
చరిత్ర

# సింహావలోకనం



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# సింహావలోకనం

(భారత స్వాతంత్ర్య సాయుధ పోరాట ప్రామాణిక గాథ)


మూలం :

**యశ్‌పాల్**

అనువాదం :

**ఆలూరి భుజంగరావు**



ప్రచురణ :

**రాహుల్ సాహిత్య సదనం**

**షాహాబాద్ - 585 228, కర్నాటక**

# కృతజ్ఞతలు

దాదాపు 20 సంవత్సరాల తరువాత 'సింహావలోకనం' మూడు భాగాల్నూ కలిపి ఒకే సంపుటిగా తెస్తూన్నాను. 80వ దశకంలో మొదటగా సింహావలోకనం – మూడు భాగాలుగా ప్రచురించాను. ఆనాడు ఎదుర్కొన్న ఆర్థిక సమస్యల్నే – ఈనాడూ ఎదుర్కోవాల్సి వచ్చినందుకు విచారిస్తూనే సంగ్రామ్‌లాంటి మిత్రుల సహాయ సహకారాలు ప్రస్తుత ప్రచురణకు అందినందుకు సంతోషిస్తూన్నాను. కంప్యూటర్లూ, టీవీలూ, ఇతర వైజ్ఞానిక ప్రగతి – దోపిడీ స్వార్థపరతత్వాల ఆధీనంలో వెర్రితలలు వేస్తూ సాధారణ ప్రజల్నే కాక మేధావుల్ని సహితం విభ్రమింపచేస్తూన్న ప్రస్తుత స్థితిలో – నాటి విప్లవ వీర యోధులైన భగత్సింగ్, సుఖదేవ్, రాజగురు, చంద్రశేఖర్ ఆజాద్, సాలెగ్రాం శుక్లా మొదలుగా గలవారు దేశంకోసం, ప్రజలకోసం, జాతికోసం చేసిన త్యాగాలనూ, చూపిన సాహసాలను వినమ్రంగా మననం చేసుకోవడం – జాతి జీవనాడిని విప్లవోన్ముఖంగా ప్రభావితం చేయగలదనీ, ఈనాడు తెలుగు గడ్డపై సాగే ప్రజల విప్లవ పోరాటానికి ఈ చరిత్ర బాసటగా నిలవగలదనీ విశ్వసిస్తూ ప్రస్తుత ప్రచురణను పాఠకుల ముందుకు తెస్తూన్నాను. నాయీ చిరు ప్రయత్నానికి గొప్పగా సహకరించి సహాయాన్ని అందించిన మిత్రులందరికీ నిండుమనస్సుతో కృతజ్ఞతలు తెల్పుకుంటూన్నాను.

వైజ్ఞానిక ప్రగతి ఎంత విజృంభించినా – మానవశ్రమకు సమానం మరోటి కాలేదన్న సత్యాన్ని ఆవిష్కరిస్తూ చాలాకొద్ది సమయంలో 'సింహావలోకనం' ఆకర్షణీయంగా తీసుకురావడానికి శ్రమించిన ప్రెస్సు మిత్రులకు మరీ మరీ కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాను !

**– ఆలూరి భుజంగరావు,**

షాహాబాద్, కర్నాటక.

21-12-2000

# సమర్పణ

ఈ దేశ ప్రజలకు స్వయం నిర్ణయాధికారాన్ని, సభ్యమానవుల్లా బ్రతకడానికి అవసరం అయిన రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సమకూర్చడం కోసం – జీవితాన్ని బలిపెట్టుకోవడానికి సంసిద్ధుణ్ణయిన నాకు సహకారాన్నిచ్చి, నాలో విశ్వాసాన్ని నింపి, జీవన్మరణ పోరాటంలో నాకు చేదోడు వాదోడుగా వున్న ఆనాటి మిత్రులందరికీ –

## మరియు

ఆనాటి చేదు అనుభవాల్ని, అపజయాల్ని గురించి తెల్సుకుని కూడా, దేశం కోసం తమ సర్వస్వాన్ని, చివరకు ప్రాణాల్తో సహా బలిపెట్టుకోవడానికి సంసిద్ధులవుతూన్న ఈనాటి మిత్రులకూ – ఈ నా అనుభవాలను సమర్పిస్తున్నాను.

**1951** **- యశ్‌పాల్**

# పరిచయం

1951 లో 'సింహావలోకన్' ప్రథమ భాగం హిందీలో ప్రచురింపబడినప్పుడు శ్రీ యశ్‌పాల్ కొన్ని పరిచయ వాక్యాల్ని వ్రాశారు. వాటిలోని కొంత భాగాన్ని ఇస్తున్నాను 'అను'.

"సాయుధ విప్లవ పోరాటానికి సంబంధించిన నా అనుభవాలను ప్రచురించవల్సిందని చాలా రోజులుగా పరిచయులూ, పాఠకులూ అడుగుతూన్నారు. ఈ మధ్యకాలంలో నా పుస్తకాలు కొన్ని వెలువడ్డాయి. అయినా, ఈ అనుభవాల్ని వెలువరించలేదు. ఆనాటి మా అనుభవాల్ని సమగ్రంగా, పుస్తక రూపంలో ప్రచురించకపోవడం - యాదృచ్ఛికం కాదు ! కావాలనే ప్రచురించలేదు. వాటిని ప్రచురించడానికి నేను సంకోచిస్తూన్నాననో, సిగ్గుపడుతూన్నాననో - అనుకోవడమూ సరికాదు ! ఆ అనుభవాలు నాకు ఏనాటికీ గర్వకారణాలే ! ఆనాటి కార్యక్రమాలూ, సంఘటనలూ - అనుభవాలూ- నా వ్యక్తిత్వంతో గాఢంగా పెనవేసుకుపోయాయి. వాటి ప్రభావం నుండి విడివడి, తటస్థుడిగా నిలబడి- ఆనాటి పరిస్థితుల మంచిచెడ్డల్ని వివేచించడానికీ, విమర్శించుకోవడానికి - ఈ సుదీర్ఘ వ్యవధి అవుసరం అయింది !

నేను ఈ విప్లవ గాథను నా వ్యక్తిగత అనుభవాల ఆధారంగా రాస్తూన్నాను. అలాగని, దీన్ని నా ఆత్మకథ అనుకోవడానికి వీల్లేదు. ఆత్మకథ రాసి, ప్రజలముందు ఓ అద్భుతమైన ఆదర్శాన్ని ఉంచడమూ నా ఉద్దేశం కాదు. కాగా, ఈ గ్రంథంలో నా వ్యక్తిగత విషయాలే చర్చించబడ్డాయనుకోవడమూ సరికాదు. ఇందులో నా వ్యక్తిగత విషయాలకంటే ఇతర మిత్రుల విషయాలే ఎక్కువగా చోటు చేసుకున్నాయి. అయితే, నేను ఈ గ్రంథాన్ని వ్యాకరణరీత్యా ప్రథమ పురుషలో "నేను" అని ప్రారంభించాను. అలా రాయడం వల్ల ఈ గ్రంథంలో చర్చింపబడిన విషయాల యొక్క లేక సంఘటనల యొక్క నిజానిజాలకు నేను బాధ్యత వహిస్తున్నాను.

చాలా రోజులుగా భారతదేశంలో జరిగిన సాయుధ పోరాటాల గురించిన ప్రామాణిక చరిత్ర ప్రకటింపబడాలని ప్రజలు కోరుతూన్నారు. అలాంటి చరిత్ర వ్రాయడానికి అనేక అభ్యంతరాలు ఉన్నాయి. మొదటిది ఈ దేశంలో జరిగిన సాయుధ పోరాటాలు రహస్యంగా జరిగాయి. ఆ పోరాటాల మనుగడకు "రహస్యం" తప్పనిసరి అయింది. ఎప్పుడైనా, కతాజిత్తుగా సాయుధ విప్లవానికి సంబంధించిన విషయాలు వెల్లడవడం జరిగితే - వాటిని ఘోరమైన అపరాధాలుగా చిత్రించి ప్రచారం చేసింది ఆంగ్ల ప్రభుత్వం. కాంగ్రెస్ మహా పురుషులు, విప్లవకారుల్ని ఉన్మత్త పదభ్రష్టులైన దేశభక్తులుగా, వారి ప్రయత్నాల్ని పిల్లాటలుగా అభివర్ణించారు. ఇక విప్లవకారులకే తమని గురించి చెప్పుకునే అవకాశం దొరికినప్పుడు - తాము అపూర్వ త్యాగధనులుగా అత్యుక్తుల్ని వ్రాసుకున్నారు. కనుక, ఇప్పటివరకు ఈ దేశంలో జరిగిన సాయుధ విప్లవ ప్రయత్నాలు యథార్థ రూపంలో ప్రజలముందుకు రానేలేదు.

ఒక వ్యక్తి అనుభవాలుగానీ, లేక కొందరు వ్యక్తుల అనుభవాలుగానీ 'చరిత్ర' అన్పించుకోవు. నా ఈ అనుభవాల్నీ 'చరిత్ర' అని నేను అనను. ఐతే, వ్యక్తుల అనుభవాలకు 'చరిత్ర'కు - హారానికి,

పూసలకూ ఉన్న సంబంధముంటుంది. పూసల్లేకపోతే హారమూ వుండదు. ఆనాటి సాయుధ విప్లవ కార్యక్రమాలలో అంతర్గతంగా యిమిడివున్న ప్రామాణికమైన ఆలోచనా పద్ధతిని అర్థం చేసుకోవడానికి నా యీ అనుభవాలు ఉపకరిస్తాయనుకుంటున్నాను. ఈ గ్రంథాన్ని నా వ్యక్తిగత అనుభవాల ద్వారా రాస్తున్నప్పటికీ కేవలం జ్ఞాపకాల మీదనే ఆధారపడలేదు. దొరికిన ఆధారాల ననుసరించి జ్ఞాపకాలనూ సరిచూసుకోవటం జరిగింది.

ఇంతవరకు వ్రాయబడిన సాయుధ విప్లవ పోరాట గాథలన్నీ వినికిడి సమాచారం ఆధారంగా వ్రాసినవే ! వాటిలో ప్రామాణికత కంటే కర్ణాకర్ణిగా విన్న అత్యుక్తులే ఎక్కువగా చోటు చేసుకున్నాయి. కానీ, ఈ గ్రంథంలో అలాంటి వినికిడి వార్తలకు స్థానం ఇవ్వలేదని స్పష్టపరుస్తున్నాను. భవిష్యత్తులో ఎవరైనా, భారతదేశంలో జరిగిన సాయుధ విప్లవ పోరాటాల గురించి ప్రామాణిక గాథను వ్రాయడానికి కలం పడితే, నాయీ అనుభవాలు ముడిపదార్థాన్ని అందించగలవని అనుకుంటూన్నాను. ఆనాటి అనుభవాలను సంకలితం చేయడంలో మిగిలివున్న నా మిత్రులు శివవర్మ, జయదేవ్ కపూర్ల సహకారం పూర్తిగా లభించింది. సర్దార్ భగత్సింగ్ తమ్ముడు కులబీర్‌సింగ్ అవసరమైన వివరాలనూ ఫోటోలనూ ఇచ్చి ఎంతో సహాయం చేశారు.

**1951** **- యశ్‌పాల్**

# మనలో మాట

క్రితం సంవత్సరం (1981) జనవరిలో 'సింహావలోకనం' మొదటి భాగాన్ని ప్రకటించాను. సరీగా సంవత్సరానికి ఈ జనవరి (1982) చివర్లో రెండవ భాగాన్ని ప్రకటిస్తున్నాను. ఈ సంవత్సర కాలంలోనూ ఎన్నో తీపి అనుభవాలూ, మరెన్నో చేదు అనుభవాలూ - ఎదురయ్యాయి. ఎందరో పాఠకులు తమ అమూల్యమైన లేఖలతో నాకు మనోనిబ్బరాన్ని, ధైర్యాన్ని ఇచ్చారు. నేను ఆశించనంతగా పాఠకుల్నుంచి, అభిమాల్నుంచి ప్రోత్సాహం లభించింది. 'సింహావలోకనం' మొదటి భాగాన్ని చదివి ముందుగా నాకు జాబు రాసినవారు మిత్రులు ఎ.ఎన్. నాగేశ్వరరావుగారు. 'సింహావలోకనం' రచన అద్భుతమైంది. అందులో సందేహం లేదు. అనువాదం బాగానే వచ్చింది... మొత్తానికి పురం పెట్టినట్టు చాలా రోజులకైనా ఒక మంచి పుస్తకాన్ని అందించారు" అని రాశారు. అప్పటివరకూ పాఠకుల స్పందన ఎలా వుంటుందోనని బిక్కు బిక్కుమంటూన్న నాకు వారి జాబు ఊరట కలిగించింది. ఉత్సాహాన్నిచ్చింది. అలాగే -

సుప్రసిద్ధ సినిమా నటులు శ్రీ కాకరాలగారు ఇలా రాశారు. "సిసలైన స్వాతంత్ర్య మహాయజ్ఞానికి స్వీయ చైతన్యంతో సమిథలయిన వారి జీవితాలకు అద్దంపట్టడంతోపాటు ఆ యజ్ఞ ఫలితాన్ని దిక్కుమళ్ళించిన రాజకీయ అవలక్షణానికి అన్ని విధాలా అద్దం పట్టింది."

ఈనాడు దినపత్రిక ఇలా రాసింది. "మనదేశంలో జరిగిన సాయుధ విప్లవాలకు సంబంధించి చెప్పుకోదగిన రిఫెరెన్సు పుస్తకంగా 'సింహావలోకనం' ఉపయోగపడుతుంది. 'సింహావలోకనం' మిగిలిన రెండు భాగాలు కూడా తెలుగులో వెలుగు చూడాలని పాఠకులు కోరుకునేలా ప్రభావితం చేయగల సత్తా ఈ పుస్తకానికి వుంది."

ప్రజాశక్తి ఇలా వ్రాసింది. "ఈనాటి యువతరానికి తెలియని అనేక అత్యద్భుత సాహసకృత్యాలతోనూ, రహస్యాలతోనూ నిండివున్న ఈ గ్రంథం నేటి యువతరాన్ని ఎంతగానో ఉత్తేజ పరచగలదు."

సృజన ఇలా రాసింది - "ఈ పుస్తకంలో ఆనాటి సామాజిక పరిస్థితులూ, కాంగ్రెసు పార్టీ గాంధీ నాయకత్వంలో అనుసరించిన దళారి రాజకీయ విధానం, ప్రజల మనోభావాలూ, విప్లవ సంఘ కార్యకలాపాలూ చాలా బాధ్యతాయుతంగా పాఠకుడిని విసుగెత్తించకుండా యశ్‌పాల్ ఒక నవలలాగా, ఆత్మకథలాగా రాశారు."

ఇలాగే మరి కూడా కొన్ని పత్రికలు చాలా ప్రోత్సాహకరంగా 'సింహావలోకనం' గురించి వ్రాశాయి. కొందరు సంపాదకులు మొదటి భాగంలోని కొన్ని సంఘటనల్ని తమ పత్రికల్లో మరలా ముద్రించుకున్నారు. (ప్రజాసాహితి, నూతన) ఒక అపరిచిత పాఠకుడు 'ఈ అనువాదం గురించి' చదివి కంట తడిపెట్టుకున్నానని వ్రాస్తూ నా త్యాగాన్ని పొగుడుతూ వుంటే చాలా సిగ్గుపడ్డాను. ఎందుకంటే, ఏదో ఒక ఉద్యోగం చేసుకుంటూ, భార్యాబిడ్డల్తో కులాసాగా జీవితాన్ని గడుపుతూ అనువాదాలు చేయడమే త్యాగమైతే, ఈ దేశంలోని కోటాను కోట్లమంది కూడూ - గూడూ - గుడ్డా లేని దీనులకు, తమ శ్రమ ఫలితాన్ని రాబందులు లాగేస్తూ వుంటే, జలగలు పీల్చేస్తూవుంటే దిక్కుతోచని దగాపడిన తమ్ముళ్ళకు - మానవోచితమైన నిండు జీవితాన్ని, జీవనాన్ని ఇవ్వగల నూతన సామాజిక వ్యవస్థను స్థాపించడం కోసం ప్రాణాలర్పించిన, ఇంకా అర్పిస్తూన్నవారి త్యాగాల్ని ఏమందాం ? వీరే కాకుండా ఇంకా ఎందరో సహృదయులు మొదటి భాగాన్ని చదివి జాబులు రాశారు. మరెందరో రెండవ భాగాన్ని


ప్రకటించమనీ రాశారు. రెండవ భాగం ప్రకటించాలన్న నా సంకల్పానికి ఊతాన్నిచ్చిన మిత్రులు శ్రీ విమల్‌గారు. ఈ గ్రంథం రెండవ భాగాన్ని ప్రకటించడంలో వారి సహకారాన్ని ప్రత్యేకం చెప్పుకోవల్సి వుంటుంది. అలాగే మిత్రులు భరత్ బాబుగారి సహకారం మరువరానిది. వారికి నేను ఏ విధంగా కృతజ్ఞతలు తెలుపగలను ? కృతజ్ఞతలకు అతీతమైన సహకారాన్ని అందించారు. ఈ రెండవభాగం వెలుగు చూడడానికి తోడ్పడ్డారు. ఈ సందర్భంగా ఒక విషయం స్ఫూరణకు వస్తున్నది. తమకోసం ప్రాణాలర్పించిన అమరవీరుల చరిత్ర పట్ల ప్రజలు ఎన్నటికీ ఉదాసీనత ప్రకటించరన్న సత్యం స్పష్టమవుతోంది.

మొదటి భాగం కాపీల పంపిణీ బాధ్యతను హైదరాబాద్ బుక్ ట్రస్టువారు తీసుకున్నారు. రెండు మూడు భాగాలను ప్రచురించడానికి వారు కొంతవరకూ తమ సంసిద్ధతను తెలియపరిచారు. కానీ, నేను వారికి రెండు మూడు భాగాలను ప్రచురించడానికి ఇవ్వలేకపోయాను. అందుకు వ్యక్తిగతమైనవి, నావిగా - కొన్ని కారణాలు వున్నాయి. ఈ రెండవ భాగం పంపిణీ బాధ్యతనూ వారు తీసుకుంటే బాగుంటుందని నా భావన. కాగా, ఈ భాగం ప్రకటించడంలోనూ, చారిత్రక ప్రామాణికతకు భంగం కలగకుండా - కొంత స్వాతంత్రాన్ని తీసుకున్నాను. మూలంలో రెండవ భాగం విప్లవ సంఘం రద్దు అవడంతో ముగుస్తుంది. అంటే, ఇంకొక నూటపాతిక పేజీల విషయం వుంటుంది. తెలుగులో ఇంకొక నూట పాతిక పేజీలు అచ్చు వేయగల ఆర్థికవనరు నాకు లేదు. పైగా, అన్ని పేజీలు వేస్తే పదహారు రూపాయిల వరకూ ధర పెట్టవల్సి వుంటుంది. అంత ధర పెట్టిన పుస్తకాన్ని అమ్ముకోవడమూ కష్టమేనన్న అభిప్రాయమూ ఒకటుంది. అందుకే భగవతీచరణ్ మృత్యువుతో తెలుగులో రెండవ భాగాన్ని ముగించాను. మరొక్క విషయం ఇక్కడ చెప్పడం అప్రస్తుతం కాదనుకుంటున్నాను. మొదటి భాగానికి పెట్టిన పెట్టుబడి ఇంకా నాకు తిరిగి రాలేదు. చేసిన అప్పు తీరలేదు. మళ్ళీ రెండవభాగానికి అప్పు చేశాను. మొదటి భాగానికి బ్యాంకు నుండి తీసుకున్న అప్పును నా జీతంలో తీర్చాను. మిత్రులు శ్రీ సూరెడ్డి రామచంద్రరావుగారి దగ్గర తీసుకున్న బాకీనీ తీర్చాను తరువాత.

మనది దళారి ఆర్థిక వ్యవస్థ. ఈ వ్యవస్థకు ఉన్న ముఖ్య లక్షణం ఒకే పనిని ఆర్థికంగా బలవంతుడూ, ఆర్థికంగా బలహీనుడూ ఇద్దరుచేస్తే - బలవంతుడికి లాభింపచేస్తుంది. బలహీనుణ్ణి నష్టపరుస్తుంది. కనుక, ఆర్థిక ఇబ్బందులూ, ఒడిదుడుకులూ - తప్పవు.

మూలంలో రెండవ భాగానికి ముందుమాటగా శ్రీ యశ్‌పాల్ నాలుగు మాటలు మాత్రం రాశారు. దాదాపుగా ఈ పుస్తకాన్ని గురించి వ్రాయవల్సినదంతా మొదటి భాగానికి వేసిన ముందు మాటలోనే రాశారు యశ్‌పాల్. కనుక, తెలుగులో, హిందీ రెండవ భాగంలో వారు రాసిన ముందు మాటను వేయడం లేదు. మూడవభాగంలో, మూలంలోని రెండు మూడుభాగాల్లోని 'ముందుమాటల్ని' వేయడం బాగుంటుందని ఉద్దేశ్యం. ఇంక ఇప్పుడు తెలుగు 'సింహావలోకనం' ఒకటి, రెండు, మూడు భాగాలు కలిపి వేసిన గ్రంథం మీ చేతుల్లో వుంది.

**- ఆలూరి భుజంగరావు**




చంద్రశేఖర్ ఆజాద్




భగత్‌సింగ్



సుఖదేవ్



రాజ్‌గురు



లాలా లజపతిరాయ్



సాలిగ్రాం శుక్లా



దుర్గాబాభి



భగవతీ చరణ్



ధన్వంతరి




శివవర్మ



డాక్టర్ గయాప్రసాద్



భగవాన్ దాసు



జయదేవ్ కపూర్




శివవర్మ



ఇంద్రపాల్




బిస్మిల్



జోగేశ్ చంద్ర చటర్జి




పృథ్వీసింగ్



బటుకేశ్వరదత్



సచ్చిదానంద హీరానంద వాత్సాయన్



జతీంద్రనాధ దాస్



భూపేంద్రనాధ్ సన్యాల్



ప్రకాశవతి



దుర్గాబాభి

# సింహావలోకనం గురించి పత్రికల, వ్యక్తుల అభిప్రాయాలు

1969లో 'సింహావలోకనం'లోని కొన్ని సంపుటాల్ని 'విశాలాంధ్ర' దినపత్రిక ఆదివారం సంచికల్లో ధారావాహికంగా ప్రచురించారు. అప్పుడు 'విశాలాంధ్ర' సంపాదకులు 'సింహావలోకనం' గురించి వ్రాసిన పరిచయ వాక్యాలు.

'శ్రీ యశ్‌పాల్ సుప్రసిద్ధ విప్లవకారులు. భగత్సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, సుఖదేవ్ - మొదలగు ప్రఖ్యాత విప్లవవీరుల సహచరులు. 1929లో వైస్రాయి లార్డ్ ఇర్విన్ ట్రయిన్ కింద బాంబు పేల్చినందుకు జన్మఖైదు చేయబడ్డారు. శ్రీ యశ్‌పాల్ విప్లవవీరులేకాక హిందీ రచయితల్లో తలమానికం లాంటివారు ! ఆనాటి తమ అనుభవాలనూ, ఆనాటి ఉద్యమ చరిత్రనూ 'సింహావలోకన్' అన్న గ్రంథ రూపంలో హిందీలో వ్రాసి ప్రకటించారు. ఆనాడు బయట చెప్పుకోవడానికి వీల్లేని, ఈనాటి యువతరానికి తెలియని అనేక అత్యద్భుత సాహసాలతో, రహస్యాలతో నిండివుంది 'సింహావలోకన్' ! అనేక ప్రముఖ హిందీ రచయితల గ్రంథాలను తెలుగులోకి అనువదించిన సుప్రసిద్ధ హిందీ పండితులు శ్రీ అలూరి భుజంగరావుగారు శ్రీ యశ్‌పాల్ గ్రంథాన్ని ఇటీవల తెలుగులోకి అనువదించారు. అందులోని కొన్ని ప్రధాన ఘట్టాలను స్థాలీపులాకంగా పాఠకులకు అందించదలిచాం! ఈ వారం ఢిల్లీ అసెంబ్లీలో, 1929 లో బాంబు ప్రయోగం గురించిన ఘట్టాన్ని ఇస్తున్నాం !" - 11 సం॥

**అరుణతార మాసపత్రిక**

'యశ్‌పాల్ భగత్సింగ్ సహచరుడు. వినాయకుడి పెళ్ళికి వెయ్యి విఘ్నాలన్నట్టు ఎన్నో అవాంతరాలు గడిచి అతని 'సింహావలోకన్' మొదటి భాగమైనా తెలుగులోకి రావడం సంతోషకరం.

భగత్సింగ్ తరం జాతీయ విప్లవకారులతరం నాటికే రౌలెట్ చట్టం వల్ల, దమనకాండవల్ల టెర్రరిజం నీరసించింది. గాంధీతత్వం, సత్యాగ్రహం దాన్ని కమ్మేశాయి. శిఖ్కు గురుద్వారాల మహంతులకు వ్యతిరేకంగా అకాలీలు జరిపిన పోరాటం ఇంకో కారణం. వీటన్నింటిలోనూ పాల్గొని పాఠం నేర్చుకుని, కమ్యూనిష్టుగా, నాస్తికుడిగా మారిన భగత్సింగ్ , టెర్రరిజం పులుసు పూర్తిగా విరగక, ఆ చర్యలద్వారా పదిమందినీ ఆకర్షించి వారిని పల్లెపట్టుకు పంపి ప్రజోద్యమం నిర్మించాలనుకున్నాడు. అప్పటికే వివిధ దేశాల విప్లవాల గురించి వాటి నాయకుల గురించి ఎంతో చదివి వున్నాడు. అతనికి సాహిత్య మంటే చాలా ఇష్టమని యశ్‌పాల్ అంటున్నాడు. బ్రతికి వుంటే ఇండియాకు ఒక లెనిన్ అయేవాడా, మావో అయేవాడా అనేది ఊహాగానమే గాని, అజయఘోష్ పార్టీ సెక్రటరీ కాగా లేనిది, భగత్సింగ్ ఎందుకు అయివుండలేడు ? మొత్తానికి అయన గొప్ప భావుకుడు, క్రియాపరుడు, గంభీరుడు గూడా!

సుఖదేవ్ పట్టుబడి గజగజలాడి తెలిసిందంతా పోలీసులకు చెప్పేశాడని గానీ, సుఖదేవ్ పట్టుదల ఫలితంగానే భగత్సింగ్ అసెంబ్లీ సంఘటనలో పాల్గొన్నాడనిగానీ - ఇలాంటి మంచి పుస్తకాల ద్వారానే తెలుస్తాయి !'

**సృజన మాసపత్రిక**

'ఈ పుస్తకంలో ఆనాటి సామాజిక పరిస్థితులూ, కాంగ్రెస్‌పార్టీ గాంధీ నాయకత్వంలో అనుసరించిన దళారి రాజకీయ విధానం, ప్రజల మనోభావాలూ, విప్లవ సంఘ కార్యకలాపాలు చాలా బాధ్యతాయుతంగా, పాఠకుడిని విసుగెత్తించకుండా యశ్‌పాల్ ఒక నవలలాగా ఆత్మకథలాగా రాశారు

**ఈనాడు దినపత్రిక**

మన దేశంలో జరిగిన సాయుధ విప్లవాలకు సంబంధించి చెప్పుకోదగిన రిఫరెన్సు పుస్తకంగా 'సింహావలోకనం' ఉపయోగపడుతుంది. 'సింహావలోకనం' మిగిలిన రెండు భాగాలు కూడా వెలుగు చూడాలని పాఠకులు కోరుకునేలా ప్రభావితం చేయగల సత్తా ఈ పుస్తకంలో వుంది.

**ప్రజాశక్తి వారపత్రిక**

'ఈనాటి యువతరానికి తెలియని అనేక అత్యద్భుత సాహసకృత్యాలతోను, రహస్యాలతోను, నిండి వున్న ఈ గ్రంథం నేటి యువతరాన్ని ఎంతగానో ఉత్తేజపరచగలదు'.

**ఆంధ్రజ్యోతి వారపత్రిక**

ఈ సింహావలోకనం - పరమోత్కృష్టమైన పుస్తకంగా సంతరించాడు యశ్‌పాల్. ఆయన వ్రాసిన భారత స్వాతంత్ర్య సాయుధ పోరాట ప్రామాణిక గాథను మూలంలో ఆయన కనబరిచిన ఆవేదనను, నిజాయితీని - ఆలూరి భుజంగరావుగారు ప్రతి అక్షరంలోను ప్రత్యక్షమయ్యేట్టు అనువదించారు. ఇది ఇలా చదువుకుంటూపోతే, ఒక చైతన్య స్రవంతిలో ఒక భావావేశంలో కొట్టుకుపోతాడు పాఠకుడు. ఇది అనువాదం అనీ, దీనికో మూలం వుందని గానీ మొదటి పేజీ చూస్తే గానీ తెలీదు. స్వతంత్ర రచనకు ఎంత నిజాయితీ, ఏకాగ్రత కావాలో, అనువాద రచనకు అంతకన్నా ఎక్కువ కావాలి !

ఈనాడు దేశ పరిస్థితిని చూసి నిరాశ చెందేవారిని కార్యోన్ముఖుల్ని చేసే పుస్తకం ఇది. ఇందులో లాలాలజపతిరాయ్ హత్యకు ప్రతీకారం చేయడం మొదలుకొని ఢిల్లీ అసెంబ్లీలో బాంబు ప్రయోగం, భగత్సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల దేశభక్తిని నిరూపించే అనేక సంఘటనలు కళ్ళకు కట్టినట్టు వివరించబడ్డాయి. యశ్‌పాల్‌గారి హిందీ మూలానికి సరళమైన అనువాదం చేసి ఆంధ్రుల కొక మహోపకారం చేశారు ఆలూరి భుజంగరావు. మొదటి రెండు భాగాలను చదివిన పాఠకులు 'సింహావలోకనం' మూడవ భాగానికై ఎదురు చూస్తారనడంలో సందేహం లేదు!

**అవంతి**

శ్రీ ఆలూరి భుజంగరావుగారు సమర్థులైన అనువాదకులు. ఆయన అనువదించిన రాహుల్జీ రచనలు తెలుగు పాఠకులలో మంచి ప్రాచుర్యం పొందేయి. యశ్‌పాల్ రాసిన ఈ 'సింహావలోకనం' అనువాదం స్వతంత్ర రచన అనిపించేటంత స్వాదువుగా నడిచింది.

ఆనాటి అనుభవాల్ని, అపజయాల్ని సవివరంగా చిత్రిస్తూన్న యశపాల్ 'సింహావలోకనం' కేవలం చరిత్ర గ్రంథం మాత్రమే కాదు. విప్లవోద్యమాలలో సర్వస్వం త్యాగం చేస్తూన్న యువకులకు గొప్ప పాఠ్యగ్రంథం కూడాను. విప్లవోద్యమాభిమానులెవ్వరూ అశ్రద్ధ చూపడానికి వీలులేని ఉత్తమ గ్రంథం'.

**సుప్రసిద్ధ సినీనటులు శ్రీ 'కాకరాల'**

'ఇంతవరకు భగత్సింగ్ గురించి వినిపిస్తూన్న చాలా చారిత్రికాంశాలు విన్నాను. ప్రేమాడిబ్ భగత్సింగానూ, జైరాజ్ చంద్రశేఖర్ ఆజాద్‌గానూ నటించిన పాత చిత్రమూ చూశాను. వాటన్నింటికన్నా నన్ను బాగా కదలించిన అంశం ఒకటి - అది - సంకుచితమైన కుటుంబ బంధాల్లో కనుపించే అనుబంధాలూ, ఆత్మీయతలూ - కన్న మిన్నగా విప్లవానికి అంకితమైన వారి మధ్య అవి ఇంకా బలంగా పెనవేసుకోవడం ...... కుటుంబంలో అయితే ఒకరి మీద మరొకరు ఆధారపడి వుండవలసిన 'స్థితి' కనుపిస్తుంది. ఇక్కడ ఆ 'స్థితి' లేదు ఎవరికి వారు స్వతంత్రంగా జీవిస్తూ సాధ్యమైనంత ఎక్కువగా

మరొకరికి సాయపడాలనే 'చైతన్యం' మాత్రమే ఇక్కడ కనుపిస్తుంది. అది - భగవతీచరణ్ -భగత్సింగ్, సుఖదేవ్, బాభీ, సుశీలాదీదీల మధ్య చదువరిని కదిలించే విధంగా ద్యోతకమైంది.

రచయిత ముందుమాటలో రాసిన ప్రకారం కల్పనా చాతుర్యం కన్నా వాస్తవికాంశాల్ని వివరించిన ఈ పుస్తకంలో చదువరిని కదిలించి అతణ్ణి ఆజన్మాంతం ఆ వ్యక్తుల త్యాగానికి కృతజ్ఞులుగా చేసే సంఘటనలు - పార్లమెంటులో బాంబు విసిరేముందు సుఖదేవ్ భగత్సింగ్‌ని అవమానించిన ఘటన, అటుమీదట బాభీ, సుశీలాదీదీ పార్క్‌లో భగత్సింగ్‌కి స్వీట్సు కమలాఫలాలూ తినిపించి అంతిమ వీడ్కోలు ఇచ్చే ఘటన..... తరువాత టాంగాలో శశి భగత్సింగ్‌ను పిలవడమూను.....

ఇక కోర్టులో భగత్సింగ్ వాదన సరీగా ఉరితీయబోయే ముందు లెనిన్ అన్న అలెగ్జాండర్ని గుర్తు చేస్తుంది. వారి త్యాగ ఫలితం నక్కల పాలు అయిందే అన్న బాధనూ కలిగిస్తుంది. ఈ త్యాగాలు వృధాపోవు అన్న ఆశనూ కలిగిస్తుంది........,

**మిత్రులు ఎ. ఎన్. నాగేశ్వరరావు**

మీ 'సింహావలోకనం' చదివాను. స్వాతంత్ర పోరాటంలో మరుగుపడిపోయిన వజ్రాలను, వాళ్ళ రుజువర్తననీ, స్వార్థరహిత దైనందిన జీవితాన్ని మెదళ్ళకు దళ్ళు బిగించుకున్న తెలుగువాళ్ళకు అందించారు. దేశానికి నిజమైన స్వేచ్ఛ సిద్ధించే యత్నానికి ఈ తరహా రచనలు చైతన్య జ్యోతులు. I Shake your hands with Revolutionary Greetings ?

# ఈ అనువాదం గురించి

నేను మొదటగా 1954 -1955 సంవత్సరాల్లో 'సింహావలోకన్' ని హిందీలో చదివాను. హిందీలో ఈ గ్రంథం మూడు భాగాలుగా రచింపబడ్డది. అప్పుడు నేను తెనాలి హిందీ ప్రేమిమండలి మహావిద్యాలయంలో 'హిందీ ప్రచారక్' ట్రయినింగ్ చదువుతున్నాను. తెనాలికి 7 మైళ్ల దూరంలో వున్న పెదపూడిలో వుంటున్నాను. అక్కడ ప్రైవేట్లు చెప్పుకుని తల్లిని పోషించుకుంటూ రోజూ తెనాలివచ్చి చదువుకుంటూ వుండేవాణ్ణి ! తల్లిని పోషించుకుంటూ చదువుకోవడం, సాహిత్య వ్యాసంగం - సాగించడం చాలా కష్టతరంగా వుండేది. తెనాలి హిందీ ప్రేమీమండలి మహావిద్యాలయంలో మంచి లైబ్రరీ వుంది. ఎన్నో హిందీ పుస్తకాలు వున్నాయి . పొట్ట తిప్పలు చూసుకుంటూ, తల్లిని పోషించుకుంటూ చదువుకోవాల్సినవాడిని కావడం వల్ల పాఠ్యగ్రంథాల్ని చదవడంలో వెనుకబడి వుండేవాణ్ణి ! సమయానికి క్లాసులకు హాజరు కాలేకపోయేవాణ్ణి ! ఐతే, మహావిద్యాలయం లైబ్రరీలోని హిందీ గ్రంథాల్ని అధ్యయనం చేయడంలో మాత్రం వెనకపడేవాణ్ణికాదు !

నేనానాడు చదివిన గ్రంథాల్లో కొన్ని తమ ప్రభావాన్ని నా మీద గొప్పగా వేశాయి. వాటిలో ముఖ్యమైనవి 'సింహావలోకన్(యశ్‌పాల్)' "విశ్వకీరూప్ రేఖా", మానవ సమాజ్ (రాహుల్‌సాంకృత్యాయన్) 'సౌరజగత్' (రచయిత పేరు జ్ఞాపకం లేదు). వీటిలో ప్రముఖంగా తన ప్రభావాన్ని నా మీద వేయగల్గిన గ్రంథం 'సింహావలోకన్ !' ఈ గ్రంథంలోని ప్రతి పేజీ అపూర్వమైన త్యాగాలతోటి, అద్భుతమైన సాహసాలతోటి - రహస్యాలతోటీ నిండి వుండడమే కాకుండా, అత్యుత్తమ సాహిత్య గ్రంథాన్ని చదివిన రసానుభూతిని కూడా ఇవ్వగలగడం ఒక విశేషం ! ఇంక దేశం కోసం ప్రాణాల్ని బలిపెట్టుకోవడం ఎలాగో తెల్సుకోవాలంటే, ఈ గ్రంథాన్ని చదివి తెలుసుకోవాల్సిందే ! సాధారణ ఆర్థిక స్థితి గల కుటుంబాల్లో పుట్టిన పందొమ్మిది ఇరవై సంవత్సరాల వయస్సు గల యువకులు దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగాలనూ, చూపిన సాహసాలనూ చదువుతుంటే ఒళ్ళు గగుర్పొడిచేది ! భగవత్సింగ్, సుఖదేవ్, రాజగురు, చంద్రశేఖర్ ఆజాద్, సాలెగ్రాంశుక్ల - వీరందరూ యువకులు ! వీరి ముందు కొండంత జీవితం వుంది. వీరిలో చదువూ, రూపమూ, సంస్కారమూ వున్నాయి. జీవితాన్ని బంగారు బాటలో నడుపుకోగల సామర్థ్యమూ వుంది. కానీ, అన్నింటినీ తుచ్ఛమైనవిగా భావించి, నిండు .జీవితాల్ని దేశం కోసం బలిపెట్టుకున్నారు. ఈ మహోన్నత త్యాగమూర్తుల జీవితాల గురించి (వాళ్ళు ఉద్యమంలో ప్రవేశించింది మొదలు - తుది శ్వాసలు వదిలేవరకూ - ఉద్యమ చరిత్ర రూపంలో 'సింహావలోకన్' లో వర్ణింపబడ్డది, 'సింహావలోకన్'ని మొదటగా చదివినప్పుడు, నా మాతృభాషలో అలాంటి గ్రంథం అంతవరకు నాకు లభించనందుకు విచారించాను. అంతవరకు నేను చదివిన పాఠ్యగ్రంథాల్లోనూ ఈ త్యాగమూర్తుల గురించి ఒక్క పాఠమైనా లేకపోవడం కనీసం ఒక్కమాట అయినా లేకపోవడం, దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల పట్లే కాదు; సమస్త దేశ ప్రజలపట్ల ఘోరమైన అపచారం చేసినట్లనిపించింది ! దట్టమైన అమావాస్య చీకట్లను పారద్రోలడానికి, పూరిగుడిసెలోని గాలికి రెపరెపలాడుతున్న చిరుదీపం శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తుంది ! నేనూ అలాగే నాకున్న పరిమిత జ్ఞానంతో పరిమిత సాధనాలతో 'సింహావలోకన్'ని తెలుగు చేయడానికి కలం పట్టాను ! ఎన్ని అభ్యంతరాలో ? ఎన్ని ఆటంకాలో ? ఆర్థికంగా స్థిమితమైన జీవితం కాకపోవడం వల్ల, తల్లిని పోషించుకుంటూ చదువుకోవాల్సినవాడిని కావడం వల్ల అసలు జీవితంలో తీరికే ఉండేది కాదు ! ఉన్న కొద్ది సమయాన్ని, 'సింహావలోకన్' ని చదవడానికో అనువాదం చేయడానికో - వినియోగించేవాడిని !

పొట్టతిప్పలు చూసుకోవాలి, భవిష్యత్తు కోసం విద్యాధ్యయనాన్ని సాగించాలి ! ఆదర్శం కోసం గ్రంథావలోకనం - అనువాదం, స్వతంత్ర రచనలు - చేయాలి ! వీటన్నింటికీ పొంతన కుదిరేది కాదు. జీవితం తిరుగలిరాళ్ళ కిందపడి నలిగిపోయే పప్పు గింజవంతు అయింది !

ఇన్ని సమస్యల్తో వేగిపోతున్నప్పటికీ 1957 నాటికి 'సింహావలోకన్' మొదటిభాగం అనువాదాన్ని పూర్తి చేశాను. అదే సంవత్సరం 'సౌందర్యవధ' మొదలుగాగల కొన్ని సంఘటనలను 'విశాలాంధ్ర' దిన పత్రికకు పంపించాను. ప్రచురించారు. తరువాత నేను గుంటూరు జిల్లా నుండి కర్నూల్ జిల్లాకు ఉద్యోగరీత్యా వెళ్ళడం జరిగింది. అప్పటికే 'గబన్' అనువాదం చేశాను. రాహుల్‌జీ, కిషన్ చందర్ గ్రంథాల్ని కొన్నింటిని అనువాదం చేశాను! వాటితో పాటు 'సింహావలోకన్' రెండవ భాగం అనువాదాన్ని పూర్తి చేశాను. రెండవ భాగం అనువాదం పూర్తి అయ్యేసరికి మొదటి భాగం అనువాదాన్ని చదివి ఇస్తానని, ఒకానొక పబ్లిషర్ నా దగ్గర నుంచి తీసుకుని ఇక నాకు తిరిగి ఇవ్వలేదు. మళ్ళీ మొదటి భాగాన్ని అనువాదం చేసుకున్నాను. సరీగా అదే సమయంలో "సింహావలోకన్" అనువాదంలోని కొంతభాగం అగ్నికి ఆహుతి కావడం జరిగింది. ఘెరమైన నిరాశలో కొన్ని సంవత్సరాలు దొర్లిపోయాయి. కొందరు మిత్రులూ, నా మామగారైన కీర్తిశేషులు కర్లపాలెం కమలనాభప్రసాదరావుగారూ "సింహావలోకన్" అనువాదాన్ని పూర్తిచేయమని మరీ మరీ చెప్పుతూండడం వల్ల మళ్ళీ ఒక మాటు కలం పట్టి అనువాదాన్ని పూర్తి చేయడానికి ఉద్యమించాను.

అప్పటికి కర్నూల్ జిల్లా ఉద్యోగాన్ని మానుకుని కృష్ణాజిల్లా ఉయ్యూరు C. B. M. బోర్డింగ్ స్కూల్లో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాను.

నేను మొదటగా "సింహావలోకన్"ని చదివినప్పుడు మంచి యువకత్వంలో వున్నాను. అప్పటికి నాకు వివాహం కాలేదు. తరువాత రెండు వివాహాలు చేసుకున్నాను. ఏడుగురు [ఇద్దరు పోయారు] బిడ్డల తండ్రినయ్యాను. అనారోగ్యాలూ-దరిద్రమూ నన్ను పూర్తిగా నిశ్శక్తుణ్ణి చేశాయి. అనువాదం చేయలేని శారీరకమైన బలహీనతలు నన్ను వివశుణ్ణి చేశాయి. ఆ స్థితిలో "సింహావలోకన్" అనువాదాన్ని నా మిత్రుడే కాదు, నా శిష్యుడు కూడా ఐన శ్రీ వెనిగళ్ళ లక్ష్మయ్య నేను చెప్పగా వ్రాసిపెట్టాడు.

ఆ తరువాత మరోమాటు 'సింహావలోకన్' అనువాదానికి ప్రమాదం ముంచుకువచ్చింది. ఎలుకలు కొట్టేశాయి. ఆ భాగాలనూ తిరిగి రాయడం జరిగింది. ఏ విధంగా నైనాసరే అచ్చువేయిస్తేగాని ఈ అనువాదానికి భద్రత లేదన్న భావం కలిగింది నాలో ! మరోమాటు విశాలాంధ్ర సంపాదకుల్ని కల్సుకున్నాను. వారీ గ్రంథాన్ని చదివి చాలా ప్రభావితులయ్యారు. అప్పుడు [1969] ఆదివారం సంచికను ఎడిట్ చేస్తున్నది 'పఠాభి రామారావు' గారనుకుంటాను. [పేరు సరీగా జ్ఞాపకం లేదు] నాతో ఇలా అన్నారు. "ఇలాంటి గ్రంథాలు యువతరాన్ని ఉద్దీపింపచేస్తాయి ! తప్పకుండా దీన్ని ప్రచురిద్దామన్నారు. 1969లో మరోమాటు, 'విశాలాంధ్ర' ఆదివారం సంచికల్లో 'సింహావలోకన్' అనువాదంలోని కొన్ని భాగాలు ధారావాహికంగా ప్రచురింపబడ్డాయి. అయినప్పటికీ ఈ అనువాదం సమగ్రంగా, తెలుగులో పుస్తక రూపంలో వెలువరించడం జరగలేదు. కొందరు మిత్రులూ, కొందరు ప్రచురణకర్తలు - ఈ అనువాదాన్ని ప్రచురిస్తామని నా దగ్గర నుండి తీసుకున్నారు. తెనాలి వాస్తవ్యులు శ్రీ సుంకర రామకోటయ్య, శ్రీ సి హెచ్. ఆంజనేయులు గార్ల ద్వారా పరిచయం అయిన శ్రీ సుబ్రమణ్యం ఈ అనువాదాన్ని ప్రచురించడానికి చాలా ఉత్సాహన్ని కనబరిచారు. శ్రీ సుబ్రమణ్యం [అన్నాయి] వృత్తికీ గ్రంథ ప్రచురణకూ బొత్తిగా పొంతన కుదరదని తెలిసీ, అనువాదాన్ని అతనికి ఇచ్చాను. ప్రచురిస్తానన్నదే చాలని ! ఈ కారణంగా శ్రీ సుబ్రమణ్యం అడపా దడపా నాకు కొంత ఆర్థిక సహాయం కూడా చేశాడు. ఐతే, అతడు అకాల మృత్యువుకు గురికావడంతో ఈ అనువాదం నా దగ్గరకు వచ్చింది.

తరువాత కొందరు మిత్రులు ఈ అనువాదాన్ని తీసుకోవడము, వాళ్ళు మరొకళ్ళకు ఇవ్వడము, వాళ్ళు ఇంకొకళ్ళకు ఇవ్వడమూ జరిగింది. ఈ అనువాదం ఎక్కడ వుందని తెలిస్తే అక్కడికి వెళ్ళి, ఎవరి దగ్గర వుందని తెలిస్తే వారి దగ్గరకు వెళ్ళి - ఎలాగైతేనేం, అనువాదాన్ని తిరిగి నా దగ్గరకు తెచ్చుకున్నాను. ఈ తెచ్చుకోవడంలో నా దగ్గర తీసుకున్న ప్రకాశకులో, వారి దగ్గర తీసుకున్న మిత్రులో - 'అసెంబ్లీలో బాంబుకేసు' మొదలైన కొంత అనువాద భాగాన్ని పారేశారు. కొన్నాళ్ళపాటు ఈ గ్రంథ ప్రచురణకు ఎవరు సాయం చేస్తారంటే వారి దగ్గరకు పరుగెత్తాను. ఈ సాకుతో నన్ను తమ చుట్టూ తిప్పుకున్న మిత్రులు చాలామంది ఉన్నారు. అలాంటి మిత్రుల చుట్టూ తిరగడానికి నేను డబ్బులూ బాగానే ఖర్చు పెట్టుకున్నాను.

మరోమాటు నన్ను నిరాశ ఆవరించింది. మరికొంచెం నా ఆరోగ్యం శిథిలం అయింది. మరో మాటు మాకు స్థానచలనం కలిగింది. ఉయ్యూరు నుండి గుడివాడ టౌన్ హైస్కూలుకు ట్రాన్స్ఫర్ అయ్యాను. సాహిత్య వ్యాసంగాన్ని పూర్తిగా కట్టిపెట్టాను. 'సింహావలోకన్' అనువాదాన్ని మూలపడేశాను. కేవలమూ 'ఉద్యోగం - ఇల్లు' తప్ప మరో వ్యాపకం లేకుండా జీవితాన్ని గడపాలని సంకల్పించుకున్నాను. కానీ, నా సంకల్పం ఒట్టి సంకల్పంగానే వుండిపోయింది. నేను ఎంత వదిలించుకుందామనుకున్నా సాహిత్య వ్యాసంగాన్ని వదిలించుకోలేకపోయాను. గుడివాడ వచ్చాక పిల్లల చదువు సంధ్యలు చక్కగా సాగాయి. ఉయ్యూరులోని ఆర్థిక బాధలు ఇక్కడ లేవు. పిల్లలు పెద్దవాళ్ళు అయ్యారు. నా అనువాద గ్రంథాల్ని వాళ్ళు చదివారు. వ్రాతప్రతిగా శిథిలావస్థలో వున్న 'సింహావలోకన్' అనువాదాన్ని పిల్లలు చదివారు. ఇంతటి విలువైన అనువాదం ఇలా శిథిలమవడం - ముఖ్యం నేను ఇక మళ్ళీ రాయలేని స్థితిలో ఇలా శిథిలమవడం పిల్లల మనసుల్ని బాధించింది. ఈ మధ్య మా పెద్ద అమ్మాయి 'పార్వతి' ఒక సంవత్సరం పాటు ఒకానొక విద్యాసంస్థలో పనిచేసింది. చేతికి అండగా నిలబడ్డది. ఆమె జీతంలో బహుకొద్ది మొత్తాన్ని నిలువచేయగలిగాను. ఆ డబ్బును [బహుకొద్ది మొత్తమే అయినప్పటికీ] 'పార్వతి' పెళ్ళికోసం వాడాలని ఉద్దేశ్యం! ఐతే. కొద్దిగా చేతిలో డబ్బు ఆడేసరికి 'సింహావలోకన్' అనువాదం నన్ను నిలదీసి అడగసాగింది. 'నన్ను పుస్తకరూపంలో ప్రకటించకుండా కూతురి పెళ్ళికి ప్రయత్నిస్తావా?'' అని అడగసాగింది. కొన్ని నెల్లు ఎటూ నిర్ణయించుకోలేని స్థితిలో గడిచిపోయాయి. చివరకు కూతురు పెళ్ళి తరువాత, 'సింహావలోకన్'న్ని తెలుగులో ప్రచురించడం ముఖ్యం అనుకున్నాను. నా ఈ అభిప్రాయాన్ని, యశ్‌పాల్ భార్య శ్రీమతి ప్రకాశవతిగారికి రాశాను. ఆమె వెంటనే ఈ గ్రంథాన్ని తెలుగులో ప్రచురించడానికి హక్కుల్ని ఇచ్చారు. ఇంక నేను ఈ గ్రంథాన్ని 'సింహావలోకనం' అన్న పేరుతో తెలుగులో ప్రచురించడానికి సర్వసన్నాహాల్ని చేసుకున్నాను. ''సింహావలోకన్' మొదటి భాగాన్ని ప్రచురిద్దామని అనుకున్నాను. ఐతే, నా దగ్గర వున్న కొద్ది మొత్తమూ ఏ విధంగానూ చాలదు. కాగా స్థానికంగా వున్న కొందరు సహృదయుల సహాయ సహకారాల్తో 'సింహావలోకనం' మొదటి భాగాన్ని ఈ రూపంలో ప్రచురించగలుగుతున్నాను. ఈ భాగం అనువదించడంలో, చారిత్రిక ప్రామాణికతకు భంగం కలుగకుండా కొంత స్వాతంత్ర్యాన్ని తీసుకోవడం జరిగిందని చెప్పడానికి విచారిస్తున్నాను. 'సింహావలోకనం' మొదటి భాగంలో వర్ణింపబడిన భగత్సింగ్, సుఖదేవ్, చంద్రశేఖర్ ఆజాద్, రాజగురు, భగవతీచరణ్, దుర్గాబాభీ - వీరి చిత్రాల్ని పాఠకుల జిజ్ఞాసను సంతృప్తి పరచడానికయినా -ఇవ్వలేకపోయాను. తెలుగులో ఈ గ్రంథ ప్రచురణకు సహకరించిన మిత్రుల ఫోటోలను వేద్దామనుకున్నాను. అదీ చేయలేకపోయాను.

రసజ్ఞులైన తెలుగు పాఠకుల సహకారం, సహృదయులైన మిత్రుల సహాయం లభిస్తే అతి త్వరలో రెండవ భాగన్ని కూడా అందించగలననుకుంటున్నాను.

జనవరి 1981 - ఆలూరి భుజంగరావు

# ప్రవృత్తి

నేను సాయుధ విప్లవ పోరాటంలో దీర్ఘకాలం పాల్గొన్నాను. ఆంగ్ల ప్రభుత్వం నా మీద ఎన్నో అపరాధాల్ని, అభియోగాల్ని మోపింది. వైస్రాయి లార్డ్ ఇర్విన్ స్పెషల్ ట్రయిన్ క్రింద బాంబు పేల్చాననీ - ఇలాంటివే మరికొన్ని అభియోగాల్ని నా మీద మోపి, నన్ను దీర్ఘకాలం జైలులో వేసింది బ్రిటీష్ ప్రభుత్వం -- !

× × ×

కొత్తగా పరిచయం అయిన మిత్రులు నా విప్లవ జీవితాన్ని గురించి తెల్సుకోవడానికి ఎంతో కుతూహలాన్ని ప్రకటిస్తూ వుంటారు. రకరకాలైన ప్రశ్నలు వేస్తూంటారు. కొందరయితే చాలా విచిత్రమైన ప్రశ్నలు వేసేవారు.

"మీకు బాంబులు, పిస్తోళ్ళు, తుపాకులు - ఎక్కడనుండి వచ్చేవి ?" అని ప్రశ్నించేవారు. వాళ్ళ ప్రశ్నలో పై ఆయుధాల్ని సంపాయించడానికి తేలికయిన మార్గం ఏదయినావుండి, అది నేను వాళ్ళకు చెప్తే బాగుండు అన్న ధ్వని వినపడేది !

పై ప్రశ్నను వేసేవాళ్ళకు "అవసరం వస్తే మనిషి అన్నింటినీ ఏదోరకంగా సంపాయించు కుంటాడు !" అని టూకీగా సమాధానం ఇచ్చేవాణ్ణి.

కొందరు ఏ మాత్రం తలా తోకా లేని ప్రశ్న వేసేవారు. "మీ విప్లవ సంఘం ఇప్పుడూ వుందా ?" అని అడిగేవారు. ఇలాంటి ప్రశ్నలు వేసే ప్రశ్నకర్తల బౌద్ధిక జ్ఞానాన్ని అంచనా వేసుకోవడం సులభం ! వీరికసలు విప్లవం అంటే ఏమిటో తెలియదు. అంతే కాకుండా, సామాజిక రాజకీయ ఉద్యమాలతో వీరికి ఎలాంటి సంబంధమూ ఉండదు. 'దేశంలోని ప్రత్యేకమైన పరిస్థితుల కారణంగా విప్లవం ప్రభవిస్తుంద'ని వీళ్ళకు చెప్పలేము. చెప్పినా అర్థం చేసుకోలేరు. సూర్యుడు అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యం .... ఎంతో శక్తియుక్తులతో ఈ దేశంలోని విప్లవ జ్వాలల్ని అర్పడానికి ప్రయత్నించింది. అయినా, అవి ఆరలేదు; దేశం నలుమూలలా వ్యాపించాయి ...... దేశంలోని పరిస్థితులు మారుతున్నాయి, విప్లవం కూడా తన రూపాన్ని పరివర్తనం చేసుకుని, ఈనాటికీ సజీవంగానే వుంది !

మరికొందరు చాలా గంభీరమైన ప్రశ్న వేసేవారు. "అసలు మీ ప్రవృత్తి ఇలాంటి హింసాత్మకమైన కార్యక్రమాలవైపు ఎలా మొగ్గింది ?" అని అడిగేవారు. ఈ ప్రశ్న చాలా విలువైంది. యోచించవల్సింది !

పై ప్రశ్న చాలామంది చాలాసార్లు వేశారు. ప్రశ్న చిన్నదేగానీ, సమాధానం ఒకటి రెండు వాక్యాలలో చెప్పడానికి వీలుపడదు.

ఒకమాటు ఓ బాధ్యతగల ఇంగ్లీషు అధికారి కూడా ఇదే ప్రశ్న వేశాడు. అతడి పేరు మిస్టర్ హాలింస్; యు.పి. పోలీస్ ఇనస్పెక్టర్ జనరల్ !

1932 జనవరి 23వ తారీకు; లాహోరు, ఢిల్లీ కుట్రకేసుల్లోని నిందితుణ్ణి కావడం వల్ల పరారీలో వున్నాను. పోలీసులు నన్ను పట్టుకోవడానికి మూడు సంవత్సరాలుగా సతమతం అవుతున్నారు. జనవరి 22వ తారీకు రాత్రి, పోలీసులు అలహాబాదులో నేను ఉన్న ప్రదేశాన్ని పసికట్టారు. సాయుధులైన పోలీసులు నేను వున్న ఇంటిని చుట్టుముట్టారు. ఈ సంఘటనను సందర్భం వచ్చినప్పుడు పూర్తిగా, వివరంగా వర్ణిస్తాను. క్లుప్తంగా చెప్పాలంటే ఆ నిశీధిలో నేనూ పోలీసులూ తుపాకులు కాల్చుకున్నాము.

నా దగ్గర తూటాలు అయిపోయాయి. లొంగిపోయిన నన్ను తీసుకుపోయి అలహాబాద్ కైనింగ్‌రోడ్డు పోలీస్‌స్టేషన్‌లో రిమాండులో వుంచారు.

ఇంకా ఒక గంటకూడా గడవలేదు. ఇద్దరు ఇంగ్లీషు అధికారులు నేనున్న ఖైదు కొట్టులోకి వచ్చారు. ఇద్దరిలోనూ ఒకతను చాలా దర్పంగా వున్నాడు. నన్ను ఉద్దేశించి ఇంగ్లీషులో ఇలా అన్నాడు. 'At last we have got you !' (చివరికి నిన్ను పట్టేశాం !)

పై అధికారి స్వరం కొంత విరసంగా, ఏ మాత్రం సానుభూతి లేకుండా వుంది. అతడి స్వరంలోని ఈ విరసత్వం తరువాత జరిగిన మా సంభాషణమీద బాగా ప్రభావాన్ని వేసింది. అతడితో ఇంగ్లీషులోనే ఇలా అన్నాను "మీరెవరో నాకు తెలియనందుకు విచారిస్తున్నాను !".

అధికారి ముఖంలోని దర్పం కొంత తగ్గింది. దాని స్థానంలో విస్మయం కనుపించింది. "మేము ఎవరమో మీకు తెలియదా ? మీ పిస్తోలు గుండ్లతో మా బుర్రలు ఎగరగొట్టడానికి ఎన్నిమాట్లు మా బంగళాల చుట్టూ తిరిగారో !"అన్నాడా అధికారి.

అతడి అజ్ఞానానికి నవ్వు వచ్చింది. "ఆ భయంతో మీరు రాత్రిళ్ళకు రాత్రిళ్ళు నిద్రపోకుండా మేలుకుని గడిపారనుకుంటాను ? ఐనా, నా దురదృష్టమో, ఏమో - మీరు ఎవరో నిజంగా నాకు తెలియదు !" అన్నాను.

అధికారి మరికొంచెం నమ్రతగా "నా పేరు హాలిన్స్. నేను యు.పి. పోలీసు ఇనస్పెక్టరు జనరల్ని !"అంటూ తన వెంటవున్న అధికారి వైపు చూపుతూ "వీరు మిస్టర్ షా ! యు.పి., సి.ఐ.డి. పోలీసు డిప్యూటీ ఇనస్పెక్టర్ జనరల్ !" అని తమ పరిచయాన్ని ఇచ్చాడు.

అతడిలోని దర్పం పూర్తిగా మాయం అయింది. నమ్రతగా మాట్లాడుతున్నాడు. నేనూ నమ్రతగా అడిగాను. "ఏమిటి సెలవు ?"

"మీరు ఈ మార్గాన్ని ఎందుకు స్వీకరించారు ?" అనడిగాడు హాలిన్స్.

"మరేమార్గమూ లేదు కనుక ! ఇంకేవిధంగా చెప్పినా మీరు వినరు గనక !" సమాధానం ఇచ్చాను.

"మీరు అన్నదానికి అర్థం ?" అనడిగాడు.

"అర్థం మీకు బాగా తెల్సు ! మా దేశ ప్రజల్లో నూటికి తొంభై తొమ్మిదిమంది కూడులేక, గుడ్డలేక, ఇల్లులేక జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్నారు. ఈ దేశ ప్రజలు తమ జీవితాల్ని బాగు పరచుకో గోరుతున్నారు. కానీ, మా దేశ ప్రజల ప్రయత్నాలన్నీ పర ప్రభుత్వపు ఇనుప పిడికిట్లో నలిగి పోతూన్నాయి. పర ప్రభుత్వాన్నుండి స్వాతంత్ర్యాన్ని పొందడానికి మరే మార్గమూ లేక మేమీమార్గాన్ని స్వీకరించాము !"

భారత ప్రజలు దుర్భరమైన దరిద్రంతో వేగిపోతూన్నారనీ, స్వాతంత్ర్యం కోసం ప్రయత్నించే అధికారం ఈ దేశ ప్రజలకు వుందనీ హాలిన్స్ ఒప్పుకున్నాడు. ఐతే, కొసమాట వదిలాడు. "ఈ దేశ ప్రజలు స్వాతంత్ర్యాన్ని పొందడానికి సరైన మార్గం గాంధీగారి సత్యాగ్రహమే !" అన్నాడు.

"గాంధీగారి సత్యాగ్రహాన్ని మీరసలు లెక్క పెట్టడంలేదుకద ? గాంధీ గారి ఉద్యమం సరైంది అనుకున్నప్పుడు, మీరా ఉద్యమ కార్యకర్తలమీద లాఠీఛార్జి ఎందుకు చేస్తున్నారు ? తుపాకి కాల్పులు ఎందుకు సాగిస్తున్నారు ? మరి గాంధీగారి కాంగ్రేసును నిషిద్ధ సంస్థగా ప్రకటించారుగదా, చాలాసార్లు? అదే సరైన మార్గం అనుకున్నప్పుడు ఇవన్నీ ఎందుకు చేస్తున్నారు ?" అడిగాను.

ఒక పరప్రభుత్వ అధికారికి అంతకంటే ఏం సమాధానం ఈయగలం ? ఐతే, ఇంగ్లీషు ప్రభుత్వం గాంధీగారి సత్యాగ్రహోద్యమాన్ని లక్ష్యపెట్టడంలేదు గనుక, విప్లవకారులకు గాంధీగారి

ఉద్యమం మీద తిరస్కార భావం ఏర్పడ్డదనుకోవడం పొరపాటు ! మొదట్నుండీ విప్లవకారులకు, గాంధీగారి స్వరాజ్యోద్యమం మీద విశ్వాసం లేదు ! అందుకనే విప్లవకారులు సాయుధ పోరాటం వైపు మొగ్గారు.

పైప్రశ్నలో మరో రకమైన ధ్వని కూడా ఇమిడి వుంది. "ఏం ? గాంధీగారి స్వరాజ్యోద్యమం మీకెందుకు నచ్చలేదు ? గాంధీగారి ఉద్యమం నిరాపదమయింది. పోలీసులు పట్టుకుంటే ఆరునెల్లు బి క్లాసు జైలుతో సరి ! అందుకు ప్రతిఫలంగా ప్రజల్లో పలుకుబడి, అశేషమైన కీర్తి, పూలదండలతో ఘనసత్కారాలు లభిస్తాయి ! కానీ, మీ మార్గం అలాంటిదికాదే ? క్రూరజంతువుల్లా రహస్య జీవితాన్ని గడపడం. పోలీసుల కంటపడితే ఉరికంబానికో తుపాకిగుండ్లకో ఎరకావడం ? గాంధీగారి ఉద్యమంతో సంతృప్తిపడక ఇంత ప్రమాదకర మార్గాన్ని ఎందుకు పూనుకున్నారు ?" అన్న ధ్వని కూడా పైప్రశ్నలో ఇమిడివుంది.

అసలు సాయుధ విప్లవ పోరాటానికి కారణం ఏంటి ? అని ప్రశ్న వేసుకుంటే, "దేశం యొక్క దుర్దశను చూడలేక, జాతీయ అవమానాన్ని, పరతంత్రంలో నలిగిపోయే పేదప్రజల దీనవదనాల్ని చూడలేక - చూసి సహించలేక - సాహసికులైన కొందరు యువకులు ప్రాణాలకు తెగించి విప్లవ కార్యక్రమాల్ని చేపట్టుతారు" అని క్లుప్తంగా సమాధానం చెప్పుకోవచ్చును. ఐతే, పైప్రశ్నకు ఈ మాత్రం సమాధానం సరిపోదు. గాంధీగారి కాంగ్రెసు ఉద్యమంలో పనిచేసే యువకులుకూడా జాతీయ అవమానాన్ని, దేశప్రజల దీనావస్థనూ చూసి సహించలేక ఉద్రిక్తులైనవాళ్ళేకదా ? వాళ్ళూ జాతీయ అవమానానికి ప్రతీకారాన్ని చేయడానికేకదా కాంగ్రేసులో చేరింది ? మరి ఆ కాంగ్రెసు, లేక గాంధీగారి సత్యాగ్రహోద్యమం విప్లవకారులకు ఎందుకు నచ్చలేదు ?

మరొక్క విషయం; ప్రాణాలకు తెగించి సాయుధ విప్లవ పోరాటాన్ని నడిపిన ఈ కొద్దిమంది యువకులే కాకుండా, ఈ దేశంలో ఇంకా కూడా చాలా మంది యువకులు వున్నారు ! వాళ్ళూ దేశస్థితిని, ప్రజల దీనావస్థనూ చూస్తూనే వున్నారు ! అశేషంగా వున్న, మిగిలిన యువకుల్లోనూ దేశంకోసం ప్రాణాల్నియగల సాహసికులూ ఎందరో వుండవచ్చు ! మరివాళ్ళు ఎవరూ విప్లవ సంఘాలను స్థాపించి, సాయుధ పోరాటాల్ని నడపకపోవడమేం ? ఈ కొద్దిమంది యువకులే అలాంటి సంఘాల్ని స్థాపించి పోరాటాల్ని నడపడమేం ? దీన్ని బట్టి మనం అర్థం చేసుకోగలిగింది ఏంటి ? విప్లవకారుల్ని ఇంతటి జాతీయ అభిమానుల్ని, దేశభక్తుల్ని, ఉద్రిక్తుల్ని - చేసిన కౌటుంబిక, వ్యక్తిగత, సామాజిక పరిస్థితుల్ని అధ్యయనం చేయాలి !

నేనీ గ్రంథంలో పై ప్రశ్నలన్నింటికీ నాకు తెల్సిన వరకు సమాధానాలనీయడానికి ప్రయత్నించాను.

## భగత్సింగ్

విప్లవ పోరాటంలో పాల్గొనేనాటి నుండి చివరవరకూ భగత్‌సింగ్, నేనూ ప్రాణస్నేహితులుగా మెలిగాము ! అంతకు క్రితం చదువుకునే రోజుల్లోనూ అతడూ నేను స్నేహితులుగా వుండేవారం. భగత్‌సింగ్ హాస్యప్రియుడు. తాను నవ్వుతూ ఎదుటివారిని నవ్వించగలడు. అతడి ఆకారం కూడా కొంత వినోదాన్ని కలిగించేట్టుగా వుండేది. ఇప్పుడు మనం ఫోటోల్లో చూస్తున్న అతడి రూపానికి అప్పటి అతని ఆకారానికి చాలా వ్యత్యాసం వుంది. తలమీద హేటు, సన్నని కొనదేలిన మీసాలతోటి వున్న ఫోటోలలోని అతని రూపాన్ని చూచి, ఆనాటి అతని ఆకారాన్ని పోల్చుకోలేము. భగత్సింగ్ పొడుగ్గా వుండేవాడు. శరీరచ్ఛాయ గొప్పదే అయినా, నూనూగు మీసాలవల్ల, అప్పుడే వస్తున్న గడ్డంవల్లా ముఖం

మసకబారినట్టు వుండేది .... సన్నని వత్తయిన కనుబొమలు .... చిన్న కండ్లు, జుట్టుముడి వదులుగా వేసుకునేవాడు. తలగుడ్డ రెండు కొసలూ రెండు భుజాలమీదకూ వ్రేలాడుతూండేవి ! సాధారణంగా అతడి వస్త్రధారణ తరచు ఎగుడుదిగుడుగా వుండేది. పైజమాని ఎప్పుడోగాని వేసుకునేవాడు కాదు. సామాన్యంగా కాలేజీకి కూడా లుంగీతోనే వచ్చేసేవాడు. భగత్‌సింగ్ ఆకారమూ, వస్త్రధారణలోని అతడి ఈ నిర్లక్ష్యాన్ని చూసి స్నేహితులం నవ్వుకునేవాళ్ళం ! అప్పటి మా సహాధ్యాయి ఝుండాసింగ్ (ఇప్పుడు సర్దార్ జశ్వంత్‌సింగ్) భగత్‌సింగ్ కండ్లను లడ్డలో చిక్కుకున్న బాదంపప్పుతోటి అతడి ఆకారాన్ని ఒంటె తోటి పోల్చేవాడు !

కాగా, కాలేజీలో చదివే రోజుల్లో సహాధ్యాయులం భగత్సింగ్‌ను తరచు ఎగతాళి పట్టిస్తూండేవారం! అప్పుడు నేనూ మిత్రుల పరిహాసానికి గురి అవుతుండేవాణ్ణి ! అలాంటి భగత్సింగ్ ఈనాడు తన ఆదర్శప్రియత, కర్తవ్యపాలన, కార్యపటుత, త్యాగశీలత - మొదలైన ఉత్తమ గుణాలవల్ల సమస్త భారతదేశానికే గర్వకారణుడయ్యాడు.

భగత్సింగ్ కుటుంబం సిక్కు మతానికి చెందిందే అయినా, వారు ఆ మతాన్ని గుడ్డిగా విశ్వసించేవారు కాదు. అనుసరించేవారూ కాదు ! భగత్సింగ్ తండ్రి కిషన్‌సింగ్‌ను నేను బాగా ఎరుగుదును. అతడి తాత అర్జున్‌సింగ్‌ను కూడా ఎరుగుదును. కిషన్‌సింగ్, అర్జున్‌సింగ్‌లు సిక్కుమతాచారాలకంటే ఆర్యసమాజపు ఆచారాలను ఎక్కువగా పాటించేవారు.

భగత్సింగ్ తాత సర్దార్ అర్జున్‌సింగ్ సిక్కు మతంలో పుట్టినా, ఆర్య సమాజ వైదిక విధానాల్ని అభిమానిస్తూ వుంటాడు. ఆ ఆచారాలను పాటిస్తూ వుంటాడు. పుట్టుకతో లభించిన మతాన్ని కాదని బుద్ధిద్వారా మరో మతం ఉత్తమమైందని గ్రహించి, అనుసరించే వ్యక్తి భావస్వాతంత్ర్యం కలవాడనీ - మతదృష్ట్యా విప్లవకారి అనీ అనక తప్పదు !

కుటుంబంలోని ఈ విప్లవాత్మకమైన భావస్వాతంత్రం భగత్సింగ్ మీద బాగా ప్రభావాన్ని వేసింది. సర్దార్ అర్జునసింగ్ వ్యక్తిగతంగానే కాకుండా మొత్తం సిక్కు సమాజాన్నే వ్యతిరేకించి, తమ గ్రామంలో ఆర్యసమాజపు ఉత్సవాలను జరుపుతూ వుంటారు.

భగత్సింగ్ పూర్వీకుల నివాస స్థానం పంజాబులోని హోషియార్‌పూర్ జిల్లాలో వుంది. కానీ, చీనాబ్ నదికి కాలువలు తవ్వాక వాళ్ళ కుటుంబం లాయల్‌పూర్ జిల్లాకు వలస వచ్చింది.

అతడి పినతండ్రి సర్దార్ అజిత్‌సింగ్ ఆనాటి రాజకీయాల్లో ప్రముఖ స్థానాన్ని పొందారు. భగత్సింగ్ తండ్రి కిషన్‌సింగ్ కూడా పర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. అప్పటికింకా గాంధీగారి సిద్ధాంతాలు ప్రచారంలోకి రాలేదు. జైళ్ళల్లో ముక్కుమూసుకు కూచుని, ఆధ్యాత్మిక శక్తి ద్వారా స్వాతంత్ర్యాన్ని పొందే సిద్ధాంతం రాజకీయ నాయకులకు తెలియదు ! సర్దార్ అజిత్‌సింగ్‌కు, బ్రిటీష్ పాలకుల చేతుల్లో చిక్కి జైళ్ళల్లో మగ్గడం ఇష్టంలేదు. బ్రిటీష్ ప్రభుత్వానికి దొరక్కుండా అంబాప్రసాద్ సూఫీతోకల్సి భారతదేశపు అనేక ప్రాంతాలలో తిరిగారు. నేపాల్లోనూ కొంతకాలమున్నారు. ఈ దేశంలో రహస్య జీవితాన్ని గడుపుతూ తాము ఏమీ చేయలేమని నిశ్చయించుకుని విదేశాలకు వెళ్ళిపోయారు. విదేశాల్లోనూ ఊరకే కూచోకుండా భారతదేశంలో రాజకీయ విప్లవాన్ని సాధించడానికి నిరంతరం కృషి చేశారు. లాలా హర్‌దయాళ్, రాజా మహేంద్ర ప్రతాప్, బర్కతుల్లా - మొదలుగాగల ప్రముఖ విప్లవకారులను కల్సుకున్నారు. వారి సహాయాన్ని, సలహాలనూ స్వీకరించారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో, బ్రిటీష్ ప్రభుత్వానికి, - బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా రోమ్‌నుండి హిందుస్తానీలో ప్రసారమయిన ఉపన్యాసాలు అజిత్‌సింగ్‌గారు ఇచ్చినవేనని చెప్పుకునేవారు. ఆ ఉపన్యాసాల్లో వారు బ్రిటీష్ ప్రభుత్వంపై నిప్పులు కక్కేవారు ! 1948 తరువాతగాని

అజిత్‌సింగ్ భారతదేశం రావడానికి వీలులేక పోయింది. అప్పటికి వారు వృద్ధులయ్యారు. నిరంతర సంఘర్షణతో డస్సిపోయారు. భారతదేశానికి వచ్చిన కొద్ది రోజులకే చనిపోయారు.

ఇది 1919 నాటి విషయం. ఆ సంవత్సరం రౌలెట్ బిల్లుకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమం ముమ్మరం అయింది. దేశం అంతట్లోనూ తీవ్రరాజకీయ వాతావరణం వ్యాపించింది. రౌలట్ బిల్లు వ్యతిరేక ఉద్యమం గాంధీగారి నాయకత్వంలో జరుగుతోంది. అప్పటికి నేనూ భగత్సింగ్ - డి.ఎ.వి. స్కూల్లోనే చదువుతూన్నాము. మేము చూసిన మొట్టమొదటి రాజకీయ ఉద్యమం అది ! అంతటి ప్రజావెల్లువను మరెన్నడూ చూడలేదు. రౌలెట్ బిల్లుకు వ్యతిరేకంగా లాహోరులో ఊరేగింపు జరిగింది. ఊరేగింపు రెండు మూడు మైళ్ళ పొడవుంటుంది. అసమ్మతి సూచకంగా అందరూ నల్లజండాలను పుచ్చుకున్నారు. ఆకాశం నల్లజండాలతో కావురు కమ్మింది. అప్పటికింకా శాంతియుతమైన సత్యాగ్రహం రాజకీయాల్లో అడుగుపెట్టలేదు. అసలా నాటి రాజకీయ నిఘంటువులో 'శాంతి, సత్యాగ్రహం' అన్నపదాల్లేవు ! ప్రజలు తమకు తెల్సిన పద్ధతిలో అసమ్మతిని ప్రకటిస్తున్నారు.

ఒక్క ఊరేగింపే కాకుండా, ఏడురోజుల వరకూ లాహోరు పట్నం అంతట్లోనూ బంద్ జరిగింది. అంతటి గొప్ప బంద్ నేనా తరువాత ఎన్నడూ చూడలేదు. రౌలెట్ బిల్లుకు వ్యతిరేకంగా లాహోరులో జరిగిన బంద్ చరిత్రాత్మకమైంది. ప్రజాభిప్రాయం ప్రకారం ఏడు రోజులు సంపూర్ణ బంద్ జరిగింది.

ఒక్క బీడీకొట్టుకూడా తెరవలేదంటే అతిశయోక్తికాదు ! పోలీసులు బలవంతాన ఎక్కడయినా ఒక దుకాణాన్ని తెరిపించేవారు. వాళ్ళు అటు వెళ్ళిపోగానే ప్రజాసమూహం వెళ్ళిపడేది ఆ దుకాణం మీదకు ! లాహోరులాంటి మహాపట్నంలో ఏడు రోజులు పూర్తి బంద్‌ను నిభాయించడం అసాధారణమైన విషయం. లాహోరులో తందూర్లనే టిక్కిహోటళ్ళు వందల సంఖ్యలో వున్నాయి. వాటిలో వేల సంఖ్యలో ప్రజలు భోంచేస్తుంటారు. ఏడు రోజులూ ఈ తందూర్లన్నీ మూతపడిపోయాయి. మధ్య తరగతి కుటుంబాల్లోని స్త్రీలు రంగంలోనికి దిగారు. గొంది గొందికీ అనేకంగా మూడురాళ్ళ పొయ్యిలు వెలిశాయి! స్త్రీలు అడిగిన వాళ్ళందరికీ ఉచితంగా రొట్టెల్ని కాల్చి ఇవ్వసాగారు. తందూర్లులేని లోటు కనబడనీయలేదు!

మరా ఏడురోజులూ గృహస్థుల నిత్యావసరాలు ఎలా గడిచాయో నాకు తెలియదు. ఎక్కడ చూసినా ప్రజలు గుంపులు గూడి రౌలెట్ బిల్లుమీద శోకాలు తీసేవారు 'అయ్యో ! రౌలెట్ బిల్లా ! అయ్యో రౌలెట్ బిల్లా !' అని పెద్దగా ఏడిచేవారు. కొన్ని చోట్ల ఐదవ జార్జి చక్రవర్తి బొమ్మను తయారుచేసి తగులబెట్టారు. లాటీచార్జీలు, తుపాకి కాల్పులూ సాధారణ విషయం అయింది. పట్నంలో మార్షల్లా ప్రకటించబడ్డది. బ్రిటీష్ ప్రభుత్వానికి భారతీయ సైన్యంమీద, పోలీసులమీద విశ్వాసం సన్నగిల్లింది. ముఖ్య స్థానాల్లో బ్రిటీష్ సైనికుల్ని తెచ్చిపెట్టింది. అరెస్టులు ముమ్మరం అయ్యాయి. ప్రభుత్వ ఆజ్ఞల్ని ధిక్కరించినవారికి నడిబజార్లో కొరడాదెబ్బలు తగుల్తూన్నాయి ! బంద్ విరమించవల్సిందనీ, ప్రభుత్వ ఆజ్ఞలను ధిక్కరించవలదనీ - బ్రిటీషు అధికారులు ఇండ్లకు, దుకాణాలకు పోస్టర్లు అంటించేవారు. వాళ్ళు అటుపోగానే ప్రజలు ఆ పోస్టర్లని చింపివేసేవారు. ఏ ఇంటికి అతికించిన పోస్టర్ని ఆ యింటివాళ్ళూ, ఏ దుకాణానికి అతికించిన పోస్టర్ని ఆ దుకాణదారుడూ - చింపకుండా చూడాలన్న నియమం పెట్టింది ప్రభుత్వం ! అవి చినిగిపోతే ఆ యింటి యజమానికీ, ఆ దుకాణదారుడికీ శిక్ష పడుతుంది ! విద్యార్థులను ఊరేగింపుల్లోనూ, సభల్లోనూ పాల్గొనకుండా చూసే బాధ్యత విద్యాసంస్థల అధిపతులకు ఇచ్చింది ప్రభుత్వం ! ఇన్ని చేసినా ప్రజలు అజేయులుగానే వుండిపోయారు !

నేనప్పుడు డి.ఎ.వి. స్కూల్లో చదువుతున్నాను. మా బోర్డింగ్ గదుల తలుపుల్ని మూసేశారు. విద్యార్థులు ఎవరూ బయటికి వెళ్ళి ఊరేగింపులో పాల్గొనకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

రౌలెట్ బిల్లు వ్యతిరేకోద్యమాన్ని చూసి ఆంగ్ల ప్రభుత్వమేకాకుండా గాంధీగారూ, కాంగ్రెస్ నాయకులు కూడా హడలిపోయారు. గాంధీగారు ఇలాంటి ఉద్యమాన్ని నడిపినందుకు ప్రాయశ్చిత్తం కూడా చేసుకున్నారు. పాపం గాంధీగారికి - ఈ ఉద్యమంలో 1917 అక్టోబర్‌లో జరిగిన రష్యా విప్లవపు ఛాయలు కనుపించి వుంటాయి. ఆ తరువాతనే ప్రతి ఉద్యమంలోనూ గాంధీగారు అహింసకు ప్రాధాన్యతనిస్తూ వచ్చారు.

ఈ బంద్ ఒక్క లాహోరులోనే కాకుండా అమృత్‌సర్, గుజరావాలా - లాంటి పట్నాల్లోనూ జరిగింది. ఇదే సందర్భంలో దురదృష్టకరమైన జలియన్‌వాలాబాగ్ హత్యాకాండ జరిగింది. ప్రజలు ఆగ్రహావేశులయ్యారు. మహోద్రిక్తులైన ప్రజల్ని అదుపులో పెట్టుకోవడానికి, గుజరావాలాబాగ్ పట్నవాసుల మీద బ్రిటీష్ ప్రభుత్వం విమానాల్లో నుండి బాంబుల్ని వేసింది ! చేయిజారిపోతున్న పరిస్థితిని అదుపులోకి తెచ్చుకుంది !

గాంధీగారు రౌలెట్ బిల్లు వ్యతిరేకోద్యమాన్ని మధ్యలోనే విరమించారు. ఆ ఉద్యమ సందర్భంగా ప్రజలమీద జరిగిన అత్యాచారాలకు న్యాయవిచారణ జరపవలసిందని కాంగ్రెసు పార్టీ ఆంగ్ల ప్రభుత్వాన్ని ప్రార్థించింది. కాంగ్రెసు పార్టీ యొక్క ఈ దయనీయ ప్రార్థనను ఆంగ్ల ప్రభుత్వం త్రోసివేయడంతో సహాయ నిరాకరణోద్యమం ప్రారంభం అయింది !

భగత్‌సింగ్ కూడా సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నాడు. తొమ్మిదవ తరగతి చదువుతూ - చదువు మానుకుని కాంగ్రెసు స్వయం సేవకుల్లో చేరిపోయాడు. అయితే, 1922లో సహాయ నిరాకరణోద్యమం ఆపివేయబడ్డది. గాంధీగారు 1921 నాటికి స్వాతంత్ర్యాన్ని తప్పక పొందుతామని ప్రతిజ్ఞ చేశారు. కానీ, 1922లో ఉద్యమం ఆపివేయడంతో ఎంతో ఉత్సాహంతో ముందుకు వచ్చిన విద్యార్థులూ, ఇతర ప్రజలూ నిరాశావృత్తులయ్యారు. తీవ్రవేగంతో వెళ్ళే ఎక్స్‌ప్రెస్ ట్రయినుకు షడన్ బ్రేకు వేసినట్లయింది. పెట్టెలు ఒకదాంటోకి ఇంకొకటి జొచ్చుకుపోయినట్లు ప్రజల త్యాగనిరతి, ఉత్సాహం, ఉద్వేగం - పెడమార్గాలు పట్టాయి, మత విద్వేషాలు తలెత్తాయి !

## యశ్‌పాల్

నేను నేషనల్ కాలేజీలో చేరేనాటికి ఎలాంటి మానసిక స్థితిలో వున్నానో తెల్సుకోవడమూ అవసరమే అనుకుంటున్నాను. నేషనల్ కాలేజీలోనే భగత్‌సింగ్, సుఖదేవ్, భగవతీచరణ్ - మరి ఇతర మిత్రులూ నాకు పరిచయులయ్యారు. నేను సాయుధ విప్లవంలో పాల్గొనడానికి కారణాల్ని పర్యాలోకిస్తే- ఓ పెద్ద గాథగా కనబడుతుంది. అప్పటి సమాజ పరిస్థితులూ, మా కుటుంబ వాతావరణం-ఇవన్నీ నేను విప్లవకారుణ్ణి కావడానికి దోహదం చేశాయి.

పరప్రభుత్వంతో నా పోరాటానికి కారణాలను వెతికేప్పుడు హృదయపు అట్టడుగు పొరలనుండి అదమ్యమైన ద్వేషం పెల్లుబుకుతుంది. బ్రిటీష్ ప్రభుత్వంమీది ద్వేషం విశ్వరూపాన్ని ధరించి మిగిలిన అన్ని భావాలనూ తనలో లీనం చేసుకుంటుంది. ఇంగ్లీషువాళ్ళ మీద నాకు వ్యక్తిగతమైన ద్వేషం ఏముంటుంది ? ఇంగ్లీషువాళ్ళ ప్రభుతనూ, శక్తినీ చూసి నేనూ అలా వుండగలిగితే బాగుండన్న కోర్కె కలగడం సహజం ! వాళ్ళలా తయారు కాలేనప్పుడు వాళ్ళమీద ఈర్ష్య కలగడం అంతకంటే సహజం! ఈ ఈర్ష్యే విస్తృతరూపంలో జాతీయతను ఆపాదించుకుంటే విప్లవకారణం అవుతుంది ! బాల్యం నుండి ఇంగ్లీషువాళ్ళను చూస్తూంటే నాలో ఈర్ష్యాద్వేషాలు పెల్లుబికుతుండేవి ! అలా ఈర్ష్యపడడం, ద్వేషించడం నా మానసిక దౌర్భల్యమనో, వ్యక్తిగతమైన లోపమనో - నేను ఆనాడు అనుకోలేదు ! ఇప్పటికీ అనుకోవడం

లేదు ! ఈ ద్వేషించే ప్రవృత్తి నాలోనే ప్రత్యేకం ఉందనుకోంది, వయోవృద్ధు ప్రసిద్ధ విప్లవకారుడు ఐన భూపేంద్రనాథ్ దత్తు జీవితంలోను కనుపిస్తుంది. అతడు తన ఆత్మకథలో ఇలా రాసుకున్నాడు.

ఒకమాటు భూపేంద్రనాథ్ దత్తు, వైద్యనాథ్‌సింగ్‌కు బెంగాల్లోని సాయుధ విప్లవ పోరాటాన్ని గురించి వివరిస్తూ "దాదాపు యాభైసంవత్సరాల క్రితం వంగదేశీయులైన నవయువకులు ఇంగ్లీషువార్ని ఘోరంగా ద్వేషించేవారు. ఆ రోజుల్లో కలకత్తాలో ట్రాం బండ్లను గుర్రాల్తో లాగించేవారు. ఇంగ్లీషువాళ్ళు ట్రాంబండ్లల్లో ప్రయాణం చేస్తూ కనిపిస్తే, దారేపోయే బెంగాలీ యువకులు, విపరీతమైన ద్వేషంతో, ట్రాం బండ్లల్లోకి జొరబడి కసితీరా ఇంగ్లీషువాళ్ళను చావగొట్టి క్రిందకు దూకి పారిపోయేవారు ! ఆ ద్వేషమే క్రమంగా సాయుధ విప్లవరూపాన్ని దాల్చింది. యువకుల్లో జాతీయ భావానికి పునాదుల్ని వేసింది." అని చెప్పారు.

యాభై ఏండ్ల క్రితం ఈ దేశానికి వచ్చి, ఇక్కడ నివసించే ఇంగ్లీషువారి ప్రవర్తనను ఇప్పుడు మనం ఊహించడం కూడా కష్టమే ! ఈ దేశానికి వచ్చిన అతి సాధారణుడైన ఇంగ్లీషువాడు కూడా తానీ దేశానికి అధిపతి అన్నట్టు వ్యవహరించేవాడు. మంసూరి, సిమ్లా, నైనిటాల్ - ఇవి ఇంగ్లీషువారి ప్రధాన స్థావరాలు ! ఆ రోజుల్లో భారతీయులతో ఇంగ్లీషువారు ఎలా ప్రవర్తించేవారో పై ప్రదేశాల్లోని వృద్ధుల్ని అడిగి తెల్సుకోవచ్చును. అప్పట్లో భారతీయుడు ఎవడూ ఇంగ్లీషువారికి ఎదురుగా గొడుగు వేసుకు వెళ్ళడానికి వీల్లేదు. పై ప్రదేశాల్లో కొన్ని రోడ్లు ఇంగ్లీషువారి కోసమే ప్రత్యేకింపబడి వుండేవి. ఆ రోడ్లన భారతీయులు నడవడానికి వీల్లేదు. ఇలాంటివే ఇంకానూ......

ఆ చిన్న వయస్సులో పరప్రభుత్వాన్ని గురించి మేమెలా మాట్లాడుకునేవారమో ఒక ఉదాహరణ ద్వారా స్పష్టం చేస్తాను. ప్రథమ ప్రపంచ యుద్ధపు రోజులు. సాయంత్రం భోజనమయ్యాక కాస్సేపు తిరగడానికి వదిలిపెట్టేవారు. వేసవికాలంలోనూ, వర్షాకాలంలోనూ రాత్రిపూట్ల ఎక్కువసేపు చదువు సాగేదికాదు. ఆ రెండు కాలాల్లోనూ సంధ్యాసమయపు షికారు కొంచెం ఎక్కువసేపే చేసేవాళ్ళం. ఒకనాడు నేనూ, నా సహాధ్యాయి ఒకతనూ మాట్లాడుకుంటూ షికారు చేస్తున్నాం. మాటల సందర్భంలో జర్మనీవాళ్ళు గెలిచి యింగ్లీషువాళ్ళు ఓడిపోతే బాగుండునని చెప్పుకుంటున్నాం. యింతలో నా భుజంమీద ఎవరో చెయ్యి వేశారు. ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాను. చెయ్యి వేసింది గురుకుల మహావిద్యాలయం ప్రిన్సిపాల్ రామ్‌దేవ్‌గారు.

నేను కొంచెం కంగారుపడ్డాను. ఆచార్యులవారు కోప్పడతారేమోనని భయపడ్డాను. వారు నన్ను కోప్పడలేదు. నన్ను ఉత్సాహితుణ్ణి చేస్తూ "జర్మనీవాళ్ళు గెలవాలని ఎందుకనుకుంటున్నావు ?" అని ప్రశ్నించారు.

"జర్మనీ గెలిస్తే ఇంగ్లీషువాడు ఓడిపోతాడు. మన దేశం స్వతంత్రమవుతుంది." అన్నాను.

"ఇంగ్లీషువాడు ఓడిపోవడం వల్ల మనదేశం స్వతంత్రమవుతుందని ఎక్కడుంది ? మనం జర్మనీవాడి పాలనలోకి పోవచ్చు. జర్మనీవాడు యింగ్లీషు వాడికంటే కూడా క్రూరంగా పరిపాలించవచ్చు !" అన్నారు ఆచార్యులవారు.

"జర్మనీవాడూ క్రూరంగా పరిపాలిస్తే ప్రజలు విప్లవం లేవదీస్తారు. మనం వాడితో పోరాడుతాం." అన్నాను అప్పటి నా జ్ఞానాన్ని అనుసరించి.

"అది సరికాదు. క్రూరంగా పరిపాలించినంత మాత్రాన విప్లవం రావాలని ఎక్కడుంది ? నాదిర్ షా, ఔరంగజేబ్ - వీళ్ళు ఎంత క్రూరంగా పరిపాలించలేదు ? అయినా విప్లవం రాలేదు కదా ? .... తెలిసీ తెలియకుండా ఇలాంటి మాటలు మాట్లాడుకోకూడదు. నువ్వింకా చదువుకోవాలి. రాజకీయాలను అర్థం చేసుకోవాలి !" అన్నారు ఆచార్యులవారు. కానీ పరప్రభుత్వం మీద వ్యతిరేక

భావాన్ని ప్రకటించినందుకు నన్నేమీ కోప్పడలేదు. ఆ రోజుల్లో లాహోరులోని మరే యితర విద్యా సంస్థకు సంబంధించిన విద్యార్థి అయినా ఇలా మాట్లాడివుంటే గట్టిగా దండింపబడేవాడు.

విప్లవాత్మకమైన భావాలు నాలో ఎలా కలిగాయో తెల్పడానికి గురుకుల విద్యాభ్యాసాన్ని గురించి ఉదహరించాను.

గురుకులం నుండి బయటపడేనాటికి నాకు దాదాపుగా పదునాలుగు ఏళ్ళుంటాయి.

ఏడు సంవత్సరాల గురుకుల వనవాసం తరువాత తిరిగి నాగరిక ప్రపంచంలోకి వచ్చిపడ్డాను. అంటే లాహోరుకు వచ్చాను. అన్ని సంవత్సరాల గురుకులవాసం తరువాత నాగరిక జీవితం చాలా కొత్తగా వుంది ! కట్టూ, బొట్టూ, మాటా - అన్నీ విభేదించాయి. పైగా, గురుకులంలో మాట్లాడుకున్నట్టు, రాజకీయాల్ని గురించి లాహోరులో స్వతంత్రంగా మాట్లాడుకోడానికి వీల్లేదు. లాహోరులో అదే రోజుల్లో రాజకీయ కారణాలవల్ల చాలామందిని అరెస్టు చేస్తున్నారు. భాయి పరమానంద్, బాలముకుందీ, బలరాజ్ మొదలైన విప్లవకారుల్ని ఆంగ్ల ప్రభుత్వం అరెస్టు చేసింది. లాహోరు వాతావరణం చాలా ఉద్రిక్తంగా వుంది. రాజకీయ విషయాల గురించి ఏమీ మాట్లాడరాదని మా అమ్మ ప్రత్యేకంగా నాకు చెప్పింది. నేను గురుకులంలో వుండగానే 'ఆనందమఠం', 'అండమాను ప్రతిధ్వని' లాంటి ప్రసిద్ధమైన గ్రంథాల్ని చదివాను. కనుక లాహోరులోని రాజకీయ స్తబ్దత లేక భీరుత్వం మరీ భరింపరానిదయింది! మరో విషయంలోనూ నా గురుకులవాసం కొంత ఇబ్బంది పెట్టింది. గురుకులంలో హిందీ చెప్తారు. ఉర్దూ చెప్పరు. ఆ రోజుల్లో లాహోరులో హిందీ ప్రచారం బొత్తిగా లేదు. ఉర్దూ రానివాడు చెల్లడు. దుకాణాలు బోర్డులు కూడా ఉర్దూలోనే వుండేవి. మొదట ఉర్దూ రాకపోవడం చాలా ఇబ్బంది అనిపించింది. కొద్ది రోజుల్లోనే తాత్కాలికంగా పనికి వచ్చేంత ఉర్దూ నేర్చుకున్నాను. ఈ విషయం 1918లో జరిగింది. 1919లో రౌలెట్ బిల్ వ్యతిరేక ఉద్యమం నడిచింది. తరువాత మా అమ్మ బదిలీ అయి ఫిరోజ్‌పూర్ వెళ్ళింది. ఆమెగారితోపాటు నేనూ ఫిరోజ్‌పూర్ వెళ్ళాను.

అక్కడే నాకు లజవంత్‌రాయ్ స్నేహమయ్యాడు. అతడు ఫిరోజ్‌పూర్ పట్నంలో ఆర్య హైస్కూల్లో చదువుతున్నాడు. నాకంటె ఒకటి రెండు సంవత్సరాలు పెద్దవాడు.

లజవంత్‌రాయ్ ఇంట్లో చాలా పుస్తకాలుండేవి. 'చంద్రకాంత సంతతి', అపరాధ పరిశోధక నవలలూ, రవీంద్ర సాహిత్యం, శరత్ సాహిత్యం, మరికొన్ని అనువాదాలూ, ప్రేమ్‌చంద్, సుదర్శన్ పుస్తకాలూ, బెంగాల్ విప్లవకారుల జీవిత చరిత్రలు కొన్ని - ఇవే కాకుండా ఇంకా చాలా పుస్తకాలు వున్నాయి వాళ్ళ ఇంట్లో! దాదాపుగా ఒక్కటి బీరుపోకుండా వాళ్ళ ఇంట్లో వున్న పుస్తకాలన్నీ చదివేశాను. వాటన్నింటినీ చదివి నేనూ ఒక నవల రాయడం ప్రారంభించాను. ఒక దస్తా కాగితాలు చెడగొట్టాను. తరువాత ఆ నవల ఏమయిపోయిందో తెలియదు.

మిడిల్ స్కూల్లో పరీక్షల్లో ప్రథముడిగా ప్యాసయ్యాను. మా అమ్మ చాలా సంతోషపడ్డది. ఆమె కండ్లు సంతోషంతో మెరిసాయి. ఆమె కండ్లల్లోని ఆ మెరపును నేను ఈనాటి వరకూ మర్చిపోలేదు. నా తమ్ముడు అప్పుడు రెండో క్లాసు చదువుతున్నాడు. మా ఇద్దరి పోషణ భారం మా అమ్మ మీదనే వుంది. మా ఇద్దరి చదువు సంధ్యల కోసం మమ్మల్ని ఆదర్శవంతులుగా తయారు చేయడానికీ మా అమ్మ కొండ ప్రాంతమైన కాంగడా జిల్లాను వదిలి విపరీతమైన ఎండల్లో దహించుకుపోయే పంజాబు ప్రాంతంలో ఉద్యోగం చేస్తున్నది. మా అమ్మకు ఆర్య సమాజపు వైదిక ధర్మం మీద అపారమైన భక్తి! తరువాత ఆమె కంటోన్మెంట్ ఆర్య కన్యా పాఠశాల వుద్యోగాన్ని మాని, అక్కడికి రెండు మైళ్ళ దూరంలో వున్న ఆర్య అనాథాలయ కన్యా పాఠశాలలో ఉపాధ్యాయినిగా కుదిరింది. మా కుటుంబం ఆర్య అనాథాలయానికి మార్పబడ్డది. మిడిల్ స్కూల్ చదువు అయ్యాక నేను మనోహర్‌లాల్ హైస్కూల్లో 9వ తరగతిలో చేరాను.

## కాంగ్రెసులో :

1921లో సహాయ నిరాకరణోద్యమం ప్రారంభం అయింది. కంటోన్మెంట్‌లో రాజకీయ వాతావరణం బొత్తిగాలేదని ముందే చెప్పాను. ఫిరోజ్‌పూర్ పట్నం కంటోన్మెంట్‌కు మూడు మైళ్ళ దూరంలో వుంటుంది. పట్నంలో మాత్రం కాంగ్రెసు సభలూ, ఊరేగింపులూ జరుగుతుండేవి. మేము అప్పుడప్పుడూ పట్నానికి వెళ్ళి కాంగ్రెసు సభల్ని చూసి వస్తుండేవాళ్ళం. ఖద్దరు ప్రచారంలోకి వచ్చిన తొలి రోజులు అవి. ఖద్దరు ప్రచారమూ పట్నంలో జరుగుతూండేది. అక్కడ శాసనోల్లంఘనం చేసిన కాంగ్రెసు స్వయం సేవకుల్ని అరెస్టులు కూడా చేస్తుండేవారు ! నేనూ, లజవంత్‌రాయ్ కంటోన్మెంట్‌లోనూ ఏదో ఒకటి చేస్తే బాగుండు అనుకునేవారం. అతడు ఒక సంవత్సరం తప్పాడు. మనోహర్‌లాల్ హైస్కూల్లోకి వచ్చేశాడు. మేమిద్దరం ఒకే క్లాసులో చదువుతూన్నాం. చివరకు కంటోన్మెంటులో విదేశీ వస్త్రాలను తగుల బెట్టాలని నిశ్చయించుకున్నాము. ముందు మా దగ్గరున్న విదేశ వస్త్రాల్ని తగుల బెట్టకుండా ఇతర్లను అడగడం ఎట్లా ? మా అమ్మకు కాంగ్రెసు ఉద్యమం పట్ల సానుభూతి వుంది. ఐతే, ఇంట్లో వున్న గుడ్డల్ని తగుల బెట్టుకోవడం వల్ల వచ్చే ప్రయోజనం ఏంటో ఆమెకు అర్థం కావడం లేదు. పైగా, కొత్త గుడ్డలు కొనుక్కోలేని స్థితిలో.

చివరకు నేను సాహసించాను. అమ్మ దగ్గర విదేశీ మిల్లులో తయారైన సిల్కు చీరె ఒకటి వుంది. దాన్ని తగులబెట్టడానికి ఇవ్వమని అడిగాను. అడగడం కాదు; ఒక రకంగా ఆ చీరెకోసం అమ్మతో పోట్లాడాను. అమ్మ ఇవ్వలేదు. నలుగురూ చూసేట్టు విలువైన విదేశీ వస్త్రాన్ని తగులబెట్టాలని నా వుద్దేశం. అలా చేస్తే ప్రజల మీద బాగా ప్రభావం పడుతుందనీ, ప్రజలు పరప్రభుత్వాన్ని ద్వేషిస్తారనీ నా నమ్మకం ! అమ్మ తన చీరెను ఇవ్వకపోవడంతో చాలా నిరాశపడ్డాను. నాదో కోటు వుంది. మిల్లు వస్త్రంతో తయారయింది. ఆ కోటు గుడ్డ విదేశీ మిల్లులో తయారు అయిందో, లేక స్వదేశీ మిల్లులో తయారు అయిందో నాకు తెలియదు ! కానీ, కాకపోనీ దాన్ని విదేశీ వస్త్రం అని తగులబెట్టేశాను. ఆ ఒక్క కోటు తప్ప మా ఇంటినుండి ఇంక ఏ వస్త్రమూ లభించలేదు తగుల బెట్టడానికి !

కంటోన్మెంట్ అంతా తిరిగి పది విదేశీ వస్త్రాల దాకా పోగుచేశాము. వాటిలో నాలుగు గుడ్డలు లజవంత్‌రాయ్ ఇంట్లోవే. మేమిద్దరం ఇత్తడి పళ్ళాన్ని ఒకదాన్ని మోగిస్తూ కంటోన్మెంట్‌లో తప్పెట వేశాం. 'రామలీల మైదానంలో సాయంత్రం విదేశీ వస్త్రాల్ని తగలబెట్టడం జరుగుతుంది. సభ కూడా జరుగుతుంది.' అని చాటింపు వేశాం. సాయంత్రానికి రామలీల మైదానంలో ఓ యాభైమంది దాకా ప్రజలు పోగయ్యారు. మా దగ్గరున్న విదేశీ వస్త్రాల్ని తగులబెట్టాం. నేనూ లజవంత్‌రాయ్ ఉపన్యసించాం ! "ఖద్దరు ధరించమనీ, విదేశీ మిల్లువస్త్రాల్లో ఆవుకొవ్వు, పందికొవ్వు కలుస్తుందనీ, స్వాతంత్ర్యం సంపాయించడానికి ఖద్దరు ధరించడం ముఖ్యమని" చెప్పాం.

సభల్లో ఎందరు మాట్లాడినా నాకు సంతృప్తిగా వుండేది కాదని చెప్పాను. అందుకు ఒక కారణం వుంది. ఇతర ఉపన్యాసకులు మహాత్మాగాంధీ, లాలా లజపతిరాయ్, సర్దార్ పటేల్ - వీరు చెప్పిన మాటల్నే చిలుకపలుకల్లా వల్లించేవారు. నాకది నచ్చే ది కాదు. నేను 'దేశదర్శన్' అన్న పుస్తకాన్ని చదివాను. దాంట్లో ఎన్నో విషయాలు చర్చించబడ్డాయి. భారతదేశంలోని వ్యాపారాన్ని ఇంగ్లీషువారు దెబ్బతీయడం మొదలైన ఎన్నో విషయాలు విపులంగా లెక్కల్తో సహా ఉదహరించాడు గ్రంథకర్త ! వాటన్నింటినీ ఏకరువు పెట్టేవాణ్ణి ! పైగా, మొగలుల కాలంలోని ధాన్యం, నెయ్యి మొదలైన ఆహార పదార్థాల ధరలను చెప్పేవాణ్ణి ! ఇంగ్లీషువారి కాలంలోని ధరలకూ, ఆనాటి ధరలకూ పోల్చి వ్యత్యాసాన్ని శ్రోతల ముందుంచేవాణ్ణి ! ఈ వ్యత్యాసం నశించాలంటే ఇంగ్లీషు ప్రభుత్వం పోవాలని చెప్పేవాణ్ణి ! అంతేకాకుండా ఇంగ్లీషువారు ఈ దేశాన్ని ఎలా దోచుకుంటున్నది, వారి దోపిడీవల్ల ఈ దేశప్రజల

జీవితం రోజు రోజుకూ ఎలా దుర్భరం అవుతున్నది లెక్కల్తో సహా ఇచ్చేవాణ్ణి ! శ్రోతలు నా ఉపన్యాసాన్ని చాలా ఆసక్తిగా వినేవారు !

గాంధీగారు 1921 డిసెంబర్ 31నాటికి స్వరాజ్యం తీసుకుతీరతామని ప్రతిజ్ఞ చేశారు. నేను మెట్రిక్యులేషన్ పరీక్ష అయ్యాక కాంగ్రెసు స్వయం సేవకుడినై ప్రచార కార్యానికి బయల్దేరాను. 1922 సం॥ వేసంగుల నాటి విషయం చెప్తూన్నాను. గాంధీగారి ప్రతిజ్ఞ పూర్తికాలేదు. విదేశీ శాసన వ్యతిరేకోద్యమం ఉగ్రరూపాన్ని దాల్చే లక్షణాలు కనుపిస్తున్నాయి. ఉద్యమం పల్లెలకు కూడా పాకింది. పల్లె ప్రజలు పన్నుల నిరాకరణోద్యమాన్ని సాగించడానికి సన్నద్ధులవుతూన్నారు. రైతు పన్నుల నిరాకరణోద్యమానికి సిద్ధం అవుతూన్నాడంటే 'దున్నేవాడికే భూమి' సిద్ధాంతాన్ని ఆచరణలో పెడుతూన్నాడన్నమాట. రైతు అంతకంటే ఇంకేం కోరతాడు ? రైతు ఉద్యమానికి అంతకంటే ఆదర్శం మాత్రం ఏముంటుంది ? సహాయ నిరాకరణోద్యమం తీవ్ర రూపాన్ని దాల్చడంతో గాంధీగారికి 1919నాటి పరిస్థితి జ్ఞాపకం వచ్చివుంటుంది. ఇంకేముంది ? గాంధీగారు ఉద్యమాన్ని పూర్తిగా ఆపేసేయమన్నారు: వుత్సాహంగా ముందుకు ఉరుకుతూన్న ప్రజల్లో నిరాశా, నిస్పృహలు వ్యాపించాయి ! ఎందరో కార్యకర్తలు ఆంగ్ల ప్రభుత్వంతో తుది పోరాటాన్ని సాగించడానికి ఇల్లూ వాకిలీ వదిలి ఉద్యమంలోకి దూకారు. ఘోర నిరాశలో వాళ్ళు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇంక కాంగ్రేసంటే ఖద్దరునూ, అహింసనూ ప్రచారం చేయడమే గావును అన్న భావన కార్యకర్తల్లో వ్యాపించింది. కార్యకర్తల్ని గ్రామాల్లోకి వెళ్ళి కాంగ్రేసు ఆదర్శాలను ప్రచారం చేయమన్నారు. ఖద్దరు ప్రచారం చేయమన్నారు. కాంగ్రేసు మీద, గాంధీగారిమీద - పూర్తి విశ్వాసాన్ని వుంచి ఖద్దరు ధరించితే స్వరాజ్యం దానంతట అదేవస్తుందన్నారు ! ప్రజలు, నిఖార్సయిన హిందూ, ముస్లిం, సిక్కు మతస్థులు కావాలన్నారు. అంటే ఎవరి మతాచారాల్ని వారు నిజాయితీగా పాటించాలన్నారు. ఇవన్ని జరిగిననాడు స్వరాజ్యం వచ్చినట్టే అన్నారు.

కార్యకర్తలకు కాంగ్రేసు నాయకులు చెప్పే విషయాల్లో నమ్మకమూలేదు, ఆసక్తీ లేదు ! కార్యకర్తలు నిరాశా నిస్పృహల్లో తమలో తాము అనేకవిధాల తర్కించుకునేవారు. ఇల్లూ వాకిలీ వదిలి తాము ఇలా వచ్చింది మతప్రచారం చేయడానికా ? పర ప్రభుత్వంతో పోరాడి దేశాన్ని స్వాతంత్ర పరచడానికా ? ఆ స్వప్నం వమ్ము అయిందా ? ఇలాంటి భావాలూ, ప్రశ్నలూ కార్యకర్తలందరిలోనూ ఉదయించాయి. ఫిరోజ్‌పూర్ జిల్లాలోని ఓ పల్లెనుంచి వచ్చిన సిక్కు కార్యకర్త ఒకతను అన్నమాటలు నాకు ఈనాటికీ జ్ఞాపకం ఉన్నాయి. ఉద్యమం మధ్యలో ఆగిపోవడంతో కార్యక్రమం పూర్తిగా మారిపోయింది. దీంతో అతడు చాలా ఖిన్నుడయ్యాడు. రోజంతా కార్యాలయంలో మౌనంగా పడుకుని వుండేవాడు. ఎవరైన పలుకరిస్తే ఇలా అనేవాడు. "ఏం ఐక్యతను ప్రచారం చేస్తాం ? అసలు పోరాడేదెవడు ? పోరాటం ఎక్కడ ? హిందూ, ముస్లిం, సిక్కులు ఐక్యంగా వుండండని చొల్లు కబుర్లు చెప్తే ప్రయోజనం ఏంటి ? మేము వెళ్ళి బ్రాహ్మడు జంజంవేసుకున్నాడో లేదో, సిక్కు జుట్టు పెంచుకున్నాడో లేదో ముస్లిం సున్నతి చేయించుకున్నాడో లేదో చూడాలిట ! వాళ్ళకు వాళ్ళ మతాలమీద విశ్వాసం వుంటే జుట్టు పెంచుకుంటారు. సున్నతి చేయించుకుంటారు. జంజం వేసుకుంటారు ! అది మాకెందుకు? మేమెందుకు అలాంటి ప్రచారం చేయాలి ? ఎవడితల్లో ఎన్ని పేలున్నాయో మాకాపట్టింది ? కత్తితో ఉల్లిపాయలు తరగడమే ప్రయోజనం అయితే, ఆ విషయం ప్రజలకు మనకంటే ముందేతెల్సు ! ఈనాడు ప్రత్యేకం చెప్పనవసరం లేదు !" అంటూ వుండేవాడు. ఆ మిత్రుడు చాలా నిరాశపడి, కాంగ్రేసు ప్రచారాన్ని, కార్యాలయాన్ని వదిలి తన గ్రామానికి వెళ్ళాడు - వ్యవసాయమైనా చేసుకోవచ్చునని.

నేనూ, పండిత తోతారాం, మహ్మద్‌దీన్‌మిరాసీ ముగ్గురం ఒక జట్టుగా వెళ్ళేవారం ప్రచారానికి.

మేము ఉదయాన్నే మూటముల్లే సర్దుకుని ప్రచారానికి ఒక ఊరి నుండి మరోవూరు వెళ్ళేవాళ్ళం. బండి దొరికితే కట్టించుకునేవారం. ఒక్కోప్పుడు అభిమానంగల గ్రామస్తులు బండి కట్టించేవారు. కాకపోతే, కాలికి బుద్ధి చెప్పేవాళ్ళం. మరీ చిన్న గ్రామాలకు వెళ్ళేవాళ్ళం కాదు. ఒక వెయ్యిమంది జనాభాగల గ్రామంలో తప్పక ప్రచార చేసేవాళ్ళం.

ప్రచార కార్యక్రమం ఇలా వుంటుంది : ఊరి రచ్చబండ దగ్గర గోనెపట్టాగానీ, చాపగానీ, వేసుక్కూచునేవాళ్ళం. ఒక్కొక్కప్పుడు వూరి వాళ్ళు మంచం వేయడమూకద్దు, మంచంమీద ఊరిపెద్దలూ మేము కూచుని ఇష్టాగోష్టిగా మాట్లాడుకునేవాళ్ళం ! సాధారణంగా ఊరిపెద్దల్తో పండిత తోతారాం మాట్లాడేవారు. మధ్యలో నేనేమైనా అందుకుంటే కోప్పడేవారు. 'చెప్పేదివిను : కొంచెం మీసాలయినా మొలవనీ - మాట్లాడుదువుగాని:' అనేవారు.

సాయంత్రం సభ జరిగేది. మహమ్మద్ దీన్ సభను ప్రారంభించేవాడు. ముందుగా సారంగీని వాయిస్తూ జాతీయ గీతాన్ని పాడేవాడు. నలుగురు మనుషులు ప్రోగయ్యాక నన్ను మాట్లాడమనేవారు. నేను మాట్లాడేవాడిని నా ఉపన్యాసంలో 'దేశదర్శన్' పుస్తకంలోని సంఖ్యల్ని ధారాళంగా వప్ప చెప్పేసేవాణ్ని. విదేశాల నుండి మన దేశానికి ఎన్ని కోట్ల రూపాయలు గుడ్డ వస్తున్నదో, మనదేశం నుండి విదేశానికి ఎన్ని కోట్ల రూపాయిలు పోతున్నాయో లెక్క చెప్పేవాణ్ణి. కనుక మన దేశం బీదదయిందని, ప్రజలు దరిద్రులయ్యారనీ - చెప్పేవాడిని ! ఆంగ్ల ప్రభుత్వానికి ముందు దేశంలో ప్రజలు సుఖకరమైన జీవితాన్ని గడిపేవారనీ, దేశంలో పేదరికం వుండేది కాదనీ - నేనప్పుడు నమ్మేవాడిని ! అలాగే ఉపన్యసించేవాడిని! రక్తం పీల్చే ఈ విదేశీయులనుండి దేశం స్వాతంత్రమైతే ప్రజల పరిస్థితి మెరుగవుతుందనీ, దరిద్రం వుండదనీ - చెప్పడానికి సాహసించేవాణ్ణి ! అయినా, వినేవాళ్ళ ముఖాల్లో ఉత్సాహం కనుపించేదికాదు. చాలా నిరాశపడేవాణ్ణి ! నా తరువాత పండిత తోతారాం మాట్లాడేవారు. వారు రామాయణ భారతాదుల్లోని కథల్ని వినిపించేవారు. శ్రోతలకు నా ఉపన్యాసం కంటే తోతారాంగారి ఉపన్యాసం బాగుండేది. వారి కథలు ప్రజలకు చక్కగా అర్థమయ్యేవి. భగవద్ భక్తిని గురించి, పరస్పరం ప్రేమతో మెలగవలసినదనీ ప్రజలకు చెప్పేవారు ! చివరకు మహమ్మద్ దీన్ వంతు వచ్చేది. అతడు సారంగీని వాయిస్తూ జాతీయగీతాన్ని పాడేవాడు. లేదా గాంధీగారిమీద ఒకపాట పాడేవాడు. తరువాత హాస్యోక్తుల్ని గుమ్మరించేవాడు. అతడి ఉపన్యాసాన్ని విని ప్రజలు పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వేవారు!

ఇదే నిత్యకార్యక్రమం కావడంవల్ల ప్రచారకార్యంపట్ల నాకూ ఉత్సాహం సన్నగిలసాగింది. ముఖ్యంగా నిరుత్సాహం ఎక్కడ వచ్చేదంటే ? స్వరాజ్యం వస్తే రైతుల స్థితిగతులు బాగుపడతాయని చెప్పేవాళ్ళం ! ఐతే, స్వరాజ్యం ఎలా వస్తుంది ? ఎలా వుంటుంది ? అనేది మాకే స్పష్టంగా తెలియదు! మాకే స్పష్టంగా తెలియని విషయాన్ని గురించి నిత్యం ఒకే రకంగా పాటపాడుతూండడం నిరుత్సాహ జనకం కాదా ? స్వరాజ్యాన్ని గురించి నాకేకాదు స్పష్టంగా తెలియంది; పట్టాభి సీతారామయ్యగారికి కూడా స్పష్టంగా తెలియదు. ఆయన రాసిన 'నేషనల్ కాంగ్రెసు హిస్టరీ', అనే గ్రంథంలో 376వ పేజీలో యిలావుంది. 'ప్రజలు పరప్రభుత్వంతో పోరాడడానికి ఆతృతపడుతున్నారు. కానీ, స్వరాజ్యం అంటే ఏమిటి ? ఎలా వుంటుంది ? అనేదాన్నిగురించి గాంధీగారు కూడా ఎలాంటి వ్యాఖ్యానమూ చేయలేదు.'

పల్లెల్లో రైతుల్తో ఇష్టాగోష్టిగా మాట్లాడుతుండేవాళ్ళం, రైతులు తమ సమస్యల్ని మాకు చెప్పేవారు. ఐతే అవి మాకు అర్థమయ్యేవికావు. రైతులకు ఇంగ్లీషు ప్రభుత్వం మీద ద్వేషం ఉంది. స్వరాజ్యం కావాలన్న భావనా వుంది. ఐతే, కాంగ్రెసు కార్యక్రమం వారి సమస్యలకు చాలా దూరం.

రైతుల సమస్యలూ, రైతుల బాధలూ కాంగ్రెసు కార్యకర్తలమైన మా దృష్టికి చాలా అల్పమైనవిగా, నీచమైనవిగా కనిపించేవి. కాంగ్రెసు ఆదర్శం మహోన్నతమైందే ! ఐతే, రైతుల సమస్యలకు దాంట్లో స్థానం లేదు. ఈ దేశ ప్రజల్లో 85% మంది రైతులు. కాంగ్రెసు కార్యక్రమాన్ని నిర్ణయించే నాయకుల దృష్టికీ, రైతుల దృష్టికీ ఏ విధంగానూ పొంతన కుదరదు ! ఈ పొంతన లేకపోవడం వల్లనే, రైతు సమస్యల్ని అర్థం చేసుకోగలవారు కాంగ్రెసుతో ప్రమేయం లేకుండా రైతు సంఘాల్ని స్థాపించారు. ఆ సంఘాల సభ్యత్వం లక్షలు దాటింది. ఆ రైతు సంఘాల్ని చూచి కాంగ్రెసు ఎంతగా భయపడ్డదంటే చివరకు వాటిని తనకు గర్భ శత్రువులుగా భావించే స్థితికి దిగజారింది.

రైతుల్ని గురించి కాంగ్రెసు దృష్టికోణాన్ని గాంధీగారు ఓ మాటు వివరించారు. 'పన్నుల్ని నిరాకరించకూడదు. భూమి మీద పరంపరానుగతంగా జమీందార్లకు గల హక్కును నిరాకరించ రాదు !' అని. దీని అర్థం ఏమిటి ? రైతు తన కాళ్ళమీద ఎన్నటికీ నిలబడకూడదని కాదా ? మరి రైతు సంఘాల లక్ష్యం గాంధీగారి దృష్టకోణానికి పూర్తి విరుద్ధం. రైతు సంఘాలు రైతు తన కాళ్ళమీద నిలబడాలంటాయి. రైతు పండించిన ధాన్యం మీద అధికారం అతడికే వుండాలంటాయి. ఏ పన్నుల రూపంలోనో, మరో ఇతర రూపంలోనో, ఆ ధాన్యాన్ని హరించరాదంటాయి. రైతుకు అతడి కుటుంబానికి అవసరం అయిన భూమి లభించాలి. ఆ భూమికి అతడు పూర్తిగా హక్కుదారుడు కావాలి ! అంటాయి రైతు సంఘాలు. రైతుల సమస్యల్ని కాంగ్రెసు ఎన్నడూ అర్థం చేసుకోలేదు. అందుకనే, కాంగ్రెసు ప్రభుత్వంలోనూ రైతు పరాధీనుడుగానే వుండిపోయాడు.

రోజుకో ఊరు చొప్పున ప్రచారం చేసుకుంటూ కాలి నడకన 'ముక్తసర్' పట్నాన్ని చేరాము.

ముక్తసర్ పట్నం మంచి వ్యాపార కేంద్రం. అక్కడి వ్యాపారం అంతా హిందూ ఖత్రీల చేతుల్లో వుంది. కొంత మార్వాడీల చేతుల్లో వుంది. కఠినమైన పనులన్నీ బీద ముస్లిములు చేస్తుంటారు. ఉదాహరణకు హిందువుల ఇండ్లల్లో నీళ్ళు పోయడంలాంటివి ముస్లిములే చేస్తుంటారు. ముస్లిము చేత నీళ్ళు పోయించుకుంటూ కూడా, తన హిందూత్వం చెక్కు చెదరకుండా వుందని గర్వపడతారు అక్కడి హిందువులు ! ముస్లిము పనివాడు హిందువుల ఇండ్లల్లో నీళ్ళు పోసేప్పుడు నడుముకు ఎర్రని గుడ్డ కట్టుకుంటాడు. అతడే ముస్లిం ఇండ్లల్లో నీళ్ళుపోసేప్పుడు ఆకు పచ్చని గుడ్డ నడుముకు కట్టుకుంటాడు. ఆ ఎర్రని గుడ్డతో అక్కడి హిందువులు తమ హిందూత్వాన్ని కాపాడుకుంటున్నారు. ముక్తసర్ ప్రాంతములోని హిందువులకూ, బెనాసర్‌లోని హిందువులకూ చాలా వ్యత్యాసముంది. బ్రాహ్మడి మీద, గోవు మీద శ్రద్ధాభక్తుల్ని ప్రదర్శించడం మినహా ముక్తసర్ హిందువులకూ, బెనారస్ హిందువులకూ ఎలాంటి సామ్యమూ వుండదు. ఆచారాల్లో, కట్టుబొట్టులో, తిండిలో దేంట్లోనూ సామ్యం కనిపించదు. మత సంబంధమైన భావాల ఐక్యతే జాతుల నిర్ణయానికి గీటురాయి అనుకుంటే, ఢాకాలోని ముస్లిములూ, కుస్తుంతునియాలోని ముస్లిములూ ఒకే జాతివారు అనవల్సివస్తుంది. కానీ, బుద్ధిశాలి ఎవడూ అలా ఒప్పుకోడానికి సిద్ధపడడు.

ముక్తపర్ పెద్దపట్నం. ప్రచారంకూడా బాగానే జరిగింది. చౌక్‌లో బల్లలూ, అవీ వేసి స్టేజీని తయారుచేశారు. శ్రోతలు కూర్చోడానికి చుట్టూ, చాపలూ పట్టాలూ వేశారు, గ్యాస్‌లైటు వెలిగించారు. ముక్తసర్ రైల్వే లైన్‌లో వుండి, ఆధునిక సౌకర్యాలు అన్నీవున్నాయక్కడ. హైస్కూల్ వుంది. మా సభకు ఐదువందలమందిదాకా శ్రోతలువచ్చారు. విద్యావంతులు గల ప్రదేశం కావడంవల్ల నేను నా ఉపన్యాసంలో పుస్తకజ్ఞానాన్ని గుమ్మరించాను. 'దేశదర్శన్'లోని అంకెల్ని దొర్లించేశాను. తిలక్, మాలవీయ, పటేల్ - వీరి పుస్తకాల్లోని విషయాల్ని వల్లించాను. పండిత తోతారాంకూడా ప్రదేశపు మహత్యాన్ని గమనించి

భగవద్భక్తిని గురించి, ధార్మిక జీవితాన్ని గురించి ప్రత్యేకం నొక్కిచెప్పాడు. చివరకు హిందువులకు, ముస్లిములకు, సిక్కులకు ఎవరి నినాదాన్ని వారికి విడివిడిగా ఇచ్చాడు. 'హరహర మహాదేవ' 'వందేమాతరం' అని అరిచాడు హిందువులకోసం. అలాగే ముస్లిముల కోసం 'నారా - ఎ - తకదీర్' 'అల్లాహో అక్బర్' అని అరిచాడు. ఇంక సిక్కులకోసం 'జోబేలేసోనిహాల్ ! సత్ సిరీ అకాల్ !' అనీ అరిచాడు.

మొహమ్మద్ దీన్ మిరాసీకూడా రసజ్ఞులైన శ్రోతలను చూసి తన హాస్యోక్తుల్ని వెదజల్లాడు. అతడు సాధారణంగా పంజాబీలోనే మాట్లాడేవాడు. పంజాబీలో చెప్పబడ్డ ఉపన్యాసాన్ని అక్కడి ప్రజలు అధికమైన ఆసక్తితో వినేవారు. దేశ ప్రజలందరూ ఐక్యంగా వుంటే ఎంతటి మహత్తర శక్తి ఉత్పన్నం ఔతుందో తెలియచేయడానికి ఒక ఉదాహరణను చెప్పేవాడు అతడు. భారతదేశంలోని 32 కోట్ల మంది (అప్పట్లో భారతదేశ జనాభా అంతే నని చెప్పేవారు) ఒక్క మాటుగా లఘుశంకను (ఒకటికి) తీర్చుకుంటే, ఆ ప్రవాహంలో మొత్తం ఇంగ్లీషుజాతే కొట్టుకుపోతుందనేవాడు. ఇది అతడు చెప్పే సాధారణమైన హాస్యోక్తి. ఇంక అతడు అసాధారణంగా, వర్షంలా కురిపించే పంజాబీ భాషలోని హాస్యోక్తుల్ని అనువాదం చేయడం సాహసంతో కూడినపని. మహమ్మద్‌దీన్ మీరాసీ విప్లవాన్ని గురించి కలలు కనేవాడు. అతడి కలలు ఇలావుండేవి, విప్లవం వస్తే... 'ఇంగ్లీషు దొరసాన్లందర్నీ ఓ కొట్టులో పెట్టి బంధిస్తారు. ఆ కొట్టుకు తనను కాపలా వుంచుతారు. ఇంక ఆ దొరసాన్లు అందరూ తనకు భార్యలైపోతారు.' ఇదీ అతడి భావాల ప్రగతి ! కాంగ్రెసు యొక్క ఈ జీతం పుచ్చుకునే కార్యకర్తకు అహింసపట్లగల సానుభూతి ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చును. మీరాసీ ఉపన్యాసం కేవలం ఇంగ్లీషువార్ని చౌకబారు హేళనతో ముంచెత్తడం ! శ్రోతలకు మాత్రం నవ్వుల్తో కడుపు ఉబ్బిపోయేది.

ముక్తసర్‌లో సభ సమాప్తం అయింది. మేమింకా స్టేజిమీదనే వున్నాము. కొందరు శ్రోతలు మా ఉపన్యాసాలవల్ల తాము పొందిన ఆనందానికి కృతజ్ఞత తెల్పడానికి వచ్చారు. వాళ్ళలో ఒకతను గొప్ప అభిప్రాయాన్ని ఇచ్చాడు. 'మిత్రమా ! నేనూ చాలా ఉపన్యాసాలు విన్నాను. మొన్న ఈ మధ్య లాలాలజపతిరాయ్ కూడా ఇక్కడకువచ్చి ఉపన్యసించాడు. ఐతే, మహమ్మద్‌దీన్‌లా ఎవరూ ఉపన్యసించలేదు. ఇలాంటి వుపన్యాసాన్ని నేనింత వరకూ వినలేదు' అన్నాడు. ఇంతకష్టపడి చెప్పిన నా వుపన్యాసాన్ని కూడా తీసిపారేశాడు. నేను చాలా కించపడ్డాను. తరువాత ఒక రకంగా సమాధానపడి మనస్సును కుదుట పరచుకున్నాను. 'నా ఉపన్యాసం లాలాలజపత్‌రాయ్ ఉపన్యాసం లాంటిది. వీళ్ళకు అర్థం కాకపోవడం సహజం' అనుకున్నాను.

ఈ మాటు ప్రచారానికి వెళ్ళి వచ్చాక చాలా నిరుత్సాహినయ్యాను. అంటే ఉద్యమం పట్ల నా అనురక్తి తగ్గిందని కాదు. నా సమయమూ, శక్తి సామర్థ్యాలూ వృథాగా ఖర్చు అవుతూన్నాయి - అనిపించింది. నేను సందిగ్ధంలో పడ్డాను. అప్పుడే మెట్రిక్ పరీక్షా ఫలితాలు ప్రకటించారు. నేను ప్రథమ శ్రేణిలో ప్యాసయ్యాను. మా స్కూల్లో ప్రథముడిగా వచ్చాను.

నన్ను ఎలాగయినా కాలేజీలో చదివించాలని మా అమ్మగారి కోరిక. కాలేజీలో చేరేట్టయితే, స్కూల్లో ప్రథముడిగా వచ్చాను గనుక, స్కూలు తరుఫున రెండు సంవత్సరాలు స్కాలర్‌షిప్ ఇస్తారు. అప్పుడే ఫిరోజ్‌పూర్‌లో కొత్తగా ఒక కాలేజీ పెట్టారు. ఆ కాలేజీ పేరు బహుశ 'రాంసుఖదాసు కాలేజీ' అనుకుంటా కొత్తగా పెట్టిన కాలేజీ కావడం వల్ల తెలివిగల విద్యార్థులకు అవకాశం ఇచ్చి పేరు తెచ్చుకోడానికి చూడడం సహజం. ఫిరోజ్‌పూర్‌లోని ఆర్యసమాజీకుల్లో అమ్మకు మంచి పలుకుబడివుంది.

వెనుక ఒకమాటు ఘోరమైన కరువు వచ్చింది. ఆ కరువులో అమ్మ ఎంతో దీక్షతో అనాధశరణాలయంలోని బాలబాలికల్ని కాపాడింది. ఆమె త్యాగాన్ని, సేవను - ఆర్యసమాజపు పెద్దలు మర్చిపోలేదు. పెద్దలందరూ మా అభివృద్ధిని కోరుతున్నారు. వాళ్ళు అమ్మకు ధైర్యాన్నిచ్చారు. 'స్కూలు తరపున ఎటూ ఓ స్కాలర్‌షిప్ వస్తుంది. కాలేజీ తరపున కూడా స్కాలర్‌షిప్ ఒచ్చేట్టు చేద్దాం.' అన్నారు. ఇక అలాంటప్పుడు నా చదువు భారం మా అమ్మమీద పడదు. ఈ సమాజంలో ఒట్టి మెట్రిక్‌కు విలువ ఏముంటుంది ?

అమ్మ ఒక రకంగా సత్యాగ్రహం ప్రారంభించింది. నన్ను కాలేజీలో చేర్పడానికి పట్టుపట్టింది. నన్ను ఉత్తమ స్థితికి తీసుకురావడమే ఆమె జీవితాదర్శం. అలాంటప్పుడు నా జీవితం వ్యర్థమవడాన్ని ఎలా సహించగలదు ? కొందరు పెద్దలు నన్ను అనూనయించారు. చదువు మానుకోవడం తెలివితేటలు కావన్నారు. అప్పటికి సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్న లక్షలాది విద్యార్థులు తమ తప్పును తెల్సుకుని, భవిష్యత్తును పాడుచేసుకోవడం వ్యర్థం అనుకుని - తిరిగి కాలేజీలకు వెళ్ళి పోయారు. కొందరు పెద్దలు 'ఇంక కొన్నాళ్లికయినా నువ్వు నీ పొరపాటును తెల్సుకుంటావు. కాలేజీలో చేరడం ముఖ్యమనీ తెల్సుకుంటావు. ఐతే, అప్పుడు నీకు ఈ స్కాలర్‌షిప్ అవకాశం వుండదు.' అన్నారు నాతో.

సహాయ నిరాకరణోద్యమంలో విద్యాలయాల్ని వదలి వచ్చిన వేలకొలది విద్యార్థులు తిరిగి విద్యాలయాల్లో ప్రవేశించారు. విద్యార్థులలా తమ ప్రతిజ్ఞను భగ్నపరచుకోవడం నా మీద వ్యతిరేక ప్రభావాన్ని వేసింది. అది మొత్తం జాతికే అవమానకరమైన విషయంగా నేను భావించాను. నేనేమీ విద్యాలయాన్ని నిరాకరించి ఉద్యమంలోకి రాలేదు. ఐనా, నేను విద్యాలయంతో సహకరించలేకపోయాను. నా భవిష్యత్తు ఏమైనాసరే కాలేజీలో చేరకూడదనుకున్నాను.

మా అమ్మ కాంగ్రెసు ప్రచారకురాలుగా రెండు నెల్లు పనిచేసింది. అప్పటికే ఆమెకు ఆ పని మొహం మొత్తింది. విరక్తిపుట్టింది. కాంగ్రెసు ప్రచారం ఏమీ జరగడమూ లేదు. ఊరకేకూచుని జీతం పుచ్చుకోవడం ఆమెకు ఇష్టంగానూ లేదు. రెండు నెల్ల తరువాత తన పాత ఉద్యోగంలో చేరిపోయింది ఆమె. గాంధీగారి ఆజ్ఞవల్ల ఉద్యమం ఆగిపోయింది. కాంగ్రెసు కార్యక్రమాలు కుంటుపడ్డాయి. కొద్దోగొప్పో ఎక్కడయినా కార్యక్రమం సాగుతున్నా, ప్రభుత్వం దాన్ని అణచేస్తూన్నది. కృష్ణదాసు భల్లాగారూ అరెస్టయ్యారు. వారి స్థానంలో రామకృష్ణగారని మరొకరు వచ్చారు. ఏం చేయడం ? అన్న ప్రశ్న నన్ను కలచివేస్తోంది. నిరంతరం యోచించి చివరకు ఒక నిశ్చయానికి వచ్చాను. 'నేను స్వంతంగా, నా శక్తితో చేయగలిగింది ఏమీలేదు' అన్న నిశ్చయానికి వచ్చేశాను.

నేను అమ్మతో స్పష్టంగా చెప్పేశాను. 'కాలేజీలో చదువుతాను. ఐతే, ప్రభుత్వ కాలేజీలో ఎలాంటి స్థితిలోనూ చదవను. లాహోరు నేషనల్ కాలేజీలో చేర్పిస్తే చదువుతాను' అన్నాను. నేషనల్ కాలేజీ చదువు ఉద్యోగం చేయడానికి అంతగా వుపయోగించదు. ఆ కాలేజీలో నన్ను చదివించాలన్న ఉత్సాహమూ అమ్మకు లేదు. నేను వకీలును కావాలని ఆమె వుద్దేశం. పైగా నేషనల్ కాలేజీలో చదివితే స్కాలర్‌షిప్ కూడా లభించదు. ఐతే, ఆమె తన ముప్ఫై సంవత్సరాల ఉద్యోగ జీవితంలో కొద్దోగొప్పో ధనాన్ని కూడబెట్టింది. నేను మరే కాలేజీలోనూ చదవ నిరాకరించేసరికి విధిలేక నేషనల్ కాలేజీలో చదవడానికి అంగీకరించింది. ఒక షరతు పెట్టింది. తను చదివించ గలిగినన్నాళ్ళూ చదివిస్తుంది. తరువాత స్వయం శక్తితో డబ్బు సంపాయించుకు చదువుకోవాలి. నేను ఆ షరతుకు అంగీకరించాను. కష్టపడడానికి నేను సిద్ధం, మార్గం దొరక్కపోతుందా ?

# నేషనల్ కాలేజీ

పంజాబ్ నేషనల్ కాలేజీలో విద్యార్థులు తమ రాజకీయ భావాలను దాచుకోవలసిన పనిలేదు. ఈ కాలేజీని స్థాపించడమే స్వరాజ్యసిద్ధికి పాటుపడే కాంగ్రెసు కార్యకర్తలను తయారు చేయడానికి ! ఐతే, అక్కడ చదివిన విద్యార్థులందరూ కాంగ్రెసు కోసం, లేక స్వరాజ్యం కోసం జీవితాల్ని త్యాగం చేయడానికే వచ్చారనుకోవడానికీ వీల్లేదు ! అక్కడి వాతావరణం ప్రభుత్వ కాలేజీల వాతావరణానికి భిన్నంగా వుంటుందని మాత్రం చెప్పవచ్చును. ఇతర కాలేజీల్లో చదివే విద్యార్థుల చదువుకు ఆదర్శం ఏదో ఒక ఉద్యోగంలో ఇరుక్కోవడం ! ఐతే, నేషనల్ కాలేజీలో చదివే విద్యార్థులకు ఉద్యోగం ఆదర్శంకాదు ! వారి చదువుకు ఆదర్శం చదవడమే ! ఇతర కాలేజీ విద్యార్థుల్లో సాధారణంగా కనుపించే అలంకరణ మీది మోజూ, ఆడంబర ప్రియత్వం - ఈ కాలేజీ విద్యార్థుల్లో కనుపించవు ! అలంకరణ విషయంలో నేషనల్ కాలేజీ విద్యార్థులు సాధారణంగా వుంటారు. కొందరు విద్యార్థులు ఖద్దరుపట్ల ఉత్సాహాన్ని కనబరిచేవారు. కొందరు మిల్లు వస్త్రాల్నీ ధరించేవారు. గాంధీ ఆశ్రమంలో లాంటి ప్రవృత్తిగానీ, నియమంగానీ నేషనల్ కాలేజీలోలేదు. అంటే, ఖద్దరే ధరించాలనీ, వండని పచ్చికూరల్నే తినాలనీ - అలాంటి నియమాలులేవు! దేవుడి విషయంలోనూ అంతే ! తప్పకుండా ప్రార్థనలో పాల్గొనాలనిగాని, ప్రార్థన చెయ్యాలనిగాని నియమంలేదు.

దాదాపుగా కాలేజీలోని విద్యార్థులందరూ పంజాబులోని వివిధ ప్రాంతాల నుండి వచ్చారు. అందరూ బోర్డింగ్‌లోనే వుండేవారు. కొందరు యు.పి. విద్యార్థులు కూడా వున్నారు. మొదట్లో విద్యార్థుల సంఖ్య మూడు వందల వరకూ వుండేది.

భాయి పరమానంద్‌గారు కాలేజీ వ్యవస్థాపకులు. వారు - చాలా నిరాడంబరంగా వుంటారు. ఒక చొక్కా ఒక ధోవతి మాత్రం ధరిస్తారు. చొక్కా - ధోవతి ధరించడంలోని నిరాడంబరత అన్యప్రాంతీయులకు అర్థంకాదు. ఎందుచేత అంటే, అన్యప్రాంతాల్లో ధనికులు కూడా చొక్కా ధోవతినే ధరిస్తారు. కానీ, పంజాబులో కేవలం అలాకాదు. పంజాబులో చొక్కా ధోవతి ధరించడం చాలా నిరాడంబరత కిందకు వస్తుంది.

భాయి పరమానంద్‌గారికి కోటూ పైజమా వేసుకునే విద్యార్థులంటే కోపం. ఇంక జుట్టు పెంచుకుని రోజు నూనె రాచుకు దువ్వుకునే విద్యార్థుల్ని కొట్టాలనేసేవారు. భాయిజీ చరిత్రను బోధించేవారు. విద్యార్థుల్లో జాతీయ భావాన్ని పెంపొందించడానికి ప్రత్యేకం కృషి చేసేవారు. జాతీయ భావాలుకల విద్యార్థుల్ని ప్రోత్సహించేవారు. చాకలి వుతికిన తెల్లని మడుపుల్ని ధరించే విద్యార్థులపట్ల ఘోరనిరాశను కనబరిచేవారు. కొన్నాళ్ళు వారి నిరాశాభావానికి నేనూ గురి అయ్యాను. నేషనల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య జుగల్ కిషోర్‌గారు. వారిప్పుడు ఉత్తరప్రదేశ్ కాంగ్రెసు ముఖ్యనాయకులు. ఆచార్యులవారు అప్పటికి కొద్దిరోజుల క్రితమే ఇంగ్లాండులో చదివి వచ్చారు. వారు హిందీకంటే ఇంగ్లీషునే చక్కగా మాట్లాడేవారు. కాలేజీలో చదువుకు మాధ్యమం హిందీ, ఇంగ్లీషూ రెండూనూ. పుస్తకాలన్నీ ఇంగ్లీషులో వున్నప్పటికీ అధ్యాపకులు హిందీలోనూ వివరించడానికి ప్రయత్నించేవారు. ఆచార్య జుగల్ కిషోర్ గారూ, ఆచార్య మోహతా గారూ హిందీ అంతగా రాకపోవడంవల్ల అచ్చం ఇంగ్లీషులోనే బోధించేవారు. జుగల్ కిషోర్‌గారు విద్యార్థుల దృష్టిని అధ్యయనం మీదకు మళ్ళించడానికి ప్రయత్నించేవారు. వాగ్వర్థనీ సభలకు తనూ హాజరయి, విద్యార్థుల జ్ఞానతృష్ణను ఉచిత మార్గాలకు మళ్ళించేవారు.

నేషనల్ కాలేజీలోని విద్యార్థుల మీద, ఆనాటి ప్రొఫెసర్ల భావాల ప్రభావం బాగాపడ్డది. వారిలో ప్రొఫెసర్ జయచంద్రవిద్యాలంకార్ గారిని ముఖ్యంగా చెప్పుకోవాలి. జయచంద్ర విద్యాలంకార్ గారు విద్యార్థుల్లోని జిజ్ఞాసను మేల్కొలిపేవారు. తర్కశక్తిని ప్రోత్సహించేవారు. వారు చరిత్రను, రాజకీయాలనూ బోధించేవారు. సాధ్యమైనంత వరకూ విద్యార్థుల్లో గుడ్డినమ్మకాలకు తావు లేకుండా చేసేవారు. 'విద్యార్థులు తర్కం ద్వారా చరిత్ర సత్యాలను పరిశీలించవల్సిందే గానీ గుడ్డిగా నమ్మరాదు, అంటూ వుండేవారు. వేదాలను నమ్మినట్టు చరిత్రను కూడా గుడ్డిగా నమ్మడం తగదు అనేవారు. విద్యాలంకార్ గారు క్లాసులో వుంటే వారి విషయంలోనే కాకుండా ఇతర అనేక విషయాల గురించి వాదోప వాదాలు జరిగేవి. ఆస్తికత్వం, నాస్తికత్వం, ఆధ్యాత్మవాదం, భౌతికవాదం - ఇంకా అనేక విషయాల గురించి తర్కించుకునేవాళ్ళం ! విద్యాలంకార్ గారి దృష్ట కోణం అభివృద్ధికరమైంది. స్పష్టమైందీను. అధ్యయన శీలురైన విద్యార్థులు ఎప్పుడూ వారివెంట వుండేవారు. ఈ విద్యార్థులే భవిష్యత్తులో తయారుకాబోయే విప్లవకారులు అంటే సరిపోతుంది.

నేషనల్ కాలేజీలోని విద్యార్థుల్లో ఎక్కువమంది రాజకీయాల్ని, అర్థశాస్త్రాన్ని, చరిత్రను - అధ్యయనం చేస్తున్నారు. ఫారసీ, సంస్కృత భాషల్ని కూడా బోధించేవారక్కడ. పారసీ చదివే విద్యార్థులు ముగ్గురు. సంస్కృతం చదివే విద్యార్థులు ఆరుగురూ వుంటారు. ఆరుగురు సంస్కృత విద్యార్థుల్లో భగత్‌సింగ్ ఒకడు. భగత్‌సింగ్ సంస్కృత విద్యార్థి అని చదివి పాఠకులు ఆశ్చర్యపడవచ్చు. కానీ, అతడు సంస్కృతాన్ని తీసుకోడానికి కొన్ని కారణాలు వున్నాయి. వాళ్ళ కుటుంబానికి ఆర్య సమాజం మీద అభిమానం మెండు. ఇదొక కారణం, మరో కారణం భగత్‌సింగ్‌కు సాహిత్యాభిరుచి అధికం. ఈ రెండు కారణాలవల్లా భగత్‌సింగ్ సంస్కృతాన్ని తీసుకున్నాడు. చదువు సంధ్యల విషయం అట్లావుంచితే, కాలేజీ విద్యార్థుల్లో సాధారణంగా కనుపించే కొట్లాడే స్వభావం, అల్లరి ప్రవృత్తి మాలోనూ బాగానే వుండేది.

## సుఖదేవ్ :

సుఖదేవ్, నేను, సుఖదేవ్ సోదరుడు జయదేవ్ థాపర్ - ముగ్గురం ఒకే గదిలో వుండేవారం. నేనూ, జయదేవ్ - రాత్రిపూట్ల బాగా పొద్దుపోయేవరకూ చదివేవాళ్ళం. పాఠ్యగ్రంథాలే కాకుండా ఇతర పుస్తకాలనూ తెచ్చుకు చదివేవాళ్లం. సుఖదేవ్‌కు చదువుమీద అలాంటి ఆసక్తి ఏమీ లేదు. మొక్కుబడి తీర్చుకున్నట్టు ఒక్క క్షణం చదివితే చదివేవాడు లేకపోతే లేదు.

సుఖదేవ్ నేషనల్ కాలేజీకి లాయల్‌పూర్ నుండి వచ్చాడు. ఊళ్ళో బట్టలకొట్టు వుంది : అతడికి బాల్యంలోనే పితృవియోగం సంభవించింది. పెదతండ్రి అచింతరాం థాపర్ స్థానీయ వామపక్ష కాంగ్రెసు నాయకుల్లో ప్రముఖుడు. అచింతరాంజీ 1920లో, సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని జైలుకు కూడా వెళ్ళాడు. ఆయనగారు జైలు గుడ్డల్తో, చేతులకు బేడీలతో - తీయించుకున్న ఫోటో ఒకటి వుండేది. ఆ ఫోటోని సుఖదేవ్ ఎప్పుడూ తన టేబిల్ మీద పెట్టుకునేవాడు. సుఖదేవ్, జయదేవ్ - ఇద్దరూ పెద్దతండ్రి పినతండ్రి బిడ్డలు. ఇద్దరూ మెట్రిక్ ప్యాసయ్యాక సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. ఉద్యమం మధ్యలో ఆగిపోవడంతో నేషనల్ కాలేజీలో చదవడానికి వచ్చారు.

సుఖదేవ్ కొన్ని కొన్ని విషయాల్లో చాలా మొండిగా వ్యవహరించేవాడు. అతడి అతి ప్రవర్తనను గురించి మొండి పట్టుదలను గురించి ఎన్నో ఉదాహరణలు ఇవ్వవచ్చును. సాయం సమయాల్లో షికారుగా బజారుకు వెళ్ళేప్పుడు ఒక్కోమారు పహిల్వాన్లు వేసుకునే జుబ్బా - లుంగీతోనే బయలుదేరేవాడు. పక్కనున్న స్నేహితులు 'గౌరవనీయమైన దుస్తులు వేసుకుని రావల్సిందని'

బతిమలాడి చెప్పేవారు. అయినా, అతడు వినేవాడుకాదు. వినకపోగా "నేను వెంటరావడం మీకు అవమానంగా వుంటే వేరుగా వస్తా"నంటూ దూరంగా వెళ్ళిపోవడానికి సిద్ధం అయ్యేవాడు. ఇది సుఖదేవ్ యొక్క భావస్వాతంత్రానికీ, వ్యక్తి స్వాతంత్ర్యానికీ ఓ ఉదాహరణ.

నాకు బాగా జ్ఞాపకం, ఓమాటు సాయంకాలం మిత్రులందరం అనార్కలీ బజారుగుండా వెడుతున్నాము. ఇంతలో పూలమాలలు అమ్మేవాడొకడు మాదగ్గరకు వచ్చాడు. మల్లెపూల మాలలు సువాసనలను గుబాళిస్తున్నాయి. సుఖదేవ్ అతడి దగ్గర ఒకమాలను కొన్నాడు. అలాకొన్న పూలమాలను చేతపట్టుకు నడవడం చాలా అసభ్యకరం అయినపని. ఒక్కోచోట ఒక్కో ఆచారం ఉంటుంది. లాహోరులో గౌరవనీయులు ఎవరూ పూలమాలను చేత పుచ్చుకుని బజార్న నడవరు. అలా నడవడం గూండాయిజానికి నిదర్శనం. అంతటితో ఊరుకోక అతడా మాలను మెళ్ళో వేసుకు నడవసాగాడు. మరి రెండడుగులు వేశాక మెళ్లో వేలాడే పూలమాల కొనను పైకితీసి ముక్కుమీద పెట్టుకున్నాడు. అప్పటికిగాని అతడికి పూలమాల యొక్క సువాసనను పూర్తిగా అనుభవించడానికి వీలుపడింది కాదుగావును.

అతడలా ప్రవర్తించడంతో ప్రక్కనే నడిచే మిత్రులు సంకోచించడం, బాధపడటం సహజం. ఎందుకంటే, మరి అతణ్ణిచూసి నవ్వే ప్రజలు అతడివెంట నడుస్తున్న మమ్మల్ని అదే కేటగిరీకి కడతారుగదా ? మిత్రులు మెల్లగా ఇలా అన్నారు "అర్థంలేని ప్రవర్తన ప్రవర్తించకు, కొంచెం పెద్దమనిషిలా నడువు."

"నా యిష్టం వచ్చినట్టు నేను నడుస్తాను. మీకు అవమానం అనిపిస్తే విడిగానడవండి" అన్నాడు, సుఖదేవ్. ఇంకేం అనేట్టు ? వ్యక్తి స్వాతంత్రం, భావస్వాతంత్రం అవసరం అన్నమాట నిజమేగాని, దాంతో పాటు మనం మన భావస్వాతంత్రాన్ని దుర్వినియోగం చేసి ఇతర్లకు బాధకలిగించటం లేదుకదా ? అన్న ఆలోచన అవుసరం. సమాజంలేంది మనం లేము. సమాజ హితమే మన హితం. అలాంటప్పుడు సమాజంకోసం, అంటే తోటిమానవులకోసం మన స్వార్థంతోపాటు వ్యక్తి స్వాతంత్రాన్ని కూడా కొంత చంపుకోవల్సివస్తుంది.

ఇతర్లను చూసి నేర్చుకోవడం సుఖదేవ్‌కు ఇష్టం వుండదు. ఇతర్ల అనుభవాలను స్వీకరించడానికి అతడు సిద్ధంగా వుండడు. అంటే అగ్నిని ముట్టుకుంటే కాలుతుందన్న సత్యాన్ని మనకు ఇతర్లు తమ అనుభవంద్వారా అందించారు. అతడు అంత తేలిగ్గా ఈ సత్యాన్ని అంగీకరించలేడు. తనూ ముట్టుకు చూస్తానంటాడు.

ఒక మాటు సుఖదేవ్ తన సహన శక్తిని పరీక్షించుకోవాలనుకున్నాడు. లాయల్‌పూర్ నుండి లాహోరు వస్తున్నాడు. మూడవతరగతి టిక్కెట్టు తీసుకున్నాడు. ఒక రైలు పెట్టెలో అచ్చం మిలటరీ వాళ్ళు కూచుని వున్నారు. వాళ్ళు ప్రయాకుణీ లెవరినీ ఆ పెట్టెలోని ఎక్కనీయడంలేదు సుఖదేవ్ వద్దంటున్నా వినకుండా బలవంతాన ఆపెట్టెలోకి దూరాడు. మిలటరీ సైనికులు దబాయించారు. కదలకుండా సీటులో కూచుని "నేను ఎక్కాను నీకు చాతనయితే దింపుకోండి" అన్నాడు.

సూర్యుడస్తమించని బ్రిటిష్‌సామ్రాజ్య సైనికులు సుఖదేవ్ యొక్క పై గర్వోక్తిని సహించగలరా? బూటుకాళ్లతో తన్నారు. గుద్దారు. అతను కిం అనలేదు, దెబ్బలు తింటూ కూచున్నాడు. సైనికులు అతడిని ఎత్తి ప్లాట్ ఫారం మీదకు పారేశారు. ఆ రైలు వెళ్ళిపోయింది. తరువాత రైల్లో అతడు లాహోరు వచ్చాడు. లాహోరు వచ్చేసరికి అతడి శరీరం బాగా వాచి వుంది. అతడు తన ఈ అనుభవాన్ని మా అందరికీ చెప్పాడు. తరువాత ఈ అనుభవాన్ని ఆదర్శంగా తీసుకుని సత్యాగ్రహాన్ని విమర్శించేవాడు 'ఆశయసిద్ధికి సత్యాగ్రహం బొత్తిగా అనుపయుక్తం' అనేవాడు అతడి ఈ అనుభవం ఆధారంగా

మిత్రులం మేమొక తాత్విక నిర్ణయానికి వచ్చాము. 'మానవుల్లో భయము. ఆత్మరక్షణకు ప్రయత్నించడమూ సహజ ప్రవృత్తులు. ఈ సహజ ప్రవృత్తులకు వ్యతిరేకమైంది ఆత్మహత్య ! విప్లవాన్ని ఆత్మరక్షణకు పోల్చుకుంటే, సత్యాగ్రహాన్ని ఆత్మహత్యకు పోల్చవచ్చును. ఆత్మహత్యా సదృశ్యమైన అసహజ మార్గంలో నడవగలవారు ఒకరో ఇద్దరో వుండవచ్చును. ఆ ఒక్కరిద్దరు అసహజవర్తనువల్ల ప్రయోజనం ఏంటి ? వాళ్ళయినా వెనుక నుండి ప్రజల సానుభూతి తనకు అండగా వుందన్న విశ్వాసం వున్నప్పుడే, ఆ మార్గాన నడవగలరు.'

సత్యాగ్రహం ఏ ఒక్కరిద్దరు మాత్రమే నడవగల అసహజ మార్గం అన్నాను. ఇది మా అభిప్రాయం మాత్రమే కాదు. స్వయంగా గాంధీగారి అభిప్రాయమూ ఇదే. సామూహిక సత్యాగ్రహాలు 'అక్రియాత్మకం' అని పించినప్పుడల్లా గాంధీగారు వ్యక్తిగత సత్యాగ్రహాన్ని ప్రారంభించేవారు. అంటే అర్థం ఏంటి ? సత్యాగ్రహోద్యమం సామూహికంగా ఆచరింపదగింది కాదనీ, ఏ ఒకరిద్దరు మాత్రమో వ్యక్తిగతంగా ఆచరింపదగిందనీ స్పష్టం కావడంలేదా ?

అప్పటికి మా విప్లవ సంఘానికి రూపురేఖలు ఏర్పడలేదు. కనుక, విప్లవ సంఘంలోని సుఖదేవ్ కార్యక్రమాల్ని గురించి ఇక్కడ చెప్పడం అప్రస్తుతం అనుకుంటున్నాను. ఐతే, ఒక విషయం చెప్పగలను. విప్లవ సంఘంలో పనిచేసేప్పుడూ అతడు తన ప్రవృత్తుల్ని ఏ మాత్రం మార్చుకోలేదు. అతి ప్రవర్తననూ, మొండి పట్టుదలను సంఘ కార్యక్రమాల్లోనూ ప్రదర్శించేవాడు. మిత్రులం అతడిపట్ల ఘోరమైన అసంతృప్తినీ, క్రోధాన్ని ప్రకటించిన సమయాలు వున్నాయి. అతణ్ణి గురించి ఇలా వ్రాయవల్సి వచ్చినందుకు చాలా దుఃఖపడుతూన్నాను. అతడంటే నాకెంతో మమకారం. నాకేకాదు, భగత్‌సింగ్, ఝుండాసింగ్ అందరికీ అతడంటే ప్రేమే నాలాగానే అతడిలోనూ సహనశక్తి ఎక్కువ. ఏ విషయాన్నయినా సరే తాను తటస్థుడిగా వుండి ఆలోచించేవాడు. అందరం సుఖదేవ్‌ను ప్రేమించాం, కానీ, అతడికి మామీద ప్రేమవుందోలేదో అతడికే తెలియాలి. అంతగా మమకారం గల అతణ్ణి, ఓమాటు విప్లవసంఘ ఆదేశానుసారం కాల్చిపారేయడానికి నేనే సిద్ధపడ్డాను. తనను కాల్చివేసే నిర్ణయానికి కూడా అతడు దర్శక మాత్రుడిగానే సమాధానం రాసి పంపించాడు. సందర్భం వచ్చినప్పుడు ఈ విషయాన్నంతా రాస్తాను. సుఖదేవ్ ఇచ్చిన సమాధానాన్ని కూడా ఉదహరిస్తాను. వైద్యుడి దగ్గరకు వెళ్ళిన రోగి తన రోగాన్ని చెప్పుకోక తప్పదు. నేనూ అలాగే అతడి గురించిన ఈ విషయాల్ని రాస్తున్నాను.

పండిట్ చేతరాం శర్మాజీ మాకు హిందీ చెప్పేవారు. శర్మగారు చాలా గంభీరమైన వ్యక్తి ........ సంగీత రసజ్ఞులు. హిందీ కవిత్వం చెప్పేప్పుడు సస్వరంతో పాడి ఛందస్సుల్ని బోధపరిచేవారు. శర్మగారికి సంగీత జ్ఞానం బాగావుంది. ఐతే, గొంతు బాగుండేది కాదు. సంగీతంలోని లోతుపాతులు మాకేం అర్థం అవుతాయి ? వారలాహావభావల్తో గానం చేస్తూవుంటే నవ్వు ఆపుకోలేకపోయేవాళ్ళం. ఐతే, శర్మగారి ఎదుట నవ్వడానికి ఎవరికీ సాహసం చాలేదుకాదు. వారంటే అందరికీ గౌరవమే.

సత్యాగ్రహోద్యమంవల్ల లాభంలేదని తెల్సుకుని, మరో మార్గాన్ని వెతికేరోజుల్లో మాకు దొరికిన సాహిత్యం ఎలాంటిదో చెప్పడమూ అవసరమే. అప్పట్లో మేము డేన్ బ్రీన్ రాసిన 'మైఫైట్ ఫార్ ఐరిష్ ఫ్రీడమ్' చదివాము. తరువాత మేజినీ, గైరిబాల్డీ జీవిత చరిత్రలు చదివాము. ఫ్రెంచి విప్లవ చరిత్ర... వాల్టేయర్, రూసోరచనలు, రష్యన్ విప్లవకారుల జీవితచరిత్రలు, 'వీరాది ఫిగనర్' 'క్రోపోటకిన్- ఇవేకాకుండా భారతీయ విప్లవకారుల చరిత్రలూ కొన్ని చదివాము. ముఖ్యం సన్యాల్ దాదాగారి జీవితచరిత్ర 'బందీజీవన్' భారతదేశ విప్లవచరిత్రకు సంబంధించిన ప్రప్రథమ గ్రంథంగా చదివాము. 'రౌలెట్ కమిటి రిపోర్టు' కూడా మామీద ఎంతగానో ప్రభావాన్ని వేసింది.

రౌలెట్ బిల్లును శాసనం చేయడం అవసరం అని నొక్కిచెప్పడానికిగానూ రౌలెట్ కమిటీ రిపోర్టు రాయబడ్డది. అందులో భారతదేశంలో జరిగిన సాయుధ విప్లవ పోరాల ప్రయత్నాల్ని సవివరంగా వర్ణించారు. ప్రభుత్వ ఉద్దేశ్యం - గతంలో విప్లవ ప్రయత్నాల్ని సాగించిన విప్లవకారుల్ని రాజద్రోహులుగా చిత్రించడం. వారి ప్రయత్నాల్ని రాజద్రోహాత్మక చర్యలుగా అభివర్ణించడం. ఐతే, ఆ రిపోర్టును చదివి భారతీయ విప్లవకారులు అపరాధులనిగానీ, రాజద్రోహులనిగానీ మేమెవరమూ అనుకోలేదు.

పై పుస్తకాల్ని చదవమని మాకు ఎవరు చెప్పారో జ్ఞాపకం లేదు. పై పుస్తకాల్లో కొన్నింటిని కాలేజీ లైబ్రరీలోంచీ తీసుకు చదివాము. మిగిలినవి ఎక్కణ్ణుండి వచ్చాయో, ఎవరు తెచ్చిపెట్టారో - ఇప్పుడు జ్ఞాపకం లేదు. అప్పుడు జ్ఞాపకం వుంచుకోవల్సిన అవసరమూ కనిపించలేదు. ఈ పుస్తకాల్ని మేము కొద్దిమందిమేకాదు చదివింది; కాలేజీలో వున్న విద్యార్థులు అందరూ చదివేవారు.

ఆ రోజుల్లో జరిగిన ఓ సంఘటన జ్ఞాపకముంది. జయచంద్ర విద్యాలంకార్‌గారు నన్నో మాటు తమ ఇంటికివచ్చి కల్సుకోమన్నారు. నేను వెళ్ళాను. వారు ప్రశ్నించారు. "భవిష్యత్తులో నీ జీవిత కార్యక్రమం ఏంటి ?"

"ఇంకా చదువుతూనేవున్నాను. ఇప్పుడే ఏం చెప్పగలను ?" అని వుంటాను.

"చదవడమే ఆదర్శం అయితే నువ్వు పర ప్రభుత్వ కాలేజీలో చదవవచ్చునుగదా ? మరి ఈ కాలేజీకి ఎందుకు వచ్చావు ? ఈ కాలేజీ నుండి నువ్వు పొందే డిగ్రీ బతుకుదెరువుకు అంతగా ఉపయోగపడదు. ఇక ప్రభుత్వోద్యోగానికి అసలే పనికిరాదు. అలాంటప్పుడు నువ్వు ఇక్కడ చదవడంలోని ఆంతర్యం ఏంటి ?" అడిగారు.

"ప్రభుత్వోద్యోగానికి పనికిరాదని నాకు తెల్సు. ప్రభుత్వోద్యోగం చేయడం అంటే పొట్టకోసం పరప్రభుత్వానికి సహకరించడం అన్నమాట. అలాంటిపని నేను ఎన్నటికీ చేయను. నా మాతృదేశంలో పర ప్రభుత్వ శాసనాన్ని ఎన్నటికీ సహించను." అన్నాను.

తరువాత జయచంద్రగారు పర ప్రభుత్వాన్ని అంతం చేయడానికి నా ప్లాను ఏమిటని అడిగారనుకుంటాను. లేకపోతే, మాతృదేశ దాస్యవిముక్తికి నేను ఏ మార్గాన్ని అనుసరించబోతూన్నాను? అనయినా ప్రశ్నించి వుంటారు.

నేనిచ్చిన సమాధానం స్పష్టంగా జ్ఞాపకం లేదు. మొత్తానికి ఇలా సమాధానం ఇచ్చి వుంటాను. "మాతృదేశ దాస్య విముక్తికి నేనేమి చేయగలను ? అన్న విషయంలో నేనింత వరకు ఒక నిర్ణయానికి రాలేదు. భవిష్యత్తు ఎలా వుంటుందో నేను ఇప్పుడే చెప్పలేను. దేశం కోసం నేనేమైనా చెయ్యనూవచ్చు. చెయ్యలేకనూపోవచ్చు.

అప్పటికి కొద్దిరోజుల క్రితం నేనూ, భగత్‌సింగ్ ఓమాటు 'రావీ' నదిలో నావ నడపడం నేర్చుకోడానికి వెళ్ళాం. మేమిద్దరమే పడవలో వున్నాం. దేశ స్వాతంత్ర్యాన్ని గురించి మాట్లాడుకుంటున్నాం. నేను చాలా గంభీరంగా, పూర్తి విశ్వాసంతో "Let us Pledge our lives to country" (మన జీవితాల్ని దేశం కోసం అర్పిచడానికి ప్రతిజ్ఞ చేద్దాం.) అన్నాను.

భగత్‌సింగ్ కూడా గంభీరవదనుడయ్యాడు. నా వైపు చేయి చాపి "I do Pledge" (ప్రతిజ్ఞ చేస్తున్నాను) అన్నాడు.

మేమిద్దరం చేతులు కలుపుకున్నాం. ఇద్దరం తెడ్లు వేయడంమాని మౌనంగా కూచున్నాము. సూర్యాస్తమయం అయింది. ఇంకా ఆకాశంలో ఎరుపు ఛాయలు కనుపిస్తున్నాయి. మేము ఇద్దరం నావను పల్లెకారికి వప్పచెప్పాం. తిరిగి వచ్చేప్పుడు కూడా మేము చాలా మౌనంగా, గంభీరంగా వున్నాము.

బహుశ, భగత్‌సింగ్‌పై సంఘటనను జయచంద్ర విద్యాలంకార్ గారికి చెప్పి వుండవచ్చును. అందువల్లనే వారు నన్ను అలా అడిగివుంటారు. భగత్‌సింగ్ దగ్గర నా అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పి, విద్యాలంకార్ గారి దగ్గర దాయడానికి అప్పటి నా మానసిక స్థితి కారణం అయివుంటుంది.

ఆ రోజుల్లో మేము నాటకాలు కూడా ఆడుతూండేవాళ్ళం. నాటకాలు ఆడడం వల్ల మా ఆసక్తి కొంత పరితృప్తిని చెందడమే కాకుండా, మా భావాలను ప్రచారం చేసుకోవడమూ జరిగేది. ఎవరో రాసిన 'మహాభారతం' అనే నాటకం ఒకటి దొరికింది. దాన్లోని సంభాషణలను మాకు అవసరం అయినట్లు మార్చుకున్నాము. దానికి 'కృష్ణ విజయం' అని పేరు పెట్టాము. పరోక్షంగా కౌరవులు ఇంగ్లీషువారిగా, పాండవులు కాంగ్రెసువారిగా చిత్రించాము. ఆ నాటకం కోసం కొన్ని పాటల్ని కూడా సొంతంగా రాసుకున్నాం. ఆ నాటకంలో మేము రాసిన ఒక పాట బహు ప్రసిద్ధిని పొందింది. 'కదే తూఖీ హిందియా హోష్ సంభాల్' అనే పాట ప్రేక్షకులకు బాగా నచ్చింది. పై పాటలకు అర్థం 'ఓ భారతీయుడా ! నువ్వు ఇప్పటికైనా తెలివి తెచ్చుకో, నీ కొంపా, గోడ - విదేశీయుడు దోచుకుంటున్నాడు. నువ్వేమో ఒళ్లు తెలియని నిద్రలో వున్నావు. ఓ దోపిడిదొంగా ! అతిగా అత్యాచారాలు చేయకు. నీ కుయుక్తులు మేము అర్థం చేసుకున్నాం' అని.

ఈ పాటను సర్దార్ అజీత్‌సింగ్ రాసిన 'పగడీ సంభాల్ ఓజట్టా' అనే పంజాబీ గీతం ఆధారంగా రాశాము. అజీత్‌సింగ్‌గారి గీతానికి అర్థం 'ఓ కర్షకా, నీ తలగుడ్డ క్రింద పడనున్నది, జాగ్రత్త' అని.

అజీత్‌సింగ్‌గారి పై పంజాబీ గీతాన్ని ప్రభుత్వం నిషేధించింది. మా నాటకంలోని కొన్ని సన్నివేశాల్ని రాజద్రోహాత్మకంగా ఉన్నాయనే సాకుతో ఆంగ్ల ప్రభుత్వం నిషేధించింది. కొన్నాళ్ళపాటు మేము మహోత్సాహంతో నాటకాలు ఆడాము.

ఆ రోజుల్లో భగత్‌సింగ్, సుఖదేవ్ - ఇద్దరూ తరచు కాలేజీకి గైరుహాజరు అవుతూండేవారు. హాస్యప్రియుడైన భగత్‌సింగ్ కొంత గంభీరుడయ్యాడు. 'విప్లవ సంఘం కోసం నువ్వేం చేయగలవు' అని నన్ను స్పష్టంగా అడిగేవాడు. నేను మౌనంగా వుండేవాణ్ణి.

అప్పటికి విప్లవ కార్యక్రమాలు, విప్లవోద్యమమూ - కొంత వరకూ స్పష్టమైన రూపాన్ని దాల్చాయి. 'హిందూస్థానీ ప్రజా తంత్ర దళం' (హెచ్.ఆర్.ఎ.) తరపున బలరాజ్ సంతకంతో, లాహోరులో విప్లవాత్మకమైన కరపత్రాన్ని ఒకదాన్ని పంచారు. అలాంటి ప్రమాదకరమైన కరపత్రాన్ని పకడ్బందీ ఐన ఏర్పాట్లు లేకుండా పంచడం సంభవం కాదు. నేను విప్లవ సంఘానికి అవుసరం ఐన సహాయం చేయడానికి సిద్ధంగా వున్నాను. ఐతే, నా చదువునుగానీ ఉద్యోగాన్ని గానీ మానుకోలేదు.

ఆ రోజుల్లో మేము సత్యాగ్రహం యొక్క నిరుపయోగాన్ని గురించి చర్చిస్తూండేవాళ్ళం. అలాగే ప్రజాతంత్రాన్ని గురించి సామ్యవాదాన్ని గురించికూడా తర్కించుకుంటూ వుండేవాళ్ళం. రష్యాను గురించి, ఆ దేశములో జరిగిన విప్లవాన్ని గురించి మాకు ఆ రోజుల్లో కొంత సాహిత్యం లభించింది. దాన్ని చదివాక మా దృష్టి సామ్యవాదం వైపు మళ్ళింది. లాలాలజపతిరాయ్ గారు 'తిలక్ స్కూలు ఆఫ్ పాలిటిక్స్' 'సర్వెంట్స్ ఆఫ్ పీపుల్స్ సొసైటి' మొదలైన సంస్థల్ని స్థాపించారు. వీటికి తోడు తమ తండ్రిగారి పేరు మీద ద్వారకాదాసు పుస్తకాలయం అన్న గ్రంథాలయాన్నొకదాన్ని స్థాపించారు. ఈ గ్రంథాలయంలో రాజకీయ సాహిత్యమూ, పత్రికలూ అధికంగా లభించేవి. ఈ గ్రంథాలయం అధ్యక్షులు రాజారాం శాస్త్రిగారు. శాస్త్రిగారు ప్రస్తుతం ఎం.ఎల్.ఎ.గా ప్రసిద్ధిని వడశారు. మా యీడువారు. పైగా మా భావాలపట్ల వారికి సానుభూతివుంది. ఆ కారణంగా ఆ రోజుల్లో ద్వారకాదాసు పుస్తకాలయం మా ప్రధానమైన కేంద్రాల్లో ఒకటిగా వుండేది.

## భగవతీచరణ్

భగవతీచరణ్ నేషనల్ కాలేజీలో మాకంటే ముందునించీ చదువుతూన్నాడు. అతణ్ణి కాలేజీలో చూస్తూవుండేవాణ్ణి. అయితే, వ్యక్తిగతంగా నాకు అతడితో పరిచయం లేదు. డేరాడూన్‌లో హిందీ సాహిత్య సమ్మేళనం సందర్భంగా ప్రథమ పరిచయం అయింది. రెండవ మాటు 1925లో హెచ్.ఆర్.ఎ. కరపత్రాల్ని పంచేప్పుడు పరిచయం అయింది. మా పరిచయం గాఢ మిత్రత్వంగా పరిణతిని చెందింది. అసలు సాయుధ విప్లవ పోరాటంలో సానుభూతిని కనబరిచే ప్రతి వ్యక్తీ మాకు ఆత్మీయుడే. ఇక సాయుధ విప్లవ పోరాటంలో పాల్గొనే వ్యక్తి జీవన్మరణ సమస్యలన్నింటిలోనూ మాకు చేదోడు - వాదోడని విశ్వసించేవాళ్ళం.

కాలేజీకి వచ్చిన రెండు మూడు సంవత్సరాల్లో భగత్‌సింగ్ వడ్డూ పొడుగూ ఎదిగి మనిషి బాగా తేలాడు. ఐతే, భగవతీచరణ్ ముందు భగత్‌సింగ్ పనికిరాడు. భగవతీచరణ్ ఎత్తు ఆరడుగులకు కొంచెం తక్కువగా వుంటుంది. పొడుక్కు తగిన లావు, బలిష్టంగా వుంటాడు. చామనచాయ, గుండ్రని గంభీరమైన ముఖం, పెదాలు కొంచెం లావు. కండ్లు కళ్ళద్దాల చాటున దాగివుండేవి. భగవతీచరణ్ లాహోరులోనే పుట్టినా, గుజరాతీ బ్రాహ్మణ వంశానికి చెందినవాడు. ఐతే, అతడు తాను పంజాబీననే చెప్పుకునేవాడు. పంజాబీ భాషను చాలా చక్కగా మాట్లాడేవాడు. ఉచ్చారణనుబట్టీ అతడు పంజాబీ కాదనీ, గుజరాతీ అని తెల్సుకోవడం అసంభవం. ఎంతో ఆత్మీయులైన కొద్దిమంది మిత్రులకు మాత్రమే అతడు గుజరాతీ బ్రాహ్మణ వంశానికి చెందినవాడని తెల్సు. భగవతీచరణ్ పూర్వీకులు గుజరాత్ నుండి ఆగ్రా వచ్చారు. అక్కణ్ణుండి లాహోరువచ్చి స్థిరపడ్డారు.

ఆ రోజుల్లో రహస్య సంఘాల్ని స్థాపించడానికి హెచ్.ఆర్.ఎ. కరపత్రం ఒకటి పంచారు. ఆ కరపత్రం జయచంద్రగారి ద్వారా ప్రకటింపబడ్డది. ఐతే, ఆ కరపత్రాన్ని భగవతీచరణ్ ఇంట్లో వుంచారు. వాటిని పంచడంలోనూ భగవతీచరణ్ బాగా సహకరించాడు. ఆ రోజుల్లోనే 'నౌజవాన్ భారత సభ' అనే సంస్థ నొకదాన్ని స్థాపించారు. ఈ సంస్థను స్థాపించినవారు భగత్‌సింగ్, భగవతీచరణ్. ఈ సంస్థ ఆశయం ప్రజల్లో తీవ్ర రాజకీయ భావాల్ని కలిగించడం, రహస్య సంఘాలకు అవుసరమైన వాతావరణాన్ని కల్పించడం, వాటిపట్ల ప్రజలకు సానుభూతిని కలిగించడం. మేమందరం ఆ సంస్థలో సభ్యులం. సంస్థ కార్యక్రమాలు బాహాటంగానే జరిగేవి. మా రహస్యోద్యమానికి ఈ సంస్థ బహిర్ ప్రాణం. ఈ సంస్థకు జనరల్ సెక్రటరీ భగత్‌సింగ్, ప్రాపగాండా సెక్రటరీ భగవతీచరణ్. ఈ సంస్థ కార్యకర్తలుగా మిత్రులు ధన్వంతరీ, ఎహసాన్ ఇలాహీ - ఇద్దరూ పని చేస్తూండేవారు. కొద్ది రోజుల్లోనే, కాంగ్రెసు పార్టీలోని యువకులు కూడా అనేకులు దీనికి సభ్యులుగా చేరారు. సామ్యవాదం మీద సహానుభూతిగలవారి నందరినీ త్వరలోనే ఈ సంస్థ ఆకర్షించింది. వివిధ ప్రాంతాల్లోనూ శాఖోపశాఖలుగా ఇది విస్తృతిని పొందింది.

'నౌజవాన్ భారత్ సభ' ముఖ్య కార్యక్రమం కాంగ్రెసు యొక్క దళారీ రాజకీయాల్ని విమర్శించడం. ప్రజల భావాలను ఉగ్ర రాజకీయాలకు అనుగుణంగా మార్చి, సాయుధ పోరాటంపట్ల వారిలో సానుభూతిని కలిగించడం. 'నౌజవాన్ భారత్ సభ'కు అప్పటి అతివాద కాంగ్రెసు పార్టీ నాయకుల సహకారం కూడా లభిస్తూవుండేది. అలా సహకరించిన కాంగ్రెసు వారిలో డా॥ సత్యపాల్, డా॥ కిచలూ, కేదారనాధ్ సహగల్, పండీదాస్ మొదలైనవారు ముఖ్యులు. భగవతీచరణ్, భగత్‌సింగ్, సుఖదేవ్, ధన్వంతరీ, ఎహసాన్ ఇలాహీ, సోడీ, నేనూ - మేమంతా నౌజవాన్ భారత్ సభ కార్యకర్తలమేకాకుండా స్వయం సేవకులం కూడాను. కార్యక్రమాల్ని నిర్ణయించడం, కార్యక్రమాల్ని నిర్వహించడమే కాకుండా సభలూ, సమావేశాలూ జరిగేప్పుడు చాపల్ని వేయడం దగ్గర్నుండి అన్ని పనులూ మేము చేసేవాళ్ళం.

మేము రహస్య జీవితాన్ని గడిపేప్పుడు రామకృష్ణ, ధన్వంతరీ, ఎహసాన్ ఇలాహీ సభా కార్యక్రమాల్ని నడిపారు. వీరిమీదా వారంట్లు పుట్టాయి. వీరూ రహస్య జీవితాన్ని గడపసాగారు. ఇక అప్పుడు సభా కార్యక్రమాల్ని అపరిచితులైన మిత్రులెవరెవరో నడిపారు. ఎవరు నడిపినా, 'నౌజవాన్ భారత సభ' ఆదర్శం అవిచ్ఛిన్నంగా నెరవేరిందనే చెప్పాలి.

సాయుధ విప్లవాన్ని గురించి నౌజవాన్ భారత సభ ప్రచారంచేసేది. సాయుధ విప్లవ ఆదర్శాన్ని సాధ్యమైన అన్ని మార్గాల ద్వారా ప్రజల్లోకి తీసుకుపోయేది. 1914లో లాహోరు కుట్ర కేసులో అభియుక్తుడైన కర్తార్ సింగ్ అనే 18 ఏండ్ల నవయువకుడు ఉరితీయబడ్డాడు. అతడు చాలా సాహసంతో, నవ్వుతూ ఉరికంబాన్ని ఎక్కాడు. అతడి జయంతి ఉత్సవాన్ని 'నౌజవాన్ భారత సభ' గ్రైండలాహాల్లో అద్భుతంగా జరిపింది. ఉరితీయబడిన, రాజకీయ ముద్దాయికి జయంతి ఉత్సవాన్ని జరపడం, ఆ రోజుల్లో నిజంగా సాహసోపేతమైన కార్యం. అలాంటి సాహసికమైన కార్యాన్ని ఒక్క నౌజవాన్ భారత్ సభ మాత్రమే చేయగలిగింది. జయంతి ఉత్సవంనాడు కర్తార్ సింగ్ చిత్రపటాన్ని ఆవిష్కరించాము. ఒకరకంగా ఈ జయంతి ఉత్సవం యువకుల్ని సాయుధ విప్లవానికి బాహాటంగా ప్రోత్సహించడమే ఔతుంది. ఉత్సవం చాలా ఆకర్షణీయంగా జరిపాము. భగత్‌సింగ్ కర్తార్ సింగ్ ఫోటో నొకదాన్ని సంపాయించాడు. ఎన్‌లార్జి చేయించిన ఫోటో మీద ఖద్దరు పరదానొకదాన్ని కట్టాము. దుర్గాబాభీ, సుశీలాదీదీ ఇద్దరూ తమ బొటనవేళ్ళను కోసుకుని ఆ రక్తపు తుంపరలను పరదామీదకు చిమ్మారు. తరువాత భగవతీభాయి ఉపన్యసించాడు.

1926 నాటి విషయం. మా విప్లవ సంఘ నాయకత్వం జయచంద్రజీ విద్యాలంకార్ గారు వహిస్తున్నారు. అప్పట్లో మా విప్లవ సంఘానికి సంబంధించిన అన్ని సంబంధాలూ వారి ఆధీనంలోనే వున్నాయి. ఐతే, విప్లవ సంఘం అంతవరకూ చెప్పుకోదగిన ఏ గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించలేదు. కాకపోతే, నౌజవాన్ భారత్ సభను నడపడం ఒకటి కనుపిస్తున్నది. మేమందరం చాలా అసంతృప్తిలో, నిరుత్సాహంలో వున్నాము. భగవతీచరణ్ తన సమయాన్ని నౌజవాన్ భారత్‌సభ కార్యక్రమాల్లోనూ, హిందీ సాహిత్య సమ్మేళనం కార్యక్రమాల్లోనూ గడుపుతూన్నాడు. విప్లవ సంఘంలో చెప్పుకోదగిన కార్యక్రమం ఏదీ జరక్కపోవడంవల్ల విసిగి ఉద్యోగ ప్రయత్నాల్ని చేస్తూన్నాడు. భగత్‌సింగ్, సుఖదేవ్, భగవతీచరణ్ - వీరు ముగ్గురూ - చాలా అసంతృప్తిగా, అశాంతిగా కాలాన్ని గడుపుతూన్నారు. వీరు విప్లవానికి క్రియాత్మక రూపాన్ని ఈయడానికి తహతహలాడుతూన్నారు. జయచంద్ర విద్యాలంకార్‌గారు మాత్రం విప్లవ కార్యక్రమాల్ని ప్రారంభించడానికి వెనకంజ వేయసాగారు. ఎంతకీ భూగోళ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోమనీ, చరిత్రను అధ్యయనం చేయమనీ చెప్పేవారు. అదీ కాకపోతే సభ్యుల్లో చచ్చును ఏరిపారెయ్యాలనేవారు. అంతకుమించి ఒక్క అడుగు ముందుకు వేసేవారు కాదు. మిగిలినవాళ్ళను వేయనిచ్చేవారు కాదు. ఈ స్థితికి విసుగు చెందిన భగత్‌సింగ్ ఢిల్లీ, కాన్పూర్ పట్టణాలకు వెళ్ళి అక్కడున్న ఇతర విప్లవకారుల్తో పరిచయం ఏర్పరచుకోవాలని నిశ్చయించుకున్నాడు. భగత్‌సింగ్ ఇలా లాహోరును వదలి వెళ్ళిపోవాలని నిశ్చయించుకోడానికి మరో కారణం వుంది. అతడు ఇంటి పని పాటల్లో ఏ మాత్రం సహకరించడం లేదు. పూర్తిగా రాజకీయ కార్యకలాపాల్లో మునిగిపోయాడు. కొడుకు ఇలా ఇల్లూ వాకిలీ పట్టకుండా తిరగడం సర్దార్ కిషన్‌సింగ్‌కు బొత్తిగా ఇష్టం లేదు. తండ్రి కొడుకును కట్టడిలో పెట్టసాగాడు. తండ్రి యొక్క అదుపాజ్ఞల్నుండి తప్పించుకోవడానికి లాహోరు నుండి వెళ్ళిపోవడం అవుసరం అనుకున్నాడు భగత్‌సింగ్ !

భగత్‌సింగ్ తండ్రికి చెప్పకుండానే లాహోరు నుండి ఢిల్లీ వెళ్ళిపోయాడు. వెడుతూ ఢిల్లీ నుండి వెలువడే హిందీ వారపత్రిక 'అర్జున్'లో ఉద్యోగం కోసం జయచంద్రగారినడిగి రికమండేషన్

లెటర్ పట్టుకువెళ్ళాడు. జీతం బత్తెం లేని ఉద్యోగం అది. దానికి వేరే రికమండేషన్‌తో అంతగా పనిలేదు. ఉచితంగా ఒక మనిషి పనిచేయడానికి సిద్ధపడితే ఎవరు వద్దంటారు ? అభ్యంతరం మాత్రం ఎవరికి వుంటుంది ? భగత్‌సింగ్ కొన్నాళ్ళపాటు 'అర్జున్' పత్రికలో పనిచేశాడు. నియమంగా, కష్టపడి పని చేసేవాడు. త్వరలోనే ఆ పత్రికాధిపతి పండిత ఇంద్రవిద్యా వాచస్పతిగారి విశ్వాసాన్ని చూరగొన్నాడు.

ఢిల్లీ - కాన్పూర్ పట్నాల్లో భగత్‌సింగ్ చాలా కష్టాల్లో జీవితాన్ని గడిపాడు. తిరిగి లాహోరు వచ్చినప్పటి అతడి ఆకారాన్ని చూస్తే చాలు అతడు పడ్డ బాధలు అర్థం అవుతాయి. తలకు తలగుడ్డలేదు. ఓ చిన్న అంగవస్త్రాన్ని చుట్టుకున్నాడు. వంటిమీద లాహోరు నుండి వెళ్ళేప్పుడు వేసుకున్న ఖద్దరుకోటు మాత్రం వుంది. కోటులోపల వేసుకున్న చొక్కాలేదు. పైజామాకు బదులు లుంగీ కట్టుకున్నాడు. పైజామా పిర్రల దగ్గర చినిగింది. కోటుకు చేతులు చినిగాయి. ఆ పైజామాను చించి కోటు చేతులకు కుట్టుకున్నాడు. ఏదోరకంగా శరీరాంగాలను కప్పుకున్నాడు. ముందు కొన్నాళ్ళు కాన్పూరులో పత్రికలమ్మి బ్రతికాడు. తరువాత స్వర్గీయ గణేశ్ శంకర విద్యార్థిగారి పరిచయంతో 'ప్రతాప్' లో పని సంపాయించుకున్నాడు. కాన్పూర్‌లో వుండగా శివవర్మ, జయదేవ్ కపూర్, విజయకుమార్ * మొదలైన యు.పి. యువవిప్లవకారుల్ని కల్సుకున్నాడు. ఐతే, వారి నాయకుల్ని కల్సుకోలేకపోయాడు.

యు.పి. విప్లవకారులు కాకోరీ వద్ద రైలును ఆపి ఖజానాను దోచుకున్నారు. అప్పుడు ప్రయాణీకుల్ని ఉద్దేశించి "మేము ప్రజల ధన, మాన, ప్రాణాలను ముట్టుకోము. ప్రభుత్వ ఖజానాను మాత్రం దోచుకుంటాం !" అన్నారు.

ఖజానాను దోచుకున్నారు. ఐతే, అనుకున్నంత ఫలితం లభించలేదు. కొద్ది రోజుల తరువాత పోలీసులకు కొంత ఆచూకీ దొరికింది. అరెస్టులు ముమ్మరం అయ్యాయి. భగత్‌సింగ్ కాన్పూర్‌లో వున్నాడు. పరిచయస్థులు అతడు అక్కణ్నుండి వెళ్ళిపోవడం మంచిదని చెప్పారు. "పోలీసులు చేతికి అందిన ప్రతివాణ్ణీ అరెస్టు చేస్తున్నారు. నువ్వు అనుమానింప దగిన స్థితిలో వున్నావు. కాన్పూరు నుంచి తప్పించుకు వెళ్ళిపో ! లేకపోతే ఈ వలయంలో చిక్కుకుంటావు !" చెప్పారు మిత్రులు అతనితో.

భగత్‌సింగ్ వెళ్ళిపోయాడు. కాన్పూరులో ఏర్పరచుకున్న పరిచయాల ఆధారంగా ఢిల్లీలో విప్లవ సంఘ స్థాపనకు ప్రయత్నించాడు. పంజాబు విప్లవ సంఘం జయచంద్రగారి గుప్పెట్లో వుంది. కార్యక్రమం ఏమీ జరగడం లేదు. భగత్‌సింగ్ పంజాబులో లేడు. ఢిల్లీలో వున్నాడు. సుఖదేవ్ విసిగి లాయల్‌పూర్ వెళ్ళిపోయాడు. భగవతీచరణ్ భారతదేశపు సాయుధ విప్లవ సమగ్ర పోరాటాన్ని గురించిన చరిత్ర రాయాలన్న ప్రయత్నంలో వున్నాడు. వ్యక్తిగత మిత్రత్వం కారణంగా మేము భగవతీచరణ్ ఇంటికి వెళ్తూండేవాళ్ళం ! అతడి గృహం 'శివ నివాస్' 'గ్వాల్‌మండీ'లో వుంది. భగవతీచరణ్ నివాసం ప్రశాంతమైన ఓ గృహస్థు నివాసంలా వుంటుంది. ఏ గోలా, ఏ రద్దీ వుండదక్కడ. మిత్రులం ప్రత్యేకంగా అడిగితే, ఘనంగా విందు కూడా చేస్తుండేవాడు భగవతీచరణ్. కాగా భగత్‌సింగ్ ఇల్లు స్నేహితులమైన మా తాకిడికి ధర్మసత్రంలా తయారయింది. అప్పటికి ఇంకా భగవతీచరణ్ ఇల్లు 'ధర్మసత్రం' అనే ఉచ్చపదవికి చేరలేదు.

## విప్లవ సంఘం :

1926వ సంవత్సరం జనవరి - ఫిబ్రవరి నెలల్లో జరిగిన విషయం. సుఖదేవ్ నా విషయం గట్టి తేల్చుకోవాలనుకున్నాడు. 'నీ అభిప్రాయం ఏంటి ?' అని ప్రతిసారీ ప్రశ్నించేవాడు. 'నా అభిప్రాయం ఏముంది ? నేను సిద్ధం ! నువ్వు ఏం చెబితే అది చేస్తాను !' అనేవాణ్ణి. 'నువ్వు ఏం చెబితే

అది చేస్తాను !' అనడంలోని అంతరార్థం సుఖదేవ్‌కు బాగా తెల్సు. అలా అనే వ్యక్తి తను బాధ్యత వహించి ఏమీ చేయడని అర్థం. విప్లవ సంఘానికి నేనూ ఒక అంగాన్నై, స్వయంగా ఆలోచించి, బాధ్యతగా కార్యక్రమాల్లో పాల్గొనాలని అతడి ఉద్దేశం !

'నువ్వు ఏం చెబితే అది చేస్తాను' అన్న నా సమాధానాన్ని సుఖదేవ్ ఒక రకంగా అర్థం చేసుకున్నాడు. నేను స్కూల్లో పని చేస్తూనో, కథలు రాసుకుంటూనో, సానుభూతిపరుడుగా మాత్రమే వుండాలనుకున్నానని అభిప్రాయపడ్డాడు. నేనుగా బాధ్యత తీసుకొని కార్యక్రమాల్ని చేపట్టడం ఇష్టంలేదనీ అనుకున్నాడు. అతడనుకున్నది కొంతవరకూ నిజంకూడాను. నేను విప్లవ కార్యక్రమాల్లో క్రియాత్మకంగా పాల్గొనేకంటే, దూరంగా వుండి నా రచనలద్వారా విప్లవానికి అనువైన వాతావరణాన్ని కల్పించడం మంచిదేమోనన్న భావన అప్పటికే నాలో వుంది. ఈ భావన నాలోని ఒక రకమైన అహంకారమే అవుతుంది. ఈ అహంకారంలో మా కుటుంబంపట్ల నాకు గల కర్తవ్యాన్ని పూర్తిచేయాలన్న భావనా వుంది. కొంతలోకొంత విప్లవ కార్యక్రమాల్లో క్రియాత్మకంగా పాల్గొని బాధల్ని వరించలేని పిరికితనం, సోమరితనం కూడా వున్నాయి.

నేనిలా అంటకుండా పట్టకుండా వుండడంసుఖదేవ్‌కూ, భగవత్‌సింగ్‌కూ బొత్తిగా నచ్చలేదు. నన్ను హేళన చేయడానికి, ఉడికించడానికి "కథకుడనీ, కళాకారుడనీ" పిల్చేవాడు. ఒక రోజున సుఖదేవ్ "నువ్వు ఏమీ చేయలేకపోతే మానె. కొందరు సభ్యులయినా సంఘానికి ఇవ్వు" అన్నాడు. నేషనల్ స్కూల్లోని ఒకరిద్దరు ఉపాధ్యాయులూ, విద్యార్థులూ విప్లవసంఘ సభ్యత్వానికి పనికి వస్తారనిపించింది నాకు. వాళ్ళను సుఖదేవ్‌కు పరిచయం చేశాను. రహస్యోద్యమాల్లో ప్రతి పనినీ, ప్రతి విషయాన్ని తర్కంద్వారా వివరించడం సంభవం కాదు. అలా వివరాల్ని అడిగే వ్యక్తి సుఖదేవ్‌కు నచ్చడు. అలాంటి వ్యక్తి విప్లవోద్యమానికి 'పనికిరాడు' అనేస్తాడు సుఖదేవ్. ఉదాహరణకు ఒక విషయం చెప్తాను. సుఖదేవ్, క్రొత్తమిత్రుడికి అడ్రసు వ్రాసి, స్టాంపులు అతికించిన ఒక కవరును ఇస్తాడు. లాహోర్ కంటోన్మెంట్ రైల్వేస్టేషనుకు సైకిల్ మీద వెళ్ళి లాహోరువైపు వచ్చే మైల్ పోస్టులో ఆ కవరును వేయమని చెప్తాడు. కవరును తీసుకువెడుతూన్న మిత్రుడు దానిమీది అడ్రసును తప్పకుండా చూస్తాడు. కవరు లాహోరులోని ఒకానొక వ్యక్తికి సంబంధించినది అని తెల్సుకుంటాడు. "లాహోరుకు రావలసిన జాబును లాహోరులోనే పోస్టు చేయవచ్చు. లేదా వ్యక్తిగతంగా తీసుకువెళ్ళి ఇవ్వచ్చు, అంతేగానీ, కంటోన్మెంట్ వరకూ సైకిల్‌మీద వెళ్ళి అక్కడ మైల్‌పోస్టులో వేయవలసిన పని ఏమిటి?" అన్న ప్రశ్న కవరు తీసుకువెడుతూన్న మిత్రుడి మనస్సుల్లో ఉదయించడం సహజం. కానీ అలాంటి ప్రశ్న ఉదయించిందా, ఇంక 'ఇతడు విప్లవోద్యమానికి పనికిరాడు' అనేస్తాడు సుఖదేవ్. సుఖదేవ్‌కు సిద్ధాంత చర్చలు అంతగా నచ్చవు. కానీ, సిద్ధాంతరీత్యా ఉద్యమంపట్ల సానుభూతి కలగనంతవరకూ పైచెప్పినలాంటి శ్రమ సాధ్యమైన పనులను నిర్వహించడానికి ఎవరు సిద్ధపడతారు ?

సుఖదేవ్ అలా ప్రవర్తించడానికీ ఓ కారణం వుంది. 'ఏదైనా ఓ గొప్ప కార్యాన్ని నిర్వహించాలని సంఘం అనుకుంటున్నది. మరి ఆ పనిని ముందుగానే నలుగురికీ తెలియపరచడం, లేక ఆ కార్యాన్ని నిర్వహించే విధానాన్ని గురించి నలుగురితో చర్చించడం ప్రమాదకరం కదా ? కనుక నాయకుని ఆజ్ఞ మేరకు బాంబులూ, పిస్తోళ్ళూ తీసుకుని, సమయం వచ్చినప్పుడు, వెనుకంజ వేయకుండా - పోరాడటానికి సిద్ధపడేవాళ్ళు కావాలి. ఇలాంటి సైనిక శాసన ప్రవృత్తిని అతడు జయచంద్రగారిని చూసి అలవరచుకుని వుంటాడు. కాక అతడి అతి ప్రవర్తన కారణంగానైనా వచ్చి వుంటుంది. జయచంద్రగారు ప్రమాదకరమైన ఏ పనిలోనూ తను స్వయంగా పాల్గొన లేదు. ఐతే, తను ఏదైనా ఆజ్ఞ యిస్తే సంఘ

సభ్యులు ఎందుకు ? ఏమిటి ? అని ప్రశ్నించరాదు. అలా ప్రశ్నించిన కార్యకర్త విప్లవోద్యమానికి పనికిరాడని నిర్ణయించేవారు.

విప్లవ కార్యక్రమాల్లో రాజకీయ హత్యలు, దోపిడీలు - వీటిని 'యాక్షన్' అంటాము. ఎవరు సాహసాన్ని ప్రదర్శించి నిలబడగలరో, ఎవరు నిలబడలేరో ముందుగా తెల్సుకోవడం కష్టం. 'యాక్షన్' సమయంలో మిత్రులెవరూ జారిపోకుండా ధైర్యంగా నిలబడగలగడం అవసరం. విప్లవ సంఘానికి నాయకుడి హోదాలో కార్యక్రమాలను నేను నడిపిన రోజుల్లోనూ, సమయానికి జారిపోయే మిత్రులవల్ల చాలా ఇరకాటంలో పడ్డాను.

నేషనల్ స్కూలు బోర్డింగ్‌లోని కొందరి పేర్లను నేను సుఖదేవ్‌కు చెప్పాను. వాళ్ళ ధైర్య, సాహసాలను పరీక్షించడం అవసరం అనుకున్నాను. అందుకో గమ్మత్తు చేశాను. ఆ రోజుల్లో నేనూ బోర్డింగ్‌లోనే వుంటూ వుండేవాణ్ణి. ఒకరోజు రాత్రి బోర్డింగ్ యొక్క రెండు రెండంతస్తుల భవనాలకూ మధ్య, ఒక అంతస్తు మేడ గోడకు, పడుకోవడానికి ముందే నిచ్చెనను ఒకదాన్ని ఆనించి పెట్టాను. పడుకోబోయేప్పుడు తెల్ల చొక్కా లాగూ వేసుకున్నాను. సగం రాత్రివేళ లేచి ఖాకీ చొక్కా, లాగూ వేసుకున్నాను. అలా గుడ్డలు మార్చుకుని రెండంతస్తుల భవనంమీద నుండి ఒక అంతస్తు మేడ మీదకు దూకాను. అదేమంత పెద్ద కష్టమైన పనికాదు. ఆ మేడ క్రింద మెల్లాలో బోర్డింగ్ విద్యార్థులూ, ఉపాధ్యాయులూ పడుకుని నిద్రపోతున్నారు. నేను మేడమీద నుండి కింద నిద్రపోతూన్న వాళ్ళమీదకు రాళ్ళు విసరసాగాను.

అందరూ మేల్కొన్నారు. "దొంగ, దొంగ" అని అరవసాగారు. వాళ్ళల్లో కొందరు భయపడి కేకలు పెట్టారు. కొందరు బెదిరించారు. "వస్తున్నాం వుండు" అన్నారు.

మేల్కొన్నవారికి కనబడడానికి ఇంకొక్క రెండు క్షణాలు అక్కడే వున్నాను. తరువాత అవతలివైపున గోడకు ఆనించివున్న నిచ్చెన మీదుగా కిందకు దిగి, నిచ్చెన లాగివేశాను. నన్ను పట్టుకోవడానికి రెండంతస్తుల భవనంమీద నుండి దూకిన వాళ్ళు విస్తుపోయారు. నిచ్చెన లేకుండా క్రిందకు ఎలా దిగుతారు. నేను క్రింద నుండి మళ్ళీ రాళ్లు విసరడానికి సిద్ధపడ్డాను.

మేడ మీదకు వచ్చిన వాళ్ళల్లో ముగ్గురు వ్యక్తులు సాహసించారు. నన్ను పట్టుకోవడానికి క్రిందకుదూకారు. నా వెంట పడ్డారు. వాళ్ళు నావెంట పడగానే మాట్లాడేశాను. నా స్వరాన్ని పోల్చుకున్నారు. నన్ను గుర్తుపట్టారు. సాహసించి క్రిందకు దూకిన ముగ్గుర్లో ఒకరు విద్యార్థి జయగోపాల్. మిగిలిన ఇద్దరూ ఉపాధ్యాయులు - మాష్టర్ మోహర్ చంద్, చిరంజీలాల్ ! చిరంజీలాల్ సైన్సు మాష్టరు. సాహసి అయినప్పటికీ ప్రతి విషయాన్ని తర్కంద్వారా నిర్ణయించాలంటాడు. కనుక సుఖదేవ్ పరీక్షలో అతడు అనుత్తీర్ణుడయ్యాడు. మాష్టర్ మోహర్‌చంద్ కూడా సాహసికుడే - అయితే, చాలా గంభీరమైన వ్యక్తి; ఇతర బాధ్యతల్ని తెంపుకోలేని పరిస్థితి. ఇక మిగిలింది జయగోపాల్.

జయగోపాల్ సంవత్సరన్నరపాటు ఏ మాత్రం తర్కించకుండా, ఆజ్ఞానువర్తి ఐన సైనికుడిలా విప్లవ సంఘ ఆజ్ఞల్ని శిరసావహించాడు. అలా వుండగలగడం మరొకరి వల్లకాదేమో అనుకుంటున్నాను; భగత్‌సింగ్, సుఖదేవ్ ఇద్దరూ 'జాతిరత్నం' అనేవారు అతణ్ణి జయగోపాల్ అరెస్టయ్యాక ప్రభుత్వ సాక్షి అయ్యాడని విని నేనెంతో బాధపడ్డాను. ముఖ్యం అతడు నా శిష్యుడని ప్రతీతి; అతడు అప్రూవర్ అయ్యాడంటేనే నాకు ఎంతో తలవంపు అనిపించింది; ప్రభుత్వ సాక్షిగా మారినందుకు అతణ్ణి కాల్చేయాలని కూడా నిర్ణయించాము. భుసావల్‌లో అతడిని కాల్చడమూ జరిగింది. ఐతే, దెబ్బ తప్పించుకున్నాడు. కానీ, ఒకటి మాత్రం నిజం; సుఖదేవ్ గనక ప్రభుత్వానికి లొంగిపోకపోతే, తన పనులను అంగీకరించి - రహస్యాలను చెప్పకపోతే, జయగోపాల్ ఎన్నటికీ అలా ప్రభుత్వసాక్షి

అయ్యేవాడు కాదు. సుఖదేవ్ లొంగిపోయి కూడా ప్రాణభిక్షను వేడుకోలేదు, అది అతడి అతి ప్రవర్తనకు, మొండితనానికి నిదర్శనం. జయగోపాల్ ప్రభుత్వసాక్షిగా మారాడు. ప్రతిఫలం రూపంలో ప్రాణభిక్షను వేడుకున్నాడు.

దాదాపుగా ఆ రోజుల్లోనే నా రెండవ శిష్యుడిగా ప్రసిద్ధినందిన ఇంద్రపాల్‌తో పరిచయం అయింది. విప్లవ సంఘంలో ఇంద్రపాల్ చాలా అద్భుతమైన పనులూ, చాలా విచిత్రమైన పనులూ చేశాడు. మా పరిచయం కూడా విచిత్రమైన స్థితిలోనే జరిగింది. భగత్‌సింగ్ లాహోరు నుండి ఢిల్లీ వెళ్ళిపోయాడు. నేను నా మకాం కిషన్‌సింగ్‌గారి ఇన్స్యూరెన్సు కంపెనీ నుండి 'హిందూసంగఠన్' అనే ఉర్దూ వారపత్రిక కార్యాలయానికి మార్చాను ఆ పత్రిక కొత్తగా ప్రారంభం అయింది. 'హిందూసంగఠన్' పత్రికను భాయీ పరమానంద్ గారు ప్రచురిస్తున్నారు. దాని ఎడిటర్ కృష్ణదాస్ భల్లా. వీరిని నేను లోగడే ఎరుగుదును. ఫిరోజ్‌పూర్ కాంగ్రెసు కార్యాలయంలో వీరికీ నాకూ పరిచయం ఏర్పడ్డది. రెండు సంవత్సరాల క్రితం వీరు నేషనల్ కాలేజీకి అధ్యాపకులుగానూ వచ్చారు. భాయీ పరమానంద్‌గారూ, కృష్ణదాస్‌భల్లాగారు - క్రమంగా హిందూ మతాభిమానులుగా మారిపోయారు. వీరికి నామీద చాలా అభిమానం. నన్ను 'హిందూసంగఠన్' కార్యాలయంలోకి వచ్చి వుండమన్నారు.

'హిందూసంగఠన్' వారపత్రిక ఆదర్శం ముస్లిములను ద్వేషించడం. ముస్లిములను లాలించి, ముఖప్రీతితో వ్యవహరించే కాంగ్రెసును విమర్శించడం. ఆ పత్రిక హిందువులకు ఇంగ్లీషువారి కంటే ముస్లిములే శత్రువులు అంటుంది. హిందువులు ఇంగ్లీషువారిని మంచి చేసుకోవాలనీ, లేకపోతే ఇంగ్లీషువారు ముస్లిములను చేరదీసి, వారికే ఉద్యోగాలిస్తారనీ అంటుంది. అప్పుడు మధ్యతరగతి హిందువులకు ఘోరమైన ఆర్థిక హాని సంభవిస్తుందని వాపోతుంది. 'హిందూసంగఠన్' తన ఆదర్శాన్ని ఆచరణలో పెట్టడానికి హిందూ యువకుల్లో వ్యాయామ ప్రచారాన్ని చేస్తుంది. హిందూ యువకులకు పరీమహల్లో దండాలు, బస్కీలూ, కర్రసాము నేర్పడం - దాని కార్యక్రమాల్లో ఒకటి ! నేను వ్యాయామాన్ని నేషనల్ కాలేజీలో వుండగానే అభ్యాసం చేసుకున్నాను ! హిందూ సంగఠన్ తరపున యువకులకు కుస్తీపట్లు - అవీ నేర్పుతూండేవాణ్ణి ! పత్రికకు వ్యాసాలు కూడా రాసి ఇచ్చేవాణ్ణి ! నేను హిందీ లిపిలో వ్యాసాల్ని రాసేవాణ్ణి, అయితే, భాష ఉర్దూ మిశ్రితంగా వుండేది ఆ వ్యాసాల్ని కేవలం లిపి మార్చుకుని వాళ్ళు తమ పత్రికలో అచ్చు వేసుకునేవారు. నేను నా వ్యాసాల్లో హిందూ జాతీయతకు ముఖ్య శత్రువు ఇంగ్లీషువారనే రాసేవాణ్ణి ! నా పేరు మీదా రాస్తూండేవాణ్ణి. ఒక్కోప్పుడు మారుపేరుతోనూ రాసేవాణ్ణి! తమ ఆదర్శానికి వ్యతిరేకమయినప్పటికీ నా వ్యాసాల్ని ప్రచురించే అవకాశం కృష్ణదాసుగారు ఇచ్చారు. వారినప్పుడు 'కృష్ణజీ' అని పిల్చేవారు అందరు !

## ఇంద్రపాల్ :

'హిందూసంగఠన్' ఉర్దూ వారపత్రిక ! దాన్ని రాయడానికి హిందూ వ్రాయసగాడు అవసరం. ఆ పత్రిక వ్రాయసగాడు మంగతరాం ! అతడు సన్నగా, చామనచాయ రంగులో వుండేవాడు. విశాలమైన నుదురు తీక్షమైన చూపులు ! చొక్కా లుంగీ, తలగుడ్డ చుట్టుకుని కార్యాలయానికి వచ్చేవాడు !

మంగతరాం కాంగడా జిల్లాకు చెందినవాడని తెలిశాక, మా పరిచయం మిత్రత్వంగా మారి ప్రగాఢమైంది ! అతడు వర్నాక్యులర్ మిడిల్ ప్యాసయ్యాడు. బ్రాహ్మణుడు : ఉన్నతమైన విద్యా గంధం లేనివాడన్న ఉద్దేశ్యంతో, అతడితో నేను రాజకీయల్ని గురించి మాట్లాడేవాణ్ణి కాదు. అదీకాక, బ్రాహ్మణుడు కావడం వల్ల ఛాందస భావాలు కలవాడు గావున అనుకునేవాణ్ణి ! కానీ కృష్ణదాసుగారు, నేనూ సాంఘిక రాజకీయ విషయాల్ని గురించి వాదించుకునేప్పుడు, మంగతరాం నా వాదనను

సమర్థించడం చూసి విస్తుపోయాను. ఐతే, ఇతడు ఛాందస భావాలు కలవాడుకాదన్న మాట !". అనుకున్నాను.

రాసేటప్పుడు ఆరుబయట కూచోవడం మంగతరాంకు ఇష్టం! "హిందూసంగరన కార్యాలయ భవనం రెండవ అంతస్తుపైన బెంచీలాంటి అరుగు ఒకటి వుంది. దానిమీద కూచుని ఉదయం సాయంకాలం రాస్తుండేవాడు. ప్రొద్దుక్రుంకిం తరువాత, మధ్యాహ్న సమయాల్లో ఎండ ఎక్కువగా వున్నప్పుడు- లోపలికి వచ్చేవాడు; చీకటిపడ్డ తరువాత కూడా కరెంటు లైటు సాయంతో రాయవచ్చును. కానీ, అతడు అలా రాసేవాడు కాదు. ప్రొద్దుక్రుంకంగానే వెళ్ళిపోయేవాడు.

ఒకరోజు రాత్రి బాగా పొద్దుపోయాక, నేను ఎందుకో మేడ మీదకు వెళ్ళాను. మంగతరాం ఇంకా ఆ అరుగు మీదే కూచుని వున్నాడు. చీకటి, మంచు విస్తారంగా కురుస్తోంది !

"అరేయి, మంగతూ ! ఇంకా అక్కడే కూచున్నావేరా ? చీకట్లో ఏం రాస్తున్నావ్ ? పైగా మంచు కూడా కురుస్తోందిగా ?లోపలికి రాకూడదు ?' అని కేకవేశాను.

"ఆఁ ! ఊరకనే కూచున్నాను" అన్నాడు అతడు. నేనూ అంతగా పట్టించుకోకుండా , ఏదో పని వుండి బయటకు వెళ్ళిపోయాను. తిరిగి వచ్చేసరికి పదకొండు, పదకొండున్నర అయింది. మంగతరాం ఇంకా అలాగే మంచు లోకూచుని వున్నాడు. "అదేమిట్రా, అలా మంచులో కూచు న్నావ్ ?" అనడిగాను ఆశ్చర్యంగా .

"ఆరుబయట హాయిగా వుంది. కూచున్నాను" అన్నాడు మంగతరాం.

నేను పరిహాసంగా "అరే, అడుక్కుతినేవాడా ? దేన్ని గురించిరా తపస్సు చేస్తున్నావ్ ? ఏం వరం కావాలేమిటి ?" అన్నాను.

నేనతణ్ణి 'అడుక్కుతినేవాడా' అనిగానీ మంగతూ అనిగానీ పిల్చేవాణ్ని; అతడు నన్ను 'పొగాకు అమ్ముకునేవాడా' అని పిల్చేవాడు. కాంగడా జిల్లాలోని సాధారణ కుటుంబీకులైన ఖత్రీయువకులు, బజార్ల వెంట తిరిగి సరుకులు అమ్ముకుంటూ వుంటారు. సరుకుల్తో నిండిన పెట్టె నొకదాన్ని వీపున కట్టుకుని తిరుగుతారు. వాళ్ళు పొగాకును తప్పకుండా అమ్ముతుంటారు. మరి నేను ఖత్రీకులానికి చెందినవాడిని కావడం వల్ల అలా అనేవాడు. నేను 'అడుక్కుతినేవాడా' అనడానికి కారణమూ విదితమే। మంగతరాం బ్రాహ్మణుడు !

దగ్గరకు వెళ్ళి నేనతడి వంటి మీద చెయ్యి వేశాను. జ్వరం. అతడి వళ్ళు వేగిపోతుంది. లోపలకు లాక్కు వచ్చి నాపడక మీద పడుకోబెట్టి దుప్పటి కప్పాను. బజారుకు వెళ్ళి వేడిపాలు తెచ్చి తాగించాను. మా కాంగడా ప్రాంతపు పల్లెటి భాషలో "నీకు జ్వరంగా వుంటే ముందే ఎందుకు చెప్పలేదు నాకు ? ఈ విధంగా మంచులో కూచుని ఎందుకు ప్రాణాలు తీసుకుంటున్నావు ? నీకు వచ్చిన బాధ ఏమిటి ? నీకు నేను ఐనవాణ్ణి కాననుకో ! కాకపోయినా - నీజిల్లావాణ్ని, నాతో చెప్పకూడదా ?" అనడిగాను?

"నాకేమీ బాధ లేదు " అన్నాడతడు. కృష్ణదాసుగారి నడిగి ఒక కంబళి తెచ్చి కప్పాను. ఆ రాత్రికి నేను క్రింద పడుకున్నాను. నా పడకను అతడికిచ్చాను. అతడికి కొంత సేవ చేశాను. డాక్టరు దగ్గరకు వెడదాం అన్నాను. అతడు వద్దన్నాడు. అప్పటికి జ్వరం తగ్గింది. ఐనా, చాలా మౌనంగా, గంభీరంగా ఉండిపోయాడు అతడు. ఇంక నేనూ అతణ్ణి గురించి ఎక్కువగా పట్టించుకోలేదు.

రెండు రోజుల తరువాత అతడే ప్రస్తావించాడు. "నువ్వు బి.ఎ. చదివినవాడివనుకున్నాను; కానీ, ఒట్టి మూర్ఖుడివి, లేదా సర్వసంగపరిత్యాగివి ."అన్నాడు.

అతడి ఉద్దేశ్యం నాకు అర్థం కాలేదు "ఎందుకనీ"? అడిగాను.

"మొన్న జరిగింది జ్ఞాపకం వుందా ?" అని ప్రశ్నించాడు మంగతరాం.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది - వారం రోజుల క్రితం ఒకమాటు అతడు మధ్యాహ్నం పన్నెండు గంటలప్పుడు, చిటపటలాడే ఎండలో కూచుని రాస్తున్నాడు. మొదట ఆశ్చర్యపడ్డాను. తీరా చూస్తే ఎదురుగా, మేడ కిటికీలో ఓ అమ్మాయి కూచుని వుంది. ఆ షోడశి, మంగతూ - ఇద్దరూ చూపులు కలుపుకుంటున్నారు. నేను పరిహాసంగా అతణ్ని కోప్పడ్డాను "ఏరా ! వంటికి నీరు పట్టిందా ఏంటి? తడిపడాల్నా ......?" అన్నాను.

పై సంఘటనను జ్ఞాపకం చేస్తూ, తరువాత జరిగిన కథని చెప్పుకు వచ్చాడు..... !

అలా చాలా రోజులుగా మంగతరాం, ఆ అమ్మాయి చూపుల తూపులకు గురి అవుతున్నారు. మొదట కొన్నాళ్ళ పాటు ఆ అమ్మాయి మంగతరాం ను చూసి ధుపుక్కున వుమ్మివేసినట్లు సంజ్ఞ ద్వారా తెలియపరుస్తూ వచ్చింది. అలాగయినా ఇతడు వదిలిపోతాడేమో బతికిపోవచ్చునని ఆ అమ్మాయి వుద్దేశ్యం ! అయితే, ఆ అమ్మాయి సంజ్ఞ వుమ్మి వేయడానికి ఉద్దేశించబడ్డదో ముద్దు పెట్టుకోవడానికి ఉద్దేశింపబడ్డదో - అర్థం కాలేదు మంగతరాంకు. అతడు మరికొంచెం సాహసంతో ప్రణయ చేష్టల్ని సాగిస్తున్నాడు. చివరకు ఆ అమ్మాయి విసిగి, ఒక కాగితం మడతలో చిన్న కంకర రాయి పెట్టి మంగతరాం దగ్గరకు విసిరింది. అతడు దడదడకొట్టుకునే హృదయంతో , ఆ కాగితాన్ని చేతిలోకి తీసుకు విప్పి చదివాడు. ఇలా రాసి వుంది ... "ఛి.......ఛి....... నా వంక అలా చూడకు ! నీ నుంచి నాకు చచ్చిన చావు అవుతూన్నది. నీకు అక్కాచెల్లెళ్లు లేరా ?"

మంగతరాం సమాధానం ఇవ్వడం కష్టం ! ఆ అమ్మాయి ఒంటరిగా మేడ మీద వున్న సమయాన్ని కనిపెట్టి సమాధానాన్ని రాసిపడేశాడు. అతడి సమాధానం ఇది "నేనేమి ఉబుసుపోకకు చూడడం లేదు ! నేను నిన్ను హృదయం అంతటితోటి ప్రేమిస్తున్నాను. కనీసం నువ్వు నాకు రోజుకు ఒక్కసారయినా కనుపించి వెళ్ళు ! నువ్వు కనుపించని రోజున నేను నిద్రాహారాల్ని మాని ఇక్కడే కూర్చుని వుంటాను !" అని రాశాడు. క్రింద "నిజమైన ప్రేమికుడు' అని సంతకం పెట్టాడు.

కొద్దిరోజులు సందిగ్ధంలో పడ్డారు. తరువాత ఇద్దరూ ఒక నిర్ణయానికి వచ్చారు. 'ఒకరిని మరొకరు చూసుకునే పవిత్రప్రేమకు అభ్యంతరం వుండరాదు' అనుకున్నారు. అ అమ్మాయి పేరు 'విలాయత్ !' ప్రణయోద్వేగంలో ఆ అమ్మాయి తన పేరు కూడా చెప్పేసింది !

జ్వరం పడడానికి ముందు రోజు సాయంత్రం 'విలాయత్' బాధామయ హృదయంతో ఒక జాబు రాసిందతడికి ! ఆ జాబులో, తల్లిదండ్రులకు అనుమానం కలిగిందనీ, ఇకమీదట ఇలా కిటికి దగ్గరకు వచ్చి నిలబడలేననీ రాసింది ! చివరకు ఇలా రాసింది. 'నా కోసం అలా కూర్చోవద్దు ! నేను నిన్ను సోదరుడిగా ప్రేమిస్తున్నాను. హిందువులు సోదరిగా భావించిన స్త్రీ గౌరవాన్ని కాపాడడానికి ప్రాణాన్ని కూడా ఇస్తారని నేను పుస్తకాల్లో చదివాను. నువ్వూ నా పట్ల అలాగే వ్యవహరిస్తావని ఆశిస్తున్నాను.'

మరుసటి రోజుల్లా ఆమె జాబుకు సమాధానం ఇవ్వడానికి మంగతరాం ఎండలో కూచుని ఎదుటి మేడ వంక చూస్తూ గడిపాడు. పగలంతా అన్న పానాదుల్ని మాని కార్తీకమాసపు చిటపట్లాడే ఎండలో కూచున్నాడు. అయినా, "విలాయత్" కనుపించలేదు. కనీసం కిటికీ దగ్గరకయినా రాలేదు. ఆ రోజు ఆదివారం అనుకుంటాను. అందరూ ఇంట్లో వుండిపోయారు. కిటికీ దగ్గరకు రావడానికి కూడాఅవకాశం దొరకలేదేమో !

ఆ అమ్మాయికి మంగతరాం - నువ్వు నన్ను సోదరుడిగా భావిస్తే నేనూ నిన్ను సోదరిగా భావిస్తాను. సోదరి కోసం ఎంతటి త్యాగాన్నయినా చేయడానికి నేను సిద్ధంగా వున్నాను ! అని

తెలియపరచాలనుకున్నాడు. పైగా, అతడు దారుణమైన మానసిక వ్యధను అనుభవిస్తున్నాడు. తనను సోదరుడిగా భావించిన స్త్రీని ప్రేమించానే అని బాధపడుతూన్నాడు !

అతడి కథనంతా విని నేనిలా అన్నాను "నువ్వు నిజాయితీకలవాడివి ! పట్టుదల కలవాడివి! నీ జీవితాన్ని ఇలా స్వల్పమైన విషయాల కోసం పాడుచేసుకోవడం తగదు ! ఆమె నిజంగా నిన్ను సోదరుడిగా చూస్తోన్నదనడానికి నిదర్శనం ఏంటి ? నిన్ను ప్రేమిస్తూనే పై మాటకు సోదరుడు అన్నదేమో ? ఏమైనా కానీ ఇలాంటి విషయాల కోసం జీవితాన్ని బలిపెట్టుకోవడం తప్పు."

మంగతరాం నేను చెప్పిందంతా మౌనంగా విన్నాడు. అప్పటికే అతడికి నా ఆదర్శాన్ని గురించి, కార్యకలాపాల్ని గురించి, చూచాయగా తెల్సింది; నా మీద అతడి హృదయంలో శ్రద్ధాసక్తులు ఏర్పడ్డాయి; మానసికమైన వేదననూ, బాధను మాన్పుకోవడానికి ప్రాయశ్చిత్తమా అన్నట్టు తన గత జీవితాన్నంతా నాకు చెప్పాడు. భవిష్యత్తులో జీవిత మార్గాన్ని మార్చుకుంటానని ప్రతినపూనాడు.

అతడు నేర్పరి ఐన వ్రాయసగాడు. పత్రికల్లో పనే కాకుండా, పోస్టర్లు కూడా రాస్తుండేవాడు. నాకు అతడు పరిచయం అయ్యాక హిందీ అక్షరాలను నేర్చాను. 'హిందూసంగఠన్' లోని కొన్ని ప్రకటనలను హిందీలోనే వేస్తూండేవారు. అతడు హిందీ అక్షరాలను నేర్చుకోవడంతో , విలువ బాగా పెరిగింది. ఆ చౌక రోజుల్లో అతడు వారానికి పాతికరూపాయలు సంపాయించేవాడు. ఇతర పాటకజనంతో సాంగత్యం ఏర్పడడం వల్ల బాగా తాగేవాడు. వేశ్యాగృహాలకు వెడుతూండేవాడు;

అప్పటి నుండి మేమిద్దరం తరచు కల్సుకుంటూ వుండేవాళ్ళం ! అతడు నాకు ఒకరకంగా ప్రాణ స్నేహితుడయ్యాడు. మరో రకంగా నాకు భక్తుడయ్యాడు; అతడు నా మీద భక్తి భావాన్ని ప్రదర్శించడానికి అవసరమైన గొప్పతనం నాలో లేదని నిర్వివాదంగా చెప్పవచ్చును ! ఐతే, తన మీద తనకే ఘోరమైన నిరాశా, నిస్పృహా, ద్వేషం - కల అతడికి నేను మంచివాడిగా, భక్తిని ప్రదర్శించదగినవాడిగా కనుపించి వుంటాను ! ఇతరులకు, దేశానికి సేవ చేయడం వల్ల చాలా ఆనందం లభిస్తుందని అతడికి చెప్పాను. ఆదర్శం కోసం నవ్వుతూ ప్రాణాల్ని త్యజించిన, మహాత్యాగులయిన విప్లవకారుల కథల్ని ఎన్నింటినో చెప్పాను అతడికి !

మంగతరాం జీవితం పూర్తిగా మారిపోయింది. వెనకటి అలవాట్లన్నీ మానేశాడు. నేను అప్పుడు సిగరెట్లు కాల్చేవాణ్ణి కాదు. అతడూ సిగరెట్లు కాల్చడం, సారాయి త్రాగడం మానేశాడు; అనవసరంగా అశ్లీలాల్ని మాట్లాడడమూ మానేశాడు. అతడికి 'యశ్‌పాల్' పేరు నచ్చింది. తన పేరూ మార్చుకున్నాడు మంగతరాం 'ఇంద్రపాల్' అయ్యాడు.

ఒకరోజు అతడు 'తను శారీరకంగా బాధను ఎంతవరకూ సహించగలడో' పరీక్షించి చూసుకోవాలనుకున్నాడు. కార్తికమాసం; దోమలు విపరీతంగా వుండే రోజులు; ఇంద్రపాల్ ఒకనాటి సాయంకాలం రావీనది వడ్డున గల వనంలోకి వెళ్ళాడు. మురుగు అధికంగా వుంది. నడుముల వరకూ పచ్చ గడ్డి పెరిగి వుంది. ఏ మాత్రం గడ్డి కదిలినా దోమలు మేఘసమూహంలా పైకిలేస్తున్నాయి; ఆ దోమలు కుడితే మనుషులే కాదు; పశువులు కూడా గిలగిల తన్నుకుంటాయి ! ఇంద్రపాల్ శరీరం మీది గుడ్డల్ని తీసి పారేశాడు. ఒక లంగోటి మాత్రం కట్టుకుని గడ్డిలోకి వెళ్ళికూచున్నాడు; దోమలు ఎంత కుట్టినా, తెల్లవారేవరకూ మనిషి కదలకుండా వుండాలి; అప్పుడు పరీక్షలో నెగ్గినట్టు; ఇంద్రపాల్ ఈ పరీక్షలో నూటికి నూరుపాళ్ళూ నెగ్గాడు. ఇలా శరీరాన్ని అనవసరంగా శ్రమ పెట్టుకోవడం వల్ల ఏమీ ప్రయోజనం వుండదని చెప్పాను. అయినా , అతడు వినిపించుకోలేదు. తన పరీక్షను కొనసాగించాడు. కష్టాల్ని సహించడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని అతడి వుద్దేశ్యం; ఇంద్రపాల్‌కు హిందీ చెప్పాను. ఇంగ్లీషు చదివించాలనుకున్నాను. కానీ ఇంగ్లీషు చదవడానికి నిరాకరించాడు.

"అనవసరనంగా సమయాన్ని పాడు చేసుకోవడం అవుతుంది;" అన్నాడు. నేనతడికి విప్లవకారుల జీవిత చరిత్రల్ని కొన్నింటిని చదవడానికి ఇచ్చాను. వాటితో పాటు స్వామీ వివేకానంద, స్వామీ రామతీర్థ-పుస్తకాలనూ కొన్నింటిని ఇచ్చాను. వివేకానంద, రామతీర్థ పుస్తకాలనతడు చాలా ఆసక్తిగా చదివాడు, విప్లవోద్యమాన్ని విస్తృత పరచడానికి నేనతడితో మాట్లాడాను. సభ్యుల్ని చేర్చడం విషయం గురించి మాట్లాడాను. అతడు స్పష్టంగా చెప్పాడు. "ఇతర్ల విషయం నేను చెప్పలేను. నావరకూ నేను సిద్ధం;" అన్నాడు.

మరొక రోజున ఇంద్రపాల్‌కు తన నిగ్రహశక్తిని పరీక్షించుకోవాలనిపించింది. ఒక అరసీసా కాపు సారాయిని తెచ్చుకు తాగాడు. జేబులో డబ్బులు వేసుకుని 'టిబ్బీ' బజారుకు వెళ్ళాడు: అందమైన, ఒకటవ నంబరు వేశ్య దగ్గరకు వెళ్ళాడు. రాత్రంతా తన దగ్గర వుండేటట్టు మాట్లాడుకున్నాడు. వేశ్య లుంగీ, చొక్కాతో తయారై వచ్చిన ఇంద్రపాల్ వంక ఆశ్చర్యంగా చూపింది. ఆ రాత్రికి పదిరూపాయలు అడిగింది. పదిరూపాయలు ఇచ్చాడు. గదిలోకి వెళ్ళి వేశ్య ప్రక్కన మంచం మీద పడుకున్నాడు. వేశ్య పదిరూపాయలు పుచ్చుకున్నది గదా ? తన కర్తవ్యాన్ని నిర్వహించడానికి రాత్రంతా సతమతం అయింది. ఇంద్రపాల్‌ను విచలితుణ్ణి చేయడానికి అనేక రకాలుగా ప్రయత్నించింది: కానీ సమాధి స్థితిలో వున్న మహాయోగిలా ఇంద్రపాల్ ఏ మాత్రం కదల్లేదు. కొంతసేపటికి వేశ్య అలసి నిద్రపోయింది. తెల్లవారుజామున మెళుకువ వచ్చినప్పుడు తిరిగి తన కర్తవ్యాన్ని నిర్వహించడానికి ప్రయత్నించింది. ఇంద్రపాల్ విశ్వామిత్రుడు కాదు, అప్సరసను చూసి పరాజితుడవడానికి ! చివరకు వేశ్య అడిగింది "మరి నువ్వు ఎందుకు వచ్చినట్టు ?"

ఇంద్రపాల్ తన నిగ్రహ శక్తిని పరీక్షించుకోవడానికి వచ్చానని నిజం చెప్పేశాడు.

వేశ్య చాలాసేపు మౌనంగా తలవంచుకు ఆలోచిస్తూ వుండిపోయింది "డబ్బు సమస్య లేదు, నువ్వు ఇక్కడికి రావాలనుకున్నప్పుడల్లా వచ్చేసెయ్యి ! నువ్విచ్చిన పదిరూపాయలు కూడా తీసుకు వెళ్ళు !" అన్నది.

తెల్లవారింతరువాత ఇంద్రపాల్ వెళ్ళిపోవడానికి సిద్ధం అయ్యాడు. వేశ్య నమస్కరించి "నా కోసం భగవంతుణ్ణి ప్రార్థించు !"అన్నది.

పై మొత్తం విషయాన్ని నాతో చెప్పి "దొంగముండ నన్ను ఏ బైరాగి కిందనో జమ కట్టేసింది !" అన్నాడు పకపక నవ్వుతూ ఇంద్రపాల్.

వేశ్య తనను బైరాగి అనుకున్నదని చెప్పి ఇంద్రపాల్ నవ్వాడు. వేశ్య యొక్క గుడ్డి నమ్మకాన్ని చూసి నవ్వడం బాగానే వుంది. కానీ, అతడు చేసింది ఏంటి ? శారీరకమైన శ్రమ ద్వారా ఆత్మోద్ధరణకు పూనుకోవడమూ హాస్యాస్పదమైన విషయం కదా ! ఉన్నతమైన విద్యాగంధం లేకుండా తార్కిక ప్రవృత్తిని అలవరచుకున్నప్పుడు అసందర్భాల్ని చేస్తూ వుంటాడు మనిషి !

కృష్ణదాసుగారికి 'హిందూసంగఠన్ ' లో పనిచేయడం తృప్తినీయలేదు. వారు అంతకంటె విస్తృతమైన ప్రాతిపదికమీద హిందూజాతికీ, మానవత్వానికీ సేవ చేయ్యాలనుకున్నారు. సన్యాసాన్ని స్వీకరించారు. వారు వెళ్ళిపోయాక నేనూ, ఇంద్రపాల్ కూడా అక్కణ్ణుండి డేరా ఎత్తేశాము !

రావల్‌పిండిలో ఇంద్రపాల్‌కు పని దొరుకుతుందని తెల్సింది. నేనూ అతణ్ణి అక్కడికి వెళ్ళమని సలహా ఇచ్చాను. "రావల్ పిండి సరిహద్దుల్లో వుంది. ఆయుధాలు సంపాయించడానికి వీలుగా వుంటుంది. నేనూ అప్పుడప్పుడూ వస్తుంటాను !" అని చెప్పాను అతడికి.

రావల్‌పిండిలో ఇంద్రపాల్ చాలా రోజులు వున్నాడు. సుఖదేవ్ - జయగోపాల్‌నూ, హంసరాజును కూడా అక్కడికి పంపాడు. ఉద్యమాన్ని నిర్మించడానికి ! ఐతే వీళ్ళకీ ఇంద్రపాల్‌కూ ఏ

విధమైన సంబంధమూ లేదు. ఒకరి గురించి మరొకరికి తెలియకుండా ఎవరి ప్రయత్నాల్లో వారు వున్నారు. ఇంద్రపాల్ ద్వారా రావల్పిండిలోని కొందరు వ్యక్తులు ఉద్యమంలోకి వచ్చారు. రెండవ లాహోరు కుట్రకేసులో వాళ్ళందరూ వున్నారు.

అప్పట్లో లాహోరు విప్లవ సంఘంలో కొంత సంచలనం కనిపిస్తొన్నది. భగత్‌సింగ్ కాన్పూర్ ఢిల్లీ - పట్నాలకు వెళ్ళి అక్కడి విప్లవకారుల్తో సంబంధాల్ని స్థిరపరుచుకుని వచ్చాడు. లాహోరు విప్లవ సంఘం ఏదన్నా ఒక ప్రభావోత్పాదకరమైన కార్యక్రమాన్ని చేపట్టాలని చూస్తున్నది. కాకోరీ కుట్రకేసులో అరెస్టయినవారిని జైళ్ళనుండి విడిపించడం ముఖ్య కార్యక్రమంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించడానికి పంజాబు నుండి కూడా కొందరు విప్లవకారులు వెడుతున్నారు. కొంత ధనాన్ని ప్రోగు చేసి పంపవల్సిన అవుసరం వుంది. కాకోరి కేసు అరెస్టుల కారణంగా యు.పి. విప్లవ సంఘం చాలా బలహీనపడిపోయింది. లాహోరు నుండి మనుషులూ, డబ్బూ లభిస్తేగాని - ఆ కార్యాక్రమాన్ని జయప్రదంగా నిర్వహించే అవకాశం లేదు. లాహోరు విప్లవ సంఘం జయచంద్ర విద్యాలంకార్ గారి చేతుల్లో వుంది. వారే మూలవిరాట్; అన్ని సంబంధాలూ వారి ద్వారానే; లాహోరు విప్లవ సంఘంలో సంచలనమైతే బాగానే వుంది. కానీ, ఏం జరగబోతోందో ఎవరికీ తెలియదు; ఈ నిష్క్రియతకూ, అలస్యానికీ భగవతీచరణ్ చాలా బాధపడుతున్నాడు ! త్వరలో ఏదో ఒకటి చేసేయాలని అతడి వుద్దేశ్యం ! అప్పుడప్పుడూ చాలా డబ్బు కూడా ఖర్చు పెట్టి వుండడం వల్ల, ఏమి జరుగని, జరుగడానికి వీల్లేని అయోమయస్థితికి విసిగిపోతూన్నాడు. "విప్లవ సంఘం ఏం చేస్తూంది? కార్యక్రమాలకు ఏవైనా అభ్యంతరాలు వుంటే - అవి ఏమిటి ? మొదలైన విషయాలు సభ్యులకు తెలియడం అవుసరం !"అంటాడు భగవతీభాయి . ఇది జయచంద్రగారికి గిట్టదు. చివరకు బాగా విసిగి "జయచంద్రగారు ఏ కార్యక్రమాన్నీ నడపరు. నడపడం వారికి చాతకాకపోతే, మేము మాకు చాతనయింది వేరుగా చేసుకుంటాం ! ఏమీ తెలియకుండా, ఏమీ చేయకుండా ఈ విధంగా కళ్ళు మూసుకు కూచోవడం మా వల్ల కాదు !" అని స్పష్టంగా అనేశాడు భగవతీభాయి.

జయచంద్ర విద్యాలంకార్‌గారికి, భగవతీచరణ్ వల్ల, తన స్థితికి ప్రమాదం వాటిల్లబోతోందన్న భయం కలగసాగింది. అలాంటి భయం కలగడానికి కారణం సుస్పష్టం ! రాజకీయంగా భగవతీచరణ్ పలుకుబడి పెరిగిపోతూన్నది. పంజాబ్‌లోని వెనకటి విప్లవకారుల్తోటీ అతడికి పరిచయాలు వున్నాయి. పైగా 1922లో సత్యాగ్రహోద్యమం ఆగిపోయాక, ఈ ఉద్యమంవల్ల ప్రయోజనం లేదని గ్రహించి, రహస్యంగా స్థాపించబడిన 'కమ్యూనిస్టు పార్టీ'తో సంబంధాలు పెట్టుకున్నాడు భగవతీచరణ్. 'కమ్యూనిస్టు పార్టీ అనడం వల్ల పాఠకులు పొరపాటుగా అర్థం చేసుకునే ప్రమాదం వుంది ! 1928 లో మీరట్ కుట్రకేసు జరిగినప్పటినుంచి వెలుగులోకి వచ్చి, దినదినమూ వ్యాప్తిచెందుతున్న భారత్ కమ్యూనిస్ట్ పార్టీకి, పైన చెప్పిన 'కమ్యూనిస్ట్ పార్టీ'కి ఎలాంటి సంబంధమూ లేదు ! కాక 1924 లో జరిగిన కాన్పూర్ కుట్రకేసుకు సంబంధించిన బోల్షవిక్ పార్టితోటీ దానికి సంబంధం లేదు. రష్యా విప్లవం జరిగాక, పంజాబులోని కొందరు సాహసికులు ఆఫ్ఘనిస్తాన్ మీదుగా రష్యా వెళ్ళారు. వాళ్ళల్లో కొందరు తిరిగి వచ్చి కమ్యూనిస్ట్ పార్టీని స్థాపించారు. రష్యా నుంచి కొంత డబ్బూ సాహిత్యం తెప్పించుకుని సామ్యవాద విప్లవం జరపడం వీరి వుద్దేశ్యం ! వీరికి కార్మిక కర్షకుల్తోగానీ, వారి ఉద్యమాల్తోగానీ బొత్తిగా సంబంధం లేదు. రష్యా నుండి, యూరప్ నుండి తమకు అందిన సాహిత్యాన్ని రహస్యంగా పంచుతుండేవారు ! ఉద్యమంలో ఓ క్రమమంటూ లేకపోవడం వల్ల వీరికి అందిన డబ్బూ పలామాలు అవుతూండేది ! భగవతీచరణ్ కమ్యూనిస్ట్ లమని చెప్పుకునే వీరితో కొన్నాళ్ళు కల్సిపనిచేశాడు. లాహోరులోని ఈ కమ్యూనిస్ట్‌పార్టీకి సంబంధించిన కార్యాకలాపాలన్నీ భగవతీబాయి పేరు మీదనే జరిగేవి. పెషావర్ నుండి డబ్బూ ,

సాహిత్యం కూడా భగవతీచరణ్ అడ్రసుకే వచ్చేవి. ఐతే ఈ కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాల్లో ఓ క్రమమంటూ లేకపోవడాన్ని గమనించిన భగవతీభాయి ఆ పార్టీతో తనకు వున్న సంబంధాలన్నింటినీ తెంచుకున్నాడు. తన అడ్రసుకు పోస్టు తెప్పించుకోవడానికీ వప్పుకోలేదు ! కమ్యూనిస్టులు అనబడే వీరికి భగవతీచరణ్ మీద గొంతు వరకూ కోపం వుండేది.

కాకోరీ కుట్రకేసులో నిందితులైన ఖైదీలను విడిపించడానికి లాహోరులో జయచంద్రగారు డబ్బు వసూలు చేస్తున్నారు. సుశీలాదీదీ అప్పుడు 'జాలంధర్ కన్యా మహావిద్యాలయం'లోపనిచేస్తున్నది. ఆమె భగవతీచరణ్ ఇంట్లోనే వుంటున్నది. జయచంద్రగారు ఖైదీలను విడిపించే కార్యక్రమం కోసం సుశీలాదీదీని డబ్బు అడిగారు. సుశీలాదీదీ దగ్గర ప్రస్తుతం డబ్బు లేదు. ఐతే, ఈ మంచి పనికి తనూ సాయం చెయ్యాలన్న ఉత్సాహం వుంది. ఆమె తన చేతులకు వున్న బంగారు గాజుల్ని చూపుతూ "నా దగ్గర ఇవి వున్నాయి. వీటిని అమ్మి, వచ్చిన డబ్బును తీసుకోండి !" అని అంటూ చేతి గాజుల్ని తీసి జయచంద్రగారి చేతికి ఇచ్చింది. వాటిని అమ్మితే దాదాపు రెండు వందల రూపాయలు రావచ్చును !

భగవతీచరణ్ ఆ గాజుల్ని అమ్మి సంఘానికి డబ్బు చెల్లించాలన్న నిర్ణయం జరిగింది. ఐతే, అతడు గాజుల్ని అమ్మడానికి సంకోచిస్తున్నాడు. అతడికి సుశీలాదీదీ మీద అమితమైన గౌరవమూ, శ్రద్ధాను ! తన చేతి మీదగా గాజుల్ని అమ్మడానికి బాధపడుతూన్నాడు. "గాజుల్ని అమ్మడం దేనికి? పోనీ, ఆ డబ్బు తనే సంఘానికి ఇచ్చేస్తే పోను గదా ? పైగా, ఈ కొద్ది మొత్తంతోనే. పని జరుగదు కదా? మిగిలిన డబ్బు ప్రోగుకాకపోతే ఏమి అవుతుంది ? ఈ డబ్బూ అటూ ఇటూ ఖర్చు అవుతుందేమో ? మిగిలింది ప్రోగుపడితే అప్పుడు వీటి విషయం ఆలోచించడం నయం కదా ?" అని ఆలోచిస్తున్నాడు భగవతీభాయి. రెండు మూడు రోజులు గడిచాయి.

ఈలోపే జయచంద్రగారు రెండు మూడుసార్లు డబ్బు కోసం మనిషిని పంపించారు ! చివరకు "గాజుల్ని అమ్మనవసరం లేదు. వాటిని తూయించి ధర కట్టిస్తే చాలు" అని కబురు పెట్టారు.

భగవతీభాయి "ఎందుకని?" ప్రశ్నించాడు.

సమాధానం ఇది "జయచంద్రగారి మేనకోడలికి పెండ్లి సంబంధం నిశ్చయం అయింది. ఈ గాజులు అమెకు పనికి వస్తాయి. తూయించి, ధర కట్టిస్తే పెళ్ళికూతురు తండ్రి ఆ డబ్బు కడతాడు. ఇలా చేయడం వల్ల సంఘానికి గాజుల డబ్బూ ముట్టుతుంది. జయచంద్రగారి మేనకోడలికి గాజులు చేయించే మజూరీ దక్కుతుంది !"

భగవతీభాయి ఇలా అన్నాడు "అలా వీలుపడదు. సుశీలాదీదీ గాజుల్ని అమ్మి వచ్చిన డబ్బును సంఘానికి కడదాం ! దాంతో పాటు జయచంద్రగారి కోడలి గాజులకు అయ్యే మొత్తాన్ని సంఘానికి కట్టవల్సిందే ! సుశీలాదీదీ గాజుల్లేకుండా వుండగలిగినప్పుడు జయచంద్రగారి మేనకోడలు ఎందుకు వుండలేదు ? విప్లవసంఘంపట్ల బాధ్యత సుశీలాదీదీ కంటె జయచంద్రగారికే ఎక్కువుగా వుంది !" అతడిలా వాదించడంతో జయచంద్రగారి జేబుకు ముప్పు రావడమే కాకుండా, వారి నిజాయితీని ప్రశ్నించినట్లయింది. భగవతీచరణ్ ఇలా అనడంలో ఏదో దురుద్దేశం వుందన్న భావాన్ని నలుగుర్లో కలిగించినప్పుడే, జయచంద్రగారి గౌరవ మర్యాదలు నిలబడతాయి ! ఇంకే వుంది ? భగవతీచరణ్ సి.ఐ.డి. అన్న అపవాదును, దుమారాన్ని లేవదీశారు జయచంద్రగారు ! అయనగారు పైన చెప్పిన గాజుల కథను ఎవరికీ చెప్పేవారు కాదు. దాన్ని కప్పి పెట్టి "నాకు చాలా విశ్వసనీయమైన చోటు నుండి వర్తమానం వచ్చింది. భగవతీచరణ్ సి.ఐ.డి. వెనక ఇతడు కమ్యూనిస్టుల్ని ఇలాగే మోసం చేశాడు !" అని చెప్పడం ప్రారంభించారు.

రహస్యోద్యమాల్లో ఏ విషయాన్నీ రచ్చకు ఈడ్చి, పరీక్షకు - పెట్టి సత్యాసత్యాల్ని తేల్చుకోవడానికి వీలుండదు గదా ? నమ్మకం మీద పనులు జరగవల్సిందే ! 'భగవతీచరణ్ సి.ఐ.డి. అని మీకెలా తెల్సింది ? ఎవరు చెప్పారు ?ఆధారం ఏమిటి ?' అని ప్రశ్నించడానికి వీల్లేదు. సి.ఐ.డి. అన్న అసత్య ప్రచారం పాకిపోయింది. అందరూ నమ్మారు. కొందరు తమ నిగూఢమైన అభిప్రాయాలను కూడా వెలిబుచ్చసాగారు. "ఔను మరి రాయ్‌సాహెబ్ కొడుకు సి.ఐ.డి. కాక మరేమవుతాడు ?" అనీ అన్నవాళ్ళు వున్నారు. ఒకతను స్పష్టంగా అనేశాడు. "భగవతీచరణ్ ఏ ఉద్యోగంలోనూ చేరకుండా, ఏ వ్యాపారాన్ని చేయకుండా వుండడానికి కారణం ఇదే ఐవుంటుంది ! రాయ్‌సాహెబ్ కొడుకు ! అతడు చేయదలచుకుంటే ఉద్యోగాలకు కొదువా ? కాకపోయినా సి.ఐ.డి. ఉద్యోగికి మరో ఉద్యోగం ఎందుకు? వ్యాపారం మాత్రం ఎందుకు ?" అని అన్నాడు.

పోనీ, భగవతీచరణ్ డబ్బు తగలేస్తూ విలాసంగా తిరిగే రకమైనా కాదు. అలాంటి రకమైనా అయితే జులాయిగా తిని తిరిగే రకం కావడంవల్ల ఉద్యోగ వ్యాపారాల్లో తల దూర్చడం లేదని నలుగురూ అనుకోవడానికైయినా అవకాశం వుంటుంది ! అతడు అలాంటివాడు కాదు. ఒక్క పైసా కూడా అనవసరంగా ఖర్చుపెట్టేవాడు కాదు. వినోదాలకు, విలాసాలకు అతడు చాలా దూరం ! ఎప్పుడూ తన గదిలో ఏకాంతంలో కూచుని ఏదో ఒకటి రాసుకుంటూనో, చదువుకుంటూనో వుండేవాడు. అతడిలోని సౌమ్యత, ఏకాంత ప్రియత, ఉద్యోగ విముఖత, క్రియాశీలత - ఇవన్నీ అతడు సి.ఐ.డి. ఉద్యోగి అన్న భావాన్ని స్థిరపరచడానికి తోడ్పడసాగాయి. అతడు రాజకీయాల్లో ఉత్సాహంగా పాల్గొనడానికి కారణాన్నీ వూహించారు. "ఉత్సాహవంతులైన కార్యకర్తలందరినీ ఒక్క మాటు పట్టించడానికి అతడిలా రాజకీయాల్లో పాల్గొంటున్నాడు !" అనేశారు. రానురానూ స్నేహితులు అతడితో మాట్లాడడానికే భయపడసాగారు. ఎక్కడయినా కనుపించినా ముఖం తప్పించేస్తున్నారు.

ఆ సంవత్సరం వేసంగి సెలవులు అయిపోయాయి. నేను లాహోరు వచ్చాను. ఉద్యోగంలో చేరడానికి ! నేషనల్ స్కూలు కూడా మూతపడ్డది. నా వుద్యోగమూ పోయింది. నేను నిరుద్యోగినయ్యాను. సుఖదేవ్, భగత్‌సింగ్ - ఇద్దరూ విప్లవ సంఘపు కార్యక్రమాల్లో పాల్గొన వల్సిందన్నారు. ఐతే విప్లవ కార్యక్రమాలేవీ జరగడం లేదు. సుఖదేవ్; భగత్‌సింగ్ కూడా ఏమీ చేయలేని స్థితిలో చేతులు కట్టుకు కూర్చున్నారు. అందుకు కారణం భగవతీచరణ్ సి.ఐ.డి. అన్న అనుమానం ! భగవతీభాయి సి.ఐ.డి. ఉద్యోగి అని అనుమానించాక, ఇంక వెనకటి పరిచయాల ఆధారంగా ఉద్యమం నడపడం సంభవం కాదు. మళ్ళీ మొదలెత్తి కొత్త వుద్యమాన్ని నిర్మించుకోవాలి ! అదీ కాకుండా నేషనల్ స్కూల్లో ఉద్యోగం వున్నన్నాళ్ళూ నేను విప్లవ కార్యక్రమాల్లో అంతగా పాల్గొనలేదు. ఆ ఉద్యోగం పోగానే విప్లవ కారుణ్ణయ్యానంటే, ఇందులో నా త్యాగబుద్ధి ఏముంది ? ఆ రోజుల్లో నేను పాల్గొనే ప్రతి రాజకీయ కార్యక్రమం ద్వారా గొప్ప త్యాగం చేశానన్న అహంకారాన్ని పూరించుకోడానికి అవసరం అయిన సంతృప్తిని కాంక్షించేవాణ్ణి !

లాహోరులో నాకు ఏ పత్రికాలయంలోనైనా పని దొరకవచ్చును. ఐతే నాకు ఉర్దూ లిపిరాదు. లాహోరు నుండి ఉర్దూ దిన పత్రికలు ఐదు వెలువడుతున్నాయి. దొరికితే వాటిల్లోనే ఉద్యోగం దొరకాలి; కానీ ఎలా ? ఉర్దూ లిపి రాదుగా ? 'ఆకాశవాణి ' అనే పత్రిక హిందీలో వెలువడుతూన్నది. ఆ పత్రిక సంస్థాపకులు భాయిపరమానంద్‌గారు. పరమానంద్‌గారు మత సంబంధమైన ఆదర్శాలు కలవారు. ఆకాశవాణి పత్రిక ఆదర్శమూ మతసంబంధమైనదే; కనుక, ఆ పత్రికలో నేను ఉద్యోగం చేయడం, ఇమడగలగడం - అసంభవం అయిన విషయం ! ఇకపోతే ఇంగ్లీషు దిన పత్రికలు రెండు మూడు వున్నాయి. ఐతే వాటిలో అప్పటికే చాలా మంది జీతాల్లేకుండా పనిచేర్చుకుంటున్నవారు ఉన్నారు.

ఆ రోజుల్లో భగత్‌సింగ్ చాలా అశాంతిగా వుండేవాడు. అతడికి అశాంతికి, రాజకీయంగానూ, పారివారికంగానూ - రెండు రకాల కారణాలు వున్నాయి. రాజకీయంగా అశాంతికి కారణం భగవతీచరణ్ సి.ఐ.డి. అన్న అపవాదు ! ఈ అపవాదు వల్ల ఎంతో కష్టపడి స్థాపించిన విప్లవ సంఘం ముక్కచెక్కలయి పోతున్నది. భగవతీచరణ్ లాంటి ముఖ్యమైన వ్యక్తి సి.ఐ.డి. ఉద్యోగి అయ్యాడంటే, దాని అర్థం ఏంటి ? ఇంతవరకూ మేమందరమూ ప్రభుత్వ ఏజంటు చేతుల్లో కీలు బొమ్మల్లా వుండిపోయామనేగా ? పైగా ఇలాంటిది జరగడం అసంభవం అనుకోవడానికి వీల్లేదు. రష్యా విప్లవ చరిత్రలో ఇలాంటి సంఘటనలు ఎన్నో చదివాము విప్లవ కారుల్ని పట్టుకోవడానికి సి.ఐ.డి.లు స్వయంగా విప్లవసంఘాల్ని స్థాపించిన వుదంతాలూ వున్నాయి ! అలాంటప్పుడు, ఒకవేళ భగవతీచరణ్ సి.ఐ.డి. ఉద్యోగి అయ్యాడంటే ఆశ్చర్యపడవల్సిన పని ఏముంది ? భగవతీచరణ్ సి.ఐ.డి. అన్న అపవాదు రహస్య విప్లవ సంఘంలోనూ, నౌజవాన్ భారత్ సభ సభ్యుల్లోనూ, కాంగ్రేసులో కూడా పాకిపోయింది. ప్రతివాళ్ళు "భగవతీచరణ్ సి.ఐ.డి. ఉద్యోగి అని చాలా నమ్మకమైన వారు చెప్పారు." అనేవాళ్ళు.

కాకోరీ కుట్రకేసు యుద్ధాయిలను విడిపించడానికి ఎలాంటి ప్రయత్నమూ చేయలేకపోయాం. అందుకుకారణం పంజాబునుండి యు.పి.కి ఎలాంటి సహాయమూ లభించకపోవడమే ! పంజాబు సహాయాన్ని అందించలేకపోవడానికి కారణం భగవతీచరణ్ సి.ఐ.డి. అన్న అపవాదు ! ఈ అపవాదు జయచంద్రగారి ద్వారా యు.,పి.లోనూ వ్యాపించింది ! పంజాబు విప్ల వ సంఘానికి జయచంద్రగారు నాయకులని యు.పి. విప్లవకారులకు తెల్సు. అలాంటప్పుడు ఈ తప్పుడు ప్రచారాన్ని ఎలా నమ్మకుండా వుంటారు ?

ఇకనప్పుడు, లాహోరులో కొత్తమిత్రుల్తో కొత్త ఆధారాల్తో విప్లవ సంఘాన్ని స్థాపించాలన్న ప్రయత్నాలు జరుగసాగాయి. ఈ కొత్త సంఘంలో భగవతీభాయికి ఎలాంటి స్థానమూ వుండదు సరికదా, అసలుదీని వునికే అతడికి తెలియకుండా వుండాలని మా వుద్దేశ్యం ! ఐతే, వచ్చిన చిక్కేమిటంటే, భగవతీచరణ్‌కు విప్లవ సంఘం యొక్క అనేకమైన రహస్యాలు తెల్సు ! విప్ల వకారుల్తో ఆత్మీయమైన పరిచయాలు వున్నాయి అతడికి. అలాంటప్పుడు అతడికి తెలియకుండా పంజాబులో ఏం చేయగలం? ఏమీ చేయలేము ! ఇటు జయచంద్రగారు స్పష్టంగా చెప్పేస్తున్నారు. "భగవతీచరణ్ వున్న వరకూ ఏ పనీ జరగడానికి వీల్లేదు. అతడు చాలా మోసగాడు !" అంటూన్నారు.

భగత్‌సింగ్ మానసికంగా చాలా బాధపడుతూన్నాడు. భగవతీచరణ్ మీద అతడికి విశ్వాసం వుంది. ఆత్మీయతా వుంది. మరో చెంప అతడి కారణంగానే విప్లవ సంఘపు కార్యక్రమాలు అన్నీ కుంటుపడుతున్నాయి. ఈ స్థితిని భరించలేకుండా వున్నాడు. ఏదయినా కార్యక్రమాన్ని నడుపుదామన్న ప్రస్తావనను తీసుకురాగానే జయచంద్రగారు "ఇస్సు.......భగవతీచరణ్‌కు తెలుస్తుంది. జాగ్రత్త!" అవేవారు. అంతటితో ఆ ప్రస్తావన ఆగిపోయేది ? భగత్‌సింగ్ వ్యక్తిగత మిత్రుత్వాన్ని తీసి అవతల పెట్టడానికి సిద్ధంగా వున్నాడు. భగవతీచరణ్‌ని కాల్చిపారేయడం వల్ల, విప్లవ సంస్థకార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగుతాయి అనుకుంటే, భగత్‌సింగ్ అందుకుసిద్ధమే, నన్ను కల్సుకున్నప్పుడల్లా అతడు ఈ విషయాన్ని గురించే మాట్లాడుతూండేవాడు. ఒక్కోప్పుడు విపరీతమైన మానసిక వేదనతో "నిజంగా ఆదౌర్భగ్యుడు సి.ఐ.డి. ఉద్యోగేనంటావా ?"అనేవాడు.

నేనూ దుర్గాబాభీ ఒకేమాటు'ప్రభాకర్' పరీక్ష వ్రాశాము. కనుక వాళ్ళ ఇంటికి నేనూ తరచువెళ్ళి వస్తూండేవాణ్ణి ! "మాటిమాటికి వాళ్ళింటికి వెడుతూంటావు కదా ? కడుపుకయితే కమ్మగా పట్టిస్తావు, ఈ మాత్రం రహస్యాన్ని తెల్సుకోలేవా , అక్కడ ?" అనేవాడు నన్ను ఉదేశించి భగత్‌సింగ్.

"రహస్యం తెల్సుకోవడానికి ప్రత్నించాను ఐనా, ఏ ఆధారమూ దొరకలేదు !" అని చెప్పే వాణ్ణి !

భగత్‌సింగ్ నా కండ్లల్లోకి సూటిగా చూస్తూ, హృదయంలో నుండి రహస్యాన్ని లాగుతున్నట్లు "ఐతే, అతడు సి.ఐ.డి. కాదంటావా ?" అని ప్రశ్నించేవాడు !

నేనూ సందిగ్ధంలో పడేవాణ్ణి. "అందరూ ఔనంటున్నారు. నేను కాదని ఎలా అనగలను ? వెతికితే ఆధారం ఏమైనా దొరుకుతుందేమో!" అనేవాణ్ణి . నిజం గానే అందరూ భగవతీభాయిని సి.ఐ.డి. అంటున్నారు. ఐతే, ఆధారం మాత్రం లేదు. భగవతీచరణ్ చాలా నేర్పుగా తనరహస్యం మాకు తెలికుండా దాస్తున్నాడని నేనూ అనుకుంటూన్నాను.

ఒకమాటు భగత్‌సింగ్ ఓ చిన్న రివాల్వర్‌ను నాకు చూపి "నేనతన్ని కాల్చిపారేస్తాను !" అన్నాడు.

నేను విసుక్కుంటూ "నీ ఇష్టం ! సొంత బాధ్యత మీద ఏమన్నా చేసుకో !" అన్నాను.

భగత్‌సింగ్ దీర్ఘంగా నిశ్వసించి మౌనంగా వుండిపోయాడు.

ఇది జరిగిన రెండు మూడు రోజుల అనంతరం ఒకమాటు భగత్‌సింగ్‌ను, భగవతీచరణ్ ఇంట్లో చూశాను. ఇద్దరూ ఒకే బల్ల మీద దిండ్లను అనుకుని కూచోని వున్నారు. భగవతీచరణ్ ముఖం నిర్మలంగా వుంది. బనీను వేసుకున్నాడు. పొట్టమీద చేత్తో రాచుకుంటూ హాయిగా మాట్లాడుతూన్నాడు. కానీ, భగత్‌సింగ్ ముఖం సంఘర్షణతో జ్వలిస్తూన్నట్టుగా వుంది. భగవతీచరణ్ విశ్వాసపాత్రుడు ! అతడి మీద సి.ఐ.డి. అన్న అపవాదు వుంది - ఈ రెండింటికి పొంతనకుదరక మధనపడుతూన్నాడు భగత్‌సింగ్.

భగవతీచరణ్‌తో ఇతర్లకంటే కొంచెం అధికంగానే నాకు పరిచయం వుంది. అతడి ఇంటికి సమయాసమయ విచక్షణ లేకుండా పోదిగిన చనువూనాకే వుంది ! కనుక, నిర్ణయం అయ్యాక అతన్ని కాల్చే బాధ్యత నాదేనన్నారు. నేనూ అంగీకరించాను. అది నాకర్తవ్యమనే అనుకున్నాను.

ఒకమాటు సుఖదేవ్ నా దగ్గరకు వచ్చాడు. "భగవతీచరణ్ వ్యవహారాన్ని ఇంకతేల్చే సెయ్యాలి !" అన్నాడు చాలా గంభీరంగా .

"ఏమిటి నీ అభిప్రాయం ?" అన్నాను ఆలోచనగా.

సుఖదేవ్ ముఖంలో అశాంతి కొట్టవచ్చినట్టు కనుపించింది. అతడు భగవతీచరణ్ ను కాల్చేయడానికి సిద్ధమైవచ్చాడని అనుకున్నాను. వెంట రివాల్వర్ కూడా తెచ్చే వుంటాడు !

"భగత్‌సింగ్ భగవతీచరణ్‌ను సొండా తీసుకువెళ్ళాడు , నువ్వు అతడి ఇంటికి వెళ్ళి అతడి పుస్తకాలనూ, కాగితాలనూ - వెతుకు ! ఏదోరకంగా అతడి రహస్యాన్ని తెల్సుకో ! అతడు నిజంగా సి.ఐ.డి. అయితే కొద్దిగానైనా ఆధారం దొరక్కపోదు;" అన్నాడు సుఖదేవ్.

రెండు రోజులుగా జలుబు పడిసెం ఏడిపిస్తోంది.పచారీ షాపుకు వెడితే, కషాయపు దినుసులను పొట్లాంకట్టి ఇచ్చాడు. భగవతీచ చరణ్ వుండడం 'గ్వాల్‌మండీ'లో నేను అటేవెడుతూన్నాను. అతడి కాగితాలను, పుస్తకాలనూ - ఎలా చూడడమా ? అని ఆలోచిస్తూ వెడుతూన్నాను. నడుస్తూనే జేబులో చేయి వేసి చూసుకున్నాను. కషాయపు దినుసుల పొట్లాం చేతికి తగిలింది. నేను వాళ్ళ ఇంటికి వెళ్ళాను. తలుపు కొట్టాను. బాభీ పై నించీ కిందికి తొంగి చూసింది "ఎవరూ ?" అని ప్రశ్నిస్తూ

"భగవతీచరణ్ ఎక్కడికి వెళ్ళాడు ?" అడిగాను.

బాభీ పై నుండే అన్నది. "చెప్పి వెళ్ళలేదు. అయినా భోజనానికి వచ్చే వేళ అయింది, కూచో !" పై నుండి దిగి వచ్చి తలుపు తీసింది.

తలుపు తీస్తూనే "జలుబుతో బాధపడుతూన్నట్టున్నావ్ ?కషాయపు దినుసుల పొట్లాం తెచ్చుకో ! కషాయం కాచియిస్తాను . వంట అవుతూన్నాది. పొంత పొయ్యిమీద పెడితే అదే కాగుతుంది. !" అన్నది బాభీ.

జేబులో నుండి పొట్లాం తీసి చూపిస్తూ "దీన్ని దంచి కాషాయం కాయాలి !" అన్నాను.

బాభీ పొట్లాం తీసుకుని పైకి వెడుతూ "రొట్టెలు కాలుస్తూన్నాను. అయ్యాక దీన్ని దంచి కాచిస్తాను !" అంటూ పైకి వెళ్ళిపోయింది.

ఢిల్లీ కాంగ్రేసు అధ్యక్షురాలు అయ్యాక బాభీ చాలా మారిపోయింది . లీడర్ అయింది. మాటకారీ అయింది. కానీ, ఆ రోజుల్లో చాలా అమాయకంగా వుండేది. నాలుగు మాట్లు అడిగితే గాని సమాధానం చెప్పేది కాదు . భగవతీచరణ్ అటునుంచీ అటే సొండా వెళ్ళాడని బాభీకి తెలియదు. ఆమె పైకి వెళ్ళాక, మెట్ల దగ్గర వున్న వాకిలి తలుపుల్ని వేసి, గొళ్ళెం పెట్టాను. ఒకవేళ ఆమె కిందికి దిగి వస్తుందేమోనన్న సంశయంతో తలుపు దగ్గరే ఒక్క క్షణం నిలబడ్డాను; మెట్ల మీద నుండి అడుగుల శబ్దం వినిపించలేదు ! కొన్ని క్షణాల తరువాత కషాయం పుదినుసుల్ని దంచే శబ్దం పై నుంచీ వినిపించింది. ఇక నిర్భయంగా సోదా చేయసాగాను. గదిలోని పెట్టేల్ని, బీరువాలనూ చూశాను. వాటిలో వున్న ప్రతీకాగితాన్నీ జాగ్రత్తగా పరిశీలించాను. వచ్చేటప్పుడు అవుసరం అవుతుందేమోనని మారుతాళాల గుత్తిని ఒకదాన్ని వెంట తెచ్చాను. దాని అవుసరమే కలుగలేదు ! ఏ పెట్టేకూ తాళాం లేదు., కొన్ని పెట్టేలకు తాళాలు వున్నా తీసేవున్నాయి ! పెట్టేల్లోనూ బీరువాల్లోనూ చాలా కాగితాలు కనిపించాయి, కొన్ని చేతిరాతకాగితాలూ కనుపించాయి. భారతదేశంలో జరిగిన సాయుధ విప్లవ పోరాటాన్ని గురించి రాసిన కాగితాలు కొన్ని, గదర్ పార్టీని గురించి రాసిన కాగితాలు కొన్ని - కనిపించాయి ! భగవతీచరణ్ రాసిన భారత విప్లవ పోరాట చరిత్రలోని ప్రధమవాక్యం - "Rebellion is the birth right of every slave nation " అని వుంది. పక్క గదిలోనూ కొన్ని పెట్టెలు వున్నాయి. వాటికీ తాళాలు లేవు. ఆ పెట్టేల్ని వెతికాను. కట్టెలు వేసుకునే గదిలోకి వెళ్ళి చూశాను. అతడి ఇంటిని పూర్తిగా సోదా చేశాను! అనుమానాస్పదమైన ఓ చిన్న వాక్యం కూడా కనుపించలేదు ! నేనా సోదాలో చూసిన కాగితాల్లోని రాతల్ని భగవతీచరణ్ ఇదివరకే నాకు చదివి వినిపించాడు ! తను రాసిన వాటిని మిత్రులకు చదివి వినిపించడం భగవతీచరణ్‌కు కూడా చాలా ఇష్టం ! దాదాపు ఒక గంట తరువాత మెట్ల మీద శబ్దం అయింది. నేను తలుపు గొళ్ళెం తీశాను. బాభీ వేడివేడి కషాయాన్ని గ్లాసులో పోసుకువచ్చింది. "బగవతీచరణ్ ఇంకా రాలేదు ?" అన్నాను ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ

"వస్తూ వుంటారు !" అని కషాయాన్ని నాకు ఇచ్చి బాభీ పైకి వెళ్ళిపోయింది. మరి ఒకటి రెండు చోట్ల చూశాను, ఏమీ వుండదని తెలిసే ! తరువాత పైన వున్న బాభీ కోసం తలుపుకొడుతూ "నేవెళుతున్నాను " అన్నాను.

"సరే;" అన్నది బాభీ.

నేను బయటికి వచ్చాను. బాభీ క్రిందికి దిగి వచ్చి తలుపులోప గడియవేసుకుంది.

వెంటనే వెళ్ళి సుఖదేవ్‌కు నా విఫల ప్రయత్నాన్ని గురించి చెప్పాను. అప్పటికి ఇంకా భగవతీచరణ్ ను కాల్చాలని సంఘం నిర్ణయించకపోవడం గొప్ప అదృష్టం ! సంఘం అలాంటి నిర్ణయం చేయకపోవడానికి కారణమూ జయచంద్రగారే ! ఆయన గారు తెలివికలవారే అయినా, మహా పిరికి వారు! ఆ రోజుల్లో ఆయుధాల్ని ఒకచోటి నుంచీ మరో చోటికి మారుస్తూ వుండవల్సివచ్చేది. జయచంద్రగారు తన దగ్గర మాత్రం ఆయుధాల్ని వుంచుకునేవారు కాదు. ఒకమాటు భగత్‌సింగ్ ఓ చిన్న పెట్టేను నా చేతికి ఇచ్చాడు. అందులో మూడు రివాల్వర్లు వున్నాయని చెప్పాడు. తరువాత పొట్ట

చెక్కలయ్యేట్టు నవ్వుతూ ".జయచంద్రగారు ఓ ప్రమాదకరం అయిన పనిమీద వెళ్ళారు ! పోలీసులు తారసిల్లితే ఆత్మరక్షణకు పనికివస్తుందని వారికి ఒక రివాల్వర్ ఇచ్చాము. వారు ఖాళీ రివాల్వర్‌ని ఒక జేబులోనూ తూటాలను జేబురుమాల్లో చుట్టుకుని మరో జేబులోనూ పెట్టుకున్నారు ! ఎందుకో తెల్సా? తూటాలు రివాల్వర్‌లోనే వుంటే, వాటంతటవే పేల్తయ్యేమోనని !" అని చెప్పి మళ్ళీ పకపకా నవ్వాడు భగత్‌సింగ్! జయచంద్రగారు అంత పిరికివారు !

ఆ రోజుల్లో నేను విప్లవ సంఘ కార్యక్రమాల్లో అంతగా పాల్గొంటూవుండేవాణ్ణికాదు. కాకపోతే, చిట్టి పొట్టి సహాయాల్ని చేస్తూ వుండేవాణ్ణి ! ఆయుదాల్ని దాయడం, ఎవరైనా కొత్త మిత్రులు వస్తే వారికి ఆశ్రయాన్ని ఇప్పించడం, - ఇతర చిన్న చిన్న పనుల చేసిపెడుతూండేవాడిని ! ఐతే, అవసరం వచ్చినప్పుడు ఉద్యోగాన్ని మాని సంఘంలో చేరిపోవాలని నిశ్చయం అయింది; అనవసరంగా ముందుగానే ఉద్యోగం మానకు కూచోవడం నాకు ఇష్టం లేదు; నేను ఉద్యోగంలో ఉండడం వల్ల విప్లవ సంఘానికీ కొంత ఉపయోగంగానే వుంది;

భగత్‌సింగ్ అశాంతికి రెండవ కారణం తండ్రి ప్రవర్తన; భగత్‌సింగ్ చాలా కాలం ఢిల్లీ కాన్పూర్ పట్నాల్లో వుండి వచ్చాడు. ఇంటి నుండి మాటిమాటికీ మాయమైపోతున్నాడు. ఎక్కడికి పోతున్నాడో, ఎక్కడ వుంటున్నాడో - కిషన్ సింగ్ గారికి తెలియదు; తెలియకపోయినప్పటికీ , కొడుకు యొక్క ఈ ప్రవాస జీవితాన్ని గురించి తండ్రి ఆందోళన పడుతూనే వున్నాడు; కొడుకు చెప్పకుండా ఇంట్లో నుండి వెళ్ళిపోతూండడం సి.ఐ.డి. పోలీసులు అతడి వెనకా వెంబడి తిరుగుతూండడం కిషన్‌సింగ్ గారు గమనిస్తూనే వున్నారు ! ఒక్కోమాటు కొడుకును దగ్గరకు పిల్చి నచ్చచెప్పేవారు "సి.ఐ.డి. లకు అనుమానం కలగకుండా వుండాలంటే , నువ్వు ఇంటి దగ్గ ర వుండాలి ! ఈ కుర్ర చేష్టలు దేశ భక్తి అనిపించుకోవు ! కొంచెం తెలివి తెచ్చుకో !" అనేవారు.

అప్పటికీ వినకపోవడంతో భగత్‌సింగ్ ఇంటి దగ్గరే వుండేటట్టు చేయడానికి సర్దార్ కిషన్‌సింగ్ గారు ఓ ఉపాయాన్ని ఆలోచించారు, అది కొత్తదేం కాదు; భగత్‌సింగ్‌కు వివాహం చేసేయ్యాలనుకున్నారు ! సంపన్నమైన ఓ సిక్కు పరివారంలోని కన్యను నిశ్చయం కూడా చేశారు. కానీ భగత్‌సింగ్ వివాహం చేసుకోవడానికి అంగీకరించలేదు. దీంతో కిషన్‌సింగ్ గారికి పుండు మీద కారం చల్లినట్టయింది.

"పెండ్లి ఎందుకు చేసుకోవు ?" తండ్రి ప్రశ్న.

"ఆర్థికంగా నాకాళ్ళ మీద నేను నిలబడేవరకూ పెండ్లి చేసుకోదలచలేదు;" కొడుకు సమాధానం.

"నువ్వు తాతకు దగ్గులు నేర్పుతున్నావేరా ? పెండ్లి చేసుకో ! నీ కాళ్ళ మీద నిలబడడానికి ప్రయత్నించు, నేనేంవద్దనడం లేదే ? వివాహం చేసుకున్న మాత్రాన నీనెత్తిన వచ్చిపడే బాధ్యతలు ఏమున్నాయి !" తండ్రి అడిగేవాడు.

ఒకమాటు తను ఇంకా చిన్నవయసులోనే వున్నానన్న సాకును చెప్పాడు భగత్‌సింగ్. తండ్రి మండిపడ్డాడు "మిగిలిన అన్ని విషయాలకూ ఆరిందావి కదా ? పెండ్లికే చిన్నవాడివి .......ముందు పెండ్లి చేసుకో; అవుసరం అనుకున్నప్పుడే భార్యను తెచ్చుకుందువుగాని !" అన్నారు కిషన్‌సింగ్‌గారు. ఈ సంబంధం చేసుకుంటే పెద్ద మొత్తంలో కట్నం లభించే అవకాశం వుంది. భగత్‌సింగ్ పెండ్లికి అంగీకరించకపోవడంతో కిషన్‌సింగ్‌గారు మానసికంగా జ్వరం పడ్డ వాడిలావుంటున్నారు!

భగత్‌సింగ్ తండ్రితో స్పష్టంగా చెప్పేశాడు. "మెట్రిక్ ప్యాసయిన పిల్లనుగాని వివాహ మాడను !" అన్నాడు. దీంతోకిషన్‌సింగ్‌గారి కోపం పరాకాష్ఠనంటింది !

భగత్‌సింగ్ విప్లవసంఘ కార్యక్రమాల గురించి తిరుగుతూండడం వల్లా ఇంటికి పోవడం లేదు. తండ్రి కోపానికి జడిసీ ఇంటికి పోవడం లేదు. నా దగ్గరగానీ, భగవతీచరణ్ ఇంట్లో గానీ వుండేవాడు. ఒక్కొప్పుడు ఇతర స్నేహితుల దగ్గరా వుంటూండేవాడు. మేము అతడికి ఆశ్రయం ఇస్తూండడం వల్ల కిషన్‌సింగ్‌గారికి మా మీదా కోపంగానే వుండేది ! వారి కోపానికి మేమూ జడిసేవారం! నలుగురు మిత్రులం కూచుని సరదాగా, నవ్వుతూమాట్లాడుకుంటున్న సమయాల్లో కిషన్‌సింగ్‌గారు వస్తే మేము మా మాటల్ని నవ్వుల్ని చప్పున ఆపి మౌనాన్ని వహించేవాళ్ళం ! మరి పెద్దవాళ్ళ ముందు ఎలా పరిహాసంగా మాట్లాడుకోగలం ? మేమలా మౌనాన్ని వహించడంతో కిషన్‌సింగ్‌గారికి మా మీద మరి కూడా కోపం వచ్చేది ! మేము విప్లవాన్ని గురించి మాట్లాడుకుంటున్నామనీ తనను చూసి మౌనాన్ని వహించామనీ - అనుకునేవారు !"

సర్దార్ కిషన్‌సింగ్‌గారు నేను వున్న చోటికి ఎన్నడూ రాలేదు. ఒక రోజున నలుగుర్నీ అడుగుతూ నేను వున్న ఇంటి అడ్రసు తెల్సుకుని వచ్చారు ! చేతిలో బారాటి లాటీ వుంది, ముఖం కందగడ్డలాగుంది. వారి వాలకం చూస్తేనే చాలా కోపంగా వున్నారని తెలుస్తున్నది; వస్తూనే కోపమూ, ఆత్మీయతా కల్సిన స్వరంలో "నువ్వు భగత్‌సింగ్‌కు పెండ్లి చేసుకోమని ఎందుకు చెప్పవు ? వాడు అసలు ఎందుకు పెళ్ళి చేసుకోడు ? మీరంతా ఒకటే జట్టు ! మహా విప్లవకారులైనట్టు , బ్రహ్మచర్యాన్ని వహించేవాళ్ళులా మాట్లాడుతూన్నారు ఇప్పుడు ! నాలుగు రోజులు పోతే ఆడపిల్లల కొంగు పట్టుకు తిరుగుతారు !" అన్నారు. వారు ఇంకా కూడా కొన్ని కటువైన బూతు శబ్దాల్ని ప్రయోగించారు. వాటిని రాయడం సంభవం కాదు.

నేను ఇలా అన్నాను. " అతడు పెళ్ళి వద్దనడగం లేదు. చదువుకున్న పిల్ల కావాలంటు న్నాడు;"

"చదువుకున్న దాని దగ్గర ఏం ప్రత్యేకత వుంటుందేంటి ? దాని సంతానం పుట్టుకతోనే చదువు నేర్చుకొని పుడతారా ?" అన్నారు.

ఉన్న కొద్దీ వారి కోపం వృద్ధవుతూనే వుంది. చివరకు తిట్టడం మొదలు పెట్టారు. "నువ్వూ, జయచంద్ర- వట్టి నీచులు; మీరేమో హాయిగా ఉద్యోగం చేసుకుంటున్నారు. ఇతర్లని నాశనం చేస్తున్నారు; మీరు మహామోసగాళ్ళు; నువ్వు వాడికి చెప్పలేవుట్రా ?" అన్నారు. 'అతడికి నేనేం చెప్పగలను ? అతడే నాకు చెప్తున్నాడు;' అందామనుకున్నాను. పైకి ఇలా అన్నాను "ఇంటి పనిపాట్లు చూసుకోమని నేను అతడికి ఎప్పుడూ చెప్తుంటాను. నేను చూడండి ఎలా ఉద్యోగం చేసుకుంటు న్నానో;"

తరువాత భగత్‌సింగ్ ఎక్కడికి వెళ్ళాడని అడిగారు. నాకు తెలియదన్నాను.

"వాడు నీ దగ్గరే వుంటున్నానని చెప్పాడే !" అంటూ ఓ పెద్ద మనిషి పేరు చెప్పి "ఆయన ఇవ్వాళ ఉదయం భగత్‌ను ఇక్కడ చూశాడట ! ........... వాడు ఎక్కడికి పోయింది నీకు తెలియక ఇంకెవరికి తెలుస్తుంది ?" అని గద్దించి, బలువైన బూతు మాట నొకదాన్ని నా మీదకు విసరి "సంకరజాతి ముండాకొడుకా, నీకు తెలియక ఇంకెవరికి తెలుస్తుందిరా ?" అన్నారు.

ఎక్కడున్నాడో నాకు తెలియదని ఒట్టు పెట్టుకున్నాను. ఊరకా బజార్లో కనుపించాడనీ, నా దగ్గరకు రాలేదని - చెప్పాను !

"మరి సుఖదేవ్ ఎక్కడ వున్నాడు ?" అని అడిగారు.

సుఖదేవ్ వుండే ప్రదేశాన్ని చెప్పడం కష్టం . అతడూ, జయగోపాల్ ఇద్దరూ కన్హయ్యాలాల్ బిల్డింగులో ఓ గదిలో రహస్యంగా వుంటున్నారు. అడ్రసు ఇవ్వడానికి వీల్లేదు. నాలుగయిదు తప్పుడు

అడ్రసులు ఇచ్చాను. "ఆ అడ్రసులకు వెళ్ళండి !బహుశ ఎక్కడయినా ఒకచోట భగత్‌సింగ్ వుండ వచ్చును." అన్నాను.

సర్దార్ కిషన్‌సింగ్ గారు నేను ఇచ్చిన తప్పుడు అడ్రసులన్నింటికీ వెళ్ళారు. దురదృష్టవశాత్తూ ఒకచోట భగత్‌సింగ్ దొరకనే దొరికాడు !

తరువాత భగత్‌సింగ్ నా దగ్గరకు వచ్చి తండ్రి తనను కొట్టిన దెబ్బలను చూపించాడు. మోకాళ్ళ మీదా, మో చేతుల మీదా, బుజాల మీదా లాటీ దెబ్బలు కనుపిస్తున్నాయి. పకపకా నవ్వుతూ తండ్రి తిట్టిన కొత్త కొత్త తిట్లను వినిపించాడు, నేను మనస్సులో చాలా బాధపడ్డాను. "నువ్వు అక్కడ వుండవనే వుద్దేశ్యంతో ఆ అడ్రసులు చెప్పాను " అన్నాను.

1927 వ సంవత్సరం దసరా పండుగ సందర్భం లాహోరులో ఎవరో ప్రజల మీద బాంబు విసిరారు. సాధారణ మనస్థితి కలవాళ్ళు ఎవరూ అలాంటి పనిచేయరు ! దట్టమైన ప్రజా సమూహంలో బాంబు పేలడం వల్ల చాలా మంది గాయపడ్డారు. కొందర్ని హాస్పటల్లో చేర్చారు. సేవాసమితి తరుపున క్షతగాత్రులకు సేవ చేయడానికి నేను హాస్పటలుకు వెళ్ళాను. దసరా పండుగ సమయంలో బాంబు పేలడం వల్ల ముస్లిములే ఈ పని చేసి వుంటారని హిందువులు వూహించారు !

పోలీసులు అనుమానం మీద కొందరిని అరెస్టు చేశారు. వాళ్ళల్లో భగత్‌సింగ్ ఒకడు ! మా కాలేజిలో చదువుకుంటున్న మరో విద్యార్థి బాబూసింగ్‌ను కూడా అరెస్టు చేశారు ! భగత్‌సింగ్‌ను దాదాపు రెండు వారాలు జైల్లో వుంచారు. అతడి వ్యవహారాన్ని న్యాయస్థానానికి పంపమని వత్తిడి చేశాము. పోలీసులు అతడి మీద ఏ నేరాన్నీ మోపలేకపోతున్నారు. చివరకు జామీను మీద వదిలి పెడతామన్నారు. ఐతే, జామీను వుండేవారు నటబై వేలు ధరావతు కట్టాలి ! అంత పెద్ద మొత్తాన్ని ఎవరు కడతారు ? లేని పక్షంలో భగత్‌సింగ్ ఇంట్లో నుండి కదలడానికి వీల్లేదు ! సి.ఐ.డి. పోలీసులు నీడలా అతడిని వెంటాడుతూన్నారు. సి.ఐ.డి. పోలీసుల కన్నుకప్పడం ఏమంత పెద్ద కష్టమైన పనికాదు. ఐతే, అలా చేయడం వల్ల పోలీసుల అనుమానం ధృవమవుతుంది !

నేను చెప్పడం వల్ల గోపీచంద్ భార్గవ్‌గారు పంజాబ్ అసెంబ్లీలో భగత్‌సింగ్‌ను అకారణంగా ధరావతు కట్టమనడాన్ని గురించి ప్రశ్నించారు. డాక్టర్ గారికి నా మీద ఎంతో విశ్వాసం ! వారికి ఎప్పుడూ తీరికవుండేది కాదు . రోగుల తోటీ, కాంగ్రెసు కార్యక్రమాల తోటీ సరిపోతూండేది. అసెంబ్లీకి సంబంధించిన సమస్త కార్యక్రమాలను నేనే చూసిపెడుతూండేవాడిని ! అసెంబ్లీ ప్రశ్నల్ని నేనే తయారుచేస్తుండేవాణ్ణి ! డాక్టరుగారు అసెంబ్లీలో ప్రశ్నించడంతో ప్రభుత్వం ధరావతును రద్దుచేసింది. భగత్‌సింగ్‌కు స్వేచ్ఛ లభించింది. కొన్నాళ్ళు ఏ కార్యక్రమాల జోలికి పోకుండా ఇంటి పట్టున వున్నాడు. వున్నట్టుండి అగస్మాత్తుగా పరారయ్యాడు. అసెంబ్లీలో బాంబు పేల్చిన తరువాతనే అతడు మళ్ళీ ప్రజలకు కనుపించాడు;

అలా పరారయిన భగత్‌సింగ్ ఢిల్లీ , ఆగ్రా, కాన్పూర్, పాట్నా, కలకత్తా - మొదలైన పట్నాల్లో నిరంతరం తిరిగి వివిధ ప్రాంతాల విప్లవ కారుల ఐక్యత కోసం కృషి చేశాడు. అన్ని ప్రాంతాల్లోనూ విప్లవ సంఘాలు బలహీన స్థితిలోనే వున్నాయి. అలా వుండడానికి ముఖ్య కారణం - తగిన సాధన సంపత్తీ, బలమైన ఉద్యమం లేక పోవడమే ! విప్లవోద్యమాలు సాధారణ ప్రజల కోసమే ఉద్దేశింపబడతాయి! ఐతే, సాధారణ ప్రజల సహాయ సహకారాలను పొందడానికి విప్లవోద్యమాలకు అవకాశం వుండదు ! ఈ ఉద్యమాలు ప్రజల కోసం ఉద్దేశింపబడినవే అయినప్పటికీ, ప్రజల సహాయ సంపత్తులకు దూరంగా వుంచి, ఏ కొద్దిమంది అభిమానుల సహాయంతోనో వీటిని నడపవలసి వుంటుంది ! మేము మా సంఘంలోని సభ్యులకు గానీ, లేక కొద్ది మంది విశ్వాసపాత్రులైన సానుభూతి పరులకు గానీ - మా కష్ట

సుఖాలనూ, అవసరాలనూ చెప్పగలం ! మా బాధాల్ని లేక అవసరాల్ని ప్రజల ముందుంచడం,వారి నుండి సహాయాన్ని ఆశించడం - అసంభవం అయిన విషయం!

కాకోరి కుట్రకేసులోని నిందితులు చాలా మంది ప్రభుత్వ సాక్షులవడంతో ప్రజల నుండి కనీససానుభూతిని ఆశించే స్థితిలోనూ విప్లవ సంఘాలు లేవు ! సాధారణంగా ఆర్థిక బాధలకు లోనవుతూ వుండే మధ్య తరగతి నుంచే విప్లవకారులు తయారయ్యేవారు ! పర ప్రభుత్వపు బానిసత్వంలో బ్రతకడానికి గౌరవ ప్రదమైన మార్గమేదీ లభించని యువకులు, పర ప్రభుత్వం మీద ద్వేషంతో విప్లవానికి తలపడతారు ! సర్వస్వమూ త్యజించి ప్రాణాలోడ్డడానికి సిద్ధపడ్డ విప్లవకారుల దగ్గర డబ్బు ఏముంటుంది ? తమ పొట్టకు బట్టకూ, ఆయుధాలకూ డబ్బు అవసరం కదా ? ప్రజలను అడగడానికా వీలుండదు ! ఇకపోతే, విప్లవకారులకు తమ ఆర్థిక సమస్యను పరిష్కరించుకోవడానికి 'రాజకీయ దోపిడీ' ఒక్కటే శరణ్యం ! కనుక భారతదేశంలో జరిగిన విప్లవ కార్యక్రమాలన్నీ రాజకీయ దోపిడీల్తోనే ప్రారంభించబడ్డాయి ! మా విప్లవ సంఘమూ దారుణమైన ఆర్థిక బాధల్లో వుంది. ఆర్థిక సమస్యను పరిష్కరించుకోడానికి దోపిడీ అనివార్యం అనిపిస్తూన్నది. ఐతే మా విప్లవ సంఘం దోపిడికి సుముఖంగా లేదు. దోపిడీ వల్ల విప్లవకారుల పట్ల ప్రజలకు ద్వేష భావం కలుగుతుందని తెల్సుకున్నాము ! కాగా, తాత్కాలికమైన ఆర్థిక బాధల్ని పరిష్కరించుకోడానికి ఇతర మార్గాలను అనుసరిస్తున్నాము. విద్యార్థి దశలో వున్న కొందరు విప్లవకారులు తమ ఉపకార వేతనాన్ని సంఘానికి ఇస్తున్నారు. విజయ్ ఇంగ్లీషు పత్రికకు ఒకదానికి విలేఖరిగా పనిచేస్తున్నాడు. బాగా సంపాయిస్తున్నాడు. నెలకు నూటయాభై, రెండు వందల వరకూ సంఘానికి ఇచ్చేవాడు !

అప్పట్లో ఒకే ఒక సాహసోపేతమైన విప్లవ చర్యను మణీంద్రనాథ్ బెనర్జీ బెనారస్‌లో చేశాడు. రాయ్‌బహద్దూర్ జె. బెనర్జీని కాల్చే బాధ్యతను మణికి వప్పచెప్పారు. రాయ్‌బహద్దూర్ బెనర్జీ రాజకీయ కుట్రకేసుల్ని పరిశోధించడంలో ప్రసిద్ధుడు. కాకోరి కుట్రకేసులోనూ అతడు పనిచేశాడు. ఆంగ్ల ప్రభుత్వం అతడి సేవలకు సంతసించి 'రాయ్‌బహద్దూర్' అన్న బిరుదును ప్రసాదించింది.

రాయ్‌బహద్దూర్ జె.బెనర్జీ, మణీంద్రనాథ్ బెనర్జీకి మామ అవుతాడు. మణికర్తవ్యానికే ప్రాధాన్యతనిచ్చాడు. బంధుత్వాన్ని తీసి అవతల పెట్టాడు. మణి, రాయ్‌బహద్దూర్ బెనర్జీని నడిబజార్లో కాల్చేశాడు ! తరువాత కూడా చాలా తెలివిగా, చాలా స్థిమితంగా వ్యవహరించాడు. ఎంతో నేర్పుతో పిస్తోలను ప్రక్కనున్న మిత్రుడికి ఇచ్చాడు. రాయ్‌బహద్దూర్ కి దెబ్బ తగిలింది. ఐతే, బ్రతికి పోయాడు. తరువాత కూడా అతడు రాజభక్తిని నిర్వహించాడు. అతడు లాహోరు కుట్రకేసులోనూ పనిచేశాడు. నాకూ అతడికీ మధ్య కొంత గ్రంధం నడిచింది - సందర్భం వచ్చినప్పుడు వివరిస్తాను :

యు.పి. నిరుత్సాహంలో మునిగివుంది. అక్కడ సాయుధ విప్లవం సాగే అవకాశాలు మృగ్యం అయ్యాయి. కాకపోతే, కాకోరీ కేసుకు సంబంధించిన ఖైదీలను విడిపిస్తే కొంత సంచలనం కలుగుతుందేమో! వాళ్ళను విడిపించడానికి ప్రతిసారీ ప్లానువేసుకునేవాళ్ళం : మా ప్లాను ప్రతీసారీ ఫేల్ అవుతూండేది: ఈ స్థితికి విసుగెత్తిన కాకోరీ కేసు ఖైదీ రామప్రసాద్ 'బిస్మిల్' తన ప్రసిద్ధ గజల్ ద్వారా జైల్లోనుండి మాకో సందేశం పంపించాడు.

బిస్మిల్ జైల్లోనుండి పంపిన గజల్ ఇది.

'మిట్ గయా జబ్ మిటనెవాలా ఫిర్ సలామ్ అయాతో క్యా,
దిల్ కి బర్బాదీ కె బాద్ ఉన్కా పయామ్ అయాతో క్యా ?'
'సర్వనాశనం అయ్యాక క్షేమంతో పనేమిటి;
హృదయమే నశించాక అతడి సందేశం అందీ ప్రయోజనం ఏంటి ?

ఎలాగయినా జైల్లో నుండి బయటపడి, పర ప్రభుత్వంతో తనివి తీరా పోరాడాలని బిస్మిల్ కోరిక. కానీ, వాళ్ళను విడిపించే శక్తి విప్లవ సంఘానికి లేదు. మా ఏర్పాట్లూ, ఆలోచనలూ - అన్నీ కపోలకల్పితాలే అయ్యాయి :

యు.పి. విప్లవ సంఘానికి నాయకత్వం వహిస్తున్న 'దాదాల ' వల్ల ప్రయోజనం లేదని నిశ్చయించుకున్న శివవర్మ జైల్లోకి వెళ్ళి బిస్మిల్‌ను కల్సుకోవాలనుకున్నాడు. విప్లవ సంఘాన్ని నడపడం గురించి బిస్మిల్ సలహా తీసుకోవడం అవసరం. పోతే, ఆయుధాలు ఎక్కడెక్కడ వున్నాయో తెల్సుకోవడమూ అవసరమే. బిస్మిల్ గోరఖపూర్ జైల్లో వున్నాడు. అతడికి ఉరిశిక్ష పడ్డది . డిసెంబర్ 17 న ఉరితీస్తారు.

ఉరిశిక్ష పడ్డ ఖైదీకి ఒకరోజు ముందు తన బంధువుల్ని కల్సుకోవడానికి అనుమతిని ఇస్తారు. శివవర్మ, బిస్మిల్‌ను కల్సుకుందామన్న ఆశతో గోరఖపూర్ వెళ్ళాడు. అతడి ఉద్దేశ్యం - బిస్మిల్ తండ్రితో పాటు తనూ ఓ బంధువులా జైల్లోకి వెళ్ళాలని ! ఐతే, బిస్మిల్ తండ్రి శివవర్మను తన వెంట జైల్లోకి తీసుకువెళ్ళడానికి అంగీకరించలేదు. ఐనా, అతడు నిరాశ పడలేదు. "ఎలాగయినా అవకాశం దొరక్కపోతుందా" అని అనుకుంటూ జైలు దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు.

బిస్మిల్ తండ్రి షాజహాన్ పూర్ నుండి వస్తూ భార్యను వెంట తీసుకురాలేదు. తీసుకురాకపోవడానికి కారణం, కొడుకుని చూసి దు:ఖాన్నీ ఆపుకోలేక పోతుందేమోనని ! కానీ, భర్తకు తెలియకుండా ఆమె కూడా బయల్దేరి గోరఖపూర్ జైలు దగ్గరకు వెళ్ళింది. శివవర్మ సాహసించి బిస్మిల్ తల్లిని అడిగాడు. "నేను విప్లవ సంఘం తరుపున బిస్మిల్‌ని కల్సుకోవడానికి వచ్చాను. నాన్నగారు తీసుకువెళ్ళడానికి నిరాకరించారు. మీరైనా తీసుకువెళ్ళండి !"

బిస్మిల్ తల్లి శివవర్మను వెంట తీసుకు వెళ్ళడానికి అంగీకరించింది. ' ఎవరైనా అడిగితే నా మేనల్లుడివని చెప్పు ! తరువాత విషయం నేచూసుకుంటాను;" అన్నది బిస్మిల్ తల్లి .

ఆమె అతణ్ణి జైల్లోకి తీసుకువెళ్ళింది శివవర్మ బిస్మిల్‌తో మాట్లాడాడు. 'చాంత్' పత్రికలో తల్లీకొడుకుల ఈ తుదికలయికను శివరమ్మ మారుపేరుతో హృదయ విదారకంగా వర్ణించాడు.

తల్లి బిస్మిల్ దగ్గరకు వెళ్ళేసరికి అతడు బావురుమని ఏడ్చేశాడు.

బిస్మిల్ తల్లి అతణ్ణి గదమాయించింది., "ఏమిటీ పరికితనం ? నా కొడుకు స్వాతంత్రం కోసం పర ప్రభుత్వంతో పోరాడుతున్నాడని, సూర్యుడస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం ముందు కూడా నా కొడుకు తలవంచడనీ గర్వపడుతూ వచ్చాను ! నువ్వు పిరికివాడిలా ఏడుస్తున్నావా ? అంత ఏడ్చేవాడివి అసలీ మార్గాన్ని ఎందుకు అనుసరించావు ?" అన్నది తల్లి.

బిస్మిల్ కండ్లు తుడుచుకున్నాడు. "తను ఏడ్చింది మృత్యువుకు భయపడి కాదని, తల్లి యొక్క వాత్సల్యం జ్ఞాపకం వచ్చి ఏడ్చాననీ;" చెప్పాడు తల్లికి. ఏడుస్తూన్న తండ్రిని ఓదార్చాడు. "ఏడవకండి ! పురుషులై వుండి మీరే ఇలా ఏడిస్తే , అమ్మను ఎవరు ఓదారుస్తారు ? మీరు ధైర్యంగా వుంటారనీ, అమ్మను ఓదారుస్తారనీ అనుకున్నాను;" అన్నాడు.

శివవర్మ - మారుపేరుతో తల్లీ కొడుకుల కలయికను వ్రాయగలిగేవాడేగాని, విప్లవోద్యమాన్ని నడపడానికి బిస్మిల్ ఇచ్చిన సలహా ఏమిటో వ్రాయలేక పోయాడు. వ్రాయడానికి ఎలా వీలుంటుంది ? ఉద్యమాన్ని నడపడానికి బయట నమ్మకమైన మిత్రులు లేరన్నాడు బిస్మిల్ ! ఆయుధాలు రెండు చోట్ల వున్నాయని చెప్పాడు. చాలా దూరంలో వున్న పల్లెటూరులో కొన్ని వున్నాయని చెప్పాడు. షాజహాన్‌పూర్‌లోని వకీలు దగ్గర కొన్ని వున్నాయని చెప్పాడు. శివవర్మ ఆయుధాల కోసం పల్లెటూరు వెళ్ళలేకపోయాడు. కానీ వకీల్ సాహబ్ దగ్గరకు వెళ్ళాడు ! వకీల్ సాహబ్ ముందు ఆయుధాలు వున్నాయని వప్పుకోలేదు.

"విప్లవ సంఘాన్ని మోసగించిన అపరాధం కింద దండింపబడతావ్ , జాగ్రత్త" అని శివవర్మ గదమాయించడంతో వకీలు తన దగ్గర వున్న ఆయుధాల్ని ఇచ్చాడు. నాలుగు రివాల్వర్లూ, కొన్ని తూటాలూ ఇచ్చాడు.

కాకోరీ కుట్రకేసులోని నిందితుల్ని విడిపించే కార్యక్రమంలో పాల్గోనడానికి భగత్‌సింగ్ , సుఖదేవ్, బలదేవ్ - కాన్పూర్ వెళ్ళారు. అనేక కారణాల వల్ల వాళ్ళను విడిపించే కార్యక్రమం కొనసాగలేదు. ఐతే, భగత్‌సింగ్, సుఖదేవ్‌లు కాన్పూర్ వెళ్ళి వస్తూండడం వల్ల యు.పి. యువ విప్లవకారుల్తో పరిచయాలు ఏర్పడ్డాయి. కాకోరీ కుట్ర కేసులోని అభియుక్తుడు యోగేశ్ చంద్ర చటర్జీని విడిపించాలని ప్రయత్నించాము. అతణ్ణి ఫతేహగడ్ జైలు నుండి ఆగ్రా జైలుకు మార్చబోతున్నారు. ఆగ్రాకు తీసుకు వెళ్ళేటప్పుడు అతణ్ణి విడిపించుదామనుకున్నాము. ముందుగా చటర్జీకి ఈ విషయం తెల్పి, అవకాశాల్ని పరిశీలించడానికి శివవర్మనూ, విజయ్‌కుమార్ నీ కాన్పూర్ నుండి ఫతేహగడ్ పంపించడం జరిగింది. వీళ్ళు జైల్లో వున్న చటర్జీని కల్సుకుని మాట్లాడాలి ! అలా కల్సుకోవడానికి జైలు అధికారులకు అర్జీపెట్టుకున్నారు. ఐతే, జైల్లో మరోరకమైన విచిత్రస్థితి ఏర్పడ్డది. జైలు వార్డన్ ఒకడు చటర్జీ పట్ల సానుభూతి కనబరుస్తూ వుండేవాడు. మరో ఖైదీకీ అవార్డన్ కూ సరిపడేది కాదు. అతడు జైలు అధికారులకు అబద్ధాలు చెప్పాడు. అవార్డన్ చటర్జీకి పిస్తోలు తెచ్చి ఇచ్చాడని చెప్పాడు; దాంతో జైలు అధికారులు చటర్జీని అనుమానిస్తున్నారు. సరీగా అదే సమయంలో శివవర్మా, విజయ్‌కుమార్ - అక్కడికి వెళ్ళారు.

జైలు అధికారులు వీళ్ళ మీద సి.ఐ.డి. నిఘా వుంచారు. శివవర్మా, విజయ్‌కుమార్‌లు - చటర్జీని కల్సుకోలేకపోయారు. సి.ఐ.డి. ల వలలో చిక్కుకున్నారు. వీళ్ళు విఫలురై తిరిగి వస్తున్నారు. ఫతేహగడ్ స్టేషన్‌లో తమను సి.ఐ.డి. లు చుట్టుముట్టినట్టు గమనించారు. వీరి టిక్కెట్ల నంబర్లనీ, వెళ్ళే ప్రదేశాన్ని - నోటు చేసుకున్నారు. మధ్యలోనే ఎక్కడో అరెస్టు చేస్తారని ఇద్దరూ అనుకున్నారు. ఫతేహగడ్ స్టేషన్‌కు పై స్టేషన్ జలాలా బాద్ లో బండి ఆగింది. తిరిగి బయలుదేరింది. ప్లాట్ ఫారాన్ని దాటింది. బండి వేగం కొంత హెచ్చింది. శివవర్మ బండిలో నుండి దూకేశాడు. అతడి వెంట ఒక పోలీసూ దూకాడు పట్టుకోడానికి ! ఐతే, శివవర్మ సిద్ధపడివున్నాడు పోలీసుకు చిక్కలేదు ! ఆపై స్టేషన్‌లో విజయ్‌కుమార్ కూడా దూకేశాడు. ఇతడి వెంట దూకే సాహసం పోలీసులు చేయలేకపోయారు.

శివవర్మా, విజయ్‌కుమార్ - అప్పటికి రైల్లో నుండి దూకి తప్పించుకున్నారు. ఫతేహగడ్ పోలీసులు కాన్పూర్ వచ్చారు. వీళ్ళను గుర్తు పట్టారు. వీళ్ళిద్దరి మీదా అరెస్టు వారంట్లు జారీ అవుతున్నాయి అని పోలీస్‌స్టేషన్ నుండి మాకు వార్తలు అందాయి. ఆ తరువాత శివవర్మ, విజయ్‌కుమార్ - ఇద్దరూ పరారయ్యారు.

భగత్‌సింగ్ లాహోరు నుండి వెళ్ళిపోయేనాటికి, పంజాబు, ఢిల్లీ, యు.పి. రాజపుతానా, బీహార్ , బెంగాల్ - మొదలైన ప్రాంతాల విప్లవ సంఘాలు పరస్పరము నామమాత్రంగా కల్సివున్నాయి. ఈ ప్రాంతాల విప్లవ సంఘాలకు కేంద్రంగా వ్యవహరిస్తున్నవారు భగత్సింగ్, శివవర్మా, విజయకుమార్ - వీరు ముగ్గురు ! వెనుకటి నుండి పంజాబు విప్లవ సంఘానికి నాయకత్వాన్ని వహిస్తున్న వారు జయచంద్రగారు. అలాగే యు.పి.లో సన్యాల్ కుటుంబం విప్లవ సంఘానికి నాయకత్వం వహిస్తూన్నది. జయచంద్రగారిలోనూ, జె.ఎన్. సన్యాల్ గారిలోనూ కష్టాల్ని వరించే సాహసం లేదు. కనుక యువతరం విప్లవకారులు నూతన నాయకత్వాన్ని వాంఛిస్తున్నారు. భగత్‌సింగ్, శివవర్మా, విజయ్‌కుమార్ - వీరు వెనకటి నాయకత్వాన్ని త్రోసిరాజని క్రొత్తగా విప్లవ శంఖాన్ని పూరించసాగారు !

# హిందూస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సేన

## (హి.స.ప్ర.స.) (H.S.R.A.)

భగత్‌సింగ్, సుఖదేవ్, శివవర్మా, విజయ్‌కుమార్ - వీరి ప్రయత్నాల ఫలితంగా ఉత్తర భారతదేశంలోని వివిధ ప్రాంతాల విప్లవ సంఘాల ప్రతినిధులు ఢిల్లీలో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు, 1928, సెప్టెంబర్ 8,9, తారీకుల్లో , అంటే రెండు రోజులు ఈ సమావేశం జరిగింది. సమావేశం ఢిల్లీలోని 'ఫిరోజ్‌షా కిల్లా' శిథిలాల్లో ఏర్పాటుఅయింది. ఈ సమావేశానికి పంజాబు ప్రతినిధులుగా సుఖదేవ్, భగత్‌సింగ్ - వెళ్ళారు. యు.పి. నుండి శివవర్మ, బ్రహ్మదత్త మిశ్ర, జయదేవ్, విజయ్‌కుమార్‌సిన్హా, సురేంద్రనాద్ పాండే వచ్చారు. బీహారు నుండి మణీంద్రనాథ్ ఘోష్, మన్‌మోహన్ బెనర్జి వచ్చారు. చంద్రశేఖర్ అజాద్ రాలేకపోయాడు. భగత్‌సింగ్ , శివవర్మా - ఇద్దరూ వెళ్ళి ఆజాద్‌ను కల్సుకుని వచ్చారు. మెజార్టీ సభ్యుల నిర్ణయానుసారం జరిగిన తీర్మానాలను తప్పక అంగీకరిస్తానని మాట ఇచ్చాడు ఆజాద్ . బెంగాలు విప్లవ సంఘం తరుపున ఈ సమావేశానికి ఎవరూ హాజరు కాలేదు. శివవర్మ, కలకత్తా వెళ్ళి అక్కడి నాయకుల్ని కల్సుకుని వచ్చాడు. బెంగాల్ నాయకులు ఈ సమావేశంలో పాల్గొనడానికి కొన్ని అసందర్భమైన షర్తుల్ని పెట్టారు. వారి మొదటి షర్తు ' అన్ని ప్రాంతాల విప్లవ పసంఘాలూ బెంగాల్ 'అనుశీలన్' పార్టీ నాయకుని వ్యక్తిగత అధిపత్యానికి లోబడివుండాలి. ఇకవారి రెండవ షర్తు 'ఇప్పుడప్పుడే విప్లవ సంఘాలు ప్రభుత్వానికి అనుమానం కలిగే పనులు ఏమీ చేయకూడదు. కేవలం ధనాన్నీ, ఆయుధాల్ని ప్రోగు చేసుకోవడం మాత్రమే చేయాలి !'

క్రొత్తగా సంఘటిత మౌతూన్న మా సంఘానికి బెంగాల్ అనుశీలన్ పార్టివారి మొదటి షర్తు బొత్తిగా నచ్చలేదు. వెనకటి విప్లవ సంఘాలు 'దాదాల'వ్యక్తిగత నిరంకుశ ఆధిపత్యం క్రింద వుండేవి; ఆ వెనుకటి 'దాదాల' నిరంకుశ ఆధిపత్యానికి ప్రతిరూపం పంజాబులో జయచంద్రగారు, యు.పి.లో జె.ఎన్ సన్యాల్‌గారు. వీరి అధిపత్యం కేవలం నిరంకుశం ఐందేకాదు, క్రియాశూన్యమైంది కూడాను. మేము జయచంద్రగారితో ఎన్నడో విసిగిపోయాం ! మాలో కొంతవరకూ ప్రజాతంత్ర భావాలు మేల్కొంటున్నాయి. వివిధ ప్రాంతాల నాయకుల అనుమతితో ఒక కేంద్ర నాయకుణ్ణి ఎన్నుకుందామనుకున్నాము. ముఖ్యమైన అధికారాలన్నీ ఆ కేంద్రనాకుడి చేతుల్లో వుంటాయి. విప్లవ సంఘాలన్నీ అతడి ఆధీనంలో వుంటాయి.

బెంగాల్ అనుశీలన్ పార్టి నాయకులు నిరంకుశ అధికారాల్ని కోరారు. ఐతే, వారి శక్తి సామర్థ్యాలకు ఒక్క ఉదాహరణ చెబితే సరిపోతుంది. కలకత్తాలో శివవర్మ ఒక్క రోజు వుండవల్సివచ్చింది. ఆ ఒక్కరోజూ అతడికి ఆశ్రయాన్ని ఇప్పించలేకపోయారు. పిల్లి ఏడుగొండ్లుల్లో తిప్పినట్టు తిప్పారతణ్ణి! తోటి విప్లవకారుడికి ఒక్క పూట రహస్యంగా గడపడానికి ఆశ్రయాన్ని చూపలేనివాళ్ళు, అన్ని ప్రాంతాల విప్లవ సంఘాలు తమ వ్యక్తిగత ఆధిపత్యం కింద వుండాలనడం ఎంత హాస్యాస్పదమైన విషయం! శివవర్మ అనుభవాన్ని బట్టి అతడి సలహానుసరించి, బెంగాల్ విప్లవ సంఘంతో సంబంధం పెట్టుకోవాలన్న అభిప్రాయాన్నే మార్చుకున్నాం:

భారతదేశంలో మొట్టమొదటిసారిగా వివిధ ప్రాంతాల విప్లవ సంఘాలు ఏకోన్ముఖమై కేంద్ర సమితి నొకదాన్ని ఎన్నుకోవడమన్నది ఈ సమావేశం లోనే జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మిత్రులు వెనకటి పద్ధతుల్ని వదిలి క్రొత్త మార్గంలో, క్రొత్త ఆదర్శంతో విప్లవాన్ని ముందుకు తీసుకుపోవాలని చూస్తున్నారు కనుకనే, జయచంద్రగారిని, జె.ఎన్ సన్యాల్ గారినీ ఈ సమావేశానికి

ఆహ్వానించలేదు. అంతవరకూ వివిధ ప్రాంతాల్లోని విప్లవ సంఘాలకు వివిధ నామాలూ వున్నాయి. బెంగాల్లో 'అనుశీలన్' పేరుతోనూ బీహార్‌లో 'యుగాంతర్' యు.పి. పంజాబుల్లో 'హిందూస్తాన్ ప్రజాతంత్రసేన', 'బెనారస్ రివల్యూషనరీ పార్టీ' అనే పేర్లతోనూ ఇలాగే అనేకరకాల పేర్లతో విప్లవ సంఘాలు పనిచేస్తూవుండేవి ! ఢిల్లీలో జరిగిన సమావేశంలో భగత్‌సింగ్, సుఖదేవ్ - ఒక సూచనను చేశారు. వివిధ ప్రాంతాల నుండి ఒక్కొక్కర్ని ప్రతినిధిగా తీపుకుని సెంట్రల్ కమిటీని ఏర్పరుద్దమన్నారు ఈ విధంగా వివిధ ప్రాంతాల్లోని విప్లవ సంఘాలనూ ఒకటిగాచేసి 'హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ' అన్న పేరును పెడదామన్నారు.

అంటే నూతనంగా ఏర్పడనున్న విప్లవ సంఘానికి 'హిందూస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సేన' అన్న పేరును సూచించారు. దీన్ని సంక్షిప్తం చేస్తే, ఇంగ్లీషులో {H.S.R.A.} హిందీలో (హి.స.ప్ర.స.) అవుతుంది.

మా విప్లవ సంఘం పేరులో 'సోషలిస్ట్' లేక 'సామ్యవాదం' అన్న పదాలను చేర్చ,డం వల్ల మేమంతా మార్క్సిజాన్ని చక్కగా అధ్యయనం చేశామని అనుకోవడానికి వీల్లేదు. ఐతే, మేము మాకు తెల్సినవరకూ, ఆనాటి పరిస్థితులననుసరించి మార్క్సిజం వైపు ఆకర్షింపపడ్డామనడానికి సందేహమూ లేదు ! మార్క్సిజానికి అభిముఖంగా ముందుకు పోవాలన్నదే మా ఆదర్శం ! కనుకే మా విప్లవ సంఘం పేరులో 'సోషలిస్ట్' అన్న శబ్దాన్ని చేర్చడం జరిగింది.

ఢిల్లీలో ఫిరోజుషా శిధిలాల్లో జరిగిన వివిధ ప్రాంతాల విప్లవ కారుల తొలి సమావేశంలో కొన్ని నిర్ణయాలను చేసుకున్నారు. 'సాయుధ విప్లవ పోరాటాన్ని సాగించడానికి డబ్బు చాలా అవసరం ! రహస్యంగా పనిచేసే విప్లవ సంఘాలు ప్రజల సహాయ సంపత్తుల మీదా, చందాల మీదా ఆధారపడానికి వీలుండదు ! కనుక తప్పనిసరిగా దోపిడీలు చేయ్యాలి ! ఐతే, విప్లవకారులు సాధ్యమైన వరకూ ప్రభుత్వ బ్యాంకుల్ని పోస్టాఫీసుల్ని మాత్రమే దోచుకోవాలనీ, ధనికుల జోలికి పోరాదనీ నిర్ణయించుకున్నారు. పల్లెటూర్లలోని ధనికులను దోచుకోవడం వల్ల ప్రజల్లో విప్లవకారులపైన ఒకరకముగా ద్వేష భావాన కలగడానికి వీలు వుంది. అది విప్లవసంఘానికి చాలా చెరుపు చేస్తుంది' ఇది ఒక నిర్ణయం !

'సాధారణంగా విప్లవకారులు, ప్రభుత్వ సాక్షులుగా మారిన నమ్మకద్రోహుల్ని, ఆంగ్ల ప్రభుత్వపు సాధారణ ఉద్యోగుల్ని వధించడంలోనే తమ శక్తినీ, ధనాన్నీ వ్యయపరుస్తూన్నారు. ఈ పద్ధతిని మానాలి! ఇక మీదట సాధారణ ప్రజల దృష్టిని బాగా ఆకర్షించే వ్యవహారాల్నే చేపట్టాలి !' ఇది రెండవ నిర్ణయం!

పైన ఉదహరించిన రెండవ నిర్ణయం ప్రకారం మొదటగా సైమన్ కమీషన్‌న్ని వ్యతిరేకించే కార్యక్రమాన్ని చేపట్టాము. సైమన్ కమీషన్ మీద ప్రజల్లో ద్వేషం బాగా వుంది. బొంబాయిలో సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా కార్మికులు గొప్ప ఊరేగింపు జరిపారు. సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా జరిగే వూరేగింపుల్లో విప్లవ కారులూ పాల్గొనాలన్న నిర్ణయం జరిగింది :

ఆ సమావేశంలో మరో విషయం కూడా స్పష్టం అయింది. ఇక మీదట విప్లవ సంఘం ఏ ఒక్కరి నాయత్వంలోనో వుండదు. మొత్తం డబ్బూ అయుధాలూ కేంద్రకమిటీ అధీనంలోనే వుంటాయి. సంఘం ఏ కార్యక్రమాన్ని చేపట్టాలన్నా, కేంద్రకమిటీ సభ్యులు ఏడుగురు ఆ కార్యక్రమాన్ని గురించి చర్చిస్తారు; విజయ్‌కుమార్ సిన్హాకూ, భగత్‌సింగ్ కూ వివిధ ప్రాంతాల పరస్పర సంబంధాలనూ కాపాడే బాధ్యతను వప్పగించారు. సుఖదేవ్ పంజాబుకు ప్రతినిధి అయ్యాడు; శివవర్మ యు.పికి కుందన్‌లాల్ రాజపుటాణాకు ఫణీంద్రనాథ్‌ఘోష్ బీహారుకు - ప్రతినిధులూ లేక ఆర్గనైజర్లూ అయ్యారు; ప్రస్తుతానికి డబ్బూ , ఆయుధాలూ - పూర్తిగా కేంద్రం ఆధీనంలోనే వుండాలన్న నిర్ణయం జరిగింది. డబ్బు అసలు

లేదు. ఆయుదాలు కూడా నామమాత్రంగానే వున్నాయి. కనుక, ఆయుధాలు ఏ ప్రాంతానికి అవసరం అయితే వాళ్ళు తీసుకువెళ్ళడం, పని అయ్యాక కేంద్రానికి వప్పచెప్పడం; అలా చేయాలనుకున్నారు.

చంద్రశేఖర్ అజాద్ వెనకటి విప్లవ సంఘాల్లోనూ, వాటి కార్యక్రమాల్లోనూ పాల్గోన్నాడు. అప్పట్లో ఆయుధాల్ని ఉపయోగించే పద్దతి కూడా మాకంటే అతడికే బాగా తెలుసు; అయినప్పటికి తాను అనుభవం కలవాడినన్న గర్వం లేకుండా మాతో కలసి పనిచేయడానికి సిద్దం అయ్యాడు. చంద్రశేఖర్ ఆజాద్‌ను మాసంఘం తరుపున సాయుధ పోరాటాలకు నాయకుడిగా నిర్ణయించారు; అతడు మా విప్లవ సంఘానికి కమాండర్ - ఇన్ - చీఫ్;

## చంద్రశేఖర్ ఆజాద్ :

శ్రీ మన్మధనాథ్ గుప్త, చంద్రశేఖర్ ఆజాద్‌ను గురించి తన గ్రంధంలో ప్రస్తావించాడు. ఆజాద్ కాకోరీ విప్లవ సంఘంలోనూ మంచి సాహసాన్ని ప్రదర్శించాడనీ, విశ్వాసపాత్రుడిగా వ్యవహరించాడనీ, మన్మధనాథ్ గుప్త రాశాడు. ఏమైనా కానీ 'హి.స.ప్ర.స.' లో ఆజాద్ స్థానం చాలా గొప్పది. అలా గని 'హి.స.ప్ర.స.' కు ఆజాద్ ఏకైకనాయకుడు అనుకోవడానికి వీల్లేదు. అసలు మా విప్లవ సంఘంలో ఏకైక నాయకత్వానికి అవకాశమే లేదు. చంద్రశేఖర్ ఆజాద్ యొక్క ఆదర్శాన్ని గురించి, సిద్ధాంతాన్ని గురించి కూడా తర్జన భర్జనలు జరుగుతూ వుంటాయి. మన్మనాథ్ గుప్త అతణ్ణి కమ్యూనిస్టుఅనేశాడు; సుఖదేవ్ రాజు 'ఆజాద్‌కు అసలు ఒక సిద్ధాంతం అంటూ లేదు;' అని అన్నాడు. ఆజాద్, నేనూ - దీర్ఘకాలం కల్సి పనిచేశాము. మాలో అభిప్రాయ భేదాలు చాలా వచ్చాయి. అంతలోకి పోట్లాడుకునేవారం. అంతలోకి కల్సిపోయేవారం ! కనుక ఆజాద్‌ను చాలా దగ్గరగా , బాగా ఎగిరివున్నాను. అతడికి ఏ సిద్ధాంతమూ లేదనడం సరికాదు. 'హి.స.ప్ర.స.' సిద్ధాంతమే అతడి సిద్ధాంతం ! మా విప్ల వ సంఘపు సిద్ధాంతాన్ని గానీ, ఆదర్శాన్ని గానీ - అతడెన్నడూ మరవలేదు ! నిర్లక్ష్యమూ చేయలేదు !

చంద్రశేఖర్ ఆజాద్ చదువు సంధ్యల్ని గురించి కూడా రకరకాలుగా చెప్పుకుంటారు ! కొందరు అతడు పండితుడు అని అనేవారు. కొందరు నిరక్షరాస్యుడని అనేవారు ! అజాద్ స్కూలుకుగానీ, కాలేజీకిగాని వెళ్ళి చదవని మాట వాస్తవమే ! అంత మాత్రాన అతడు మూర్ఖుడనుకోవడం తగదు ! ఎం.ఎ.లనూ బి.ఎ.లనూ తయారు చేసే కార్ఖానాల (యూనివర్శిటీలు) తో పరిచయంలేని మాత్రాన మానవులు మూర్ఖులవుతారనుకోవడం మూర్ఖమైన అభిప్రాయమే అవుతుంది ! అగ్బర్, శివాజీ, రణజీత్‌సింగట్ - నిరక్షరాస్యులే అయినా మూర్ఖులనడానికి ఎవరూ సాహసించలేరు ! ఆజాద్ కూడా అగ్బర్, శివాజీ, రణజీత్‌సింగ్ - మొదలైన వారి కోవకు చెందిన వాడు. విప్లవ సంఘం విస్తృతరూపంలో కార్యక్రమాన్ని ప్రారంభించింది. అనేక చోట్ల మా సంఘ స్థావరాలు ఏర్పడ్డాయి. వివిధ ప్రాంతాల నుండి ఎందరో మిత్రులు వచ్చి ఆస్థావరాల్లో వారం పదిరోజుల పాటు వుంటున్నారు. ఒక్క వారం పదిరోజుల పాటు ఎక్కడయినా స్థిమితంగా వుండడడానికి అవకాశం దొరికినప్పుడు , సిద్ధాంతరీత్యా ప్రసిద్ధి నందిన ఏదో ఒక ఉత్తమ గ్రంధాన్ని వెంటతెచ్చుకునేవాడు ఆజాద్ ! మిత్రుల చేత చదివించుకుని వినేవాడు. ఆ గ్రంధానికి సంబంధించిన చర్చలో తనూ పాల్గోనడానికి ప్రయత్నించేవాడు.

అప్పట్లో మా విప్లవ సంఘం ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో వుంది. ఢిల్లీ సమావేశంలో పాల్గోనడానికి వచ్చిన ప్రతినిధులు తిరుగు చార్జీలకు కూడా ఎంతో బాధపడ్డారు. సమావేశం జరిగేటప్పుడు చిల్లర ఖర్చులకు కూడా డబ్బులు లేవు. ఫణీంద్రనాథ్ ఘోష్ బీహార్ నుండి రిట్రన్ టిక్కెట్టు తీసుకువచ్చాడు. విజయ్‌కుమార్ సిన్హా ఫణీంద్రనాథ్ ఘోష్ రిట్రన్ టిక్కెట్టును అమ్మి పదిరూపాయలు పట్టుకువచ్చాడు. వాటితో చిల్లర ఖర్చుల్ని గడుపుకున్నారు. అలాంటి స్థితిలో మొట్ట

మొదట ఆర్థిక సమస్యను పరిష్కరించుకోవాలనుకున్నారు. ఫణీంద్రనాథ్ ఘోష్ (ఇతడు ప్రథమ లాహోరు కుట్రకేసులో ప్రభుత్వ సాక్షి అయ్యాడు ) బేతియాలో దోపిడీకి ఏర్పాటు చేస్తానన్నాడు. భగత్‌సింగ్ , ఆజాద్ ఆయుధాల్ని తీసుకుని బేతియా కెళ్ళారు . కొన్నాళ్ళు అక్కడున్నారు. మార్వాడీల దుకాణాలను పరిశీలించారు. దోపిడికి సరైన అవకాశాలు లభించలేదు. నిరాశ పడి తిరిగి వచ్చారు.

విప్లవ సంఘం ముందు ఎన్నో కార్యక్రమాలు వున్నాయి. సైమన్ కమీషన్ భారతదేశానికి వచ్చింది. ఢిల్లీ సమావేశంలో, 'సైమన్ కమీషన్ మీద బాంబు పేల్చి భారత ప్రజల అసంతృప్తిని వ్యక్తపరచాలి ' అవి భగత్‌సింగ్ సూచించాడు. అతడి సూచన సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదింపబడ్డది. ఐతే, తగినంత ఆర్థికవనరు లేకుండా సైమన్ కమీషన్ మీద బాంబు ప్రేల్చే కార్యక్రమం జయప్రదం ఎలా అవుతుంది ? ఇదిలా వుండగా కైలాసవతి గోరఖ్‌పూర్ పోస్టాఫీసులో దాదాపు 3000 రు॥ దొంగిలించి , తెచ్చి సంఘానికి ఇచ్చాడు. అతడు గోరఖ్‌పూర్ పోస్టాఫీసులో ఉద్యోగం చేస్తున్నాడు. పై మొత్తాన్ని దొంగిలించాక పరారయ్యాడు. ఆ కొద్ది మొత్తంతోనే ఖర్చుల్ని గడుపుతూన్నారు.

లాహోరులోని నౌజవాన్ భారత్‌సభకు ఒకటే ఆదేశాన్ని ఇచ్చారు. సైమన్ కమీషన్ వచ్చినప్పుడు, అన్ని రాజకీయ పార్టీలనూ కలుపుకుని బ్రహ్మాండమైన నిరసన ప్రదర్శన జరపవలసిందని-చెప్పారు. కాంగ్రెసువారికీ సైమన్ కమీషన్ మీద కొంత అసంతృప్తి వుంది. ఎంత బతిమలాడినా, దేబిరించినా తమ పార్టీ సభ్యుణ్ణి ఒక్కణ్ణీ ఆ కమీషన్‌లోకి తీసుకోలేదని కాంగ్రెసువారి బాధ. నౌజవాన్ భారత్‌సభ "మా అదృష్టాన్ని నిర్ణయించడానికి ఇంగ్లీషు ప్రభుత్వానికి హక్కు లేదు ! అసలు కమీషన్ని పంపడానికి వాళ్ళెవరు ?" అని అంటూంది . ఈ విషయంలో బొంబాయి కార్మికులు సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా చేసిన హర్తాళ్‌ను నౌజవాన్ భారత్‌సభ అనుకరించింది. బొంబాయి కార్మికులు "సైమన్ కమీషన్ వెనక్కి వెళ్ళు ."' అని నినాదాలిస్తూ బ్రహ్మాండమైన ఊరేగింపు జరిపారు.

లాహోరులో సైమన్ కమీషన్ వ్యతిరేక ప్రదర్శనకు- ముఖ్యంగా నౌజవాన్ భారత సభ నాయకత్వాన్ని వహిస్తూన్నది. పట్నం మొత్తంలో విజయవంతంగా హర్తాళ్ జరిగింది. ఊరేగింపు జరిగింది. నల్ల జండాలతో ఆకాశం కావురు కమ్మేసింది. అంత పెద్ద ఊరేగింపునూ, ప్రజల ఉత్సాహాన్నీ చూసి ప్రభావితులైన కాంగ్రెసు వారూ ఆప్రదర్శనలో పాల్గొన్నారు. ఊరేగింపుకు ముందు నడవక తప్పలేదు వారికి.

వృద్ధనాయకులు (పంజాబ్ కేసరి) లాలాలజపతిరాయ్ ఊరేగింపు ముందు వున్నారు. నవ యువకులు వార్ని చుట్టుముట్టి , ప్రజా సమూహపు వత్తిడి వారికి తగలకుండా కాపాడుతున్నారు. కొందరు వారికి ఎండ తగలకుండా గొడుగు పట్టారు. ఊరేగింపు రైల్వేస్టేషన్ వరకూ వచ్చింది. నౌజవాన్ భారతసభ యువకులు ముందు వరుసలో వున్నారు. పోలీసులు వుగ్రులయినప్పటికీ యువకులు వెనక్కి తగ్గలేదు. సైమన్‌కు నల్లసండాల్ని చూపించి 'సైమన్ గో బెక్' అన్న తమ నినాదాన్ని అతడి చెవులకు వినిపించిగాని వెనక్కుతగ్గమని పట్టుపట్టారు. పోలీసులు లాఠీచార్జి చేశారు. నౌజవాన్ భారతసభ సభ్యులు - ప్రజలు వెనక్కు పోకుండా వారిని ఉత్సాహితుల్ని చేస్తున్నారు. ప్రజల హృదయాల్లో ఆంగ్ల ప్రభుత్వంపై ద్వేషాన్ని నింపడానికి అది చక్కని అదను.

లాలాలజపతిరాయ్ గారి వెనుక జనసమూహం విస్తారంగా వుంది. వారు ఇకనప్పుడు వెనక్కి వెళ్ళాలన్నా వీలుపడదు. ముందువరుసలో వున్న వాళ్ళ మీద పోలీసులు లాఠీచార్జిచేస్తున్నారు. యువకులు లాలాజీకి నాలుగువైపులా పోగుపడి వారికి దెబ్బతగలకుండా చూస్తున్నారు. పోలీసులు ఎంత కొట్టినా ప్రజలు ఒక్క అడుగు వెనక్కు వేయలేదు. భగవతీచరణ్, సుఖదేవ్, నేనూ - అక్కడే ఒక పక్కగా నిలబడి వున్నాము. ధన్వంతరీ, ఎహసాన్ ఇలాహీ కూడా అక్కడే ప్రజాసమూహంలో వున్నారు.

లాలాజీని చుట్టుకుని నిలబడి ఉన్న యువకులు ఎంతకీ చెదరకపోవడంతో, దగ్గరలోనే నిలబడివున్న పోలీసు సూపరింటెండెంట్ స్కాట్ - ఆ యువకుల మీద లాఠీ ఛార్జికి ఆర్డరు ఇచ్చాడు. డి.ఎస్.పి. సాండర్స కొందరు పోలీసులతో వచ్చి లాలాజీని కాపాడుతున్న యువకుల సమూహం మీద పడ్డాడు, సాండర్స్ చేతిలోనూ లాఠీ వుంది. దాంతో లాలాజీని గురిచూసి ఒక్కటివేశాడు. ఎండతగలకుండా వారికి పట్టిన గొడుగు విరిగిపోయింది. సాండర్స్ కొట్టిన లాఠీ దెబ్బ లాలాజీ బుజానికి తగిలింది.

అప్పటికీ యువకులు వెనకంగ వేయలేదు. లజపతిరాయ్ చుట్టూ పోగుపడి వారిని రక్షించడానికి, వారికి దెబ్బ తగలకుండా కాపాడడానికీ - సిద్ధంగా వున్నారు. కాని, దెబ్బ తిన్నాక లాలాజీ ప్రజాసమూహాన్ని ఉద్దేశించి "పోలీసుల ఈ అమానుష చర్యకు అసమ్మతి సూచకంగా ఊరేగింపును ఆపేద్దాం"అన్నారు. ప్రజలు హతోత్సాహులయ్యారు. నాయకుని ఆజ్ఞ మేరకు ఊరేగింపును విరమించారు.

ఆ రోజున మేము 'పాపడ్‌మండీ'లోనూ దెబ్బలు తిన్నాము.

లాలాలజపతిరాయ్ ఆజ్ఞ ప్రకారం ఊరేగింపును విరమించి, చీలిపోయిన ప్రజలు నల్లజండాలు పుచ్చుకుని 'సైమన్ గోబేక్' అని అరుచుకుంటూ బజార్ల వెంట తిరగసాగారు. ఎక్కడయినా దుకాణాలు తెరచివుంటే - బలవంతాన మూయిస్తున్నారు. నేనూ, భగవతీచరణ్, 'పాపడ్‌మండీ' మీదుగా వెడుతూన్న ప్రజా సమూహంలో వున్నాం. సమూహానికి ముందు అప్పటి రాష్ట్రీయవాది - ముస్లిం నాయకుడు - మౌలానా జాఫర్ అలీ వున్నారు. 'పాపడ్‌మండీ' లో కేవలం ఒకే దుకాణం తెరచివుంది. అది రాయ్‌బహద్దూర్ లక్ష్మణదాస్ బట్టల దుకాణం ! ప్రజా సమూహం గుడ్డల దుకాణాన్ని మూయవల్సిందని పట్టుపట్టింది !

రాయ్‌బహద్దూర్ హిందూమహాసభ నాయకుడు. విదేశీ ప్రభుత్వానికి పరమభక్తుడు. ఇతడి పోషకత్వంలో కొందరు వస్తాదులూ వున్నారు ! ఈ వస్తాదుల పేరు చెబితే లాహోరులో అందరూ భయపడుతూ వుంటారు, రాయ్‌బహద్దూర్ బట్టల దుకాణం ఓ పెద్ద భవనంలో వుంది. .....చుట్టూ ప్రహరీ.......దాని లోపల వస్తాదులు కసరత్తు చేసే అఖాడాలు వున్నాయి ! ప్రజలు దుకాణం మూయవల్సిందని పట్టుపట్టారు. ప్రజలు ప్రహరీని దాటి లోపలకు వెళ్ళారు. ఇంకేవుంది; వస్తాదులు- లోపలకు వచ్చినవాళ్ళను బాణాకర్రల్తో బాదసాగారు !

భగవతీచరణ్ మౌలానా గార్ని ఉద్దేశించి "మౌలానాగారూ ! ఆగండి; ప్రజల్ని కొట్టవద్దని వాళ్ళకు చెప్పండి !" అని అరిచాడు.

మౌలానాగారు పరుగెత్తుతూ వెనక్కయినా తిరిగిచూడకుండా, చేయి పైకి ఎత్తి సమాధానం ఇచ్చారు "వాళ్ళకు చెప్పండి ! అమాయకులైన ప్రజల్నెందుకు కొట్టడం ? కొట్టదలచుకుంటే వచ్చినన్ను కొట్టమనండి !" అన్నారు పరుగెత్తుతూనే. ఇంక ప్రజలు పరుగులంకించుకున్నారు !

ప్రజలలా పరుగెత్తడం సిగ్గుచేటనిపించింది ! మేము గేటు దగ్గరకు వెళ్ళి ప్రజలను ఉద్దేశించి "సోదరులారా ! పరుగెత్తకండి !" అన్నాము.

రాయ్‌బహద్దూర్ గుండాలు మా బుర్రలకు గురి చూశారు. ఒక దెబ్బ నా నెత్తికి తగిలింది. తలగుడ్డ వున్నప్పటికీ తల తిరిగి కింద పడ్డాను. కొన్ని సెకండ్ల తరువాత స్పృహ వచ్చింది. తలగుడ్డ ఒక వైపున పడి వుంది. నేనొక వైపున పడ్డాను. కొన్ని అడుగుల దూరంలో భగవతీచరణ్ ఒక దుకాణం ముందున్న స్తంభాన్ని ఆనుకుని నిలబడివున్నాడు. అతడి తల పగిలింది. రక్తం కారుతోంది. నేనతడి దగ్గరకు వెళ్ళిచూశాను. దెబ్బ ఏమంత పెద్దది కాదు గానీ, అతడి కళ్ళ జోడు ఎక్కడో పడిపోయింది, జోడు లేకుండా అతడు ఒక్క పనీచేయలేడు. జోడు కోసం చుట్టప్రక్కల చూశాను. కనిపించలేదు. అప్పటికి సమూహంలోని ప్రజలందరూ వెళ్ళిపోయారు.

ఆ రోజు సాయంకాలం కాంగ్రెసు 'మోరీదర్వాజా' బయట మైదానంలో ఒక బహిరంగసభను జరిపింది. లాలాలజపతిరాయ్‌గారు ఉపన్యసిస్తున్నారు. ఉదయం ఊరేగింపు మీద ఘోరంగా లాఠీ చార్జి జరిగింది. సాయంకాలం ప్రభుత్వ వ్యతిరేక సభను నిర్విఘ్నంగా జరుపుకున్నాం. మరి అది బ్రిటిష్ ప్రభుత్వం . అనాడు ఉదయం అంత గలభా జరిగినా సాయంకాలంసభజరుపకోడానికి వీలుంది. కానీ, ఈనాడు మన రమరాజ్యంలో స్థితి ఏమిటి ? ఓ సాధారణమైన నాటకాన్ని ప్రదర్శించాలంటే, ముందుగా ప్రభుత్వం దగ్గరనుండి అనుమతి తెచ్చుకోవాలి ! వ్రాత ప్రతిని పోలీసులకు చూపించాలి.

'మోరీదర్వాజా' బయట బహిరంగ సభ జరుగుతోంది. నేనూ సుఖదేవ్ సభావేదికకు - శ్రోతలకు - వెనుకవరుసలో దూరంగా నిలబడి వున్నాము. మాకు కొద్ది దూరంలో డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ నీల్ నిలబడి వున్నాడు ! లాలాజీ ప్రభావోత్పాదకంగా ఉపన్యసిస్తున్నారు ! అమానుషమైన పోలీసుల చర్యను గర్హిస్తూ "నిరాయుధులైన ప్రజల మీద అమానుషిక, క్రూర హింసలను సాగించే ప్రభుత్వం చిరకాలం మన గలగలేదు : నేనీరోజు చాలెంజిచేసి చెప్తున్నాను. ఈ ప్రభుత్వ పోలీసులు ఈనాడు నన్ను కొట్టారు. ఈ దుష్ట చర్యే ఒకనాడు ఈ ప్రభుత్వాన్ని సర్వనాశనం చేస్తుంది !" అని అన్నారు. కొంచెం దూరంలో నిలబడి ఉన్న ఇంగ్లీషు అధికారుల్ని వుద్దేశించి తన భావాన్ని ఇంగ్లీషు లోనూ పునరుద్ఘాటించారు.!" "I Declare that the blows struck at me will be the last nails in the coffin of the British rule of india ".

లాలాలజపతిరాయ్ గారి పై మాటల్ని విని దూరంగా నిలటబడి వున్న ఇంగ్లీషు అధికారి నీల్ పళ్ళు బయటపెట్టి ఇకలించాడు. అతడలా నవ్వడంతో నా గుండెల్లో ఎవరో శూలం పెట్టి పొడిచినట్టయింది. నేను సుఖదేవ్‌తో ఇలా అన్నాను. "This is intolerabel " (దీన్ని భరించలేము)

సుఖదేవ్ చిరునవ్వు నవ్వాడు. "లాలాజీ ఛాలెంజీ చేస్తున్నారు. అంత కంటే ఏం చేయ గలరు ? పొద్దున ఊరేగింపు ఆపారు. ఇంకొంచెం కోపం వస్తే ఈ సభను మధ్యలో ఆపి వెళ్ళి పోతారు!" అన్నాడు.

ఈ సంఘటన మా హృదయాలను దహింపచేసింది. దీన్ని ఇంతటితో పోనియకూడదని మేమంతా అనుకున్నాం !

1928 నవంబరు 17 వ తారీకున లాలాలజపతిరాయ్ చనిపోయారు ! ప్రజలు దుఃఖితులయ్యారు. పర ప్రభుత్వం మీద ద్వేషం పెల్లుబికింది, ప్రజల్లో! లాలాజీ శవయాత్రలో ఒక లక్ష మంది దాకా పాల్గొన్నారు. గోపీచంద్ భార్గవ్‌గారు పసిపిల్లవాడిలా వెక్కి వెక్కి ఏడిచారు. లాహోరులోని హిందువులు సరేసరి, ముస్లిములు కూడా లాలాజీ మృత్యువు గురించి శోకసంతప్త హృదయులయ్యారు! లాహోరులోని అన్ని సంస్థలూ శవయాత్రలో పాల్గొన్నాయి. ఐతే, నౌజవాన్ భారత్ సభ యువకులైన మా మీద ఇతర సంస్థల యువకుల కంటే బాధ్యత అధికంగా వుంది. ఉదయం 10 గంటలకు శవయాత్ర ప్రారంభమైంది. రావీనదీతటం నాలుగు మైళ్ళ దూరంలో వుంటుంది. అక్కడికి వెళ్ళేసరికి సాయంత్రం అయిదు గంటలయింది. శవం మీద పూవులు వర్షంలా కురిశాయి. అత్యధికమైన పూల బరువును మోయలేక శవవాహకులు పది అడుగులకు ఒకరు మారుతూ, తటాన్ని చేరారు.

సాయంత్రం అయింది. కనుచీకటి పడ్డది. చితి పూర్తిగా తగుల బడటానికి ఇంకా చాలా సమయం పట్టుతుంది. ప్రజలు పల్చబడ్డారు. డాక్టరు భార్గవ్‌గారు ఏడుస్తూనే "చితి దగ్గర మనం ఎవ్వరంలే కుండా వెళ్ళడానికి వీల్లేదు. చితిని ఎవరైనా అవమానపరచవచ్చును " అన్నారు.

"ఈ రాత్రి చితి దగ్గర నేను వుంటాను !" అని మాట ఇచ్చాను నేను.

అప్పటికి చాలా అలసిపోయాను. భగవతీచరణ్ నా అలసటను గమనించాడు "ఈ చలిలో ఈ చల్లని ఇసుక మీద - రాత్రంతా ఎలా గడపగలవు ?" అన్నాడు.

"మాట ఇచ్చాను కదా ?" అన్నాను.

"సరే !" అంటూ భగవతీభాయీ కూడా వెళ్ళిపోయాడు. నేనొక్కణ్ణే చితికి కొద్దిదూరంలో కూచుని వున్నాను. వెన్నెల మసగ్గా వుంది. రావీ నది మీదుగా వచ్చే చల్లని గాలి శరీరాన్ని కొంగర్లు ఎత్తిస్తోంది. చితి కొంత వెచ్చదనాన్నిస్తోంది. నిద్రమగత .... కండ్లు మూతలుపడుతున్నాయి !

ఒక గంట తరువాత, దూరం నుండి నన్నెవరో పిల్చినట్టయింది. స్వరం గుర్తుపట్టాను. భగవతీభాయీ. అతడు, దూరంగా తీరపు ఇసుకకు అవతల నిలబడి పిలుస్తున్నాడు. దగ్గరకు వెళ్ళాను. గుర్రబండి మీద ఒక మంచాన్ని పరుపునూ వేసుకువచ్చాడు. ఒక గిన్నెలో తినుబండారాల్ని పట్టుకువచ్చాడు.

మేమిద్దరం చితికి కొద్ది దూరంలో మంచం వాల్చుకుని పడుకున్నాము. తెల్లవారి సూర్యకిరణాలు నిద్రలేపాయి. గాఢంగా నిద్రపట్టింది. పడుకున్న వాళ్ళం అటునుంచి ఇటు కదలనుకూడా లేదు. అసలు భగవతీభాయితో కల్సి ఒక మంచంలో పడుకుంటే, అటూ ఇటూ పొర్లడానికి చోటు మాత్రం ఎక్కడుంటుంది ? పరారీలో వుండగా, మేమిద్దరం ఎముకల్ని కొరికే చలిలో ఒకే దుప్పట్లో పడుకున్న రోజులు ఎన్నో వున్నాయి !

పంజాబ్, యు.పి., రాజపుటానా, బీహార్ - ఈ నాలుగు ప్రాంతాల మధ్య పరస్పర సంబంధాలు ఏర్పడడంతో, విప్లవ కార్యక్రమాలు చురుగ్గా సాగిపోతున్నాయి. రోజూ కొత్త కొత్త ముఖాలు కనుపిస్తున్నాయి. ఈ కొత్త మిత్రులు పంజాబీ దుస్తుల్లో కనుపించేవారు. ఐనా, వీరి ఉచ్చారణ, వీరు పంజాబీలు కారని చెప్తూనే వుండేది ! ఈ కొత్త మిత్రుల్లో కొందరు నా అతిధులుగానూ వుండేవారు. మొదటగా నాకు అతిధులైన మిత్రులు కైలాసపతి. మహావీరసింగ్ - వీరిద్దరు ! మహావీరసింగ్ అండమాను ద్వీపంలో కారాగారంలోనే చనిపోయాడు. కైలాసపతి ఢిల్లీ కుట్రకేసులో అరెస్టయి ప్రభుత్వ సాక్షిగా మారాడు ! కైలాసపతి పరిస్థితుల ప్రభావానికి స్పష్టమైన ఉదాహరణ ! నేనతణ్ణి వివిధమైన మానసిక స్థితుల్లోనూ చాలా దగ్గరగా చూశాను. నా దగ్గరకు అతిధులుగా వచ్చే ఈ కొత్త మిత్రుల ఆదర్శం ఏమిటో, ఎందుకు వస్తున్నారో నాకు తెల్సు ! నాకు తెల్సునని వీరికీ తెల్సు ! అయినప్పటికీ, మేము విప్లవ సంఘకార్యక్రమాల గురించి ఏమీ మాట్లాడుకునేవారం కాదు ! రహస్య ఉద్యమాల్లో అనుశాసనాన్ని పాటించడం చాలా అవసరం !

యు.పి. నుండి కొత్త మిత్రులు చాలామంది వచ్చారు. వారందరినీ విడివిడిగా సురక్షితమైన ప్రదేశాల్లో వుంచడం అవుసరం ! సుఖదేవ్ మరో విచిత్రమైన పనిని కూడా వప్పచెప్పాడు నాకు. వెయ్యి రూపాయీల కాగితాలను తేలికగా మార్చుకోవడానికి వీలయిన అవకాశాల్ని చూడమన్నాడు. అప్పట్లో అతడు ఎందుకలా చెప్పాడో నాకు అర్థం కాలేదు. 'ఎక్కణ్ణుండో వెయ్యి రూపాయీల కాగితాలు సంఘం సంపాయించింది, వాటిని మార్చుకోవడం అవుసరం అయింది గావును !' అనుకున్నాను. వ్యాపార సంస్థలతో నాకు ఎలాంటి సంబంధమూ లేదని, వాటిని మార్చే విషయంలో నేనెలాంటి సహాయమూ చేయలేననీ చెప్పాను ! ఐతే, వెయ్యి రూపాయీల కాగితాల్ని మార్చడం అన్నమాట విని నేను చాలా ఆశ్చర్యపడ్డాను. అప్పట్లో విప్లవ సంఘం ఆర్థిక స్థితి చాలా దౌర్భగ్యంగా వుంది. సుఖదేవ్ ఒకటీ అరా - నా దగ్గర గుంజుతుండేవాడు. ఐతే, మా అందరికీ గొప్పఅండ భగవతీచరణ్ ! కానీ, అతడు దాదాపుగా రహస్య జీవితం గడుపుతూ వున్నట్టే ! బాభీ, భగవతీచరణ్ కంటే కూడా దయార్ద్ర హృదయ ! సుఖదేవ్ ఎంత అడిగితే అంత - ఎదురుప్రశ్న వేయకుండా ఇచ్చేది ! సుఖదేవ్ వెయ్యి రూపాయల కాగితాల్ని

మార్చడాన్ని గురించి ఎందుకలా అడిగాడో, కొన్నాళ్ళ తరువాత తెల్సింది ! విప్లవ సంఘం ఆర్థిక బాధకు విసిగి, పంజాబ్ నేషనల్ బ్యాంకీని దోయడానికి ప్లాను వేసింది. మరి బ్యాంకీనిదోచాక, నోట్లను మార్చుకునే సమస్యఎదురువుతుంది కదా ? సుఖదేవ్ ఆ సమస్యకు పరిష్కారాన్ని వెదకటానికే నన్నలా అడిగాడు.

డిసెంబర్ మొదటి వారంలో సుఖదేవ్ నన్ను నేషనల్ బ్యాంకీకి వెళ్లి చూసిరమ్మన్నాడు. నేషనల్ బ్యాంకీని దోచుకోవడానికి ఒక ప్లాను తయారుచేయమన్నాడు. ఒక వేళ దోపిడి జయప్రదం కాకపోవడానికి కారణాలు ఏమైనా వుంటే వివరించమన్నాడు. నేను పదిరూపాయల కాగితాన్ని మార్చుకోవడానికి అన్నట్టు బ్యాంకీకి వెళ్ళాను. పరిశీలనగా చూశాను. తిరిగి వచ్చి నా అభిప్రాయాన్ని చెప్పాను. "బ్యాంకీని దోయడం అనుకున్నంత తేలిక కాదు. క్లర్కులు కూచునే చోటే ఖజానా వుంది. అలాంటి స్థితిలో చాలా ఎక్కువమంది దోపిడీలో పాల్గోనాలి ! కనీసం ముప్ఫై మంది సాయుధులైనా పాల్గోనాలి! తిరిగి వెళ్ళేప్పుడు వీళ్ళందరినీ బస్సులో తీసుకువెళ్ళాలి ! బస్సు ఎక్కడ దొరుకుతుంది?' ' అన్నాను.

"టాక్సీని మాట్లాడుకోవచ్చును. డ్రయివర్నితప్పిస్తే సరి !" అన్నాడు సుఖదేవ్.

తరువాత తెల్సింది, సుఖదేవ్ బ్యాంకీ దోపిడీని గురించి భగవతీచరణ్‌ను కూడా అభిప్రాయం ఇవ్వమని అడిగాడుట. అతణ్ణి అడిగినట్టు నాకు తెలియదు. నన్ను అడిగినట్టు అతడికీ తెలియదు, సుఖదేవ్‌కు ఇదో పెద్ద అలవాటు ! ఒక విషయాన్ని గురించి రహస్యం బయటపడకుండా, నలుగురి అభిప్రాయాల్ని తీసుకుంటాడు. ఆ అభిప్రాయాలు పనికివస్తాయనుకుంటే స్వీకరిస్తాడు! భగవతీచరణ్ పంజాబు నేషనల్ బ్యాంకీని దోచడాన్ని వ్యతిరేకించాడు. "లాహోరు ప్రజలు , ముఖ్యం ఆర్యసమాజీకులు- పంజాబు నేషనల్ మ్యాంకీని జాతీయ సంస్థగా భావిస్తున్నారు. బ్యాంకీని దోయడానికి నాకేం అభ్యంతరం లేదు. ఐతే, మరో బ్యాంకీని దోద్దాం !" అన్నాడు భగవతీచరణ్.

పంజాబు నేషనల్ బ్యాంకీని దోచుకోవడానికి ఆజాద్, కైలాసవతి, భగత్‌సింగ్, మహావీరసింగ్, కుందన్ లాల్, రాజగురు - వీరందరూ లాహోరు వచ్చారు ! భగత్‌సింగ్ అప్పటికే జుట్టు తీయించుకున్నాడు. టోపీ పెట్టుకుంటూ వుండేవాడు. భగత్‌సింగ్, మహావీరసింగ్, పెద్ద మునుషుల్లా టాక్సీని మాట్లాడుకురావడానికి స్టేషన్ కు వెళ్ళారు. మా ప్లాను : సుఖదేవ్ గేటు కాపలా జవానుకు పిస్తోలు చూపించి, బెదిరించి వాడి దగ్గరున్న తుపాకి లాక్కూంటాడు ! కైలాసపతి టెలిఫోను తీగెలను తెగ్గోస్తాడు. అందుకు అవసరం అవతుందని ఓ బాకును దగ్గర పెట్టుకున్నాడు. భగత్‌సింగ్, మహావీరసింగ్ - బ్యాంకీలో వున్న వాళ్ళు ఎటూ పోకుండా, అరవకుండా - ఒక ప్రక్కకు వుంచుతారు. హంసరాజ్, కైలాసవతి - క్యాషియర్లను కదలకుండా చూస్తారు. జయగోపాల్, కిషోరీ లాల్ నోట్లను ప్రోగుచేసుకుని సంచుల్లోకి సర్దుకుంటారు. నాణ్యాలను సంచుల్లోకి పోసుకోవద్దని ప్రత్యేకం చెప్పారు వాళ్ళకు. అజాద్ ఈ మొత్తం వ్యవహారాన్ని గమనిస్తూ వుంటాడు., తిరిగివచ్చేప్పుడు డ్రయివర్ని కారులోనే ఒక ప్రక్కకు తోసి, కారునడుపుకు వెళ్ళే బాధ్యత కూడా ఆజాద్ దే ! ఆజాద్ 1926 లో పరారీలో వుండగా బొంబాయి, ఝూన్సీ పట్నాల్లో కొన్నాళ్ళు వున్నాడు. అప్పుడు మోటారు క్లీనర్‌గా, డ్రయివర్‌గా పని చేశాడు.

సమయానికి భగత్‌సింగ్, మహావీరసింగ్, టాక్సీ తీసుకురాలేదు. దోపిడీ నిమిత్తం బ్యాంకీలోకి వెళ్ళిన మిత్రులు కంగారు పడుతూన్నారు. బ్యాంకి కట్టేసే సమయం అయింది. చివరకు మహావీరసింగ్ ఓ గుర్రబండిలో వచ్చాడు. టాక్సీ సమయానికి దొరకలేదని చెప్పాడు, ఆజాద్ సంజ్ఞ చేశాడు. మిత్రులందరూ బయటికి వచ్చారు. ఇదో పెద్ద అసఫలత అనుకోవడానికి వీల్లేదు. తగిన సాధనలు లేనప్పుడు ఇలాంటి అసఫలతలు సహజంగా జరుగుతాయి !

ఆ రోజు టాక్సీ దొరకకపోతే మర్నాడు దొరకవచ్చును గదా ? ఎవరైనా రెండు మూడు గంటలముందే టాక్సీని తీసుకుని 'శాలిమర్' 'జహంగీర్ కా మకబరా' మొదలైన ప్రదేశాల్ని చూస్తూ విలాసయాత్రికుడిలా సమయాన్ని గడపవచ్చును. కానీ, బ్యాంకీ లోపలి పరిస్థితిని చూశాక ఆజాద్‌కు ఈ దోపిడీ యత్నం తెలివి గల పని అనిపించలేదు। ఆజాద్ దుస్సాహసి అని పేరు పడ్డాడు వ్యక్తిగతంగా అతడు నిజంగా దుస్సాహసుడే। ఐతే, 'యాక్షన్'లో పాల్గొనేటప్పుడు చాలా జాగ్రత్తగా వుంటాడు. ఆ సమయంలో అతడిలోని ఉద్రేకం అణగిపోతుంది. తర్కబుద్ధి వికసిస్తుంది ! 'చావడానికీ చంపడానికీ సిద్ధం అయినప్పటికీ ఎంతవరకూ సఫలతను పొందగలం ?' అన్న దాన్ని గురించి ఖచ్చితంగా అంచనా వేస్తాడు। సరిగా అంచనా వేయడంలో తర్కబుద్ధితో పనిచేయడంలో నేనూ గట్టి వాణ్ణే నని మిత్రులు వప్పుకుంటారు। ఏతే ఆజాద్‌తో సమానం నేను కాలేను ।...... ఆరోజున మేము బోర్స్టల్ జైలు మీద దాడిచేసి పోలీసుల చేతుల్లోనుండి, భగత్‌సింగ్‌నూ, దత్తునూ, విడిపించి తెచ్చుకోవడానికి వెళ్ళాము. నేను ఆవేశంలో పిచ్చివాణ్ణి అయ్యాను. ముందుకు దూకటానికి తొందరపడుతూన్నాను. కానీ ఆజాద్ పళ్ళు పటపట కొరికి 'స్టాప్' అన్నాడు. పదినిమిషాల తరువాత ఉద్రేకం తగ్గింది. పరిస్థితిని గమనించాను. నా తొందరపాటు వల్ల, భగత్‌సింగ్, దత్తుతో సహా ఏడెనిమిది మందిమి చనిపోయేవాళ్ళం! ఇంతమందిమి చనిపోయినా, ఆశయం సిద్ధించేది కాదు. భగత్‌సింగ్‌ను దక్కించుకోవడం సంభవం అయ్యేది కాదు. ఈ ప్రత్యేకత వల్లనే, ఇంగ్లీషు రాకపోయినప్పటికీ ఆజాద్‌ను 'హి.స.ప్ర.స.' కు కమాండర్ ఇన్. చీఫ్‌గా ఎన్నుకున్నాము.

## సాండర్స్ వధ

ఇంత ఏర్పాటూ జరిగాక లాహోరులో ఏదో ఒక 'యాక్షన్' న్ని జరపాలన్న ఉద్దేశ్యం ఆజాద్‌కు వుంది. లజపతిరాయ్ గారు చనిపోయి అప్పటికింకా ఒక నెల అయినా కాలేదు, 'లాలాజీని కొట్టి భారత జాతిని అవమాన పరిచారు. ఆ అవమానానికి ప్రతీకారం చేద్దాం, అన్నాడు భగత్‌సింగ్. లాలాజీని అవమాన పరచినందుకు ప్రతీకారాన్ని చేయాలని కేంద్ర కమీటి నిర్ణయించింది. కేంద్రకమిటీ సభ్యులందరూ అప్పుడు లాహోరులోనే వున్నారు. లాహోరులోని 'మజంగ్' పేటలో విప్లవ సంఘం ఓ ఇంటిని అద్దెకు తీసుకుంది. ఆ యింట్లోనే సభ్యులుపై నిర్ణయాన్ని చేశారు ! అప్పుడు శివవర్మ, ఫణీంద్రనాధ్ ఘోష్ లాహోరులో లేరు. వాళ్ళను పిలిపించడానికి చాలా రోజులు పట్టవచ్చును. కనుక వాళ్ళు ఇద్దరూ లేకుండానే నిర్ణయం చేశారు.

ప్రధమ లాహోరు కుట్రకేసులోని ప్రభుత్వ సాక్షి జయగోపాల్ తన వాఙ్మూలంలో "హి.స.ప్ర.స.' స్కాటును చంపాలని నిర్ణయించింది. కానీ పొరపాటున సాండర్సను చంపడం జరిగింది " అని చెప్పాడు. అది సరికాదు. సైమన్ కమీషన్ వ్యతిరేక ప్రదర్శన సందర్భంలో నేను వివరంగా చెప్పాను. స్కాటు ఆర్డర్ ఇచ్చాడు. సాండర్స లాటీ తీసుకు లాలాజీని కొట్టాడు. 'హి.స.ప్ర.స.' కు ఎవరి మీద ప్రత్యేకమైన పక్షపాతం లేదు. జాతీయ అవమానానికి ప్రతీకారాన్ని చేయాలి ! అందుకు స్కాటు, సాండర్స - ఇద్దరూ అర్హులే ! ఇద్దర్నీ కాల్చేయాలనేదే మా ఉద్దేశ్యం ! పైగా, సాండర్సను - స్కాటు అని పొరపాటు పడవల్సిన అగత్యం ఏమీ లేదు . స్కాటు తన నల్లని చిన్న కారులో ఆఫీసుకు వచ్చేవాడు. సాండర్స ఎర్రని మోటార్ సైకిల్ మీద వచ్చేవాడు. స్కాటు ఆఫీసుకు రావడానికి ఓ నియమం అంటూ లేదు. కనుక అతణ్ణి బంగాళలోనే చంపాలని నిశ్చయించుకున్నాము. సాండర్సను డి.ఎ.వి. కాలేజికి ఎదురుగా, పోలీస్ స్టేషన్ ఎదుట కాల్చాలని నిర్ణయించాము !

కొన్నాళ్ళపాటు స్కాటు, సాండర్స - వీళ్ళు వచ్చేపోయే మార్గాన్ని గమనించాము. సాండర్స ఒకప్పుడు గోల్‌బాగ్ మధ్య గుండా వెళ్ళేవాడు. ఒక్కొక్కప్పుడు గోల్‌బాగ్‌ప్రక్క గుండా టౌన్‌హాల్ ముందు

నుంచీ వెళ్ళేవాడు, ఇతడు స్టేషన్ ఆవరణలో, నియమంగా రోజూ ఒకే చోట మోటార్ సైకిల్‌ని పెడుతూండేవాడు. కనుక వీరిద్దరి విషయంలో ఒకరు ఇంకొకరని పొరపాటు పడవల్సిన అవుసరమేలేదు!

డిసెంబర్ 17 వ తారీకు మధ్యాహ్నం 'మజంగ్' నుంచి జయగోపాల్‌ను, సాండర్సు స్టేషన్‌లో ఉన్నాడోలేడో చూసిరమ్మని పంపించాము. కొన్నాళ్ళగా జయగోపాల్ సాండర్సు వచ్చేపోయే మార్గాన్ని గమనిస్తున్నాడు. అతడు సాండర్సనే, స్కాటు అనుకొని పొరపాటు పడ్డాడు ! పైగా, అతడసలు స్కాటును చూసి వుండడడు ! రాజగురు కూడా ఓ మాటు పరిసరాన్ని చూసి వచ్చాడు. రాజగురుకు సైకిల్ తొక్కడం రాదు. అందువల్ల ఒక గంట ముందుగానే , రివాల్వర్ నొకదాన్ని జేబులో వేసుకుని మెల్లగా సాండర్సు వుండే ఆఫీసు వైపు వెళ్ళిపోయాడు. తరువాత ఆజాద్, భగత్‌సింగ్ సైకిళ్ళ మీద వెళ్ళారు ! రెండు రోజుల క్రితమే ఎవరు ఎక్కడ నిలుచోవల్సింది, పోరాటం జరిగితే ఎవరిస్థానం ఎక్కడ? తప్పించుకుని ఏ మార్గాన వెళ్ళిపోవాలి ? మొదలైన విషయాల్ని పరిశీలించుకోవడం జరిగింది!

సాండర్సు పోలీస్‌స్టేషన్ ఆవరణను దాటి రోడ్డు మీదకు మోటార్ సైకిల్ మీద వచ్చే సమయానికి, భగత్‌సింగ్, రాజగురు - అతడిని రివాల్వర్‌తో కాలుస్తారు ! అక్కడే దగ్గర్లో జయగోపాల్ సైకిల్‌ని పెట్టుకు నిలబడి వుంటాడు , చూపరులకు 'చెడిపోయిన సైకిల్‌ని బాగుచేసుకుంటున్నాడురా!' అనిపించేట్టు ! అక్కడలా సైకిల్ పెట్టుకు జయగోపాల్ నుంచోవడానికి కారణం ఒక వేళ సాండర్సు మొదటి దెబ్బను తప్పించుకుని మోటార్ సైకిల్ మీద ముందుకు వెళ్ళేట్టయితే, భగత్‌సింగ్, జయగోపాల్ దగ్గరున్న సైకిల్‌ని వేసుకుని వెళ్ళి, అతణ్ణి కాల్చి చంపుతాడు.

ఆజాద్ డి.ఎ.వి. కాలేజీ ఆవరణ లోపల, ముఖ ద్వారంలో, ఎవరికీ కనపడకుండా దాక్కున్నాడు. భగత్‌సింగ్ , రాజగురు - సాండర్సును కాల్చాక డి.ఎ వి కాలేజీ ఆవరణను దాటి ముఖ ద్వారం గుండా హాస్టల్లోకి పారిపోతారు. ఆజాద్ అలా ముఖ ద్వారంలో పొంచుని వుండడంలోని ఉద్దేశ్యం, హాస్టల్లోకి వెడుతూన్న భగత్‌సింగ్‌నూ, రాజగురునూ ఎవరైనా వెంబడిస్తే, వాళ్ళని ఆజాద్ అడ్డుకుని, వీళ్ళు నిరాటంకంగా వెళ్ళిపోవడానికి అవకాశం కల్పిస్తాడు. అజాద్ చేతిలో మౌజర్ పిస్తోలు వుంది. పిస్తోలు వుంచే అరను జత చేస్తే, మౌజర్ పిస్తోలును రైఫిల్లా ఉపయోగించవచ్చును. బుజానికి ఆనించుకుని గురి చూసి కాల్చవచ్చును. మౌజర్ పిస్తోలు మామూలు తుపాకికంటే ఎక్కువ దూరానికి కాలుస్తుంది. దాన్లో ఒక్కమాటే పదిగుళ్ళు పట్టుతాయి. మరో పది పది గుళ్ళ మేగజీనులను రెండింటిని ఆజాద్ జేబులో పెట్టుకున్నాడు.

ఎవరికీ అనుమానం కలగకుండా వుండడానికి భగత్‌సింగ్ రాజగురు- పోలీస్ స్టేషన్ గేటుకు అవతలగా కొద్ది దూరంలో నిలబడ్డారు. జయగోపాల్ సంజ్ఞ చేశాక గానీ వీళ్ళు ముందుకురారు. సాండర్సు తన మోటారు సైకిల్ ఎక్కి మెల్లగా వస్తున్నాడు. గేటును సమీపించాడు. జయగోపాల్ సంజ్ఞ చేశాడు. సాండర్స్ మోటారు సైకిలుతో రోడ్డు మీదకు వచ్చాడు. రాజగురు, భగత్‌సింగ్ - అతడి మీదకు లంఘించారు. రాజగురు రివాల్వర్‌ని పేల్చాడు. సాండర్సు తలకు గుండు తగిలింది. చిన్నగా కేక పెట్టి అతడు మోటార్ సైకిల్‌తో సహా కింద పడిపోయాడు. భగత్‌సింగ్ అనుమానం నివృత్తి చేసుకోడానికి అతడి తలమీదా, బుజాల మీద మరి నాలుగయిదు మార్లు కాల్చాడు ! భగత్‌సింగ్, రాజగురు - ఇద్దరూ డి.ఎ.వి, కాలేజి ఆవరణవైపు పరుగెత్తారు !

సాండర్సు పడిపోగానే స్టేషన్ వరండాలో నిలబడివున్న పోలీసు ఒకడు అరిచాడు. వెంటనే ట్రాఫిక్ ఇనస్పెక్టరు ఫర్న మరొకరిద్దరు పోలీసులూ - భగత్‌సింగ్, రాజగురును వెంబడించారు ! భగత్‌సింగ్ వెనక్కు తిరిగి తమను వెంబడిస్తూన్న ఫర్నను పిస్తోలుతో కాల్చాడు. ఫర్న వంగి దెబ్బను తప్పించుకునే ప్రయత్నంలో కింద పడ్డాడు. అతడికి గుండు తగల్లేదు. మిగిలిన పోలీసులు భయపడ్డారు.

ఆజాద్ తన స్థానంలో గజరాజులా నిలబడ్డాడు "పదండి!" అన్నాడు, రాజగురు భగత్‌సింగ్‌ను ఉద్దేశించి !

భగత్‌సింగ్, రాజగురు - కాలేజి హాస్టల్లోకి వెళ్ళారు. ఆజాద్ వారికి అడ్డంగా నిలబడ్డాడు. ఇంతలో హెడ్‌కానిస్టేబుల్ చందన్ సింగ్ బూతులు తిడుతూ పరుగెత్తుకు వచ్చాడు.

ఆజాద్ తన మౌజర్ని రైఫిల్లా బుజానికి టాకించుకుని "జాగ్రత్త! వెనక్కి వెళ్ళిపో!" అన్నాడు.

చందన్‌సింగ్ వెంట వున్న మరి ఇద్దరు పోలీసులు జంకి వెనక్కి తగ్గారు కానీ, చందన్‌సింగ్ వెనక్కి తగ్గలేదు. ఆజాద్ కాల్చాడు. ఒకే దెబ్బతో చదన్‌సింగ్ చేతులు బార్లగా చాపి బోర్లా పడ్డాడు ! తరువాత ఆజాద్ కూడా భగత్‌సింగ్‌నూ, రాజగురునూ అనుసరించి కాలేజి హాస్టల్లోకి వెళ్ళిపోయాడు. హాస్టల్లోకి వచ్చాక ఆజాద్ రాజగురును సైకిల్ మీద కూచో పెట్టుకుని గోల్‌బాగ్ గుండా 'మజంగ్'కు వెళ్ళిపోయాడు. కొద్దిక్షణాల తరువాత , వాళ్ళను అనుసరించి భగత్‌సింగ్ కూడా "మజంగ్' కు వెళ్ళాడు!

పోలీసు డిప్యూటీ సూపరింటెండెంట్‌ను చంపడంతో లాహోరు అంతట్లోనూ కలవరం బయల్దేరింది. ఎవరు చంపారు ? ఎందుకు చంపారు ? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావడం లేదు. ప్రజలు అనేకరకాలుగా వూహించుకుంటున్నారు. మర్నాడు ఎర్రని కరపత్రాలు కొన్ని పంచారు. అవి ఇంగ్లీషు కరపత్రాలు ! వాటిలో ఇలా వుంది.

## 'హిందూస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సేన నోటీస్' సామ్రాజ్యవాదులారా జాగ్రత్త !

జె.పి. సాండర్సను వధించి లాలాలజపతిరాయ్ హత్యకు ప్రతీకారాన్ని చేశాము.

జె.పి. సాండర్సులాంటి ఒక సాధారణుడైన పోలీసు ఉద్యోగి ముప్పై కోట్ల ప్రజలచే సమ్మానితుడైన ఒక ప్రజానాయకుణ్ణి కొట్టడం, అతడి ప్రాణాలను పొట్టన పెట్టుకోవడం - ఎంత శోచనీయమైన విషయం ? ఎంత దుఃఖదాయకమైన స్థితి ? ఇది భారత నవయువకులకో సవాలు!

భారత ప్రజలు నిష్ప్రాణులు కారని, వారిలో రక్తం ఇంకా ప్రవహిస్తూనే వున్నదనీ - ప్రపంచానికి చాటాము ఈనాడు ! భారతదేశ గౌరవం కోసం యువకులమైన మేము మా ప్రాణాలను అర్పించడానికి సిద్ధంగా వున్నాం; భారత దేశ గౌరవాన్ని నిలబెట్టడానికి ప్రాణాకు తెగించి మేమీ సాహసాన్ని చేశాం. కానీ, మా దేశ నాయకులే మమ్మల్ని నిందిస్తున్నారు; ఐనా, ఫరవాలేదు;

## ఓ దుష్ట ప్రభుత్వమా జాగ్రత్త !

బాధామయ జీవులైన ఈ దేశ ప్రజల మనస్సుల్ని నొప్పించకు; నీ క్రూర కృత్యాల్ని విరమించు; మేము ఆయుధాలు ధరించకుండా వుండగలనందులకు నువ్వు ఎన్నో జాగ్రత్తల్ని తీసుకున్నావు. నిషేధాల్ని అమలుపరచావు : ఐనా, ఈ దేశ ప్రజలకు ఆయుధాలు లభిస్తూనే వుంటాయి. రివాల్వర్లనీ, పిస్తోళ్ళనీ సంపాయించుకుంటూనే వుంటారు ! ఈ కొద్ది ఆయుధాలు సాయుధ విప్లవానికి సరిపోకపోవచ్చును. కానీ జాతీయ అవమాననానికి ప్రతీకారం తీర్చుకోవడానికి తప్పక సరిపోతాయి ! మా నాయకులే మమ్మల్ని ఎంత నిందించనీ, పర ప్రభుత్వం మమ్మల్ని ఎంత హింసించనీ - అయినా జాతి గౌరవాన్ని నిలబెట్టడానికి మేము సదాతత్పరులమైవుంటాము ! ఆత్మీయుల నిందలనూ, క్రూర హింసలనూ సహిస్తూ కూడా ఉరికంబానికి ఎక్కుతూ కూడా - మేము మా సంపూర్ణమైన చైతన్యంతో నినదిస్తాం -

## ఇన్కిలాబ్ జిందాబాద్ ! (విప్లవం వర్థిల్లాలి)

ఒక మానవుణ్ణి వధించినందుకు మేము చాలా దుఃఖపడుతూన్నాం. కానీ, ఇతడు దుష్ట ఆంగ్ల ప్రభుత్వపు శరీరాంగం ! ఈ దుష్ట ప్రభుత్వాన్ని అంతం చేయడం అవుసరం. మేము ఈ మానవుణ్ణి భారతదేశంలోని బ్రిటిష్ ప్రభుత్వ ఉద్యోగి కావడంవల్లనే హత్య చేశాం ! బ్రిటిష్ ప్రభుత్వం ప్రపంచ ప్రభుత్వాల్లోకే క్రూరమైంది.

మానవ రక్తాన్ని ప్రవహింప జేసి నందకు చింతిస్తున్నాం, కానీ, క్రాంతిని ఆవాహనం చేసేటప్పుడు మానవ రక్తాన్ని ప్రోక్షించడం అవుసరం ! ఒక మానవుణ్ణి మరో మానవుడు దోచుకోవడానికి వీలులేని న్యాయ సమ్మతమైన సాంఘిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థ కోసం మేము క్రాంతిని ఆవాహనం చేస్తున్నాము.

## ఇన్కిలాబ్ జిందాబాద్ !

28 డిసెంబర్ 1928 సం॥ బలరాజ్

సేనాపతి, పంజాబ్ - హి.స.ప్ర.స.॥

విప్లవాన్ని గురించీ, దౌర్జన్యవాదాన్ని (టెర్రరిజం) గురించీ వెనకా కొంత చెప్పాను. పైనుదహరించిన కరపత్రం మా దృష్టికోణాన్ని , ఆశయాన్ని స్పష్టం చేసింది. మేము విప్లవాన్ని కోరుతూన్నాము. దౌర్జన్యవాదులంకాము. ప్రత్యేకమైన పరిస్థితుల వల్ల చెదురు ముదురుగా ప్రభుత్వోద్యోగుల్ని హత్య చేసినప్పటికీ మా లక్ష్యం సామూహిక సాయుధ విప్లవం ! ఇక మా ఆదర్శం - ఒక మానవుణ్ణి మరొక మానవుడు పీడించే సాంఘిక ధర్మాన్ని అంతం చేయడం !

ఒకటి రెండు రోజుల వరకూ రహస్యం పోలీసుల క్కూడా అర్థం కాలేదు. సాండర్స్ ను ఎవరు చంపారు ? కారణం ఏమిటి ? అన్న ప్రశ్న పోలీసుల్ని వేధించింది. కానీ పై కరపత్రం పంచడంతో విషయం అందరికీ అర్థం అయిపోయింది. సాండర్స్ హత్యకు సంబంధించిన రాజకీయ కారణం బయటపడ్డది. విప్లవ కారులు ఈ పని చేశారని ప్రజలు తెల్సుకున్నారు. ప్రజల ముఖాల్లో గర్వంతో గూడిన చిరునవ్వు వెలసింది. ఇక పోలీసులకు గంగవెర్రులు ఎత్తాయి. చేతికి అందిన ప్రతివాణ్ణి అరెస్టు చేశారు. ఇలా అరెస్టు చేయబడ్డవాళ్ళందరూ బాహాటంగా రాజకీయాల్లో పాల్గోంటున్నా వారే : వీరిలో ఎవరికీ, విప్లవ సంఘ రహస్యాలు గానీ, సాండర్స్ హత్యకు సంబంధించిన వివరాలు గానీ తెలియవు! అరెస్టు చేసిన వారి ఇండ్లనూ సోదా చేశారు. ఎక్కడా ఏమీ ఆధారం దొరకలేదు;కాకపోతే ఈ అరెస్టు ఐన వారిలో హంసరాజ్‌బోహరా ఒక్కడికి మాత్రం విప్లవ సంఘంతో సంబంధం వుంది. సాండర్స హత్యవివరిలూ అతడికి తెల్సు .

హంసరాజ్ బోహరా అప్పటికే విప్లవ సంఘంలో పని చేస్తున్నాడు. విద్యార్థి కార్యక్రమాల్లో పాల్గోంటున్నాడు. అతణ్ణి అరెస్టు చేసి ఏడు రోజులు జైల్లో వుంచారు. అతడి మీద ఆపరాధాన్ని మోపడానికి ఏ ఆధారాలూ లేకపోవడం వల్ల చివరకు వదిలిపెట్టారు. జైల్లో హంసరాజ్ చాలా ధైర్యంగా వున్నాడు. ఏ మాత్రం పిరికితనాన్ని ప్రదర్శించలేదు. కానీ, తరువాత రెండవ మాటు అరెస్టు అయినప్పుడు హంసరాజ్ ప్రభుత్వ సాక్షిగా మారిపోయాడు. రెండవ మాటు అతడలా ప్రభుత్వ సాక్షి కావడానికి పరోక్షంగా సుఖదేవ్ కొంతకారణం అనుకుంటున్నాను. సుఖదేవ్ తను చేసిన పనులను వప్పుకున్నాడు. నేరాన్నీ అంగీకరించాడు. హంసరాజ్‌కు - సుఖదేవ్ అలా నేరాన్ని అంగీకరించడం ఒక ఉదాహరణగా పని చేసింది, హంసరాజ్ చాలా విశ్వాసపాత్రుడైన మిత్రుడు. సుఖదేవ్, భగత్‌సింగ్ కూడా

అతడంటే అభిమానాన్ని కనబరిచేవారు. సుఖదేవ్ అంటే హంసరాజ్‌కు ఎంతో శ్రద్ధ ! సుఖదేవ్ , హంసరాజ్ ఇద్దరూ దూరపు బంధువులు కూడాను ! కనుక సుఖదేవ్ ప్రవర్తన హంసరాజ్ మీద అనివార్యంగా ప్రభావాన్ని వేసి వుంటుంది.

మర్నాడు ఉదయమే సుఖదేవ్ నా దగ్గరకు వచ్చాడు. ఒకరి కండ్లల్లోకి మరరం చూసుకున్నాం. పరిస్థితి అర్థం అయింది.

"డబ్బు కావాలి ! డాక్టర్ గోపీచంద్ భార్గవ్‌గారు ఇప్పుడు సంతృప్తి పడతారేమో ! వారి గురువు గారి అవమానానికి ప్రతీకారం చేశాము కదా ? పోనీ, నువ్వు వెళ్ళి వారినే డబ్బు అడకూడదు ?" అన్నాడు సుఖదేవ్.

అప్పుడు డబ్బు చాలా అవసరంగా కావాలి ! విప్లవ సంఘం ఆర్థికంగా మహా ఇరకాటంలో వుంది. ప్రభుత్వ సాక్షి జయగోపాల్ తన వాఙ్మూలం లోనూ ఆర్థిక ఇబ్బందిని ప్రస్తావించాడు. 'సాండర్స్' ని హత్య చేశాక, అందరూ 'మజంగ్' లోని ఇంటికి చేరుకున్నారు. ఆ పూటకు తిండితిప్పలకు సరిపోను డబ్బులు ఎవరి దగ్గరా లేవు. అప్పుడు పండిట్ (ఆజాద్) చెప్పగా, నేను నా మిత్రుడైన బన్సీలాల్ దగ్గరకు వెళ్ళి పదిరూపాయిలు తెచ్చి ఇచ్చాను. వాటితో అందరికీ భోజనపు ఖర్చు వెళ్ళిపోయింది - అని చెప్పాడు జయగోపాల్.

నేను నేరుగా గోపీచంద్ గారి దగ్గరకు వెళ్ళాను. ఒంటరిగావారితో మాట్లాడాను. పరమ గాంధీ వాది అయినప్పటికీ డాక్టరు గారి ముఖంలో, సంతోషం కొట్టవచ్చినట్టు కనుపించింది. తమ గురువు గారి అవమానానికి ప్రతీకారం జరిగిందన్న సంతృప్తి వారి ముఖంలో కనుపించింది.

డాక్టరు గారు ఆత్రంగా అడిగారు. "ఎవరు చేశారీ పని ?"

"పేరు చెప్పడానికి వీల్లేదు. విప్లవ కారులు చేశారని చెప్పగలను ! దేశ స్వాతంత్రం కోసం, గౌరవం కోసం ప్రాణాల నర్పించడానికైనా వెనుదీయని సాహసికులైన యువకులు చేశారు ఈ పనిని !" అన్నాను.

ఓ రెండు గంటలు ఆగి కనుపించమన్నారు డాక్టరుగారు. రెండు గంటల తరువాత ఏ కాంతంలో వార్ని కలుసుకున్నాను. రెండు వందల రూపాయిలు నా చేతిలో పెట్టారు. అప్పటికి సహాయం ఐతే చేశారు కానీ, ఇలాంటి విప్లవ కార్యక్రమాల్తో సంబంధం వుండడంవల్ల నన్ను ఎలా వదిలించుకోవడమా? అని చూడసాగారు. ఆ తరువాత కొద్దిరోజులకే వారి ఉద్యోగాన్ని మాని లక్ష్మి ఇన్సూరెన్సు కంపెనీలో ఉద్యోగానికి కుదిరాను.

రెండు వందల రూపాయల్తో ఏమయ్యేట్టు ? అప్పుడిక దుర్గాబాభీవంతు వచ్చింది; భగవతీభాయి దాదాపు రహస్య జీవితాన్ని గడుపుతున్నాడని చెప్పాను. కొద్ది రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. బాభీతో ఇలా అన్నాడు. "బ్యాంకీ నుండి ఐదు వందల రూపాయలు తెచ్చి ఇంట్లో పెట్టు ! అవుసరం రావచ్చును !"

బాభీ గృహిణీ హోదాలో ప్రశ్నించింది, "అంత డబ్బు ఎందుకు ఇంట్లో ?"

భగవతీభాయి బాభీని పల్లెటూరి అమాయకురాలిగా చూసేవాడు "చెప్పినట్టు చెయ్యి !" అన్నాడు.

అదే రోజు సుఖదేవ్ బాభీ దగ్గరకు వెళ్ళి అడిగాడు "ఇంట్లో ఏమైనా డబ్బు వుందా ?"

"ఉన్నది , ఎందుకు ? ఎంత కావాలి ?" అనడిగింది బాభీ (వదినె)

"ఇప్పుడు ఇంట్లో ఎంత డబ్బు వుంది ?"

"ఎంత కావాలి ?'

"ఐదువందలు;"

బాభీ మౌనంగా తెచ్చి ఇచ్చింది.

ఒకటి రెండు రోజుల్లో లాహోరులో వున్న విప్లవ కారులందరూ మెల్లగా జారుకున్నారు. అమృతసర్, ఫిరోజ్ పూర్ - ఇతర పట్నాలకూ వెళ్ళిపోయారు, అందరూ వెళ్ళిపోయారు. కానీ, భగత్‌సింగ్ లాహోరునుండి బయటికి వెళ్ళడం చాలా కష్టం; ఒట్టిగానే భగత్‌సింగ్ మీద పోలీసులకు అనుమానంగా వుండేది. అతడు చాలా రోజులుగా పోలీసుల కంట పడకుండా పరారీలో వున్నాడు. సాండర్స్ హత్య జరిగింది.......... ఈ స్థితిలో పోలీసులు అతడి కోసం గాలిస్తూ వుండడం సహజం! భగత్‌సింగ్ జుట్టు తీసేయించుకున్నాడు. వేషాన్నీ మార్చాడు. అయినా, ముఖంలో ఏమంత మార్పు వస్తుంది ? ట్రాఫిక్ ఇనస్పెక్టరు ఫర్నను కాల్చబోయినప్పుడు, అతడి వెంట వున్న పోలీసులు భగత్‌సింగ్‌ను స్పష్టంగా చూశారు; గడ్డం నున్నగా గొరిగించాడు. ఐతే, అతడికి దట్టమైన గడ్డం ఎప్పుడూ పెరగదు; ఇప్పుడు గొరిగించడం వల్ల ముఖంలో వచ్చే పెద్ద మార్పు ఏ మీ వుండదు !

ఆ రోజు రాత్రి ఎనిమిదిగంటలా చాయల సుఖదేవ్, బాభీ దగ్గరకు వెళ్ళాడు. అప్పట్లో బాభీ సంస్కృతం చదువుతుండేది. పొరిగింటి మరో ఆమె, బాభీ ఇద్దరూ ట్యూషన్ మాస్టర్ని కుదుర్చుకున్నారు. పాఠం చెప్పించుకుంటూన్న బాభీని ఒక పక్కకు పిల్చి "ఊరికి వెళ్ళాలి : వెళ్ళగలవా ?" అనడిగాడు సుఖదేవ్.

"ఏ ఊరు ? ఎక్కడికి ? ఏం పని?" బాభీ అడిగింది.

"ఈ సంఘటనలో పాల్గొన్న ఒక విప్లవకారుణ్ణి లాహోరునుంచి పోలీసుల కళ్ళుపడకుండా బయటకు తీసుకువెళ్ళాలి ! అతడి భార్యగా నువ్వు నటించాలి. చాలా ప్రమాదంతో కూడిన పని, పోలీసులకు అనుమానం కలిగితే కాల్పులు కూడా జరగవచ్చును : మరి బాగా ఆలోచించుకో !"

సుఖదేవ్ బాభీ ముఖంలోకి తీక్షణంగా చూస్తున్నాడు.

"ఎవరతడు ?" బాభీ ప్రశ్న,

"ఎవరో ఒకరు" సుఖదేవ్ అంతకంటె చెప్పడు.

"సరే వెళ్తాను"

"అతడు రాత్రికి ఇక్కడే వుంటాడు. ఇంక ఈ చదువును ఆపేసెయ్యి;"

"సరే :"

మరి కొద్దిసేపట్లో సుఖదేవ్ మరో పొడుగాటి వ్యక్తిని వెంటపెట్టుకు వచ్చాడు. అతడు ఓవర్‌కోటు వేసుకున్నాడు. హేట్ పెట్టుకున్నాడు. వెంట నవుకరు కూడా వున్నాడు. బాభీ వాళ్ళను గదిలో కూచో పెట్టింది. తానూ కూర్చుంది. సుఖదేవ్ వైపు చూస్తూ మౌనంగా వుంది. కొత్తవాడి వైపు ఏం చూస్తుంది ? ఏం మాట్లాడుతుంది ?

సుఖదేవ్, బాభీ నుద్దేశించి "ఈయన్ని గుర్తుపట్టగలవా ?" అనడిగాడు.

బాభీ చూసింది పరిశీలనగా చూసింది. "భగత్‌సింగ్ :" అంది.

భగత్‌సింగ్, సుఖదేవ్ - పకపకా నవ్వారు.

తెల్లవారుజామున ఐదుగంటల మెయిలుకు కలకత్తా వెళ్ళాలన్న నిశ్చయం జరిగింది. భగత్‌సింగ్ ఓవరుకోటు కాలర్ని బాగా పైకిఎత్తుకుని, హేట్‌ను ముఖం మీదకు లాక్కుని ప్లాట్‌ఫారం మీదకు వచ్చాడు, చంకలో దుర్గాబాభీ కొడుకు నాలుగేళ్ళ'శచి' వున్నాడు. పసివాడితలను తన ముఖానికి అడ్డం పెట్టుకున్నాడు. బాభీ కూడా బాగా ముఖానికి పౌడరు కొట్టుకుంది. ఎత్తు మడమల చెప్పుల్తో టకటక నడుస్తూ భగత్‌సింగ్ వెనకాలే ప్లాట్‌ఫారం మీదకు వచ్చింది. వెంట నౌకరు వేషంలో రాజగురు

వున్నాడు, భగత్‌సింగ్ జేబులో గుళ్ళు నింపిన పిస్తోలు వుంది. రాజగురు దగ్గరా పిస్తోలు వుంది. పోలీసులకు అనుమానం కలిగితే తప్పకుండా కాల్పులు జరిగేవి !......... బాభీ, శచి ఏమయ్యేవారో ?

రాజగురు లక్నో వరకు కలిసి వెళ్ళాడు. అక్కడ నుంచి వేరే ట్రెయిన్ లో వెళ్ళిపోయాడు. భగత్‌సింగ్, బాభీ, శచి - కలకత్తా చేరుకున్నారు !

అప్పుడు సుశీలాదీదీ కలకత్తాలో వుంటోంది. భగవతీచరణ్ కూడా కలకత్తాలోనే వుంటున్నాడు. దుర్గాబాభీ , భగత్‌సింగ్ - తాము వస్తున్నట్లు కలకత్తాకు టెలిగ్రాం ఇచ్చారు.

అంతవరకు భగవతీచరణ్ బాభీని ఒక పల్లెటూరి స్త్రీగానే చూసేవాడు. ఆమె చూపిన ఈ సాహసానికి పొంగిపోయాడు. రైలు దిగగానే భార్యను అభినందిస్తూ బుజాన చెయ్యి వేసి "నిన్ను ఇప్పుడు అర్థం చేసుకున్నాను;" అన్నాడు.

కలకత్తాలో కాంగ్రెసు సభలు జరుగుతూన్నాయి. సాధారణంగా అయితే, లాహోరుకంటే కలకత్తా కొంతవరకు ప్రమాద రహితమైన ప్రదేశమని చెప్పవచ్చు ! కానీ, కాంగ్రెసు సభలో పాల్గొనటానికి అన్ని ప్రాంతాల నాయకులూ, రాజకీయ వాదులూ కలకత్తా వచ్చారు. వారి ననుసరించి అన్ని ప్రాంతాల సి.ఐ.డి. పోలీసులూ కలకత్తా వచ్చారు. ఈ స్థితిని గమనించిన భగత్‌సింగ్ పగలంతా నిద్రపోతూ గడిపేవాడు. రాత్రిపూట కలకత్తాలోని విప్లవకారుల్ని కల్సుకోడానికి వెళ్ళేవాడు. అలా వెళ్ళేటప్పుడు బెంగాలీ బాబులా పంచా - లాల్చీ వేసుకుని దుశ్శాలువను కప్పుకుని వెళ్ళేవాడు.

సుశీలాదీదీ జాలంధర్ కన్యా మహావిద్యాలయం ఉద్యోగాన్ని మానేసింది. కలకత్తాలోని ఓ కోటీశ్వరుడి కూతురికి ట్యూటర్‌గా ఉద్యోగం చేస్తోంది. సెంట్రల్ ఎవెన్యూలో సేటు భవనంలోనే సుసీలాదీదీ వుండటానికి ఒక గదిని ఇచ్చారు. దుర్గాబాభీ, భగత్‌సింగ్ ఆ గదిలోనే వుండసాగారు.

సేటుగారి కుటుంబ సభ్యుల సంఖ్య గొప్పది. భగత్‌సింగ్ అలా పగలంతా పడుకుని వుండడం వల్ల వారిలో ఎవరికైనా అనుమానం కలగవచ్చు ! అనుమాన నివృత్తికై భగత్‌సింగ్ తన మేనల్లుడనీ, ప్రయాణంలో జబ్బు పడ్డాడనీ నలుగురికీ చెప్పింది సుశీలాదీదీ ! లేబిల్ అతికించిన మందు సీసానొకదాన్ని భగత్‌సింగ్ మంచం కింద పెట్టింది. ఆ సీసాలోని నీళ్ళను అప్పుడప్పుడూ కాసినికాసిని పారబోస్తూండేది. భగత్‌సింగ్ పగటి పూట బాగా తినేవాడు, బాగా నిద్రపోయేవాడు. రాత్రిళ్ళు నిశాచరుడిలా తిరిగేవాడు. నాలుగయిదు రోజుల్లో మరో చోటు చూసుకుని వెళ్ళిపోయాడు !

కేంద్ర కమిటీ సభ్యులందరూ ఆగ్రాలో వుంటున్నారు 'నాయికీ మండి'లో ఇల్లు తీసుకున్నాము. సభ్యులందరికీ బాంబులు తయారుచేయడం నేర్పడం కోసం యతీంద్రనాధ్ దాసు ఆగ్రా వచ్చాడు.

ఆగ్రా కేంద్రంలో వివిధ ప్రాంతాల్నుండి వచ్చిన 'హి.స.ప్ర.స.' మిత్రులు చాలా రోజుల పాటు కలసి మెలసి వున్నారు. బాంబుల్ని తయారుచేయడం నేర్చుకోవడంతో పాటు ఒకరి భావాల్ని ఒకరు ఇచ్చిపుచ్చుకోవడమూ జరిగింది. ఎప్పుడూ మిత్రులు అనేక విషయాల గురించి తర్కించుకుంటూ వుండేవారు. ఆ రకంగా తమ భావాలకు మెరుగులు దిద్దుకునేవారు ! మిత్రులు ఆగ్రా కేంద్రంలో ఏయే విషయాల గురించి తర్కించుకుంటూ వుండేవారో తెల్సుకోవడానికి, వారు అక్కడ చదువుతూండిన పుస్తకాల లిష్టును పరిశీలిస్తే సరిపోతుంది. ప్రభుత్వ సాక్షిగా మారిన ఫణీంద్రనాధ్ ఘోష్ తన వాఙ్మూలం లోనూ ఆగ్రా కేంద్రంలో అప్పుడు చదువుతూండిన పుస్తకాల గురించి చెప్పాడు. ఆ రోజుల్లో ఆగ్రా కేంద్రంలో చదివిన పుస్తకాల్లో కొన్నింటి పేర్లు : -

The History of the Revolutionery Struggle in British India Open & Secret. The Ideal of Republic. 1914 ^ 15 Rising Ideal of Equality, Liberty, Fraternity. Indian princes and Revolutioneries (Salaries Pamphlet)' Turkish

messages to Indian"s Muslim Rules Berlin committee and the German plot Non ^ cooperation, Swaraj without clear Definition Failture of Non ^ cooperation , Movement and the Revolutionery parties communist thought. Spiritualism. Advanced socialist thought. Communist School of thought. Nehru Report. Territorists and Mass revolutionaries : Anarchism and socialism, Communism. Syndicalism and collectivism. The Evolution and the world Revolution. Modern Breech Icaders. Use of Explosives.

Monopoly or How Labourt is Robbed భారతీయ ఇతిహాస్‌కా భౌగోలిక్ ఆధార్. ముఖజనే ఉల్ అదవియాత్. భారతీయ సడకోంకెనక్షే. వివాహ ఔర్ ప్రేమ్. Eternal city. Studies in the psychology of sex. What never happened. Les Miserables మొదలైనవి. మేము రాజకీయ గ్రంథాల్నే కాదు, నవలల్నీ ఇష్టంగా చదువుతూండేవారం !

లాహోరులో సాండర్సను వధించాక ప్రజల్లో విప్లవకారులకు పలుకుబడి పెరిగింది. ఏదోపిడీలు చేయనవసరం లేకుండా సానుభూతిపరులు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. మరో ఇంటిని 'హింగ్ కీ మండీ'లో తీసుకున్నాము. చాలా పెద్ద పరిమాణంలో బాంబుల తయారీ జరుగుతోంది. బాంబుల్ని తయారు చేయడం నేర్చుకోవడం కోసం అన్ని ప్రాంతాల నుంచి కార్యకర్తలు ఆగ్రా వచ్చారు. పంజాబ్ నుండి సుఖదేవ్, రాజపురాణా నుంచి కుందన్‌లాల్ బాంబులు తయారుచేయడాన్ని నేర్పడానికి వచ్చారు. చంద్రశేఖర్ ఆజాద్ కూడా ఆగ్రా వచ్చాడు.

ఆజాద్‌కు చదువు అంతగా రాదు. ఐతే, మంచి పుస్తకాలను తెచ్చుకుని మిత్రుల చేత చదివించి వింటుంటాడు. నవలలన్నా, సెక్స్ పుస్తకాలన్నా అతడికి చెడ్డ కోపం ! బ్రహ్మచర్యం పట్ల అతని భావాలు అతి సనాతనమైనవి ! అప్పటికే కొన్ని సందర్భాల్లో కొందరు మిత్రులు స్త్రీ ఆకర్షణలో పడి తమ కర్తవ్యాన్ని నిర్లక్ష్యం చేయడం జరిగింది. కనుక అతడు స్త్రీ, ప్రేమ, సౌందర్యం - వీటి గురించి మాట్లాడితేనే కోపగించుకునేవాడు ! కసరత్తు తాను చేసేవాడు, ఇతర్ల చేత చేయించేవాడు. మరే పని లేకపోతే పిస్తోలుతో 'గురి' సాధన చేస్తుండేవాడు !

ఆ రోజుల్లో ఆజాద్‌కీ, ఇతర మిత్రులకీ - స్త్రీ, ప్రేమ, సౌందర్యం - వీటిని గురించి ఎలాంటి అభిప్రాయాలుండేవో తెల్సుకోవడానికి ఒకటి రెండు ఉదాహరణల్ని ఇస్తే సరిపోతుంది. ఏ సందర్భంలోనో నైనా సరే, స్త్రీని గురించిన ప్రస్తావన వస్తే ఆజాద్ వ్యతిరేకించకుండా వుండేవాడు కాదు. 'మళ్ళీ ఆ 'సూదంటురాయి' విషయం ఎత్తారా ? ఆ నాయాల్ది ఎవర్ని పట్టుకుంటే వాళ్ళను ముంచేస్తుంది ! మనం సైనికులం .....మనకు ఆడదాన్తో పనేంటి ?' అనేవాడు. ఐతే, ఇతర మిత్రులు స్త్రీని గురించి చర్చించడానికి ఎలాంటి అభ్యంతరాన్ని కనబరిచేవారు కాదు. సుఖదేవ్ అభిప్రాయం దాదాపు ఆజాద్ అభిప్రాయంతో కలుస్తూండేది. స్త్రీని గురించి చర్చవస్తే "ఆడది లేనప్పుడు ఇంక ఆడదాన్ని గురించి చర్చించి ప్రయోజనం?' అనేవాడు.

ఆజాద్‌కు "అమ్మా ! మాకు వీడ్కోలు ఇమ్మా ! విజయధ్వజాన్ని ఎగురవేయడానికి వెళుతామమ్మా !" అన్న పాట చాలా ఇష్టమైంది. భగత్‌సింగ్‌నో, రాజగురునో, లేకపోతే బచ్చన్‌నో - పై పాట పాడమని అడుగుతూ వుండేవాడు. రాజగురు సాధారణంగా మౌనంగా వుంటాడు. ఐతే, పరిహాసమాడడంలో దిట్ట ! ఆజాద్ అతణ్ణి పై పాట పాడమని అడిగినప్పుడు కొంటె తనానికి ఏ ప్రేమ గీతాన్నో ప్రారంభించేవాడు. రాజగురు మహారాష్ట్రుడు,., అతడి ఉర్దూ ఉచ్చారణ విచిత్రంగా వుండేది. ఆజాద్ గనుక 'విజయధ్వజం' పాటపాడమని మరీ బలవంతం చేస్తే రాజగురు నవ్వుతూ 'అదిగో పోలీసులు ఇప్పుడే వస్తారు, విజయధ్వజాన్ని పట్టుకుని !" అనేవాడు.

ఒకరోజున రాజగురు ఒక అందమైన స్త్రీ చిత్రం వున్న క్యాలండర్ని ఒకదాన్ని పట్టుకొచ్చి 'నాయాకీమండీ'లో తీసుకున్న ఇంట్లో గోడకు తగిలించాడు. అజాద్ అప్పుడే బజార్నించి వచ్చాడు. బచ్చన్ ఆజాద్ ని ఉద్దేశించి "భైయ్యా ! ఇటుచూడు. దీన్ని ఎవరో తెచ్చారు !" అన్నాడు.

అజాద్ క్యాలండర్ని చూశాడు కనుబొమలు ముడిపడినై, మేకుతో సహా, ఊడబెరికి, క్యాలండర్ని చింపి అవలపారేశాడు.

కొద్దిసేపటి తరువాత రాజగురు వచ్చాడు. గోడన క్యాలండర్ లేదు "అరే, నా క్యాలండర్ ఏమైంది ?" పెద్దగానే అన్నాడు.

బచ్చన్ మౌనంగా కిందపడివున్న క్యాలండర్ ముక్కల వంక చూశాడు. రాజగురు కూడా క్యాలండర్ ముక్కల్ని చూశాడు "ఎవరీ పనిచేసింది "? కోపంగా అడిగాడు.

"నేను !" అజాద్ అన్నాడు. అజాద్ పట్ల వున్న గౌరవంతో స్వరాన్ని కొంతనమ్రంగా మార్చుకుని "మీరు ఎందుకుచింపారు ? నేనెంతో ఇష్టంగా తెచ్చుకున్నాను గదా ?" అన్నాడు రాజగురు.

"మనకు ఇలాంటి క్యాలంర్లతో పనేంటి ?" అజాద్ కోప్పడ్డాడు,

" చాలా అందంగా వుంది !,,

"మనకు అందంతో పనేమిటి ?" కోపంతో పెద్దగా అన్నాడు అజాద్

"ఐతే, అందంంగా వున్న ప్రతిదాన్నీ చింపేస్తారా ? పడగొడతారా ?" రాజగురు ఎదురు తిరిగాడు.

"అఁ , పడగొడతాను !" అజాద్ రొమ్ము విరిచాడు.

"ఐతే, వెళ్ళి తాజమహల్ పడగొట్టు !" రాజగురు ఛాలంజిచేశాడు.

"నా వల్ల అయినప్పుడు తప్పకుండా పడగొడతాను !" అజాద్ కళ్ళు ఎర్రబడ్డాయి. వీళ్ళ వాదనను వింటున్న మిగిలిన మిత్రులు ముసిముసినవ్వులు నవ్వుకుంటున్నారు. రెండు క్షణాల తరువాత రాజగురు కోపం కూడా చిరునవ్వుగా మారిపోయింది.

1929 ప్రాంతాల్లో బ్రహ్మచర్యాన్ని గురించి అజాద్ భావాలు అలా వుండేవి ! కానీ, ఒకే ఒక్క సంవత్సరంలో అజాద్ భావాల్లో ఎంతో పరివర్తన వచ్చింది. అతడి భావాలు సహజత్వానికి చాలా దగ్గరగా పరివర్తన చెందాయి. అనాచారమన్నా, విశృంఖలత్వం అన్నా - అజాద్కు ఎప్పుడూ అసహ్యమే! 1930 సంవత్సరం చలికాలం. కాన్పూర్ చున్నీ గంజ్ లోని ఇంట్లో వుంటున్నాము. అజాద్ ఇలా అంటుండేవాడు "విప్లవం జీవితాంతం అచరించవల్సినవ్రతం అయినప్పుడు, తగిన అదర్శవంతురాలూ - విప్లవ కారిణీ - లభిస్తే వివాహం ఆడడం మంచి పద్ధతి !"

మంచి వుత్సాహంలో వున్నప్పుడు తనకు కాబోయే భార్య గురించి ఇలా చెప్పేవాడు. "పర్వతాల్లో తిరుగుతూ వుంటాం ! అమె దగ్గర ఒక రైఫిల్ వుంటుంది, నా దగ్గర ఒక రైఫిల్ వుంటుంది శత్రువులు చుట్టుముడతారు . అమె రైఫిల్ నింపి ఇస్తూంటుంది. నేను ధనాధన్ - ధనాధన్ కాల్చేస్తూంటాను!"

ఆగ్రాలో వున్న రోజుల్లో అజాద్, మిత్రులకు పిస్తోలు కాల్చడం నేర్పడం కోసం ఇద్దర్ని - ముగ్గుర్ని బుందేల్ఖండ్ అడవుల్లోకి తీసుకువెళ్తూండేవాడు. అలా మిత్రులకు నేర్పడంలో అతడికి ఎంత అనందం లభించేదో - మాటల్లో చెప్పలేను. దూరంగా వున్న సూక్ష్మమైన లక్ష్యాన్ని ఛేదించినప్పుడు అజాద్ పొందే అనందం అవర్ణనీయం. సట్టా వ్యాపారంలో ఓ లక్ష కొట్టుకున్న వ్యాపారి కూడా అంత సంతోషాన్ని పొందడేమో ! నేనూ - అజాద్ కల్సి వున్న రోజుల్లో అతడి పిస్తోలు కాల్చడం నేర్పే ఉత్సాహానికి నేనూ గురి అయ్యాను ! అంతటి గురిగాణ్ణి కావాలన్న ఉత్సాహం నాకేమీ లేదు ! సాధ్యమైన

వరకూ ఆజాద్‌ను కూడా నిరుత్సాహ పరుస్తూండేవాణ్ణి ! అలాంటి సందర్భాల్లో ఆజాద్ కసురుకునేవాడు "అరే బాంగ్‌డూస్, పిటిపిటియాని ఊరకాకోటు జేబులో పెట్టుకు తిరుగుతూ వుంటే, ప్రాక్టీస్ చేయకపోతే, సందర్భం వచ్చినప్పుడు గురికి బారెడు దూరంలో గోలీ తగుల్తుంది. ఆ తరువాత పళ్ళు ఇకిలించవల్సి వస్తుంది !" అనేవాడు. (ఆజాద్ నన్ను సోహన్ అనిగానీ, బాంగ్‌డూస్ (మూర్ఖుడు) అనిగానీ పిల్చేవాడు. పిస్తోల్‌ని ముద్దుగా 'పిటిపిటియా' అనేవాడు.)

నేనిలా అనేవాడిని "పిస్తోలు దగ్గరుంచుకోవడం ఆత్మరక్షణ కేగానీ, సర్కస్ లో లక్ష్యాన్ని ఛేదించి బహుమతి గెల్చుకోవడానికి కాదుకదా ? పైన ఎగిరే పక్షిని కొట్టవల్సిన పనేముంటుంది ? పోరాటంలోనూ కంటికి సూటిగా తుపాకిని పెట్టుకుని గురి చూసి కాల్చే అవకాశం ఏమీ వుండదు ! మనం కాల్చడమంటూ వస్తే మనిషి మీదనే కదా కాల్చేది ? మరి రెండు అంగుళాలు అటుతగిల్నా - ఇటుతగిల్నా పరవాలేదు ! కంగారు పడకుండా సందర్భం వచ్చినప్పుడు స్థిమితంగా వుండగలిగితే సరి! కాకపోయినా, ఇంత కష్టపడి సంపాయిస్తూన్న తూటాలను ప్రాక్టీసులోనే ఖాళీచేయడం ఏం తెలివి తేటలు ?"

అయినా ఆజాద్ నా వాదనను ఒప్పుకునే వాడు కాదు.

అన్ని ప్రాంతాల కార్యకర్తలకూ బాంబులు చేయడం నేర్పాక ఆగ్రా కేంద్రాన్ని ఎత్తేశాము. ఢిల్లీకి మార్చాము. శివవర్మ యు.పి.లోని సహారన్‌పూర్‌లో బాంబుల ఫ్యాక్టరీని ప్రారంభించాడు. సుఖదేవ్ లాహోరులో బాంబులు తయారు చేయడాన్ని ప్రారంభించాడు.

# అసెంబ్లీ బాంబు కేసు

1947 ముందు లోకసభను, కేంద్రీయ అసెంబ్లీ అనిగానీ ఢిల్లీ అసెంబ్లీ అని గానీ - అనేవారు. ఢిల్లీ అసెంబ్లీలో బాంబు పేల్చడం తోచీతోచని పని కానీ, పిచ్చి చేష్టకానీ కాదు. అసెంబ్లీలో బాంబు పేల్చడం 'హి.స.ప్ర.స.' (హిందుస్తాన్ సమాజవాద ప్రజాతంత్ర సేన) కార్యక్రమంలో ఒకభాగం! దాని ఆదర్శానికి స్పష్టమైన ఆచరణాత్మక రూపం ! ఆంగ్ల ప్రభుత్వం రెండు కొత్త శాసనాలను రూపొందించబోతోంది. అవి కేవలం భారత ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను అణచడానికే వుద్దేశింపబడ్డాయి. వాటిలో ఒకటి 'పబ్లిక్ సేఫ్టీబిల్లు' (ప్రజారక్షణ బిల్లు) రెండవది. 'ట్రేడ్సడిస్ప్యూట్సుబిల్లు' (కార్మిక తగాయిదా బిల్లు) ఈ రెండు బిల్లుల్ని ఆంగ్ల ప్రభుత్వం సాధారణ పద్ధతిలో ప్యాస్ చేయలేదని మాకు తెల్సు ! కాంగ్రెసు సభ్యులూ, ఇతర మిత వాదులూ - అందరూ కల్సి ఈ బిల్లుల్ని వ్యతిరేకిస్తారు. అసెంబ్లీలోని మెజారిటీ సభ్యులు ఈ బిల్లుల్ని వ్యతిరేకించినప్పటికీ ఆంగ్ల ప్రభుత్వం వైస్రాయి యొక్క ప్రత్యేక అధికారాల్తో ఈ బిల్లుల్ని ప్యాస్ చేస్తుంది. పై రెండు బిల్లులూ ప్రత్యేకం భారత ప్రజల స్వాతంత్ర్య భావాల్ని అణచడానికే ఉద్దేశింపబడ్డాయి !

వైస్రాయి యొక్క ప్రత్యేకాధికరంతో పై బిల్లులను ప్యాస్ చేసినట్టు ప్రకటించిన వెంటనే అసెంబ్లీ హాల్లోకి బాంబుల్ని విసరి అభివృద్ధినిరోధక శాసనాల పట్ల ప్రజల అసంతృప్తిని వ్యక్తపరచాలని 'హి.స.ప్ర.స.' యొక్క కేంద్రకమిటీ నిర్ణయించింది. ఇలా బాంబుల్ని వేసి అసంతృప్తిని ప్రకటించడంలో రెండు ఉద్దేశాలు వున్నాయి !

ఒకటి ఆంగ్ల ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరిక, "ప్రజా ప్రతి నిధుల నిర్ణయాన్ని త్రోసి రాజని నీవు నీ ఆయుధ బలంతో దుష్టమైన శాసనాలను ప్యాసు చేసుకునేట్లయితే, మేమూ ఆయుధ బలంతోనే

మా అసమ్మతిని వ్యక్తపరచగలం !" రెండవది, బ్రిటీష్ రాజ్యాంగ నియమాలకు లోబడి, అసెంబ్లీలో తమ వ్యతిరేకతను వ్యక్తపరచి - తద్వారా ప్రభుత్వంలో మార్పు తేవచ్చునని కలలు కంటున్న ఈ దేశ నాయకులకు హెచ్చరిక "మీరిలా అసెంబ్లీలో వ్యతిరేకతను వ్యక్తపరచిన మాత్రాన ప్రయోజనం ఏమీ లేదు. మీరు కాదన్నా అభివృద్ధి నిరోధకమైన బిల్లులు ప్యాసు అవుతూనే వుంటాయి, బ్రిటీష్ ప్రభుత్వం రాజ్యాంగం అన్న ముసుగులోంచి నియమవిరుద్ధమైన క్రియల్ని చేస్తోంది. ఆ ముసుగును తొలగించాలి ! ఆంగ్ల ప్రభుత్వానికి అసమ్మతిని తెలిపే మార్గం ఒకటే ఒకటుంది - అది సాయుధ పోరాట మార్గం !"

పై కార్యక్రమాన్ని నిర్వహించడం కోసం 'హి.స.ప్ర.స.' కేంద్రాన్ని ఢిల్లీకి మార్చడం జరిగింది. మిత్రుడు జయదేవ్ కపూర్‌కు అసెంబ్లీ పరిస్థితుల్ని పరిశీలించే బాధ్యతను వప్పగించారు. ఆ రోజుల్లోనూ అసెంబ్లీలోకి వెళ్ళడానికి ప్యాసులు వుండేవి. అవసరం అయినప్పుడు రెండు మూడు ప్యాసుల్ని సులువుగా సంపాయించే మార్గాన్ని ముందుగానే చూసుకోవడం అవసరం కదా ? జయదేవ్‌కపూర్ అసెంబ్లీ కార్యాలయంలో, తాను ఢిల్లీ హిందూ కాలేజిలో అర్థశాస్త్రాన్ని చదువుతున్న విద్యార్థిగా పరిచయం చేసుకున్నాడు. అలా పరిచయం కావడం వల్ల అసెంబ్లీ లైబ్రరిలోకి వెళ్ళడానికి అవకాశం లభిస్తుంది. కార్యాలయ అధికారులకు తన పట్ల నమ్మకం కుదిరాక, అసెంబ్లీ కార్యక్రమాలను చూడడానికి అనుమతిని సంపాదించుకున్నాడు. పరిచయాల్ని పెంపొందించుకున్నాడు. అవసరం అయితే రెండు మూడు ప్యాసుల్ని సంపాయించగలస్థితికి వచ్చాడు. అప్పుడప్పుడూ కార్యక్రమాల్ని తిలకించడానికన్నట్టు విప్లవ సంఘపు ఇతర మిత్రులు కూడా అసెంబ్లీ హాల్లోకి వెళ్ళిరాసాగారు. ఈ రకంగా పరిసరాన్ని పరిస్థితిని పరిశీలించసాగారు.

భగత్‌సింగ్ కూడా జయదేవ్ కపూర్‌తో పాటు ఒకటిరెండు మార్లు అసెంబ్లీ హాల్లోకి వెళ్ళివచ్చాడు.

అసెంబ్లీలో బాంబు పేల్చడానికి సంబంధించిన అనేక సమస్యల్ని గురించి చర్చించడం జరిగింది. మొదటి సమస్య అసెంబ్లీలో బాంబు ప్రేల్చిన మిత్రుల్ని తిరిగి తెచ్చుకోవడమా ? మానడమా? అజాద్ కూడా ఒకటి రెండుమార్లు అసెంబ్లీలోకి వెళ్ళివచ్చాడు. అతడిలా అన్నాడు 'బాంబు ప్రేల్చిన మిత్రుల్ని సురక్షితంగా తిరిగి తెచ్చుకోవడం ఏమంత కష్టమైన పని కాదు. ఐతే, సమయానికి ఒక కారు అందుబాటులో వుండడం అవసరం !"

ఒక కారును ఏర్పాటు చేసుకున్నాం. ఈ కార్యక్రమంలో ఎవరెవరు పాల్గొంటారో కూడా నిర్ణయం అయింది. భగత్‌సింగ్, విజయ్‌కుమార్ సిన్హా - మరో రకంగా వాదిస్తూన్నారు. "కేవలమూ అసెంబ్లీలో బాంబుల్ని పేల్చి కరపత్రాల్ని పంచడమే చాలదు. అంతటితో వూరుకుంటే 'హి.స.ప్ర.స.' ఆదర్శాన్ని ప్రజలు అర్థం చేసుకోలేరు ! పైగా అంతటితో వూరుకుంటే విప్లవకారులమైన మన మీద ప్రజలకు వ్యతిరేక భావం కూడా కలగవచ్చు ను ! మనని ఖూనీ కోర్లగా భావించే ప్రమాదం వుంది. కనుక, అసెంబ్లీలో బాంబులు పేల్చాక, కరపత్రాల్ని పంచడంతోపాటు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నినాదాలు ఇవ్వాలి ! పోలీసులకు పట్టుబడి కోర్టులో కేసు నడిచేటప్పుడు మన ఆదర్శాన్నిస్పష్టంగా చాటుకోవాలి ! అలా ఐతేనే ప్రజలు మన కార్యక్రమాల గురించి, మన ఆదర్శాన్ని గురించి సరైన అవగాహనను ఏర్పరచుకో గలుగుతారు !" అన్నారు.

సామ్రాజ్యవాదుల కోర్టుల్లోనే సిద్ధాంత పోరాటాన్ని జరపాలన్న వాదాన్ని మిత్రులందరూ అంగీకరించారు. సాధారణంగా మా ఆదర్శాన్ని ప్రజల్లో ప్రచారం చేసుకోవడానికి వీలువుండదు. అలా చేయడం రాజద్రోహం అవుతుంది. వార్తా పత్రికలూ మాభావాలనూ, ఆదర్శాలనూ ప్రచురించవు.

సభల్లోనూ చెప్పుకోవడానికి వీలువుండదు. ఐతే, నిందితుల వాఙ్మూలాల్ని, వారి నేరాల వర్ణనల్ని పత్రికల్లో ప్రచురించవచ్చును. అలాంటి స్థితిలో మా ఆదర్శాల్ని, కార్యక్రమాల్ని పత్రికలు విపులంగా ప్రచురించవచ్చును. అసెంబ్లీ బాంబుకేసులోనూ, లాహోరు కుట్రకేసులోనూ మా ఈ ఆదర్శాన్ని నెరవేర్చుకున్నాము ! తరువాత బ్రిటిష్ ప్రభుత్వం తన కోర్టుల ద్వారా రాజద్రోహం ప్రచారం కావడాన్ని గమనించింది. విప్లవకారుల వాఙ్మూలాల్ని పత్రికల్లో ప్రచురించడాన్ని నిషేదించింది.

ఒక విషయం ఇక్కడ స్పష్టం చేయడం అవుసరం అనుకుంటున్నాను,. కేవలం అసెంబ్లాలో బాంబు పేల్చడమే విప్లవకారుల ఉద్దేశ్యం కాదు ! అదే అయితే, విప్లవ సంఘంలోని ఏ సాధారణ కార్యకర్త అయినా అందుకు పరిపోతాడు ! అలాంటి స్థితిలో, అవకాశం వుండీ, మా విప్లవ సంఘంలోని అత్యుత్తమ నాయకుల్ని ఇద్దర్ని బలిపెట్టుకోవాల్సిన అవుసరం వుండేది కాదు. తన ఆదర్శాన్ని ప్రచారం చేసుకోవడానికి బాంబును ఒక సాధనంగా వాడుకుంది విప్లవ సంఘం !

పైన చెప్పిన బిల్లుల్ని గురించి అసెంబ్లీలో తీవ్ర వాద ప్రతివాదనలు జరుగుతూన్నాయి. విప్లవ సంఘంలోనూ 'బాంబు పేల్చడానికి ఎవర్ని పంపించాలి !' అన్న సమస్య మీద వాద ప్రతివాదనలు జరుగుతూన్నాయి. భగత్‌సింగ్‌నూ, జయదేవ్‌కపూర్‌నూ పంపించాలని అనుకున్నారొకమాటు, మరో మాటు భగత్‌సింగ్‌నూ రాజగురునూ పంపించాలనుకున్నారు. విజయ్‌కుమార్, శివవర్మ వీరిద్దరూ భగత్‌సింగ్‌ను పంపడాన్ని వ్యతిరేకించారు. భవిష్యత్తులో వుద్యమాన్ని తీర్చిదిద్దడానికి భగత్‌సింగ్, అజాద్ వీరిద్దరూ - సురక్షితంగా వుండడం అవుసరం అని వీరి వాదన !

బటుకేశ్వరదత్తు కాకోరీసంఘటన దగ్గర్నుండి పార్టీతో సంబంధాలున్న వ్యక్తి ! అసెంబ్లీలో బాంబు పేల్చే విషయం తెలియగానే అతడిలా అన్నాడు. "పార్టీతో చాలా సంవత్సరాలుగా సంబంధం వుంది నాకు; ఐనా, నన్ను ఏ కార్యక్రమంలోకీ తీసుకొనలేదు, ఇలా ఏ కార్యక్రమంలోకీ నన్ను తీసుకోని పక్షంలో పార్టీతో నాకున్న సంబంధాల్ని తెగతెంపులు చేసుకుంటాను;"

చివరకు బంటుకేశ్వరదత్తు విజయ్‌కుమార్ సిన్హాలను అసెంబ్లీలోకి పంపించాలన్న నిర్ణయం జరిగింది, పబ్లిక్ సేఫ్టీబిల్లూ, ట్రేడ్‌డిస్ప్యూట్సుబిల్లూ అసెంబ్లీలో ఓడిపోయాయి. ఇంక ఆ బిల్లుల్ని తన ప్రత్యేకాధికారంతో ప్యాసు చేసినట్టు వైస్రాయి ప్రకటిస్తాడు. ఆ రోజు కోసమే మేము ఎదురు చూస్తున్నాము.

అప్పుడు దాదాపుగా విప్లవ సంఘ సభ్యులంరదూ ఢిల్లీలో వున్నారు. ఏ కార్యక్రమమూ జరగకపోవడంతో విసిగిపోతూన్నారు. సరీగా అదే సమయంలో మాకో సమాచారం అందింది. 'హోలీ పండుగ సందర్భంగా కొత్త ఢిల్లీలోని కొందరు ప్రముఖులు వైస్రాయికి పార్టీ ఇవ్వాలనుకున్నారు. పార్టీ పండుగరోజునే జరుగుతుంది;' ఇది తెలియగానే 'అసెంబ్లీలో బాంబు పేల్చడం తరువాత ముందు వైస్రాయి మీద దాడి చేయాలనుకున్నాము ! ఈ కార్యక్రమం తాలూకు బాధ్యతల్ని శివవర్మ, రాజగురు, జయదేవ్‌కపూర్ - వీరికి వప్పగించాం !

వైస్రాయి కారుకు ముందు పైలెట్ ఒకడు మోటార్ సైకిల్‌మీద వెళ్తాడు. వైస్రాయికారును గుర్తించడం ఏమంత కష్టం కాదు. దాని మీద 'తాజ్' (కిరీటం) గుర్తు వుంటుంది. ఐనప్పటికీ వెళ్తున్న కారు మీద బాంబు వేయడం తేలికైనపని కాదు. కారు మన ముందుకు రావడానికి కొన్ని క్షణాల ముందే చేతుల్లోకి బాంబుల్ని తీసుకుని సిద్ధంగా వుండాలి ! వైస్రాయి వచ్చే దారిలో ముందు రాజగురు నుంచుని వుంటాడు. అతడు కారులో వైస్రాయిని చూడగానే సంజ్ఞ చేస్తాడు, అతడికి కొద్ది దూరంలో జయదేవ్ నిలబడివుంటాడు. ఇతడికి ఇరవై అడుగుల దూరంలో శివవర్మ నిలబడి వుంటాడు. శివవర్మ జయదేవ్ కపూర్ చెరో రెండు బాంబుల్ని చేతుల్లోకి తీసుకుని రెడీగా వుంటారు.

మొదట జయదేవ్ వైస్రాయి కారు మీదకు బాంబు విసురుతాడు, అది గురితప్పితే వెంటనే శివవర్మ తన చేతిలోని బాంబును విసురుతాడు. ఇంతలో జయదేవ్ ముందుకువచ్చి, తన చేతిలోని

రెండవ బాంబునూ వైస్రాయి కారు మీద వేస్తాడు, జయదేవ్ వేసిన మొదటి బాంబు గురితప్పకపోయినా శివవర్మ తన చేతిలోని రెండు బాంబుల్ని వేసి కారును పూర్తిగా ధ్వంసం చేస్తాడు.

పైలెట్ మోటార్ సైకిల్ కనుపించింది. శివవర్మ, జయదేవ్‌కపూర్ బాంబుల్ని చేతుల్లోకి తీసుకున్నారు. మీటనొక్కరడానికి సిద్ధంగా వున్నారు. రాజగురు వంక చూశారు. అతడు అనుకున్న విధంగా సంజ్ఞ చేయలేదు. శివవర్మ, జయదేవ్‌లు - సంజ్ఞ ఎందుకుచేయలేదో అర్థం కాక కంగారు పడుతూన్నారు. కిరీటం గుర్తు గలకారు వీరి ముందుకు వచ్చింది. కారులోకి చూశారు. వాళ్లే డ్రైవరూ, ముగ్గురు యువతులూ వున్నారు. వైస్రాయి లేడు. ముందుగా సంజ్ఞ చేయడానికి రాజగురువును అలా దూరంగా నుంచోమనడం మంచిదయింది. లేకపోతే, కారు మీద కిరీటం గుర్తు చూడగానే శివవర్మ, జయదేవ్ కపూర్ బాంబుల్ని విసిరేవారు. గాంధీగారికీ, కాంగ్రెసుకూ మా విప్లవ సంఘాన్ని నిందించడానికీ, వైస్రాయి పట్ల సానుభూతిని భక్తిప్రపత్తుల్ని ప్రకటించుకోడానికీ - మరో చక్కని అవకాశం లభించేది ! కిరీటం గుర్తు వున్న కారు వెనక వస్తూన్న కార్లలోనూ వైస్రాయిలేడు. తరువాత తెల్సింది, వైస్రాయి చాపల వేటకు వెళ్ళాట్ట ! అటు నుంచి అటే మరో దారిన పార్టీకి హాజరు అయ్యాడు.

బటుకేశ్వర దత్తునూ, విజయ్‌కుమార్ సిన్హానూ అసెంబ్లీలో బాంబు పేల్చడానికి పంపించాలని నిర్ణయించిన సమావేశంలో సుఖదేవ్ లేడు. ఈ నిర్ణయాన్ని వెంటనే సుఖదేవ్‌కు తెలియపరిచాము. వార్త అందగానే సుఖదేవ్ నేరుగా ఢిల్లీ వచ్చేశాడు. తరువాత ఏం జరిగిందో చెప్పడానికి ముందు - ఒక విషయం తెలియపరచడం అవుసరం అనుకుంటున్నాను. భగత్‌సింగ్, సుఖదేవ్‌లు ప్రాణమిత్రులు, ఒకరికోసం మరొకరు ప్రాణం ఇవ్వడానికి కూడా సిద్ధంగా వుంటారు. సుఖదేవ్ - భగత్‌సింగ్‌ను ఒంటరిగా కల్సుకుని ఇలా అడిగాడు "అసెంబ్లీలో బాంబు పేల్చడానికి నువ్వు కదా వెళ్ళవల్సింది ? మరొకర్ని పంపడానికి నిర్ణయం ఎలా జరిగింది ?"

బహుశా భగత్‌సింగ్ ఇలా సమాధానం ఇచ్చి వుంటాడు "ఉద్యమాన్ని కాపాడుకోవడం కోసం తాను వెళ్ళకుండా వుండడం అవుసరమని సమావేశంలో భావించారు !"

సుఖదేవ్ తన మొరటైన కఠినస్వరంతో ఇలా అన్నాడు "ఈ పోచికోలు కబుర్లు నాకు చెప్పకు! నీ వ్యక్తిగత మిత్రుడిగా ఒకటి చెప్తున్నాను విను ! నీ కాళ్ళను నువ్వే నరుక్కుంటున్నావు ! ఈ మార్గం నిన్ను ఎక్కడికి తీసుకువెళ్తుందో తెల్సా ? నీకు అహంకారం బాగా పెరిగిపోయింది. సన్యాల్ దాదాలా, జయచంద్రజీలా తయారవుతున్నావు ! జాగ్రత్త, నువ్విలా పతనానికి పోతూవుంటే చూస్తూ వూరుకోలేను. చివరకు నీ స్థితి ఎలా మారుతుందో తెల్సా ? ఒకనాటికి నువ్వూ భాయీ పరమానంద్ అవుతావు !"

1915 లాహోరు హైకోర్టు తన తీర్పులో భాయీ పరమానంద్ గురించి ఇలా వ్రాసింది . "భాయీ పరమానంద్ ఈ విప్లవ సంఘానికి నాయకుడు. కానీ, చాలా పిరికివాడు. ప్రమాదకరమైన కార్యక్రమాల్లోకి ఇతరులను నెట్టి, తాను సురక్షితంగా వుంటాడు !"

సుఖదేవ్ పై తీర్పును భగత్‌సింగ్‌కు జ్ఞాపకం చేశాడు. తరువాత ఇలా అన్నాడు. "నువ్వూ ఎల్లకాలమూ తప్పించుకోలేవు ! నూవ్వూ ఒకనాటికి కోర్టు ముందు హాజరు పడవల్సి వుంటుంది. ఆనాడు నీ గురించి కూడా భాయీ పరమానంద్ గురించి రాసినట్టేరాస్తారు !"

భగత్‌సింగ్ గొప్ప సాహసికుడే కాక భావుకుడు కూడాను ! ఐనా, మౌనంగా సుఖదేవ్ వంక చూస్తూ వుండిపోయాడు. సుఖదేవ్ అంతటితో ఆగలేదు "నువ్వేం చెప్పబోతున్నావో నాకు తెల్సు ! ఉద్యమం కోసం అమరవీరుడనిపించుకునే సదవకాశాన్ని వదులుకుంటున్నాననబోతున్నావు ! ఔనా ? నీ హృదయాన్ని ఒక్క మాటు తడివిచూసుకో : నీకు ఇప్పుడసలు మృత్యువును ఎదుర్కోవాలన్న తహతహలేదు. నీకు మోజు పెరిగింది. నువ్వు ఆమెను ప్రేమిస్తున్నావు కదూ ? అందుకే జీవితం మీద

మమకారాన్ని పెంచుకున్నావు ! పైగా, నువ్వు లేకపోతే 'విప్లవ సంఘం దిక్కూ మొక్కూ లేకుండా పోతుంది' అనుకుంటున్నావు. ఈ కుంటిసాకులు మరెవరి దగ్గరైనా చెప్పు, నా దగ్గర చెప్పకు ! నువ్వు దిగజారి పోతున్నావ్, జాగ్రత్త" అన్నాడు.

భగత్‌సింగ్ కొద్దిసేపు అలాగే బోనులో పడ్డ పులిలా చూస్తూ వుండిపోయాడు. తరువాత "అసెంబ్లీలో బాంబు పేల్చడానికి నేనే వెడతాను. నన్నే పంపించితీరాలి ! నువ్వు నన్ను ఘోరంగా అవమానపరిచావు . అందుకు నేనేమీ అనను. ఇక మీదట నువ్వు నాతో ఎన్నడూ మాట్లాడకు !" అన్నాడు.

సుఖదేవ్ ఎండుబారిన స్వరంతో "మిత్రుడి పట్ల నా కర్తవ్యాన్ని నిర్వహించాను;" అన్నాడు.

తరువాత ఇద్దరూ వేరువేరు మార్గాల గుండా కేంద్రకమీటిని చేరుకున్నారు.

సుఖదేవ్ లాహోరు వచ్చాడు. అప్పుడతడి కళ్ళు బాగా వాచివున్నాయి. బహుశ చాలాసేపు ఏడ్చివుంటాడు. అతడు ఎవరితోనూ మాట్లాడలేని స్థితిలో వున్నాడు.

ఏడవతారీకు మధ్యాహ్నం సుఖదేవ్, భగవతీచరణ్ ను వెతికిపట్టుకున్నాడు. ఇలా అన్నాడు. "భగత్‌సింగ్‌ను చివరిసారిగా కల్సుకోదలచుకుంటే ఈ రాత్రికి బయల్దేరి ఢిల్లీ వెళ్ళు! బాభీని కూడా వెంట తీసుకువెళ్ళు !"

సుశీలాదీదీ సెలవు మీద లాహోరు వచ్చింది. భగవతీభాయీ ఇంటోనే వుంటోంది. ఆమె కూడా ఢిల్లీకి బయల్దేరింది. భగవతీబాయీ కొడుకు నాలుగేళ్ళ 'శచి' భగత్‌సింగ్‌కు బాగా మాలిమి అయ్యాడు. శచినీ వెంట తీసుకువెళ్ళారు !

ఢిల్లీ చేరాక వీళ్ళందర్నీ 'కుదసియాబాగ్' పార్కులో వుంచి తాను కేంద్రకమిటీ దగ్గరకు వెళ్ళాడు సుఖదేవ్.

కొద్దిసేపటి తరువాత సుఖదేవ్ భగత్‌సింగ్‌ను వెంట పెట్టుకుని పార్కుకువచ్చాడు. ఏం జరుగబోతుందో ఎవరికీ తెలియదు. జరగబోయే విషయాన్ని గురించి ఎవరూ మాట్లాడలేదు. భగత్‌సింగ్‌కు రసగుల్లాలన్నా, కమలాపండ్లన్నా చాలా ఇష్టం ! బాభీ, సుశీలాదీదీ పై తినుబండారాల్ని దండిగా పట్టుకువచ్చారు. ఇద్దరూ భగత్‌సింగ్‌కు వాటిని పెట్టారు. చాలా మమకారంతో తినిపించారు. పదిగంటలాచాయల భగత్‌సింగ్ అందరి దగ్గరా సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. బాభీకీ, సుశీలాదీదీకీ - భగత్‌సింగ్‌కు తుదివీడ్కోలు చెప్తున్నామని మాత్రమే తెల్సు . ఏం జరగబోతుందో వాళ్ళకు తెలియదు. అది పార్టీ అనుశాసనం ! ఇద్దరూ భగత్‌సింగ్ కు తిలకం దిద్దారు. దీవించారు.

1929 ఏప్రియల్ 8 వ తారీకు ! ఆ రోజు అసెంబ్లీలో, వైస్రాయి తన ప్రత్యేక అధికారాన్ని ఉపయోగించి , పై రెండు బిల్లుల్ని శాసనం చేసినట్టు ప్రకటించనున్నాడు. అసెంబ్లీ కార్యక్రమాలు ప్రారంభం అయ్యాక మొదట ప్రశ్నోత్తరాల కార్యక్రమం వుంటుంది. భగత్‌సింగ్, బటుకేశ్వరదత్తు, జయదేవ్‌కపూర్ - వీరు ముగ్గురూ అసెంబ్లీ గ్యాలరీలోకి ప్రవేశించారు. వీరు కూర్చున్న చోటికి బాగా దగ్గరగా ఎదురుగా అధికార పార్టీ సభ్యులు కూర్చుని వున్నారు.

అసెంబ్లీలో బాంబులు ఎక్కడ వెయ్యాలన్న దాన్ని గురించి కూడా చాలా రోజులు చర్చలు జరిగాయి. ఆంగ్ల ప్రభుత్వపు హోం మెంబరు, ప్రభుత్వ పార్టీ నాయకుడు ఐన సర్ సుస్టర్, ప్రతిపక్ష నాయకుడైన పండిత మోతీలాల్ నెహ్రూ, వారి అనుయాయులూ ఎదురు మళ్ళగా చాలా దగ్గరగా కూచుంటారు. బాంబు సర్ సుస్టర్ మీద వేస్తే, అతడితో పాటు కాంగ్రేసు సభ్యులు కూడా దెబ్బతింటారు. స్పీకర్ విఠల్‌భాయీ పటేల్ కూడా దెబ్బతినే ప్రమాదం వుంది. కనుక - సర్ సుస్టర్ వెనుకనున్న చెక్క గోడకు అవతల బాంబు వెయ్యాలన్న నిర్ణయం చేసుకున్నాము. అలా వేయడం వల్ల కాంగ్రేసు

సభ్యులకు ఏమీ దెబ్బతగలదు. అధికార పార్టీ సభ్యులకూ ప్రమాదం సంభవించదు. అసలా రోజున కాంగ్రేసు సభ్యుల్ని అసెంబ్లీకి వెళ్ళకుండా చేద్దామనుకున్నాము. కానీ, అలా చేయడం వల్ల ప్రభుత్వానికి సందేహం కలుగుతుంది. రహస్యం ముందుగా బైటపడుతుంది. అలా చేయలేము.

సర్ సుస్టర్, పై చెప్పిన బిల్లుల్ని గురించి ప్రకటన చేయడానికి లేచి నిలబడగానే అసెంబ్లీలోని ఇతర మిత్రులు బైటకు వెళ్ళిపోయారు. భగత్‌సింగ్ దగ్గర, బటుకేశ్వరదత్తు దగ్గర వున్న అసెంబ్లీ ప్యాసుల్ని తాము తీసుకు వెళ్ళారు. అలాంటి ముందు జాగ్రత్త తప్పనిసరి. ఎందుకంటే, అరెస్టు అవగానే భగత్‌సింగ్, బటుకేశ్వర దత్తుల జేబుల్ని వెతుకుతారు ప్యాసులు వారి దగ్గరే వుంటే అవి ఎవరి ద్వారా లభించాయో తెల్సిపోతుంది. ఇంక ఈ ప్యాసులు ఇప్పించిన సభ్యుడికి - విప్లవ సంఘంతో సంబంధాలున్నట్టు రుజువవుతుంది !

సర్ సుస్టర్ తన స్థానంలో లేచి నిలబడ్డాడు . 'పబ్లిక్ సేఫ్టీ బిలునూ, ట్రేడ్ డిస్ప్యూట్స్ బిల్లునూ, వైస్రాయి యొక్క ప్రత్యేకాధికారంతో ప్యాసు చేసినట్టు ప్రకటించాడు. వెంటనే భగత్‌సింగ్ బటుకేశ్వరదత్తు - లేచి నిలబడ్డారు. మొదటే నిశ్చయించుకున్న ప్రదేశంలో భగత్‌పసింగ్ ఒక బాంబును విసిరాడు. భయంకరమైన శబ్దంతో బాంబు బ్రద్దలయింది. అసెంబ్లీలోని వారందతరూ స్తబ్దులైపోయారు. తరువాత బటుకేశ్వరదత్తు కూడా అదే ప్రదేశంలోకి ఒకబాంబుని విసిరాడు. హాలంతా నల్లని పొగతో కావురు కమ్మేసింది. అసెంబ్లీ సభ్యులూ కార్యక్రమాన్ని చూడటానికి వచ్చిన ప్రేక్షకులూ భయపడి పారిపోసాగారు. ముగ్గురు వ్యక్తులు మాత్రం స్థిమితంగా తమ స్థానాల్లో వున్నారు .- వారు విఠల్ భాయీ పటేల్, పండిత మోతీలాల్ నెహ్రూ, జిన్నా సాహెబ్ ! సర్‌సుస్టర్ కూడా ఎలా నిలబడ్డాడో అలాగే వుండిపోయాడు. భగత్‌సింగ్, సర్‌సుస్టర్ ను గురిచూసి రెండు మార్లు కాల్చాడు. కానీ, గుండ్లు అతడికి తగల్లేదు. అతడి డెస్కకు తగిలాయి. తనను కాలుస్తున్నారని తెల్సుకున్న సుస్టర్ వెంటనే డెస్క్ కిందకు దూరి దాక్కున్నాడు. అప్పటికి ఇంకా భగత్‌సింగ్ పిస్తోలులో ఆరుగుండ్లువున్నాయి. జేబులో మరో ఎనిమిది గుళ్ళు వున్నాయి. అయినా అతను మరెవర్నీ కాల్చలేదు !

భగత్‌సింగ్ దత్తూ - దీర్ఘ స్వరంతో నినాదాలిచ్చారు.

**ఇన్కిలాబ్ జిందాబాద్ !**

**సామ్రాజ్యవాదం నశించాలి !**

**ప్రపంచ కార్మికులారా, ఏకంకండి !**

నినాదాలిస్తూ భగత్‌సింగ్ దత్తూ ఎర్రని ఇంగ్లీషు కరపత్రాల్ని హాలులోకి విసిరారు. ఆ కరపత్రాల్లోని విషయం ..............

## హిందూస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సేన నోటీస్

'చెవిటి వాళ్ళకు వినిపించడం కోసం బాంబులు పేల్చడం అవుసరం ' అని ప్రసిద్ధ ఫ్రెంచి అరాచకవాది - అమరవీరుడు 'వేలియా చెప్పిన పైసూక్తి మా యీ చర్య యొక్క విశిష్టతను చాటుతోంది.

"గత పదిసంవత్సరాలుగా బ్రిటిషు ప్రభుత్వం సంస్కరణల పేరుతో ఈ దేశ ప్రజల్ని ఎంత ఘోరంగా అవమానపరుస్తూ వచ్చిందో వేరే చెప్పనవసరం లేదు. భారత పార్లమెంట్ అనబడే ఈ సభ ద్వారా బండరాళ్ళలాంటి శాసనాల్ని ప్రజల నెత్తి మీదకు విసిరి వారిని అవమానపరచిన సందర్భాల గురించీ వేరే చెప్పనవసరం లేదు అనుకుంటున్నాము. ఇవన్నీ అందరికీ స్పష్టంగా తెలిసిన విషయాలు! ఈ నాడు ప్రజలు "సైమన్ కమీషన్ తమకేమో ఒరగ బెడుతుందని" ఎదురుచూస్తున్న

తరుణంలో, ఆ ఒరగబెట్టే ఎంగిలి మెతుకుల కోసం పరస్పరం కొట్లాడుకుంటున్న సమయంలో, పర ప్రభుత్వం ప్రజల నెత్తి మీదకు మరో బండరాయిని విసురుతోంది. పబ్లిక్ సేఫ్టీబిల్లునూ, ట్రేడ్సుడిస్ప్యూట్స్ బిల్లునూ శాసనం చేసి తన దమన నీతిని మరికొంత పటుతరం చేయాలనుకొంటోంది. ఇంతటితో ఆగక వచ్చే అసెంబ్లీ సమావేశంలో ప్రస్ శాడీషన్ (Press Sedition Act) బిల్లును తెస్తానని బెదిరిస్తోంది. కార్మిక నాయకుల్ని ఇష్టమొచ్చి నట్లు అరెస్టు చేయడం ద్వారా ఈ ప్రభుత్వం తన స్వభావాన్ని (మార్గాన్ని) విశదపరుస్తోంది .

"దమననీతికీ, అవమానానికీ జాతి మొత్తమూ గురౌతూన్నది. ఈ ఉద్రిక్త పరిస్థితిలో , 'హిందూస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సంఘం' తన బాధ్యతను గుర్తెరిగి, తన సైన్యానికి ఈ చర్య తీసుకోవడానికి ఆజ్ఞను ఇచ్చింది. ఈ చర్య ద్వారా మేము పర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూన్నాము. చట్టబద్ధత పేరు మీద ఆడుతూన్న ఈ ప్రహసనాన్ని ఇంతటితో ఆపివేయాలి ! విదేశీ దోపిడిదారైన ఈ సామ్రాజ్యవాద ప్రభుత్వం యొక్క 'చట్టబద్ధత ' అనే ముసుగును చించివేయడం అవుసరం !

"ప్రజాప్రతినిధుల్ని మేము ఒకటి కోరుతున్నాము. మీరు పార్లమెంట్ అనే ఈ మోసపూరిత ఆకర్షణను త్యజించండి ! మీమీ నియోజక వర్గాలకు వెళ్ళి ప్రజలను విప్లవానికి సన్నద్ధం చేయండి ! ప్రజల్ని విదేశీ ప్రభుత్వానికి, దమననీతికి, దోపిడికీ - వ్యతిరేకంగా మోహరించేటట్టు చేయండి . "భారత ప్రజల తరుపున అభివృద్ధి నిరోధక, దమన నీతిని, పటుతరం చేసే శాసనాలకు వ్యతిరేకంగా లాలాలజపతిరాయ్ గారి మృత్యువుకు వ్యతిరేకంగా - మేమీ చర్య తీసుకున్నట్టు విదేశీ ప్రభుత్వానికీ తెలియపరుస్తున్నాము".

"మేము మానవ జీవితం పవిత్రమైందిగా భావిస్తున్నాము. ప్రతి వ్యక్తి పూర్ణ స్వాతంత్ర్యాన్ని అనుభవించగల ఉజ్వల భవిష్యత్తును మేము సంభావిస్తున్నాము. తప్పని సరిగా మానవ రక్తాన్ని ప్రవహింప చేయవల్సి వస్తూన్నందుకు విచారిస్తున్నాం. కానీ, విప్లవం ద్వారా పూర్ణ స్వాతంత్ర్యాన్నీ ఈయగల, ఒక మానవుడు మరో మానవుణ్ణి దోచుకోవడానికి వీలులేని నవసమాజాన్ని నిర్మించేప్పుడు, ఎంతో కొంత రక్తపాతం అనివార్యమౌతుంది !

## ఇన్కిలాబ్ జిందాబాద్ !

సం॥ బలరాజ్
కమాండర్ -ఇన్ - చీఫ్

బాంబు పేలిన శబ్దాన్ని విని అసెంబ్లీలోని వారందరూ , చివరకు కాపలా పోలీసులు కూడా హడలిపోయారు. అందరూ బయటకు పరుగెత్తారు. ప్రేక్షకుల గ్యాలరీ పూర్తిగా ఖాళీ అయింది, కొంత సేపు భగత్‌సింగ్, దత్తూ మౌనంగా నిలబడివున్నారు. వాళ్ళదగ్గరకు రావడానికి కూడా ఎవరూ సాహసించలేదు. భగత్‌సింగ్, దత్తూ - ప్రేక్షకులతో పాటు తామూ బయటకు వెళ్ళడానికి ఎంతో అవకాశం వుంది. ఇద్దరి దగ్గరా పిస్తోళ్ళున్నాయి. గుళ్ళున్నాయి. వీళ్ళ మీద పెట్టిన కేసును విచారించిన జడ్జి కూడా 'వీళ్ళిద్దరూ పారిపోవడానికి తగినంత అవకాశం వుందని' అంగీకరించాడు. తప్పించుకుని పారిపోవడం మా ఉద్దేశ్యం కాదని ముందే చెప్పాను కదా ! మా ఆదర్శాన్ని అభిప్రాయాన్ని చెప్పుకోవడానికి అనువైన సందర్భం కోసం మాత్రమే బాంబు పేల్చాము.

మరొక్క విషయం కూడా గమనించవల్సివుంది. భగత్‌సింగ్, దత్తే 'బ్రిటిష్ రాజ్యం' నశించాలీ అనకుండా 'సామ్రాజ్యవాదం నశించాలి' 'ప్రపంచకార్మికులారా ఏకంకండి' అన్న నినాదాల్ని ఇచ్చారు. ఈ రెండు నినాదాలు 'హి.స.ప్ర.స.' యొక్క రాజకీయ దృష్టి కోణాన్ని విశదపరచడానికి తగివున్నాయి.

భగత్‌సింగ్, దత్తు- అలాగే నిశ్చలంగా చాలా సేపు నిలబడివున్నారు. అప్పటికి సార్జంట్ టెరీ సాహసం చేసి వారి దగ్గరకు వచ్చి ఇలా అడిగాడు. "ఈ పని చేసింది మీరేనా ?"

భగత్‌సింగ్ ఔనన్నాడు. అప్పటికీ అతని చేతిలో పిస్తోలు వుంది. చంపదలచుకుంటే ఇంగ్లీషు సార్జంటును తృటికాలంలో చంపేసేవాడు. కానీ, 'హి.స.ప్ర.స.' పోరాటం ఇంగ్లీషు వ్యక్తుల మీద కాదు. బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యవస్థ మీద ! భగత్‌సింగ్ తన పనేదో చేసేశాడు. ఐతే, సర్‌సుస్టర్ గనుక డెస్కు కింద దూరకపోతే, అతణ్ణి తప్పకుండా కాల్చేవాడు. సుస్టర్ని కాల్చడానికి కారణం; అతడు అసెంబ్లీలో బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రముఖ ఏజెంటు హోదాలో నిలబడ్డాడు. అప్పుడు భగత్‌సింగ్, దత్తు ఖాకీనిక్కరు, ఖాకీచొక్కా వేసుకున్నారు. భగత్‌సింగ్‌చేతిలో ఫెల్టుహేటు వుంది.

భగత్‌సింగ్, దత్తు - లొంగిపోయారు. తరువాత సాయుధ పోలీసులు వాళ్ళను అరెస్టు చేశారు. పెద్ద ఆర్భాటంతో, కాపలతో చెరోకారులో కూర్చోపెట్టుకుని కొత్త ఢిల్లీ పోలీసు స్టేషన్‌కు తీసుకు వెళ్ళారు.

భగత్‌సింగ్‌నూ దత్తునూ తీసుకు వెడుతూన్న కార్లకు దారిలో ఒక టాంగా ఎదురయింది. టాంగా ప్రక్క నుండి కార్లు వెళ్తున్నాయి. టాంగాలో భగవతీచరణ్, బాభీ, సుశీలాదీదీ వున్నారు. సుఖదేవ్ సైకిల్ మీద టాంగాను అనుసరించి వస్తున్నాడు. పోలీసుల్తో నిండి వున్న కార్లు దగ్గరకు వచ్చాయి, ఒకరిని ఒకరుగుర్తించారు. కానీ, గుర్తించనట్టు ప్రవర్తించారు. ఎంతో మానసిక స్థైర్యం వుంటే గాని అలా ఎరగనట్టు ప్రవర్తించగలగడం సంభవం కాదు.

అంతకంటే ఆ క్షణాన భగత్‌సింగ్‌ను రక్షించడం కోసం తమ ప్రాణాలు అర్పించేసేయడం వాళ్ళకెంతో తేలికయిన విషయంగా వుండేది. అంతటి మనో నిబ్బరాన్ని పిరికివాళ్ళు గానీ, వికృతమైన మానసిక స్థితి కలవారు గానీ - ఎన్నటికీ ప్రదర్శించలేరు ! పన్నాదాయి కర్తవ్య నిర్వహణ దీక్షతో తన సంతానం ముక్కలు ముక్కలు అయిపోతూన్నా చూస్తూ నిలుచుండిపోయినట్టు పెద్దవాళ్ళు ఎలాగో నిబ్బరాన్ని ప్రదర్శించారు. కానీ, బాభీ ఒడిలో కూచున్న నాలుగేళ్ళ శచి, కారు దగ్గర్నుండి పోయేటప్పుడు భగత్‌సింగ్‌ను చూశాడు. రెండు చేతులూ కారువైపు చాపి 'లంబేచాచాజీ!'(పొడుగు బాబాయిగారూ !) అని అరిచాడు.

వెంటనే దుర్గాబాభీ, శచిముఖాన్ని తన ఒడిలో దాచుకుంది. అలా అతడు కేకలు వేయకుండా చేసింది. పొంగిపొర్లివస్తున్న దుఃఖాన్ని ఆపుకోవడం కోసం గొంతునొక్కుకున్న చందం అయింది !

అసెంబ్లీలో బాంబు పేల్చిన ఈ సంఘటన మొత్తం దేశాన్ని కుదిపివేసింది. ఆంగ్ల ప్రభుత్వ పోలీసు బలగాలు కంగుతిన్నాయి. కలకత్తా నుంచి స్పెషల్ టెర్రరిస్టపోలీసుల్ని ఢిల్లీ రావించారు.

న్యాయస్థానంలో తన ఆదర్శాన్ని చెప్పుకోవడం కోసం 'హి.స.ప్ర.స. ' భగత్‌సింగ్‌నూ, దత్తునూ - అసెంబ్లీలో బలిపెట్టుకుంది, మరి న్యాయస్థానంలో తమ ఆదర్శాన్ని వీరు ఎలా చెప్పుకోగలుగుతారు ? వీరి మీద అసెంబ్లీలో బాంబు పేల్చి నరహత్యకు పాల్పడ్డట్టు' అభియోగాన్ని మోపాడు సెసన్సు జడ్జి. భారత శిక్షస్మృతి సెక్షన్ 307. కింద పేలుడు పదార్థాలు కలిగి వున్నందకు వీరికి జన్మఖైదు విధించాడు.

భగత్‌సింగ్ బాంబు పేల్చానని అంగీకరించాడు. కానీ, నరహత్యకు పాల్పడ్డారన్న అభియోగాన్ని తిరస్కరించాడు. దేశంలోని ప్రస్తుత పరిస్థితిని గురించి హెచ్చరికచేయడం కోసం మాత్రమే బాంబు పేల్చానని వాదించాడు. అసెంబ్లీలో బాంబు పేల్చడం అనే తన చర్యను, తన ఉద్దేశ్యాన్నుండి, తన అభిప్రాయన్నుండి - వేరుపరచి చూడరాదని గట్టిగా వాదించాడు. న్యాయస్థానమూ, ప్రజలూ కూడా మా ఉద్దేశాన్ని గమనించాలని కోరాడు.

సెషన్స్ జడ్జి ఉద్దేశ్యానికి ప్రాధాన్యత నీయకుండా తన తీర్పులో ఇలా రాశాడు "సాధారణంగా, అపరాధానికి వెనుక వున్న ఉద్దేశ్యానికి ప్రాధాన్యత ఈయడం జరగదు. మా ముందున్న అపరాధం గురించి మాత్రమే మేము ఆలోచిస్తాము !"

పైన ఉదహరించిన సెషన్స్ జడ్జి అభిప్రాయాన్ని ఖండిస్తూ భగత్‌సింగ్ ఇచ్చిన ఉదాహరణలు అతడి మేధోసంపదకు నిదర్శనాలు ! తమ చర్యల నుండి ఆదర్శాన్ని వేరుపరచరాదన్నాడు "మానవుడి ప్రాణం తీయడం వరకూ ఆలోచిస్తే, ఒక వ్యక్తిని చంపడమూ, కొన్ని వేల మందిని యుద్ధ క్షేత్రాల్లో మిషన్ గన్నులతో కాల్చి చంపడము - ఒక్కటే క్రియ ! పరిణామమూ ఒకటే ! కానీ, ఒకరిని చంపినవాడిని హంతకుడంటాము ! కానీ యుద్ధం చేసే దేశాలను గానీ, సేనాపతుల్ని గానీ - హంతకులని పిలవము! ఒక మనిషిని బెదిరించి జేబుకొట్టడము, పన్నులు వసూలు చేయడము - రెండింటి పరిణామము ఒకటే, ఇతరుల జేబుల్ని ఖాళీ చేయడం ! కానీ పన్నులు వసూలు చేసే అధికారిని జేబులు కొట్టేవాడదము! భగత్‌సింగ్, సులేమాన్ చెప్పిన సందర్భాన్ని ఒకదాన్ని ఉటంకించాడు. "ఎలుకల్ని చంపడానికీ అన్నంలో మందు కలుపుతాం, మనుషుల్ని చంపడానికీ కలుపుతాం; అన్నంలో మందుకలపడం అనే క్రియ యొక్క మంచి చెడ్డలు ఉద్దేశ్యంమీద ఆధారపడివుంటాయి;"

భగత్‌సింగ్ హైకోర్టులో మరి కూడా ఇలా అన్నాడు "మాకు విధించిన శిక్షను గురించి మేము ఎలాంటి అభ్యంతమమూ చెప్పడం లేదు. కానీ, మమ్మల్ని హంతకులనడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము!"

విప్లవాన్ని గురించి భగత్‌సింగ్ ఇలా అన్నాడు "విప్లవాన్ని వ్యతిరేకించేవారు కేవలము పిస్తోళ్ళు, బాంబులూ, కత్తులూ, రక్తపాతమే విప్లవం అనుకుంటున్నారు. ఇవి విప్లవానికి సహాయపడే ఉపకరణాలు మాత్రమే ! కేవలం ఆయుధాలు మాత్రమే విప్లవం కాదు. వీటి వెనుక , సామాజిక , రాజ నైతిక ఆర్థిక పరిస్థితుల్ని ఆమూలాగ్రం మార్చివేసుకోవాలన్న ప్రజల బలమైన కోర్కె వుంటుంది. అది నిజమైన విప్లవ శక్తి; మా ఉద్దేశ్యంలో విప్లవం అంటే కేవలం కొంతమంది వ్యక్తుల్ని చంపడం మాత్రమే కాదు. ఒకమానవుడిని మరో మానవుడు దోచుకోవడాన్ని అంతం చేసి, ఈ దేశంలో సమసమాజాన్ని నిర్మించడం మా ఆదర్శం !"

# లాహోరు బాంబు ఫ్యాక్టరీ పోలీసుల వశం !

అటు ఢిల్లీలోని సీతారాం బజార్లో (జయదేవ్ కపూర్ ద్వారా తీసుకున్న ఇంట్లో) కేంద్రకమిటీ ముఖ్యులందరూ అసెంబ్లీలో బాంబు ప్రయోగ కార్యక్రమాన్ని గురించి తర్జనభర్జనలు జరుపుతున్నారు. అదే సమయంలో లాహోరులోనూ ప్రజల సహకారంతో, హి.స.ప్ర.స. కార్యక్రమాలు తీవ్రమయ్యాయి. పలుకుబడీ పెరగసాగింది.

నేను అప్పటికి ఒక సంవత్సరంగా ఉద్యోగం చేస్తున్నాను. లాయల్‌పూర్ 'ఆర్యకన్యా పాఠశాల్లో' పని చేస్తున్న మా అమ్మగార్ని వుద్యోగం మాన్పించి లాహోరు పిలిపించాను. సుఖదేవ్, సహాయకంగా వుంటుందని సోదరి ప్రేమవతిని కూడా లాయల్‌పూర్ నుండి లాహోరు పిలిపించమన్నాడు. అలాగే పిలిపించడం జరిగింది. గోపీచంద్ గారి రికమండేషన్‌తో, బచ్చోవాలీ ఆర్యకన్యా పాఠశాల్లో ప్రేమవతికి ఉద్యోగం ఇప్పించడమూ జరిగింది.

సోదరి ప్రేమవతి తండ్రి చనిపోయాడు. ఆమె లాహోరు వచ్చింది.ఆమెతో పాటు ఆమె తల్లి కూడా లాహోరు వచ్చింది. బచ్చోవాలీలో ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నాము. మేము వాళ్ళూ కూడా అక్కడే వుంటున్నాము. ప్రేమవతి లాహోరు వచ్చాక విప్లవ సంఘానికి ఎంతో సహకారాన్ని ఇచ్చింది.

ప్రేమవతి భర్త చనిపోయి ఆయిదేళ్ళయింది. భర్తపోయాక ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. నెత్తిన కిరోసిన్ పోసుకుంది. ఇంక అగ్గిపుల్ల గీచి ముట్టించుకోవడమే ఆలస్యం, ఇంతలో నలుగురికి తెల్సింది. .ఆ ప్రయత్నం ఆగిపోయింది. ఆ తరువాత ఆమె దాదాపు మూడేళ్ళ పాటు ఏకాంతవాసాన్ని గడిపింది. అతి దారుణమైన నిరాశలో పడిపోయింది. మానసికంగా ఆమెకు కొంత ఊరట కలుగుతుందనే వుద్దేశ్యంతో తండ్రి ఆమెను ఆర్యకన్యాపాఠశాల్లో ఉపాధ్యాయినిగా ఉద్యోగానికి కుదిర్చాడు. ఆ ఉద్యోగానికి జీతభత్యాలు ఏమీ ఇవ్వరు. తండ్రి పోయాక, కుటుంబ నిర్వహణకుగాను అదే పాఠశాల్లో జీతం మీద ఉపాధ్యాయినిగా పని చేయసాగింది, ప్రేమవతి.

జీవితం పట్ల ఆమెకు కొంత ఆశను కలిగించడం అవుసరం. పంజాబ్ యూనివర్శిటీ హిందీ పరీక్షలకు కూచోమని ప్రోత్సహించాను. ఆ పరీక్షలు ప్యాసు అయితే ఉపాధ్యాయురాలిగా స్థిరపడుతుంది. ఆమె జీవిత పరిస్థితులు బాగుపడతాయని ఉద్దేశ్యం; నేను లాయల్‌పూర్‌లో వుండగా ప్రేమవతిని 'భూషణ్' పరీక్షకు చదివించాను. పాఠాల్తో పాటు విప్లవకారుల జీవితాల్ని గురించి, విప్లవాన్ని గురించి చెప్తూండేవాణ్ణి ! నిరాశావృతమయిన తన జీవితానికి ఒక ఆదర్శం, ఒక ఉద్దేశ్యం వున్నాయన్న ఆత్మవిశ్వాసం కలిగింది ఆమెలో;

ప్రేమవతికి ముఖ్యమైన శిష్యురాండ్రు ఇద్దరుండేవారు. ప్రకాశవతి-స్వదేశ్ వీళ్ళిద్దరు ! పంజాబ్ విప్లవకారుడు పిండీదాస్ కూతురు స్వదేశ్ ! ప్రకాశవతి ఇల్లూ వాకిలి వదలి హి.స.ప్ర.స.లో చేరిపోయింది. ఢిల్లీ కుట్రకేసు యొక్క ప్రభుత్వ సాక్షులు 'ప్రకాశవతి ఢిల్లీ బాంబు ఫ్యాక్టరీలో ప్రధానమైన వ్యక్తిగా వుండేదని ' చెప్పారు. దుర్గాబాభీ, సుశీలాదీదీ, ప్రకాశ్‌వతి - ఈ ముగ్గుర్ని పట్టించినవారికి ప్రభుత్వం బహుమతుల్ని కూడా ప్రకటించింది. ఢిల్లీ కుట్రకేసు నిందితులందరూ అరెస్టయ్యాక 1933లో గానీ ప్రకాశ్‌వతి అరెస్టు కాలేదు.

భగవతీచరణ్ పరారీలో వున్నాడు. మీరట్ కుట్రకేసులో అతడు నిందితుడు. ప్రభుత్వం మాటిమాటికి అతడి ఇంటిని సోదా చేస్తున్నది. ఒకమాటు సుఖదేవ్ బాంబులకు అవుసరం అయిన ఢిప్పుల్ని కొన్నింటిని తయారు చేయించుకువస్తూ బాభీని కల్సుకోవడానికి భగవతీచరణ్ ఇంటికి వెళ్ళాడు. మాట్లాడడం అయ్యాక డిప్పుల్ని అక్కడే వదిలివెళ్ళాడు. అనుకోకుండా అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు పోలీసులు సోదా చేయడానికి వారంటు పట్టుకు వచ్చారు.

బాభీ మనస్సులో చాలా భయపడ్డది. కంగారుపడ్డది. పైకి మాత్రం నిబ్బరంగా సమాధానం ఇచ్చింది. "వారు ఇంట్లోలేరు ఇతర మగవాళ్ళూ ఎవరూలేరు, మాకు నమ్మకం అయిన వ్యక్తి ఎవరైనా వుంటే గాని సోదా చేయనీయను. సోదా చేసేటప్పుడు మా మనుషులూ వుండాలి కదా ? మీరే ఏదైనా నిషిద్ధ వస్తువును పట్టుకువచ్చి మా ఇంట్లో దొరికింది, అనవచ్చు కదా ?" అన్నది.

పోలీసులు నిషేదించబడిన కమ్యూనిస్ట్ సాహిత్యం ఉందన్న ఉద్దేశంతో వచ్చారు. సోదా చేసేవరకూ ఇంట్లో నుంచి ఏ చిన్న వస్తువునూ బయటకు తీసుకు వెళ్ళనీయమని పట్టుపట్టారు. బాభీ నమ్మకస్థులైన పెద్ద మనుషుల్ని తెచ్చుకునే వరకు కూచుంటామన్నారు.

బాభీ కంగారు పడుతూ మా యింటికి వచ్చింది. పరిస్థితిని నాకూ ప్రేమవతికి వివరించి చెప్పింది. మేము బాభీని వెంటపెట్టుకుని స్వదేశ్ ఇంటికి వెళ్ళాము.స్వదేశ్ ఇల్లు గ్వాల్ మండీలో, బాభీ ఇంటికి నాలుగడుగుల దూరంలోనే వుంది. బాభీని అక్కడే వుండమని, స్వదేశ్‌ను బాభీ ఇంటికి పంపించాము.

స్వదేశ్ , తాను సుశీలాదీదీ పెంచుకుంటూన్న జబ్బుపడిన పిల్లవాడిని చూడటానికి వచ్చానని పోలీసుల్తో చెప్పింది. పోలీసులు ఆ అమ్మాయిని ఇంట్లోకి వెళ్ళనిచ్చారు. బాంబుల డిప్పలు ఎక్కడ ఉన్నాయో చెప్పి పంపించడం వల్ల, వాటిని తన బట్టల్లో దాచుకుని పోలీసుల ముందునుంచే వచ్చేసింది.వచ్చేటప్పుడు పోలీసులు వినేట్టు సుశీలాదీదీ చెల్లెల్ని ఉద్దేశించి "పసివాడికి మందులు తీసుకుని వెంటనే వచ్చేస్తాను !" అని చెప్పి మరీ వచ్చేసింది. మేము, స్వదేశ్ ఇంటి దగ్గరేవున్నాము. డిప్పలు, వచ్చేశాక బాభీ - గంభీరంగా నన్ను వెంట బెట్టుకుని వెళ్ళింది ఇంటికి. నేను భగవతీచరణ్ తరుపున వారంటును చూశాను. సోదా చేసుకోమన్నాను.

సాండర్సవధ జరిగిన మరుసటి రోజున నేను గోపీచంద్ భార్గవ్ గారిని కల్సుకోవడం వారు మారు మాట్లాడుకుండా రెండువందల రూపాయిలు ఇవ్వడంతో ఎంతో ఉత్సాహపడ్డాను. పార్టీకి మంచి సహాయకుడు దొరికాడనుకున్నాను. ఐతే, ఆ తరువాత నుంచి డాక్టరు గారు తన అసెంబ్లీ కార్యక్రమాల గురించి నాతో మాట్లాడడం బాగా తగ్గించారు. ఈ ఉదాసీనతను నేను మరోరకంగా అర్థం చేసుకున్నాను. 'విప్లవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గోనే అవకాశాన్ని నాకు ఇవ్వడం కోసం అసెంబ్లీ బాధ్యతలను నాకు వప్పగించడం లేదు, అనుకున్నాను. ఐతే, త్వరలోనే డాక్టరుగారు ఇలా ప్రవర్తించడానికి కారణం తెల్సింది. నన్ను ప్రమాదకరమైన వ్యక్తిగా భావించి సాధ్యమైన వరకు దూరంగా వుంచడం కోసం అలా ప్రవర్తిస్తున్నారని తెల్సుకున్నాను. ఇంక అలాంటప్పుడు వారి దగ్గర ఉద్యోగం ఎలా చేయగలను ? మచ్ఛీ - హట్టాలో హిందూ సంగఠన్ కోసం వారు తీసుకున్న ఇంటినీ నేను ఖాళీచేయక తప్పలేదు !

డాక్టరుగారు నాకు మూడునెల్ల జీతం ఇవ్వాలి.ఒకటి రెండు మార్లు చాలా మోమాటపడుతూ జీతం అడిగాను. వారు నవ్వుతూ "చుద్దాం" అన్నారు. ఇంకేమి అడిగేట్టు? జీతం ఇవ్వలేదు గానీ, "లక్ష్మీ ఇన్సూరెన్సు కంపెనీ"లో నాకు ఉద్యోగం ఇప్పించారు.

ఈ ఉద్యోగం ఇప్పించినందుకు డాక్టరుగారికి నేను కృతజ్ఞత చెప్పక తప్పదు. బహుశ వారు, నన్ను ఒదిలించుకోడానికి నాకీ ఉద్యోగం ఇప్పించివుంటారు ! లక్ష్మీఇన్సూరెన్సు కంపెనీలో జీతం చాలా తక్కువ. మరో స్థితిలో ఐతే, అంత తక్కువ జీతానికి నేనా ఉద్యోగం చేసేవాణ్ణి కాదు. కానీ, చేయక తప్పదు. మా అమ్మగారు లాయల్‌పూర్ ఉద్యోగం మానారు. లాహోరులోనే వుంటున్నారు. ఇల్లు గడవడానికి మరే మార్గం లేదు. లక్ష్మీ ఇన్సూరెన్సు కంపెనీలోని అనుభవాలు బహుచేదైనవి. అంతక్రితం చేసిన ఉద్యోగాల్నింటిలోనూ నేను ప్రశంసల్నే పొందాను ! కానీ లక్ష్మీ ఇన్సూరెన్సు కంపెనీలో తిరస్కారానికి, విమర్శలకూ గురి అయ్యాను. క్లర్క్ ఉద్యోగానికి నేను ఏ విధంగానూ, తగనన్న నిర్ణయానికి అప్పుడే వచ్చాను. ఆ ఉద్యోగం నాకెంతో విసుగునూ, అయిష్టాన్ని కలిగించింది. మాటిమాటికీ పొరపాట్లు చేసేవాణ్ణి. చివాట్లు తినేవాణ్ణి ! గొప్ప వకీల్నో, ప్రొపెసర్నో, రాజకీయ కార్యకర్తనో కావాలన్న నా కోర్కె ఎక్కడా! ఈ ఇన్సూరెన్సు క్లర్కు ఉద్యో గం ఎక్కడ ?

సుఖదేవ్ ఏదైనా విప్లవ కార్యక్రమం తాలూకు బాధ్యతను వప్పగించిప్పుడు చాలా ఇరకాటంలో పడేవాణ్ణి. ఆఫీసుకు వెళ్ళి సెలవు అడిగితే హెడ్‌క్లర్క్ గదమాయించేవాడు. కోప్పడేవాడు. "సెలవు.....సెలవు.....రోజూ సెలవేనా ? నీకు అంత అవుసరం అయిన పనులు వుంటే, ఉద్యోగానికే ఒక సెలవు పారేసి వెళ్ళిపోకూడదు ? కంపెనీకి ఉద్యోగులు తరుగు అనుకోకు, ముందు కంపెనీ పని, తరువాత సొంతపనీ" అనేవాడు.

నేను మనస్సులోనే చాలా కించపడేవాణ్ణి. "బతకడానికి ఒక్క క్లర్కు ఉద్యోగమేనా ? మరో మార్గం లేదా నాకు ?" అనుకునేవాణ్ణి, నేను కాగితం బుడగలో వున్నట్టూ, ఆ బుడగను పగుల గొట్టుకుని బయటకు రాలేని వివశ్వంతో తన్నుకు లాడుతున్నట్టూ - బాధపడేవాడిని. అలాంటప్పుడు ఈ వ్యవస్థలోని అసమానత కొట్టవచ్చినట్టు కనిపిస్తూ వుండేది నాకు;

ఆగ్రా కేంద్రాన్ని ఢిల్లీకి మార్చాక యు.పి.కి సహారన్‌పూర్ లోని 'లకడ్‌మండీ' లోనూ పంజాబుకు లాహోరులోని కిలాగుజ్జర్ సింగ్ దగ్గర వున్న కాశ్మీరీ బిల్డింగ్‌లోనూ బాంబు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలన్న ఆలోచనలు జరుగుతూన్నాయి. కాశ్మీరీ బిల్డింగ్‌లో మూడు నాలుగు నెల్ల క్రితమే ఒక గదిని భగవతీచరణ్ అద్దెకు తీసుకున్నాడు. పైగా, దాన్ని తన అసలు పేరు మీదనే అద్దెకు పుచ్చుకున్నాడు. ఇంక సుఖదేవ్, ఢిల్లీ, యు.పి.ల్నుండి వచ్చే మిత్రులకు ఆ గదిలోనే నివాసాన్ని ఏర్పాటు చేయసాగాడు. ఆ గదిలోని బాంబు ఫ్యాక్టరీ పోలీసుల వశం అయ్యాక భగవతీచరణ్‌ని 'నీ అసలు పేరుతోనే ఆ గదిని ఎందుకు తీసుకున్నా' అని అడిగాను.

అప్పుడు భగవతీచరణ్ ఇలా అన్నాడు "ఇంటికిదూరంగా, ప్రశాంతంగా, ఏమైనా రాసుకోవడానికో, చదువుకోవడానికో వుంటుందని తీసుకున్నాను".

భగవతీచరణ్ అలా ప్రత్యేకం గది తీసుకోవడమూ సహజమే ! వాళ్ళ ఇల్లు లాహోరులో సాయుధ విప్లవ పోరాటానికీ, అటు నౌజవాన్ భారతసభ కార్యక్రమాలకు - ఈ రెండింటికి కేంద్రంగా వుండేది, ఎప్పుడూ సందడిగా వుండేది. ఇంతమంది వచ్చిపడుతూ వుంటే, దుర్గాబాభీ మనస్సులో ఏమనుకునేదో ఏమో గాని, పైకి మాత్రం అప్యాయతగా "రాండి" అనేది. నౌకరు లేకపోతే, తానే గోధుమపిండి తడిపి వంట ఏర్పాట్లు చేసేది. ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పుకోడానికి కొందరువస్తూండేవారు. భగవతీచరణ్ కొన్నాళ్ళు సంగీతాన్ని అభ్యసించాడు. ఆ మిత్రులూ వస్తుండేవారు. ఇలా వివిధరకాలవారూ వస్తుండడమూ ఒకరకంగా మంచే అనాలి. కేవలమూ రాజకీయంగా అనుమానాస్పదమైన వాళ్ళే వస్తుంటే ప్రభుత్వానికి మరీ గంగ వెర్రులెత్తుతాయి !

ఆ రోజుల్లో భగవతీచరణ్ మీద మీరట్ - కుట్రకేసు సంబంధంగా అరెస్టు వారంటుండడం వల్ల రహస్యజీవితాన్ని గడుపుతూన్నాడు. ఆగ్రాలోనో, అలహాబాదులోనో వుంటున్నాడు. ఇంక కాశ్మీరీ బిల్డింగ్‌లో తీసుకున్న గదిలో సుఖదేవ్ బాంబు ఫ్యాక్టరీకి అవసరం అయిన సరంజామా తెచ్చి పడేయసాగాడు.అప్పటికి నేను కేవలం రెండుమూడుసార్లు మాత్రమే ఆ బిల్డింగ్ దగ్గరకు వెళ్ళాను. అదీ కొత్త మిత్రుల్ని దిగబెట్టడానికి వెళ్ళాను. సుఖదేవ్ వెళ్ళమంటేనే అక్కడికి వెళ్ళేవాడిని. ఒకమాటు సుఖదేవ్ చెప్పగా కొన్ని రసాయనిక పదార్థాల్ని కొని ఇచ్చి రావడానికి ఆ బిల్డింగ్ దగ్గరకు వెళ్ళాను. అప్పుడే శివవర్మను మొదటిసారిగా అక్కడ చూశాను. నేను తీసుకువెళ్ళినవే కాకుండా మరికొన్ని రసాయనిక పదార్థాలు అంతకుముందే అక్కడ వున్నాయి. రసాయనిక పదార్థాలు ఎందుకో ఊహించలేనంత అమాయకుణ్ణి కాదుగదా ? బాంబుల తయారీకి ప్రేలుడు పదార్థం తయారుచేయబోతూన్నారనుకున్నాను. నాకూ ఉత్సాహం కలిగింది !

సుఖదేవ్ వచ్చాక పేలుడు పదార్థాన్ని తయారు చేసేటప్పుడు ఎవరెవరుండాలన్న దాన్ని గురించి మాట్లాడుకోనటం జరిగింది. ఇలాంటి విషయాల్లో ఎక్కువ మందిని చేర్చడం మంచిది కాదని శివవర్మ అన్నాడు. వాటిని తయారు చేసేటప్పుడు, కాలేజిలో రసాయనశాస్త్రాన్ని అభ్యసించిన మిత్రులు వుండడం ఉపయోగకరంగా వుంటుందనీ అన్నాడు. ఐతే, మాలో రసాయనశాస్త్రాన్ని అభ్యసించిన వ్యక్తి భగవతీచరణ్ ఒక్కడే ! అతడేమో అప్పుడు లాహోరులోలేడు. సుఖదేవ్, నన్నూ - బాంబులు చేయడం నేర్చుకోమన్నాడు. ముందు మర్కరీ ఫల్మనేట్ తయారుచేయాలనుకున్నారు. పిక్రిక్‌యాసిడ్, గన్ కాటన్ ఎటూ ఆగ్రాలో తయారయ్యాయి కదా !

మధ్యాహ్న సమయం. సుఖదేవ్, ఓ పింగాణీ పళ్ళెంలో ముందు పాదరసం వేశాడు. తరువాత నిదానంగా మరో ద్రావకాన్ని దాన్లో కలుపసాగాడు. పళ్ళెంలోంచి క్రమంగా పొగలేవసాగింది. నల్లని మేఘాల్లా కావురు కమ్మింది గదిలో. మేము ఊపిరాడక దగ్గడం ప్రారంభించాము. తుండ్లను

నోటికీ ముక్కుకూ అడ్డం పెట్టుకున్నాము. ఐనా, అక్కడేవుండి కలుపుతున్నాము. పాదరసంలో అలా ద్రావకాన్ని వేసేటప్పుడు ఓ గాజు కడ్డీతో ఆపకుండా నిరంతరమూ కలుపుతూ వుండడమూ అవసరమే! కనుక మేము ఆ పళ్ళేన్ని విడిచి దూరంగా వెళ్ళడానికి వీలులేదు ! ఒక ద్రావకం పూర్తిగా కలపడం అయిపోయాక, మరో ద్రావకాన్ని కలపడం ప్రారంభించాము. ఈ రెండవ ద్రావకం నాలుగు చుక్కలు పడేసరికి గదంతా నల్లని పొగతో కావురుకమ్మేసింది. మేము శ్వాసపీల్చడానికి గానీ, మాట్లాడుకోవడానికి గానీ అవకాశం లేకుండాపోయింది. ఈ ద్రావకాన్ని పోసేప్పుడూ దగ్గరవుండి కలుపుతూ వుండడం తప్పదు ! రెండు క్షణాల తరువాత ఊపిరి అడక ముగ్గురం గిలగిల్లాడసాగాము. పోనీ, ఒక్కొక్కరుచొప్పున వంతుల ప్రకారం వచ్చి కలుపుతూండడం మిగిలిన ఇద్దరు బయటికి వెళ్ళి శ్వాస పీల్చుకోవడం మంచిదని అనుకున్నాం ! ఐతే, ఆ విషయాన్ని మాలో మేము చెప్పుకోవడానికి వీల్లేనంత దారుణంగా పొగకావురు కమ్మేసింది ! ఒక్క క్షణం తరువాత ఇక తట్టుకలేక ముగ్గురం వరండాలోకి వచ్చిపడ్డాము. తరువాత మేము ముగ్గురమూ వంతుల ప్రకారం వెళ్ళి శ్వాససీల్చకుండా వుండగలిగినంతసేపు ద్రావకాన్ని కలుపుతూ వుండడానికి నిశ్చయించుకున్నాము. ఒకళ్ళ తరువాత ఒకళ్ళుగా అలా వెళ్ళికలిపాము.

బయటికి వచ్చాక సుఖదేవ్‌తో " మనం చాలా పిచ్చిపని చేస్తున్నాము. పై భాగాల్లో గృహస్థులు వున్నారు. ఈ పొగ, దుర్గంధం - రెండు వందల గజాల వరకూ పైకి కొడుతూన్నది ! ఇక్కడ ఇలా చేయడం తగదు !"అన్నాను.

సుఖదేవ్ చాలా నిర్లక్ష్యంగా "మన పని మనం చేసుకు పోక తప్పదు కదా ! ఇతర్లకోసం ఆపలేము !" అన్నాడు.

అప్పటికీ మళ్ళీ ఇలా అన్నాను. "ఇతర్ల కోసం కాకపోయినా, మనం చేసేపని నలుగురి దృష్టినీ ఆకర్షించకూడదు కదా ?"

దాదాపు ఓ రెండు గంటలు అలా సతమతం అయ్యాక సుర్మా లాంటి నల్లని పదార్థం 'మర్కరీ ఫల్మినేట్' తయారయింది. అదొక అరతులం వుంటుంది. ఒక సీసాలో నీళ్ళు పోసి దాన్లో ఈ అరతులం పదార్థాన్ని వేసి మూత పెట్టేశాం.

ఆరోజు రాత్రి నేను బాంబు ఫ్యాక్టరీలోనే పడుకున్నాను. ఆ తరువాత కూడా చాలా సార్లు నేనా గదిలోనే పడుకున్నాను. పక్కనున్న టిక్కీ హోటల్ నుండి రొట్టె తెప్పించుకుతిని అక్కడే పడుండేవాణ్ణి ఒక్కోమాటు ! బాంబు ఫ్యాక్టరీకి అవుసరం అయిన కొన్ని పాత్రలనూ, వస్త్రాలనూ నాయింటి నుండి పట్టుకువచ్చి పడేశాను. వాటి మీద నా పేరు వుంది. ఇది నేను పడ్డ గొప్ప పొరపాట్లల్లో ఒకటి ! ఫ్యాక్టరీ పట్టుపడ్డాక నేను అక్కడ వున్నాననేది ఆ వస్తువుల వలన స్పష్టమైంది.

1929 ఏప్రియల్ నాలుగో తారీకునో, లేక ఐదవతారీకునో సుఖదేవ్-భగత్‌సింగ్, దత్తు ఫోటోల నెగటివ్‌లను నాకు ఇచ్చాడు. అవి ఎవరివో చెప్పలేదు. "బాంబు పేలిన దృశ్యానికి రెండు వైపులా ఈ రెండు చిత్రాలూ వుండేట్టు ఫోటోతీయించి, ఆరు కాపీలు పట్రా" అని చెప్పాడు సుఖదేవ్. ఎందుకు ? ఏమిటి ? అని ప్రశ్నించడం అనవసరం ! నేను సుఖదేవ్ చెప్పిన పనిని చేసుకు రావడానికి వెళ్ళాను. బాంబు పేలిన ఊహా చిత్రాన్ని ఒకదాన్ని తయారు చేశాను. భగత్‌సింగ్, దత్తు ఫోటోల నెగటివ్‌లతో రెండు ఫోటోలను తీయించి, వాటిని ఈ ఊహా చిత్రానికి రెండు వైపులా అతికించాను. మళ్ళీ అదే ఫోటోగ్రాఫరు దగ్గరకు వెళ్ళి, భగత్‌సింగ్, దత్తు ఫోటోలు అతికించబడిన కాల్పనిక చిత్రాన్ని ఫోటో తీసి, ఆరు కాపీలు ఇవ్వమన్నాను.

ఈ లోపు ఢిల్లీ అసెంబ్లీలో బాంబు పేల్చడం జరిగింది. ఫోటో గ్రాఫరు ఇవ్వాళ ఇస్తాను, రేపు ఇస్తానని తిప్పుతున్నాడు నన్ను ! ఏప్రియల్ పదకొండవ తారీఖున అనుకుంటాను, కాపీలు తీసుకు

రావడానికి ఫోటో గ్రాఫరు దగ్గరకు వెళ్ళాను. అక్కడొక వ్యక్తి కూచుని వున్నాడు. అతడి తల పాగాను చూస్తేనే అతడు సి.ఐ.డి. అని తెలుస్తున్నది. నన్నతడు తదేక దీక్షగా చూడటాన్ని గమనించాను. కొంతసేపటికి గాని విషయం అర్థం కాలేదు.

అప్పటికి రెండు రోజుల క్రితమే ఢిల్లీ అసెంబ్లీలో బాంబు ప్రేలిన విషయం పత్రికల్లో ప్రచురింపబడ్డది. దత్తు - భగత్‌సింగు ఫోటోలను కూడా వేశారు. బాంబు పేల్చినవారి విషయమూ, పేల్చిన వారి ఫోటోలూ పత్రికల్లో ప్రచురింబడ్డ తరువాత, వాళ్ళ ఫోటోలను ఈ విధంగా తీయించే వ్యక్తిపై పోలీసుల దృష్టిపడడం సహజం ! ఐతే,, ఫోటోగ్రాఫరు ఒకటి రెండు రోజుల్లో పనిచేసి ఇచ్చినట్లయితే ఏ గొడవ లేకుండా పోయేది. ఇంత జరిగి భగత్సింగ్ దత్తు ఫోటోలు పత్రికల్లో ప్రచురింపబడ్డాక ఇంక నేను ఆఫోటోగ్రాఫరు దగ్గరకు వెళ్ళకుండా వుండవల్సింది. ఐతే, పూర్వానుభవం లేదుగా మరి?

నేను ఫోటోగ్రాఫరుకు డబ్బు ఇచ్చి, ఫోటోలు తీసుకున్నాను, వెళ్ళడానికి బయలుదేరాను. సైకిల్ మీద రావడం కొంత మేలు చేసింది. నేను సైకిల్ దగ్గరకు వెళ్ళేసరికి నన్ను చూస్తున్న వ్యక్తి తన సైకిల్ దగ్గరకు వెళ్ళి, సైకిల్ తాళం తీయసాగాడు. అతడి వేషమూ, వాలకమూ, సి.ఐ.డి. పోలీసు ఇన్‌స్పెక్టరని చెబుతున్నాయి ! అదృష్టం ఏమిటంటే, నేను నా సైకిల్‌కు తాళం వేయలేదు. వెంటనే సైకిల్ ఎక్కి మహా వేగంగా త్రొక్కుకుంటూ వెళ్ళిపోయాను. కొంత దూరం వెళ్ళి వెనక్కి తిరిగి చూశాను. మధ్యాహ్నం సమయం రోడ్డు మీద జనం అట్టేలేరు. అతడు చాలా దూరంలో వున్నాడు. సైకిల్ మీద వస్తున్నాడు, నన్ను వెంబడిస్తూ ! అతడు గనుక "పట్టుకోండి , పట్టుకోండి !" అని కేకలు పెట్టినట్లయితే నలుగురూ నన్ను పట్టుకునేవారు. కానీ, అతను అలా కేకలు పెట్టలేదు. అందుకు కారణం తను బాగా సైకిల్ తొక్కగలనన్న గర్వం కావచ్చును. ఆ గర్వంలో 'ఇతణ్ణి పట్టుకోలేక పోతానా' అని అనుకుని వుంటాడు. లేక అలా నా వెనకాలేవచ్చి నేను ఎక్కడ వుండేది, నాతో పాటు ఎవరెవరు వుంటున్నది తెల్సుకుందామని అయినా అనుకుని వుంటాడు. నేను గొందుల్లో నుంచీ, సందుల్లోంచీ, నాకు చాతనయినంత వేగంగా సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళిపోయాను ! మధ్యలో రెండు చోట్ల సైకిల్ దిగి వెనక్కి తిరిగి చూశాను, ఎవరైనా వెంబడిస్తున్నారేమోనని !

నేను బాంబు ఫ్యాక్టరీకి వచ్చి సుఖదేవ్‌కు ఈ విషయం చెప్పాను 'రెండు రోజుల వరకూ నన్నా గదిలో నుండి బయటకు కదలవద్దన్నాడు' పగలంతా ఏదో ఒక పుస్తకాన్ని చదువుతూ కూచునేవాణ్ణి ! మనస్సులో ఒకటే ఆందోళనగా వుండేది. లక్ష్మీ ఇన్సూరెన్సు కంపెనీకి వెళ్ళి సెలవు చీటీనయినా ఇచ్చిరాకపోతినే అని బాధ పడ్డాను.

సుఖదేవ్ ఎక్కడికో వెళ్ళాడు. గదిలో నేనొక్కడికినే వున్నాను. చదువుమీద విసుకుపుట్టింది. కిటికీలో నుండి రోడ్డు మీదకు చూస్తూకూచున్నాను. కాసేపు పుస్తకం మూసి గదిలోనే పచారు చేస్తూ అటూ ఇటూ తిరిగేవాణ్ణి ! నేను బయటికి చూసిన ప్రతితడవా, ఒక వ్యక్తి మా గది వైపు చుస్తూ రోడ్డు మీద నిలబడి వుండడాన్ని గమనించాను, అతడు కిటీకి వైపు చూస్తుండడాన్నీ గమనించాను. సుఖదేవ్ రాగానే ఈ విషయాన్ని చెప్పాను."ఈ ఇంటి మీద సి.ఐ.డి. పోలీసుల కన్ను పడ్డది !" అన్నాను.

"యిదంతా నీ అనుమానం !" అన్నాడు సుఖదేవ్

నేను అక్కడికీ ఇలా అన్నాను "మర్కరీ ఫల్మినేట్ తయారు చేసేటప్పుడు చాలా దూరం వరకూ పొగా, దుర్గధం వ్యాపించాయి అలాంటి స్థితిలో ఈ గది మీద ప్రజలకు అనుమానం కలగడం సహజం కదా !" అప్పటికి పొగవల్ల, దుర్గంధంవల్లనే పోలీసులు అనుమానించారనుకున్నాను. గులాంరసూల్ సానమిషన్ దగ్గరనుండి కిశోరీలాల్ బాంబుడిప్పల్ని పట్టుకొస్తుండగా పోలీసులు

వెంబడించి - బాంబు ఫ్యాక్టరీని తెలుసుకున్నారని నాకు తెలియదు. ఇది 1929 ఏప్రియల్ 13న జరిగింది అనుకుంటున్నాను. ఆ రాత్రి నేను అక్కడే పడుకున్నాను. 14 వ తారీకు తెల్లవారు జామున లేచి మా ఇంటికి వెళ్ళాను. ఇంటి దగ్గర పరిస్థితిని తెల్సుకోవడమూ అవుసరమే ! లక్ష్మీ ఇన్సూరెన్సు కంపెనీకి వెళ్ళి రెండు రోజులు ఉద్యోగానికి పోనందుకు ఏదో ఒక కారణాన్ని చెప్పుకోవాలి ! ఫోటోల్ని తెచ్చేటప్పుడు ఒక సి.ఐ.డి. నన్ను వెంబడించాడు ! ఐతే, లాహోరువంటి మహా పట్నంలో ఒక్కడు గుర్తించినంత మాత్రాన భయపడాల్సిన పనేముంటుంది ! ఆ రోజు నేను లక్ష్మీ ఇన్సూరెన్సు కంపెనీకి ఉద్యోగానికి వెళ్ళాను. సాయంకాలం మళ్ళీ సుఖదేవ్ ను కల్సుకున్నాను.

మర్కరీఫల్మినేట్ తయారయ్యాక, పేలుడు పదార్థాల్లో అతి ముఖ్యమైంది 'పిక్రిక్ యాసిడ్!' దాన్ని తయారుచేసే ప్రయత్నంలో వున్నాము! "ఈ రాత్రి నేను ఫ్యాక్టరీలోనే వుండడం అవసరమా?" అని అడిగాను సుఖదేవ్‌ను.

"ఇవ్వాళ రాత్రికి కొందరు మిత్రులు వస్తున్నారు. పిక్రిక్ యాసిడ్‌ని రెండు రోజులు ఆగి తయారుచేద్దాం ! నువ్వీ రాత్రి ఇక్కడ వుండనవసరం లేదు;" అన్నాడు సుఖదేవ్.

ఆ రాత్రి ఫ్యాక్టరీకి జయగోపాల్, కిశోర్‌లాల్ - వచ్చారు. నేను విప్లవ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్న విషయం వాళ్ళకు ఇంకా తెలియదు. అసందర్భంగా చెప్పుకోవడమూ ఉచితం కాదు.

మర్నాడు ఉదయం ఎనిమిది గంటలాచాయల దుర్గాబాభీని కల్సుకోవడానికి భగవతీచరణ్ ఇంటికి వెళ్ళాను. ముఖ్యమైన విషయాలు ఏమైనావుంటే, నాకు చెప్పమని సుఖదేవ్ బాభీకి చెప్పివెడతాడు.

భగవతీచరణ్ ఇంటిని పోలీసులు చుట్టుముట్టారు. సోదా చేయడానికి వచ్చారు. ఐతే, ఇంకా ప్రారంభించలేదు. పోలీసులు కొంచెం కఠినంగానే వ్యవహరిస్తున్నారు. ఎవర్నీ బయటకు పోనీయడంలేదు. సబ్ ఇన్‌స్పెక్టరు ఇంటిముందు కుర్చీ వేసుకుకూచున్నాడు. నేను కొంచెం దార్ష్టికంగానే పోలీసు ఇన్‌స్పెక్టర్‌తో ఇలా అన్నాను. "మీరు సోదా చేయాలనుకుంటే చేయండి. ఇంట్లో ఆడవాళ్ళను బాధించడం దేనికి ? పసిపిల్లవాడు జబ్బుగా వున్నాడు. డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళాలి. మీరు ఎవరినీ బయటికి వెళ్ళనీయమంటారేంటి;" అన్నాను. సుశీలాదీదీ పెంచుకుంటూన్న బెంగాలీ కుర్రావాడు సతీష్ నిజంగానే జబ్బుగా వున్నాడు అప్పుడు. "నేనొకణ్ణీ సోదా చేయడానికి వీలులేదు. ఖాన్ బహద్దూర్‌గారు రావాలి ! వారికోసమే ఎదురుచూస్తున్నా !" అన్నాడు సబినస్పెక్టరు.

ఇంతలో ఒక కానిస్టేబుల్ సైకిల్ మీద వచ్చాడు. కూర్చుని కూర్చుని ఇన్‌స్పెక్టర్ బాగా విసిగిపోయాడు "ఖాన్ బహద్దూర్ గారు ఎందుకింత ఆలస్యం చేస్తున్నారు ? అక్కడ ఎంతసేపు సోదా చేస్తారుట ?" అని అడిగాడు కానిస్టేబుల్‌ను.

ఇది వినేసరికి నాతల తిరిగినట్టయింది. నౌజవాన్ భారత సభ మిత్రులు, ధన్వంతరీ, ఎహసాన్ ఇలాహి - మొదలైన వారి ఇళ్ళను కూడా సోదా చేస్తున్నారు గావును అనుకున్నాను.

బాభీ దగ్గరకు వెళ్ళి "ప్రమాదకరమైన వస్తువులు ఏమీ లేవుకదా ?' అనడిగాను.

"నాకు తెలియదు నిన్న సాయంత్రం సుఖదేవ్ వచ్చాడు..... ఏమీ చెప్పను కూడా చెప్పడు .........ఇంట్లో ఏమైనా పెట్టాడో, ఏమో నాకేం తెలియదు !" అన్నది బాభీ.

సరే, ఈ విషయాన్ని సుఖదేవ్‌కు చెప్పిరావడం మంచిదనుకున్నాను.

గ్వాల్‌మండీ నుండి కాశ్మీరీ బిల్డింగువైపు వెళ్ళాను. కాశ్మీరీ బిల్డింగుకు వెళ్ళడానికి లాగుజ్జర్ సింగ్‌కు వెళ్ళే పెద్దబజారులో నించి మలుపు తిరిగి ఓ చిన్న గొందిలోకి వెళ్ళాలి. ! నేను సైకిల్ మీద మలుపు తిరిగాను, బాంబుల ఫ్యాక్టరీ ముందు వరండాలోనూ, గొందిలోనూ పోలీసులు గుంపులుగా నిలబడి వున్నారు. ఇకనప్పుడు భయపడి వెనక్కు తిరగడం అనుమానానికి కారణం అవుతుంది. ఐతే

పోలీసుల మధ్య నుండి వెళ్ళడం మాత్రం ఎలా ? పైకిభయాన్నీ, ఆదుర్దానీ కనబడనివ్వకుండా, నిర్లక్ష్యాన్ని, నిర్భయాన్నీ నటిస్తూ పోలీసుల మధ్య గుండా గొందిని దాటి అవతలకి వెళ్ళిపోయాను. నన్ను ఎవరైనా వెంబడిస్తున్నారేమోనని దారిలో ఒకటి రెండు మార్లు వెనక్కి తిరిగి చూశాను !

బాభీని, దీదీనీ ఒక ప్రక్కకు తీసుకు వెళ్ళి "సర్వనాశనం అయింది. బాంబు ఫ్యాక్టరీకి పోలీసులు వచ్చిపడ్డారు. సోదా జరుగుతోంది. నేను లోపలికి వెళ్ళకుండా తప్పించుకువచ్చాను !" అన్నాను.

"సుఖదేవ్ ఎక్కడ వున్నాడో?" అడిగారు వాళ్ళు,

"ఏమో ! రాత్రి అక్కడ పడుకుంటే మాత్రం ఐపోతాడు !" అన్నాను నేను.

"ఎలాగయినా సరే, నువ్వు తప్పించుకు వెళ్ళిపో ?" అన్నారు ఇద్దరు.

"వారు ఎక్కడ వున్నారో, ఏంటో ! తెలిసీతెలియక ఫ్యాక్టరీకి వెడితే పట్టుబడిపోతారు !" అన్నది బాభీ దిగులుగా భగవతీచరణ్‌ను గురించి.

"ఇవ్వాళ అక్కడికి వెళ్ళకుండా వుంటే - రేపీ వార్త ఎటూ పత్రికల్లో పడుతుంది గనుక ఇకవెళ్ళడు !" అన్నాను ధైర్యాన్ని ఇస్తూ -

అక్కడి నుండి నేరుగా మా ఇంటికి వెళ్ళాను. ప్రేమవతికి, మా అమ్మకు విషయమంతా చెప్పాను. "నేను వెళ్ళిపోతూన్నాను. కొన్నాళ్ళకి తిరిగిరావచ్చు, లేక ఇదే తుదివీడ్కోలు కావచ్చు!" అన్నాను.

మా కుటుంబ ఆర్థిక స్థితి బాగాలేదని ముందే చెప్పాను. అప్పుడు మా అమ్మ దగ్గర చాలా కొద్దిగా డబ్బు వుంది. అందులో నుండి కొంత నేను తీసుకున్నాను. వెళుతూ, "డాక్టర్ గోపీచంద్ భార్గవ్‌గారు నాకు మూణ్ణెల్ల జీతం 240 రూ. ఇవ్వాలి. వాటిని తెచ్చుకోవల్సిందని" మా అమ్మకు చెప్పాను. తరువాత తెల్సింది. మా అమ్మ గోపీచంద్ భార్గవ్‌గారిని డబ్బు అడిగిందట. వారు రూ. 40 లు మా అమ్మ చేతిలో పెట్టి 'రెండువందల రూపాయలు ఇది వరకే యశ్‌పాల్ కు ఇచ్చాను. మీకు నమ్మకం లేకపోతే అతడు వచ్చాక మాట్లాడుకుందాం !' అన్నారుట; నేను పరారీలో వున్నాననీ డాక్టరుగారికి తెల్సు, ఎందుకు పరీరీలో వున్నానో కూడా తెల్సు !

డాక్టరుగారు నాకు రెండువందల రూపాయలు ప్రత్యేకమైన పరిస్థితిలో ఇచ్చారు. వారు ఈ డబ్బు ఇచ్చిన పరిస్థితిని బట్టి, తమ గురువుగారి అవమానానికి ప్రతీకారాన్ని చేసినందుకు విప్లవ సంఘానికి సహాయం చేస్తున్నారని నేను అనుకున్నాను. నేను అలా అనుకోవడం చా లా సహజం ! ఐతే, డాక్టరుగారు నిజాయితీగా నా జీతాన్నే నాకు ఇచ్చారన్న మాట ! ఔనుమరి , లజపతిరాయ్ గారి అవమానికి ప్రతీకారాన్ని చేసే బాధ్యత మాదేనన్నమాట ! నాయకులకు అనవసరం ! సామాన్యుల నియమాలూ, పద్ధతులూ, బాధ్యతలూ వేరుగా వుంటాయి. నాయకుల నియమాలూ, పద్ధతులూ, బాధ్యతలూ సామాన్యులకు భిన్నంగా వుంటాయి. గోపీచంద్ భార్గవ్ గారికి రెండువందలు పెద్ద విషయమేమీ కాదు. లాలాలజపతిరాయ్ మీద వారికి శ్రద్ధ కూడా అపారంగానే వుంది ! బహుశ, భవిష్యత్తులో పోలీసుల నుండి ఏదయినా బాధ వస్తుందేమోనని ముందు జాగ్రత్త పడ్డారేమో ? ఒకవేళ, ఎప్పుడైనా, నేను అరెస్టు అయితే, విప్లవకారులకు ఆర్థిక సహాయం చేశారని పోలీసులకు చెప్తానని భయపడివుంటారు డాక్టరుగారు ! ఇలా ఎందుకు రాస్తూన్నానంటే వామపక్షనాయకుడు డాక్టర్ సత్యపాల్‌గారు ఇలాంటి సందర్భంలోనే ఇంతకంటే విచిత్రంగా ప్రవర్తించారు ! ఒక మిత్రుడు సత్యపాల్ గారి దగ్గరకు వెళ్ళి విప్లవ కార్యక్రమాలకు ఆర్థిక సహాయం చేయవల్సిందని అడిగాడు.

డాక్టర్ సత్యపాల్‌గారు కంగారుబడ్డారు. "నువ్వు సి.ఐ.డి. వని నాకు తెల్సు , తక్షణం బయటకు వెళ్ళు ! లేకపోతే, పోలీసులకు ఫోన్ చేస్తాను, అరెస్టు చేయిస్తాను !" అన్నారట.

ఇంతదూరం ఆలోచించగలిగిన డాక్టరు సత్యపాల్ ఒక చిన్న విషయాన్ని మర్చిపోయారు. సి.ఐ.డి.ని, పోలీసులు అరెస్టు చేస్తారా ? అరెస్టు చేసి ఏ శిక్ష విధిస్తారు ? తాను విప్లవ కారులకు సహాయం చేస్తున్నాడని ప్రభుత్వం ఎక్కడ అనుకుంటుందోనన్న భయమే యీ అనవసరపు జాగ్రత్తలకు కారణం!

ఇలా ప్రవర్తించింది వీరే కాదు, గాంధీగారు కూడా ఓ మాటు ధన్వంతరీనీ సి.ఐ.డి. అనేశారు. ధన్వంతరీ గాంధీగార్ని కల్సుకోవడానికి సబర్మతీ ఆశ్రమానికి వెళ్ళాడు. వారిని ఆర్థిక సహాయం అడగడానికి వెళ్ళలేదు. 'మా మార్గం మీకు నచ్చకపోతే దయచేసి మెదలకుండా వూరుకోండి ! బహిరంగ సభల్లో మమ్మల్ని నిందించకండి !' అని చెప్పడానికి వెళ్ళాడు. గాంధీగారు అసలు ధన్వంతరీతో మాట్లాడడానికే నిరాకరించారు. ' ఈ మనిషి సి.ఐ.డి. పోలీసులాగున్నాడు !' అన్నారు. ఆచార్య జగల్‌కిషోర్, పండిట్ నెహ్రూ, ఆచార్య కృపలానీ - వీరు మాతో మాట్లాడటానికి భయపడేవారు కాదు. చక్కగా మాట్లాడేవారు. నేను వీరిని స్వయంగా కల్సుకునీ మాట్లాడాను. ఇంక నేతాజీ సుభాష్‌బోస్ మమ్మల్ని చూసి పరమానందపడేవారు. ఎంతో ఉత్సాహంగా మాట్లాడేవారు !

మధ్యాహ్నం రెండుగంటలకల్లా లాహోరు నుండి బయల్దేరాను. అప్పుడు స్టేషన్‌లో అమృతసర్ వైపు వెళ్ళే బండివుంది. కాంగడకూ అదే మార్గం !అప్పటికి ఏదో విధంగా లాహోరు నుండి తప్పించుకుని వెళ్ళిపోవడమే ముఖ్యం అనుకున్నాను. వెళ్ళేటప్పుడు వేషం కొంత మార్చాను. లాహోరులో సాధారణ విద్యార్థుల్లా దుస్తులు వేసుకునేవాడిని ! స్టేషన్‌కు వెడుతూ హేట్ ఒకటి కొనుక్కున్నాను. గడ్డం మీసాలూ సున్నగా గొరిగించాను.

రహస్య జీవితానికి అది నా ప్రథమానుభవం ! గుండెలు దడదడలాడాయి. అందరూ నావంక చూస్తున్నట్టేవుంది ! రహస్య జీవితాన్ని గడపడానికి ఓ రహస్యం తెల్సుకోవాలి ! అలాంటి జీవితాన్ని గడపడానికి ఆత్మవిశ్వాసం కంటె గొప్ప మంత్రం లేదు;ఈ కిటుకు తెలిశాక అదే లాహోరులో, సాధారణమైన వేషం మార్పుతో ఎంతో నిర్భయంగా తిరిగాను. ఎటుచూసినా నన్ను పట్టుకోవడం కోసం ప్రకటనలు అతికించబడిన వీధుల్లో నిరాక్షేపణీయంగా తిరిగాను. ఒకమాటు అదే లాహోరు స్టేషన్‌లో జేబులో పిస్తోలు పొరపాటున బయటికి కనుపించింది. అయినా, ఏ మాత్రం కంగారుపడకుండా, హుషారుగా వీలవేసుకుంటూ చేతిలోని తూటాలు ఎగురవేస్తూ - ఈ విధంగానిర్భయాన్ని నటిస్తూ - రైలు ఎక్కేశాను; ఇతర్లకు సందేహం కలగకుండా చేయడానికి ఇంతకంటే సులువైన మార్గం ఇంకేముంటుంది?

రహస్య జీవితానుభవం లేకపోవడం వల్ల నేరుగా కంగడాకే వెళ్ళి పోయాను. వేటగాడి వల్ల ప్రమాదం సంభవించబోతున్నప్పుడు మృగం నేరుగా తన గుహకే వెడుతుంది; వేటగాడికి దొరికి పోవడానికి అంతకంటే మంచి ప్రదేశం ఇంకెక్కడ వుంటుంది ? నేనూ ఆత్మరక్షణ కోసం కాంగడకే వెళ్ళాను. అక్కడ మా బంధువు వకీలు ఒకరు వున్నారు. ఆయన పేరు దీవాన్ మానచంద్ర : వారింటికి వెళ్ళాను. వారిని మభ్యపెట్టడం బాగుండదు - యదార్థాన్ని చెప్పేశాను;

నా మనస్సులో అనేక ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. బాంబు ఫ్యాక్టరీని పోలీసులు వశపరచుకోవడం నేను కళ్ళారా చూశాను. ఐతే, పోలీసుల ముఖాల్లో ఆదుర్దాగానీ భయం గానీ ఏ మాత్రం లేదు. చాలా ప్రశాంతంతగా వున్నారు. ఆగ్రా నుండి తెచ్చిన ప్రేలుడు పదార్థంతో తయారు చేసిన ఒకబాంబు అరమరపై భాగంలో వుంది. సుఖదేవ్ దగ్గర పిస్తోలు వుంది.తూటాలూ వున్నాయి. మరి పోలీసులు వచ్చినప్పుడు. సుఖదేవ్ ఎలా ప్రవర్తించాడు ? ఏం చేశాడు ? అనేది తెల్సుకోవడానికి మనస్సు తొందర పడుతూన్నది. వార్తా పత్రికల కోసం అదుర్దాగా ఎదురు చూస్తున్నాను. కాంగడాకు

పత్రిక ఓ రోజు ఆలస్యంగా వస్తుంది. మూడవ రోజున పత్రిక వచ్చింది. సుఖదేవ్ పోలీసులను ఏ మాత్రం వ్యతిరేకించలేదని, ప్రతిఘటించలేదనీ - వణుకుతూ అన్నింటినీ పోలీసులకు వప్పు చెప్పాడనీ చదివాను. సుఖదేవ్ అలా లొంగిపోతాడని మనస్సు ఎంతకీ వప్పుకోవడం లేదు. ఎందుకలా లొంగిపోయాడు ? అసలు ఏం జరిగిందో వివరంగా తెల్సుకోవడానికి మనస్సు ఆరాటపడుతున్నది. తరువాత పత్రికలో చదివింది యదార్థమేమనిని ధృవం అయింది. సుఖదేవ్ అలా అవమానకరంగా లొంగిపోయినందుకు నా మనస్సు చాలా బాధపడ్డది. నేను ఎంతగా మానసిక బాధను అనుభవించానో చెప్పలేను ! ఆ బాధతో సుఖదేవ్‌ను కాల్చడానికే నిశ్చయించుకున్నాను, ఈ నిశ్చయం ఉచితమా ? అనుచితమా అనే విషయాన్ని గురించి, సందర్భం వచ్చినప్పుడు వివరంగా రాస్తాను. సుఖదేవ్ పోలీసులకు లొంగిపోయి, జరిగినదంతా చెప్పేశాడు. ఐతే, అతడలా చెప్పడానికి కారణం పిరికితనం కాదు ! తన సహజమైన అతి ప్రవర్తన, అహంకారాలవల్లనే, అతడలా జరిగిందంతా పోలీసులకు చేప్పేశాడు.

లాహోరు బాంబు ఫ్యాక్టరీ పట్టుపడ్డప్పుడు ప్రత్యేకం చెప్పుకోదగిన సంఘటన ఏమీ జరగలేదు. ఐతే, మావిప్లవ సంఘ చరిత్రలో ఈ ఫ్యాక్టరీ పోలీసుల వశం అవడం ఓ ప్రత్యేకతను కలిగివుంది. ఈ ఫ్యాక్టరీ పట్టుపడడం వల్లనే, సాండర్స హత్యకు అసెంబ్లీలో బాంబులు పేల్చడానికీ మొదలైన విప్లవ కార్యక్రమాలన్నింటికీ పరస్పర సంబంధం వున్నదని పోలీసులకు తెల్సింది. ఈ ఫ్యాక్టరీ పట్టుపడడంతో పోలీసులూ ఒక అడుగు ముందుకు వేశారు. మా ఉద్యమమూ ఒకడుగు ముందుకు వేసింది.

మా బంధువు వకీలుగారు ఇలా అన్నారు. "రహస్య జీవితాన్ని గడపడం కష్టం! ఇలా పరారుకావడం వల్ల పోలీసుల అనుమానం ధృవం అవడం వినా మరో ప్రయోజనం వుండదు ! పైగా నువ్వు అపరాధివని స్పష్టం అవుతుంది; ఇలా దాగివుండడం వల్ల ! నన్నడిగితే పోలీసులకు లొంగిపోవడం మేలంటాను ! కేసునడిచాక కోర్టు వ్యవహారాలు మేము చూసుకుంటాం. అలాకాక, రహస్యంగా వుండి నీ కార్యకలాపాల్ని కొనసాగించాలనుకుంటావా ? నీ యిష్టం ! కానీ, అలారహస్య జీవితాన్ని గడపడానికి కాంగడా తగిన ప్రదేశం కాదు. ఇక్కడ అన్నీ చిన్న చిన్న పల్లెలు. కొత్త ముఖాలు ఎప్పుడోగాని కనుపించవు. కొత్త వాళ్ళు ఈ పల్లెల్లో దాగి వుండగలగడం. అసంభవం అయిన విషయం! పరారయి ఈ పల్లెల్లో దాక్కోవడమంటే, ఎలుక బోనులో చిక్కుకున్నట్లే ! అదీకాక,ఇక్కడి ప్రజల రాజకీయచైతన్యం ఎంత మాత్రపుదో నీకూ తెల్సు; ఇక్కడి ప్రజలందరూ బ్రిటిష్ సైన్యంలో సైనికులు. అదేవీరి ముఖ్యవృత్తి;..........ఇక నీ యిష్టం, ఆలోచించుకో" అన్నాడు.

కాంగడా కోట శిథిలాల్లో కూచుని చాలా సేపు ఆలోచించాను. నిర్జనమైన కొండల్లో కోనల్లో దాక్కొని, బాంబుల్ని తయారు చేసి విప్లవాన్ని సృష్టిద్దామనుకోవడం మూర్ఖమైన ఆలోచన అనిపించింది. ప్రజా సామాన్యం వల్లనే కదా విప్లవం సంభవం అయ్యేది ? మరి అలాంటప్పుడు ప్రజా సామాన్యానికి దూరంగా నిర్జన ప్రదేశాల్లో వుండి విప్లవాన్ని సృష్టిద్దామనుకోవడం మూర్ఖత్వం కాదా ? ఆత్మచింతన ద్వారా ఆత్మిక శక్తిని ప్రజ్వలింప చేసుకోవడానికి అడవులు బేషుగ్గా పనికివస్తాయి; గానీ, విప్లవానికి మాత్రం పనికిరావు ............ అని నిర్ణయించుకున్నాను.

మానవులనే వృక్షాలతో నిండిన, మహానగరాలనే అడవుల్లో తల దాచుకోవడానికి మర్నాడే బయల్దేరాను. రహస్యంగా, దాగి వుండి, నామిత్రుల్ని కల్సుకుని, తిరిగి క్రాంతిని ఆవాహనం చేయడానికి కృతనిశ్చయుణ్ణయ్యాను.

# సహచరుల్ని కల్సుకోవడానికి ప్రయత్నాలు

పచ్చని పర్వతాల్లో, కొండవాగుల ఆలింగనంలో బంధింపబడిన అందమైన చిన్న నగరం- కాంగడా ! దూరంగా అన్నిటికంటే పెద్ద పర్వతంమీద శిధిలం అయిన కోట ఒకటుంది. అతి పురాతనమైన ఆ శిధిల దుర్గం ఆకాశంవంక గర్వంగా తలెత్తి చూస్తున్నట్టుంది ! కాంగడాకు వాయువ్య దిక్కుగా సదా మంచుతో కప్పబడివుండే హిమవత్పర్వతాలు తళ తళా మెరుస్తూ కనులపండువుగా వుంటాయి. ఇంతగా ప్రకృతి సౌందర్యంతో పెనవేసుకున్న కాంగడా అంటే నాకెంతో ఇష్టం ! ఎన్నో పర్వతాల్ని చూశాను. ప్రకృతి సౌందర్యాన్ని ఎంతగానో వీక్షించాను. ఐనా, కాంగడాపట్ల నాకు గల మమకారం, ఆకర్షణ - అజేయంగానే వుండి పోయాయీనాటి వరకు !

పరారై కాంగడాలో గడిపిన ఆ రెండు మూడు రోజులలోనూ అక్కడి ప్రకృతి సౌందర్యం నన్నేమాత్రమూ ముగ్ధుణ్ణి చేయలేకపోయింది. అసలు నేనా ప్రకృతిశోభను చూడేలేకపోయాను. మనస్సు అహర్నిశలు వ్యాకులపడుతూండేది. 'ఈ చిన్ని నగరంలో నన్ను ఎరిగినవాళ్ళు ఎందరోవున్నారు ! వీరికి, నా రహస్యజీవితానికి గల కారణాన్ని ఎలాచెప్పడం ? వీళ్ళసలు అర్థంచేసుకోరు ! అలాంటప్పుడు ఇక్కడ నేను ఎలా వుండగలను ? ఇక్కడ-వకీలుగారి ఇంట్లో ఉండడం వల్ల నావక్కడికే ప్రమాదంకాదు, వకీలు గారికి ప్రమాదమే !' అని ఆలోచిస్తూండేవాణ్ణి.

కాగా, నేను అనుసరింపదగింది, ఒకే ఒకమార్గం వుంది ! ఏదైనా ఒక పెద్ద పట్నానికి వెళ్ళి, అక్కడ నా నివాసాన్ని ఏర్పరచుకోవాలి, మా విప్లవ సంఘంలోని మిగిలిన మిత్రులు ఏమయ్యారో, ఎక్కడ ఉన్నారో తెలుసుకోవాలి ! నా ఆదర్శాన్ని వివరిస్తూ విప్లవసంఘానికి కొత్త సభ్యుల్ని ఏర్పరచుకోవాలి పర ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి మళ్ళీ ఆయుధాల్ని సంపాయించాలి ! ఇదంతా చేయాలంటే, లక్షల సంఖ్యలో మానవులు ఒకర్నిగురించి మరొకరు పట్టించుకోకుండా, ఎవరిపనుల్లో వాళ్ళు, ఎవరి బురదలోవాళ్ళు - మునిగి తేలుతూండే మహానగరాల్లో మకాం పెట్టడం ఔసరం ! అప్పటికి నాకు అలాంటి పట్నం లాహోరు ఒక్కటే తెల్సు ! ఐతే, లాహోరులో నన్ను ఎరిగినవాళ్ళు చాలామంది ఉన్నారు. పైగా, అక్కడి పోలీసులు నన్ను గుర్తుపట్టే ప్రమాదమూ ఎంతయినా వుంది ! ...... నేను జమ్మూ వెళ్ళడానికి నిశ్చయించుకున్నాను !

జమ్మూ కాంగడా కంటే చాలా పెద్దపట్నం ! అంత క్రితం 1926లో జమ్మూలో ఒకటి రెండునెల్లు వున్నాను. అప్పుడు అక్కడి యువకులు కొందరు మిత్రులయ్యారు. వాళ్ళకు ఖుదీరాంబోసు, దీనదయాళ్ లాంటి విప్లవవీరుల్ని గురించి చెప్తూండేవాణ్ణి ! అలా విప్లవాన్ని ప్రచారం చేశాను. అప్పట్లో కొందరు యువకులు విప్లవ కార్యక్రమాలవైపు మొగ్గుచూపారు కూడాను .... ఇకనిప్పుడు ఆ వెనుకటి మిత్రత్వాల ఆధారంగా జమ్మూలో కొంతలోకొంత ఏమైనా చేయగలనన్న ఆశ ఏర్పడ్డది ! పైగా, అక్కడ నన్ను ఎరిగినవాళ్ళు ఆటేలేరు.

జమ్మూలో మా బంధువొకతనున్నాడు. అతడు సంస్థానంలో ఉద్యోగి ! పేరు చిరంజీలాల్ ! నేను అతడి దగ్గరకే వెళ్ళాను. అతడికి నా భావాలపట్లా, ఆదర్శంపట్లా సానుభూతి ఏముంటుంది ? కాకపోతే, నా సాహసాన్ని మెచ్చుకుంటూ వుండేవాడు. నేను వెళ్ళగానే - మభ్యపెట్టకుండా నా పరారీనిగురించి, పరారీకిగల కారణాన్ని గురించి స్పష్టంగా చెప్పేశాను. మా బంధువు ఏ మాత్రం భయపడలేదు. తనదగ్గరే వుండమన్నాడు. అప్పుడతడి భార్యాబిడ్డలు ఊళ్ళోలేరు. బంధువుల్ని

చూసిరావడానికి పొరుగూరు వెళ్ళారు. ఇంట్లో అతడూ, నేను-ఇద్దరమే ! రహస్య జీవితం అలవాటు లేకపోవడంవల్ల పగలంతా ఇంట్లోంచీ బయటకు వచ్చేవాణ్ణికాదు ! చదువుకుంటూండేవాణ్ణి. రాత్రి పూట్ల వెనుకటి పరిచయుల్ని కల్సుకోవడానికి వెళ్ళేవాణ్ణి !

వెనుకటి మిత్రుల్లో కొందర్నే కల్సుకోగలిగాను. వారిలో ఒకతను మాస్టరుగారు. సన్నగా, పొడుగ్గా, చామనచాయ రంగులో వుండేవాడు. పాతిక సంవత్సరాలపైన అయింది కల్సుకొని, పేరు జ్ఞాపకం రావడం లేదు. మాస్టరుగారిద్వారా మరో మిత్రుడు పరిచయం అయ్యాడు. ఈ కొత్త మిత్రుడిపేరు భాగ్‌రాం ! మిత్రుడు భాగ్‌రాం- నేనూ చాలా సంవత్సరాలపాటు కల్సిమెల్సి వున్నాం ! ఎన్నో సందర్భాల్లో ఇద్దరం కలిసి మృత్యువు నెదిరించాం ! ఇతడు నాకంటేముందే అరెస్టయ్యాడు. జమ్మూలోని మిత్రుల్లో చదువుకున్నవారు ఎక్కువగా వున్నారు. వారితో మా ఆదర్శాన్ని గురించి, సిద్ధాంతాన్ని గురించి చర్చిస్తూండేవాణ్ణి ! అలా చేయడంవల్ల చదువుకున్న యువకుల్లో నూతన చైతన్యం ప్రభవిస్తుందని ఆశ! పర ప్రభుత్వం మీద ద్వేషాన్ని రేపి, స్వాతంత్రేశ్చను హృదయాలలో రగిల్చి ఒక మానవుణ్ణి మరోమానవుడు పీడించే సాంఘిక ధర్మాన్ని సమాప్తంచేయడానికి యువకుల్ని సన్నద్ధంచేయడం నా ఉద్దేశం ! అందుకే చదువుకున్న మిత్రులతో రాజకీయ చర్చలు జరపాలి అనుకున్నాను. కొన్ని రాజకీయ గ్రంథాల్ని తెప్పించుకోవడమూ ఔసరం అనుకున్నాను.

ఇంద్రపాల్ లాహోరులోని పాత అనార్కిలీలోనే వుంటూన్నాడు. అప్పటికి అతడి మీద పోలీసులకు ఎలాంటి అనుమానమూ కలగలేదు. నేను అతడికి ఒక జాబురాశాను. అందులో ప్రేమవతినిగానీ, దుర్గాబాభీనిగాని అడిగి కొన్ని రాజకీయ గ్రంథాల్ని పంపమని రాశాను. అతడలాగే పంపించాడు.

మిత్రుల్లో బ్రిటీష్ ప్రభుత్వంమీద పోరాటానికి సిద్ధం కావాల్సిందని ప్రచారం చేయడంతో తృప్తిపడలేక పోయాను. జమ్మూ సంస్థానం ! బ్రిటిష్ ఇండియాలో వున్నట్లు సంస్థానాల్లో ఆయుధాలమీద నిషేధం వుండదు. కనుక, జమ్మూలో కొంత తేలికగా ఆయుధాల్ని సంపాదించవచ్చును. నేనక్కడ ఆయుధాల్ని సంపాయించడానికీ ప్రయత్నించాను. ఆయుధాలు దొరకడానికి దొరికాయి. ఐతే, అవన్నీ పాతవి, నాటువి ! ఎప్పటికప్పుడు మందు కూరుకుని ఉపయోగించే పిస్తోళ్ళు, తుపాకులు ! అవిమాకు పనికిరావు. బాంబుల్ని తయారు చేసుకోవాలన్న ఆలోచనా వుంది ! లాహోరులోని బాంబు ఫ్యాక్టరీలో, సుఖదేవ్ పేలుడు పదార్థాన్ని తయారు చేసేప్పుడు దగ్గరే వున్నాను. ఆ పదార్థాలను తయారుచేసే విధానం బుర్రలో వుంది ! మర్క్యురీఫల్మినేట్ తయారు చేసేప్పుడు లేచిన దుర్గంధాన్ని, పొగనూ మర్చే పోలేకుండా వున్నాను ! ఆ పొగవల్లా, దుర్గంధం వల్ల ఇరుగుపొరుగు వారికి మామీద అనుమానం కలిగింది అనుకునేవాణ్ణి ! కానీ యదార్థం అదికాదు ! రసాయనిక పదార్థాలను కొనేప్పుడో, లేక బాంబులకు అవసరం అయిన డిప్పల్ని పోతపోయించేప్పుడో - పోలీసులు మా ఫ్యాక్టరీని పసికట్టి వుంటారు !

నాకు గల పరిమితమైన అనుభవంతో, ఇతర్ల సహాయాన్ని ఆశించకుండా ఇతర్లకు అనుమానం కలగకుండా - కొత్తరకం బాంబుని ఒకదాన్ని తయారుచేయడానికి నిరంతరం యోచిస్తూ వుండేవాణ్ణి బాంబులు తయారుచేయడం, తుపాకుల్ని సంపాయించడం - ఇదే విప్లవాన్ని ఆవాహనం చేయడానికి అతి ప్రధానమైన విషయం అనుకునేవాణ్ణి ! ఏ కొద్దిమంది త్యాగమూర్తులయిన యువకులో ఆయుధాల్ని ధరించి విప్లవాన్ని ప్రభవింపచేస్తారని మా సంఘంలోని మిత్రుల విశ్వాసం ! నేనూ అలాగే అనుకునేవాణ్ణి

మేమూ సామ్యవాద విప్లవాన్నే ఆదర్శంగా పెట్టుకున్నాము. ఐతే, అనుసరించిన మార్గంలో

వ్యత్యాసం వుంది. సాహసికులైన ఏ కొద్దిమంది మధ్య తరగతి యువకుల హృదయాల్లోనో విప్లవబీజాలు నాటి, వాళ్ళను పర ప్రభుత్వం మీదకు యుద్ధసన్నద్ధుల్ని చేస్తేచాలు అనుకున్నాం ! ఆ ఆశయసిద్ధి కోసమే నేను జమ్మూలో బాంబుల్ని తయారుచేయడానికి, పిస్తోళ్ళు సంపాయించడానికీ - ప్రయత్నం చేయసాగాను !

ఆర్థిక సమస్య నా మనస్సును బాధిస్తోంది. దాంతోపాటు మిత్రుల ఎడబాటూ నా మనస్సును కలచి వేస్తోంది. సుఖదేవ్ అరెస్టయ్యాడు. మరికొందరు మిత్రులూ అరెస్టయ్యారు. బయట ఉన్నవాళ్ళలో నేను బాగా ఎరిగిన మిత్రుడు భగవతీచరణ్ ఒక్కడే ! నేను పరారై దాదాపు నెలకావస్తోంది. ఇన్నాళ్ళల్లోనూ భగవతీచరణ్ ఎక్కడ ఉన్నాడో, ఏమిటో ? ఏమీ తెలియలేదు ! ఢిల్లీలో, యు.పి.లో, భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ మా విప్లవ సంఘానికి శాఖలు వున్నాయి. ఆయా శాఖల మిత్రుల్ని కొందర్ని సుఖదేవ్ దగ్గరకు వచ్చినప్పుడు చూశాను కూడాను ! ఐతే, వాళ్ళ అసలు పేర్లూ, నివాస స్థలాలూ నాకు తెలియవు. నాకు వాళ్ళ మారుపేర్లు మాత్రమే తెల్సు !

నాకు లాహోరు నుంచి జాబులు వస్తూనే వున్నాయి. ప్రేమపతి, సుఖదేవ్ బంధువుగా జైల్లోకివెళ్ళి అతణ్ని కల్సుకుని వచ్చినట్టు తెల్సింది. నేను ఇంద్రపాల్‌కు జాబు రాశాను. సుఖదేవ్‌ని కల్సుకుని, మిత్రుల అడ్రసులు అడిగి రాయమని కోరాను.

ఇంతలో, సుఖదేవ్ జైల్లో నిరాహారదీక్ష పూనాడన్న వార్త పత్రికల్లో చదివాను. ఇంద్రపాల్ కూడా తన జాబులో సుఖదేవ్ నిరాహారదీక్ష పూనినట్టు రాశాడు. అప్పటికి ఏడురోజులుగా అతడు నిరాహారదీక్షను సాగిస్తున్నాడు. ఇంద్రపాల్ మరో విషయమూ రాశాడు "ప్రభుత్వం సుఖదేవ్‌ను కల్సుకోడానికి ఎవరికీ అనుమతి నీయడం లేదు. దగ్గర బంధువులు మాత్రం కల్సుకోవచ్చును. అదీ, జైలర్ సమ్ముఖంలోనే కల్సుకోవాలి ! ఇంక మిత్రుల అడ్రసులు అడగడం ఎలా ?"

సుఖదేవ్ ప్రవృత్తి నాకు బాగా తెల్సు. ప్రభుత్వానికి అలా లొంగిపోయినందువల్ల మానసికంగా బాధపడి వుంటాడు. అందుకనే నిరాహారదీక్షను పూనాడేమో ? తన సహజమైన మొండితనంవల్ల ప్రాణాన్నే బలిపెట్టుకునే మాత్రపువాడు ! అతడు అంతపనీ చేశాడా ? ఇంక మిత్రుల్ని కల్సుకోవడం సంభవం కాదు ! నేను జైల్లోకి వెళ్ళి సుఖదేవ్‌ను కల్సుకోవడానికి నిశ్చయించుకున్నాను. మిత్రుల అడ్రసులు తెల్సుకుని, వాళ్ళను కల్సుకుని - నేనూ హించిన కొత్తరకం బాంబును గురించి వాళ్ళకు చెప్పి, ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలని నా ఉద్దేశ్యం ! ఇంక జమ్మూలో - మిత్రులకూ, ప్రపంచానికీ-దూరంగా అలా వుండిపోవడం నావల్లకాక పోయింది.

జమ్మూలో ఉదయాన్నే రైలు ఎక్కాను. రాత్రి పది గంటలకు లాహోరులో దిగాను. సరిగా నెలరోజుల తరువాత లాహోరు వచ్చాను. మనస్సులో బెరుగ్గావుంది. ఐతే, నెలరోజుల క్రితం, లాహోరు నుండి వెళ్ళేప్పుడున్నంత బెరుకూ, భయమూ - ఇప్పుడు లేదు ! నా దగ్గర ఆత్మరక్షణకు పిస్తోలయినా లేదు. జమ్మూనించి బయల్దేరేప్పుడు పంజాబీ గ్రామీణుడిలా దుస్తుల్ని ధరించాను. మాసిన చొక్కా లుంగీ పెద్ద తలగుడ్డతో లాహోరులో దిగాను. ఇతర్ల దృష్టిని ఆకర్షించకుండా వుండడానికి వేషమే అనువుగా వుంటుంది. పాత అనార్కలీలో ఇంద్రపాల్ వున్నచోటికి వెళ్ళాను.

ఇంద్రపాల్ పాత అనార్కలీలోని ఓమురికి భోజన హోటలు మేడ పైభాగాన్ని అద్దెకు తీసుకు వుంటున్నాడు. "వ్రాయస సోదరులు" అని ఒక బోర్డుకూడా తగిలించాడు. ఒకరిద్దరు శిష్యులు అతడి దగ్గర పని నేర్చుకుంటున్నారు. కొందరు మిత్రులూ వున్నారు. అందరూ అక్కడే వుంటూన్నారు. నన్నలా అనుకోకుండా చూడడంతో ఇంద్రపాల్ ఆశ్చర్యపడ్డాడు. అయితే, ప్రక్కన కూచున్న మిత్రుల ఎదుట ఆశ్చర్యాన్ని కనబడనీయలేదు. ఏకాంతంలో అతడితో మాట్లాడాను. దుర్గాబాభీనిగానీ, ప్రేమవతినిగానీ,

వెంటనే తీసుకురావల్సిందని చెప్పాను. దుర్గాబాభీ రావడం కష్టం ! ఎక్కడికి బయల్దేరినా సి.ఐ.డి. పోలీసు వెంబడిస్తాడు. చాలా సేపు అటూ ఇటూ తిరిగి అతణ్ణి తప్పించుకొని గానీ రావడానికి వీలుపడదు! ఐతే, ప్రేమవతిని పిలిపించాడు.

ప్రేమవతి, లాయర్‌పూర్ నుండి వచ్చిన సుఖదేవ్ బంధువుల్తో పాటు తానూ జైల్లోకి వెళ్ళి అతణ్ణి చూసివచ్చింది. "సుఖదేవ్‌తో ఏమీ మాట్లాడడానికి వీలుండదు. జైలు అధికారి ఎదటేవుంటాడు" అని చెప్పింది నాతో. అలాంటప్పుడు ఇతరుల్ని ఎవర్ని పంపించినా ప్రయోజనం వుండదు.

"ఐతే, నేనే జైల్లోకివెళ్ళి అతణ్ణి కలుసుకుంటాను !" అన్నాను ప్రేమవతితో. ఆమె చాలా ఆశ్చర్యపడ్డది. "అసంభవం" అన్నది. ఐనా నేను వినలేదు. అతణ్ణి అడిగి మిత్రుల అడ్రసులు తెల్సుకోవల్సిందేనని పట్టుపట్టాను. నా మొండి పట్టునుచూసి "సరే, అలాగే చెయ్యి !" అన్నది ప్రేమవతి.

"నాకు సరిపోయే సూటూ-హేటూ-బూటూ, ప్లీడర్లు ఉపయోగించే కాగితాల ఫైలూ సంపాయించి పెట్టమని అడిగాను. వీటిని ధన్వంతరీ ద్వారాగానీ, ఎహసాన్‌ఇలాహీ ద్వారా గానీ పంపిస్తానన్నది ప్రేమవతి.

మర్నాడు మధ్యాహ్నానికి వకీలుగా ముస్తాబు అవడానికి అవుసరం అయిన డ్రస్సూ, ఫైలూ వచ్చేశాయి. నేను సుఖదేవ్‌ను కల్సుకోవడానికి వకీలు వేషంలో జైల్లోకి వెడుతున్నానని బాభీకి కూడా తెల్సును. బాభీ నన్ను వెళ్ళవద్దని అనలేదు. ఎవరికేగానీ బాభీ పిరికి మందు పోయదు. ఆమె వచ్చి నన్ను కల్సుకోవడానికి వీలు లేకపోయింది. ఐతే, ఒక సలహానిచ్చింది. సుశీలా దీదీ చెల్లెల్ని, సుఖదేవ్ చెల్లలనిచెప్పి వెంటతీసుకు వెళ్ళమని కబురు పెట్టింది.

ఆ అమ్మాయి పేరు శకుంతల. రెండు సంవత్సరాలుగా బాభీ దగ్గరే వుంటూన్నది. కాలేజీలో చదువూతూన్నది. ఇన్నాళ్టిలోనూ, మాటిమాటికీ భగవతీచరణ్ ఇల్లు సోదా అవుతూండడంవల్ల కొంత అనుభవాన్ని సంపాయించుకుంది ! పోలీసులు వచ్చినప్పుడు ఎలా మెసులుకోవల్సింది. నిషిద్ధ సాహిత్యాన్ని ఎలా దాయవల్సింది-తెల్సుకున్నది ! శకుంతల గంభీరమైన స్వభావం గల పిల్ల. భగవతీచరణ్ ఇంటికి వచ్చిపోతూండే విప్లవకారుల బంధువులకు భోజనాది సౌకర్యాలను ఈ అమ్మాయే చూస్తూండేది ! నాతోపాటు అలా సుఖదేవ్ చెల్లెల్ని అని చెప్పుకుని జైల్లోకి రావడం శకుంతల చేసిన గొప్ప సాహసం అని చెప్పక తప్పదు. పోలీసులు అనుమానించి పట్టుకుంటే నా విషయం సరే సరి, ఆ అమ్మాయి గతి ఏంకాను ? ఆ రోజుల్లో మాకు భయమన్నమాటే తెలియదు ! ఆకాశంలో అదర్శపు చుక్కల్ని లెక్కపెట్టుకుంటూ ఆవేశంతో ముందుకు పోవడయే మా పని !

కోటూ, సూటూ, బూటూ-తో ముస్తాబయి, టైకట్టుకుని, కళ్ళజోడు మార్చుకుని, శకుంతలను వెంట పెట్టుకుని లాహోరు సెంట్రల్ జైలుకు వెళ్ళాను ! జైలు అధికారులకు నేను అప్పుడే ఇంగ్లాండు నుంచి దిగిన, లాయర్‌పూర్‌లో ప్రాక్టీసు పెట్టిన బారిస్టరుగా నా పరిచయాన్నిచ్చాను. నాలుక మడతపెట్టి, ఇంగ్లాండు నుంచి దిగిన యువకుడిలా పెద్దమనిషిలా జైలర్‌తో ఇంగ్లీషులో మాట్లాడాను. అనుశాసనంపట్ల భక్తి శ్రద్ధల్ని వలకపోస్తూ జేబులో నుండి సిగరెట్ తీసి "ఇక్కడ సిగరెట్ తాగడం నిషిద్ధం కాదుకదా ?" అనడిగాను జైలర్ని.

తరువాత ఇలా అన్నాను "ముద్దాయి సుఖదేవ్ నిరశన వ్రతం పూనాడని తెల్సి, ఇతడి పెదతండ్రి లాలా అచింతరాం చాలా బాధపడ్డాడు. ఆయన తరపున ముద్దాయిని నిరశనవ్రతం మానవల్సిందని చెప్పడానికి వచ్చాను. వారం రోజులనుంచి ఇతడు ఇలా ఉపవాసంచేస్తున్నట్లు తెలిసి ఇతడి తల్లికూడా ఉపవాసం చేయడానికి సిద్ధపడుతూన్నది. ఇతడిలాచేసినందుకు బంధువులందరూ

చాలా దుఃఖపడుతూన్నారు. ఉపవాసం మానమని చెప్పడంతోపాటు ఇతడితో ఈ కేసుగురించి మాట్లాడానికీ వచ్చాను" అన్నాను.

శకుంతల తన అన్న ఇలా ఉపవాసం చేస్తున్నందుకు కన్నీళ్ళు పెట్టుకుంది. ఆ అమ్మాయి లాయల్‌పూర్ నించి వచ్చిన, సాధారణ కుటుంబాల్లోని పల్లెటి పడుచులా వేషం వేసుకుంది. అలాగే నటిస్తూన్నది. పమిటచెరగు అడ్డం పెట్టుకుని వెక్కి వెక్కి ఏడవ సాగింది.

నేను శకుంతల వైపు తిరిగి "ఏడిస్తే ప్రయోజనం ఏముంది ? ఈ మొండిపట్టు వదలమని మీ అన్నకు చెప్పు!" అన్నాను.

జైలర్‌కి నమ్మకం కలిగింది. సుఖదేవ్‌ని జైలుకొట్టులో నుండి ఆఫీసు గదిలోకి పిలిపించాడు. సుఖదేవ్ బాగా మాసినగుడ్డల్ని వేసుకున్నాడు. వారం రోజులుగా తిండి తినకపోవడం వల్ల జబ్బుపడ్డ వాడిలా వున్నాడు.

సుఖదేవ్ వైపు సౌజ్ఞ చేస్తూ శకుంతలను అడిగాను "ఇతడేనా మీ అన్నయ్య ?"

శకుంతల అన్నను చూసేసరికి దుఃఖాన్ని ఆపుకోలేక మళ్ళీ బావురుమంది.

సుఖదేవ్ పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. అపరిచితుణ్ణి అడిగినట్టు నా పరిచయాన్ని అడిగాడు. ఉపవాసాన్ని వీడవల్సిందని అతణ్ణికోపడ్డాను. ప్రభుత్వ శాసనాన్ని గౌరవించడం అవసరం అనీ చెప్పాను. తరువాత సుఖదేవ్‌ని, అతడు అరెస్టయిన కారణాన్ని గురించీ, అప్పటి పరిస్థితిని గురించీ ప్రశ్నించాను. జైలర్ వైపు తిరిగి చిరునవ్వు నవ్వుతూ "ప్రభుత్వోద్యోగి ఎదుట ముద్దాయి ఇలాంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలడంటారా ?" అన్నాను.

జైలర్ కొంచెం అవతలకు వెళ్ళి నిలబడ్డాడు. నేను సుఖదేవ్‌కి మరికొంచెం దగ్గరికి వెళ్ళి మెల్లగా మాట్లాడాను. "ఏమీ వ్యతిరేకించకుండా అలా అరెస్టు ఎందుకయ్యావు" అడిగాను.

సుఖదేవ్ "జరగవలసిందేదో జరిగిపోయింది, రెండు ముక్కల్లో ఇప్పుడేం చెప్పగలను ? అలా ఎందుకు జరిగిందో సమయం వచ్చినప్పుడు అదే తెలుస్తుంది ?" అన్నాడు.

స్నేహితుల నిజమైన పేర్లు, అడ్రసులూ తెలియని నా బాధ గురించి అతడికి చెప్పాను. ప్రభాత్ (శివవర్మ), కాలీచరణ్ (కైలాసపతి), ఠాకూర్‌భాయీ (మహావీర్‌సింగ్) - ఈ మిత్రుల్ని కలవడానికి మార్గాన్ని అడిగాను. లాహోరులో ఈ మిత్రుల్తో పరిచయం అయితేవుంది. కానీ, బ్రాకెట్టులో ఇచ్చిన వీరి అసలు పేర్లు అప్పటివరకూ నాకు తెలియదు. వీరు పంజాబు దేశస్థులుకారు. యు.పి. విప్లవకారులు. లాహోరువచ్చి పోతూండేవారు.

భగవతీచరణ్‌ను కల్సుకోవడానికి మార్గం సుఖదేవ్‌కు తెలియదు. యు.పి. మిత్రుల్ని కల్సుకోవడానికి సహారన్‌పూర్‌లోని శివవర్మ అడ్రసునిచ్చాడు. పంజాబులోని మిత్రుల్తో మళ్ళీ సంబంధాల్ని స్థాపించుకోవడానికి జయచంద్ర విద్యాలంకార్‌గారినీ, లాలారామచరణ్‌దాసుగార్నీ కల్సుకోమన్నాడు.

మాట్లాడడం అయ్యాక జైలరుకు వినబడేట్టు పెద్దగా నిరశనవ్రతాన్ని మానవల్సిందని- సుఖదేవ్‌కు సలహాఇచ్చాను. వచ్చేప్పుడు నేను పట్టుకువెళ్ళిన ఫైళ్ళమీద జైలర్ చేత సంతకం చేయించాను. శకుంతలను వెంటపెట్టుకుని బయటకు వచ్చేశాను.

నేనిలా జైల్లోకి వెళ్ళి సుఖదేవ్‌ని కల్సుకున్నట్టు విన్న ప్రతివారూ నా సాహసాన్నీ, చాతుర్యాన్నీ పొగిడారు. పరారీలోవున్న నేను అలా జైల్లోకి వెళ్ళడం నిజంగా దుస్సాహసమే అనిపించుకుంటుంది. కానీ, జైల్లో వున్న ఆ కొద్దిక్షణాలూ, పైకి ఎంతబింకంగావున్నా, లోపల ఎంత బాధపడ్డానో చెప్పలేను. ఎలుక, బోనులోకి వెళ్ళడంతేలికే, తిరిగి బయటకు రాగలగాలిగదా ? అలా చేయడం దుస్సాహసమే , ఐతే, మిత్రుల్ని కల్సుకోవడానికి అంతకంటే మరోమార్గం మాత్రం ఏముంది ?

# సహారన్‌పూర్ బాంబు ఫ్యాక్టరి

సుఖదేవ్ మూడు అడ్రసులు ఇచ్చాడు. ఒకటి సహారన్‌పూర్ లకడ్‌మండీలోని డాక్టర్ నిగమ్ ఆస్పత్రి ! సుఖదేవ్ అరెస్టు అయిన విషయం తెలియక, వాళ్ళు అక్కణ్ణుండి మకాం ఎత్తేయకపోతే ప్రభాత్ (శివవర్మ) లకడ్‌మండీలో దొరుకుతాడు.

రెండో అడ్రసు లాలారామ్‌చరణ్‌దాసుగారిది. వీరు 1914లో రాజద్రోహ కుట్రకేసులో జైలుకు వెళ్ళారు. జన్మఖైదుచేసి రెండు సంవత్సరాల క్రితమే విడుదల అయ్యారు. వీరిద్వారా వెనుకటి విప్లవకారుల్తో సంబంధాలు పెట్టుకోవడానికి సుఖదేవ్, భగత్సింగ్-వీరి గ్రామం వెళ్తాండేవారు. వీరితో నాకూ బాగానే పరిచయం వుంది. అప్పుడు రామ్‌చరణ్‌దాసుగారు అమృత్‌సర్‌లో వుంటున్నారు. కనుక వార్ని కల్సుకోవడానికి అమృత్‌సర్ వెళ్ళాలి. కానీ, వెళ్ళనవసరం లేకపోయింది. దాసుగారు కూడా అరెస్టయ్యారని ఆరోజు సాయంకాలమే తెల్సింది. ఇంక సుఖదేవ్ ఇచ్చిన మూడవ అడ్రసు జయచంద్ర విద్యాలంకార్ గారిది. వీరినీ పోలీసులు అనుమానించారు. ఐతే, అప్పటికింకా అరెస్టు కాలేదు. బాహాటంగా తిరుగుతూన్నారు. పరారు కాకుండా గ్వాల్‌మండీలోనే వుంటూన్నారు. అనుమానించబడికూడా వీరు అప్పటివరకు అరెస్టుకాలేదు. అందుకు కారణం ; పోలీసులు 'వీరి ఇంటికి వచ్చేపోయే విప్లవకారుల్ని కనిపెట్టి తద్వారా విప్లవసంఘ రహస్యాల్ని కూపీ తీయవచ్చు ! అనుకున్నారేమో !' ఏమైనా కానీ, నేను వీరి ఇంటికి వెళ్ళడం తగదు. మరివీరిని నా దగ్గరకు పిలిపించుకోవడానికీ వీలులేదు. అలా పిలిపించడాన్ని జయచంద్రగారు అవమానంగా భావిస్తారు. మరో విషయం భగవతీచరణ్ మీద వేసిన అపవాదు వల్లకూడా వీరిని కల్సుకోవడానికి నాకేమంత ఇష్టం లేకపోయింది. చివరకు సహరన్‌పూర్ వెళ్ళి శివవర్మను కల్సుకోవాలని నిర్ణయించుకున్నాను.

శివవర్మను లాహోరు బాంబు ఫ్యాక్టరీలో చూశాను. అతడు మాట్లాడే పద్ధతి, ప్రవర్తన చాలా హుందాగా వుండేది. అతడి ప్రభావం నామీద బాగా పనిచేసిందనీ చెప్పవచ్చును. పైగా, సుఖదేవ్ మరో మాట కూడా అన్నాడు. శివవర్మ ద్వారా ఆజాద్‌ను కల్సుకోవచ్చునన్నాడు. అంతకంటే కావల్సిందేమిటి ?

సహారన్‌పూర్ వెళ్ళడానికి ముందు ఒకమాటు దుర్గాబాభీని కల్సుకుని మాట్లాదామనుకున్నాను. భగవతీచరణ్‌ని కల్సుకోవడానికి మార్గం అడుగుదామని ఉద్దేశ్యం ! ఐతే, అసలు బాభీని కల్సుకునే మార్గం ఏమిటి ? వారి ఇంటికి వెళ్ళడానికి వీలులేదు. జైళ్ళలో మగ్గుతూన్న విప్లవకారుల బంధువులు ఇంటినిండా వుంటారు ! వారి సేవలో దుర్గాబాభీ తలమునకలవుతూ వుంటుంది. జైళ్ళలోని విప్లవకారులందరూ దుర్గాబాభీకి ఆత్మీయులైన బంధువులే ! వాళ్ళకు కమ్మని భోజనం తయారుచేసి పంపించడం ఆమె తన విప్లవాత్మకమైన కర్తవ్యంగా భావించింది! విప్లవకారుల బంధువులు ఇంతమంది ఇంట్లో వుండడంవల్ల, వారిని కల్సుకోవడానికి ఎవరెవరు వస్తూంటారో తెల్సుకునే నిమిత్తం సి.ఐ.డి.లు ఇంటిచుట్టూ తిరుగుతూవుంటారు. ఇంక నేను వెళ్ళడం ఎలా సంభవం ? దుర్గాబాభీని పిలిపించడం మాత్రం ఎలా సంభవం ? బాధ్యతలు నెత్తిన పడ్డప్పుడు చూడాలి దుర్గాబాభీయొక్క 'దుర్గ' రూపం !

దుర్గాబాభీ, ప్రేమవతి ద్వారా కబురు పంపింది. 'లాహోరులో అరెస్టులు ముమ్మరం కావడంవల్ల భగవతీచరణ్ ఇప్పుడప్పుడే ఇంటికి రావడంగానీ, ఇంటికి జాబు రాయడంగానీ చేయడు. బహుశ సుశీలా దీదీ దగ్గర వుండవచ్చును. అక్కడ వుండి, తిరిగి మిత్రుల్తో సంబంధాలు ఏర్పరచుకోడానికి

చూస్తుంటాడు' అని. అప్పటికి సుశీలాదీదీ పోలీసుల దృష్టిలో పడలేదు. కలకత్తాలో ఆమె వుండే ప్రదేశం సురక్షితమయింది. సహారన్‌పూర్ వెళ్ళి శివవర్మను కల్సుకున్నాక అటునుంచి కలకత్తా వెళ్ళి భగవతీభాయిని గురించి ఆరా తీద్దామనుకున్నాను. కలకత్తా వెళ్ళడానికి అవుసరం అయిన డబ్బులకోసం మరో రెండు రోజులు లాహోరులోనే వుండిపోయాను.

సుఖదేవ్‌ను కల్సుకోవడానికి సెంట్రల్ జైలుకు వెళ్ళినప్పుడు మంచి సూటూ, బూటూ వేసుకుని వెళ్ళాను. ఐతే, ఇంద్రపాల్ తీసుకున్న గదుల్లో మాత్రం మాసిన చొక్కా, లుంగీ - కట్టుకుని గడిపేవాడిని. "నీగురించి మిత్రులు అడిగితే ఏం చెప్పమంటా ?" అని అడిగాడు ఇంద్రపాల్.

నేనిలా అన్నాను "బాల్యమిత్రుణ్ణని చెప్పు ! చనువును ప్రదర్శించడానికి చిట్టిపొట్టి తిట్లను ఉపయోగిస్తూండు ! ఎవడో పల్లెటూరిబైతులే అనుకుంటారు నీ స్నేహితులు !"

ఇంద్రపాల్ నా గురించి అలాగే చెప్పాడు తన స్నేహితులకు ! నేను పగలంతా ఇంట్లోనుండి కదలకపోవడానికి ఓ కారణాన్ని చెప్పాడు. "వీడికి కండ్లజబ్బు .... ఎండను చూడలేడు !" అన్నాడు. నల్లకళ్ళజోడు ఒకదాన్ని తెచ్చి ఇచ్చాడు. కండ్లజబ్బుకు నిదర్శనంగా దాన్ని 24 గంటలూ తీసేవాణ్ణికాదు.

మే 14వ తారీకు ఉదయం ఎవరూ లేకుండాచూసి ఇంద్రపాల్ ఇలా అన్నాడు. "సహారన్‌పూర్ అస్పత్రి నొకదాన్ని పోలీసులు పట్టుకున్నారట ! బాంబులు దొరికాయి. ప్రభాత్, హరీష్ - అనే ఇద్దరు విప్లవకారుల్ని అరెస్టు చేశారట !"

ఇంగ్లీషు వార్తా పత్రికను చదివి విషయం వివరంగా తెల్సుకోడానికి ఆతృతపడుతూన్నాను. నేనక్కడ ఇంగ్లీషు పత్రికను చదవడం అంటే, కావాలని ఇతరులదృష్టిని నావైపు తిప్పుకోవడమే అవుతుంది ! కాకపోయినా, సహారన్‌పూర్‌లో, లకడ్‌మండీలో అస్పత్రి పట్టుపడ్డదని తెలిశాక - ఇంక వివరంతో పనేమిటి ? పైగా, ప్రభాత్ అరెస్టయ్యాడని తెలిశాక ఇంక అనుమానానికి, ఆశకు - తావు ఎక్కడ వుంటుంది ? సమయానికి డబ్బు అంది, నేను వెళ్ళి వున్నట్లయితే నేనూ అక్కడ పోలీసులకు దొరికి పోయేవాణ్ణి ! లాహోరు బాంబు ఫ్యాక్టరీలో ఆరోజు రాత్రి నేను ఉండక పోవడం ఎలా అనుకోకుండా జరిగిందో, ఇదీ అంతే ! ఇప్పుడింక భగవతీచరణ్‌ను కల్సుకోడానికి కలకత్తా వెళ్ళడం కన్నా మరో మార్గం లేదు !

సహారన్‌పూర్ బాంబు ఫ్యాక్టరీ పట్టుబడిపోవడం మా విప్లవసంఘానికి పెద్దదెబ్బ ! అప్పట్లో (హి.స.ప్ర.స.)కు ముఖ్యస్థానం సహారన్‌పూరే !

...... ఆ రోజున సహారన్‌పూర్ బాంబు ఫ్యాక్టరీలో ఎక్కువమంది సభ్యులు లేకపోవడమూ ఓ అదృష్టమే ! అప్పట్లో 'హి.స.ప్ర.స' ఢిల్లీ, యు.పి., పంజాబ్ - ఈ మూడు ప్రాంతాల్లోనే ఎక్కువ వ్యాప్తిలో వుంది. ఆజాద్‌కు వ్యక్తిగతంగా ఝాంసీ, గ్వాలియర్ - ప్రాంతాల్లో పరిచయం ఎక్కువ. కనుక, అతడు అక్కడే వుంటుండేవాడు ! అసలు 'హి.స.ప్ర.స. కేంద్రం ఆగ్రా ! ఆగ్రానుండి కేంద్రాన్ని సహారన్‌పూర్‌కు మార్చారు. అలా మార్చడానికి రెండు కారణాలు వున్నాయి. ఒకటి, భౌగోళికంగా ఆగ్రాకంటే సహారన్‌పూర్ సౌకర్యమైంది. ఇక రెండవ కారణాన్ని వివరిస్తాను.

అసెంబ్లీలో బాంబు వేయడానికి ముందు జరిగిన విషయం ! భగత్సింగ్ విప్లవ కార్యక్రమాల సందర్భంగా అలహాబాద్‌కు వెళ్ళివస్తూండేవాడు. అక్కడి స్థానిక నాయకుడు యతీన్‌సన్యాల్, భగత్సింగ్‌కు లలిత్ మోహన్ బెనర్జీ అనేయువకుడిని పరిచయం చేశాడు. లలిత్‌బెనర్జీ ఉత్సాహవంతుడైన యువకుడు. విప్లవకార్యక్రమాలు చురుగ్గా సాగనందుకు బాధపడుతుండేవాడు. 'లలిత్‌బెనర్జీ మంచి ఉత్సాహవంతుడైన కార్యకర్త' అని భగత్సింగ్ అభిప్రాయపడ్డాడు.

లలిత్‌బెనర్జీ అలహాబాద్ యూనివర్శిటీలో ఎం.ఎస్.సి. చదువుతూన్నాడు. యతీంద్రదాసు బాంబులు చేయడం నేర్పేనిమిత్తం కలకత్తా నుండి ఆగ్రా వచ్చాడు. మా విప్లవసంఘ సభ్యుల్లోని ప్రసిద్ధులైనవారందరూ ఆగ్రాలోనే వున్నారు, బాంబులు చేయడం నేర్చుకోవడానికి ! అదే సందర్భంలో భగత్సింగ్ ఈ లలిత్‌బెనర్జీని కూడా పిలిపించాడు.

లలిత్‌బెనర్జీ ఆగ్రా వచ్చాడు. విప్లవసంఘ ఏర్పాట్లను చూశాడు. మూడు ఇండ్లలో బాంబులు తయారుచేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. చాలమంది సభ్యులు నేర్చుకుంటున్నారు. ఈ అట్టహాసాన్ని, ఆయుధాల్ని చూసి, ఉత్సాహపడడానికి బదులు లలిత్‌బెనర్జీ నీరసించిపోయాడు ! కంగారుపడ్డాడు ! భయపడసాగాడు ! అతడి భయాన్ని, కంగారునీ ఆజాద్, సుఖదేవ్, శివవర్మ, యతీంద్రనాథ్ - వీరందరూ గమనించారు ! 'ఇలాంటి వాణ్ణి తీసుకురావడం భగత్సింగ్ చేసిన పొరపాటని' అందరూ అన్నారు.

యతీంద్రనాథ్ దాస్ హెచ్చరించాడు. "ఇతడిని అలహాబాద్ పోనీయవద్దు ! మొత్తం సంఘాన్నే ముంచేస్తాడు. యమున ఒడ్డుకు తీసుకుపోయి కాల్చి యమునలో పారేద్దాం !" అన్నాడు.

భగత్సింగ్, లలిత్‌బెనర్జీని కాల్చడాన్ని వ్యతిరేకించాడు. అంత తీవ్రంగా వ్యవహరించడానికి ఇతర మిత్రులూ అంగీకరించలేదు ! అతణ్ణి అలహాబాద్ వెళ్ళనిచ్చారు. అతడు చూసిన మూడు ఇళ్ళనూ వెంటనే మార్చివేయాలన్న నిర్ణయం జరిగింది. యతీంద్రనాథ్ దాసు అనుమానమూ నిజమే అయింది. లలిత్‌బెనర్జీ అలహాబాద్ వెళ్ళగానే అరెస్టయ్యాడు. క్షమాభిక్ష దొరుకుతుందన్న ఆశతో వెంటనే ప్రభుత్వసాక్షి అయ్యాడు.

లలిత్‌మోహన్‌బెనర్జీ కొరకే కాకుండా మరో కారణం వల్లనూ కేంద్రాన్ని మార్చడం అవుసరం అయింది. భగత్సింగ్, దత్తా అసెంబ్లీలో బాంబుపేల్చి అరెస్టయ్యేరోజు దగ్గరపడుతూన్నది. నియమానుసారంగా వాళ్ళకు తెల్సిన ఇండ్లను మార్చాలి !

డాక్టర్ గయాప్రసాద్‌కు సహారన్‌పూర్‌లో కేంద్రం కోసం ఓ ఇల్లు అద్దెకు తీసుకోమని చెప్పడం జరిగింది. అయితే, తగిన ఇంటిని అతడు తీసుకోకపోవడంవల్ల, ఆగ్రాలో లలితబెనర్జీ చూసిన ఇళ్లను తక్షణం ఖాళీచేసి అక్కడున్న సామాన్ని ఢిల్లీ సీతారాం బజార్లో తీసుక్ను ఇంట్లో తాత్కాలికంగా పడేశారు. కారణాంతరాలవల్ల సీతారాం బజార్లో తీసుకున్న ఇంటినీ వెంటనే ఖాళీ చేయవల్సి వచ్చింది. అక్కడ మేడమీద మూడవ అంతస్తులో, ఒగదిని అద్దెకు తీసుకున్నారు. కింది భాగంలో వున్నవాళ్ళు చాలా పొగరుబోతులు 'చంప పగులగొడతాను !', 'తన్ని తగిలేస్తాను !' ఈ రెండు వంత పదాలనూ ఉపయోగించకుండా వాళ్ళసలు మాట్లాడరు. పై వంత పదాలను ఉపయోగించకపోతే తమ హోదాకు భంగం కలిగినట్టు భావిస్తారువాళ్ళు ! చుట్టుప్రక్కల ప్రజలు వాళ్ళని 'గురూ' అనీ 'ఉస్తాద్' అనీ పిలుస్తూవుంటారు. ముఖంచాటు చేసుకుని నోటికి వచ్చినట్టు తిడుతూవుంటారు.

ఒక రోజున కింది వాకిలికి ఎదురుగా సైకిల్ పెట్టడంవల్ల ఈ 'వస్తాదు' లకూ, జయదేవ్‌కపూర్‌కీ పోట్లాట జరిగింది. సాధారణంగా విప్లవసంఘ సభ్యులు ఇతర్ల దృష్టిని ఆకర్షించే పనులు ఏవీ చేయరు. ఎవరితోనూ పోట్లాడరు. అందరిపట్లా వినయాన్నే ప్రదర్శిస్తూ వుంటారు. ఐనా, ఎంత ఒదిగివున్నా ఒక్కోప్పుడు కవ్వింపు చర్యలు జరుగుతూనే వుంటాయి. ఇక్కడా అలాగే జరిగింది. వెంటనే ఆ గదినీ మార్చవల్సివచ్చింది. ఈ చిన్న విషయానికి ప్రాముఖ్యత ఇవ్వడం అనవసరం ! కానీ, ఇవ్వవల్సి వచ్చింది. కారణం వివరిస్తాను.

డాక్టర్ గయాప్రసాద్ సహారన్‌పూర్ 'లకడ్‌మండీ'లో కేంద్రానికి సరిపడే ఇంటినొకదాన్ని అద్దెకు తీసుకున్నాడు. ఇంటినయితే తీసుకున్నాడు. దగ్గర డబ్బు లేక పోవడంవల్ల అప్పటికి అవుసరం

అయిన సరంజామును ఏర్పాటు చేయలేకపోయాడు. అంతక్రితం డాక్టర్ గయాప్రసాద్ ఫిరోజ్‌పూర్‌లో ఇలాంటి ఆస్పత్రి నొకదాన్ని పెట్టాడు. పైకి ఆస్పత్రి లోపల విప్లవసంఘ కేంద్రం ! ఫిరోజ్‌పూర్‌లో ప్లాను చక్కగా పారింది ! త్వరలోనే డాక్టర్ గయాప్రసాద్ నాగరికుల్లో పలుకుబడి సంపాయించాడక్కడ ! కాయస్థుల సంఘానికి సెక్రటరీ కూడా అయ్యాడు ! హోమియోపతి, అలోపతి, అయుర్వేదం - ఈ మూడింటినీ కలిపి కొట్టేవాడు ! అవసరాలకు సరిపడే ఆదాయమూ వచ్చేది ! కానీ, సహారన్‌పూర్‌లో ఆర్థిక ఇబ్బందివల్ల కాలు నిలదొక్కుకోలేకపోయాడు !

శివవర్మ, జయదేవ్‌కపూర్ - ఢిల్లీలోని బాంబుల్ని, ఆయుధాల్ని, ఇతర సామాగ్రిని తెచ్చి సహారన్‌పూర్‌లో పడేస్తున్నారు ! ఎంత ప్రయత్నించినా డబ్బులు మాత్రం పట్రాలేకపోతున్నారు. వీళ్ళు ఏమైనా డబ్బు సంపాయించుకు వస్తారన్న ఆశతో గయాప్రసాద్ ఆస్పత్రిలో కూచుని ఎదురుచూస్తూండేవాడు. లేకపోతే ఏదో ఒక పుస్తకం చదువుకుంటూవుండేవాడు. స్టెతస్కోప్ ఒకటీ, ఎనిమా కేన్ ఒకటి - గోడకు తగిలించి వుండేవి. అది ఆస్పత్రి అనడానికి ఆ రెండు వస్తువులే ఆధారం !

యతీంద్రనాథ్ దాసు బాంబులు చేయడంలో ప్రసిద్ధుడు ! శివవర్మ అతడి దగ్గర బాంబులు చేయడం నేర్చుకున్నాడు. ఆగ్రాలో తయారైన పేలుడు పదార్థాన్నీ, లాహోరులో సుఖదేవ్ పోతపోయించిన బాంబుల డిప్పల్ని సహారన్‌పూర్‌లోని ఈ ఆస్పత్రిలోనే పడేశారు. బాంబుల్లో మందుకూరి సిద్ధంగా వుంచుకోవడమూ ఔసరం అనుకున్నారు శివవర్మా, జయదేవ్‌కపూర్ ! వాళ్ళు ఆ బాంబుల్ని ప్రయోగించడానికి తగిన అవకాశం లభించిందనే అనుకున్నారు. అప్పట్లో వైస్రాయి డేరాడూన్ అడవుల్లోకి వేట నిమిత్తం వెళ్ళాడు. వైస్రాయిమీద బాంబుదాడి చేయాలనుకున్నారు శివవర్మ, జయదేవ్‌కపూర్ ! శివవర్మ ఝాన్సీవెళ్ళి ఆజాద్‌ని కల్సుకుని మాట్లాడాడు. వైస్రాయిమీద దాడి చేయడానికి అనుమతినీయవల్సిందని అడిగాడు. ఆజాద్ 'మొదట పరిస్థితిని జాగ్రత్తగా గమనించండి' అని మాత్రం చెప్పాడు. వాళ్ళిద్దరూ సి.ఐ.డి.పోలీసుల్లా దుస్తుల్ని వేసుకుని, అలాగే వ్యవహరించారు. వైస్రాయి వచ్చే పోయే మార్గాన్ని, సమయాన్నీ సి.ఐ.డి.ల దగ్గరే కూపీలాగి తెల్సుకున్నారు.

సాండర్సహత్య, అసెంబ్లీ బాంబుకేసు, లాహోరు బాంబుఫ్యాక్టరీ పట్టుబడిపోవడం - ఇవన్నీ వెంట వెంటనే జరిగాయి ! పోలీసులు వివిధ ప్రాంతాల్లోని విప్లవకారుల్ని అరెస్టు చేస్తున్నారు. సుఖదేవ్ అరెస్టు అయ్యాడు. అతడు ప్రభుత్వసాక్షిగా మారతాడన్న అనుమానం లేకపోయినప్పటికీ, సహారన్‌పూర్‌లోని కేంద్రస్థానం అతడికి తెలునుగనుక, విప్లవ సంఘపు నియమాన్ననుసరించి ఆ ఇంటినీ వెంటనే ఖాళీ చేయాలి ! అయితే, డబ్బుదే పెద్దసమస్య అయింది!

సహారన్‌పూర్‌లో విప్లవాత్మక తీవ్ర రాజకీయ వాతావరణం కనిపిస్తోంది. డబ్బుల్లేకపోవడంవల్ల, శివవర్మ, జయదేవ్‌కపూర్ స్థానీయ దుస్తుల్ని కొనుక్కోలేకపోయారు. వాళ్ళు కాన్పూర్, మురాదాబాద్ నగరాల్లోని విద్యార్థుల్లాగా దుస్తుల్ని ధరిస్తున్నారు. వాళ్ళల్లో ని ఈ ప్రత్యేకతా, సామానూ - సరంజామా లేని ఆస్పత్రి- ప్రజల అనుమానానికి కారణం అవుతున్నాయి. వీళ్ళు ప్రక్కనున్న గ్రంధాలయానికి వార్తా పత్రికను చదవడానికి వెళ్ళేవాళ్ళు ! ప్రజలు వీళ్ళతో ప్రత్యేకం రాజకీయాల్ని గురించి మాట్లాడడం మొదలు పెట్టారు. గయాప్రసాద్, శివవర్మ, జయదేవ్ - ముగ్గురూ పరిస్థితిని గమనించారు. అక్కడ నుండి డేరా ఎత్తడం అవుసరం అనీ - అనుకున్నారు. ఐతే, అక్కడి నుండి వెళ్ళిపోవడానికయినా డబ్బు కావాలిగదా !

మే పది లేక పదకొండోతారీకున ఖద్దరు ధరించిన ఓ పెద్దమనిషి గయాప్రసాద్‌ను ఒంటరిగా కల్సుకుని అడిగాడు "విప్లవకారులకూ మీకూ ఏమీ సంబంధంలేదుకదా ? ఈ పట్నంలో విప్లవకారుల కోసం పోలీసులు వేట ప్రారంభించాలరుట !"

డాక్టరు గయాప్రసాద్ తనకూ విప్లవకారులకూ ఏ సంబంధమూ లేదని ఆ పెద్దమనిషికి చెప్పాడు. కానీ, అక్కడనుండి త్వరగా డేరా ఎత్తేయడానికి తహతహలాడాడు. ఎంత ప్రయత్నించినా లాభం లేక పోయింది. ముగ్గురూ వెళ్ళిపోవడానికి అవుసరం అయిన ఖర్చులకు కూడా డబ్బులేదు. ముగ్గురి జేబుల్లోదీ కలబోసుకుంటే, కాన్పూరు వరకూ ఒక టిక్కెట్టుకు మాత్రమే డబ్బు వుంది. ఆ మొత్తం డబ్బులూ తీసుకుని గయాప్రసాద్ కాన్పూరు వెళ్ళాడు. కాన్పూరులో గయాప్రసాద్ బంధువు ఒకతను వున్నాడు. అతణ్ణి అడిగి ఏమైనా డబ్బుతెచ్చుకోవచ్చునని ఊహ ! డాక్టర్ కాన్పూర్ వెళ్ళాక శివవర్మ, జయదేవ్ దగ్గర కలిపి పదణాలు మాత్రం వున్నాయి ! డాక్టర్ పన్నెండో తారీకు ఉదయానికల్లా తిరిగివస్తానన్నాడు. ఈ రెండు రోజులూ ఏసెనగపప్పులో కొనుక్కుతిని కాలక్షేపం చేయవచ్చును- అనుకున్నారు శివవర్మ, జయదేవ్‌కపూర్ !

'పోలీసులు ఈ ఇంటిని ఎలా పసికట్టారు ?' అన్న ప్రశ్న గయాప్రసాద్‌నూ, శివవర్మనూ, జయదేవ్‌కపూర్నూ- చాలా రోజులు వేధించింది ! 'డబ్బు లేకపోవడంవల్ల ఆస్పత్రికి అవుసరం అయిన సరంజామును ఏర్పరచలేకపోయాము. ఈ కారణంవల్లనే పోలీసులు లోగుట్టును పసికట్టారు !' అని అనుకుని చాలా రోజులపాటు బాధపడ్డారు. కానీ, సత్యం అదికాదు. సి.ఐ.డి. పోలీసులకు లోగుట్టును పసికట్టే తెలివితేటలు అంతంత మాత్రమే ! అంతకుముందు ఆ యింటిని ఎరిగివున్న ఇద్దరు వ్యక్తులు అరెస్టయ్యారు. ఒకరు సుఖదేవ్, రెండవ అతడు ఫణీంద్రనాథ్ ఘోష్ ! సుఖదేవ్ ఆ యింటి అడ్రసు పోలీసులకు చెప్పి వుండడు. అతడే చెప్పివుంటే పోలీసులు ఆ యింటిపై పదిపదిహేను రోజులు ముందే దాడిచేసేవారు ! అదీకాక, తాను పోలీసులకు ఆ యింటి అడ్రసు చెప్పివుంటే, నన్ను అక్కడికి వెళ్ళమని ఎందుకు చెప్తాడు ?

సుఖదేవ్ పోలీసులకు రహస్యాలు చెప్పాడు. ఐతే, అతడో ప్రత్యేకమైన పద్ధతిలో చెప్పాడు ! అతడు చెప్పినదాన్ని బట్టి ఏ ఒక్క అరెస్టూ జరగలేదు ! సుఖదేవ్ తాను అరెస్టుకాకముందే మార్చివేయబడిన అడ్రసులు మాత్రమే పోలీసులకు చెప్పాడు. సహారన్‌పూర్ ఇంటి అడ్రసును అతడు పోలీసులకు చెప్పలేదు.

సహారన్‌పూర్‌లోని ఆస్పత్రిని పోలీసులు పట్టుకోవడానికి రెండు, మూడురోజులుముందే ఫణీంద్రనాథ్ ఘోష్ కలకత్తాలో అరెస్టయ్యాడు. పట్టుపడగానే క్షమాభిక్షను ఆశించి ప్రభుత్వసాక్షి అయ్యాడు.

ఫణీంద్రనాథ్ ఘోష్ 1914నాటి విప్లవోద్యమంలోనూ పాల్గొన్నాడు. అనుభవజ్ఞుడూ, విశ్వాసపాత్రుడూ ఐన విప్లవకారుడు ! వెనుకటి ఉద్యమాల్లో పాల్గొన్నప్పుడూ అతడు కొన్నాళ్ళు జైలుచేశాడు. 'హి.స.ప్ర.స.' లోనూ అతడిస్థానం చాలా వున్నతమైంది ! బీహార్ ప్రాంతానికంతటికీ అతడు ప్రతినిధి. 'హి.స.ప్ర.స.'ను పటిష్టంచేయడంలో ఆజాద్‌కూ, భగత్సింగ్‌కూ ఎంతోసహకరించాడు ఘోష్ ! కానీ, కొన్నాళ్ళుగా అతడిలో కొంత మార్పువచ్చింది. మార్పుకు కారణముంది. విప్లవ సంఘ నియమాన్ననుసరించి ఏ సభ్యుడైనా వివాహం చేసుకోవాలంటే సంఘం యొక్క అనుమతిని పొందాలి ! వివాహంచేసుకున్న సభ్యుల్ని సంఘంలో చేర్చుకోడానికి అభ్యంతరంలేదు. కానీ, ఆ తర్వాత సభ్యులు వివాహం చేసుకోదలిస్తే సంఘంయొక్క అనుమతిని విధిగా పొందితీరాలి ! ఐతే, ఈ నియమాన్ని ఎవరూ పట్టించుకోలేదు. పట్టించుకోకపోవడానికీ కారణం వుంది. అసలు మా విప్లవసంఘ సభ్యుల్లో వివాహాన్ని గురించిన ఆలోచనకే తావులేదు. కనుక పై నియమాన్ని సభ్యులకు గట్టిగా తెలియపరచడంగానీ, పైనియమాన్ని విధిగా పాటించడానికి అవుసరం అయిన జాగ్రత్తల్ని తీసుకోవడంగానీ - జరగలేదు ! ఆదరణలేని నియమాన్ని ఎవరో ఒకరు త్రోసిరాజనడం సహజం ! అలా త్రోసిరాజన్న

ఒకరిద్దరు మిత్రులపట్ల కటువుగా వ్యవహరించడం జరిగింది ! ఐతే, ఫణీంద్రనాథ్ ఘోష్ పట్ల అలాంటిదీ ఏమీ జరగలేదు ! తన పెళ్ళివిషయం మిత్రులెవరికీ తెలియకుండా దాచిపెట్టాడు అతడు ! వివాహం చేసుకున్నాక ప్రమాదాల్ని వరించలేని పిరికితనం అతడిలో గూడుకట్టుకోసాగింది ! ఫణీంద్రనాథ్ ఘోష్ ప్రసిద్ధ విప్లవకారుడు కావడంవల్ల - అసెంబ్లీ బాంబు కేసు, లాహోరు బాంబుఫ్యాక్టరీ పట్టుబడడం - జరిగాక పోలీసులు అతడికోసమూ గాలించసాగారు. పోలీసుల బారినుండి తప్పించుకోడానికి అతడు పరారయ్యాడు. పరారయ్యాడేగానీ నవవధువుమీది ఆకర్షణను చంపుకోలేకపోయాడు. నేరుగా అత్తవారింటికి, కలకత్తా వెళ్ళాడు.

ఫణీంద్రనాథ్ ఘోష్‌కు వివాహమైన విషయం మిత్రులకు తెలియదు గానీ, పోలీసులకు తెల్సు. అతణ్ణి పట్టుకోడానికి అత్తవారింటిమీదా ఓ కన్ను వేసివుంచారు పోలీసులు ! ఘోష్ కలకత్తా వెళ్ళగానే పోలీసులు పట్టుకున్నారు. వెంటనే ప్రభుత్వ సాక్షి అయ్యాడు. పరప్రభుత్వంనుండి దయాభిక్షను ఆశించి విప్లవసంఘ రహస్యాలను చెప్పేశాడు. మిత్రుల్ని పట్టించాడు. యతీంద్రనాథ్ దాస్, కమల్‌నాథ్ తివారి, వైద్యనాథ్ సింహ్, సురేంద్రపాండే, లలిత్‌మోహన్ బెనర్జీ - వీరందరి పేర్లూ ఫణీంద్రనాథ్ ఘోష్ ప్రభుత్వానికిచ్చాడు. పై మిత్రులందర్నీ పోలీసులు అరెస్టు చేశారు. ఇంతటి విశ్వాసఘాతుకం చేశాడుగనుకనే అతడిని దండించాలని ఆజాద్ ప్రత్యేకం పట్టుపట్టాడు. జలగాం న్యాయస్థానంలో ఒకమాటూ, 1930లో అలహాబాదులో మరోమాటూ-ఫణీంద్రనాథ్ ఘోష్‌ను కాల్చడమూ జరిగింది ! ఐనా, అతడు బ్రతికిపోయాడు ! సరే, అదలా వుంచుదాం !

సి.ఐ.డి. పోలీసులు ఏ యింటిమీదనయినా కన్ను వేశారంటే ఇంట్లోవున్నవాళ్ళు ఏ మాత్రం అనుభవం కలవారయినా వెంటనే పసికట్టేస్తారు. శివవర్మా, జయదేవ్‌కపూర్- అనుభవం కలవారైవుండికూడా తమ ఆస్పత్రిమీద పోలీసుల కన్నుపడ్డదని గమనించలేకపోయారు. 12వ తారీకు మధ్యాహ్నం నుండి కపూర్ మనస్సుకు ఏదో అవ్యక్తమైన అనుమానమూ, శంకా - పొడమసాగాయి ! ఆ రాత్రి ఇద్దరూ వంతుల ప్రకారం కాపలా కాయాలని నిర్ణయించుకున్నారు !

పోలీసులు ఏసమయంలో దాడి చేయడానికి వస్తారో మాకు బాగా తెల్సు. పోలీసులు ఎప్పుడూ తెల్లవారుజామున నాలుగు, లేక ఐదు గంటలాచాయల దాడికి బయలుదేరుతారు ! రాత్రంతా అలా కాపలా కాశారు వాళ్ళు ! తెల్లవారి ఆరుగంటలాచాయల మిద్దె మీద నుండి క్రిందకు దిగారు. సూర్యోదయం అయింది. చల్లని గాలికి, ఇద్దరికీ ముంచుకుపోయినట్టు నిద్ర వచ్చింది. రాత్రంతా మేలుకుని వున్నారేమో, తెల్లవారి డాక్టరు డబ్బుతో వస్తాడన్న కమ్మని వూహల్తో గదిలోని మంచాలమీద పడి గాఢనిద్రలో మైమరచారు ! అంతలో ఎవరో దబదబా తలుపు కొట్టారు. అయినా, కపూర్‌కి మెళుకువరాలేదు.

శివవర్మ కంగారుగా నిద్ర లేచాడు. డాక్టరు వచ్చాడనుకున్నాడు. వెళ్ళి తలుపుతీశాడు. డాక్టరుకు బదులు పోలీసులు ప్రత్యక్షం అయ్యారు. అతణ్ణి చుట్టుముట్టారు. అతడు డాక్టర్ వచ్చాడనుకుని తలుపు తీయడానికి వచ్చాడు. కనుక, తలక్రింద వున్న పిస్తోల్ని తెచ్చుకోలేదు.

పోలీసులు ప్రశ్నించారు. "మీరేనా డాక్టరు ?"

"నేను డాక్టర్నికాను, వారి బంధువుని. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్నాను. నేనూ నామిత్రుడు వేసంగి సెలవులకు మంసూరీ వెళ్ళాము. తిరిగి వస్తూ, మొన్న ఇక్కడ దిగాం ! డాక్టరుగారు ఏదో పనిమీద కాన్పూరు వెళ్ళారు !" అని చెప్పాడు శివవర్మ

'పోలీసులు కేవలం అనుమానంమీద వచ్చారు. తెలివిగా మాట్లాడి వారి అనుమానాన్ని తీరిస్తే వెళ్ళిపోతారు' అనుకున్నాడు శివవర్మ. కానీ, పోలీసులు కేవలం అనుమానంమీదనే రాలేదు.

పూర్తిగా తెల్సుకునే వచ్చారు. డిప్యూటీ సూపరింటెండెంట్ మధురావత్తుజోషీ, ఒక సబ్ ఇనస్పెక్టర్నూ, సశస్త్రులైన పదిమంది పోలీసుల్నీ తీసుకువచ్చాడు.

జోషీ శివవర్మను వెంటపెట్టుకుని ముందుగదిలోకి వచ్చాడు. అనేక ప్రశ్నలు వేస్తున్నాడు. "ఏం చదువుతూన్నావ్ ? బెనారస్‌లో లెక్చరర్లు ఎవరెవరున్నారు ?" అని ప్రశ్నిస్తూనే అరమరల్లోని పుస్తకాలను చూస్తూన్నాడు. కొన్ని నిషిద్ధ గ్రంథాలు కనుపించాయి. ఇంతలో లోపలిగదిలోనుండి సబ్ఇనస్పెక్టర్ ఇలా అన్నాడు. "ఈ గదిలోకి రాండి. ఇక్కడ చూడాల్సింది చాలావుంది !"

ఇనస్పెక్టరు పిలుపునందుకుని జోషీ శివవర్మను వెంటపెట్టుకుని లోపలి గదిలోకి వెళ్ళాడు. అక్కడ కపూర్ పోలీసుల అధీనంలో వుండడాన్ని చూశాడు శివవర్మ !

లోపల గది అరమరల్లో బాంబులు చేయడానికి అవుసరమైన పదార్థాలూ పాత్రలూ వున్నాయి. ఒక పెట్టెలో తయారు చేసిన బాంబులు వున్నాయి. మరో బ్యాగ్‌లో రెండు పిస్తోళ్ళూ, తూటాలు వున్నాయి. జోషీ, శివవర్మను ఆ యింటిని గురించి ఇంకా ప్రశ్నిస్తూనే వున్నాడు. ఇంక ఇప్పుడు ఏదో సమాధానం, చెప్పి తెలివిగా, తప్పించుకునే అవకాశం లేదు. పోనీ, ఆయుధాలను లంకించుకుందామంటే, అందుకూ అవకాశం లేదు. చుట్టూ పోలీసులు వున్నారు ! మాటలాడుతూనే తెలివిగా ఆయుధాల్ని చేచిక్కించుకునే అవకాశాన్ని కల్పించుకోవాలి !

జోషీ, శివవర్మ చేతనే అల్మారాలను తెరిపిస్తూన్నాడు "అదేమిటి ? ఇదేమిటి ?" అని ప్రశ్నిస్తూన్నాడు.

"నాకేం తెల్సు ? ఇదంతా డాక్టరు సామాను ! ఆయన ఆయుర్వేద వైద్యం కూడా చేస్తూంటాడు. పుఠంపెట్టి సొంతంగా మందులూ తయారుచేస్తుంటాడు !" అన్నాడు శివవర్మ.

ఒక పెట్టె వైపు వేలితోచూపుతూ "ఆ పెట్టెను తెరు" అని ఆజ్ఞ ఇచ్చాడు జోషీ శివవర్మకు.

"అన్నీ నేనే తెరవాల్నా ? సోదా చేసేదిమీరు. మీరే తెరుచుకోండి !' అన్నాడు శివవర్మ.

"మీరే తెరవాలి !" జోషీ పట్టుపట్టాడు.

"సరే !" అంటూ శివవర్మ పెట్టె మూత తెరచి లోపల చేయిపెట్టి పెద్దగా అరిచాడు "ఇక చావండి, ఇదిగో బాంబు !" అంటూ పెట్లోనుండి బాంబునొకదాన్ని బయటకు తీశాడు.

జోషీ హడలిపోయాడు ; గావు కేక పెట్టాడు ! "పట్టుకోండి ! పరుగెత్తండి !" అని తన పోలీసులకు ఆర్డర్ ఇచ్చాడు. పట్టుకోడానికి బదులు తనే అందరికంటే ముందు బయటికి పరుగెత్తాడు. పోలీసులు కూడా 'పట్టుకోండి!' అన్న ఆజ్ఞను లెక్క పెట్టకుండా 'పరుగెత్తండి !' అన్న ఆజ్ఞకే ప్రాధాన్యతనిచ్చారు.

శివవర్మ వెంటనే రెండవ అరమర వైపు పరుగెత్తాడు. బాంబు అతడి చేతిలోవుంది. ఐతే, ఆకస్మికంగా పేలకుండా వుండ గలందులకు బాంబులు పేలడానికి ఉపయోగపడే వత్తుల్ని రెండవ అరమరలో వుంచారు. ఆ అరమరలోనే చిన్న బ్యాగ్‌లో రెండు పిస్తోళ్ళు కూడా వున్నాయి. వత్తుల్నీ, పిస్తోళ్ళనూ తీసుకోవడానికే రెండవ అరమరవైపు పరుగెత్తాడు ! శివవర్మ ఆ అరమరవైపు తిరగగానే సబ్ ఇనస్పెక్టర్ అతడి మీదకు లంఘించాడు. "విప్లవకారుల్ని పట్టుకోడానికి వచ్చాక ఇంక మాకు మృత్యుభయం వుంటుందా ?"అని అరిచాడు సబ్ ఇనస్పెక్టర్.

సబ్ ఇనస్పెక్టర్, శివవర్మను నడుముల దగ్గర వాటేసుకుని ఎత్తి కింద పడేశాడు. అతడి మీద కూచుని, అతడి రెండు చేతులమీదా తన రెండు మోకాళ్ళనూ ఉంచి గట్టిగా అదిమిపట్టాడు. ఇనస్పెక్టర్ బాగా ఒడ్డూ పొడుగూ గల దిట్టమైన మనిషి ! పైగా, రసపుత్రుడు. ఆ జాతికి సహజమైన శౌర్యంతోపాటు ఔదార్యం కూడా వుందతడిలో !

శివవర్మ వత్తుల్నిగానీ, పిస్తోళ్ళనుగానీ అందుకోలేకపోయాడు. ఇంతలో బయటకు పరుగెత్తుకు వెళ్ళిన పోలీసులూ వెనక్కుతిరిగి వచ్చారు. శివవర్మను పెడరెక్కలు విరిచి కట్టేశారు. బాగా కొట్టారు. జయదేవ్‌కపూర్‌కూ బేడీలు వేశారు.

డిప్యూటీ సూపరింటెండెంట్ జోషీ అరుస్తూ ఇంటి బయటకు వెళ్ళి నిలబడ్డాడు. శత్రువుల్ని కట్టేశారని తెలిశాక పిస్తోల్ని చేతపుచ్చుకుని, వణుకుతూ లోపలికి వచ్చాడు. పోలీసుల మధ్య బేడీలతో నిలబడివున్న కపూర్‌ని చూసి కంగారుగా "బాంబును క్రిందపెట్టు ...... లేకపోతే కాల్చేస్తాను !" అన్నాడు జోషీ.

నిద్రలో వుండగా పట్టుపడడమూ, గందరగోళాన్నీ చూసి కపూర్ కంగారుపడి వుంటాడు. లేకపోతే అరభసలో తను ఏదో ఒకటి చేయడానికి ప్రయత్నించేవాడే ! కానీ, తనకంటె కూడా కంగారు పడుతూ, వణికిపోతూన్న జోషీని చూసి నవ్వుతూ "బాబూ, కొంచెం తెలివి తెచ్చుకోండి ! నా చేతులకు బేడీలు వున్నాయి ! బాంబులేదు నాచేతుల్లో ........... అది సరే, మీరసలు పిస్తోలును ఎలా పట్టుకున్నారో చూసుకోండి !" అన్నాడు కపూర్.

జోషీ చేతులు గజగజ వణికిపోతూన్నాయి. అతడు పిస్తోలును తలకిందుగా గురిపెట్టి పట్టుకున్నాడు.

తరువాత ఇద్దరు ముద్దాయిలనూ, దొరికిన సామాన్లనూ పోలీసుస్టేషన్‌కి తీసుకువెళ్ళమని అజ్ఞ ఇచ్చాడు జోషీ ! ఈ వార్తను డిప్యూటీకమీషనర్‌కి తెలియపరచడానికి, అతడి బంగళాకు వెళ్ళాడు.

జోషీ వెళ్ళిపోయాక, సబ్ ఇనస్పెక్టరు, పరాజితుడైన శత్రువు పట్ల రసపుత్రుడు ప్రకటించే సహజ ఔదార్యాన్ని కనబరుస్తూ "ఇన్ని పిస్తోళ్ళూ, బాంబులూ వుండి కూడా ఇలా పట్టుబడిపోయారేం? మీరు ఏమాత్రం ప్రయత్నించినా మా అందర్ని చంపి హాయిగా పారిపోగలిగే వారుకదా ?" అని ప్రశ్నించాడు శివవర్మనూ, కపూర్‌నీ !

"మిమ్మల్ని చంపడంవల్ల మాకేం వస్తుంది ? స్వరాజ్యం కోసం పోరాడే మేము స్వదేశస్థుల్నే చంపుకుంటామా ? మీతోపాటు తెల్లవాడు ఎవడైనా వచ్చినట్టయితే - తెలిసేది !" అన్నాడు శివవర్మ. అప్పుడిక అంతకంటే ఇంకేమనగలడు ? ఐతే, అతడలా అనడం కేవలం ఇనస్పెక్టర్ని సంతృప్తిపరచడానికో, లేక తమ అశక్తతనుకప్పి పుచ్చుకోవడానికో మాత్రం కాదు ! అతడన్న మాటల్లో కొంత సత్యమూ లేకపోలేదు. 'హి.స.ప్ర.స.' యొక్క ఉద్దేశ్యం. సర్వసాధారణ ప్రజల్లో విప్లవశంఖాన్ని పూరించడం ! సాధారణ ప్రజల్లో విప్లవాన్ని సృష్టించాలన్న ఆదర్శాన్ని మొండిగా పట్టుక్కూచోడంవల్ల బ్రిటీష్ సామ్రాజ్యపు ముఖ్యాంగమైన పోలీసుల్నీ సర్వసాధారణ ప్రజ కింద జమకట్టుకున్నారు !

శివవర్మ అన్నమాటలు పోలీసుల మీదా బాగానే పనిచేశాయి "మాదేముంది బాబూ ! పొట్టకూటికి బ్రతికే కుక్కలం ! మేము చచ్చిపోతే మాత్రం నష్టమేమిటి ? మాలాంటి వాళ్ళు రోజా ఎంతమంది చావడం లేదు ? మీ జీవితమే జీవితం బాబూ, ఇతర్ల కోసం ఇలా త్యాగం చేస్తు న్నారు !" అన్నారు పోలీసులు. నిజంగానే వాళ్ళకళ్ళు చమర్చాయి.

ఒక పోలీసు చాలా ఖిన్నవదనుడై "మీరెవరో మాకు తెలియదు. 'నల్లమందు వ్యాపారుల్ని పట్టుకోడానికి వెళ్ళాలి పదండి' అని చెప్పి తీసుకువచ్చారు !" అన్నాడు.

శివవర్మ, జయదేవ్‌కపూర్ - వీరి ప్రవర్తనకు పోలీసులూ, ఇనస్పెక్టరూ బాగా ప్రభావితులయ్యారు. వీరు చదువుకున్న వారనీ ఉన్నత వంశాలకు చెందినవారనీ, తెల్సుకున్నారు. తరువాత జైల్లోనూ వీరికి అనేక విధాల సహాయం చేశారు. ఇనస్పెక్టరు తరచూ వీరి దేశభక్తిని పొగడడమే కాకుండా, దేశ శ్రేయస్సుకు భంగకరమైన తమ జీవితాల్ని తలుచుకుని చింతిస్తూండేవాడు ! ఇనస్పెక్టరు కుండ

బద్దలుకొట్టినట్టు సత్యాన్ని మాట్లాడేవ్యక్తి ! తరువాత అతడు స్పష్టంగా శివవర్మ, కపూర్‌లకు తన బాధను చెప్పేశాడు. "ప్రాణాలకు తెగించి మిమ్మల్ని పట్టుకుందినేను ! ఈ సాహసానికి ప్రశంస ప్రమోషన్ కూడా లభించవచ్చు అనుకున్నాను. కానీ, జోషీ కలెక్టరుకు రాసుకున్న రిపోర్టులో తనే పట్టుకున్నట్టు రాసుకున్నాడు !" భుక్తి ముక్తి రెండూ చెడడంతో తాను దేశద్రోహం చేశానన్న భావన ఇనస్పెక్టర్‌ని మరీ పీడించింది !

డాక్టర్ గయాప్రసాద్ డబ్బుకోం అనేక రకాల ప్రయత్నించి, విఫలుడై ఒట్టి చేతులతో మూడవ నాటికి తిరిగి వచ్చాడు ! డాక్టరు ఆనాటి వార్తాపత్రికను చదివినట్లయితే సహారన్‌పూర్ వచ్చేవాడుకాదు. సాధారణంగా విప్లవకారులు రోజూ ఉదయాన్నే వార్తా పత్రికను చదువుతారు. అలా చదవడంవల్ల దేశపరిస్థితుల్ని ఎప్పటికప్పుడు తెల్సుకుని తగు జాగ్రత్తల్ని తీసుకోడానికి వీలవుతుంది. గయాప్రసాద్ ఆనాటి పత్రికను చదవలేదు. దారిలోనూ ఎక్కడా చూడలేదు. పత్రిక కొనడానికి అతడి దగ్గర డబ్బుల్లేవు. ఎంతో కష్టంమీద సహారన్‌పూర్ రావడానికి ఛార్జీల్ని సంపాయించుకున్నాడు ! 'ఎటు తిరిగీ సహారన్‌పూర్‌లో మిత్రులు పేపరుకొని వుంటారు ! అక్కడికివెళ్ళి చదువుకోవచ్చును !' అనుకున్నాడు డాక్టరు. సహారన్‌పూర్ రైల్వే స్టేషన్‌లోనే అతడికోసం పోలీసులు కనిపెట్టుకుని వున్నారు. ఐతే, డాక్టర్ శాంతంగా, ప్రశాంతంగా, హుందాగావుండే మనిషి కావడంవల్ల, పోలీసులు అతణ్ణి పోల్చుకోలేకపోయారు. ఎలాగో జనంలోపడి, బయటకువచ్చాడు. ఆస్పత్రిని చేరాడు.

డాక్టరు కోసం ఎదరుచూస్తూ కొందరు పోలీసులు ఆస్పత్రిలోనూ వున్నారు. డాక్టర్ సహజంగా వచ్చి తలుపు కొట్టాడు. లోపలవున్న పోలీసుల్లో ఒకడు తలుపుతీశాడు. డాక్టర్ని కావలేసుకున్నాడు. గాఢమైన ఆలింగన పాశంలో బంధించివేశాడు. పోలీసుమెడా, డాక్టరు మెడా కర్చుకుపోయాయి. ఇద్దరూ ప్రత్యర్థుల వీపును మాత్రమే చూడగల్గుతున్నారు. డాక్టరు కూడా గాఢంగానే ఆలింగనం చేసుకున్నాడు. పోలీసు తన పట్టును మరికొంచెం బిగించాడు. డాక్టర్ తన ఆలింగనాన్ని మరి కొంచెం దృఢతరం చేశాడు. ఇద్దరి ఉద్దేశాలూ వేరయినప్పటికీ కొన్ని క్షణాలు ఇద్దరూ మౌనంగా స్నేహాలింగనంలో బంధింపబడి వున్నారు. చివరకు "ఇకచాలుగాని మిత్రమా ! విడిచిపెట్టు ! నేచెప్పేది విను !" అన్నాడు డాక్టరు.

మా మిత్రుల్లో కాశీరామ్‌కూ, మిత్రుల్ని గాఢా లింగనంలో బంధించే అలవాటు వుంది. పైగా, అతడు డాక్టర్ని కల్సుకునీ చాలా రోజులు అయింది. ఢిల్లీ నుంచి అతడు సహారన్‌పూర్ వస్తాడనీ డాక్టర్ అనుకుంటూన్నాడు. ఇంకేముంది ? కాశీరామ్ వచ్చాడని అనుకున్నాడు డాక్టర్ ! చాలా రోజుల తరువాత కలవడంవల్ల ఇలా స్నేహభావాన్ని ప్రదర్శిస్తున్నాడేమో అనుకున్నాడు.

డాక్టర్ని కావలేసుకున్న పోలీసు వదిలి పెట్టడానికి బదులు తోటి పోలీసుల్ని కేక వేశాడు. "మూడో వాడుకూడా వచ్చాడు. రండి రండి !" అని అరిచాడు.

డాక్టర్ పరిస్థితిని అర్థం చేసుకునేలోపే, లోపలినుండి మరో నలుగురు పోలీసులు వచ్చారు. అతణ్ణి పట్టుకుని చేతులకు బేడీలు వేశారు.

గయాప్రసాద్‌ను సంకెళ్ళువేసి పోలీసుస్టేషనుకు తీసుకు వెడుతూన్నారు. దారిలో అతడికి తన జేబులోవున్న జాబు విషయం స్ఫురణకు వచ్చింది ! కాకోరీ కుట్ర కేసులోని ముద్దాయి యోగేశ్ చటర్జీ, ఆ కేసులో పనిచేస్తున్న ప్లీడర్లద్వారా మాకు వర్తమానాల్ని పంపుతూండేవాడు. ఆ కేసులో ముద్దాయిల తరుపున పనిచేస్తూన్న సి.బి. గుప్త (ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రి) మోహన్‌లాల్ సక్సేనా (కేంద్ర ప్రభుత్వంలో శరణార్థుల పునరావాసశాఖకు మంత్రిగా వున్నారు) వీరి ద్వారా యోగేశ్ చటర్జీ జైలు నుండి రాసి పంపిన జాబు గయాప్రసాద్ జేబులో వుంది. ఆ జాబులో పై వకీళ్ళ పేర్లూ వున్నాయి.

వెళుతూన్న డాక్టరుకు జాబు జ్ఞాపకం రావడంతోపాటు, దానిలో కాంగ్రెసు ప్లీడర్లయిన పై ఇద్దరిపేర్లు వుండడం స్ఫురణకు వచ్చింది. ఆ జాబుగనుక పోలీసుల చేతుల్లోపడితే విప్లవకారులపై సానుభూతిని ప్రదర్శించే ఇద్దరు కాంగ్రెసుపార్టీ ప్లీడర్లూ బాగా ఇరుకునపడతారు !

డాక్టర్ గయాప్రసాద్ వెడుతూన్నవాడల్లా చప్పున ఆగిపోయాడు. "నేను ఒకటికి పోవాలి !" అన్నాడు.

"స్టేషన్‌కు వెళ్ళాక పోసుకుందురుగాని !" అన్నారు పోలీసులు

"నాకు వచ్చినప్పుడు పోసుకుంటాను ! మీరు పోసుకోమన్నప్పుడు పోసుకుంటానా ?" డాక్టర్ మొండికి వేశాడు. ముందుకు నడవలేదు.

పోలీసులు వివశులయ్యారు. డాక్టరు రెండుచేతులకూ బేడీలు వేసివున్నాయి. ఒకటికి పోసుకోవడం కోసం ఒక చేతి బేడీని తీసి, రెండవచేతి బేడీని పుచ్చుకునే పోలీసు డాక్టర్ని రోడ్డుప్రక్కన ఒకటికి కూచోమన్నాడు. రోడ్డుప్రక్కన కూచోగానే, బేడీతీసిన చేతిని లోపలిజేబులోకి పోనిచ్చి యోగేశ్‌చటర్జీ రాసిన జాబునుతీసి నోట్లోకుక్కుకున్నాడు, డాక్టర్ గయాప్రసాద్ ! కచ్చాపచ్చాగా నమిలి ఆకాగితం ముద్దను మింగేశాడు. ఐతే ఆ కాగితం ముద్ద గొంతుదిగలేదు. అడ్డంపడ్డది. డాక్టరుకు ఊపిరి ఆడడంలేదు. గుడ్లు ఎళ్ళుకువచ్చాయి. నోట మాట రావడంలేదు. డాక్టరు గయాప్రసాద్ రోడ్డుప్రక్కన చతికిలిబడి కూర్చుని, అతికష్టంమీద దోసెడపట్టి మంచినీళ్ళు పోయండని సంజ్ఞచేశాడు. పోలీసులకు డాక్టరు పడే బాధకు కారణం తెలియదు. ఐనా, ఒక పోలీసు చప్పున ప్రక్కదుకాణంలో నుండి ఇన్ని మంచినీళ్ళుతెచ్చి దోసెట్లో పోశాడు. గయాప్రసాద్ మెల్లగా రెండు గుక్కల నీళ్ళు మింగాడు. వుండ లోపలకు పోయంది. గణ్ణం గడిచింది.

శ్రీ చంద్రభానుగుప్త, శ్రీ మోహన్‌లాల్ సక్సేనాలాంటి ప్రసిద్ధులైన వారిని ఇరకాటంలో పడేయదగిన జాబును డాక్టర్ గయాప్రసాద్ ప్రాణాల్ని కూడా లెక్కచేయకుండా మింగేశాడు. గయాప్రసాద్ చాలా సాహసంతో కూడిన పనిని చాలానేర్పుతో చేశాడు ! దేశంలో విప్లవకారుల పట్ల సానుభూతి కొరవడి పోతూన్న రోజులవి ! లాహోరులోనూ చుట్టుపట్ల పట్నాల్లోనూ, ఇతర ప్రదేశాల్లోనూ అరెస్టులు ముమ్మరంగా జరుగుతూన్నాయి ! కొందరు విప్లవకారులు పోలీసులకు భయపడి రహస్యాల్ని చెప్పేస్తున్నారు. తమకు సాయంచేసిన పెద్దమనుషుల పేర్లుకూడా పోలీసులకు చెప్తూన్నారు. దాంతో విప్లవకారుల పట్ల ఒక రకమైన అనాసక్తిభావం ఏర్పడుతూన్నది. అప్పుడు గయాప్రసాద్ గనుక అలా సమయస్ఫూర్తిగా వ్యవహరించక పోయినట్లయితే, ప్రసిద్ధులైన కాంగ్రెసు వ్యక్తులను ప్రభుత్వ దృష్టికి తెచ్చిన కారణంగా విప్లవ సంఘానికి ఎంతోచెడ్డపేరు వచ్చేది. ప్రజలు విప్లవకారులనుండి సాహసాన్ని, శౌర్యాన్ని ఆశిస్తారు !

విప్లవకారులు సాహసాన్ని ప్రదర్శించినప్పుడు ప్రజలు ఆదరిస్తారు. అంటే, విప్లవకారులు పోలీసుల్ని చావగొట్టడమో, అరెస్టు అయ్యాక ఎన్ని హింసలు పెట్టినా రహస్యాలు చెప్పకుండా ఉరికొయ్యకు వేలాడడానికయినా సిద్ధపడడమో - చేసినప్పుడు ప్రజలు ఆనందపడతారు ! గాంధీగారు, విప్లవకారులను నిందించినా, సహాయం చేయతగనివారని నెత్తిన నోరువెట్టుకు అరిచినా - లక్ష్య పెట్టకుండా సహాయం చేస్తారు ! కానీ, అరెస్టయిన విప్లవకారుడొకడు రహస్యాల్ని పోలీసులకు చెప్పేశాడా, పరారీలోవున్న విప్లవకారులకు చచ్చినచావు అవుతుంది ! ఇకనలాంటప్పుడు ప్రజలు విప్లవకారులకు సాధారణమైన సహాయం చేయడానికి కూడా నిరాకరిస్తారు ! "ఇప్పుడు మేము మీకు సాయంచేస్తే రేపు మీరు అరెస్టయి మేము చేసిన సహాయాన్ని పోలీసులకు చెప్తారు. మమ్మల్ని కట్టతాళ్ళు మేమే తెచ్చుకున్నట్టు అవుతుంది !" అని ముఖానే అనేస్తారు. ప్రజల మనోవృత్తి అలా వుండే

రోజుల్లో డాక్టర్ గయాప్రసాద్ ఆ జాబును మింగి విప్లవసంఘం అప్రతిష్టపాలు కాకుండా కాపాడడంలో అతిశయోక్తి ఏ మాత్రం లేదు !

పై సంఘటనలవల్ల డాక్టర్ గయాప్రసాద్ యొక్క స్వభావమూ, ప్రవర్తనా ఎలాంటివో వూహించుకోవచ్చును. అతడికి ఆడంబరమూ అట్టహాసమూ - పనికిరాదు ; మౌనంగా, గంభీరమైన కర్తవ్యాల్ని నిర్వహిస్తూ వుంటాడు. మాట్లాడడమూ అంతే, చాలా నిదానంగా మాట్లాడతాడు. నడవడమూ అంతే ! నిదానంగా నడుస్తూవుంటాడు ! ఎంతదూరమైనా, అట్లా నడుస్తూనేవుంటాడు. అలసటపడడు. ఆగిపోడు !

ప్రజలు సహజంగా తమ పిరికితనాన్ని కప్పిపుచ్చుకోడానికి అహింసను చాటు చేసుకుంటారు. ఐతే, ఒక్కోప్పుడు సాహసం ప్రదర్శించి నిజాయితీని ప్రకటిస్తారు ! పోలీసులు, అసెంబ్లీ బాంబుకేసుకూ, సాండర్స్ హత్యకూ, లాహోరు బాంబు ఫ్యాక్టరీకీ, సహారన్‌పూర్ బాంబుఫ్యాక్టరీకీ - వీటన్నింటికి పరస్పర సంబంధం వుందని రుజావు చేయడానికి సతమతం అవుతూన్నారు. ఎంత ప్రయత్నించినా ఆధారాలు దొరకడంలేదు. ఐనా, విడవకుండా ఆధారాల్ని పోగుచేస్తున్నారు పోలీసులు. విప్లవసంఘం ఢిల్లీ సీతారాంబజార్లోని ఇంటిని ఎప్పుడో ఖాళీచేసింది. ఖాళీచేసిన ఆ యింటి అడ్రసును ప్రభుత్వ సాక్షి జయగోపాల్, హంసరాజ్ బోహరా - వీళ్ళిద్దరూ పోలీసులకు చెప్పారు! సీతారాం బజార్లోని మేడకింది భాగంలో వుండే 'వస్తాదు'ల్ని అరెస్టయిన విప్లవకారుల దగ్గరకు తీసుకువెళ్ళి, 'వీరు ఎన్నడయినా మీమేడ పై భాగపు గదికివచ్చారా ?' అని అడగసాగారు పోలీసులు. అంటే విప్లవకారుల్ని గుర్తుపట్టడానికి 'వస్తాదు'ల్ని వాడుతూన్నారన్నమాట !

ఈ 'వస్తాదు'ల్ని సహారన్‌పూర్ కూడా తీసుకువెళ్ళారు. డాక్టర్నీ, శివవర్మనూ, జయదేవ్‌కపూర్‌నూ - చూపించి "వీరు ఎప్పుడయినా మీ మేడపైగదికి వచ్చారా ?" అని అడిగారు పోలీసులు ! 'వస్తాదు' లు విప్లవకారులను గుర్తించారు. ఐతే, ఏం ? 'వస్తాదు'లు 'వీళ్ళను మేముఎన్నడూ ఆగదిలో చూడలేదు.' అని స్పష్టంగా నిరాకరించారు. ఈ 'వస్తాదు'లకూ జయదేవ్‌కపూర్‌కూ పోట్లాట జరిగిన విషయం పాఠకులకు జ్ఞాపకం వుండి వుంటుంది ! వీళ్ళు తాము విప్లవకారుల్ని చూడలేదని నిరాకరించడమే కాకుండా, తరువాత ఓ పోలీసుద్వారా ఇలా కబురంపారు. "యదార్థ స్థితి తెలియక పోవడంవల్ల ఢిల్లీలో మీకు తగిన గౌరవాన్ని ఇవ్వలేదు. మా వల్ల మీకు ఎలాంటి హానీజరుగదు. మానించీ మీకు ఏమైనా సహాయం అవుసరం అయితే కబురుపెట్టండి, తప్పకుండా చేసి పెడతాము !"

సహారన్‌పూర్ లకడ్‌మండీలో డాక్టర్ గయాప్రసాద్ ఆస్పత్రి కోసం తీసుకున్న ఇంటి చుట్టుపక్కల గల గృహస్తుల్ని చాలామందిని తీసుకువచ్చారు, వీళ్ళను గుర్తుపట్టడానికి ! శివవర్మ, కపూర్ - ఇద్దరూ మొదట చెప్పిన మాట మీదే నిలబడివున్నారు. "ఆ యింటితోగానీ, ఆ యింటిలోని సామానుతోగాని మాకేమీ సంబంధంలేదు ! మేము చుట్టపుచూపుగా వచ్చాం, ఆ యింటికి !" అన్నమాట మీదనే వున్నారు. వీళ్ళకు ఆ యింటితోటీ ఆ యింట్లోని సామాగ్రితోటీ సంబంధం వున్నదని నిరూపించడానికి పోలీసు అధికారులు సతమతం అవుతూన్నారు. ఐతే, అప్పటికే వీళ్ళు విప్లవకారులని లకడ్‌మండీలోని గృహస్తులకు తెలిసిపోయింది. పోలీసు అధికారులు వీళ్ళను గుర్తించడానికి తీసుకువచ్చిన గృహస్తులు "మేము వీళ్ళను ఎన్నడూ అక్కడచూడలేదు !" అని స్పష్టంగా చెప్పారు.

ఈ ప్రకరణలో మరోవిషయాన్ని గురించి చెప్పడమూ అప్రస్తుతంకాదనుకుంటున్నాను. శ్రీ సి.బి.గుప్తా, శ్రీ మోహన్‌లాల్ సక్సేనా - విప్లవకారులైన ఖైదీలదగ్గరనుంచి ప్రమాదకరమైన వార్తల్ని ఎలా మావద్దకు తెచ్చేవారో తెల్సుకోవడమూ అవుసరమే ! బ్రిటీష్ పాలకులు తమ ప్రభుత్వం చట్టబద్ధమైనదనీ

న్యాయసమ్మతమైనదనీ - చాటుకోవడానికి రాజకీయ ఖైదీలకు కొన్ని సౌకర్యాలను ఇచ్చారు ! రాజకీయ ఖైదీలు తమ కేసును గురించి, తమ వకీళ్ళతో రహస్యంగా మాట్లాడుకోవచ్చును ! రాజకీయ ఖైదీలు అలా తమకేసును గురించి ప్లీడర్లతో రహస్యంగా మాట్లాడుకోవడం న్యాయోచితమైనదేనని బ్రిటిషు ప్రభుత్వం అంగీకరించింది. కాకోరీకుట్ర కేసులోని నిందితులూ తమ ప్లీడర్లతో రహస్యంగా మాట్లాడుకోడానికి అవకాశం వుండేది. వీరు మాట్లాడుకునేప్పుడు జైలు అధికారులు వీరి మాటలు వినపడనంత దూరంలో నిలబడి వుండేవారు !

రాజకీయ ఖైదీలయొక్క పై అధికారం సమర్థింపదగిందే ! ఖైదీలకు తమప్లీడర్లతో మాట్లాడుకోడానికి అలాంటి అవకాశమే లేకపోతే, ఇంక వారు జన్మాంతంలోనూ పోలీసుల చేతుల్లోనుండి బయటపడలేరు. ఖైదీలమీద పోలీసులు నేరాన్ని మోపుతారు. ఆ నేరాన్ని తిరస్కరించడానికి ఖైదీలు, వారి ప్లీడర్లూ ఏం ఎత్తుగడలు వేస్తున్నారో ముందుగానే పోలీసులకు తెల్సిపోతే ఎలా ? ఖైదీలను ఇరికించడానికి పోలీసులు ముందుగానే కొత్త కొత్త మార్గాల్ని వెతికిపెట్టుకోరా ? రాజకీయ ఖైదీల పైఅధికారాన్ని ఉపయోగించుకుని శ్రీ. సి.బి.గుప్తా, శ్రీ మోహన్‌లాల్ సక్సేనా - కాకోరీకుట్ర కేసులోని ఖైదీలనుండి వార్తల్ని తెచ్చి ఇతర విప్లవకారులకు అందిస్తూండేవారు !

ఐతే, రాజకీయ ఖైదీలు ఇలా పై అధికారాన్ని దుర్వినియోగం చేసి, బయటవున్న తమ మిత్రులకు రహస్యాల్ని పంపుతూంటారని పోలీసు అధికార్లకూ తెల్సు ! ఎన్నోసార్లు బ్రిటీష్ ప్రభుత్వం ఖైదీలపై అధికారాన్ని లాగేసేయాలనీ చూసింది. రాజకీయ ఖైదీలూ, కాంగ్రెసు ప్లీడర్లూ ఏక కంఠంతో పై అధికారాన్ని లాగివేయడాన్ని తిరస్కరించారు. బ్రిటీష్ ప్రభుత్వానికి తను న్యాయసమ్మతంగా వ్యవహరిస్తానన్న అభిమానం మెండు ! కనుకే, ఖైదీల యొక్క పై అధికారాన్ని హరించే ప్రయత్నాన్ని విరమించుకుంది. కానీ, కాంగ్రెసు 'రామరాజ్యంలో' ఖైదీల ఆత్మరక్షణకు ఉపయోగించే ఏకైక సాధనం అయిన పై అధికారం సత్యాహింసలనే మహా సముద్రంలో బుడుంగున మునిగిపోయింది !

1949 ఫిబ్రవరిలో, దేశవ్యాప్తంగా జరిగిన రైల్వే సమ్మెను విఫలం చేయడానికి కాంగ్రెసు ప్రభుత్వం ఎందరో కార్మికనాయకులనూ, కమ్యూనిస్టులనూ జైళ్ళల్లో కుక్కింది ! నేను కమ్యూనిస్టుపార్టీ సభ్యుణ్ణిగానీ, ఏ కార్మిక సంఘంతోగానీ సంబంధం వున్న వాణ్ణికాను ! అయినా, నన్నూ అరెస్టు చేసి లక్నో జైల్లోపెట్టారు ! జైల్లో పెట్టబడిన కొందరు కార్మిక నాయకులమీదా, కొందరు కమ్యూనిస్టుల మీదా దొంగకేసులు బనాయించారు ! కోర్టులో కేసులు నడుస్తూన్నాయి. తమ ప్లీడర్లతో మాట్లాడడానికి అవకాశాన్ని కోరారు వారు ! ప్లీడర్లకు జైల్లోని కమ్యూనిస్టు ఖైదీలను కల్సుకోడానికి అనుమతి చాలా కష్టంమీదగాని లభించలేదు ! లభించినప్పటికీ సి.ఐ.డి. పోలీసు ఆఫీసర్లు-ఖైదీలూ, ప్లీడర్లూ మాట్లాడుకునే ప్రతిమాటనూ తాము వింటామని పట్టుపట్టారు ! ఈ అన్యాయాన్ని ఖండిస్తూ, ఖైదీలూ, ప్లీడర్లూ అసలు మాట్లాడుకోవడమే మానేశారు !

నేనొక సాహితీపరుణ్ణి కావడం వల్ల చాలా పత్రికలు నన్ను విడుదల చేయమనిరాశాయి. బాగా పలుకుబడి గల కాంగ్రెసు నాయకులు కూడా నన్ను అరెస్టు చేయడం తప్పన్నారు. నా ఆరోగ్యమూ బాగుండలేదు. జామీనుమీద నన్ను వదలడానికి కాంగ్రెసు ప్రభుత్వం వప్పుకుంది. 'ప్రజా ఉద్యమాల్లో పాల్గొనకుండా, వాటిని గురించి వ్రాయకుండా వుండాలన్న ఆంక్షను కూడా పెట్టింది. నేనలా విడుదలకావడానికి అంగీకరించలేదు. కొద్ది రోజుల క్రితమే అనారోగ్యంతో వున్న రుద్రదత్తు భరద్వాజను అరెస్టుచేసి జైలుకు తీసుకువచ్చారు. జైలుకు వచ్చిన మరునాడే అతడు చనిపోయాడు. కాంగ్రెసు ప్రభుత్వపు ఈ రాక్షసత్వాన్ని ప్రజలు విమర్శిస్తూనే వున్నారు ! నా అనారోగ్యాన్ని చూసి ప్రభుత్వానికి భయం వేసినట్టుంది. తను పెట్టిన షరతులను నేను తిరస్కరించినప్పటికీ వదిలి పెట్టింది !

విడుదల అయ్యాక, అప్పటి యు.పి. పోలీసుశాఖ మంత్రి లాల్ బహదూర్‌శాస్త్రిని కల్సుకున్నాను. రాజకీయ ఖైదీలు తమ ప్లీడర్లను కల్సుకుని ఏకాంతంలో మాట్లాడుకునేహక్కుకు భంగం కలగడాన్ని గురించి చెప్పాను.

అప్పుడు శాస్త్రిగారు రాట్నం మీద నూలు వడుకుతూన్నారు. తకిలీ నుండి వస్తూన్న నూలు వంకచూస్తూ "కమ్యూనిస్టుల్ని గురించి మీకు తెలియదు. వాళ్ళకు హింసయందు విశ్వాసం ఎక్కువ. పోలీసులు అరెస్టు చెయ్యబోతే పరారవుతారు !" అన్నారు శాస్త్రిగారు.

1931లో కాంగ్రెసును ఆంగ్ల ప్రభుత్వం నిషేధించింది. అప్పుడు కాంగ్రెసు కార్యకర్తలు రహస్య జీవితాన్ని గడుపుతూ తమ పార్టీ కార్యక్రమాల్ని కొనసాగించారు. 1942లోనూ అహింసాత్మకులైన కాంగ్రెసువారు రహస్య జీవితాన్ని గడపడం అందరికీ తెలిసిన విషయమే ! పై రెండు సందర్భాలనూ జ్ఞాపకం చేస్తూ "మీరు బహిరంగంగా ఉద్యమాల్ని నడపనీయడం లేదు, గనుక కమ్యూనిస్టులు రహస్య జీవితాన్ని గడుపుతూ ఉద్యమాల్ని నడుపుతూన్నారు!" అన్నాను. శాస్త్రిగారు కమ్యూనిస్టుల మీద ప్రదర్శించిన కోపాన్ని చూసినప్పుడు తన పట్టు నుండి తప్పించుకుపోయిన పిల్లిని చూసి కుక్కపడే వ్యసనం జ్ఞాపకం వచ్చింది !

రాజకీయ ఖైదీల హక్కుకు ఎలాంటి అవాంతరమూరానీయ వలదని శాస్త్రిగారికి చెప్పాను. "విప్లవకారులు హింసాత్మక చర్యలు చేసేవారని ఇంగ్లీషువారికి తెలియకపోదు. అయినా, బ్రిటిష్ ప్రభుత్వం రాజకీయ ఖైదీలపై హక్కును హరించలేదు" అని చెప్పాను !

ఎలాగైతే ఏం, శాస్త్రిగారు ఎట్టకేలకు, "రాజకీయ ఖైదీలకు రహస్యంగా తమప్లీడర్లతో మాట్లాడుకునే హక్కు వుందని" వప్పుకున్నారు. ఆ హక్కును పునరుద్ధరిస్తామనీ మాట ఇచ్చారు. ఐతే, వారిమాట కేవలం మాటగానే ఉండిపోయింది. ఫలితాన్ని ఏమీ ఇవ్వలేదు ! ఇదీ కాంగ్రెసు వారి 'రామరాజ్య'పు నైతిక స్థాయి ! దీనికీ ఇంగ్లీషువారి 'రావణరాజ్య'పు నైతిక స్థాయికీ పోలికపెట్టి చూసుకున్నప్పుడు, సాధారణ ప్రజలు కాంగ్రెసు మార్కు 'రామరాజ్యా'న్ని ద్వేషించకుండా వుండలేరు

సహారన్‌పూర్ బాంబుఫ్యాక్టరీని గురించి ఫణీంద్రనాథ్ ఘోష్ ప్రభుత్వానికి సమాచారాన్ని ఇచ్చాడని స్పష్టం అయింది ! అతడు ప్రభుత్వ సాక్షిఅయి ఎందరో విప్లవకారుల్ని అరెస్టు చేయించాడు. లాహోరు కుట్ర కేసులోనే కాకుండా పాట్నా కుట్ర కేసులోనూ ప్రభుత్వ సాక్షి అయ్యాడు.

ఇలా ప్రభుత్వ సాక్షిఅయి విప్లవకారులకు ద్రోహం చేసిన కారణంగా ఫణీంద్రనాథ్ ఘోష్‌ను 1929లో జల్‌గాం జైల్లోనూ, 1930లో అలహాబాద్‌లోనూ దండించడానికి ప్రయత్నాలు జరిగాయి. ఐతే, రెండు మార్లూ తప్పించుకు బ్రతికిపోయాడు.

1932 చివరి రోజులు అనుకుంటాను. హజారీబాగ్ జైల్లోవున్న యోగేంద్రశుక్ల, మరికొందరు విప్లవకారులూ ఫణీంద్రనాథ్ ఘోష్‌ను దండించడానికి మరోమాటు ప్రయత్నించాలనుకున్నారు. ఆ బాధ్యతను వైకుంఠశుక్లకు అప్పగించారు.

విప్లవకారులకు విశ్వాసఘాతుకం చేశాక ఫణీంద్రనాథ్ పాట్నానుండి తన కాపురాన్ని ఎత్తేశాడు. భాగల్‌పూర్‌లోనూ వుండడంలేదు. చంపారన్ జిల్లాలోని బేతియా అనే గ్రామంలో వుంటూన్నాడు. అక్కడే ఓ చిల్లర దుకాణాన్ని పెట్టుకున్నాడు. అక్కడా అతడికి భయంగానే వుంది. ఆత్మరక్షణకు రివాల్వర్ లైసెన్సు తీసుకున్నాడు. ఎప్పుడూ రివాల్వర్ దగ్గర వుంచుకునేవాడు. అతణ్ణి కాపాడడానికి ప్రభుత్వం ఇద్దరు పోలీసులను కూడా ఇచ్చింది. ఇద్దరు పోలీసులూ దుకాణందగ్గరా, ఇంటి దగ్గరా కాపలా కాస్తూండేవారు !

1934 సం॥ మార్చి, లేక ఏప్రియల్ నెల అనుకుంటాను. వైకుంఠశుక్ల, మరో మిత్రుడు, ఫణీంద్రనాథ్ దుకాణం దగ్గరకు వెళ్ళారు. వీళ్ళు దుకాణం దగ్గర ఒక పెద్ద టపాకాయను పేల్చారు. టపాకాయ చాలా పెద్దది కావడం వల్ల బాంబు పేలినంత శబ్దం అయింది. అలాగే పొగకూడా

విరజిమ్ముకుంది ! అది నిజంగా బాంబుగావుననుకుని ఫణీంద్రనాథ్‌కు కాపలావున్న ఇద్దరు పోలీసులూ పారిపోయారు. వైకుంఠశుక్ల, అతని మిత్రుడు- వెంటనే ఫణీంద్రుడి దుకాణంలోకి వెళ్ళి పోయారు. కత్తి తీసుకుని ఫణీంద్రనాథ్ మెడమీద ఒక్కవేటు వేశాడు వైకుంఠశుక్ల ! ఫణీంద్రనాథ్‌కు మంచి దెబ్బ తగిలింది. క్రింద పడిపోయాడు. ఇద్దరు విప్లవకారులూ దుకాణం నుండి బయటకు వస్తూండగా ఒక వ్యక్తి వీళ్ళను పట్టుకోడానికి ముందుకు వచ్చాడు. విప్లవకారులు, 'అనవసరంగా ఈ వ్యవహారంలో కల్పించుకోవద్దని' చెప్పారతడికి ! అయినా అతడు వినిపించుకోకుండా వైకుంఠశుక్లనూ, అతడి మిత్రుణ్ణీ పట్టుకోవడానికి ప్రత్నించాడు. వైకుంఠశుక్ల రక్తసిక్తమైన తన చేతిలోని కత్తితో ఆ వ్యక్తిని ఒక్క వేటు వేశాడు. అతడూ తెగి పడ్డాడు ! తరువాత ఇద్దరు విప్లవకారులూ, రక్తం ఓడుతూన్న కత్తుల్ని తీసుకుని, సైకిళ్ళమీద, నడి బజారుగుండా, పట్టపగలు, అందరి ముందుగా వెళ్ళిపోయారు. ఆ క్షణాన వారిని అడ్డగించడానికి ఎవరూ సాహసించలేకపోయారు !

కత్తివ్రేటుకు క్రిందపడిన ఫణీంద్రనాథ్ వెంటనే మరణించలేదు. హాస్పటలుకు తీసుకువెళ్ళాక ఓ గంటసేపటివరకూ బ్రతికే వున్నాడు. ఆ గంటసేపటిలోనూ మన తెలివిలో, బాగా మాట్లాడగల స్థితిలోనే వున్నాడు. పోలీసులు ఫణీంద్రుణ్ణి అనేక ప్రశ్నలు వేశారు. తనను కొట్టిన విప్లవకారుల్ని ఎరుగుదునని మాత్రం చెప్పాడు. ఐతే, వాళ్ళ ఊరూ, పేరూ చెప్పడానికి నిరాకరించాడు. 'చెప్పి ప్రయోజనంలేదు' , అని మాత్రం అన్నాడు ఫణీంద్రనాథ్ ! అలా చెప్పనిరాకరించడం, తాను విప్లవకారులకుచేసిన ద్రోహానికి పశ్చాత్తాపాన్ని పొందడం వల్లనూకావచ్చు, లేక ఇప్పుడు తను వాళ్ళ పేర్లను పోలీసులకుచెప్తే, ఈ పగ తన తరువాతకూడా ఎంతవరకూ పోతోందోనన్న భయమూకావచ్చు !

కొన్ని నెలలతరువాత ఎవరో చెప్పిన ఆధారంగా వైకుంఠశుక్లను అరెస్టు చేశారు. అతణ్ణి 1935 సంవత్సరం మే నెలలో గయా జైల్లో ఉరితీశారు. వైకుంఠశుక్లను గురించి బ్రిటీష్ ప్రభుత్వానికి సూచననిచ్చిన దేశద్రోహి ఇప్పుడు కాంగ్రెసు నాయకుడై దేశాన్ని దోచుకుంటున్నాడు. దేశంకోసం ప్రాణాల్ని సయితం తృణప్రాయంగా త్యజించిన అమరవీరుడు వైకుంఠశుక్ల కుటుంబం ఘోరమైన ఆర్థిక బాధల్లో వేగిపోతోంది !

సహారన్‌పూర్ బాంబు ఫ్యాక్టరీ పట్టుపడడం నా మార్గానికి కొంత అవరోధాన్ని కలిగించింది. కేంద్ర కమిటీతో సంబంధాన్ని ఏర్పరచుకోడానికిగల అవకాశం నశించింది. కాగా, ఇక కలకత్తా వెళ్ళి భగవతీచరణ్‌ను వెతకడం ఒక్కటే నాకు మిగిలిన మార్గం !

# కలకత్తాకు ప్రస్థానం

కలకత్తా మహాపట్నంతో అంతవరకూ నాకు ప్రత్యక్ష పరిచయం లేదు. కాకపోతే, హిందీలోకి అనువదింపబడిన వంగ సాహిత్యంవల్లా, రౌలెట్ కమిటీ రిపోర్టులో చర్చించబడిన విప్లవకారుల కార్యకలాపాల ద్వారా- కలకత్తాకు సంబంధించిన సాహిత్యక పరిచయం మాత్రం వుంది. ఆ మహాపట్నంలో భగవతీచరణ్ ఉనికి చెప్పగల వ్యక్తి ఒక్కరే వున్నారు. ఆ వ్యక్తి సుశీలాదీదీ !

సుశీలాదీదీ అడ్రసును దుర్గాబాభీ ద్వారా తెల్సుకున్నాను. సెంట్రల్ ఎవెన్యూలో ఛాజూరాం అనే కోటీశ్వరుడి భవనంలో వుంటోంది దీదీ ! ఆ కోటీశ్వరుడి కూతురుకు చదువుచెబుతూ అతడి భవనంలోనే ఓ గదిలో వుంటోన్నది ఆమె ! లాహోరునుండి కలకత్తాకు నేరుగా టిక్కెట్టు కొనుక్కోకుండా,

రెండు మార్లుగా టిక్కెట్టు కొనుక్కొని ప్రయాణం చేశాను. నేరుగా టిక్కెట్టు కొనడంవల్ల, ఇంతదూరపు టిక్కెట్టుమీద ఎవరికయినా అనుమానం కలగవచ్చును ! వెంటసామానంటూ ఏమీలేదు. ఒక సూట్‌కేసు మాత్రం వుంది. అందులో సుఖదేవ్‌ను కల్సుకోవడానికి జైల్లోకి వెళ్ళినప్పుడు వేసుకున్న డ్రస్సు వుంది. కలకత్తా స్టేషన్‌లో, వైటింగ్ రూంలోనే డ్రస్సు మార్చుకున్నాను. గౌరవనీయమైన వేషంలో ఛాజూరాం భవనానికి వెళ్ళాను !

అనుకోకుండా నేనలావెళ్ళి పడడంతో సుశీలాదీదీకి కొంత బాధ కలిగింది. దాంతోపాటు కొంత సంతోషం కూడా కలిగింది. సంతోషానికి కారణాన్ని ముందు వివరిస్తాను. లాహోరు బాంబు ఫ్యాక్టరీలో సుఖదేవ్ మరికొందరు మిత్రులూ అరెస్టుకావడం, సహరన్‌పూర్ బాంబుఫ్యాక్టరీకూడా పట్టుబడిపోవడంతో విప్లవసంఘం పూర్తిగా ధ్వంసమయిపోయిందన్న నిరాశలో వుంది దీదీ ! కలకత్తాలోనూ, యతీంద్రనాథ్ దాసు, మణీంద్రనాథ్ ఘోష్ - మొదలైన విప్లవకారులు అరెస్టయ్యారు. ఎటుచూసినా నిరాశా, నిస్పృహలు వ్యాపించివున్నాయి. సుశీలాదీదీకి విప్లవ సంఘంపట్ల, లేక విప్లవసంఘంలోని కొందరు వ్యక్తులపట్ల గాఢమైన సానుభూతివుంది. ఆమె సానుభూతిని అర్థంచేసుకోడానికి ఒక్క సంఘటనను జ్ఞాపకంచేస్తే సరిపోతుంది. సాండర్స్ హత్య జరిగాక, పరారీలో వున్న భగత్‌సింగ్‌కు ఏమాత్రం సంకోచించకుండా తను ఆశ్రయాన్ని ఇచ్చింది. అలా ఆశ్రయాన్ని ఇవ్వడానికి ఎంతో అభిమానమూ, సానుభూతి, ఆత్మస్థైర్యమూ అవుసరం ! అలాంటిస్థితిలో నన్నుచూడడంవల్ల 'విప్లవసంఘం ఇంకా సజీవంగానే వుంది' అన్న సంతృప్తి సుశీలాదీదీకి కలగడం సహజం !

ఇంక నేనలా వెళ్ళడంవల్ల సుశీలాదీదీకి బాధకలగడానికీ కారణం వుంది. నేను ముందు తెలియపరచకుండా, తగిన ఏర్పాట్లకు అవకాశం ఇవ్వకుండా వెళ్ళిపడ్డాను. సేటుగారి సుదీర్ఘమైన పరివారంలోని సభ్యులకు నేనెవరని చెప్పేట్టు ? ఈ సమస్యవల్ల సుశీలాదీదీకి కొంచెం బాధ కలిగి వుండవచ్చును.

సుశీలాదీదీకి మరో విషయాన్ని గురించి సంతోషం కలిగింది. పరారీలో నేను కేవలం దాక్కోవడానికీ, ఆత్మరక్షణకూ మాత్రమే ప్రాధాన్యతనివ్వనందుకూ, భగవతీభాయిని కల్సుకుని మాకార్యక్రమాల్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తూన్నందుకు కూడా ఆమె ఎంతో ఆనందపడ్డది.

లాహోరు బాంబు ఫ్యాక్టరీని పోలీసులు పట్టుకుని దాదాపు ఒక నెలకావస్తోంది. బాంబు ఫ్యాక్టరీగది భగవతీచరణ్ పేరుమీద అద్దెకుతీసుకున్నదని అందరికీ తెల్సిపోయింది. జయచంద్ర విద్యాలంకార్‌గారు, భగవతీచరణ్ సి.ఐ.డి. అనడానికి ఇదొక నిదర్శనం అని నలుగురికీ చెప్పసాగారు; సుశీలాదీదీకి, భగవతీభాయిమీద ఎంతో అభిమానం ! విప్లవసంఘ సభ్యుడిగానేకాకుండా వ్యక్తిగతంగా కూడా భగవతీచరణ్ అంటే దీదీకి చాలా అభిమానం ! ఆమె అతన్ని సోదరుడిగా భావించేది. రాఖీని కూడా కట్టింది. భగవతీభాయీకూడా సుశీలాదీదీని అసాధారణ మహిళగా భావించేవాడు ! ఈస్థితిలో భగవతీభాయి మీద నాకుగల గొప్ప విశ్వాసాన్ని చూసీ దీదీ సంతోషపడ్డదని చెప్పవచ్చును !

సుశీలాదీదీ 'భగవతీభాయి కలకత్తాలోనే వున్నా'డని చెప్పింది. ఐతే, అతడు కలకత్తాలో ఏపేటలో, ఎక్కడవున్నదీ మాత్రం ఆమెకు తెలియదు. అతణ్ణి వెతికి పట్టుకోవడమూ సంభవంకాదు. మూడు నాలుగు రోజులకు ఒకమాటు 'మైదానం'లో గానీ 'చౌరంగీ'లోగానీ దీదీని కల్సుకుంటూ వుంటాడు అతడు. ఒకవేళ అతడు తను వుండేప్రదేశాన్ని దీదీకి చెప్పినప్పటికీ ఆమె అక్కడికి వెళ్ళడం సమంజసంగా వుండదు. అతడు నిమ్నశ్రేణి మానవులు నివసించే మురికివాడలాంటి ఓ 'బాసా'లో వుంటున్నాడుట ! అక్కడికి దీదీ ఎలావెళ్ళగలదు ? నన్ను మాత్రం ఎలాతీసుకువెళ్ళగలదు ? ఎర్రని, చక్కని రూపమూ, గౌరవనీయమైన దుస్తులూ - దీదీ అక్కడికి వెడితే అనుమానానికి కారణం అవుతుంది.

"భగవతీభాయి రెండు మూడు రోజుల తరువాత" 'మైదానం'లో గానీ, 'చౌరంగీ'లోగానీ కలుస్తాడు. అతడు విప్లవసంఘంలో పనిచేయడానికి సిద్ధంగా వున్నాడు. ఐతే, జయచంద్రగారి దుష్ప్రచారంవల్ల కుంగిపోతున్నాడు. ప్రజలకు తన నిజాయితీని ఎలా తెలియపరచడమా అని బాధపడుతున్నాడని" సుశీలాదీదీ చెప్పింది. వచ్చిన చిక్కు ఏమిటంటే- కలకత్తా ప్రాంతపు విప్లవకారులు జయచంద్రగారి మాటనే సహజంగా నమ్ముతారు. అలాంటప్పుడు భగవతీభాయి తన నిష్కళంతను ఎలా నిరూపించుకోగలడు ?

మూడు నాలుగు రోజుల తరువాత భగవతీభాయిని కల్సుకునే ఉద్దేశ్యంతో నేనూ, సుశీలాదీదీ 'చౌరంగీ' వైపు వెళ్ళాము. సంధ్యాసమయం , ట్రాంలైనుదాటి 'మైదానం' ప్రక్కగుండా 'విక్టోరియా స్మారకం' వైపు వెడుతూన్నాం! ఒక వ్యక్తి వచ్చి మా ఎదుట నిలబడ్డాడు. మాసిన మొద్దు చొక్కా మోకాళ్ళుదిగని మొద్దు ధోవతి, గేటు కాపలా వాళ్ళలా మురికి టోపీని ధరించి అతడు మా ముందు నిలబడివున్నాడు. తల మాసింది. గడ్డం పెరిగింది. సలాంపెడుతూన్నట్టు చెయ్యిఎత్తి తన నుదురును స్పర్శించుకున్నాడు అతడు !

భగవతీభాయిని కల్సుకోవడానికే వెళ్ళాము. కనుక వెంటనే గుర్తుపట్టగలిగాను. మామూలుస్థితిలో ఆ వేషంలో అతణ్ణి గుర్తు పట్టడం చాలా కష్టం ! భగవతీభాయిని చూడగానే పంజాబీపద్ధతిలో గాఢాలింగనం చేసుకోడానికి మనస్సు కొట్టుకులాడింది. కానీ, తమాయించుకున్నాను. నేను మధ్య తరగతి మర్యాదస్తుడి వేషంలో వున్నాను. నా ప్రక్కన వున్న సుశీలాదీదీ కూడా ఉన్నత వర్గానికి చెందిన మహిళగా కనపడుతోంది ! అక్కడ నేను కూలివాడి వేషంలో వున్న భగవతీభాయిని ఆలింగనం చేసుకుంటే నలుగురి దృష్టికీ ఎక్కుతాంకదా ?

భగవతీభాయి తను వుండే ప్రదేశాన్ని చూపించాడు. అతడు 'బాంసతల్లా'లో ఒక బీద మార్వాడీ 'బాసా'లో వుంటూన్నాడు. ఒక చిన్న, ఇరుకైన, చీకటి గొందిగుండా 'బాసా' గేటు దగ్గరకు వెళ్ళాలి ! చుట్టూ నాలుగంతస్థుల భవనాలు ! అన్నీ చిన్న చిన్న గదులు ! ఆ గదుల్లో దరిద్రులైన మార్వాడీలు వుంటున్నారు. కొన్ని గదుల్లో కుటుంబీకులు వుంటూన్నారు. మరి కొన్నింటిలో అవివాహితులైన యువకులు వుంటున్నారు. గదుల్లో వుండేవాళ్ళు అందరూ మధ్య తరగతి దరిద్రులు. అందరూ తాము తిన్న ఎంగిలి ఆకుల్నీ, చెత్తాచెదారాన్ని గేటుముందు పారేస్తూవుంటారు ! మార్వాడీ స్త్రీలు పై అంతస్తుల్లోని గదుల ముందు ఎదురు మళ్ళగా కూచుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ వుంటారు. నాలుగు రోజులపాటు ఛాజూరాం భవనంలో వుండి, తరువాత భగవతీభాయీ గదికి మారాను. అవసరాన్ని బట్టి వేషాన్ని మార్చాను.

భగవతీభాయీకి నేను జమ్మూలో కొత్తగా పరిశోధించిన బాంబును గురించి చెప్పాను. అతడు కాలేజీలో సైన్సు చదివాడు. ఈ విషయంలో నాకంటె అతడికే ఎక్కువ తెల్సు ! బాంబు తయారు చేయడానికి నేను ఊహించిన పద్ధతిని పూర్తిగావిని చాలా సంతోషించాడు. ఎవరైనా మంచి పనిచేసినప్పుడు భగవతీచరణ్ తప్పకుండా 'యు ఆర్ ఎ జ్యూయల్ !' అన్న విశేషణంతో ప్రశంసిస్తాడు.

అప్పటివరకూ మేమిద్దరం నిరాయుధులుగానే వున్నాము. భగవతీచరణ్ ఇన్నాళ్ళూ ఊరకాకూచోలేదు కలకత్తాలో ! లాహోరు కుట్ర కేసులో అరెస్టయిన యతీంద్రనాథ్‌దాస్ ఇంటి అడ్రసు తెల్సుకున్నాడు. యతీంద్రనాథ్ దాసు కుటుంబం భవానీపూర్‌లో వుంటూంది. మేమిద్దరమూ అతడి తమ్ముడు కిరణ్‌దాసును కల్సుకున్నాము.

ఈ మధ్య కిరణ్‌దాసు జైల్లో వున్న తన అన్నను కల్సుకోడానికి లాహోరు వెళ్ళాడు. అక్కడ కొన్నాళ్ళు దుర్గాబాభీకి అతిథిగా వున్నాడు. జైళ్ళల్లో వున్న విప్లవకారులకూ, వారిని చూడడానికి వచ్చే

బంధుమిత్రులకూ బాహీ చేస్తున్న సేవనూ, త్యాగాన్నీ కండ్లారా చూశాడు కిరణ్‌దాసు ! జయచంద్ర విద్యాలంకార్‌గారి ప్రచారంలోని అంతర్యం అర్థం చేసుకున్నాడు. నేనూ, భగవతీభాయి - కిరణ్‌దాసుతో స్పష్టంగా మాట్లాడాము. బెంగాల్ విప్లవకారుల్ని పరిచయం చేయవల్సిందని అడిగాము. రెండు రివాల్వర్లను కొని ఇవ్వమన్నాము. అతడిమీద మాకు విశ్వాసం వుందని తెలియపరచడానికి, రెండు రివాల్వర్లకుగానూ అతడు అడిగినంత డబ్బునూ ముందే ఇచ్చేశాము !

ఇక్కడ మరో విషయం చెప్పడమూ అప్రస్తుతం కాదనుకుంటున్నాను. నాజేబులో కేవలం పదిపదిహేనురూపాయలు మాత్రమే వున్నాయి. అదీ నా సొంత డబ్బుకాదు. లాహోరునుండి వచ్చేప్పుడు ప్రేమవతి ప్రోగుచేసి ఇచ్చిన విప్లవసంఘపు డబ్బు అది ! అప్పుడు భగవతీభాయీ దగ్గర ఐదువందలదాకా సొంతడబ్బు వుంది ! ఆ ఐదు వందల్లోంచి మూడు వందల రూపాయలను కిరణ్ దాసుకు ఇచ్చాడు !

కిరణ్‌దాసు డబ్బుతీసుకునేప్పుడు చాలా నమ్మకంగా రెండురోజుల్లో పిస్తోళ్ళుతెచ్చి ఇస్తానని చెప్పాడు. రెండురోజులు .... మూడు రోజులు వారం గడచిపోయింది. అతడు పిస్తోళ్ళు తెచ్చి ఇవ్వలేదు రోజూ మేము, అతడు కల్సుకుంటానని చెప్పిన చోటికి వెళ్ళేవాళ్ళం ! అతడు రాకపోవడంతో నిరాశచెంది తిరిగి వచ్చేవాళ్ళం ! ఇంటికి వెళ్ళికల్సుకోవచ్చును. ఐతే, ఇంటికిరావద్దని చెప్పాడు. అతడి ఇంటికి మేము వెళ్ళడంవల్ల, ఇంట్లోవాళ్ళకు అనుమానం కలుగుతుంది. వాళ్ళ ఇంటిపై నిఘావుంచిన సి.ఐ. డి. పోలీసులు మా వెంటపడే ప్రమాదమూ వుంటుంది !

ఒకమాటు కిరణ్‌దాసు రాత్రిపూట బెంగాల్ విప్లవసంఘపు నాయకులయిన 'దాదాల' దగ్గరకు తీసుకువెళ్ళాడు. వారు మా ఉద్యమాన్ని గురించి అడిగారు. మేము "మా మిత్రులు చాలామంది అరెస్టుకావడంవల్ల సెంట్రల్ కమిటీతో మాకు సంబంధాలు తెగిపోయాయని !" చెప్పాము. ఆ నాయకులు మా విప్లవసంఘంపట్ల నిరాశను ప్రకటించారు. "ఈ విధమైన చెదురు మదురుగా జరిగే దౌర్జన్యచర్యలవల్ల విప్లవంరాదు"అన్నారు. మాకు సలహా ఇచ్చారు. "ముందు మీ ఉద్యమాన్ని బలపరచుకోండి. తరువాత పరిస్థితినిబట్టి సహకరిస్తాము" అన్నారు.

కిరణ్‌దాసు వాలకం చూస్తూవుంటే, అతడివల్ల ఏమీప్రయోజనం కలిగేట్టు కనపడలేదు ! అతడివెంట తిరగడానికి ఒక్కరే సరిపోతారు, ఇద్దరు అనవసరం ! భగవతీభాయి నాకంటే తెలివిగా మాట్లాడగలడు. వడ్డూ పొడుగూ గల శరీరం కావడంవల్ల ఆకర్షణీయంగానూ వుంటాడు. భగవతీభాయి అక్కడేవుండి కిరణ్ వ్యవహారాన్ని తేల్చుకోడానికీ, నేను జమ్మూ వెళ్ళిపోవ్వడానికీ నిశ్చయించుకున్నాం భగవతీభాయి తన దగ్గర వున్న రెండువందల రూపాయల్లోనుండి వందరూపాయలు నాచేతిలో పెట్టాడు "నువ్వు జమ్మూ వెళ్ళిపో ! అవసరమైన సామాన్లకొనుక్కుని కొత్తరకమైన బాంబును తయారుచెయ్యి ! నేనూ ఇక్కడి వ్యవహారాల్ని పదిరోజుల్లో చూసుకుని వచ్చేస్తాను. నేను అక్కడికి వచ్చాక కొత్తరకం బాంబును పరిక్షచేద్దాం" అని అన్నాడు.

నేను జమ్మూ వెళ్ళిపోయాను.

భాగ్‌రామ్ ఇనుపరేకును కొయ్యడానికి అవుసరం అయిన రంపం కత్తెర-మొదలైన సామాన్ని కొనుక్కు వచ్చాడు. అర్థఅంగుళం వ్యాసం గల ఇత్తడి ముక్కల్ని సీసంతో అతికి, తూటాల్ని తయారుచేసుకున్నాం ! ఆ తరువాత వెనుక ఆలోచించినట్టు, ఈ తూటాలను పొదిగి కొత్తరకం బాంబును తయారుచేశాను.

బాంబులోపల తూటాలతోపాటు పేలుడు పదార్థాన్ని నింపాము. బాంబుకు కొన్ని గజాల జానికి తాడును జతచేశాము. ఆ తాడుకు నిప్పు అంటించి, దాన్ని పేలేట్టుచేయాలి. బాంబుపైభాగంలో

ట్రిగర్‌ని అమర్చలేదు. ట్రిగర్ రాపిడికి నిప్పుఅంటుకునేట్టుచేసే పేలుడు పదార్థాన్ని కూడా ఏర్పరచలేదు. ఇప్పటికి జానికి తాడుతో బాంబునుపేల్చి, అనుకున్న ప్రకారం తూటాలు ప్రేలి, సఫలత లభించితే తరువాత ట్రిగర్ మొదలైన లోటుపాట్లను సరిచేసుకోవచ్చుననుకున్నాం. నా తెలివితేటలతో, భాగ్‌రాం యొక్క పరిశ్రమతో బాంబు తయారయింది. ఈ కొత్తరకం బాంబు సంతృప్తికరమైన ఫలితాన్ని ఇస్తుందనడంలో సందేహంలేదు మాకు !

భగవతీభాయి కూడా జమ్మూ వచ్చాడు.

కిరణ్‌దాసు భగవతీభాయికి ఒక పిస్తోలు, ఇరవై తూటాలు ఇచ్చాడు. ఒక్క నెల రోజులలోపల మరో పిస్తోలు తెచ్చి యిస్తానని ఎన్నోవిధాల ఒట్లు పెట్టుకున్నాడు.

పిస్తోలు చేతికివచ్చాక మాకు కొండంత ధైర్యం వచ్చింది. మేమూ సశస్త్రులమేనన్న సంతృప్తి కలిగింది ! ఇంక ఇప్పుడు మేము నిరుపాయంగా చంపబడం ! ఐతే, ఒక్క పిస్తోలుతోనే బ్రిటీష్ ప్రభుత్వాన్ని నాశనం చేయగలమన్న పగటి కలలు కనే అమాయకులం కాదు మేము ! కాకపోతే, పోలీసులతో సంఘర్షణ వచ్చినపుడు ఆత్మరక్షణ చేసుకుంటూ, ఎదురు దెబ్బ తీయగలమన్న సంతోషాన్ని మాత్రం తప్పక పొందాము. రాజకీయంగా కూడా పిస్తోలు ప్రజలమీద కొంత ప్రభావాన్ని వేస్తుంది. సానుభూతిపరులైన యువకులకు, విప్లవాన్ని గురించి వాచా చెప్పటంకంటే, ఆయుధాల్ని చూపించి చెప్పినప్పుడు వారిలో ఉత్సాహం రెట్టింపు అవుతుంది !

బ్రిటీష్ ప్రభుత్వం ఆయుధధారణను నిషేధించింది. ప్రజలు ఆయుధాలు అట్టేపెట్టుకోకుండా పోలీసులు వివిధ జాగ్రత్తల్ని తీసుకుంటున్నారు. ఐనా, మేము ఆయుధాల్ని సంపాయిస్తున్నాం ! ఆయుధాల్ని ధరిస్తున్నాం ! ఇది సానుభూతి గల యువకులకు - మా శక్తి సమర్థతలను చాటడానికీ, బ్రిటీష్ ప్రభుత్వపు ఓటమిని తెల్పడానికీ చక్కగా ఉపయోగపడుతుంది. మరొక్క విషయం, యుకులకు ఆయుధాల్ని చూపించి ఉత్సాహపరిచే పద్ధతిని మేము మాత్రమే అవలంభించామని అనుకోనవసరం లేదు. 1942-44లో సాయుధ పోరాటానికి ప్రయత్నించిన వారుకూడా అలాగే చేశారు. నాకంటె కూడా ఒడ్డుపొడుగుగల భగవతీభాయి ఆయుధాల్ని ప్రదర్శించడంతో జమ్మూలోని చాలా మంది మిత్రులు ఉత్సాహితులయ్యారు.

మరునాడే కొత్తగా తయారు చేసిన బాంబును పరీక్షించడానికి బయలుదేరాము. పట్నానికి నాలుగు మైళ్ళ దూరంలో గల అరణ్యంలోకి వెళ్ళాము. కొత్త పద్ధతిలో, సొంతంగా పరిశోధించి తయారుచేసిన ఈ బాంబు ఎంతవరకూ అనుకున్న ఫలితాన్నిస్తుందో చూడాలని తాపత్రయంగా వుంది. ఐతే, బాంబు వుత్తమంగా పేలగలదన్న విశ్వాసం మా కెటూ వుంది. కాకపోతే, కండ్లారా చూడడానికి ఆత్రపడుతూన్నాం ! బాంబును ఓ చిన్న గుంటలో పెట్టాము. గుంటను బరువైన బండల్తో మూసేశాము. గుంటకు ఓ పాతికగజాల దూరంలో ఓ పెద్దరాయి గోడ పెట్టినట్టు పడివుంది. బాంబు పేలిన తరువాత బాంబులోని తూటాలు నాలుగువైపులా విరజిమ్ముకోడానికి చుట్టూ అడ్డంలేకుండా చేశాము. బాంబు పేలాక ఎదురుగా గోడపెట్టినట్టున్న పెద్ద బండకు కనీసం ఒకటి రెండు తూటాలయినా వచ్చి తగుల్తాయని నా విశ్వాసం ! దాన్ని బట్టి తూటాలు వెళ్ళగల దూరాన్ని అంచనా వేసుకోవచ్చును. నేనూ భగవతీభాయీ ఆ పెద్ద బండకు అవతల ఎత్తయిన ప్రదేశంలోకి వెళ్ళి నిలబడ్డాము. భాగ్‌రాం తాడుకు నిప్పంటించి దగ్గరలోనేవున్న ఓ పెద్దగోతిలోకి దూకాడు !

బాంబు పేలిన శబ్దం అయితే గొప్పగా వినిపించింది. కానీ గుంటపైన పెట్టిన బండల్లో ఒక్కటీకదల్లేదు ! ఎదురుగా వున్న బండకు తూటా తగిలినగుర్తు ఒకటీ కనిపించలేదు. దగ్గరకు వెళ్ళి చూశాము. తూటాలు అక్కడే క్రింద విరజిమ్ముకుని పడి వున్నాయి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో

తయారుచేసిన అవరణ పగిలిపోయింది. నేను చాలా నిరాశపడ్డాను. మనస్సు కించపడ్డది. భగవతీభాయి ఒక రకంగా నన్ను ఓదార్చాడు. అప్పుడు తూటాలు దూరం వరకూ ఎందుకు దెబ్బతీయలేదో కొన్నాళ్ళ తరువాతగానీ అర్ధంకాలేదు !

అసఫలతకు ఖిన్నమనస్కులమైన మేమిద్దరమూ పట్నానికి దిగువనవున్న 'తవీ' నది ఒడ్డుకు షికారు చేయడానికి వెళ్ళాము. నది ఒడ్డున కూర్చుని మేమొకనిర్ణయానికి వచ్చాము. బాంబులకు అవుసరమైన ఇనుపడిప్పల్ని తయారు చేసుకోక తప్పదనుకున్నాము. బాంబుల్ని తయారుచేయడానికి సంబంధించినంతవరకూ కల్పనల్ని వదిలి వాస్తవిక మార్గాన్ని అనుసరించక తప్పదనీ అనుకున్నాము. ఐతే, బాంబుల అవరణకు అవుసరం అయిన ఇనుప డిప్పల్ని ఇతర్ల చేత తయారుచేయించడం ప్రమాద భరితం ! ఆ డిప్పల్ని తయారుచేసే కమ్మరపు పనిలో భాగ్‌రాంకు అనుభవం వుంది ! కానీ, వాటికి అవుసరం అయిన సామాగ్రిని కొని కమ్మరపుకొలిమిని పెట్టడానికి డబ్బుకావాలి, సమయమూ పడుతుంది ! విప్లవకారులను జోరుగా అరెస్టు చేస్తున్న రోజులవి ! ప్రజల్లో సానుభూతి సన్నగిలుతోంది. ఎటునుండీ ఆర్థికసహాయం లభించడం లేదు. ఎవరైనా కొద్దిగొప్పో సహాయంచేసినా అది మా ఆదర్శంపట్ల సానుభూతి వుండి కాదు. కేవలం వ్యక్తిగత పరిచయాల్ని పురస్కరించుకుని మాత్రమే ఆర్థిక సహాయాన్ని స్వల్పంగా పొందగలుగుతున్నాము పరిచయుల నుండి ! మొత్తం కార్యక్రమం అంతా భగవతీభాయి డబ్బుతోనే జరుగుతోంది. సోదరి ప్రేమవతి - వాళ్ళనూ వీళ్ళనూ చందా రూపంలో అడిగి, చాలా కొద్ది మొత్తాన్ని మాత్రమే పంపగలుగుతూన్నది. ప్రజల్ని ఉత్సాహపరచి, వారి సానుభూతిని మా వైపు తిప్పుకుని, వారి నుండి సహాయాన్ని పొందే మార్గం ప్రశస్తం చేసుకోవాలి ! అలా చేసుకోడానికి ప్రజలని ఆకర్షించే 'యాక్షన్'న్ని ఒకదాన్ని తక్షణం చేసివేయడం అవుసరం ! ఐతే, మంచి డిప్పల్ని తయారు చేసుకున్నప్పటికీ, మేలు రకమైన పేలుడు పదార్థాన్ని తయారు చేసుకోలేనిస్థితిలో వాటి ఉపయోగం అంతగా వుండదు. కానీ, మేలురకమైన పేలుడు పదార్థాన్ని తయారు చేసుకోగలిగితే, మంచి డిప్పలు లేకపోయినా ఎలాగో పని జరుపుకోవచ్చును.

వెన్నెల రాత్రి ! 'తవీ' నదీతీరం ! తీతువుకూస్తూన్నది. మేమిద్దరం మా కార్యక్రమాల్ని గురించి మాట్లాడుకుంటూ ఒక నిర్ణయానికి వచ్చాము. శక్తివంతమైన పేలుడు పదార్థాన్ని అధిక పరిమాణంలో తయారుచేసుకోగలిగితే, మంచి డిప్పలు లేకండానే దాన్ని రైలు పట్టాలకింద పాతిపెట్టి, వైస్రాయి స్పెషల్ ట్రయిన్ని పడగొట్టవచ్చును ! మా యిద్దరిలో ఒకరు ప్రాణాలర్పించి అయినా ఈ కార్యక్రమాన్ని నిర్వహించగలిగితే ప్రజలకు మా విప్లవసంఘపు శక్తి సమర్థతలపట్ల విశ్వాసం కలుగుతుంది. ప్రజల అభిప్రాయాల్లో పరివర్తన తెచ్చినవారమవుతాము. భవిష్యత్తులో విస్తృతరూపంలో విప్లవ కార్యక్రమాల్ని నడపడానికి, ప్రజల సహాయ సానుభూతిని సంపాయించిన వారమవుతాము !

మా విప్లవసంఘంలో పేలుడు పదార్థాన్ని తయారుచేయడం తెల్సినవారు ముగ్గురే వున్నారు. యతీంద్రనాథ్ దాస్, సుఖదేవ్, శివవర్మ ! వీళ్ళు ముగ్గురూ అరెస్టయ్యారు. పోతే, ఇంక ఇతరమిత్రులెవరికీ బాంబుల్ని తయారుచేయడం - అంటే బాంబుల్లోపలి పేలుడు పదార్థాన్ని తయారు చేయడం రాదు. భగవతీభాయి, కిరణదాసు ద్వారా బెంగాల్లోని మిత్రుల్లో బాంబులు చేయడం తెల్సిన మిత్రుణ్ణి ఎవరినైనా పరిచయం చేసుకోడానికి ప్రయత్నించాడు. కానీ, ప్రయత్నం ఫలించలేదు.

బాంబులు చేయడం తెల్సినవారు ఎవరున్నారు ? ఉన్నా, మనకు చెప్పగలవారు వుండాలి గదా ? ఈ సమస్యను గురించి కొంతసేపు ఆలోచించి "నా దృష్టిలో అలాంటి వ్యక్తి ఒకడున్నాడు. అతడికి ప్రేలుడు పదార్థాన్ని తయారుచేసే విధానం తెల్సు ! జయచంద్రగారి దుష్ప్రచారం తరువాత

గూడా అతడు నా పట్ల పూర్తి విశ్వాసాన్ని కలిగి వున్నాడు. మనం వెడితే అతడావిధానాన్ని, పదార్థాల పాళ్ళనూ తప్పకుండా చెప్తాడు !" అని తరువాత ఆ వ్యక్తి పేరు చెప్పాడు భగవతీభాయి 'దేవదత్తశర్మ !'

దేవదత్తశర్మ లాహోరు గవర్నమెంటు కాలేజీలో రసాయన శాస్త్రాన్ని బోధించే అధ్యాపకుడు. అతడికీ భగవతీచరణ్‌కూ మంచి స్నేహం ! బహుశ ఇద్దరూ సహాధ్యాయులనుకుంటాను. అప్పుడు వేసంగి సెలవులు కావడంవల్ల దేవదత్తశర్మ తన స్వస్థలం అయిన శ్రీనగర్‌కు వెళ్ళాడు !

శ్రీనగర్ వెళ్ళి దేవదత్తశర్మను కల్సుకోవడం అవుసరం అన్న తన అభిప్రాయాన్ని వెల్లడించాడు భగవతీభాయి.

భగవతీభాయిని శ్రీనగర్ వెళ్ళవద్దన్నాను. నేనే వెడతానన్నాను, ఇలా చెప్పాను. "దేవదత్తశర్మకు నీ మీద విశ్వాసం వుందన్నమాట నిజమేగానీ, అయినా, నువ్విప్పుడు శ్రీనగర్ వెళ్ళడం ఏమంత మంచిది కాదనే నాఉద్దేశ్యం ! ఎందుచేతనంటే, వేసవికాలంలో సహజంగా లాహోరులోని ప్రజలు చాలా మంది శ్రీనగరు వెడుతూంటారు. అదీకాక వెనకకూడా ఒకమాటు నీవు శ్రీనగర్ వెళ్ళావు ! శ్రీనగర్‌లో నీ పరిచయుల సంఖ్య అధికం ! కనుక నీకు అక్కడ ప్రమాదం సంభవించగల పరిస్థితుల కూడా బహుళంగానే వుంటాయి. అన్నింటినీ మించి కాశ్మీరీ బిల్డింగ్‌లోని బాంబుఫ్యాక్టరీ పట్టుపడ్డాక, జయచంద్రగారు తన ప్రచారాన్ని మలుపుతిప్పారు. నిన్ను అక్కడ నిందించేవారి సంఖ్య కూడా అధికంగానే వుంటుందని నా ఉద్దేశం ! ఇన్ని కారణాలనూ బట్టి శ్రీనగర్‌కు నేను వెళ్ళడమేనయం అనుకుంటున్నాను. నువ్వు పంపించావనిగానీ, లేక నేనే స్వతంత్రంగా వచ్చానని గాని చెప్పి శర్మను కల్సుకుని మాట్లాడతాను. ఒకవేళ శ్రీనగర్ వెళ్ళడం నీకు మాత్రం ప్రమాదకరం ఎందుకుకాదు ? అని నీవు అడగవచ్చును. నేను పోయినా ఫరావాలేదు. పార్టీకి నాకంటే నీ అవుసరమే ఎక్కువ ! నేను పోయినా, నీవు బ్రతికి వుండడం ముఖ్యం !" అన్నాను.

నేను కాశ్మీర్ వెళ్ళడం నిశ్చయం అయింది. భగవతీభాయి ఢిల్లీ వెళ్ళి అక్కడ స్థావరాన్ని స్థిరపరుచుకుంటానన్నాడు. శ్రీనగర్‌లో పనిచూసుకున్నాక నన్నూ నేరుగా ఢిల్లీ వచ్చేయమన్నాడు. ఢిల్లీలోని విశ్వాసపాత్రుడైన ఓ మిత్రుడి అడ్రసునిచ్చాడు.

మర్నాడు విలాస యాత్రికుడిలా రైనీ కోటును బుజానవేసుకుని, కెమేరానొకదాన్ని బుజానికి తగిలించుకుని కాశ్మీర్ వైపు ప్రస్థానాన్ని సాగించాను. ఆ ఒక్క పిస్తోలూ మా ఉమ్మడి సంపత్తి ! దాన్ని ఆత్మ రక్షణార్థం నాకియ్యబోయాడు భగవతీచరణ్ !

నేనిలా అన్నాను "పిస్తోలును నువ్వే అట్టిపెట్టుకో ! పిస్తోలుతో నాకు అంతటి అవుసరం ఏమీ వుండదనుకుంటాను. ఒకవేళ పోలీసులు అనుమానించినా ఆ అపరిచిత ప్రదేశంలో నేను తప్పించుకు ఎక్కడికి పోగలను ? కాకపోతే, ఒకరిద్దరు సంస్థాన పోలీసుల్ని చంపగలనేమో, అంతమాత్రాన ప్రయోజనం మాత్రం ఏముంటుంది ? అదీకాక నువ్వు పంజాబుగుండా ఢిల్లీ వెళ్ళవల్సినవాడివి ! కనుక పిస్తోలు నీ దగ్గర వుండడం అవుసరం !"

ఇన్నాళ్టి అనుభవాన్ని బట్టీ - నా ప్రవర్తనద్వారా ఇతర్లకు అనుమానం కలగకుండా నన్ను నేను రక్షించుకోగలనన్న -విశ్వాసం వుందినాకు ! కాశ్మీర్ వెళ్ళడానికి డబ్బు భగవతీభాయి ఇచ్చాడు. "దూరదేశం వెడుతూన్నావు. మళ్ళీ మళ్ళీ వెళ్ళడం కుదరదు ! ఖర్చుకు వెనకాడి, చూడవల్సిన ప్రదేశాల్ని చూడకుండా రాకు ! డబ్బు తక్కువ అయితే ఢిల్లీకి టెలిగ్రాం ఇవ్వు !" అన్నాడు భగవతీభాయి

# బాంబుల్ని చేయడం ఎలా ?

కొన్ని సంఘటనలూ, దృశ్యాలూ మనస్సులో అలా నిలిచి పోతాయి. ఎంతో ప్రభావితం చేస్తాయి మనిషిని; ఒక్కొమాటు మానసిక స్థితిని బట్టి కూడా దృశ్యాలు మన మనస్సుమీద ప్రభావాన్ని వేస్తూవుంటాయి. రెండునెల్ల క్రితం మంచుతో కప్పబడిన పర్వతశిఖరాల్తో పచ్చని ప్రకృతి దృశ్యాలతో కనులకు ఇంపుగావుండే కాంగడా ప్రాంతపు ప్రకృతి సౌందర్యాన్ని నేనసలు గమనించనే లేకపోయాను. నేను అప్పుడు భయంతో, ఆత్మరక్షణకోసం తాపత్రయపడుతూన్నాను. ఆ స్థితిలో కాంగడా సౌందర్యం నన్ను ముగ్ధుణ్ణి చేయలేకపోయింది. కానీ, ఇప్పుడు నేను విప్లవసంఘం తరఫున బాధ్యతాయుతమైన కర్తవ్యాన్ని నిర్వహించడానికి వెడుతూన్నాను. ఆనాటి భయంగానీ, బెరుకుగానీ - ఇప్పుడు లేదు. పైగా, ఓ రకమైన ఉత్సాహం, గర్వం అనుభూతికి వస్తోంది ! ప్రకృతి శోభను తిలకించగల సవ్యమైన మానసికస్థితిలో వున్నాను. జాగ్రత్తగా వ్యవహరించవల్సిన అవసరం ఎటూ వుంది ! ఐతే, వెనుకటి భయం మాత్రం లేదు మనస్సులో !

జమ్మూ నుండి కాశ్మీరుకు దూరం 205 మైళ్ళు వుంటుంది ! ఇంత దూరమూ బస్సులోనే ప్రయాణం చెయ్యాలి ! సాయం సమయం ! బటోట్ గుండా ప్రయాణం సాగుతోంది. బటోట్ లోయల్లో సూర్యాస్తమయ సౌందర్యం మహాద్భుతంగా వుంది. దేవదారువనాల వెనుక సూర్యుడు అస్తమిస్తున్నాడు. దూరంగా యూరోపియన్ దంపతులు ఓ ఎత్తైయిన బండమీద నిలబడి సూర్యాస్తమయ సౌందర్యాన్ని తన్మయులై అవలోకిస్తూన్నారు. దేవదారు వృక్షాల శిరోభాగం నుండి సూర్యుడు క్రమేణా క్రిందికి దిగుతూన్నాడు. యూరోపియన్ దంపతులు కూడా సూర్యాస్తమయ దృశ్యంలో భాగంగా కనిపిస్తున్నారు నా కంటికి ! 22 సంవత్సరాల తరువాత ఈ నాటికీ నేనానాటి సూర్యాస్తమయ దృశ్యాన్ని మనోఫలకం మీద యథాతథంగా చూడగలుగుతూన్నానంటే, ఆ దృశ్యం నన్ను ఎంతగా ఆకర్షించిందో ఊహించ వచ్చును ! మరో విషయం కూడా బాగా జ్ఞాపకం వుంది. దృశ్యం ఎంత బాగున్నప్పటికీ దాన్ని కావాలని ద్వేషించడానికి ప్రయత్నించాను. అందుకు కారణం, ఆ దృశ్యంతోపాటు కనిపిస్తూన్న యూరోపియన్ దంపతులు ! వాళ్ళలా కమనీయమైన సాయంత్రపు దుస్తుల్లో, ఉల్లాసంగా, ఉత్సాహంగా వుండడాన్ని ఏ విధంగాను సహించలేకపోయాను. 'నిరంతరం శ్రమించే స్థానికులు పస్తుల్తో కృశించి, నశించిపోతూన్నారు. పై నుండి వచ్చిన వీరు వాళ్ళ రక్తాన్ని పీల్చిపిప్పిచేస్తూ ఇలా ఉల్లాసంగా జీవిస్తున్నారు' అన్న ఆలోచన నాలో ద్వేషానలాన్ని రేపింది ! 'నా దేశాన్ని దోచుకుని వీళ్ళు సుఖాల్ని ప్రోదిచేసుకుంటున్నారు ! అలాంటప్పుడు వీళ్ళను తప్పకుండా ద్వేషించవల్సిందే !' అనుకున్నాను.

మర్నాడు మధ్యాహ్నానికి మా బస్సు 'బన్హాల్' పర్వతాన్ని ఎక్కసాగింది. బస్సు పాము మెలికలు తిరుగుతూ పర్వతాన్ని ఎక్కుతోంది. జూన్ నెల అనుకుంటాను. ఎండలు దహించేస్తున్నాయి. 'బన్హాల్' పర్వతం ఎండుగా, బోడిగా వుంది. ఎక్కడా చెట్టుగానీ, చేమగానీ కనుపించడంలేదు. నిటారుగా వున్న పర్వతాన్ని బస్సు చాలా కష్టంగా ఎక్కుతోంది !

బస్సు పర్వత శిరోభాగానికి ఎక్కింది. అవతలివైపుకు, కొంచెం క్రిందకు దిగి ఓ సొరంగం ముందు ఆగింది. ఇంత ఎత్తు కొండను ఎక్కడంతో బస్సు యొక్క ఇనుప శ్వాసకోశాలు కూడా అలసట చెందాయా అనిపించింది ! ఇంతకు ముందుకూడా, సొగంకొండ ఎక్కాక, ఇంజన్ వేడి ఎక్కడంవల్ల నీళ్ళు పోసుకోడానికి బస్సు ఒకమాటు ఆగింది. చెట్లూ, చేమలూ, అడ్డంలేవు. సొరంగంలో నుండి

చూస్తే అవతల లోయలో వున్న పల్లెలీలగా కనుపిస్తోంది! మనుషులు అంగుష్ఠ మాత్రుల్లాగానూ, ఇళ్ల బొమ్మరిళ్ళుగానూ కనిపిస్తున్నాయి.

బస్సు సొరంగంలోకి ప్రవేశించింది. సొరంగం చిన్నదే ! బస్సు అవతలివైపుకు వెళ్ళింది. విచిత్రం ...... రంగస్థలం మీద దృశ్యం మారినట్టయింది. చల్లనిగాలి, సర్వత్రా పసిరిక, పత్ర-పుష్పాలతోనిండి కనుల పండువుగావున్న వృక్షరాజి-దర్శనమిచ్చాయి ! మహా మాంత్రికుడు తన మంత్రపు బెత్తాన్ని ఝళిపించి నూతన దృశ్యాన్ని సృష్టించాడా అనిపించింది ! 'బన్హాల్' పర్వతం దాదాపూ తొమ్మిదివేల అడుగుల ఎత్తు వుంటుంది. పర్వతానికి ఇటువైపున జమ్మూ ! సొరంగం దాటి అవతలకు వెడితే కాశ్మీరు ! ఎక్కప్పుడు పర్వతం నిటారుగా వుడడంలవ్ల గోడ మీదకు ఎగపాకినట్టుగా వుంది. సొరంగం దాటి కిందకు దిగడం అంత కష్టం అనిపించలేదు !

పర్వతాన్ని దిగి 'వేరీనాగ్'ను దాటాము. అక్కడనుండి సమతల ప్రదేశం వచ్చింది. రోడ్డుకు రెండువైపులా తెల్లని సఫేదా వృక్షాలు బారులు తీర్చివున్నాయి. తెల్లని మానులూ, పచ్చని అగ్రాలూ ! పల్లెలూ, ఇండ్లూ ఆదరకంగా వున్నాయి. ప్రజలు కూడా కట్టూ, బొట్టూ - రంగూ రూపాల్లో ప్రత్యేకంగా వున్నారు ! ఎర్రని శరీరాలేఅయినా, మురికిపట్టి మాసినట్టు కనిపిస్తున్నారు. బాగా మాసిన గుండ్రని సొట్ట టోపీల్నూ, చినిగి పీలికలైన, మోకాళ్ళవరకూ వచ్చే చొక్కాల్నూ ధరించారు ప్రజలు ! గ్రామాల్లో ఇండ్ల సమీపాల్లో ఫలవృక్షాలు అధికం ! 'వేరీనాగ్' నుండి శ్రీనగర్ 40 మైళ్ళు మాత్రమే వుంటుంది. త్వరగానే శ్రీనగర్ చేరాను !

బస్‌స్టాండులో హోటళ్ళకు, హౌస్‌బోటులవద్దకు తీసుకువెళ్ళే దళారులసంఖ్య అధికంగా వుంది. పంజాబీ సి.ఐ.డి. పోలీసులు కూడా అధికంగానే వున్నారు. అసలక్కడ పంజాబీలే అధికంగా వున్నారు. నేను పంజాబీని కానట్టూ, పంజాబీభాష రానట్టూ వ్యవహరించాను. నేరుగా 'నీడోజ్' హోటలుకు వెళ్ళిపోయాను. 'నీడోజ్' హోటల్లో సాధారణంగా యూరోపియనులే దిగుతూవుంటారు ! కాకపోతే వాళ్ళతో సరితూగేభారతీయులు దిగుతారు ! శ్రీనగర్‌కు సంబంధించిన కొన్ని విషయాలను జమ్మూలోనే, మిత్రులవల్ల తెలుసుకున్నాను !

'నీడోజ్' హోటల్ చాలా బాగుంది. శుభ్రంగా వుంది. ఐతే, ఆ హోటలు ఖర్చు భరించడం కష్టం ఆ రోజుల్లోనే రోజుకు దాదాపు పది రూపాయిల అద్దెవుండేది గదికి ! నేను అంత ఖర్చుపెట్టగలగడం కష్టమే, ఐనా - ఇతరత్రా ప్రమాదాలు సంభవించకుండా రక్షణకావాలంటే, అక్కడ వుండక తప్పదు !

భోజనానంతరం, సుఖదేవ్‌ను జైల్లో కల్సుకోవడానికి వెళ్ళినప్పుడు వేసుకున్న సూటును ధరించి దేవదత్తశర్మ యింటికి బయలుదేరాను ! దేవదత్తశర్మ అన్నగారు మెజిస్ట్రేటు; అతడి పేరు భీమసేన్ ! ఆయన గార్ని నేను ఎరుగను. ఐతే, దేవదత్తశర్మ తమ్ముళ్ళను ఎరుగుదును. వాళ్ళు నాకు లాహోరులోనే పరిచయం అయ్యారు. కనుక తమ్ముళ్ళు కనుపిస్తేఫరవాలేదు. కాక మెజిస్ట్రేటుగారి కంటపడితే, ఎవరూ ? ఎక్కడినుండి వచ్చావ్ ? అన్న ప్రశ్నలు వేస్తారు !

భీమసేన్‌గారినే కల్సుకోవడం జరిగింది. ఎవరు ? ఏమిటి ? ఎక్కడి నుండి వస్తున్నారు ? ఎందుకోసం వచ్చారు ? అన్న ప్రశ్నల్ని వేశారు మెజిస్ట్రేట్‌గారు. వారు పంజాబీలో అడుగుతూన్నారు. నేనేమో పంజాబీరానట్టు ఇంగ్లీషులో సమాధానం చెప్తున్నాను. "శర్మగారిని లాహోరులో ఎరుగుదుననీ, ఎప్పుడయినీ శ్రీనగర్ వస్తే, తనను కల్సుకోవల్సిందని మరీ మరీ చెప్పారనీ," అన్నాను.

"ఎక్కడ దిగారు ?" అనడిగాడు మెజిస్ట్రేట్ గారు

"నీడోజ్ హోటల్లో !" అని సమాధానం చెప్పాను.

'నీడోజ్' హోటలు పేరు వినేసరికి మెజిస్ట్రేటుగారి ముఖంలో, స్వరంలో బాగా మార్పు వచ్చింది. నేను ఉన్నతమైన కుటుంబానికి చెందినవాణ్ణని నమ్మకం కుదిరింది. స్వరంలో ఆత్మీయతధ్వనించింది!

"శర్మ ఊళ్ళోలేడు. 'పహల్‌గావ్' వెళ్ళాడు! రెండు మూడు రోజుల్లో రావచ్చును" అన్నారు మెజిస్ట్రేటుగారు. నేను నాపేరు, నా నివాసస్థానం - అన్నీ కల్పితమైనవి చెప్పాను. ఆ రోజు సాయంత్రం వరకూ శ్రీనగర్ అంతటా తిరిగి ప్రదేశాన్ని గమనించడానికి ప్రయత్నించాను!

శ్రీనగర్ జీలం నదిమీదకు పూర్తిగా పరచుకున్న పట్టణం. నదికి తీరం అంటూ లేదు. అన్నీ ఇండ్లే. అక్కడక్కడా వంతెనలు మాత్రం వున్నాయి. రాకపోకలకు! పట్నంలో గుర్రబండ్లు, కార్లు కూడా వున్నాయి. ఐతే, ఎక్కువగా పడవల మీదనే రాకపోకలు సాగుతూంటాయి. జీలం నది పాయలు మొత్తం పట్నంలోకి వ్యాపించి వున్నాయి. ఆ కాలువల్లో తూగుతూవెళ్ళే చిన్న చిన్న పడవలు రంగు రంగుల గొడుగుల్తో కప్పబడి చాలా ఆకర్షణీయంగా కనుపిస్తూ వుంటాయి!

శ్రీనగర్‌లోని పెద్ద వంతెన పేరు 'మీరాకదల్'! ఈ వంతెనకు ఇటువైపున ధనికులు నివసించే శుభ్రమైన పేటలు! అటువైపున స్థానిక బీదప్రజలు నివసించే మురికిపేటలు వున్నాయి! మొత్తం శ్రీనగర్‌లో ఎటు చూసినా యూరోపియన్లు కనిపిస్తారు. స్థానిక ప్రజల్తో పోల్చిచూస్తే యూరోపియనుల సంఖ్య అత్యల్పం! ఐతే, ఆధిక్యంలో మాత్రం వారిదే పైచేయి! 'స్థానిక ప్రజలు కేవలం విలాసార్థం వచ్చే యూరోపియనులకు సౌఖ్యాలను చేకూర్చడానికి మాత్రమే బ్రతుకుతున్నారు, అనిపించింది. విలాసార్థం వచ్చినవాళ్ళు యజమానులయ్యారు. స్థానికులు వాళ్ళకు దాసులయ్యారు.

దేవదత్తశర్మను కల్సుకోడానికి ఎటుతిరిగీ మూడు నాలుగు రోజులు పడుతుంది. అంతవరకూ 'నీడోజ్' హోటలు గది అద్దెను భరించడం కష్టం! ఎటూ హోటల్లో దిగాను గనుక ఒకరోజు అద్దెకట్టక తప్పదు. అందుకని ఆ రాత్రి ఆ హోటలు గదిలోనే పడుకున్నాను! మర్నాడు మధ్యాహ్నం గది ఖాళీచేసి 'గుల్‌మర్గ' వెళ్ళాను! దేశంలోని గొప్పవారు వేసవి కాలంలో చల్లని ప్రదేశాన్ని వెతుక్కుంటూ శ్రీనరగ్ వస్తారు! అలా వచ్చిన గొప్పవాళ్ళలో మరీ గొప్పవాళ్ళు కొందరుంటారు, వాళ్ళు జూన్ నెలలో శ్రీనగర్ నుండి 'గుల్‌మర్గ' వెడతారు!

గుల్‌మర్గలో మంచు ఎక్కువగా కురుస్తూ వుంటుంది. అక్కడికి వెళ్ళేవాళ్ళు సాధారణంగా గొప్ప దొరలై వుంటారు! సముద్ర తలానికి చాలా ఎత్తున వున్న ఓ విశాలమైన సమతల ప్రదేశం అది. మైదానం అంతట్లోనూ పచ్చని తివాచీ పరచినట్లు పసిరిక దట్టంగా పెరిగివుంది. చుట్టూ యూరోపియను పద్ధతిలో నిర్మించిన చిన్న చిన్న గదులు! వాటికి అద్దె చాలా ఎక్కువగా వుంటుంది. దొరలు మైదానంలో గోల్ఫు ఆడుతూవుంటారు! గోల్ఫు ఆడడానికి గుల్‌మర్గ వెళ్ళడం అనేది దొరలకు కూడా గొప్పతనాన్ని ఆపాదించగల గొప్పతనం! అక్కడో హోటలు కూడా వుంది. అది నీడోజ్ హోటలుకు బ్రాంచి అనుకుంటాను. మధ్య తరగతి భారతీయుల కొరకు మురికి హోటలూ ఒకటుంది. రెండు చెక్కగదులు వున్నాయి. నేనొక గదిని తీసుకున్నాను. ఆ హోటల్లో పశ్చిమ పంజాబులోని 'ఝంగ్' జిల్లానుండి వచ్చిన ముగ్గురు యువకులు రెండు రోజులనుండి వుంటున్నారు గది తీసుకుని! నేను స్కూలు మాస్టర్‌గా వారికి పరిచయం అయ్యాను. నివాసస్థానం జలంధర్ అని చెప్పాను. మేమందరం కల్సి షికారుకు వెడుతుండేవాళ్ళం! ఆ రోజుల్లో గుల్‌మర్గలో ఇంగ్లీషువాళ్ళ ప్రభావానికి అంతూ పొంతూ వుండేది కాదు. భారతీయులు ఎవరూ పసిరిక మైదానంవైపు వెళ్ళడానికి వీల్లేదు! ఎవరైనా అటువెడితే దొరల గోల్ఫు ఆటకు అభ్యంతరం కలుగుతుంది. వాళ్ళు నోటికొచ్చినట్లు తిట్టినా, కొట్టినా పడవల్సిందే ! కనుక భారతీయులెవరూ ఆ మైదానం పక్కకు వెళ్ళేవాళ్ళు కాదు. ఒకవేళ వెళ్ళినా, చాలా

భయపడుతూ వెళ్ళేవారు ! గోల్ఫు ఆడేప్పుడు బంతిని మెల్లగానూ, విసురుగానూ కొట్టడానికి రకరకాల కర్రలు అవుసరం అవుతాయి. ఆట ఆడుతున్న దొరల వెంట పరుగెత్తుతూ కర్రలు అందించడం కాశ్మీర్ బాలుర వృత్తి ! మురికిపట్టిన పొడుగాటి చొక్కాలు వేసుకొని వీపుమీద గోల్ఫు ఆడడానికి ఉపయోగించే కర్రల్తో నిండిని సంచితో-దొరల వెనుక పరిగెత్తుతూ వుంటారు కాశ్మీర్ బాలురు !

నేనూ, ఝంగ్ జిల్లా యువకులూ మైదానంలో తిరుగుతూన్నాము. దొరల విదిలింపులకు గురి అవుతామేమోనన్న బెరుకు అందరిలోనూ వుంది. ఆ యువకులు పంజాబీభాషలో దొరలను అమ్మబూతులు తిడుతూన్నారు. దొరలను చెప్పుతీసుకుతన్నాలని చెప్పుకుంటున్నారు ! ఇంగ్లీషు స్త్రీలు కనపడినప్పుడు - వయస్సుతో సంబంధం లేకుండా - వాళ్ళను వ్యభిచరించాలన్న తమ ఘనమైన అభిప్రాయాన్ని పంజాబీభాషలో వ్యక్తపరుస్తూన్నారు. అలా దూషించటం చాలా అసభ్యత అని నేనూ ఒప్పుకుంటాను. ఈనాడు ఒక యూరోపియన్ స్త్రీ గురించి ఏ భారతీయుడయినా అలాంటి అభిప్రాయాన్ని ప్రకటిస్తే తప్పకుండా వారిస్తాను. కానీ, అప్పుడెందుకనో, ఆ యువకులు అలా మాట్లాడడం అంత అభ్యంతరకరం అనుపించలేదు నాకు ! లాహోరులో ఓ మాటు కొందరు యువకులు బజార్లో స్త్రీని అవమానపరచిన కారణంగా, వాళ్ళతో కొట్లాడానుకూడాను ! మరి ఝంగ్ యువకుల్ని ఎందుకు వారించలేదు నేను ? నా అంతరాంతర చేతన, వారలా వ్యవహరించడం సబబేమోనన్న అభిప్రాయాన్ని ఎందుకు వ్యక్త పరిచింది ? ఝంగ్ యువకులు అలా ఇంగ్లీషు వారిని ఎందుకు తిడుతూన్నారు ? గుల్‌మర్గ మీద ఇంగ్లీషువారు అధికారాన్ని చలాయిస్తున్నారు. ఝంగ్ యువకుల తిట్లు, వారి అధికారానికి తమదైన పద్ధతిలో నిరసన తెలియపరచడమే అవుతుంది ! ఇంగ్లీషు వారి అధికారాన్ని తిరస్కరించడానికి, తమ దైన్యస్థితిని కప్పిపుచ్చుకోడానికి యువకులు అలా వ్యవహరిస్తున్నారు. యువకుల ప్రవర్తన సమర్థనీయమనిగానీ, అనుకరణీయమనిగానీ అనలేము; ఐతే, ఇంగ్లీషువారి అధికారాన్ని తమకు చాతనయిన పద్ధతిలో ఝంగ్ యువకులు వ్యతిరేకిస్తున్నారనడంలో సందేహం లేదు ! అసలా రోజుల్లో సవ్యమైన మార్గంలో ఇంగ్లీషువార్ని వ్యతిరేకించడానికి భారతీయులకు అవకాశం ఎక్కడిది ?

ఆ రోజు ఆకాశం మేఘావృతం అయింది. దూదిపింజల్లా మంచు తునకలు రాలుతూన్నాయి. చలి మిక్కుటం అయింది. రైనీ కోటుమీద కంబళిని కప్పుకుని గడిపాను ఆరాత్రిని మర్నాడూ అలాగేవుంది. మేఘాలు చాలా కిందకుదిగి వర్షించసాగాయి. మేఘాలు వృక్షాగ్రాల్ని స్పర్శిస్తూన్నాయి. ఆ చిటపట చినుకుల్లో, చలిలో బయటికి పోవడం యువకులకు ఇష్టం లేదు. దుప్పట్లు కప్పుకు కూచుని పేకాట ప్రారంభించారు ! కానీ, నాకుమాత్రం అక్కడ కూచోబుద్ధిపుట్టలేదు. అక్కడికి మరికొంచెం దూరంలో 'అల్‌పత్తర్' అనే ప్రదేశం వుంది. అక్కడ వర్షాకాలంలోనూ మంచు గడ్డ కడుపుతూవుంటుందిట ! నేనా ప్రదేశాన్ని చూడడానికి వెళ్ళాను. అక్కడ ముందుకు వెళ్ళడం అంటే పైకి ఎక్కడమే ! కొద్ది దూరం వెళ్ళాక, ప్రదేశం నిర్మానుష్యం అయింది ! మార్గదర్శకులూ ఎవరూ లేరు వెంట !

అక్కడ పశువుల్ని మేపుకునే కుర్రవాడు ఒకడు కనిపించాడు. శరీరపురంగు ఎర్రనిదే అయినా మురికి పట్టివుంది. వర్షానికి మట్టికొట్టుకు పోయిన చోట శరీరం మెరుస్తోంది. నెత్తిన కొబ్బరిచిప్పలాంటి టోపీ. గిలకల్ని తాకుతూన్న పీలికలైన మురికిచొక్కా ! నన్ను చూడగానే ఆ కుర్రవాడు దగ్గరకు వచ్చి 'సలాంసాబ్ ! పైసా !'అని చెయ్యిచాపాడు.

ఆ రోజుల్లో కాశ్మీరీ బాలుర సర్వసాధారణమైన ప్రవర్తన అది ! సలాంపెట్టి ఇనాం అడుగుతూ వుంటారు. దొరలు తమ అహంకారాన్ని పూరించుకోడానికి, అలా అడిగేలా కుర్రవాళ్ళను ప్రోత్సహిస్తూ వుంటారు

"నేను అల్‌పత్తర్ వెళ్ళాలి దారి చూపుతావా ?" అని అడిగాను ఆ కుర్రవాణ్ణి.

చూపుతానన్నాడు కుర్రవాడు.

మరికొంత పైకి ఎక్కాక ఓ చిన్న మైదానం కనుపించింది. మైదానంలో మంచు గడ్డకట్టుకుని వుంది. అంచుల్లా కంకర రాళ్ళ ప్రదేశం ! అదే అల్‌పత్తర్ ! కొండ ఎక్కిన పరిశ్రమవల్లా, రైనీకోటును వేసుకుని వుండడంవల్లా ఆ విపరీతమైన చలిలోనూ చెమటపోస్తున్నది ! మంచు మైదానంలో నాలుగు అడుగులు వేసి చూద్దామనిపించింది. రెండు అడుగులు వేశానోలేదో కాలుజారి క్రింద పడ్డాను. లేచి ఇవతలకి రావడానికి ఎంతో ప్రయత్నించాను. కానీ, ప్రయోజనంలేకపోయింది. మంచు సిమెంటు, కాంక్రీటులా గట్టిపడి వుంది. కాలు మోపినిలబడనీయడంలేదు. చివరకు అలసిపోయాను. సహాయంకోసం ఆకుర్రవాడి వైపు చేయిచాచాను. అతడు కంకర అంచున నిలబడి తనచేతి కర్రను నాకు అందించాడు. అతడి సాయంతో ఇవతలికి రాగలిగాను. బాగా అలసిపోయానేమో ఆయాసం వచ్చింది.

మైదానం కొసల్న కంకరరాళ్ళల్లో కూచుని ఆ కుర్రవాడితో మాట్లాడుతూన్నాను. క్రింద కంకరరాళ్ళలో గాజు పెంకులు కనిపించాయి. గాజు పెంకులను కుర్రవాడికి చూపుతూ 'అవేమిటి ?' అడిగాను.

ఆ కుర్రవాడు తన కుడిచేతి వేళ్ళను ఎడమచేతి మణికట్టు చుట్టూ తిప్పుతూ వచ్చీరాని హిందీలో 'గాజు' అని చెప్పాడు. నాలుగురోజుల కితం ఇక్కడికో సేటుజీ వచ్చాడు. అతడి వెంట అతడి భార్య, కూతురూ వున్నారు. ఇక్కడ డేరావేసుకుని ఆ రాత్రిని గడిపారు. కూతురు చేతిగాజు పగిలి వుంటుంది. ఆ సేటు ఈ కుర్రవాడికి నాలుగు అణాలు కూడా ఇచ్చాడుట ! వాళ్ళు కనుమల వద్దనుండి కులీల భుజాలమీద ఎక్కి వచ్చారుట !

సేటుజీ కూలీల బుజాలమీద ఎక్కిరావడాన్ని గురించి చాలా ఆదరభావంతో చెప్పాడు; కాశ్మీరీ కుర్రవాడు ! వీళ్ళు తమ బుజాలమీద ఎక్కి సవారీ చేసిన వాణ్ణి ఎంతో గౌరవిస్తారు !

కాశ్మీరు ప్రజలు భారతీయులకంటే ఇంగ్లీషు వాళ్ళనే ఎక్కువగా గౌరవిస్తూంటారు ! అందుకు కారణం; ఇంగ్లీషు వాళ్ళనుండీ వీళ్ళకు నాలుగు డబ్బులు ఎక్కువగా ముడుతూవుంటాయి ! వీళ్ళకు ఇంగ్లీషు వాళ్ళపట్లకల గౌరవం. కుక్క తన ఎజమానిపట్ల చూపే విశ్వాసం లాంటిది ! ఆరోజుల్లో కాశ్మీరు నుండి ఇంగ్లీషువాళ్ళను వెళ్ళగొట్టడానికి ఉద్యమం గనుక ప్రారంభించినట్టయితే, కూలీనాలీ చేసుకునే సాధారణ కాశ్మీరు ప్రజలు ఆ ఉద్యమాన్ని తప్పకుండా వ్యతిరేకించేవారు ! అలాంటి కాశ్మీరు ప్రజలు ఈనాడు 'కాశ్మీరు కాశ్మీరు ప్రజలదే'నని ఘంటాపథంగా చెప్తూన్నారు. వెనుకటిస్థితికీ, ఇప్పటిస్థితికీ ఎక్కడా పోలికేలేదు. మానవుడు, బతుకుదెరువుకూ, పరిస్థితులకూ అనుగుణంగా మారుతాడన్న సత్యం దీన్నిబట్టి స్పష్టం అవుతూన్నది !

నేనూ ఆ కుర్రవాడికి నాలుగు అణాలు ఇచ్చాను. సేటు పొందిన గౌరవాన్నే నేనూ పొందాలన్న కాంక్ష నా అంతరాంతరాల్లో ఎక్కడో పనిచేస్తూవుండి వుంటుంది. చలికాలంలో ఆ పరిసరంలో ఎటుచూసినా మంచు నిండివుంటుందని చెప్పాడు కుర్రవాడు.

"మరి చలికాలంలో నువ్వేమితొడుక్కుంటావ్ ?" అని అడిగాను.

కుర్రవాడు తన మురికి చొక్కాను చేత్తోతాకి "దీన్నే తొడుక్కుంటాను. మేమసలు చలికాలం ఇక్కడ వుడం ! కిందికి వెళ్ళి పోతాం ! చలికాలం దొరలు కిందికి వెడతారుగా ? ఇంక మేము ఇక్కడ వుండి ఏం చేస్తాం ?" అని అన్నాడు.

మర్నాడు కూడా గుల్మర్గలో అలాగే వర్షంకురుస్తూన్నది. నేను గదితీసుకున్న హోటలుకు లాహోరు నుండి ఉర్దూదినపత్రిక వస్తుంది ! లాహోరు కుట్రకేసుకు సంబంధించిన ముద్దాయిల

వాఙ్మూలాల్ని పత్రికల్లో వేస్తున్నారు. భగత్‌సింగ్ లాహోరు కోర్టులో, విప్లవాన్ని ఆవాహనంచేస్తూ, బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇచ్చిన అద్భుత, సాహసోపేతమైన వాఙ్మూలాన్ని పత్రికలు ప్రకటిస్తూన్నాయి. ఆ వాఙ్మూలాన్ని గురించి ఎవరూ తర్కించేవారుకాదు. ఐతే, దాన్ని పెద్దగా ఇతర్లు వినేట్టు చదువుతూండేవారు. చదువుతూన్నప్పుడు చదువరుల స్వరంలో గర్వం, అభిమానం ధ్వనించేవి ! మూడవరోజు వర్షం ఆగిపోయింది. ఝుంగ్ యువకులు వర్షానికీ, చలిగి విసిగి శ్రీనగర్ వెళ్ళడానికి సిద్ధం అయ్యారు. వాళ్ళతోపాటు నేనూ బయలుదేరాను. అప్పటికి దేవదత్తశర్మ వచ్చివుండవచ్చుననీ అనుకున్నాను !

గుల్‌మర్గ నుండి వచ్చేప్పుడు, ముగ్గురు యువకుల్లో ఒకతను పసిరికమైదానాన్ని, ఆ మైదానంపై విహరిస్తూన్న మేఘశకలాల్ని చూపుతూ "ఈ సౌందర్యం కంటె నా దేశపు ఎండలూ, వడగాలి, ఎండు ప్రకృతి- నాకు నచ్చుతాయి !" అన్నాడు, జన్మస్థానపు మమకారాన్ని హృదయంలో ప్రోదిచేసుకుంటూ.

శ్రీనగర్ వెళ్ళాక యువకులు నన్నూతమతోపాటే వుండమని బలవంతం చేశారు. వాళ్ళు శ్రీనగర్‌లో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. వంట సొంతంగానే వండుకునేవాళ్ళు ! ఒక్కోప్పుడు హోటలుకు వెళ్ళిభోంచేసేవారు ! నా సూటుకేసునూ వాళ్ళగదిలోనే పడేశాను. మేజిస్ట్రేటు గారు ఇంట్లోవుండని సమయాన్ని చూసి దేవదత్తశర్మను కల్సుకోడానికి వెళ్ళాను !

నన్నుచూసి దేవదత్తశర్మ చకితుడయ్యాడు. ఐతే, తన ఆశ్చర్యాన్ని పైకి కనబడనీయలేదు. మేమిద్దరమూ అక్కడ మాట్లాడుకోలేదు. బయటికి వెళ్ళిపోయాము ! షికారా (చిన్నపడవ) నొకదాన్ని తీసుకుని 'చినార్‌నాలా' గుండా 'డల్‌జీల్' లోకి వెళ్ళాము. మా మాటలు ఎవరూవినని ఏకాంతంలో ఇంగ్లీషులో మాట్లాడుకున్నాము. హిందీలో మాట్లాడుకుంటే షికారా నడిపే బెస్త వినవచ్చును !

ముందుగా దేవదత్తశర్మకు ఒక వాగ్దానం చేశాను. "మనం ఇలా కల్సుకోడాన్ని గురించి భగవతీభాయికి తప్ప మరి ఇంకెవరికీ తెలియదు. భవిష్యత్తులో కూడా ఈ విషయం మా యిద్దరిలోనేవుంటుంది. ఇతర విప్లవసంఘ సభ్యులకు కూడా తెలియనీయను ! మేమిద్దరం ఏ స్థితిలోనూ నిన్ను కల్సుకున్నట్టు బయటపెట్టం ! ఔసరం అయితే ప్రాణాలయినా ఇస్తాంగానీ, నీకు హానిజరగనీయం !" అన్నాను.

ఒక గంటసేపు మా షికారా డల్‌జీల్‌లో వుంది. దేవదత్త శర్మ చాలాసేపు మెరుస్తూన్న అలలవంక చూస్తూ. ఆలోచిస్తూ కూచున్నాడు. చిరకు తన సమ్మతిని తెల్పుతూ "నేను - పిక్రిక్ యాసిడ్ తయారు చేయడానికి ప్రయోగాలు చేశాను. ఐతే,విధానం నీకుచెప్పడానికి ఇప్పుడు నోటికి జ్ఞాపకంలేదు ! పుస్తకాలు తిరగవేయాలి ! ఇక్కడి కాలేజి గ్రంధాలయంలోని పుస్తకాల్ని చూడాలి ! సంతృప్తికరంగా వివరాలు దొరికితే తప్పకుండా చెప్తాను: ఐతే, రెండు మూడురోజులు పట్టవచ్చు" అన్నాడు శర్మ.

తరువాత శర్మ నేను ఎక్కడవుంటున్నదీ అడిగాడు. అడ్రసు చెప్పాను. "నువ్వు అక్కడవుంటే వీల్లేదు. నేను అక్కడికివచ్చి నిన్ను కల్సుకోను ! నీతో నేను మాట్లాడినట్లు ఇంకోరికి తెలియడానికి వీల్లేదు" అని అన్నాడు.

ఎలాగో తంటాలు పడి 'హౌసుబోటు' నొకదాన్ని అద్దెకు తీసుకున్నాను. అసలా హౌస్‌బోటును ఓ ఇంగ్లీషువాడు అద్దెకు తీసుకున్నాడు. అతడు వేటకు దూరప్రదేశానికి వెళ్ళాడు. పది పదిహేనురోజుల వరకూరాడు. అతడు వచ్చేవరకూ బోటునువూరకా వుంచడం దండుగ: మరెవరికయినా అద్దెకు ఇచ్చి నాలుగు డబ్బులు చేసుకోవాలని చూస్తున్నాడు సొంతదారుడు ! నాకాబోటు చాలా తక్కువ అద్దెకు దొరికింది. అసలు కాశ్మీర్‌లో ఒక ఆచారంవుంది. ముందు విపరీతమైన ధర చెప్తారు. తరువాత

కారుచౌకగా అమ్ముతారు. పది రూపాయలు చెప్పిన వస్తువుని ఒక్కరూపాయికి అమ్మేస్తారు ! 'చినార్ నాలా'లోని నా హౌస్‌బోటు నంబర్ని దేవదత్తశర్మకు చెప్పాను.

'హౌస్‌బోట్లు' (నావ ఇళ్ళు) కొన్ని రెండతస్తులవికూడా వుంటాయి. ఎంత చిన్న హౌస్‌బోటులోనయినా రెండు గదులు, ముందు వసారా స్నానాల గది, డ్రాయరు, కుర్చీలు, మంచం - ఇవన్నీ తప్పకుండా వుంటాయి ! కరెంటుకూడా ఏర్పాటువుంటుంది.

హౌస్‌బోట్లు ఒడ్డున లంగరు వేసుకుని వుంటాయి. ఐతే, అవుసరం అయినప్పుడు నీళ్ళల్లో తమ ఇష్టంవచ్చిన చోటికి తిరుగుతూ వుంటాయి. చినార్‌నాలా, డల్‌జీల్, జీలం నదీ-వీటిల్లో ఎన్నో హౌస్‌బోట్లు అటూ ఇటూ తిరుగుతూ కనిపిస్తూవుంటాయి. సాక్షాత్తూ ఇండ్లు నీళ్ళల్లో ఒకచోటినుంచీ మరో చోటికి వెడుతూన్నట్టుగా వుంటుంది.

కాశ్మీర్‌లో ఒక్క ఇండ్లేకాదు, చేలుకూడా ఒకచోటినించీ మరో చోటికి ప్రయాణం చేస్తుంటాయి. వెదురు వాసాల్తో తెప్పల్లాకట్టి, వాటి మీద చెత్తాచెదారం వేసి మట్టి పోస్తారు. ఇంక వాటిమీద కూర పాదుల్ని పెట్టి దోస, దొండ, టొమేటో - మొదలైన కూరల్ని పండిస్తూంటారు ! ఈ కూర మళ్ళు నీటిపై తేల్తూ ఒక చోటినించీ మరో చోటుకి ప్రయాణమూ చేస్తూ వుంటాయి ! ఒక్కోమాటు ఈ కూర మళ్ళను దొంగలు తీసుకు పోవడమూ జరుగుతూవుంటుంది !

దేవదత్తశర్మ కోసం ఎదురుచూస్తూ హౌస్‌బోటులో విశ్రాంతి తీసుకుంటున్నాను. బోటుతోపాటు ఓ చిన్న పడవకూడా వుంటుంది ! దాన్ని 'షికారా' అంటారు. ఒడ్డుకు రావడానికీ, తిరిగి హౌస్‌బోటు దగ్గరకు వెళ్ళడానికీ ఉపయోగిస్తారీ 'షికారా'ను !

హౌస్‌బోటుతో పాటు సొంతదారుడు (పల్లెకారి) ఎప్పుడూ సిద్ధంగా వుంటాడు. అద్దెకు తీసుకున్న వ్యక్తి షికారు తిరిగి రావాలనుకున్నప్పుడు, సొంతదారుడు తిప్పుకువస్తాడు. నేను దేవదత్తశర్మ కోసం ఎదురుచూస్తూ హౌస్‌బోటులో పడుకుని ఏదో ఒక నవలను చదువుకుంటూ వుండేవాణ్ణి ! బాగా విసుగుపుట్టినప్పుడు ఎటయినా షికారు వెళ్ళేవాణ్ణి ! శ్రీనగర్ బజార్లల్లో తిరిగేవాణ్ణి కాదు. లాహోరులోని పరిచయులు ఎవరైనా కనుపిస్తారేమోనన్న అనుమానం వేధించేది ! అందుకని 'షికారా'లో 'డల్‌జీల్' 'హార్బన్', 'శకంరాచార్య' మొదలైన చోట్లకు షికారుగా వెళ్ళి వస్తూండేవాణ్ణి !

'డల్‌జీల్' లోతు ఎక్కువ, నీళ్ళు తళతళ మెరుస్తూ స్వచ్ఛంగా వుంటాయి. మూడు నాలుగు నిలువులలోతులో, అడుగున పడివున్న రంగు రంగుల రాళ్ళు పైకి చాలా చక్కగా కనపడుతూంటాయి. వడ్డున పెద్ద పెద్ద తామరలు పరుచుకుని వుంటాయి. దట్టంగా పరుచుకున్న తామరాకులవల్ల నీళ్ళు కనుపించవు ! తీరానకల 'మజనూ' వృక్షాలు నదిలోకి వంగి మహా అందంగా వుంటాయి. తీరానికి దాపున పడవల్లో తిరిగే వారికి వంగిన 'మజనూ' వృక్షపు కొనలు తలలకు తగుల్తూవుంటాయి. పడవలు తమ మీదకి వచ్చినప్పుడు తామర పూవులూ, ఆకులూ నీటిలోకి మునిగిపోతాయి. పడవ సాగిపోగానే పైకి వస్తాయి ! పడవలు తామరపూవులమీదుగా వెడుతూన్నట్టుంది .... ఎంతో అందమైన దృశ్యం ! డల్‌జీల్ ఓ పెద్ద సరోవరం ! ఆరుమైళ్ళ పొడవు, రెండు మైళ్ళ వెడల్పు వుంటుంది ! ఒక్కోప్పుడు సముద్రంలా పెద్దపెద్దఅలలూ లేస్తూంటాయి ! దూరంగా క్షితిజంలో నల్లని పర్వతాలు, వాటి వెనుక తెల్లని హిమగిరి శిఖరాలు ... అందాలు చిందే ప్రకృతి దృశ్యం !

నీటి అలలమీద పడి మెరిసే ఎండ అతిమోహకంగా వుంటుంది. యూరోపియన్ దంపతులు పొద్దస్తమానం డల్‌జీల్‌లో ఈదుతూ, మునకలు వేస్తూ కనుపిస్తూనే వుంటారు ! నేను పొద్దుగూకులూ తామర ఆకుల మీదా, పూల మీదా - పడవలో కూచుని, అటూ ఇటూ తిరుగుతూండే వాణ్ణి !

బాంబుల్ని చేయడానికి అవుసరం అయిన వివరణ దొరుకుతుందన్న విశ్వాసం కుదిరింది. దేవదత్త దగ్గర వివరణ తీసుకున్న తరువాత, నేను తిరిగి వెళ్ళి బాంబుల్ని చేయడంలో నిమగ్నం కావాలి. శక్తివంతమైన ప్రేలుడు పదార్థాన్ని తయారు చేసుకుని, దాంతో బాంబుల్ని కూరుకుని, వైస్రాయి ట్రయిన్ క్రింద పెట్టాలి ! వైస్రాయి ట్రయిన్‌ని పడగొట్టాలి. బహూశ, ట్రయిన్‌ని పడగొట్టడానికి నేనే వెళ్ళవచ్చును. వైస్రాయిగానీ, గవర్నర్‌గానీ ప్రయాణం చేసేప్పుడు రైల్వే లైనుకు రెండు వైపులా సశస్త్రులైన పోలీసులు కాపలా వుంటారు ...

వైస్రాయి ట్రయిన్ కింద బాంబు పేల్చడానికి నేనే వెడతాను. భగవతీభాయి వెనుక వుంటాడు. బాంబు పేల్చాక పట్టుకోడానికి వచ్చిన పోలీసుల్తో పోరాడుతూ అక్కడే చనిపోతాను. ఒకవేళ బతికి పట్టుబడితే ఉరిశిక్ష తప్పదు ..... నేను 'షికారా'లో కూచుని, నదీ జలాలవైపు ఏకాగ్రంగా చూస్తూ నా మృత్యువును గురించి ఆలోచించుకుంటూ ఉండేవాణ్ణి ! ఏ విధంగా చూసినా చావు మాత్రం ఖాయం. తుపాకి గుండుకు ఎరకావడమో ! ఉరికొయ్యకు వేళ్ళాడడమో ! తప్పదు ! వివరణ లభించాక, ఇంక ఆటే ఆలస్యం వుండదు. మహా అయితే ఒక్క మూణ్ణెల్లు !

మూడు నెల్లని ఎందుకు అనుకున్నానంటే - అప్పటికి వైస్రాయి సిమ్లా నుండి ఢిల్లీకి తిరిగివస్తాడు. అప్పుడే బాంబు పేల్చేయాలని నా వుద్దేశం ! అప్పటి నా ఊహలు ఇప్పటికీ బుర్రలో సజీవంగా వున్నాయి. కాశ్మీరు ప్రపంచంలోకే అందమైన ప్రదేశం. అలాంటి సుందర ప్రదేశంలో, నావలో విహరిస్తూ, కమలదళాల్ని చూస్తూ - నా గొంతుకు ఉరితాడును నేనే పేనుకుంటూ వుండేవాణ్ణి ! ఎంత విచిత్రమైన విషయం ! ఇప్పుడావిషయాల్ని జ్ఞాపకం చేసుకుంటే పెదాలమీద చిరునవ్వు తాండవిస్తుంది.

నావలో ఆ నాలుగు రోజులూ నేనెంతో సౌఖ్యాన్ని, విశ్రాంతినీ అనుభవించాను. అంతవరకూ గడిచిన నా అల్ప జీవితంలో అంతటి సౌఖ్యాన్ని నేను ఎన్నడూ అనుభవించలేదు. ఆ నావలో, సుఖాన్ని అనుభవిస్తూ కూడా, ఆ సుఖానికి నేను తగను అన్న భావన నా మనస్సును వీడలేదు. 'ఎరువు సొమ్ము బరువు చేటు' అన్నట్టుగానే నేనా నాలుగు రోజులూ నావలో గడిపాను. మృత్యువును ఆహ్వానిస్తున్న నేను ఆ సౌఖ్యాన్ని అనుభవించలేక పోయాను. వెనుక ఒక మాటు నాటకంలో భోజరాజు వేషం వేశాను. ఎంత మహారాజులా వేషం వేసుకుని, సింహాసనం మీద కూచున్నప్పటికీ, నేను మహారాజును కానని తెలుస్తూనే వుంది. మొన్న ఈ మధ్య 1952లో నేను వ్రాసిన 'నశేనశేకీబాత్' నాటకంలో తాగుబోతు వేషం వేశాను. ఎంత నేను తాగినట్టు నటించినా, తాగుబోతును కాదని తెలుస్తూనే వుంది ! అలాగే ఆ నలుగు రోజులూ నావలో సర్వసుఖాలూ అనుభవిస్తూ కూడా ఆ సుఖాలు నావికావన్న విషయాన్ని మరువలేదు నేను.

ఒకరోజు మధ్యాహ్నం దేవదత్తశర్మ వచ్చాడు. అతడి జేబులో, ఇంగ్లీషులో రాయబడిన కాగితం ఒకటుంది. మొదలు అతడు నాకు 'ప్రేలుడు' తత్వాన్ని గురించి కొంతసేపు చెప్పాడు. తరువాత 'పిక్రిక్ యాసిడ్'ని తయారు చేసే విధానాన్ని గురించి చెప్పాడు. అనంతరం తన జేబులోని కాగితంలో రాసిన నోట్సును నన్ను నా స్వదస్తూరితో విడిగా రాసుకోమన్నాడు. కొన్ని పుస్తకాల పేర్లు చెప్పాడు. ఆ పుస్తకాల్లో ఏ పేజీ నుండి ఏ పేజీ వరకు మాకు ఉపయోగిస్తుందో కూడా చెప్పాడు .... రెండు రోజుల్లో అక్కడి పని పూర్తయింది !

మర్నాడు మధ్యాహ్నం శ్రీనగర్ నుండి రావల్‌పిండికి బయల్దేరాను. బస్సుస్టాండ్‌లో పంజాబ్ సి.ఐ.డి. పోలీసులు అధికంగా ఉంటారని తెల్సు. బస్సుస్టాండ్‌లో ఎక్కువసేపు నిలబడకుండా వెంటనే వెళ్ళిపోవడం ఎలాగా ? అని ఆలోచిస్తున్నాను. ఇంతలో ఒక బస్సు డ్రయివరు నా దగ్గరకు వచ్చాడు. "నా బస్సు ఖాళీగా రావల్‌పిండి వెడుతోంది. వస్తే రాండి ! నేరుగా వెళ్ళవచ్చు !" అన్నాడు.

నేనతడి బస్సులో కూచున్నాను. బస్సు వెంటనే బయలుదేరింది. పట్నం చివరకు వెళ్ళాక బస్సును ఆపాడు. పక్క సందులోనుండి ఇద్దరు స్త్రీలు వచ్చారు. బస్సులో ఎక్కారు. వాళ్ళకోసమే బస్సు ఆపాడు. అ యిద్దరిలో ఒకామె అందమైన యువతి ! నల్లని బురకావేసుకుంది. రెండవ స్త్రీ మధ్య వయస్కురాలు. మొద్దు దుప్పటి నొకదాన్ని కప్పుకుంది !

ఇద్దరు స్త్రీలూ ఎక్కాక బస్సు బయలు దేరింది. డ్రయివరు మహా వేగంగా నడుపుతున్నాడు బస్సును. నేనొక మాటు ఓరగా బస్సులోని నవయువతివంక చూశాను. అద్భుతమైన సౌందర్యవతి ! డ్రయివర్ కూడా అప్పుడప్పుడూ వెనక్కు తిరిగి నవయువతి వంక చూస్తూన్నాడు. ఆమె సౌందర్యం డ్రయివర్ని పిచ్చివాణ్ణి చేసింది ! 'డ్రైవరు ఈమెను లేపుకుపోవడానికి ఒట్టి బండిని రావల్పిండికి తీసుకుపోతున్నాడని' అప్పుడు అర్థం చేసుకున్నాను ! తీవ్ర వేగంతో బండిని నడుపుతూన్నాడు. 'టర్నింగ్' వచ్చినప్పుడు బస్సు పడిపోతుందేమో అనిపిస్తూన్నది.

'ఇంత వేగంగా ఎందుకు పోనిస్తావ్ ? యాక్సిడెంటు అవుతుంది !' అన్నాను నేను డ్రయివర్‌తో.

'అలస్యం అయితే 'దోమేల్' దగ్గర దారి మూసేస్తారు.' అన్నాడు డ్రయివర్.

శ్రీనగర్ నుండి రావల్పిండి వెళ్ళే బస్సుల్ని 'దోమేల్' లోగాని, లేకపోతే 'కోహాలా'లో గాని ఆపేస్తారు. అ పర్వత మార్గాల్లో రాత్రి పూట బస్సుల్ని నడపనీయరు. డ్రయివరు 'దోమేల్' దాటాక బస్సును అడ్డదారికి మళ్ళించాడు.

నేను మళ్ళీ "ఎక్కడికి పోనిస్తున్నావ్ ?" అనడిగాను.

"భయపడకండి. ఎబటాబాద్ మీదుగా చాలా తొందరగా రావల్పిండి తీసుకువెళ్ళి దింపుతాను !" అన్నాడు డ్రయివర్.

బస్సు పశ్చిమోత్తర ప్రదేశపు సరిహద్దు గుండా వెడుతూన్నది. ప్రమాదకరమైన పర్వత మార్గాన ఏ మాత్రం వేగాన్ని తగ్గించకుండా పోనిస్తున్నాడు బస్సును డ్రయివర్. ఆకాశం మేఘావృతమైంది. దట్టమైన అంధకారం ... అయినా కారు వేగం తగ్గలేదు ! తీక్షణమైన బస్సు లైట్లకాంతి అంధకారాన్ని చీల్చుకు వెడుతూన్నది. అర్ధరాత్రి అయింది.

దారి ప్రక్కన ఒక పఠాన్ నిలబడి వున్నాడు. అతడి చేతిలో మూట కూడా వుంది. బస్సును ఆపమని చేయి ఎత్తాడు. డ్రయివర్ బస్సును ఆపలేదు సరికదా, ఒక్క ఉదుటులో బస్సు వేగాన్ని మరికూడా పెంచి, దూసుకు పోయాడు.

నేను మళ్ళీ "ఏమిటిది ? ప్రయాణీకుణ్ణి ఎక్కించుకోవెందుకనీ !" అనడిగాను.

"ప్రయాణీకుడుకాదు. సరిహద్దు దోపిడీ దొంగ ! ప్రయాణీకుడిలా వేషం వేసుకుని, బస్సును ఆపి దోచుకుంటాడు ! స్పీడ్ తగ్గిస్తే టైర్లను తుపాకీతో కాల్చి బండిని పడేస్తాడు !" అన్నాడు డ్రయివర్.

ఇంకేం మాట్లాడగలను ? మౌనంగా వుండిపోయాను. ఆ నవయవ్వనవతి కారణంగానే డ్రయివరు ఇంత ప్రమాదకరమైన అడ్డదారికి బస్సును మళ్ళించాడు. బస్సు వెళ్ళిపోతూన్నది. వర్షం ప్రారంభం అయింది. చూస్తూండగానే పెద్దదయింది ! అంత వర్షంలోనూ, అదే వేగంతో నాటుదారిన బస్సును పోనిస్తున్నాడు. అప్పుడప్పుడు నవయువతి వంక, వెనుదిరిగి చూస్తున్నాడు. బస్సులోపల మసక కాంతిలో యువతి అస్పష్టంగా కనుపిస్తోంది. యువతిని చూసినకొద్దీ డ్రయివర్‌కు నిషా ఎక్కుతోంది. అతడి కండ్లు అరుణిమను దాలుస్తున్నాయి !

ఒక కాలువ అడ్డం వచ్చింది. వంతెనయినా లేదు. నీళ్ళు నడుముల వరకూ వుంటాయి ! డ్రయివరు ఒక్క క్షణం కారును ఆపాడు.

"వర్షం జోరుగావుంది. ఇంకాసేపు వుంటే ప్రవాహం ఎక్కువ అవుతుందేగాని తగ్గదు !" అన్నాడు డ్రయివరు. అంటూనే బస్సును కాలువలోకి పోనిచ్చాడు. అది కొండవాగు లోతుబాగానే వుంది. ప్రవాహ వేగమూ అధికంగానే వుంది. అతడి దుస్సాహసాన్ని వ్యతిరేకించాను.

"ఏమిటీ దుస్సాహసం ? ఇంజనులోకి నీళ్ళుపోతే బండి కాలవలోనే వుండిపోదా ? పైగా బండిలో బరువులేదు. తేలికగా వుంది. ప్రవాహ వేగానికి తల్లక్రిందులైతే ? అన్నాను.

డ్రయివర్ బస్సును వెనక్కునడిపి ఒడ్డుకు తీసుకువచ్చాడు. కొన్ని క్షణాలు ప్రవాహం వంక చూస్తూ వుండిపోయాడు. "వర్షం పెద్దదవుతోంది. కాలవలో అంతకంతకూ నీరు ఎక్కువ అవుతోంది ఇలా ఎంతసేపు పడుండాల్సి వస్తుందో ? వీల్లేదు. నేను ఇప్పుడే కాలువ దాటిస్తాను !" అన్నాడు డ్రయివర్.

"ఇప్పుడే దాటిస్తావా ?" అన్నాను.

"అంత భయపడతారేంటి సాబ్ !" అన్నాడు. డ్రయివర్ నిర్లక్ష్యంగా. ఇంకనేనేమీ మాట్లాడలేదు. నన్ను పిరికి వాడనుకుంటున్నాడేమోనని మనస్సులో బాధపడుతున్నాను !

డ్రయివర్ బండిని వెనక్కు నడిపాడు. కొంతదూరం వెళ్ళాక బండిని వెనక్కు తిప్పాడు. అంటే కాలువ వైపుకు బండి వెనుక భాగం వచ్చిందన్నమాట ! తీవ్రవేగంతో 'బ్యాక్' చేసుకుంటూ బస్సును కాలువ లోనికి పోనిచ్చాడు. చూస్తుండగానే బస్సు కాలువను దాటేసింది ! బండి బోల్తాకొట్టేదే, కొంచెంలో తప్పింది !

డ్రైవర్ సాహసికుడని వప్పుకోక తప్పలేదు. ఇంత సాహసమూ ఈ స్త్రీని గురించే కదా ? ఒక స్త్రీమీది ఆకర్షణ కారణంగా ఇతడింతటి సాహసాన్ని ప్రదర్శించాడు ! మృత్యువును కూడా లెక్క చేయలేదు. మరి నా ముందు వున్న ఆకర్షణ ఇంతకంటే గొప్పది కదా ? సమస్త దేశపు సంపూర్ణ స్వాతంత్ర్యం ! ఇంత గొప్ప ఆకర్షణ కోసం నేను ప్రాణాల్ని త్యాగం చేయడానికి సిద్ధపడడంలో ఆశ్చర్యం ఏముంది ? శ్రీనగర్ నుండీ ఢిల్లీ వెళ్ళేప్పుడు ప్రతి అడుగూ నేను మృత్యుముఖంలోకే వేస్తున్నట్టు అనిపించింది.

సూర్యోదయం అయింది. బస్సు 'రావల్‌పిండీ - పెషావర్' రైల్వే లైన్‌ను అనుసరించి వెడుతోంది. డ్రైవర్ బస్సును ఒక స్టేషన్ దగ్గర ఆపాడు. ఆ ఇద్దరు స్త్రీలూ అక్కడ దిగారు. అప్పుడే రావల్‌పిండి నుండి పెషావర్ వెళ్ళే రైలు పొగలు విరజిమ్ముకుంటూ వచ్చింది. ఇద్దరు స్త్రీలు ఆ రైల్లో ఎక్కారు. బస్సు రావల్‌పిండీ వైపు బయల్దేరింది. డ్రైవర్ తోటకూరకాడ అయ్యాడు. అతడిలోని ఉత్సాహం అంతా నశించింది. స్టీరింగ్‌మీద ఉన్న అతడి ముంజేతులు, మణికట్లు విరిచినట్టు ఏమాత్రం పటుత్వం లేకుండా కనుపించాయి !

శ్రీనరగ్ నుండి రావల్‌పిండి చేరాను. అక్కడి నుండి ఢిల్లీ వెళ్ళేప్పుడు లాహోరులో దిగి ఒక రాత్రిని అక్కడ గడిపాను. వైస్రాయి ట్రయిన్ క్రింద బాంబు పేల్చే సందర్భంలో ఇంద్రపాల్ సహాయాన్ని అర్థిద్దామని ఉద్దేశం ! అతడితో మాట్లాడాలనే లాహోరులో దిగాను. "విప్లవ సంఘానికి నీ అవసరం కలిగితే ఇల్లూ వాకిలీ విడిచి వచ్చేయగలవా ?" అనడిగాను ఇంద్రపాల్‌ను.

ఇంద్రపాల్ అన్నాడు "నాతోపాటు నా తమ్ముళ్ళు ఇద్దరు వుంటున్నారు ఇక్కడ ! ఒక్క వారం రోజులు ముందు గనక చెపితే, వాళ్ళకు మరోచోట ఆశ్రయాన్ని ఏర్పాటు చేసి నేను వచ్చేస్తాను !"

బాంబులు చేసే విధానం చేచిక్కాక ఎంతో ఉత్సాహం వచ్చింది నాకు ! ఇంద్రపాల్ ఇలా తను వచ్చేయడానికి అంగీకరించడంతో నా ఉత్సాహం రెట్టింపయింది !

# ఢిల్లీ, రోహతక్‌లో బాంబులు తయారయ్యాయి

నేను ఢిల్లీ రాకముందే భగవతీభాయి ఓ యింటిని అద్దెకు తీసుకున్నాడు. ఆ యిల్లు 'నయాబజార్'లోనో లేక 'శ్రద్ధానంద బజార్' పక్క గొందిలోనో వుంది అనుకుంటాను. మేడ పై భాగాన్ని అద్దెకు తీసుకున్నాడు. కింద గోదాములుండేవి ! ముందు వరండా, ఒక ప్రక్కన వంట గది. మరో పక్కన స్నానాల గది, పాకీదొడ్డి ! ముఖద్వారానికి అటూ ఇటూ రెండు గదులు. వనుక వైపునా అలాగే రెండు గదులు వున్నాయి. ముందువైపు ఉన్న రెండు గదుల్లో ఒకదాంట్లో మేము వుంటున్నాము. రెండవదాన్లో ఓ మాస్టర్‌గారూ, హిందూ కాలేజీలో చదివే విద్యార్థి ఒకతనూ, ఢిల్లీ సెక్రటరియేట్‌లో పనిచేసే క్లర్కు ఒకతను కల్సివుంటున్నారు. మాస్టర్‌గారి పేరు సుందర్‌లాల్ అనుకుంటాను. గంభీరమైన స్వభావం కల వ్యక్తి. క్లర్కు పేరు గిరిధారీలాల్. అతడిది 'ఫరీదాబాద్' వీరిద్దరు వంటచేసి పెట్టడానికి ఒక బ్రాహ్మణ్ణి కుదుర్చుకున్నారు. ఢిల్లీలో వంట బ్రాహ్మణ్ణి 'పరసాది' అంటారు. భగవతీభాయి నేనూ - కూడా భోజనం విషయంలో వాళ్ళతో కల్సిపోయాం ! 'పరసాది' అందరికీ కలిపి ఉమ్మడిగా వంట చేసేవాడు. ఖర్చు సమానంగా వేసుకునేవాళ్ళం. తక్కువ ఖర్చుతో మంచి భోజనం లభించేది.

నేను బాంబులు తయారు చేసే విధానాన్ని తెల్సుకురావడంతో భగవతీభాయి పరమానందపడ్డాడు. ఉత్సాహితుడయ్యాడు. వైస్రాయి ఎప్పుడు వస్తాడు ? ఎప్పుడు వెడతాడు ? తారీకు, సమయం తెలియడం ఎలా ? అన్న ప్రశ్నలు మాలో అప్పుడే ఉదయించసాగాయి. వైస్రాయి వెళ్ళేప్పుడు రైల్వేలైన్లకు కాపలా వుంటుందా ? బాంబుల్ని పట్టాల క్రింద పెట్టడం ఎలా ? బాంబులను పేల్చే బాధ్యత ఎవరిది ? ఎవరు పేల్చడానికి వెళ్తారు ? ఎలా వెళ్ళాలి ? మొదలైన ప్రశ్నలు మా బుర్రల్లో అప్పటికే స్థానాన్ని ఏర్పరచుకున్నాయి. బాంబుల్ని పేల్చడానికి 'నేను వెళ్తా'నన్నాను. 'కాదు నేనే వెళ్తా' నన్నాడు భగవతీభాయి. చివరకు ఓ రకంగా సరిపెట్టుకున్నాం. "అసలు బాంబులు తయారుకానీ ! తరువాత ఎవరు వెళ్ళేది నిర్ణయించుకోవచ్చు !" అనుకున్నాం.

దేవదత్తశర్మ చెప్పిన విధానాన్ని అక్షరాక్షరం భగవతీభాయికి చెప్పి వినిపించాను. సాంతం విని "నేను కాలేజీలో రసాయన శాస్త్రాన్ని చదివాను. కనుక, నేనే బాంబుల్ని తయారు చేస్తాను !" అన్నాడు భగవతీభాయి. "మొదలు సామాన్లను రానీ, ఎవరు తయారు చేయడమో తరువాత ఆలోచిద్దాం !" అన్నాను నేను. బాంబుల్ని తయారు చేయడానికి అనుకూలమైన ప్రదేశం ఏది ? అన్న సమస్యా మమ్ముల్ని వేధించసాగింది. 'మర్కరీ ఫల్మనేట్'ను తయారు చేసేప్పుడు విపరీతమైన పొగ, దుర్గంధమూ వ్యాపిస్తుంది. ఐనప్పటికీ, ఇతర్ల దృష్టిని ఆకర్షించని ప్రదేశంగా వుండాలి.

భగవతీభాయి ఇలా అన్నాడు "ఈ మహాపట్నంలో, ఒకరినొకరు శంకిస్తూడే ఈ క్రిక్కిరిసిన ఇరుకు గొందుల్లో కంటే, ఈ పనికి ఒక మోస్తరు పల్లెటూరును ఎన్నుకోవడం నయం !" అని క్షణం ఆగి 'దగ్గర్లో "రోహతక్" వుంది. అక్కడ వైద్యుడు, ఒక యువకుడు వున్నాడు. అతడు గనుక వప్పుకుంటే ఈ పనికి 'రోహతక్' అనువైన ప్రదేశం ! ఆ యువకుడు వెనకకొన్నాళ్ళు లాహోరులో వుండి వైద్యం నేర్చుకున్నాడు. అప్పుడు నౌజవాన్ భారత సభ కార్యక్రమాల్లోనూ పాల్గొన్నాడు. అతడు గనక వప్పుకుంటే కొత్త మందులు తయారు చేస్తున్నట్లు నటించి, పాదరసం, గంధకం పుటం పెడుతూన్న వంకతో 'మర్కరీ ఫల్మనేట్' తయారు చేసుకోవచ్చును !" అన్నాడు.

భగవతీభాయి రోహతక్ వెళ్ళాడు. తనకు పరిచయుడైన వైద్యుడు లేఖ్‌రాంతో మాట్లాడాడు. లేఖ్‌రాం తాను సహకరిస్తానని వప్పుకున్నాడు. ఒక సమస్య తీరింది. మేము ఢిల్లీలో అవసరం అయిన సామాగ్రినీ, పదార్థాలనూ కొనడం ప్రారంభించాం ! నేరుగా దుకాణానికి వెళ్ళి అవసరం అయిన వస్తువులన్నింటినీ ఒకేరోజు కొనడానికి వీలులేదు ! కొన్ని వస్తువుల్ని పరిచయుల ద్వారా కొనిపించి తెప్పించుకున్నాం ! కొన్నింటిని మేమే ఒకటీ అరా చొప్పున కొని తెచ్చుకున్నాం ! సామానులన్నింటినీ కొనుక్కోడానికి ఎటూ కొన్నాళ్ళు పట్టింది. మధ్యమధ్యా సమయం దొరికినప్పుడు రైల్వేలైన్ల వెంట కొంతదూరం వెళ్ళి ఎక్కడ బాంబు పెట్టడానికి వీలుగా వుంటుందో చూసి వస్తూండేవాళ్ళం ! తరచు 'ఢిల్లీ - అంబాలా', 'ఢిల్లీ - భటిండా' మొదలుగాగల రైల్వేలైన్లను పరిశీలిస్తూండేవారం.

ఇన్నాళ్టిలో వెనుకటి పరిచయాల ఆధారంగా విప్లవ సంఘంపట్ల సానుభూతి గల కొందరు మిత్రుల్ని ఏర్పరచుకోగలిగాము. కొంత డబ్బు కూడా దొరుకుతూనే వుంది. లాహోరు కోర్టులో భగత్సింగ్ కేసు నడుస్తూంది. అతడి వాఙ్మూలం పత్రికల్లో ప్రకటితమవుతోంది. ప్రజల్లో కొంత సంచలనమూ, విప్లవ సంఘం పట్ల సానుభూతి కలుగుతున్నాయి. ఐదూ, పది రూపాయలు అవుసరం అయితే పుడుతూన్నాయి ! అవుసరానికి ఒక పూట తల దాచుకునే ఆశ్రయాన్ని ఇస్తున్నారు ప్రజలు ! ఇలాంటి ఆశ్రయస్థానాల్ని మేము 'సెల్టర్' అనిగానీ 'సోర్స' అనిగానీ అంటాం ! ఈ 'సెల్టర్'లు చాలా ముఖ్యమైనవి. మనం వున్న ప్రదేశం మీద పోలీసుల కన్ను పడ్డదని తెల్సినప్పుడు, ఊరు వదిలిపెట్టకుండా, తాత్కాలికంగా ఈ ఆశ్రయస్థానాల్లో తలదాచుకోవచ్చును ! లేకపోతే, ఇతర కార్యకర్తలు ఎవరైనా వచ్చినప్పుడు, మనం వుండే అసలు ప్రదేశాన్ని వారికి చూపకుండా, ఈ ఆశ్రయ స్థానాల్లో వుంచవచ్చును వారిని ! ఇతరులకు మా మీద అనుమానం కలుగకుండా వుండగలందులకు చాలా జాగ్రత్త పడుతూంటాము ! ఈ కొత్తచోట భగవతీభాయి తను పోలీసు డిప్యూటీ సూపరింటెండెంట్ కొడుకునని చెప్పుకున్నాడు. తమది అలీగఢ్ అనీ, తాను ఫైర్ ఇంస్యూరెన్స్ ఏజన్సీ తీసుకున్నాననీ చెప్పుకున్నాడు. నన్ను తన పినతండ్రి కొడుగ్గా పరిచయం చేశాడు. భగవతీభాయి పేరు హరీశ్వరసింగ్, నా పేరు జగదీశ్వరసింగ్ ! నేను ఇంస్యూరెన్సు పని నేర్చుకోడానికి బొంబాయి వెళ్ళాననీ, కంపెనీతో పోట్లాడి తిరిగి వచ్చాననీ చెప్పాడు. నా నిమిత్తం గవర్నమెంట్ ఉద్యోగం కొరకు ఎదురు చూస్తున్నట్టు చెప్పాడు.

భగవతీభాయి బయటికి వెళ్ళేప్పుడు సూటు వేసుకునేవాడు. ఇంటో వున్నప్పుడు ధోవతి కట్టుకునేవాడు. చాలా గంభీరంగా వుండేవాడు. నన్ను మాత్రం పెద్దలమాట వినకుండా తిరిగే రకం అనుకునేవారు అందరు ! పోలీసు ఉద్యోగి కుటుంబీకులం అనిపించుకోడానికి కాంగ్రేసు నాయకుల్ని, కాంగ్రేసునూ విమర్శిస్తూ వుండేవాళ్ళం ! అలా కాగ్రేసును విమర్శించడం వల్ల రెండు రకాల ప్రయోజనాల్ని సాధించాలని మా ఉద్దేశం ! ఒకటి మామీద అనుమానం కలగకుండా చూసుకోవడం రెండవది తర్కం ద్వారా, విమర్శ ద్వారా - ప్రజల హృదయాల్లో గాంధీగారి రాజకీయాలమీది గుడ్డినమ్మకాన్ని తొలగించడం !

ఇతరులెవరైనా ప్రభుత్వ చర్యల్ని విమర్శిస్తూంటే ఇలా అనేవాళ్ళం "బ్రిటీష్ ప్రభుత్వం అంటే ఏంటనుకుంటున్నారు ? కోమటోడి చిల్లరకొట్టు అనుకుంటున్నారా ? ప్రభుత్వం అంటే అదేమరి ? అలా నార తీస్తేనే ప్రభుత్వం అనిపించుకుంటుంది ?"

అక్కడ వుంటున్నప్పుడే ఒకరోజు సాయంకాలం జయచంద్ర విద్యాలంకార్‌గారు కనుపించారు. నేను ఎక్కడికో వెళ్ళి సాయంత్రం పూట గదికి తిరిగి వస్తూన్నాను. శ్రద్ధానంద బజారులోని 'అర్జున్' కార్యాలయానికి వెళ్ళే మెట్లను ఎక్కుతూండగా వారిని చూశాను ! నేను నేరుగా గదికివెళ్ళాను. భగవతీచరణ్‌తో జయచంద్రగారు కనుపించారని చెప్పాను. ఇలా అన్నాను "జాగ్రత్త, వారి కంటపడకు.

నలుగురికీ నీ గురించి చెప్పి గోలపెడతారు ! 'భగవతీచరణ్ సి.ఐ.డి., పరారీలో ఉన్నాని చెప్పుకుంటూ ఈ ప్రాంతాల తిరుగుతున్నాడహో !' అని చాటింపు వేస్తారు !"

మాటల సందర్భంలో జయచంద్రగారిని కల్సుకోమని సుఖదేవ్ చెప్పిన విషయం ప్రస్తావనకు వచ్చింది.

భగవతీచరణ్ అన్నాడు "ఇప్పుడు మంచి అవకాశం వెళ్ళి కల్సుకో ! మిత్రుల అడ్రసులు ఇస్తాడేమో !" ఇది భగవతీచరణ్ స్వభావంలోని ఔదార్యానికి గొప్ప ఉదాహరణ ! విప్లవసంఘం కోసం అవమానాన్ని సహించడానికయినా సిద్ధపడేవాడు. కనుకనే తనను సి.ఐ.డి. అని ప్రచారం చేస్తున్న వ్యక్తిని కల్సుకోమని సహజంగా సలహా ఇవ్వగలిగాడు.

నేను శ్రద్ధానంద బజారుకు వెళ్ళాను. అర్జున్ కార్యాలయం మెట్లుదిగే వ్యక్తుల్ని పరిశీలిస్తూ కొంతసేపు ఆ బజార్లోనే అటూ ఇటూ తిరిగాను. మరి కొంతసేపటికి విద్యాలంకార్‌గారు మెట్లుదిగి 'ఫతేహ్‌పూర్' వైపు వెళుతూన్నారు. నేనూ వెనకాలే వెళ్ళాను. బాగా చీకటి పడ్డది. పిలిచాను. జయచంద్రగారు కంగారుపడ్డారు. "నువ్వు ఎక్కణ్ణించి వస్తున్నావు ? నిన్ను ఎవరూ వెంబడించడం లేదు కదా ? నన్నూ ఎవరూ వెంబడించడం లేదు కదా ?" అని అడిగారు.

వార్ని ఎవరూ వెంబడించడం లేదని చెప్పాను. వారు అర్జున్ కార్యాలయానికి వెళ్ళడం, రావడం కూడా నేను చూస్తూనే వున్నాననీ, వార్నిగానీ, నన్నుగానీ ఎవరూ వెంబడించడం లేదనీ, ఎవరైనా వెంబడిస్తూన్నట్లయితే, నేనిలా పలుకరించేవాణ్ణి కాననీ చెప్పాను ! తరువాత సుఖదేవ్ వార్ని కల్సుకోమనడాన్ని గురించి చెప్పి, విప్లవసంఘంతో తిరిగి సంబంధాన్ని ఏర్పరచవల్సిందని అడిగాను.

"భగవతీచరణ్ ఎక్కడ వున్నాడో, నీకేమైనా తెల్సా ?" అని అడిగారు జయచంద్రగారు.

"పది రోజుల క్రితం ఝాంసీలో వున్నట్టు విన్నాను. ఇప్పుడూ అక్కడే వుండి వుంటాడు !' ' అన్నాను.

"భగవతీచరణ్ ఎలాంటివాడో నీకు తెలియంది ఏముంది ? తను పరారీలో వున్నట్టు నటిస్తూ పరారీలో వున్న విప్లవకారుల్ని పట్టించాలని చూస్తున్నాడు. జాగ్రత్త !" అని అన్నారు.

నేనిలా అన్నాను "భగవతీచరణ్ కంట పడకుండా, నేను జాగ్రత్తగానే వుంటూన్నాను. అవకాశం దొరికినప్పుడు అతడి పని ఎటూ పడతాను ! నాకూ విప్లవసంఘపు వెనుకటి మిత్రులకూ బొత్తిగా సంబంధాలు లేవు ! విప్లవసంఘంతో తిరిగి సంబంధాన్ని స్థాపించుకోడానికి నాకు ఎవరి అడ్రసులూ తెలియవు. నేనూ కొందరు మిత్రుల్ని స్వతంత్రంగా ఏర్పరచుకున్నాను. ఇలా ఎవరికివారు చిన్న చిన్న సంఘాలను ఏర్పరచుకోవడం బాగుండదు కదా ? కనుక, మీకు తెల్సిన అడ్రసులు చెప్పి నాకు సాయపడండి !" అని అడిగాను.

అప్పుడు జయచంద్రగారు ఇలా అన్నారు. "నువ్వు మొదట స్వతంత్రంగా ఓ దళాన్ని తయారు చేసుకో ! అప్పుడు విప్లవ సంఘంతో సంబంధం పెట్టుకోవడం వుపయోగకరంగా వుంటుంది !" అని "నువ్వు ఎక్కడ వుంటున్నావు ? నీతోపాటు ఎందరు మిత్రులు వున్నారు ?" అని ఎదురు ప్రశ్నించారు.

జయచంద్రగారు అలా ప్రశ్నించడం నాకే మాత్రం నచ్చలేదు. మాలో ఒకరినొకరం అలా ప్రశ్నించుకోము ! తనకు తెల్సిన అడ్రసులు ఏవీ చెప్పకపోగా, నా రహస్యాల్ని కూపీలాగాలని చూడడం బాధాకరం అనిపించింది ! తనకు తెల్సిన మిత్రుల అడ్రసులు నాకు చెప్పడం అభ్యంతరం అయినప్పుడు, నాకు సంబంధించిన రహస్యాల్ని అడగరాదు. సరే, అడిగారు గనుక ఏదో ఒకటి

చెప్పాలి. "ప్రస్తుతం అంబాలాలో వుంటున్నాను. అంతగా మిత్రులూ లేరు, ఉద్యమం కూడా అంతంతమాత్రంగానే వుంది !" అన్నాను.

"అంబాలాలో నీతోపాటు ఇంకెందరు వుంటున్నారు ?" అనడిగారు.

"మేము నలుగురం వుంటున్నాము !" అని చెప్పాననుకుంటాను.

నలుగురి పేర్లూ,వాళ్ళు ఏం చేస్తున్నదీ అడిగారు. నాలుగు కల్పితమైన పేర్లూ, నాలుగు కల్పితమైన వృత్తుల్ని కూడా చెప్పేశాను ! ఇంకా వారు అడుగుతూనే వున్నారు. నేను చెప్పేస్తూనే వున్నాను. జాలంధర్‌లో ముగ్గురు మిత్రులు వున్నారనీ, రావల్‌పిండిలో నలుగురు వున్నారనీ చెప్పాను. వాళ్ళ పేర్లూ, వృత్తూలూ అడిగారు.ఏడు కల్పితమైన పేర్లనూ, ఏడు కల్పితమైన వృత్తుల్ని చెప్పేశాను !

"ఐతే, మీ దగ్గర ఆయుధాలు ఎన్ని వున్నయ్ !" అని అడిగారు.

"మూడు రివాల్వర్లు మాత్రం వున్నయ్యి !" అన్నాను. వారికి నేనిలా మిత్రులున్నారనీ, ఆయుధాలు వున్నాయని అబద్ధం చెప్పడానికి కారణం, వారు నన్ను - విప్లవసంఘపు ఇతర సభ్యుల్తో కలవడానికి తగుదునని భావించాలని ! ఐతే, ఇది మోసం కాదా అనవచ్చును. మోసమే ! తప్పును అంగీకరించడంలో తప్పులేదు !

జయచంద్రగారు తన ప్రశ్నల్ని పునరుక్తం చేశారు. అంబాలాలో, జాలందర్‌లో, రావల్‌పిండిలో వున్న మిత్రులపేర్లనూ, వారి వృత్తుల్ని మళ్ళీ అడిగారు ! వారలా రెండవ మాటు ఎందుకు అడిగారో నాకుతెల్సు ! నేను చెప్పినవి అబద్ధాలు గనుక అయితే, రెండవ మాటు పొరపాటు పడతాను. కానీ, నేను రెండవమాటూ మొదట చెప్పిన వివరాలన్నింటినీ పూసగుచ్చినట్టు చెప్పాను. చివరకు ఓ సలహా ఇచ్చారు. "మిత్రుల్ని (సభ్యుల్ని) బాగా పెంచు ! ఒకరిని గురించి మరొకరికి తెలియనీయకు ! భారతదేశపు భూగోళాన్ని బాగా అధ్యయనం చెయ్యి ! స్థితిని బట్టి నిన్ను విప్లవ సంఘంలోకి తీసుకుంటాను !" అని అన్నారు.

తరువాత నా అంబాలా అడ్రసు నడిగారు. నేనొక కల్పితమైన అడ్రసు చెప్పాను. ఇలా అన్నాను "ఈ అడ్రసును నేను ఏ క్షణానయినా మార్చవచ్చును !"

జయచంద్రగారితో మాట్లాడుతూండగా 'హిందూస్తాన్‌టైమ్సు' విలేఖరి చమన్‌లాల్ మా ఇద్దర్నీ చూశాడు. చమన్‌లాల్ ఈ మధ్య వరకు విలేఖరిగానే పని చేస్తూన్నాడు. ఇప్పుడు బౌద్ధ సన్యాసి అయ్యాడు. గదికి వచ్చాక భగవతీచరణ్‌కు జయచంద్రగారితో మాట్లాడడాన్ని గురించి చెప్పాను. ఆయన తెలివి తేటలకు పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వుకున్నాం ! నేనూ, జయచంద్రగారు మాట్లాడుతూండగా చమన్‌లాల్ చూశాడని కూడా చెప్పాను భగవతీచరణ్‌కు!

జయచంద్రగార్ని కల్సుకున్నందుకు ప్రతిఫలాన్ని మర్నాడే అనుభవించాను !

చమన్‌లాల్ స్వభావం ఇప్పుడు మారిపోయిందేమో ! ఆ రోజుల్లో మాత్రం ముక్కు మీద కోపం వుండేది అతడికి ! ప్రతి దాన్ని గురించి గుచ్చిగుచ్చి ప్రశ్నిస్తూండేవాడు. నోట్లో నువ్వుగింజ నానదు ! అతడికి భగవీచరణ్ తన అసలు పేరుతోనే పరిచయం అయ్యాడు. నేను మాత్రం మహారాష్ట్రదేశపు పరారు విప్లవకారుడు 'దాండేకర్'గా పరిచయం అయ్యాను.

నేను చమన్‌లాల్‌తో సాధారణంగా ఇంగ్లీషులోనే మాట్లాడుతూండేవాణ్ణి ! ఒకవేళ హిందీలో మాట్లాడవల్సివస్తే వచ్చీరాని మరాటీ స్వరంలో మాట్లాడేవాణ్ణి ! నన్నతడు మహారాష్ట్రుడనే అనుకున్నాడు. మా వుద్యమం మీద అతడికి సానుభూతి వుంది. ఢిల్లీలో మేము కాలు నిలదొక్కుకోడానికి, రసాయనిక పదార్థాలను కొనడానికి అతడు నూటయాభై రూపాయల వరకూ ఇచ్చాడు. ఒకటి రెండు రోజుల్లో మరి కొంత డబ్బు సర్దుతానని వాగ్దానం చేశాడు.

మర్నాడు చమన్‌లాల్ దగ్గరకు వెళ్ళాను డబ్బు అడిగి తీసుకురావడానికి ! అతడు నన్నుచూసి మండి పడ్డాడు. ముఖమంతా కందగడ్డ చేసుకుని "నీలాంటి మోసగాళ్ళతో నేను మాట్లాడను ! ఇంకెన్నడూ నన్ను కల్సుకోవద్దని భగవతీచరణ్‌కు కూడా చెప్పు ! నేను మిమ్మల్ని విశ్వసించాలి ! మీరేమో నన్ను మోసగించండి ?" అన్నాడు పట్టరాని కోపంతో.

చాలా ఓపికగా, ఓర్పుతో అతణ్ణి శాంతపరచడానికి ప్రయత్నించాను. "నిన్ను మేము ఏవిధంగా మోసం చేశామో చెప్పు ?" అని అడిగాను.

"నిన్న నువ్వు జయచంద్రగారితో మాట్లాడుతున్నావు కదా ? నువ్వు వెళ్ళాక 'ఈ దాండేకర్‌ని నీ వెలా ఎరుగుదువు ?' అని అతణ్ణి ప్రశ్నించాను !" అని నిన్నతనకూ జయచంద్రగారికీ జరిగిన సంభాషణను చెప్పాడు చమన్‌లాల్.

చమన్‌లాల్ అడిగిన ప్రశ్నకు జయచంద్రగారు ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ "దాండేకర్ ఎవరు ? నేను ఏ దాండేకర్‌నీ ఎరుగను !" అన్నారు.

"అరె ... నా కంతా తెల్సులేవయ్యా ..... నా దగ్గర ఏం దాస్తావు గానీ నిన్న సాయంత్రం నీతో మాట్లాడలా ? అతడు నీ కెలా పరిచయమో చెప్పు ?" అని అడిగాడు చమన్‌లాల్.

"నువ్వు నన్ను పిచ్చోణ్ణి చేసేస్తున్నావు ! నిన్న నాతో మాట్లాడిన అతను యశ్‌పాల్ ! అతడు లాహోరు కుట్రకేసులో ముద్దాయి. పరారీలో వున్నాడు. అతడు నేషనల్ కాలేజీలో చదివాడు. నా విద్యార్థి !" అన్నారు జయచంద్రగారు. నేను 'దాండేకర్‌నని' చమన్‌లాల్, కాదు 'యశ్‌పాల్' అని జయచంద్రగారు కొంత సేపు తర్కించుకున్నారు. చివరకు తర్కంలో చమన్‌లాల్ ఓడిపోక తప్పలేదు.

ఇకనప్పుడు చమన్‌లాల్‌కు మా మీద కోసం రావడం సహజమే కదా ? నేను దాండేకర్ నని' , చమన్‌లాల్‌ని ఒక రకంగా బలవంతానా నమ్మించడం జరిగింది. నన్ను మొదటగా ఢిల్లీలో భగవతీభాయి ప్రక్కన చూసి, నాపేరు 'దాండేకర్' అని తెల్సుకున్నప్పుడే చమన్‌లాల్‌కు కొంత అనుమానం కలిగింది. కనుబొమలు చిట్లించి "ఇతని పేరు దాండేకరా ? ఇతణ్ని నేను ఎక్కడో చూసినట్టు గుర్తు ?" అన్నాడు అప్పుడే !

చమన్‌లాల్ నన్ను లోగడ చూసినమాట నిజమే ! అప్పటికి ఏడు సంవత్సరాల క్రితం, అంటే 1922లో ఫిరోజ్‌పూర్ కాంగ్రెసు కార్యాలయంలో చూశాడు ! అప్పుడు ఫిరోజ్‌పూర్ కాంగ్రెసు కార్యాలయానికి ఏదో పని మీద వచ్చాడు ఇతడు. అక్కడ ఇతడికి జ్వరం పట్టుకుంది. విపరీతమైన జ్వరమూ, తలనొప్పి - ఏడ్చి, మూలిగి గందరగోళం చేశాడు. నేనితడితలకు తలనొప్పి మందులు రాచాను. ముఖాన తడిగుడ్డలు పెట్టి, మంచు గడ్డలు పెట్టి అనేక రకాలసేవ చేశాను. కనుక ఇతడికి నేను కొంతలో కొంత జ్ఞాపకం వున్నాను. భగవతీచరణ్ పక్కన నన్ను చూడగానే పూర్వజ్ఞాపకాల్ని తిరగ తోడుకోడానికి ప్రయత్నించి కూడా సంకోచించి వూరుకున్నాడు. అలాంటప్పుడు నేను కావాలని వెనుకటి పరిచయాల్ని తిరగతోడడం అనవసరం అనుకున్నాను. దాండేకర్‌గానే వ్యవహరించాను. అదీకాక, చమన్‌లాల్ నోట్లో నువ్వుగింజ నానదని నాకు ముందే తెల్సుగదా !

మేము తనను కావాలని మోసం చేశామని చమన్‌లాల్‌కు కోపం ! మేము అతణ్ణి చాలా సేపు బతిమలాడుకున్నాం ! చివరకు ఇలా అన్నాం ! "ఇందుట్లో మోసం ఏముంది ? నీ దగ్గర తీసుకున్న డబ్బును మేమేమీ ఇతర విధాల ఖర్చు పెట్టలేదు కదా ? ఇంక అసలు పేరు నీకు చెప్పకుండా వుండడం, నిన్ను మోసం చేయాలనే వుద్దేశంతో కాదు ! నువ్వు పొరపాటున ఎక్కడయినా అంటే నువ్వూ, మేమూ కూడా ఇరుక్కుంటాం !" అని చెప్పాము.

ఏమైనాగాని, జయచంద్రగారి తెలివితేటల్ని అర్థం చేసుకోవడం కష్టం ! నేను పరారీలో వున్నానని వారికి తెల్సు ! పరారీలో వున్న వారు పేరు మార్చుకుంటానని వారికి తెలియదందామా ?

చమన్‌లాల్ నేను 'దాండేకర్'నని వాదిస్తున్నప్పుడు కాదని నా అసలు పేరును బయటికి లాగవలసిన అవసరం ఏమొచ్చింది జయచంద్రగారికి ? చమన్‌లాల్ మాకు మరో విషయాన్నీ చెప్పాడు. భగవతీచరణ్ సి.ఐ.డి. అని ప్రచారం చేస్తూన్నందుకు జయచంద్రగార్ని, చమన్‌లాల్ బాగా చివాట్లు పెట్టాడుట ! భగవతీచరణ్ సి.ఐ.డి. కాదని, నేనూ, భగవతీచరణ్ ఇద్దరం ఒకేచోట వుంటున్నామని కూడా చెప్పాడుట చమన్‌లాల్. "భగవతీచరణ్ సి.ఐ.డి. ఐతే యశ్‌పాల్ ఏనాడో అరెస్టు అయ్యేవాడు కాడా ?" అని అడిగాడుట జయచంద్రగారిని.

చమన్‌లాల్‌కు నా అసలు పేరు చెప్పినందుకు నాకు జయచంద్రగారిమీద ఎటూ కోపం వచ్చింది. ఐతే, నేనూ, భగవతీచరణ్ కలిసే వున్నామని చమన్‌లాల్ చెప్పినప్పుడు తనతో అబద్ధం ఆడినందుకు వారికి నా మీద ఎంత కోపం వచ్చిందో ?

నేనూ భగవతీచరణ్ - చాలాసేపు నవ్వుకున్నాం !

జయచంద్రగారితో అలా అబద్ధం చెప్పినందుకు నేనేమాత్రమూ కించపడలేదు ! వారి కుతంత్రాన్ని, నైచ్యాన్ని ఎదుర్కోవడానికే నేనలా వ్యవహరించాల్సి వచ్చింది !

రసాయనిక పదార్థాలను కొనడం పూర్తయింది. ఇక పేలుడు పదార్థాన్ని తయారు చేయడానికి రోహతక్ ఎవరు వెళ్ళాలి ? అన్న ప్రశ్న వచ్చింది ! భగవతీచరణ్ తనే వెళ్ళాలి అనుకుంటున్నాడు.

దేవదత్తశర్మ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాడు "ఎక్కువ రోజులపాటు, పెద్ద పరిమాణంలో ఈ పదార్థాన్ని తయారు చేయడం ఆరోగ్యానికి దెబ్బ" అని చెప్పాడు. వీటి పొగ, దుర్గంధం ఎలా బాధపెడుతుందో, లాహోరులో అనుభవించాను గదా ! ఆరోగ్యం చెడేమాట అటుంచినా, పోలీసులకు అనుమానం కలిగితే పోరాటంలో చనిపోవడమో, పట్టుపడితే ఉరి కొయ్యకు వేళ్ళాడడమో ఖాయం !

ఈ లోపు భగవతీచరణ్ కలకత్తా వెళ్ళి కిరణ్ నడిగి రెండవ పిస్తోలు కూడా తెచ్చాడు. మేమిద్దరమూ, సాయుధులమైనాము. రోహతక్ నేనే వెడతానని మొండికి వేశాను. ఇలా తర్కించాను. "రోహతక్ వెళ్ళిన వ్యక్తి ఒక నెల రోజుల వరకూ అక్కడే వుండాలి ! ఈ లోపు ఇక్కడ నీ ద్వారా జరగవల్సిన అవుసరం అయిన పనులు ఎన్నో వున్నాయి. అవన్నీ ఆగిపోతాయి !" అని అన్నాను. అప్పట్లో భగవతీచరణ్ గణేశ్‌శంకర్ విద్యార్థిగారి ద్వారా అజాద్‌తో సంబంధాన్ని పెట్టుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. భగవతీభాయి రోహతక్ వెడితే, అజాద్‌ను కల్సుకునే ప్రయత్నం ఆగిపోతుంది ! ఇదే విషయాన్ని ప్రస్తావించి ఇలా అన్నాను. "అజాద్‌తో సంబంధం పెట్టుకోవడం చాలా ముఖ్యం ! నువ్వు రోహతక్ వెడితే ఈ ముఖ్యమైన పని ఆగిపోతుంది ! అదీగాక, అక్కడికి వెళ్ళిన వ్యక్తి వైద్యుడికి నౌకరుగా వేషం వెయ్యాలి ! నీ రూపం, ఒడ్డూ పొడుగూ చూసి నౌకరని ఎవ్వరూ అనుకోరు !" అని చిట్టచివరకు బ్రహ్మాస్త్రాన్ని అడ్డు వేశాను. "ఒక వేళ బాంబులు చేస్తూ పట్టుపడవచ్చును. నేను పట్టుపడతానూ ? ఫరవాలేదు. కానీ, నువ్వు పట్టుపడితే విప్లవ సంఘానికి తీరని లోటు ఏర్పడుతుంది !" అన్నాను.

చివరకు భగవతీచరణ్ వప్పుకున్నాడు. ఒకరోజు రోహతక్ వెళ్ళి లేఖరాంను వెంట తీసుకువచ్చాడు. మా యిద్దరికీ పరిచయం చేశాడు. మేము రోహతక్‌లో ఎలా పనిచేయాల్లో మాట్లాడుకున్నాము.

నేను తన నౌకరుగా వుండడాన్ని గురించి మొదట ఆశ్చర్యాన్ని ప్రకటించాడు లేఖరాం ! ముఖ్యంగా నా వేషాన్ని చూసి అభ్యంతరాన్ని తెల్పాడు. "నువ్వు నాకు నౌకరువంటే ఎవరు నమ్ముతారు ?" అన్నాడు. నిజమే, అప్పుడు నేను వేసుకున్న డ్రస్సును చూస్తూ, నేను లేఖరాంకు నౌకర్నంటే ఎవరూ

నమ్మరు ! లేఖరాం గ్లాస్కో పంచా, లాల్చీ, కోటూ, తలగుడ్డాతో పల్లెటి ప్రజల దృష్టిలో నాగరికమైన వేషంలోనే వున్నాడు. ఐతే, నేను అతడికంటే కూడా నాగరికమైన వేషంలో వున్నాను. కోటూ, బూటూ, సూటూ, హేటూ - వేసుకుని కళ్ళజోడు పెట్టుకుని, మీసం నున్నగా గొరుక్కుని నవనాగరికుడిలా వున్న నేను అతడికి నౌకర్నంటే ఎవరు నమ్ముతారు ?

భగవతీచరణ్ చెప్పిన ప్రకారం లేఖరాం రోహతక్‌లో ప్రత్యేకం ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఆ యిల్లు లేఖరాం కాపురం వుండే ఇంటికీ అతడి ఆస్పత్రికీ కొంచెం దూరంలో వుంటుంది. నేనక్కడికి పోకముందే అతడు తను కొత్త మందుల్ని తయారుచేయబోతున్నట్లు నలుగురికీ చెప్పాడు. వెండి, బంగారం, ముత్యాలు, పాదరసం వీటి భస్మాల్ని తయారు చేయబోతున్నట్టూ చెప్పుకున్నాడు. లేఖరాంను అప్పటికి కొంత సామాను ఇచ్చి రోహతక్ పంపించాము. నాలుగయిదు రోజులు ఆగి వచ్చి నన్ను తీసుకువెళ్ళమని చెప్పాము. నేనా నాలుగు రోజులూ గడ్డం చేసుకోలేదు. ఐదవ రోజున గడ్డం చేసుకున్నాను. ఐతే, మీసాల్ని తగ్గించలేదు. బారాటి మీసాలు వుండేట్టు చేసుకున్నాను. లాహోరులో వుండగా భగవతీభాయి సన్నని చిన్ని మీసాల్ని వుంచుకునేవాడు. ఢిల్లీలో అతడూ నిమ్మకాయలు నిలబడేట్టు మీసాలు పెంచుతూన్నాడు.

నేనలా మీసం పెంచడం అక్కడున్న వాళ్ళకు ఆశ్చర్యాన్ని కలిగించకుండా ఎలా వుంటుంది ? చుట్టుపట్ల వాళ్ళు నా మీసాల అభివృద్ధిని గురించి ప్రశ్నించారు.

భగవతీభాయి ఇలా సమాధానం చెప్పాడు. "కొజ్జాల్లా మీసాలు నున్నగా గొరిగించుకోవడం ఠాకుర్లమైన మాకు తగదు !" అన్నాడు.

ఐదారు రోజుల తరువాత లేఖరాం నన్ను తీసుకు వెళ్ళడానికి వచ్చాడు. అతడు వస్తూ మొద్దు ధోవతీ, మొద్దు చొక్కా, ఆకుపచ్చ తలగుడ్డ నొకదాన్ని పట్టుకువచ్చాడు. ఇతర్లకు అనుమానం కలక్కుండా వుండడానికి, రాత్రిపూట వెళ్ళాలని నిశ్చయించుకున్నాం. రాత్రి పదిగంటలా ఛాయల ఆ మొద్దు ధోవతిని కట్టుకుని, చొక్కా తొడుక్కున్నాను. ఆకుపచ్చని తలగుడ్డను హరియానా ప్రాంతపు 'జాట్'లు చుట్టుకున్నట్టు తలకు చుట్టుకున్నాను. కళ్ళజోడు తీసేశాను !

నా వేషాన్ని చేసి నవ్వుతూ "నువ్వు ఇప్పుడు అచ్చం పల్లెటూరి బైతులాగున్నావు !" అన్నాడు లేఖరాం.

నా పేరు 'కిట్టయ్య'గా మారిపోయింది.

రోహతక్‌లో లేఖరాం ఆస్పత్రి పెద్దబజారు మధ్యలో వుంది. నేను రోజూ ప్రొద్దున్నే ఆస్పత్రిని చిమ్మి శుభ్రం చేసేవాణ్ణి ! రోగులు కూచోడానికి చాపలూ, పట్టాలూ పరిచేవాణ్ణి ! తరువాత బజారు వాకిట్లో కూచుని సన్నికల్లులో ఏదో ఒక మందు నూరుతూండేవాణ్ణి ! వేసవికాలం, ఎండలు మండిపోతున్నాయి. మిత్రుల్తో గానీ, రోగుల్తో గానీ మాట్లాడేప్పుడు లేఖరాం నన్ను కేకవేసేవాడు. "అరే కిట్టయ్యా ! చెమట పోస్తోంది .... కాసేపు ఇసురు !" అనేవాడు. నేను మందు నూరడం ఆపి విసినకర్రతో విసిరేవాణ్ణి !

లేఖరాం ముందు తీసుకున్న ఇల్లు మాకు అంతగా నచ్చలేదు. తగిన ఇంటిని మరోదాన్ని చూసుకోడానికి కొద్ది రోజులు పట్టింది.

తగిన ఇల్లు కుదిరింది. కొత్త ఇంట్లో మందులు తయారు చేయడం ప్రారంభించాము. అంటే బాంబులకు అవసరం అయిన ప్రేలుడు పదార్థాన్ని తయారు చేయడం ప్రారంభించామన్న మాట ! దేవదత్త శర్మ చెప్పిన ప్రకారం ఒక ద్రావకంలో మరో ద్రావకాన్ని బొట్టు బొట్టు చొప్పున కలిపేవాణ్ణి ! ఈ ద్రావకాల్ని స్టౌమీద వుడికిస్తూ మూడవ రకం ద్రావకాన్ని బొట్టు బొట్టు చొప్పున పోస్తూ కలబెడుతూండేవాణ్ణి

ఈ మూడో ద్రావకం పడగానే పసుపుపచ్చని పొగ అత్యధికంగా లేచేది. తగని దుర్గంధం ! అయినా వదిలి వెళ్ళడానికి వీల్లేదు. కలుపుతూనే వుండాలి. ఆ పొగ ప్రభావం వల్ల రెండు రోజులకే నేను వేసుకున్న చొక్కా, ధోవతి ఎక్కడ పుచ్చుకుంటే అక్కడ వూడిరాసాగింది ! ప్రతి రెండు రోజులకు మరో ధోవతి, చొక్కా తెచ్చుకోవడం సంభవం కాదు. కనుక పని చేసేప్పుడు లంగోటీతో వుండేవాణ్ణి ! బయటికి వెళ్ళేప్పుడు మరో చిరిగిన మొద్దు చొక్కా, ధోవతి కట్టుకునేవాణ్ణి !

లంగోటీతో వుండడం వల్ల ఆ పొగ ప్రభావం నా శరీరం మీద పనిచేయసాగింది. శరీరం అంతా పసుపు పచ్చని రంగుకు తిరిగింది. స్నానం చేసేప్పుడు శరీరం మీద నుండి పచ్చని పొరలు ఊడిపోసాగాయి. ఆ పొగకు, దుర్గంధానికీ దగ్గూ, తలనొప్పి పట్టుకున్నాయి. రసాయనిక పదార్థాల మిశ్రణంతో 'పిక్రిక్ యాసిడ్' ని స్ఫటికంలా తయారు చేశాక, దాన్ని కడగడం అవసరం ! కడిగేప్పుడు చేతులకు రబ్బరు తొడుగుల్ని ఉపయోగించేవాణ్ణి ! ఐనా చేతులకు రంగు అంటేది ! రబ్బరు తొడుగులు కూడా మూడు నాలుగు రోజులకు పిగిలి పోతూండేవి ! మొదట నా చేతులు పచ్చబడ్డాయి. క్రమంగా పసుపుపచ్చన ఎరుపుకు తిరిగింది. గోరింటాకు పెట్టుకున్నట్టు !

రోజూ ఉదయాన్నే ద్రావకాల్ని వండడానికి కూర్చునేవాణ్ణి ! ద్రావకాల మిశ్రణకు దాదాపు మూడు నాలుగు గంటల సమయం పట్టేది. మిశ్రణ అయ్యాక చల్లారడానికి, స్ఫటికంలా గట్టి పడడానికి కిందకు దింపి పెట్టేవాణ్ణి ! చల్లారేలోపు ఆస్పత్రి దగ్గర పనిచూసి వచ్చేవాణ్ణి !

అక్కడ నా పని, మందులు నూరడం, లేఖరాంకు విసరడం, అతడికీ, అతడి మిత్రులకూ బావి నుండి చల్లని నీళ్ళు తోడి తెచ్చి పెట్టడం ! ఆస్పత్రి దగ్గర లేఖరాం మిత్రులు కొందరు నా చేతి ఎరుపును చూసి అడగసాగారు.

నేను దైన్యాన్ని అభినయిస్తూ, చేతులు నలుపుకుంటూ "గోరింటాకు పెట్టుకుండాను, బాబూ !' అని సమాధానం చెప్పేవాణ్ణి.

లేఖరాం వూరుకుంటాడా ? "నాయాల, కొజ్జాల్లా గోరింటాకు పెట్టుకున్నాడు ! సిగ్గేయడం లేదట్రా, చెప్పుకోడానికి ? ముఖం చూడు ఎలా వుందో ! మంచి షోకిల్లాకదూ, గోరింటాకు పెట్టుకోకపోతే ఎలా ?" అనేవాడు.

లేఖరాంకూ, అతడి మిత్ర్రులకూ మంచి నీళ్ళు ఆర్యసమాజ మందిరంలోని బావిలోనించీ తెచ్చి పెట్టేవాణ్ణి ! ఆ మందిరంలో ఓ సాధువు వుండేవాడు. నాకు పరిచయం అయ్యాడు. నేను వెళ్ళగానే "ఏం కిట్టయ్యా ! ఇలా వచ్చావు ?" అని అడిగేవాడు.

"అయ్యగోరికి మంచీలు తోడుకెలడానికి వచ్చానయ్యా !" అనేవాణ్ణి. సాధువు తనకూ ఒక బొక్కెన నీళ్ళు తోడి పెట్టమని అడిగేవాడు. తోడి ఇచ్చేవాణ్ణి ! 'లేఖరాం నౌకరు కిట్టయ్య చాలా మంచివాడేగానీ, ముక్కుకు సూటిగా పోయేరకం !' అని బజార్లో అందరూ నా గురించి చెప్పుకునేవారు.

నీళ్ళకు వెళ్ళినప్పుడు సాధవుతో మాట్లాడుతూ కాసేపు కూచునేవాణ్ణి. వెంటనే తిరిగి వస్తే, మందులు నూరడమో, లేఖరాంకు విసరడమో చేయవల్సి వుంటుంది ! అందువల్ల ఆర్యసమాజ మందిరంలోనే సాధువుతో మాట్లాడుతూ కొంత సమయాన్ని గడిపేవాణ్ణి !

ఏకాంతంతో విసిగిపోయన సాధువుకు కూడా నేనలా కాసేపు తనతో మాట్లాడుతూ కూచోవడం ఇష్టంగానే వుండేది ! ఏవేవో విషయాలు చెప్తూ వుండేవాడు.

ఒకరోజున నేను వెళ్ళేసరికి సాధువు ఓ పుస్తకాన్ని చదువుతూన్నాడు. నేను సాధువుకు అభిముఖంగా వున్నాను. పుస్తకంమీది పేరు కనబడుతూనేవుంది. పేరు చదివాను. 'చినాల్‌పచ్చీసి' అని వుంది.

తోడిన నీళ్ళను సాధువు కమండలంలోపోస్తూ "రామాయనం సదువుతుండారాయ్యా !" అని అడిగాను.

సాధువు పుస్తకంమూసి నావంక చూసి "శాస్త్రగ్రంథం ! నువ్వు రామాయణమే అనుకో ! సరేగాని నువ్వేంచదువుకోలేదా ?"అని అడిగాడు.

"లేదయ్యా ! అంత అదిట్టం నాకెక్కడది ?" అన్నాను. సాధువుకు నామీద దయకలిగింది. నాకు చదువు చెబుతానన్నాడు.

నేను తనవెంట ఆస్పత్రికి వచ్చేప్పుడూ, ఆస్పత్రినుంచి ఇంటికి వెళ్ళేప్పుడూ లేఖరాం నాచేత ఏ డబ్బానో, మూటనో మోయిస్తేండేవాడు అలా మోయించడం అవుసరం వుండికాదు. చుట్టుపట్ల ప్రజలు నేను నిజంగా అతని నౌకర్ను అనుకోగలందులకు అలా మోయించేవాడు. ఒకనాడు మామూలుగా లేఖరాం, అతడి వెనుక నేనూ బజార్న వెడుతూన్నాము ! నా నెత్తిన ఒకడబ్బా ఉంది. బజార్లో లేఖరాం మిత్రుడు ఒకడు కలిశాడు. ఆ మిత్రుడు కిళ్ళీకొట్టుముందు వేసివున్న ఇనుపకుర్చీలో కూచుని కలర్ తాగుతున్నాడు. లేఖరాంకు మరోకుర్చీ చూపించి కూచోమన్నాడు. కిళ్ళీకొట్టు యజమానికి మరో కలర్ ఇవ్వమని ఆర్డర్ ఇచ్చాడు.

నేను నెత్తిన డబ్బా పెట్టుకుని అలాగే రోడ్డు ప్రక్కన నిలబడి వున్నాను. లేఖరాం నావైపుతిరిగి "ఏరా కిట్టయ్యా ! నువ్వూసోడా తాగుతావా ?" అనడిగాడు.

"తాగుతానయ్యా !" అన్నాను.

"ఆ ఁ!ఆ ఁ! నువ్వూసోడా తాగుతావా ? ఏం షోకిల్లావిరా ! నాయాల, నీ తాత ముత్తాతలుతాగార్రా, ఎన్నడయినా, సోడా ?" అంటూ కిళ్ళీకొట్టు ఎజమానివైపు తిరిగి 'సరేబాబు ! వాడికీ ఓ సోడా ఇవ్వు' అన్నాడు.

కొట్టు ఎజమాని ఇద్దరు మిత్రులకూ 'కలర్'లను ఇచ్చాడు. రెండు సోడాల్ని కొట్టి గ్లాసుల్లోపోసి, లెమనేడ్-ఐసూ, కలిపి -వినయాన్ని ప్రదర్శిస్తూ ఇచ్చాడు వాళ్ళకు ! నాకు మాత్రం సోడాకొట్టి, కాయను ఆపర్న చేతికి ఇచ్చాడు.

నేను నెత్తినవున్న డబ్బాను కిందపెట్టి. అలాగే రోడ్డు ప్రక్కన నిలబడి సోడాకాయనుఎత్తుకుని గటగట తాగుతూన్నాను. లేఖరాంనావైపు చూశాడు. కోప్పడ్డాడు. "దున్నపోతులా అలా నుంచోని తాగుతావేం ? కూచోని తాగలేవా ?" అన్నాడు నేను అపర్న రోడ్డుమీదనేకూచున్నాను.

బాంబు ఫ్యాక్టరీకి వచ్చాక తలుపు లోపల గడియ వేశాను. లేఖరాంను కసితారాతన్నాను. అతడి కొంటెతనానికి తగినశిక్ష విధించాను. బయట అతడు ఎజమాని నేనునౌకర్ని, ఫ్యాక్టరీలో అతడు శిష్యుడు నేను గురువును ! ప్రతిసారీ ఫ్యాక్టరీలో ఒట్టుపెట్టుకునేవాడు. బయట కొంటెగా వ్యవహరించనని మాట ఇచ్చేవాడు. ఐతే, బయటకు వెళ్ళగానే తన మామూలు ధోరణిలో పడేవాడు. నన్ను కొంటెగా ఏడిపించ చూసేవాడు. అతడి ప్రవర్తన ఫ్యాక్టరీలో ఒకరకంగా వుండేది ! బయట మరోరకంగా వుండేది ! లేఖరాం నన్ను 'అన్నయ్యా' అని పిల్చేవాడు. ఫ్యాక్టరీలో నన్ను ఉబ్బేయడానికి ప్రయత్నించేవాడు !

లేఖరాం మధ్యాహ్నభోజనానికి ఇంటికి వెళ్ళేవాడుకాదు. ఫ్యాక్టరీకే తెప్పించుకునేవాడు. అతడి తమ్ముడు భోజనం పట్టుకువచ్చేవాడు. లేఖరాం భార్య, భర్తకోసం ప్రత్యేకం పరోటాలూ, కలగలుపుపప్పు, నెయ్యీ పంపేది. నా కోసం విడిగా రొట్టెలూ, పప్పు పంపేది. తమ్ముడు భోజనం పెట్టి వెళ్ళగానే లోపల గడియవేసుకుని, ఇద్దరం కూచుని మొత్తం భోజనాన్ని తినేసేవాళ్ళం ! లేఖరాం నా ఆరోగ్యాన్ని గురించి చాలా శ్రద్ధ తీసుకునేవాడు. ద్రావకాల ప్రభావం నా శరీరానికి ఎక్కడ హాని చేస్తుందోనని వేయికండ్లతో కనిపెట్టివుండేవాడు. రోజూ ఉదయాన్నే ఒకమాటు ఫ్యాక్టరీకివచ్చి

చూసివెళ్ళేవాడు. తను వచ్చేప్పుడు రోజూ అర్ధసేరు పెరుగో, పాలో పట్టుకువచ్చేవాడు నాకోసం ! వస్తూ 'హిందూస్తాన్ టైమ్సు' దినపత్రికను తెచ్చేవాడు.

లాహోరుకోర్టులో అసెంబ్లీ బాంబుకేసు నడుస్తోంది. భగత్‌సింగ్, ఇతర మిత్రులూ నిరశనవ్రతం పట్టారు. ఆకారణంగా కేసు విచారణ ఆగిపోయింది. విప్లవకారులు నిరశనవ్రతం చేయడానికి కారణం, ప్రభుత్వం తమపట్ల మర్యాదగా వ్యవహరించకపోవడమే ! బ్రిటీష్ ప్రభుత్వం సాధారణ అపరాధుల్ని వేరుగానూ రాజకీయ ఖైదీలను వేరుగానూ వుంచుతోంది జైళ్ళల్లో ! రాజకీయ ఖైదీలయొక్క ప్రత్యేకతను అంగీకరించింది. ఎ,బి,క్లాసుల్ని నిర్ణయించి, రాజకీయ ఖైదీలకు ప్రత్యేకమైన సౌకర్యాలను అంగీకరించింది. ఐతే, ఈ ప్రత్యేక సౌకర్యాలన్నీ సంపన్నులైన రాజకీయ ఖైదీలకు మాత్రమే ఇస్తూన్నది. బీద, మధ్యతరగతి రాజకీయ ఖైదీలను చాలా నిరాదరణగా చూస్తోన్నది ! వీరికీ మనుష్యోచితమైన అన్నవస్త్రాలను కూడా ఇవ్వడం లేదు !

బ్రిటీష్ ప్రభుత్వం మధ్యతరగతి బీదప్రజానీకం నుంచి వచ్చిన విప్లవకారుల్ని రాజకీయఖైదీలుగా అంగీకరించలేదు. వీరికి రాజకీయ ఖైదీలకు ఇచ్చే ప్రత్యేకమైన సౌకర్యాలనూ ఇవ్వడంలేదు. బ్రిటీష్ ప్రభుత్వమూ, గాంధీగారూ - విప్లవకారులకు హింసావాదులనే ముద్రవేశారు !

విప్లవకారులూ, కాంగ్రెసువారూ - ఉభయులూ రాజకీయ ఖైదీలే ఐనప్పటికీ, ధనికులైన కాంగ్రెసు ఖైదీలపట్ల బ్రిటీష్ ప్రభుత్వం ఎలా వ్యవహరించేదో తెల్సుకోడానికి నెహ్రూగారు తన ఆత్మకథలో రాసిన కొన్ని వాక్యాలను చదివితే సరిపోతుంది ! జవహర్‌లాల్ నెహ్రూగారు, మోతీలాల్ నెహ్రూ జైలు జీవితాన్ని గురించి రాస్తూ 'వారి నిత్యావసర భోజన పదార్థాల లిస్టునుచూసి ఆంగ్లేయుడైన జైలరు చకితుడయ్యాడని' గర్వంగా తెల్పారు. మరి బ్రిటీష్ ప్రభుత్వం తమపట్ల ఒకరకంగా ప్రవర్తించి, బీద, మధ్యతరగతి దేశభక్తులపట్ల మరోరకంగా వ్యవహరించడాన్ని మోతీలాల్ నెహ్రూగానీ, జవహర్‌లాల్ నెహ్రూగానీ - వ్యతిరేకించినట్టు ఎక్కడాలేదు !

ఆంగ్ల ప్రభుత్వం కాంగ్రెసు ఖైదీలను మాత్రమే రాజకీయ ఖైదీలుగా చూసేది. విప్లవకారుల్ని రాజకీయ ఖైదీలగా అంగీకరించేది కాదు. ఐతే, విప్లవకారులు తమను రాజకీయ ఖైదీలగా చూడవల్సిందని అడుగుతూన్నారు. 'మేము దొంగలమో, హంతకులమో కాదు. రాజకీయ ఖైదీలము. ఒక రకంగా యుద్ధ ఖైదీలం ! మమ్మల్ని సభ్యసమాజ ప్రజల్లా చూడాలి ! అలాంటి అన్న వస్త్రాల్నే మాకు ఇవ్వాలి' ఇది విప్లవకారుల డిమాండ్ ! అందుకే, విప్లవకారులు నిరశనవ్రతం చేస్తున్నారు.

విప్లవకారులందరూ సమానమైన దృఢచిత్తంతో నిరశనవ్రతాన్ని చేయలేక పోతున్నారు. విప్లవకారులమైన మేము నిరశనవ్రతం చేయడం, ఆధ్యాత్మిక శక్తుల్ని సంపాయించడానికో, లేక ఆత్మోద్ధరణకోసమో కాదు ! ప్రజల దృష్టిని మా వైపు తిప్పుకుని, ప్రజల సానుభూతి ద్వారా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలన్నదే మా ఆదర్శం ! అందుకోసం విప్లవకారులు ఒక ఉపాయాన్ని ఆలోచించారు. ఖైదీలందరి తరఫున ఇద్దరిద్దరు చొప్పున ఆమరణ నిరాహారదీక్ష పూనాలన్న నిర్ణయం జరిగింది. మొదటి ఇద్దరూ చనిపోయాక మరో ఇద్దరు నిరాహార దీక్షను పూనుతారు. ఈ విధంగా ఇద్దరిద్దరు చొప్పున ఖైదీలు నిరాహారదీక్షపూనడం వల్ల రెండురకాల ప్రయోజనాల్ని సాధింప వచ్చును. ఒకటి నిరాహారదీక్షాక్రమాన్ని చాలా కాలం నిర్వహించవచ్చును. రెండవది, ముద్దాయిల్లో ఇద్దరు కోర్టుకు హాజరు కాకపోవడంవల్ల కేసు విచారణా చాలా రోజులపాటు వాయిదా పడుతుంది !

విప్లవకారులైన ఖైదీల ఈ నిరాహారదీక్షను - మా విప్లవసంఘాన్ని ప్రజల్లో ప్రచారం చేసుకోడానికీ ఓ సాధనంగా భావించాము ! ప్రజల సానుభూతిని పొందడానికీ, ప్రజల్లో ప్రచారానికీ నిరాహారదీక్ష ఓ సాధనంగా పనిచేస్తుందని, మేము గాంధీగారి నుండే తెల్సుకున్నాము.

యతీంద్రనాథ్ దాసు అసలే జబ్బు పడివున్నాడు. ఆ స్థితిలో నిరాహారదీక్ష పూనాడు. అతడా నిరాహారదీక్షలోనే అసువుల్ని బాశాడు !

విప్లవకారులు నిరశనవ్రతం చేసేప్పుడు వ్రతభంగం కావించడానికి జైలు అధికారులు రబ్బరు గొట్టాల ద్వారా ముక్కుల గుండా బలవంతానా పాలు పట్టేవారు వ్రత ధారులకు ! ఇలా ముక్కుల గుండా బలవంతానా పాలు పట్టడాన్ని వ్యతిరేకించడానికి తన్నుకులాడేవారు ఖైదీలు ! ఈ కుమ్ములాటలో రబ్బరు గొట్టాలు పొట్టల్లోకి పోకుండా శరీరంలోని ఇతర భాగాలలోకి వెడుతూండేవి ! యతీంత్రనాథ్ దాసు పట్ల ఇదే జరిగింది ! బలవంతానా పాలు ఎక్కించబోయారు. పెనుగులాటలో పాలు ఊపిరితిత్తుల్లోకి పోయాయి. నిమోనియా వచ్చింది ! పరిస్థితి విషమించింది. విప్లవకారుల కోర్కెలపట్ల ప్రజల్లో సానుభూతి ఏర్పడ్డది. ప్రజలు ఆందోళన చేయసాగారు ! ఆంగ్ల ప్రభుత్వ క్రూర విధానాన్ని ద్వేషించసాగారు !

యతీంద్రనాథ్ దాసు అసువుల్ని బాశాడని పత్రికల్లో పడ్డది. ఖైదీల 'డిఫెన్సుకమిటీ' కోర్కె పై అతడి శవాన్ని, లాహోరులో వున్న అతడి తమ్ముడు కిరణ్‌దాసుకు ఇచ్చేశారు. యతీంద్రనాథ్ శవాన్ని లాహోరు నుండి కలకత్తా తీసుకు వెళ్ళారు. లాహోరులో శవయాత్రలో లక్షల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. శవంమీద పూవులు వర్షంలా కురిశాయి. అతడి శవంతో పాటు కిరణ్‌దాసు, దుర్గాబాభీ, భగత్‌సింగ్ తండ్రి - కలకత్తా వెళ్ళారు ! దారిలో ప్రతిస్టేషన్ దగ్గరా వేల సంఖ్యలో ప్రజలు గుమిగూడారు, శవాన్ని చూడడానికి !

నేను రోహతక్ బాంబుఫ్యాక్టరీలో రోజూ పత్రిక చూస్తూండేవాణ్ణి ! ప్రజలు యతీంద్రనాథ్ దాసు శవం పట్ల ప్రకటిస్తున్న భక్తి భావాన్ని, ఆదర - ప్రపత్తుల్ని గురించి చదివేవాణ్ణి ! అది చదువుతూంటే పరస్పర విరుద్ధమైన విచిత్ర భావాలు నా హృదయంలో తుఫానులా లేచేవి. మా విప్లవ సంఘ సభ్యుడిగా యతీంద్రనాథ్ దాసు చేసిన మహత్ త్యాగానికి నేనెంతో గర్వపడేవాణ్ణి ! ప్రజలిలా అతడి శవంపట్ల భక్తి ప్రపత్తుల్ని ప్రకటించడం నైతికంగా మా విప్లవసంఘానికి ఘన విజయమనీ, బ్రిటీష్ ప్రభుత్వానికి ఘోరపరాజయమనీ అనుకున్నాను. ఐతే, దీంతోపాటు సన్నని బాధ కూడా కలిగింది మనస్సులో ! ఏ ఆడంబరమూ, అట్టహాసమూ లేకుడా దేశం కోసం మౌనంగా బలైపోవడం మా ఆదర్శం ! కానీ, ప్రజలిలా బలవంతానా యతీంద్రనాథ్ దాసు శవంపట్ల శ్రద్ధ ప్రకటించడంతో మా త్యాగానికి ప్రతిఫలాన్ని అంటకట్టారు. ప్రతిఫలం లభించాక ఇంక అది త్యాగం ఎట్లా అవుతుంది ? ఇలాంటి భావాలేవేవో నా బుర్రలో కదులాడేవి !

రోహతక్‌లో నేను చదువు సంధ్యలురాని మొద్దబ్బాయిగా పరిచయం అయ్యాను. కనుక వార్తాపత్రికను రహస్యంగా చదువుకుంటూ వుండేవాణ్ణి ! ఒక రోజున వార్తాపత్రిక చదువుతూన్నాను. లేఖరాం తమ్ముడు అన్నం తీసుకుని మిద్దెమీదికి వచ్చాడు. చదువులో మునిగిపోయానేమో అతడు మెట్లు ఎక్కివచ్చిన సవ్వడిని వినిపించుకోలేదు ! నేను పత్రిక చదవడాన్ని చూసి అతడు విస్మయాన్ని ప్రకటించాడు. "ఏం, కిట్టయ్యా ! పత్రిక చదువుతున్నావా ? నీకు చదువు కూడా వచ్చునా ?" అన్నాడు నవ్వుతూ.

నేను అమాయకంగా నవ్వుతూ "అంత అదిట్టం నా కేడదయ్యా ? ఊరకా బొమ్మలు సూత్తుండా !" అంటూ వార్తాపత్రికలోని బొమ్మ నొకదాన్ని చూపించి "ఈనగోరు గేందీగోరు కదో ?" అనడిగాను.

"ఛ ... ఛా .... మహాత్మాగాంధీ ఇలా వుంటాడా ?" అన్నాడు లేఖరాం తమ్ముడు నా అవివేకానికి నవ్వుకుంటూ.

అక్కడికి నీళ్ళు పోయడానికి పనిమనిషి ఒకామె వస్తూండేది. మంచి వయస్సులో వుంది. బలంగా కూడా వుండేది ! ఇంత పెద్ద కడవలను నెత్తిన పెట్టుకుని గునగున నడిచేది ! తయారైన స్ఫటికంలాంటి 'క్లోరోపిక్రేట్'ని కడగడానికి నీళ్ళు అవుసరం ! ఒక బాననిండా కడవలతో నీళ్ళు పోయించుకునేవారం. బాన నిండా పోశాక కడవల్లో కూడా నీళ్ళు తెచ్చి పెట్టేది. కడవకు 'కానీ' చొప్పున కూలి తీసుకునేది.

కిట్టయ్యా అమాయకుడన్న విషయం ఆ నీళ్ళమనిషికి కూడా తెల్సిపోయింది. కడవను నెత్తిన పెట్టుకు వస్తూనే కేకవేసేది. "అరే, కిట్టయ్యా ! తొందరగా కడవదించు !" అనేది.

నేను ద్రావకాల్ని వండేప్పుడు లంగోటీతో వుండేవాణ్ణి. మధ్య తరగతి మనస్తత్వం కారణంగా లంగోటీతో ఒక స్త్రీ సమీపానికి వెళ్ళడానికి సంకోచించేవాణ్ణి, కానీ నీళ్ళమనిషి అరిచేది. "యాడ సచ్చావురా, కిట్టయ్యా ! నా మెడ ఇరిగిపోతాండాది ! బేగిరం వచ్చిదించు !" అనేది కోపంగా ! ఇంక వెళ్ళక తప్పేదికాదు.

నీళ్ళమనిషి బానలో రెండు కడవలు పోసి మూడు అనిచెప్పేది. కాదు రెండేనని వాదించేవాణ్ణి నేను. చనువూ, ప్రేమా కల్సిన స్వరంతో "సచ్చినోడా ! నీకు లెక్కకూడా వచ్చంట్రా ?' ' అనేది.

ఆమెకు లెక్కపెట్టడంరాదు. ఒక్కొక్క కడవపోసినప్పుడు మట్టి గోడన బొగ్గుతో ఒక్కోగీటు గీచుకునేది. మూడు కడవలుపోసి నాలుగు గీతలు గీచేది ! ఆమె అటు పోగానే తడిమట్టితో అదనంగా గీచిన గీటును చెరిపేవాణ్ణి. ఒక్కో కడవ నీళ్ళుపోసేక కాసేపు అలుపు తీర్చుకోడానికి కూచునేది. అలాకూచునప్పుడు నాపెళ్ళాం బిడ్డల్ని గురించి, ఇల్లూ, వాకిల్నీ గురించి రకరకాల ప్రశ్నలూవేసేది. నేనుకావాలనే చాలా అమాయకంగా, చాలా మూర్ఖంగా సమాధానం చెప్పేవాణ్ణి. నీళ్ళ మనిషి నా సమాధానాలను విని పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వేది.

'క్లోరోపిక్రిట్' నూ 'గన్‌కాటన్'న్నీ సమృద్ధిగా తయారుచేసుకున్నాం ! ఇంక ఢిల్లీ వెళ్ళిపోయే ప్రయత్నంలో వున్నాం. ఆ రోజు చిట్ట చివరిసారిగా 'క్లోరోపిక్రేట్'ని కడిగి ఆరబెట్టాను. సాయంత్రం ఆసుపత్రికి లేఖరాం మిత్రుడు ఒకతను వచ్చాడు. అతడు లేఖరాంతో, మేము బాంబులు తయారుచేయడానికి ఇంటిని తీసుకున్న బజారును వుద్దేశించి "ఆ బజారులో ఇవ్వాళ పోలీసులు తిరుగుతున్నారు!" అన్నాడు. అప్పుడు నేనూ ఆస్పత్రిదగ్గరే వున్నాను. పోలీసులు తిరుగుతూన్నారని విని ఇద్దరమూ కంగారుపడ్డాము. ఐతే, పైకి ఏ మాత్రం కనుపడనీయలేదు. ఆ చెప్పిన వ్యక్తి పేరు లక్ష్మణదాసు. అతడు రోహతక్ కాంగ్రెసు కమిటీకి సెక్రటరి ! లక్ష్మణదాసు వెళ్ళాక "ఇప్పుడేం చేసేట్టు" అన్నాడు లేఖరాం.

నేనిలా అన్నాను. "తయారయినవరూ తడిదోపొడిదో ప్రేలుడు పదార్థాన్ని మూటకట్టుకుని, తక్షణం పరారవుదాం ! ఇంటికి తాళం వేసేయి, మిగిలిన వస్తువుల గురించి తరువాత ఆలోచించుకోవచ్చును ఒకవేళ రాత్రికి పోలీసులు వచ్చిపడితే, తయారయిన పదార్థం దక్కుతుంది ! మనమూ తప్పించుకుంటాం !"

నేను తయారయిన పదార్థాన్ని మూట కట్టడానికి వెడుతూ లేఖరాంతో ఇలా అన్నాను. "నువ్వు లక్ష్మణదాసుతో అవసరమైన పనిమీద మధుర వెడుతూన్నానని చెప్పు. అతన్ని మీ ఇంటికి వెళ్ళి ఏదోపనిమీద నీవు మధుర వెళ్ళినట్టు చెప్పమను. నీవిలా వూరు విడిచి వెళ్ళడాన్ని ఎవరికీ చెప్పవద్దని మీ ఆవిడకు చెప్పి పంపు, మరొక విషయం- మూడు రోజుల తరువాత లక్ష్మణదాసును ఢిల్లీ క్లాత్ మార్కెట్టులోని ఖయాలిరాం గుప్తా ఇంటివద్దకు మూడుగంటలా చాయల రమ్మను. 'ఎందుకని ?' అని ప్రశ్నిస్తే అక్కడికి వచ్చాక చెప్తానను !"

సూర్యాస్తమయం కావస్తోంది. తయారయిన వరకూ ప్రేలుడు పదార్థాన్ని మూట కట్టుకున్నాం. మిగిలిన సామానుల్ని ఒకగదిలో పడేసి తాళాం వేశాం. లేఖరాం పల్లెటూరి రైతులా దుస్తులు మార్చుకున్నాడు. ఇద్దరం ఢిల్లీ రోడ్డున పడ్డాము ! ఇద్దరినెత్తినా మూటలువున్నాయి. ఢిల్లీవైపు వేళ్ళేకారు ఒకటి వచ్చింది. ఆపడానికి చేయి ఎత్తాము ! కారు ఆగింది. తీరాచూస్తే లోపల ముగ్గురు పోలీసులు కూచునివున్నారు. బాంబుల సామగ్రిని దగ్గర పెట్టుకుని పోలీసుల వరసన కూచోడం ఎలా ? కాక, కారుని ఆపమని ఎక్కకపోవడం ఎలా ? ఎక్కకపోతే పోలీసులకు అనుమానం కలగవచ్చుగదా ? ధర దగ్గర పేచీ పెట్టాము. కారుడ్రయివరు ఏవిధంగాను వప్పుకోడానికి వీల్లెనంత తక్కువ ఛార్జీ ఇస్తామన్నాము, ఢిల్లీకి ! కారు డ్రయివరు మా మూర్ఖత్వానికి తిట్టుకుంటూ అంతకే ఎక్కించుకోడానికి ఇష్టపడ్డాడు. ఎక్కక తప్పిందికాదు. ఐతే, పోలీసులుమమ్మల్ని గమనించ లేదు. కారులో ఇరవై ఏండ్ల స్త్రీ ఒకామెకూడా వుంది. పోలీసుల దృష్టంతా ఆమెమీదనే వుంది. పోలీసులు ఆమెనుచూసి ఇలా పాడుతూన్నారు "కొత్త వయసునాది ఓ డ్రయివరన్నా, కారు మెల్లగనడుపు"

నేనూ పోలీసుల మాటల్లో మాటకలిపాను "కొత్త వయసయితే, కారు మెల్లగా ఎందుకునడపాలి, పోలీసన్నా ? వయసేం పాలపిడతా ? తొణికి పోతుందని భయపడ్డానికి ?" అన్నాను.

పోలీసుల ఉత్సాహం రెట్టింపయింది. "భలే చౌధరీ, భలే" అంటూ నా వీపుమీద చరిచాడు ఒక పోలీసు. నవ్వుతూ పేలుతూ రాత్రి పదిగంటలకు ఢిల్లీ చురుకున్నాము.

మేమలా వచ్చేయడం తెలివయిన పని అని భగవతీచరణ్ అన్నాడు. ఐతే, మేము వచ్చేశాక రోహతక్‌లో ఎం జరిగిందో తెల్సుకోవాలన్న ఆదుర్దా ఎక్కువయింది. మూడవనాడు మధ్యాహ్నం మూడుగంటలకు గుప్తా ఇంటికి వెళ్ళాము. లక్ష్మణదాసును కల్సుకున్నాము. ఆరోజు పోలీసులు లేచివచ్చిన ఒకామెను వెతుకుతూ ఆ బజారులో అలాతిరిగారట. పోలీసుల విషయంలో మా ఆదుర్దా తగ్గింది. ఐతే, మరో విషయం మమ్ముల్ని బాధపెట్టింది.

లేఖరాం ఇలా ఆగస్మాత్తుగా వూరువిడిచి వెళ్ళాడని వినేసరికి, అతడి భార్య స్పృహతప్పి పడిపోయిందిట. స్పృహ వచ్చాక కూడా ఆహారం ముట్టకుండా, భర్త వస్తేనేగాని అన్నం ముట్టనని పట్టుపట్టుక్కూచ్చుదిట !

బాంబులకు అవుసరం అయిన రసాయనిక పదార్థాలను కొనడానికి లేఖరాం 250 రూపాయలు భార్యదగ్గర తీసుకుని మాకు ఇచ్చాడు. ఐతే, ఆ డబ్బును ఎలా ఖర్చుచేసింది, ఎందుకు ఖర్చుచేసింది భార్యకు చెప్పలేదు. చెప్పడానికి వీలూలేదు. ఈ మధ్య అతడు తరచు భార్యకు చెప్పకుండా ఢిల్లీ వెడుతూన్నాడు. అడపాతడపా రాత్రిళ్ళు ఇంటికి పోకుండా నాతోపాటు ఫ్యాక్టరీలోనే పడుకుంటున్నాడు. ఇప్పుడతడు వెనకటిలా తన సంపాదనని ప్రేమతో భార్యకు ఇవ్వడంలేదు. ఇదంతా చూస్తూ వుంటే భార్యకు అనుమానం వేసింది. 'ఏ దొంగముండో భర్తను వలలో వేసుకుంది' అనుకుంది లేఖరాం భార్య.

మేము లక్ష్మణదాసును కల్సుకోడానికి ఖయాలీరాంగుప్త ఇంటికి వెళ్ళాము. లక్ష్మణదాసు అప్పటికే వచ్చివున్నాడు. లేఖరాంను చూసి చిరునవ్వు నవ్వాడు. నన్ను గుర్తుపట్టలేదు. మౌనంగా వున్నాడు. కొత్తవాణ్ణి నా ఎదురుగా ఏం చెప్పగలడు ?

లేఖరాం, లక్ష్మణదాసుయొక్క సంకోచాన్ని అర్థం చేసుకున్నాడు.

"ఎందకూ సంకోచం ? ఇతను మరెవరోకాదు. మన కిట్టయ్యే "

అన్నాడు లేఖరాం.

అప్పటికీ లక్ష్మణదాసు నన్ను గుర్తుపట్టలేదు. లేఖరాం చెప్పింది అర్థమూ చేసుకోలేదు. మౌనంగానే వనాాడు.

లేఖరాం మళ్ళీ ఒకమాటు 'నేను కిట్టయ్య'నని చెప్పాడు. లక్ష్మణ దాసు నావైపు తేరిపార చూశాడు. ఎక్కడా పోలికల సామ్యం కుదరడం లేదు. సూటూ, బూటూ, టై, చక్కగా దువ్వుకున్నతల, నున్నగా గొరుక్కున్న గడ్డం - నన్ను ఎలా గుర్తించగలడు ? కిట్టయ్యను నేనేనన్న ఊహకూడా దుర్భరంగానే వుంది, అతడికి ! లక్ష్మణదాసు విశ్వాస పాత్రుడనీ, విప్లవ సంఘానికి ఉపయోగపడే వ్యక్తి అనీ లేఖరాం ముందే నాకు చెప్పివుంచాడు. అతణ్ణి గట్టి తెల్సుకోదలచాము. లక్ష్మణదాసు అలా సంకోచించడం చూసి నేను కిట్టయ్య భాషలో అదేస్వరంలో "మీ కిట్టాయినే కదండయ్యా !" అన్నాను. లక్ష్మణదాసు రెండుమూడు సార్లు నన్ను ఎగాదిగా చూశాడు. నేను 'కిట్టయ్య'నని నిశ్చయించుకున్నాడు. తరువాత లేఖరాం నా పేరు 'జగదీశ్' అనీ, నేను విప్లవసంఘంలోని ప్రముఖవ్యక్తి ననీ చెప్పాడు. నేను ఎప్పుడు కబురుపెడితే అప్పుడు రావలసిందనీ, చెప్పిన పనులను చేసిపెట్టవలసిందనీ చెప్పాడు.

బాంబులకు అవుసరం అయిన ప్రేలుడు పదార్థం తయారయ్యాక తగిన డిప్పలు సంపాయించడం సమస్య అయింది. రెండు సేర్ల ప్రేలుడు పదార్థం పట్టే పెద్ద డిప్పలు కావాలి. వాటిని ఇతర్లచేత చేయించడం ఇష్టం లేదు. సొంతంగానే తయారు చేసుకోవాలని మా వుద్దేశం. అందుకు ఒక వుపాయం ఆలోచించాం. మూడు పెద్ద ఇత్తడి గ్లాసుల్ని తెచ్చాం. వాటి మూతులకు సరిపోయిన ఇనుప బిళ్ళల్ని కోయించాం. ఆ బిళ్ళలకు కరంటువైర్లు పట్టేంత రంధ్రాలు ఏర్పరచాం. ఇక వాటిని లోటాల మూతులకు ఇపుప తీగలతో బిగించాం. ఈ మొత్తం కార్యక్రమాన్ని శ్రద్ధానంద బజారు వెనుక వైపున వున్న గొందిలోని అద్దె ఇంట్లోనే నిర్వహించాం. చుట్టుపట్ల వాళ్ళ దగ్గర బ్రిటీష్ ప్రభుత్వపు సువ్యవస్థను గురించి తెగ పొగుడుతూండేడాళ్ళం. రహస్యంగా, లోపలిగదిలో, వైస్రాయిట్రయిన్ని పడగొట్టడానికి బాంబుల్ని తయారు చేస్తూండేవాళ్ళం.

# రైలు పట్టాల క్రింద బాంబు !

బాంబులు తయారయ్యాయి. వైస్రాయిట్రయిన్ క్రింద బాంబుల్ని పెట్టడానికి సరైన ప్రదేశం ఏది ? అన్న సమస్య ఎదురైంది. అంటే, ఏ రైల్వే లైనుకింద బాంబుల్ని పెట్టాలి ? అన్నదొక సమస్యఅయింది. మొదట కాలకా - ఢిల్లీ రైల్వేలైనులో బాంబు పేల్చాలనుకున్నాము. వైస్రాయి సిమ్లా నుండి ఢిల్లీకి అదే లైన్న వస్తాడు. అతడు సిమ్లా నుండి వచ్చేప్పుడు,అతడి స్పెషల్ ట్రయిన్‌ని పడగొట్టాలని ఉద్దేశం. ఆ వుద్దేశంతోనే కాలకా-ఢిల్లీ రైల్వేలైన్‌ని పరిశీలించి చూశాము. ఆ లైన్ క్రింద బాంబులు పెట్టడానికి ఎన్నో అభ్యంతరాలూ, అసౌకర్యాలూ కనుపించాయి. వైస్రాయిట్రయిన్‌ని పడగొట్టడం కోసం ఒకరిద్దరం చనిపోవడానికియినా సిద్ధమే ! ఐతే, వైస్రాయి ట్రయిన్‌ని పడగొట్టీ, తప్పించుకుని బ్రతికే అవకాశమూ వుంటే మరీ మంచిది. ఆ దృష్టితో చూస్తే 'మధురా - ఢిల్లీ' రైల్వేలైను అన్ని విధాల తగివుంది. ఈ రైల్వే లైన్‌కు సమానాంతర రేఖలో బస్సు రూట్ వుంది. బాంబు పేల్చి ట్రయిన్‌ని పడగొట్టాక, పోరాటం సంభవించకపోతే, బాంబు పేల్చిన మిత్రుడు ఈ రోడ్డున ఢిల్లీకి వచ్చేయవచ్చును. బాంబు పేల్చడానికి ఢిల్లీ మధుర లైను తగినదని ఎంచాము. అందుకు అవుసరం అయిన ఏర్పాట్లల్లో మునిగిపోయాము.

రైలు పట్టా క్రింద బాంబు పెడితే, వైస్రాయి స్పెషల్ ట్రయిన్‌కు ముందు ఇతర ట్రయిన్‌లు ఆ లైన్ మీదుగా పోవచ్చును. వాటి వత్తిడికి బాంబులు పేలకుండా వుండడం అవుసరం. అందుకు

అవుసరం అయిన జాగ్రత్తలు తీసుకోవాలి. స్పెషల్ ట్రయిన్ వెళ్ళడానికి కొన్ని గంటల ముందు నుండి సాయుధులైన పోలీసులు రైల్వేలైనుకు రెండువైపులా కాపలా వుంటారు. కనుక, వైస్రాయి స్పెషల్ ట్రయిన్ రావడానికి గంటో రెండు గంటలో ముందు బాంబుల్ని లైన్‌క్రింద పాతిపెట్టడం సంభవం కాదు. కొన్ని రోజులు ముందుగా పాతిపెట్టవల్సి వుంటుంది. మరి అన్ని రోజుల్లోనూ ప్యాసింజర్ బండ్లు ఎన్నో ఆ పట్టాల మీదుగా పోతూవుంటాయి కదా. వాటికి బాంబులవల్ల ఏ విధమైన ప్రమాదమూ కలగకుండా చూసుకోవాలి. కనుక బాంబుల్ని ముందుగా పాతిపెట్టినప్పటికీ, మన ఇష్టం వచ్చినప్పుడు పేల్చుకోడానికి అనువైన ఉపాయాన్ని చూసుకోవాలి.

అందుకు తగిన ఉపాయాన్నీ ఆలోచించాము. రైల్వేలైనుకు కొద్ది దూరంలో వున్న పొదల్లో బ్యాటరీ నొకదాన్ని దాచి, బ్యాటరీ నుండి బాంబుల వరకూ వైరును భూమిలో నుండి తీసుకు వెళ్ళి జతపరచడం. ఒక వ్యక్తి బ్యాటరీ దగ్గర దాగివుండి, స్పెషల్ ట్రయిన్ బాంబుల మీదకురాగానే బటన్ నొక్కితేసరి. ఇంజను సరీగా బాంబుల మీదకు రాగానే బటన్ నొక్కితే, ఇంజను పడిపోతుంది. ఇంజన్ పడిపోగానే రైలు మొత్తమూ పడిపోతుంది. స్పెషల్ ట్రయిన్ పడిపోగానే ఎటూ గందరగోళం ప్రారంభం అవుతుంది. ఆ సంరంభంలో, గలభాలో - బాంబు పేల్చిన వ్యక్తి తప్పించుకుని నిరపాయంగా ఢిల్లీ వెళ్ళిపోవచ్చును.

మరొక విషయాన్ని గురించీ మేము ముందుగానే ఆలోచించి పెట్టుకున్నాము. రైల్వేలైన్‌ను అనుసరించి ఢిల్లీ వరకూ వున్న బస్సు రూటు, 'ఓఖలే' దగ్గర రైల్వేలైన్‌ను దాటుతుంది. అక్కడ రైలు గేటూ ఒకటుంది. బండి రావడానికి ముందు ఆ గేటు వేసేస్తారు. బండి వెళ్ళాకగాని తెరువచ్చు. బాంబు పేల్చి ఢిల్లీవైపు వచ్చే మిత్రుడు ఆ గేటు మూసి వుండడంవల్ల ఆగిపోవల్సి వస్తుంది. లేదా పోరాడి గేటును తెరిపించవల్సి వస్తుంది. ఆ పోరాటంలో బాంబు పేల్చిన మిత్రడు బతకనూవచ్చు. చనిపోనూవచ్చు, కనుక గేటు దగ్గర పోరాడనవసరం లేకుండా, ఉపాయంగా తెరిపించగలిగితే ? అందుకో మార్గాన్ని ఆలోచించాం. బాంబు పేల్చే మిత్రడు మిలటరీ ఆఫీసర్ దుస్తుల్ని ధరించాలి. అలా మిలటరీ ఆఫీసర్ దుస్తుల్ని ధరించడంవల్ల రెండు రకాల ప్రయోజనాల్ని సాధింపవచ్చును. ఒకటి బాంబు పేల్చిన స్థలం నుండి కొద్ది దూరం తప్పుకుంటే చాలు, ఇంకెవ్వరూ అతణ్ణి అనుమానించరు. నిరభ్యంతరంగా వెళ్ళి పోవడానికి వీలవుతుంది. రెండవది. మిలటరీ ఆఫీసరు దుస్తుల్లోని హోదా, దర్పం - రైలు గేటు తెరిపించడానికీ ఉపయోగపడుతుంది. మరో విషయాన్నీ ముందుగా ఆలోచించాము. బాంబు పేల్చిన చోటినుండి ఢిల్లీకి ఎంత త్వరగా వెళ్ళగలిగితే, అంత మంచిది. త్వరగా వెళ్ళడానికి సైకిల్ ఏ విధంగానూ పనికి రాదు. మోటార్ సైకిల్ వుండవల్సిందే. మిలటరీ ఆఫీసరు సైకిల్‌మీద కంటె మోటార్ సైకిల్‌మీద రావడమే హుందాగా వుంటుంది.

రైలు పట్టాల క్రింద బాంబుల్ని రాత్రిపూట మాత్రమే పెట్టడానికి వీలుంటుంది. ఏ రైలూరాని సమయం చూసి బాంబుల్ని పాతిపెట్టాలి. రాత్రిపూట్ల ప్యాసింజర్ బండ్లు ఏయే సమయాల్లో నడుస్తాయో టైంటేబుల్ చూసి తెల్సుకున్నాము. కానీ, గూడ్సు బండ్లు ఎప్పుడెప్పుడు వెళ్ళేదీ తెల్సుకోవడం ఎలా ? గూడ్సు బండ్ల రాకపోకల్ని తెల్సుకోడానికి మేమొక ఉపాయం ఆలోచించాము. మాలో ఒకరు రైల్వేలైన్ ప్రక్కన కొన్నాళ్ళు వుండి ఏయే బండ్లు ఎప్పుడెప్పుడు వెళతాయో గమనించాలి. ఈ పనికి నియమింపబడ్డ మిత్రుడు వుండడానికి అనువైన స్థలమూ ఒకటి కనుపించింది. రోడ్డుకు ప్రక్కన రైల్వేలైనుకు పదిగజాల దూరంలో, మొగలుల కాలంనాటి పడిపోయిన సత్రం ఒకటుంది. పరిస్థితిని గమనించే మిత్రుడు కొన్నాళ్ళపాటు శిథిలమైన ఆ సత్రంలో వుండాలి. ఆ శిథిలసత్రానికి ప్రక్కనే పది అడుగుల్లో బావిఒకటుంది.

ఇకనిప్పుడు శిధిల సత్రంలో సాధువుగా వేషం వేసుకుని కొన్నాళ్ళు వుండి పరిస్థితిని గమనించే మిత్రుడు అవుసరం అయ్యాడు. సాధువుగా వేషం వేసుకుని శిధిల సత్రంలో వుండడానికి నేను సిద్ధం. భగవతీచరణ్ కూడా సిద్ధంగా వున్నాడు. ఐతే, మాకు అంతకంటె కూడా ముఖ్యమైన పనులు ఎన్నో వున్నాయి.... మోటార్ సైకిల్ కొనుక్కోవాలి. దాన్ని వేగంగా నడపడం నేర్చుకోవాలి. బ్యాటరీని, కరెంటు తీగల్ని సంపాయించాలి. క్రొత్తగా పరిచయం అయిన మిత్రలతో సంబంధాలు తెగకుండా చూసుకోవాలి. అన్నింటినీ మించి డబ్బుది పెద్ద సమస్య, దాన్ని పరిష్కరించుకోవాలి. ఇలాంటివే అత్యవసరమైన పనులు ఇంకా ఎన్నో వున్నాయి.

అప్పటివరకూ భగవతీభాయి తన చేతుల్తో, తానే బాంబు పేల్చి స్పెషల్ ట్రయిన్‌న్ని పడగొట్టాలనుకుంటున్నాడు. నాకు నేనూ అలాగే నా చేతుల్తో పేల్చి పడగొట్టాలనుకుంటున్నాను. మా యిద్దరిలో ఎవరైనా కానీ, బాంబు పేల్చే వ్యక్తి సాధువు వేషం వేసుకుని సత్రంలో కూచోడానికి వీలు వుండదు. తలా, మీసాలూ, గడ్డం నున్నగా గొరిగించుకుని సాధువు వేషంలో వున్న వ్యక్తి మర్నాడే మిలటరీ ఆఫీసరుగా ఎలా వేషం వేయగలడు ? సాధువు వేషం వేసుకుని పరిస్థితిని గమనించడానికి లాహోరు నుండి ఇంద్రపాల్‌ను పిలిపించాలనుకున్నాము.

ఇంద్రపాల్‌కు రమ్మని జాబు రాశాను. జాబులో నా అడ్రసు రాయడం మంచిదికాదు. అతణ్ణి ఫ్రాంటియర్ మెయిల్లో రమ్మని రాశాను. అది ఉదయం ఏడున్నరకల్లా ఢిల్లీ వస్తుంది. ఇంద్రపాల్‌ని, జైలుకు ఎదురుగావున్న ఫిరోజ్‌షాతుగలక్ ఖిల్లా శిధిలాల్లోకి ఎనిమిదిన్నరా ఆచాయల రమ్మని రాశాను. అతడు అలాగే వచ్చాడు. ఫిరోజ్‌షాఖిల్లా చరిత్ర ప్రసిద్ధమైన స్థలం. ఆ ప్రదేశాన్ని చూడడానికి ఎందరో విలాస యాత్రికులు వస్తూంటారు. నేనూ ఒక విలాస యాత్రికుడిలా వేషం వేసుకుని కేమేరా నొకదాన్ని బుజానికి తగిలించుకుని కొద్ది నిముషాలు ముందుగా అక్కడికి చేరాను.

నేను రాసిన ప్రకారం ఇంద్రపాల్ ఎనిమిదిన్నరకల్లా అక్కడికి వచ్చాడు. ఇద్దరం ఖిల్లాను చూస్తూ, అటూ ఇటూ తిరుగుతూ మాట్లాడు కుంటున్నాం. ఖిల్లాలోని ఓ ఆకర్షణీయమైన ప్రదేశానికి వచ్చి ఆగిపోయాం. ఇంద్రపాల్ చాలా ఉత్సాహంగా "ఇక్కడ నాకు ఫొటో తియ్యి." అని అడిగాడు.

"అవుసరం అయినప్పుడు ఫొటో ఎటూ తీస్తాను." అన్నాను.

అతడు బలవంతంచేశాడు 'కాదు.' ఇప్పుడే తియ్యి అన్నాడు.

నేను నా భుజానికి తగిలించుకున్న కెమేరా కేసును తీసి చూపించాను. కేసులో కెమేరా లేదు. ఒక పరిచయునిదగ్గర ఒట్టి కేసు మాత్రం అడిగి తెచ్చుకున్నాను. ఇలాంటిచోట్ల విలాస యాత్రికుడనిపించుకోడానికి, కెమేరాలేని ఆ ఖాళీ కేసు సహాయపడగలదని అభిప్రాయం.

ఇంద్రపాల్‌తో ఇలా అన్నాను. "నవ్వెక పరారై పార్టీలోకి వచ్చేయవల్సిన సమయం ఆసన్నమైంది.'

"నా పరిస్థితిని అర్థంచేసుకో ! తరువాత నువ్వు ఎలా చెప్తే అలా చేస్తాను. నాకు ఇద్దరు తమ్ముళ్ళు వున్నారు. ఒకడికి పన్నెండేళ్ళూ, ఇంకొకడికి ఎనిమిది ఏళ్ళూ, వాళ్ళిద్దరికీ నేను తప్ప ఈ ప్రపంచములో ఇంకెవరూ లేరు. నాకు వారం రోజుల క్రితమే వివాహం అయింది." అన్నాడు. ఇంద్రపాల్.

"ఐతే, ఒకనెలలో రెండునెల్లో నీ అవుసరం వుంటుంది. ఆ రెండు నెల్లూ వచ్చేయ గలవా ?" అనడిగాను. అది ఆగస్టు నెల. అక్టోబరుకల్లా పని జరిగిపోతుందని నా ఉద్దేశం.

"వచ్చేస్తాను. ఐతే, ఆ రెండునెల్లూ నా తమ్ముళ్ళకు భోజన సదుపాయానికి అయ్యేఖర్చులు ఇప్పించు. ఈ మధ్య నేను చాలా ఖర్చులో పడ్డాను. నాదగ్గర కానీ డబ్బులేదు. ఛార్జీలకుకూడా ఇబ్బందిపడివచ్చాను." అన్నాడు ఇంద్రపాల్.

"రెండు నెల్లకు నీ తమ్ముళ్ళకు ఎంత ఖర్చు అవుతుంది ? ఎంత డబ్బుకావాలి ?" అనడిగాడు.

ఇంద్రపాల్ లెక్కవేసి చూసి, ఇరవై రూపాయలు అడిగాడు.

పది రూపాయలు అప్పుడే ఇచ్చేశాను. ఒక చీటీమీద 'ఇతనికి ఇరవై రూపాయలు ఇవ్వవల్సింది' అని వ్రాసి ఇచ్చాను. చీటీమీద ప్రాణనాధుడు అని సంతకం పెట్టాను. దాన్ని ఇంద్రపాల్ చేతికిఇస్తూ "అవుసరం వచ్చినప్పుడు నిన్ను వచ్చేయమని రాస్తాను. అప్పుడు నువ్వు ఈ చీటీని దుర్గాబాభీకిగానీ, లేక ప్రేమవతికిగానీ చూపించి డబ్బు తీసుకో." అని చెప్పాను.

అతడువచ్చి ఏం చేయవల్సివుంటుందో నేను చెప్పలేదు. అతడు అడుగలేదు. ఏమిటి ? ఎందుకు ? ఎప్పుడు ? ఇలాంటి ప్రశ్నలు మాకు నచ్చవు. ఇంద్రపాల్ నియమపాలనలో గట్టివాడు. అతడిని మేము వున్న ఇంటిదగ్గరకు తీసుకువెళ్ళలేదు. మధ్యాహ్నం బండికి అటు నుంచి అటే లాహోరుకు పంపించాను. అతడు వచ్చేప్పుడు ఒక సూట్‌కేస్ తీసుకువాచ్చడు. అది చూడడానికి చిన్నదే అయినా, చాలా బరువుగా వుంది. దానిలో సుఖదేవ్ పోతపోయించిన బాంబుల డిప్పలు వున్నాయి. ఇంద్రపాల్ దగ్గరనుండి ఆ సూట్‌కేసును నేను తీసుకున్నాను.

ఇంద్రపాల్‌కు రాసి ఇచ్చిన చీటీమీద ప్రాణనాధుడు అని సంతకం పెట్టినట్టు రాశాను. అదో గమ్మత్తయిన విషయం. మొదటగా పరారైవెళ్ళేప్పుడు 'ఇంద్రపాల్ అడ్రసుకు ప్రాణనాధుడు అన్న పేరుతో జాబులు రాస్తాను' అని చెప్పాను. ప్రాణనాధుడు అన్న పేరు ఆలోచించి పెట్టుకుందికాదు. ఆ క్షణానికితోచింది, ఆ పేరు పెట్టుకున్నాను.

ఒక రోజున సుశీలాదీదీ ఇలా అంది. "ఏమిటీ పిచ్చి పేరు పెట్టుకున్నావు ? పిలవాలంటే సిగ్గువేస్తుంది గదా ?"

"ఏం చేయమంటారు ? జీవితంలో ప్రాణనాధుడు అని పిలచేవాళ్ళు ఎవరైనా వుంటారన్న నమ్మకం నాకు లేదు. అందుకే ఆ పేరు పెట్టుకున్నాను. ఇప్పుడు అందరూ నన్ను తప్పనిసరిగా 'ప్రాణనాధుడు' అని పిలుస్తారు." అన్నాను నవ్వుతూ.

"ఛీ....ఛీ... అసభ్యుడా!" అని విదిలించుకుంది సుశీలాదీదీ. అప్పటినుండి నేను మంచివాణ్ణికానన్న ఓ స్థిరమైన అభిప్రాయాన్ని ఏర్పరచుకుంది ఆమెగారు. నన్ను పిలవవల్సివస్తే 'అసభ్యుడు' అనిగానీ, 'సభ్యతకు మొదటి పుస్తకం' అనిగానీ పిలిచేది ఆమెగారు. ఐతే, ఢిల్లీలో నా పేరు ప్రాణనాధుడు కాదు, జగదీశ్.

సెప్టెంబర్‌లో ఇంద్రపాల్‌ని ఢిల్లీ వచ్చేయమని జాబువేశాను. ఈ మాటు అతణ్ణి చాందినీచౌక్‌లోని 'మానస సరోవర్' హోటల్లో కల్సుకోమని రాశాను. నేను అతడు రావడానికి కొన్ని నిమిషాలముందు అక్కడికి చేరాను. టీ తాగాక ఇద్దరం 'ఫతేహ్‌పురీ' బజార్లోని ఓ సత్రంలోకి వెళ్ళాం. వెళ్ళేప్పుడే 'ఓ రెండునెల్లపాటు సాధువు వేషంలో నువ్వు వుండవల్సి వుంటుంది' అని అతడికి చెప్పాను.

ఇంద్రపాల్ సాధువువేషంలో రెండు నెల్లు ఉండడానికి అంగీకరించాడు. ఇద్దరం సైకిళ్ళుమీద మధుర రోడ్డున వెళ్ళాం. ఢిల్లీకి తొమ్మిది మైళ్ళ దూరంలోవున్న మొగలుల కాలంనాటి పడిపోయిన సత్రాన్ని అతడికి చూపి "సాధువువేషం వేసుకుని నువ్వీ శిధిలాల్లో వుండాలి. దగ్గర్లో రెండువూళ్ళు వున్నాయి. అక్కడికి వెళ్ళి భిక్ష తెచ్చుకో ! రెండు గ్రామాల ప్రజలకూ, వచ్చేపోయే వారికి నువ్వు సాధువువన్న విశ్వాసం కలిగేట్టు ప్రవర్తించు. నేనూ, భగవతీచరణ్ అప్పుడప్పుడూవచ్చి చూసి పోతూంటాము" అని చెప్పాను.

ఆ నిర్జన ప్రదేశంలో వుండడానికి ఇంద్రపాల్ వప్పుకున్నాడు. అప్పటికీ అక్కడ అలా సాధువు వేషంలో ఎందుకు వుండాల్సో నేను చెప్పనూలేదు. అతడు అడగనూలేదు. మర్నాడు సాధువువేషం వేసుకోవాలని నిశ్చయించుకున్నాం. మర్నాటి మధ్యాహ్నం నేనూ భగవతీ చరణ్ పాండవులకిల్లా దగ్గరకు వెళ్ళాం. అక్కడికి ఇంద్రపాల్ మా కంటే ముందు చేరాడు. అతడు తలా, గడ్డం, మీసాలూ నున్నగా గొరిగించుకుని వచ్చాడు. మేము వెళుతూ సాధువులకు అవుసరం అయిన సామాన్ని వెంట తీసుకు వెళ్ళాం.. కాషాయి రంగువేసిన పాతధోవతి ఒకటి, ఒక కంబళి, కమండలం, చిలం, ఓ సవాపావు పుగాకు ఇవన్నీ తీసుకువెళ్ళాం. ఇద్రపాల్ పాండవులకిల్లాలోని ఓ మూలకువెళ్ళి వేషాన్ని మార్చుకున్నాడు. సాధువువేషంలో మధుర రోడ్డు ప్రక్కన వున్న శిధిల సత్రానికి వెళ్ళిపోయాడు. మేము రెండు రోజుల్లోవచ్చి తనను కలుసుకుంటామని చెప్పాము. అతడు విడిచిన మామూలు గుడ్డల్ని మాతోపాటు గదికి తెచ్చాము.

మూడు రోజుల తరువాత. సైకిల్ వేసుకుని ఇంద్రపాల్‌ని కల్సుకోడానికి వెళ్ళాను. సూర్యాస్తమయం ఇంకా కాలేదు. అతడు గోచీని మాత్రం పెట్టుకుని బావి గట్టుమీద కూచునివున్నాడు. ముఖం తీసి పోయింది. బావి గచ్చుమీద ఇద్దరు ముగ్గురు గ్రామస్థులు కూచుని చిలంపట్టు పడుతూన్నారు.

నేను వాళ్ళ ఎదుట ఇంద్రపాల్‌ని గౌరవించాను. "సాధూబాబా" అని పిల్చి కాళ్ళకు నమస్కారం పెట్టాను.

"శుభమస్తు, సుఖమస్తు" అని నన్ను దీవించాక "షాహుకారు ఏం పనిమీద వచ్చావిటు ?' ' అని ప్రశ్నించాడు ఇంద్రపాల్.

నేను సాధారణ వ్యాపారస్థుడిలా దుస్తులు వేసుకుని వెళ్ళాను. నలుగురి ఎదుట అతడిని గౌరవిస్తూ క్రింద చతికిలబడి కూచున్నాను. "నిన్న పెద్ద గుమాస్తాగారు మధురనించీ కారులోవస్తూ తమర్ని ఇక్కడ చూశారుట... దర్శనం చేసుకుందామని వచ్చాను. తమ దయవల్ల ఇంటో ఆనోళ్ళు కులాసాగుండారు. తమరు ఒక్కమాటు దయచేసి మా ఇంటిని పావనం చెయ్యండి." అని అన్నాను.

అక్కడ కూచున్న వాళ్ళను ఉద్దేశించి "సాధూబాబాగారు పట్నాల్లో వుండరు. ఆ రభస, ఆ రొద వీరికి గిట్టవు. ఢిల్లీలో పెద్ద పెద్ద సేటులూ, షాహుకార్లూ సాధూబాబాగారి దర్శనం కోసం తహతహలాడుతూ వుంటారు. ఐతే, వీరికి ధనాశ బొత్తిగా లేదు. డబ్బే సంపాయించదలచుకుంటే లక్షలు సంపాయించేవారు కారా ? నిండు యవ్వనంలో సంసారాన్ని త్యజించి సన్యాసి అయ్యారు. వీరు ఏం చెబితే అది అక్షరాలా జరిగిపోతుంది. వీరి చేతిమీదుగా ఇంత వీపూది మంత్రించి పెట్టారా ? ఏ రోగమైనా రక్కిన కట్టవల్సిందే మా ఇంట్లో ఆనోళ్ళకు నాలుగు నెల్లనుండి అజీర్తి... తాగిన నీళ్ళు కూడా ఇమడడంలేదు. బాబాగారు మూడు చిటికెల వీపూది పెట్టారు. దాంతో రోగమంతా ఎటుపోయిందో ? ఏం తిన్నా అగ్నిలా భస్మం అయిపోతూన్నది...." అని ఇంద్రపాల్ వైపు తిరిగి నమస్కరించి వినయంగా "సాధూబాబా, మరో చిటికెడు వీపూది దయ చేయించండి, ఆనోళ్ళకు శరీరంలో బలం వస్తుంది.' అన్నాను.

ఇంద్రపాల్ గంభీరంగా "పదిరోజుల పాటు చూడు బలం దానంతట అదే వస్తుంది." అన్నాడు.

నేనలా కూచుని ఏమేమిటో అడుగుతూనే వున్నాను "బాబా ! వ్యాపారాలు పడిపోయాయి. బొత్తిగా అమ్మకాలు లేవు. వీపూది మంత్రించి దయ చేయించండి. బీద ముండాకొడుకుని బతికి పోతాను."

అక్కడ వున్నవాళ్ళు వెళ్ళిపోతే ఇంద్రపాల్‌తో అసలు విషయం మాట్లాడవచ్చునని అనుకుంటున్నాను.

సూర్యాస్తమయం అయింది. అందరూ వెళ్ళిపోయారు. ఇంద్రపాల్ తన బాధను చెప్తూకు వచ్చాడు. "మూడు రోజుల నుండి తిండి లేదు. మొన్న పక్కవూరికి భిక్షానికి వెళ్ళాను. ఒక ఇంట్లో అడిగాను. ఇల్లాలు గుప్పెడు గోధుమ పిండి తెచ్చి కమండలంలో వేసింది. మరో ఇంటికి వెళ్ళడానికి సిగ్గు వేసింది. ఆ పిండిని వూరి వాళ్ళు చూస్తూండగానే చీమలకు పోశాను. నిన్న మళ్ళీ ఒక ఇంటికి వెళ్ళాను. ఆ యిల్లాలూ గుప్పెడు పిండి వేసింది. దాన్నీ చీమలకు పోశాను. మూడు రోజుల నుండి మంచినీళ్ళే ఆధారం. ఆకలిని చంపుకోడానికి అదేపనిగా చిలంపట్టు పట్టడంవల్ల తల తిరుగుతోంది. నడవను గూడా నవడలేకుండా వున్నాను" అన్నాడు.

విని చాలా బాధపడ్డాను. వెంటనే సైకిల్‌మీద ఢిల్లీ వచ్చాను. భగవదీభాయికి పరిస్థితిని చెప్పాను. వెంటనే భగవతీభాయి ఓ పది పరోటాలూ, ఇంత కూరా, ఒక పిడతనిండా పెరుగు, నాలుగు రోజుల పాటు నిల్వ వుండే మిఠాయి కొంత తీసుకుని సైకిల్‌మీద ఇంద్రపాల్ దగ్గరకు వెళ్ళాడు. ఇంద్రపాల్ కమ్మగా భోజనం చేశాడు.

మూడు నాలుగు రోజుల వరకూ ఇంద్రపాల్ అలాగే తనకు లభించిన భిక్షను చీమలకు పెడుతూ వచ్చాడు. ఊరి ప్రజలకు ఆశ్చర్యం వేసింది. "సాధుబాబా, మరి మీరేమీ భోంచేయరా ?" అని అడిగారు.

ఇంద్రపాల్ చాలా వుదారంగా "నాయనా, చీమలు కూడా శివుడి సృష్టేకదా ? వాటికీ కడుపునిండాలికదా ? కొద్ది పిండి లభించింది గనుక చీమలకు పెట్టాను. నాకు సరిపోయినంత లభించినప్పుడు నేనూ తింటాను." అన్నాడు. ఇంద్రపాల్ మాటలూ, ప్రవర్తనా ఊరి ప్రజల మీద గొప్పగా ప్రభావాన్ని వేశాయి. అతడు ఒకే ఇంటి దగ్గర భిక్ష అడిగే నియమాన్ని అక్షరాలా పాటించాడు. ఇప్పుడతడికి ఒక ఇంటి దగ్గరే సరిపోయేట్టు భిక్ష లభిస్తోన్నది. ఒక్కోప్పుడు ఊరి ప్రజలు సత్రం దగ్గరకే భోజనం తెచ్చి పెడుతూన్నారు.

బావిలో నుండి నీరు చేదుకోడానికి తాడొకటి, ఆస్ప్రిన్ బిళ్ళలు కాసిని, అమృతాంజనం బాటిల్ ఒకటి, హిందీ రామాయణము, హిందీలో 'హస్తరేఖా సాముద్రికం' పుస్తకం ఒకటి, వ్యాఘ్రు చర్మం - ఇవన్నీ తీసుకు వెళ్ళి ఇంద్రపాల్‌కు ఇచ్చాము. నేనూ, భగవతీచరణ్ - ఢిల్లీలోని సాధారణ వ్యాపారస్తుల వేషంలో అతడి దగ్గరకు వెడుతూండే వాళ్ళం. నలుగురూ చూసేట్టు సాధూబాబా పట్ల భక్తి శ్రద్ధల్ని ప్రదర్శిస్తూ, కాళ్ళకు నమస్కరించే వాళ్ళం.

సత్రానికి రెండు వైపులా ఉన్న ఊళ్ళు, ఒకటి మదన్‌పురం, రెండవది తేహ్‌ఖండ్. ఈ రెండు గ్రామాల ప్రజలు ఇంద్రపాల్ దగ్గరకు మందుకూ మాకుకూ వస్తూండేవారు. కొందరు ప్రశ్నలు అడగడానికీ వచ్చేవారు. ఇంద్రపాల్ చెప్పగా గ్రామ ప్రజలు నాలుగు కుండల్ని కొని బావి గట్టున చెట్టుకింద పెట్టారు. గ్రామ ప్రజలు ఆబానల నిండా నీళ్ళు తోడి పోసేవారు. 'సాధూబాబా' దాహంగొన్న బాటసారులకు మంచి నీళ్ళు పోస్తూండేవాడు.

ఆ శిధిల సత్రానికి దగ్గర్లో రైలు గేటు వుంది. గేటు కాపలా దారు (చేతరాం) పొరపాటు వల్ల రెండు గొర్రెలు రైలు కిందపడి చచ్చిపోయాయి. అతడు సాధూబాబా దగ్గరకు వచ్చి కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

ఇంద్రపాల్ ఓ క్షణం కళ్ళు మూసుకుని ధ్యాన్నించినట్టు నటించాడు. "రోజూ బావి గట్టుమీద కూచుని రామనామాన్ని జపించు. రోజూ ఓ పది మందికి నీళ్ళుపోయి. పది మందికి పోసే వరకూ రామ నామాన్ని జపిస్తూ బావి గట్టుమీదనే వుండాలి. నీకు ఏ చెరుపూ జరగదు." అని చెప్పాడు.

చేతరాం అలాగే చేశాడు. కాకతాళీయంగా ఓ అర్ధరూపాయి జుర్మానాతో తప్పించుకున్నాడు. తల నొప్పిగా వున్నవారూ, నడుములు నొప్పి పెట్టినవారూ మందు కోసం వచ్చేవారు. ఇంద్రపాల్ ఆస్ప్రీన్ బిళ్ళల్నినూరి, ఆ పొడిని విభూతితో కలిపి పెట్టేవాడు. ఆ పొడిని ఇచ్చేప్పుడు కొంత తంత్రం చేసేవాడు.

మొదట్లో ఇంద్రపాల్ ఆ శిథిల సత్రంలో చాలా కష్టపడ్డాడు. పస్తులు పడుకున్నాడు. దోమలు, పాములూ వేధించాయి. ఒక మాటు పాముని తొక్కనూ తొక్కాడు. మా పరిచయుడైన ఓ డాక్టర్ని అడిగి పాము కాటుకు మందు తీసుకువెళ్ళి ఇచ్చాం అతడికి. ఇన్ని బాధలు పడినప్పటికీ తనను ఆ నిర్జన ప్రదేశంలో ఎందుకు వుండమన్నామో, అతడికి తెలియదు. అతడు అడగలేదు. కొన్నాళ్ళ తరువాత చుట్టుపట్ల గ్రామాల ప్రజలకు 'సాధూబాబా' మీద భక్తి కుదిరింది. బావి దగ్గర ప్రదేశాన్ని శుభ్రంచేసి పురుగూపుట్రా భయం లేకుండా చేశారు. రోజూ ఎవరో ఒకరు భోజనం కూడా పట్టుకువచ్చి పెడుతూండేవారు.

325రూ. పెట్టి ఓ పాత మోటార్ సైకిల్‌ని కొన్నాం. దాన్ని నడపడం నేర్చుకోడానికి రోజూ సత్రం మీదుగా మధుర వెళ్ళి వస్తూండేవాణ్ణి. అలా వెళ్ళి వచ్చేప్పుడు సూటూ, బూటూ వేసుకొని దర్పంగా వుండేవాణ్ణి. ఇంద్రపాల్ దగ్గర ఆగేవాణ్ణికాదు. హాయిగా వున్నాడా, లేదా - అని చూస్తూ వెళ్ళేవాణ్ణి. ఒకటి రెండుమార్లు అత్యవసరమైన వార్తను చెప్పవల్సి మోటార్‌సైకిల్ మీద వెళుతూ ఆగాను. అక్కడ ఆగడానికి ఓ వంక అవుసరం అయింది. మోటార్ సైకిల్ ఇంజన్‌కు నీళ్ళు అవుసరం అన్న వంకతో ఆగాను. పాపం ఆ పల్లె ప్రజలకు మోటార్ సైకిల్‌కి నీరు అవుసరం వుండదని తెలియదు. మోటర్‌కి నీరు అవుసరం అయినట్టు దీనికీ నీరు అవుసరం అనుకునేవారు. నేను మోటర్ సైకిల్‌కి ముందు తగిలించి వుండే 'కార్బాయిడ్ లాంప్' లో నీరు పోయించుకునేవాణ్ణి.

సాధారణంగా నేను ఇంద్రపాల్ దగ్గరకు వ్యాపారస్తుడి వేషంలో వెళ్ళేవాణ్ణి. ఐతే, సూటూ, బూటూ వేసుకున్నప్పుడు నన్ను 'సాధూబాబా' భక్తులు అసలు గుర్తించనేలేదు. మనుషులు దుస్తుల్ని, ప్రవర్తననీ చూస్తారు - ముఖకవళికల్ని పట్టించుకోరు.

అలా శిథిల సత్రంలో ఇంద్రపాల్ మూడు వారాలు నానాకష్టాలు పడ్డాడు. అప్పటికీ అతడికి అలా వుండడం ఎందుకో చెప్పలేదు. అతడికి చెప్పకుండా ఇలా వ్యవహరించడానికి కారణం వుంది. ఒకవేళ ఇంద్రపాల్ బాధల్ని భరించలేక వెళ్ళిపోతే ? అప్పుడు అతడికి రహస్యాన్ని చెప్పడం అనవసరమే అవుతుంది కదా ? కానీ, ఇంద్రపాల్ బాధలకు జడిసి వెళ్ళిపోలేదు. విప్లవకారుడిగా తగిన ధైర్యాన్ని, సహనాన్ని కనబరిచాడు.

ప్రయత్నాలన్నీ పూర్తి అయ్యాయి. వైస్రాయి అక్టోబరు రెండవ వారంలో బొంబాయి వెళతాడనీ, ఇరవై నాలుగవ తారీకున అక్కణ్ణుండి తిరిగి వస్తాడనీ తెల్సింది. ఆనాటికి అంతా సిద్ధం చేసుకుని 'యాక్షన్ని' జరిపేయాలని నిశ్చయించుకున్నాము.

వైస్రాయి ట్రయిన్ కింద ఎవరు బాంబు పేలుస్తారనేది త్వరలో నిర్ణయించుకోవాలి. బాంబు పేల్చే వ్యక్తి ఆదికి తగిన మిలటరీ ఆఫీసరు డ్రస్సు కుట్టించుకోవాలి. నేనే బాంబు పేలుస్తానని వాదించాను భగవతీ భాయితో. నా వాదన సారాంశం 'నేను చనిపోయినా ఫరవాలేదు. నువ్వు ఎక్కువ రోజులు బతికి వుండడం పార్టీకి అవుసరం' ఇది.

భగవతీభాయీ తన వైపు నుండి తనే బాంబు పేలుస్తానని వాదించాడు. "జయచంద్రగారు నా మీద తీవ్రంగా దుష్ప్రచారం చేశారు. కనుక నేను విప్లవసంఘంలో స్వేచ్ఛగా పనిచేసే అవకాశం లేదు. కాగా, ఈ కార్యక్రమంలో నువ్వు గనక చనిపోతే, కావాలని నిన్ను నేను చంపించానని జయచంద్రగారు ప్రచారం చేస్తారు. నన్ను సి.ఐ.డి. అనడానికి ఆధారం ఆయనకు దొరుకుతుంది." ఇది భగవతీచరణ్ వాదన.

ఆరోజు వాదన చాలా తీవ్రస్థాయిలో జరిగింది. నేను కొంచెం కోపంగానే ఇలా అన్నాను. "ఏమిటీ నీ పిచ్చివాదన ? సి.ఐ.డి., వైస్రాయి ట్రయిన్ కింద బాంబు పేల్చించాడంటే ఎవరు నమ్ముతారు ? బాంబు పేల్చించడం సి.ఐ.డి. పనికాదు. బాంబు పేల్చకముందే పేల్చేవాళ్ళను పట్టివ్వడం అతడి పని'.'

భగవతీభాయి చిరునవ్వునవ్వాడు. నన్ను రెండు చేతులతోటీ వాటేసుకుని "మిత్రమా నిన్ను ఒప్పించడం కష్టమేాయ్" అన్నాడు. ఆ రోజే మేము కొత్త ఢిల్లీలోని 'కనాట్ సర్కస్'కు వెళ్ళాము. నా ఆదికి సరిపోయిన ఖాకి (మిలటరీ ఆఫీసరు) డ్రస్సు తీసుకున్నాం. తరువాత గణేశ్ శంకర్ విద్యార్థిగారి ద్వారా ఆజాద్‌ను కల్సుకోడానికి ప్రయత్నించాలను కున్నాం.

వైస్రాయిట్రయిన్ కింద బాంబు పేల్చే ఈ కార్యక్రమం వ్యక్తిగతమైన కార్యక్రమంగా ఎవరూ భావించరాదని మా ఉద్దేశం. ఇంగ్లీషు ప్రభుత్వపు దమననీతికి వ్యతిరేకంగా 'హి.స.ప్ర.స' కమాండర్. ఇన్. చీఫ్ పేర కరపత్రం ఒకటి ప్రకటించాలనీ అనుకున్నాం. కనుక ఆజాద్‌ను కల్సుకోవడం అవసరం. ఝాంసీలో సదాశివరావ్ తమ్ముడు శంకరావ్ వున్నాడు. ఆ శంకరరావు ద్వారా ఆజాద్‌ను కల్సుకొన వచ్చునని భగవతీభాయీకి కాన్పూర్‌లోని ఒక మిత్రుడు చెప్పాడు. భగవతీభాయి ఝాంసీ వెళ్ళాడు. అక్కడికి వెళ్ళాక ఆజాద్ గ్వాలియర్‌లో వున్నాడనీ, అతడూ విప్లవసంఘంలోని ఇతర మిత్రులూ ఘోరమైన ఆర్థిక బాధల్లో వున్నారనీ తెల్సింది భగవతీభాయీకి.

భగవతీచరణ్ ఆజాద్‌కు ఓ సందేశాన్ని పంపించాడు. 'పంజాబులోనూ, ఢిల్లీలోనూ పరిస్థితి కొంత మెరుగ్గా వుంది. మిత్రులకు అవుసరం అయితే డబ్బుగానీ, ఆశ్రయంగానీ సులభంగా దొరుకుతూన్నది ఇక్కడ. ప్రస్తుతం ఐదు వందల రూపాయిలు సర్దగల స్థితిలో వున్నాము. మేము ఒక అత్యవసరమైన కార్యక్రమాన్ని గురించి మీ సలహా తీసుకోవాలి. కనుక మిమ్మల్ని కల్సుకోడానికి ఎదురు చూస్తూంటాము.' అని కబురు పెట్టాడు. నాలుగు రోజుల్లో వచ్చి ఏ విషయాన్నీ తెల్సుకుంటానని చెప్పి భగవతీచరణ్ ఢిల్లీ వచ్చేశాడు. ఆజాద్‌తో సంబంధం ఏర్పడ వచ్చునని మేము ఆశించాము.

ఒక రోజు ఇంద్రపాల్ దగ్గరకు వెళ్ళాను. "ఢిల్లీ - మధుర లైను మీదుగా రాత్రి పది గంటల నుండి తెల్లవారు జామున ఐదు గంటల వరకూ ప్యాసింజర్ బండ్లుగానీ, గూడ్సుబండ్లుగానీ ఏయే సమయాల్లో వెడుతూ వుంటాయో మేలుకుని వుండి గమనించ"మని చెప్పాను అతడికి.

అతడు అలాగే చేశాడు. ఇన్నాళ్టిలోనూ ఇంద్రపాల్ రైల్వేలైనుని గురించి అనేక విషయాలు తెల్సుకున్నాడు. లైనును బాగు చేయడం, పట్టాలు తొలగించడం, బిగించడం - లాంటివి. రాత్రి 11 గంటల నుండి తెల్లవారు జామున ఐదు గంటల వరకూ ఆ లైనుమీద ప్యాసింజర్ బండ్లు తిరగవని చెప్పాడు. అది గూడ్సు బండ్లకు ప్రత్యేకింపబడిన సమయం. అప్పుడప్పుడూ ఇంద్రపాల్‌తో పాటు ఎవరైనా ప్రయాణీకులు శిథిల సత్రంలో రాత్రి పూటను గడుపుతూండడంకద్దు. ఒక రోజు నేను ఇంద్రపాల్ దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాను. "ఈ రాత్రికి ఎవరినీ ఇక్కడ పడుకోనీయకు. రాత్రికి నేను ఢిల్లీ నుండి బాంబులు పట్టుకువస్తాను. ఇద్దరంకల్సి రైలు పట్టాలకింద పాతి పెట్టుదాం."

తనుపడ్డ ఈ శ్రమకంతటికీ ఆదర్శం వైస్రాయిట్రయిన్ కింద బాంబు పేల్చడం అని తెలిశాక, ఇంద్రపాల్‌కండ్లు ఆనందంతో మెరిశాయి. అతడు గద్గద స్వరంతో "మిత్రమా ఈ 'యాక్షన్' జరిగితే నేను పడ్డ ఇంత కష్టానికి ఫలితం లభించుచినట్టు భావిస్తాను." అన్నాడు.

రాత్రి తొమ్మిది గంటలాచాయల ఇత్తడి లోటాలతో తయారు చేసిన రెండు బాంబులు, ఒక బర్మా, ఒక పలుగూ మొదలైన పరికరాల్ని తీసుకుని, సైకిల్ మీద ఇంద్రపాల్ దగ్గరకు వెళ్ళాను. ఆ రోజు

పౌర్ణమి అనుకుంటాను. పిండి ఆరబోసినట్టు వెన్నెల కాస్తోంది. ఇంద్రపాల్ బావి గట్టుమీద కూచుని నా కోసం ఎదురు చూస్తున్నాడు.

అతడికి బాంబుల్ని చూపించి 'వీటిని పట్టాలకింద పాతి పెట్టాలి ! అన్నాను.

బాంబుల్ని చూసేసరికి ఇంద్రపాల్ కండ్లల్లో కాంతి స్పష్టంగా కనుపించింది. వెంటనే వెళ్ళి బాంబుల్ని పాతిపెట్టడానికి కూచోడం అవివేకం అవుతుంది. తెల్లవారు జామున నాలుగు గంటల వరకూ, బండ్లురావు. ఏ అభ్యంతరమూ లేకండా పనిపూర్తి చేసుకోవచ్చును.తెల్లవారు జామున మొదటగా రెండు గూడ్సు బండ్లు వెడతాయి. ఒకవేళ, రైలు వెళ్ళే అదురుకు బాంబులు వాటంతట అవి ప్రేలినా గూడ్సు బండ్లకే దెబ్బ తగులుతుంది. అనవసరమైన మానవహత్య జరగదు.

దాదాపు ఇంకా గంటన్నర వరకూ ఎదురు చూస్తూ కూచోవాలి. అప్పుడుగాని పని ప్రారంభించడానికి వీల్లేదు. మేమిద్దరం పడిపోయిన సత్రం మేడ మీదకు వెళ్ళి కూచుందామనుకున్నాం. సైకిల్‌ని, సత్రం లోపల, కిందనే, దట్టమైన చీకటికోణంలో పడుకోబెట్టాం. పైకి వెళ్ళడానికి మెట్లులేవు. పడిపోయిన గోడ మీదుగా ఎక్కి పైకి వెళ్ళాము. పైన మేము కూచోడానికి కంబళినీ, పులి చర్మాన్ని తీసుకున్నాడు ఇంద్రపాల్. నేనేమో బాంబుల మూటను చేత పుచుకున్నాను. ఇద్దరం పైకి ఎక్కాం.

పంటలు కోశారు. సత్రానికి చుట్టుపట్ల చాలా దూరాలవరకూ ఖాళీ చేలు కనుపిస్తున్నాయి. ఇసుక భూమి వెన్నెలట్లో తళతళా మెరుస్తోంది. చిన్న చిన్న దుబ్బులూ, పొదలూ భూమి రంగులోనే కల్సి తమ ప్రత్యేకతను గోల్పోయాయి. రోడ్డుకు రెండు వైపులా వున్న వృక్షాలు, వెన్నెట్లో చిన్న చిన్న మొక్కల్లా మెరుస్తూ కనుపిస్తున్నాయి. సత్రానికి ఒక వైపున నల్లని తార్రోడ్డు. మరో వైపు రైల్వేలైను. పరిసరం నిశ్శబ్దంగా వుంది. ఎక్కడో తీతువు కూస్తోంది.

నేనూ, ఇంద్రపాల్ - సత్రం పైన కూచుని హాయిగా మాట్లాడు కుంటున్నాం. ఆ అర్ధరాత్రిపూట మా మాటలు ఎవరూ వినరన్న విశ్వాసంతో, లాహోరులో జరిగిన సంఘటనల్ని జ్ఞాపకం చేసుకుని పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వుకుంటున్నాము. విపరీతంగా నవ్వుకుంటున్నామేమో, మాటిమాటికీ ఇద్దరికండ్లూ చెమరుస్తున్నాయి. ఆ నిశీధిలో మా నవ్వులు అనంత విశ్వంలో ప్రతిధ్వనిస్తూన్నట్టుంది.

"ఎవరక్కడ ? కదలకండి జాగ్రత్త" అన్న క్రూరమైన గదమాయింపు మా నవ్వుల్ని ఠక్కిన ఆపింది. తేరుకుని తలెత్తి ఎదరకు చూశాం. ఇద్దరు పోలీసులు మా వైపు తుపాకులు గురిపెట్టి నిలబడి వున్నారు.

అలాంటప్పుడు కంగారు పడకుండా ఎలా వుంటాం. నా దగ్గర పిస్తోలు వుంది. ఐతే, చెయ్యి కదిలించే అవకాశం ఏదీ ?

ఇంద్రపాల్ నన్ను మోచేత్తో చిన్నగా పొడిచి, మెల్లగా "పిస్తోల్" అన్నాడు.

మెదలకుండా వుండమని అతడికి సౌజ్ఞ ద్వారా తెలియపరిచాను. పడిపోయిన గోడమీద గుండా పైకి ఎక్కేదారిలో నిలబడి పోలీసుల్ని ఉద్దేశించి "ఎపురుండి, అయ్యాగోరు తమరు ?" అన్నాను పల్లెటి స్వరంలో.

"మీరు ఎవరు ?" పోలీసులు మరి కొంచెం కటుస్వరంలో పెద్దగా ప్రశ్నించారు.

ఇంద్రపాల్ ధైర్యంగా సమాధానం ఇచ్చాడు. "మేం సాధువులం. నెలనాళ్ళగా ఇక్కడ వేంచేసి వున్నాం. మీరు ఎవరి కోసం వెతుకుతూన్నారు" అని అడిగాడు.

పోలీసులు నన్ను చూపి "ఇతడు ఎవరు ?" అని ప్రశ్నించారు.

"భక్తుడు" ఇంద్రపాల్ సమాధానం ఇచ్చాడు.

నేను రెండు చేతులూ జోడించి, బతిమలాడుకుంటూ, కొజ్జాల్లా మోచేతుల్ని బుజాల్ని కదిలిస్తూ, "అయ్యా, బాబూ- నేను బీద కోమిటోణ్ణయ్యా. మా వూరు మదిర" అంటూ మెల్లగాలేచి

నిలబడ్డాను. పై నుండి కిందకు దూకడానికి వీలుంటుందేమోనని చూశాను. కింద పది పన్నెండు మంది మనుషులు లాఠీలు పుచ్చుకు నిలబడి వున్నారు. ఇంక ఇప్పుడు పిస్తోలును నమ్ముకోడం కంటే ఏదో రకంగా మాటల్తో తప్పించుకోవడమే మంచిది.

ఇంద్రపాల్ మళ్ళీ ఇలా అన్నాడు. "మేము సాధువులం మీరు పోలీసులు. మీరు మమ్మల్ని రక్షించాలిగాని, బాధ పెట్టకూడదు."

పోలీసులు "సాధూబాబా, మేము మిమ్మల్ని ఇబ్బంది పెట్టం. మీరు హాయిగా రామనామం జపం చేసుకోండి ! కానీ, దొంగలూ తోడు బోతులూ మీ దగ్గర తలదాచుకుంటే, వాళ్ళను పట్టుకోవడం మా కర్తవ్యం కదా ?" అన్నారు.

"ఐతే, వీడు దొంగ అంటారా ?" ఇంద్రపాల్ ఆశ్చర్యాన్ని ప్రకటించాడు. నా వైపు తిరిగి "ఏరా, నువ్వు దొంగవా ?" అని అడిగాడు.

నేను మళ్ళీ చేతులు జోడించాను. "నేను దొంగనుకాను. దొరగోరు ! బిద కోమిటోణ్ణి. కావాలంటే మా వూరొచ్చి ఇసారించుకోండి తెలుసుద్ది" అన్నాను.

ఇంద్రపాల్ పోలీసులతో, నన్ను గురించి "ఈ నాయాల దొంగ అంటారా ? నేను నమ్మను.' ' అన్నాడు.

తుపాకులు గురిపెట్టి నిలబడివున్న పోలీసుల్లో ఒకడు ఇలా అన్నాడు. "నీకేం తెలియదు సాధూబాబా ! ఈ నాయాల రైలు పట్టాలకింద బాంబులు పెట్టేరకం. అమాయకుడిలా వేషం వేస్తున్నాడు. ఇలాంటోళ్ళు చాలా మంది పరార్లో వుండారు."

"అరేయి. నీ చేతులు చూపించరా." అన్నాడు రెండవ పోలీసు.

రోహతక్‌లో బాంబులు చేసేప్పుడు, పిక్రిక్ యాసిడ్ స్పర్శవల్ల చేతులు ఎర్రపడ్డాయి. ఇప్పుడు నేను తడవతడవకూ చేతులు జోడిస్తూండడంవల్ల చేతుల ఎరుపు పోలీసులకు కనపడి వుంటుంది. ఇద్దరు పోలీసులూ పిట్ట గోడను దాటి బాగా దగ్గరకు వచ్చారు. ఒకతను అప్పటికీ తుపాకిని మా వైపు గురిపెట్టే వున్నాడు. ఐతే, రెండో అతడు మాత్రం తుపాకి మడమను నేలకు టాకించాడు.

మొదటి పోలీసు ప్రశ్నించాడు "నువ్వు బాంబులు చేసేవాడివి కాకపోతే, నీ చేతులు ఎర్రగా ఎందుకు వున్నాయిరా ?" అని అడిగాడు.

పోలీసులకు, బాంబులు చేసేవారి చేతులు ఎర్రగా వుంటాయని ఎలా తెల్సిందో నేను వూహించుకోలేక పోయాను. అప్పట్లో విప్లవకారులు చాలా మంది అరెస్టు అయ్యారు. మరి వాళ్ళల్లో ఎవరి చేతులయినా ఎర్రగా వున్నాయోమో. లేక, అప్రూవర్లగా మారిన విప్లవకారుల్లో ఎవరైనా పిక్రిక్ యాసిడ్ స్పర్శవల్ల చేతులు ఎర్రపడతాయని పోలీసు అధికారులకు చెబితే, వారు సాధారణ పోలీసులకు ఈ విషయాన్ని చెప్పారేమో, విప్లవకారుల్ని గుర్తించడానికి సాయపడవచ్చుననే ఉద్దేశంతో ! ఏమైనాగానీ, నా గురించి పోలీసు చాలా ఖచ్చితంగా వూహించాడు. చేతులు ఎర్రగా వున్న ప్రతివాడూ బాంబులు తయారు చేసేవాడు అనుకోవడం అసంబద్ధమే అవుతుంది. ఐతే, నా పట్ల అసంబద్ధం కాలేదు. సత్యమే అయింది!

పోలీసు అంత సూటిగా ప్రశ్నించేసరికి నేను కొంచెం అధికంగానే కంగారు పడ్డాను. ఐతే, పిస్తోలును నమ్ముకోవల్సిన పరిస్థితి కాకపోవడం వల్ల మరి కొంచెం ధైర్యాన్ని ప్రకటిస్తూ "మా వదినమ్మ గోరింటాకు రుబ్బించింది అయ్యగోరూ. మనసుండబట్టలేక నేనూ రవంత పెట్టుకుండాను." అన్నాను.

ఇంద్రపాల్ కోపంగా తిట్టాడు. "అరె, కొజ్జానాయాల ! మొగోడివై యుండి. ఆడోళ్ళకు గోరింటాకు రుబ్బుతావుర్రా ?" అన్నాడు.

నేను ఏడుపుస్వరంతో "ఏం చెయ్యను బాబూ, వదినమ్మ చెప్పిన పని చెయ్యకపోతే, అన్నయ్య ఇంట్లో నుంచి తన్ని తగిలేత్తాడు. ఒకమాటు, రోకలి తీసుకుని కొట్టాడు, చూడండి." అంటూ తల ముందుకు వంచాను.

పోలీసులకు నా మాటల్లో కొంత విశ్వాసం కలిగింది. "నాయాల... గోరింటాకు రుబ్బావా ? లేక గంజాయి దమ్ము కొట్టడం కూడా వుందా" అని అడిగాడు ఒక పోలీసు.

నేను ప్రాదేయపూర్వకంగా "ఎప్పుడైనా రెండు దమ్ములు కొడుతుంటాను బాబూ ! మా వూరి గుళ్ళోకి ఇట్టాంటి సాధూబాబాలు ఎవరైనావత్తే దమ్ముకొడతానికి చిలం ఇత్తుంటారు." అన్నాను.

పోలీసులు నా యిల్లూ వాకిలీ, ఊరూ పేరూ అన్ని వివరాలూ అడిగారు. నేను ఏడుస్తూన్నట్టు కన్నీళ్ళు తుడుచుకుంటూ అన్నీ వివరంగా చెప్పాను. "మాది మదిర (మధుర) పాండు రంగడిగుడి ఎనకాతల గళ్ళీలో. ఎర్రమేడ పక్కన మా యిల్లు ! అమ్మా - అయ్యా సిన్నప్పుడే సనిపోయారు. ఇద్దరు అన్నలు వుండారు. పెద్ద వదినమ్మ మా గడుసుది. కొట్టుద్ది. కోసుద్ది. ఆమె పోరు పడలేక కూలీనాలీ సేసుక బతుకుదామని ఢిల్లీ ఎలుతుండా 'సాధూబాబా' గార్ని గురించి అందరూ చెప్పుకుంటుండారు. దరిశనం సేసుకు ఎలితే ఫలితం ఇచ్చుద్దని ఈ పూటకు ఈడ ఆగే" అన్నాను.

పోలీసు 'భారతీయ శిక్షాస్మృతి'ని బాగా అవలోడనం చేసినట్టున్నాడు. "నిన్ను వదలడానికి వీల్లేదు. ఏ పనీ పాటూ లేకండా తిరుగుతూన్నావు. పైగా, గంజాయి తాగుతానని చెప్తూన్నావు. నిన్ను అరెస్టు చేసి 109వ సెక్షన్ కింద కేసు పెట్టవచ్చును. 'బదర్‌పూర్' పోలీసు స్టేషన్‌కు పద. ఎవరైనా వచ్చి జామీను ఇస్తే, అప్పుడు వదిలి పెడతాం" అన్నాడు.

రెండవ పోలీసు తన నడుముకు తగిలించుకున్న బేడీలను తీసి, నావైపు చాపి "చేతులు పట్టు" అన్నాడు.

నేను ఉలిక్కిపడి వెనక్కి తగ్గినట్టు నటించాను. నా ధైర్యం సన్నగిల్లింది. కండ్లు తుడుచుకునే వంకతో ధోవతి చెరుగును పైకి తీసుకుంటున్నట్టు నటించి ఒక మాటు చేతిని నడుమున వున్న పిస్తోలు వరకూ పోనిచ్చాను. ఐనా, మరోమారు ప్రయత్నించి చూద్దామనుకున్నాను. ఏడుస్తూ "బాబోయ్ ! టేసనుకు వత్తే కులం సెడుద్ది. వదినమ్మ ఇంట్లో అడుగు పెట్టనీదు. కులంలో నుండి ఎలేత్తారు. పెళ్ళి సంబంధం సెడుద్ది" అన్నాను.

పోలీసులు నాతో అశ్లీల పదజాలతో ఎగతాళికి దిగారు. మళ్ళీ ఒకమాటు నా ఇల్లూ వాకిలి గురించిన వివరాలు అడిగాడు, మొదటి పోలీసు. ఒకవేళ నేను అబద్ధం చెప్పివుంటే రెండవ మాటు చెప్పడంలో తప్పక పొరపడతానని అతడి వుద్దేశం. కానీ, నేను పొరపడతానా ? అక్షరాక్షరం మొదట చెప్పిందే చెప్పాను. కులం చెడుతుందని మరో మాటు ఏడిచాను.

పోలీసులు నాతో ఎగతాళికి దిగడం చూసి ఇంద్రపాల్ ఒక పోలీసుని "కానిస్టేబుల్‌గారూ, మీతో ఒక్కమాట." అని పిలిచి, ఆ పోలీసు బుజంమీద చెయ్యివేసి పడిపోయిన పిట్టగోడ దగ్గరకు తీసుకు వెళ్ళాడు.

నేనిలా అనుకున్నాను. 'ఇంద్రపాల్ ఇద్దరు పోలీసుల్ని వేరు చేశాడు. వాణ్ణి పిట్టగోడమీద నుండి కిందికి నెట్టి, వాడి దగ్గరవున్న తుపాకిని లాక్కుంటాడు. నేను వీడికి పిస్తోలు చూపించి వీడి దగ్గరున్న తుపాకి లాక్కుంటేసరి.'

నేను శ్వాస బిగబట్టుకుని, ఇంద్రపాల్ ఆ పోలీసుని ఎప్పుడు కిందకు నెడతాడా అని ఎదురు చూస్తున్నాను. కానీ, అతడు అలాంటి దేమీ చేయలేదు సరికదా, వెనుక్కు తిరిగి నా దగ్గరకు వచ్చి "అరేయి, నీ జేబులో ఏముందో తీసి, కానిస్టేబుల్‌గారికి ఇచ్చేయరా ! లేకపోతే స్టేషనుకు పట్టుకుపోతారు. కొరడా దెబ్బలు పడతాయి. నాయాల ఖైదులోనే హరీ అంటావ్" అన్నాడు ఇంద్రపాల్.

నేను నా జేబులో నుండి ఒక పది రూపాయిల కాగితాన్ని, ఒక రూపాయి బిళ్ళనూ, పావులాబిళ్ళనూ తీసి ఇంద్రపాల్ చేతిలో పెట్టాను.

అప్పుడే పోలీసు దృష్టి నా జేబు మీద పడ్డది. నా జేబు వైపు వేలితో చూపుతూ "ఏరా, నువ్వు మహా పల్లెటూరి బైతులా వేషం వేస్తున్నావ్ మరి నీకా కలం ఎక్కడిది ?" అని అడిగాడు.

పోలీసు ఈ ప్రశ్న వేయడంతో నేను అదిరి పడ్డాను. నేను ఇంత వరకూ చెప్పిన మాటలకూ నా జేబులో వున్న ఫౌంటెన్ పెన్నుకూ ఏ విధంగానూ పొంతన కుదరదు. ఆ కలం ఏ పరిచయుని దగ్గరో కొట్టేసింది. 'వాటర్ మేన్ ఫౌంటెన్‌పెన్' ఆ రోజుల్లోనే దాని ఖరీదు పది పన్నెండు రూపాయిలకు తక్కువుండదు. అయినా నేను నా 'అమాయకత్వాన్ని' నటిస్తూనే వున్నాను.

"దీన్ని తిర్నాల్లో పదణాలకు కొనుక్కుండా, బాబూ !" అన్నాను.

అంతలోకే పోలీసు దృష్టి మరో విషయం మీదకు పోయింది. పరిహాసంగా నవ్వుతూ "నాయాలకు సదువైతేరాదుగానీ, కలమొకటి జేబుకు తగిలించుకుని పంతులయ్యి ఐపోవాలనుంటున్నాడు !" అన్నాడు.

ఇంద్రపాల్ వ్యవహారం సరి చేశాడు. పదకొండు రూపాయిలు పోలీసులకు ఇచ్చాడు. పావులా తను అట్టే పెట్టుకున్నాడు గంజాయి కోసం ! ఇంతలో నాకో ఆలోచన వచ్చింది. దగ్గరున్న డబ్బు అంతా తీసుకున్నా, ఏ మాత్రం బాధ పడకపోతే పోలీసులకు అనుమానం వేయదా ? నేను వెంటనే చేతులు జోడించి "బాబూ, ఢిల్లీ ఇంకా పది మైళ్ళుంది. బస్సు ఖర్చు కేమైనా ఇప్పించండి బాబూ ! పొద్దున్నే తిండికీ ఒక అణా డబ్బులు దయ చేయించండి !" అని బతిమలాడాను.

పోలీసులు ఒక రూపాయి తిరిగి ఇచ్చేశారు. ఒక సలహానూ ఇచ్చారు. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దన్నారు. 'మరెవరైనా వచ్చి అడిగితే, మధురనించి వస్తూన్నట్టు చెప్పవద్దు. దేవి తిరునాళ్ళ నుండి వస్తూన్నట్టు చెప్పు' అన్నారు. పక్కవూళ్ళో దేవి తిరునాళ్ళు జరుగుతోంది.

పోలీసులూ, కింద వున్న మనుషులూ - అందరూ వెళ్ళి పోయారు. వాళ్ళు వెళ్ళిపోయాక మేము మళ్ళీ నవ్వుకున్నాము. "బాగానే దొరికి పోయాం. అయితే యేం ? అద్భుతంగా తప్పించుకున్నాం." అనుకున్నాం.

మేము పోలీసుల దృష్టిని ఆకర్షించడానికి కారణం, అలా, అర్థ రాత్రిపూట పెద్దగా నవ్వడమే. అప్పట్లో మధుర రోడ్డున చాలా దోపిడీలు జరిగాయి. వాటి నిరోధం కోసం బదర్‌పూర్ నుండి ఇద్దరు సాయుధులైన పోలీసులు నిజాముద్దీన్ పోలీసుస్టేషన్ వైపు రౌండ్‌కు బయల్దేరుతారు. నిజాముద్దీన్ స్టేషన్ నుండి ఇద్దరు పోలీసులు బదర్‌పూర్ వైపు వెడతారు. ఈ రెండు జట్లూ దారిలో ఒకరిని ఒకరు కల్సుకున్నాక, ఎవరి స్టేషనుకు వారు వెనక్కు తిరిగి వెళతారు. ఇంద్రపాల్ నాకు ఆ పరిసరాన్ని గురించి చాలా విషయాలు చెప్పాడు. ఐతే, పోలీసుల ఈ రౌండ్‌ను గురించి చెప్పడం మర్చే పోయాడు. దారిలో దోపిడిగాళ్ళు వున్నారని తెల్సినా, నేను ఎన్నో మార్లు వంటరిగా సైకిల్ మీద వెళ్ళాను, వచ్చాను. ఎన్నడూ భయపడలేదు.

రైలు పట్టాలక్రింద గోతులు తీయడానికి చాలా పరిశ్రమించవల్సి వచ్చింది. ఎలాగైతేయేం ? బాంబుల్ని పాతి పెట్టాము. తెల్లవారుజామున నాలుగు గంటలకు గూడ్సు బండి ఒకటి వెళుతుంది, అదివెళ్ళే వరకూ అక్కడే వున్నాము. గూడ్సు బండి వెళ్ళే వత్తిడికి బాంబులు పేలు తయ్యేమోనని మా భయం. కానీ, బాంబులు పేలలేదు గూడ్సు బండి 'ధనధన' శబ్దం వేసుకుంటూ వెళ్ళి పోయింది. మేలు రకం పేలుడు పదార్థాన్ని తయారు చేయగలిగినందుకు మేము ఎంతో సంతోషించాము.

ఆ రాత్రి నేనూ ఇంద్రపాల్... ఒకే కంబళిని కప్పుకుని గడిపాము. అప్పుడు బయల్దేరితే పోలీసుల రెండవ జట్టు తగలవచ్చు; లేక దొంగలు తారసిల్ల వచ్చును. సొగం రాత్రి వరకూ హాయిగానే నిద్రపోయాం. తరువాత చలి విపరీతం అయింది. తెల్లవారుజామునే లేచి సైకిల్ మీద ఢిల్లీ వెళ్ళిపోయాను. చుట్టుపట్ల గ్రామాల నుండి పాలు అమ్ముకునే వాళ్లు ఎందరో సైకిళ్ళ మీద ఢిల్లీ వెడుతూ కనుపించారు.

గదికి వచ్చాక రాత్రి జరిగిందంతా భగవతీచరణ్‌కు చెప్పాను. అతడు నా చాతుర్యాన్ని మెచ్చుకుంటాడనుకున్నాను. మెచ్చుకోక పోగా కోప్పడ్డాడు. అనవసరంగా, అంత పెద్దగా నవ్వి పోలీసుల దృష్టికి ఎక్కినందుకు గదమాయించాడు. "ఇక నిన్ను రాత్రిపూట వంటరిగా సత్రం దగ్గరకు పోనీయను." అన్నాడు. ఇంకా అక్కడ చేయవల్సిన పని చాలా వుంది. ఇంకో బాంబును పాతి పెట్టాలి. బాంబుల దగ్గర్నుండి దగ్గర్లో వున్న పొదలవరకు వైర్‌ని పాతి పెట్టుకోవాలి. మర్నాడు మూడవ బాంబునీ తయారు చేసుకున్నాం. 250 గజాల ఎలెక్ట్రిక్ వైర్‌ని కొన్నాం.

ఆ రాత్రి సత్రం దగ్గరకు నాతోపాటు తనూ రావడానికి సిద్ధం అయ్యాడు భగవతీచరణ్. రావద్దని ఎంతగానో చెప్పాను. "ఇద్దరమూ వెడితే, ఏదయినా అనుకోని ఆపదవస్తే - ఇద్దరమూ పట్టుపడడమో, లేక చనిపోవడమో జరుగుతుంది. అంతకంటే ఒకరు వెళ్ళి మరొకరు సురక్షితంగా వుండడం నయం కాదా ?" అన్నాను. భగవతీభాయిని కావాలని కూడా నేను కొంత రావద్దని ఆటంక పరిచాను. అందుకు కారణం, అతడి ముక్కు రంధ్రాల్లోనో, లేక గొంతులోనో కొంత లోపం వుంది. ఎప్పుడూ సన్నగా దగ్గుతూ వుంటాడు. అతడు శ్వాస పీల్చేప్పుడూ గురకపెడుతూన్నట్టు శబ్దం వస్తుంది.

రాత్రి పది పన్నెండు గంటల మధ్య పోలీసులు రౌండ్‌కు వస్తారు. వాళ్ళు కాసేపు ఇంద్రపాల్ దగ్గర కూచునిగాని వెళ్ళరు. ఆ కాసేపూ ఏ పడిపోయినా గోడచాటునో నక్కి వుండల్సి వస్తుంది. భగవతీభాయి దగ్గడం, గురక పెట్టినట్టు శ్వాస పీల్చడం - దాక్కోవడానికి అభ్యంతరంగా పరిణమిస్తాయి. అందుకే అతణ్ణి రావద్దన్నాను. ఐనా, అతడు వినలేదు.

మేము రాత్రి పది గంటలాచాయల ఇంద్రపాల్ దగ్గరకు వెళ్ళాం. చలి మిక్కుటంగా వుండడంవల్ల అతడు మంటవేసుకు చలికాగుతూన్నాడు. సరీగా పదిన్నరకు పోలీసులు నిజాముద్దీన్ వైపు వెడతారు. పదకొండున్నరకు తిరిగి బదర్‌పూర్ వైపు వెడతారు. తిరిగి వెళ్ళేప్పుడు కాసేపు ఇంద్రపాల్ దగ్గర కూచుని రెండు చిలందమ్ములు కొట్టివెడతారు.

సత్రంలో ఒకగది పడిపోకుండా మంచిస్థితిలో వుంది. దాన్లో ఇంద్రపాల్ నివాసాన్ని ఏర్పరచుకున్నాడు. పక్కగది పడిపోయి రాళ్ళూ రప్పల్తో నిండివుంది. ఆ పడిపోయిన గదిలోనే మేము దాక్కోవాలి, పోలీసులు వచ్చినప్పుడు. ముందుగానే పడిపోయిన గదిలోకి వెళ్ళి టార్చి లైటు సాయంతో, మేము కూచోడానికి స్థలాన్ని ఏర్పాటు చేసుకు వచ్చాము. బదర్‌పూర్ వైపు నుండి పోలీసుల బూట్ల శబ్దం ఎప్పుడు వినవస్తుందా ? అని ఎదురు చూస్తున్నాము. చెవులు రిక్కించుకున్నాము. కొంతసేపటికి, బదర్‌పూర్ వైపు నుండి రోడ్డుమీద పోలీసుల బూట్ల శబ్దం వినిపించింది. మేమిద్దరం పడిపోయిన గదిలోకి వెళ్ళి ఒక మూలన ఒదుక్కున్నాం. మా సైకిళ్ళను ఒకమూల పడేశాం. మా ఇద్దరికీ ఎడం చేతుల్లో టార్చిలైట్లు, కుడి చేతుల్లో పిస్తోళ్ళూ రెడీగా వున్నాయి. బూట్ల శబ్దం రాను రాను దగ్గరకు వస్తూన్నచి. పోలీసులు ఇంద్రపాల్‌ను ఉద్దేశించి "సాధూబాబా సుకంగా వున్నావా ?" అని అడిగారు.

"రాండి ! రాండి ! కానిస్టేబుల్ గారూ ! రెండు దమ్ములు కొట్టి పోదురుగాని" అని కేక వేశాడు ఇంద్రపాల్.

"తిరిగి వెళ్ళేప్పుడు వస్తాం." అంటూ పోలీసులు వెళ్ళిపోయారు.

పోలీసులు నాలుగడుగులు ముందుకు వెళ్ళి పోయారు. ఇంద్రపాల్ మమ్మల్ని ఉద్దేశించి "బుల్లోళ్ళూ, ఇంకోక్కక్షణం ఊపిరి బిగబట్టుక్కూచోండి." అన్నాడు.

'ఇప్పటికి గణ్ణం గడిచింది. ఐతే, తిరిగి వచ్చేప్పుడు పోలీసులు తిష్టవేస్తారుగదా ? భగవతీచరణ్ దగ్గులూ, గురకలూ అప్పుడు కొంప ముంచుతయ్యేమో' అని యోచిస్తూ రెండు క్షణాలు గడిపి బయటికి వచ్చాం.

"ఏరా, పోలీసువాడు నీ చిన్నాన్నా, దమ్ముకొట్టి వెళ్ళమని ఆహ్వానిస్తున్నావ్ ?" అని అడిగాను ఇంద్రపాల్‌ని.

"అరేయ్, మీరిద్దరూ నన్నీ పాడుపడ్డ సత్రంలో పెట్టి తాడు తెంచారు. ఒక్క పది నిమిషాలు బాధపడలేరేం ?" అన్నాడు నవ్వుతూ ఇంద్రపాల్.

మేమిద్దరం బయటికి వచ్చి మంట దగ్గర కూచుని చలికాగుతూ పోలీసులు తిరిగి వచ్చే సవ్వడి కోసం చెవులు రిక్కించుకున్నాం ! కొంతసేపటికి పోలీసుల బూట్ల శబ్దం మళ్ళీ వినపడ్డాది. పోలీసులు ఇంద్ర పాల్ దగ్గరకు వచ్చి కాసేపు కూచున్నారు. మాట్లాడుకుంటున్నారు. నా దగ్గర పది రూపాయలు కొట్టేసిన పోలీసు స్వరాన్ని గుర్తుపట్టాను. ఇంద్రపాల్ అతడి పేరును కూడా అడిగి తెల్సుకున్నాడు. తను అరెస్టు అయ్యాక ఇంద్రపాల్ ఈ పోలీసును గురించీ వాఙ్మూలంలో చెప్పాడు. ఇతడి పేరునూ, నంబరునూ కూడా చెప్పాడు. ఈ కానిస్టేబుల్ గారిని కోర్టుకు లాగారు. లంచం తీసుకున్న అపరాధానికి ఉద్యోగం కాస్తా వూడిపోయింది. ఇతడు బదర్‌పూర్ పోలీసుస్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్. అతడి నంబరు పదకొండు.

ఇంద్రపాల్ అరెస్టు అయ్యాక ప్రభుత్వసాక్షి అయ్యాడు. తన వాఙ్మూలంలో తెహాఖండ పరిసరంలోని ఎందరి పేర్లనో చెప్పాడు. ఇతడి వాఙ్మూలంలోని సత్యాసత్యాలను తెల్సుకోడానికి వాళ్ళందరినీ కోర్టుకు పిలిపించారు. వీరిలో రైలుగేటు కాపలాదారు చేతరాం కూడా వున్నాడు.

కోర్టులో కూడా వీళ్ళు ఇంద్రపాల్‌ని 'సాధూబాబా' అనే పిలిచారు. అతడి కాళ్ళకు నమస్కరించారు. "మమ్మల్ని పోలీసోళ్ళచేత సావగొట్టించావు కదా, సాధూబాబా." అని అడిగారు.

ఇంద్రపాల్ చెప్పిందానికంటె మరి కూడా రహస్యాలు తెల్సుకోడానికి పోలీసులు వీళ్ళందర్నీ చావ కొట్టారు. ఇంద్రపాల్ దొంగ సాధువని తెలిసినప్పటికీ వీళ్ళు అతణ్ణి 'సాధూబాబా' అనడం మానలేదు. ఇంద్రపాల్ అద్భుతమైన శక్తులు కల 'సాధూబాబా' అన్న విశ్వాసం వాళ్ళను వదలలేదు. విశ్వాసం మనుషుల మీద ఎంతగా ప్రభావాన్ని వేస్తుందో తెల్సుకోడానికి ఈ ఒక్క ఉదాహరణ సరిపోతుంది.

సరె, అదలావుంచి ప్రస్తుతానికి వద్దాం. పోలీసులు ఇంద్రపాల్ దగ్గర కూచుని మాట్లాడుతున్నారు. పదకొండో నంబరు పోలీసు ఇలా అన్నాడు. "సాధూబాబా, మీ దయవల్ల ఆనాడు పది రూపాయలు దొరికాయి. చలికాలం పులిలావచ్చి పడ్డది. ఇంటో పెళ్ళాం బిడ్డలకు కప్పుకోడానికి దుప్పట్లు లేవు. మీరు దయచూపితే మళ్ళీ ఏమైనా నాలుగు డబ్బులు దొరుకుతాయి. మీకూ గంజాయికి ముట్ట చెబుతానులే. సాధూ బాబా , దారేపోయే బాటసార్లను ఒక పూటకు ఇక్కడ వుండమంటూండు. ఆ పై విషయం మేం చూసుకుంటాం."

ఇంద్రపాల్ ఆ పోలీసుకు ధైర్యాన్నిచ్చాడు. "అలాగే, అలాగే, తప్పకుండా వుండమంటాను. భగవంతుడు ఎవరికి పెట్టేది వాళ్ళకు పెడతాడు." అని చెప్పాడు.

"మీదయ" అన్నాడు పదకొండో నంబరు పోలీసు.

పోలీసులు - అందరూ వెళ్ళి పోయారు.

దాదాపు ఇరవై నిముషాలసేపు భగవతీచరణ్ ఊపిరి బిగబట్టుకు కూచున్నాడు. దగ్గూ, గురక - అంతాబంద్ ! పదకొండున్నర తరువాత మూడవ బాంబును కూడా పట్టాలకింద పాతి పెట్టాము. రెండు వందల యాభైగజాల ఎలెక్ట్రిక్‌వైర్‌ను బాంబుల దగ్గర నుండి రోడ్డు ప్రక్కన వున్న పొదల వరకూ పాతిపెట్టాం. ఆ రాత్రిని సత్రంలోనే గడిపాం. ఇంక రెండు మూడు రోజులే వ్యవధి వుంది. వైస్రాయి 24వ తారీకు ఉదయం ఆరు గంటకు ఢిల్లీ వస్తాడు. ఈ రెండు మూడు రోజులూ ఇంద్రపాల్ చాలా జాగ్రత్తగా వుండాలి. రైళ్ళ రాకపోకలవల్ల, భూమి అదిరి, బాంబుల్ని పాతినచోట మట్టీ, రాళ్ళూ చెదరి అవి బయటకు కనబడుతాయేమో గమనిస్తూ వుండాలి. 24వ తారీకు ఉదయం స్పెషల్ ట్రయిన్ కింద బాంబు పేలుస్తాం. 23వ తారీకున పొద్దూకింతరువాత ఇంద్రపాల్‌ని అక్కడ నుండి ఢిల్లీకి తీసుకుపోవాలనుకున్నాము.

అంతా సిద్ధం అయింది. అక్టోబర్ 21న భగవతీచరణ్ ఆజాద్‌ను కల్సుకునే ప్రయత్నంలో మరోమాటు కాన్పూర్ వెళ్ళాడు. నేనెంతో ఉత్సాహంగా వున్నాను. 'బాంబుల్ని పాతిపెట్టడం జరిగింది. ఆజాద్‌ను కల్సుకోవడం కూడా జరిగితే విస్తృత రూపంలో కార్యక్రమాల్ని సాగించవచ్చును.' అనుకున్నాను. వైస్రాయి ట్రయిన్ కింద బాంబు పేల్చాక ఢిల్లీలో అరెస్టులు ముమ్మరం అవుతాయి. అప్పటికి అవుసరం అవుతుందనే ఉద్దేశంతో 'బంగస్‌కేపుల్' దగ్గర మరో ఇంటిని అద్దెకు తీసుకున్నాము. అంతగా అయితే, నయాబజార్‌లోని గదిని ఆజాద్‌కు ఇచ్చి, మా యిద్దరిలో ఒకరు అతడితోపాటు వుండేట్టూ, రెండవవారూ ఇంద్రపాల్ కలిసి, 'బంగస్‌కేపుల్' దగ్గర తీసుకున్న ఇంటిలో వుండేట్టూ వూహించుకున్నాం. కాన్పూర్ వెడుతూ భగవతీచరణ్ ఆజాద్‌కు ఇవ్వడానికి ఐదువందల రూపాయీలు తీసుకువెళ్ళాడు. ఈ ఐదువందలూ వైస్రాయి ట్రయిన్ కింద బాంబు పేల్చే సందర్భంగా అవుసరం పడవచ్చునన్న ఉద్దేశంతో పోగుచేసి అట్టే పెట్టినవి.

కాన్పూర్‌లోని గణేశ్ శంకర విద్యార్థి ద్వారా ఆజాద్ భగవతీ చరణ్‌కు సమాధానాన్ని పంపాడు. "మీమీద నాకు విశ్వాసం లేదు. నాకు మీ సహాయమూ వద్దు. సంబంధమూ వద్దు."

ఆజాద్ ఇచ్చిన సమాధానాన్ని గణేశ్ శంకర్ విద్యార్థి భగవతీ చరణ్‌కు చెప్పాడు. భగవతీచరణ్ ఏ మాత్రం కించ పడలేదు. చిరు నవ్వు నవ్వి "మా మీద ఆజాద్‌కు వున్న సంశయమూ, అవిశ్వాసమూ ఒక రోజున వాటంతటవే తొలగి పోతాయి. మీరు భయ్యాకు ఒక విషయాన్ని చెప్పండి. అతణ్ణి ఇప్పుడే సురక్షితమైన ప్రదేశాన్ని చూసుకోమనండి. మేము 24వ తారీకు ఉదయం వైస్రాయి ట్రయిన్ కింద బాంబు పేల్చబోతున్నాము. తరువాత అరెస్టులు ముమ్మరం అవుతాయి. భయ్యాన్ని అజాగ్రత్తగా వుండవద్దనీ, సురక్షిత ప్రదేశంలో వుండమనీ చెప్పండి." అన్నాడు.

గణేశ్ శంకర్ విద్యార్థి, వైస్రాయి ట్రయిన్ కింద బాంబు పేల్చడం అన్న మాటవిని ఉలిక్కిపడ్డాడు. ఈ ప్రయత్నాన్ని విరమించుకోవల్సిందని చెప్పాడు. భగవతీచరణ్ కూడా గణేశ్ శంకర్ విద్యార్థికి పరిస్థితిని వివరించి చెప్పాడు. "మేము అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నాం. ఇప్పుడు కార్యక్రమాన్ని ఆపేయడమంటే చాలా నష్టపడవల్సి వుంటుంది." అన్నాడు.

గణేశ్ శంకర విద్యార్థి పట్టుపట్టాడు. "మీకు నష్టం కలుగ వచ్చును. అయినా, ఇప్పుడీపని దేశానికి చెరువు చేస్తుదని నేను అనుకుంటున్నాను. ఇరవై నాలుగోతారీకున వైస్రాయి ఢిల్లీ వచ్చాక, వలస దేశాల గురించిన బ్రిటీష్ ప్రభుత్వపు దృష్టి కోణాన్ని వివరిస్తాడు. ఈ వివరించడం ఢిల్లీలో జరిగితే భారతదేశానికి ఎంతో మేలు చేకూరుతుంది. అలా కాకుండా వైస్రాయి మీద దాడిచేస్తే వలసదేశాల గురించిన దృష్టి కోణాన్ని ఢిల్లీలో ప్రకటించడం జరగదు. అందువల్ల దేశానికి అహితమే జరుగుతుంది. మీ ఈ కార్యక్రమం జరిగితే, ఇంతవరకూ కాంగ్రేసు చేసిన ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అవుతాయి." అని చెప్పాడు.

భగవతీచరణ్ అనేక విధాల చెప్పి చూశాడు. అయినా గణేశ్ శంకర విద్యార్థి వప్పుకోలేదు. వారి అభిప్రాయాన్ని నిర్లక్ష్యం చేయడానికీ వీల్లేదు. విద్యార్థిగారు వ్యక్తి గతంగా అహింసావాది అయినప్పటికీ, వారి రాజకీయాభిప్రాయాలు విప్లవాత్మకంగా వుండేవి. విప్లవకారులకు వారి సహాయ, సానుభూతులు సదాలభిస్తూండేవి.

అక్టోబర్ 22వ తారీకు సాయంకాలం భగవతీభాయి కాన్పూర్ నుండి ఢిల్లీ వచ్చాడు. "కార్యక్రమాన్ని ఆపడానికి నిర్ణయం జరిగింది." అని చెప్పాడు.

నాకు చెడ్డ కోపం వచ్చింది. "గణేశ్ శంకర్ విద్యార్థిగారి మాటను వినవల్సిన అవుసరం మనకేమి లేదు. ఆయన కాంగ్రేసు వాది. కాంగ్రేసు దృష్టి కోణం నుండి సమస్యను ఆలోచించి, మన కార్యక్రమానికి ఆటంకాన్ని కలిగిస్తున్నారు." అని అన్నాను. కానీ, తప్పలేదు. కార్యక్రమాన్ని ఆపవల్సే వచ్చింది. భగవతీచరణ్, కార్యక్రమాన్ని అపుతామని విద్యార్థిగారికి మాట ఇచ్చివచ్చాడు.

22వ తారీకున, బాగా పొద్దూకాక, సైకిల్ మీద ఇంద్రపాల్ దగ్గరకు వెళ్ళాను. 'కార్యక్రమాన్ని ఆపివేయడం జరిగిం'దని చెప్పాను. అతడికీ ఇలా కార్యక్రమాన్ని ఆపి వేయడం నచ్చలేదు. అతడి మనస్సు చాలా బాధ పడ్డది. "ఎప్పటి వరకూ ఆపుతారు ?" అని అడిగాడు ఇంద్రపాల్.

'బహూశ నవంబరు చివరి వారంలో జరపడానికి వీలవుతుందేమో' అని అన్నాను.

ఎముకల్ని కొరొకే ఆ చలిలో, ఇంద్రపాల్ ఒంటరిగా శిథిలమైన ఆ సత్రంలో నవంబరు చివరి వారం వరకూ పడివుండడం అనవసరం. అతడు అక్కడ వుండనప్పుడు బాంబుల్ని అలాగే భూమిలో వుంచి వెళ్ళి పోవడం సబబు అనిపించలేదు. బండ్ల రాకపోకల వల్ల మట్టీ రాళ్ళూ కదిలి - కొన్నాల్టి కయినా బాంబులు బయటపడే ప్రమాదం వుంది. బాంబుల్ని, ఎలెక్ట్రిక్ వైర్‌ను తీసుకుని వెళ్ళి పోవడమే మంచిదనిపించింది. అర్ధరాత్రికల్లా మేమిద్దరం బాంబుల్ని, వైర్‌నూ బయటికి లాగేశాం. తెల్లవారాక కొంత సామాన్ను నాతోపాటు ఢిల్లీకి తీసుకువచ్చాను. పొద్దుగూకాక భగవతీచరణ్ గుర్రబండి (టాంగా) నొకదాన్ని తీసుకుని సత్రం దగ్గరకు వెళ్ళాడు. వెడుతూ ఖాకీ పైజమానొకదాన్నీ, టర్కీ టోపీ నొకదాన్ని వెంట తీసుకువెళ్ళాడు.

ఇంద్రపాల్‌ని భగవతీచరణ్ 'బంగస్‌కేపుల్' దగ్గర తీసుకున్న ఇంటికి వెంట పెట్టుకు వచ్చాడు. వాళ్ళు రాకముందే నేనూ అక్కడికి చేరాను.

భగవతీచరణ్ ఆ యింటి యజమానికి తాను ఫారసీ వాడినని చెప్పాడు. పేరు 'జంషెడ్ రుస్తుం' అని చెప్పాడు. నేనూ ఫారసీ వాడిగానే పరిచయం అయ్యాను. ఇంద్రపాల్ ముస్లిం వంటవాడుగా పరిచయం అయ్యాడు. అతడు అబ్దుల్లా అని పేరు పెట్టుకున్నాడు. ముస్లిముల పరిసరమే కావడంవల్ల ఇంద్రపాల్ తనూ ముస్లిమై అందరితోటీ కలివిడిగా మాట్లాడుతూండేవాడు. ఎవరైనా మాగురించి అడిగితే "ఫారసీలు .... వాళ్ళకు దేవుడూ, దయ్యం - కులం, మతం ఏముంటుంది ? హోటల్లో అన్నీ తినేస్తారు. అమ్మగారు మంసూరీలో వుంటోంది. ఆమెగారు వచ్చేవరకూ ఇంతే...." అని చెప్పేవాడు.

ఆ రోజు రాత్రి మేము ముగ్గురంకల్సి హాయిగాగడిపాము. ఇంద్రపాల్, మేమూ - అంతహాయిగా గడిపి చాలా రోజులయింది. హృదయాలు విప్పుకొని ఒకళ్ళ భావాలు ఒకళ్ళం కలపోసుకున్నాం. పాడుపడిన సత్రంలోని తన అనుభవాలెన్నింటినో చెప్పాడు ఇంద్రపాల్.

ఇంద్రపాల్ భిక్షాటన నిమిత్తం తేహఖండ్, మదన్‌పూరా, ఇంకా చుట్టుపట్ల గ్రామాలకూ వెడుతూండేవాడు. ఆ చుట్టుపట్ల పంటలు బాగా దెబ్బతిన్నాయి. రైతులస్థితి దారుణంగా తయారయింది.కొన్ని కుటుంబాలు రోజుల తరబడి పస్తులుపడి వుంటూన్నాయి. రైతులు ప్రభుత్వానికి సహాయం కోసం అర్జీ పెట్టుకున్నారు. ప్రభుత్వం కొందరు ఆఫీసర్లని, జమాన్లనూ పరిస్థితి గమనించి -

రిపోర్టు ఇవ్వమని పంపింది. ఆఫీసర్లు మందీ మార్బలంతో వచ్చి పల్లెల్లో డేరాలు వేసుకుని కొన్నాళ్లు వున్నారు. వాళ్ళ రిపోర్టు ఆధారంగా, పంటలుపోయి కాటకం ప్రబలిన ఈ ప్రాంత ప్రజల సహాయార్థం ప్రభుత్వం ఒక ఏర్పాటు చేసింది. పడిపోయిన ఆనకట్టనొకదాన్ని మరమ్మతుచేయించ సంకల్పించింది. రైతులు సూర్యోదయంతోపాటు పనిలోకి వంగుతారు. మట్టి తవ్వడం, మట్టి మోయడం ప్రారంభిస్తారు. సూర్యాస్తమయం అయ్యాకగాని ఇళ్ళకురారు. ఇంత చాకిరీచేస్తే ప్రభుత్వం తలకు రెండు అణాల చొప్పున రోజు కూలి ఇస్తుంది. ఇది కరువుపని.

ఇంద్రపాల్ నిరుద్యోగి అయ్యాడు. ఇక్కడా అతడికి ఆటే పనేమీలేదు. 'అవుసరం అయినప్పుడు తిరిగివస్తాను' అని చెప్పి లాహోరు వెళ్ళిపోయాడు. తమ్ముళ్ళ స్థితిగతుల్ని చూడడానికి.

ఆ పరిసరంలో క్రిస్టియన్లూ, ఆంగ్లో - ఇండియన్లూ కూడా అధిక సంఖ్యలోనే వున్నారు. పరిసరాన్నిబట్టి మేమూ ఆడంబరంగానే వుంటున్నాము. బయటకు వెళ్ళేప్పుడు సూటు వేసుకునేవాళ్ళం. ఇంట్లోనూ స్లీపింగ్ సూట్‌ను వేసుకుంటూ వుండేవాళ్లం. వరండాలో రెండు పేము కుర్చీలూ, బల్లఒకటీ నలుగురికీ కనపడుతూండేవి. చౌకబారు టీ సెట్లనూ రెండింటిని కొనిపెట్టాము. మేమూ ధనికులమని నలుగురూ అనుకోగలందులకు నయాబజార్లోని గదిలో వుండేప్పుడూ మేము బయటకు సూట్ వేసుకునే వెళ్లేవాళ్ళం. ఐతే, లోపల ఒక్కచాప మినహాయించి ఇంకేమీ వుండేదికాదు.

వేసంగుల్లో నేనూ, భగవతీచరణ్ - ఇద్దరం దుప్పట్లో, లేకపోతే మా ధోవతులో కప్పుకుని ఒకే చాపమీద పడుకునేవాళ్ళం. కానీ, చలికాలంలో దుప్పట్లూ, ధోవతులూ చలిని ఆపేవికావు. కంబళీ కప్పుకోవడం అనివార్యం అయ్యేది. ఐతే, ఒకే కంబళివుంది. పడుకునేప్పుడు ఇద్దరమూ చాపమీద నిటారుగా పడుకుని ఒకే కంబళిని ఇద్దరం చెరిసాగం కప్పుకు పడుకునేవారం. కాగా, నిద్రలో ఎవరోవకరు వత్తిగిలడమూ, రెండవ వారికి కంబళి చాలకపోవడమూ జరిగేది. పోనీ రెండవ కంబళి కొందామా అనుకుంటే, అది అనవసరమైన ఖర్చు అనిపించేది. ఎందుచేత అంటే, నవంబర్‌లో ఎటూ వైస్రాయి ట్రయిన్‌కింద బాంబు పేల్చడం జరుగుతుంది. ఆ తరువాత ఇద్దర్లో ఎవరో ఒకరమే వుంటాము. ఈ ఒక్కనెల రోజుల భాగ్యానికి మరో కంబళి దేనికి ?

ఒకరోజున చలినించి రక్షించుకోడానికి ఒక వుపాయాన్ని ఆలోచించాము. ఒకళ్ళం కంబళి కప్పుకున్నాము. మరొకళ్ళం రెండు దుప్పట్ల నడుమ న్యూస్ పేపరులను పెట్టుకుని, రెండు దుప్పట్లనూ ఆవళంగా జతచేసి కప్పుకున్నాము. ఈ కాగితపు కంబళిని కప్పుకుంటే అసలు చలి వేసేదే కాదు. భగవతీచరణ్ ఆరు రూపాయిలకు ఒక వాయలెన్‌ని కొనుక్కు వచ్చాడు. అతడి పొదుపుతనాన్ని దృష్టిలో పెట్టుకుంటే, ఆ ఆరు రూపాయీల వాయలెన్‌ని గొప్ప విలాస వస్తువుగా భావించవచ్చును ! అతడు ఎప్పుడూ వెదురు కుర్చీమీద కూచుని, వెదురు డ్రాయరు మీదకు రెండు కాళ్ళనూ పారేసి వాయ్‌లెన్‌ని వాయిస్తూ వుండేవాడు ! నేనేదయినా చెబితే ఆ గోలలో వినబడేదికాదు. నాకు విసుగుపుట్టి పెద్దగా అరిచేవాణ్ణి ! అప్పుడు మనలోకంలోకి వచ్చి 'వాయలిన్ మీద ఓ రాగాన్ని పలికించడానికి ప్రయత్నిస్తున్నాను !" అనేవాడు.

నాకు సంగీతంలోని లోతుపాతులు అప్పుడూ తెలియవు. ఇప్పటికీ తెలియవు ! భగవతీచరణ్ అర్థనీలితనేత్రుడై సంగీత ప్రభావాన్ని గురించి నాకు చెప్పడానికి ప్రయత్నించేవాడు. అతడికి సంగీతమన్నా, కవిత్వమన్నా చాలా ఇష్టం !

ఇంద్రపాల్‌ని లాహోరు పంపించివేశాము. మా దృష్టి రెండు విషయాల మీద కేంద్రీకృతమైంది. ఉద్యమాన్ని వ్యాప్తి చేయడం. వైస్రాయి ట్రయిన్‌కింద సమర్థవంతంగా బాంబు పేల్చడం ! ఈ రెండే మా ముందున్న కార్యక్రమాలు ! వైస్రాయి మీద దాడి చేయడానికి ఇంకో నెల రోజులకు గానీ మళ్ళీ

అవకాశం దొరకదు ! ట్రయిన్ కింద బాంబు పేల్చే సందర్భంలో అభ్యంతరకరంగా పరిగణింపదగిన రెండు విషయాలు ఎప్పుడూ నా బుర్రలో మెదుల్తూ వుండేవి ! ఒకటి బాంబు పేల్చి తిరిగి వచ్చేప్పుడు రైలు గేట్ వేసి వుండడం, రెండవది మేము కొన్న బ్యాటరీ బలహీన పడుతుందేమోనన్న భయం !

బాంబు పేల్చాక 'రైలు గేటు' సమస్య నుండి తప్పించుకోడానికి, ఢిల్లీవైపు రాకుండా బదర్‌పూర్ వైపు వెళ్ళిపోవచ్చును ! అటు మధుర వరకూ ఆ రోడ్డు వెళ్ళిపోతుంది. మధ్యలో ఎక్కడా బాంబు పేల్చిన మిత్రుడు దాక్కోడానికి వీలైన పెద్ద గ్రామం తగలదు. ఒకరోజున ఆ గ్రామాల్లో మిత్రుడు దాక్కోడానికి వీలుంటుందేమోనని చూసి రావడానికి వెళ్ళాను. ఆ రోడ్డులో మధురే పెద్ద పట్నం! మధుర వైపు వెళ్ళేవాణ్ణే, కానీ, మోటార్ సైకిల్లో పెట్రోలు చాలదు. పైగా, భగవతీభాయీకి మధుర వరకూ వెళ్ళివస్తానని చెప్పనూలేదు !

వెనక్కు తిరిగి ఢిల్లీకి బయల్దేరాను. సూర్యాస్తమయం ఐన కొద్ది క్షణాలకు చంద్రోదయం అయింది. గుడ్డి వెన్నెల మసగ్గా ప్రకృతిలో పరుచుకుంటోంది. ఆ వెన్నెట్లో దారి బాగానే కనుపిస్తోంది. మోటార్ సైకిల్ లైటు వెలిగించనవుసరం లేకపోయింది. మార్గం జన శూన్యంగా వుంది. రెండు వైపులా వున్న చెట్ల నీడలు రోడ్డుమీద నల్లని మచ్చల్లా పరుచుకున్నాయి. నేను తీవ్ర వేగంలో మోటార్ సైకిల్ మీద ఆ నీడల్ని దాటుతూ వెళ్ళిపోతున్నాను.

వెళుతూన్న నేను పెద్ద కుదుపుతో రోడ్డు ప్రక్కన మట్టిలో పడిపోయాను. మోటార్ సైకిల్ మరో ప్రక్కన పడ్డది. రెండు క్షణాల తరువాత గానీ, నేను కిందపడ్డట్టు తెల్సుకోలేదు. నా ప్రక్కనే చెట్టునీడన ఎడ్లబండి ఒకటి తల్ల క్రిందులుగా పడివుంది. అది ఇటికరాళ్ళ బండి. రాళ్ళుగుట్టగా పడివున్నాయి. చీకట్లో నేనారాళ్ళను చూడలేదు. రాళ్ళగుట్టకు తగిలి నేనోపక్కనా, మోటార్ సైకిల్ మరో పక్కనా పడ్డాము. అకస్మికమైన ఈ దెబ్బకు నా మస్తిష్కం క్షణకాలం పనిచేయడం మానుకుంది గావును, విషయం వెంటనే గ్రహింపుకు రాలేదు.

రెండు క్షణాల తరువాత లేచి నిలబడ్డాను. మోటార్ సైకిల్ ఇంజన్ని ఆపాను. దానిమీదనే మెల్లగా ఢిల్లీ చేరవచ్చునేమోనని ప్రయత్నం చేశాను. కానీ, లాభంలేదు. మోటార్ సైకిల్ ముందు చక్రం బాగా వంకరపోయింది. టైర్, ట్యూబ్ పగిలిపోయాయి. తోసుకు పోవడానికి కూడా వీలులేకుండా వుంది. ఇంతలో మధుర నుండి ఢిల్లీవైపు వెళ్ళే లారీ ఒకటి వచ్చింది. ఆ లారీని నేను ఇంతకు క్రితమే వెనకపడేసి వచ్చాను. లారీని ఆపమని చెయ్యి ఎత్తాను. మోటార్ సైకిల్ దానిమీద పడేసి, నేనూ ఎక్కాను.

దెబ్బలు బాగా తగిలాయి. ఫ్యాంట్ మోకాళ్ళ దగ్గర చినిగి, మోకాళ్ళు దోక్కుపోయాయి. మణికట్టుకూ, మోచేతులకూ, వీపుకు దెబ్బలు తగిలి రక్తం స్రవిస్తోంది. నేను జేబురుమాలను చింపి దెబ్బలు తగిలిన చోట్ల కట్టుకున్నాను. ఎక్కువ పొద్దుపోలేదు. ఢిల్లీలో మోటార్ సైకిల్‌ని బాగుచేయడానికి దుకాణం దగ్గర వప్పగించి, నేను 'బసంగ్‌కెపుల్' దగ్గర తీసుకున్న ఇంటికి వెళ్ళాను. భగవతీభాయి ఇంట్లోనే వున్నాడు. ఏ డాక్టరు దగ్గరకైనా వెళ్ళి ఏదో ఒక మారు పేరు చెప్పి కట్టు కట్టించుకోవచ్చును. ఐతే, ఆ రోజున మా దగ్గర కట్టు కట్టించుకోడానికి కూడా డబ్బులు లేవు. ఏ కట్టూ కట్టించకుండా వదిలితే దెబ్బలు చీముపట్టి రణాలు అవుతాయేమోనని భయమూ వుంది ! కనుక తాత్కాలికంగా స్పిరిట్‌తో గాయాల్ని కడిగి శుభ్రం చేయడం ఉత్తమం అనుకున్నాం ! అలాగే చేశాం ! పెద్ద పెద్ద గాయాల్ని స్పిరిట్‌తో తడిపితే ఎలా వుంటుందో అనుభవించిన వారికే తెలుస్తుంది ! పళ్ళు బిగబట్టి, కండ్లు మూసుకుని పడుకున్నాను నేను. భగవతీచరణ్ స్పిరిట్‌లో దూదిముంచి గాయాల్ని శుభ్రం చేస్తున్నాడు. బాధకు తట్టుకోలేక నాకు తెలియకుండానే కేకలు వేస్తానేమోనని భయపడ్డాను. కేకలు వేయలేదుగానీ,

అంత మొరటుగా బాధను సహించడంవల్లనో లేక దెబ్బల వల్లనో తీవ్రంగా జ్వరం కాసింది ! రోడ్డు మీద తగిలిన గాయాలు రక్తాన్ని విషతుల్యం చేశాయేమోనన్న సంశయమూ కలిగింది !

ఢిల్లీలోని మా పరిచయుల్లో కృష్ణజీ ఒకరు. వీరి నివాసం 'అజమేరీ దర్వాజా'లో ! ఈయన రాక్షసి బొగ్గు వ్యాపారం చేస్తూ వుండేవాడు. ఈయన నాకు చాలా కాలంగా పరిచయుడు. 1921-22 సంవత్సర ప్రాంతంలో ప్రేమవతి తండ్రి లాయల్‌పూర్‌లోని జిన్నింగ్‌మిల్లులో మేనేజరుగా వుండేవాడు. అప్పుడు కృష్ణజీ ఆ మిల్లులోనే క్లర్కుగా పనిచేశాడు. ఇప్పుడు ఢిల్లీలో సొంతంగా రాక్షసి బొగ్గు వ్యాపారం చేస్తున్నాడు. నేను ఢిల్లీ రాగానే కృష్ణజీని కల్సుకున్నాను. భగవతీచరణ్‌కు కూడా ఈయనను పరిచయం చేశాను.

కృష్ణజీకి, వారి భార్యకూ మా పట్ల చాలా సానుభూతి ! ఏ క్షణాన్నయినా వారింటికి వెళ్ళి భోంచేయవచ్చును! అత్యవసరం అయిన పరిస్థితిలో వారింట్లో ఒకటి రెండు రోజులు తలదాచుకోవచ్చును. అవుసరం పడితే పదీ ఐదూ సర్దుతూనూ వుంటాడు ! కృష్ణజీ పరమ గాంధీవాది ! ఎప్పుడూ ఖద్దరే ధరిస్తూంటాడు. హింసాత్మక కార్యక్రమాల్ని అంగీకరించడు. ఐతే ఏం ? మా మిత్రత్వం కారణంగా వ్యక్తిగత అవుసరాలకు సాయం చేస్తుండేవాడు. మా ఆదర్శానికి మాత్రం ఆర్థిక సహాయం చేసేవాడు కాదు ! మాకు ఎప్పుడయినా పదీ, ఐదూ అవుసరం పడి, కృష్ణజీని అడిగితే, ఎందుకూ ? ఏమిటీ ? అని లక్ష ప్రశ్నలు వేసేవాడు. తను ఇచ్చిన డబ్బు మా వ్యక్తిగత అవుసరాలకేగాని, హింసాత్మక కార్యక్రమాలకు వినియోగించమని తెల్సుకునిగానీ ఇచ్చేవాడు కాదు !

పైగా, ప్రతి విషయాన్ని గురించి ప్రశ్నించడం, తర్కించడం కృష్ణజీకి అలవాటు. ఆయన విశ్వాసపాత్రుడని మాకు తెల్సు. అయినప్పటికీ మా కార్యక్రమాల్ని గురించి అందరికీ చెప్పడం ఉచితం కాదు కదా ? "చెప్పము." అని నిర్మొగమాటంగా అనడానికి వీల్లేదు. ఈ కారణంవల్ల కృష్ణజీకి తరచు అబద్ధాలు చెప్తూవుండేవాళ్ళం. మేము అబద్ధాలు చెప్పినట్టు ఆయనకు తెలిసేది. అడగనూ అడిగేవాడు. నవ్విపూరుకునే వాళ్ళం.

ఒకమాటు కృష్ణజీ ఇలా అడిగాడు. "నువ్వు అసలు ఎప్పుడైనా నిజం చెప్తావా ?"

నేను ఇలా అన్నాను "ఎందుకు చెప్పను ? అబద్ధంచెప్తే పని జరుగదనుకున్నప్పుడు నిజమే చెప్తాను."

ఈగాయాల్తో, జ్వరంతో కృష్ణజీ ఇంటికివెడితే ఇంక ప్రశ్నల వర్షం కురిపిస్తాడు. మోటార్ సైకిల్ ఎక్కడిది ? ఆ సమయంలో అంత దూరం ఎందుకు వెళ్ళావు ? ఏం పనిమీద వెళ్ళావు ? ఇలాంటివే అనేక ప్రశ్నలు వేస్తాడు. ఐతే, వారిఇంట్లో జరిగినట్టు మరోచోట వైద్య సౌకర్యమూ జరగదు. విశ్రాంతీవుండదు. భగవతీచరణ్ నన్ను వారింటికే పంపించాడు.

కృష్ణజీ స్నేహితుడు ఒకతను హోమియోపతి డాక్టర్; పేరు యుద్ధవీరసింగ్. ఈయన ప్రస్తుతం ఢిల్లీ కాంగ్రేసు కమిటీకి అధ్యక్షుడు. ఈ యుద్ధవీరసింగ్‌ను నావైద్యం నిమిత్తము తీసుకువచ్చాడు కృష్ణజీ. డాక్టరుగారు జ్వరం తగ్గడానికి కడుపులోకి మందు ఇచ్చారు. గాయాల్ని కడిగి నియమంగా కట్టుకట్టారు. దాదాపూ ఒక వారంరోజుల పాటు మంచంలో వున్నాను. ఆ వారంరోజులూ కృష్ణజీ బావమరిది ధృవజీ నాకు సేవచేశాడు. మా పరిచయం, మా స్నేహం కారణంగా ధృవజీ పోలీసుల చేతుల్లో బాగా దెబ్బలుకూడా తిన్నాడు.

మంచంలోవున్న వారంరోజుల్లోనూ ఎప్పుడూ బాంబుల్ని గురించి, వైర్లనుగురించి, బ్యాటరీనిగురించి - ఆలోచిస్తూ వుండేవాణ్ణి. బ్యాటరీ బలహీనపడి అనుకున్న సమయానికి, అనుకున్నట్టుగా పనిచేయదేమోనని భయపడేవాణ్ణి. బ్యాటరీని గురించిన నిరంతర ఆలోచనలవల్ల, నేనూ, విప్లవ సంఘంకూడా అనవసరమైన లాయలాసలో చిక్కుకోవడం జరిగింది.

# సహాయకుల కోసం అన్వేషణ

బ్యాటరీకీ, కరెంటుకూ సంబంధించిన కొన్ని సందేహాల్ని నా తమ్ముడు ధర్మపాల్ నడిగి నివృత్తి చేసుకోవాలనుకున్నాను. ఇంద్రపాల్ అడ్రసుకు ఈ సంబంధంగా ఓ జాబు కూడా రాశాను. ధర్మపాల్ 1928లో మెట్రిక్ ప్యాసయ్యాడు. నేను విప్లవసంఘ కార్యక్రమాల్లో తిరుగుతూండడంవల్ల స్థిరంగా ఇంటి దగ్గర వుండి, అతణ్ణి కాలేజీలో చదివించడం గానీ, ఇంటి ఖర్చును నిర్వహించడంగానీ చేయలేకపోవుతన్నాను. ఈ కారణంవల్ల - అంతటితో చదువు ఆపి, ఎలెక్ట్రీషియన్‌గా తయారై మా అమ్మపొట్టనూ, తన పొట్టనూ పోషించుకోవలసిందని, చెప్పాను అతడికి. ఈ ఆదర్శంతోనే అతణ్ణి లాహోరులోని ఓ ఎల్‌క్ట్రిక్ పనినేర్పేస్కూల్లో చేర్పించాను. అక్కడ అతడు సర్టిఫికేట్ కూడా పొందాడు. లాహోరులోని ఎలెక్ట్రిక్ సిటీ బోర్డులో అప్రంటీస్‌గా చేరాడు. ధర్మపాల్ త్వరలో నాలుగు డబ్బులు సంపాయించేయోగ్యతను గడించి, మా అమ్మను పోషిస్తాడనుకున్నాను. కానీ, అతడూ నా మార్గాన్నే అనుసరించాడు. ఎలెక్ట్రిక్ మెకానిక్కయి పొట్ట పోసుకోవడానికి బదులు, లాహోరు కుట్రకేసులోని ముద్దాయిల 'డిఫెన్సుకమిటీ' తరపున పనిచేయసాగాడు. మేమందరమూ అదృశ్యులం అయ్యాక కూడా లాహోరులో రహస్యోద్యమం నడుస్తూనే వుంది. ధన్వంతరీ, ఎహసాన్ఇలాహి, సుఖదేవ్‌రాజ్, ధర్మపాల్-వీరు మా సలహాలననుసరించి ఉద్యమాన్ని నడుపుతూన్నారు. ధర్మపాల్ ఉద్యమ కార్యక్రమాల్నే కాకుండా ప్రేమవతి, దుర్గాబాభీలకు సెక్రటరీగా కూడా పని చేస్తున్నాడు.

ధర్మపాల్, ఇంద్రపాల్ ద్వారా నాకు సమాధనం పంపించాడు. దాని సారాంశం 'తనను లాహోరు సి.ఐ.డి పోలీసులు అనుక్షణం వెంటాడుతూన్నారు. తను స్వయంగా ఢిల్లీకి రావడం మంచిది కాదు, వెంబడిస్తూ లాహోరు సి.ఐ.డిలు ఢిల్లీ వచ్చే ప్రమాదం ఎంతయినా వుంది. అలాంటిది జరిగితే మొత్తం అందరూ పట్టుపడతారు. బ్యాటరీ విషయంలో హంసరాజ్ యొక్క 'వైర్‌లెస్' ద్వారా పని జరుపుకోవడం మంచిది. హంస్‌రాజ్ తన కొత్త పరిశోధనలవల్ల మనకు పని జరపగలడు' ఇది ధర్మపాల్ పంపించిన సమాధానంలోని సారాంశం.

హంస్‌రాజ్ కొత్త పరిశోధననొకదాన్ని చేశాడు. కనుక అతణ్ణి 'హంస్‌రాజ్ వైర్‌లెస్' అనే వారం. అతణ్ణి నేను 1924 నుండి ఎరుగుదును. ఇంద్రపాల్ అతణ్ణి ఢిల్లీ తీసుకువచ్చాడు.

హంస్‌రాజ్ మాతో ఇలా అన్నాడు. "మీరు అనవసరంగా బ్యాటరీ అనీ, వైర్లనీ - వీటికోసం టైం వేస్టు చేస్తున్నారు. నేను చిన్న చిన్న యంత్రాల్ని తయారుచేసి ఇస్తాను. వాటిని బాంబుతో పాటు జతపరిచి పాతి పెట్టండి. అలాంటిదే యంత్రం మరోటి తయారు చేసిస్తాను. దాన్ని దగ్గర అట్టేపెట్టుకొండి. మీ దగ్గర వున్న యంత్రం వైర్లతో పని లేకుండా, మీరు తలుచుకున్నప్పుడు బాంబుల్తో జతపరిచిన యంత్రాల్ని ప్రకోపించపచేసి అగ్నిని పుట్టిస్తుంది. ఈ యంత్రం వుంటే వైర్లతోటీ పని లేదు. బ్యాటరీ బలహీనపడుతుందన్న భయమూ లేదు. అసలు నాలుగణాల డబ్బులు ఖర్చుపెట్టుకుంటే ఎన్నో బ్యాటరీలు తయారుచేసి ఇస్తాను."

హంస్‌రాజ్ మాటలు విని నేనూ, భగవతీభాయి, ఇంద్రపాల్ - ముగ్గురం పరమానందపడ్డాం. అతడి యంత్రాన్ని నమ్ముకుని మాప్లానునే పూర్తిగా మార్చేసుకున్నాం. అతడు తయారుచేసి ఇచ్చే యంత్రం వల్ల పని సులువవడమే కాకుండా, ఎవరూ ప్రాణాలు బలిపెట్టుకోనవసరం వుండదు. రైలు పట్టాలకింద బాంబులు పాతిపెట్టినచోటికి, ఒక వైపున తేహఖండ్ గ్రామం వుంది. మరోవైపు చేలూ,

వాటిని దాటాక ఒకుగ్రామం, గ్రామానికి అవతల ఓ ఎత్తయిన దిబ్బ వుంది. ఆ దిబ్బ మీద నుండి చూస్తే రైలుపట్టాలు కనిపిస్తుంటాయి. 'మాలో ఎవరైనా ఒకరు ఆ దిబ్బమీద కూచుని, తీక్షణమైన దుర్భిణీలోంచి చూసి, వైస్రాయిట్రయిన్ సరిగా బాంబుల మీదకు వచ్చే సమయానికి, హంస్‌రాజ్ చేసి ఇచ్చిన యంత్రపు బటన్‌నొక్కితేసరి. రెండు మైళ్ళ దూరాన్నుండే వైస్రాయి ట్రయిన్ని పడగొట్టవచ్చు; అనుకున్నాం. ఏ బాధా, ఏ ప్రమాదమూ లేకుండా ఇంతగొప్ప కార్యాన్ని నిర్వహించడానికి మార్గం దొరకడంతో మా ఉత్సాహం రెట్టింపు అయింది. అదీకాక, బాంబుని ఎలా పేల్చారో తెలియక బ్రిటీష్ ప్రభుత్వమూ, పోలీసులు కంగుతింటారన్న వూహ మా కుతూహలాన్ని పెంచింది. బాంబు పేల్చాక బ్రిటీష్ ప్రభుత్వాన్ని సవాల్ చేస్తూ ఓ కరపత్రాన్ని ప్రకటించాలని మా ఉద్దేశం. ఆ కరపత్రంలో బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి "మా శక్తి సమర్థతలు నీకు తెలియవు. నీ మొత్తం సైన్యాన్ని, పోలీసుల్ని సర్వనాశనం చేయగలం, జాగ్రత్త." అని హెచ్చరించాలనీ అనుకున్నాము.

'ప్రజలు ఆయుధాలు లేకపోవడంవల్ల నిరుత్సాహంగా వున్నారు. ఇలాంటి అద్భుతమైన యంత్రాలూ, కార్యాలవల్ల ప్రజల ఉత్సాహం రెట్టింపు అవుతుంది. సాయుధ విప్లవ పోరాటం ప్రారంభం అవుతుంది.' అనీ అనుకున్నాం. మేము దౌర్జన్య వాదం నుండి సాయుధ విప్లవ పోరాటంవైపు ముందడుగు వేస్తున్న స్థితి అది.

హంస్‌రాజ్ మమ్మల్ని మరికూడా ఉత్సాహితుల్ని చేశాడు. "మీరు దిబ్బమీదికి వెళ్ళవల్సిన అవసరంకూడ వుండదు. నేనొక యంత్రాన్ని చేసియిస్తాను. దాన్ని బాంబు పేల్చదలచుకున్న చోటికి దరిదాపుల్లో పెడితేచాలు. ఆ యంత్రానికి సంబంధించిందే మరోయంత్రాన్ని చేసియిస్తాను. దాన్ని మీదగ్గర వుంచుకోండి. బాంబులదగ్గర వుంచిన యంత్రానికీ మీదగ్గరవుంచుకున్న యంత్రానికీ వైర్‌లెస్‌ద్వారా సంబంధాన్ని కలుపుతాను. స్పెషల్‌ట్రయిన్ బాంబులదగ్గరకు రాగానే, పరిసరంలో వుంచిన యంత్రంమీద ప్రతిబింబం పడుతుంది. ఆ ప్రతిబింబం వైర్‌లెస్ ద్వారా మీదగ్గరవున్న యంత్రంలో కనుపిస్తుంది. వెంటనే, మీ దగ్గర వున్న యంత్రం బటన్ నొక్కితేసరి. బాంబులు పేలుతాయి. ట్రయిన్ పడిపోతుంది. మనం మన గదిలోనేకూచుని వైస్రాయి ట్రయిన్‌ని పడగొట్టవచ్చును." అని చెప్పాడు హంస్‌రాజ్.

టెలివిజన్ యంత్రాన్ని గురించి పత్రికల్లో వార్తలు వస్తున్న రోజులవి. హంస్‌రాజ్ తను వైర్‌లెస్ సాయంతో సొంతంగా కొత్త రకం టెలివిజన్‌ని కనిపెట్టాననీ చెప్పాడు. అతడు తన వైర్‌లెస్ ప్రయోగాల్ని కొన్నిచోట్ల ప్రదర్శించి చూపాడు. 'ఎస్.పి.ఎస్.కె.' హాల్లో అతడిచ్చిన కొన్ని ప్రదర్శనలను ఇంద్రపాల్ స్వయంగా చూడనూ చూశాడు. నా తమ్ముడు ధర్మపాల్ కూడా హంస్‌రాజ్ చేసిన విచిత్రమైన ప్రయోగాల్ని, పరిశోధనలనూ కొన్నింటిని చూసి నాకు చెప్పాడు. ఇన్ని కారణాలవల్లా అతడి మాటల్ని ఒట్టి అబద్ధాలని కొట్టివేయడానికి వీల్లేక పోయింది. హంస్‌రాజ్ ప్రయోగాలు కొన్ని ఏ మాత్రం తలాతోకా లేకుండా వుండేవి. అయినా, మేమతణ్ణి విశ్వసించక తప్పలేదు. ప్రేతాత్మల్తో మాట్లాడడం ఒకటి. కరెంటుతీగెలసాయంతో మనిషిలోని ప్రేమభావాన్ని తెలుసుకోవడం ఒకటి. కరెంటూ, వైర్‌లెస్, మెస్మరిజం ఈ మూడింటినీ కలగా పులగం చేయడం - ఇవన్నీ మాకు అర్థంలేని పనులుగా కనుపించేవి. ఐతే, అతడి ప్రయోగాల్ని మేమూ కొన్నింటిని చూశాం. చూసిన ఎవరేగానీ అతడి మాటల్ని విశ్వసించకుండా వుండలేరు. ఐతే, అప్పట్లో అతడి ప్రయోగాలు విజ్ఞానానికి సంబంధించినవా, లేక గారడీకి సంబంధించినవా అనే విషయాన్ని గురించి మేము ఆలోచించలేదు.

హంస్‌రాజ్ కొన్ని ప్రయోగాలు మా ఎదురుగా కూడా చేశాడని చెప్పాను. అతడొక చిన్న పీసాలో తెల్లని ద్రవపదార్థన్ని తయారు చేశాడు. దాన్ని జేబు బ్యాటరీకి వున్న చిన్న బల్బుకు ఓ గజం దూరంలో పెట్టాడు. బల్బు తనంతతాను వెలిగింది. అంటే కరెంటు వైర్లు రెండింటినీ కలుపకుండానే

వాతావరణంలో వున్న ద్రవపదార్థపు ప్రభావం వల్ల బల్బును వెలిగించగలిగాడన్న మాట. అతడి ఈ ప్రయోగాలకు ఆధారమైన వైజ్ఞానిక సిద్ధాంతాల గురించి చర్చించి - వాటిని అర్థం చేసుకోవాలనుకున్నాము. కానీ, హంస్‌రాజ్ చర్చించడానికి ఇష్టపడలేదు.

"ఈ నా ప్రయోగాల్లోని రహస్యాన్ని నేనెవరికీ చెప్పను" అని స్పష్టంగా అనేశాడు. మేము అందుకు అంగీకరించాము. 'అతడి ప్రయోగాల తాలూకు రహస్యాల్తో, సిద్ధాంతాలతో మాకు పనేమిటి ? అవసరం అయినప్పుడల్లా క్రొత్త క్రొత్త యంత్రాల్ని తయారు చేసి ఇస్తేచాలు.' అనుకున్నాం. హంస్‌రాజ్ చెప్పిన మాటల ఆధారంగా పిచ్చి పిచ్చి వూహలు అనేకం వూహించాం. ఢిల్లీ సెక్రటరీయేట్‌నూ పోలీసు స్టేషన్లనూ దగ్ధపటలం చేసేయాలను కున్నాం. ప్రభుత్వానికి ఊపిరి సలపనీయ గూడదనుకున్నాం.

హంస్‌రాజ్ ఇలా చెప్పాడు."వైస్రాయి ట్రయిన్‌ని పడగొట్టడానికి అవుసరం అయిన యంత్రాల్ని నేను ఢిల్లీలో తయారు చేయలేను. లాయల్‌పూర్‌లో తయారు చేస్తాను." అన్నాడు.

ఢిల్లీలోనే చేయవల్సిందనీ, ప్రత్యేకమైన ఇంటిని అద్దెకు తీసుకుఇస్తామనీ, అవుసరం అయిన అన్నిసౌకర్యాలూ కలిగిస్తామనీ అతడితో చెప్పాం. అయినా, అతడు అంగీకరించలేదు. 'లాయల్‌పూర్‌లోనే చేయగల' నన్నాడు. పదిరోజుల్లో అవుసరం అయిన యంత్రాల్ని తయారుచేసి తాను స్వయంగానయినా తెచ్చి ఇస్తానన్నాడు. లేకపోతే, ఇంద్రపాల్ ద్వారానయినా పంపిస్తానన్నాడు.

# ఆజాద్‌తోనూ, విప్లవసంఘంతోనూ సంబంధం !

జయచంద్రవిద్యాలంకార్ గారి దుష్ప్రచారం కారణంగా ఆజాద్ మా సహాయాన్ని, సంబంధాన్ని తిరస్కరించాడు. ఆజాద్ తిరస్కరించాడంటే మొత్తం విప్లవసంఘమే మమ్మల్ని తన సభ్యులుగా చేర్చుకోడానికి తిరస్కరిస్తున్నదన్నమాట. ఐనా, మేము నిరాశ పడలేదు. వైస్రాయి ట్రయిన్ కింద బాంబు పేల్చాక భయ్యాఆజాద్ మనస్సులో మామీదకల అవిశ్వాసం దానంతట అదే తొలగిపోతుందనీ - అనుకున్నాం. ఈలోపు మేము వ్యక్తిగతంగా మాకుఉన్న పరిచయాల్ని అభివృద్ధి చేసుకుంటున్నాము. పరిమితమైన పరిధిలోనే పటిష్ఠమైన ఉద్యమాన్ని నిర్మిస్తున్నాము. వైస్రాయి ట్రయిన్‌ని పడగొట్టాక మేము తయారుచేసిన మిత్రుల్తో సహావెళ్లి కేంద్రసంఘంలో కల్సిపోవాలని ఉద్దేశం. మాకు మేము 'హి.స.ప్ర.స.' సభ్యులమనే భావిస్తున్నాము. పైగా సెంట్రల్ కమిటి సభ్యులు ఢిల్లీలో వున్నారనీ మాకు తెల్సు. మాకూ వారికీ మిత్రులు కొందరున్నారు. ఆ మిత్రులద్వారా కేంద్ర కమిటీ సభ్యులువున్న ప్రదేశాల్ని తెల్సుకుని వెళ్ళి వారితో మాట్లాడవచ్చును. కానీ, అలా త్వరపడడంవల్ల పరిస్థితి మెరుగుకాకపోగా చెడిపోయే అవకాశాలే ఎక్కువగా వున్నాయి. కనుకనే మేమలా త్వరపడలేదు.

సహారన్‌పూర్ బాంబు ఫ్యాక్టరీలో అరెస్టయిన జయదేవ్‌కపూర్‌కు విప్లవసంఘపు ఢిల్లీ శాఖతో సంబంధంవుంది. ఢిల్లీశాఖ సభ్యుడు జయదేవ్‌కపూర్. ఢిల్లీశాఖ మరోసభ్యుడు కాశీరాం. వీరిద్దరూ ఒకే గ్రామవాసులు; బంధువులు. కాలేజీలో చదువుకునేప్పుడు యమున ఒడ్డునవున్న రామస్వరూప్ ధర్మసత్రంలో ఒకేగదిలో వుంటుండేవారు. అప్పటికి ఇంకా కాశీరాం పోలీసులదృష్టికి ఎక్కలేదు. జయదేవ్‌ను సహారన్‌పూర్ నుండి లాహోరు జైలుకు మార్చారు. జయదేవ్‌ను చూడడానికి అతడి కేసునుగురించి తెల్సుకోడానికీ కాశీరాం లాహోరు వెళ్ళాడు. జయదేవ్ కపూర్‌ని జైల్లో కల్సుకున్నాడు. జయదేవ్‌కపూర్, భగవతీచరణ్‌ను గురించి భగవత్‌సింగ్‌కువున్న అభిప్రాయాన్ని కాశీరాంకుచెప్పాడు.

అంటే, భగవతీచరణ్ సి.ఐ.డి. కాదు. అలా పొరపాటు అభిప్రాయపడడానికి జయచంద్రగారి దుష్ప్రచారమే కారణం - అని చెప్పాడన్నమాట. పైగా, కాశీరాం, లాహోరులో దుర్గాబాభీని చూశాడు. ఆమె విప్లవకారులకు చేస్తున్న సేవనూ చూశాడు. లాహోరులోని మిత్రులు మాకు ఓ అత్యవసరం అయిన వర్తమానాన్ని కాశీరాం ద్వారా పంపించారు. ఎవరిద్వారా మమ్మల్ని కల్సుకోడానికి వీలువుంటుందో- చెప్పిపంపారు అతడికి.

అప్పుడు ఢిల్లీ పార్టీ (శాఖ)కి ఆర్గనైజరు కైలాసపతి. ఇతడు లాహోరులో మాయింట్లో కొన్నాళ్ళు వున్నాడు. కాశీరాం లాహోరునుండి వచ్చి భగవతీచరణ్‌కు సంబంధించిన యదార్థాన్ని చెప్పాడు. కాశీరాం ద్వారానూ, ఇతర మిత్రుల ప్రయత్నాలవల్లనూ కైలాసపతికీ మాకూ సంబంధాలు ఏర్పడ్డాయి.

ఆజాద్‌కూడా లాహోరు జైల్లోని మిత్రుల పరిస్థితిని తెల్సుకురావడానికి తనకు విశ్వాసపాత్రుడైన విశ్వనాథవైశంపాయన్ 'బచ్చన్'ని గ్వాలియర్ నుండి లాహోరు పంపించాడు. లాహోరు నుండి తిరిగి వచ్చేప్పుడు 'బచ్చన్' ఢిల్లీలోదిగి కైలాసపతిని కల్సుకున్నాడు. బచ్చన్‌కూడా లాహోరులో తనుచూసిన, విన్న విషయాన్ని కైలాసపతికి చెప్పాడు. భగవతీభాయి సి.ఐ.డి. కాదని కైలాసపతి తెల్సుకున్నాడు. మేము ఆజాద్‌ను కల్సుకో గోరుతూన్నట్లు కైలాసపతికి చెప్పాము. అతడు, ఆజాద్ -మేమూ కల్సుకునే ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చాడు.

కైలాసపతి ప్రభుత్వ సాక్షులుగా మారిన విప్లవకారులందరిలోకీ బహు చెడ్డపేరును సంపాయించుకున్నాడు. నేను చాలా బాగానూ, చాలా దగ్గరగానూ ఎరుగుదును. వివిధ స్థితుల్లోనూ, వివిధ రూపాల్లోనూ అతణ్ణి చూశాను. కనుక అతడి చరిత్రనుగురించి ఇక్కడ కొంచెం విస్తారంగా రాయడం ఉచితం అనుకుంటున్నాను.

కాకోరీ కుట్రకేసు తర్వాత బలహీనపడ్డ విప్లవసంఘాన్ని తిరిగి పటిష్ఠం చేయడానికి కైలాసపతి ఎంతగానో సహకరించాడు. అతడు చదువుకునేరోజుల్నుండి తీవ్ర రాజకీయవాదిగానే వున్నాడు. విప్లవ సంఘంపట్ల మొదట్నుండి అతడికి సానుభూతి వుంది. 1928లో భగత్ సింగ్, సుఖదేవ్, విజయకుమార్‌సిన్హా, ఆజాద్ - వీరి ప్రయత్నాలవల్ల ఏర్పడ్డ 'హిసప్రస' విప్లవోద్యమంలోనూ కైలాసపతి ప్రముఖస్థానాన్ని పొందాడు. 1928 నాటికి అతడు విప్లవసంఘంలో సభ్యుడు. ఐనప్పటికీ గోరఖ్‌పూర్ జిల్లాలోని 'బర్‌హాల్‌గంజ్' పోస్టాఫీసులో రిజర్వ్‌క్లర్క్ ఉద్యోగాన్ని చేస్తున్నాడు. అప్పట్లో విప్లవసంఘం దారుణమైన ఆర్థిక బాధల్తో వేగి పోతోంది. దోపిడీచేసే శక్తి లేదు. సంఘానికి ! అప్పుడు విప్లవసంఘం- పోస్టాఫీసులో డబ్బు కాచేసి పరారు కావసిందని ఆజ్ఞాపించింది. కైలాసపతి అలాగే చేశాడు. 32 వందల రూపాయిలను పోస్టాఫీసులో గాచేసి పరారు అయ్యాడు. కైలాసపతి కుటుంబ ఆర్థిక స్థితిని చూస్తే, అతడికావుద్యోగం విలువయిందని ఎవరైనా అంటారు. అయినా, అతడు ఉద్యోగాన్ని లెక్కపెట్టలేదు. ప్రభుత్వం తనను పెట్టే బాధల్ని లెక్కపెట్టలేదు. విప్లవసంఘు ఆజ్ఞను శిరసావహించాడు. పోస్టాఫీసులో నుండి తెచ్చిన డబ్బులో 5 వందల రూపాయిలను మిత్రుడు హలధర్‌బాజ్‌పేయీ ద్వారా తన తండ్రికి పంపించాడు కైలాసపతి. విప్లవోద్యమంలో తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ దొంగతనానికి కూడా వెనుదీయకపోవడం అన్నది కైలాసపతి వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోడానికి తోడ్పడుతుంది.

పోస్టాఫీసులో డబ్బు దొంగిలించిన తరువాతనే, లాహోరులో మా యింట్లో కొన్నాళ్ళు వున్నాడతడు. కైలాసపతి బాగా పొట్టిగా వుండేవాడు. బహుశ ఐదడుగులు వుంటాడేమో. శరీరపు రంగు నల్లని నలుపయినా, అతడు మాత్రం తను చామనచాయగా వున్నాననుకునేవాడు. ముఖం కోలగా

వుండేది. బుగ్గలు లోపలికి పీక్కుపోయి, ఎముకలు ఎళ్ళు కొచ్చి వుండేవి. అప్పుడతణ్ణి 'కాశీచరణ్' అని పిల్చేవారు. అతడి అసలు పేరు అప్పటికి నాకు తెలియదు. కైలాసపతి లాహోరులో వున్నప్పుడూ, తరువాత ఢిల్లీ వచ్చాక కూడా తన వ్యక్తిగత అవుసరాల పట్ల చాలా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ వుండేవాడు. భగవత్‌సింగ్, సుఖదేవ్ వీళ్ళిద్దరూ కైలాసపతి పట్ల అకారణంగా నిర్లక్ష్యభావాన్ని ప్రదర్శిస్తూండేవారు. వీరు తన పట్ల ప్రదర్శించే నిర్లక్ష్యభావాన్ని గురించి కైలాసపతి విప్లవసంఘంలో చర్చను కూడా లేవదీశాడు. భగవత్‌సింగ్ సౌందర్యోపాసి. అసౌందర్యాన్ని అతడు ద్వేషించకుండా వుండలేడు. భగత్‌సింగ్, కైలాసపతిని చిన్నచూపు చూడ్డానికి ఈ ప్రవృత్తి ముఖ్య కారణం. నేను మాత్రం కైలాసపతి పట్ల సానుభూతిని కలిగి వుండేవాణ్ణి. అతడి మౌన ముద్ర, వ్యక్తిగత అవసరాల పట్ల అతడు ప్రదర్శించే నిరాపేక్ష నాలోని సానుభూతికి కారణాలు.మరో విషయంలోనూ అతడి మీద నాకు జాలి కలిగేది. నేను హాయిగా ఇంటిపట్టున వుండి సుఖపడుతూ విప్లవ సంఘానికి ఏ కొద్దిగానో సాయం చేస్తున్న రోజుల్లో, అతడు ఇల్లూ వాకిలీ వదిలి పరారై నానా బాధలూ పడ్డాడు. అతడి మీది నాలోని సానుభూతికి ఇదీ ఓ కారణం.

మేము కైలాసపతిని ఢిల్లీలో 1929 నవంబరులో కల్సుకున్నాము. కల్సుకోగానే దెబ్బతిన్న నా చేతిని గురించి ప్రశ్నించాడతాడు. ఆ రోజుల్లో ఉదయపు సమయాల్లో బాగా చలిగావుండేది. ముఖ్యంగా ఉదయాన్నే సైకిల్ తొక్కితే, రివ్వున వీచే చలిగాలికి వళ్ళు కొంగర్లు ఎత్తేది. ఢిల్లీలో కైలాసపతి యమునవడ్డున గల న్యూ హిందూ హాస్టలులో వుంటున్నాడు. అక్కణ్ణుండి ఉదయాన్నే వణుకుతూ, సైకిల్‌మీద మా దగ్గరకు వచ్చేవాడు. మేము లాహోరు నుండి వున్ని దుస్తుల్ని తెప్పించుకున్నాము. ఢిల్లీలోనూ ఆర్థికంగా మంచి స్థితిలోవున్న మిత్రుల కారణంగా మేము గుడ్డలకు ఏమీ బాధ పడడంలేదు. చలీ మమ్మల్ని అంతగా బాధించడం లేదు.

ఒకరోజు కైలాసపతి స్వెట్టర్ లేకుండా చలికి వణుకుతూండడాన్ని చూశాను. నా స్వెట్టర్ అతడికి ఇచ్చాను. మర్నాడు స్వెట్టర్ లేకుండా వణుకుతూండగా మళ్ళీ చూశాను. నేనిచ్చిన స్వెట్టర్ ఏమయిందని అడిగాను. 'మరో మిత్రుడికి లేకపోతే ఇచ్చేశానని' చెప్పాడు. వెంటనే భగవతీభాయి తన స్వెట్టర్ని తీసి ఇచ్చాడు. అది అతడికి పెద్దది కావడంవల్ల ఎబ్బెట్టుగా వుంది. "పోనీ ఇది నీకు బాగుండకపోతే మరొకటి తెచ్చి ఇస్తాము." అన్నాము మేము.

అతడు చాలా నిర్లక్ష్యంగా "చలికాగడం ముఖ్యం. ఏలా వుంటే ఏం ?" అన్నాడు.

రెండు రోజుల తరువాత మళ్ళీ కైలాసపతి చలికి వణుకుతూ వచ్చాడు. అతడి వంటిమీద భగవతీభాయి ఇచ్చిన స్వెట్టర్ లేదు. దీన్నీ చలికి బాధపడుతూన్న మరో మిత్రుడికి ఇచ్చాడని తెల్సింది. ఇది కైలాసపతి వ్యక్తిత్వంలోని ఒక భాగం. రెండవ భాగాన్ని గురించి సందర్భం వచ్చినప్పుడు వివరిస్తాను.

నవంబరు రెండవ వారంలో కైలాసపతి మాదగ్గర 30 రూపాయిలు తీసుకుని కాన్పూర్ వెళ్ళాడు. ఆజాద్‌తో మా సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి. భయ్యా ఆజాద్‌కు మా గురించి బచ్చన్‌కూడా చెప్పాడు. కనుక, సమావేశానికి అంగీకరించాడు. కైలాసపతి తిరిగి వచ్చాక, సాయంత్రం 'కుదసియాబాగ్'కు మమ్మల్ని తీసుకువెళ్ళాడు. నేనూ, భగవతీచరణ్ - ఆజాద్‌ను చూడడం అదే మొదటిసారి. కైలాసపతి మమ్మల్ని పరిచయం చేశాడు. భయ్యా ఆజాద్, చాలా సహజంగా, చాలా నిష్కపటంగా "చూడు సోదరా. వెనక ఓమాటు మిమ్మల్ని కల్సుకోడానికి నేను నిరాకరించాను. ఐనా, మీరు ఏమీ అనుకోవద్దు. అప్పట్లో మీగురించి నేను విన్న విషయాల్నిబట్టీ, మిత్రులు నాకుచెప్పిన విషయాల్ని బట్టి - అలా నిరాకరించాను. ఇప్పుడు మీ గురించిన అనుమానాలు నివృత్తి అయ్యాయి. మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాను. వెనుకటి విషయాల్ని మర్చిపొండి." అన్నాడు.

ఆజాద్ వెంట మరోవ్యక్తి వున్నాడు. అతడు కొంచెం పొడుగ్గా, గోధుమ వర్ణంలో వున్నాడు. కండ్లు చంచలంగా వున్నాయి. భయ్యా ఆజాద్ అతన్ని 'బచ్చన్' అని పిల్చేవాడు. అసలు పేరు విశ్వనాధ వైశం పాయన్. భయ్యా వెంట ఎప్పుడూ 'బచ్చన్' వుంటాడు. భయ్యా చెప్పిన ప్రతి చిన్న పనినీ బచ్చన్ శ్రద్ధగా చేస్తాడు. అప్పుడే ఆజాద్‌కు వైస్రాయి ట్రయిన్ కింద బాంబు ప్రేల్చాలన్న మా అభిప్రాయాన్ని చెప్పాము. ఇలా అన్నాము. "ఈపని ఎప్పుడో జరిగిపోయేది. గణేశ్ శంకర విద్యార్థి గారు అభ్యంతర పెట్టడంవల్ల ఆగిపోయాం."

ఆజాద్ తన ప్రయత్నాలగురించి చెప్పాడు "నేను లాహోరు కుట్రకేసును నడుపుతూన్న ఖాన్ బహదూర్ అబ్దుల్ అజీజ్‌నీ, మిస్టర్ హార్టన్‌నీ, ఖైరాత్‌నబీనీ - కాల్చివేయాలన్న ప్లానులో వున్నాను." అన్నాడు.

మేము ఇలా అన్నాము. "చిన్న చిన్న పోలీసు ఉద్యోగుల్నో, ఆఫీసర్లనో - చంపడంకోసం మన శక్తినీ, కాలాన్నీ వ్యర్థపుచ్చడం అవుతున్నది. ఈ ఉద్యోగుల్ని, ఆఫీసర్లనూ చంపి ప్రయోజనంలేదు. ప్రభుత్వపు ఉప్పూ, పులుసూ తింటున్నారు గనుక తప్పనిసరిఐ ఉద్యోగధర్మాన్ని నిర్వహిస్తున్నారు. మరొక్క విషయం, సాధారణమైన ఉద్యోగిని చంపడానికిగానీ, వైస్రాయిని చంపడానికిగానీ - మనం ఒకేరకమైన శ్రమపడవలసి వస్తున్నది. అలాంటప్పుడు సాధారణమైన ఉద్యోగిని ఎందుకు చంపాలి ? బ్రిటీష్ ప్రభుత్వానికి తల్లివేరులా పనిచేస్తున్న వైస్రాయినే కడతేరుద్దాం. వైస్రాయిమీద దాడి ప్రజల ధైర్య సాహసాలనూ రెట్టింపు చేస్తుంది !"

ఆజాద్ మా అభిప్రాయాన్ని ఒప్పుకున్నాడు. విప్లవ సంఘపు ఆర్థికబాధను గురించి విచారాన్ని వెలిబుచ్చాడు. దోపిడీ చేయవలసిన పరిస్థితులు ఏర్పడుతూండడంవల్ల మానసికంగా కొంత బాధపడ్డాడు. "ఎటునుంచీ ఆర్థిక సహాయం లభించడంలేదు. నేను కొందరి దగ్గర అప్పుతెచ్చి విప్లవ సంఘపు అవుసరాల్ని గడిపాను. ఆ అప్పులు తీర్చలేక పోయినందుకు చాలా సిగ్గుపడుతూన్నాను." అన్నాడు ఆజాద్.

దోపిడీచేయడాన్ని గురించి అందరం ఏకాభిప్రాయానికి వచ్చాం. అయితే, ముందు వైస్రాయి విషయాన్ని చూసుకుని, ఆ తరువాత పెద్ద దోపిడీ నొకదాన్ని చేయాలన్న నిర్ణయానికి వచ్చాం. దోపిడీ చేయడం మాకేమీ వ్యసనం కాదు. తప్పనిసరిఐ మాత్రమే ఆ నిర్ణయం చేసుకున్నాం. 'కుదసియాబాగ్'లో సమావేశం ముగిశాక, భయ్యా ఆజాద్ తను ఉండేయింటిని మాకు చూపించాడు. మేమూ 'నయాబజార్'లోని మాగదిని ఆజాద్‌కు చూపించాము. అత్యవసరమైన పరిస్థితిలో వెంటనే వార్తలను పంపుకోడానికి ఇది ఉపయోగపడుతుంది.

ఆజాద్ యమున ఒడ్డునగల 'న్యూ హిందూహాస్టల్' సూపరింటెండెంట్ నందకిషోర్‌నిగమ్ యింట్లో వుంటున్నాడు. కైలాసపతికూడా అక్కడే వుంటున్నాడు. నిగమ్ హిందూకాలేజి లెక్చరర్, బోర్డింగ్ సూపరింటెండెంట్. కైలాసపతికి మరి ఒకరిద్దరు మిత్రులకు ఆర్థిక అవుసరాలను కూడా ఇతడే గడుపుతున్నాడు.

విప్లవ సంఘం తరపున వైస్రాయి ట్రయిన్ కింద బాంబు పేల్చడానికి ఆజాద్ మాకు అనుమతినిచ్చాడు. నవంబరు చివరి వారంలో వైస్రాయి ఢిల్లీ నుండి వెళ్ళనూ వెళ్ళాడు. మళ్ళీ తిరిగి రానూవచ్చాడు. మేము బాంబు పేల్చలేకపోయాం. అందుకు కారణం హంసరాజ్ సమయానికి యంత్రాల్ని తయారుచేసి యివ్వకపోవడమే. అతడుయిస్తానన్న సమయానికి ఇంద్రపాల్ లాయల్పూరు వెళ్ళాడు. అయినా, హంస్‌రాజ్ యంత్రాల్ని యివ్వలేదు. ఇలా అన్నాడు "ఈ వైర్‌లెస్ యంత్రాల్ని నేను ఒక్కడినే తయారుచేస్తానని అందరికీ తెలుసు. ప్రభుత్వానికీ తెలుసు. కనుక, ఈ వ్యవహారంలో నా వైర్‌లెస్ యంత్రాల్ని వాడడం వల్ల ప్రభుత్వాన్నికి నా మీద అనుమానం కలుగుతుంది."

హంస్‌రాజ్‌వైర్‌లెస్ యంత్రాన్ని తయారు చేసి యివ్వడానికి నిరాకరించాడు. ఐతే, మరోదాన్ని తయారు చేసి యిస్తానన్నాడు. అది గ్యాస్‌తో నిండిన బల్బు. ఆ బల్బు ప్రభావం వల్ల అయిదు వందల గజాలలోపు ఉన్న ప్రజలందరూ మూర్ఛపోతారు. ఆ బల్బులో కొంత ద్రవ పదార్థం వుంటుంది. బల్బు పగలగానే ద్రవ పదార్థం గ్యాస్‌గా మారి అయిదు వందల గజాల వరకూ వ్యాపిస్తుంది. హంస్‌రాజ్ ఈ కొత్త ప్రయోగాన్ని గురించి మాకు చెప్పాడు. ఆ గ్యాస్‌కు విరుగుడు మందును కూడా తయారు చేసి ఇస్తానన్నాడు. జేబులో విరుగుడు మందు ఉంటే ఆ గ్యాస్ ఏమీ చేయదట.

హంస్‌రాజ్ చెప్పిన ఈ 'మూర్ఛాగ్యాస్'ను గురించి మా అందరికీ అనుమానం కలిగింది. భగవతీచరణ్ "ఒక్కక్షణంలో ఏ గ్యాసేగాని, అయిదు వందల గజాలు ఎలా వ్యాపించగలదు ?" అని అడిగాడు.

నేను హంస్‌రాజ్‌కు-గ్యాస్‌కూ విద్యుత్తరంగానికీ ఉన్న వ్యత్యాసాన్ని బోధపరచడానికి ప్రయత్నించాను. అంటే, సువాసన, శబ్దం, విద్యుత్తరంగం వీటి నడకలో ఉన్న వ్యత్యాసాన్ని బోధపర్చాలనుకున్నాను.

హంస్‌రాజ్ నా మాటలు సాంతం వినకుండానే "అలా కాదు. నేను చెప్పేదాన్ని మీరు అర్థం చేసుకోలేదు. నేను గ్యాస్ అన్నది విద్యుత్తరంగాన్నే" అంటూ ఇంద్రపాల్ వైపు తిరిగి "ఇతనికి చెప్పేప్పుడు 'వేవ్' అంటే అర్థం చేసుకోలేడు గనక 'గ్యాస్' అన్నాను. మీరూ చూశారు గదా ? గజన్నర దూరాన్నుండి వైర్‌లెస్ ద్వారా బల్బును వెలిగించింది ? అలాంటిదే ఇదీను." అన్నాడు.

రసాయన శాస్త్రంలో ఏ మాత్రం పరిచయం ఉన్నా, హంస్‌రాజ్ చెప్పిన ఈ గ్యాస్, గొంతెమ్మ కోర్కెలాంటిదని స్పష్టమవుతుంది. ఐతే, అతణ్ణీ, అతడు చెప్పే మాటల్నీ నమ్మకతప్పలేదు. అతడు, కరెంటు వైరులతో పనిలేకుండా బ్యాటరీకి గజన్నర దూరంలో బల్బునుపెట్టి వెలిగించి చూపించాడు. పైగా, మేము పని గడవడం ముఖ్యమన్న తొందరలో ఉన్నామేమో, ఏ మాత్రం తర్కించకుండా అతని మాటలను నమ్మేశాం. దీన్ని ఒకరకంగా బుద్ధిహీనతే అనాలి. ఇందుకు ముఖ్య కారణం - మా ప్రాణాలకు ప్రమాదం కలగకుండా, వైస్రాయి ప్రాణాల్ని తీసేయాలన్న మాలోని పిరికితనమే ! రానున్న రెండు మూడు నెలల్లో వైస్రాయి చాలామార్లు ఢిల్లీకి వచ్చి వెళతాడు.కనుక హంసరాజ్ తయారుచేసి యిచ్చే గ్యాస్ కోసం నిరీక్షించడమే ఉచితం అనుకున్నాం.

# సావర్కార్‌బాబా, జిన్నాసాహెబ్

ప్రసిద్ధ విప్లవకారుడైన వినాయక సార్కార్ అన్న బాబాసావర్కార్ ఢిల్లీకి వచ్చాడు. 'అర్జున్' కార్యాలయంలో దిగాడు. ఒకప్పుడు సావర్కార్ సోదరులు భారత స్వాతంత్ర్యం కోసం విప్లవ బీజాల్ని నాటిన మహాయోధులు. కాని ప్రస్తుతం వారు హిందూ మహాసభ తరపున పనిచేస్తున్నారు. బాబాసావర్కార్ మత సంబంధమైన పనికొరకే ఢిల్లీ వచ్చారు. మా చిన్నతనంలో, వీరి విప్లవజీవితం మమ్ములను ఎంతగానో ప్రభావితం చేసింది. వీరురాసిన 'అండమాను-ప్రతిధ్వని' అనే పుస్తకాన్ని ఎన్నిమార్లు చదివామో చెప్పలేను. యాభైయేళ్ళ తరువాత ఇప్పటికీ ఆ పుస్తకంలోని ఎన్నో వాక్యాలను నేను వప్పచెప్పగలను.కనుక సావర్కార్ సోదరులమీద మాకు అపారమైన శ్రద్ధాసక్తులు ఉన్నాయని వేరేచెప్పనవసరం లేదు. 'అర్జున్' కార్యాలయానికి వెళ్ళి బాబాసావర్కార్ గారి దర్శనం చేసుకోవాలని నిశ్చయించుకున్నాను.

బాబా సావర్కార్ హిందూ మతాభిమానిఐ, విప్లవానికి దూరంగా ఉన్నప్పటికీ, వారి నుండి కొంత సహాయం లభిస్తుందన్న ఆశ మాకు ఉంది. నేనూ, భగవతీచరణ్ - వారిని కలుసుకోవడానికి వెళ్ళాము. సాధారణంగా, నేను ఎవరికాళ్ళకూ నమస్కారం పెట్టను.. కాని బాబాసావర్కార్ కాళ్ళకు నేనూ, భగవతీచరణ్ - ఇద్దరం నమస్కరించాం. మా అసలు పేర్లను చెప్పి, మాకు సహాయం చేయవలసిందని అడిగాం. బాబా మమ్ములను నిరాశపర్చలేదు. కొద్ది రోజుల తరువాత తనను కలుసుకోవలసిందని చెప్పారు.

కొన్నాళ్ళు గడిచాక నేను బొంబే వెళ్ళాను. సావర్కారక్ సోదరులలో అందరికంటే చిన్నవాడు 'దోభీతలాబ్'లో ఉంటున్నాడు. అతడిని వెతికి పట్టుకున్నాను. బాబాసావర్కార్‌గారి అడ్రసు అడిగాను. బాబా సావర్కార్ అకోలాలో ఉంటున్నారు. వినాయక సావర్కార్ 'రత్నగిరి' ఖైదులో ఉన్నాడు. వినాయక సావర్కార్ని కల్సుకోవడానికి అవకాశం ఉండదు. బాబాసావర్కార్‌ని కల్సుకోవడానికి అకోలా వెళ్లాను.

అకోలాలో బాబా ఒక మేడ పై భాగంలోని చిన్న గదిలో ఉంటున్నారు. వారి గదిలో కూర్చీలు, బల్లలు, మంచాలు - ఇలాంటివేవీ లేవు. కింద పరుపునొకదాన్ని పరుచుకుని కూర్చుని ఉన్నారు. రైల్వేప్లాటు ఫారం మీద క్షణకాలం విశ్రాంతి తీసుకుంటున్న బాటసారిలా. పరుపుకు పక్కనే మూతలేని చెక్కపెట్టె ఒకటుంది. దాన్ని పుస్తకాలు - అవీ పెట్టుకోవడానికి షల్ఫులా వాడుకుంటున్నారు. గదిలో ఒక పక్కన తెల్లగా తోమిన యిత్తడి బిందె నిండా నీళ్ళున్నాయి.

డిశంబరు మొదటి వారం, ఆకాశంలో చిరుమేఘాలు కన్పిస్తున్నాయి. నేను రాత్రంతా ట్రైనులో ప్రయాణం చేసి, తెల్లవారి తొమ్మిది గంటలకు అక్కడికి చేరాను. వాతావరణం చలి చలిగా ఉంది. బాబాసావర్కార్ వేడినిచ్చే కోటును వేసుకున్నారు. కోటుమామిడి చిగురు రంగులో ఉంది. గుండీలకు బదులు తాళ్ళుకట్టుకున్నారు. వారి పడకను ఆనుకుని గోడన వారు ధరించే విచిత్రమైన దుస్తులు వేలాడుతూన్నాయి. జోధపురి నమూనలోని చొక్కా ఒకటి, నల్లని టోపి ఒకటి. కాళ్ళ వైపున కిర్రు చెప్పులు పెట్టి ఉన్నాయి. ఆ చెప్పులూ వారి చొక్కా నల్లని టోపి వీటిని ఆశ్చర్యంగా చూశాను.

బాబాసావర్కార్ నా పట్ల ఎంతో వాత్సల్యాన్ని ప్రదర్శించారు. తన పడకకు ప్రక్కనే నేను కూర్చోవడానికీ ఒక పరుపును వేయించారు. వెళ్ళగానే ముందు కాళ్ళూ చేతులూ కడుకోవడానికి వేడి నీళ్ళు యిచ్చారు. తరువాత వేడివేడి టీని యిచ్చారు. టీ తాగాక కప్పుకోవటానికి గొంగళి నొకదాన్ని యిచ్చారు. బాబాసావర్కార్ ఏమీ కప్పుకో కుండా మౌనంగా కూర్చుని ఉన్నారు. అప్పటికి వారి వయస్సు 60 ఏళ్ళకు తక్కువ ఉండదు. వాతావరణం చలిచలిగా ఉన్నప్పటికీ, వారు కప్పుకోకుండా, నేను గొంగళిని కప్పుకోవడానికి సంకోచిస్తున్నాను. బాబా బలవంతం చేశారు. "అలా కాదు. నువ్వు ప్రయాణం చేసి అలసిఉన్నావ్. చలి ఎక్కువగా ఉన్నది. నీవు తప్పకుండా కప్పుకోవాలి. నేను ఎప్పుడూ ఇలాగే ఉంటాను." అన్నారు. భోజనం చేసేప్పుడూ అలాగే బలవంతం చేసి మరీ మరీ తినిపించారు. వారి బలవంతమూ, ఆత్మీయతా చూస్తూ ఉంటే, పరదేశం నుండి వచ్చిన బంధువును ఆదరిస్తున్నట్టుగా ఉంది.

ఆ రోజు వాతావరణం చల్లగా ఉంది. పైగా బాబాకు జలుబు చేసినట్టుగా కూడా ఉంది. ప్రతి రెండు గంటలకూ ఆ యింటి యిల్లాలు, బాబాకోసం యిత్తడికప్పు గ్లాసులో టీ పట్టుకొచ్చి యిస్తున్నది. ప్రతిసారి బాబా ఆ కప్పు గ్లాసును నా ముందుకు జరుపుతూ ఉన్నారు. బాబా మరొకటి తెప్పించు కుంటున్నారు. వాళ్ళు నేను ఎంతవద్దన్నా తాగక తప్పడం లేదు. ఆ టీ మామూలు టీ రుచిలో లేదు. దాన్ని గురించి బాబా ఇలా చెప్పారు. "ఇది మామూలు టీ కాదు. తులసి ఆకులు, అల్లపురసంతో తయారు చేసిన పానీయం ఇది" అన్నారు.

'జలుబు వల్ల వారు ఇలాంటి పానీయాన్ని సేవిస్తున్నారు గావును' అనుకున్నాను. కాని, వారు ఎప్పుడూ అలాంటి తులసి ఆకు టీనే తాగుతారట.

నేను సంకోచిస్తూ "శరీరానికి మంచిదని మీరు ఈ తులసి ఆకు టీని తాగుతున్నారా ? లేక మామూలుటీ, విదేశపు టీ కావడం వల్ల, దాన్ని విసర్జించి ఈ దేశవాళీటీని తాగుతున్నారా ?" అడిగాను.

నేనిలా అడగటానికి కారణం వారు వేసుకున్న విచిత్రమైన దుస్తులే.

ఈ దేశపు కట్టూ బొట్టును నిలబెట్టటానికి వారు ప్రత్యేకం ప్రయత్నిస్తున్నట్లు కనిపించింది. అందుకు ఇంకొక్క ఉదాహరణ కూడా చెబుతాను.

మధ్నాహ్నం వారి అనుచరులైన యువకులు కొందరు, తమ వ్యాయామశాలల్ని గురించి వారితో మాట్లాడుతున్నారు. వాళ్ళు మరాఠీలో మాట్లాడుతున్నారు. అయినా, నాకు ఫుట్ బాల్ మాచ్‌ని గురించిన సంభాషణ జరుగుతూన్నదని తెలుస్తూనే ఉన్నది. ఫుట్‌బాల్, క్రికెట్, హాకీ - ఈ ఆటలన్నీ మనం ఇంగ్లీషువాళ్ళ నుండే నేర్చుకున్నాం. కనుక, ఈ ఆటలను ఆడేటప్పుడు వాటికి సంబంధించిన ఇంగ్లీషు పారిభాషిక శబ్దాలను ఉపయోగించక తప్పదు.ఉదాహరణకు - సెంటర్, ఫార్వర్డ్, బ్యాక్, హాఫ్‌బ్యాక్, గోల్,ఔట్, పెనాల్టీ మొదలైనవి. ఆ యువకులు ఈ యింగ్లీషు పారిభాషిక శబ్దాలను ఉపయోగించకుండా, వీటికి సమానార్థకాలైన సంస్కృత శబ్దాలను వాడుతున్నారు. పరభాష మీద ఆధారపడకుండా మన భాషను పటిష్టం చేసుకోవడం ముదావహం అనిపించింది. అయినా, ఇదో విచిత్రమైన ప్రయత్నం అనుకున్నాను.

టీని గురించి నేనడిగిన ప్రశ్నకు బాబా ఇలా సమాధానం ఇచ్చారు. "నువ్వు అన్నమాట నిజమే. టీ తాగే ఆచారం మనకు విదేశాల నుండి దిగుమతి అయింది. అందుకనే, నేను మామూలు టీని తాగకుండా, తులసి ఆకు టీని తాగుతున్నాను !" అన్నారు.

వారి మీద నాకు అపారమైన భక్తి శ్రద్ధలున్నాయ్. వారి త్యాగమయ జీవితాన్ని చూసి నేనెంతో ప్రభావితుడనయ్యాను. అయినా సంస్కృతీ సభ్యతలపట్ల వారి దృష్టి కోణం, వారు అనుసరిస్తున్న మార్గం అవ్యవహారిక మనిపించింది.

బాబా సహృదయులు స్పష్టంగా మాట్లాడేస్తారు. వారితో మాట్లాడేటప్పుడు ఏ విధమైన దాపరికమూ, యుక్తులూ - అవుసరం ఉండవు.

వారికి కాంగ్రేస్ ఉద్యమం నిష్ఫలమయిందనీ చెప్పనవసరం లేదు. విప్లవాన్ని గురించీ చెప్పవలసిన అవుసరం ఉండదు. మా యువతరానికి విప్లవ సందేశాన్ని అందించిందే సావర్కార్ సోదరులు. కనుక, ఉపోద్ఘాతంతో పనిలేక పోయింది. ఏకాంతం లభించగానే డబ్బూ, ఆయుధాలు సహాయం చేయవలసిందనీ, కొందరు సాహసికులైన మిత్రుల్నీ పరిచయం చేయవలసిందనీ అడిగాను.

నా అభ్యర్థనను వారు తిరస్కరించ లేదు. అయితే వారి దృష్టి కోణాన్నీ, కార్యక్రమాన్నీ ఇలా వివరించారు. "విదేశీయులదాస్యాన్నుంచి దేశాన్ని ఉద్ధరించడం మన ఉద్దేశం. దేశాన్ని ఉద్ధరించడమంటే మన జాతీయతను సంరక్షించుకుంటూ. అభివృద్ధికి తీసుకుపోవడమన్న మాట. ఈ దేశములో ఒక్క యింగ్లీషు వారే మనకు శత్రువులు కారు. ఇక్కడే ఉంటూ ఈ దేశ ఐక్యతకు, జాతీయతకు, స్వాతంత్ర్య ప్రయత్నాలకు బద్ధ విరోధులుగా వ్యవహరిస్తున్న మరొకరు కూడా ఉన్నారు. వాళ్ళు ఇంగ్లీషువారికి బాసటగా ఉండి మన ప్రయత్నాల్ని వ్యర్థ పుచ్చుతున్నారు. వాళ్ళు మరెవరోకారు, ముస్లిములే. ముస్లిములు ఈ దేశ ప్రజల్లో కలవకుండా ఈ దేశ సంస్కృతితో తమకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తారు. ఏ దేశానికైనా, ఏ జాతికైనా సంస్కృతి చాలా ప్రధానమైంది. సాంస్కృతికమైన ఐక్యతను సాధించాలి. అప్పుడే విదేశీయుల దాస్యాన్నుండి విముక్తి పొందగలం. సాంస్కృతికమైన ఐక్యతను

సాధించడానికి, సంస్కృతికి విరోధులైన అన్యుల పీడ వదిలించుకోవాలి. ఈ ఐక్యతను సాధించకుండా దాస్యాన్నుండి ముక్తి పొందటం అసంభవం. దాస్యమనేది మహావృక్షం. దాన్ని పడగొట్టాలంటే, మొదలు నరకాలి. ఆకుల్ని తుంచి వేయడం వల్ల ప్రయోజనం లేదు. నీ ఉద్దేశ్యంపట్ల నాకు సహానుభూతి ఉంది. ఐతే, మీ కార్యక్రమాల్లో మార్పు వచ్చినప్పుడే, నేను సహకరించగలను.'' అన్నారు.

నేను మౌనంగా ఉన్నాను. బాబా సావర్కార్ నా మౌనాన్ని అంగీకారంగా భావించి ఉంటారు. ఇంకా ఇలా అన్నారు. "మన జాతీయతకు ముఖ్యశత్రువు జిన్నా. ఆయన 'ముస్లిములు ఈ దేశ సభ్యతకు సంబంధించనివారని, వారికోసం దేశాన్ని ముక్కలు చేయాలని అంటున్నారు.' దేశాన్ని ముక్కలుచేసే ఈ దుష్ట రాజకీయాలకు జిన్నా ఏకైక నాయకుడు. మీరు గనక అతడ్ని సమాప్తంచేస్తే భారత స్వాతంత్ర్యసిద్ధికి అడ్డుగావున్న గొప్ప అవరోధం తొలగిపోతుంది. ఇందుకోసం నేను 50 వేల రూపాయలవలరకు మీకు నర్ధగలనని హామీయిస్తున్నాను."

నేను వినయంగా చిరునవ్వుతో వారి ప్రతిపాదనను తిరస్కరించాను. అప్పట్లో విప్లవ సంఘం దారుణమైన ఆర్థిక బాధలతో వేగి పోతూన్నది. ఆ స్థితిలో 50 వేల రూపాయలు - సాధారణమైన ఆశకాదు. ఆర్థిక సమస్యను పరిష్కరించుకోవడానికి, జిన్నామీద దాడిచేయడం తప్పనిసరి అనుకున్నా అనుకోవచ్చును. అయితే, నేను అలా అనుకోలేకపోయాను. మా ఆదర్శంకోసం దోపిడీచేయడం, దొంగ నోట్లను అచ్చువేయడం, ఒకటి, రెండు హత్యలు చేయడం - మాకు ఆటే పట్టింపు నిచ్చే విషయాలుకావు. అయితే, మత దురహంకారంతో అన్యమతస్థుల్ని చంపడం దేశానికీ, ప్రజలకూ క్షేమంకాదని మా ఉద్దేశ్యం. నిజంగా అలా చేయడం మత దురహంకారమే అవుతుంది.

నేను అదే రోజు సాయంకాలం ఢిల్లీకి బయల్దేరాను. నేను బయల్దేరటానికి ముందు ఒక వ్యక్తి గుడ్డల్లో చుట్టిన ఒక వస్తువును పట్టుకువచ్చి బాబాకు యిచ్చి వెళ్ళాడు. అతడు వెళ్ళాక బాబా నాతో ఇలా అన్నారు. "నేను నీకు ఏమీ యివ్వలేకపోతున్నాను. చాలా దూరం నుంచి వచ్చావు. వ్యవధి అంతగా లేదు. ఈ వస్తువు నొక్కదాన్నే యిస్తున్నాను. తీసుకువెళ్ళు !"

గుడ్డల్లో చుట్టిన ఆ వస్తువును బైటకు తీశారు. అదొక నాటు తుపాకి. దాన్ని చూస్తూనే పల్లెటి కమ్మరి తయారుచేసి వుంటాడని అనుకున్నాను. దానికి తూటాలు పనిచేయవు. మందు కూరుకోవాలని తెలుస్తూనే వుంది. ఐనా నేను బాబావైపు చూసి "మరి దీనికి తూటాలేవండీ ?" అని అడిగాను. బాబా చిరునవ్వు నవ్వుతూ "దీనిలోని విశేషమే అది ! తూటాల కొరకు మరొకరిని ఆశ్రయించవలసిన పని వుండదు. ఎప్పుడు పడితే అప్పుడు మందు కూరుకోవచ్చు" అన్నారు. బాబాకు నమస్కారం పెట్టాను. ఆ బరువును మోయలేనన్నాను. నా నడుములకు తగిలించి వున్న 'కోల్టు' పిస్తోల్ని చూపించి "మాకు ఇలాంటి సుకరమైన ఆయుధాలు కావాలి. వీటిని మా శరీరంమీద, గుడ్డల్లోనే, సునాయాసంగా దాచుకోగలం" అన్నాను.

బాబా కొంచెంగా నిరాశపడ్డారు. "సరే నీ యిష్టం. కాకపోయినా ఇలాంటి విదేశీ ఆయుధాల్ని ఎన్నని సంపాయించగలరు ?'' అన్నారు.

నేను వెళ్ళడానికి సిద్ధమయ్యాను. బాబా నా చేతిలో పదిరూపాయల నోటును పెట్టి "నువ్వు రావడం అనవసరమే అయింది. ఇప్పుడు నా దగ్గర ఇంతే వుంది. రైలు ఛార్జీకీ, ప్రయాణంలో తిండితిప్పలకూ వాడుకో !'' అన్నారు. మా అభిప్రాయాల్లో భేదమున్నప్పటికీ వారు నా మీద చూపిన వాత్సల్యం, వారి మహోన్నతమైన వ్యక్తిత్వాన్ని తెలియపరుస్తుంది. నేను, ఆ పదిరూపాయలను ఆశీర్వాదంగా భావించి తీసుకున్నాను.

మిస్టర్ జిన్నాను గురించి బాబాగారు చేసిన ప్రతిపాదన అసాధారణమైంది. మొత్తం భారతదేశపు రాజకీయాల్లోనే విపత్కర పరిస్థితులను కలిగించే విషయం. జిన్నాసాహెబ్‌ను హత్య చేయడమంటే, దేశంలోని హిందూ ముస్లిముల మధ్య, ఘోరమైన మతయుద్ధ జ్వాలల్ని రేపడమన్న మాట ! ఆ జ్వాలల్లో కొన్ని వేలమంది హిందూ ముస్లిములు భస్మమై పోతారనడంలో సందేహం లేదు. నేను రాత్రంతా రైల్లో పడుకుని ఇదే విషయాన్ని గురించి ఆలోచించాను. జాతీయ ఐక్యత అవుసరమే ! హిందూ ముస్లిములు ఐక్యంగా ఉండవలసిందే. అయితే రోజురోజుకీ హిందూ ముస్లిముల మధ్య ద్వేషం పెరిగిపోతూన్నది. నేనూ, మతసంబంధమైన గుడ్డి నమ్మకాల్లేని నాలాటి మరికొందరూ, హిందూ ముస్లిముల మత విద్వేషాన్ని, వట్టి మూర్ఖత్వమని కొట్టి పారెయ్యవచ్చు ! కానీ, ఈ మూర్ఖత్వమే రాజకీయాల్లో ప్రముఖ పాత్ర వహిస్తూన్నది. అయితే, మత సంబంధమైన విశ్వాసాలు వేరైన మాత్రాన, మనుష్యులు ఒకరినొకరు ద్వేషించుకోవడం అవుసరమని నేననుకోను ! 'నవజవాన్ భారతసభ'ను గురించి చర్చించినప్పుడు, ఒక విషయం చెప్పాను. మతసంబంధమైన ద్వేషాన్ని తగ్గించడానికి, వివిధ మతాలకూ, కులాలకూ సంబంధించిన సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేస్తూ ఉండేవాళ్ళం మేము !

ఇదే విషయాన్ని గురించి ఆలోచిస్తూ వుంటే, మరో విషయం జ్ఞాపకానికి వచ్చింది. మా చిన్నతనంలో పంజాబు దేశంలోని పెద్ద పెద్ద పట్టణాల్లో హోటళ్ళూ, మిఠాయికొట్లూ హిందువులే పెడుతూండేవారు వాటిల్లోనే ముస్లిములు నిరభ్యంతరంగా భోంచేస్తూ వుండేవారు ! ఆ రోజుల్లో, ముస్లిములు మిఠాయికొట్లు పెట్టినట్లుగానీ, హోటళ్ళు పెట్టినట్లుగానీ మాకు తెలియదు. అంటే, హిందువులు తాకిన వస్తువులను, తినగూడదన్న పట్టింపు, ఆనాడు ముస్లిములకు లేదు ! అలాగే, కొన్ని వృత్తుల్ని ముస్లిములే చేస్తూ వుండేవారు. హిందువులు చేసేవారు కాదు. హిందువులు కూడా ఆ యా అవుసరాల్ని ముస్లిముల ద్వారా తీర్చుకుంటూ వుండేవారు. మరో విషయం కూడా జ్ఞాపకం వచ్చింది. 1929 వ సంవత్సరం, ఆ సంవత్సరమే నేను లాహోర్ నుండి పరారయ్యాను. నేను పరారు కావడానికి కొద్దిరోజుల ముందు, ఒక నీటిపంపు దగ్గర, ఒక హిందువు, ఒక ముస్లిము పోట్లాడుకోవడం చూశాను. పోట్లాటకు కారణం ఒక హిందువు నీళ్ళు పట్టుకోబోయేముందు, కుండ తొలుచుకున్నాడు. ఆ నీటితుంపరలు పక్కనే పెట్టివున్న ఒక ముస్లిం గృహస్తు కుండమీద పడ్డాయి. ఆ ముస్లిం తన కుండ అపవిత్రమైనట్టు భావించి, విసిరి పగలగొట్టాడు. అంతటితో వూరుకోక, హిందువు చేతిలోని కుండనూ పగులగొట్టాడు. దాంతో, హిందూ ముస్లిములు ఒకళ్ళనొకళ్ళు చంపుకోడానికి సిద్ధం అయ్యారు ! ఇది హిందూ - ముస్లిం మతాలమధ్య ఏర్పడ్డ ద్వేషానికి ప్రతీకం ! లేక ఆ ద్వేషాన్ని అణచుకోవడానికి ప్రయత్నం !

ఒకప్పుడు, ముస్లిము హిందువు తాకిన పదార్థాల్ని తినడానికి సంకోచించేవాడు కాదు ! హిందువులను ద్వేషించేవాడూ కాదు ! హిందువులు తనను ద్వేషించడం చూసి, అతడూ హిందువులను ద్వేషిస్తున్నాడు ! నిజంగా ఆలోచిస్తే, హిందూ ముస్లిముల మధ్య రగులుకున్న ద్వేషానికి కారణం, జిన్నాసాహెబ్‌గానీ, ముస్లిమ్‌లీగు గానీ కాదు. హిందువుల్లోని అగ్రవర్ణాలకు చెందినవారే అందుకు కారణం. ఈ అగ్రవర్ణాలకు చెందినవారు ఒక్క ముస్లిములనే కాదు ద్వేషించడం, తమ మతంలోని నిమ్న వర్ణాలకు చెందినవారనీ అంటరానివారని ద్వేషిస్తూ వుంటారు ! అగ్రవర్ణాలవారు, అంటరానివారుగా భావించే శూద్రుల సంఖ్యే హిందువుల్లో ఎక్కువ ! వీరు పాటించే ఈ అంటరానితనానికి మత సంబంధంగా గానీ, సిద్ధాంతరూపంలో గానీ ఆధారాలేమీ లేవు. ఇది హిందూ సమాజంలో, మధ్యయుగపు ఆర్థికవ్యవస్థ తెచ్చిపెట్టిన దుష్పరిణామం ! మధ్యయుగపు ఆర్థిక విధానం మారిపోతున్నది. దాన్ననుసరించి

ఈ అంటరానితనం కూడా, హిందూ సమాజం నుండి, శాశ్వతంగా వైదొలగుతున్నది. అయితే, వెళ్ళేముందు తన తఢాకా చూపించి గాని మరీ వెళ్ళదు !

హిందూమతంలోని ఆధ్యాత్మవాదం, సర్వప్రాణుల్లోనూ ఒకే ఆత్మ ఉన్నదని చెబుతున్నది ! ఆఖరికి మనిషిలో ఉన్న ఆత్మ, కుక్కలో ఉన్న ఆత్మ కూడా ఒకటే నంటున్నది ! అలాంటప్పుడు హిందూ మతంలో అస్పృశ్యతకు తావున్నదనడం సబబు కాదు. అయితే, హిందూ సామాజిక వ్యవస్థ ఈ అంటరానితనాన్ని సృష్టించింది !

ఢిల్లీ తిరిగివచ్చి పరిణామాన్ని భగవతీభాయికీ, అజాద్‌కూ చెప్పాను. జిన్నా సాహెబ్‌కు సంబంధించిన, బాబాగారి ప్రతిపాదనను విని, ఆజాద్ చాలా నొచ్చుకున్నాడు. విసుక్కున్నాడు. "ఆయన మనల్ని, కూలికి హత్య చేసేవాళ్ళం అనుకుంటున్నాడా ?" అన్నాడు.

తరువాత, బారెడు పొడుగునాటు తుపాకిని గురించి చెప్పుకుని, పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వుకున్నాము. అయితే, ఇది కేవలం నవ్వి ఊరుకోవాల్సిన విషయం కాదు. ఆ తుపాకి పట్ల బాబా చూపిన అనురాగం, భారతీయ సంస్కృతి పట్ల వారికి గల ప్రగాఢమైన ఆదర భావానికి ప్రతీకం ! ఏమైతేనేం ? సావర్కారు సోదరుల దృష్టి కోణానికీ, మా దృష్టి కోణానికీ చాలా వ్యత్యాసం వుంది. వారి దృష్టి కోణం నాటు తుపాకి లాంటిది. బరువుచేటు, ఎప్పటికప్పుడు మందు కూరుకోవడం బాధాకరం. మా దృష్టి కోణం 'కోల్టు' పిస్తోల్లాంటిది. ఒకేమాటు మాగ్‌జీన్‌లో 8 గుండ్లను నింపుకుని ధనాధనా కాల్చేయవచ్చును. నాటు తుపాకి ఎంత స్వదేశపుదైనా, మేము స్వీకరించలేము. అయితే, విదేశీ పిస్తోలుతో సమానంగా పనిచేసే, స్వదేశీ పిస్తోళ్ళని, తయారుచేసుకోవడానికి తప్పకుండా ప్రయత్నం చేస్తాము !

సావర్కార్ సోదరులు, పారతంత్ర్యాన్ని పారద్రోలడానికి, అవసరమైన జాతీయతను, హిందూ సంస్కృతి యొక్క రక్షణకు ఉపయోగపర్చాలనుకుంటున్నారు ! వారి భావాలు ఈనాటికీ అలాగే ఉన్నాయ్. ఒక్క సావర్కార్ సోదరులే కాదు. సాయుధ స్వాతంత్ర్య పోరాటం ప్రారంభమైన తొలి రోజుల్లోని యువకులు కూడా జాతీయతకు ఆదర్శం మత సంబంధమైందనే భావించేవారు ! ఖుదీరాంభోస్, కన్హాయిలాల్ దత్తు మొదలైన ఆ యుగపు విప్లవవీరులు ఉరికంబానికి ఎక్కుతూ 'భారత మాతకుజై' 'రాధామాతకుజై' అని నినాదాలిచ్చారు. అంటే మతాన్నీ, జాతీయతనూ కలిపివేశారన్నమాట ! 'కూకా' ఉద్యమాన్ని నడిపిన సిక్కులు.'బహబీ' విద్రోహాన్ని నడిపిన ముస్లిములు కూడా అలాగే చేశారు ! కాని 'హి.స.ప్ర.స.' యువకులమైన మేము మతము, జాతీయత వేరు వేరు పదార్థాలనే భావించాం. మత సంబంధమైన దృష్టి కోణాన్ని పూర్తిగా వదలి పెట్టేశాం. మత సంబంధమైన విశ్వాసాలు గల వెనుకటి విప్లవకారుల్ని గౌరవిస్తూనే మేము మతాన్ని తీసి ప్రక్కన పెట్టేశాము. మాలో ఈ మార్పు రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. పశ్చిమ దేశాల్లోని అభ్యుదయకరమైన భావాల సంపర్కం, పారిశ్రామిక అభివృద్ధి ద్వారా ఆ దేశాల్లో కలిగిన భావ విప్లవం - భారతీయ విప్లవ కారులమైన మామీద పనిచేశాయి ! ముఖ్యం, 1917 లో, రష్యాలో జరిగిన సామ్యవాద విప్లవం మమ్ములను ఎంతగానో ప్రభావితం చేసింది !

మేము మత సంబంధమైన ఆదర్శవాదాన్ని వదలి, మార్క్సు చెప్పిన గతితార్కిక భౌతికవాదం వైపు మొగ్గాము ! కనుకనే, ఉరికంబానికి ఎక్కేటప్పుడూ, లేక జైళ్ళలో యమ యాతనలను అనుభవించేటప్పుడూ మాకు 'రామనామం'తో పని పడలేదు. భగత్సింగ్ ఉరి కంబానికి ఎక్కుతూ 'ఇన్‌కిలాబ్ జిందాబాద్ !' 'సామ్రాజ్యవాద్ ముర్దాబాద్ !' అని నినాదాలను ఇచ్చాడు.ఈ రెండు నినాదాలు భౌతికమైనవే గాని ఆధ్యాత్మిక ప్రమేయం కలవి కావు. గతితార్కిక భౌతికవాదం ద్వారా ఆత్మ విశ్వాసాన్ని, మనో నిబ్బరాన్ని కూడగట్టుకోవడానికి సంబంధించిన గొప్ప ఉదాహరణను నేను ఫతేహగఢ్ సెంట్రల్

జైలులో చూశాను. 1934 జూన్ నెల, ఫతేహగఢ్ సెంట్రల్ జైలులోని సి. క్లాస్ ఖైదీ రమేష్‌గుప్త అనే విప్లవవీరుడి పట్ల జైలు అధికారులు అత్యాచారాన్ని చేశారు. ఆ విషయం తెలిసి మేమంతా నిరవన వ్రతం పట్టాము. మాకూ కొన్ని సమస్యలున్నాయి. మొత్తంగా కలిపి నిరశన వ్రతం చేయడం అవసరమైంది. ఈ దీక్ష రెండు వారాలపాటు సాగింది. ఆ జైలులోని బి. క్లాస్ ఖైదీలము నేనూ, కాకోరీ కుట్ర కేసులోని ముద్దాయీ మన్మథనాథ్ గుప్త, బెనారస్ కాల్పులకు సంబంధించిన ముద్దాయి మణీంద్రనాథ్ బెనర్జీ - మేం ముగ్గురమే ! మణి బెనర్జీ ఆరోగ్యం అసలే అంతంత మాత్రం. 15 రోజుల ఉపవాసంతో పూర్తిగా చెడిపోయింది. గుండెజబ్బు భీకర రూపాన్ని దాల్చింది. కాళ్ళూ చేతులూ వాచిపోయినాయి. కండ్లు కనపట్టం లేదు. మణిని జైలు హాస్పిటల్‌కు పంపించేశారు. అప్పుడు జైలు సూపరింటెండెంట్ మేజర్ రామ్‌నారాయణ భండారి.

మణి బ్రతుకుతాడన్న ఆశ నశించింది. భండారీకి భయమేసింది. మణిపట్ల అతడు ప్రవర్తించిన ప్రవర్తనను, చూపిన నిర్లక్ష్యాన్ని తెలుపుతూ, గవర్నర్‌కు మేము రిపోర్టు చేస్తామేమోనని భయపడ్డాడు. ఈ భయంతోనే, మణి ఇంకా కొన్ని గంటల్లో చనిపోతాడనగా, నేనూ, మన్మథనాథ్‌గుప్త హాస్పిటల్‌కు వెళ్ళి, అతడి దగ్గర వుండటానికి అనుమతించాడు. మేము మణిదగ్గరకు వెళ్ళినప్పుడు అతడికసలు ఏమీ కనిపించడం లేదు. శ్వాస పీల్చడానికి యమయాతన పడుతున్నాడు. ఆక్సిజన్ గ్యాస్ పెట్టారు. అయినా శ్వాస పీల్చుకోవడానికి అతడి శరీరం అంతా మెలికెలు తిరుగుతూన్నది. తన్నుకులాడుతున్నాడు. అంత మెలికెలు తిరిగి ప్రయత్నిస్తేనే గాని, ఒకటి రెండుమార్లు శ్వాస పీల్చలేక పోతున్నాడు ! శ్వాస కొంచెం లోపలికి పోయాక ఒక్క క్షణం స్థిమితపడి మాతో మాట్లాడగలుగుతున్నాడు. అంత బాధలోనూ అతడు తెలివిని కోల్పోలేదు.

మణీంద్రనాథ్ బెనర్జీ పడుతున్న ఈ బాధను చూశాక మన్మథనాథ్ గుప్త హృదయం ద్రవించిపోయింది. అతడు ప్రార్థనా పూర్వకంగా రెండు చేతులూ జోడించి, కరుణాభరిత స్వరంలో, మణికి వినపడేట్టు "నేను నాస్తికుణ్ణి, నాకు భగవంతుడున్నాడన్న నమ్మకం లేదు. కాని కొందరు భగవంతుడున్నాడని విశ్వసిస్తున్నారు. పైగా అతడు సర్వశక్తి సంపన్నుడనీ, అద్భుతమైన శక్తులు కలవాడనీ అంటున్నారు. నిజంగా వాళ్లు అంటున్నట్టు భగవంతుడనేవాడుండి, అతడు నీ బాధను తొలగించితే, నేను నా తార్కిక ప్రవృత్తిని చంపుకుని, అనేకులు చెబుతున్న ఆ భగవంతుణ్ణి విశ్వసించడానికీ, ప్రార్థించడానికి సిద్ధంగా వున్నాను" అని అన్నాడు.

మన్మథనాథ్‌గుప్త ఇలా ప్రార్థిస్తున్న సమయంలోనే మణి శరీరం మెలికెలు తిరిగి శ్వాసకోసం అతి దారుణంగా సంఘర్షిస్తున్నది. ఒక్క క్షణం అతడి శ్వాసనాళిక సవ్యంగా పనిచేసింది. మణి ఖిన్నస్వరంలో "డామ్ యువర్‌గాడ్ - డామ్ హిజ్ మెర్సి. నీ దేవుడూ, అతడి దయ వల్లకాట్లో కలిసినట్టుంది. చచ్చేప్పుడు భగవంతుడు కనపడతాడని అందరూ వాగుతారు. నాకు అంధకారం తప్ప ఇంకేమీ కనిపించడం లేదు. ఈ తుది ఘడియల్లో నా బుద్ధిని వక్రింపచేయకు. నాకు పిరికిమందు పోయటానికి ప్రయత్నించకు" అని అన్నాడు.

మణి శ్వాస తీసుకోవడం మళ్ళీ కష్టసాధ్యమైంది. ఒక్కమాటు పెద్దగా ఎక్కు పెట్టాడు. అతడి శరీరం ప్రాణరహితమైంది. మణి చనిపోయాడు.......

'హి.స.ప్ర.స.' యువకులమైన మాకు మత సంబంధమైన మౌఢ్యం లేదనడానికి మణి మృత్యువు ఒక ఉదాహరణ. భగవతీభాయి కూడా మృత్యు సమయంలో ఇలాంటి మనోనిబ్బరాన్నే ప్రదర్శించాడు. సందర్భం వచ్చినప్పుడు ఆ సంఘటననూ వర్ణిస్తాను. మతాన్ని గురించి మా అభిప్రాయం ఏమిటని అడిగితే, ఒక్కటే చెప్పగలను. మాకు హిందువు, ముస్లిం అన్న వ్యత్యాసం లేదు.

ఆజాద్ బ్రాహ్మణుడు. అతడికి విప్లవ సంఘంలో 'పండితుడు' అన్న ఉపనామమూ ఒకటుంది. (ఉత్తర హిందూ స్థానంలో పండితుడు అంటే బ్రాహ్మణుడని అర్థం.) అవసరమైతే చాలా శోత్రీయంగా త్రికాల సంధ్యావందనాన్నీ ఆచరించగలడు. కానీ, అతడికి జంద్యంమీదా, సంధ్యమీదా చెడ్డమంట. జంద్యాన్నీ, సంధ్యనూ ఆత్మవిశ్వాసం లేకపోవడానికీ, బుద్ధిహీనతకూ, వేషానికీ - ప్రతిరూపాలని ఆజాద్ ఉద్దేశ్యం. పూజలూ, అనుష్టానాలూ చేసే వ్యక్తిని అతడంతగా విశ్వసించడు !

భగవతీభాయీకి సంధ్య అన్నా, జంధ్యమన్నా ద్వేషం లేదుగానీ, వాటి గురించిన చర్చ అనవసరమంటాడు. ఆజాద్, భగవతీభాయీ ఇద్దరూ మాంసాన్ని తినేవారు కారు. అయితే మాంసాన్ని కూరగాయల్ని కలిపి ఒకే పాత్రలో వండితే, మాంసం ముక్కలను ఏరి అవతలపెట్టి, మిగిలిన పదార్థాన్ని తినడానికి, వీరిద్దరూ సంశయించేవారు కారు !

# వైస్రాయి స్పెషల్ ట్రైను క్రింద బాంబు

విప్లవసంఘం అనుమతించినప్పటికీ, నవంబరు చివరి వారంలో వైస్రాయి ట్రయిన్ క్రింద బాంబు ప్రేల్చలేకపోయినందుకు, మేము చాలా బాధపడ్డాము. ఇప్పుడు మళ్ళీ అవకాశం వచ్చింది. డిశంబరు మూడవ వారంలో వైస్రాయి కొల్హాపూరు వెళ్ళుతున్నాడు. 23 వ తారీఖున తిరిగి ఢిల్లీ వస్తాడు. ఆ రోజునే గాంధీగారు, వైస్రాయిని కల్సుకుంటారు. కనుక, రాజకీయంగా చూసినా, ఆ రోజున వైస్రాయి మీద దాడి చేయడం గొప్పగా ప్రభావాన్ని వేస్తుంది !

ఇంద్రపాల్‌కు కబురు పెట్టాము. 'మూర్ఛాగ్యాస్'తో సహా హంస్‌రాజ్‌ను తీసుకుని డిశంబరు 18, 19 తారీకుల్లో ఢిల్లీ వచ్చేసెయ్యమన్నాము. ఇంద్రపాల్, హంస్‌రాజ్ - ఇద్దరూ 20 వ తారీకున ఢిల్లీ వచ్చారు. వాళ్ళను చూసేసరికి మాకు ఎంతో ఉత్సాహం కలిగింది. అయితే హంస్‌రాజ్ మా ఉత్సాహాన్ని నీరు కార్చేశాడు. అతడిలా చెప్పాడు. "గ్యాస్ బల్బుల్ని చాలా బాగా తయారుచేశాను. లాహోరువరకూ వాటిని జాగ్రత్తగా పట్టుకువచ్చాను. లాహోర్ నుండి ఢిల్లీ రావడానికి స్టేషను వరకు గుర్రపు బండిలో వచ్చాను. బండి కుదుపుకు గ్యాస్ బల్బులను పెట్టిన పెట్టె కదిలి బల్బులు పగిలిపోయాయి. గ్యాస్ చాలా గొప్పగా తయారైంది. బల్బులు పగిలిపోవడం వల్ల ఇతర ప్రయాణీకులు, బండివాడు స్పృహతప్పి పడిపోయారు.గుర్రం కూడా పడిపోయింది. నా దగ్గర నిరోధక మందు ఉన్నది గనుక గ్యాస్ నా మీద పని చేయలేదు. తప్పించుకు బైటపడ్డాను !" అని చెప్పాడు.

అయితే, ఇలా గ్యాస్ బల్బులు పగిలినప్పుడు ఇంద్రపాల్ అతనివెంట లేడుట !

గ్యాస్ బల్బులు లాహోర్‌లోనే పగిలిపోవడం వల్ల హంస్‌రాజ్ అటునుంచి అటే లాయల్పూరు వెళ్ళిపోతానన్నాడు. అయితే, మా ఆదేశాన్ననుసరించి అతడ్ని బలవంతాన ఢిల్లీ పట్టుకొచ్చాడు ఇంద్రపాల్ ! విషయమంతా విని మేము మానసికంగా చాలా బాధపడ్డాము. కొంతవరకు గంభీర ముద్రను కూడా దాల్చాము. దాంతో హంస్‌రాజ్ ఏమనుకున్నాడో ఏమో, "గ్యాస్ బల్బులు పోతే పోయాయి. మీకోసం మరో యంత్రాన్ని తయారుచేసి పెడతాను !" అన్నాడు.

వెనక ఒకమాటు బ్యాటరీకి గజం దూరంలో బల్బులు పెట్టి, కరెంటు వైరులతో పని లేకుండానే వెలిగించి చూపించాడు. దాన్నతడు 'ఏక్‌గజీ' అంటాడు. ఈ ఏక్‌గజీ ప్రయోగాన్ని, 500 గజాల దూరం వరకూ పనిచేసేట్టు కూడా, ఏర్పాటు చేసుకోవచ్చునన్నాడు. అతడిలా చెప్పడంతో, మేము కొంత మనశ్శాంతిని పొంది, స్థిమితపడ్డాము.

అతడు చెప్పిన కొత్త ప్రయోగంతో పని జరుపుకోవడానికి మేము సిద్ధమయ్యాము.

హంస్‌రాజ్ మా దగ్గర మూడు రూపాయిలు తీసుకుని బజారుకు వెళ్ళి కొన్ని వస్తువులు కొనుక్కొచ్చాడు. అతడు తన ప్రయోగానికి అవుసరమయ్యెన వస్తువులను కొనేటప్పుడు మమ్మల్ని ఎవరినీ వెంట ఉండనిచ్చేవాడు కాదు. అతడు మధ్యాహ్నానికల్లా కొన్ని గోలీలను తయారుచేశాడు. కొన్ని వస్తువులను నూరి ఒక చిన్న సీసాలో నీళ్ళుపోసి కలిపాడు 'పాంచ్‌సొగజీ' తయారైంది అన్నాడు.

అతడు చేసిన ఈ ప్రయోగ ప్రభావాన్ని మొదటగా పరీక్షించి చూడాలనుకున్నాము. ఘటన జరపదలచిన స్థలంలోనే పరీక్షించడం ఉచితమనీ అనుకున్నాము. వెనకటిలా కొన్ని రోజులముందే రైల్వేలైను క్రింద బాంబులు పాతిపెట్టి, వాటికి కాపలాకాస్తూ కూర్చునే అవసరమూ, అవకాశమూ - రెండూ లేవిప్పుడు కనుక, వెనుకటి శిధిల సత్రం దగ్గరకే పోవలసిన పనేముంది ?

ఆ రోజు డిశంబరు 21 వ తారీకు, 23 వ తారీకు ఉదయం 6 గంటలకు, వైస్రాయి స్పెషల్ ట్రయిన్ ఢిల్లీ వచ్చేస్తుంది. ఇంకా ఒక పగలు ఒక రాత్రి మాత్రమే సమయం వుంది. క్రొత్త ఢిల్లీ రైల్వే స్టేషనూ, నిజాముద్దీన్ రైల్వేస్టేషన్ల మధ్యలో 'కౌరవ పాండవుల కిల్లా' ఒకటుంది. శిథిలమైన ఆ కిల్లా ఢిల్లీకి నాలుగు మైళ్ళ దూరంలో వుంది. ఆ కిల్లా సమీపంలోనే రైల్వే లైను క్రింద బాంబు పెట్టాలని నిశ్చయించుకున్నాము. కిల్లాకు దిగువన రైల్వే లైనుకు వంతెన ఒకటుంది. వంతెన దాటాక, లైను బాగా వంపు తిరుగుతుంది. పైగా, రైల్వే లైను అక్కడ, బాగా ఎత్తునుంచి క్రిందికి దిగుతుంది. అక్కడ గనక బండి పడితే, తునాతునకలై పోతుంది !

బాంబు పాతిపెట్టాలనుకున్నచోట రైలుపట్టాలమీద ఇంద్రపాల్‌ని కూచోబెట్టాము. ఒక జేబు బ్యాటరీకి బల్బును అమర్చి అతడి చేతికి యిచ్చి, అది వెలిగినప్పుడు మాకు చెప్పమన్నాము. నేనూ, హంస్‌రాజ్ - అతడు తయారుచేసిన యంత్రాన్ని చేతబుచ్చుకుని, ఇంద్రపాల్‌ని కేంద్రంగా భావించి, నాలుగు వందల గజాల వలయంలో, చుట్టూ తిరుగుతున్నాము. సీసా హంస్‌రాజ్ చేతులోనే వుంది. మేము ఎంత తిరిగినా బల్బు వెలగలేదు. హంస్‌రాజ్ ఇలా అన్నాడు. "ఈ ప్రయోగం ద్వారా బల్బును వెలిగించగల 'వేవ్' సర్వత్రా ఉండదు. సూక్ష్మరేఖా మాత్రంగా ఎక్కడో వుంటుంది !"

నాకు అతడి మాటలు విచిత్రమనిపించాయి. నేను ఒక మార్గం చెప్పాను. "ఇలా సీసాను పుచ్చుకు తిరగడం కంటే, బ్యాటరీని, సీసాని ఒకదానికొకటి అభిముఖంగా ఉంచి, రెండింటినీ వలయాకారంగా త్రిప్పితే, ఏదో ఒక రేఖలో అనుసంధానం కుదరకపోతుందా ?" అన్నాను.

హంస్‌రాజ్ నా సలహా సరికాదన్నాడు. ఇలా అన్నాడు. 'ఈ ప్రయోగం నీవర్థం చేసుకోలేవు. నేను, ఈ రాత్రికి కూర్చుని సరిచేస్తాను. 'వేవ్'ను వెతికే బెడద కూడ ఉండదు !'

సూర్యుడస్తమించాడు. మేము తిరిగి వచ్చేశాము. భగవతీ భాయీతో విషయమంతా చెప్పాను. "ఎలాగైనా సరే, 23 వ తారీకున పని జరుపవలసిందే !" అనుకున్నాము. కనుక, ఆ రాత్రే బాంబులను పట్టాల క్రింద పాతి రావాలి ! అప్పుడు భాగ్‌రామ్, లేఖ్‌రామ్ - ఇద్దరు మిత్రులూ ఢిల్లీలోనే ఉన్నారు. లేఖ్‌రామ్‌ని ప్రత్యేకం ఢిల్లీ పిలిపించాము. 22 వ తారీకు రాత్రి, మా సైకిళ్ళూ, ఇతర వస్తువులూ - అన్నీ, అతడి చేతికి యిచ్చి రోహతక్ పంపించాలని ఉద్దేశ్యం. ఆ రాత్రే ఆ యింటిని ఖాళీ చేసెయ్యాలనీ అనుకున్నాము !

ప్రస్తుతం నేనూ, భగవతీచరణ్ - మృత్యువుకు సంసిద్ధులమై ఉన్నాము. కాకపోతే, అరెస్టయినా తప్పదనుకుంటున్నాము. అలాంటి స్థితిలో లేఖ్‌రామ్, భాగ్‌రామ్ - ఈ మిత్రలిద్దర్నీ, కేంద్ర కమిటీకి పరిచయం చేయడం ఉచితం !

మేము నలుగురం రాత్రి 11 న్నర గంటలా ప్రాయల, బాంబులు తీసుకుని 'కౌరవ పాండవుల' కిల్లా దగ్గరకు వెళ్ళాము. ఒక గంట గంటన్నరలో, అనుకున్నట్టు బాంబుల్ని పట్టాల క్రింద పాతిపెట్టి, తిరిగి వచ్చేశాము.

మరునాడు, ఉదయం హంస్‌రాజ్ మళ్ళీ తన ప్రయోగాన్ని ప్రారంభించాడు. బ్యాటరీకి రెండున్నర గజాల దూరంలో ఉన్న బల్బును, కరెంటు వైర్‌లతో పని లేకుండా, వెలిగించి చూపించాడు ! అయితే, సీసా అతని చేతిలో ఉంటేనే బల్బు వెలుగుతున్నది. ఇంకెవరైనా తీసుకుంటే వెలగడం లేదు.

చివరకు హంస్‌రాజ్ ఇలా అన్నాడు. "యిప్పటికి మీరు వైర్లు పాతుకొని బ్యాటరీతో పని జరుపుకోండి. నేను నిదానంగా కొన్ని యంత్రాలను తయారుచేసి యిస్తాను. వాటిని మీలో ఎవరైనా ప్రయోగించడానికి వీలుగా తయారుచేసి యిస్తాను."

హంస్‌రాజ్ చేసిన ఈ మోసానికి మేమందరం పండ్లు కొరుక్కుని, మెదలకుండా ఉండిపోయాం. హంస్‌రాజ్ మా పార్టీ సభ్యుడు కాదు. కనుక, అతణ్ణి పార్టీ ఆజ్ఞను మన్నించనందుకు దండించడమన్న సమస్య లేదు. హంస్‌రాజ్ అలా అడ్డం తిరిగాక, బ్యాటరీని, వైర్లనూ వెంటనే ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం కలిగింది. అయితే, హంస్‌రాజ్, మాకో గొప్ప మేలు చేశాడు. బేడా అర్ధణాకు దొరికే జేబు బ్యాటరీ 'సెల్సు'ను రెండింటిని పట్టుకొచ్చి, ఒక డబ్బాలో పెట్టి వాటికి స్విచ్‌ని అమర్చాడు. కరెంటు వైర్లను అమర్చుకోవడానికి డబ్బాకు రెండు రంధ్రాలను ఏర్పాటు చేశాడు. ఐదణాల డబ్బులతో, 300 గజాల దూరం వరకూ పనిచేయగల గొప్ప బ్యాటరీని తయారుచేసి యిచ్చాడు ! అతడు తయారుచేసిన ఈ బ్యాటరీని చూసి మేము నిజంగా చకితులమయ్యాము. హంస్‌రాజ్ గ్యాసును తయారుచేయగలడనీ కేవలం ప్రభుత్వ భయంవల్ల తయారుచేసి యివ్వడానికి జంకుతున్నాడనీ అనుకున్నాము. ఒకమాటు మేము మా కార్యక్రమంలో సఫలతను పొందితే, అతడికీ ధైర్యం వస్తుందని సరిపెట్టుకున్నాము !

మేము కరెంటు వైర్లు కొనుక్కురావడానికి బజారుకు వెళుతున్నాము. కైలాసపతి ఎదురుపడి "ఏదో అత్యవసరమైన విషయమై మాట్లాడటానికి భయ్యా మిమ్మల్ని రమ్మంటున్నాడు !" అని చెప్పాడు. మేము వెనక్కు తిరిగి అతడితోపాటు 'కుదసియాబాగ్' చేరుకున్నాము. ఆజాద్‌తోపాటు మరో వ్యక్తి కూడా ఉన్నాడక్కడ. అతడు ఒడ్డూపొడుగూ కలిగిన భారీ మనిషి. గోధుమవన్నె శరీరం, చురుకైన కండ్లు !

ఆజాద్ సంభాషణ ప్రారంభించాడు. "నేను విప్లవసంఘం తరఫున 23 వ తారీకున యాక్షన్ జరపడానికి అనుమతినిచ్చాను. కానీ, కొన్ని అనుకోని సమస్యలు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని గురించి మరోమాటు చర్చించవలసిన అవుసరం కలిగింది....." అన్నాడు.

చివరకు తేలిన సారాంశం. గణేశ్‌శంకర్ విద్యార్థి 'యాక్షన్'ని ఆపమన్నాడు.

ఈ మధ్య ఆజాద్ ఈ విషయమై గణేశ్‌శంకర్ విద్యార్థిగారితో మళ్ళీ చర్చించాడు. విద్యార్థిగారు "24 వ తారీకునుండి కాంగ్రెస్ మహాసభ జరుగుతుంది. ఈసారి మహాసభ చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. క్రిందటి సంవత్సరం కలకత్తాలో మహాసభ జరిగినప్పుడు, ఒక సంవత్సరంలో ప్రభుత్వం కాంగ్రెసు కోర్కెలను అంగీకరించకపోతే, ప్రజా ఉద్యమాన్ని నడుపుతానని తీర్మానించింది మహాసభ ! ఈ సంవత్సరం, మహాసభ జరిగాక కాంగ్రెస్ తప్పకుండా ఉద్యమాన్ని ప్రారంభిస్తుంది. రేపు ఆఖరిసారిగా, గాంధీగారు వైస్రాయితో మాట్లాడి, అమీతుమీ తేల్చుకుంటారు. వైస్రాయి కాంగ్రెసు కోర్కెలను అంగీకరించకపోతే, ఉద్యమం లేవదీయడం ఖాయం. కనుక, అతడు అంగీకరించేదీ, లేందీ తేలేవరకూ మీరు ఈ 'యాక్షన్'ని జరపగూడదు !" అన్నాడు.

గణేశ్‌శంకర్ విద్యార్థిగారి అభిప్రాయాన్ని ఆజాద్ మాకు చెప్పాడు. అప్పుడు మేము "కాంగ్రెస్, 1928 లో జరిగిన మహాసభలో ప్రభుత్వానికి ఒక సంవత్సరం గడువిచ్చింది. సంవత్సరం లోపల

కోర్కెలను పూర్తిచేయకపోతే, ఉద్యమాన్ని నడుపుతామన్నది. బ్రిటీష్ ప్రభుత్వం కాంగ్రెస్ మాటలను లక్ష్యపెట్టలేదు. మేము బాంబు ప్రేల్చాక కరపత్రాన్ని ఒకదాన్ని పంచుతాము. దానిలో ఈ విషయాన్ని స్పష్టంగా విపులీకరించుతాము ! కాంగ్రెస్ నిజంగా ఉద్యమం నడపదలచుకుంటే, ఈ 'యాక్షన్'వల్ల ప్రజల్లో ఉత్సాహం రెట్టింపు అవుతుందేగాని, తగ్గదు ! గాంధీగారు ఒకమాటు గడువుపెట్టారు. దాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. మళ్ళీ యిప్పుడు గాంధీగారు వైస్రాయిని ప్రార్థించడానికి వెళ్ళడమంటే, ఇది దేశానికీ, కాంగ్రెస్‌కూ కూడా అవమానకరమైన విషయం ! గాంధీగారు వైస్రాయిని కలుసుకోకముందే, మేము అతణ్ణి సమాప్తం చేయాలనుకుంటున్నాము. కాంగ్రెస్ యొక్క దళారి రాజకీయాలకు ఈ విధంగా మేము మా వ్యతిరేకతను వ్యక్తపరచాలనుకుంటున్నాం. కాంగ్రెస్ పోరాటానికి ఎన్నడూ సిద్ధపడదు. బ్రిటీషు ప్రభుత్వముతో కాంగ్రెస్‌చేస్తున్న రాజీబేరాలకు తీవ్ర విఘాతం కలిగించినప్పుడే సాయుధ పోరాటం ప్రారంభమవుతుది" అన్నాము.

భయ్యా ఆజాద్ వెంట మరో నూతనుడుకూడా ఉన్నాడని చెప్పాను. అతడి పేరు 'వి' అని చెప్పారు. పూర్తి పేరు 'వీరభద్ర తివారి' అని తరువాత తెలిసింది. అతడు యు.పి. విప్లవ సంఘానికి సంఘటనకర్త. తీక్షణమైన దృష్టితో ఒకమాటు మావంకచూసి, తలవంచుకుని గడ్డిలో వేలితోరాస్తూ, మాట్లాడుతున్నాడు. అతడి మాటలు, వాలకం చాల ప్రభావోత్పాదకంగా ఉన్నాయి.

వీరభద్ర తివారి సమస్యను విపులీకరించి మాట్లాడాడు. అతడు మా ఉద్దేశ్యంతో ఏకీభవిస్తున్నాడు. అయితే, కాంగ్రెసు నాయకుల సహానుభూతిని పోగొట్టుకోవడం విప్లవ సంఘానికి మంచిది కాదన్నాడు. ఒక్క వారం రోజులు కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటే, గాంధీగారు వైస్రాయిని కలుసుకుంటారు. ఆ తరువాత మన కార్యక్రమాన్ని నిర్వహించుకున్నా ఫరవాలేదని అతని వాదన. అతడింకా ఇలా అన్నాడు. "నాకు నమ్మకంగా తెలిసింది. ఈమాటు పండిట్ జవహరలాల్ నెహ్రూ గారి నాయకత్వం క్రింద పోరాటం జరగటం గాంధీగారికీ యిష్టమే. అందుకే నెహ్రూగారిని అధ్యక్ష పదవికెక్కించారు. అప్పుడు మనం మన విప్లవ సంఘం తరపున ఏకొద్ది పనిని చేయగలిగినా రెట్టింపు ఫలితాన్నిస్తుంది."

ఢిల్లీ ప్రతినిధి కైలాసపతిగూడా 'యాక్షన్'న్ను ఆపడమే ఉచితమన్న నిర్ణయానికొచ్చాడు. అతడిలా అన్నాడు "విప్లవ సంఘం యింకా వర్ధమానస్థితిలోనే వుంది. ప్రభుత్వంమీద ఇంత పెద్దదెబ్బతీసే శక్తి పార్టీకి లేదు. ఇది జరగాక, ప్రభుత్వం విప్లవకారుల్ని ఏరియేరి చంపుతుంది. అంత పెద్ద దెబ్బను పార్టీ తట్టుకోలేదు."

విషయం పైనుదహరించిందే అయినా, ఉదాహరణల్ని, యుక్తుల్ని గుమ్మరిస్తూ నాలుగు గంటలసేపు వాదించుకున్నాము. నేనూ, భగవతీ భాయి వాళ్ళు చెప్పిందాన్ని సుతరామూ ఒప్పుకోలేదు. వాళ్ళూ మా తర్కాన్ని అంగీకరించలేదు.

ఆజాద్ మధ్యస్తంగా ఉన్నాడు. అతడిలా అంటున్నాడు "మనం ఇతరుల చేతిలో కీలుబొమ్మలంకా గూడదు. ఒకమాటు వాళ్ళు చెప్పినప్పుడు 'యాక్షన్'న్ను ఆపేశాము. ఈమాటూ వాళ్ళు ఆపమన్నారు గనక ఆపుతామనడం బాగుండదు. అట్లాగని, వెనుకాముందూ ఆలోచించుకోకుండా దూకడమూ మంచిదికాదు. బాంబులు పేల్చడం మనకేమీ వ్యవసనం కాదుగదా ? కాంగ్రెసువారి రాజీబేరపు రాజకీయాలకూ, మన రాజకీయాలకూ సంబంధంలేదు. కనుక ప్రతిపనికీ వారి ముఖంవంక మనం చూట్టం, మన భావాలకూ ఆదర్శానికే విరుద్ధం. ఏమైనాకానీ, మీరు నలుగురూ ఒక నిర్ణయానికివచ్చి 'యాక్షన్'న్ని జరపడమో, మానడమో నిశ్చయించండి."

వాదన ఎంతకీ తెగడంలేదు. కరెంటు వైరులు కొనుక్కురావడం గురించి మనస్సు పీకుతున్నది నాకు. ఎంతకీ వాదన తెమలకపోవడంతో 'ఇప్పుడేవస్తా' అనిచెప్పి లేచివచ్చేశాను.

బజారుకువెళ్ళి రెండువందల యాభైగజాల వైరుకొనుక్కుని 'నయాబజార్'లోని గదికి వెళ్ళాను. హంస్‌రాజ్ సహాయంతో వైర్లను బ్యాటరీకి జతపర్చి, రెండవచివరన బల్బుపెట్టి వెలిగించి చూసుకున్నాం.

దాదాపు ఆరుగంటలా చాయల భగవతీభాయికూడా తిరిగివచ్చాడు. అతడు చాల విచారంగా ఉన్నాడు. నన్నొక ప్రక్కకుపిలిచి "యాక్షన్‌న్ని ఆపివేయడానికే నిర్ణయం జరిగింది." అన్నాడు.

"ఇప్పుడిక ఆపడానికి వీల్లేదు." అన్నాను నేను దృఢస్వరంలో.

"నిర్ణయం జరిగాక ఆపకపోతే ఎలా ?" అన్నాడు భగవతీభాయి.

"వాళ్ళ వాదన నిన్నూ సంతృప్తిపర్చలేదు. నన్నూ సంతృప్తిపరచలేదు. కనుక, నైతికంగా చూసినా, ఈ నిర్ణయాన్ని అంగీకరించవలసిన అవుసరం మనకులేదు. ఆ తరువాత ఏమైనాసరే" అన్నాను నేను.

భగవతీభాయి "అలా చేయడం మంచిదికాదు" అన్నాడు.

నేను మొండికేశాను. "నేను రేపు ఉదయం తప్పకుండా బాంబు ప్రేలుస్తాను. నేనేమీ బతికి తిరిగిరాను. కనుక, పార్టీకి సమాధానం చెప్పుకోవల్సిన బాధ, బాధ్యత నాకు లేదు. నేను చనిపోయాక, నిన్నడుగుతారూ ? 'యశ్‌పాల్ నా మాట వినలేదు' అనేసేయి. ఒకవేళ, నేను బతికి, తిరిగి వస్తే, ఈ 'యాక్షన్' జరపడంవల్ల ప్రజల్లో రెట్టించిన ఉత్సాహమే, నా తరపున సమాధానం అవుతుంది. అప్పటికీ పార్టీ నన్ను దండిస్తానంటుందీ ? దండించనీ ! నిర్ణయాన్ని తోసిరాజన్నందుకు పార్టీ నన్ను కాల్చడానికి సిద్ధపడ్డా నాకిష్టమే" అని అన్నాను.

కొన్ని క్షణాలపాటు భగవతీభాయి మౌనంగా, ఆలోచిస్తూ వుండిపోయాడు. తరువాత "నీ వెనక నేనూ వున్నాను. ఏమైతే అదవుతుంది 'యాక్షన్'న్ని ఆపవద్దు' అన్నాడు.

పార్టీ 'యాక్షన్'న్ని ఆపివేయాలని నిర్ణయించింది. కనుక 'యాక్షన్' జరిగాక పంచడానికి 'కమాండర్ ఇన్ చీఫ్ - కర్తార్ సింగ్' పేరుతో కరపత్రానొకదాన్ని లోగడ రాయించాము. ఇప్పుడా కరపత్రాన్ని ఉపయోగించుకోవడానికి వీల్లేదుకదా ? 'యాక్షన్'న్ని ఆపివేయడానికే నిర్ణయం జరగడంవల్ల ఆజాద్, పార్టీ ముద్రవేసిన ఆ కరపత్రాన్ని, పార్టీముద్రనూ తిరిగి తనకు తెచ్చియివ్వమని భగవతీభాయికి చెప్పాడు. మా పార్టీముద్ర రెండుకత్తులు కలిసిన ఆర్చిలాగా ఉంటుంది. లోపల 'H.S.R.A' అక్షరాలుంటాయి. క్రింద రెండు చేతులు ఒకదాన్నొకటి స్నేహపూర్వకంగా పట్టుకున్నట్టు ఉంటాయి. ఈముద్ర పరప్రభుత్వంతో పోరాడటానికీ, దేశ ప్రజల ఐక్యతకూ చిహ్నం.

రాజకీయంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా నేను 'యాక్షన్' వెంటనే జరిగిపోవాలన్న పట్టుదలతో ఉన్నాను. అందుకు కారణమూ వుంది. అక్టోబరులోనే వైస్రాయి ట్రయిను క్రింద బాంబు పేల్చడానికి అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాము. భగవతీభాయి, మిలటరీ ఆఫీసరుడ్రస్సులో నాకొక ఫొటోను కూడా తీయించాడు. నేను బాంబు పేల్చి, అక్కడే పోరాడుతూనిహతుడనైయ్యాక, నా స్మృతి చిహ్నంగా ఆ ఫొటో వుంటుందనుకున్నాము. మేము, ఏ మిత్రుడినైనా, మృత్యువు సంభవించగల ప్రమాదకరమైన పనికి నియోగించినప్పుడు, అతడికి ఫొటో తీయిస్తూ వుంటాము. ఇంద్రపాల్ తల గొరిగించుకుని సాధువు వేషానికి సిద్ధమయ్యే ముందు, అతడికీ ఒక ఫొటో తీయించాము.

ఫొటో తీయించినప్పటి నుంచీ, నన్ను నేను బలి అయిపోయిన వాడిగానే భావిస్తూ వచ్చాను. ఇంక ఇప్పుడిలా, లక్షణంగా బతికి తిరగటం, నాకే సిగ్గుగా ఉంది. కనుకనే, డిశంబరు 23వ తారీకు ఉదయం ఎలాగైనా వైస్రాయి ట్రైను క్రింద బాంబు పేల్చేయాలని పట్టుపట్టాను. ఇది ఒక రకంగా మొండి పట్టే అవుతుంది. ఈ మొండి పట్టుకు, అనేక కారణాల్లో ఒక కారణం నా ఆత్మాభిమానం, కాక నా అహంకారం.

భగవతీభాయీ - మేము రాసిన కరపత్రాన్ని, ముద్రనూ ఆజాద్‌కు యిచ్చి, తొమ్మిది గంటలా చాయల తిరిగి వచ్చాడు. వెంటనే రోహతక్‌కు గానీ, లాహోరుకు గానీ తీసుకు వెళ్లడానికి వీలులేని వస్తువులు కొన్ని ఉన్నాయి. సైకిళ్ళూ, అవినూ, వాటిని ఖయాలీరామ్‌గుప్త ఇంటికి చేర్చాము. అప్పటికి తొమ్మిదిన్నర దాదాపు అయింది. ఇంక ఆలస్యం చేయడానికి వీలు లేదు. భోజనం కూడా చేయకుండా, బ్యాటరీ, వైర్లూ నేల త్రవ్వడానికి పలుగూ పారా లాంటి సాధనాలు తీసుకుని 'కౌరవ పాండవుల' కిల్లా శిథిలాల దగ్గరకు వెళ్ళాము.

ఆ రోజూ 'నయా బజారు' గదిలో లేఖ్‌రామ్, భాగ్‌రామ్, ఇంద్రపాల్, హంస్‌రాజ్ - మొదలుగా గల మిత్రులందరూ ఉన్నారు. గది బాగా సందడిగా ఉంది. పక్క గదుల్లోని వాళ్ళు 'ఠాకూర్ సాబ్ ఏమిటి ఇవ్వాళ బాగా సందడిగా ఉంది ?" అని అడిగారు.

"ఇవ్వాళ ఒక్క రోజే ! ఇక సందడి ఉండదులే. అసలు విషయం మేమిటంటే, ఈ రాత్రికి నేను ఇంగ్లాండు వెళ్ళు తున్నాను. మా ఊరి స్నేహితులు పంపించడానికి వచ్చారు. నేనేమో పెద్ద ఉరికంబానికి ఎక్కబోతున్నట్టు బాధ పడుతున్నారు" అన్నాను నేను.

మేము వైర్లూ, సామానులు తీసుకుని వెళ్ళుతున్నాము. మిత్రులందరికీ ఆకలి వేస్తూన్నది. దారిలోనే ఇన్ని పూరీలు, మిఠాయి కొనుక్కున్నాము. రైల్వేలైను దగ్గరకు కొంచెం ముందుగానే చేరాము. ఇంకొక ప్యాసింజర్ బండి వెళ్ళాలి. అది వెళ్ళాక గాని పని ప్రారంభించడానికి వీల్లేదు. ఈ లోపు మిత్రులందరం కిల్లా శిథిలాల్లో ఒక మూలకూర్చుని, తెచ్చుకున్న ఫలహారాలను తిన సాగాము. నాకూ ఆకలిగానే ఉంది. ఆ రోజుల్లా ఏమీ తినలేదు. కితం రోజూ ఏమీ తినలేదు. నోరు చేదుగా ఉంది. ఆకలిగా ఉన్నా ఏమీ తినలేక పోయాను.

నేనేమీ తినలేక పోవడాన్ని చూసి ఇంద్రపాల్ ఇలా అన్నాడు. "ఈ బలి పశువులను బాగా మేపండయ్యా, అప్పుడుగాని ముక్తి లభించదు. ఆకలితో ఉంటే బలి పశువు ఆత్మ ఆకాశంలో వేలాడుతూ ఉంటుంది. స్వర్గానికి వెళ్ళదు." అంటూ నాకు చూపించి నన్ను ఉడికిస్తూ తను బాగా పట్టించసాగాడు.

నేను నవ్వుతూ "ఇంతటితో నన్ను వదిలించుకుందామనుకుంటున్నా వేమిటి ? చచ్చి దయ్యమైవచ్చి, నీ నెత్తిన కూర్చుంటాను." అన్నాను ఇంద్రపాల్‌తో. కానీ, ఆనాడక్కడున్న మిత్రుల్లో ఎక్కువ మంది, నాకంటేముందే వెళ్ళిపోతారని అప్పట్లో నాకు తెలియదుగదా ! భగవతీభాయి, భాగ్‌రామ్, ఇంద్రపాల్ - వీరేనాడో జీవితయాత్రను ముగించారు.

ప్యాసింజర్ బండి వెళ్ళిపోయింది. మేము వైర్లను భూమిలో పాతటం ప్రారంభించాం. రెండు రోజుల నుంచి సన్నని వర్షపుతుంపరలు పడుతూండడంవల్ల నేల మెత్తబడి మృదువుగా వుంది. ఒక్క రెండు గంటల్లో రెండు వందల యాభై గజాల వైరును భూమిలో పాతిపెట్టి తిరిగి వచ్చేశాము.

బాంబుల దగ్గర నుండి రోడ్డుకు రెండువందల గజాల దూరం వరకూ వైరువచ్చింది. అక్కడనుంచీ రోడ్డువరకూ వున్న రెండువందల గజాల ప్రదేశమూ యిసుక భూమి. ఆ యిసుకలో వైర్లవరకూ మోటార్ సైకిలును తీసుకువెళ్ళడం కష్టం. కనుక, నేను మోటార్ సైకిలును రోడ్డుమీద వదలి, స్విచ్ నొక్కటానికి వైర్లవరకూ వెళ్ళాలి. ఈ స్థితిని గమనించి భగవతీభాయి ఇలా అన్నాడు "నువ్వు మోటార్ సైకిలును రోడ్డుమీద వదలి, బ్యాటరీ స్విచ్ నొక్కటానికి వైర్లవరకూ వెళ్ళవలసి వుంటుంది. స్పెషల్ ట్రయిన వచ్చే వరకూ అరగంటో, గంటో నీవు నిరీక్షించవలసి వుంటుంది. అప్పుడు, రోడ్డుమీద మనిషిలేకుండా నిలబెట్టివున్న మోటార్ సైకిలును చూసి ఎవరైనా అనుమానించవచ్చునుగదా ? అదీగాక, రైల్వేలైను వెంట కాపలా పోలీసులు ఎవరైనా రావచ్చును. మనిషిలేకుండా నిలబెట్టబడివున్న

మోటార్ సైకిలును వాళ్ళు చూసినా అనుమానిస్తారు. కనుక,దానిదగ్గర ఎవరో ఒకరు వుండడం మంచిది. ఒక వేళ పోలీసులే ప్రశ్నిస్తే ఢిల్లీ వెళుతున్నాము, మోటారు సైకిలు చెడిపోవడంవల్ల ఆగిపోయామనో, పెట్రోలు అయిపోవడంవల్ల ఆగిపోయామనో చెప్పవచ్చు. మనిషిలేకుండా మోటార్ సైకిలుని రోడ్డుమీద వుంచితే ఎవరైనా ఎత్తుకునీ పోవచ్చు. అలాంటప్పుడు ఒకవేళ తప్పించుకుపోవడానికి అవకాశంవున్నా నీవు తప్పించుకోలేవు."

అక్కడ నుండి మేము దాదాపు రెండుగంటలాచాయల నయాబజార్‌లోని గదికి వచ్చాము. మిగిలిన సామానులనుకూడా మూటగట్టాము. నేను మిలటరీ ఆఫీసరు డ్రస్సు వేసుకున్నాను. నా మామూలు గుడ్డలను భగవతీభాయికి యిచ్చాను. తెల్లవారుజామున నాలుగు గంటల బండికి హంస్‌రాజ్, ఇంద్రపాల్, భాగ్‌రామ్ - వీరు లాహోరు వెళ్ళిపోతారు. లేఖ్‌రామ్ రోహతక్ వెళతాడు. భగవతీభాయి గాజియాబాద్ వెళ్ళి అక్కడ స్టేషనులో నాకోసం ఎదురుచూస్తూ కూర్చుంటాడు.

వైస్రాయి స్పెషల్ ట్రయిన్ ఉదయం 6 గంటలకు ఢిల్లీ చేరుతుంది. అంటే 6 గంటలకు 5, 6 నిముషాల ముందు స్పెషల్ ట్రయిను 'కౌరవ పాండవుల' కిల్లా దగ్గరకు వస్తూందన్నమాట. బాంబు పేల్చాక ఏ అభ్యంతరమూ లేకపోతే మోటార్ సైకిలును గాజియాబాద్ స్టేషనులో వదలిపెట్టి నేనూ, భగవతీభాయి కలకత్తా వెళ్ళిపోతాము. అక్కడ 'గుంజాన్' పురంలో దాక్కుంటాము. అప్పట్లో కలకత్తాలో గుర్రపు పందాలు జరుగుతున్నాయి. బాగా సందడిగా వుంటుంది; అక్కడ ! ఏదో విధంగా దాక్కోవచ్చు. మేమందరం విడిపోవడానికి సిద్ధం అయ్యాక, భగవతీభాయి ఇలా అన్నాడు "మోటార్ సైకిలు కాపలా కోసరం నేను నీతోపాటు అక్కడకు వస్తాను."

కేవలం మోటార్ సైకిలు కాపలాకోసం భగవతీభాయిని బాధపెట్టడం నాకిష్టంలేదు. నేను అతనిని నావెంట రావద్దనిచెప్పి, ఇలా అన్నాను "భాగ్‌రామ్ నా వెంటవస్తే బాగుంటుంది. పోరాటంలో చేతికో, కాలికో గుండు తగిలి నేను వల్లతప్పితే, అతడు నన్ను మోటార్ సైకిలు వెనక కూర్చోబెట్టుకుని తీవ్రవేగంతో గాజియాబాద్ స్టేషన్ దగ్గరకు తీసుకువచ్చి దింపగలడు."

భాగ్‌రామ్ వెంటనే సిద్ధమయ్యాడు. వైస్రాయి ట్రయిను కింద బాంబు పేల్చిన కారణంగా, నేను సాహసవంతుణ్ణిని అందరూ అంటారు. కానీ, నా కంటే భాగ్‌రామ్ చూపిన సాహసం ప్రశంసాపాత్రమైంది. ఎందుకంటే, నేను ఎన్నో రోజులుగా మృత్యువుకు సిద్ధమవుతూన్నాను. ఈ కార్యక్రమం కోసం వేగిరిపడుతూన్నాను. కానీ, తను పాల్గొనవలసి వుంటుందని భాగ్‌రామ్ అంతవరకూ అనుకోలేదు ప్రమాదాన్ని చాలా రోజులుగా వూహిస్తూ సిద్ధపడ్డ నాకంటే, అప్పటికప్పుడు ప్రమాదాన్ని వరించడానికి సంసిద్ధుడైన భాగ్‌రామ్ సాహసవంతుడుకాడా ?

భాగ్‌రామ్ మామూలు దుస్తుల్లో వున్నాడు. అయితే, అతడి ఆరోగ్యం బాగుండక పోవడంవల్ల, చలికాలంలో సైనికులు వేసుకునే ఓవర్‌కోటు నొకదాన్ని కొనుకున్నాడు. అది యిప్పుడు అక్కర కొచ్చింది. అతడికీ ఒకపిస్తోలు యిచ్చాం. ఒంటరిగా ఏదైనా ప్రమాదం సంభవించినా, యిద్దరం కలసి పోరాడవలసివచ్చినా పనికొస్తుందని ! సరే, భగవతీచరణ్ గాజియాబాద్ వెళ్ళడానికి సమ్మతించాడు.

అందరూ వెళ్ళిపోయాక మేమిద్దరం దాదాపు నాలుగున్నర గంటలా చాయల, నిశ్శబ్దంగా గదిలోనుండి కిందికి దిగాము. మోటార్ సైకిలు కిందిగొందిలో వుంది. దాన్ని రోడ్డుమీదికి నెట్టుకుంటూ వెళ్లాము. రోడ్డుమీదికి వెళ్ళాక మోటార్ సైకిల్‌ను స్టార్ట్ చేశాము. భాగ్‌రామ్‌బంట్రోతు వేషంలో వెనక కూర్చున్నాడు. మోటార్ సైకిలు రోడ్డుమీద వేగంగా వెళ్ళిపోతున్నది.

రెండురోజులుగా జడివానలు పడుతుండడంవల్ల, ఆ రోజు తెల్లవారు జామున దట్టంగా మంచుపట్టింది. మంచుకారణంగా వీధిలైట్ల కాంతికూడా నామమాత్రంగా ప్రసరిస్తూన్నది. మా మోటార్

సైకిలు లైటుకాంతికూడా ఎక్కువ దూరం ప్రసరించడం లేదు. పట్టణందాటాక మంచు మరీ దట్టంగా వుంది. 'కౌరవ పాండవుల కిల్లా' దగ్గరకు వెళ్ళి మోటార్ సైకిలుదిగి దాన్ని దారి ప్రక్కన పెట్టాము.

కరెంటు వైర్ల దగ్గరకు వెళ్ళేముందు భాగ్‌రామ్‌తో ఇలా చెప్పాను. "స్పెషల్ ట్రైనుకు ముందు పైలెట్ ఇంజను వెళ్ళుతుది. పైలెట్ ఇంజను వెళ్ళే శబ్దానికీ, ట్రైను మొత్తం వెళ్ళే శబ్దానికీ వ్యత్యాసం స్పష్టంగా తెలుస్తూనే వుంటుంది. నేనా ఇంజన్‌ను మామూలుగా వెళ్ళిపోనిస్తాను. అది వెళ్ళాక పది, పదిహేను నిముషాలకు స్పెషల్ ట్రైను వస్తుంది. స్పెషల్ ట్రైను రాగానే బాంబు పేలుస్తాను.పేలుడు శబ్దమయ్యాక, నేను రావడం ఆలస్యంఐ, కాల్పులు జిరిగిన శబ్దం వినబడితే, రెండు క్షణాలు చూసి, యిక నువ్వు మోటార్ సైకిలు వేసుకుని వెళ్ళిపోవచ్చును. బాంబు పేల్చక ముందే కాపలా పోలీసులు ఎవరైనా వచ్చి, 'ఎందుకు నించున్నా'వని నిన్ను అడిగితే, 'కెప్టెన్‌సాబ్ రెండు కొచ్చారు. బండి చెడిపోయింది. ఏదైనా కారువస్తే పంపించమని, తాను ముందు వెళ్ళి పోయారు.' అని చెప్పి తప్పించుకో."

నేను వెళ్ళి పాడుపడ్డ బావి దగ్గర, భూమిలో పాతిన కరెంటు వైరుల కొనలను వెతుక్కున్నాను.వాటిని బ్యాటరీకి జాయంట్ చేశాను. యిక బండి రావాడం కోసరం ఎదురు చూస్తున్నాను. నిరీక్షణలో చేతి గడియారాన్ని చూసి నిముషాలు లెక్క పెట్టుకుంటూ గడపడం కొంత మనశ్శాంతినిస్తుంది. అయితే, నేను నా గడియారాన్ని భగవతీచరణ్‌కు యిచ్చి వచ్చాను. చలి మిక్కుటంగా వేస్తున్నది. మంచు ధారాళంగా కురుస్తున్నది. మనిషిని ఉషారుగా వుండటానికి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ, బ్యాటరీచుట్టూ పచారు చేస్తున్నాను. సమయం గడచిన కొద్దీ, కాంతి రేఖలు ప్రస్ఫుటించడానికి బదులు, మంచు దట్టమైన దృశ్యం మరీ మసక బారుతూన్నది. వర్షానికి తడిసిన భూమిలో నుండి, ఆవిర్లు పైకి తేలి వాతావరణంలో వ్యాప్తమవుతున్నాయి.

కొంతసేపు గడిచాక మధుర వైపు నుండి శబ్దం వినిపించింది. రానురాను శబ్దం దగ్గర అవుతున్నది. ముందు పైలెట్ యింజను వెళ్ళుతుందన్న విషయం జ్ఞాపకం ఉంది. శబ్దం బాంబులు పాతిన చోట్టికి వచ్చింది. కానీ, మంచు కారణంగా పైలెట్ యింజనుకు ఉన్న లైటు గానీ, వెలుగుకానీ కనిపించలేదు. యింజను ఢీల్లీ వైపు వెళ్ళి పోయింది. పైలెట్ యింజనుకు ఒకవేళ లైటు ఉండదేమోననుకున్నాను.

ఇక, వైస్రాయి స్పెషల్ ట్రైన్ రావడానికి 15 నిముషాల కంటే ఎక్కువ సమయం ఉండటానికి వీల్లేదు. వాతావరణంలో అంధకారపు ఛాయలు తగ్గి మంచు యొక్క తెల్లదనం ఎక్కువైంది. దూది పింజల్లా మంచు సర్వత్రా వ్యాప్తమైంది. పది అడుగుల దూరంలో వున్న పొదలు కూడాకనిపించడంలేదు. 'ఒకవేళ స్పెసల్ ట్రైన్‌కు గల ప్రకాశవంతమైన లైటు కాంతి కూడా కనిపించకపోతే ? యింజను బాంబుల మీదికి వచ్చినట్లు ఎలా తెలుస్తుంది ? ఎలాగైనాగానీ, శబ్దాన్ని బట్టి అయినా యింజను రాకడను తెలుసుకోవాలి' అనుకున్నాను.

మేము వేసుకున్న ప్లాను - యింజను బాంబుల ముందుకు రాగానే ఎదురు దెబ్బ కొట్టినట్టు బాంబులను పేల్చివేస్తే, యింజను పట్టాలు తప్పుతుంది. ఎదురు మళ్ళగా వస్తున్న రెండు రైళ్ళు ఢీకొన్నట్టు, మొత్తం స్పెషల్ ట్రైను కిందపడిపోతుంది.

మళ్ళీ మధుర వైపు నుంచిపట్టాల మీద శబ్దం వినిపించింది. శబ్దం రానురాను కొత్త ఢిల్లీ వైపుకు వచ్చేస్తున్నది. మంచులో, యింజను ముందున్న లైటు కాంతిని చూడడానికి వివశంగా ప్రయత్నిస్తున్నాను. ఏమీ కనుపించడం లేదు. ఇక శబ్దాన్ని బట్టే పని జరుపుకోవాలి. బండి వస్తున్న శబ్దం బాగా దగ్గరైంది. నేను శ్వాస బిగబట్టుకుని, నా శరీరంలోని చైతన్యాన్నంతటిని కర్ణేంద్రియాల పాలు చేసి, బండి బాంబుల మీదకు వచ్చిన శబ్దాన్ని గ్రహించడానికి సిద్ధంగా కూర్చున్నాను... బండి బాంబుల మీదకు వచ్చిందను కున్నాను. బ్యాటరీబటన్ నొక్కేశాను.

బటన్ నొక్కగానే కర్ణపుటల్ని భేధించేట్టుగా బాంబులు పేలిన శబ్దం అయింది. ఆ శబ్దంతో పాటు పెట్టెలు గుద్దుకుని కిందపడి దొర్లే శబ్దం కూడా వస్తుందనుకున్నాను. కానీ, నా ఊహలకూ, నా కల్పనలకూ విరుద్ధంగా జరిగింది. నేను ఆశించిన, ట్రయిన్ కూలిన శబ్దాలేమీ వినపడలేదు. స్పెషల్ ట్రైను తీవ్ర వేగంతో, అవిచ్ఛిన్నంగా క్రొత్త ఢిల్లీవైపు వెళ్ళి పోయింది.

అసఫలత, నిరాశ - ఈ రెండూ పెనవేసుకోగా, నా హృదయ స్పందన ఆగినంత పని అయింది. అలాంటి దారుణమైన నిరాశలో మనుషులు గుండె ఆగి చనిపోవడమూ కద్దు. నేను నిరాశలో అసహాయుణ్నై, అశక్తుణ్నై కింకర్తవ్య విమూఢుణ్ణై - నిలుచుండి పోయాను.

బాంబులు పేలినాబండి వెళ్ళి పోయింది. ఇకనప్పుడు, రైలు పట్టాలకు కొంచెం కొంచెం దూరంలో కాపలా ఉన్న పోలీసులు, నా మీదికి వచ్చిపడడం జరుగుతుంది. నేను భుజానికి తగిలించి ఉన్న, పెట్టెలో నుంచి, పిస్తోలును బైటకుతీసి, గురిపెట్టుకున్నాను. రెండు పాదాల మీద, శరీరపు సంతులనాన్ని స్థిరం చేసుకుని, నా వైపు రాబోయే పోలీసులను చూడడానికి కళ్ళు పెద్దవి చేసుకున్నాను.

ఒక్క నిముషం అలాగే నిలబడి ఉన్నాను. అలా పోలీసుల కోసరం ఎదురు చూడటం అవివేకమనిపించింది. చప్పున వెళ్ళిపోవాలనుకున్నాను.

మోటార్ సైకిలు వైపు వెళ్ళడానికి వెనక్కు తిరిగాను. కానీ, ఇంత శబ్దమయ్యాక, బాంబులు పేలాక పోలీసులు రాకుండా ఉంటారా ? నేనిలా వెనక్కు తిరగటంవల్ల, తుపాకిగుండ్లు నా వీపుకు తగిలితే ? మృత్యువు తప్పనప్పుడు వీపుచూపడ మెందుకు ? ఛాతీనే ఎదురొడ్డుతాను. నేను మళ్ళీ ముందుకు తిరిగాను. సాహసాన్ని కూడగట్టుకోవడానికి ఒక మాటు చిరునవ్వు నవ్వుకున్నాను. మనస్సులోనే ఇలా సవాల్ చేశాను. 'రండి ఎవడొస్తాడో.'

మరి రెండు నిముషాలు అలాగే గడిచాయి. ఎవరూ వస్తున్నట్టు కనపడలేదు. శబ్దమూ వినపడలేదు.

నేను మోటార్ సైకిలువైపు వెళ్ళడానికి, మరి రెండడుగులు ముందుకు వేశాను. ప్రతి రెండడుగులకూ ఓమాటు వెనక్కు తిరిగి చూస్తున్నాను, ఎవరైనా వస్తున్నారేమోనని అలా వెనక్కితిరిగిచూస్తూనే రోడ్డుమీదకు వచ్చాను.

నన్ను చూడగానే "ఏమీ జరగలేదా ?" అని భాగ్‌రామ్ ప్రశ్నించాడు. చెయ్యి తిప్పి నా అసఫలతనూ, నిరాశనూ వ్యక్తపరచాను.

"పేలుడు పదార్థం తక్కువైందేమో ?" అన్నాడు భాగ్‌రామ్.

"కావచ్చును" అన్నాను.

"నువ్వు రావటానికి చాలా ఆలస్యంచేశావు. తుపాకీలు కాల్చిన శబ్దమూ వినపడడంలేదు. నువ్వూ రావడంలేదు" అన్నాడు భాగ్‌రామ్.

నేనేమీ మాట్లాడలేక పోయాను. "ఎవరైనా వస్తారేమోనని చూస్తున్నాను" అన్నాను.

మోటార్ సైకిలును స్టార్ట్ చేయడానికి స్టార్టర్‌ని కాలితో విసురుగా తొక్కాను. ఒకసారి, రెండుసార్లు ....... పదిసార్లు ..... యిరవై సార్లు, నా శక్తినంతా కూడదీసుకొని తొక్కాను. అలుపు వచ్చేసింది. అయినా యింజను స్టార్టు కాలేదు. నేను ప్రక్కకు తప్పుకున్నాను. భాగ్‌రామ్ ప్రయత్నించి చూశాడు. ప్రయోజనం లేకపోయింది.

భాగ్‌రామ్ "ఈ చలికి యింజను స్టార్ట్ కావడంలేదేమో, కొంచెం దూరం నెట్టితేసరి" అన్నాడు.

యింజన్ను గేరులోవుంచి ఇద్దరం కొంతదూరం మోటార్ సైకిల్‌ని నెట్టాం. అయినా, యింజను స్టార్ట్ కాలేదు. మేము రెండు ఫర్లాంగులు దాన్నలా నెట్టుకెళ్ళాము.

మడ్‌గార్డ్ మీదా, పెట్రోలు టాంకు మీదా మంచు ధారలు కట్టింది. దాన్ని చూపు భాగ్‌రామ్ "మంచు 'ప్లగ్'లోకి వెళ్ళి వుంటుంది. 'ప్లగ్' ఊడదీసి శుభ్రంచేస్తే గాని నడవదు" అన్నా

ఈ రభసతో పదిపదిహేను నిముషాలు గడిచాయి. మేము ఒక పని చేసివుంటే బాగుండె రోడ్డు పక్కనే వున్న పొదల్లో మోటార్ సైకిలును దాచిపెట్టి, మా వరకూ మేము తప్పించు పారిపోవ చాలా సులువైన మార్గం. ఎందుకంటే, మేము ఇంక అక్కడున్న ప్రతి క్షణమూ మమ్ములను మృ ముఖంలోకి తోస్తూనే వుంటుంది. కనీసం, అరెస్టయినా తప్పదు. అయితే, ఆ క్షణాన మా యిద్దరి బు ఇంత చిన్న వుపాయం తట్టందే !

వైస్రాయి స్పెషల్ ట్రెయిన్ బాంబులు పేలిన చోటునుండి ఢిల్లీ వెళ్ళడానికి అరేడు నిము కంటే ఎక్కువ సమయం పట్టదు. ట్రయిన్ స్టేషన్‌లోకి వెళ్ళగానే పోలీసు పటాలం బాంబుపే ప్రదేశానికి పరుగు లంకించు కుంటుంది. నిజంగా అంతే జరిగింది.

మేము మోటార్ సైకిల్ నెట్టుకుంటూ వెళుతున్నాము. మంచు కురుస్తున్నది. చాలామ పోలీసులు వస్తున్న బూట్లశబ్దం వినిపించింది.

"ఇంక ఆపేసెయి !" నేను భాగ్‌రామ్‌తో చెప్పాను. "పోలీసులో, సైన్యమో వస్తూన్నది. మోటార్ సైకిలును చాటు చేసుకుని అటు నుంచో. కాల్పులు జరిగితే నువ్వు సైకిలు చాటున కూర్చు నిన్ను రక్షించుకుంటూ, సాధ్యమైనంత వరకూ ఎక్కువ మందిని కాల్చు. ముందు నేనే ఎదుర నిలబడి కాల్చేస్తాను" అని చెప్పాను.

పోలీసుల బూట్ల శబ్దం త్వరత్వరగా మావైపు వచ్చేస్తూన్నది. మంచు పొరలనుండి మస ఆకారాలు కనిపించసాగాయి. ఆఫీసరు రెండు అడగుల ముందు నడుస్తున్నాడు. పోలీసుల భుజా రైఫిళ్ళు వున్నాయి.

నేను రోడ్డుకు ఓ ప్రక్కన సిద్ధంగా నిలబడ్డాను. పోలీసులు బాగా దగ్గరకు వచ్చాక, ముం నేనే కాలుద్దామనుకున్నాను. టపటప యిద్దరు ముగ్గుర్ని పడగొట్టేస్తే సరి !

ఇప్పుడా సన్నివేశాన్ని తలుచుకుంటే, 'ఎందుకంత బాధపడ్డామా ?' అనిపిస్తుంది. పోలీసు నుండి తప్పించుకోవడానికి, ఏ పొదల చాటునైనా రెండు నిముషాలు దాక్కుంటే సరిపోయే పోలీసులు వెళ్ళాక ఢిల్లీకి వెళ్ళిపొయ్యేవాళ్ళం ! అయితే, ఆ మాత్రం ఆలోచించే మనస్థిమితం అప్పు ఎక్కడిదీ ? తెగ ఉద్రేకం ముంచుకొస్తున్నదాయె !

పోలీసులు మాకు పది అడుగుల దూరంలోకి వచ్చారు. ముందు నడుస్తున్న ఆఫీసరు ద నా మీద పడ్డది. నేను జేబులో నున్న పిస్తోలును గట్టిగా చేత్తో పట్టుకునే ఉన్నాను. పోలీసులు వ రెండు అడుగులు ముందుకు వచ్చారు. వాళ్ళ ఆఫీసరు కటుస్వరంలో పెద్దగా అరిచాడు. "ఐ త రైట్"నా చెయ్యి పిస్తోలుతో సహా బైటకు వచ్చేదల్లా తక్కిన ఆగిపోయింది. ఆఫీసరు యిచ్చిన ఆర్డ ఫైర్ చేయడానికి కాదని, శాల్యూట్ చేయడానికని తెల్సుకున్నాను. ఆఫీసరు నేను అపరాధిననిగా అనుమానితుడనని గానీ అనుకోలేదు. తన పై ఆఫీసరుననుకున్నాడు. బాగ్‌రామ్‌ని పు అనుకున్నాడు. అతడలా అనుకోవడం అసహజమూ కాదు. నేను వేసుకున్న మిలటరీ డ్రస్సు మీ మేజర్ పదవికి ఉచితమైన చిహ్నాలున్నాయి. బహుశా, ఆ ఆఫీసరు 'బాంబు పేల్చిన ప్రదేశా చూట్టానికి నేను తనకంటే ముందు వచ్చాననుకున్నాడేమో ! నేను మేజరు హోదాను అభినయిస్తూ కొంచెం కిందికి వంచు, వాళ్ళ శాల్యూట్‌ను స్వీకరించాను. పోలీసులు ముందుకు వెళ్ళి పోయారు

నేను భాగ్‌రామ్ వంకచూసి "ఇది మరీ బాగుంది ! సరే ! మోటార్ సైకిలును నెట్టుకు పోద సగ ముందేమి జరుగనుందో చూదాం !" అన్నాను.

మేమిద్దరం వంతుల ప్రకారం సైకిలును నెట్టుకుంటూ ఢిల్లీవైపుకు వెళ్ళుతున్నాం. సెంట్రల్ జైలు దగ్గరకు వెళ్ళాక నేను నెట్టటం మానేశాను. అచ్చం భాగ్‌రామ్‌నే నెట్టుకు పదమన్నాను. అప్పటికి రోడ్డమీద జన సంచారం కనిపిస్తూన్నది. మేము 'ఫైజ్ బజార్'లోకి వచ్చాము. అక్కడే పోలీస్ స్టేషన్ ప్రక్కన, మోటార్ కారులు, మోటార్ సైకిళ్ళూ బాగుచేసే షాపు వున్నది. ఓ మనిషి షాపు వరండాలో దుప్పటి కప్పుకుని ముడుచుకు పడుకొని ఉన్నాడు.

భాగ్‌రామ్ దాష్టీకంగా కేకవేసి అతడ్ని లేపాడు. "కెప్టెన్ సాబ్ మోటార్ సైకిలు పాడయిపోయింది. దీన్ని బాగుచేసి వుంచు. మా మనిషి వచ్చి తీసుకెళ్తాడు." అన్నాడు భాగ్‌రామ్.

సూర్యోదయమైంది. అయినా బజార్లో మనుష్య సంచారం అంతగా లేదు. మేమిద్దరం 'చాందినీ చౌక్'కు వెళ్ళాము. మా యిద్దరికీ అలసట మిక్కుటమైంది. నాలుగు మైళ్ళు మోటార్ సైకిలు నెట్టుకుంటూ వచ్చాము. నేను 48 గంటలనుండీ ఏమీ తిననూలేదు. నిద్రా పోలేదు. కాలుతీసి కాలు వేయడం కష్టమవుతూన్నది. ముందు ఏమైనా ఇంత తిని శరీరంలోకి బలం తెచ్చుకుంటేగాని నడవలేకండా వున్నాను.

మేమిద్దరం 'మానసరోవర్' హోటల్‌కు వెళ్ళాము. అప్పట్లో ఆ హోటలు చాలా ప్రసిద్ధమైంది. అదృష్టం ఏమిటంటే, బలవంతాన భగవతీభాయి నా జేబులో 15 రూపాయిలు పెట్టాడు. భాగ్‌రామ్ ఒక సలహా యిచ్చాడు. 'పచ్చి కోడి గుడ్లను తాగి, వేడి వేడి పాలు తాగడం నయమన్నాడు.' మేమిద్దరం వేరు వేరు బల్లల ముందు కూర్చున్నాము. మరి ఆఫీసరూ, ప్యూనూ ఒక బల్లముందే కూర్చోవడానికి వీల్లేదుగా

నాకు అప్పుడూ ఆకలి వేయలేదు. తల తిరిగిపోతున్నది. నేల వేము తిన్నట్టు నోరు కటిక చేదుగా వుంది. బలవంతాన అరు గుడ్లను కొట్టుకు తాగాను. వేడివేడిపాలు పట్టించాను. కాసేపు విశ్రాంతి తీసుకునే ఉద్దేశ్యంతో అక్కడే కూర్చున్నాము. అయితే, ఎంతసేపని అక్కడ కూర్చోగలం ?

అక్కడ నుంచి బయలుదేరి స్టేషనుకు వెళ్ళాము. ఇకనప్పుడు మాకు ఢిల్లీలో తల దాచుకునే చోటు ఏదీ లేదు. కాకపోయినా, ఏ పరిచయుడి యింటికైనా వెళదామంటే, ఎలా వీలు ? మిలటరీ ఆఫీసరు దుస్తుల్లో వెళితే పరిస్థితిని ఊహించుకు వాళ్ళు కంగారు పడరా ? గాజియాబాద్ స్టేషనులో భగవతీభాయి నాకోసం ఎదురు చూస్తుంటాడు. అయితే, ఎలా వెళ్ళడం ? మోటార్ సైకిలు చెడిపోయింది. ఇక, రైల్లో వెళ్ళాలి. రైల్లో వెళ్ళడమంటే, నేనీ మేజరు దుస్తులతో ఢిల్లీ స్టేషనులో రైలు ఎక్కాలన్నమాట ! నా శరీరం మీద మిలటరీ ఆఫీసరు దుస్తులు ఉన్నాయి. అయితే, మేజరు హోదాను తెలిపే యిత్తడి బిళ్ళల మీద 'హెచ్.యస్.ఆర్.ఎ.' అన్న ఇంగ్లీషు అక్షరాలున్నాయి. ఆ బిళ్ళలు నన్ను ప్రమాదంలోకి దించుతాయి. ఎవరైనా ఆ బిళ్ళల మీది అక్షరాలను స్పష్టంగా చదువుకోవచ్చును. మేజరు దుస్తులకూ ఆ అక్షరాలకూ పొంతన ఎలా కుదురుతుంది ? అయితే, వేరు మార్గం మాత్రం ఏముంది ? ఆ బిళ్ళలతోనే, ఆ దుస్తులతోనే, ఢిల్లీ స్టేషనుకు వెళ్ళాను. హుందా అయిన ప్రవర్తనతో, నిర్లక్ష్యాన్ని ప్రకటిస్తూ రైల్వేస్టేషనులోకి ప్రవేశించాను.

భాగ్‌రామ్ నా కోసం ఫస్టుక్లాస్ టికెట్ ఒకటి, తన కోసం థర్డ్ క్లాస్ టికెట్ ఒకటి కొన్నాడు. నన్ను అడుగడుగునా అనుమానం పీడిస్తోంది. ఏ క్షణాన, పోలీసులు అనుమానించి, మీద పడతారో తెలియదు. నేను అనుక్షణం పోరాటానికి సిద్ధమయ్యే ఉన్నాను. పైకి మాత్రం చాలా నిబ్బరంగా, తాపీగా ఉన్నట్టు కనిపిస్తున్నాను.

అసలు ప్రమాదం, గాజియాబాద్ వెళ్ళే రైల్లో కాలుపెట్టాక వచ్చింది. ఒక యింగ్లీషు సిపాయి నేనెక్కిన ఫస్టుక్లాస్ పెట్టెలో పడుకుని హాయిగా పేపరు చదువుకుంటున్నాడు. అతడు నా దుస్తుల్ని, విచిత్రమైన చిహ్నాలనూ చూసి తప్పకుండా అనుమానిస్తాడనుకున్నాను. పెట్టెలో అడుగుపెట్టగానే

అతడోమాటు ఓరగా నావైపు చూశాడు. ఉలిక్కిపడ్డట్టయి, అదిరిపడి లేచి వెళ్ళి ఒక ప్రక్కన నిలబడ్డాడు. చప్పున శాల్యూట్ చేశాడు. ఫస్టుక్లాసు పెట్టెలో పడుకున్న అపరాధానికి ఏమన్నా అంటానేమోనని భయపడుతూ తల వంచుకుని కిందికి దిగి వెళ్ళిపోయాడు.

రైలు ఢిల్లీ స్టేషనులో బయలుదేరింది. మనస్సు కుదుటపడ్డది. 'ఇప్పటికి బ్రతికిపోయాం' అనుకున్నాను. బండి గాజియాబాద్ స్టేషనుకు వెళ్ళేసరికి ఉదయం పది గంటలయింది. నన్ను చూసి భగవతీభాయి నిర్విణ్ణుడయ్యాడు. నేను బతికి ఉంటే 7 గంటలలోపే అక్కడికి చేరాలి. బహుశా, భగవతీభాయి నేను అయిపోయాననే నిశ్చయం చేసుకుని ఉంటాడు. నేను రైల్లో ఉన్నంత సేపూ పరిపరివిధాల ఆలోచించాను. 'భగవతీభాయి గాజియాబాద్ స్టేషనులో ఉంటాడా ? 7 గంటలన్నది. 8 గంటల వరకూ ఎదురు చూస్తాడనుకుందాం. ఆ తరువాత అయినా వెళ్ళిపోతాడు గదా ? కానీ, భగవతీభాయి నాకోసం పది గంటల వరకూ అక్కడే కూర్చుని ఉన్నాడు. వెయిటింగ్ రూములో కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు. నన్ను చూడగానే కళ్ళతోనే ప్రశ్నించాడు. "ఏమైంది ?" అని.

నేను రెండు చేతులూ అడ్డంగా తిప్పాను. ఏమీ కాలేదు అన్నట్టు.

'హంస్‌రాజ్ తయారు చేసి యిచ్చిన బ్యాటరి సరీగా పనిచేయలేదు గావును' అనుకున్నాడు భగవతీచరణ్. నేను జరిగింది చెప్పాను. "పేలడం బ్రహ్మాండంగా పేలింది. బండికేమీ నష్టం కలగలేదు. మామూలుగా వెళ్ళిపోయింది. మోటార్ సైకిలే పాడైంది. అక్కడ నుండి ఢిల్లీకి నడిచి వచ్చి, ఢిల్లీలో రైలెక్కి ఇటు వచ్చాం." అన్నాను.

నేను చనిపోయానని నిశ్చయించుకుని ఎంతో విచారంగా ఉన్నాడు భగవతీచరణ్. అతడి ముఖంలోకి యిప్పటికి కళాకాంతులొచ్చాయి. నా వీపును ప్రేమతో చరుస్తూ "Never mind we will try it again !" (విచారించకు. మరోమాటు ప్రయత్నిద్దాం.) అన్నాడు.

భాగ్‌రామ్ మంచులో తిరగడం వల్ల చాలా బాధపడుతున్నాడు. అతడిని నేరుగా లాహోర్ పంపించాము. ఇంద్రపాల్ దగ్గరకు వెళ్ళి విశ్రాంతి తీసుకోమని చెప్పాము. నేనూ, భగవతీభాయి అదే ప్యాసింజర్ బండిలో ఎక్కి కూర్చున్నాము. బండి మెల్లగా తూగుతూ వెళుతున్నది. అన్ని స్టేషన్లలోనూ ఆగుతున్నది. భగవతీచరణ్ సూటు వేసుకున్నాడు. నేను మిలటరీ దుస్తుల్ని విప్పి మామూలు గుడ్డలు కట్టుకున్నాను. మా యిద్దరి మనస్సులూ బాగాలేవు. మౌనంగా, ఉదాసీనంగా రైలు పెట్టెలో పడుకున్నాము. బండి మురాదాబాద్ స్టేషను చేరగానే పేపర్లు అమ్మే కుర్రాడి అరుపులు వినిపించాయి. 'తాజా వార్త ! వైస్రాయి స్పెషల్ ట్రైను క్రింద బాంబు పేలింది. రైలు పట్టాలెగిరిపోయాయ్. ఒక పెట్టె తునాతునకలైంది. ఒక మనిషి చచ్చిపోయడు !'

మా ఆశ్చర్యానికీ, ఉత్సాహానికీ మితిలేకపోయింది. మా ప్యాసింజర్ బండికి ముందు ఒక ఎక్స్‌ప్రెస్ బండి ఢిల్లీ నుండి మురాదాబాద్ వచ్చింది. దానిలో, అప్పుడే ప్రింటైన ప్రత్యేక సంచికలు మురాదాబాద్ వచ్చి ఉంటాయి.

ప్రత్యేక సంచికకొని చదివాము. బాంబు వైస్రాయి భోజనం చేసే కంపార్టుమెంటు కింద పేలింది. ఆ కంపార్ట్‌మెంటు మొత్తం తునాతునకలై ఎగిరిపోయింది. కింది యినుప చట్రం మాత్రం మిగిలింది. బాంబు పేలిన చోట ఆరడుగుల రైలు పట్టాలు ఎగిరి పోయినయ్యి. బండి తీవ్ర వేగంతో వెళ్ళుతుండడం వల్ల రైలు పట్టాలు తెగిన చోట యీడ్చుకుంటూ వెళ్ళిపోయింది. ఎగిరిపోయిన కంపార్ట్‌మెంటు ప్రక్కనే వైస్రాయి సెక్రటరీ కంపార్ట్‌మెంటు ఉంది. బాంబు పేలిన శబ్దానికి అతడు స్పృహ కోల్పోయాడు. ఢిల్లీ సమీపానికి రావడం వల్ల ఒక బంట్రోతు కిటికీ తెరచి ముఖం బైటకు పెట్టాడు. అతడి ముఖం కాలిపోయింది. వైస్రాయి పెట్టె ముందుకెళ్ళిపోయింది. బాంబు పేలిన

శబ్దానికి వైస్రాయి తన పడకలోనే ఎగిరిపడ్డాడు. ట్రైను కొత్త ఢిల్లీ చేరగానే పరదాలతో కప్పివేశారు. దెబ్బతిన్న ట్రైనును చూస్తే ప్రజల్లో వ్యతిరేక ప్రభావం కలుగుతుందని !

వైస్రాయి బండి దిగి తన నివాసానికి వెళ్ళేముందు, చర్చికి వెళ్ళాడు. ప్రాణాలు దక్కినందుకు భగవంతుణ్ణి ప్రార్థించుకోవడానికి !

నిరాశలో మునిగివున్న మాకు ప్రత్యేక సంచికను చదివేటప్పటికి ప్రాణాలు కుదుటపడ్డట్టయింది. అలా దట్టంగా మంచు పట్టకపోతే మేము వేసుకున్న ప్లాను ప్రకారం యింజను ముందు బాంబు పేల్చడం జరిగేది. మొత్తం ట్రైనే ధ్వంసమయ్యేది. మేము మురాదాబాద్‌లో దిగి డెహరా ఎక్స్‌ప్రెస్‌లో కలకత్తా వెళ్ళిపోయాము.

బాంబు పేలిన విషయం మా కంటే ముందే కలకత్తా చేరింది. సుశీలాదీదీని కల్సుకున్నాము. మేము చేసివచ్చిన పనికి ఆమె కళ్ళల్లో సంతోషమూ, ఆనందమూ మెరుపుల్లా మెరిశాయి. లాహోరులో కాంగ్రెస్ మహాసభలు జరుగుతున్నాయి. అక్కడి వార్తలు ఏ పూట కాపూట కలకత్తాకు చేరుతున్నాయి. వైస్రాయి ట్రైను కింద బాంబు పేల్చిన విషయం విని, మహాసభకు వచ్చిన ప్రజలు ఆనందంతో ఉన్మత్తులయ్యారు !

కాంగ్రెస్ మహాసభ ప్రారంభంలోనే, గాంధీగారు స్వయంగా ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఆ తీర్మానంలో వారు వైస్రాయి ట్రైను కింద బాంబు పేల్చిన విప్లవకారుల్ని బాగా నిందించారు. మమ్మల్ని పిరికివాళ్ళుగా, నీచకార్యాలు చేసేవాళ్ళుగా అభివర్ణించారు. వైస్రాయి పట్ల సానుభూతిని ప్రదర్శించారు. వైస్రాయి ప్రాణాలను రక్షించినందుకు భగవంతుడికి ధన్యవాదాలు అర్పించారు.

గాంధీగారు పై తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించవలసిందని కరుణాభరితమైన స్వరంలో మహాసభకు వచ్చిన సభ్యులను వేడుకున్నారు.

గాంధీగారిమీద ప్రజలకు గుడ్డి నమ్మకం ఉంది. వారి మీద అపారమైన గౌరవమూ వుంది. కాంగ్రెస్ నాయకులు, ఆ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదింపజేసి గాంధీగారి గౌరవాన్ని కాపాడవలసిందని, పదే పదే ప్రార్థించారు సభ్యుల్ని. అయినప్పటికీ, మహాసభకు వచ్చిన సభ్యులు ఆ తీర్మానాన్ని విని, తమ తీవ్ర వ్యతిరేకతను వ్యక్తపరచారు. 1713గురు సభ్యుల్లో కేవలం యనభై ఒక్క మంది మెజార్టీతోనే, తీర్మానం ప్యాసైందంటే, ఎందరు వ్యతిరేకులో ఊహించుకోవచ్చును. ఈ 81 మందిలోనూ, నిజంగా విప్లవకారుల ఈ కార్యక్రమాన్ని నిరసించిన వాళ్ళు ఎంత మంది ఉంటారు ? అప్పట్లో పంజాబులోని ప్రముఖ కాంగ్రెసు నాయకురాలు సరళాదేవి చౌధరాణి ఒక విషయాన్ని పబ్లిక్‌గా ఒప్పేసుకున్నారు. గాంధీగారికి కోపం వస్తుందనే తనూ, తనతోపాటు ఇంకా అనేకులు ఆ తీర్మానాన్ని బలపరచినట్లు ఆమె బహిరంగంగానే చెప్పింది.

మాకు మళ్ళీ వెనుకటి సమస్యే ఎదురైంది. కేంద్ర కమిటీతో తిరిగి సంబంధాన్ని ఏర్పర్చుకోవాలి. మేము ఉండడానికి కొత్త ప్రదేశాన్ని వెతుక్కోవాలి. ఈ మాటు నేను కలకత్తాలోని సెంట్రల్ ఎవెన్యూలో ఉంటున్న శ్రీ సురేంద్ర విద్యాలంకార్‌గారి యింట్లో కొన్నాళ్ళు ఉన్నాను. సురేంద్రగారిని చూడగానే గుర్తుపట్టాను. ఆయన కాంగడా గురుకులంలో నా కంటే పై క్లాసులో చదువుతూండేవాడు. నేను అయనకు నా అసలు పేరు చెప్పలేదు. కాకపోతే, విప్లవకారుణ్ణనీ, ఢిల్లీ సంఘటనతో సంబంధం ఉండటం వల్ల పరారీలో ఉన్నాననీ చెప్పాను. నాలుగు రోజుల తరువాత భగవతీభాయి కలకత్తా నుండి లక్నో వెళ్ళిపోయాడు. ఇక లక్నోలో మకాం వేయాలని మేమనుకున్నాము. వైస్రాయి ట్రైన్ కింద బాంబు పేల్చే కార్యక్రమంలో నా ఆరోగ్యం దెబ్బతిన్నది. భగవతీభాయి నన్ను ఒక వారం రోజుల పాటు సురేంద్రగారి ఇంట్లో ఉండి విశ్రాంతి తీసుకోమని చెప్పి వెళ్ళాడు.

అనుకున్న రోజుకు, అనుకున్న ట్రైనులో నేను లక్నో వెళ్ళి పోయాను. భగవతీచరణ్ స్టేషనుకు వచ్చాడు. అతడు, నేను వెళ్ళేప్పటికే అమీనాబాద్ పార్కులో, సోలమన్ కంపెనీదగ్గర, మాకోసం పై అంతస్థులో గదినొకదాన్ని తీసుకున్నాడు. అప్పట్లో లక్నో యింతగా పెరగలేదు. ఆగదినప్పుడు నెలకు పదిరూపాయలకు అద్దెకు తీసుకున్నాము. ఇప్పుడాగది 200లు యిచ్చినా దొరకదు.

నేను లక్నోరాగానే మాగదిముందు 'శానిటరీ సప్లయర్సు' అని బోర్డు తగిలించాను. చుట్టు ప్రక్కలవాళ్ళూ, కింది దుకాణాలవాళ్ళూ మా బోర్డుకు అర్థం తెలుసుకోలేకపోయారు. మేము చుట్టుపక్కల వాళ్ళందరికీ మా బిజినెస్‌ను గురించిన వివరాలనుచెప్పాము. కొన్ని కేట్లాగులను చూపించాము. మా సామానులు ఆస్పత్రులకు, కార్ఖానాలకు, స్కూళ్ళకు మాత్రమే పనికొస్తాయని, ఉత్సాహవంతులైన ధనికులుకూడా తమ గదుల్లో అమర్చుకోవచ్చునని చెప్పాము. అప్పట్లో 'ఫ్లష్ సిస్టం' 'వాష్‌బేసిన్' లాంటివి లక్నో ప్రజలకు కూడా తెలియవు. నేను కలకత్తానుంచి వచ్చేటప్పుడే ఈ సామానులమ్మే కంపెనీలను అడిగి, కేట్లాగులను పట్టుకొచ్చాను.

ఉండడానికి కొత్తచోటు చూసుకున్నాము. ఇప్పుడిక, పార్టీ నిర్ణయాన్ని తోసిరాజని బాంబు పేల్చినందుకు, ఆజాద్‌కు లేక పార్టీకి ఏం సమాధానం చెప్పుకోవడం ? అన్న సమస్య ఎదురైంది. పార్టీ నిర్ణయాన్ని తిరస్కరించినందుకు నైతికంగా మేము ఏమీ బాధపడడంలేదు. తప్పుచేసినవాళ్ళలా సిగ్గుపడడంలేదు. అయితే, రెండు మూడు నెలలుగా ఆజాద్ కొంత కోపంగా వుంటూన్నాడు. అతడికోపం వృద్ధికాకముందే - సమస్య మరీ చిక్కుపడకముందే - పరిష్కరించుకోవడం మంచిది ! మమ్ములను చూడగానే ఆజాద్, మండిపడతాడనడంలో సందేహంలేదు. కనుక, యిద్దరం ఒకమాటు వెళ్ళేకంటే, మొదట నేనువెళ్ళి, ఆజాద్‌ను కల్సుకుని, తరువాత పరిస్థితి ననుసరించి భగవతీచరణ్ వెళ్ళి కలుసుకోవడం నయం అనుకున్నాను.

నేను జనవరి రెండవతారీకున ఢిల్లీ వెళ్ళాను. నందకిషోర్ దగ్గరకువెళ్ళి, కైలాసపతి ఎక్కడున్నాడో అడుగుదామనుకున్నాను. అయితే వెతకనవసరం లేకుండా భయ్యా ఆజాద్, నందకిషోర్ ఇంట్లోనే కనిపించాడు. నందకిషోర్ ఎదుటా, ఇతర మిత్రుల ఎదుటా - ఆజాద్ నాతో కొంచెం గంభీరంగా మట్లాడాడు. ఆజాద్ యొక్క కోపాన్ని అర్థం చేసుకోవటానికి, ఆ గంభీరమే చాలు ! ఏకాంతంలో మాట్లాడడానికి యమునానది ఒడ్డుకు వెళ్ళాం.

"నిర్ణయానికి విరుద్ధంగా మీరు బాంబుల్ని ఎందుకు పేల్చారు ?" అని అడిగాడు ఆజాద్.

నేను చాలా స్పష్టంగా మాట్లాడాను. "నిర్ణయానికి వ్యతిరేకంగా పనిచేయడం వరకూ ఆలోచిస్తే నేను అపరాధినే ! ఈ అపరాధానికి పార్టీ ఏ శిక్ష విధించినా అనుభవించడానికి నేను సిద్ధంగా వున్నాను. భగవతీచరణ్ నన్ను వారించాడు. నేను అతడిమాటనూవినలేదు. కారణం, కాంగ్రేసు మహాసభకు ముందుగా వైస్రాయి ట్రైను కింద బాంబు పేలిస్తే ప్రజలమీద రాజకీయంగాకూడా ప్రభావం బాగాపడుతుంది అని నా ఊహ ! నా ఊహ సరియైనదని రుజువయింది ! లాహోరు కాంగ్రేసు మహాసభకు వచ్చిన సభ్యులమీద, ఈ సంఘటన ఎలా ప్రభావాన్ని వేసిందో మనం చూశాము కదా !"

ఆజాద్ తనకోపాన్ని అణచుకోవడానికి పెదవి కొరుక్కున్నాడు. కోపంతో కండ్లు చింతనిప్పుల్లా ఎర్రబడ్డాయి. "నీ వూహకు అర్థమేమిటి ? నీవూహ పార్టీ నిర్ణయంకంటే కూడా గొప్పదైందా ? పార్టీకంటే

నీ ఊహే గొప్పదన్న భావన నీకుంటే నీకు పార్టీతో సంబంధమేమిటీ ? వెళ్ళు, వెళ్ళి నీయిష్టంవచ్చినట్లు చేసుకో ! ఒక చెంప మేముచర్చిస్తూనే ఉన్నాము. నువ్వేదో వంకపెట్టి చర్చలోంచి వెళ్ళిపోయావు ! అక్కడికి మేమంతా వ్యర్థులమై, అనవసరంగా చర్చిస్తున్నట్లు ......"అన్నాడు ఆజాద్.

నేను చాలా వినయంగా "మధ్యలో లేచిపోవడానికి కారణం చర్చపట్ల ఉపేక్షాభావం ఉండడం వల్ల కాదు. కరెంటు వైరులు తెచ్చుకోవాలి. ఆలస్యమైతే కొట్లుకట్టి వేస్తారు. అందువల్ల లేచిపోయాను. పైగా, అప్పటికి రెండు సార్లు 'యాక్షన్' ఆగిపోయింది. ఒక్క భగవతీభాయిని మినహాయించి, మిగిలిన వాళ్ళు నేను పిరికితనం వల్ల 'యాక్షన్'ని ఆపుతున్నానని అనుకునే ప్రమాదమూ ఎంతైనా వుంది ! నేను పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పనిచేశాను. భవిష్యత్తులో నా కర్తవ్యాన్ని నేను నిర్వహిస్తానన్న విశ్వాసం మీకు వుంటే క్షమించండి ! లేదా, మీరుగాని, పార్టీగాని - యిష్టమొచ్చిన శిక్ష విధించవచ్చు. నేను పార్టీకి లొంగిపోతున్నాను." అంటూ జేబులో నుంచి పిస్తోలును తీసి ఆజాద్ ముందు పెట్టాను.

ఆజాద్ కోపాన్ని అణచుకోవడానికి పెదవి కొరుక్కున్నాడు. అదే ప్రయత్నంలో కండ్లు చెమర్చాయి. రుమాలుతో కండ్లు తుడుచుకుని నా పిస్తోలును నా కిస్తూ "ఉంచుకో ! నీ దగ్గరే ఉంచుకోదీన్ని !" అన్నాడు. మిత్రుల మీద కోపం వచ్చినప్పుడు ఆ కోపాన్ని అణచుకోడానికి ప్రయత్నించినప్పుడు, ఆజాద్ కండ్లు ఎర్రపడతాయి. చమరుస్తాయి ! ఐతే, ఎంత కోపంలో వున్నా, అతడు మిత్రుల్ని ఎన్నడూ తూలనాడడు !

తరువాత నేనిలా అన్నాను. "గాంధీగారు (కాంగ్రెసుపార్టీ) వైస్రాయి మీద మనం జరిపిన ఈ దాడిని నిందించారు. దీనికి మనం సమాధానం చెప్పడం అవుసరం ! మనం మన భావాలను ప్రజల ముందు వుంచడానికి ఇదో చక్కని అవకాశం ! పైగా, కాంగ్రెసు జనవరి 26వ తారీకును 'సంపూర్ణ - స్వాతంత్ర్య' దినంగా ప్రకటించబోతోంది ! అదే రోజున మనం మన అభిప్రాయాన్ని కరపత్రం రూపంలో ప్రజల ముందు వుంచుదాము ! మీరు 'సరే' అంటే నేనూ, భగవతీచరణ్ - కల్సి విస్తృతమైన ప్రకటనను తయారు చేస్తాము ! దాన్ని మిత్రులందరికి చదివి వినిపించి - అందరూ అంగీకరించాక, ప్రింటు చేయిద్దాము !" అని చెప్పాను.

భయ్యా ఆజాద్ కరపత్రాన్ని ప్రకటించడాన్ని గురించి చాలా ఉత్సాహాన్ని కనబరిచాడు. వెంటనే తనూనాతోపాటు లక్నోకు బయల్దేరాడు !

అమీనాబాద్‌లో మేము తీసుకున్న ఇంట్లో కరపత్రంలో ప్రకటించదగు విషయాన్ని గురించి జోరుగా తర్జన భర్జనలు జరిగాయి. అప్పట్లో గాంధీగారు 'యంగ్ ఇండియా' వార పత్రికలో 'Cult of the Bumb' (బాంబు మార్గం) అనే వ్యాసాన్ని ఒకదాన్ని ప్రకటించారు. కనుక, మేము మా కరపత్రానికి 'Philosophy of the Bumb' (బాంబు దర్శనం - బాంబు తత్వం !) అని పేరు పెట్టాము. ఈ కరపత్రాన్ని, వైస్రాయి ట్రైనుక్రింద బాంబు పేల్చిన ఆశయాన్ని ప్రజలకు చాటటానికీ, గాంధీ గారి పై వ్యాసానికీ సమాధానంగానూ ప్రకటించాము ! పై కరపత్రం, హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్, అసోసియేషన్ అధ్యక్షుడు కర్తార్ సింగ్ (అంటే ఆజాద్) సంతకంతో ప్రకటింపబడ్డది. పై కరపత్రంలోని ముఖ్య విషయాల్ని ఇక్కడ ఉదహరించడం అసందర్భం కాదనుకుంటున్నాను !

# బాంబు దర్శనం

## PHILOSOPHY OF THE BUMB

వైస్రాయి మీద బాంబు దాడి జరిగాక కాంగ్రెసు పార్టీ, గాంధీగారూ విప్లవకారుల్ని విమర్శించడంతోపాటు మమ్మల్ని లేనిపోని నిందలతో ముంచెత్తడం ప్రారంభించారు. విప్లవకారులం అయిన మేము సవిమర్శకు ఎన్నడూ జడవము ! కానీ, లేనిపోని నిందలతో మా నెత్తికి అపరాధాల్ని చుట్టడాన్ని ఎన్నటికీ సహించము ! మా మీద వేసే నిందలు నిరాధారాలని చెప్పడంతోపాటు, వాటిలోని నిజానిజాల్ని ప్రజల ముందు వుంచడం ఎంతో అవుసరం అనుకుంటున్నాము.

'విప్లవకారులు హింసాత్మకులు' అన్న వాదునొకదాన్ని వేస్తున్నారు. అసలు హింస అంటే ఏమిటి ? అహింస అంటే ఏమిటి ? హింస అంటే శారీరక బలం ద్వారా ఇతరులకు అన్యాయం చేయడం ! ఇక అహింస అంటే, తాము కష్టాల్ని అనుభవించి, ఆత్మిక శక్తి ద్వారా ఎదుటివారికి హృదయ పరివర్తన గావించడం ! తద్వారా వ్యక్తిగతమైన లేక జాతిగతమైన అభీష్టాన్ని నెరవేర్చుకోవడం. విప్లవకారులు కూడా తమ విశ్వాసాన్ని అనుసరించి న్యాయం కోసం, దేశం కోసం, పోరాడుతున్నారు. ఈ పోరాటంలో వారు మానసిక శక్తినే కాకుండా, శారీరక శక్తిని కూడా వినియోగిస్తున్నారు. ఆదర్శం కోసం కష్టాల్ని సహించడంలోనూ, అవసరమైతే ప్రాణాల్ని బలిపెట్టు కోవడంలోనూ ఎవ్వరికీ తీసిపోరు విప్లవకారులు !

విప్లవకారుల భావాలు లేక వారి ఆదర్శం మీకు నచ్చవచ్చు, లేక నచ్చకపోవచ్చును ! అంత మాత్రానికి వారిని 'హింసాత్మకు'లనడం సబబు కాదు. సత్యాగ్రహమంటే ఏమిటి ? సత్యం కోసం ప్రయత్నించడము ! సత్యం కోసం ఒక్క ఆత్మిక బలంతోనే ఎందుకు ప్రయత్నించాలి ? శారీరక బలాన్ని మాత్రం ఎందుకు ఉపయోగించకూడదు ? విప్లవకారులు సత్యం కోసం, న్యాయం కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం తమకు తెలిసిన, చేతనైన అన్ని మార్గాల్నా ప్రయత్నిస్తారు. వారు తమ సంపూర్ణ ఆత్మిక, నైతిక, శారీరక శక్తుల్ని అన్నింటినీ - తమ ఆదర్శ సాధనకు ఉపయోగిస్తారు !

గాంధీగారికి విప్లవకారులకు మధ్యవున్న బేధం హింస, అహింసలకు సంబంధించినదికాదు. గాంధీగారు దేశ స్వాతంత్ర్యం కోసం ఒక్క ఆత్మికబలాన్నే వాడుదామంటున్నారు. విప్లవకారులు తమ సమస్తశక్తుల్ని వినియోగించి, చేతనైన అన్ని మార్గాల్నా పోరాడుదామంటున్నారు.

విప్లవకారులమైన మేము విప్లవం ద్వారానే ఈ దేశ ప్రజలకు దాస్య విముక్తి కలుగుతుందను కుంటున్నాము. విప్లవం అంటే మా ఉద్దేశ్యంలో ఒక్క పర ప్రభుత్వంతో పోరాడటం మాత్రమే కాదు. మా విప్లవానికి ఆదర్శం న్యాయ సమ్మతమైన, ఒక కొత్త సమాజాన్ని స్థాపించడం. పెట్టుబడిదారీ విధానాన్ని నాశనం చేసి, వర్గ రహితమైన సమాజ వికాసానికి దోహదం చేయడం. విదేశీయుల దోపిడీనుండి, దేశీయుల దోపిడీనుండి ప్రజల్ని కాపాడి, వారికి స్వయం నిర్ణయాధికారాన్ని యివ్వడం మా విప్లవానికి ఆదర్శం ! దోపిడీదారుల్ని అధికారచ్యుతుల్ని చేసి, శాసనాధికారాన్ని రైతులకూ, కూలీలకూ యివ్వడం మా ఆదర్శం ! రైతు కూలీ ప్రజారాజ్యాన్ని మేము కోరుతున్నాము.

దేశంలోని యువకులు నేడు విప్లవానికి సంసిద్ధులవుతున్నారు. మానసిక దాస్యాన్నుండి, మత పిచ్చినుండి బైటపడుతున్నారు. ఈ దేశపు యువకులు విప్లవాన్ని అధ్యయనం చేస్తున్నారు. యువకులు విదేశీయుల దాస్య శృంఖలాలను తెంచుకోవడానికి సంఘర్షిస్తున్నారు. ఈ సంఘర్షణల్లోంచి

విప్లవ జ్వాలలు ప్రజ్వరిల్లుతాయి. ఆ జ్వాలల్లో దోపిడీ విధానం భస్మమైపోతుంది. అన్యాయానికీ, దోపిడీకీ వ్యతిరేకంగా యువకుల హృదయాల్లో ప్రజ్వరిల్లిన క్రోధాగ్ని దౌర్జన్యవాదంగా అక్కడక్కడా బైటపడుతుంది. ఈ దౌర్జన్యవాదం రాబోయే సాయుధపోరాటానికి స్వస్తి వాచకం. దీన్ని సంపూర్ణమైన విప్లవం అనడానికి వీల్లేదు. అయితే, ఈ దౌర్జన్యవాదాన్ని మినహాయించి విప్లవమూ సంభవముకాదు. ఇంతవరకు ప్రపంచంలో ప్రభవించిన విప్లవాలన్నీ దౌర్జన్యవాదంతోనే ప్రారంభ మయ్యాయి. దౌర్జన్యవాదం దోపిడీదారుల్ని హడలగొడుతుంది. దీనులూ, నిరుపాయులూ అయిన ప్రజలకు ఆత్మ విశ్వాసాన్నీ, ఉత్సాహాన్నీ యిస్తుంది. మా ఆదర్శం దౌర్జన్యవాదం కాదు. అయితే దౌర్జన్యవాదం విప్లవాన్ని ప్రభవింప జేయడానికి సహకరిస్తుంది. విప్లవం ప్రజలకు సామాజిక రాజకీయ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ప్రసాదిస్తుంది.

విప్లవకారులు విప్లవాన్నే విశ్వసిస్తారు. ప్రజలను విప్లవంవైపే నడిపిస్తారు. అందుకు సంభవమైన అన్ని మార్గాల్నా ప్రయత్నిస్తారు. మాకు ముందు, ప్రపంచ ప్రజలు దోపిడీదారులకు వ్యతిరేకంగా నడిపిన పోరాటాలన్నీ, మాకు మార్గాన్ని చూపుతున్నాయి. ఇంతవరకూ చరిత్రలో పీడిత ప్రజలు పోరాటం ద్వారానే దోపిడీదారుల్ని ఓడిస్తూ వచ్చారు. భారత విప్లవకారులు కూడా యీ దేశపు దోపిడీదారుల్ని పోరాటం ద్వారా తప్పకుండా ఓడిస్తారు.

మరి కాంగ్రెస్ మార్గమేమిటి ? కాంగ్రెస్ లక్ష్యమేమిటి ? ఇప్పుడు కాంగ్రెసు 'స్వరాజ్యం' నుండి తన ఆదర్శాన్ని మార్చుకుని 'పూర్ణ స్వరాజ్యం' నా లక్ష్యమంటున్నది. నిజంగా కాంగ్రెస్ లక్ష్యం పూర్ణ స్వరాజ్యమే ఐతే, అది విదేశీ దోపిడీదారుడితో పోరాడాలి. కానీ, కాంగ్రెస్ ఆ పని చేయడంలేదు. పైపెచ్చు బ్రిటీషు ప్రభుత్వంతో హోరాహోరీగా పోరాడుతూన్న విప్లవకారుల్ని నిందిస్తూన్నది. కాంగ్రెస్, నిందలు అనే తన పదునైన అస్త్రాల్ని విప్లవకారుల మీద వేస్తూన్నది. డిశంబరు 23 తారీకున విప్లవకారులు వైస్రాయి మీద దాడి జరిపారు. ఆ దాడిని కాంగ్రెస్ నిందించింది. లాహోర్ కాంగ్రెస్ మహాసభలో, విప్లవకారులు వైస్రాయి మీద చేసిన దాడిని నిందిస్తూ గాంధీగారు స్వయంగా ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు ! ఆ తీర్మానాన్ని పాసు చేయించుకోవడానికి గాంధీగారు తన శక్తినంతా ఉపయోగించారు. పది సంవత్సరాల నుండి గాంధీగారు ప్రేమతో పర ప్రభుత్వానికి హృదయ పరివర్తన గావించండని ప్రజలకు చెబుతున్నారు. ఈ దేశానికి శత్రువులైన పర ప్రభుత్వ ప్రతినిధుల్ని (వైస్రాయి) గాంధీగారు 'మిత్రులు' అని సంబోధిస్తున్నారు. కానీ, ఈ దేశం కోసం ప్రాణాలను బలిపెట్టుతూన్న విప్లవకారుల్ని పిరికివారనీ, వారి విప్లవ చర్యల్ని జఘన్యమైన కార్యాలనీ నిందిస్తున్నారు.

గాంధీగారు తన తీర్మానాన్ని ప్యాసు చేయించుకున్న విధానం అందరికీ తెలిసిందే ! ప్రజల మీద గాంధీగారు అలిగారు. కోపగించుకున్నారు. తీర్మానం ప్యాసు కాకపోతే కాంగ్రెస్ నుండి వెళ్ళిపోతానని బెదిరించారు. ఇంతచేసినా వారి తీర్మానం ఎక్కువ మెజారిటీతో ప్యాసు కాలేకపోయింది. పదిహేడు వందల పదముగ్గురు ప్రతినిధుల్లో గాంధీగారి తీర్మానం 81 మంది మెజారిటీని మాత్రమే తెచ్చుకుంది. ఈ అల్ప మెజారిటీకి అర్థమేమిటి ? ప్రజలు ఎవరి వైపున్నారు ? అహింసను ఆదర్శంగా స్వీకరించి, ఆచరిస్తున్నామని చెప్పుకునే ప్రతినిధుల్లోనే గాంధీగారి తీర్మానానికి, వారి అహింసా సిద్ధాంతానికి ఇంతకొద్ది మెజారిటీ లభించిందంటే, దేశంలోని అశేష ప్రజల విషయమేమిటి ? ప్రజలు అహింసను కోరుతున్నారో, హింసను కోరుతున్నారో నిర్ణయించుకోవడం కష్టంకాదు.

గాంధీగారు ఆనాడు మహాసభలో యిచ్చిన తన ఉపన్యాసాన్ని 'ది కల్ట్ ఆఫ్ బమ్' అనే పేరుతో యంగ్ ఇండియాలో ప్రచురించారు. ఆ వ్యాసం మూడు భాగాలుగా ఉంది. ఒకటి 'వారి విశ్వాసం' రెండు 'వారి అభిప్రాయం' మూడు 'వారి తర్కం' మొదటిదైన వారి విశ్వాసాన్ని మనం విమర్శించడం అనవసరం. కారణం విశ్వాసానికీ విమర్శకూ ఎప్పుడూ పొసగదు. పోతే మిగిలిన రెండు

భాగాలను మనం విమర్శించవచ్చును. గాంధీగారు, గడచిన పది సంవత్సరాల తన రాజకీయ జీవితంలోనూ, ప్రజలు అహింసా సిద్ధాంతాన్ని అధికాధికంగా స్వీకరించడాన్ని గమనించానని చెప్పారు. దేశ ప్రజలకు గాంధీగారి మీద భక్తి వుంది. శ్రద్ధ వుంది. అందుకు అనుమానం లేదు. అంతమాత్రాన దేశ ప్రజలందరూ గాంధీగారి రాజకీయ సిద్ధాంతాల్ని అనుసరించే వారనుకోవడం పొరపాటు. ఈ దేశ ప్రజల్లో ఎక్కువమంది అశిక్షితులు. వారికి ఏ రాజకీయాలూ పట్టవు. ప్రజలు గాంధీగారిని ఆధ్యాత్మిక శక్తి సంపన్నులైన మహా పురుషులుగానే భావిస్తున్నారు. గాంధీగారి రాజకీయ అభిప్రాయాలుగానీ, ఆదర్శాలుగానీ ప్రజలకు పట్టవు. ఇటు గాంధీగారికీ ప్రజల భావాలుగానీ, ప్రజల స్థితిగతులుగానీ తెలియవు. గాంధీగారు ప్రజల్ని ఉపన్యాస వేదికల మీద నుండి చూశారేగాని, వ్యక్తిగతంగా బాధామయ జీవుల్ని కల్సుకుని, వారి కష్టసుఖాలను విచారించి ఎరుగరు. రైతులతో, కార్మికులతో గాంధీగారికి అసలే పరిచయం లేదు. మనదేశ ప్రజలు కూడా ప్రపంచంలోని ఇతర దేశాల ప్రజల్లాంటివారే ! సాధారణ మానవమాత్రులే. శత్రువును ప్రేమించడమన్న మహా తంత్రం మనదేశ ప్రజలకూ అర్థంగాదు. ప్రేమించినవారితో స్నేహం చేయడం, హింసించిన వారిని ద్వేషించి పోరాడడం సర్వసాధారణమైన విషయం. ద్వేషం కారణంగానే పోరాటాలు సంభవిస్తాయి. సర్వసాధారణమైన ఈ నియమానికి విరుద్ధంగా దేశ ప్రజలకు ప్రేమతో స్వాతంత్ర్య పోరాటాన్ని పోరాడండి అని చెప్పడంలో అర్థం లేదు ! అన్యాయానికి ప్రతిగా పోరాడటానికి కావలసింది ప్రేమకాదు, ద్వేషం ! ఈ సహజ నియమానికి మనదేశ ప్రజలు అతీతులు కారు.

ప్రేమద్వారా శత్రువుకు హృదయ పరివర్తనం చేయవచ్చునన్న సిద్ధాంతంలో తన విశ్వాసం రోజురోజుకు ధృఢతరం అవుతున్నదని గాంధీగారు అంటున్నారు. మేము ఒక్క ప్రశ్న వేస్తున్నాము. ఇంతవరకూ గాంధీగారు ప్రేమతో ఈ దేశానికి శత్రువులైన విదేశీ పాలకులకు ఎందరికి హృదయ పరివర్తన గావించాడు ? అడయార్, డయ్యర్, రీడింగ్, ఇర్విన్ - వీళ్ళల్లో ఎవరికైనా ఒక్కరికి హృదయ పరివర్తన గావించారా ? ఒక్కరినైనా భారతదేశానికి మిత్రులను చేయగలిగారా ? 'లేదు' అని చెప్పుకోక తప్పదు ! అలాంటప్పుడు, మొత్తం బ్రిటీషు పాలకుల హృదయాలనే మార్చేస్తాననడం హాస్యాస్పదం కాదా ?

వైస్రాయి ట్రైనుకింద అనుకున్నట్లు బాంబు పేల్చలేక పోయాము. అనుకున్నట్లు పేల్చగలిగితే మాత్రం కొంప మునిగిపోయేదేముంది ? మహా అయితే, వైస్రాయి గాయపడతాడు. లేకపోతే, చచ్చిపోతాడు. కాంగ్రెస్ నాయకులు వైస్రాయితో సమావేశం కాలేరు. ఇప్పుడు సమావేశమై సాధించిందేమిటి ? మరోమాటు 'అర్థస్వరాజ్యం' కోసం వైస్రాయిని అర్థించడమే గదా ? కిందటి సంవత్సరం జరిగిన కాంగ్రేస్ మహాసభలో పోరాటం సాగిస్తామని సవాల్ చేశారు. మళ్ళీ ఇప్పుడు 'అర్థ స్వాతంత్ర్యం' అయినా యివ్వండయ్యా అని అడుక్కోవడం ఏం బాగుంటుంది?

వైస్రాయి భారతదేశానికి శత్రువు. లాహోర్ కుట్ర కేసుకు, మీరట్ కుట్ర కేసుకు, భుసావల్‌లో జరిగిన దమన కాండకు ఇతడే కారకుడు. ఇలాంటి వాళ్ళు చనిపోతేనే మంచిది. గాంధీగారు, నెహ్రూగారు కూడా తాము గొప్ప రాజనీతిజ్ఞులమని అనుకుంటారు. అయితే, వైస్రాయి కూటనీతి వీరిద్దరినీ బుట్టలో పెట్టేసింది. సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా భారతదేశంలోని రాజకీయ పార్టీలన్నీ ఏకమయ్యాయి. ఆ ఐక్యతను ఈ వైస్రాయి పాడు చేశాడు. ఈ వైస్రాయి కూటనీతి వల్ల కాంగ్రెసే రెండు పార్టీలయింది. ఇంతజేసినా ఈ వైస్రాయిని 'భారతదేశానికి మిత్రుడు' అనడానికి గాంధీగారు సంకోచించటం లేదు !

ఒకవేళ, విప్లవకారులకూ కాంగ్రేసుకూ ఎలాంటి సంబంధమూ లేదని గాంధీగారు అనుకుంటే, అది మా పట్ల ఘోరమైన అన్యాయమే అవుతుంది. కాంగ్రేసు ప్రజల్లో స్వాతంత్రేచ్ఛను కలిగించిందని

మేమూ ఒప్పుకుంటాము. అయితే, అంతటితో కాంగ్రెసు బాధ్యత తీరిపోలేదు. దేశానికి కాంగ్రెసు చేయవలసింది ఇంకా ఎంతో ఉంది. కానీ, ఆ సంస్థ మీద దళారి రాజకీయాలను అభిమానించే నాయకుల ప్రాబల్యం ఎక్కువైంది. కాంగ్రెస్ చెప్పే అహింస, విదేశీ పాలకులతో రాజీబేరాలకు దిగడానికి ఒక సాకుగా తయారైంది. కాంగ్రెసు పూర్ణస్వరాజ్యమే తన లక్ష్యమని ఈ సంవత్సరం ప్రకటించింది. అయితే విప్లవకారులు 25 ఏండ్ల నుండి ఇదే లక్ష్యాన్ని ఘోషిస్తున్నారు. ఈ లక్ష్యసాధన కోసమే పోరాడుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెసు సరియైన మార్గాన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతుందని ఆశిద్దాం !

విప్లవకారులు ఏవో చిట్టిపొట్టి సంస్కరణలను ఆశిస్తున్నారనడం ఘోరమైన అన్యాయం. మేము సంస్కరణలను ఎన్నటికీ కోరము. సమూలంగా వ్యవస్థను మార్చటమే మా లక్ష్యం. చిట్టిపొట్టి సంస్కరణల ఆశ బ్రిటీషు ప్రభుత్వం మా కెన్నటికీ చూపలేదు ! అలాంటి ఆశల్ని, తమ చెప్పుచేతల్లో ఉండి, భారత ప్రజల్ని అణచడానికి తమకు సహకరిస్తారని విశ్వసించిన కాంగ్రెస్ నాయకులకే చూపిస్తోంది. కాంగ్రెసు బ్రిటీషు వారిని కోరిన హోంరూల్, స్వాయత్తశాసనం, బాధ్యతాయుత స్వాయత్తశాసనం, పూర్ణబాధ్యతాయుత స్వాయత్తశాసనం, ఉపనివేశ స్వరాజ్యం - ఇవన్నీ విదేశ దాస్యానికి మారుపేరులు. ఈ సంస్కరణలను విప్లవకారులు ఎన్నడూ ఆశించలేదు. మా లక్ష్యమూ, మేము కోరేందీ పూర్ణ స్వాతంత్ర్యమే ! ఆ ఆదర్శంతోనే విప్లవకారులు బలి అవుతున్నారు !

ప్రజల జాగృతికి కారణం సహాయ నిరాకరణోద్యమమూ, అహింసా వ్రతం అని గాంధీగారి ఉద్దేశం. ఇది కేవలం భ్రమ. ప్రజల్లో చైతన్యం పోరాటంవల్లే వస్తుంది. రష్యా ప్రజలు పోరాటంవల్లే చైతన్యవంతులయ్యారు; అహింస వల్ల కాదు ! నిజం చెప్పాలంటే, అహింస మాటున, కాంగ్రెస్ యొక్క దళారి రాజకీయాలు, సహాయ నిరాకరణోద్యమాన్ని కూడా నీరు కార్చేశాయి. రాజకీయాల్లో అహింస అనేది ఒక కొత్త ప్రయోగం. ఇది ఎక్కడా సఫలతను పొందినట్లు చూడం ! అహింసాత్మక రాజకీయాల ద్వారా ఒక సంవత్సరంలో స్వాతంత్ర్యాన్ని పొందుతామన్న ప్రతిజ్ఞ హాస్యాస్పదమే అయింది ! బార్డోలీ రైతుల ఉద్యమాన్ని ఈ అహింసే నీరు కార్చేసింది. ప్రతిచోటా ఈ విధంగా అపజయాన్ని పొందిన ఈ అహింసాత్మక రాజకీయాలు, ప్రజల సౌభాగ్యాన్ని బలిపెట్టడమే కాకుండా, ప్రజలను మోసగించాయని కూడా అనవచ్చును.

గాంధీగారు, విప్లవకారుల పట్ల సహానుభూతిని కనపర్చవద్దని, వారికి ఎలాంటి సహాయమూ చేయవద్దని ప్రజలకు చెప్పారు. ప్రజల భావాలను అవగతం చేసుకోగలనన్న గర్వం గాంధీగారికి ఉంది. ఇన్ని కోట్ల మంది ప్రజల భావాలను అవగతం చేసుకోగలిగిన గాంధీగారు, విప్లవకారుల భావాలను అర్థం చేసుకోలేకపోవడం విచిత్రం ! విప్లవకారులు తమ దేశంకోసం ప్రాణాలకు తెగించి పోరాడతారు. జయకారాలను గానీ, మెప్పుకోలును పొందాలని గాని వారికుండదు. తమ దేశ ప్రజల కోసం, తమ ఆదర్శం కోసం నిందలనూ సహిస్తారు, కష్టాలనూ ఎదుర్కొంటారు. విప్లవకారులు నూటికి నూరుపాళ్ళు త్యాగమూర్తులు. అలాంటి వారిని ప్రజలు గుర్తించకుండా ఉండటం, సానుభూతిని కనపర్చకుండా ఉండటం అసంభవం.

మేము యువకులకూ, రైతు కూలీలకూ, మేధావులకూ ఓ విన్నపం చేస్తున్నాం. స్వాతంత్ర్య పోరాటంలో మాతో చేతులు కలపండి. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా జరిగే అన్ని దోపిడీలనూ నిరోధించి, వినూత్న సమాజాన్ని సృష్టిద్దాం !

అహింస పేరుతో సాగుతున్న దళారి రాజకీయాలను తన్ని పారేయండి. అహింస పేరుతో విదేశీ దాస్యానికి తలవంచినన్నాళ్ళూ, మన సంస్కృతీ సభ్యతలూ, మనదేశ గౌరవమూ బుగ్గిపాలవుతాయి! విప్లవం వర్ధిల్లాలి !

కర్తార్ సింగ్,
అధ్యక్షుడు,
హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్.

ఇది 'బాంబు దర్శనం' యొక్క సంక్షిప్త అనువాదం. ఈ కరపత్రం ఇంగ్లీషులో నన్నని టైపులో 4 ఫుల్‌స్కేప్ కాగితాల్లో వెలువడ్డది. దీన్ని వ్రాయడానికి అచ్చువేయించడానికి చాలా రోజులు పట్టింది. అచ్చు వేసే ఏర్పాట్లన్నింటినీ ఆజాద్ చూసుకున్నాడు. విప్లవ కార్యక్రమాలు విస్తారంగా సాగాలంటే స్వంత ప్రెస్ ఉండటం అవసరం అని ఆజాద్‌కు తెలుసు. అవసరమైన సాహిత్యాన్ని కావలసినంత రహస్యంగా అచ్చు వేసే ఏర్పాట్లను ఆజాద్ చేశాడు. విప్లవానికి బాంబు ఫ్యాక్టరీ ఎంత ముఖ్యమో ప్రెస్ కూడా అంతే ముఖ్యమని ఆజాద్ ఉద్దేశ్యం. అప్పట్లో మా కరపత్రాలను కాన్పూరులో అచ్చు వేయిస్తూ ఉండేవారం.

మేము అమీనాబాద్‌లోని యింట్లోనే ఉన్నాం. యింట్లో అన్నం వండుకునేవారం కాదు. ఆజాద్, భగవతీచరణ్ - 'గుయిన్‌రోడ్'లో వున్న 'శుద్ధమహావీర్ హిందూ హోటల్'ల్లో భోంచేస్తూ ఉండేవారు. నేను అక్కడికి వెళ్ళేవాడిని కాదు. నా జీర్ణశక్తి సరిగా లేకపోవడం వల్ల అక్కడి భోజనం సరిపడేది కాదు. పైగా ఆ హోటల్‌లో పీటల మీద భాశనపట్టు వేసుకు కూర్చుని భోంచేయాలి. ప్యాంటు వేసుకునే నాకు అలా కూర్చోవడానికి యిబ్బందిగా వుండేది. నాకు ధోవతులా లేవు ! నేనొక ముస్లిం హోటల్‌కు వెళ్ళి, రొట్టె వెన్న తెచ్చుకునేవాడిని. పావుసేరు టమాటాలు తెచ్చుకునేవాడిని. టీ పెట్టుకోవడానికి చిన్న స్టౌని కొన్నాము. ఆ రోజుల్లో విదేశాల నుండి వచ్చే పాల డబ్బాలు కూడా చాలా చౌకగా ఉండేవి. నేను డబ్బాలోంచి పాలపిండిని వంచుకునే వాడిని. అది తీగెలు తీగెలుగా ధార కట్టేది.

దాన్ని చూసి ఆజాద్ ముఖం చిట్లించేవాడు. "ఛీ ! ఛీ ! ఏమిటి, నీ తిండి ?" అనేవాడు.

ఒకరోజున నేనొక రొట్టుముక్కకు పాలపిండిని రాచి ఆజాద్‌ను తినమని బలవంతం చేశాను. అతడు "వద్దు వద్దు" అంటూనే అయిష్టంగా ఆ ముక్కను తిన్నాడు. తరువాత కండ్లు పెద్దవి చేసి "భలే, పొట్టిగా ! ఇదారుచి, ఇందుకా నీవు ఈ పాలపిండిని మరిగావు !" అంటూ డబ్బా మొత్తం ఖాళీ చేశాడు. ఆ తరువాత నేను ఎప్పుడు కొత్త పాలడబ్బా తెచ్చినా, ఆజాద్ నా చేతుల్లోంచి దాన్ని వడపీక్కుని "రా బాబూ భాయీ ! మిఠాయి తిందాంరా !" అంటూ భగవతీచరణ్‌ని పిలిచేవాడు. ఇద్దరు బ్రాహ్మణులూ డబ్బాను ఖాళీ చేసేవారు. ఇద్దరికీ తీపి అంటే చాలా యిష్టం.

1930వ సంవత్సరం. జనవరి నెల. మూడవ వారం. ఆజాద్ విప్లవ సంఘు కార్యకర్త లందరికీ ఓ సమావేశాన్ని కాన్పూర్‌లో ఏర్పాటు చేశాడు. ఈ సమావేశం యొక్క ఉద్దేశ్యం కొత్త కేంద్ర కమిటీని ఎన్నుకుని, ప్రాంతీయ కార్యకర్తలకు కొత్త బాధ్యతలను వప్పజెప్పాలని ! ఇది 'రామ్‌నారాయణ్ బజార్'లోని ఓ మేడ పై అంతస్థులో జరిగింది. మేడ పురాతనమైంది. కరెంటు లేదు. ఆజాద్ మమ్ముల్ని లక్నోనుండి సాయంత్రం బండిలో తీసుకొచ్చాడు. యిరుకైన మెట్లదగ్గర విశ్వాసపాత్రులైన ఇద్దరు మిత్రులు రివాల్వర్‌లు పుచ్చుకుని కాపలా కాస్తున్నారు. ఈ సమావేశంలో పాల్గొన్నవారిలో ఆజాద్, భగవతీచరణ్, వీరభద్ర, కైలాసపతి, నేను - కాక మరో పెద్ద మనిషి కూడా ఉన్నాడు. ఆయనను చూస్తూనే నేను గుర్తుపట్టాను. ఆయన మరెవరో కాదు. ఇప్పుడు యు.పి. సోషలిస్ట్ పార్టీలోని ప్రముఖ నాయకులు సేఠ్ దామోదర స్వరూప్‌గారు ! సేఠ్‌గారు నన్నూ గుర్తుపట్టారు.

సేఠ్‌గారు నాకు పూర్వపరిచయులే ! వారి పరిచయ గాధ విచిత్రమైంది. బహుశా 1926వ సంవత్సరం అనుకుంటాను. ఆనందస్వామి (కృష్ణలాల్) డెహ్రాడూన్ మంసూరీలకు మధ్యనున్న రాజపుర్ అనే గ్రామంలో వున్నారు ! ఆ వూళ్ళో డాక్టర్ కేశవచంద్రశాస్త్రిగారు అనే గృహస్తు ఒకరు

వున్నారు. వారి ఆస్పత్రికి పక్కనే కొన్ని బ్యారక్కులు ఖాళీగా వున్నాయి. వాటిలో ఆనందస్వామి 'శక్తి ఆశ్రమం' అని ఒక ఆశ్రమాన్ని పెట్టారు. దానిలో యువకులకు వ్యాయామాన్ని నేర్పడంతోపాటు, జాతీయ భావాలను బోధిస్తూ వుండేవారు. నన్ను అక్కడికి పిలిపించారు. నేను యువకులకు సస్తీపట్లు- అవీ నేర్పుతూండేవాడిని. లోపాయికారీగా విప్లవ కార్యక్రమాన్ని ప్రచారం చేస్తూ వుండేవాడిని.

డాక్టర్ శాస్త్రి ప్రకృతి చికిత్సకులు. సాధారణంగా వారి రోగులు బాగా ఫీజు చెల్లించుకోగల ధనికులై యుండేవారు. అయితే, వారి దగ్గరున్న రోగుల్లో ఒకరోగి మాత్రం ఉచితంగా వైద్యం చేయించు కుంటున్నాడు. డాక్టర్ సానుభూతి కారణంగా, ఆ రోగి దగ్గర డబ్బు తీసుకోకుండా వైద్యం చేస్తున్నాడు. ఆ రోగి విప్లవకారుడు. అతడు కాకోరీ కుట్ర కేసులో ముద్దాయి సేఠ్ దామోదర్ స్వరూప్ ! కేసు జరుగుతుండగా సేఠ్‌గారు అసాధ్యంగా జబ్బు పడ్డారు. డాక్టర్లు లాభంలేదు, బతకడు అనేశారు. ప్రభుత్వం వదిలిపెట్టేసింది. ఆ స్థితిలో డాక్టర్ శాస్త్రి, సేఠ్‌గార్ని వైద్యం చేయడానికి తన దగ్గరకు తెచ్చుకున్నారు.

శాస్త్రిగారి హాస్పిటల్‌లోని ఒకరోగి విప్లవకారుడని తెలిసి నేను చూడడానికి వెళ్ళాను. సేఠ్‌గారు మంచంలో ఉన్నారు. ఎముకల గూడులా ఉన్నారు. లేచి కూర్చోవటం మాట అటుంచి, పక్కకు వత్తిగిలాలన్నా మరొకరు సహాయం చేయవలసిందే ! వారికి ఏమీ అరిగేది కాదు. చెంచా తోటి పళ్ళరసమో, పాలను విరగ్గొట్టి, ఆ నీళ్ళో పోసేవారు. అవీ అరిగేవి కావు. సేఠ్‌గారు విప్లవకారులు కావడం వల్ల, వారిమీది గౌరవంకొద్దీ, కొంత వారి బాధను చూసి జాలికలిగి నా తీరిక సమయాల్లో వారికి ఉపచర్యలు చేస్తూ వుండేవాడిని !

నాకంటే ముందునుంచి ఓ అమెరికన్ స్త్రీ సేఠ్‌గారికి సేవ చేస్తూ ఉన్నది. ఆమె పేరు మిసెస్ ఫ్రేడాదాస్. డాక్టరు శాస్త్రిగారికి ఒక అతిథి వున్నాడు. ఆయన ఒడియా దేశపు జమీందారు. అతని పేరు దాసు. ఆ దాసు ధర్మపత్ని ఫ్రేడాదాస్ ! సేఠ్‌గారు పడే బాధను చూసినప్పుడు ఫ్రేడా దాస్ చాలా దుఃఖపడేది. ఆమె సేఠ్‌గారు విప్లవకారులని తెలిసి, జైలు జీవితాన్ని గడిపారని తెలిసి వారిని ఎంతో గౌరవిస్తూ ఉండేది. ఏ సంకోచమూ లేకుండా రోజూ సేఠ్‌గారి శరీరాన్ని వేడినీళ్ళతో కడిగి తుడిచేది. ఎప్పుడూ పడుకుని ఉండడం వల్ల సేఠ్‌గారి వీపంతా పుండయి పోయింది. ఆ పుండుకు పౌడరు అద్దేది. రెండు పూట్లా పక్క శుభ్రం చేసేది. బట్టలు మార్చేది. ఆమెలోని సేవాభావాన్ని చూసి చుట్టప్రక్కల ప్రజలు ఆమెను 'కరుణామయి అయిన మాతృమూర్తి'గా భావించి గౌరవిస్తూ వుండేవారు.

ఒకరోజున 'శక్తి ఆశ్రమం' తరపున ఓ చిన్న సభ జరిగింది. ఆ సభలో కొందరు మిసెస్ ఫ్రేడాదాసు యొక్క సేవాభావాన్నీ, ఆమెకు భారతదేశం పట్లగల స్నేహభావాన్నీ పొగిడారు.

డాక్టర్ శాస్త్రిగారి ధర్మపత్ని కూడా అమెరికా దేశస్థురాలే ! ఆమె చెల్లెలి పేరు మవేల్. మరునాటి నుండి మిసెస్ శాస్త్రి, మవేల్ యిద్దరూ తామూ సేఠ్‌గారికి సేవ చేయడం ప్రారంభించారు. కొత్తగా సేవ చేయడానికి వచ్చారేమో, ప్రథమ ఉత్సాహంలో మిసెస్ ఫ్రుడాదాస్‌ను తమకు ప్రతిద్వంద్విగా భావించారు. ఫ్రేడా వుద్దేశ్యం వేరు. 'సేవ చెయ్యడం ప్రారంభించానుగదా, చివరంటా నా చేతిమీదుగానే సేవ జరిగితే బాగుంటుంది' అని ఆమె అంటుంది. కానీ, మిసెస్ శాస్త్రి ఉద్దేశ్యం, ఆమె చెల్లెలి ఉద్దేశ్యం వేరు. 'ఈ పుణ్యకార్యాన్ని మేమే చెయ్యాలి' అని వారంటారు. వీరి పోటీ చిలికి చిలికి గాలివాన అయింది. ఈ రగడలో నేనూ కొంత చిక్కుకున్నాను. మిసెస్ శాస్త్రి, ఆమె చెల్లెలు మవేల్, గంటల తరబడి సేఠ్‌గారి దగ్గర కూర్చుని సేవ చేసేవారు. వారితో మిసెస్ శాస్త్రి "మీరు మా అతిథులు. నా భర్త మీకు వైద్యం చేస్తున్నాడు. కనుక మరొకరిచేత మీరు సేవ చేయించుకోవడం బాగుండదు." అనేది.

నేనూ తరచు సేఠ్‌గారి దగ్గరే ఉంటూ ఉండేవాడిని. వాళ్ళు నాకూ చెప్పసాగారు. "ఆమె చాలా కృతఘ్నురాలు. కాకపోతే, మా యింట్లో ఉంటూ, మా అతిథికి సేవ చేసుకోవడానికి, మాకే అవకాశాన్ని ఇవ్వదా ? వీరికి సేవచేసే అధికారమూ, బాధ్యతా మాది. వీరికి సేవచేసి ఆ గౌరవాన్ని, పుణ్యాన్ని తను కొట్టేయ్యాలని చూస్తున్నది ఫ్రేడా ! నువ్వు సేఠ్‌గారికీ మిత్రుడివి, మాకూ మిత్రుడివి ! కనుక, వీరికి సేవ చెయ్యడానికి ఫ్రేడాను రానివ్వకుండా ఉండటం నీ కర్తవ్యం కూడాను !" అనేవారు.

మరోవైపు నుండి ఫ్రేడా తన బాధను నాకు చెప్పుకునేది. "ఈ స్త్రీలకు రోగిమీద ఏమాత్రం సానుభూతి లేదు. పైగా రోగికి సేవ చేసే విధానమూ వీరికి తెలియదు. నేను నర్సుపని నేర్చుకున్నాను. నర్సు ట్రైనింగ్ ప్యాసయ్యాను. నా దగ్గర సర్టిఫికేట్ కూడా ఉంది. నాకేదో గౌరవం లభిస్తుందన్న ఈర్ష్యతో వీళ్ళు ఇలా మాట్లాడుతున్నారు. నాకు గౌరవం అవసరం లేదు. ఒక రోగికి, అందులోనూ, తన దేశంకోసం పోరాడి ఆరోగ్యాన్ని కోల్పోయిన రోగికి సేవ చెయ్యడం నా కర్తవ్యం అనుకుంటున్నాను. నువ్వు సేఠ్‌గారి మిత్రుడివి. ఆ యిద్దరు స్త్రీలకూ "సేఠ్‌గారి సేవలోకి రావద్దని చెప్పడం నీ కర్తవ్యం !" అనేది.

సేఠ్‌గారు ఈ పోట్లాటతో మానసికంగా బాధపడసాగారు. శరీరంలోని బాధలు కొంచెం శమించి, కాసేపు కన్ను మూద్దామనుకుంటే, ఈ ముగ్గురు పోటీదారులు వచ్చి ఆయన దగ్గర కూర్చుని కబుర్లు ప్రారంభించేవారు. దీనితో సేఠ్‌గారికి విశ్రాంతే దుర్లభమైంది. నేను ఎవరి పక్షానా ఉండేవాడిని కాదు. ఎవరికీ చెప్పలేకపోయేవాడిని. ఎవరితోటీ విరోధం తెచ్చుకోవడము నా కిష్టం లేదు. సేఠ్‌గారు కూడా ఈ రెండు పక్షాల్లోనూ ఎవరికీ చెప్పలేకుండా ఉన్నారు. రోజురోజుకూ పోటీ పెరిగిపోతున్నది. ఎప్పుడైనా మరీ భరించలేకపోతే, సేఠ్‌గారు నాతో ఇలా అనేవారు. "నేను నిముషాలు లెక్కపెట్టుకుంటున్నాను. ఈ మవేల్ నాతో ప్రణయలీలలు సాగిస్తూ ఉంది. నాకు ఎప్పుడు నయమవుతుందా, ఎప్పుడు పెళ్ళి చేసుకుందామా అని చూస్తున్నదట ! పాపం ఫ్రేడా నన్ను పసిబిడ్డలా చూసుకుంది. ఎప్పుడైనా ఒకమాటు నుదురును ముద్దుపెట్టుకునేది. ఈ దయ్యం ప్రొద్దుకూకులూ ఊపిరాడకుండా ముద్దుపెట్టుకుంటూనే ఉంటుంది. తల తిరుగుతూంది. అసలే రోగంతో చస్తున్నాను. ఇదొకటి వచ్చిపడ్డది !"

ఈ రెండు పక్షాలకూ పోట్లాట బాగా పెరిగిపోయింది. చివరకు ఫ్రేడా ఓడిపోయింది. మిసెస్ శాస్త్రి విసిరిన చివరి పాచిక బాగా పారింది. 'నా భర్త సేఠ్‌గారికి బాగా వైద్యం చేస్తున్నారు. కాని ఫ్రేడా కావాలని అపథ్యం పెట్టి, సేఠ్‌గారి ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నది. మా మీద ద్వేషం కొద్దీ' అని ప్రచారం ప్రారంభించింది. ఈ ప్రచారం ముందు ఫ్రేడా తల వంచేసింది.

ఫ్రేడా గుండెరాయి చేసుకుంది. సేఠ్‌గారి గదిలోకైనా పోగూడదని ప్రతిజ్ఞ చేసుకుంది. శాస్త్రిగారి యింట్లో నుంచి వెళ్ళిపోయి హోటల్‌లో ఉండసాగింది. ఎంత ప్రతిజ్ఞ చేసుకున్నా తన అభిమానానికీ, ఆదరణకూ పాత్రుడైన సేఠ్‌గారి క్షేమాన్ని తెల్సుకోకుండా ఉండలేకపోయేది ! నన్ను తన దగ్గరకు పిలిపించుకుని, సేఠ్‌గారి ఆరోగ్యాన్ని గురించి అడిగి తెల్సుకుంటూ ఉండేది. కొందరికి ఈ అమెరికన్ స్త్రీల వైషమ్యానికి కారణం అర్థమయ్యేది కాదు. కాని ప్రజల దృష్టిలో 'గొప్ప' అనిపించుకోవాలనే ప్రవృత్తే ఈ పోటీకి, వైషమ్యానికి కారణం.

ఫ్రేడా రాకపోవడం సేఠ్‌గారికీ బాధగానే వుండేది. సేఠ్‌గారు ఫ్రేడాను గురించి నన్ను అడుగుతూ ఉండేవారు. ఒక్కొక్కప్పుడు ఆమెను పిలుచుకు రమ్మని చెబుతూండేవారు.

ఒకరోజున మవేల్ 'నేను ఫ్రేడాను సమర్థిస్తున్నానని' అన్నది. అన్న పద్ధతి నన్ను బాగా ఇరుకున పెట్టింది. మవేల్ వయస్సెంతో నాకు తెలియదు. తెలుసుకోవడానికి నేను ప్రయత్నించనూలేదు. చూట్టానికి మాత్రం నవ యువతిలా ఉండేది. అంగసౌష్టవం - ముక్కూ, ముఖమూ బాగుండేది.

ముఖాన స్ఫోటకం మచ్చలున్నాయి. ఐనా, పౌడరు దళసరిగా కొట్టడం వల్ల, అవి కనిపించేవి కావు. అప్పుడప్పుడూ షికారుకు పిలుచుకు వెళ్ళుతూండేది. ఆమెతో తిరగడం నాకూ యిష్టమే ! నేను ఫ్రేడా పక్షాన ఉన్నానని కోపగించుకుంటూ ఇలా అన్నది, ఒక రోజున "నేను నిన్ను ఎంతో ప్రేమిస్తున్నాను. నువ్వు మాత్రం నా శత్రువుకే సహాయం చేస్తున్నావు. ఇంక ఇలా చేసేట్టయితే, నేను నీతో షికారుకు రాను !" అన్నది.

మవేల్ ఇలా అనడం నాకేమీ నచ్చలేదు. ఆమెకు ఫ్రేడాతో మాట్లాడనని మాట యివ్వడం తగదు. అలాగని మవేల్‌ని విరోధం చేసుకోవడమూ నాకు నచ్చలేదు. చాలా యిరుకున పడ్డాను. ఎలాగరా ఈ సమస్య పరిష్కారం అవడమని చాలాసేపు ఆలోచించాను. మరునాడు సమస్య తనకు తానై పరిష్కరింపబడ్డది. ఫ్రేడా రాజపూర్ నుండి వెళ్ళిపోయింది. అప్పుడే ప్రేమవతి తండ్రి చనిపోయినట్లు నాకు టెలిగ్రాం వచ్చింది. నేనూ అక్కడి నుండి వచ్చేశాను. తరువాత ఒకటి రెండుమార్లు సేఠ్‌గారి ఆరోగ్యాన్ని తెలుపవలసిందని ఆనందస్వామికి జాబులు వేశాను. అంతే ... ఇంక ఆ విషయాన్నే మర్చిపోయాను. దాదాపు నాలుగేళ్ళ తరువాత సేఠ్‌గారిని ఆ సమావేశంలో చూశాను. ఆయన మృత్యువుతో పోరాడి బ్రతికారు.

ఆ సమావేశానికి సేఠ్‌గారు రావడమంటే మళ్ళీ జైలుకో, ఉరిశిక్షకో సిద్ధపడ్డాడన్న మాటే ! తరువాత తెలిసింది. సేఠ్‌గారు అనుభవజ్ఞులు గావడం వల్ల మా ఉద్యమానికి తన సహాయ సహకారాలను యిస్తారేమోనని, ఆజాద్ వారిని బలవంతాన తీసుకొచ్చాడు. మా ఉద్యమంలో మళ్ళీ వారెన్నడూ కనపడలేదు.

కాన్పూరులో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమైన అనేక విషయాల మీద నిర్ణయం తీసుకోవడం జరిగింది. సమావేశానికి ముందే మేము ఆజాద్‌తో కొన్ని విషయాలు మాట్లాడాము. మా విప్లవ సంఘానికి అనుబంధంగా, సిద్ధాంత దృష్టితో పనిచేసే, విశ్వాసపాత్రులైన మిత్రులతో, ఓ ఉద్యమాన్ని నిర్మించడం అవసరమను కున్నాము. యీ ఉద్యమంలోని మిత్రులు విప్లవ సంఘానికి సైన్యాన్ని సమకూర్చడానికీ, విప్లవ సంఘ కార్యక్రమాలను ప్రజల్లో ప్రచారం చేయడానికీ తోడ్పడాలి. రైతు కూలీల్లోనూ, ప్రభుత్వ ఉద్యోగుల్లోనూ, విద్యార్థుల్లోనూ సమావేశాలను జరిపి విప్లవం పట్ల వారి సానుభూతిని కూడగట్టుకోవాలనుకున్నాం. విప్లవం పట్ల ప్రజల్లో వున్న దురూహలను తొలగించడం అవసరమే ! ఈ పనిని అనుబంధ ఉద్యమం నిర్వహించాలని మా ఉద్దేశ్యం !

సేఠ్ దామోదర స్వరూప్‌గారిని పోలీసులు బాగా ఎరుగుదురు. ఆయన ఆరోగ్యమూ అంత మంచిది కాదు. కనుక, రహస్య జీవితాన్ని ఆయన గడపలేదు. అయితే, రహస్యోద్యమంలో పాల్గొనకుండా బాహాటంగా రహస్యోద్యమానికి సహాయం చేయవచ్చును. ఉదాహరణకు : విద్యావంతుల్లో ప్రచారం చేసి విప్లవోద్యమం కోసం ధనాన్ని సంపాయించవచ్చును. సేఠ్‌గారి విప్లవ జీవితాన్ని గురించి అందరికీ తెలుసు గనుక, విప్లవం పేరుమీద డబ్బు సంపాదించుకు తినడానికి వచ్చాడని ఎవ్వరూ అనుకోరు !

అనుబంధ సంస్థను వారికి వప్పగించుదామనే ఉద్దేశ్యంతో సేఠ్‌గారిని యీ సమావేశానికి తీసుకురావడం జరిగింది. ఈ అనుబంధ సంస్థ కార్యక్రమం - విప్లవ సాహిత్యాన్ని ప్రచారం చేయడం, డబ్బు ప్రోగు చేయడం, సాయుధ పోరాటానికి సిద్ధపడేట్లు యువకులను తయారు చేయడం ! భయ్యా ఆజాద్ మరోమాట కూడా అన్నాడు. "సేఠ్‌గారికి ప్రమాదం లేకుండా వుండడానికి, అనుబంధ సంస్థను సాధ్యమైనంత వరకు విప్లవోద్యమానికి సంబంధం లేకుండా వుంచడం మంచిది."

సేర్‌గారి వయస్సునూ, వారి అనుభవాన్నీ, వారు పడ్డ బాధల్నీ దృష్టిలో వుంచుకుని వారిని 'హి.స.ప్ర.స.'కు అధ్యక్షుణ్ణి చేద్దామనుకున్నాడు ఆజాద్. 1928 నుండి ఆజాద్ 'హి.స.ప్ర.స.'కు అధ్యక్షుడూ, కమాండర్ ఇన్ చీఫ్‌గా కూడా ఉంటున్నాడు ! ఈ రెండు పదవుల వల్లా ఆజాద్‌కు వ్యక్తిగతమైన లాభం ఏమీలేదు. అయినప్పటికీ, మా విప్లవ సంఘంలో అతడి వ్యక్తిగత ఆధిపత్యానికి కొంత అవకాశం కలుగుతూన్నది. ఆజాద్ తాను స్వయంగా దామోదర స్వరూప్‌గారిని అధ్యక్షుణ్ణి చేయాలన్న తీర్మానాన్ని ప్రతిపాదించాడు. సిద్ధాంతాలను ప్రచారం చేయడంలోనూ, ఇతరుల భావాలను తనవైపు తిప్పుకోవడంలోనూ, తనకు అటే నేర్పులేదని ఆజాద్ స్పష్టంగా చెప్పాడు. ఆజాద్ యొక్క యీ ప్రతిపాదన వల్ల అతడిలోని నిస్వార్థత ద్యోతకం అవుతూంది. ఆజాద్ ఎప్పుడూ తన వ్యక్తిత్వం కంటే విప్లవ సంఘ ఆదర్శమే ముఖ్యమైందనుకునేవాడు.

విప్లవసంఘ అనుశాసనాన్ని, రహస్యాలనూ కాపాడుకోవడానికి, సాయుధ శాఖనూ, ప్రచార శాఖనూ వేరు చేయడం అవసరం. అలా వేరు చేసినప్పటికీ రెండు శాఖలకు అవినాభావ సంబంధం ఉండడానికి, రెండింటికీ కలిపి, జనరల్ సెక్రటరీగా భగవతీభాయిని నియమించడం జరిగంది ! భగవతీభాయి, అధ్యక్షుడికీ, (దామోదర స్వరూప్) కమాండ్ ఇన్ చీఫ్‌కీ (ఆజాద్) సంబంధాన్ని కలుపుతూ, ఇద్దరికీ సెక్రటరీగా పనిచేస్తాడు. సేర్‌గారూ, ఆజాద్, భగవతీచరణ్ - వీళ్ళు ముగ్గురూ శాశ్వత కమిటీగా ఏర్పడతారు. ఈ కమిటీ ద్వారానే ప్రాంతీయ సంఘాల పరస్పర సంబంధాలు ఏర్పడుతూ ఉంటాయి. యు.పి.కి వీరభద్రతివారీని కార్యకర్తగా నియమించారు. ఢిల్లీకి కైలాసపతి, పంజాబుకు నేను బెంగాల్ విప్లవ సంఘం 'హి.స.ప్ర.స.'తో సంబంధాన్ని తప్పక ఏర్పర్చుకుంటుందని వీరభద్రతివారి చెప్పాడు. మహారాష్ట్ర నుండి కూడా కొందరు సభ్యులు 'హి.స.ప్ర.స.'లో జేరతారని ఆజాద్ అన్నాడు.

సాయుధ పోరాటాన్ని ప్రోత్సాహకరంగా నడపడానికి స్వంత ప్రెస్ ఉండడం అవసరం. ప్రెస్ ఉండాలి అంటే డబ్బు అవసరం. సాధ్యమైనంత వరకు డబ్బును సానుభూతి గల ప్రజల వద్దనుండే వసూలు చేయాలని విప్లవ సంఘం అనుకుంటూన్నది. ప్రజల్లో విప్లవసంఘం పట్ల సానుభూతి గల వారి సంఖ్యే స్వల్పం. సానుభూతి పరుల్ని పెంచుకుని వారి నుండి డబ్బు వసూలు చేయడానికి కొంత కాలం పడుతుంది. కనుక ప్రస్తుతానికి దోపిడీ చేయక తప్పదనుకున్నాము ! అందుకు అవసరమైన బాధ్యతలన్నింటినీ ఆజాద్‌కు యివ్వడం జరిగింది.

వీరభద్రతివారి మరో రకమైన అభిప్రాయాన్ని యిచ్చాడు. "సాయుధ పోరాటంలో పాల్గొనేవారు, అక్కడికక్కడ, చనిపోవడమో, అరెస్టు కావడమో జరుగుతూ వుంటుంది. అలాంటి స్థితిలో, ప్రాంతీయ కార్యకర్తలు పోరాటంలో పాల్గొనడం వల్ల, ప్రాంతానికి, కేంద్రానికి ఉన్న సంబంధాలు, ఎప్పటికప్పుడు దెబ్బతినే ప్రమాదం ఉంది. అలాంటి యిబ్బంది కలగకుండా ఉండటానికి, ప్రాంతీయ కార్యకర్తలు సాయుధ పోరాటాలకు సూత్రధారులుగా ఉండవచ్చును. కాని, వారు వ్యక్తిగతంగా సాయుధ పోరాటాల్లో పాల్గొనరాదు." అన్నాడు.

నేను పై అభిప్రాయాన్ని వ్యతిరేకించాను. "పోరాటంలో ప్రాంతీయ కార్యకర్త పాల్గొనకపోతే, ఇతర సభ్యుల్లోనూ పిరికితనం పాదుకునే ప్రమాదం ఉంది. విప్లవ సంఘంలోకి, కొత్తగా వచ్చిన సభ్యులు, నాయకుడు పాల్గొనని పక్షంలో, పోరాటం సంభవించినప్పుడు ఆత్మరక్షణకే తహతహలాడుతారు. కేంద్రానికీ, ప్రాంతీయ సంఘాలకూ సంబంధాలను స్థిరపరచడానికి, శాశ్వత కమిటీలోని ముగ్గురు సభ్యులే చాలు !" అన్నాను.

కైలాసపతి, వీరభద్ర తివారిని సమర్థించాడు. నేను, భగవతీచరణ్, ఆజాద్ మేము ముగ్గురం వ్యతిరేకించాము. ఒకరకంగా సమస్యను పరిష్కరించాం. సేర్‌గారిని మినహాయించి, మిగిలిన

సభ్యుల్లోని ప్రతి ఒక్కడూ, కనీసం, మూడుసార్లయినా సాయుధ పోరాటంలో పాల్గొనాలి ! అలా పాల్గొన్న సభ్యుడు ఇక సాయుధ పోరాటంలో పాల్గొనకపోయినా ఫరవాలేదు. లేకపోతే, ఏ సభ్యుడయినా పరిశిక్షకు యోగ్యమైన కార్యక్రమాన్ని నిర్వహించి, అతడి అవసరం సెంట్రల్ కమిటీకి అనివార్యం అనుకున్నప్పుడు, అతడిక సాయుధ పోరాటంలో పాల్గొననవసరం వుండదు. మొత్తం మీద, ఏ సభ్యుడైనా సాయుధ కార్యక్రమంలో పాల్గొనడం గానీ, మానడం గానీ అతడి యిష్టం మీద ఆధారపడి వుండదు. ఆ విషయాన్ని విప్లవ సంఘం నిర్ణయిస్తుంది. యీ సమావేశంలోనే 'బాంబు దర్శనం' కరపత్రాల్ని ఉత్తర భారతదేశం అంతటిలోనూ అంటే, బెంగాల్, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్‌లో పంచడానికి నిర్ణయం జరిగింది. తమ తమ ప్రాంతాల్లో కరపత్రాలను పంచే బాధ్యత ప్రాంతీయ కార్యకర్తలకు యివ్వబడింది.

సమావేశం ముగిసింది. నేనిక లాహోరులోనే వుండటం అవుసరం. ఇంద్రపాల్‌ని లక్నో పిలిపించాము. లాహోరులో పట్నానికి పెడగా, ఒక యింటిని అద్దెకు తీసుకోవలసిందని, అతడికి చెప్పి పంపించాం. అతడితోపాటే పంజాబులో పంచవలసిన 'బాంబు దర్శనం' కరపత్రాలను లాహోరు పంపించేశాం. వాటిని నాతోపాటైనా తీసుకు వెళ్ళవచ్చును. అయితే, దారిలో పోలీసులు నన్ను గుర్తించితే, ఇంత శ్రమపడి అచ్చు వేయించిన కరపత్రాలు పలామాలు అవుతాయి ! లాహోరులో నేను దాదాపు 20 సంవత్సరాలు వున్నాను. అక్కడ నన్ను చాలామంది ఎరిగి ఉన్నారు. కనుక, కరపత్రాలు నావెంట తీసుకువెళ్ళడం తగదు అనుకున్నాము.

ఇంద్రపాల్ లక్నో వచ్చినప్పుడు, విలువైన మంచి సూటు వేసుకుని వచ్చాడు.

"ఇంత ఖరీదైన సూటు ఎక్కడిది ?" అడిగాం అతణ్ణి.

తనకు మొన్ననే పెళ్ళయిందని చెప్పాడు అతడు.

మేము చాలా ఆశ్చర్యపడ్డాం. "నువ్వు విప్లవకారుడివి. ప్రమాదం ఎప్పుడూ నీడలా నిన్ను వెంటాడుతూనే వుంటుంది. అలాంటప్పుడు యీ పెళ్ళి వల్ల ప్రయోజనం ఏమిటి ? ఒకవేళ, పిల్లను నీవు ప్రేమించి, ఆమె మనస్తత్వాన్ని నీవు ఎరిగుండి, నిర్భయంగా నీ ఆదర్శానికి తోడ్పడేదైతే కొంతవరకూ ఫరవాలేదు. ఈ వివాహం వల్ల, అలాంటిదీ సంభవము కాదు గదా ?" అని అడిగాం.

ఇంద్రపాల్ "వెనకే ప్రధానం జరిగింది. నేను పెళ్ళిని వాయిదా వేస్తుండడం వల్ల యింట్లో పెద్దవాళ్ళకు అనుమానం ఎక్కువవుతూన్నది. యింట్లో ఇదొక పెద్ద సమస్యగా తయారైంది. పెళ్ళయిందే అనుకో, అయినా వచ్చిన నష్టం ఏముంది ? యీ వివాహం వల్ల నేను విప్లవ సంఘ కార్యక్రమాలకు పనికిరాని వాణ్ణి మాత్రం ఎలా అవుతాను ? జీతపురాళ్ళను ఆశించే సైనికులు వివాహం చేసుకోవడం లేదా ? వాళ్ళు యుద్ధాల్లోకి మాత్రం వెళ్ళడం లేదా ? వివాహం సైనికుల్ని బలహీన పర్చనప్పుడు, విప్లవకారుల్ని ఎలా బలహీనపరచగలదు ? 30 రూపాయిల జీతం కోసం, తుపాకులకు గుండెను ఎదురొడ్డే సైనికులకంటే, మనం ఆదర్శవంతులము కామా ?" అన్నాడు.

ఇంద్రపాల్ యొక్క పై తర్కాన్ని విని మేము మౌనాన్ని వహించాము. భగవతీచరణ్ అతడి మాటలకు ముగ్ధుడయ్యాడు. ఇలా అన్నాడు "He is a Jewel".

ఇంద్రపాల్ తను రైల్లో వస్తున్నప్పుడు జరిగిన ఒక సంఘటనను గురించి చెప్పాడు. రైల్లో ఇంద్రపాల్ కొత్త సూటు వేసుకుని ప్రయాణం చేశాడు. ఒక పెద్ద మనిషి అతడితో ఇంగ్లీషులో మాట్లాడడం ప్రారంభించాడు. ఇంద్రపాల్ తనకు ఇంగ్లీషు రాదని చెప్పాడు. అవతలి పెద్దమనిషి ఆశ్చర్యపడ్డాడు. 'ఏ డిపార్టుమెంటులో పని చేస్తున్నారు ?' అని ఇంద్రపాల్‌ని అడిగాడు అతడు.

ఇంద్రపాల్ "నేను కలంకూలి చేసుకునే వ్రాయసగాణ్ణి !" అన్నాడు.

పెద్దమనిషి చిరునవ్వు నవ్వి మౌనంగా ఉండిపోయాడు.

పై విషయాన్ని విని, "నీవు అలా సూటువేసుకుని ప్రయాణం చేయడం తగదని" ఇంద్రపాల్‌తో అన్నాము. అతడికి మా మాటలు రుచించలేదు. అభ్యంతరాన్ని చెప్పాడు. "ఇంగ్లీషు రాకపోయినంత మాత్రాన సూటు వేసుకోవడం తగదా ? ఇంగ్లీషువాళ్ళే సూటు వేసుకోవాల్నా ? ఇది మనకు ఇంగ్లీషువాళ్ళ నుండి లభించిన భావ దాస్యం కాదా ?" అన్నాడు.

"అధికారాన్నీ, సిద్ధాంతాన్నీ గురించి కాదు మేము చెప్పడం. ఆ మాటకు వస్తే, ఎవరికి యిష్టమైన డ్రస్సు వారు వేసుకునే అధికారం ఉంది ! కానీ నువ్విలా వ్యవహరించడం తగదు. నీ వేషం, నిన్ను యితరులు అనుమానించేట్టుగా ఉండకూడదు. నిన్నిలా అడిగినతను ఒకవేళ సి.ఐ.డి. కూడా కావచ్చును గదా ? నీ వేషానికీ, నీ వృత్తికీ, భాషకూ అతక్కపోయేసరికి, అతడు నిన్ను అనుమానించి ఎక్కడనుంచి వస్తున్నావో, ఎక్కడికి వెళ్ళుతున్నావో కనిపెట్టవచ్చును ! మనం ఓ అసాధ్యమైన పనిని సాధించడానికి కంకణం కుట్టుకున్నాం. అలాంటప్పుడు మనకు యిష్టమున్నా లేకపోయినా మనల్ని గాలించే సి.ఐ.డి.లకు, యితర్లకు అనుమానం కలగని విధంగానే వేషాన్ని వెయ్యాలి. అలాంటి భాషనే మాట్లాడాలి !" అన్నాము.

ఇంత చెప్పినా ఇంద్రపాల్‌కు నా తర్కం రుచించలేదు. అప్పుడు నేను శిథిల సత్రంలోని సంఘటనను జ్ఞాపకం చేశాను. "ఆనాడు నేను కానిస్టేబుల్ ముందు బీదకోమటిలా అభినయించక, ఆత్మాభిమానాన్ని ప్రదర్శిస్తే, ఏమయ్యేది ? మనం జీవితమంతా అనుశాసనాన్నే పాటిస్తూ ఉండాలి." అన్నాను.

అప్పటికి ఇంద్రపాల్‌కు నా తర్కం అర్థమైంది. అతడు నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని "ఇప్పుడర్థమైంది." అన్నాడు.

పరారీలో ఉన్న రోజుల్లోనూ, జైలు నుంచి విడుదలయ్యాకనూ, ఇప్పటికీ నన్ను కొందరు అడుగుతూ ఉంటారు. "పోలీసులు మిమ్మల్ని ఎలా పోల్చుకోలేకపొయ్యేవారు ? పోలీసులకు చిక్కకుండా మీరెలా తప్పించు కునేవారు ?" అని.

పోలీసులకు అనుమానం కలగకుండా తప్పించుకోవడానికి, మన యదార్థస్థితి బైటపడకుండా ఉండేట్టు వ్యవహరించడం ఒకటే మార్గం !

లాహోరులో మేము చెప్పినట్లు ఇంద్రపాల్ ఓ యింటిని అద్దెకు తీసుకున్నాడు. ఆ యిల్లు కృష్ణనగర్‌లో పాత గవర్నమెంటు ప్రెస్సుకు ఎదురుగా ఉండేది. అప్పటికి కృష్ణనగర్ కొత్తగా కడుతున్న పేట. అక్కడక్కడ మాత్రమే యిళ్ళున్నాయి. జనసంచారమూ, సందడీ తక్కువగా ఉండేది. ఆ ఆవరణలో రెండే యిళ్ళున్నాయి. ఒకదాంట్లో యింటి యజమానురాలుండేది. ఆమె విధవరాలు. రెండవ యింటిని ఇంద్రపాల్ మా కోసం అద్దెకు తీసుకున్నాడు.

నేనాయింటికి రాత్రిపూట వచ్చాను. తెల్లవారి నిద్రలేచి పరిసరాన్ని కలయ జూస్తున్నాను. యింటి యజమానురాలు గేదెకు కుడితి పెడుతున్నది. ఆమెను చూస్తూనే గుర్తు పట్టేశాను. ఆమె పేరు ధనదేవి. చనిపోయిన ఆమె భర్త పేరు లాలా భగత్ రామ్‌పురీ. భగత్‌రామ్ ఆర్యసమాజ నాయకులలో ఒకరు ! ప్రసిద్ధులు ! మాకూ వీరికీ బాగా పరిచయం వుంది. నేను భగత్‌రామ్‌గారిని మామ అనీ, ఈ ధనదేవిని అత్త అని పిలచేవాడిని.

నేను పరారీలో ఉన్నానని ధనదేవికి తెలుసు. నన్ను చూస్తే గుర్తు పడుతుంది. నేను అక్కడ ఉన్నట్టు వెళ్ళి మా అమ్మకు చెప్తుంది. కనుక నేను ఆమె కంట పడకుండా ఉండడానికి చాలా జాగ్రత్త

తీసుకుంటున్నాను. పగటి పూట యింట్లో నుంచి బయటికి వెళ్ళేవాడిని కాను. ప్రొద్దుక్రుంకాక గానీ, లేకపోతే, తెల్లవారు జామున గానీ బయటకు వెళ్ళిపోయేవాడిని ! అలా వెళ్ళేప్పుడు ఆమె వాకిలి ముందునుంచే వెళ్ళవలసి వచ్చేది. ముఖం ఒక ప్రక్కకు తిప్పుకుని, ఇంద్రపాల్‌ని చాటు చేసుకుని వెళ్ళుతూండేవాడిని. దుస్తుల్నా ఆమె గుర్తు పట్టడానికి వీల్లేని విధంగా మార్చేశాను.

పంజాబు దేశంలోని వివిధ ప్రాంతాల్లోనూ 'బాంబు దర్శనం' కరపత్రాలను ఏ యిబ్బందీ లేకుండా పంచేశాం. ఈ కార్యక్రమాన్ని ధన్వంతరీ, యహసాన్ ఇలాహీ, ఫజల్ - మొదలుగా గల నవజవాన్ భారత సభ యువకులు సమర్థవంతంగా నిర్వహించారు. అయితే పశ్చిమోత్తర సరిహద్దు ప్రాంతంలో కరపత్రాలను పంచడం ఒక సమస్య అయింది. అక్కడ ప్రభుత్వ దమన నీతి కొంచెం అధికంగానే ఉంటుంది. అయినప్పటికీ వెనక మేము కొందరు మిత్రుల్ని ఆ ప్రదేశాలకు పంపాము.

సుఖదేవ్ తాను అరెస్టు కాకముందే హంస్‌రాజ్ బోహరా అనే యువకుణ్ణి రావల్పిండి పంపాడు. జయగోపాల్‌ని కోహాట్ సమీపంలోని ఓ సరిహద్దు గ్రామానికి పంపాడు. అవుసరమైతే, అక్కడ నుంచి సరిహద్దును దాటడం చాలా సుళువు. అయితే, పై ఇద్దరు మిత్రులు అరెస్టయి ప్రభుత్వ సాక్షులుగా మారిపోయారు. మళ్ళీ అక్కడకు కొత్త మిత్రుల్ని పంపించి పరిచయాల్ని ఏర్పర్చుకోవడం అవసరం. వెనక ఓ మాటు ఇంద్రపాల్ రావల్పిండి వెళ్ళి వచ్చాడు. ఈ మాటు నేనూ అతనూ కలసి రావల్పిండి వెళ్ళాలనుకున్నాం.

రావల్పిండిలో ఇంద్రపాల్ వెనుకటి తన పరిచయుల్ని కలుసుకున్నాడు. వైస్రాయి ట్రైను కింద బాంబు పేల్చాక అక్కడి మిత్రులకు మా మీద అమితమైన విశ్వాసం జనించింది. కరపత్రాలు పంచడానికి ఎలాంటి అభ్యంతరమూ కలగలేదు. ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న కొందరు మిత్రులతో, స్థానిక విప్లవ సంఘాన్నొకదాన్ని స్థాపించాము. ప్రమాదకరమైన విప్లవ కార్యక్రమాల వైపు యువకుల్ని ప్రోత్సహించడం ఒక పెద్ద సమస్యగా ఉంటుంది. అయితే, ఒక్కోప్పుడు యువకుల ఉత్సాహాన్ని అదుపులో పెట్టడమూ సమస్య అయి కూర్చుంటుంది. పై రెండు రకాలవారి వల్ల ప్రమాదం సంభవించే పరిస్థితి ఎప్పుడూ ఉంటుంది. పిరికివాళ్ళు సమయానికి వెనక్కు తగ్గుతారు. పోలీసులకు దొరికితే, ప్రభుత్వ సాక్షులై ఇతర మిత్రుల్ని పట్టిస్తారు. అధికమైన ఉత్సాహం గల మిత్రులు, అనవసరంగా ఇతరుల దృష్టికి ఎక్కి, ఆపదలను కొని తెచ్చుకుని తాము మునుగుతూ ఇతర మిత్రుల్ని ముంచుతారు. రావల్పిండిలో ఈ రెండోరకం మిత్రులే దొరికారు మాకు.

'బాంబు దర్శనం' కరపత్రాలను అంతటా పంచేశాం. ఈ సందర్భంగా ఒక్కరూ అరెస్టు గాకపోవడంతో ప్రజలకు మా విప్లవ సంఘం పట్ల శ్రద్ధాసక్తులు ఎక్కువయ్యాయి. చదువుకున్నవారికీ, మధ్య తరగతి మేధావులకూ మా కరపత్రంలోని తర్కం బాగా నచ్చింది. పైగా ఒకే రోజున, ఒకే సమయాన అన్ని చోట్లా కరపత్రం ఒకేమారు, పంచబడటంతో ప్రజలు బాగా ప్రభావితులయ్యారు. మా విప్లవ సంఘానికి శాఖలు దేశమంతటా ఉన్నాయనుకున్నారు. ప్రజలకు రాజకీయ పార్టీల సిద్ధాంతాలు నచ్చినప్పటికీ, ఆ పార్టీలు కొంత సమర్థవంతంగా ఉంటేనే, వాటికి చేయూత నిస్తారు. వివిధ ప్రదేశాల్లోనూ కరపత్రాలను ఒకే సమయానికి ఎలా పంచామో ఇప్పుడు చెప్పడం వల్ల నష్టం లేదు. కొన్ని చోట్ల మిత్రుల ద్వారా పంచాం. కొన్ని చోట్ల, మేమే తెల్లవారు జామున లేచి, రెండు మూడు గ్రామాల్లో కరపత్రాలు పడేస్తూ వెళ్ళాం. ఈ కరపత్రాలు పంచాక పరప్రభుత్వం మీద విప్లవకారులు చేసే కొత్త దాడుల కోసం ప్రజలు ఉత్సాహంగా ఎదురు చూడసాగారు.

# భగత్సింగ్‌నూ, దత్తునూ - జైలు నుంచి విడిపించే ప్రయత్నంలో

కాన్పూర్ సమావేశంలో ముందుగా లాహోర్ కుట్ర కేసులోని ఖైదీలను విడిపించడానికి ప్రయత్నించాలన్న నిర్ణయం జరిగింది. మేము ఆజాద్‌కు, హంస్‌రాజ్ 'మూర్ఛాగ్యాస్'ను గురించి, విరుగుడు మందును గురించి చెప్పాము. మాలాగానే ఆజాద్ కూడా నమ్మాడు. అతడికీ మంచి ఉత్సాహం కలిగింది. జైలునుండి గానీ, కోర్టు నుండి గానీ ఖైదీలందరినీ విడిపించి తెచ్చుకోవచ్చు అనుకున్నాం. హంస్‌రాజ్ నుండి 'మూర్ఛాగ్యాస్'ను సంపాయించి ఖైదీలను విడిపించడానికి ఓ ప్లాను వేయవలసిందని నాకు చెప్పాడు ఆజాద్ !

'మూర్ఛాగ్యాస్' ను తీసుకురావడానికి ఇంద్రపాల్ లాయల్పూరు వెళ్ళాడు. అతడు వట్టి చేతులతోనే తిరిగి వచ్చాడు. కొన్ని వస్తువులు దొరక్కపోవడం వల్ల గ్యాస్ తయారు కాలేదని చెప్పాడు. ఆ గ్యాస్‌ను తయారు చేయడానికి కొకైన్ కావాలన్నాడు హంస్‌రాజ్ !

కొకైన్‌కీ, ఈ గ్యాస్‌కూ సంబంధమేమిటో నాకు బోధపడలేదు. అయితే, హంస్‌రాజ్ మాటలు ఏవీ బోధపడవు కదా ! తర్కంతో పనిలేకుండా అతడు చెప్పింది నమ్మడమే ! నేను యింట్లోనుంచి బయటకు వచ్చేవాడిని కాదు. అవుసరమైన పనులు చేసిపెట్టడానికి మిత్రులో, సహచరులో ఎటూ ఉండనే ఉన్నారు. దుర్గాబాభీ, ధన్వంతరీ, ఎహసాన్ ఇలాహీ వెనుకటి నుంచీ ఉన్నవారే ! ఇప్పుడు కొత్తగా ధర్మపాల్, ప్రేమ్, విశ్వంభర్, సుఖదేవరాజ్ వీరూ తయారయ్యారు. నేను ధర్వంతరీని పిలిపించి "మన సైంటిస్టుకు (హంస్‌రాజ్) కొకైన్ కావాలిట !" అన్నాను.

ధన్వంతరీతోపాటు సుఖదేవ్‌రాజు కూడా వచ్చాడు. ఇద్దరూ పకలపడి నవ్వారు. "మీ సైంటిస్టు కొకైన్ తింటాడా ఏమిటి ?" అని అడిగారు.

అప్పటివరకూ మా సైంటిస్టు ఎవరో వాళ్ళుకు తెలియదు. కొకైన్‌తో ఏమి తయారు చేస్తాడో కూడా వాళ్ళకు తెలియదు. హంస్‌రాజ్ పేరు బైటపడకుండా ఉండడానికి మిత్రుల దగ్గర అతడి పేరు ఎత్తేవాళ్ళము కాదు. 'సైంటిస్టు' అనే చెప్పుకునే వాళ్ళం.

ధన్వంతరీకి, సుఖదేవ్‌రాజుకూ విప్లవసంఘపు పని కోసమే కొకైన్ అవుసరమని చెప్పాను. "ఒకవేళ తింటాడూ, తిననీ ! మనకేం ? మన పని చేసిపెడితే, అతడు ఎంతతిన్నా తెచ్చి పెడదాం !" అన్నాను నేను.

ధన్వంతరీ కొకైన్ పిచ్చిగాళ్ళతో మాట్లాడడం వల్ల వచ్చే అపకీర్తికి కూడా వెరవకుండా ఎలాగో దాన్ని సంపాదించాడు.

ఇంద్రపాల్ కొకైన్ తీసుకుని లాయల్పూరు వెళ్ళాడు. తిరిగి వచ్చి ఒక వారం రోజుల్లో గ్యాస్ తయారవుతుంది అని చెప్పాడు. వారం రోజుల తరువాత గ్యాసును తీసుకురావడానికి మళ్ళీ లాయల్పూర్ వెళ్ళాడు. వట్టి చేతులతో తిరిగి వచ్చాడు. "మనం యిచ్చిన కొకైన్ మంచిది కాదుట. అందువల్ల మంచి గ్యాస్ తయారుకాలేదు. పైగా, అతడి ఇతర పదార్థాలు కూడా చెడిపోయాయిట ! వైజ్ఞానికుల ప్రయోగశాలల్లో ఉండేటటువంటి, శుద్ధమైన కొకైన్ కావాలిట" అని కూడా చెప్పాడు ఇంద్రపాల్.

'లాయల్పూరులోని ఎగ్రికల్చరల్ కాలేజీ లేబరేటరీలో, అలాంటి కొకైన్ వున్నదనీ, దాన్ని తను దొంగిలించబోతున్నాననీ, హంస్‌రాజ్ ఇంద్రపాల్‌కు చెప్పాడట ! మేము చాలా ఆదుర్దాగా మూర్ఛాగ్యాస్ కోసం ఎదురు చూస్తున్నాము.

లాహోర్‌లో దుర్గాబాభీ, ధన్వంతరీ పోగుచేసిన డబ్బులతోనే మా ఖర్చులు గడుస్తున్నాయి. సోదరి ప్రేమవతి రెండు మూడు నెలల క్రితం బాగా జబ్బుపడడం వల్ల లాహోర్ నుండి కాంగడా వెళ్ళిపోయింది. చాలా రోజులుగా ఆమెకు జ్వరం వస్తున్నది. జ్వరాన్ని నిర్లక్ష్యం చేసేసరికి క్షయరోగంలోకి దింపింది. కాంగడా కొండగాలికి ఆరోగ్యం కొంత కుదుట పడుతుందేమోనన్న ఉద్దేశ్యంతో, అక్కడకు తీసుకువెళ్ళారు. ఆమె అయిష్టంగానే వెళ్ళింది. మంచంలో ఉండి కూడా ఎప్పుడూ విప్లవ సంఘాన్ని గురించే ఆలోచించేది. త్వరలోనే ఆమె జీవితం ముగిసిపోయింది.

జబ్బులో ఉండగా ఒకమాటు ధర్మపాల్ కాంగడా వెళ్ళి ఆమెను చూసి వచ్చాడు. ధర్మపాల్‌తో ఆమె విప్లవ సంఘాన్ని గురించీ, విప్లవ సంఘ సభ్యుల్ని గురించీ చాలాసేపు మాట్లాడింది. ప్రమవతి కాంగడా వెళ్ళడానికి ముందు తనకు విశ్వాసపాత్రులైన ఇద్దరు శిష్యురాండ్రనూ, ఒక శిష్యుణ్ణీ దుర్గాబాభీకి పరిచయం చేసింది. శిష్యురాండ్ర పేర్లు, ప్రకాశవతీ కపూర్, విమల ! శిష్యుడి పేరు ప్రేమ్‌నాథ్ ! విమల, ప్రేమ్‌నాథ్ ఇద్దరూ అన్నా చెల్లెళ్ళు. ప్రకాశవతి విప్లవసంఘం కోసం ఇంట్లోనించి దొంగిలించి డబ్బుతెచ్చి యిస్తూండేది, ప్రేమవతికి ! ప్రకాశవతి యింటికి పెద్దకూతురు కావడం వల్ల, తాళం చెవులు ఆమె చేతికిస్తూ ఉండేది తల్లి ! యినుప పెట్టెలో నుంచి డబ్బుకాజేసి విప్లవసంఘానికి యిస్తూండేది తను! ఒక్కోప్పుడు నగలనూ పట్టుకొచ్చి యిచ్చేది ! ప్రేమవతి లాహోర్‌లో ఉన్నన్నాళ్ళూ, ఆమె ద్వారానే విప్లవ సంఘానికి డబ్బు అందిస్తూ వుండేది ప్రకాశవతి ! ప్రేమవతి కాంగడా వెళ్ళాక ప్రేమనాథ్ ద్వారా నేరుగా నాకే డబ్బు పంపించసాగింది. ప్రకాశవతి, విమల పార్టీ సానుభూతిపరులని నాకు తెలుసును. అయితే, అంతవరకూ నేను వారిని చూడలేదు.

ఆర్థికబాధలు ఎటూ ఉండనే వున్నాయి. అయినప్పటికీ, వాళ్ళనడిగీ, వీళ్ళనడిగీ నాలుగు డబ్బులు అధికంగానే పోగుచేస్తున్నాము. అయితే, వెనకటి కంటే ఖర్చులు పెరిగిపోయాయి. పార్టీ అవసరాలు పెరిగిపోయాయి. దోపిడీచేయడం నాకిష్టంలేదు. ఇంద్రపాల్‌తో తరచు ఆర్థిక బాధను గురించి మాట్లాడుతూ ఉండేవాడిని. ఒకరోజున అతడిలా అన్నాడు. "మనం దొగనోట్లు ఎందుకు అచ్చు వేయకూడదు ?" ఇంద్రపాల్ పరిచయుల్లో దొంగనోట్లు వేయడం తెల్సిన అతడు ఒకడున్నాడు ! నిజంగా దొంగనోట్లు వేయడమే జరిగితే, ఒక పెద్ద సమస్య తీరిపోతుంది. దోపిడీ చేయవలసిన బాధ తప్పుతుంది. దోపిడీ చేయడం నాకూ యిష్టంలేదు. భగవతీచరణ్‌కూ యిష్టంలేదు. యిష్టం లేకపోవడానికి కారణం, విప్లవ కారులు దోపిడీలు చేయడం వల్ల ప్రజల దృష్టిలో పల్చబడతారు !

ఒకరోజున ఇంద్రపాల్ గులాబ్‌సింగ్‌ను నా దగ్గరకు తీసుకొచ్చాడు. అతడు 'రూపాయి బిళ్ళను అచ్చు వేసే మూసను తయారు చేసుకుని, మూడు లోహాల మిశ్రమంతో రూపాయిలను అచ్చువేయవచ్చు'నని చెప్పాడు. అతడు అచ్చువేసిన ఒక రూపాయిని నాకు చూపించాడు. అది మంచి రూపాయిలాగానే మ్రోగింది. అయితే, రూపాయి ఆకారం అంత బాగాలేదు. చూడగానే అనుమానం కలిగేటట్లుగా ఉంది. ఐనా, ఆకారాన్ని సరిచేయడం పెద్ద సమస్య కాదు. ఆ బాధ్యతను భాగ్‌రామ్ తీసుకోగలడు. నేను భాగ్‌రామ్‌ని పిలిపించి గులాబ్‌సింగ్‌కు పరిచయం చేశాను. ఈ ప్రయత్నంలో డబ్బూ బాగా నలిగింది. మనుష్యులమూ శ్రమపడ్డాం. సమయమూ వ్యర్థమైంది. ప్రయోజనం మాత్రం ఏమీ కలగలేదు !

ఇంద్రపాల్ అరెస్టయ్యాక ప్రభుత్వసాక్షి అయినట్టు కొంత నాటకమాడాడు. అప్పుడు ఈ దొంగ రూపాయిలను ముద్రించడానికి ప్రయత్నించిన విషయాన్నీ పోలీసులకు చెప్పాడు. నేను పరారీలో ఉండగా, ప్రభుత్వం నా మీద మోపిన నేరాల్లో ఇదీ ఒకటయింది ! దొంగ రూపాయిలను ముద్ర వేయడమనేది పెద్ద అపరాధమే ! ఖూనీకేసంత బలమైందే ఇదీను ! ప్రభుత్వ మనుగడకు

సంబంధించింది కావడం వల్ల దీన్ని ఇంత ఘోరమైన అపరాధంగా పరిగణించడం చాలా అవసరం. దొంగ రూపాయిలు అచ్చువేయడం వల్ల రూపాయిలు అచ్చువేసే ప్రభుత్వ గుత్త అధికారానికి దెబ్బ తగులుతుంది ! పైగా, ప్రభుత్వ ఆర్థిక విధానాన్ని తల్లక్రిందులు చేయడమూ జరుగుతుంది ! ఏమైనా కానీ దోపిడీలూ, హత్యల కంటే మా దృష్టిలో దొంగనోట్లు వేయడమే నయం. దొంగ రూపాయిలు ముద్రవేస్తే ప్రభుత్వం ఘోరమైన శిక్షలు విధిస్తుందని మాకు తెలుసు. ఉరికొయ్యకు వేలాడడానికే సిద్ధపడ్డ మాకు, శిక్షల్లో కఠినమేమిటి, తేలికేమిటి ?

హంస్‌రాజ్ 'మూర్ఛాగ్యాస్' యిస్తాడన్న ఆశలో మరి రెండు నెలలు గడిచాయి. మరోమాటూ ఇంద్రపాల్‌ని, సుఖదేవ్‌రాజుని లాయల్పూరు పంపించాము. వాళ్ళతో 'హంస్‌రాజు వెంట వెళ్ళి కాలేజీలో కొకైన్ ఎక్కడుందో చూసి, దొంగిలించి తెచ్చి యివ్వవలసింది' అని చెప్పి పంపించాను. ఇంద్రపాల్, సుఖదేవరాజ్ - హంస్‌రాజ్‌తో కలసి పగటిపూట కాలేజీకి వెళ్ళారు. కొకైన్ ఎక్కడుందో చూసి వచ్చారు. ఆ రాత్రి దాన్ని దొంగలించడానికి కాలేజీలో జొరబడ్డారు. మా ప్రాణానికి కొకైన్ హనుమంతుడు తెచ్చిన సంజీవి అయింది ! ఈ కొకైన్‌తో జైలు నుంచి మా మిత్రుల్ని విడిపించుకోవడానికీ, బ్రిటీషు ప్రభుత్వపు అహంకారాన్ని మంట కలపడానికీ కలలు కంటున్నాం ! అప్పటికింకా హంస్‌రాజ్ యొక్క మూర్ఛాగ్యాసు మీద మాకు ఉన్న గుడ్డి నమ్మకం ఏ మాత్రం సళ్ళు వదల లేదు !

ఇంద్రపాల్, సుఖదేవరాజ్ - గాజు అద్దాల్ని కోసే చిన్న రంపాన్ని వెంట తీసుకెళ్ళారు. ఎగ్రికల్చరల్ కాలేజి వరండా లోంచి, కిటికీ అద్దాలను కోసి, గదిలోకి జొరబడ్డారు. అక్కడ బీరువా ఉంది. ఆ బీరువా అద్దాన్ని రంపంతో కోసి, కొకైన్ సీసాను తీసుకురావాలి. అంత ఆలస్యాన్ని భరించలేకనో, తన ప్రతాపాన్ని చూపడానికో సుఖదేవ్‌రాజ్ అలమారా అద్దాన్ని కొయ్యకుండా, ఏదో వస్తువు తీసుకుని దాన్ని పగులగొట్టాడు. క్రితంరోజు హంస్‌రాజ్ చూపించిన కొకైన్ బాటిల్‌ని జేబులో వేసుకున్నాడు. వాళ్ళు కిటికీలోనుంచి బైటపడ్డారో లేదో, ప్రమాదాన్ని సూచిస్తూ కాలేజీ గంట మోగింది ! సుఖదేవ్‌రాజ్ అలమారా అద్దాన్ని పగలగొట్టిన శబ్దానికి నైట్‌వాచర్ లేచాడు. ఇంకేముంది ! ఇంద్రపాల్, సుఖదేవ్‌రాజ్ ఇద్దరూ కాలేజీ తోటలోకి పరుగెత్తి ముళ్ళకంచెల్నీ, ముళ్ళ తీగెల్నీ దాటుతూ ఎలాగో పట్టుబడకుండా తప్పించుకున్నారు. సుఖదేవ్‌రాజ్ యొక్క ఈ తొందరపాటుతనం, విప్లవసంఘంలోని అతడి చర్యలకు భూమికలాంటిది. అతడిలోని ఈ తొందరపాటు ప్రవృత్తి వల్ల విప్లవసంఘు సభ్యులమైన మేము అనేక బాధలకు గురి అయ్యాము !

ఎంతో కష్టపడి దొంగిలించిన సీసాను హంస్‌రాజ్‌కిచ్చారు. అతడు పెదవి విరిచాడు. "నేను చూపించిన సీసా ఇది కాదు. పొరపాటు పడ్డారు !" అన్నాడు. హంస్‌రాజ్ చూపించిన అరలో తెల్లని పదార్థంతో నిండి ఉన్న ఒకే రకమైన సీసాలు చాలా ఉన్నాయి. వాటిమీద పదార్థాల పేర్లు లేవు. నంబర్లున్నాయి. ఇంక అప్పుడేం చేసేట్టు ? ఇంద్రపాల్ సుఖదేవ్‌రాజ్ ఇద్దరూ హంస్‌రాజ్‌ను బతిమిలాడారు. "నీకు కావలసిన పదార్థమేమిటో చెప్పు ! లాహోర్‌లో దొరక్కపోతే, కలకత్తాలోనో, బొంబాయిలోనో సంపాయించుకొస్తాము. పోనీ, కొకైన్‌లో నీకు పనికివచ్చే ఆ ప్రత్యేకమైన రకం పేరేమిటో చెప్పు ! ఎక్కడో ఒకచోట సంపాయిస్తాము" అన్నారు.

చివరకు హంస్‌రాజ్ 'మూర్ఛాగ్యాస్' తయారు చేయడానికి అవసరమైన పదార్థం పేరు చెప్పాడు. "లిక్రిస్ పౌడర్ !"

అతడికవసరమైన పదార్థం పేరు తెలియడంతో, ఎలాగైనా సంపాయించి పెడదామన్న ఉత్సాహం నాకూ కలిగింది. ధన్వంతరీని పిలిపించి "కొంచెం లిక్విస్ పౌడరు తెచ్చి పెట్టు. మూర్ఛాగ్యాస్ తయారు చేయడానికి అవసరమట" అన్నాను. ధర్వంతరీ లాహోర్ ఆయుర్వేద కాలేజీలో వైద్యశాస్త్ర

పరీక్ష పాసయ్యాడు. అతడికి ఎల్లోపతి మందులతోనూ పరిచయముంది. ధన్వంతరీ పెద్దగా నవ్వాడు. "భలే బాగుంది ! లిక్రిస్ పౌడరుతో మూర్ఛాగ్యాస్ తయారవుతుందా ? ఇది చాలా సాధారణమైన పదార్థం. ఎంత కావాలో చెప్పు తెచ్చిపెడతాను ?" అన్నాడు. సరే ! హంస్‌రాజ్‌కు లిక్రిస్ పౌడర్‌కూడా పంపించాం.

'మూర్ఛాగ్యాస్' తీసుకురావడానికి ఇంద్రపాల్ మళ్ళీ లాయల్పూరు వెళ్ళాడు. వట్టి చేతులతో లాహోరు తిరిగి వచ్చాడు. "అతడు ఏమీ తయారు చేయడు." అని చివరిమాట చెప్పేశాడు.

హంస్‌రాజ్ ఇలా మోసం చేయడంతో ఇంద్రపాల్‌కు కోపమొచ్చింది. అతడు ఇలా అన్నాడు. "హంస్‌రాజ్ చేత ఎలాగయినా 'మూర్ఛాగ్యాస్' తయారు చేయించవలసిందే ! వెయ్యో, రెండువేలో కావాలంటే యిచ్చేద్దాం. సంఘానికి డబ్బు లేకపోతే, నా భార్య నగలనమ్మి నేను కొంత సర్దుతాను. మిగిలింది మీరు పోగు చెయ్యండి. అప్పటికీ తయారుచేయనంటాడా ? నేను ఎలాగో మాయబుచ్చి అతడ్ని ఇక్కడకు పట్టుకొస్తాను. ఒక గదిలో కూర్చోబెడదాం. పిస్తోలు చూపిద్దాం. 'చేస్తావా చెయ్యి ! లేకపోతే నీవు అయిపోతావు ! అని చెబుదాం."

ఇంద్రపాల్ చెప్పినట్టు బలవంతం చేయడానికి నేను యిష్టపడలేదు. ఎవరితోటీ అలా ప్రవర్తించడం తగదు. ఇక నాకు అనుమానం వేయసాగింది. 'అసలు హంస్‌రాజ్‌కు మూర్ఛాగ్యాస్ తయారుచేయడం వచ్చునా ? లేక, మాచేత పొగడ్తలు పొందటానికి, వచ్చని చెబుతున్నాడా ?' అని అనుమానించసాగాను.

ఇంద్రపాల్, హంస్‌రాజుతో చాలా మంచిగా వ్యవహరిస్తున్నాడు. అతడిపట్ల భక్తినీ, గౌరవాన్నీ ప్రదర్శిస్తున్నాడు. ఎలాగైనా 'మూర్ఛాగ్యాస్' తయారుచేయడం వచ్చునో, రాదో-కూపీలాగుదాం అనుకుంటున్నాడు. అయితే, హంస్‌రాజ్, ఇంద్రపాల్‌కు రహస్యం చెప్పలేదు సరిగదా, మరో ఎత్తు వేశాడు. ఇలా అన్నాడు ఇంద్రపాల్‌తో "వీళ్ళు ఇలాంటి చిన్న చిన్న వాటి కోసరం నన్ను ప్రమాదాల్లోకి లాగాలని చూస్తున్నారు. ప్రపంచాన్ని ఆశ్చర్యంతో ముంచెత్తే గొప్ప గొప్ప పరిశోధనలు నాకొచ్చు. అలాంటివి తయారుచేసి ఘనకీర్తిని పొందవలసిన నేను ఇలాంటి వాటికోసం జీవితాన్ని పాడుచేసుకుంటానా? వీళ్ళకు ఇప్పుడు నేను గ్యాస్ చేసియిస్తే, అది నేను యిచ్చానని ఎలాగైనా బైటపడుతుంది !" అన్నాడు.

హంస్‌రాజ్ ఇలా మోసం చేయడంతో, ఇంద్రపాల్ కోపం మరీ ఎక్కువైంది. అయితే, అతడికి అద్భుతమైన వైజ్ఞానిక పరిశోధనలు నిజంగానే తెలుసునన్న విశ్వాసమూ అధికమైంది. తనకు చేతనైన పద్ధతిలో హంసరాజ్ మీద పగదీర్చుకోవడానికి ఇంద్రపాల్ ప్రయత్నించాడు కూడాను.

ఆ రోజుల్లోనే బెంగాల్ విప్లవకారులు చిటకాంగ్ శస్త్రాగారం మీద దాడిచేసి ఆయుధాల్ని దోచుకున్నారు. ఈ వార్త లాహోర్ యువకుల మీదా ప్రభావాన్ని వేసింది. లాహోర్‌లోని మాల్‌రోడ్‌లో లార్డు లారెన్స్ విగ్రహం ఒకటుంది. అతడి విగ్రహానికి ఒకచేతిలో కత్తీ, మరో చేతిలో కలమూ వుంది. విగ్రహం క్రింద ఇలా వ్రాసి వుంది. 'Will you be governed Pen or sword ?' ఆ విగ్రహం 1857 విప్లవం తరువాత ప్రతిష్ఠింపబడ్డది. మొత్తం పంజాబు దేశానికే అవమానకరమైన విగ్రహం అది. చదువుకునే రోజుల్లోనూ ఈ విగ్రహాన్ని చూస్తే మాకు వళ్ళు మండుతుండేది. 1919 లో, రౌలెట్ బిల్లు వ్యతిరేకోద్యమంలో ప్రజలు ఆ విగ్రహం మీద దాడిచేసి కత్తినీ కలాన్నీ విరగ్గొట్టేశారు. అప్పటికి గాంధీగారి అహింస కాంగ్రెస్‌ను బుట్టలో వేసుకోలేదు ! ప్రజలు జాతిగౌరవానికి భంగకరమైన ఆ విగ్రహం మీద పెద్ద పెట్టున దాడి చేశారు. విగ్రహాన్నే పడగొట్టాలని ప్రజల ఉద్దేశ్యం. అయితే, ఇంతలో పోలీసులు వచ్చారు. కాల్పులు జరిపి ప్రజలను చెదరగొట్టారు. మొత్తం దేశానికే కళంక చిహ్నమైన ఆ విగ్రహాన్ని పడగొట్టకుండా కాపాడుకున్నారు.

ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించడంతో, ప్రభుత్వానికి కొంచెంగా 'హృదయ పరివర్తన' జరిగింది. ఆ విగ్రహం క్రింద వున్న వాక్యాన్ని ఇలా మార్చింది. "I served you with sword and Pen !"

లాహోర్‌లోని నౌజవాన్ భారత సభ ఆ విగ్రహాన్ని పడగొట్టడానికి మళ్ళీ ఉద్యమాన్ని లేవదీసింది. ప్రజలు కోపోద్రిక్తులై విగ్రహాన్ని పడగొట్టడానికి సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్‌లోని యువకులూ ఈ ఉద్యమంలో పాల్గొని నాయకత్వాన్ని వహిస్తున్నారు. ప్రజలు మాల్‌రోడ్డులో సత్యాగ్రహాన్నీ చేస్తున్నారు. ప్రభుత్వం 'షేర్‌దిల్' పోలీసుల్ని మాల్‌రోడ్డులో కాపలా పెట్టింది. సత్యాగ్రహం చేయడానికి ప్రజలు మాల్‌రోడ్డు వద్దకు రాగానే షేర్ దిల్ పోలీసులు క్రూరంగా కొట్టి తరిమేసేవారు. షేర్ దిల్ పోలీసుల క్రూరత్వం ముందు సత్యాగ్రహులు నిలవలేకపోతున్నారు. ఉద్యమం నీళ్ళుగారి పోతూన్నది.

లాహోర్‌లో సుఖదేవరాజ్ కుటుంబం 'చిడియామారా'లో ఉండేది. అతడు తమ యింట్లో ఉండకుండా ఇంద్రపాల్ దగ్గరకు వచ్చి ఉండసాగాడు. సుఖదేవరాజ్ పరారీలో లేడు. అతడిమీద పోలీసులకు అనుమానమూ లేదు. అతడప్పుడు యిల్లు విడిచి రావడం అనవసరం. అయినా అతడు యిల్లు విడిచిపెట్టి మాలోకి వచ్చి చేరిపోయాడు. ఓ మాటు ధన్వంతరీతోపాటు నేను వుండే యింటికీ వచ్చాడు. అసలు విషయమేమిటంటే, సుఖదేవరాజ్‌కు చదువుమీద యిష్టం లేదు. తమ కుటుంబపు బీదరికాన్ని సహించలేకుండానూ ఉన్నాడు. అందుకే విప్లవసంఘంలోకి వచ్చి చేరిపోయాడు. కొందరు చెడ్డ పిల్లలు బడి ఎగగొట్టి ఊరివాళ్ళ తోటల్లో పడి పచ్చికాయల్ని తెంపిపారేస్తూ ఉంటారు. కేవలం తోట కాపలాదారుని ఏడిపించడానికి ! సుఖదేవరాజ్ ఆ కొంటె పిల్లల్లాంటి మనస్తత్వం కలవాడు !

సుఖదేవరాజ్ ఎప్పుడూ అసంతృప్తిని ప్రకటిస్తూ ఉండేవాడు. "విప్లవసంఘం ఏ పనీ చేయడం లేదు ! ఆ పని చేయవచ్చు ! ఈ పని చేయవచ్చు !" అంటూ ఉండేవాడు.

అప్పట్లో సుఖదేవరాజ్ మంచి ఉత్సాహం గల యువకుడనుకున్నాను. పైగా, చదువుకున్న వాడు. అతడి ఉత్సాహాన్ని చంపడం దేనికని, నేను ఒక చిన్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాను. షేర్‌దిల్ పోలీసుల మీద దాడిచేసి వాళ్ళ దగ్గరున్న తుపాకులు లాక్కునే కార్యక్రమాన్ని నిర్ణయించుకున్నాం. అలా చేయడం వల్ల, విప్లవసంఘానికి ఆయుధాలూ లభిస్తాయి ! ఆంగ్ల ప్రభుత్వపు ప్రతిష్ఠను మంట గలిపినట్టూ అవుతుంది ! ఈ కార్యక్రమానికి సహకరించవలసిందని సుఖదేవరాజ్‌కు చెప్పాను. పంజాబు ప్రభుత్వము విప్లవకారుల్ని అణచడానికి 'షేర్‌దిల్' అనే ప్రత్యేక పోలీసు శాఖ నొకదాన్ని ఏర్పాటు చేసింది. ఈ షేర్‌దిల్ పోలీసులు బాగా బలంగా ఉంటారు. క్రూరులు. అక్షరజ్ఞానం లేనివాళ్ళు. వీళ్ళను తనకు విశ్వాసపాత్రులుగా ఉంచుకోవడానికి మంచి తిండి, మంచి గుడ్డ, మంచి జీతమూ - యిస్తూన్నది ప్రభుత్వం ! వీళ్ళు ఎప్పుడూ నడుముకు రివాల్వర్ కట్టుకుని, తిరుగుతూ ఉంటారు. నా ప్లాను ప్రకారం, ఒక్కొక్క 'షేర్‌దిల్' పోలీసు మీద ఇద్దరేసి మిత్రులు దాడి చేయాలి ! ఒక మిత్రుడు షేర్‌దిల్ పోలీసు సైకిలుకి తన సైకిల్ను ఢీకొట్టి అతడ్ని పడేస్తాడు. రెండవ మిత్రుడు క్రిందపడ్డ వాడి తలకు పిస్తోలు గురిపెట్టి కాల్చి చంపుతాడతడ్ని. అతడి దగ్గర వున్న ఆయుధాన్ని తీసుకుని పరారవుతాడు. ఈ దాడి, లాహోర్‌లోని మారుమూల ప్రదేశాల్లో, అనేకచోట్ల ఒకేసారి, ఒకేరోజున జరగాలి ! ఇలా అయిదారుగురు 'షేర్‌దిల్' పోలీసులను చంపడం వల్ల మిగిలినవాళ్ళు ప్రజలపై అత్యాచారాలు చెయ్యడానికి సాహసించరు!

సుఖదేవ్‌రాజ్ నన్ను మరీ తొందర పెడుతున్నాడు. "మనం తయారవడానికే రోజులు గడచిపోతున్నాయి. నాకు ఒకపిస్తోలు యివ్వు. నే వంటరిగావెళ్ళి ఒక 'షేర్‌దిల్'ని చంపి అతడి పిస్తోలును లాక్కొస్తాను" అనేవాడు.

నేను అతడికి శాంతించమని చెప్పేవాడిని. "నువ్వు ఒకణ్ణి చంపి నందువల్ల ప్రయోజనంలేదు. వెంటనే అధికారులు యిద్దరూ, ముగ్గురూ షేర్ దిల్ పోలీసుల్ని కలిసితిరగమని ఆజ్ఞయిస్తారు. అప్పుడు మనప్లానే దెబ్బతిని పోతుంది. మనం పూర్తిగా సిద్ధపడిగాని కార్యక్రమంలోకి దిగటానికి వీల్లేదు. నీకు చేతులు అంత జిలగావుంటే, ఈలోపు నాలుగు సైకిళ్ళను ప్రోగుచేసే ఉపాయంచూడు." అన్నాను.

ఢిల్లీ నుండి కొన్ని పిస్తోళ్ళురావాలి. వాటికోసం ఎదురుచూస్తున్నాను. ఇంద్రపాల్ దగ్గర రెండు మూడు సైకిళ్ళు వున్నాయి. అవి వాళ్ళ దగ్గర వీళ్ళ దగ్గరతెచ్చి నెంబర్లు మార్చుకున్నవీ, పార్ట్‌లు మార్చుకున్న వీను. వాటినే మేమంతా వాడుతున్నాము. షేర్‌దిల్ కార్యక్రమానికి అవి ఎటూచాలవు. ఇంకా సైకిళ్ళు కావాలి. అందుకే సుఖదేవ్‌రాజ్‌కి సైకిళ్ళ సమస్యను చూసుకొమ్మని చెప్పాను.

మధ్యాహ్న సమయం. సుఖదేవ్‌రాజ్ నాదగ్గరకువచ్చి "వెళదాం పద" అన్నాడు. నేనూ బయల్దేరాను. అతడు నన్ను కాలేజీ ఎదురుగా వున్న కచేరీ మొగదల్లో నిలబడమని చెప్పాడు. అతడేమో కాలేజీ లోపలకు వెళ్ళాడు. రెండు క్షణాలతర్వాత ఓ కొత్త సైకిలును వేసుకుని బైటకొచ్చాడు. ఆ సైకిలును నాచేతికిచ్చి, మళ్ళీ అతడు కాలేజీలోకి వెళ్ళాడు. వెళుతూ "సైకిలు యింట్లోపెట్టి కాలేజీ రెండవగేటు వైపుకు రమ్మన్నాడు" నన్ను. నేను దొంగిలించిన సైకిలును యింటిదగ్గర పెట్టి పాత సైకిలును వేసుకుని అతడు చెప్పినట్టు కాలేజీ రెండవగేటుదగ్గరకు వెళ్ళాను.

నేను గేటుకు కొంచెం పైకివెళ్ళి వెనక్కు తిరిగాను. సుఖదేవ్ రాజ్ మరో కొత్త సైకిలును వేసుకునివస్తూ నాకు ఎదురయ్యాడు గేటు దాటి కొంచెం అవతలికి వెళ్ళాక ఆ సైకిలునూ నా చేతికిచ్చాడు. నేను నా పాత సైకిలును తొక్కుకుంటూ, కొత్త సైకిలును చేత్తోపట్టుకుని యింటికి వెళ్ళాను. సుఖదేవ్‌రాజ్ నన్ను మళ్ళీ రమ్మన్నాడు. ఈ మాటు వచ్చేటప్పుడు, ఇంద్రపాల్‌ని నా సైకిలు వెనక కూర్చోబెట్టుకుని వచ్చాను. ఈమాటు సుఖదేవ్‌రాజ్ ఇంద్రపాల్‌ని కూడా కాలేజీలోపలకు తీసుకు వెళ్ళాడు. కొంచెం సేపటి తరువాత యిద్దరూ సైకిళ్ళమీద బయటకొచ్చేశారు. సుఖదేవ్‌రాజ్ చూపిన ఈ సాహసాన్ని నేనూ కాదనలేకపోయాను. అయితే, అతడి తొందరపాటే నాకు గిట్టేదికాదు. భగవతీభాయి లాహోరు వచ్చాడు. సుఖదేవ్‌రాజ్ యొక్క ఈ సాహసాన్ని గురించి అతడికి చెప్పాను. భగవతీభాయి గద్గదస్వరంతో "He is a Jewel" అన్నాడు.

ఒకరోజున ప్రేమనాథ్ చాలా గాభారపడుతూ నాదగ్గరకువచ్చాడు. కన్నీళ్ళు పెట్టుకుంటున్నాడు. ఇలా అన్నాడు. "ప్రకాశవతి మీకివ్వమని నాచేతికో కవరిచ్చింది. పొరపాటున నేనాకవరును ఎక్కడో పారేశాను. ఆమెదానిలో వెయ్యి రూపాయిల నోటుపెట్టి యిచ్చిందిట".

అదివిని నేను చాలా ఆశ్చర్యపడ్డాను. బాధపడ్డాను. విప్లవసంఘం తనకేదో పెద్దదండనను విధిస్తుందని ప్రేమనాథ్ భయపడుతున్నాడు. నేను అతడికి ధైర్యాన్నిచ్చాను. "నువ్వు దాన్ని వెతకడానికి ప్రయత్నించు దండన మోసానికేగాని, పొరపాటుకు వుండదు. నువ్వు నిజంగా పొరపాటుపడితే, అందుకు బాధపడతాం.కాక మోసంచేసినట్లయితే ఎప్పటికైనా బయటపడుతుంది." అన్నాను.

ఇది జరిగిన రెండు మూడురోజులకు ప్రకాశవతి నన్ను కలుసుకోగోరుతున్నదని ప్రేమనాథ్ వచ్చి చెప్పాడు. నేనంగీకరించాను. ప్రేమనాథ్ ఆమెను తీసుకుని వచ్చాడు. ప్రకాశవతిగారిని అదే నేను మొదటిసారిగా చూడటం బాగాసన్నగా పొట్టిగావుంది. ప్రేమనాథ్ డబ్బు పారేసినందుకు బాధపడ్డది. "నాకంతడబ్బు అదృష్టవశాత్తూ యింట్లో దొరికింది. అలాంటి అవకాశాలు రోజూరావుగదా ?" అన్నది.

ప్రకాశవతి మరో విషయాన్ని గురించి చెప్పింది. "ఇంట్లో ఉంటూ పార్టీపని చేయడం కష్టమైతే, పార్టీలోకి తీసుకునే ఏర్పాట్లుచేస్తానని బేబే (ప్రేమవతి) చెప్పింది. నేను ఇంట్లోవుండడానికి వీల్లేని పరిస్థితులు ఇప్పుడు ఏర్పడ్డాయి. మావాళ్ళు నాకువివాహం చేసెయ్యాలని తొందర పడుతున్నారు. ప్రధానం పెట్టడంకూడా జరిగింది." అన్నది.

ప్రకాశవతిగారితో మొదటిసారి మాట్లాడేప్పుడు ప్రేమనాథ్‌ను దగ్గర వుంచుకున్నాను. ఆడపిల్లలతో ఒంటరిగా మాట్లాడకూడదన్న మధ్యతరగతి మనస్తత్వం అందుకు కారణం. ఆమె యిల్లువిడిచి పార్టీలోకి వచ్చే విషయాన్ని గురించి, తరువాత ప్రేమనాథ్ ద్వారా కబురు పంపుతానని చెప్పాను. ఇలా ప్రకాశవతిగారిని కల్సుకోవడం గురించీ వెయ్యి రూపాయల కాగితం పోవడంగురించీ దుర్గాబాభీకి, ధన్వంతరీకి కూడా చెప్పాను. ఎందుకంటే, బాధ్యత నా ఒక్కడిమీదనే ఉండకుండా విషయం అందరికీ తెలిసివుండడం మంచిదికదా ? అయినప్పటికీ ఈ విషయాన్ని గురించే తరువాత చాలా రభసజరిగింది. సందర్భానుసరించి జరిగిన రభసనూ వివరంగా వర్ణిస్తాను.

దాదాపు ఆ రోజుల్లోనే జరిగిన మరోవిషయాన్ని చెప్పడమూ అవుసరమే అనుకుంటున్నాను. ఒకనాటి మధ్యాహ్న సమయం. నేను ఇంటి వెనకగదిలో ఒంటరిగా కూర్చుని ఏదో చదువుకుంటున్నాను. ఎదురుగా మెల్లావుంది. ప్రహరీగేటు తెరచివున్నది. ఇంద్రపాల్ కోసం ఎదురుచూస్తూ, ఏదో పుస్తకాన్ని చదువుకుంటున్నాను. ప్రహరీ గేటు లోంచి దృష్టి చాలాదూరం వరకు పోతూన్నది. తెరచిన గేటులోంచి, ధనదేవి కోళ్ళు మాటిమాటికీ వాకిట్లోకి వస్తున్నాయి. కోళ్లు వాకిలిని పాడుచేస్తాయనే ఉద్దేశ్యంతో, చిన్నచిన్నరాళ్ళు, మట్టిగడ్డలూ వేసి వాటిని అదిలిస్తున్నాను.

నిమిష నిమిషానికీ అవి రావడం, నేను తోలడం జరుగుతూన్నది. నాకు విసుగూపుట్టింది. కోపమూ వచ్చింది. ఈ మాటు కోళ్ళను అదిలించడానికి దగ్గర మట్టిగడ్డలు కూడా లేవు. చుట్టూ చూశాను. బాగా లావుగా, పొడవుగా ఉన్న మేకు ఒకటి కనిపించింది. ఒకకోడి బాగా గర్వంగా వెన్ను విరుచుకు నడిచి వస్తూన్నది. అది నాకు యిరవై అడుగుల దూరంలో ఉండగానే, గురిచూసి మేకుతో ఒక్కటేశాను. మేకు సరీగా దాని తలకు తగిలింది. కోడికూతా పెట్టలేదు. తన్నుకులాడనూ లేదు. దెబ్బతో చచ్చిపడ్డది.

సరీగా అదే సమయానికి ఇంద్రపాల్ వచ్చాడు. కోడి చచ్చిపడి ఉండడాన్ని చూసి చాలా గాభరాపడ్డాడు. ధనదేవి అసాధ్యురాలు. ఆమె కోడిని చంపి, అక్కడ ఇక మనగలగడం అసంభవం. ఆవిడ పిల్లల మీద, నౌకర్ల మీద అరచే అరుపులు మాకు కర్ణకఠోరంగా వినపడుతూంటాయి.

ఇంద్రపాల్ "ఈమెతో పోట్లాట వచ్చిందంటే, ఇంక ఇక్కడ మనం ఉండడం కష్టం" అన్నాడు.

ఇంద్రపాల్ చచ్చిన కోడి కాలు పుచ్చుకుని ధనదేవి దగ్గరకు తీసుకు వెళ్ళాడు. "గంట సేపటి నుండి, మాటిమాటికీ వాకిట్లోకి వస్తూవుంటే, ఓ చిన్న మట్టిగడ్డ విసిరాను. చచ్చి ఊరుకుంది. ఇందులో నా తప్పేముంది. చెప్పండి ? మీరు యివ్వమంటే దీని ఖరీదు యిస్తాను. భోంచెయ్యమంటే, హాయిగా భోంచేస్తాను" అన్నాడు.

"వట్టి అబద్ధాలకోరువి. నువ్వు ఇప్పుడేగా నా ముందు నుంచి వెళ్ళింది ? నిన్ను గంట సేపటి నుంచి కోడి ఎట్లా ఏడిపించింది ? సరేగానీ, నీ గదిలో ఉన్న అతనెవరు ?" అని అడిగింది ధనదేవి.

"మా అన్న, ఊరునుంచి వచ్చాడు."

"మరి పగటిపూట యింట్లోనుంచి బైటకురాడేం ?"

"వాడికి కళ్ళ జబ్బు. ఎండను చూడలేడు"

"నువ్వు వట్టి అబద్ధాల కోరువి. నేను అతడి వ్యవహారమంతా కని పెట్టేశాను. కడుపు తీపి మీకేం తెలుస్తుంది ? కొడుకును చూడడానికి వాళ్ళ అమ్మ ఎంత బాధ పడుతున్నదో. నా దగ్గరకు రెండు మాట్లు వచ్చింది ఆమె. కొడుకును కళ్ళతో చూసుకుని సంవత్సరమైందిట. కడుపు తీపి మీకేం తెలుస్తుంది ? గుండె రాయిజేసుకు బతుకుతున్నది పిచ్చి బాగులది. పాపం, ప్రేమదేవి (మా అమ్మ) ఎంతో బాధపడుతున్నది. ఇద్దరు కొడుకులూ పనికిమాలిన వాళ్ళయ్యారు. నేను ఆమెను నా యింట్లోనే

ఉంచుకునేదాన్ని. అయితే ఆమె యిక్కడకు రావడంతో పోలీసులు యింటి ముందు ధర్నా కూర్చుంటారు. మీ యిద్దరూ యిరుకున పడతారు. నా కంతా తెల్సు. ఏమీ తెలుసుకోలేని పిచ్చిదాన్ని కాదు. ఏమైనా కానీ, ఒక రోజున ప్రేమదేవిని యిక్కడకు తీసుకొస్తాను. కళ్ళారా కొడుకుని చూసుకుంటుంది." అని అన్నది ధనదేవి.

ఇంద్రపాల్, ఇక ఏమీ ఎరగనట్టు వ్యవహరించడం, అనవసర మనుకున్నాడు. నన్ను చూడడానికి, మా అమ్మను తీసుకొచ్చే విషయాన్ని గురించి, నా అభిప్రాయాన్ని తెలుసుకుని, చెపుతానన్నాడు ఆమెతో. నేను చాలా తెలివిగా వ్యవహరిస్తున్నానని గర్వపడుతున్నాను. నిజానికి తెలివిగా వ్యవహరించింది ధనదేవే. ఆమె నన్ను ఎప్పుడో గుర్తు పట్టింది. ఆ కోడిని మాకు యివ్వడమేకాకుండా వండుకోవడానికి నెయ్యి మసాలా కూడా యిచ్చి పంపించింది. మేము ఉదయం పూట పులగం వండుకునే వాళ్ళం. రాత్రిపూట ఏ 'తందూర్'కైనా వెళ్ళి రొట్టె తిని వచ్చేవాళ్ళం.

మా అమ్మ వచ్చి చూసి పోవడానికి నేను అంగీకరించాను. అయితే, సి.ఐ.డి. ఎవడైనా వెంబడిస్తాడేమో, కనిపెట్టి ఉండవలసిందని ఇంద్రపాల్‌కు చెప్పాను.

మా అమ్మ నన్ను చూడడానికి వచ్చింది. ఈ ఒక్క సంవత్సరంలోనే ఆమె చాలా చిక్కి పోయింది. నా తమ్ముడూ సరీగా యింటికి వెళ్ళడం లేదుట. అతడు కరెంటు ఆఫీసు పనిమాని లాహోర్ కుట్రకేసు ముద్దాయిల డిఫెన్సు కమిటీ తరపున పనిచేస్తున్నాడు. ఏదైనా కూలి పని దొరికితే నాలుగు రోజులు చేసి అయిదో, పదో సంపాయించి అమ్మకు యిచ్చి వెళుతున్నాడు. లాహోర్‌లో మా బంధువు ఒకరూ మేమూ కలసి ఒక యింటిని అద్దెకు తీసుకున్నాం. మా అమ్మ సగమూ, బంధువులు సగమూ అద్దె కట్టుకుంటున్నారు. యింటి ముందు ఎప్పుడూ సి.ఐ.డి. కూర్చుని ఉండడం వల్ల ఆ బంధువులు భయపడి యిల్లు ఖాళీ చేసి వెళ్ళి పోయారు. మొత్తం యింటికి మా అమ్మ అద్దె కట్టవలసి వచ్చింది. ఎక్కడ నుంచి తెచ్చి కడుతుంది ? యిల్లు ఖాళీచేసి 'బుధసభ'లోని ఓ గదిలో ఉంటూన్నది. (చెడువర్తనను నిర్మూలింప చేయడానికి స్త్రీల కోసం ఒకసభ పనిజేస్తూ ఉండేది. ఆ సంస్థ సభ్యురాళ్ళు ప్రతి బుధవారం సమావేశమయ్యేవారు. కనుక ఆ సంస్థకు 'బుధసభ' అని పేరొచ్చింది. ఇలాంటిదే 'మంగళసభ' కూడా ఒకటుంది) అక్కడా ఎన్నాళ్ళు ఉండటానికి వీలవుతుందో తెలియదు. ఊరక ఒకచోట ఉండాలన్నా బాధగానే ఉంటుంది. ఇదంతా చెబుతూ మా అమ్మ కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. అయితే కన్నీటిని ఆపుకుని చిరునవ్వు నవ్వడానికి ప్రయత్నించింది.

నేను ఏ మాత్రం విచారాన్ని కనబరచలేదు. చిరునవ్వు నవ్వుతూ "నేనేమీ చెడ్డపని చేయడంలేదు. మాతృదేశ విముక్తి కోసం ప్రయత్నించడం కర్తవ్యమేకదా ! మీరు చిన్నప్పటినుంచీ సత్యం మాట్లాడమని చెప్పేవారు. వీరత్వాన్ని బోధించేవారు. మీ ఆశయమే నెరవేరుతూన్నది. మీరు కోరిన విధంగానే, నేను నడుస్తున్నాను. తన తల్లినిగురించి ప్రతివాడూ ఆలోచిస్తాడు. భారతమాతనుగురించి కూడా ఎవరో ఒకరు ఆలోచించాలిగదా ? భగత్‌సింగ్, సుఖదేవ్‌లుకూడా ఒక తల్లిగన్నబిడ్డలే ! వాళ్ళూ దేశంకోసం జైళ్ళల్లో మగ్గుతున్నారు కదా ?" అన్నాను.

మా అమ్మ ధైర్యంగా "నాకేమీ బాధలేదు. నన్నుగురించి ఆలోచించవద్దు. ఉద్యోగం దొరుకుతుందేమోనని చూస్తున్నాను. జీవితమంతా ఉద్యోగం చేశాను. ఇప్పుడూ చేస్తాను. అయితే, ఒకటి మాత్రం మర్చిపోకు. తల్లిపాలకు అవమానం తెచ్చేపని ఏదీ చేయకు" అన్నది.

ఆ తరువాత పరారీలో ఉండగా మా అమ్మను మళ్ళీ కల్సుకోలేదు. ధర్మపాల్ అరెస్టు అయ్యాక ఆమెకు ఉద్యోగం దొరకడం కూడా కష్టమైంది.

ఆ తరువాత ప్రతిరోజూ ధనదేవి మాకు ఒకగ్లాసెడు మజ్జిగయిస్తూ వుండేది. పాలు అవుసరమైనా అడగమని చెప్పింది. ఇంద్రపాల్ అరెస్టు అయ్యాక, ఇంద్రపాల్ గదికి వచ్చిపోయే మిత్రుల్ని గురించి, ఆమెను ప్రశ్నించాలని చూశారు పోలీసులు. ఆమె పోలీసుల మీద మండిపడ్డది. "పొరుగింటి వ్యవహారాలను పట్టించుకునే మనిషిని కాను." అని పెద్దగా అరిచింది. పోలీసులు ఆమె యింటిని సోదాచేశారు. నేలనుకూడా తవ్విచూశారు. భూమిలో ఏమన్నా దాచిపెట్టిందేమోనని. ఆమె ఈషణ్మాత్రమూ భయపడలేదు.

'మూర్ఛాగ్యాస్' లభిస్తుందన్న ఆశ ఇకలేదు. భగత్‌సింగునూ, దత్తునూ విడిపించడానికి, ఐదారుగురు మిత్రులు జైలుమీద ముట్టడి చేయడం నాకంతగా నచ్చలేదు. జైలుగేటు దగ్గర సాయుధులైన పోలీసుల కాపలా ఎప్పుడూ ఉంటుంది. ఆ రోజుల్లో విప్లవకారుల కుట్రకేసు తీర్పు జరుగుతూండడంవల్ల, సెంట్రల్ జైలుదగ్గర ప్రత్యేకం డేరానొకదాన్ని వేసి షేర్‌దిల్ పోలీసుల్ని కొందర్ని కాపలాపెట్టారు. నేను చాలామార్లు సెంట్రల్ జైలుమీదుగా అటూ యిటూ తిరిగి పరిస్థితిని గమనించాను. నా ఉద్దేశ్యం ముందు షేర్‌దిల్ పోలీసులమీద దాడిచేసి అధికంగా ఆయుధాలను సమకూర్చుకుని అప్పుడు ఎక్కువమంది మిత్రులం కలసి జైలుమీద దాడిచెయ్యాలని. ఈ కార్యక్రమం ఆమోదయోగ్యమైందో కాదో నిర్ణయించుకోవడానికి భగవతీభాయిని లాహోరు పిలిపించారు. మొదలు షేర్‌దిల్ పోలీసులమీద దాడిచేసి, తరువాత భగత్‌సింగ్ మొదలగు మిత్రుల్ని విడిపించడానికి ప్రయత్నించడమన్నది భగవతీచరణ్‌కు నచ్చలేదు. ఇది భగత్‌సింగ్‌పట్ల అశ్రద్ధను ప్రదర్శించడమే అవుతుందని అతడనుకున్నాడు.

వైస్రాయి ట్రైనుక్రింద బాంబు పేల్చడాన్నిగురించి చర్చించినప్పుడు ఒక విషయం రాయడం మర్చిపోయాను. యాక్షన్‌ని జరపడమా ఆపడమా అని చర్చించేప్పుడు భగత్‌సింగ్ యొక్క అభిప్రాయాన్ని కూడా ఉదహరించాడు ఆజాద్. అంతక్రితమే, ఆజాద్ బచ్చన్‌ని, లాహోరు పంపించాడు. అతడు భగత్‌సింగ్ అభిప్రాయం తెల్సుకుని వచ్చాడు.

భగత్‌సింగ్ "ట్రైను క్రింద బాంబు ప్రేల్చడంవల్ల, కాంగ్రేసు నాయకులకు కోపం వస్తుందనుకుంటే, ప్రస్తుతానికి ఆ ఏర్పాటును ఆపి మమ్మల్ని జైలు నుంచి విడిపించడానికి ప్రయత్నించండి. మమ్మల్ని విడిపించడంవల్ల, కాంగ్రేసు నాయకులకూ కోపంరాదు. మన విప్లవసంఘ గౌరవమూ పెరుగుతుంది." అని కబురు పెట్టాడు.

అప్పట్లో భగవతీచరణ్, భగత్‌సింగ్ అభిప్రాయాన్ని ఆమోదించలేదు. అయితే, వైస్రాయి ట్రైనుక్రింత బాంబు పేల్చడం అయ్యాక, భగత్‌సింగ్‌కు ఒక వర్తమానం పంపించాడు భగవతీచరణ్. 'ఇకమీదట అన్నికార్యక్రమాలను ఆపి మిమ్మల్ని విడిపించడానికే ప్రయత్నిస్తాం. ఆ ప్రయత్నంకోసమే యశపాల్ లాహోరులో వుంటున్నాడు.' అని తెలియపరచాడు.

భగత్‌సింగ్, భగవతీచరణ్ పంపించిన వార్తప్రకారం, తమను విడిపిస్తారని ఎదురు చూస్తున్నాడు. భగవతీచరణ్ తనమాటమీద నిలబడి ఉన్నాడు. భగవత్‌సింగ్‌ను ముందు విడిపించవలసిందేనంటున్నాడు. నేనేమో షేర్ దిల్ పోలీసులమాద దాడిచేయడం ముఖ్యమని పట్టుబట్టాను. మా యిద్దరికీ ఈ విషయంలో బాగా తర్కం జరిగింది. నేను చాలాకటువుగా మాట్లాడాను. ఇలా అన్నాను "నువ్వు మిత్రత్వం గురించి మాట్లాడుతున్నావ్. భగత్‌సింగ్ కాల్చేసిన తూట. ఇది పోరాటం. ఇందులో స్నేహానికీ, మిత్రత్వానికీ తావులేదు. కాల్చేసిన తుపాకి గుండును వెతుక్కోవడానికి సమయాన్ని, ఇతర తుపాకీగుండ్లనూ (మిత్రుల్ని) ఖర్చు పెట్టుకోవడంవల్ల ప్రయోజనమేమిటి ? ఒక వ్యక్తి కోసం విప్లవ సంఘ శక్తిని పాడుచేసుకోవడం మూర్ఖత్వం. ఒక భగత్‌సింగ్ పోతే, కొన్ని వందలమంది భగత్‌సింగ్‌లు సంఘర్షణలోంచి పుట్టుకొస్తారు. ముందు షేర్ దిల్ పోలీసులమీద దాడిచేసి, ఆ తరువాత అవునరం అనుకుంటే,

భగత్‌సింగ్‌ను విడిపించడానికి ప్రయత్నించేద్దాం." నా మాటలకు భగవతీ చరణ్ చాలా బాధపడ్డాడు. అతడు విచార వదనుడయ్యాడు. "నువ్వు ఇలా అంటావని నేననుకోలేదు. నేనేమీ మాట్లాడను. ఇక నీ విషయాన్ని అజాద్ ముందు ఉంచుదాం. అతడే నిర్ణయిస్తాడు." అన్నాడు.

నేను మరీ మండిపడ్డాను. 'ఆజాద్ ఏం నిర్ణయిస్తాడు ? నువ్వు చెప్పింది అతడూ అవునంటాడు. మొత్తం స్థితిని భగత్‌సింగ్‌కు రాసి పంపుదాం. అతడెలా నిర్ణయిస్తే అలాచేద్దాం" అన్నాను.

భగత్సింగ్ చెల్లిలికి ఉత్తరంయిచ్చి జైల్లోకి పంపించాం. భగత్సింగ్ వెంటనే సమాధానం యిచ్చాడు. మేము బయట కొట్టుకు చస్తున్నామని అతడికేం తెలుసు ? కొంత పరిహాసాన్ని ధ్వనింపజేస్తూ అతడిలా రాశాడు. "రోజా ఒక కొత్త ఆలోచన ఆలోచించివద్దని కళాకారుడికి (నాకు) చెప్పండి. మొదలు అనుకున్నపని మొదలు జరగాలి. పరిస్థితుల్ని ఆలోచించడానికీ, కార్యక్రమాన్ని నిర్ధారించడానికి 'మోటా' (భగవతీచరణ్) తగిపోతాడు. 'యాక్షన్'లో 'మోటా'ని వెనక ఉంచి 'పండిట్' (అజాద్)ని ముందుంచండి. కళాకారుణ్ని కరపత్రం రాయమనండి."

భగత్సింగ్‌కి 'బాంబు దర్శనం' పంపించాం. అతడది చదువు కున్నాడు. బాగా నచ్చింది గూడాను. ఆ కరపత్రాన్ని నేనే రాశానని భగత్సింగ్ అనుకున్నాడు. కాని, నిజం చెప్పవలసి వస్తే రూపాయిలో పన్నెండణాల భాగం భగవతీచరణే రాశాడు దాన్ని.

భగత్‌సింగ్ జైలు నుంచి నాకో సందేశాన్ని పంపించాడు. "అతడికి ఆవేశం తగ్గేవరకూ ప్రతి పనిలోనూ తనే ముందుంటానంటాడు. ఒకపని (ట్రైనుక్రింద బాంబు పేల్చడం) చేశాడు గదా ! కొన్నాళ్ళు శాంతంగా వుండమనండి. ప్రస్తుతం యాక్షన్ కంటే కరపత్రాలు ప్రకటించడం ముఖ్యం."

భగత్‌సింగ్ ఇలా సమాధానం పంపించడంతో నేను మౌనంగా వుండిపోయాను.

హంస్‌రాజ్ యొక్క 'మూర్ఛాగ్యాస్' లభించదని నిర్ణయించుకున్నాము.

ఒకనాటి ఉదయం యింట్లో నేనూ భగవతీచరణ్ వున్నాం. ప్రేమనాథ్, పదిగంటలా చాయల ప్రకాశవతిగారిని వెంటతీసుకుని మా దగ్గరకు వచ్చాడు. 'బాభీ వీరిని యిక్కడకు తీసుకు వెళ్ళమన్నారు వీరు యింట్లో నుండి వచ్చేశారు. తనదగ్గర ఉంటే నలుగురూ అనుమానించడానికి కారణమౌతుంది. మరెక్కడైనా ఏర్పాటు చేసేవరకూ వీరిని యిక్కడే ఉంచమన్నారు బాభీ" అన్నాడు.

ఆ యింట్లో అంతవరకూ ఆడవాళ్ళు ఎవ్వరూ వుండలేదు. అప్పుడప్పుడూ దుర్గాబాభీ వచ్చి పోతూఉండేది. అయితే, ఆమె విషయం వేరు. గొప్ప ధైర్యమూ, ఆత్మ విశ్వాసమూ కలవ్యక్తి. ఆమెను గురించి ఎవరూ ఆలోచించవలసిన పని వుండదు. తన బాధ్యతనేకాకుండా ఇతరుల బాధ్యతనుకూడా చూసుకోగల వ్యక్తిత్వం ఆమెది. వెనుక ఒకమాటు ప్రకాశవతిగారికి "మీరు సాయుధ పోరాటంలో పాల్గొనడానికి, యిల్లు విడిచి వచ్చేట్లయితే, మీ వసతికి అవుసమైన ఏర్పాట్లను పార్టీ చేస్తుంది" అని వ్రాశాను. అయితే, ఇంత త్వరగా, ముందుగా చెప్పకుండా యిల్లు విడిచి వచ్చేస్తుందని అనుకోలేదు. అనుకోకుండా వచ్చిన ఆమెనుగురించి కొద్దిసేపు బాధపడ్డాను కూడాను. అప్పటికి నేనూ ప్రేమనాథ్ తప్ప ప్రకాశవతిగారిని యితర మిత్రులెవరూ ఎరుగరు.

భగవతీభాయి, ప్రకాశతిగారితో నన్నే మాట్లాడమన్నాడు. నేను ఆమెను ఒక ప్రక్కకు తీసుకెళ్ళి అడిగాను. "మీరు ముందు తెలియపర్చకుండా ఎందుకొచ్చారు ? మీరుండటానికి ఏర్పాట్లేమీ మేము చెయ్యలేదు కదా ?"

ఆమెగారు "మీరు ఇల్లు విడిచి రావడాన్ని గురించి రాసిన ఉత్తరం మా అన్నయ్య చూశాడు. మా నాను గారికీ విషయం తెలిసింది. ఆయనగారు అవమానంతో, వళ్ళు తెలియని కోపంతో 'వంటిమీది

నగలన్నీ తీసి అక్కడ పెట్టి, ఇప్పుడే నా యింట్లో నుంచి బైటకు వెళ్ళు' అన్నారు." అని చెప్పింది.

అలా అని తండ్రి కిందిగదిలోకి వెళ్ళి కూర్చున్నాడు. ప్రకాశవతి వంటిమీది నగలన్నీ తీసి అక్కడే పడేసింది. మేడ మీదకు వెళ్ళి పిట్టగోడను దాటి పక్క మేడ మెట్ల మీదుగా కిందికి దిగింది. నేరుగా దుర్గాబాభీ దగ్గరకు వచ్చింది.

నేను అడిగాను. "కాకపోయినా, ఇంట్లోనే ఉండడానికి అభ్యంతరం ఏమిటి మీకు ?"

"మా నాన్నగారు పెళ్ళి చేసెయ్యాలంటున్నారు. నాకు వివాహం చేసుకోవాలని లేదు. అదీకాక, మా నాన్నగారు మీ జాబును చూశారు. చాలా మండిపడుతున్నారు." అన్నది ప్రకాశవతి.

"అయితే, పెండ్లిచేసుకోకుండా ఉండటానికే యిల్లు విడిచిపెట్టి వచ్చారా ?"

ఆమె తలవూపి ఔనన్నది.

నేను రెండు క్షణాలు ఆలోచించాను. "మీరు ఎంతవరకూ చదువుకున్నారు ?" అని అడిగాను.

"మిడిల్ ప్యాసయ్యాను. హిందీరత్న చదివాను. ఆపైన చదివించడానికి మా వాళ్ళు ఒప్పుకోలేదు." అన్నదామె.

"చరిత్ర, భూగోళం -చదువుకున్నారా ?"

"ఆ"

"ఏ భూగోళం చదువుకున్నారు ?"

"ప్రపంచ భూగోళం చదువుకున్నాను"

నాకు నవ్వు వచ్చింది. "మనదేశ భూగోళం చక్కగా చదవడం గొప్ప. ఇలాంటప్పుడు ప్రపంచ భూగోళమంతా చదివేశారా." అన్నాను నవ్వుతూ.

నేనలా నవ్వడం ఆమె మనస్సును నొప్పించింది.

"ఇంకేం చదువుకున్నారు ?" అని అడిగాను.

"ప్రేమవతి అక్క యిచ్చిన పుస్తకాలన్నీ చదివేశాను." అన్నది.

ఆమె విప్లవ సంఘానికి ఎంత వరకు పనికివస్తుందో తెల్సుకోవడానికి నేనీ ప్రశ్నల్నీ వేశాను. ప్రకాశతిగారిలో విప్లవ సంఘపు కార్యక్రమాల్లో పాల్గొనాలన్న ఉత్సాహం ఎటూ ఉంది. అయితే, ఉత్సాహంతో పాటు విజ్ఞానమూ ఉంటే మంచిది కదా.

నేను నిర్మొగమాటంగా అన్నాను. "వివాహం ఆడడం మీకు ఇష్టం లేక, మీరు తిరస్కరిస్తున్నా రంటే, మేము తప్పకుండా సానుభూతి చూపుతాం. అయితే, ఈ విషయంలో మేము చేసే సహాయం ఏమీ ఉండదు. మా కార్యక్రమాలకు ఆదర్శం కేవలం రాజకీయ పోరాటం."

ప్రకాశవతిగారు గాభరాపడ్డారు. "మీరు అనేది నాకు అర్థం కావడం లేదు." అన్నారు.

"అర్థం కాకపోవడానికి ఏముంది ? మీరు పెండ్లిని తిరస్కరించడానికే యిల్లు విడచి వచ్చేట్లయితే, మీకు మేము ఎలాంటి వసతినీ చూపలేము. అలా చూపడం మా పని కాదు." అన్నాను.

ప్రకాశవతి ఒక్కక్షణం తలవంచుకు నిలబడ్డారు. నిరాశగా "సరే నేను వెళ్ళిపోతాను." అన్నారు.

"ఎక్కడికి వెళతారు ? ఇంటికి వెళ్ళి మీకు యిష్టం లేని పెళ్ళి చేస్తున్నందుకు మీ నాన్నగారితో పోట్లాడండి." అని సలహాయిచ్చాను.

"యింటికి వెళ్ళను. ఏ మొచ్చానో వచ్చాను. యింటికి వెళడం జరగదు."

"మరి ఎక్కడికి వెళతారు ?"

"ఎక్కడికో ఒక చోటికి ............ గంగలోకి వెళతాను." అన్నది ప్రకాశవతి.

నా హృదయం ద్రవించింది. "అలా చెయ్యడం చాలా తెలివి తక్కువ" అన్నాను.

"ప్రేమవతి అక్క యిష్టంలేని పెళ్ళి చేసుకోవద్దన్నది. యింట్లో వాళ్లు పార్టీ పనిని చెయ్యనివ్వకపోతే, యిల్లు విడిచి పార్టీలోకే వచ్చే సెయ్యమన్నది. మీరు అలాగే రాశారు కదా ?" అన్నది ప్రకాశవతి. ఆమెగారి కండ్లు చెమర్చాయి. కన్నీటిని ఆపుకోవడానికి పెదవిని పంటితో నొక్కుకున్నది.

"వివాహం యిష్టంలేక యిల్లు విడిచివచ్చానని చెప్తున్నారు కదా ? పార్టీ పని చేయడానికి కాదుగదా, మీరు యిల్లు విడిచింది ?" అని ప్రశ్నించాను.

"మరి పెళ్ళి అయితే పార్టీపని చెయ్యనిస్తారా ?" అని అన్నది ప్రకాశవతి.

"అయితే మీరు పార్టీకోసమే యిల్లువిడిచి వచ్చారన్నమాట. అలాగైతే, మిమ్మల్ని తప్పకుండా ఆహ్వానిస్తాము. నేను కొంచెం కఠినంగా మాట్లాడడాను. క్షమించండి. మీ ఉద్దేశ్యాన్ని తెలుసుకోవడానికే నేను అలా మాట్లాడాను" అని అన్నాను.

నేను కఠినంగా మాట్లాడినంతసేపు ప్రకాశవతి గంభీరంగానే సమాధానం యిచ్చింది. నేను సిగ్గుపడి క్షమాపణ అడిగేసరికి ఆమె పమిట చెరగులో ముఖం దాచుకుని ఏడవసాగింది. యింతలో నాకొక ఆలోచన వచ్చింది. ఆమె అలా ఏడుస్తూవుంటే, ఇతర మిత్రులు ఏమనుకుంటారు ? ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించబోయాను. అయితే నోటివెంట మాట వస్తేగా ? మొదట నేను నిర్మొగమాటంగా ప్రవర్తించి నందుకు చాలా సిగ్గుపడ్డాను. ఆ సిగ్గే తరువాత తరువాత నాలోని బలహీనతగా తయారైంది.

ఆనాటి సాయంకాలమే, తన తండ్రికో ఉత్తరం రాయమని ఆమెకు చెప్పాను. ఉత్తరంలో 'మీ కూతురు ఏ అవమానకరమైన పని చేయలేదు. వివాహం మాని దేశసేవ కోసం జీవితం అంకితం చేయడానికి వెళ్ళింది. ఈ విషయంలో గలభా చేసుకోవడం మంచిది కాదు. అందువల్ల మీకు నష్టమేగాని లాభముండదు.' అని రాయమన్నాను.

షేర్ దిల్ పోలీసుల మీద దాడిని గురించీ, మిత్రుల్ని జైలు నుండి విడిపించడాన్ని గురించి ఆలోచించే రోజుల్లో, సుఖదేవరాజు మరో సాహసాన్ని చేశాడు. లారెన్సు విగ్రహాన్ని పడగొట్టడానికి ప్రజలు సత్యాగ్రహం చేస్తున్నారు. ప్రజలకూ పోలీసులకూ రోజూ ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. సుఖదేవరాజ్ అప్పుడే మాల్‌రోడ్డు నుండి వచ్చాడు.ఇలా అన్నాడు. "నీల్ (లాహోరు పోలీసు సూపర్నెంటు) సత్యాగ్రహుల్ని ఆపడానికి పోస్టాఫీసు కెదురుగా నిలబడి ఉన్నాడు. మంచి అవకాశం ఓ రివాల్వర్ ఇటు యివ్వు. నేనిప్పుడే సైకిలు మీద వెళ్ళి అతడ్ని కాల్చేస్తాను. జనం బాగా గుంపులుగా ఉన్నారు. నేను వెనక నుంచి వెళ్ళి కాల్చి తప్పించుకుని వస్తాను."

అతడిలాంటి ప్రస్తావనలు చేస్తూనే వున్నాడు. వాటిని నేను కాదంటూనే ఉన్నాను. రానురాను అతడి ప్రస్తావనలను కాదనడం, నా పిరికితనానికి నిదర్శన మవుతున్నది. నేను ఒకరకంగా సిగ్గుపడుతున్నాను.

అప్పుడు యింట్లో ప్రకాశవతి ఒకర్తే ఉంది. ఇంక ఎవ్వరూ లేరు. నేనిలా అన్నాను. "నిన్నెవరైనా వెంబడిస్తేనో ? నిన్ను రక్షించడానికైనా ఇంకొకరు నీ వెంట ఉండడం మంచిది కదా ? ఇప్పుడు యింట్లో ఎవ్వరూ లేరు. పోనీ, నేను వద్దామనుకుంటే, అక్కడ నన్ను ఎరిగిన వాళ్ళు ఎవరైనా కనపడవచ్చు. నేను పరారీలో ఉన్నవాడిని కదా ? ఎవరైనా నన్నుచూసి కేకలువేస్తే అసలుకే మోసమొస్తుంది."

"నన్ను రక్షించడానికి ఎవ్వరూ అవుసరము లేదు." అన్నాడతడు. పిస్తోలు కోసరం బలవంతం చేశాడు. కాదనలేక పోయాను. అతడికో పిస్తోలు యిచ్చాను. అతడు వెళ్ళగానే నేనూ తలపాగానొకదాన్ని చుట్టు కున్నాను. వీపుమీద వేలాడుతున్న కొసను గడ్డమూ, ముక్కూ కనపడకుండా

నోటితో పట్టుకున్నాను. జేబులో ఒక పిస్తోలు పెట్టుకుని, సైకిలు వేసుకుని అతడు చెప్పిన చోటుకు, అతడి వెనకే నేనూ వెళ్ళాను. మిత్రుణ్ని ఒంటరిగా ప్రమాదాల్ని వరించడానికి పంపిచడం, నేను సహించలేను. సుఖదేవరాజ్ మెల్లగా సైకిలు తొక్కుకుంటూ వెళుతూన్నాడు. పోస్టాఫీసు దగ్గరకు వెళ్ళకముందే నేను అతణ్ని చూశాను. అతడు ప్రజాసమూహమూ, పోలీసులూ ఉన్నవైపు వెళ్ళకుండా, గ్వాల్ మండీ వైపు వెళ్ళిపోయాడు.

అతడు అలా వెళ్ళడంతో, 'లోయర్‌మాల్ రోడ్డు నుండి వెనక్కు తిరిగి, పోలీసులకు వెనుకవైపుకు రావడానికి, అలా వెళ్ళాడేమో.' అనుకున్నాను. నేను సరాసరి పోలీసుల వెనక్కువెళ్ళి, సుఖదేవరాజు రాక కోసం, ఎదురు చూస్తూన్నాను. పోలీసులకు కొంచెం దూరంగా నిలబడి, సిగరెట్ కాలుస్తూ, పరిస్థితిని పరిశీలిస్తున్నాడు నీల్. ఫుట్‌ఫాత్ పక్కన నీల్ మోటార్ సైకిలు పెట్టి ఉంది. నీల్ పక్కన సాయుధుడైన ఒక సార్జెంటు మోటార్ సైకిల్ పక్కన పెట్టుకుని నిలబడి ఉన్నాడు. నేను ఒక్కక్షణం ఆలోచించాను. 'ఇలాంటప్పుడు రాజ్ ఏం చేయగలడు ? ఏం చెయ్యాలని అతడి ఉద్దేశ్యం ?' నేను ఆలోచిస్తూనే మాల్‌రోడ్డున కొంత దూరం సైకివెళ్ళి, మళ్ళా వెనక్కుతిరిగి వచ్చాను. ఒక కిల్లీకొట్టు దగ్గర కలర్ ఒకటి తాగుతూ కొంత కాలం గడిపాను. నేను చూస్తుండగానే నీల్, సార్జెంట్-యిద్దరూ మోటార్ సైకిళ్ళమీద వెళ్ళిపోయారు. నేనూ వెనక్కు తిరిగి యింటికి వచ్చేశాను.

ఒకగంట తరువాత, సుఖదేవరాజ్ కూడా యింటికి వాచ్చడు. రివాల్వర్‌ని నా చేతికి యిస్తూ "పరిస్థితి అనుకూలించలేదు. నీల్ చుట్టూ మనుష్యులు నిలబడి ఉన్నారు. వాళ్ళు తప్పుకుంటారేమోనని, చాలాసేపు కాపువేసి ఉన్నాను" అన్నాడు. అప్పుడే ఇంద్రపాల్ కూడా వచ్చాడు. ఇంద్రపాల్ ఎదుట, వాదించి సుఖదేవరాజ్‌ని అబద్ధీకుడనిపించడం ఉచిత మనిపించలేదు.

ప్రకాశవతి మరి కొన్నాళ్ళపాటు చదవడం అవుసరం అనుకున్నాము. ధైర్యంగా, రహస్యజీవితం గడపడం, పార్టీ సభ్యులతో చనువుగా వ్యవహరించడం, నేర్చుకోవాలనీ అనుకున్నాము. ఆమెకు 'కమల' అని క్రొత్తపేరు పెట్టాము. వచ్చిన మరునాడే, ప్రకాశవతి ఇంద్రపాల్ యింటిని శుభ్రం చేసి, పని పాటులు చూసుకోవడం ప్రారంభించింది. ఇంగ్లీషు చదవడమూ మొదలు పెట్టింది. ఢిల్లీ నుండి బచ్చన్ కూడా వచ్చాడు. అప్పుడప్పుడూ సంపూర్ణసింగ్‌కూడా వస్తూ వుండేవాడు. మిత్రుల సంఖ్య అధికం అవడంతో 'కిలా గుజ్జర్‌సింగ్'లో కూడా మరోయింటిని అద్దెకు తీసుకున్నది పార్టీ. సుఖదేవ్‌రాజ్, విశ్వేశ్వర్ అక్కడవుంటూ ఉండేవారు. లాహోర్ వచ్చినప్పుడు భగవతీచరణ్‌కూడా అక్కడే ఉండేవాడు. ఒకనాడు సుఖదేవ్‌రాజ్ మా దగ్గరకువచ్చి "ఇక్కడ మిత్రులు ఎక్కువయ్యారు. కమల ఇంగ్లీషు చదువు సాగదిక్కడ. మేము ఉన్న చోట విశ్రాంతిగా ఉంటుంది. నేను నియమంగా ఆమెకు ఇంగ్లీషు చెబుతాను. అక్కడికి పంపించండి." అన్నాడు.

ఒకమాటు దుర్గాబాభీ ప్రకాశవతిని గురించి ఇలా అన్నది. "కమలను వారి (భగవతీచరణ్) దగ్గరైనా ఉంచుదాం. లేకపోతే, నీ దగ్గరైనా ఉంచుకో. అదీ యిదీకాకపోతే ఢిల్లీ కృష్ణజీగారింటికి పంపించేద్దాం."

సుఖదేవ్ రాజ్ చెప్పినట్టు, ప్రకాశవతిని వాళ్ళు ఉన్న చోటికి పంపించడం సబబు అనిపించలేదు. బాభీకూడా అదే ఉద్దేశ్యంతో, పై అభిప్రాయాన్ని వ్యక్తపరచింది. అయినా నేను బాభీని వ్యతిరేకించాను. "దింట్లో ఏముంది ? ఎక్కడుంటే ఏం ? కిలా గుజ్జర్‌సింగ్‌లోని యింటికే పంపించేద్దాం" అన్నాను. నేనిలా అనటానికి కారణం నా హృదయాంతరాళాల్లోని ఏవో కోర్కెలను అణచుకునే ప్రయత్నమన్న మాట.

ఒక్క క్షణం ఆలోచించి "అసలీ గొడవంతా ఎందుకు ? కమలను నువ్వే పెళ్ళి చేసుకో." అన్నది బాభీ. ఆమె అలా అనటం నాకేమీ బాగనిపించలేదు. నేను ఏ కోర్కెనైతే దాయడానికి ప్రయత్నిస్తున్నానో, దాన్నే బాభీ బైటుకు లాగింది.

నేను "నువ్వు చాలా పెద్దదానివి బాభీ" అన్నాను.

బాభీ మౌనంగా వుండిపోయింది.

నన్ను అజాద్ ఢిల్లీ పిలిపించాడు. జైలుమీద దాడిచేసే విషయంలో ఒక ప్లానును నిర్ధారణ చేసుకోవడం మంచిదని అజాద్ ఉద్దేశ్యం. దాడి చేసేటప్పుడు, కొంత ఉపయోగకరంగా వుంటుందనే ఉద్దేశ్యంతో, నాకు రైఫిల్ కాల్చడం నేర్పాలని అనుకున్నాడు. ఆ మధ్య అజాద్ ఒక రైఫిల్‌నికూడా కొన్నాడు.

ప్రకాశవతిని నాతోపాటు ఢిల్లీ తీసుకువెళ్ళాను. మేమందరం జైలుమీద దాడిలో ఎటూ పాల్గొంటాము. అలాంటప్పుడు, ప్రకాశవతిని పార్టీ సానుభూతిపరులైన యితర మిత్రులకు పరిచయం జేయడం నయం కదా ? ఒకవేళ ఆదాడిలో మేము చనిపోవచ్చు. అలాంటప్పుడు అన్యమిత్రుల పరిచయం లేకపోతే, ప్రకాశవతి ఏమైపోతుంది ? ఈ ఉద్దేశ్యంతోనే ఆమెను ఢిల్లీ తీసుకువచ్చాను. ఖయాలీరామ్‌గుప్త, మహాశయ్ కృష్ణజీ, ధ్రువదేవ్ - మొదలగు మిత్రుల్ని ఆమెకు పరిచయం చేశాను. వ్యక్తిగతంగా ఆమెమీద నాకు విశ్వాసం ఉన్నప్పటికీ, జైలుమీద జరపబోయే దాడినిగురించి, అంతవరకూ నేనామెకు చెప్పలేదు.

ఢిల్లీకి వచ్చాక, రైఫిల్ కాల్చడం నేర్పడానికి భయ్యా, నన్ను మీరట్ జిల్లాలోని 'నల్గడా' అడవులకు తీసుకువెళ్ళాడు. వెంట కైలాసపతి లేఖరామ్ ఉన్నారు. బహుశా, భవానీసింగ్‌కూడా ఉన్నాడని అనుకుంటాను. గురిని ప్రాక్టీసు చేయడంలో నాకేమంత ఉత్సాహం వుండదు. అయితే, అజాద్‌కు గురి ప్రాక్టీసు విషయంలో చాలా ఉత్సాహం ! గురిపట్ల మా యిద్దరికీ ఉన్న ఈ భిన్నదృష్టి కోణానికి కారణం, నేను తాత్కాలికమైన అవుసరంవరకే ఆయుధ చాలనాన్ని గురించి ఆలోచించేవాడ్ని. కాని, అజాద్ ఆలోచన చాలా దూరంవలరకూ పోయేది. అతడు 'గెరిల్లా యుద్ధానికి' తగినట్టుగా మమ్ములనందరినీ తయారు చెయ్యాలనుకునేవాడు.

మేము 'నల్గడా' వెళ్ళేటప్పుడు రెండు సూట్‌కేసుల్లో ఆయుధాలు పెట్టుకున్నాము. బెడ్డింగులో మా అయిదుగురికి కావలసిన గుడ్డలూ, దుప్పట్లూ పెట్టుకున్నాము. బయలుదేరేప్పుడు అజాద్ ఒక సూట్ కేసును చేతబుచ్చుకున్నాడు. రెండవ సూట్ కేసునూ, బెడ్డింగునూ నాకు వప్పచెపుతూ "సోహన్, జాగ్రత్త" అన్నాడు.

నేను నిక్కరూ, కోటూ వేసుకుని హేట్ పెట్టుకున్నాను. అజాద్ నిక్కరూ కోటూ వేసుకున్నాడు. క్లర్కులు ఉపయోగించే గుండ్రని టోపీ పెట్టుకున్నాడు. కైలాసపతి, భవానీసింగ్, లేఖరామ్ ధోవతులు కట్టుకున్నారు, కోట్లు వేసుకున్నారు. నా వేషాన్ని చూసి కారువాడు నాకు తన పక్కనే చోటుయిచ్చాడు. భయ్యా నావెనక కూచున్నాడు. మిగిలిన వాళ్ళు అవతల కూచున్నారు. కారులో ఎక్కాక, బెడ్డింగ్‌ను జాగ్రత్తగా చూడమని కైలాసపతికిక చెప్పాను. నల్గడా వెళ్ళటానికి ఢిల్లీ, మీరట్ - మధ్య ఒక పోలీస్ స్టేషన్ ముందు కారుదిగాము. పోలీసు స్టేషను వరండాలోని రెండు స్తంభాలకూ, మమ్మల్ని పట్టుకుంటే బహుమతులిస్తామని ప్రకటించిన ప్రకటన పత్రాలు అతికించబడివున్నాయి. ఒకదాంట్లో లాహోర్ కుట్రకేసులోని ముద్దాయిలను పట్టించేందుకు బహుమతులు ప్రకటించారు. అందులో నా పేరు, అజాద్ పేరుకూడా ఉంది. రెండవ దాంట్లో వైస్రాయి ట్రైను క్రింద బాంబు పేల్చిన వ్యక్తిని పట్టించిన వారికి బహుమతి ప్రకటించారు.

నేను అక్కడ దిగేటప్పుడు నాచేతిలో వున్న సూట్ కేసును మాత్రం తీసుకుదిగాను. బెడ్డింగు కారులోనే వుండిపోయింది. "బెడ్డింగును ఎందుకు దించలేదు ?" అజాద్ నన్ను కోప్పడ్డాడు.

"నేను ముందు కూర్చున్నాను. కైలాసపతి వెనక కూర్చున్నాడు కనుక, బెడ్డింగు బాధ్యత అతడికి వప్పచెప్పాను" అన్నాను.

ఆజాద్ కోపగించుకున్నాడు "బాధ్యత నీకుకదా యిచ్చింది ? బెడ్డింగులో ఇతరులనడిగి తెచ్చిన గుడ్డలూ ఉన్నాయి. గుర్తులనుబట్టి, పోలీసులు ఆ గుడ్డలు ఎవరివో తెలుసుకుంటారుగదా ? లాహోరులో గుడ్డలద్వారా, పోలీసులు, కొందరు మిత్రుల్ని అరెస్టు చెయ్యలేదా ?" అన్నాడు.

"ఇప్పుడిక కోప్పడి ప్రయోజనమేమిటి ? నాతోపాటురా" అంటూ నేను నేరుగా పోలీస్ స్టేషన్ లోపలకు వెళ్ళాను. ఆజాద్ నా వెనకాలే తనూ వచ్చాడు. స్టేషన్ ఇన్‌చార్జీ, ఒక హెడ్‌కానిస్టేబులూ - ఒకరు కుర్చీలోనూ మరొకరు స్టూలుమీద కూర్చుని ఏదో పనిచూసుకుంటున్నారు. నేను చాలా దార్పికంగా "స్టేషన్ ఇన్ చార్జీ ఎవరు" అని అడిగానువాళ్ళను.

స్టేషన్‌లోవున్న వాళ్ళిద్దరూ కంగారుపడి, లేచి నిలబడి, సలాం పెట్టారు. నేను కుర్చీలాక్కు కూర్చుని, సగం ఇంగ్లీషులోనూ, సగం వచ్చీరాని హిందీలోనూ ఆజాద్‌తో ఇలా అన్నాను. "పంటులూ, బెడ్డింగు పోయిందని రిపోర్టు యివ్వుము" అని జేబులోనుండి సిగరెట్ తీసి ముట్టించి, స్టేషన్ ఇన్‌చార్జీతో ఇలా అన్నాను. "పై స్టేషనుకు ఫోన్ చేయుము. బెడ్డింగు యిచ్చుటకి పంపుమనుము." మళ్ళీ ఆజాద్ నుద్దేశించి "పంటులూ, టుమారో, నువ్వు ఇటు వాస్తడు. బెడ్డింగు అడుగుతాడు. అని వీరికి చెప్పుము" అన్నాను.

ఆజాద్ "అలాగే సాబ్" అన్నాడు. తరువాత స్టేషన్ ఇన్ చార్జీకి కారులో బెడ్డింగు మర్చిపోవ డాన్ని గురించి చెప్పాడు. నేను మళ్ళీ స్టేషన్ ఇన్‌చార్జీతో ఇలా అన్నాను. "బెడ్డింగు రేపు లభించనియెడల స్టేషన్‌కు పంపుము." అంటూ ఓ కాగితం తీసుకుని దానిమీద నా అడ్రసు రాసి యిచ్చాను. 'ఆర్. కె. మొదలియార్, ఇంజనీర్, సెంట్రల్ పి.డబ్ల్యూ.డి., కేరాఫ్ స్టేషన్ మాష్టర్, ఢిల్లీ.'

స్టేషన్ నుంచి బైటకు వచ్చాము. ఆజాద్‌కు కోపం తగ్గింది. చిరు నవ్వు నవ్వుతూ "నాయాల, వేషం వెయ్యమంటే మహావేస్తాడు. రేపు బెడ్డింగురాకపోనీ, తల పగలగొడతాను" అన్నాడు.

నేను ధైర్యం చెప్పాను. "రేపు తప్పకుండా పంపిస్తారు. ఒకవేళ పంపిచరూ, పోనీ వాటిమీద విప్లవకారులవని తెల్సుకోవటానికి గుర్తు లేమీ లేవుకదా ? అనవసరంగా గాభారాపడడం దేనికి ?" అన్నాను. మేము తిరిగి ఢిల్లీ వెళ్ళేసరికి బెడ్డింగువచ్చి వుంది.

గ్యాస్ లేకుండా న్యాయస్థానంమీద దాడిచేసి, మిత్రుల్ని విడిపించడం సంభవంకాదు. పరిమితమైన, మా సాధనాలను బట్టి, భగత్‌సింగ్‌నూ, దత్తునూ మాత్రమే విడిపించాలనుకున్నాము. జైలుమీదగాని, జైలుగేటు వద్దగాని, దాడి చెయ్యవలసి వుంటుంది. భగత్‌సింగ్‌నూ, దత్తునూ కోర్టుకు తీసుకువెళ్ళేప్పుడుగానీ, తిరిగి జైలుకు తెచ్చేప్పుడుగానీ దాడి జరపాలని అనుకున్నాము. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి చాలామంది మిత్రులు వచ్చారు. వాళ్ళందరూ వుండడానికీ, విడిపించుకు వచ్చాక, భగత్‌సింగ్‌నూ దత్తునూ ఉంచడానికీ ప్రస్తుతం విప్లవ సంఘం ఆధీనంలోవున్న రెండు యిండ్లూ చాలవు. కనుక, ఒక పెద్ద బంగళానే అద్దెకు తీసుకోవాలని నిర్ణయించుకున్నాము. బంగళాని తగువిధంగా అలంకరించి, చూపరులకు అనుమానం కలగకుండా ఉండేట్టు ఉచడం అవుసరం. గౌరవనీయమైన గృహస్థు కుటుంబం అనిపించడానికి, ఒకరో, యిద్దరో 'దొరసానులు' కనిపిస్తూ వుండడమూ అవుసరమే. మరి 'దొరసానులు'గా ఎవరు తయారయ్యేట్టు ? ఈ విషయమై చర్చలు జరుగుతున్నాయి.

అప్పట్లో దుర్గాబాభీ పరిస్థితి చాలా కష్టంగా వుంది. సి. ఐ. డి. లు ఎప్పుడూ ఆమెను వెంటాడుతూ ఉండేవారు. మమ్ములను కల్సుకోవటానికి కూడా ఆమె రావడం కష్టసాధ్యమే అవుతూన్నది.

మరోవైపున జయచంద్రగారి దుష్ప్రచారంవల్ల కొందరు ఆమెను సి. ఐ. డి. పోలీసు భార్య అనే అనుకుంటున్నారు. అలా అనుకునేవారు ఆమె ఎక్కడికిపోతున్నది, ఎక్కడ నుంచి వస్తున్నది కనిపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. అలాంటి వారివల్లా దుర్గాబాభీకి యిబ్బంది కలుగుతూన్నది. కొందరు సి. ఐ. డి. పోలీసు భార్యను ఉడికించడం, ఏడిపించడమే తమ ఘనమైన దేశభక్తికి నిదర్శనం అని అనుకునేవారూ ఉన్నారు. బాభీ మమ్మల్ని కల్సుకోవడానికీ, మా సందేశాన్ని ఇతర మిత్రులకు చెప్పడానికీ, అటూ యిటూ తిరుగుతూ ఉండేది. అర్ధరాత్రీ, అపరాత్రీ చుట్టుపట్లవాళ్ళు ఎరుగని, అపరిచితులు ఆమెదగ్గరకు వచ్చి వుంటూవుండేవారు. ఇది కొందరికి కంటుగా ఉండేది. ఆమెను అడ్డూ అపూలేని స్త్రీ అని అనుకోవడానికి, ఈ తిరుగుడు సాయపడుతూ వుండేది. చాలామంది ఆమెను తిరుగుబోతు స్త్రీ అనుకునేవారు. పైగా భర్త నెలలతరబడి యింటికిరాడు. అయినా, ఆమె ఏనాడూ విచారంగా వుండేదికాదు. ఇది తిరుగుబోతు స్త్రీ లక్షణం కాక మరేమిటి ? ఇన్ని కారణాలవల్ల చుట్టుపట్ల వాళ్ళు బాభీకి సహాయం చెయ్యకపోగా, బాధించడానికే ప్రయత్నించేవాళ్ళు. వాళ్ళు పెట్టేబాధలను గురించి మాత్రం ఎవరికి చెప్పుకోగలదు ? ప్రజల దృష్టిలో ఆమె దేశ ద్రోహి ఐన సి.ఐ.డి. భార్య. తిరుగుబోతు. ప్రభుత్వ దృష్టిలో రాజ ద్రోహి భార్య.

ఈ విచిత్ర పరిస్థితులవల్ల దుర్గాబాభీ చాలా బాధపడుతూన్నది. భగవతీచరణ్ సి.ఐ.డి. కాదని తెలిసిన మిత్రులు కూడా, దుర్గాబాభీమీద ఒక రకంగా మండిపడుతుండేవారు. దుర్గాబాభీ ఎప్పుడు ఎక్కడికి వెళ్ళుతుందో, ఎప్పుడు ఎవరితో మాట్లాడుతుందో, ఎవరికీ తెలియదు. ఎప్పుడూ, ఎక్కడికోవెళ్ళి వస్తూండడం వల్ల, భగవతీచరణ్ స్నేహితులకు కూడా దుర్గాబాభీ మీద కంటుగా ఉండేది. అలాంటి వాళ్ళు, భగవతీచరణ్ మీద సానుభూతిని ప్రకటిస్తూనే, దుర్గాబాభీని ద్వేషించేవారు. "పాపం, అతడేమో, దేశం కోసం దేశాలపాలయ్యాడు. ఈమెకు భర్తను గురించిన దిగులే లేదు. ఎప్పుడూ రంగుల సీతాకోకచిలుకలా (విసనకర్రలా) అలంకరించుకుని, కొత్త స్నేహితులతో తిరుగుతూ ఉంటుంది." అనుకునేవారు.

1929 సెప్టెంబరులో ఇంద్రపాల్ మొదటగా లాహోరు నుండి ఢిల్లీ వచ్చాడు. అప్పటివరకూ అతడికి దుర్గాబాభీతో అంతగా పరిచయం లేదు. లాహోరులో ఇంద్రపాల్, బాభీని గురించి ఎన్నో అపవాదుల్ని విన్నాడు. అతడి బుర్ర వేడెక్కి పోయింది. ఢిల్లీ వచ్చాక భగవతీ భాయీతో స్పష్టంగా అనేశాడు. "ఒక విప్లవకారుని భార్య అందరూ నిందించేట్టు అలా ఉండడం తగదు."

భగవతీభాయి ఇంద్రపాల్ భావాన్ని అర్థం చేసుకున్నాడు. "నువ్వు, ఆమె మీద అపవాదుల్ని వినటమేగాని, కండ్లతో చూడలేదు కదా ? విన్నమాటలే నిజమనుకునేట్లయితే, ఇతరుల మాటల్ని విని నమ్మేకంటే, నా భార్య చెప్పిన మాటల్ని విని నేను ఎందుకు నమ్మకూడదు ? ఆమె అసాధారణ పద్ధతిలో జీవితం గడపవలసి ఉన్నది. ప్రజలు సాధారణ దృష్టితో ఆమెను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తు న్నారు" అన్నాడు.

దుర్గాబాభీ అప్పటికి అనేక సార్లు తన బాధను గురించి భర్తకు చెప్పుకుంది. తనూపరారవడానికి అజ్ఞయివ్వమని వర్తమానాన్ని పంపించింది. పరిస్థితుల్ని వివరంగా చర్చించుకోవడానికి భగవతీభాయి ఆమెను ఢిల్లీ పిలిపించాడు. 'అజ్మీరీ దర్వాజా'లోని మహాశయ్ కృష్ణజీ యింట్లో యిద్దరూ మాట్లాడుకున్నారు. నేనూ అక్కడే ఉన్నాను. వారి పుత్రుడు శచికి (ఇప్పుడు ఇంజనీరు) అప్పుడు నాలుగేళ్ళ వయస్సు ఉంటుంది. తల్లివస్తూ అతడ్ని తీసుకు వచ్చింది. శచి దాదాపు ఆరు నెలల తరువాత తండ్రిని చూశాడు. తండ్రిని చూడగానే మొదట తన నల్లని కండ్లను పెద్దవిచేసి ఆశ్చర్యాన్ని ప్రకటించాడు. తరువాత అతడి పెదవులు చిరునవ్వు నవ్వడానికి విస్తృతమయ్యాయి. "పాపా" అన్నాడు. కానీ, ఆ వయస్సులోనే, మౌనంగా ఉండాలన్న విషయం అతడికి అర్థమయినట్లుంది. అతడు మౌనంగా తండ్రి మెడను కావిటేసుకున్నాడు. చివరకు, వెళ్ళేప్పుడు కూడా ఏ మాత్రం ఏడవలేదు.

భగవతీభాయి బాభీతో అన్నాడు. "పరారు కావడానికి తొందరపడకు. యిద్దరం పరారైతే ప్రభుత్వం మన ఆస్తిపాస్తుల్ని జప్తు చేస్తుంది. బ్యాంకులో ఉన్న డబ్బునూ తీసేసుకుంటుంది. అవుసరమైనప్పుడు నేను పిలిపిస్తాను. ఈ పోరాటం సుదీర్ఘమైంది. తొందరపడకు."

భగత్సింగునూ, దత్తునూ విడిపించే కార్యక్రమంలో స్త్రీలు అవుసరమౌతారని బాభీకి తెలిసింది. ఆమె తనకా అవకాశం యివ్వవలసిందని భర్తనడిగింది. భగవతీచరణ్ ఈ మాటు కాదనలేక పోయాడు. బంగాళా ఒకటి అద్దెకు తీసుకునే బాధ్యతను నాకిచ్చారు. అద్దెకు తీసుకున్నాక, బాభీ, ప్రకాశవతి - ఆ గృహంలోని గృహిణులవుతారు.

కార్యక్రమాలన్నీ చాలా త్వరగా జరిగిపోతున్నాయి. మే నెల ఎండలు దహించేస్తున్నాయి. నేను జైలుకు సమీపంలో బహావల్ పూర్ రోడ్డులో బంగళా సగభాగాన్ని అద్దెకు తీసుకున్నాను. మిగిలిన సగ భాగంలోనూ, మదరాసు ప్రాంతపు యింజనీరు ఒకతనుంటున్నాడు. పక్కమేడలో పెన్షను పుచ్చుకుంటున్న జడ్జి మిస్టర్ భోసలా ఉంటున్నాడు. ఎవరికీ అనుమానం కలగని ప్రశాంతమైన వాతావరణం అది.

బంగళా అద్దెకు తీసుకున్నాము. అయితే, ఫర్నిచర్ ఏమీ తీసుకోలేదు. బంగాళాలో ప్రవేశించడానికి ముందు, దుర్గాబాభీ ఇంద్రపాల్ తీసుకున్న ఇంటికి వచ్చింది. శచిని తీసుకురాలేదు. ప్రమాదాన్ని వరించడానికి వచ్చింది తను. శచిని వెంట తెస్తే ఎలా ? ధన్వంతరీ అన్నగారి పేరు విద్యారత్న, శచిని వారి దగ్గర ఉంచి వచ్చింది. దుర్గాబాభీ ఒక్క సూటుకేసు మాత్రమే వెంట తెచ్చుకుంది. ఆమె గుర్రపు బండిలోనూ, నేను సైకిలు మీద బంగళాకు వెళ్ళాం. బంగళాలోని పనిమనిషీ, తోటమాలీ కొత్తగా అద్దెకొచ్చిన దొరసానమ్మగారిని చూడడానికి ఆతురతపడుతున్నారు. బాభీని గుర్రపు బండిలో చూడగానే, పనిమనిషి తోటమాలీని కేక వేసింది. తోటమాలి తన గదిలో నుండి బైటకు వచ్చి "గుర్రపు బండిలో వచ్చారా ?" అని పనిమణిషితో అంటూ పెదవి విరిచింది.

మాలీ అన్నమాట నా చెవిన పడింది. మనస్సు చివుక్కుమంది. ఫర్నిచరూ, మోటార్‌కారూ - మాకు అవుసరం లేకపోయినప్పటికీ ఇతరుల దృష్టికి ఎబ్బెట్టు లేకుండా, ఆ బంగళాకు తగిన వారం అనిపించుకోవడానికి, వాటి అవుసరం ఎంతైనా వుంది.

జైలు మీద దాడిచేసి, భగత్సింగునూ, దత్తునూ తెచ్చుకునే కార్యక్రమం కోసం ఒక కారును ఎటూ మాట్లాడుకున్నాము. ఆ కారును సాధ్యమైనంత ఎక్కువ సేపు బంగళా ముందు ఉంచవలసిందని ధన్వంతరీకి కబురు పెట్టాము.

నేను మాల్‌రోడ్డులో ఉన్న పెద్ద ఫర్నిచర్ కంపెనీ 'హయాత్ బ్రదర్సుకు' వెళ్ళాను. ఓ పెద్ద సోపాసెట్టూ, నాలుగు కుర్చీలూ, టీపాయ్ ఒకటీ, భోజనం చేయడానికి ఉపయోగించే మేజాలుకొన్నీ, రెండు నవారు మంచాలూ, రెండు యినుప మంచాలూ అద్దెకు తీసుకుని కాంట్రాక్టు మీద సంతకం పెట్టాను. అతడే సామానులకు బంగాళాకు పంపించాడు. నెల అయిన తరువాత అద్దె కట్టాలి. పాపం అతడికి ఈనాటి వరకూ ఆ ఫర్నిచరు తాలూకు అద్దె ముట్టలేదు. ఆ సాయంకాలమే దర్వాజాలకూ, కిటికీలకూ అందమైన పరదాలను కట్టాము. పనిమనిషి ఉదయం సాయంత్రం వచ్చి బంగాళా ముందు నీళ్ళు చల్లి పోతున్నది. అప్పటికి గాని మేము గౌరవనీయులమన్న విశ్వాసం చుట్టు ప్రక్కల వాళ్ళకు కలగలేదు.

భగవతీభాయి ఢిల్లీ వెళ్ళాడు. ప్రకాశవతిని తీసుకురావడానికీ, ఆజాద్‌నీ మరొకరిద్దరు మిత్రుల్నీ ఆయుధాలతోసహా తీసుకువచ్చే ఏర్పాటు చేయడానికీ భగవతీచరణ్ వెళ్ళాడు. తిరిగి వచ్చాక నాతో ఇలా అన్నాడు. "నువ్వు ఈ పిల్లను తీసుకువచ్చి పార్టీ నెత్తిన బెట్టావు. ఇదేం తెలివైన పనికాదు.

ఆ అమ్మాయికి తగిన వయసాలేదు, చదువు సంధ్యలూ లేవు, నలుగురితో తెలివిగా వ్యవహరించే జ్ఞానమూ అంతకంటే లేదు. వట్టి పిచ్చి బాగులది. నెత్తిమీదకు చెరగులాక్కుని నడవటము కూడా చేతకాదు. ఈ బంగళాలో ఆ అమ్మాయి ఉండటానికి తగదు. చూసేవాళ్ళకు అసందర్భంగానే ఉంటుంది. నేనామెను వెంట తీసుకువచ్చాను. అయితే, తిరిగి ఢిల్లీకి పంపించేయడమే నయమని నా ఉద్దేశ్యం."

భగవతీభాయి అన్న పై మాటలు ప్రకాశవతిని గురించినవి.

సుశీలాదీదీకూడా బంగళాలోకి వచ్చేసింది.

మరునాడు నేను ప్రకాశవతిని తీసుకుని ఢిల్లీ వెళ్ళాను. ప్రకాశవతిని అక్కడే వుంచి, ఆజాద్ ఇతర మిత్రులూ లాహోరు రావడానికి తగిన ఏర్పాట్లు చెయ్యాలి. ఆమెను మహాశయ్ కృష్ణజీగారింట్లో దించాను. వచ్చేప్పుడు ఇలా అన్నాను. "ఇది మనం ఆఖరుసారి కలుసుకోవడం. మేము జైలుమీద దాడిచేయటానికి వెళ్ళుతున్నాము. నాఉద్దేశ్యం ప్రకారం మాలో ఎవ్వరమూ బతికి తిరిగిరాము. భగవతీభాయి 'యాక్షన్'లో పాల్గొనకపోతే అతడు మాత్రమే బతికుంటాడు. అప్పుడు అతడెలా చేయమని నీకు సలహాయిస్తే, అలా చెయ్యి. ఒకవేళ అతడూ పాల్గొంటే బతక్కపోవచ్చు. మా మరణవార్తలు జూన్ రెండు మూడు తారీకుల్లో నీవు పత్రికల్లో చదువుతావు. మేమందరమూ పోయాక ఖయాలీరామ్ గుప్త ద్వారా నువ్వు ఢిల్లీ విప్లవ సంఘానికి నాయకుడైన కైలాసపతిని కలుసు కోవచ్చును.'

నా మాటలు విని ప్రకాశవతి చైతన్య విహీన అయింది. ఏమీ మాట్లాడలేకపోయింది.

"భయపడ్డావా ?" అని అడిగాను.

ఆమె మాట్లాడడానికి ప్రయత్నించింది. కానీ మాట పెకల్లేదు. తలవూపి భయపడలేదని మాత్రం తెలియపరచింది.

నేను "ఈ మార్గమే ఇంత. బహుశా రెండు మూడు నెలల్లో నీ వంతూ రావచ్చు. పోరాడుతూ చనిపో. అంతేగాని పోలీసులకు పట్టుబడకు." అని చెప్పి ఒక పిస్తోలు ప్రకాశవతికిచ్చాను. అది మధ్యాహ్న సమయం. మేమలా మౌనంగా విచారంగా ఉండడంచూస్తే, కృష్ణజీవికిగానీ వారి భార్యకుగానీ సందేహం కలగవచ్చు. మేమిద్దరం ఏదోవంక పెట్టి బైటకు వెళ్ళిపోయాం.

నేను నిశ్చయంగా మృత్యువును ఆలింగనం చేసుకోవడానికి వెళుతున్నాను. కానీ, ప్రేయసిని విడిచి వెళ్ళలేకపోతున్నాను. వెళ్ళబోయే ముందు "నన్ను జ్ఞాపకం ఉంచుకుంటావా ?" అని అడిగాను. ప్రకాశవతి తలతిప్పి "నేనూ త్వరలోనే వచ్చి మిమ్మల్ని కల్సుకుంటాను" అన్నది.

లాహోరువచ్చేశాను. బంగళాలో దుర్గాబాభీ, సుశీలాదీదీ, బచ్చన్, నేనూకాక దాడిలో పాల్గొనటానికి ఆజాద్ పంపించిన ఛైల్‌బిహారీ కూడా ఉంటున్నాడు. భగవతీభాయి, సుఖదేవ్‌రాజ్ 'కిల్లా గుజ్జర్ సింగ్'లోని యింట్లోనే వుంటున్నారు. ఛైల్‌బిహారీ బంగళాలో 'బాయ్'గా పనిచేస్తున్నాడు. అంటే వంటగదిలో నుంచి ప్లేట్లలో అన్నాలు తెచ్చి మేజాలమీద పెట్టడం, అప్పుడప్పుడూ బల్లలూ, మేజాలూ తుడుస్తూ వుండడం - ఇలాంటివే చేస్తూవుండేవాడు. జైలుమీద బాంబులూ పిస్తోళ్ళూ, రైఫిళ్ళూ తీసుకుని దాడిచెయ్యాలని నిశ్చయమైంది. అయినప్పటికీ, అతి ముఖ్యమైన ఇంకొక రెండు విషయాలు అనిశ్చితంగానే ఉండిపోయాయి.

నా ప్లాను ప్రకారం, భగత్‌సింగ్‌ను బోస్టల్ జైలుకు తీసుకెళ్ళడానికి, సెంట్రల్ జైలులో నుండి బయటకు తెచ్చేప్పుడు, గేటు దగ్గర దాడి జరపాలి. సెంట్రల్ జైలుగేటు మెయిన్ రోడ్డు మీదకువుంది. భగత్ సింగ్ ఒకప్లాను నిచ్చాడు. అతడి ప్లాను ప్రకారం బోస్టల్ జైలు నుండి సెంట్రల్ జైలుకు తెచ్చేప్పుడు దాడిజరగాలి. బోస్టల్ జైలుగేటు మెయిన్ రోడ్డుకు ఒక వంద అడుగుల దూరంలో వుంది.

మా యిద్దరి ప్లానులను ఆజాద్‌కు చెప్పాము. వాటిల్లో ఏ ప్లానును ఆజాద్ ఉత్తమమైందిగా భావిస్తాడో, దాని ప్రకారం దాడి జరుగుతుంది.

మరో ముఖ్యమైన విషయం, ఆజాద్ ఢిల్లీ నుండి ముగ్గురు మిత్రుల్ని తీసుకొచ్చాడు. ఈ దాడిలో పాల్గొనడానికి ! ఆ ముగ్గురూ కాక, లాహోరులోని మిత్రుల్లో ఎవరెవరిని ఈ దాడికి సిద్ధం చెయ్యాలి? ముఖ్యమైన సమస్య భగవతీచరణ్‌ది ! అతడు ఈ దాడిలో తనూ పాల్గొంటానని పట్టుబడుతున్నాడు. నేను వ్యతిరేకిస్తున్నాను. ఇలా అంటున్నాను. "నేనూ, ఆజాద్ మేమిద్దరం పాల్గొంటున్నాం కదా ? అలాంటప్పుడు నువ్వు వెనక్కు తగ్గడం మంచిది !"

సుఖదేవ్‌రాజ్‌ది కూడా ఒక సమస్య అయింది. భగవతీచరణ్ అతణ్ని మంచి సాహసికుడనుకుంటున్నాడు. కనుక, దాడిలో ఉంచుదామంటున్నాడు. కానీ, అతడి సాహసాన్ని నేను విశ్వసించలేక పోతున్నాను. ఎలాంటి పరిస్థితిలోనూ వెనకడుగు వెయ్యని మిత్రుల్నే ఈ కార్యక్రమంలో ఉంచాలని నేను పట్టుబడుతున్నాను. ఆ రోజున సుఖదేవ్‌రాజ్ నీల్‌ని కాలుస్తానని వెళ్ళి, వెనక్కు తిరిగివచ్చి, నాతో అబద్ధమాడిన విషయాన్ని భగవతీచరణ్‌కు చెప్పాను.

భగవతీచరణ్ గంభీరంగా "నేను ఒకటి చెప్తున్నాను విను. సుఖదేవరాజు నువ్వు అనకున్నంత చెడ్డవాడు కాదు. యింతవరకూ ఒక్క 'యాక్షన్'లోనూ పాల్గొనక పోవడం వల్ల అతడు ఎక్కిరి కొక్కిరి పనులు చేస్తున్నాడు. రేపు 'యాక్షన్'లో పాల్గొంటే అతడూ స్థిమిత పడతాడు" అన్నాడు.

ఆజాద్, నన్నూ, భగవతీచరణ్‌నూ కూర్చోబెట్టుకుని చాలాసేపు జైలు ఆక్రమణను గురించి మాట్లాడాడు. నా ప్లాను ప్రకారం దాడి చేయడమా ? లేక భగత్‌సింగ్ యిచ్చిన ప్లాను ప్రకారం దాడి చేయడమా ? అన్న సమస్య ఎంతకీ తేలడం లేదు. నా ప్లాను ప్రకారమైతే సెంట్రల్ జైలు నుంచి కోర్టుకు తీసుకెళ్ళేప్పుడు గానీ, లేక బోస్టన్ జైలుకు తీసుకెళ్ళేప్పుడు గానీ దాడి జరగాలి. భగత్‌సింగ్ యిచ్చిన ప్లాను ప్రకారమైతే బోస్టల్ జైలు నుంచి సెంట్రల్ జైలుకు తీసుకురావడానికి భగత్సింగ్, దుత్త ఇద్దర్ని పోలీస్ వ్యాన్‌లో కూర్చోబెట్టబోయేప్పుడు, దాడి జరగాలి. ఆజాద్ నా ప్లానులో ఉన్న లోపాన్ని ఎత్తి చూపాడు. "సెంట్రల్ జైలు గేటు దగ్గర పోలీసులు ఎక్కువ సంఖ్యలో ఉంటారు. పక్కనే షేర్‌దిల్ పోలీసుల డేరా కూడా ఒకటుంది. బోస్టల్ జైలు దగ్గర ఎక్కువ మంది పోలీసులు ఉండరు. ఒక్క ఆరుగురు పోలీసులు మాత్రం ఉంటారు !" అన్నాడు ఆజాద్.

బోస్టల్ జైలు దగ్గర దాడి జరపడాన్ని గురించి నేనీ అభ్యంతరాన్ని చెప్పాను. "బోస్టల్ జైలు మెయిన్ రోడ్డుకు బాగా దూరంలో ఉంది. బస్సులో కూర్చోబెట్టేటప్పుడు దాడి చేయాలంటే మన కారు జైలుకు అభిముఖంగా బాగా దగ్గరకు పోవాలి. మన కారు అలా జైలు వైపు తిరగగానే పోలీసులు అనుమానించి, జాగ్రత్తపడే ప్రమాదం ఉంది. కాకపోతే, పోలీసులు భగత్‌సింగ్‌నూ, దత్తునూ కారులో కోర్చోబెట్టుకుని తీసుకువెళ్ళేప్పుడు కాల్పులు సాగించవలసి ఉంటుంది. పోలీసులు భగత్‌సింగ్‌నూ, దత్తునూ చుట్టుకుని కూర్చుని ఉంటారు. దూరం నుంచి కాల్చడంలో తుపాకీ గుడ్లు పోలీసులకే తగులుతాయని ఎలా చెప్పగలం ? భగత్‌సింగ్‌కూ, దత్తుకూ తగిలినా తగలవచ్చును ! పైగా, బోస్టల్ జైలు దగ్గర కాల్పులు గలభా ప్రారంభమైతే సెంట్రల్ జైలు దగ్గర ఉన్న షేర్‌దిల్ పోలీసులు పరుగెత్తుకు రావచ్చు. మరి సెంట్రల్ జైలు దగ్గర పరిస్థితి వేరు ! భగత్‌సింగ్‌నూ, దత్తునూ సెంట్రల్ జైలు గేటు నుండి బైటకు తీసుకురాగానే కాపలా పోలీసుల మీద ఒక బాంబు, షేర్‌దిల్ పోలీసుల మీద ఒక బాంబు వేయాలి. అలా వేయడం వల్ల పోలీసుల్లోనూ ప్రజల్లోనూ కోలాహలం బయలు దేరుతుంది. ఆ గలభాలో భగత్‌సింగ్, దత్తూ మన కారువైపు పరుగెత్తుకు వస్తారు. ఎవడైనా పోలీసు వీళ్ళను వెంబడిస్తే మిగిలిన మిత్రులు ఆ పోలీసు పని పట్టుతారు ! సెంట్రల్ జైలు గేటు బాగా రోడ్డు మీదకు వుంది. మన కారు

ప్రత్యేకం గేటు వైపు తిరగవలసిన పని లేదు. పైగా ఆ రోడ్డున ఎన్నో కారులు పోతుంటాయి. తప్పించుకోవడం కూడా సులభం !"

భగవతీచరణ్ ఉద్దేశ్యం మరో రకంగా ఉంది. నేను సెంట్రల్, బోర్‌స్టల్ జైళ్ళను దూరం నుండి చూసి ప్లాను వేస్తున్నాను. కానీ, భగత్‌సింగ్ ఆ జైళ్ళల్లో ఉంటున్నాడు. ఆ గేట్ల గుండా నడుస్తున్నాడు. కనుక అతడి ప్లానే ఎక్కువ విశ్వాసయోగ్యమైందని భగవతీచరణ్ ఉద్దేశ్యం.

చివరకు భగత్‌సింగ్ ప్లాను ప్రకారం దాడి జరపాలని నిర్ణయమైంది. పోతే దాడిలో భగవతీచరణ్ పాల్గొనే సమస్య వచ్చింది. తను పాల్గొనే విషయాన్ని గురించి ఆర్ద్రస్వరంలో భగవతీచరణ్ ఇలా అన్నాడు. "నేను తర్కించలేను. కానీ, ఈ 'యాక్షన్'లో పాల్గొనాలని అనుకుంటున్నాను. ఈ పోరాటంలో ఒకవేళ నేను చనిపోతే పంజాబు ప్రాంతపు నాయకత్వాన్ని తీసుకోవడానికి ధన్వంతరీ, సుఖదేవ్‌రాజ్ లాంటి అనుభవజ్ఞులైన మిత్రులున్నారు. సెంట్రల్ కమిటీలోని నా స్థానాన్ని సోహన్ (యశపాల్) పూర్తి చేయవచ్చును. నా తరువాత ఆజాద్‌కు తోడుగా వుండి సెంట్రల్ కమిటీలోని బాధ్యతలను సోహన్ చూసుకోవాలని అనుకుంటున్నాను. కనుక, ఈమాటు సోహన్ యాక్షన్‌లో పాల్గొనకుండా ఉండడం బాగుంటుంది."

అప్పటికి నేను, యాక్షన్‌లో ఎవరు పాల్గొనేదీ నిర్ణయించడం మర్నాటికి వాయిదా వేయమని కోరాను.

జూన్ ఒకటవ తారీకున ఆదివారం నాడు బోర్‌స్టల్ జైలు మీద దాడి చేయాలనుకున్నాం. నేను భగవతీభాయితో, ఏకాంతంలో ఇలా మాట్లాడాను. "ఇప్పుడు నేను దాడిలో పాల్గొనక పోవడం వల్ల ఎన్నో రకాల అపోహలు బయల్దేరుతాయి. సుఖదేవరాజు నీతో చెప్పినట్లే, మిగిలిన మిత్రులకు కూడా చెప్పాడు. నేను ప్రకాశవతి మీది మోహం వల్లనే దాడిలో పాల్గొన లేదని నలుగురూ అనుకుంటారు. మరొకటి, నా ప్లానును మీరు అంగీకరించక పోవడం వల్ల నేను దాడిలో పాల్గొనలేదని ప్రచారం జరుగుతుంది !"

భగవతీచరణ్ నా భుజం మీద చెయ్యి వేసి "ఏమిటి నీ అర్థం లేని మాటలు ? ఏవో ప్రచారాలు జరుగుతాయని మనం భయపడతామా? నా గురించి ఎన్ని రకాల ప్రచారాలు జరగలేదు! ....... నేను ప్రతిసారి నీ మాటనే వింటూ వచ్చాను. ఈసారికి నువ్వు నామాట విను !" అన్నాడు.

నేను ఏమీ మాట్లాడలేకపోయాను.

మే 23వ తారీకు ఉదయాన్నే భగవతీచరణ్ "బాంబుల్ని కూరి సిద్ధం చెయ్యి. ఒకదాన్ని పరీక్షిద్దాం !" అన్నాడు.

రోహతక్‌లో తయారుచేసిన పేలుడు పదార్థం ఇంకా కొంత వుంది. భయ్యా ఆజాద్ కాన్పూరులో బాంబుల డిప్పల్ని పోతపోయించాడు. ఈ దాడిలో ఉపయోగించడానికి మూడింటిని పట్టుకొచ్చాడు. నేను వాటిని పరీక్షించి "వీటిలో ఒకదాని ట్రిగర్ వదులుగా వుంది. స్క్రూడ్రైవర్ తీసుకువచ్చి సరిచేయాలి." అన్నాను.

బాంబు డిప్పల్లో పదార్థాన్ని కూరేప్పుడు లోపల శుభ్రం చేసి వార్నీషును పూయడం కద్దు. అలా చేయడం వల్ల డిప్పలకూ పేలుడు పదార్థానికీ రాపిడి జరిగి రసాయనిక క్రియ ఉత్పన్నమై, బాంబు తనంత తాను పేలే ప్రమాదం వుండదు. అలాంటి రాపిడివల్ల ఉత్పన్నమయ్యే రసాయనిక క్రియ క్రమంగా వృద్ధి చెంది, పది రోజుల తరువాత కూడా బాంబును పేల్చవచ్చును. నేను 'జపాన్ బ్లాక్' వార్నీషును బాంబులోపల పూసి, వాటిని ఆరడానికి విడిగా పెట్టాను. నా ఉద్దేశ్యం ప్రకారం అవి ఓ పది గంటల్లో ఆరిపోవాలి. ఈలోపు స్క్రూడ్రైవర్‌ని తెచ్చుకుని, ట్రిగర్‌ని సరిచేయవచ్చును. ఉదయం ఎనిమిది, తొమ్మిది గంటలా ప్రాయల నేను డిప్పలను ఆరడానికి పెట్టాను. ఇది బహావల్‌పూర్ రోడ్డులో

తీసుకున్న బంగళాలో జరిగింది. నేనప్పుడే సైకిలు వేసుకుని బైటకు వెళ్ళాను. ఒకటి రెండు రోజుల్లో ఎన్నో విషయాలు చూసుకోవాలి. స్నేహితులను దాచే ప్రదేశాల్ని ఎన్నుకోవాలి. కారును ట్రైల్ చూసుకోవాలి. ధన్వంతరీ తీసుకొచ్చిన ఇద్దరు డ్రైవర్లలో ఎవరు ఉపయోగపడతారో చూసుకోవాలి !

నేను మధ్యాహ్నం మూడు గంటలకు బంగళాకు తిరిగొచ్చాను. మే నెల ఎండల్లో, ఎక్కడెక్కడో తిరిగొచ్చాను. నా కోసం పెట్టి వున్న చల్లారిపోయిన అన్నం తింటున్నాను. అప్పుడు బంగళాలో బాభీ, సుశాలా దీదీ, ఛైల్ బిహారీ, మదన్ గోపాల్, నేనూ ఉన్నాము. అజాద్, ధన్వంతరీతోపాటు కలసి కారును స్వయంగా చూసిరావడానికి వెళ్ళాడు. భగవతీచరణ్, బచ్చన్, సుఖదేవ్‌రాజ్ ఈ ముగ్గురూ ఒక బాంబును తీసుకుని రావీనది తీరానికి వెళ్ళారు; పరీక్షించడానికి !

"బాంబును కూరిందెవరు ? లోపల ఆరిందా ?" అని అడిగాను. బాంబును ఎండలో ఎండబెట్టారని చెప్పారు. భగవతీభాయి, సుఖదేవరాజు కలసి ట్రిగర్‌ని కూడా బాగుచేశారని చెప్పారు.

మేము ఇంకా మాట్లాడుతూనే ఉన్నాము. వాకిట్లోకి ఒక గుర్రపు బండి వచ్చింది. అందులో సుఖదేవరాజు ఉన్నాడు.

"నన్ను బండిలో నుంచి దింపండి." సుఖదేవరాజు బాధతో మూలిగినట్టు అరిచాడు.

నేనూ, ఛైల్ బిహారీ, మదన్ గోపాల్ ముగ్గురం అతణ్ని బండిలో నుంచి దించాము. అతడి కాలికి కట్టివున్న కట్టులో నుండి రక్తం కారుతూన్నది. మాకు అనుమానం వేసింది. దెబ్బ తగలడానికి కారణాన్ని అడిగాము. బాధతో పెదవుల్ని కొరుక్కుంటూ 'బాంబుల్ని పరీక్షించేప్పుడు హరిభాయీ (భగవతీచరణ్) చేతిలోనే పేలిపోయింది. అతను బాగా గాయపడ్డాడు. బాంబు దెబ్బకు కింద పడిపోయాడు. నా కాలికి బాగా దెబ్బ తగిలింది. బచ్చన్ వెనక ఉన్నాడు. అతనికేమీ దెబ్బ తగల్లేదు. హరిభాయీ దగ్గర బచ్చన్‌ని ఉంచి నేను వచ్చాను." అన్నాడు సుఖదేవరాజ్.

నేను ఛైల్‌బిహారీని వెంటబెట్టుకుని మాల్‌రోడ్డు మీదుగా చారింక్రాస్ వైపు పరుగెత్తాను. నేనూ ఛైల్ బిహారీ నిజంగా రోడ్డున పరుగెత్తుతున్నాము. ఒక టాక్సీని కుదుర్చుకుని, రావీ తీరానికి వెళ్ళాము. అక్కడ నుండి తీరాన్ని దాటి అడవిలోకి వెళ్ళాం. అడవిలో 'బచ్చన్' 'బచ్చన్' అని అరుస్తూ అటూ యిటూ తిరిగాం. కొంత సేపటికి మా కేకలకు సమాదానంగా బచ్చన్ పలికాడు. అతడి స్వరాన్ని అనుసరించి భగవతీచరణ్ పడి ఉన్న చోటుకి వెళ్ళాం.

భగవతీచరణ్ వెల్లకిలా పడివున్నాడు. రెండు మోకాళ్ళూ పైకి ముడుచుకుని ఉన్నాయి. రెండు మోచేతులూ పైకి లేచి ఉన్నాయి. ఒక చేతికి ముంజేయి ఎగిరి పోయింది. మరొక చేతికి వేళ్ళన్నీ ఎగిరిపోయాయి. ముఖానికి బాగా దెబ్బలు తగిలాయి. పొట్టకు ఎడమ వైపున పెద్ద పెద్ద రంధ్రాల పడి రక్తం కారుతూన్నది. కుడివైపున పొట్ట పగిలి పేగులు కొన్ని బైటకు వచ్చాయి. బచ్చన్ నదిలో గుడ్డ తడుపుకు వచ్చి భగవతీచరణ్ గొంతులో చుక్క చుక్క నీళ్ళు పోస్తున్నాడు.

మమ్మల్ని చూసి భగవతీచరణే ముందు మాట్లాడాడు. "మీరొచ్చారా ? అజాద్ కూడా వచ్చి వుంటే కండ్లతో చూసేవాడిని !" అన్నాడు.

"భయ్యా యిప్పుడు యింట్లో లేడు. ఉంటే తప్పకుండా వచ్చేవాడు." అన్నాను.

"రాకపోయినా ఫరవాలేదు." భగవతీభాయి మమ్మల్ని చింతించవద్దన్నాడు.

మేమందరం స్కౌటింగ్ శిక్షణ పొందిన వాళ్ళమే ! ఒకరి చేతులు మరొకరం కలుపుకుని భగవతీచరణ్‌ని చేతుల మీదకు ఎత్తుకుని కారు వరకూ తీసుకువెళ్ళడానికి ప్రయత్నించాము. శరీరం కదిలేసరికి బాధకు ఓర్వలేక భగవతీచరణ్ వెర్రికేక పెట్టాడు. తిరిగి పడుకోబెట్టేశాము. ఒక మంచమో, స్ట్రేచరో ఉంటేగాని అతన్ని కారు వరకూ తీసుకుపోలేం.

దుఃఖావేశం వల్ల, మూసుకుపోయిన గొంతును సరిచేసుకుంటూ "భయపడకు. నేను యిప్పుడే వెళ్ళి, ఓ మంచం పట్టుకొస్తాను !" అన్నాను.

"నేను భయపడుతున్నాననుకున్నావా ? లేదు. భగత్‌సింగ్‌ను విడిపించే కార్యక్రమంలో పాల్గొనలేకపోతానే అని విచారిస్తున్నాను. ఈ మృత్యువు రెండు రోజుల తరువాత వస్తే ఎంత బాగుండేది !" అన్నాడు భగవతీచరణ్.

మంచం తీసుకువచ్చి, తనను తీసుకువెడతానన్న మాటకు సమాధానంగా భగవతీచరణ్ ఇలా అన్నాడు. "అనవసరం. అలాంటివేమీ పట్టుకురాకు. బాంబు పేలిన శబ్దం చాలా దూరం వరకూ వినిపించి ఉంటుంది. పోలీసులు వచ్చినా రావచ్చు ! నీ దగ్గర ఉంటే ఒక రివాల్వరు నాకిచ్చి వెళ్ళు. పోలీసులకు బాంబు పేలడం వల్ల నేను దెబ్బతిన్నానని కబురు పెట్టు. భగత్‌సింగ్‌ను విడిపించే ప్రయత్నం ఆగడానికి వీల్లేదు". భగవతీచరణ్ ఇంగ్లీషులో ఆగి ఆగి మాట్లాడుతున్నాడు. అతడు మంచి తెలివిలో ఉన్నాడు. తను బ్రతకనని అతనికి తెలుసు. ఒకటికి వెళ్ళవలసిన అవసరం అనిపిస్తున్నా, ఒకటికి రావడంలేదనీ, బాంబు ముక్క ఏదో మూత్రద్వారానికి అడ్డంపడి ఉంటుందని చెప్పాడు. మృత్యువును ఎదుట చూసి కూడా భయమేమిటో ఎరుగని ఇలాంటి మహావీరులైన విప్లవకారుల్ని, విదేశీదోపిడీగాడైన వైస్రాయి పట్ల సానుభూతిని చూపే సందర్భంలో గాంధీగారు, పిరికివారనీ, నీచకార్యాలు చేసేవారనీ నిందించారు !

ఛైల్ బిహారీని భగవతీచరణ్ దగ్గర ఉంచి, బచ్చన్‌ని వెంటబెట్టుకుని నేను క్రిస్టియన్ కాలేజి బోర్డింగ్‌లోకి వచ్చాను. దేవరాజ్ సేఠీ, సచ్చిదానంద హీరానంద వాత్స్యాయన్ (ఇప్పుడు 'అజ్ఞేయ' అన్న పేరుతో ప్రసిద్ధినొందాడు.) తో కొత్తగా పరిచయ మైంది. ఇద్దరూ బాగా బలంగా ఉండేవారు. భగవతీచరణ్‌ని తేలిగ్గా ఎత్తుకుని కారు వరకూ తీసుకురావడానికి వారు సహకరించగలరు. బోర్డింగ్‌లోనే రెండు దుప్పట్లూ, ఒక మంచమూ తీసుకున్నాం. వెంటనే వెనక్కు తిరిగి భగవతీభాయి దగ్గరకు బయల్దేరాము. దారిలో ఇంత మంచుగడ్డను కొనుక్కున్నాము. గాయాలకు అనిస్తూ వుండవచ్చునని

బాగా చీకటి పడిపోయింది. అడవిలో టార్చిలైట్లను వెలిగించుకుని, భగవతీచరణ్ ఉన్న ప్రదేశంకోసం వెతుకుతున్నాము. ఛైల్ బిహారీని పేరుబెట్టి, పెద్దగా పిలవడం ప్రారంభించాము. ఎన్ని మారులు పిలిచానా సమాధానం లేదు. మా కేకలకూ, సందడికీ చెట్లమీద ఉన్న పక్షులు భయపడి ఎగిరిపోతున్నాయి.

చెట్ల కొమ్మలకు తెల్లని గుడ్డపీలికలు కనిపించాయి. ఆ గుడ్డ పీలికల్ని అనుసరించి ముందుకు వెళ్ళాం.

టార్చిలైట్ల వెలుతురులో భగవతీచరణ్ మృత శరీరం మాకు కనుపించింది. భగవతీచరణ్ చనిపోయాక ఛైల్‌బిహారీ భయపడి ఉంటాడు. అందుకే అతడు శవాన్ని ఒంటరిగా వదిలి వెళ్ళిపోయాడు.

భగవతీచరణ్‌ని ఆ స్థితిలో చూసేసరికి గుండె గొంతుకలో కొచ్చినట్టయింది. పెదవి కొరుక్కుని ఆవేశాన్ని అణచు కున్నాను. బచ్చన్ వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. ఇప్పుడేంచేసేట్టు ? శవాన్ని బంగళాలోకి తీసుకెళితే మళ్ళీ బైటకు తీసుకు రావడం పెద్ద సమస్య అవుతుంది కదా ? మిత్రులందరం ఇరుకున పడతాం. ఒక దుప్పటితో భగవతీచరణ్ శరీరాన్ని కప్పివేశాము.

నేను రుద్ధస్వరంతో ఆదేశించాను. "We must honour our brave leader and give him last salute" అన్నాను. నేను 'శాల్యూట్' అనగానే అందరూ శవం చుట్టూచేరి సలామ్ పెడుతున్నట్లు తమ చేతులను నుదురుకు ఆనించు కున్నారు. ఒక్క క్షణం అలాగే నిలబడ్డాము.

మేము నలుగురం తిరిగి వచ్చేశాము. తిరిగి వచ్చేప్పుడు నా శరీరం విరగ్గొట్టినట్టుంది. బాగా అలసిపోయాను. అడుగు ముందుకు పడడం లేదు. ఒకమాటు ఉదయం నండి రాత్రి ఒంటిగంట వరకూ అరవై నాలుగు మైళ్ళు ఏక బిగువున నడిచాను. అప్పుడూ నేనింత అలసట చెందలేదు.

నేనూ బచ్చన్ బంగళాకు తిరిగి వచ్చాము. బంగళాలో అందరూ మధ్య గదిలో వదిగి ప్రాణాలు బిగబట్టుకుని కూర్చుని ఉన్నారు. మేము వెళ్ళగానే వాళ్ళల్లో సంచలనం కనిపించింది. కళ్ళు పెద్దవి చేసి ప్రశ్నించారు. "ఏమైంది ?"

నేను రెండు చేతులనూ అడ్డంగా తిప్పి "సర్వనాశనం." అన్నట్టు సౌజ్ఞ చేశాను.

బచ్చన్ బావురుమన్నాడు.

బాభీ కూర్చున్నది కూర్చున్నట్టే కళ్ళు మూసుకుంది. సుశీలా దీదీ నిర్విణ్ణురాలై రెండు చేతులతో తలను పట్టుకుని ఉండిపోయింది. ఆజాద్ ఏమీ మాట్లాడలేక మౌనంగా నేలవంక చేస్తున్నాడు. మదన గోపాల్ శిలాప్రతిమలా అయిపోయాడు. సరీగా అదే సమయానికి ఛైల్ బిహారీ వచ్చాడు. అతడు నడిచి వచ్చినట్టున్నాడు. కనుక, మా కంటే, ఆలస్యంగా బంగళాకు చేరాడు. అతణ్ణి చూడగానే నాకు ఎక్కడలేని కోపమూ వచ్చింది. "నువ్వు వదిలిపెట్టి ఎలా వచ్చావ్ ?' అని అడిగాను.

అతడు తన వివశతను వ్యక్తపరిచాడు. "చనిపోయాక వచ్చేశాను."

"నిన్ను అక్కడ ఉండమని చెప్పాను కదా ? మేము ప్రదేశాన్ని తెల్సుకోలేక కేకలు వేస్తూ ఎంతోసేపు తిరిగాము !"

"దారి తెలియడానికి గుడ్డపీలికలు చెట్ల కొమ్మలకు కట్టాను !"

ఆజాద్ తల ఎత్తాడు. కోపంతో అతడి పెదవులు కంపిస్తున్నాయి. 'నిన్నసలు వదిలిపెట్టి ఎవడు రమ్మన్నాడు ?" అని, కోపగించుకోవడం అనవసరం కావడం వల్ల మౌనాన్ని వహించాడు.

చాలా సేపటి వరకు ఎవరూ ఏమీ మాట్లాడలేకపోయారు. అందరి కంటే ముందు ఆజాద్ మాట్లాడాడు. "ఇంక ఏమీ ప్రయోజనం లేదు. మీరు లేవండి !" అన్నాడు.

చాలా బాధగా ఆజాద్ మాట్లాడుతున్నాడు. అతడు దుర్గాబాభీని ఉద్దేశించి "నువ్వు మా అందరికి తల్లివి - సోదరివి ! నువ్వు పార్టీకోసం సర్వస్వాన్ని త్యాగం చేశావు. మేమంతా నీకు ఋణపడి వున్నాం. నీపట్ల మాకు గల కర్తవ్యాన్ని ఎన్నటికీ మర్చిపోము !" అన్నాడు.

ఆజాద్, బచ్చన్ చెరోప్రక్కా పట్టుకుని, బాభీని తీసుకువెళ్ళి మంచంమీద పడుకోబెట్టారు. బాభీ చైతన్య విహీన అయింది. ఏడవటం లేదు. కన్నీళ్ళు పెట్టుకోవడమూ లేదు. మాట్లాడడమూ లేదు. హృదయాన్ని వ్రయ్యలు చేయగల ఆఘాతం తగిలిందామెకు. ఇంక కన్నీళ్ళు ఎక్కడ నుంచి వస్తాయి ? ఏడుపు ఎక్కడనుంచి వస్తుంది ? ఆ బంగళాలో వున్న మా అందరి క్షేమమూ, నాయకుడి క్షేమమూ బాభీ దుఃఖాన్ని అణచుకోవడం మీద ఆధారపడి వుంది ! ఆమె ఏడుపులూ, పెడబొబ్బలూ ప్రారంభించిందా ? మాపని గల్లంతు అవుతుంది.

ఆజాద్ ధైర్యంగా ఉండమని సుశీలాదీదీకీ చెప్పాడు. ఆమెనూ ఒక మంచం మీద పడుకోబెట్టాడు. దాదాపు రాత్రి 11 గంటలయింది. నేను దుఃఖ సముద్రంలో మునిగివున్నాను. ఒక సోఫాలో మౌనంగా పడి వున్నాను.

ఆజాద్ లైట్లు ఆర్పేసి, నన్ను బైటకు తీసుకువెళ్ళి ఇలా అడిగాడు "శరీరాన్ని ఏం చేసి వచ్చారు ?"

"దట్టమైన చీకటి. పరిసరమా కొత్తది. ఏమి చెయ్యడానికీ తోచక, శవం మీద ఒక దుప్పటిని కప్పి వచ్చాము" అన్నాను.

"జంతువులేమన్నా శరీరాన్ని పాడుచేస్తాయేమో ? మనం తెల్లవారు జామున వెళదాము. నేనూ ఒక మాటు చూసినట్లవుతుంది. శవాన్ని ఏదో ఒకటి చేసివద్దాం." అన్నాడు ఆజాద్.

ఆజాద్, భగవతీచరణ్‌కు తగిలిన దెబ్బలను గురించి నన్ను అడుగుతూ ఉన్నాడు. నేను చెప్తూ ఉన్నాను.

"ఇప్పుడేం చేసేట్టు ? యిద్దరు మనుష్యులు తక్కువయ్యారు కదా ? 'యాక్షన్' జరపగలమంటావా ?" అని అడిగాడు ఆజాద్.

"యాక్షన్ తప్పకుండా జరపాలి. ఇది భగవతీచరణ్ అంతిమ కోర్కె. ఏమైనా సరే యాక్షన్ జరిగి తీరవలసిందే !" అన్నాను నేను.

నేను సైకిళ్ళు బైటకు తెచ్చాను. ఆజాద్, సుశీలాదీదీకి చెప్పి రావడానికి వెళ్ళాడు. ఆమె 'నేనూ అంతిమ దర్శనం చేసుకుంటాను' అని పట్టుబట్టింది.

ఆజాద్ నన్ను అడిగాడు "తీసుకు వెళదామా ?"

నేను వద్దన్నాను.

సుశీలాదీదీ చాలా బతిమలాడింది. ఆజాద్ నావంక చూశాడు. "తీసుకువెళితే నష్ట మేమిటి ?" అని అడిగాడు.

నేను "ఇంకా వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. రౌండు తిరుగుతున్న పోలీసులు అక్కడక్కడా కనిపిస్తారు. రాత్రిపూట ఇలా స్త్రీని, సైకిలు మీద కూర్చోబెట్టుకు తీసుకుపోతే, పోలీసులు తప్పకుండా అనుమానిస్తారు !" అన్నాను. ఆ రోజుల్లో లాహోరులో ఆడవాళ్ళను సైకిలు మీద, వెనుక కూర్చోబెట్టుకు తీసుకువెళ్ళే ఆచారం లేదు. దుర్గాబాభీ మమ్ముల్ని కల్సుకోటానికి ధర్మపాల్ వెంటగానీ, ధన్వంతరీ వెంటగానీ సైకిలు మీద వెనుక కూర్చుని వచ్చేది. అందుకనే బాభీని చుట్టుపట్ల కుటుంబీకులు 'తిరుగుబోతు' అని అనుకునేవారు.

బాభీ ఇంకా అలాగే పడి ఉన్నది. నేనూ, ఆజాద్, బచ్చన్ ముగ్గురం బయల్దేరి వెళ్ళిపోయాము. రావీ తీరానగల అడవిలోకి వెళ్ళే సరికి సూర్యోదయం కావచ్చింది. అక్కడక్కడా కాకులు కూస్తున్నాయి. భగవతీభాయి శరీరం తెల్లని దుప్పటితో కప్పి వుంది. ఏ జంతువూ కదిలించలేదు. కాకపోతే రక్తపు వాసనను పట్టి గండు చీమలు వచ్చాయి. దుప్పటి మీద అటూ యిటూ తిరుగుతున్నాయి.

మేము పరిసరాన్ని ఒకమాటు కలయచూశాము. పలుగూ, పార ఏమీ వెంట తీసుకెళ్ళలేదు. శవాన్ని పాతి పెట్టడం సంభవం కాదు. అక్కడికి కొద్ది దూరంలో రావీనది శాఖ ఒకటుంది. నీళ్ళు నిండుగా ఉన్నాయి. మాకేం చెయ్యటానికీ తోచలేదు. మీద కప్పిన దుప్పటిలోనే శవాన్ని గొంతుకు కూర్చున్నట్లుగా మూటగట్టాము. శవంతోపాటు మూటలో పెద్ద పెద్ద రాళ్ళను కొన్నింటిని వేశాం, పైకి తేలకుండా ! బచ్చన్ చిన్న కత్తెరను ఒకదాన్ని పట్టుకొచ్చాడు. శవం తలమీద ఉన్న వెంట్రుకలను కొన్నింటిని కత్తిరించుకుని, జ్ఞాపకార్థం దగ్గర వుంచుకున్నాము. గట్టిగా మూటగట్టాక ముగ్గురం తీసుకువెళ్ళి మూటను రావీనది శాఖలో వదిలిపెట్టాము.

బంగళా అంతా విషాదంలో మునిగి ఉంది. ఎవరూ ఎవరితోటి మాట్లాడటం లేదు. ఎవరికీ తిండీతిప్పలూ కూడా లేవు. అప్పుడప్పుడూ ఆజాద్ జూన్ ఒకటవ తారీకున జరుపవలసిన దాడిని గురించి ప్రశ్నిస్తూ ఉండేవాడు. నేనేమీ మాట్లాడలేక పోయేవాడిని. ఒక్కటి మాత్రం చెప్పేవాడిని. "ఏమైనా కానీ 'యాక్షన్' జరిగి తీరవలసిందే."

సుశీలాదీదీ కళ్ళు తుడుచుకుంటూ, బాభీని ఓదార్చడానికి ప్రయత్నించేది. బాభీ మన ప్రపంచంలోనే లేదు. మంచం మీద ఎలా పడుకోబెట్టారో, అలాగే ఉంది. కదలలేదు. ఏడవలేదు.

అజాద్ కూడా మాటిమాటికీ బాభీ దగ్గరకు వెళ్ళి, విప్లవ సంఘానికి వారు చేసిన సేవను గురించి చెప్పి, ఊరట కలిగించాలని చూసేవాడు. అప్పటికీ ఆమెలో ఏమీ సంచలనం కనిపించేది కాదు. బచ్చన్, బాభీ దగ్గరకు వెళ్ళి దుఃఖావేశంలో, పొర్లిపొర్లి ఏడ్చేవాడు. అతడు ఏడుస్తున్నప్పుడు మాత్రం, బాభీ కొంచెంగా కదిలేది. తన చేతితో బచ్చన్ తలను నిమిరేది. బచ్చన్‌కు ఆజాద్ అన్నా, భగవతీచరణ్ అన్నా విపరీతమైన మమకారం. అతడు ఏడుస్తూనే ఇలా అన్నాడు. "భయ్యా (అజాద్) నా హృదయంలో విప్లవ జ్యోతిని వెలిగించాడు. బాబూ భాయి (భగవతీచరణ్) ఆ జ్యోతిని అమర జ్యోతిని చేశాడు !"

మేము జరిగిన విషయం వివరంగా చెప్పమని బచ్చన్‌ని అడిగాము. బచ్చన్ ఇలా చెప్పాడు. "నువ్వు బాంబులోపల వార్నీసు పూసి వెళ్ళాక, సుఖదేవరాజు వాటిని ఎండలోపెట్టి, ఆరబెట్టమని తొందర పెట్టాడు. అలాగే చేశాము. ఎండలో బెట్టటం వల్ల రెండు మూడు గంటల్లోనే వార్నీసు ఆరిపోయినట్లయింది. తరువాత బాంబుల్ని కూరమని తొందర పెట్టాడు. బాబూ భాయి బాంబును కూరాడు."

నేను ఒక విషయం జ్ఞాపకం చేశాను. "నేను ఒక బాంబుకు ట్రిగర్ వదులుగా ఉందని చెప్పాను గదా ?"అన్నాను.

"మాకు అప్పుడు వదులుగా ఉన్నట్లు తెలియలేదు." అన్నాడు బచ్చన్.

ముగ్గురూ, కూరిన మూడు బాంబులను తీసుకుని పరీక్షించడానికి రావీనదీ తీరానికి తీసుకెళ్ళారు. సైకిళ్ళను ఒడ్డునపెట్టి, పల్లెకారినడిగి నావ తీసుకుని, నదిలోకి వెళ్ళారు. దట్టమైన అడవిని సమీపించాక నావలో నుండి అడవిలోకి వెళ్ళిపోయారు. అక్కడ ఒక ప్రదేశాన్ని ఎన్నుకుని, బాంబుల్ని విసరడానికి సిద్ధమయ్యారు. బచ్చన్, సుఖదేవ్‌రాజ్ వెనక్కు తగ్గారు. భగవతీచరణ్ చేతిలోకి బాంబును తీసుకుని "దీనికి ట్రిగర్ వదులుగా ఉంది. ఇంకో బాంబును పరీక్షిద్దాం." అన్నాడు.

సుఖదేవరాజ్, భగవతీచరణ్ వైపు ఒక అడుగు వేసి "నీకు భయంగా ఉంటే, నేను విసురుతాను. నాకు యివ్వు."అన్నాడు.

భగవతీచరణ్ చిరునవ్వు నవ్వుతూ "భయపడవలసిన పనేముంది ? ప్రమాదం నాకెంతో నీకూ అంతేకదా ? నువ్వు వెనక్కు తగ్గు" అంటూ చేతుల్ని చాచి బాంబును విసరబోయాడు. బాంబు చేతినుండి విడిపడుతూనే పేలింది. బాంబు పేలిన దెబ్బకు భగవతీచరణ్ కింద పడిపోయాడు. ట్రిగర్ సరీగా ఉన్నట్లయితే బాంబు కిందపడ్డ తరువాతనే పేలేది.

భగవతీచరణ్ ఇలా దారుణమైన మృత్యువుకు గురికావడంతో ఈ అపరాధానికి నేనే కారణమనిపించింది నాకు. ట్రిగర్ వదులుగా వుందని చూసినవాడ్ని, వెంటనే ఎందుకు బాగుచెయ్యలేదు? నాకు చెప్పకుండా వాళ్ళసలు బాంబుల్ని పరీక్షించడానికి ఎందుకు వెళ్ళారు ? నేను బజారునుండి యింటికి వచ్చేటప్పటికి, అంతా జరిగిపోయిందికదా ?

నేను బాభీని ఓదార్చటానికైనా ప్రయత్నించ లేకపోయాను. అసలు బాభీని ఓదార్చాలన్న ఊహే నాకు రాలేదు. భగవతీభాయి మృత్యువు బాభీకంటే కూడా నన్ను దుఃఖితుణ్ణి చేసింది. నా దుఃఖంలో ఆమె దుఃఖాన్ని నేను పూర్తిగా మర్చిపోయాను. ఒక్కమాటుకూడా ఆమె దగ్గరకువెళ్ళి ఒక్క ఓదార్పుమాటనైనా మాట్లాడలేదు. ఇది నేను చేసిన గొప్ప తప్పని చాలారోజుల తరువాత తెలుసుకున్నాను. చాలా బాధపడ్డానుకూడాను. మన కష్ట సుఖాల్లో, ఇతరుల బాధల్ని గమనించక పోవడమే, స్వార్థానికి మూలం.

# బోస్ట్రల్ జైలుపై దాడికి విప్లవకారుల యత్నం

మే 31వ తారీకు అనుకుంటాను. భగవతీచరణ్ మృత్యువును గురించి ప్రకాశవతికి ఓ జాబు రాద్దామనుకున్నాను. జాబు రాయడానికి ముందే ఎవరి అడ్రసుకు రాయడమా ? అని ఆలోచించాను. ప్రకాశవతి కృష్ణజీ దగ్గర ఉంటున్నది. అయితే ఆయన అడ్రసుకు జాబు రాయడం యిష్టం లేదు. ప్రతిదానికి ప్రశ్నలు అడిగే అతడి ప్రవృత్తి నాకు తెలుసు. ఆయన, తను స్వయంగా జాబును చదవకుండా ప్రకాశవతికి యివ్వడేమో అనుకున్నాను. అందువల్ల అతని బావమరిది ధ్రువజీ అడ్రసుకు జాబు రాయడానికి నిశ్చయించుకున్నాను. ముందే కవరుమీద అడ్రసు వ్రాశాను.

సగపట జాబు రాశాను. ఆ జాబులోని భావం ఇలా ఉంటుంది. "అనుకోకుండా బాంబు పేలి భగవతీచరణ్ చనిపోయాడు. నా తరువాత నీ బాధ్యతను ఎవరిమీద ఉంచుదామనుకున్నానో, అతడు నాకంటే ముందే వెళ్ళిపోయాడు. భగవతీచరణ్ లేకపోవడంవల్ల విప్లవ సంఘానికి ఒక చెయ్యి కొట్టేసినట్టయింది. ఇక బాభీ విషయం నువ్వు ఆలోచించుకోవచ్చు. ఆమె తన సర్వస్వాన్ని విప్లవ సంఘానికి అర్పించింది. ఆమెవంక నేను చూడలేకపోతున్నాను. ఆమెతో ఒక్కమాటకూడా మాట్లాడలేకుండా ఉన్నాను. నా తరువాత బాభీపట్ల కృతజ్ఞత చూపవలసిన బాధ్యత నీకు ఎంతైనా ఉంది. జీవితంలో దుర్గాబాభీకి అన్ని విధాలా సహకరించి సహాయ భూతురాలివిగా ఉండటం నీ ప్రథమ కర్తవ్యం......" నేను జాబును పూర్తి చెయ్యలేదు. ఇంతలో జైలువైపు ఒకమాటు వెళ్ళిరమ్మని ఆజాద్ కేకవేశాడు.

సగంరాసిన జాబుని, అడ్రసు రాసిన కవరును జేబులో పెట్టుకుని బజారుకు వెళ్ళడం మంచిదికాదు. బజారులో ఏ క్షణాన్నైనా పట్టుబడవచ్చు లేక కాల్పులకు గురికావచ్చు. నా జేబులో ఉన్న కవరుమీద ఎవరి అడ్రసువుంటే వాళ్ళపని బాగాపడతారు పోలీసులు. అడ్రసు రాసిన కవరునూ, సగం వ్రాసిన జాబునూ చింపేశాను. ఆ ముక్కల్ని ఛైల్ బిహారీకిచ్చానో లేక మదన్‌గోపాల్ కిచ్చానో జ్ఞాపకం లేదు. మొత్తానికి యిద్దరిలో ఎవరికో ఒకరికిచ్చి తగలబెట్టమని చెప్పాను.

నేనిచ్చిన కాగితం ముక్కల్ని వాళ్ళు తగలబెట్టలేదు. మధ్యహాలులోనో, వంటగదిలోనో ఒకమూల అశ్రద్ధగా పారేశారు. మేము, అనుకోకుండా బాంబులు పేలడంవల్ల, హడావుడిగా బంగళాను ఖాళీచేసి వెళ్ళిపోయాము. పోలీసులు మా రహస్యాలను తెల్సుకోవడానికి బంగళాలోని అంగుళాంగుల ప్రదేశాన్నీ పరీక్షించారు. చింపివేసిన కాగితపు ముక్కలు పోలీసులకు దొరికాయి. వెంటనే ఢిల్లీలోని ధ్రువజీని అరెస్టు చేశారు. మా రహస్యాలు చెప్పమని ఆయనను పోలీసులు చాలా బాధించారు. నా యీ పొరపాటును గురించి నేను ఈనాటికీ బాధపడుతున్నాను. ధ్రువజీ శారీరకంగా కొద్దిమనిషే అయినా, గొప్ప హృదయంగల వ్యక్తి ! తను జైలునుంచి విడుదలయ్యాకకూడా, నేను పరారీలో ఉండగా, నా కెన్నోమార్లు సహాయంచేశారు. నేనంటే ధ్రువజీకి ఎంతో విశ్వాసం. కనుకనే మా మిత్రత్వం ఈనాటికీ చెక్కుచెదరకుండా ఉంది.

మేము ఎక్కడున్నామో చెప్పమని పోలీసులు ధ్రువజీని చాలా బాధించారు. అయితే, ఆయనకే తెలియదుగదా, మేము ఎక్కడున్నామో ? ఎలా చెప్పగలడు ? పోలీసులు 'కమల'ను గురించి ప్రశ్నలు వేశారు. ధ్రువజీ యింటినీ, కృష్ణజీ యింటినీ పోలీసులు చుట్టుముట్టి, సోదాచేశారు. అయితే, ప్రకాశవతి పట్టుబడలేదు. పోలీసులు రావడానికి కొద్దిక్షణాల ముందే, సి.ఐ.డి. యింటిని పోల్చుకోవడానికి ప్రయత్నిస్తుండగా, ఆమె ఎవరికీ చెప్పకుండా ఖయాలీరామ్ గుప్త యింటికి పారిపోయింది.

× × ×

రావీనది ఒడ్డున పల్లెకారి దగ్గర ఉంచిన సైకిళ్ళను తెచ్చుకోవాలి. సుఖదేవరాజ్ కాలికి వైద్యం చేయించాలి. అయితే జూన్ 1వ తారీకున ఎలాంటి పరిస్థితిలోనూ 'యాక్షన్' జరగాలి. మేము దుఃఖాన్ని మా హృదయాల్లోనే అణచుకుని తగు ప్రయత్నాల్లో మునిగిపోయాము.

నేనూ, ఆజాద్ - మాటిమాటికీ సెంట్రల్ జైలువైపు, బోర్స్టల్ జైలువైపూ వెళ్ళివస్తూండే వాళ్ళం. ఆజాద్ తడవతడవకూ అడిగేవాడు. "సోహాన్, ఎక్కడ వీలుగా ఉంటుందంటావ్ ? బోర్స్టల్ దగ్గరా ? సెంట్రల్ దగ్గరా ?"

నేను ఒకటే సమాధానం చెప్పేవాడిని. "నిర్ణయం జరిగిందికదా ? బోర్స్టల్ జైలుదగ్గరే" అనేవాడ్ని.

జూన్ 1వ తారీకు ఉదయాన్నే ఆజాద్ ఇలా అన్నాడు. "ఇవ్వాళ సాయంత్రం 5 గంటలకు యాక్షన్ జరగాలి. బాబూభాయీ (భగవతీ చరణ్), సుఖదేవరాజ్ - వీరిద్దరిబదులు ఎవరిని తీసుకుందాం? ఛైల్ బిహారీ, మదన్‌గోపాల్ - వీళ్ళిద్దరిలో ఎవరో ఒకర్ని ఎన్నుకో."

ఛైల్ బిహారీకీ, మదన్‌గోపాల్‌కూ ఓ గొప్ప 'యాక్షన్'కు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలుసుగానీ, ఎప్పుడు, ఎక్కడ, ఏ రకంగా జరుగుతుందో - వాళ్ళకు తెలియదు. పైగా ఎవరెవరు యాక్షన్‌లో పాల్గొంటారో వాళ్ళకు తెలియదు. ఆజాద్ వీళ్ళిద్దరిలో ఎవరు తగిపోతారనుకుంటే, వారితో నీవు విడిగా మాట్లాడు. నిర్ణయించిన మిత్రుణ్ణి సైకిలుమీద తీసుకువెళ్ళి ప్రదేశంచూపించు" అని చెప్పాడు ఆజాద్.

పై మాటలు ఆజాద్ నాతో చెబుతుండగా బాభీ విన్నది. ఆమె "యాక్షన్‌లో వారి (భగవతీచరణ్) స్థానంలో ఉండతగిన అధికారం నాకు ఉన్నది. నాకు అవకాశం యివ్వండి" అని అడిగింది.

ఆజాద్ నావంక చూశాడు. మేమిద్దరం ఆమెను అనూనయించాము. "ఈమాటు మీరు వద్దులేండి" అని చెప్పాము.

"ఎందువల్ల ?" బాభీ పట్టుపట్టింది.

ఆజాద్ కన్నీటిని తుడుచుకున్నాడు. "మీరు పాల్గొనడం, ఆలోచించవలసిన విషయం. పసివాడి జీవితం ఒకటుంది కదా !" అన్నాడు.

"పసివాడు ఇంక మీపిల్లవాడే. వాడి బాధ్యత మీదే" అన్నది బాభీ.

"బాభీ ఈ మాటు మామాటవిను" అన్నాడు ఆజాద్.

బాభీ, మేమూ మాట్లాడుకోవడం విని సుశీలాదీదీ వచ్చింది. ఆమె కూడా దాడిలో పాల్గొంటానని మొండికేసింది. అయితే ఆమెనూ తిరస్కరించాము.

నేను, ఛైల్‌బిహారీని ఎన్నుకున్నాను. అతడిని ఒక ప్రక్కకు తీసుకువెళ్ళి మాట్లాడాను. "ఇవ్వాళ మనము జైలుమీద దాడిచేసి భగత్సింగునూ, దత్తునూ విడిపించడానికి వెళుతున్నాము. అక్కడ పోరాటంలో 99 పాళ్ళు మనం చనిపోవడమే జరుగుతుంది. కాల్పులు ప్రారంభమయ్యాక వెనక్కు పారిపోవడానికి అవకాశం వుండదు. అలా పారిపోయే మిత్రుణ్ని నేనుగానీ, ఆజాద్‌గానీ కాల్చి చంపేయడం ఖాయం. కనుక, నువ్వు దాడిలో పాల్గొనగలిగితే మాతోరా. సాహసంలేదా, ముందుగానే చెప్పేసేయ్" అన్నాను.

ఛైల్‌బిహారీ సమాధానం యివ్వటానికి ఓ అరగంట వ్యవధి అడిగాడు. అరగంట తరువాత వచ్చి "నావల్లకాదు" అని స్పష్టంగా చెప్పాడు.

ఇకనప్పుడు మదనగోపాల్‌ని పిలచి విషయం చెప్పాను. పరిస్థితిని వివరించాను. "నువ్వు పాల్గొనగలవా ? లేదా ? చెప్పు" అని అడిగాను.

అతడు కొన్ని క్షణాలు అలాగే ఆలోచిస్తూ నిలబడ్డాడు. తరువాత "పాల్గొంటాను" అన్నాడు.

"అయితే తయారుగా ఉండు"' అని చెప్పానతడికి.

కొన్ని క్షణాల తరువాత అజాద్ నన్ను పిల్చి, మదన్‌గోపాల్ వైపు సంజ్ఞచేసి చూపించాడు. అతడో గదిలో కూర్చుని గీతాపఠనం కావిస్తున్నాడు. అజాద్ మదనగోపాల్ పట్ల తన విరక్తిని వ్యక్తపరస్తూ "గీతా పఠనం ద్వారా తెచ్చుకున్న ఈ సాహసం, సమయానికి దగా చేస్తుంది" అన్నాడు.

గీతాపఠనంచేసే మదన్‌గోపాల్ అరెస్టు కాగానే ప్రభుత్వసాక్షి అయ్యాడు. పోలీసుల్ని సంతోషపెట్టడానికి తలాతోకాలేని విషయాలు ఎన్నో చెప్పాడు. మనిషి ప్రాణంమీది తీపివల్ల ప్రభుత్వసాక్షి అవుతాడు. మనలోని ప్రాణభీతిని పోలీసులు పసికట్టారా, ఇంక మనచేత ఏమైనా చెప్పిస్తారు. మదనగోపాల్ తన శౌర్యాన్ని చాటుకోవడానికి, కోతలు కోశాడు. ఛైల్ బిహారీని అజాద్ కాలుస్తానన్నాడని కూడా చెప్పాడు. అది అబద్ధం. ఛైల్ బిహారీ తాను పాల్గొనలేనని స్పష్టంగా చెప్పాడు. అలా చెప్పిన మిత్రుణ్ని కాల్చాలని మేము అనుకోము. అయితే, మదన గోపాల్ ప్రభుత్వసాక్షి అయ్యాడని తెలిశాక, అతణ్ని కాల్చాలని అజాద్‌తోసహా మేము అందరం అనుకున్నాం.

మదనగోపాల్‌కు పిస్తోలు కాల్చడం రాదు. అజాద్ ఓ ఖాళీ రివాల్వర్ అతనికి ఇచ్చి గురిపెట్టడం ఎలాగో కాల్చడం ఎలాగో చెప్పాడు. గుండ్లను రివాల్వరులో పెట్టుకునే విధానాన్నీ చూపాడు. అజాద్ అందరికీ డ్యూటీలను వప్పగించాడు. పోరాటంలో ఎవరు ఏంచెయ్యాలో - చెప్పాడు. అందరికీ ఆయుధాలనిచ్చాక నాజేబులోనూ తన జేబులోనూ ఉన్న డబ్బును సుశీలాదీదీకి ఇచ్చాడు. ఒక్కక్షణం ఆలోచించి ఆమె దగ్గర నుండి కొంత డబ్బును తిరిగి తీసుకుని తలా పదిహేనురూపాయల చొప్పునా పంచాడు. మాలో ఎవరైనా గాయపడి, ప్రాణాలతో బైటపడితే, తప్పించుకోడానికి ఆ మాత్రమైనా డబ్బుండాలికదా ?

బోర్‌స్టల్ జైలు ముందు వ్యాను తిరగడానికి అవుసరమైన మెల్లా లేదు. అందువల్ల వ్యానును పది పదిహేను అడుగుల దూరంలో రోడ్డుమీద ఉంచి ఖైదీలను వ్యానుదాకా నడిపించుకొని వెళ్ళి, ఎక్కిస్తారు. ఖైదీలను వ్యాను దగ్గరకు తీసుకువెళ్ళేటప్పుడే మేము దాడిజరపాలని భగత్‌సింగ్ ఉద్దేశ్యం. అజాద్ మా అందరికీ డ్యూటీలను వేశాడు. జగదీశ్, బచ్చన్ ఇద్దరూ మధ్యాహ్నం ఒకటి ఒకటిన్నరాచాయల జైలు దగ్గరకు వెళ్ళారు. భగత్‌సింగ్‌నూ, దత్తునూ పోలీసువ్యాను బోర్‌స్టల్ జైలుకు తీసుకు వెళ్ళిందో లేదో చూసిరావటానికి. వాళ్ళిద్దరూ రెండున్నర గంటలాచాయల తిరిగొచ్చారు. 'రెండుంబావుకు పోలీసు వ్యాను భగత్‌సింగ్‌నూ,దత్తునూ బోర్‌స్టల్ జైలుకు తీసుకువెళ్ళింది' అని చెప్పారు. వాళ్ళను తిరిగి 5 గంటలకు సెంట్రల్ జైలుకు తెస్తారు. నాలుగు గంటలకు మేమందరము కారులో ఎవరి స్థానాల్లో వాళ్ళం కూర్చున్నాము. ఇంతలో 'ఆగండి' అన్న సుశీలాదీదీ కేక వినిపించింది. ఆమె లోపల నుండి బైటకు వచ్చింది. ఆమె చెయ్యి కొంచెంగా తెగి రక్తం కారుతున్నది. ఆ రక్తంలో బొటన వ్రేలును అద్ది మా అందరికీ వీరతిలకం దిద్దింది. బాభీ శిలా ప్రతిమలా వరండాలో నిలబడి ఉంది.

మేము బోర్‌స్టల్ జైలునూ, సెంట్రల్ జైలునూదాటి ముందుకు, కాలువవైపుకు వెళ్ళిపోయాము. బచ్చన్ మాతోపాటు కారులో ఉన్నాడు. భగత్‌సింగ్‌నూ, దత్తునూ తిరిగి తీసుకురావడానికి పోలీసువ్యాను సెంట్రలు జైలు నుండి బోర్‌స్టలు జైలువైపు వెళ్ళగానే, సంజ్ఞద్వారా జగదీశ్ మాకు ఆ విషయాన్ని తెలియపరుస్తాడు. మా కారు బోర్‌స్టల్ జైలుకు అభిముఖంగా పెట్టి ఉన్నది. పోలీసు వ్యానుకోసరం నిరీక్షిస్తున్నాము. ఎవరికీ అనుమానం కలగకుండా ఉండడానికి డ్రైవర్ చెడిపోయిన యింజన్‌ను

బాగుచేస్తున్నట్టుగా నటిస్తున్నాడు. జగదీశ్ సంజ్ఞ చేశాడు. డ్రైవర్ తీవ్రవేగంతో కారునడుపుకుని బోర్స్టల్ జైలు ముందుకు తీసుకు వెళ్ళాడు. పోలీస్‌వ్యాను ఇంకా బోర్స్టల్ జైలు గేటుదగ్గరకు రాలేదు. మా కారు పెద్దబజారు నుంచి బోర్స్టల్ జైలు గేటువైపుకు ఉండే చిన్న గొందివైపు తిరిగి నిలబడి ఉంది. పోలీస్ వ్యాను మెల్లగా జైలు గేటుదగ్గరకు వచ్చింది. కొద్దిసేపు జైలుగేటుకు అభిముఖంగా నిలబడ్డది. కాని జైలుగేటు తెరువబడలేదు. పోలీస్‌వ్యాను ఒక్క క్షణం అలా నిలబడి గేటువైపుకు తిరగడానికి వెనక్కు వచ్చింది. వ్యాను ఇలా వెనక్కు రావడంలోని అర్థం ఏమిటి ? ఖైదీలను కారువరకు నడిపించకుండా, ఒక పంజరంలో నుంచి ఇంకొక పంజరంలోకి పక్షుల్ని మార్చినట్టు, జైలు గేటు నుండి పోలీస్‌వ్యాన్‌లోకి ఖైదీలను మారుస్తారన్నమాట. పోలీసువ్యాను, వెనక్కు తిరిగివెళ్ళి గేటును అనుకున్నది. వారికసలు పది అడుగులు నడిచే అవకాశమే యివ్వనప్పుడు తప్పించుకుని మాలోకి ఎలా రాగలుగుతారు ? మాకారు గేటువైపుకు వెళ్ళేగొందికి అభిముఖంగా తిరిగి ఉన్నది. ఇంజను ఆడుతున్నది. ఆజాద్ జైలుగేటువైపు చూస్తూ "సోహన్ ఇప్పుడేంచేద్దాం ?" అన్నాడు.

"వెళ్ళి పడదాం"

"ఎలా ?"

"ఎలాగైనాకానీ"

ఆజాద్ హూంకరించాడు.

భగత్‌సింగ్, దత్తూ జైలు లోపల నుండి గేటువైపుకువస్తూ కనిపించారు. నేను వెనుక సీటులో ఎడమవైపున కూర్చున్నాను. కుడివైపున బచ్చన్ మధ్యలో మదనగోపాల్.

ఆజాద్ మెల్లగా "సిగ్నల్" అన్నాడు.

బచ్చన్ మెల్లగా ఫ్లూటు వాయించాడు. బచ్చన్ ఫ్లూటు వాయించగానే, భగత్‌సింగ్, దత్తూ మమ్ములను చూసి, సిద్ధపడతారు. తరువాత భగత్‌సింగ్ మాకు సంజ్ఞచేస్తాడు. అప్పుడు మేము దాడికి సిద్ధమవుతాము. నేను మొదటగా జైలు గేటుకు ఒక పక్కన కూర్చుని ఉండే, ఆరుగురు వశస్త్రులైన పోలీసులమీద బాంబు నొకదాన్ని వేసి, పిస్టల్‌కాల్చి వారు ముందుకు అడుగు వెయ్యకుండా చూస్తాను. బచ్చన్ పోలీసు వ్యాను మీద బాంబువేసి, దానిలోని పోలీసుల్ని అదుపులో పట్టుకుంటాడు. మావైపు పరుగెత్తుకువస్తున్న భగత్‌సింగ్‌కూ, దత్తుకూ చెరొక పిస్తోలు అందిస్తాడు మదనగోపాల్. ఆజాద్ కాళ్లదగ్గర మౌజర్ పిస్తోలు ఉంది. దాన్ని రైఫిల్‌లా భుజానికి టాకించుకుని కాల్చవచ్చును. మావైపు ఎవరైనా పోలీసులు వస్తే వాళ్ళను యమపురికి పంపిస్తాడు ఆజాద్.

భగత్‌సింగ్, దత్తూ బైటకు వచ్చారు. భగత్‌సింగ్ తలగీరు కుంటున్నట్టు సంజ్ఞ చేయలేదు.

ఆజాద్ "ఏం చేద్దాం ?" అన్నాడు.

"వెళ్ళి పడదాం" నేను భగత్‌సింగ్ వంక చూస్తూ ఆజాద్‌కు సమాధానం యిచ్చాను.

డ్రైవరు యింజను స్టార్ట్ చేశాడు. కాని ఆజాద్ డ్రైవరుచేతి మీద తన చేతిని వేసి "ఆగు" అన్నాడు.

భగత్‌సింగ్ మావైపు రాకుండా నేరూగా పోలీసువ్యానులోకి వెళ్ళిపోయాడు.

ఆజాద్ మెల్లగా "వ్యానును రానీ" అన్నాడు.

ఆజాద్ ఉద్దేశ్యం, ఎటూ వచ్చాము. ఆ విధంగా కాకపోతే, మరో విధంగా దాడి చేద్దామని. అప్పటికి మాకారుమీద ఎటూ అనుమానం కలిగి ఉండాలి. తప్పించుకు వెళ్ళిపోదామన్న ఊహ మాకులేదు. భగత్‌సింగ్‌నూ, దత్తునూ కూర్చోబెట్టుకుని పోలీసువ్యాను మా పక్క నుంచి వెళ్ళింది.

భగత్‌సింగ్ మమ్మల్ని చూశాడు. మేము అతణ్ని చూశాం. ఎలాంటి సంజ్ఞగానీ, సంకేతంగానీ చేయలేదు.

అజాద్, కారును యింటికి తీసుకెళ్ళమని డ్రైవరుకు ఆజ్ఞ యిచ్చాడు. కారు తీవ్రవేగంతో యింటిముఖం పట్టింది. రెండు మూడు గొందులు తిరిగి మమ్మల్ని ఎవరూ వెంబడించడంలేదని తెలుసుకున్నాం. ఓ నిర్మానుష్యమైన ప్రదేశంలో కారు నెంబరును మార్చేశాము.

కారు శబ్దంవిని బాభీ, సుశీలాదీదీ వరండాలోకి వచ్చారు. మిగిలిన వాళ్ళ పరిస్థితి నేను చెప్పలేను. నేను మాత్రం వాళ్ళనుచూచి తలవంచుకున్నాను. వీర తిలకం దిద్దించుకుని వెళ్ళాం మరి.

ఆజాద్ ఇలా అన్నాడు. "ఏంచేసేట్టు చెప్పు నువ్వేమో వెళ్ళి పడదాం అంటున్నావ్.... కానీ పరిస్థితిని ఆలోచించావా ? ఇవ్వాళ కాకపోతే రాపు దాడి జరుపుతాము."

"నువ్వు తెలివైన పని చేశావ్. నేను ఆవేశంలోపడి కొట్టుకు పోతూన్నాను. బాధ్యత నీది కదా" అన్నాను నేను.

# బహావల్‌పూర్ రోడ్డులో బాంబులు పేలాయి

ఆ రాత్రి నేనూ ఆజాద్ చాలసేపు మాట్లాడుతూ కూర్చున్నాము. ఆజాద్ ఇలా అన్నాడు. "భగత్‌సింగ్‌నూ, దత్తూనూ తప్పకుండా విడిపించాలి. అయితే, ఇలా కాదు. చిటగాంవ్ శస్త్రాగారం మీద దాడి జరిపినట్టు పెద్దఎత్తున దాడి జరపాలి. పాతిక ముప్పైమంది మిత్రులు బాంబులు తీసుకుని దాడిలో పాల్గొనాలి.

నేను రెండు నెలల నుంచీ అదే చెపుతున్నాను.

నా మనస్సు శరీరం కూడా శిథిలమయ్యాయి. జ్వరం కాసినవాడిలా అయ్యాను. నేనూ, ఆజాద్ వరండాలో పడుకుని ఉన్నాము. ఆజాద్ అర్ధరాత్రివరకూ మాట్లాడుతూనే ఉన్నాడు. లోపల పడుకుంటేనైనా నిద్రపడుతుందేమోనని లోపలకు వెళ్ళాను.

డ్రాయింగ్ రూమును ఆనుకుని పెద్దగది ఒకటుంది. ఆ గదిలో కుడి ఎడమవైపులగల గోడలకు ఆనించి ఇనుపవి స్ప్రింగ్ మంచాలు వాల్చి ఉన్నాయి. ఒక మంచం మీద బాభీ పడుకుని ఉంది. పైన పంఖా తిరుగుతూంది. నేను రెండవ మంచంమీద ఆపర్న పడుకున్నాను. వెంటనే నిద్ర పట్టింది.

అలికిడికి మెళుకువ వచ్చింది. కళ్ళు తెరచి చూచాను. బాభీ నిద్రలేచి బైటకువెళుతూన్నది. ఆమె లేవడంవల్ల స్ప్రింగ్ మంచం 'కిర్రు' మన్నది. సూర్యోదయం కావస్తున్నది. నేను మంచంమీదనుంచి లేచి పంఖాను ఆపుజేసి, బయటకు వెళ్ళాను. డ్రాయింగ్ రూముదాటి వరండాలోకి వచ్చానోలేదో బంగళాలో భయంకరమైన శబ్దం అయింది. బంగళా అంతా కదిలిపోయింది. ఆజాద్ కేక వేశాడు. 'బాంబు పేలిందా ?'

'ఆ' అని నేను నిర్వణ్ణునై నిలుచుండి పోయాను.

'వెంటనే బంగళా ఖాళీ చేసేయండి' ఆజాద్ ఆజ్ఞ యిచ్చాడు. మేము త్వరత్వరగా ఆయుధాలను బ్యాగ్‌ల్లోకి సర్దుతున్నాము. ఇంతలో రెండవ బాంబు పేలింది. రెండు క్షణాల క్రితం, నేనూ

బాభీ పడుకుని ఉన్న గదిలోనే, బాంబులు పేలినయ్. ఆ గది అరమరలో బాంబులు వున్నాయి. నిన్నటిరోజున దాడిలో ఉపయోగించడానికి తీసుకువెళ్ళిన బాంబుల్ని, తిరిగితెచ్చి అరమరలో పెట్టాము. అవి పేలినయ్యి. ఇప్పుడు పేలిన ఈ రెండు బాంబులు, నిన్న సాయంత్రం నాచేతిలోనూ, బచ్చన్ చేతిలోనూ ఉన్నాయి. అవి అప్పుడే పేలితే, ఆజాద్‌తోసహా అందరం ఆహుతి అయిపోయేవాళ్ళం.

రెండు మూడు నిముషాల్లో ఆయుధాలను, అవుసరమైన కాగితాలనూ సర్దేసుకున్నాం. బంగళా దగ్గర కారులేదు. దాన్ని నిన్నరాత్రే పంపించివేశాము. మదన్‌గోపాల్‌కూ, ఛైల్‌బిహారీకి ఒక్కొక్క రివాల్వర్ యిచ్చి, యూనివర్సిటీ గ్రౌండ్సులో మాకోసం ఎదురు చూడండి అనిచెప్పి పంపించాము. ఆజాద్ ఆయుధాలతోనిండిన బ్యాగ్‌ను చేతపుచ్చుకున్నాడు. నేనూ, బచ్చన్, దుర్గాబాభీనీ, సుశీలాదీదీని మా సైకిళ్ళవెనుక కూర్చోబెట్టుకున్నాము. నిర్మానుష్యమైన బజార్లల్లో ఒక రౌండుకొట్టి, మమ్మల్ని ఎవ్వరూ వెంబడించడంలేదని నిర్ధారించుకుని, ఇంద్రపాల్ గదికి వెళ్ళాము.

బంగళాలో బాంబు పేలడం, మేము తప్పించుకు రావడం - తెల్సుకుని ఇంద్రపాల్ విచారగ్రస్తుడయ్యాడు. "అక్కడ నా సామానులు చాలా ఉన్నాయి. వాటిమీద పేర్లూ ఉన్నాయి. అవి పోలీసులు చేతుల్లో పడితే ... ?" అన్నాడు ఇంద్రపాల్.

ఇంద్రపాల్ అనుమానం సబబైందే. ఈమధ్యనే అతడికి వివాహమైంది. పెళ్ళిలో అత్తవారిచ్చిన సామానులను మేము తీసుకువెళ్ళి వాడుకుంటున్నాము. కొన్నిటిమీద అతడి పేరూ ఉంది.

నేను అతడికి ధైర్యాన్ని యిచ్చాను. 'అప్పుడే పోలీసులు వచ్చి వుండరు. నేను వెళ్ళి చూసి వస్తాను. అవకాశముంటే సామానులన్నింటినీ తీసుకు వస్తాను." అని నేను బయల్దేరాను.

ఆజాద్ హెచ్చరించాడు. 'జాగ్రత్త ..... మరీ కుర్రవాడిలా వ్యవహరించకు' అన్నాడు.

నేను బహావల్‌పూర్ రోడ్డుకువెళ్ళి బంగళాముందు ఒకమాటు అటూ యిటూ తిరిగి చూశాను. పరిసరమూ బంగళా కూడా నిర్మానుష్యంగా ఉంది. ఒక పరదాను తీసుకుని దానిలో పట్టినంత సామానులను మూటగట్టాను. సైకిల్‌మీద ఇంద్రపాల్ గదికి తెచ్చిపడేశాను. 'ఇంకా అక్కడ చాలా సామాను ఉంది' అని చెప్పాను. బాభీనీ, సుశీలాదీదీనీ - బచ్చన్ వెంట సురక్షిత ప్రదేశానికి పంపించాక, ఆజాద్, నేనూ, ఇంద్రపాల్ - ముగ్గురం సైకిళ్ళు వేసుకుని మళ్ళీ బంగళా దగ్గరకు వెళ్ళాం. జాగ్రత్తగా ఓమాటు లోపలకు తొంగిచూశాం.

ఆజాద్ మళ్ళీ ఓమాటు హెచ్చరించాడు. 'మనం మరీ కుర్రతనంగా వ్యవహరిస్తున్నాం. పక్కన ఇంజనీయర్ వున్నారు. బాధ్యత గల ప్రభుత్వోద్యోగి. అతడు పోలీసులకు ఫోనుచేసి ఉంటేనో ?' అన్నాడు. నేను పక్కవాటాలోని ఇంజనీయరుగారి తలుపు కొట్టాను. ఆయన బైటకు వచ్చాడు. నేను ఇంగ్లీషులో మాట్లాడాను. 'బంగళాలో బాంబు పేలింది' అన్నాను.

ఇంజనీయరు గాభరాపడుతూ 'అవును' అన్నాడు.

'మీరు పోలీసులకు ఫోను చేశారా ?'

'ఇంకా చెయ్యలేదు. చెయ్యాలి'

'ఇప్పుడే చెయ్యకండి.'

'ఏం ?'

'మేం విప్లవకారులం. అనుకోకుండా బాంబు పేలింది. మీరు ఒక అరగంట ఆగి పోలీసులకు ఫోను చెయ్యండి. అలా చేయడంవల్ల ప్రభుత్వంపట్ల మీరు మీ కర్తవ్యాన్ని నిర్వహించినవారూ అవుతారు. ఈలోపు మేము మా సామానులూ సర్దుకుంటాం' అని అన్నాను నేను. ఇంజనీయరుగారు

అలాగేచేస్తానని ఒప్పుకున్నారు. అలాగే చేశారు కూడాను. మేము అనవసరమైన వస్తువుల్ని మినహాయించి, మిగిలిన వస్తువులన్నింటినీ పట్టుకెళ్ళిపోయాం.

ఇలా ఆకస్మికంగా బాంబు పేలడంవల్ల ధ్రువజీ పోలీసులచేతుల్లో పడడమే కాకుండా,ఈ ఇంజనీరుగారుకూడా చాలాబాధలకు గురిఅయ్యారు. నేను ఇంజనీయరుగారితో మాట్లాడేటప్పుడు ఇంద్రపాల్ పక్కనే ఉన్నాడు. ఇంద్రపాల్ తరువాత ప్రభుత్వసాక్షిగా మారాడు. అతడు పర ప్రభుత్వం నుండి క్షమాభిక్ష నాశించి ప్రభుత్వ సాక్షిగా మారలేదు. తనకంటే ముందు ప్రభుత్వసాక్షులుగా మారి విప్లవసంఘ సభ్యుల్ని ఎందరినో ఉరికంబాలకు ఎక్కించడానికి సిద్ధమైన ద్రోహుల సాక్ష్యాలను తల్లక్రిందులు చేయడానికి ప్రభుత్వసాక్షి అయ్యాడు ఇంద్రపాల్.

ఇంద్రపాల్ ఎందరినో కాపాడినమాట నిజమే. కాని, ఈ ఇంజనీయరుగారిని మాత్రం ఇరకాటంలో పడేశాడు. వీరు మాకోసం అరగంట ఆగి ఫోన్ చేసిన విషయాన్ని పోలీసులకు చెప్పేశాడు. ప్రభుత్వం ఈ యింజనీయరుగారిని చాలా బాధ పెట్టింది. ప్రతిక్రియగా వారిహోదాను తగ్గించింది !

# జల్‌గాం న్యాయస్థానంలో ప్రభుత్వసాక్షిపై కాల్పులు

1930వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో ప్రజల ఉత్సాహాన్ని రెట్టించే మరో సంఘటన జరిగింది. జల్‌గాం న్యాయస్థానంలో, లాహోరు కుట్రకేసులోని ప్రభుత్వసాక్షి జయగోపాల్‌ని కాల్చడం జరిగింది. కాల్చింది మిత్రుడు భగవాన్ దాస్

భగవాన్‌దాస్, సదాశివరావు మల్కాపూర్ - వీరిద్దరూ 1929 అక్టోబరులో అరెస్టయ్యారు. వీరు అరెస్టు అయ్యేప్పుడు ప్రజలు ఎలా వ్యవహరించారో, వీరు న్యాయస్థానంలో ప్రభుత్వ సాక్షిని కాల్చిన తరువాత, వీరిపట్ల ప్రజల ప్రవర్తన ఎలావుందో తెల్సుకోవడం ముఖ్యం. విప్లవకారుల సాహసచర్యలు ప్రజల భావాల్లో స్పష్టమైన పరిణామాన్ని, మార్పునూ తీసుకువస్తాయి.

1929 అక్టోబరులో భగవతీచరణ్ మీద తనకుగల అవిశ్వాసం కారణంగా ఆజాద్ మా సంబంధాన్నీ, సహచర్యాన్ని తిరస్కరించాడని వెనకే చెప్పాను. అప్పుడు ఆజాద్ గ్వాలియర్‌లో ఉంటున్నాడు. ఘోరమైన ఆర్థికబాధల్లో ఉన్నాడు. గ్వాలియర్‌లో కాలు నిలదొక్కుకునే స్థితి ఎంతకీ కనుపించడంలేదు. బాంబులు తయారుచేయడానికి ఉపయోగించే పేలుడు పదార్థాలనూ, ఇతర సామాగ్రినీ తీసుకుని పూనా వెళ్ళమని భగవాన్‌దాస్‌కూ, సదాశివరావుకూ చెప్పాడు ఆజాద్. పూనాలో రాజుగురు ఓ కేంద్రాన్ని స్థాపించి కొంత ఉద్యమాన్ని నిర్మించాడు. పూనా (పూణె) వెళ్ళడానికి, భూసావల్‌లో బండిమారాలి. అక్కడ ఎక్సైజు పోలీసుల హడావుడి ఎక్కువగా ఉంటుంది. ప్రయాణీకుల పెట్టెల్ని, మూటల్నికూడా సోదాచేస్తూ వుంటారు.

పోలీసులు భగవాన్‌దాస్, సదాశివరావు - దగ్గరున్న పెట్టెనీ, మూటనీకూడా తనిఖీ చేయాలన్నారు. సదాశివరావు మాటల్తో పోలీసుల్ని మభ్య పెట్టాలని చూశాడు. కానీ, పోలీసులు మూటలు విప్పి చూడందే పోనీయమన్నారు. పెట్టె తెరువక తప్పిందికాదు. పెట్టెలో ద్రావకాల్ని చూసేసరికి పోలీసులకు అనుమానం కలిగింది. భగవాన్‌దాస్. ఆ ద్రావకాలు అమూల్యమైన ఔషధాలని చెప్పి తప్పించుకోచూశాడు. ఇంతలో తూటాల పొట్లాం ఒకటి పోలీసులకు దొరికింది. ఇక తప్పించుకోవడానికి మార్గంలేదు. భగవాన్‌దాస్ గుడ్డలో చుట్టి ఉన్న పిస్తోలును పెట్టెలో నుండి మొదటే తెలివిగాతీసి ప్రక్కకు పెట్టుకున్నాడు.

తప్పించుకోవడం సంభవంకాదని నిశ్చయించుకున్నాక, ఇద్దరు విప్లవకారులు తమలో తాము సంజ్ఞ చేసుకున్నారు. పారిపోవడానికి నిశ్చయించుకున్నారు.

సదాశివరావు పిస్తోలు ఒక్కటే తీసుకొని పరుగెత్తితే బాగుండేది. అతడలా చెయ్యకుండా మొత్తం పెట్టెనే తీసుకుని పరుగులంకించుకున్నాడు. ఇద్దరు విప్లవకారులు ప్లాటుఫారం మీద నుండి రైలు పట్టాల ననుసరించి సిగ్నల్ కాబిన్‌వైపు పరుగెత్తారు. పోలీసులు వారిని వెంబడించారు. ప్రజల సహాయాన్ని అర్థించారు పోలీసులు. "బాంబులు పేల్చేవాళ్ళు పరుగెత్తుతున్నారు. పట్టుకోండి" అని అరిచారు పోలీసులు. ప్లాటుఫారంమీది ప్రజలు పోలీసులకు సాయమొచ్చారు.

పెట్టె ఎత్తుకుని పరుగెత్తుతున్న సదాశివరావు కాలు సిగ్నల్ తీగల్లో చిక్కుకున్నది. అతడు కింద పడ్డాడు. పోలీసులు అతణ్ణి సమీపించారు. ఇంతలో భగవాన్‌దాస్ పోలీసుల్నీ, ప్రజల్నీ భయపెట్టడానికి జేబులోనుండి పిస్తోలుతీసి గాలిలోకి కాల్చాడు. అయినా, ప్రజల గుంపు వాళ్ళను వదల్లేదు. వాళ్ళిద్దరూ రైల్వే ఫెన్సింగ్‌నుదాటి ఊళ్ళోపడ్డారు. ఊరు కొత్త ఎటు పోవాల్నో తెలియదు. నేరుగా పోలీస్ స్టేషన్‌కే వెళ్ళారు; అరెస్టయ్యారు.

అలా నిరుపాయంగా అరెస్టు అయినందుకూ, అమూల్యమైన పేలుడు పదార్థాల్ని వ్యర్థపరచినందుకూ ఇద్దరు మిత్రులూ చాలా బాధపడుతూండేవారు. వీరిద్దరూ లాహోరు కుట్రకేసుకు సంబంధించినవారని ప్రభుత్వ సాక్షులు మొదటే చెప్పారు. పోలీసులు వీళ్ళని లాహోరు తీసుకొచ్చి, జయగోపాల్, ఫణీంద్రనాథ్‌ఘోష్ చేత గుర్తింపచేశారు కూడాను. వీరు లాహోరు కుట్రకేసుకు సంబంధించినవారే అయినా, వీరిమీద కేసు జల్‌గాంకోర్టులోనే నడిచింది. వీరిని ధూలియా జైలులో బంధించారు.

భగవాన్‌దాస్, సదాశివరావు - వీరిద్దరికీ వకీలు రా.వి. దులేర్. వీరు ఝాంసీ నివాసి. ఈ వకీలుద్వారా ఇద్దరు విప్లవకారులూ ఆజాద్‌కు ఓ సందేశాన్ని పంపించారు. "మాకేసులో రెండవమాటు సాక్ష్యం ఇవ్వడానికి జయగోపాల్, ఫణీంద్రనాథ్ ఘోష్ - ఇద్దరు ప్రభుత్వ సాక్షులు జల్‌గాం కోర్టుకు వస్తున్నారు. మాకొక పిస్తోలు పంపించినట్లయితే, ప్రభుత్వ సాక్షుల్ని కాల్చివేస్తాం."

1930 జనవరిలో ఆజాద్‌కు ఈ సందేశం అందింది. ఆజాద్ భగవతీచరణ్‌ని ధూలియా పంపించాడు. భగవాన్ దాస్‌నీ, సదాశివరావునీ జైల్లో కల్సుకుని వారి ప్లానును తెలుసుకుని ఒక నిర్ణయానికి రావడానికి భగవతీచరణ్ ఝాంసీ నివాసిగా వకీలు వేషంలో, జైల్లోకివెళ్ళి ఇద్దరు మిత్రుల్నీ కల్సుకున్నాడు. తిరిగివచ్చి 'పనిజరగడానికి అవకాశం ఉందని' ఆజాద్‌కు చెప్పాడు.

ఫిబ్రవరి 17వ తారీకు సాయంత్రం సదాశివరావు తమ్ముడు శంకర్రావు, ఇద్దరు ముద్దాయిలకు భోజనాన్ని తీసుకుని జైల్లోకి వెళ్ళాడు. వెళుతూ గిన్నెలో గుండ్లతో నింపిన పిస్తోలును పెట్టుకుని తీసుకువెళ్లాడు.

సదాశివరావు, భగవాన్‌దాస్ - ఇద్దరూ జైల్లో చాలా సజ్జనులనిపించుకున్నారు. నియమబద్ధంగా వ్యవహరించేవారు. తమ ప్రవర్తినవల్ల పోలీసులమీద బాగా ప్రభావాన్ని వేశారు. అప్పుడప్పుడూ పాటలు పాడి వినిపించి, పోలీసులను మంచి చేసుకున్నారు. జల్‌గాంసెషన్స్ కోర్టులో ఫిబ్రవరి 2వ తారికున వీళ్ళకేసు వాయిదాఉంది. ఆనాడు సాక్ష్యం ఇవ్వడానికి జయగోపాల్, ఫణీంద్రనాథ్ ఘోష్‌కూడా జల్‌గాం వస్తారు. జైలు నుండి జల్‌గాం న్యాయస్థానానికి వెళ్ళేటప్పుడు భగవాన్‌దాస్ పిస్తోలును జేబులో పెట్టుకువెళ్ళాడు.

ముద్దాయిలకు వెనుకవైపున కోర్టు ఆవరణలో ఒక డేరాను వేశారు. అందులో ప్రభుత్వసాక్షులిద్దరూ, వాళ్ళ రక్షణకోసం వచ్చిన పోలీసు అధికారులూ, టేబులుముందు కూర్చుని భోజనం చేస్తున్నారు.

భోజనం చెయ్యడానికివీలుగా, సదాశివరావుకూ, భగవాన్‌దాస్‌కూ కుడిచేతి బేడీలను ఊడదీసి ఎడమచేతికి తగిలించారు. వారికి భోజనం పెడుతున్న శంశర్రావు "మీ వెనకవైపున ప్రభుత్వసాక్షులు యిద్దరూ డేరాలో కూర్చుని పోలీసులతోపాటు భోంచేస్తున్నారు" అని చెప్పాడు.

భగవాన్‌దాస్, సదాశివరావు ఇద్దరూ కూడ బలుక్కున్నారు. ఇంత కంటె చక్కని అవకాశం లభించదు. భగవాన్‌దాస్ జేబులోనుండి పిస్తోలును తీశాడు. ఆవేశంతో ప్రభుత్వసాక్షులున్న డేరావైపు పరుగెత్తాడు.

డేరా వాకిట్లో సబ్‌యిన్‌స్పెక్టరు నానక్ షా భగవాన్ దాస్‌ను అడ్డగించాడు. భగవాన్ దాస్ అతడిని కాల్చేశాడు. గుండు అతడి తొడలో నుండి దూసుకుపోయింది. నానక్‌షా వెర్రికేకపెట్టి ప్రాణం రక్షించుకోవడానికి పరుగెత్తాడు.

భగవాన్ దాస్ డేరాగుడ్డను ఎత్తాడు. ఫణీంద్రనాథ్ ఘోష్, తుపాకీ కాల్పునువిని కుర్చీలోనుంచి తప్పుకుని, టేబుల్ క్రిందకు దూరి మొదటే జాగ్రత్త పడ్డాడు. జయగోపాల్ ధైర్యంచేసి భగవాన్‌దాస్‌ను ఎదిరించాడు. భగవాన్‌దాస్ అతడిపై పిస్తోలు పేల్చాడు. గుండు జయగోపాల్ భుజానికి తగిలింది. అతడు గావుకేకపెట్టి కోర్టుహాల్లోకి పరుగెత్తాడు. ప్రభుత్వసాక్షులతోపాటు భోజనానికి కూర్చున్న పోలీసు ఆఫీసరుకూడా, టేబుల్ కింద దూరాడు. భగవాన్‌దాస్ కిందికివంగి టేబుల్ కింద ఉన్న వాళ్ళను కాల్చడానికి ప్రయత్నించాడు. కాని, పిస్తోలు మొండికేసింది.

భగవాన్‌దాస్, డేరాలోనుండి బైటకువచ్చి, కోర్టుహాల్లోకి పరుగెత్తాడు. తనమీద నేరాన్ని మోపుతూ తన దగ్గర దొరికిన పిస్తోలును, పోలీసులు కోర్టుహాల్లో పెట్టారు. దాన్ని చేజిక్కించుకుందామని భగవాన్ దాస్ ఉద్దేశ్యం. సదాశివరావు అంతకుముందే కోర్టుహాల్లోకి పరుగెత్తడానికి ప్రయత్నించాడు. పోలీసులు పట్టుకున్నారతణ్ని.

పిస్తోలు దెబ్బతిన్న సబ్‌యిన్‌స్పెక్టరు నానక్‌షా కూడా ప్రాణరక్షణార్థం కోర్టుహాల్లోకే పరుగెత్తాడు. తనవైపే పరుగెత్తుకువస్తున్న భగవాన్ దాస్‌ను చూసి చావుకు తెగించాడు నాన్‌క్‌షా ! తప్పించుకోవడానికి వేరు మార్గం లేక పోవడంతో, భగవాన్‌దాస్‌మీద కలబడక తప్పిందికాదు. నానక్‌షా ఒడ్డూ పొడుగూగల భారీ విగ్రహం. భగవాన్‌దాస్‌ని కిందపడేసి కదలకుండా పట్టేశాడు. ఇంతలో మరికొందరు పోలీసులువచ్చి భగవాన్‌దాస్‌ను పట్టుకున్నారు. జల్‌గాం ప్రజలు చాలామంది విప్లవకారులకేసు విచారణ వినడానికి కోర్టుకు వచ్చారు. వాళ్ళు పోలీసులను నిందిస్తూ విప్లవకారులకు జయకారాలను పలికారు 'విప్లవం వర్థిల్లాలి' అన్న నినాదంతో పరిసరం ప్రతిధ్వనించింది.

వెంటనే కోర్టు కార్యక్రమాల్ని ఆపివేశారు. ప్రభుత్వసాక్షులిద్దర్నీ పోలీసువ్యానులో కూర్చోబెట్టి సురక్షితమైన ప్రదేశానికి పంపించి వేశారు. ప్రజలు ఆగ్రహావేశులై, ఆవ్యానుమీద రాళ్ళు రువ్వారు. 'దేశ ద్రోహులు నశించాలి' అన్న నినాదం మిన్ను ముట్టింది. పోలీసులు పది పదిహేను మందిని అరెస్టు చేశారు. జల్‌గాంలో వెంటనే 144వ సెక్షను ప్రకటించారు.

అప్పటికి మిత్రుడు భగవాన్ దాస్, సదాశివరావు అరెస్టయి నాలుగు నెలలు కావస్తున్నది. ఈ నాలుగు నెలల్లోనూ ప్రజల్లో ఎంత మార్పు వచ్చింది. విప్లవకారులపట్ల ఎంత సానుభూతి పెరిగింది. ఈ నాలుగు నెలల్లో విప్లవకారులు అనేక సాహస కార్యాలను చేశారు. వైస్రాయి ట్రైను క్రింద బాంబు పేల్చడం, చిటకాంగ్ శస్త్రాగారం మీద దాడి, 'బాంబు దర్శనం' కరపత్రాన్ని పంచడం - ఇలాంటి కార్యక్రమాలు జరిగాయి. వీటివల్ల 'విప్లవకారులు ఎవరూ ? ఎందుకు పోరాడుతున్నా రూ ?' అన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారు.

ప్రజల్లోనేకాదు. పోలీసుల్లోనూ చాలా పరివర్తన వచ్చింది. జైల్లోకి పిస్తోలు రావడంవల్ల, కోర్టులోనే కాల్పులు జరగటంవల్ల భారతీయ పోలీసులమీద బ్రిటీషు ప్రభుత్వానికి నమ్మకం తగ్గింది. వెంటనే ఇంగ్లీషు సార్జెంటు వచ్చాడు. కొందరు పోలీసుల్ని మార్చారు. కొందరికి అజాగ్రత్తగా ఉన్న నేరానికి శిక్షలు కూడా పడవచ్చు అనుకుంటున్నారు. పోలీసులు భయపడుతున్నారు. ఆ పోలీసుల్లోని ఒకడు ఇలా అన్నాడు. "ఎందుకిలా భయపడి చస్తారు ?...... మహా అయితే ఉద్యోగం పోతుంది. కాకపోతే, నాలుగు నెలలు జైలుశిక్ష వేస్తారు. అంతేగా ? దేశం కోసం, జాతికోసం ప్రాణాలను యిస్తున్న, భారతమాత బిడ్డల్ని చూడండ్రా"

వైస్రాయి ట్రైను కింద బాంబు పేల్చి రెండు నెలలు అయింది. ఆ కేసును పరీక్షించడానికి ప్రత్యేకం లండన్ నుండి స్కాట్‌లాండ్ యార్డ్ సి.ఐ.డి.లను పిలిపించారు. వాళ్ళూ ఏమీ తెల్సుకోలేక పోయారు. ఇప్పుడిక కోర్టులోనే ప్రభుత్వసాక్షుల్ని కాల్చేశారు, విప్లవకారులు ! ప్రజల దృష్టి కోణంలో మార్పు వస్తున్నది. ప్రజల సహానుభూతిని పొందగల యోగ్యత విప్లవకారులకూ లభిస్తున్నది.

నేను కొన్ని వస్తువులు నిరుపయోగమైనవని భావించి బంగళాలోనే వదిలిపెట్టేశాను. అలా వదిలిపెట్టిన వాటిల్లో నేను హిందీలో వ్రాసిన కగితాలు కొన్ని ఉన్నాయి. ఇంద్రపాల్ గదిలో ఉన్నప్పుడుగానీ, బంగళాలో ఖాళీగా ఉన్నప్పుడుగానీ, ఆస్కర్‌వైల్డ్ ప్రసిద్ధ నాటకం 'వీరాది నిహిలిస్ట్'ను హిందీలోకి అనువాదం చేస్తూవుండేవాణ్ని. ఆ అనువాదపు కాగితాలను ఎక్కడికి పట్టుకు వెళ్ళగలను ? వాటిని అక్కడే వదిలివేశాను. అవి నేనా బంగళాలో ఉన్నాననడానికి సాక్ష్యమయ్యాయి ! ప్రతిసారీ పట్టుబడకుండా తప్పించుకుంటున్నందుకు పోలీసులు నామీద ఆగ్రహావేశులవు తున్నారు.

ప్రజల సహానుభూతి కారణంగానే విప్లవకారులు పోలీసులకు పట్టుబడకుండా ప్రభుత్వంతో పోరాడగలరు. ప్రజల సానుభూతికి మమ్ముల్ని దూరం చెయ్యడానికి పోలీసులు మా వ్యక్తిత్వానికి సంబంధించిన అపవాదుల్ని ప్రచారం చేస్తుంటారు. ప్రభుత్వ సాక్షులచేత మా వ్యక్తిత్వాన్ని కళంకితం చేయడానికి అబద్ధాల్ని చెప్పిస్తూ వుంటారు. అప్రూవర్‌గా మారిన మదనగోపాల్ తన సాక్ష్యంలో "బహావల్‌పూర్ రోడ్డులోని బంగళాలో బాంబు పేలడంవల్ల భగత్‌సింగ్‌ను విడిపించే కార్యక్రమం జరగలేదు. బాంబు పేలడానికి కారణం, బాంబులున్న అలమారా దగ్గర నుంచుని యశ్‌పాల్ బాభీతో పరిహాసంగా పెనగులాడుతున్నాడు. ఆ పెనగులాటలో వాళ్ళు అలమారాకు తగలడం దానిలోని బాంబులు కదిలి పేలడం జరిగింది. యశ్‌పాల్, సుశీలాదీదీతోనూ ప్రణయం సాగిస్తూ ఉంటాడు. అందుకనే ఆజాద్‌కు యశ్‌పాల్ అంటే కోపం" అని చెప్పాడు.

పై విధంగా చెప్పేటప్పుడు పోలీసులుగానీ, మదనగోపాల్‌గానీ ఒక్క విషయం ఆలోచించడం మర్చేపోయారు. బాంబులు పేలడంవల్ల అలమారా తలుపులు పూర్తిగా ఎగిరిపోయాయి. బాంబు ముక్కలు ఎదర గోడకు తగిలి, గోడకు కన్నాలు పడ్డాయి. గోడ ప్లాస్టర్ అంతా ఎగిరిపోయింది. అలాంటిస్థితిలో అలమారాదగ్గరున్న యశ్‌పాల్ గతి ఏమౌతుంది ? పైగా నేను ప్రణయం సాగించింది ఎలాంటి స్త్రీతోనని చెప్పాడు ? మూడు రోజుల క్రితం బాంబు పేలి భర్త చనిపోయిన స్త్రీతోనా ? గాయపడ్డ ఆ భర్తను నేను కండ్లారా చూశానే.

సుశీలాదీదీనీ, బాభీనీ, ధన్వంతరీ సురక్షిత ప్రదేశానికి చేర్చాడు. మదనగోపాల్‌ని, ఒక మిత్రుణ్ణి తోడుయిచ్చి, లాహోరు నుండి పంపించేశాము. ఛైల్‌బిహారీని సిమ్లా పంపించడం జరిగింది.

చిన్నతనంలో బాగా జబ్బుపడడంవల్ల జీర్ణకోశం చెడిపోయింది. అజీర్తివ్యాధి పట్టుకుంది. మాటిమాటికీ జీర్ణకోశం చెడిపోతుండేది. భగవతీచరణ్ చనిపోవటం, ఇతర వ్యవహారాలు కూడా నా ఆరోగ్యంమీద కొంత చెడ్డ ప్రభావాన్ని వేశాయి. నేను రెండు మూడు వారాలు విశ్రాంతి తీసుకుంటానని ఆజాద్‌కు చెప్పాను. అతడంగీకరించాడు. జులై మొదటి వారంలో నేను ఢిల్లీ వెళ్ళిపోవడం నిశ్చయమైంది.

# ఢిల్లీ బాంబు ఫ్యాక్టరీ

భగత్‌సింగ్‌నూ, దత్తునూ విడిపించడానికి జరిగిన ప్రయత్నాలకూ, ఇంతవరకూ జరిగిన ఇతర విప్లవ కార్యక్రమాలకూ అయిన ఖర్చులన్నింటినీ దాదాపుగా భగవతీచరణే భరించాడు. అతడి అనుమతితో దుర్గాబాభీ 5,6 వేల రూపాయలదాకా ఖర్చుపెట్టింది. సుశీలాదీదీ కలకత్తాలో ఉద్యోగంచేసి పంపాయించి యిచ్చిన రెండువేల రూపాయలు కూడా విప్లవ సంఘం క్రిదనే ఖర్చయ్యాయి. భగవతీచరణ్ చనిపోయాక విప్లవ సంఘపు ఆర్థికబాధలు మిక్కుటమయ్యాయి. 1930 జులై మొదటివారంలో విధిలేక ఆజాద్ దోపిడీనొకదాన్ని చేశాడు. మధ్యాహ్నం, ఢిల్లీ చాందనీ చౌక్‌లోని 'గదోడియా స్టోర్'ని దోచుకోవడం జరిగింది.

ఆజాద్, విద్యాభూషణ్, కాశీరామ్ - పిస్తోళ్ళు తీసుకుని గదోడియా ఉన్న పై అంతస్తులోకి వెళ్ళారు. ఆ స్టోరులోనే ఉద్యోగంచేస్తున్న మిత్రుడు విశ్వంభరదయాళ్, వీళ్ళు వెళ్ళడానికి ముందే, పై అంతస్తులో సిద్ధంగా ఉన్నాడు. దోపిడీకి ఎప్పుడు వెళ్ళడం మంచిదో అతడేచెప్పాడు. ధన్వంతరీ, భవానీసింగ్ - ఇద్దరూ గొందిలో మెట్లదగ్గర పిస్తోళ్ళు తీసుకు సిద్ధంగా ఉన్నారు గలభా జరిగితే, కిందివాళ్ళు పైకిపోకుండా జాగ్రత్త తీసుకుంటారు. పైన పిస్తోలు కాల్చవలసిన అవుసరం కలగలేదు. కేవలం పిస్తోలు చూపించి పనిజరుపుకొని వచ్చారు, మిత్రులు ! రెండు మూడు నిముషాల్లో 17200 రూపాయిాలు చేజిక్కాయి.

మిత్రులు మెట్లుదిగి క్రిందికి వచ్చాక కొందరు గోలచెయ్యాలని చూశారు. అప్పుడు ఆజాద్ ఒకమాటూ, విద్యాభూషణ్ ఒకమాటూ పిస్తోలు కాల్చారు. కొద్ది దూరంలో గల టౌనుహాలు ఆవరణలో లేఖరామ్ కారుపెట్టుకుని సిద్ధంగా ఉన్నాడు. మిత్రులు కారులో కూర్చోగానే, కారుబయల్దేరి వెళ్ళిపోయింది. మొత్తం డబ్బును హిందూహాస్టల్లో, ప్రొఫెసర్ నిగమ్ దగ్గర ఉంచారు. క్రమంగా అన్ని ప్రాంతాలకూ సర్దారా డబ్బును. ఈ దోపిడీ, నేను ఢిల్లీ చేరకముందే జరిగిపోయింది.

మొత్తం డబ్బులో ఎక్కువభాగాన్ని ఢిల్లీలో ఉన్న కైలాసపతికీ, కాన్పూరులో ఉన్న వీరభద్రతివారీకీ యివ్వడం జరిగింది. ఢిల్లీలో పెద్ద ఎత్తున పేలుడుపదార్థాన్ని తయారుచేసే ఫ్యాక్టరీని పెట్టాలనీ, కాన్పూర్‌లోపై డిప్పల్ని తయారుచేసే కార్ఖానాని పెట్టాలనీ ఉద్దేశ్యం. ఇలా పెద్ద ఎత్తున బాంబు ఫ్యాక్టరీకి ధనం కేటాయించడంలోని ఉద్దేశ్యం, అత్యధిక సంఖ్యలో బాంబుల్ని తయారుచేసి, మా ఉద్యమానికి గెరిల్లా పోరాట రూపాన్ని యివ్వాలని. మా ఉద్యమాన్ని దౌర్జన్యవాదం నుంచి, సాయుధ పోరాటం వైపు తీసుకెళ్ళడానికి ప్రయత్నిస్తున్నాము. ఒక్కొక్క ప్రాంతానికి సైక్లో స్టైల్ మిషన్ కొనుక్కోవటానికికూడా డబ్బు కేటాయించడం జరిగింది. దానిద్వారా కరపత్రాలను ఎక్కువగా పంచి మా ఆదర్శాలను ప్రజల్లో ఎక్కువగా ప్రచారం చేసుకోవాలని ఉద్దేశ్యం. పంజాబు ప్రాంతానికి ప్రత్యేకం రెండువేల రూపాయలు అధికంగా కేటాయించడం జరిగింది. సరిహద్దు ప్రాంతంలో గుల్‌మహారాజు బ్రిటీషు ప్రభుత్వాన్ని వ్యతిరేకేస్తున్నాడు. అతడితో స్నేహం కలుపుకుని మా ఆదర్శాన్ని అక్కడ ప్రచారం చేసుకోవాలని అనుకున్నాం.

నేను ఢిల్లీవచ్చి ఆజాద్‌ను కల్సుకున్నాను. తిరిగి లాహోరువెళ్ళి నా బాధ్యతలను స్వీకరించాలనుకుంటున్నాను. కానీ, ఆజాద్ "ముందు ఢిల్లీలో బాంబు ఫ్యాక్టరీని స్థాపించడం జరగనీ,

ఆ తరువాత వెళుదువుగాని" అన్నాడు. అప్పట్లో బాంబులు తయారుచేయడం మా విప్లవ సంఘంలో నా ఒక్కడికే తెలుసు. పంజాబులో నా స్థానంలో ధన్వంతరీ బాధ్యతలను నిర్వహిస్తున్నాడు.

'ఝుండావాలా'లో ఒక పెద్దబంగళాను బాంబు ఫ్యాక్టరీకోసం అద్దెకు తీసుకున్నాం. బంగళా మా అవుసరానికి తగినట్టుగా వుంది. చుట్టూ ఖాళీ ప్రదేశం. యిరుగు పొరుగులు వచ్చి చూస్తారన్న భయంలేదు. గాలీ, వెలుగూ ధారాళంగా వచ్చే గదులు. ఈమాటు బాంబు ఫాక్టరీని ఓ స్థిరమైన రూపంలో స్థాపించాలని ఉద్దేశ్యం. అంటే, ఎప్పుడూ బాంబులు తయారవుతూనే వుండాలని ! అలా వుండాలంటే తగిన ఆవరణ అవుసరం. పిక్రిక్ యాసిడ్ కడగబంవల్ల ద్రావకంతో కలిసిన నీరు నిరంతరం ప్రవహిస్తూ వుంటుంది. చూపరులకు అనుమానం కలగకుండా ఉండటానికి పైకి సబ్బుల ఫ్యాక్టరీగా ఆవరణను కల్పిద్దాం అనుకున్నాం. ఒక సైన్‌బోర్డును 'హిమాలయన్ టాయ్‌లెట్స్' అనే పేరుతో తయారుచేయించాం.

సబ్బులకుకానీ, పిక్రిక్ యాసిడ్ తయారుచేయడానికిగానీ, రసాయన శాస్త్రం చదివిన మిత్రుడు బాగా ఉపయోగపడతాడు. లాహోరు నుండి హీరానంద సచ్చిదానంద వాత్స్యాయన్‌ను (అజ్ఞేయ) ఢిల్లీ పిలిపించాము. అతడు కాలేజీలో రసాయన శాస్త్రాన్ని చదివాడు. ఈ మధ్యనే కాలేజీమాని విప్లవసంఘ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు.

అవుసరమైన పదార్థాల లిస్టును కైలాసపతికిచ్చాను. పదార్థాలన్నీ వచ్చేశాయి.

బంగాళా ముందుగదిని 'షోరూమ్'గా ఏర్పాటుచేశాం. వాత్స్యాయన్ కొన్ని పుస్తకాలను చదివి, ముఖానికి పులుముకునే క్రీమునూ, తలనూనెనూ తయారుచేశాడు. సీసాలకు మా కార్ఖానా లేబిలు నతికించి 'షోరూమ్'లో పెట్టాం. రచనా ప్రవృత్తీ, కళాప్రవృత్తీ కలవాళ్ళము యిద్దరం ఉన్నామక్కడ. నేనూ, అజ్ఞేయ ! మా కార్ఖానాలో తయారయ్యే వస్తువులన్నింటికీ కళాత్మకమైన పేర్లనే పెట్టాం. 'వసంత పరాగ్ హైర్ ఆయిల్' 'వసంత పరాగ్ క్రీమ్' 'వసంత పరాగ్ సోప్' సబ్బులనైతే మేము తయారుచెయ్యలేక పోయాం. కానీ, షో రూమ్‌లో సబ్బులు ఉండడం అవుసరంకదా ? సబ్బులకు అవుసరమైన మూస నొకదాన్ని తయారు చేయించి, బజారు నుండి కొన్ని సబ్బుబిళ్ళలు కొనుక్కొచ్చి, వాటిని మేము తయారుచేసిన మూసలోపెట్టి మా ఫ్యాక్టరీ ముద్రవేశాం. క్రీమ్‌నూ, నూనెనూ వాత్స్యాయనే తయారుచేశాడు. కానీ, పిక్రిక్ యాసిడ్ అతడి వల్లకాలేదు. అతడి కోమలమైన శరీరమూ, స్వభావమూ పిక్రిక్ యాసిడ్ యొక్క ఘాటును భరించలేకపోయాయి. పూర్వానుభవం లేకపోవడమూ, కొంతకారణమైంది. పిక్రిక్ యాసిడ్ పనికూడా వాత్స్యాయనే చూసుకుంటే నేను లాహోరు వెళ్ళిపోవచ్చును అనుకున్నాను.

పిక్రిక్ యాసిడ్ తయారుచేసేటప్పుడు మరికొందరు మిత్రులు కూడా నాతోపాటు పనిచేసేవారు. వాత్స్యాయన్, విమల ప్రసాద్ జైన్, గిరివరసింగ్, ప్రకాశవతి - వీరు నాతోపాటు ఉండేవారు. మొదట కొన్నాళ్ళుకైలాసపతికూడా పిక్రిక్ యాసిడ్ తయారుచేయటాన్ని నేర్చుకోవాలన్న ఉత్సాహాన్ని కనపర్చాడు. అయితే దుర్గంధపూరితమైన, ఊపిరాడని పొగకు భయపడిపోయాడు. పిక్రిక్ యాసిడ్ కడిగిన పసుపుపచ్చని నీరు నిరంతరం బయటికి వెళ్ళుతూనే వుంటుది. ఆ నీటిని చూసి ఎవరైనా అనుమాన పడవచ్చు. అందువల్ల ఆ నీటిలో సోడాపుప్పును కలిపి మరేదైనా రంగును కలిపేవాళ్ళం.

గడచిన 5, 6 నెలలలోకైలాసపతి వేషమూ, ప్రవర్తనకూడా బాగా మారింది. వళ్ళుమాయకుండా గుడ్డమాయకుండా వుంటున్నాడు. హైర్ ఆయిల్ పూసుకుని తల నున్నగా దువ్వుకుంటున్నాడు. ముఖానికి పూసుకున్న క్రీమ్‌వాసనలు మనిషి దగ్గర గుబాళిస్తున్నాయి. యిస్త్రీ చొక్కా గ్లాస్కో పంచె, కొత్త చెప్పులు నడకలో నాజూకు. బెంగాలీబాబుల్లా ధోవతి కోసను చేతబుచ్చుకుని అందరూ తనవైపు

చూసేట్టు వయ్యారంగా నడుస్తూన్నాడు. వెనక అతడిమీద నాకువున్న సానుభూతి పోయింది. మరోరకమైన భావనేదో నాలో గూడుకట్టుకోసాగింది.

కైలాసపతిలో వచ్చిన ఈ మార్పును గురించి ఒకటి రెండుమార్లు ఆజాద్‌తో ప్రస్తావించాను కూడాను. "ఠండీకి నీరు పట్టింది" అని అన్నాను.

కైలాసపతికి 'ఠండీ ప్రసాద్' అన్న మరోపేరు విప్లవ సంఘంలో వాడుకలో ఉంది. అతడిలో వచ్చిన ఈ మార్పు ఆజాద్ మనస్సునూ బాధించేది. అయితే నామనస్సును బాధించినంతగా మాత్రంకాదు. కైలాసపతిలో ఇలా మార్పురావడానికి ముఖ్యకారణం ఒకటుంది. విప్లవ సంఘపు డబ్బు కొన్నివేల రూపాయలు అతడిచేతులలో ఉంటున్నాయి. విప్లవ సంఘపు అవుసరాల కోసరం యాభయ్యో, వందో ఖర్చు పెట్టేప్పుడు తనకు ఓ అర్థరూపాయిపెట్టి క్రీమ్‌బాటిల్ కొనుక్కోవడం పెద్ద తప్పు అనిపించలేదతడికి. కైలాసపతి ఇలా తన్నుతాను అలంకరించుకుని ఆనందించడానికి కారణం అతను అరెస్టు అయిన తరువాతగాని తెలియలేదు.

ఢిల్లీ బాంబు ఫ్యాక్టరీ, రోహతక్‌లోని మట్టిమిద్దెలాంటిది కాదు. విశాలంగా ఉండి గాలీవెలుగూ ధారాళంగా వచ్చే గదులు. పైగా ద్రావకాల ప్రభావం శరీరంమీద పడకుండా ఉండడానికి, పేలుడు పదార్థాన్ని తయారు చేయడంలో పాల్గొనే మిత్రులందరికీ ప్రత్యేకమైన దుస్తుల్ని కుట్టించాం. అప్పట్లో బుష్‌షర్టు వేసుకునే ఆచారం భారతదేశంలో లేదు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత భారతదేశం వచ్చిన అమెరికన్లను చూసి మనం బుష్‌షర్టు ధరించడం నేర్చాం. కానీ మేము ఢిల్లీ బాంబు ఫ్యాక్టరీలోని మిత్రులకు, పనిలో వీలుగా ఉండగలందులకు, ఆనాడే బుష్‌షర్టులు కుట్టించాం. ప్యాంటు, బుష్‌షర్టు వేసుకుని పగలంతా పనిచేస్తుండేవాళ్ళం.

ఢిల్లీలో ఎక్కువ పరిమాణంలో పదార్థాలను తయారు చేశాం. బంగళా విశాలమైందే అయినా, ద్రావకాల పొగ అధికంగా వస్తూ ఉండేది. సాయంకాలమయ్యేసరికి మేమందరం పూర్తిగా అలసిపోయ్యేవాళ్ళం. అన్నం వండుకునే ఓపిక కూడా ఉండేదికాదు మాలో. పిక్రిక్ యాసిడ్‌నీ గన్‌కాటన్‌నీ తయారు చేశాక డైనమైట్‌కు అవుసరమైన పేలుడు పదార్థాన్ని కూడా కొంత తయారుచేశాం. ఇది అతి భయంకరమైన ప్రేలుడు పదార్థం. ఒకరోజున ద్రావకం సీసాలో, ఒకబొట్టు ద్రావకం ఉండగా, ఒక అరఔన్సు 'నైట్రోగ్లిజరీన్'ని వేశాడు వాత్స్యాయన్. సీసా మూత వదులుగా వుంది గనక సరిపోయింది. మూత ఎగిరివెళ్ళి నడికప్పుకు కొట్టుకుంది. మూతగట్టిగా ఉన్నట్లయితే, సీసా పగిలి ఆ గాజు ముక్కలతో మేమందరం గాయపడేవాళ్ళం.

కైలాసపతి గుర్రపుబండిలో ద్రావకాలు తెచ్చేవాడు. మేము అస్తమానం పేలుడు పదార్థాన్ని తయారు చేస్తుండేవాళ్ళం. సాయంత్రానికి తలనొప్పి పట్టుకునేది. మా చేతులకు పిక్రిక్ యాసిడ్ పవరు తగలడం వల్ల, ఆహారాన్ని తీసుకు తినడమూ కష్టమయ్యేది. మా చేతుల స్పర్శ వల్ల ఆహారం చేదెక్కేది. అలాంటి స్థితిలో, ఏ హోటలుకో వెళ్ళి ఇంత ఆహారాన్ని తిని వస్తూండేవాళ్ళం విమల ప్రసాద్ జైన్‌కు ఒక గుర్రపు బండి వాడితో పరిచయం వుంది. అతడి బండిలో నాలుగైదుమైళ్ళు తిరిగి వచ్చేవాళ్ళం. అప్పట్లో నేను ఒక విషయం తెలుసుకోలేకపోయాను. కైలాసపతి ప్రవర్తన నా మనస్సును ఎలా బాధిస్తున్నదో నా ప్రవర్తన కూడా అతడినలాగే బాధిస్తోంది. అతడు ఆజాద్‌తో నా మీద చాడీలు చెప్పేవాడు. విప్లవ సంఘపు డబ్బును సొంతానికి ఖర్చు చేస్తున్నానని చెప్పేవాడు. ఫ్యాక్టరీ బాధ్యత నాదే అయినా, నా ఒక్కడి కోసం ఏ ఖర్చూ పెట్టేవాడినికాదు. ఏది తెప్పించినా, ఏ ఖర్చు పెట్టినా, ఉమ్మడిగా అందరి కోసరమూ ఉద్దేశింపబడి ఉండేది.

# యశ్‌పాల్‌కు మృత్యుదండన

ఓ నలభై పౌన్లు పిక్రిక్ యాసిడ్, కొంత గన్‌కాటన్, నైట్రోగ్లిజరీన్ కొంత తయారు చేసుకున్నాం. ఈ మాత్రం పదార్థంతో 5, 6 వందల బాంబులు తయారవుతాయి. పేలుడు పదార్థం తయారు చేసిన మిత్రుల ఆరోగ్యం దెబ్బతిన్నది. కొన్నాళ్ళపాటు పనిని ఆపేశాం.

ఒకరోజు మధ్యాహ్నం కైలాసపతి నాతో ఇలా అన్నాడు. "రేపు ఉదయం కాన్పూరులో కేంద్రకమిటీ మీటింగు ఉంది. ఈ రాత్రి బండికే నీవు వెళ్ళు. కాన్పూర్ స్టేషన్‌లో మిత్రులు నిన్ను కలుసుకుని మీటింగు జరిగే ప్రదేశానికి తీసుకు వెళుతారు."

"నువ్వూ వస్తావుగదా ? నీతోపాటే నేనూ బయలుదేరుతాను" అన్నాను నేను.

"నేనూ వస్తాను. అయితే నాకు ఇక్కడ కొంచెంపనుంది.మొదటి బండికి కాకపోతే రెండవబండికి నేను బయలుదేరి వస్తాను. నువ్వు మాత్రం ఆలస్యం చేయకు. మొదటిబండికే వెళ్ళు. అక్కడ, స్టేషన్‌లో మిత్రలు నీకోసం ఎదురు చూస్తూ వుంటారు." అన్నాడు కైలాసపతి.

ఆ రోజుల్లో కైలాసపతి ప్రతిమాటనూ నేను వ్యతిరేకిస్తూ వుండేవాడిని. అతణ్ని ఉడికించటానికి "నువ్వు రెండవ బండికివెళితే, నేను మాత్రం ఆ బండికి ఎందుకు రాకూడదు ? నాకా బండిలో చోటుండదా ?" అన్నాను.

"నువ్వు ముందువెళితే, ఆజాద్ కొంతవరకూ స్థిమిత పడతాడు. మీటింగుకు ముందు నీతో ఏమో మాట్లాడాలని భైయ్యా ఉద్దేశ్యం అయివుంటుంది. వీలైతే నేనూ మొదటి బండికే వస్తాను. నా కోసం నువ్వు ఎదురు చూడవద్దు." అన్నాడు కైలాసపతి.

సరీగా రైలు బయలుదేరే సమయానికే స్టేషనుకు వెళ్ళడం నా అలవాటు. అలా వెళ్ళడంవల్ల సి.ఐ.డి. పోలీసుల కంటపడకుండా తప్పించుకోవచ్చు. ఢిల్లీ స్టేషనులో కైలాసపతి కోసం వెతక్కుండా నేరుగా రైలు ఎక్కి కూర్చున్నాను. కాన్పూరులోనూ, ప్లాటుఫారంమీద ప్రయాణీకుల గుంపుల్లో, నన్ను తీసుకువెళ్ళటానికి వచ్చిన మిత్రుడికోసరం ఒకటి రెండు మార్లు వెతికాను. అతడు నాకు కనిపించలేదు. నన్ను తీసుకువెళ్ళటానకి వచ్చిన మిత్రుణ్ని నేను ఎటూ ఎరిగే వుంటాను. నాకు అతడూ, అతడికి నేను కలపడకపోవడం యాదృచ్ఛికమే.

మీటింగు ఎక్కడో నాకు తెలియదు. ఆజాద్‌ను కలుసుకోవాలన్నా, ఎక్కడికి వెళ్ళాలో, ఎక్కడ వుంటాడో నాకు తెలియదు. నాకు కైలాసపతిమీద విపరీతమైన కోపం వచ్చింది. 'అతడు తల దువ్వు కోవడంలోనో, ధోవతి కుచ్చెళ్ళు ముడుచుకోవడంలోనో మునిగి ఉంటాడు. కనుకే, నాతోపాటు బయలుదేరలేకపోయాడు !' అనుకున్నాను. ఆజాద్ ఎక్కడున్నాడో తెల్సుకోవడానికి వీరభద్రతివారీ యింటికి వెళ్ళాను.

వీరభద్రావతివారి అప్పట్లో శ్రద్ధానందపార్కులో కాంగ్రెసు ఆఫీసుకు దగ్గర్లో ఉండేవాడు. నేను మెట్లు ఎక్కి పైకి వెళ్ళాను. ఎదురుగా అతడే భాశనపట్టు వేసుకు కూర్చుని వున్నాడు. నన్నుచూసి వీరభద్రతివారి విభ్రాంతుడయ్యాడు. కొంచెంగా అదరి పడ్డాడు కుడాను. నేనలా అకస్మాత్తుగా తన యింటికి వస్తానని అతడు అనుకుని ఉండడు. పరారులో ఉన్న నేను, అలా చెప్పా పెట్టకుండా తన యింటికి రావడంవల్ల అతడు ఆశ్చర్యపడడమూ, అదరిపడడమూ సహజమే. పైగా, అతడి యింటి ప్రక్కనే, విప్లవకారుల్ని పట్టుకోవడానికి, ప్రత్యేకం నియమించిన, సి.ఐ.డి. పోలీసు యినస్పెక్టరు రాయ్ సాహబ్ శంభూనాథ్ నివాసం.

నేనలా అనుకోకుండా వెళ్ళినందుకు కొంత బాధపడుతూ "నేను కేంద్రకమిటీ మీటింగ్‌కు వచ్చాను. కైలాసపతి వస్తానని రాలేదు. మీటింగ్‌కు తీసుకువెళ్ళడానికి, స్టేషన్‌దగ్గర మిత్రులు ఎదురుచూస్తూ వుంటారని చెప్పాడు. వాళ్ళూ నాకు కనిపించలేదు. నేను యిక్కడ ఇంకెవరినీ ఎరుగను. తప్పనిసరై మీ యింటికి వచ్చాను'' అన్నాను.

వీరభద్రవతివారి పరుపు పరుచుకు కూర్చున్నాడు. ఆ పరుపుమీద నన్నూ కూర్చోమని చేత్తో సంజ్ఞ చేశాడు. నేనూ కూర్చున్నాను.

శరత్‌బాబు నవల 'అరక్షణీయ' నా చేతిలో ఉంది. నా చేతిలోని ఆ పుస్తకాన్ని వీరభద్రతివారి తీసుకున్నాడు. పుస్తకం పేరులోని మొదటి 'అ'ను తన వ్రేలితో మూసి నాకు చూపించాడు. అతడి ఉద్దేశ్యం ఏమిటో నాకు అర్థం కాలేదు. "దారిలో పొద్దుపోవడానికి చదువుతూన్నాను' అన్నాను.

''అవుననుకో దీని పేరు 'అరక్షణీయ' కంటే 'రక్షణీయ' అని ఉంటే బాగుండేది'' అన్నాడు. వీరభద్రతివారి చాల గంభీరంగా మాట్లాడుతున్నాడు.

ఇన్ని సంవత్సరాల తరువాత ఆ నవలలోని విషయమేమిటో జ్ఞాపకం లేదు. అప్పుడు పుస్తకాన్ని సాంతం చదువనూలేదు. వీరభద్రతివారి నవల పేరును గురించి మాట్లాడుతున్నాడు - అనుకున్నాను. "ఇప్పుడే ఏమీ చెప్పలేను. సాంతం పూస్తకం చదివిగాని అభిప్రాయాన్ని యివ్వలేను" అన్నాను.

'నువ్వు చదవకపోవచ్చు. నేను చదివాను. నాకు అంతా తెలుసు' అలాగే గంభీరంగా మాట్లాడుతున్నాడు వీరభద్రతివారి.

నేను అప్పటికీ అర్థంచేసుకోలేదు. పుస్తకం పేరును గురించీ, కథను గురించీ మాట్లాడుతున్నాడు- అనుకున్నాను. చిరునవ్వు నవ్వుతూ "నువ్వు చదవొచ్చు నేనూ సాంతం చదవాలిగదా ?'' అన్నాను.

'నిన్ను రిసీవ్ చేసుకోవడానికి స్టేషన్‌కు వచ్చిన మిత్రుడు నిన్ను చూడకపోవడం, నువ్వు యిక్కడకు రావడం చాలా మంచిదయింది' అన్నాడు.

వీరభద్రతివారీ మీటింగుకు ముందు నాతో ఏమో మాట్లాడాలను కుంటూన్నాడు అనుకున్నాను. బహుశా, ఆజాద్‌కూ ఇతడికీ అభిప్రాయ బేధంవచ్చి ఉంటుంది. అందుకే మీటింగుకు ముందుగా నాతోమాట్లాడాలని అనుకుని ఉంటాడని అభిప్రాయపడ్డాను. 'మంచే అయింది. విషయం ఏమిటో చెప్పండి ?' అన్నాను.

'చాలా మంచి అయిది' అంటూ వీరభద్రతివారీ నా కండ్లల్లోకి సూటిగా చూశాడు. అతడి ముఖంలో సంతోషచ్ఛాయలు కనిపించాయి.

అతడేంచెపుతాడో వినాలన్న కుతూహలం నాలో ఎక్కువైంది. అతడిలా అన్నాడు. 'ఇవ్వాళ పొద్దుకుంకేవరకూ బైటకు ఎక్కడికి వెళ్లకు. రాత్రికి తిరిగి వెళ్ళిపో.'

"నేను క్రేంద్రకమిటీ మీటింగులో పాల్గొనడానికి వచ్చానుకదా ?''

"మీటింగు అయిపోయింది.''

నేను విపరీతమైన ఆశ్చర్యంతో "ఏమిటి, మీరు అనేది ?'' అన్నాను

"నీకు సురక్షితమైన ప్రదేశం ఏది ?'' అని అడిగాడు.

"నాకు అన్ని ప్రదేశాలూ ఒకలాంటివే, ఢిల్లీలో నాపని ఐపోయింది. ఇంక పంజాబు వెళ్ళమంటారనుకుంటాను ?'' అన్నాను.

"పంజాబు నీకు సురక్షితమైన ప్రదేశం కాదు.''

నా ఆశ్చర్యం యినుమడించింది. 'పంజాబులో ఈ మధ్య అరెస్టులు జరిగాయి గావును వార్తా పత్రికలద్వారా బైటకు తెలియకుండా ఉండి ఉంటాయి. ఇతడు ప్రత్యేకం తెలుసుకున్నాడు గావును' అనుకున్నాను. పైకి ఇలా అడిగాను. "పంజాబులో ఏం జరిగింది ?"

నేనతడి మాటల్ని అర్థం చేసుకోలేదని వీరభద్రతివారీ తెల్సుకున్నాడు. నా రెండు చేతులనూ తన చేతుల్లోకి తీసుకుని నా కండ్లలోకి సూటిగాచూస్తూ "నేను చెప్పిన మాటలు మరెవరికీ చెప్పనని ప్రమాణం చెయ్యి" అన్నాడు.

నేను కొంచెంగా బాధపడ్డాను. "విప్లవ సంఘ రహస్యాన్ని మరెవరికైనా చెప్పడం అన్న ప్రశ్నే ఉండదుకదా ? అందులోనూ నేను మరెక్కడైనా చెపుతానని మీరు ఎలా అనుకున్నారు ?" అన్నాను.

"నేను చెప్పబోయేది విప్లవ సంఘ రహస్యంకంటే కూడా రహస్యమైంది. దీన్ని పార్టీ సభ్యులకు కూడా చెప్పనని మాటయివ్వు. ఆజాద్‌కు కూడా చెప్పటానికి వీల్లేదు" అన్నాడు వీరభద్రతివారీ.

"నేను పార్టీ హితానికి విరుద్ధంగా ఏ విషయాన్నీ బైటపెట్టను" అన్నాను గంభీరంగా.

"నేనూ పార్టీహితాన్ని గురించే మాట్లాడుతున్నాను. నీకూ నాకూ ఎక్కువ మిత్రత్వం లేదు. రెండు మూడు సార్లు మాత్రమే నిన్ను నేను కల్సుకున్నాను. వెనుక నీగురించి నేవిన్నదాన్నిబట్టి యిప్పుడు వింటున్న దాన్నిబట్టి అలాంటిమాట నీ దగ్గర తీసుకోవడం అవుసరం అనుకుంటు న్నాను" అన్నాడు వీరభద్రతివారీ.

నేను గంభీరుణ్ణయ్యాను. "పార్టీహితంకోసం నీవు చెపుతున్న రహస్యాన్ని దాయటం అవుసరమైతే, నేనీ రహస్యాన్ని ఇంకెవరికీ చెప్పను" అని అతడి రెండుచేతులనూ నా చేతుల్లోకి తీసుకుని ప్రమాణం చేశాను.

'కేంద్రకమిటీ మీటింగు అయిపోయింది. నిన్ను ఇక్కడకు పిలిపించి కాల్చేయాలని నిర్ణయం జరిగింది.' అన్నాడు వీరభద్రతివారీ.

నా నెత్తిన పిడుగు పడ్డట్టయింది. "ఎందుకని నన్ను కాలుస్తారు ? కారణం ఏమిటి ?" అని అడిగాను.

"నీమీద మిత్రలుకు విశ్వాసం తగ్గింది. నువ్వు సుఖాన్నీ, షోకుల్నీ మరిగావని అనుకుంటున్నారు. నీలో పిరికతనం గూడుకట్టుకున్నదని భావిస్తున్నారు. నువ్వు విప్లవ సంఘాన్ని నట్టేట్లో ముంచుతావని మిత్రుల అభిప్రాయం..... విశ్వాస ఘాతుకం చేస్తావని అనుకుంటున్నారు."

ఘోరంగా అవమాన పడిపోయాను. "ఈ అనుమానాలకూ సంశయాలకూ నిదర్శన మేమిటి? నా ప్రవర్తనలో అలాంటి అనుమానం కలిగించిన విషయమేమిటి ? ఎవరు వేశారు, ఈ నిందను నామీద ?" అని అడిగాను.

"అదంతా పోనీ నిన్ను కాల్చెయ్యడం పార్టీకి హితాన్ని చేకూరుస్తుందని నే అనుకోవడం లేదు. కనుకనే నీచేతిలోని పుస్తకంమీది 'అ'ను మూసి 'రక్షణీయ' అని ఉండాలని చెప్పాను. నువ్వు యిక్కడకు వచ్చి ఈ విషయాన్ని తెలుసుకోవడం మంచిదే అయింది. ఇప్పుడు నువ్వు ఈ రహస్యాన్ని బైటపెడితే- కేంద్రకమిటీ నిర్ణయాన్ని అమలు పరచడానికి అభ్యంతరం కలిగించిన అపరాధానికి నీతోపాటు నన్నూ కాల్చేస్తారు."

నేను దాదాపు పిచ్చివాడినయ్యాను. 'నా అపరాధ మేమిటో నాకు చెప్పి, అపరాధం రుజూ ఐన తరువాత కాల్చేసినా నాకు అభ్యంతరం ఉండదు" అన్నాను.

వీరభద్రతివారీ "అదెలా జరుగుతుంది ? ఎవరినైనా కాల్చెయ్యడం జరుగుతుందని తెలిశాక, అతడు పోలీసులకు చెప్పి రక్షణను పొందవచ్చు కదా ? మిత్రులందరినీ పట్టించ్చునుకదా ?" అన్నాడు.

"అంటే నేనిక పోలీసుల రక్షణలోకివెళ్ళి, మిత్రులందరినీ పట్టించేస్తానని, అనుమానిస్తున్నా రన్నమాట" అని అడిగాను.

"నీమీద నాకు అలాంటి అనుమానం ఏమీలేదు. కానీ, ఇతర మిత్రులకు ఉంది. నీమీద నాకు అనుమానంలేదు కాబట్టే నీకు ఈ విషయాన్ని చెప్పాను. ఒకరకంగా నేను నీకంటే కూడా ప్రమాదంలో యిరుక్కున్నాను. నువ్వు ఏనాడు ఈ రహస్యాన్ని బైటపెట్టినా, నా ప్రాణానికి ముప్పు వాటిల్లుతుంది. అయినా, నిన్ను కాల్చివేయడం పార్టీ క్షేమానికి విరుద్ధం గనక, నేను ఈ రహస్యాన్ని నీకు చెప్పాను" అని అన్నాడు వీరభద్రతివారీ.

అంతటి ఘోరమైన అపరాధం నామీద వేసేసరికి, నామీద నాకే అసహ్యం వేసింది. చాలా సేపు మౌనంగా కూర్చుండిపోయాను. తరువాత "నేను ఆజాద్‌ను కలుసుకునే ఏర్పాటు చెయ్యి. నేను వాళ్ళతో మాట్లాడతాను. నా అపరాధమేమిటో చెప్పి ఋజువుపర్చమని అడుగుతాను. అపరాధమేమిటో చెప్పకుండా, దాన్ని ఋజువు పర్చకుండా శిక్ష విధించటం ఏం న్యాయం ?' అన్నాను.

వీరభద్రతివారీ "నీతోటి ఏమీ మాట్లాడకుండా, నిన్ను కాల్చెయ్యాలని కేంద్రకమిటీ నిర్ణయించింది. ఇప్పుడీ విషయాన్ని గురించి ఆజాద్‌తో మాట్లాడడానికి వెళితే, నీకీ రహస్యం ఎవరు చెప్పారన్న ప్రశ్న వస్తుంది. అంటే నన్ను కాల్చేసేయడం జరుగుతుందన్న మాట" అన్నాడు.

నేను ఇంకేమీ మాట్లాడలేక పోయాను. కొంతసేపు ఆలోచించి మళ్ళీ ఇలా అడిగాను "ఈ స్థితిలో నేనేం చెయ్యాలి ?"

వీరభద్రతివారీ "కనీసం నీ ప్రాణాన్నీ, ప్రకాశవతి ప్రాణాన్నీ రక్షించుకోవడం ముఖ్యం. నిన్ను కాల్చేశాక ప్రకాశవతిని కూడా కాలుస్తారు. మీరు మిమ్మల్ని రక్షించుకుంటూ, ఏదైనా ఒక 'యాక్షన్'ని చేసి చూపించగలిగితే, పార్టీకి మీమీద ఉన్న అనుమానం పోతుంది. పార్టీ పునరాలోచించుకుని తన నిర్ణయాన్ని మార్చుకుంటుంది. అలాంటప్పుడు మీమీద ఈ నేరాలు వేసినవాళ్ళే అబద్ధీకులని తేలిపోతుంది. మీరిద్దరూ పార్టీ తన నిర్ణయాన్ని మార్చుకునేట్టు వ్యవహరించగలరని నాకు విశ్వాసం ఉంది" అని సలహా యిచ్చాడు.

కేంద్ర కమిటీ మీటింగులో ఎవరెవరు పాల్గొన్నారని, పంజాబుకు ప్రతినిధి ఎవరని అడిగాను. వీరభద్రతివారీ ఇంకేమీ చెప్పనన్నాడు.

మానసికంగా చాలా బాధపడుతూన్నాను. పగలంతా మౌనంగా పడుకుని ఆలోచించాను. ఇప్పుడు నేనేం చేయ్యాలి ? ఇంతవరకూ పోలీసులకే భయపడవలసి వచ్చింది. ప్రతి స్టేషన్ దగ్గరా, పోస్టాఫీసు దగ్గరా, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ విప్లవకారుల్ని పట్టి యివ్వడానికి పెద్ద పెద్ద ప్రకటనలు అతికించారు. లాహోరు కుట్రకేసులోని ముద్దాయిలనూ, వైస్రాయి ట్రైను క్రింద బాంబు పేల్చినవారిని పట్టియిచ్చిన వారికి పెద్ద పెద్ద బహుమతులు ప్రకటించారు. అన్ని ప్రకటనల్లోనూ నా ఫోటో ఉంటుంది. మిగిలిన అందరి ఫోటోలకంటే కూడా కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. బహుమతుల విషయంలోనూ ఆజాద్‌కూ నాకే అందరికంటే ఎక్కువ బహుమతులు ప్రకటించారు. కనుక, ఇన్నాళ్లూ పోలీసుల కంటపడకుండా తప్పించుకు తిరిగాను. ఇప్పుడు అంతకంటే పెద్ద బాధవచ్చిపడ్డది. నా పార్టీ మిత్రులే నన్ను ఎక్కడచూసినా కాల్చేస్తారు.

నేను తిరిగే పరిసరాలు, ఉంటే ప్రదేశాలు నా కథా కమామిషూ పోలీసులకు తెలియదు. పార్టీ సభ్యులకు ఇవన్నీ తెలుసు. ఇంతవరకూ పరప్రభుత్వం నుండి ప్రాణభయం ఉండేది. అది ఒకరకంగా

గర్వించదగిన విషయం. ఇప్పుడు మిత్రుల ద్వారా అవమానింపబడి ప్రాణాన్ని రక్షించుకోవడానికి దేవుళ్ళాడుతూ తిరగవలసిన పరిస్థితి. అవమానకరమైన ఈ స్థితిలో ప్రాణరక్షణ కంటే ముఖ్యమైంది, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం.

ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి చాలా సులువైన ఆలోచన ఒకటొచ్చింది. నేరుగా డిప్యూటీ కమీషనర్ ఆఫీసుకుగాని, పోలీసు సూపరింటెండెంటు ఆఫీసుకుగాని వెళ్ళడం వీలైతే వాళ్ళిద్దరినిగానీ, లేకపోతే ఒకర్నిగానీ కాల్చేసి, నేనూ పోరాడుతూ చచ్చిపోవడం. అప్పుడే నలుగురికీ వినపడేట్టు క్రిందవిధంగా అరిచి నా అభిప్రాయాన్ని వ్యక్తపరుద్దామనుకున్నాను. "నా మిత్రులు నన్ను సందేహిస్తున్నారు. ప్రాణాలనిచ్చి వారి సందేహాన్ని తొలగిస్తాను. నేను పిరికివాణ్ణిగానీ, విశ్వాస ఘాతకుణ్ణిగానీ కాను."

ఇలాంటివే పిచ్చిపిచ్చి ఊహలేవో వచ్చినాయి.

ఆత్మహత్యా సదృధ్యమైన పని ఏదో ఒకటి చేసేవాణ్ణి. కాని ప్రకాశవతిపట్ల నాకుగల బాధ్యత స్ఫురణకువచ్చి ఆగిపోయాను. మరోరకంగా ఆలోచించసాగాను. నేనొక చిన్న సంఘాన్ని ఏర్పర్చి దాని ద్వారా కొన్ని 'యాక్షన్'లను జరిపితే, సెంట్రల్ కమిటీ తన నిర్ణయాన్ని తప్పకుండా మార్చుకుంటుంది. పంజాబువెళ్ళి కొందరు మిత్రుల్ని కలుసుకుని వారి సహాయంతో కనీసం ముగ్గురు షేర్‌దిల్ పోలీసులమీద దాడిచేసి వాళ్ళ ఆయుధాల్ని లాక్కోవాలనుకున్నాను. ఆ ఆయుధాల్ని సెంట్రల్ కమిటీకి వప్పజెప్పినప్పుడు కమిటీ నా గురించి విధిగా పునరాలోచిస్తుంది. పంజాబువెళ్ళి కార్యరంగంలో దిగటమే ప్రస్తుత కర్తవ్యం.

ఆ రాత్రే ఢిల్లీకి తిరుగు ముఖం పట్టాను. స్టేషన్‌లో పోలీసుల నుంచేకాకుండా, నా స్నేహితులకంట పడకుండా కూడా జాగ్రత్త తీసుకోవాల్సి వచ్చింది. నేను నేరుగా ఢిల్లీలోని బాంబు ఫ్యాక్టరీకి వెళ్ళాను. ప్రకాశవతి అక్కడే ఉన్నది గదామరి ? ఆమెను అక్కడ నుంచి తీసుకు వెళ్ళటం ముఖ్యం. కేంద్ర కమిటీ నిర్ణయం ఫ్యాక్టరీలో ఉన్న అందరికీ తెలుసునో, తెలియదో, నాకు తెలియదు. ఫ్యాక్టరీలో ఉన్న మిత్రులు, ప్రకాశవతిని తీసుకువెళ్ళడానికి అభ్యంతరం చెపితే, పోరాడడానికి నేను సిద్ధంగా వున్నాను. అలాకాక చర్చలద్వారా నా అపరాధాన్ని, ధ్రువీకరించడానికి యిష్టపడితే, అందుకూ నేను సిద్ధమే. ఆ సమయములో కైలాసపతి బాంబు ఫ్యాక్టరీలోనే ఉంటాడు.

నేను తలుపు కొట్టాను. గిరివర సింగ్ తలుపు తీశాడు. అతడు నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వు సహజంగా ఉంది. ఫ్యాక్టరీలో అనుమానింపదగిన పరిస్థితులు లేవనుకున్నాను. లోపల విమల్, వాత్స్యాయన్ - యిద్దరూ కనిపించారు. వాత్స్యాయన్ నన్ను చూసి మౌనంగా ఉండిపోయాడు. అతడు అప్పుడప్పుడూ అలా మౌనంగా ఉండటం మామూలే. నేరుగా ప్రకాశవతి దగ్గరకు వెళ్ళాను. నీ గుడ్డలూ, తయారయిన పిక్రిక్ యాసిడ్‌నీ మూటగట్టుకుని వెంటనే బయలుదేరు' అన్నాను.

నే అలా వెంటనే బయలు దేరమన్నందుకు ప్రకాశవతి ఏ మాత్రం ఆశ్చర్యపడలేదు. అప్పటి మా జీవితాల్లో అలాంటి అనుకోని ప్రయాణాలు సహజమే.

ప్రకాశవతికిగానీ, ఇతర మిత్రులకుగానీ అనుమానంకలిగే మాట ఒక్కటీ నేను మాట్లాడలేదు. ప్రవర్తనలోనూ అనుమానానికి ఆస్కారాన్ని యివ్వలేదు.

విమల్ నాదగ్గరకు వచ్చి "ఏమిటీ విషయం ? ఎక్కడికి వెళుతున్నావు ?" అడిగాడు.

'ఈ యింటిమీద పోలీసుల కన్ను పడ్డటుంది. నేను కమలను మరొకచోటుకి తీసుకెళ్ళుతున్నాను. మీరూ సిద్ధంకండి' అన్నాను.

ఇంతలో కైలాసపతి వచ్చాడు. అతడి ముఖంలో విస్మయం కొట్టవచ్చినట్టు కనిపించింది. 'కాన్పూరు వస్తానంటివే, ఇదేనన్నమాట రావడం ?' అన్నాను కైలాసపతితో.

నేను ప్రాణాలతో తన ఎదుట కనిపించే సరికి కంగారు పడ్డాడు. ఆ కంగారులో నా మాటకు సమాధానం యివ్వలేదు. అతడి సమాధానం కోసం నేనూ ఎదరు చూడలేదు.

తరువాత విమల్ నాతో చెప్పాడు. అతడు కైలాసపతితో 'ఈ యింటిమీద పోలీసుల కన్ను పడ్డదని' నేను అన్నమాటను చెప్పాడట. "ఇతడు మాట అడ్డం వేశాడు. కేంద్రకమిటీ ఇతడ్ని కాల్చెయాలని నిర్ణయించింది. అందుకే కాన్పూరు పిలిపించడం జరిగింది. ఎలాగో తప్పించుకుని పారిపోయి వచ్చాడు. ఇప్పుడు కమలను తీసుకుని పారిపోతున్నాడు !"

అప్పుడు విమల్ అన్నాడు."సెంట్రల్ కమిటీ అలాంటి నిర్ణయాన్ని చేసినట్లయితే, నువ్వు ఇక్కడ ఇన్‌ఛార్జీ కదా ? ఆ నిర్ణయం అమలు జరపటానికి నాకు ఆర్డర్ యివ్వు. నేను అతడ్ని ఇప్పుడే కాలుస్తాను."

కైలాసపతి సాహసించలేకనో, లేక పరిస్థితి అనుకూలించకనో నన్ను కాల్చడానికి ఆర్డర్ యివ్వలేదు. అయితే, నన్ను వెంబడించి నేను ఎక్కడకు పోతున్నదీ తెలుసుకోమని విమల్‌కు ఆర్డర్ యిచ్చాడు. విమల్ నన్ను వెంబడించడాన్ని నేను గమనించలేదు. ప్రకాశపతిని, జుమ్మా మసీదు దగ్గర ఉన్న దేవరాజు భల్లాయింట్లో దిగపెట్టాను. ఈ దేవరాజు నా బాల్యస్నేహితుడు. సహాధ్యాయి.

అప్పటికీ నేను ప్రకాశపతికి ఏమీ చెప్పలేదు. తనను ఫ్యాక్టరీ నుంచి తీసుకొచ్చిన కారణాన్నిగానీ, సెంట్రల్ కమిటీ నిర్ణయాన్నిగానీ ఆమెకు తెలియనివ్వలేదు. ప్రకాశపతికి అనవసరమైన మానసిక వ్యథ కలగకుండా పరిస్థితిని అదుపులోకి తెచ్చుకుందామని నా ఉద్దేశ్యం. ఆరోజు సాయంకాలమే నేను లాహోర్ వెళ్ళిపోయాను.

తయారైన పిక్రిక్ యాసిడ్, నైట్రోగ్లిజరిన్ మొదలైన ప్రేలుడు పదార్థాలను జాగ్రత్తగా లాహోరు పట్టుకెళ్ళడానికి వాత్స్యాయన్‌ని సాయం రమ్మన్నాను. అతడు అంగీకరించాడు. సెంట్రల్ కమిటీ నన్ను కాల్చివేయడానికి చేసిన నిర్ణయం అతడికి ముందే తెలుసు. అతడికి తెలుసునని నాకు తెలియదు. తెలిసికూడా అతడు నాకు సహకరించాడు. అందుకు కారణం నామీద తనకువున్న విశ్వాసమూ కావచ్చును లేక నా రహస్యాన్ని తెల్సుకోవడానికీ కావచ్చును. వాత్స్యాయన్‌కి దొరవేషం వేశాను. నేను బంట్రోతు వేషం వేసుకున్నాను. సూట్‌కేసులోకి ప్రేలుడు పదార్థాన్ని సర్దుకొని దాన్ని అతడిదగ్గరే సెకండ్‌క్లాసు పెట్టెలో పెట్టాను. నేను థర్డ్ క్లాసు పెట్టెలో కూర్చున్నాను. లాహోర్ వెళ్ళాక వాత్స్యాయన్ సూట్‌కేసు నాకు యిచ్చేశాడు.

లాహోర్ వెళ్ళాక మిత్రుల్ని కలుసుకుని కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాను. లాహోర్‌లోని మిత్రులు రెండు ముఠాలుగా చీలి ఉన్నారని గమనించాను. ఈ ముఠాలు ఏర్పడ్డం ఏ ప్రత్యేకమైన సిద్ధాంతం కారణంగానూ కాదు. ఆర్థికస్థితి, సాంఘిక పరిస్థితులు చదువు సంధ్యలు - వీటి దృష్ట్యా మిత్రులు ముఠాలుగా చీలిపోయారు. ఉదాహరణకు ఇంద్రపాల్, భాగ్‌రామ్, గులాబ్‌సింగ్, జహంగీరీలాల్ - వీరందరూ నిమ్న మధ్య తరగతికి చెందినవారు. వీరు తమ తిండి తాము కష్టపడి సంపాయించుకు తినవలసినవారు. చదువులోనూ వీరు అంతగా అభివృద్ధి చెందలేదు. హిందీ, ఉర్దూ మాత్రం చదువుకున్నారు. వీరందరూ ఒక ముఠాగా కనిపించారు. రెండవ ముఠాలో వాత్స్యాయన్, దేవరాజ్ సేఠీ, కేవల్‌కృష్ణ, సుఖదేవరాజ్, దుర్గాదాస్ ఖన్నా, ధన్వంతరీ - వీరున్నారు. వీరందరూ యూనివర్శిటీ విద్యనభ్యసించిన విద్యాధికులు. పొట్టకోసం తాము కష్టపడకుండా తమ కుటుంబాలమీద ఆధారపడ్డవారు. ఈరెండవ ముఠాలోని వారందరికీ ధన్వంతరీ, సుఖదేవరాజ్ - నాయకులుగా ఉన్నారు.

నన్ను కాల్చివెయ్యటానికి నిర్ణయించిన మీటింగులో సుఖదేవరాజ్ గానీ ధన్వంతరీగానీ - వీరిద్దరిలో ఎవరో ఒకరు ఉండి ఉంటారని ముందే అనుకున్నాను. ఉన్నత మధ్యతరగతి మిత్రుల్లో ధన్వంతరీకీ సుఖదేవరాజ్‌కూ పరిచయాలు ఎక్కువగా ఉన్నాయి. నౌజవాన్ భారతసభ కార్యకర్తగా ధన్వంతరీకి బాగా పలుకుబడి ఉంది. సుఖదేవరాజ్ మీద నాకు ఎప్పుడూ విశ్వాసం లేదు. కాని నేను ఏదైనా కార్యక్రమం ప్రారంభిస్తే ధన్వంతరీ తప్పకుండా సహకరిస్తాడని ఆశించాను.

విద్యార్థుల్లో వాత్స్యాయన్‌కు పరిచయం బాగావుంది. అతడప్పటికే హిందీ, ఇంగ్లీషు భాషల్లో కథలూ, కవిత్వాలూ రాస్తూ వుండేవాడు. ఏదైనా 'యాక్షన్'ని జరపాలంటే డబ్బూ మిత్రులూ కూడా అవుసమౌతారు. గదోడియాస్టోర్ దోపిడీ తరువాత విప్లవసంఘం ఆర్థికంగా మంచి స్థితిలోనే ఉంది. అయితే, నేను వ్యక్తిగతంగా నిర్వహించే కార్యక్రమాలకు విప్లవ సంఘాన్నుండి ఆర్థిక సహాయాన్ని ఆశించలేనుకదా ? నేను ఉన్నత మధ్యతరగతికి చెందిన మిత్రుల సహాయ సహకారాలతో ఏదో ఒక యాక్షన్‌ని జరపాలని నిశ్చయించుకున్నాను.

నా అభిప్రాయాన్ని వాత్స్యాయన్‌కు చెప్పాను. అతడు నా ప్లానును విని మౌనంగా ఉన్నాడు ప్రోత్సహించనూ లేదు. వ్యతిరేకించనూలేదు. ఇతర మిత్రుల్నీ కొందరిని కలుసుకున్నాను. వాళ్ళకూ చెప్పాను. వాళ్ళూ విని ఊరుకున్నారు. నన్ను కాల్చేయ్యాలన్న నిర్ణయం వాళ్లందరికీ తెలిసిందని నేను అనుకోలేదు. స్థానిక నాయకులు ధన్వంతరీ, సుఖదేవరాజ్‌లు కావడంవల్లా, నేను స్థానిక నాయకుణ్ణి కాకపోవడంవల్లా వీళ్ళునాతో చొరవగా మాట్లాడలేక పోతున్నారనుకున్నాను. ఒకమాటు ధన్వంతరీని కల్సుకుని మాట్లాడదామనుకున్నాను. అదీ జరగలేదు.

ఉన్నత మధ్యతరగతి మిత్రులవల్ల ప్రయోజనంలేదని నిర్ణయించుకుని నిమ్న మధ్యతరగతి మిత్రులను కల్సుకోవడానికి ప్రయత్నించాను. ఇంద్రపాల్‌ని కలుసుకున్నాను. షేర్ దిల్ పోలీసులమీద దాడిచేసి ఆయుధాల్ని సంపాయించాలన్న నా ప్లానును ఇంద్రపాల్‌కు చెప్పాను. ఈ యాక్షన్‌కు సహకరించమని చెప్పడానికి అతణ్ణి ధన్వంతరీ దగ్గరకు పంపించాను. పంజాబుకు ఇన్‌ఛార్జీ ధన్వంతరీ అని ఇంద్రపాల్‌కు మొదటే చెప్పాను.

సెంట్రల్ కమిటీ నిర్ణయాన్ని నేను ఇంద్రపాల్‌కు తెలియపర్చలేదు. అలా తెలియపర్చడం వల్ల మిత్రుల దృష్టిలో నా విలువను నేను చంపుకున్నవాడినీ అవుతాను, విప్లవ సంఘంపట్ల మిత్రుల దృష్టికోణాన్ని మార్చినవాడినీ అవుతాను.

ఇంద్రపాల్, ధన్వంతరీతో మాట్లాడాడు. ధన్వంతరీ తనను ఏకాంత ప్రదేశంలో కల్సుకోమని కబురుపంపాడు నాకు. 'ఏకాంతంలో కల్సుకోవడం దేనికి ? నాకూ అతడికీ పరిచయులైన కొందరు మిత్రుల సమక్షములో మాట్లాడుకుందాము' అన్నాను నేను. ధన్వంతరీ నా ప్రతిపాదనను తిరస్కరించాడు.

నన్ను ఏకాంతంలో కల్సుకోమనడానికి కారణం ఏమిటో ఊహించుకోవడం కష్టంకాదు. నేనా ప్రతిపాదనను తిరస్కరించాను.

ఏకాంతంలో కల్సుకోడానికి నేను తిరస్కరించేసరికి ఇంద్రపాల్‌కు ఆశ్చర్యం వేసింది. నేను తిరస్కరించిన కారణాన్ని అడిగాడు. యధార్థం చెప్పాను. "నన్ను ఏకాంత ప్రదేశానికి పిలిపించి, ధన్వంతరీ, సుఖదేవరాజ్ - కాల్చేయాలని చూస్తున్నారు" అని చెప్పాను.

ఇంద్రపాల్ చకితుడయ్యాడు. కోపమూ వచ్చిందతడికి. సమస్యను అజాద్ ముందు పెట్టమని సలహా యిచ్చాడు. అప్పుడు నేను ఇంద్రపాల్‌తో "వీళ్ళు నాకు అజాద్ ఎక్కడున్నాడో చెప్పడంలేదు. నామీద అజాద్‌కు ఏవేవో చాడీలు చెప్పారు. సెంట్రల్ కమిటీలో - అజాద్ నన్ను కాల్చివేయాలని నిర్ణయంచినట్లు వీళ్ళు ప్రచారం చేస్తున్నారు. నేను ఇలా అంటున్నాను 'నా తప్పేమిటో

నాకు చెప్పండి. సమస్యను ఆజాద్ ముందు ఉంచుదాం. నేను నా మీద మోపిన అపరాధాలు నిరాధారాలని ఋజువు చేసుకుంటాను. అప్పటికీ ఆజాద్‌కుగానీ, సెంట్రల్ కమిటీలోని మెజార్టీ సభ్యులకుకానీ, నేను అపరాధినేనన్న విశ్వాసం ఉంటే నిరభ్యంతరంగా కాల్చేయ్యవచ్చు. కాని వీళ్ళు తమతప్పు బైటపడుతుందని, నాకా అవకాశాన్ని యివ్వడం లేదు."

ఇంద్రపాల్ మరీ కోపగించుకున్నాడు. అతడు పిస్తోలు నొకదాన్ని తీసుకుని నాతోపాటు ధన్వంతరీని ఏకాంత స్థానంలో కల్సుకోవడానికి వచ్చేస్తానన్నాడు. భాగ్‌రామ్‌నికూడా తోడురమ్మని పిలిచాడు.

ధన్వంతరీ నన్ను డి.ఏ.వీ. కాలేజి బోర్డింగ్ హౌస్‌లో, సూర్యోదయ సమయమప్పుడు కలుసుకోమని కబురుపెట్టాడు పంజాబులో వేసంగి సెలవులు ఇతర ప్రాంతాలకంటే ఆలస్యంగా యిస్తారు. స్కూళ్ళు, కాలేజీలు తిరిగి తెరవడము కూడా యితర ప్రాంతాలకంటే ఆలస్యంగానే జరుగుతుంది. అవి వేసవి సెలవులు. బోర్డింగ్‌హౌస్‌లో చాలా కొద్ది మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. బోర్డింగ్‌హౌస్, చుట్టూ భవనాలతో కప్పబడి రహస్యాత్మకంగా ఉంటుంది. మేము ఆ బోర్డింగ్‌హౌస్‌కు వెళ్ళాం. అప్పుడు ధన్వంతరీ నడవాలో మంచంవేసుకు కూర్చుని ఉన్నాడు. విద్యార్థులు లేకపోవడంవల్ల చుట్టూవున్న గదులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. అయితే, ఆ గదుల్లో ఒకరిద్దరైనా తలుపుల చాటున దాక్కుని ఉంటారని నేను అనుమానించాను. నేను ఇద్దరు మిత్రులతో రావడం చూసేసరికి ధన్వంతరీ ముఖంలో సహజంగాఉండే చిరునవ్వు మాయమైంది. కోపంతో ముఖం ఎర్రబడ్డది. అతడి కోపానికి కారణం తెలిసినా తెలియనట్టు చిరునవ్వు నవ్వుతూ "నిన్ను కలుసుకోవడానికి ఎంతో ఆత్రుత పడుతున్నాను" అన్నాను.

"నిన్ను ఒక్కడినే రమ్మన్నానుగదా ? వీళ్ళనెందుకు వెంట తీసుకొచ్చావు ?" అని అన్నాడు ధన్వంతరీ. అతడి స్వరం హుందాగా దార్ఢ్యకంగా ఉంది.

"మేము ఊరి నుంచి కలిసివస్తున్నాము. అపర్నే ఇటువచ్చేశాం. మనం ఒంటరిగా మాట్లాడుకోవలసింది ఏమైనా ఉంటే, అటుపోయి మాట్లాడుకుందాం పద" అన్నాను.

అందుకతడు ఒప్పుకోలేదు. మరి అతడు కోరిన విధంగా ఏకాంతంలో కల్సుకోవడానికి నేను మాత్రం ఎందుకు ఒప్పుకుంటాను ?

ఇప్పటివరకూ ధన్వంతరీ నామాట వింటాడని, నా సమస్యను ఆజాద్ దగ్గర ఉంచడంలో సహకరిస్తాడని ఎంతో ఆశించాను. కాని ధన్వంతరీ అసలు మాట్లాడటానికే అంగీకరించలేదు. చాలా నిరాశ పడిపోయాను. ఇంతవరకూ నా ఈ సమస్యను ఒక్క ఇంద్రపాల్‌కే చెప్పాను. మరెవ్వరికీ చెప్పలేదు. మిత్రులెవ్వరూ నాగురించి సెంట్రల్ కమిటీచేసిన నిర్ణయం నాకు తెలుసునని అనుకోవడంలేదు. కాన్పూర్‌లో స్టేషన్ దగ్గరకు- నన్ను తీసుకువెళ్ళటానికి వచ్చిన మిత్రులు కనపడకపోవటంతో అను శాసనాన్ని అతిక్రమించి, అటూ యిటూ తిరుగుతున్నానని మాత్రం మిత్రులు అనుకున్నారు. మరి నన్ను ఒంటరిగా కలుసుకోమన్నప్పుడు నేను ఇద్దరి మిత్రుల్ని వెంటబెట్టుకు వెళ్ళడాన్ని ధన్వంతరీ ఎలా అర్థం చేసుకున్నాడో నాకు తెలియదు. నిర్ణయం తెలిసి జాగ్రత్తకోసం మిత్రుల్ని వెంటతెచ్చాననుకున్నాడో, విప్లవ సంఘపు అనుశాసనాన్ని నిర్లక్ష్యంచేసి అకారణంగానే తెచ్చాననుకున్నాడో పార్టీ నిర్ణయాన్ని అనుసరించి నన్ను కాల్చివెయ్యలేకపోవడంతో ధన్వంతరీ ఒకరకంగా అవమానపడుతున్నాడు. నేను పోలీసుల్ని ఆశ్రయించి విప్లవసంఘానికి చెరుపు చేయకముందే కాల్చెయ్యాలన్న దృఢచిత్తంతో ఉన్నాడు.

ధన్వంతరీ, వాత్స్యాయన్ - ఇతర మిత్రుల నుండి సహాయం లభించలేదు. నాకున్న పరిమితమైన ఆయుధాలతో ఇంద్రపాల్, భాగ్‌రామ్‌ల సహకారంతో ఏదో ఒక యాక్షన్‌ను జరిపేయాలని నిర్ణయించుకున్నాను. నేను ఢిల్లీనుంచి తెచ్చిన పిక్రిక్ యాసిడ్, నైట్రోగ్లిజరిన్ మొదలైన పేలుడు పదార్థాలు ఎటూ ఉండనే ఉన్నయ్. మేము మాల్‌రోడ్డు ప్రక్కనే ఉన్న పోలీసుక్వార్టర్లను బాంబులతో పడగొట్టాలనుకున్నాం. ఆ క్వార్టర్లను పడగొట్టడానికి వాటంతట అవిగా పేలే బాంబుల్ని ఉపయోగించాలనుకున్నాం. త్వరగా ఏదో ఒకటిచేసి, ధన్వంతరీ, సుఖదేవరాజ్ - ఇద్దరూ నాకంటె అయోగ్యులని నిరూపించాలని నేను ఆత్రుతపడుతున్నాను.

# అగ్నివలయం

బహావల్‌పూర్ రోడ్డులోని బంగళాలో బాంబు పేలిన తరువాత జరిగిన విషయం నేను లాహోరు నుండి ఢిల్లీ వెళుతూ ఇంద్రపాల్‌తో ఇలా అన్నాను. "నువ్వు విప్లవ సంఘంలో చాలా రోజులు బాధ్యతాయుతంగా పని చేశావు. కొన్నాళ్ళపాటు నేను లాహోర్‌లో ఉండను. నా బదులు నువ్వు పంజాబుకు ఆర్గనైజరుగా వ్యవహరించు" అని చెప్పాను. అతడికి ఇలా చెప్పేముందు నేనీ విషయమై ఆజాద్‌తో మాటమాత్రమైనా అనలేదు.

ఇంద్రపాల్ తన పరిమితమైన అవకాశాల్ని వినియోగించుకుని స్వంతంత్రంగా విప్లవకార్యక్రమాల్ని ప్రారంభించాడు. అతడు తన యీ ఉద్యమానికి 'అగ్ని వలయం' అని పేరు పెట్టాడు. అతడీ ఉద్యమం ద్వారా 1933 జులై నెలలో ఆరుచోట్ల బాంబుల్ని పేల్చాడు. లాహోర్, అమృతసర్, రావల్పిండి, షేఖ్‌పురా, గుజరావాలా, లాయల్పురు - ఈ పట్టణాల్లో బాంబులు పేలాయి.

ఈ మొత్తం ప్రయత్నాన్ని ఇంద్రపాల్ స్వంతంగా చేశాడు. జహంగీరీలాల్, కుందన్‌లాల్, భాగ్‌రామ్, జయప్రకాశ్, దయానతరామ్, హంసరాజ్ - ఈ మిత్రులు ఇంద్రపాల్‌తో సహకరించి అతడి కార్యక్రమాలకు తోడ్పడ్డారు. కాలేజీ విద్యనభ్యసించిన మిత్రులతో ఇంద్రపాల్‌కు ఎలాంటి సంబంధమూ లేకపోవడం గమనార్హం. ధన్వంతరీ, సుఖదేవరాజు - తాము పంజాబుకు ఆర్గనైజర్లమని చెప్పుకుంటున్నారు. దాన్ని ఇంద్రపాల్ సహించలేకపోయాడు. నేనుతప్ప మరొకరు పంజాబుకు ఆర్గనైజర్‌గా ఉండడం ఇంద్రపాల్‌కు గిట్టదు.

ఇంద్రపాల్‌కు పిక్రిక్ యాసిడ్ లభ్యంకాలేదు. అతడు గులాబ్‌చంద్, హంసరాజ్‌ల సహాయంతో కొత్తరకం బాబుల్ని తయారు చేసుకున్నాడు. బాణసంచాకు ఉపయోగించే పేలుడు పదార్థాన్ని సిగరెట్ డబ్బాల్లోకూరి, వాటంతట అవి పేలేట్టు ఏర్పాటు చేశాడు. వాటంతటవి పేలేట్టు చేయడం చాలా సహజం, మైనపు వత్తి చివర్న త్వరగా నిప్పంటుకునే మందులో తడిపిన తాడును జతచేసి, ఆ తాడు రెండవ కొసను బాంబులకు జతచేసేవాడు. మైనపువత్తి వెలిగించి తను వెళ్ళిపొయ్యేవాడు. వత్తిసాంతం వెలిగాక చివర్నవున్న తాడు అంటుకుని బాంబులకు నిప్పు నందించేది బాంబులు పేలేవి. ఈ బాంబులు కొవ్వత్తిని వెలిగించిన 5, 6 గంటల తరువాతగాని పేలవు. ఒకచోట ఇలాంటి బాంబే పేలింది. దాన్ని పరీక్షించడానికి ఇద్దరు కానిస్టేబుళ్ళూ, ఒక సబ్ యిన్‌స్పెక్టరు వెళ్ళి పరీక్షిస్తుండగా వాళ్ళు ముగ్గురూ, అనుకోకుండా మరికొన్ని బాంబులు పేలి చనిపోవడం జరిగింది.

ఇంద్రపాల్ ఇలా బాంబుల్ని పేల్చడం ప్రజల్ని భయభ్రాంతుల్ని చేసి వినోదాన్ని తిలకిద్దామని మాత్రం కాదు. పర ప్రభుత్వంమీద దెబ్బ తీయడానికి ప్రజల సహకారం అవసరమని అతడికీ తెలుసు. కష్టపడి పొట్టపోసుకునే మిత్రుల కష్టారిజతం నుండి, కొంత డబ్బును వసూలు చేశాడు. ఉర్దూలో, తమ ఆదర్శాన్ని తెలిపే కరపత్రాన్ని ప్రచురించడానికి ఓ చిన్న హేండు ప్రస్సును కూడా ఏర్పాటు చేసుకున్నాడు.

వీళ్ళు తెలతెల వారుతుండగా బాంబుల్ని పేల్చారు. బాంబులు పేల్చడానికి ముందు కరపత్రాల్ని పంచారు. ఈ కరపత్రాన్ని రెండవ లాహోరు కుట్రకేసులో పోలీసులు కోర్టులో దాఖలు చేశారు. ఈ కరపత్రపు కోర్టునెం. EXPIAEL కరపత్రం ఉర్దూలో ఉంది. అనువదించి క్రింద ఉదహరిస్తున్నాను.

## హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్

భారతమాత గౌరవాన్ని కాపాడడానికి దీక్షాకంకణులైన స్వాతంత్ర్యేచ్ఛగల పంజాబు ప్రజలారా!

'పారతంత్ర్య భారాన్ని ఇంక ఎక్కువ రోజులు మోయడం సంభవంకాదు. భారతమాత యొక్క ఈ కళంకాన్ని మీరు మీకవోష్ణరక్తంతో కడిగివేయటానికి కంకణం కట్టుకున్నారు. జీవితాల్ని తర్పణంచేస్తూ కదనరంగానికి కదలివచ్చారు. మీ ఈ ప్రయత్నానికి అడ్డు తగిలిన ప్రతివాడు దేశద్రోహి, జాతికి శత్రువు అవుతాడు. ఈ ప్రకృతిలో ప్రతిజీవి స్వాతంత్ర్యంగా వుంది. తన్నుతాను పాలించుకుంటున్నది. ఈ ప్రపంచం ఒక మహాసంగ్రామ క్షేత్రం. ఈ క్షేత్రంలో, జీవితాన్ని తర్పణచేయడానికి సాహసించి, ముందుకు వచ్చినవారే జీవించి ఉండటానికి అర్హులు.

'చావటం నేర్చుకున్ననాడే బ్రతకగలం'

శత్రువును ఓడించటానికి మనం యుద్ధం చేయక తప్పదు. అయితే ఆయుధబలంతో, పశుబలంతో - వికటాట్టహాసం చేస్తున్న శత్రువుతో పోరాడడానికి సత్యాగ్రహం పేరుతో నిరాయుధులైన ప్రజలను ప్రోత్సహించడం స్వాతంత్ర్య పోరాటం అనిపించుకోదు. అది ఆత్మహత్యా సదృశమైంది. అహింసాత్మకమైన సత్యాగ్రహాన్ని ప్రజలు చవిచూచారు. సత్యాగ్రహోద్యమంలో వేలసంఖ్యలో దేశసోదరులు జైళ్ళల్లో మగ్గారు. ఎందరో భారతమాత ముద్దుబిడ్డలు అసువుల్ని బాశారు. అయినా మనం సఫలతను పొందలేకపోయాం. అసఫలతే మనకు మిగిలింది. గడచిన 10, 15 సంవత్సరాలుగా దేశచరిత్ర మనకేమి చెపుతున్నది ? పీడితులూ, నిరుపాయులూ, నిరస్త్రులూ అయిన ప్రజల రక్తాన్ని ప్రవహింపజేసిన మాత్రాన మనకు జరిగే అన్యాయాలూ, అత్యాచారాలు ఆగిపోవు. మన రక్తాన్ని ప్రవహింపజేసుకుని, మనం కష్టాలను అనుభవించినంతమాత్రాన స్వాతంత్ర్యంరాదు. స్వాతంత్ర్యాన్ని పొందటానికి శత్రువునెదిర్చి, దాస్యశృంఖలాలను తెంచుకోవడం అవసరం. అన్యాయమూ, అత్యాచారాలే పునాదిగాకల ఈ ప్రభుత్వాన్ని సమూలంగా నాశనం చేయాలి.

స్వాతంత్ర్య పోరాటంలో విజయాన్ని సాధించడానికి మనమందరము శక్తివంతమైన సైన్యంలా సంఘటితమవ్వాలి. మనలో ఐక్యతలేక పోతే, మనం వీడిన విరిసరంలా ఉంటే - శత్రువును జయించలేం. మనమే దెబ్బతింటాం. పెషావర్‌లో దాదాపు రెండు వందలమంది భారతీయుల్ని బలిపెట్టుకుని మనమేం సాధించాం ? చిటకాంగ్ శస్త్రాగారంమీద దాడి జరిపిన హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ మీకోసం నూతనమైన మార్గాన్ని ప్రశస్తంజేసింది. మనం సంఘటితమై సరియైన మార్గాన్న పోరాడితే విజయాన్ని తప్పక పొందగలం.

పర ప్రభుత్వానికి ప్రతినిధి అయిన వైస్రాయి ఇన్నాళ్ళూ భారత దేశంపట్ల తనకు సానుభూతికలదని చెప్పుకున్నాడు. ఇప్పుడు అతడి అసలు రూపం బైటపడ్డది. ప్రజలు సాహసాన్ని

ప్రదర్శించవలసిన సమయం వచ్చింది. ముందుగాచెప్పి శత్రువుమీదకు యుద్ధానికి వెళ్ళడం యుద్ధనీతికే విరుద్ధం. ఎక్కడికక్కడ ప్రజలు అజేయులైన సైనికుల్లా తయారు కావాలి. మీశక్తి సమర్థతలను పెంపొందించి, మీకు ఆయుధాల నివ్వడానికి హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ సిద్ధంగా ఉంది.

## 'ఇది తుది సమరం అటో ఇటో తేల్చేస్తుంది !'

ఇంద్రపాల్‌కు ఈ మాత్రం కరపత్రం ప్రకటించడంతో సంతృప్తి కలగలేదు. ప్రజల్ని ప్రభావితంచేసే యాక్షన్ ఏదైనా జరపాలని చూస్తున్నాడు. అతడు హంస్‌రాజ్ దగ్గరకు వెళ్ళాడు. హంసరాజ్ మళ్ళీ 'మూర్ఛాగ్యాస్' తయారుచేసి యిస్తానని ఇంద్రపాల్‌ను నమ్మించాడు. ఇంద్రపాల్ బీదలైన తన మిత్రులనడిగి 200 రూపాయలు పోగుచేసి హంసరాజ్ కిచ్చాడు.

అయినా హంసరాజ్ గ్యాసును తయారుచేసి యివ్వలేదు. ఏవేవో వంకలు చెపుతున్నాడు. ఇంద్రపాల్‌కు చెడ్డకోపం వచ్చింది. 'హంసరాజ్ తను పోలీసుల చేతుల్లో పడతానేమోననే భయంచేత గ్యాస్ తయారుచేసి యివ్వడంలేదు." అనుకున్నాడు ఇంద్రపాల్. అతడిని ఏదోవిధంగా బలవంతపెట్టి పని జరుపుకోవాలనుకున్నాడు.

ఇంద్రపాల్ ఒక గమ్మత్తు చేశాడు. ఒక సూట్‌కేసులో కొన్ని పేలుడు పదార్థాల్ని పెట్టుకున్నాడు. ఆ పదార్థాలు కొంతసేపటి తరువాత వాటంతటవి పేలేట్టు ఏర్పాటు చేసుకున్నాడు. ఒక కొట్టుదగ్గర 'లస్సీ' తాగుతూ పెట్టెను అక్కడేవదిలి వెళ్ళిపోయాడు. కొంతసేపటికి పెట్టెలోని పేలుడు పదార్థాలు పేలాయి. ఎవరికీ హానిజరగనంత తేలికైన పదార్థాలే అందులో పెట్టాడు. పదార్థాలు పేలాక ఆ పెట్టెలోని కొన్ని కాగితాలు విరజిమ్ముకున్నాయి. ఆ కాగితాల్లో ఒకదానిమీద హంసరాజ్ నిజమైన అడ్రసును రాసిపెట్టాడు ఇంద్రపాల్ !

పోలీసులువచ్చి పేలుడు సంభవించిన ప్రదేశాన్నీ, పెట్టెనూ, కాగితాలనూ పరీక్షించారు. హంస్‌రాజ్ అడ్రసు కనుపించింది. ఇంద్రపాల్, హంస్‌రాజ్‌కో జాబు రాశాడు. అందులో "నీమీద పోలీసులకు అనుమానం కలిగింది. నీవు మాదగ్గరకు వస్తే తగిన రక్షణకు ఏర్పాటు చేయగలము" అని రాశాడు. నాలుగైదు రోజుల తరువాత నిజంగానే పోలీసులు హంసరాజ్ యింటిని సోదాచేశారు. అప్పుడు హంసరాజ్ యింట్లో లేడు. కనుక అరెస్టుకాలేదు. అతడుపరారై లాహోరువచ్చాడు. అయినా మూర్ఛాగ్యాస్ తయారుచేసి యివ్వలేదు. కుంటిసాకులు అడ్డుపెడుతూనే వున్నాడు.

హంసరాజ్ ఎంతకీ తనకు రక్షణ ఏర్పాట్లు చేయించమనీ, తన ఆర్థిక బాధల్ని తొలగించమనీ అడిగేవాడేగాని గ్యాస్‌ను మాత్రం తయారు చేసి ఇచ్చేవాడు కాదు.

ఇంద్రపాల్ దగ్గర డబ్బులేదు. తను సంపాయించిన డబ్బునూ, మిత్రులు యిచ్చిన డబ్బునూ బాంబులు చేయడానికీ, ప్రస్సును కొనుక్కోవడానికీ, మూర్ఛాగ్యాస్ కోసమూ వాడేశాడు. అప్పుడే ఇంద్రపాల్‌కూ మరికొందరు మిత్రులకూ ఉద్యోగాలు ఊడిపోయాయి.

హంసరాజ్ తన వైర్‌లెస్ ప్రయోగంద్వారా పరిచయులదగ్గర కొంత డబ్బును సంపాయించగలిగేవాడు. అయితే, ఆ డబ్బును తానొక్కడే వాడుకునేవాడు. యితర మిత్రుల కోసరం ఖర్చుపెట్టేవాడు కాదు. కొత్తగా పరిచయమైన వారిమీద ప్రభావాన్ని వేయటానికి తానే తన వైర్‌లెస్ ప్రయోగం ద్వారా వైస్రాయి ట్రైను కింద బాంబు పేల్చానని చెప్పుకునేవాడు. అప్పటికి ఏ కుట్రకేసుద్వారానూ వైస్రాయి ట్రైను కింద బాంబు పేల్చిన రహస్యం బైటపడలేదు. కనుక, హంసరాజ్ చెప్పింది నమ్మేవారు.

ఇంద్రపాల్ మిత్రులు కొందరు అజాగ్రత్తగా వ్యవహరించారు. అందువల్ల ఇంద్రపాల్‌ను గురించిన సమాచారం పోలీసులకు అందింది. ఇంద్రపాల్‌ని పోలీసులు అనుమానించారు. అతడు తాను ప్రమాదంలో ఉండికూడా అన్యాయాన్ని వ్యతిరేకించి నా కోసం పోరాడడానికి సిద్ధమయ్యాడు.

× × ×

కొద్దిరోజుల తరువాత దుర్గాదాస్‌ఖన్నా తనను కలుసుకోమని నాకు కబురు పెట్టాడు. లాహోరులో ఉన్న విప్లవ సంఘ మిత్రుల్లో ఇతడు తెలివైనవాడు. లోతుగా ఆలోచించగల మనిషి. బహుశా నన్ను కాల్చడానికి ఇతణ్ణే ఉపయోగిస్తున్నారేమో అనుకున్నాను. ఎలాపోయి ఎలావస్తుందోనని ముందుగా చెప్పకుండా అతడి ఇంటికేవెళ్ళి కల్సుకున్నాను. అంతక్రితం ఖన్నాకూ నాకూ ఆటే పరిచయం లేదు. ఒక్కమాటు మాత్రం రాత్రిపూట గోల్‌బాగ్‌లో కల్సుకున్నాము. అప్పుడు ప్రకాశవతిని గురించి ప్రశ్నించాడు.

వెనక కలుసుకున్నప్పుడూ ఖన్నా స్పష్టంగా మాట్లాడాడు. "ప్రకాశవతి పార్టీ పనికి, పనికి వస్తుందనా ? లేక నీకు ఆమెపట్ల వ్యక్తిగతమైన ఆసక్తి ఉండడంవల్ల పార్టీలోకి తెచ్చావా ?" అని అడిగాడు.

నేనూ అప్పుడు స్పష్టంగానే సమాధానం చెప్పాను. "ఇంతక్రితం నేను ప్రకాశవతిని అసలు ఎరుగను. ఇప్పుడామెను బాగా అర్థం చేసుకున్నాను. నేనామెను ప్రేమిస్తున్నాను. గౌరవిస్తున్నాను. ఆమె సాహసం కలది. తెలివివేటలు కలది. పార్టీలో పనిచేయటానికి అవుసరమైన యోగ్యతలన్నీ ఆమెలో ఉన్నాయి" అన్నాను.

అప్పుడు దుర్గాదాస్ నాకో సలహాను కూడా యిచ్చాడు. "ప్రకాశవతి బంధువులు ఇలా జరిగినందుకు చాలా అవమానపడుతున్నారు. వాళ్ళేకరకంగా పగదీర్చుకోవాలని చూస్తున్నారు. నువ్వు జాగ్రత్తగా ఉండు. సాధ్యమైనవరకు ప్రకాశవతిని లాహోరులో ఉంచకు" అన్నాడు.

ఈమాటు కలుసుకున్నప్పుడూ ప్రకాశవతి విషయాన్ని ప్రస్తావించాడు ఖన్నా. "నువ్వు ఆమెను గౌరవిస్తున్నానంటివే ? ఆమెను గురించి కొన్ని చెడ్డవార్తలను విన్నాను నేను" అన్నాడు ఖన్నా.

అతడలా అనడంతో నా మనస్సుకు చాలా బాధ కలిగింది. "ఆ చెడ్డవార్తలు చెప్పేవాళ్ళెవరో, నాయెదుట చెప్పమనండి" అన్నాను.

మేము ఇంగ్లీషులో మాట్లాడుకుంటున్నాము. ఖన్నా ఇలా అడిగాడు. "నువ్వు ఆమెను పెండ్లి చేసుకున్నావా ?"

నేను అవునని తల వూపాను.

తరువాత ధన్వంతరీ నన్ను కలుసుకో గోరుతున్నట్లు చెప్పాడు.

"నేనూ అతడ్ని కలుసుకోవాలనుకుంటున్నాను. నువ్వు నన్ను అతడి దగ్గరకు తీసుకు వెళ్ళు" అన్నాను.

దుర్గాదాస్ రెండు క్షణాలు ఆలోచించి "నీకో విషయం చెప్పాలను కుంటున్నాను. నువ్వు ఎవరితోటీ చెప్పనని మాటయివ్వు" అని అన్నాడు.

నేను మాట యిచ్చాను.

"భయపడవుకదా ?"

"నేనేమీ భయపడను"

"కేంద్రకమిటీ నిన్ను కాల్చెయ్యాలని నిర్ణయించింది. అందుకే యిప్పుడు ధన్వంతరీ నిన్ను పిలిపించాడు."

"ఈ విషయం నాకు ముందే తెలుసు. కేంద్రకమిటీ నన్ను కాల్చెయ్యడానికి నిర్ణయంచేసిందని లాహోరు రాకముందే నేను తెలుసుకున్నాను. నువ్వే నాకు చెప్పావనీ, నీమీదకు వస్తుందనీ నీవేమీ భయపడనవసరం లేదు. కనుకే, నిన్ను తీసుకెళ్ళమని అడిగాను. నువ్వు ధన్వంతరీతో నేను చెప్పమన్నట్టుగా ఈ మాటలు చెప్పు. "నాకు వాళ్ళ కుతంత్రం ఎన్నడో తెలిసిపోయింది. ఈ ఒక్క విషయాన్నిబట్టి అయినా విప్లవ సంఘ సభ్యులు ఎవరిని అభిమానిస్తున్నారో తెలుసుకోవచ్చును. ఇది ధన్వంతరీ చేస్తున్న మోసం. అసలు సెంట్రల్ కమిటీ నిర్ణయమే చేయలేదు. ఇతడు వట్టి అబద్ధాలు వాగుతున్నాడు. అయినప్పటికీ, సెంట్రల్ కమిటీ నాతప్పులేమిటోచెప్పి వాటిని విచారించి శిక్ష విధించితే, నేను అనుభవించడానికి సిద్ధంగా ఉన్నాను. అలాకాక. ధన్వంతరీ వ్యక్తిగతంగా నాతోటి పోట్లాడాలనుకుంటాడా ? అందుకూ నేను సిద్ధమే" అన్నాను.

"ఇది చాలా విచారకరమైన విషయం. అసలు ఇలాంటి నిర్ణయం ఎందుకు జరిగింది?" దుర్గాదాసు అన్నాడు.

"నా అపరాధమేమిటో నాకు చెప్పలేదు. వాళ్ళు నా మీద వేసిన అపరాధాలకు సమాధానము చెప్పుకునే అవకాశమూ నాకు యివ్వలేదు. ఇది ధన్వంతరీ, సుఖదేవరాజ్ - నాయకత్వంకోసం పన్నిన కుట్ర ! సెంట్రల్ కమిటీ ఇలాంటి నిర్ణయం చేయలేదు. చేయదు. నా సమ్ముఖంలో సెంట్రల్ కమిటీ మీటింగును ఏర్పాటు చేయమనండి. ఆ మీటింగుకు స్థానిక మిత్రుల్ని కొందర్ని ఆహ్వానించమనండి. నా వ్యతిరేకుల్ని నా అపరాధా లేమిటో చెప్పుకోమనండి. నేను చెప్పవలసింది చెప్పుకుంటాను. అప్పుడు కమిటీ ఏది నిర్ణయిస్తే ఆ నిర్ణయానికి నేను బాధ్యుడనై వుంటాను. అంతే గాని, ఇలా కుక్కచావు చావటానికి నేను ఎన్నటికీ ఒప్పుకోను. నాకూ సాయుధులైన ఆరుగురు మిత్రులున్నారు. అలాంటి స్థితివస్తే కంఠంలో ఊపిరున్నవరకూ నేను పిస్తోలుకాలుస్తూనే ఉంటాను. ఎదురుగా ఆజాద్ వచ్చి నిలబడ్డా లెక్కచేయను. నా మీద వేసిన అపరాధాలకు తగు సమాధానం యిచ్చే అవకాశం నాకు యివ్వకుండా నన్నుచంపేస్తే, అది విప్లవకారుల జీవితాలకే కళంకమయి కూర్చుంటుంది. సాధ్యమైనవరకు నేను అలాంటిది జరగనివ్వను. వీళ్ళొకవేళ నన్ను దొంగచాటుగా చంపేస్తారూ ? అది విప్లవసంఘానికే గొడ్డలిపెట్టు అవుతుంది. అలాంటిదే జరిగితే, నన్ను అభిమానించి, నాకోసం ప్రాణాలనయినా ఇవ్వడానికి సిద్ధంగావున్న మిత్రులు వీళ్ళను ఎన్నటికీ క్షమించరు. వీళ్ళ అంతు తేలుస్తారు. నన్ను రక్షించడానికి, ముందుగా నా కీవిషయాన్ని చెప్పిన మిత్రులు కూడా నిజాయితీపరులే. వాళ్ళూ అవుసరమైతే ప్రాణత్యాగానికైనా వెనుదీయనివారే. ఆజాద్ ఇలాంటి నిర్ణయాన్ని చేశాడని వాళ్ళెవరూ నమ్మడంలేదు. 'ధన్వంతరీ, సుఖదేవరాజ్ - కేవలం ఆజాద్ పేరును తమ స్వార్థం కోసం వాడుకుంటున్నారని' మాత్రమే యిక్కడి మిత్రులు అనుకుంటున్నారు లేకపోతే, ఆజాద్‌కు చాడీలుచెప్పి, అతడ్ని మూర్ఖుణ్ణిచేసి వీళ్ళు ఆట ఆడుతున్నారని అనుకుంటున్నారు" అని అన్నాను.

మానసికంగా బాధపడుతున్నాను, కోపమూబాగానే ఉంది. వీటితో పాటు కొంత కుతంత్రాన్ని కూడా అనుసరించాను. ఇలా కుతంత్రంగా వ్యవహరించినందుకు నేను ఎన్నడూ బాధపడలేదు. మా విప్లవ సంఘంలోని నిరంకుశత్వాన్ని వ్యతిరేకిస్తూ నేను జరిపిన పోరాటంలో కుతంత్రమూ ఒక భాగమనే అనుకున్నాను.

దుర్గాదాస్ ఖన్నా నాకు ధైర్యాన్ని యిచ్చాడు. "నీ మీద మోపిన అపరాధాల గురించి సమాధానం చెప్పకునే అవకాశం నీకు యివ్వకపోవడం దురన్యాయం. నీ మీద మోపిన అపరాధాలు కూడా ఏమంత తీవ్రమైనవి కావు. వాటిల్లో ఒక్కటీ స్పష్టమైన అపరాధమని నాకు అనిపించలేదు" అని అన్నాడు.

అప్పటివరకూ అసలు నామీదవేసిన అపరాధాలేమిటో కూడా నాకు తెలియదు. దుర్గాదాస్‌ని ఇలా అడిగాను. "అసలు నామీద వేసిన అపరాధాలేమిటి ? నాకు ఒక్కటి తెలియదు."

దుర్గాదాస్ "నీ మీద చాలా అపరాధాలు వేశారు. ప్రకాశవతిని కేవలం నీ స్వార్థం కోసరమే విప్లవ సంఘంలోకి తీసుకు రావడం ఒకటి. ఈ విధంగా విప్లవ సంఘానికి తీరని కళంకాన్ని తెచ్చిపెట్టావు. విప్లవ సంఘంలో ప్రకాశవతి గౌరవాన్ని పెంచడానికి ఆమె పంపించిన వెయ్యి రూపాయలు పోగొట్టాడని ప్రేమనాథ్‌మీద అభాండం వేశావు. నీకు భగవతీచరణ్‌మీద ఈర్ష్య. అందుకనే, అతడి చేతిలో పేలేట్టు బాంబును తయారుచేశావ్. తరువాత కూడా నువ్వు తగు జాగ్రత్త తీసుకోకుండా అతడిని కావాలని మృత్యువుపాలు చేశావు. భగత్సింగ్‌ను విడిపించడం నీకు యిష్టంలేదు. ఏ క్షణాన్నైనా ప్రకాశవతిని తీసుకుని లేచిపోవాలని నీ ఉద్దేశ్యం. బహావల్‌పూర్ రోడ్ బంగళాలో బాంబులు పేలడానికి కూడా నువ్వే కారణం. భగత్సింగ్‌ను విడిపించే కార్యక్రమం ఆగిపోవడానికి నువ్వే బంగళాలో బాంబు పేల్చావు. కనుకనే, నువ్వు బంగళాలో ఉన్నంతసేపు ఆ బాంబులు పేలలేదు. నువ్వు బైటకు రాగానే పేలాయి. అలా ఏర్పాటు చేసుకున్నావు. నువ్వు సుఖజీవితాన్ని కాంక్షిస్తున్నావు. ఏక్షణాన్నైనా పోలీసులకు రహస్యాన్ని చెప్పెయ్యగలవు. ఇవన్నీ నీమీద మోపిన నేరాలు."

నేరాలన్నింటినీ విని కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయాను. తరువాత బాధామయ స్వరంలో "ఇవన్నీ నామీది ఈర్ష్యవల్ల కల్పించిన నేరాలు. వాళ్ళు చెప్పిన నేరాల్లోని అన్ని సందార్భాల్లోనూ ఎవరో ఒకరు నా దగ్గర ఉండనే ఉన్నారు. అలా వున్నవాళ్ళు ఇప్పటికీ ఉన్నారు కదా ? మరి ఈ అపరాధాల గురించి వాళ్ళనేమన్నా అడిగారా ? ప్రకాశవతిని ఇంటి నుంచి పిలిపించేముందు నేను భగవతీచరణ్‌తోనూ, ఆజాద్‌తోనూ చర్చించాను. *ప్రకాశవతి విప్లవ సంఘంలోకి వచ్చాక నా ప్రవర్తన ఏమటో ఇంద్రపాల్‌ని అడగవచ్చును. నేను పిలిపించడంవల్ల, ప్రకాశవతి విప్లవ సంఘంలోకి వచ్చినట్లయితే మొదటగా దుర్గాబాభీ దగ్గరకు ఎందుకు పోతుంది ? నాదగ్గరకే వచ్చేసేది కదా ? ప్రేమనాథ్ 1000 రూపాయలు పోగొట్టి, నా దగ్గరకువచ్చి కన్నీటిపర్యంతమై చెప్పుకున్నప్పుడు ఇంద్రపాల్‌కూడా పక్కన ఉన్నాడు. భగవతీచరణ్‌పట్ల నా ప్రవర్తనలో లోపమున్నదంటున్నారు. అతడి చేతిలో పేలిన బాంబు నేనుకూరింది కాదుకదా ? నా పరోక్షంలో భగవతీ చరణ్, సుఖదేవరాజ్ కూరుకున్నారా బాంబును. వాళ్ళసలు ఆ బాంబును పరీక్షించడానికి తీసుకువెళ్ళిన విషయంకూడా నాకు తెలియదు. దీనికి ఆజాద్, ఇంద్రపాల్ సాక్ష్యమున్నారు. భగవతీచరణ్ దెబ్బతిన్న తరువాత, నేనతడి దగ్గరకు మొదట వెళ్ళినప్పుడు ఛైల్ బిహారీ నా వెంట వున్నాడు. రెండవమాటూ వెళ్ళినప్పుడు ఇంద్రపాల్, బచ్చన్ ఉన్నారు, నావల్ల దోషమేమిటి వాళ్ళను విచారించారా ? బాంబులు పేలిన గదిలో నేనూ బాభీ ఇద్దరం పడుకుని వున్నాం. మేము ఇవతలకు వచ్చిన తరువాత పేలడం మా అదృష్టం.

---

* వెనక ఈ సందర్భంవచ్చింది. అప్పుడు ఒక విషయం రాయడం మర్చేపోయాను. ప్రకాశవతి ప్రేమనాథ్ ద్వారా డబ్బు పంపించడమూ, చివరకు ప్రకాశవతి విప్లవ సంఘంలోకి వచ్చేయడమూ జరిగింది. ఆ మధ్యకాలంలో నేనొకమాటు ఢిల్లీ వెళ్ళాను. ప్రేమనాథ్ ద్వారా డబ్బు పంపడం, ప్రకాశవతి విప్లవ సంఘంలోకి వచ్చేయడం గురించి భగవతీచరణ్ సమ్ముఖంలోనే ఆజాద్‌తో మాట్లాడాను. ఆజాద్ ఇలా అన్నాడు. "ఇల్లు అద్దెకు తీసుకోవడం లాంటి విషయాల్లో ఆడవాళ్ళు కొంత సహకారంగా వుండేమాట నిజమే. కానీ, ఆడవాళ్ళను సంఘంలోకి తీసుకోవడం సమస్యతో కూడిన విషయం. అయినా, మీరూ ఆలోచించడి. ఆ అమ్మాయిని నేను చూడనూలేదుకదా. ఏంచెప్పగలను?" అప్పటికి ప్రకాశవతిని నేనూ చూడలేదు. భగవతీచరణ్‌కూడా చూడలేదు. ఐతే, సోదరి ప్రేమవతి, ప్రకాశవతిని సంఘంలోకి తీసుకోవల్సిందని మరీ మరీ చెప్పింది. అందువల్ల తీసుకోవడం జరిగింది.

రెండు నిముషాల తరువాత పేలిన బాంబులు రెండు నిముషాలు ముందుకూడా పేలవచ్చునుకదా ? సాక్షులుగా వున్న మిత్రులను ఎవరినీ విచారించకుండా, కేవలం నన్ను తమ మార్గానికి అడ్డంలేకుండా తొలగించుకోవడానికి ఈ కుట్ర పన్నారు."

నేను దుర్గాదాస్‌తో మరికూడా అన్నాను. "ఇదంతా సుఖదేవరాజ్ చేసినకుట్ర. ఇలాగే నామీద భగవతీచరణ్‌కూ చెప్పాడు. కానీ, అప్పటి పరిస్థితి పోట్లాటలకూ, చర్చలకూ తగిలేదు గనుక వీళ్ళ చాడీకోరు ప్రవర్తనను చర్చకు పెట్టలేదు. వీళ్ళు, నేను సుఖాల్ని కాంక్షిస్తున్నానని చెపుతున్నారు. ఏ క్షణాన్నైనా పోలీసుల ఆశ్రయంలోకి వెళ్ళి పోతాననీ చెపుతున్నారు. వీళ్ళు నన్ను అన్యాయంగా చంపచూసిన విషయం పదిహేను రోజులముందే నాకు తెలిసింది. నిజంగా నేను విలాస ప్రియుణ్ణయితే- ఏనాడో పోలీసుల్ని శరణుజొచ్చేవాణ్ణికాదా ? ఇదంతా కొందరు స్వార్థపరులుచేసిన విశ్వాస ఘాతుకమని భావిస్తున్నాను. నేనిప్పటికీ విప్లవసంఘాన్ని గౌరవిస్తున్నాను. నా సమస్యను సెంట్రల్ కమిటీ ముందు ఉంచమని యిప్పటికీ అడుగుతున్నాను. నా మీద నేరాలు మోపిన వాళ్లల్లో నాలాగ విప్లవ సంఘంకోసరం నిష్టతో, సాహసంతో, యధార్థంగా కృషి చేసిన వాళ్ళు ఎందరున్నారు ?" అని బాధామయ స్వరంలో అడిగాను.

దుర్గాదాస్ ఖన్నా స్వరం ఆర్ద్రమైంది. "నువ్వు విశ్వాసపాత్రుడ వనటానికి ఇంతకంటే ప్రమాణం ఏం కావాలి ? నువ్వు నాతోపాటు ధన్వంతరీ దగ్గరకురా, నీమీద మోపిన అపరాధాల్ని చర్చకు పెట్టమని అడుగుదాం" అన్నాడు.

అప్పుడు రాత్రి 8 గంటలయి వుంటుంది. "ఎక్కడకు వెళ్ళి కలుసుకుందాం ?" అని అడిగాను.

"మింటోపార్కుకు"

మింటోపార్కు రాత్రి 8 గంటలు దాటితే నిర్మానుష్యంగా ఉంటుంది.

"నేను రావటానికి సిద్ధంగా ఉన్నాను. అయితే బాధ్యత నీదే నా కేమాత్రం అనుమానం తగిలినా నేను ముందుగా కాల్పులు ప్రారంభిస్తాను. అలాకాక, చీకట్లో నన్నెవరైనా కాల్చారంటే, నేను నిన్ను కాల్చిచంపేస్తాను" అని అన్నాను.

"నన్ను విశ్వసించు నిన్ను కాల్చాలన్న నిర్ణయాన్ని నేను నిజంగా వ్యతిరేకిస్తున్నాను. అంతేకాక, ప్రకాశవతికీ నాకూ కొంత బంధుత్వం ఉంది. నిన్ను ఇప్పుడు పిలిపించింది కాల్చడానికే. కానీ, నేను ప్రక్క నున్నంతసేపూ వాళ్ళు నీకేమీ అన్యాయం చేయలేరు. నేను నిన్ను వదలి అవతలకు వెళ్ళను. ఈ పోట్లాట ఇంతటితో సమసిపోవాలని నేను అనుకుంటున్నాను. దీనివల్ల పార్టీ మొత్తంగా నాశనమయిపోతుంది" అన్నాడు ఖన్నా.

మేముయిద్దరం సైకిళ్ళు వేసుకుని, మింటోపార్కువైపు వెళ్ళాము. పార్కులోకి వెళ్ళగానే, ఒకచేత్తో సైకిలు హాండిల్ పుచ్చుకుని, రెండవ చేత్తో జేబులో ఉన్న పిస్తోలును పుచ్చుకున్నాను. అప్పటికి ఖన్నామీద నాకు పూర్తి విశ్వాసం లేదు. రోడ్డుమీద కరెంటులైట్ల వెలుగు ఉన్నది. ఐతే, పార్కులో మాత్రం అంధకారం గాఢంగా అలుముకుని వుంది. మేము కిందికి దిగి, సైకిళ్ళు నడుపుకుంటూ వెళ్ళుతూన్నాము. ఖన్నా టార్చిలైట్ వేశాడు. నాలుగు అడుగుల దూరంలో, బెంచీమీద కూర్చున్న వ్యక్తిని గుర్తుపట్టాను. అతడు ధన్వంతరీ. నేను మరికొంచెం జాగ్రత్త పడ్డాను. ఖన్నాకు దగ్గరగా జరిగాను. పిస్తోలును జేబులోనుంచి బైటకు తీశాను ధన్వంతరీ మౌనంగా కూర్చుని ఉన్నాడు.

ఖన్నా ధన్వంతరీని పిలిచాడు. ధన్వంతరీ తన చేతిలోని బ్యాటరీ లైటును ఆకాశంలోకి ఫోకస్‌చేసి ఏదో సౌజ్ఞ చేశాడు. వాళ్ళిద్దరూ నా ఎదురుగా నాలుగైదు అడుగుల దూరంలో, మెల్లగా ఏమో

మాట్లాడుకున్నారు. తరువాత ఖన్నా నా దగ్గరకు తిరిగి వచ్చాడు. ధన్వంతరీ మళ్ళీ టార్చిలైట్ వేసి ఏదో సంజ్ఞ చేవాడు.

"వెళదాం పద" అన్నాడు ఖన్నా.

నేను ముందు జాగ్రత్త కోసం, ధన్వంతరీనికూడా రోడ్డు వరకూ రమ్మన్నాను. అతడూ మాతోపాటు రోడ్డువరకు వచ్చాడు.

ఖన్నా మధ్యవర్తిగా ఉండి ఒక ఏర్పాటు చేశాడు. నేనూ, ధన్వంతరీ ఢిల్లీ వెళ్ళుతాము. ఆజాద్‌ను కలుసుకుంటాము. నీమీద మోపబడ్డ నేరాలగురించి పునరాలోచించమని అడుగుతాము. ఇందుకు ధన్వంతరీని ఒప్పించాడు ఖన్నా.

లాహోరులో ఉన్న ఈ కొద్దిరోజులూ నేను ఇంద్రపాల్ దగ్గరా, జహంగీరీలాల్ దగ్గరా ఉన్నాను. ఇంద్రపాల్ నేను ఢిల్లీ వెళ్ళేటప్పుడు తానూ స్టేషనువరకూ తోడు వచ్చాడు.

లాహోరులో నేను మాసినగుడ్డలతో సాధారణమైన పంజాబీ యువకుడి వేషంలో ఉండేవాడిని. స్టేషనకు వెళ్ళేప్పుడు సూటు వేసుకున్నాను. సెకండ్ క్లాసులో ప్రయాణం చేయాలని ఉద్దేశ్యం. అప్పటి సెకండ్‌క్లాసు, ఇప్పటి ఫస్టుక్లాసుకు సమానంగా ఉండేది. అప్పటి ఫస్టుక్లాసు ఇప్పటి ఎయిర్ కండిషన్‌కు సమానంగా ఉండేది. మోసగిస్తారేమో నన్ను అనుమానం మనస్సులో అప్పటికీ ఉంది. సెకండ్ క్లాసు పెట్టెలో, తలుపులు వేసేసుకుంటే ఇతరులెవ్వరూ లోపలకు రావడానికి వీలు వుండదు. కనుకనే సెకండ్ క్లాస్‌లో ప్రయాణం చేశాను.

జాగ్రత్తగా ఉండడానికి ప్రయత్నించి అనుకోకుండానే కొంత అజాగ్రత్తగా వ్యవహరించాను. జాగ్రత్త కోసరం కోటుజేబులో ఎప్పుడూ గుండ్లతోనిండిన పిస్తోలును ఉంచుకుంటాను. విడిగా కొన్ని తూటాలనూ జేబులో వేసుకుంటాను. టికెట్ తీసుకోవడానికి బుక్కింగ్ ఆఫీసు దగ్గరకు వెళ్ళాను. లోపలి జేబులో నుంచి నోట్లు, పై జేబులో నుంచి చిల్లర డబ్బులూ తీసి కిటికీలో పెట్టాను. చిల్లర డబ్బులుతో పాటు పిస్తోలు గుండ్లు రెండింటిని కిటీకీలో పెట్టడం జరిగింది.

కనుచివర్ల నుండి పరిసరాన్ని ఒకమాటు కలయచూశాను. బుక్కింగు కిటికీకి కొద్ది దూరంలో పంజాబు సి.ఐ.డి. పోలీసు ఒకడు నిలబడి నావైపు చూస్తున్నాడు. ఇకనప్పుడు, పిస్తోలు గుండ్లను దాయటం గానీ, కంగారుపడటంగానీ చేయకూడదు. గుండ్లను జేబులో వేసుకోకుండా చేతిలో ఎగరవేసుకుంటూ బుక్కింగ్ క్లర్కుమీద విసుక్కుంటూ, కోపగించుకుంటూ, ఫస్టుక్లాస్ టికెట్ యివ్వమని ఇంగ్లీషులో అడిగాను.

"సర్, ఫస్టుక్లాస్‌లో సీటు లేదండి ! రిజర్వు అయిపోయినాయి" అన్నాడు క్లర్కు.

నేను మండిపడ్డాను. "ఏమిటి నీ వాగుడు ? మూడు గంటలకు సీటు రిజర్వు చేయమని ఫోన్ చేయించాను. నువ్వు ఇప్పుడు సీటు ఖాళీ లేదంటున్నావ్ ?" అంటూ ఇంద్రపాల్ వైపు తిరిగి "ఏంపంతులూ నువ్వు మూడు గంటలకు ఫోన్‌చేయలేదా ?" అని అడిగాను.

ఇంద్రపాల్ భయాన్ని, వినయాన్ని ప్రదర్శిస్తూ "చేశాను సాబ్" అన్నాడు.

"మరి ఇంక ఏమిటయ్యా నీవు మాట్లాడేది ?" అని డబాయించాను క్లర్కును.

'నేను 6 గంటలకు డ్యూటీకి వచ్చాను సార్ మీరు ఫోన్ చేసిన విషయం నాకు తెలియదు' అన్నాడు క్లర్కు.

"సరే ఇప్పుడు సెకండ్ క్లాస్ టికెట్టు యివ్వు. నేను పైకి రిపోర్టు చేస్తాను" అన్నాను. క్లర్కు టికెట్ రాస్తున్నాడు. నేను ఇంకా గుండ్లను ఎగురువేస్తూనే ఉన్నాను. ఇంద్రపాల్ వంక కోపంగా చూసి "ఏమిటలా నిలబడి ఉన్నావ్ ? సెకండ్ క్లాసులో చోటుందట. పోయి సామాను సర్దు" అన్నాను.

ఇంద్రపాల్ నా బెడ్డింగునూ, సూట్ కేసునూ తీసుకుని ప్లాట్ ఫారం మీదకు వెళ్ళాడు. అతడి వెనుక నేనూ వెళ్ళాను. కొంచెం దూరంగా నన్ను అనుసరిస్తూ సి.ఐ.డి. పోలీసు కూడా ప్లాటుఫారం మీదకు వచ్చాడు.

ప్లాట్ ఫారం మీదరకు వెళ్ళాక ఇంద్రపాల్‌ని మరొకమాటు కసిరాను. "ఏమిటలా నిలబడి చూస్తావ్ ? సీటు ఎక్కడుందో గార్డును అడుగు" అన్నాను.

గార్డు ఎదురుగానే ఉన్నాడు. ఇంద్రపాల్ 'జంట్' సాబ్‌కు సీటు చూపమని అడిగాడు గార్డును. (నిరక్షరాస్యులైన పంజాబీలు జాయింట్ మెజిస్ట్రేట్‌ను 'జంట్ సాబ్' అంటారు) గార్డు పక్క పెట్టెలో సీటు చూపాడు. ఇంద్రపాల్ బెడ్డింగ్‌ను పరుస్తున్నాడు. నేను జేబులో వున్న పిస్తోలును ఒకచేత్తో పుచ్చుకుని, మరోచేత్తో గుండ్లను ఎగరవేస్తూ సి.ఐ.డి. పోలీసు వ్యవహారాన్ని కనిపెడుతున్నాను. 'నాచేతిలో పిస్తోలు గుండ్లను నువుచూసిన మాత్రాన, నేనేమీ భయపడను' అని సి.ఐ.డి.కి తెలియపరచడమే నా ఉద్దేశం. సి.ఐ.డి. కొంచెం దూరం అయ్యాడు. నా వైపు అంత తీక్షణంగా కూడా చూడడంలేదు. ఐనా, అతడి దృష్టిలో నేనున్నాను. సి.ఐ.డి.కి వినబడ్డేట్టు గార్డును కేక వేశాను. "గార్డు"

"యస్ సర్" అంటూ గార్డు నా దగ్గరకు పరుగెత్తుకు వచ్చాడు. జేబులో నుండి పది రూపాయిల కాగితాన్ని తీసి అతడికి ఇస్తూ "బ్లాక్ ఎండ్ వైట్ సిగరెట్ టిన్ను ఒకటి తెచ్చి పెట్టు" అన్నాను ఇంగ్లీషులో.

గార్డు పది రూపాయిల కాగితాన్ని తీసుకుని, కొద్ది దూరంలో వున్న స్టాల్ దగ్గరకు పరుగెత్తాడు. టిన్ను తెచ్చి నాకు ఇచ్చాడు. నేను టిన్నును తీసుకున్నాను. కానీ, చిల్లర తీసుకోలేదు. ముఖం అటు త్రిప్పుకున్నాను. గార్డు చిల్లర డబ్బుల్ని పెట్టెలో సీటుమీద పెట్టి, బండి కదలడానికి విజిల్ వేస్తూ వెళ్ళిపోయాడు.

ఇంత నాటకం ఆడినా ఇంకా భయంగానే వుంది. సి.ఐ.డి. ఏం చేస్తాడోనని లోపల భయపడుతునే ఉన్నాను. రైలు కదిలింది. 'హమ్మయ్య' అనుకున్నాను. ఐనా, పూర్తిగా ధైర్యం చిక్కలేదు. ఐదు మైళ్ళల్లో 'మియామీర్' స్టేషన్ వుంది. 'ఆ స్టేషనూ గడిచిపోయింది. అప్పటికీ మనస్సు పీకుతోంది. అది ఫ్రాంటియర్ మైల్. నలభై యాభై మైళ్ళ దూరంలో వున్న 'కసూర్' స్టేషన్‌లోనే ఇక ఆగడం నేను ప్రాణాలు ఉగ్గపట్టుకు కూచున్నాను. 'కసూర్' స్టేషన్ కూడా నిరాపదంగా గడిచిపోయింది. ఫిరోజ్‌పూర్ స్టేషనూ వెళ్ళిపోయింది.

ఢిల్లీ స్టేషన్‌లో మరి కూడా జాగ్రత్త వహించవల్సి వచ్చింది. అక్కడ అటు పోలీసుల భయమూ పీడించింది. ఇటు మిత్రుల భయమూ పీడించింది. మానసికంగా విపరీతంగా ఉద్విగ్నం అయ్యానేమో, నోరు చేదు ఎక్కింది. జీర్ణకోశం దెబ్బతిన్నది.

ప్రకాశవతిని జుమ్మా మసీదు దగ్గర గల దేవరాజు భల్లా ఇంట్లో వుంచి వెళ్ళాను. ఢిల్లీ వెళ్ళగానే, ముందు అక్కడికే వెళ్ళాను. ప్రకాశవతి అక్కడ లేదు. నేను కంగారు పడిపోయాను. 'ప్రకాశవతి వారం రోజుల క్రితం మిత్రుల్ని కల్సుకు రావడానికి వెళ్ళింది. ఇంతవరకూ రాలేదు' అని దేవరాజు భల్లా చెప్పాడు.

నాకు అదుర్దా మరీ ఎక్కువైంది. నేను లాహోరు వెళ్ళేప్పుడు ప్రకాశవతికి ఏమీ చెప్పివెళ్ళలేదు. మిత్రుల్ని కల్సుకోవడానికి గానీ, మరి ఎక్కడికేగాని వెళ్ళవద్దనీ ఆమెకు చెప్పలేదు. అలా చెప్పడంవల్ల అనవసరంగా గాభరా పడుతుందని నా ఉద్దేశం. 'మిత్రుల్ని కల్సుకోవడానికి వెళ్ళి ఇన్నాళ్ళు ఎక్కడ వుంది ? తన ఇష్ట ప్రకారమే ఎక్కడయినా ఉన్నట్లయితే, రెండవ జత గుడ్డల్ని, ఇతర అవుసరం అయిన

వస్తువుల్ని తీసుకువెళ్ళేదికదా ? తప్పకుండా ఎక్కడో బంధిపబడ్డది' అని అనుకున్నాను. ఇంక ఒక్క క్షణం అక్కడ ఉండలేదు. వెంటనే మేడదిగి బాంబు ఫ్యాక్టరీకి బయల్దేరాను.

అప్పుడే సూర్యోదయం అయింది. ధన్వంతరీ నా కంటే ముందే ఢిల్లీ వచ్చాడు. ఆజాద్‌తో సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి సుఖదేవ్ రాజు, ధన్వంతరీ - ఇద్దరూ బాంబు ఫ్యాక్టరీలోనే ఉండవచ్చు. నేను మేడమెట్లను ఎక్కుతూ పైకి చూశాను. ముందుగది వాకిలి తెరిచి వుంది. జేబులో నుండి పిస్తోలును బయటికితీశాను. ఇలాంటి సందర్భాల్లో ఎన్నడూ నేనిలా తొందరపడలేదు. ప్రకాశవతికి ఏ ఆపద సంభవించిందోనన్న ఆందోళన నన్ను ఉద్విగ్నుణ్ణి చేసింది.

ముందు గదిలోనూ, మధ్య గదిలోనూ ఎవరూ కనుపించలేదు. కుడివైపు వరండాలోకి వెళ్ళాను. ధన్వంతరీ మంచంమీద దుప్పటికప్పుకు పడుకుని వున్నాడు. నేను పైకి వచ్చిన సవ్వడికి ధన్వంతరీకి మెళుకువ వచ్చింది. అతడు కండ్లు తెరవడంతోనే, చేతిలో పిస్తోలు పుచ్చుకుని నేను తన మంచం దగ్గర నుండి వెనక్కి తిరిగి వెళ్ళిపోవడాన్ని చూశాడు. అయినా, అతడు తన మంచంలో మౌనంగా కూచుని వుండిపోయాడు. గాభరాగానీ, ఉద్విగ్నతగానీ అతడిలో లేశమాత్రమూ కనుపించలేదు. నా ఈ ప్రవర్తనవల్ల ధన్వంతరీ చాలా అవమానపడి వుండవచ్చును. కానీ, వెనక్కు తిరిగి మధ్య గదిలోకి వచ్చాను. గిరివర సింగ్ అప్పుడే స్నానం చేసి వచ్చాడు. ఎదురుగా కనిపించాడు.

"ప్రకాశవతి ఎక్కడ వుంది ?" నేను గిరివరసింగ్‌ను అడిగాను.

నా స్వరం వినిగావును, ప్రకాశవతి పక్క గదిలో నుండి మధ్య గదిలోకి వచ్చింది. ఆమె ముఖంలోకి ఒక మాటు చూశాను. బుగ్గలమీద ఎండిన కన్నీటిధార కనుపించింది. ఆమె బాధను అర్థం చేసుకున్నాను. వెంటనే, నాతోపాటు బయల్దేరమన్నాను. ప్రకాశవతి ముందూ, నేను వెనుకా, మెట్లవరకూ వచ్చాము. ఇంతలో సుశీలాదీదీ మరో గదిలో నుండి బయటకు వచ్చింది. "ఎప్పుడు వచ్చావు ? ఎక్కడకీ వెళ్ళడం ? ఏమిటి జరిగింది ?" అనడిగింది. ఆమె స్వరం సహజంగా వుంది.

"తొందరపనిమీద వెళుతూన్నాము. మళ్ళీ వస్తాను" అని సుశీలా దీదీకి సమాధానం చెప్పి మెట్లు దిగి కిందికి వచ్చేశాను.

దేవరాజు భల్లా ఇంటికి వెళ్లాక ప్రకాశవతి జరిగిన విషయాన్ని ఇలా చెప్పింది. "మీరు వెళ్ళిన నాలుగైదు రోజులకు మిత్రుల్ని చూసి రావడానికి ఫ్యాక్టరీకి వెళ్ళాను. విమల ప్రసాద్ నన్ను తిరిగి రానీయలేదు." అంటూ అక్కడ జరిగిన విషయాన్నంతా చెప్పింది.

తరువాత ఆజాద్, ధన్వంతరీ - వచ్చి నేను ఎక్కడికి వెళ్ళింది చెప్పమని ప్రకాశవతిని బాధించారు. నేనసలు ఎక్కడికి వెళ్ళింది ఆమెకు చెప్పలేదు. ఇంక నేను ఎక్కడికి వెళ్ళానో ఎలా చెప్పగలదు ? వాళ్ళు ఎన్నిసార్లు అడిగినా 'నాకు తెలియద'నే చెప్పింది.

ప్రకాశవతికి నేను ఎక్కడికి వెళ్ళింది తెల్సునని ఆజాద్ అభిప్రాయం. ఆమె కావాలని నేనున్న ప్రదేశాన్ని చెప్పడంలేదు అనుకున్నాడు. "నీ కంతా తెల్సు. నువ్వు చెప్పి తీరాలి. చెప్పకపోతే పరిణామం చాలా చెడుగా వుంటుంది' అని డబాయించసాగాడు.

ఆజాద్ ప్రకాశవతిని అడిగిన మరో ప్రశ్న "యశ్‌పాల్‌కూ నీకూ సంబంధం ఏంటి ?"

ప్రకాశవతికి, ఆజాద్ అలా ప్రవర్తించడం చాలా క్రొత్తగా వుంది. ఏమిటీ ప్రశ్నలు ? ఏమిటీ దబాయింపులు ? పరిస్థితి ఆమెకు బొత్తిగా అర్థంకాలేదు. మానసికంగా చాలా బాధపడుతున్నదేమో ఆజాద్ అడిగిన రెండవ ప్రశ్నకు చాలా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పింది. "మా సంబంధంతో మీకు సంబంధం ? మీరు ఎవరు అడగడానికి ?" అన్నది. ఇలా తిరస్కారంగా మాట్లాడడంద్వారా తన ఆత్మగౌరవాన్ని రక్షించుకో చూసింది ప్రకాశవతి.

ఆజాద్‌ను మేమందరమూ గౌరవంగా చూసేవారం. అసలు ఆజాద్, తోటిమిత్రుల మనస్సుల్ని బాధించేట్టు ఎన్నడూ వ్యవహరించేవాడు కాదు. కోపంలోనూ 'మీరు' 'తమరు' అనే అనేవాడు. ఈ మధ్య ధన్వంతరీ, సుఖదేవ్‌రాజ్, కైలాసపతి - ముగ్గురూ ఆజాద్ దగ్గర ముఖప్రీతిగా మాట్లాడడం ప్రారంభించారు. ఆజాద్ స్వభావంలోనూ కొంత మార్పు వచ్చింది.

ప్రకాశవతి అలా తిరస్కారంగా మాట్లాడడంవల్ల ఆజాద్‌కు ఎంత కోపం వచ్చి వుంటుందో చెప్పడం కష్టం. అలాంటి స్థితిలో ప్రకాశవతిని చెంపదెబ్బ వెయ్యకపోవడం అదృష్టం అన్నమాట.

ఇకనప్పుడు ప్రకాశవతికి యదార్థస్థితిని చెప్పేశాను. సెంట్రల్ కమిటీ నిర్ణయాన్ని విని ఆమె చాలా విచారపడ్డది. నేను, ఆజాద్‌నూ ఇతర మిత్రుల్ని కల్సుకోవడానికి వెళుతూన్నానీ చెప్పాను. తనూ ఓ పిస్తోలు తీసుకుని నాతోపాటు రావడానికి సిద్ధం అయింది.

తను రానవసరం లేదని నేను వారించాను. పిస్తోలు అవుసరం వుండదనీ నేను చెప్పాను. నేను ఇంకా ఇలా అన్నాను. "ఇప్పుడు చదరిన స్థితిని సవ్యం చేయడం ముఖ్యం. స్థితి సవ్యం కావడానికి మన యధార్థత తోడ్పడుతుందేగాని, పిస్తోలు తోడ్పడదు. ఒకవేళ నేను పరిస్థితిని చక్కబరచలేకపోతే, అక్కడ చనిపోవడం జరిగితే, యధార్థాన్ని లోకానికి చాటి, నాపై మోపిన అపరాధాలు సత్యదూరమైనవని చెప్పడానికి నీవు బ్రతికివుండడం అవుసరం. కనుక నువ్వు తొందరపడడం గాని భయపడడంగానీ తగదు" అన్నాను.

ఆజాద్‌ను కల్సుకోడానికి వెళ్ళేముందు, ఖయాలీరాంగుప్త దగ్గకు వెళ్ళాను. పరిస్థితినంతా వివరంగా చెప్పాను. ఖయాలీరాంగుప్త విని చకితుడయ్యాడు. మొదట నేను నా మీద మోపిన అపరాధాల్నీ, నాకు విధించిన దండనను మిత్రులకు తెలియకముందే పరిస్థితిని చక్కపరుద్దామనుకున్నాను. కానీ, ఆ ప్రయత్నంలో సఫలుణ్ణి కాలేకపోయాను. ఇప్పుడిక పరిస్థితి మిత్రులకు చెప్పి, మిత్రుల సానుభూతిద్వారా విప్లవ సంఘం మీద వత్తిడి తీసుకువచ్చి, పరిస్థితిని చక్కబరచడానికి ప్రయత్నిస్తున్నాను. గుప్తనుకూడా ఆజాద్ దగ్గరకు రమ్మన్నాను. అతడు సిద్ధమయ్యాడు. తరువాత సుశీలాదీదీని కల్సుకున్నాను. పరిస్థితిని చెప్పాను. ఆమె నిర్విణ్ణురాలయింది. ఆమె విస్మయాన్ని చూశాక 'ఆమెకూ ఈ విషయం ఇంత వరకూ తెలియదనుకున్నాను. విషయం ఎక్కువ మంది మిత్రులకు తెలియకుండా నన్ను ఐపో జేయాలన్న ప్రయత్నం జరిగింది. సుశీలాదీదీకి నామీద మోపిన అపరాధాల్ని చెప్పాను. విని, ఆమె అసలు మాట్లాడలేకపోయింది.

# యశ్‌పాల్ మృత్యుదండన రద్దు

ఆజద్ కాన్పూరులో వున్నాడు. కైలాసపతి టెలిగ్రాం యిచ్చి పిలిపించాడు. మధ్యాహ్నం సమయం. నేను ఖయాలీరాంగుప్తనూ, సుశీలా దీదీని వెంటబెట్టుకుని ఢిల్లీ బాంబు ఫ్యాక్టరీకి వెళ్ళాను. ఆజాద్, ధన్వంతరీ కూచుని ఏమిటో మాట్లాడుకుంటున్నారు. మమ్మల్ని చూడగానే ఆజాద్ ముఖము, కండ్లూ ఎర్రపడ్డాయి. ధన్వంతరీ ముఖం జేవురించింది. వాళ్ళిద్దరికీ కోపంవచ్చిందని అర్థం అయింది. వాళ్ళకోపాన్ని లెక్క చేయకుండా ఆజాద్‌తో "నామీద మోపిన అపరాధాల్ని తెల్సుకోవాలనీ, వాటి నిజా నిజాలను తేల్సుకోవాలనీ - కోరుతున్నాను" అన్నాను.

ఆజాద్ కండ్లు చింతనిప్పులయ్యాయి. కోపంలో పెదవులు వణికాయి. "నలుగురిని వెంటబెట్టుకువచ్చి నన్ను దడిపిద్దామనుకుంటున్నావా ? అసలు, వీరిని ఇక్కడికి ఎవరి అనుమతితో తీసుకువచ్చావు.?" అంటూ ఖయాలీరాంగుప్త వైపు సంజ్ఞచేసి చూపించాడు. "నీకూ అరుగురు మిత్రులున్నారనీ, వాళ్ళు నన్ను కాల్చేయడానికి సిద్ధమవుతారని అన్నావుట ? తీసుకునా నీ మిత్రుల్ని! ఎవరి తల్లిపాల బలమెంతో తేల్చుకుందాం ?" అన్నాడు ఆజాద్. అలా అంటూనే ఆజాద్ ఒక చేత్తో మీసాలు మెలి తిప్పాడు.

ధన్వంతరీ చెప్పిన మాటలకు ఆజాద్ నామీద మండిపడుతూన్నాడని అర్థం అవుతూనేవుంది. నేను శాంతంగా, కానీ కర్కశ స్వరంలో ఇలా అన్నాను. "నీ దగ్గర ఏవేవో అబద్ధాలు వాగినట్టున్నారు. అందుకే నా మీద నీకిలా కోపం వస్తూన్నది. నేను న్యాయాన్ని విచారించమని అడగడానికి వచ్చాను. మన మిత్రులు కొందరు నా పట్ల జరిగిన నిర్ణయం అనుచితమైందని భావిస్తూన్నారు. అనుచితమైనదని భావించినదాన్ని వాళ్ళు వ్యతిరేకించడంలో తప్పేమిటి ? నువ్వు నాతో ఏకాంతంలో మాట్లాడదలుచుకుంటే-నేనందుకు సిద్ధంగా వున్నాను."

ఆజాద్, ధన్వంతరీని, సుశీలాదీదీని, ఖయాలీరాంగుప్తనీ - అవతలికి పంపించాడు. వాళ్ళు వెళ్ళాక అతడు చేసిన మొదటి ప్రశ్న "నీకు సెంట్రల్ కమిటీ నిర్ణయాన్ని గురించి చెప్పిందెవరు ?"

"నాకీ నిర్ణయం ఢిల్లీలోనే తెల్సింది. ఐతే, నిన్ను కల్సుకోవడానికి కాన్పూరు వెళ్ళాను. స్టేషన్ దగ్గర నాకెవరూ కనుపించలేదు. నేను నేరుగా వీరభద్ర ఇంటికి వెళ్ళాను. అతడు నాదగ్గర ఎత్తువేయ్యాలని చూశాడు. 'సాయంత్రం వరకూ ఇక్కడ వుండు ఆజాద్‌ను వెతికి పట్టుకు వస్తాను. లేకపోతే, రాత్రి ఎనిమిది గంటలకు సరసయ్యాఘట్టం దగ్గరకు రా. అప్పుడు ఆజాద్‌ను అక్కడికి తీసుకువస్తాను, అని అన్నాడు. 'ఏం, సాయంత్రంలోపు ఆజాద్ ఎక్కడవున్నాడో ఎందుకు తెల్సుకోలేవు? నాలుగు గంటలకు నేను ఇక్కడికి వస్తాను. అప్పటికి నువ్వు ఆజాద్‌ను పిలుచుకురా' అని నేనతడికి చెప్పి వెళ్ళిపోయాను. సాయంత్రం నాలుగు గంటలకు ఒకమాటు నేను వీరభద్రతివారీ ఇంటికి వెళ్ళాను. నిన్ను పిలిపించాడేమో చూడడానికి. ఐదుగంటలకూ ఒకమాటు వెళ్ళాను. నేను ఆ రాత్రికే బయలుదేరి ఢిల్లీ వచ్చేశాను. తరువాత లాహోరు వెళ్ళాను. షేర్ దిల్ పోలీసుల 'యాక్షన్'ని జరిపి, తద్వారా నామీద మీకుగల అనుమానాన్ని తీర్చాలని నా ఉద్దేశం. లాహోరు వెళ్ళగానే నాకు ఈ విషయాన్ని ఇద్దరు చెప్పారు. ఇద్దరూ వ్యతిరేకించారుకూడాను. లాహోరులోని మిత్రులు ఇది సుఖదేవ్‌రాజు, ధన్వంతరీయొక్క కుతంత్రం అనుకుంటున్నారు. వీళ్ళిద్దర్నీ కాల్చేయాలని అక్కడి మిత్రులు అనుకుంటున్నారు. వాళ్ళను బలవంతాన ఆపాను. వాళ్ళు అసలు ఇది పార్టీ నిర్ణయం కాదు అనుకుంటున్నారు. విషయం నీకు చెప్పి, సత్యాసత్యాల్ని తెలుసుకుందామని ఆ మిత్రులకు నచ్చచెప్పాను" అన్నాను.

ఆజాద్‌కు కోపంవచ్చింది "నేను చెప్తూన్నాను. ఇది పార్టీ నిర్ణయమే" అన్నాడు.

"నిర్ణయం చేసేముందు నా అపరాధాలేమిటో నాకు చెప్పాలికదా ?" అన్నాను నేను.

"ఏం అపరాధాలు చెప్పాలి నీకు ? కమలకు నీకు సంబంధం ఏంటి ?" ఆజాద్ దబాయించాడు.

"భార్యా భర్తల సంబంధం" నేనూ తీవ్రస్వరంలోనే మాట్లాడాను.

"కమల కాదంటున్నది. ఆమె నన్ను ఇన్సల్టు చేసింది. పిడికెడు మనిషి లేదు. 'మీకేమిటి సంబంధం ? అనడిగింది. మీరు పార్టీని అపవిత్రం చేస్తున్నారు" అన్నాడు ఆజాద్.

నాకూ తీవ్రంగా కోపం వచ్చింది "అపవిత్రం చేయడం ఏంటి ? నువ్వు ఇలా మాట్లాడితే నేను సహించలేను. సరీగా మాట్లాడితే సమాధానం చెబుతాను. నువ్వు కమలతో కూడా ఇలాగే మాట్లాడి వుంటావు. అందుకే ఆమె అలా సమాధానం చెప్పింది" అని అన్నాను.

"నువ్వు ఎవరి అనుమతితో పెళ్ళి చేసుకున్నావు ? మెంబర్లు పెళ్ళి చేసుకునే ముందు పార్టీ అనుమతిని తీసుకోవాలని నీకు తెలియదా ? నువ్వు ఒక ప్రాంతానికి ఆర్గనైజరువు. పార్టీ నియమాలు నీకు తెలియవా ?"

"నేనీ విషయమై భగవతీచరణ్‌తో మొదటే మాట్లాడాను. అతడు నీతో చెప్పలేదేమో, నాకు తెలియదు. బాభీతోకూడా మాట్లాడాను. కావాలనుకుంటే నువ్వు ఇప్పుడయినా బాభీని అడుగవచ్చును. నేను రహస్యంగా, పార్టీ సభ్యులకు తెలియకుండా ఏమీ చేయలేదు. అసలు మా ఇద్దర్నీ వివాహం చేసుకోమని బాభీ సలహా యిచ్చింది. సుఖదేవరాజు అప్పుడూ నన్ను అవమానపరిచాడు 'విషయం నీకు చెప్పి సమస్యను పరిష్కరించుకుందామని భగవతీచరణ్‌తో అన్నాను కూడా. ఐతే, జైలు 'యాక్షన్' అయ్యాక మాట్లాడవచ్చునన్నాడు భగవతీభాయి. ఆ తరువాత రెండు రోజులకే భగవతీభాయి...... బంగళాలో బాంబు పేలడం, మనం విడిపోవడం జరిగింది. ఇంక నేను తరువాత నిన్ను కల్సుకోనేలేదు. ఆ తరువాత నేనసలు ఈ విషయానికే ప్రాధాన్యత నివ్వలేదు. నా ప్రవర్తన పార్టీ సభ్యులకు అందరికీ తెల్సుకదా ? ఎవరికైనా అభ్యంతరం వుంటే చెప్పవచ్చునుకదా ? నా పట్ల ఇలా వ్యవహరించడం న్యాయ సమ్మతమని అనుకోవడంలేదు నేను. ప్రకాశవతిని నా కోసం ఇంటి నుండి పిలిపించుకున్నానని అంటున్నారు. ఇది సత్యదూరం. ప్రకాశవతి విప్లవ సంఘంలోకి వచ్చే విషయంలో నీతోటీ, భగవతీ చరణ్‌తోటీ మాట్లాడడం జరిగింది. సుఖదేవరాజు, ధన్వంతరీ చెప్పిన చాడీలను నిజమని నమ్మేశారు. పార్టీని మోసగించడం, పార్టీలపట్ల విశ్వాస ఘాతుకం చేయడమే నావుద్దేశ్యం ఐతే, ఏనాడో పోలీసుల అండకు చేరేవాణ్ణి. మీరు నన్ను కాల్చేయడానికి నిర్ణయించినట్టు తెల్సికూడా, ప్రాణాల్ని రక్షించుకోవడానికి నేను పోలీసుల్ని ఆశ్రయించ లేదు. దీన్ని బట్టి అయినా నా నిజాయితీని, విప్లవ సంఘంపట్ల నాకున్న విశ్వాసాన్ని అర్థం చేసుకోవచ్చును. నన్నూ ప్రకాశవతిని - విప్లవ సంఘం కాల్చేయవచ్చును. అయినా, మేము పోలీసుల శరణ్యాన్ని వేడం. నీ యిష్టం కాల్చేస్తే కాల్చేయ్ ఒకనాడు నీ అంతరాత్మ తప్పక నిన్ను నిందిస్తుంది." అంటూ జేబులో నుండి పిస్తోలును తీసి ఆజాద్ ముందువుంచి "అపరాధాన్ని గురించి చెప్పకుండానే, అపరాధాన్ని గురించి చర్చించకుండానే - మిత్రుల్ని హత్య చేయడంతో విప్లవం వర్ధిల్లుతుంది అనుకుంటే అలాగే కానివ్వు" అన్నాను. కన్నీటిని ఆపుకోలేకపోయాను.

ఆజాద్ కండ్లవెంట కూడా కన్నీరు ధారకట్టింది. కన్నీటిని తుడుచుకోకుండానే "అయిందేదో అయింది. నీకీ రహస్యం ఎవరు చెప్పారో చెప్పాలి, నువ్వు ! లేకపోతే, పార్టీనడవడం కష్టం." అని అన్నాడు ఆజాద్.

"నేను చెప్పను. రహస్యం చెప్పిన మిత్రుడు తనకుతానై ఎన్నడయినా చెప్పుకోవచ్చును. నేను మాత్రం అతడి పేరు చెప్పను. నాకీ రహస్యాన్ని చెప్పిన మిత్రుడికీ నాకూ వ్యక్తిగత మిత్రత్వం ఏమీలేదు. నన్ను కాల్చేయడం విప్లవ సంఘానికి క్షేమం కాదన్నదృష్టితోనే అతడు నాకీ రహస్యాన్ని చెప్పాడు. మరెవరికీ చెప్పనని నేనతడికి మాట ఇచ్చాను. నేను నీకూ విశ్వాసఘాతుకం చేయను. అతడికీ విశ్వాస ఘాతకం చేయను. నేను నీకతడి పేరు చెప్పనందుకు కాలుస్తానంటావా ? కాల్చు, మాట నిలుపుకోడానికి ప్రాణాల్ని ఇస్తున్నానన్న సంతృప్తి అయినా వుంటుది నాకు" అన్నాను నేను.

ఆజాద్ కొన్ని క్షణాలు గుప్పెడలను బిగబట్టి తీవ్రంగా ఆలోచిస్తూ వుండిపోయాడు. తరువాత "ఇక పార్టీ సాగదు" అంటూ కన్నీటిని తుడుచుకుని సుశీలాదీదీనీ, ధన్వంతరీనీ, కైలాసపతినీ పిల్చాడు.

తీవ్రమైన కోపంతో "నాకు పార్టీ గీర్టీ ఏమీ అవుసరం లేదు. మీలో ఎవరిమీదా నాకు విశ్వాసం లేదు మీరందరూ నన్ను మోసగించారు. మీరు ఎం.ఎ., బి.ఎ., చదివిన వాళ్ళు, తెలివికలవాళ్ళు, నన్ను మూర్ఖుణ్ణి చెయ్యడానికి ప్రయత్నించారు. నాతోపాటు సమావేశంలో కూచుని తీర్మానాలు చేసేదీ మీరే, తరువాత ఆ తీర్మానం జరగకుండా కుతంత్రం చేసేదీమీరే. మనం చేసుకున్న నిర్ణయాన్ని సెంట్రల్ కమిటీ సభ్యుడే ఎవడో బయట పెట్టివుంటాడు. అంతటి ద్రోహిఎవడై వుంటాడో నేను వూహించలేకుండా వున్నాను. నాతల తిరిగిపోతుంది. ఇలాంటి కమిటీతో నేను పని చేయలేను. నేను ఒంటరిగానే చాతనయింది చేస్తాను ? నా వరకూ నాకు ఒక్క 'మౌజర్' వుంటే చాలు 'వావల్ల ఇంక ఏమీ కాదు' అనుకున్న క్షణాన నడిబజార్లో పోలీసుల్తో పోరాడుతూ సమాప్తం ఔతాను. మీరందరూ ఆయుధాలను పంచుకోండి. స్వతంత్రంగా ఉద్యమాల్ని నిర్మించుకోండి" అన్నాడు అజాద్.

సుశీలాదీదీ పార్టీని రద్దుచేయడాన్ని వ్యతిరేకించింది. "కొందరు మిమ్మల్ని మోసం చేసినమాట నిజమే. కొందరు నిజాయితీపరులూ వున్నారు పార్టీలో (నావైపు చూపి) మృత్యుదండన విధించినప్పటికీ, మిమ్మల్నీ, పార్టీనీ మోసగించని ఇలాంటి మిత్రుడు ఒక్కడు వున్నప్పటికీ పార్టీ సజీవంగా వుంటుంది. పార్టీకి ఇదొక అగ్ని పరీక్ష. నమ్మక ద్రోహులెవరో తెల్సుకుని, పార్టీలో నుంచి తీసెయ్యండి వాళ్ళను" అన్నది.

ధన్వంతరీ అప్పటికీ తలవంచుకునే వున్నాడు. కన్నీటిని ఆపుకుంటూ ఆర్ద్రస్వరంలో "మీ నాయకత్వానికీ, అధికారానికీ విరుద్ధంగా మిత్రుల్ని రెచ్చగొట్టిన వ్యక్తితో కల్సి నేను పనిచేయలేను. మిమ్మల్ని 'మూర్ఖుడు' అనేవారితో కల్సి పనిచేయడమూ నావల్ల కాదు. మిమ్మల్ని అయోగ్యుడనీ, గర్విష్టి అనీ, 'మందబుద్ధి' అని అన్నవారితో...." అని అన్నాడు నన్ను ఉద్దేశించే అతడన్నది.

లాహోరులో నామీద ఎన్నో అభాండాల్ని ప్రచారంచేయడం జరిగింది. వాటన్నింటికీ ధన్వంతరీ ఇప్పుడు లాహోరు మిత్రులకు ఏం సమాధానం చెప్పగలడు ? పార్టీ నిర్ణయం మార్చుకున్నదని చెప్పాక, ఇంక పంజాబులో అతడి నాయకత్వమూ, గౌరవమూ, సామర్థ్యమూ సమాప్తమౌతాయి. అసలు కారణం అది.

అజాద్ మళ్ళీ కోపంగా "నిజమే నన్ను మూర్ఖుడనేవారితో కల్సి నేను మాత్రం ఎలా పనిచేయగలను ?" అన్నాడు.

నేను అజాద్‌ని నిందించానని ఒప్పుకున్నాను. "నాకు జరిగిన అన్యాయానికి విరుద్ధంగా పోరాడేప్పుడు భయ్యాని నేను నిందించిన మాట నిజమే. అజాద్‌ని నేను 'మందబుద్ధి' అనీ అన్నాను' అంటూ అజాద్ వైపు తిరిగి 'నన్ను నువ్వు ఎన్నో మార్లు 'కాకి' అనీ, 'మూర్ఖుడనీ' అనలేదా ? నిన్ను 'మందబుద్ధి' అని నేనొక్కణ్ణేకాదు అన్నది. అందరూ అన్నారు. అయితే, అలా అనడం నిన్ను నిందించాలనికాదు. నిన్ను మొదట్నుండి తప్పుదారి పట్టిస్తున్నారు. నువ్వు అర్థం చేసుకోలేక పోతూ న్నావు" అన్నాను.

నేను బహావల్‌పూర్ రోడ్డులోని బంగళాలో జరిగిన ఒక సన్నివేశాన్ని జ్ఞాపకం చేశాను అజాద్‌కు. అప్పుడు భగవతీభాయి, నేను, సుఖదేవరాజు, ధన్వంతరీ, సుశీలాదీదీ, దుర్గాబాభీ - అందరమూ అజాద్‌ను గురించి చెప్పుకుని పొట్టచెక్కలయ్యేట్టు నవ్వుకుంటున్నాము. అజాద్‌ను అందరం కల్సి 'మందబుద్ధి' అనేస్తున్నాము.

అజాద్‌ను మేము 'మందబుద్ధి" అనేవాళ్ళం ఐతే, తిరస్కార భావంతో కాదు. అతడిలోని ఆత్మవిశ్వాసాన్ని, గుడ్డిగా నమ్మడాన్ని బట్టి 'మందబుద్ధి' అనేవాళ్ళం. నేను ప్రతిదాన్ని సంశయదృష్టితో చూసేవాణ్ణి. మాటిమాటికి పోలీసుల కండ్లల్లో కారం చల్లుతూండేవాణ్ణి కనుక నన్ను 'కాకి' అనేవారు.

కట్టెవిరిచి పొయ్యిలో పెట్టినట్టు మాట్లాడే స్వభావం కావడంవల్ల 'బాంగ్‌డూస్' అని అనేవారు నన్ను. అలంకరణ పట్ల వ్యామోహంకల వాణ్ణి కావడంవల్ల 'ప్రింస్' అనీ అనేవాళ్ళు.

నాకూ, ఆజాద్‌కేకాదు. మా సంఘంలోని ప్రతి ఒక్కరికీ ఏదో ఒక మారు పేరు వుండనే వుంది. అసలు దుర్గాబాభీ ప్రతి ఒక్కరికీ ఏదో ఒక మారు పేరు పెట్టేస్తుంది. ఇలాంటి మారు పేర్లకు మేము ఎవ్వరమూ కోపం తెచ్చుకునేవాళ్ళం కాదు. కానీ, ఆజాద్‌కు మాత్రం మారుపేర్లంటే మహా కోపం.

ఆజాద్ స్థిమితపడ్డాడు. ధన్వంతరీ యొక్క అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తూ "కల్సి పనిచేయలేకపోవడం ఎలా ? కలిసేపని చేయాలి ! జరిగిందేదో జరిగింది. ఇకదాన్ని మర్చేపోదాం. కొంచెంలో విశ్వాసపాత్రుడూ, విప్లవ సంఘానికి పనికి వచ్చేవాడూ ఐన - మిత్రుణ్ణి శాశ్వతంగా దూరం చేసుకునే వాళ్ళం; మనలో మనం అనుకున్నవన్నీ మర్చేపోదాం" అన్నాడు.

ప్రకాశవతి నా భార్యగా పార్టీ ఒప్పుకుంది. పంజాబుకు ఇన్ ఛార్జి ధన్వంతరి అయ్యాడు. నేను ఆజాద్‌తో పాటు వుంటూ అతడికి సహకరిస్తూండాలన్న నిర్ణయం జరిగింది. ధన్వంతరి పంజాబ్ వెళ్ళి, సెంట్రల్ కమిటీ నాపట్ల తన నిర్ణయాన్ని మార్చుకుందని చెప్పాలి, నేనూ అతడితో పాటు పంజాబువెళ్ళి, అతడు పంజాబుకు నాయకుడు కావడంలో నాకెలాంటి అభ్యంతరమూ లేదని మిత్రుల దగ్గర ఒప్పుకోవాలి. పంజాబులో అతడి నాయకత్వాన్ని సమర్థించాలి. నా దగ్గరవున్న పేలుడు పదార్థాన్నంతటినీ ధన్వంతరీకి ఒప్పచెప్పాలనీ నిర్ణయం జరిగింది.

లాహోరు కుట్ర కేసులో పనిచేస్తున్న పోలీసు ఆఫీసరు ఖాన్ బహద్దూర్ అబ్దుల్ అజీజ్‌ను కాల్చేయాలని పార్టీ నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో నేను ధన్వంతరీకి సహకరించాలన్న నిర్ణయమూ జరిగింది.

తరువాత ఆజాద్ ప్రకాశవతిని బాంబు ఫ్యాక్టరీకి పిలిపించి ఇలా అన్నాడు. "నీపట్ల ఇలా వ్యవహరించినందుకు మేమందరమూ చాలా బాధపడుతూన్నాము. నీమీద నాకేమీ వ్యక్తిగత ద్వేషం లేదు. పార్టీ నిర్ణయాన్ని అనుసరించి మాత్రమే అలా వ్యవహరించవల్సి వచ్చింది. గతాన్ని మర్చిపో."

# విప్లవ సంఘం రద్దయింది

ఆజాద్, సుశీలాదీదీ - వీరిద్దరి ప్రయత్నాలవల్ల ఢిల్లీలో ఎలాగో మాలో మాకు తలలు ముడిపడ్డాయి. ఐతే, ధన్వంతరీ మాత్రం అసం తృప్తిగానే వున్నాడు. సెంట్రల్ కమిటీ తన నిర్ణయాన్ని మార్చుకున్నాక, ధన్వంతరీకి ఆచరణలో కొన్ని చిక్కులు ఎదురయ్యాయి.

లాహోరు వెళ్ళాక, నా దగ్గరవున్న మొత్తం పేలుడు పదార్థాన్ని ధన్వంతరీకి ఒప్ప చెప్పాను. అతడే పంజాబుకు నాయకుడిగా వుండడంలో నా ఆమోదాన్ని కూడా తెలిపాను. ఐతే, సమస్య అంతటితో తేలిపోలేదు. ధన్వంతరీ పంజాబులో 'యశ్‌పాల్ తన తప్పును అంగీకరించాడు. పార్టీని క్షమాభిక్ష వేడుకున్నాడు. కనుక పార్టీ క్షమించింది' అని చెప్పసాగాడు. అలా చెప్పకపోతే పంజాబులో పార్టీ గౌరవంగానీ, ధన్వంతరీ గౌరవం గాని - ఏ మాత్రం వుండవు.

ఐతే, ధన్వంతరీ అలా చెబితే నేనెందుకు సమర్థిస్తాను ? నేనిలా చెప్పసాగాను మిత్రులకు "నా విషయం అసలు సెంట్రల్ కమిటీ ముందు పెట్టనేలేదు. నన్ను కాల్చాలని సెంట్రల్ కమిటీయే నిర్ణయించివుంటే, ఆజాద్ ఒక్కడే ఆ నిర్ణయాన్ని ఎలా మార్చగలడు ? నన్ను కాల్చాలన్న నిర్ణయం

ఆజాద్ ఒక్కడే చేశాడు. అదీ అతడి స్వబుద్ధి కాదు. చాడీ కోరుల ప్రోత్సాహం. తరువాత తన తప్పును తెల్సుకున్నాడు. చాడీ కోరులు నామీద మోపిన నేరాలన్నీ అసత్యాలని ఋజువైంది. ఆజాద్ నన్ను క్షమాపణ అడిగాడు. నామీద అసత్యాల్ని ఆరోపించినవాళ్ళు క్షమాపణ వేడుకున్నారు" అని చెప్పసాగాను.

ఆనాడు ఢిల్లీలో ఆజాద్ ప్రకాశవతిపట్ల నా ప్రవర్తనను గురించి మాత్రమే ప్రశ్నించాడు. నా మీద మోపబడిన మిగిలిన అపరాధాల్ని గురించి అతడు ప్రశ్నించలేదు. కానీ, నేనే మిగిలిన అపరాధాల్ని గురించి ప్రస్తావించాను. అప్పుడు ఆజాద్ చాలా ఖిన్నవదనుడై "అన్నీ చొల్లు కబుర్లు ! వాటిని గురించి మనం ఇక అనుకోవద్దు !" అని అన్నాడు. బహవల్‌పూర్ రోడ్డు బంగళాలో బాంబులు ఎందుకలా ప్రేలాయని మాత్రం అడిగాడు.

నేనూ అవి ఎందుకలా ప్రేలాయా ? అని చాలా రోజులపాటు ఆలోచించాను. ఒకమాటు లాహోరులో దేవదత్తశర్మను కల్సుకుని చర్చించాను కూడా ! లోపల రాచిన వార్నిష్ పూర్తిగా ఆరకుండా త్వరగా బాంబుల్ని కూరడం వల్ల, అవి అలా పేలివుంటాయనుకున్నాము.

అప్పట్లో ఇంద్రపాల్, అతడి సహజరులూ - ఘోరమైన ఆర్థిక బాధలతో వేగిపోతున్నారు. ధన్వంతరీగానీ, సుఖదేవ్‌రాజ్‌గానీ - అతడికి ఎలాంటి సాయమూ చేయడంలేదు. లాహోరులో ధన్వంతరీ ఏ మాత్రం కార్యక్రమాన్ని నిర్వహించలేకపోతున్నాడు. నా కారణం వల్ల ఏర్పడ్డ గందరగోళాన్ని సర్దడానికే అతడికి ఇరవైనాలుగు గంటలు చాలడంలేదు. నా పనీ అలాగే వుంది. ఢిల్లీలో కొంత తగాదా సర్దుబాటు అయినప్పటికీ లాహోరులోని మిత్రుల్లో వెనుకటి స్థానం నాకు లభించలేదు. అప్పుడు నేను ఇంద్రపాల్ సాయంతో కార్యక్రమాన్ని కొంతవరకూ ముందుకు తీసుకువెళ్ళడానికి ప్రయత్నించాను.

ఆగష్టు 26వ తారీకునో లేక 27వ తారీకునో ఇంద్రపాల్ తీసుకున్న గదికి వెళ్ళాను. ఇంటిముందు ఒక వ్యక్తి అకారణంగా కూచుని ఉండడాన్ని గమనించాను. గేటుదాటి ప్రాంగణంలోకి వెళ్ళకముందు నేనతణ్ణి చూడలేదు. వెనక్కు తిరిగిరావడం బాగుండదు. నేరుగా, ఏ మాత్రం జంకూ గొంకూలేకుండా తలుపుకొట్టి, లోపలకు వెళ్ళాను. వెళుతూనే "నీ గదిమీద సి.ఐ.డి. కన్నుపడ్డట్టుంది. ఎవడో సి.ఐ.డి. బయట కాపలా కాస్తున్నాడు. తీరా వచ్చాక వెనక్కు తిరిగిపోతే అతడు అనుమాన పడవచ్చును. నేను ఇప్పుడే వెళుతూన్నాను. నువ్వూ బయటికి రా. ఎక్కడయినా కూచుని మాట్లాడుకోవచ్చును !" అని అన్నాను ఇంద్రపాల్‌తో.

నన్ను చూసి ఇంద్రపాల్ ఆశ్చర్యపడ్డాడు. కంగారుపడ్డాడు కూడాను. "నువ్వు ఇక్కడికి ఎందుకు వచ్చావ్ ? మూడు రోజుల నుండి ఈ ఇంటి చుట్టూ సి.ఐ.డి.లు తిరుగుతున్నారు. ఇక్కడే కాదు గ్వాల్‌మండీలోని ఇంటినీ, జహంగీర్ ఇంటిని కూడా పోలీసులు కమ్మేశారు !" అని అన్నాడు ఇంద్రపాల్.

నేను నిలబడే "సి.ఐ.డి.లకు అనుమానం కలిగిందని తెలిశాక పరారు ఎందుకుకాలేదు?" అని అడిగాను ఇంద్రపాల్‌ను.

"మూడు రోజుల నుండి తిండికి కూడా డబ్బుల్లేవు. ఎవరి దగ్గరకైనా వెళ్ళి అడుగుదామంటే, పోలీసులు వెంటాడుతున్నారు ! ఇంక ఎలా పరారు కావడం ?" అన్నాడు ఇంద్రపాల్.

ఇంద్రపాల్ దగ్గర బాంబుల డిప్పలు కొన్ని వుండాలి. 'అవి ఎక్కడ పెట్టావు ?' అని అడిగాను.

'నందలాల్ మాస్టారింట్లో వున్నాయి !' అన్నాడు ఇంద్రపాల్.

"ఇద్దరం బయటకు వెడదాం పద ! ఇద్దరం చెరో రోడ్డునా వెడదాం. పోలీసు యిద్దర్లో ఎవర్నో ఒకర్నే వెంటాడుతాడు !" అన్నాను తొందర్లో.

ఇంద్రపాల్ 'ఔను. ఇద్దరం బయటకువెడితే, అతడు నన్నే వెంబడిస్తాడు. నువ్వు తప్పించుకోవచ్చును !" నీ దగ్గర ఏమైనా డబ్బులు వున్నాయా ? బీడీలు తెచ్చుకోవడానికి అన్నట్లు, నేనూ బయటకు వస్తాను !" అన్నాడు ఇంద్రపాల్.

నా దగ్గరా అప్పుడు రెండు మూడు రూపాలయిల కంటే ఎక్కువ లేదు. ఆ డబ్బుల్ని ఇంద్రపాల్‌కు ఇచ్చేశాను. "రాత్రి ఎనిమిది గంటలాచాయల 'చౌబుర్జీ' దగ్గరకు రా ! లేకపోతే రేపు ఉదయం రావీనదికి వెళ్ళే రోడ్డు మీదకురా ! పది పదిహేను రూపాయిలు ఎక్కడయినా చూసి ఇస్తాను. జాగ్రత్త, పోలీసుల్ని వెంటపెట్టుకురాకు !" అన్నాను.

మేము గవర్నమెంట్ కాలేజీ మీదుగా అనార్‌కలీ బజారుకు వెళ్ళాము. ఇంద్రపాల్ దుకాణం దగ్గర 'లస్సీ' త్రాగడానికి ఆగాడు. నేను రెండడుగులు ముందుకు వెళ్ళి, వెనక్కు తిరిగి "సరే, నేను దుకాణానికి వెడుతున్నాను. సాయంకాలం వస్తాను. ఎక్కడికీ వెళ్ళకు !" అని ఇంద్రపాల్‌కు చెబుతూ సి.ఐ.డి. ఎక్కడ ఉన్నాడోనని చూశాను.

సి.ఐ.డి. ఇంద్రపాల్‌కు కొద్ది దూరంలో, నిలబడి వున్నాడు. ఇంద్రపాల్ కనుమరుగు కాకుండా చూసుకుంటున్నాడు. ఐనా, నేను మెడికల్ కాలేజిలోకి వెళ్ళి కొంతసేపు ఎవరినో వెతుకుతున్నట్లు అటూ ఇటూ తిరిగాను. నన్నెవరూ వెంబడించడంలేదని నిశ్చయం అయ్యాక అక్కణ్ణుండి వెళ్ళిపోయాను.

తన మీద పోలీసులకు అనుమానం కలిగిందని తెలిశాక ఇంద్రపాల్ తన దగ్గర వున్న ఆయుధాల్ని, ఇతర వస్తువుల్ని మెల్లగా మిత్రుల ఇండ్లకు చారవేశాడు. తను మాత్రం అక్కణ్ణుంచి కదల్లేదు. అతడి ఈ ప్రవర్తన చాలా అనుచితం అనిపించింది నాకు ! ఇంద్రపాల్ అలా పరారు కాకపోవడానికీ కారణం వుంది. మిత్రుల పరస్పర కొట్లాటలూ, ఆర్థిక బాధలూ అతణ్ణి నిరాశపరిచాయి. 'పరారై చేయగలిగింది ఏమీలేదు' అన్న స్థితికి వచ్చాడు. 'తన మీద అపరాధాన్ని మోపడానికి ఆధారాలు ఏమీ లేవు గనుక కొద్ది రోజులు జైల్లో వుంచి వదిలిపెట్టేస్తారు. ఆ తరువాత ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చును !' అని ఇంద్రపాల్ వూహించి ఉండవచ్చును. అతడా రాత్రి 'చౌబుర్జీ' దగ్గరకు రాలేదు. మర్నాడు ఉదయం రావీ నదికి పోయే రోడ్డువద్దకూ రాలేదు. అతడి గదిముందు ఆ రోజు సాయంకాలం నుండే పోలీసులు కాపలా అధికం చేశారు. మర్నాడు తెల్లవారుఝామున ఐదు గంటలకు, అతణ్ణీ, అతడి సహచరుల్నీ ఎక్కడివాళ్ళను అక్కడ అరెస్టు చేశారు.

మాలో మాకు ఏర్పడ్డ మనస్పర్థలన్నింటినీ మరచి, ధన్వంతరీతో కల్సి పనిచేయడానికి మరోమాటు ప్రయత్నించాను. త్వరలో ఏదో ఒక 'యాక్షన్'ని జరిపి చెదరిన నా స్థానాన్ని స్థిరపరచుకోవాలన్న తాపత్రయంలో వున్నాను నేను. 'యాక్షన్'లో నాకు సహకరించడానికి ధన్వంతరి తిరస్కరించాడు. అతడికి నా ప్రస్థానంలో, నా స్థితిని కుదుటపరచుకోవాలన్న స్వార్థమే కనిపించింది ! అప్పట్లో ధన్వంతరి లాహోరులోని అబ్దుల్ అజీజ్‌ని చంపివేయాలన్న ప్లానులో వున్నాడు. ఐతే, ప్లాను నెరవేరడంలేదు. ధన్వంతరీ నాతో మనస్సు విప్పి మాట్లాడడం లేదు. అతడికి సలహాదారు - సుఖదేవరాజు ! అబ్దుల్ అజీజ్ మీద దాడి చేయడాన్ని గురించి, నాకు తెల్సిన దాన్ని బట్టి, ఇలా నా అభిప్రాయాన్నిచ్చాను. 'ఈ ప్లానులో ఆత్మరక్షణకే ప్రాముఖ్యత ఇవ్వబడ్డది. ఆత్మరక్షణకు ఇంత జాగ్రత్త తీసుకున్న ప్లాను ఎన్నటికీ సఫలం కాదు !' నా స్వరం కటువుగా వుండి వుండవచ్చు. అయితే, నేను చెప్పింది మాత్రం సత్యం ! సుఖదేవరాజ్ ప్లాను ప్రకారం ఒక మాటు ఖాన్ బహద్దూర్ కార్లో వెడుతూండగా, కాల్పడం జరిగింది. ఆ కాల్పుల వల్ల అవతలివారు తగు జాగ్రత్తలు తీసుకోవడం మినహా మరోకటి జరుగలేదు. అప్పట్లో ధన్వంతరీకి సుఖదేవ్‌రాజుపట్ల గొప్ప విశ్వాసం వుండేది. అతడి సాహసం, శౌర్యం, తెలివితేటల పట్ల - ప్రగాఢమైన విశ్వాసం వుండేది. తరువాత రెండునెల్లకే ఆ విశ్వాసం పటాపంచలైంది !

రెండు రోజుల తరువాత ధన్వంతరీ, 'నీతో కల్సి పనిచేయలేనని' స్పష్టంగా చెప్పేశాడు నాకు. ఇక నేను పంజాబులో వుంటే పార్టీ సజావుగా సాగే అవకాశమూ కనుపించలేదు. మా ఇద్దరిలోనూ, ఒకరి మీద ఒకరికి అభిప్రాయబేధాలువున్నాయి. మా ఇద్దరి సమస్యల్ని మరోమాటు సెంట్రల్ కమిటీ ముందు వుంచాలనుకున్నాం. మేమిద్దరం ఢిల్లీవచ్చేశాం. ఆజాద్‌ను పిలిపించాం. కైలాసపతి ప్రభుత్వసాక్షి అయ్యాక అతడు తన వాఙ్మూలంలో ఈ సమావేశాన్ని గురించి చెప్పాడు. ఈ సమావేశం సెప్టెంబరు నాలుగున జరిగింది.

ధన్వంతరీ మళ్ళీ నా మీద కొన్ని అపరాధాల్ని మోపాడు. "నేను నా గౌరవాన్ని నిలుపుకోడానికి పార్టీని నిందిస్తున్నాననీ, పార్టీలో నిరంకుశత్వం గూడుకట్టుకుందని ప్రచారం చేస్తున్నాననీ, చెప్పాడు. మరికూడా కొన్ని నేరాల్ని ఆరోపించి, నన్ను పార్టి నుండి వైదొలగించితేగాని తాను పార్టీలో పనిచేయలేనని చెప్పుకున్నాడు ధన్వతరీ. కైలాసపతి అతణ్ణి సమర్థించాడు.

నామీద నేరాల్ని మోపి, నన్ను సెంట్రల్ కమిటీ కాల్చివేయడానికి నిర్ణయించిందని లాహోరు మిత్రుల్తో చెప్పుకున్న బాధ్యతగల వ్యక్తులు ఒకరకంగా ఇరకాటంలో పడ్డారు. ఆ నిర్ణయం మారిపోవడానికి కారణం ఏమి చెప్పగలరు ? 'యశపాల్ తన తప్పును ఒప్పుకుని, క్షమాపణను కోరాడు' అని చెప్పుకోవాలి. వాళ్ళు అలా క్షమాపణ కోరాననీ, తప్పుల్ని అంగీకరించాననీ చెబితే నేనెందుకు వప్పుకుంటాను ? నేను ఇలా చెప్పసాగాను "నామీద మోపిన నేరాలు క్షమించదగినవి కావు. సెంట్రల్ కమిటీ ముందు నా అపరాధాల్ని పెట్టండి. విచారణ జరవండి. నేరం ఋజూ అయితే దండించండి. అంతేగాని, దయాధర్మానికి నన్నేమీ క్షమించ నవుసరం లేదు" అంటున్నాను.

ఈ విషయమై ఆజాద్‌తో అన్నాను. "ఇది నా ఆత్మ గౌరవానికి సంబంధించిన ప్రశ్న కనుక, ఈ సమస్యను సెంట్రల్ కమిటీలో చర్చకు పెట్టవల్సిందే" అని పట్టుపట్టాను.

ఆజాద్ చిరాకు పడ్డాడు. "సెంట్రల్ కమిటీలేదు. ఏమీ లేదు. కమిటీలో జరిగిన నిర్ణయం అమలు జరగకుండా చేసిన, ఆ విశ్వాస ఘాతకుడు ఎవరో తెలిసేవరకూ నేనీ సెంట్రల్ కముటీని అంగీకరించను" అన్నాడు.

నేను మౌనంగా వుండిపోయాను.

ధన్వంతరీ,కైలాసపతి - వీరిద్దరూ నన్ను పార్టీ నుంచి తొలగించవలసిందని పట్టుపట్టడంతో, ఆజాద్ అసలు పార్టీనే రద్దుచేశాడు. ధన్వంతరీ, కైలాసపతి నాతోపాటు కల్సి పనిచేయడం కంటే పార్టి రద్దు అవడమే మేలని భావించారు. వారు అందుకే అంగీకరించారు. భయ్యా ఆజాద్ మొత్తం ఆయుధాల్ని ఏడు భాగాలు చేశాడు. బీహార్, యు.పి, పంజాబ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర - ఈ ఆరు ప్రాంతాలకు ఆరుభాగాలను ఇచ్చేశాడు. ఏడవ భాగాన్ని నాకు ఇచ్చేశాడు. నేను ఏ ప్రాంతానికీ ప్రతి నిధిని కాకపోయినప్పటికీ నాకూ సమానభాగాన్ని ఇవ్వడమేకాకుండా ఓ మంచి రివాల్వర్‌ని అదనంగా ఇస్తూ ఆర్ద్రస్వరంతో - 'సోహన్‌కు (యశ్‌పాల్‌కు) ఇవ్వడం కొందరికి అనుచితం అనిపించవచ్చును. కానీ, నేనిలా ఇవ్వడం ఉచితమనుకుని ఇస్తున్నాను. ఇతరులు ఈ ఆయుధాల్ని ఉపయోగిస్తారో, లేదో చెప్పలేను. సోహన్ మాత్రం తప్పకుండా వీటిని ఉపయోగిస్తాడు" అన్నాడు.

నామీద ఎంత ద్వేషం ఉన్నప్పటికీ, నాకు ఆయుధాలివ్వడాన్ని ధన్వంతరీ వ్యతిరేకించలేదు. అతడికి ఆజాద్‌మీద గొప్ప విశ్వాసం. ఆజాద్ చేసే పనిని వ్యతిరేకించలేడు. విప్లవ సంఘం విచ్ఛిన్నం అయింది. దురదృష్టకరమైన ఈస్థితికి కారణం నేనయినందుకు చాలా విచారించాను. కానీ, చేయగలిగింది ఏమీలేదు.

ధన్వంతరీ, కైలాసపతీ - వీరికే కాకుండా విప్లవ సంఘంలోని ఇతర సభ్యులైన విమల్, బచ్చన్ -వీరికీ నా ప్రవర్తన నచ్చలేదు. నామీద మోపిన ఇతర అపరాధాల్ని అట్లావుంచినా, ప్రకాశవతీ, నేనూ - భార్యా భర్తలుగా ఉండడం అన్నది వీరి దృష్టిలో గొప్ప అపరాధం. విప్లవ కార్యక్రమాల్ని సాగించడానికి, అత్యున్నతమైన, నియమబద్ధమైన త్యాగమయ జీవితం గడపడం అవసరం అన్న అభిప్రాయం కలవారు కావడం వల్ల మా సంబంధం సిగ్గుచేటయిందిగా వారు భావించారు. మా సంఘ సభ్యుడైన ఆప్టే అనే యువకుడు, మూడు నాలుగు ఏళ్ళ క్రితం ఇంత కంటే ఘోరమైన పొరపాటు ఒకటి చేశాడు. విప్లవ సంఘంపట్ల సానుభూతిగల ఒక మిత్రుడి భార్యతో అనుచితసంబంధాన్ని పెట్టుకున్నాడు. తరువాత ఆప్టేవి లక్నోలో కాల్చేయడమూ జరిగింది.

స్త్రీ సంబంధమైన విషయాల్లో 'హిసప్రస' సభ్యులమైన మాదృష్టి కోణానికీ, మాకంటే ముందున్న విప్లవకారుల దృష్టికోణానికీ చాలా వ్యత్యాసం వుంది. స్త్రీ అంటే కేవలం నరకద్వారమనిగానీ, ఆమె గురించిన ఆలోచనే పాపకృత్యమనిగానీ - మేము అనుకునేవాళ్ళంకాదు. స్త్రీని ద్వేషించేవాళ్ళమూకాదు. సమాజంలో స్త్రీ యొక్క దయనీయస్థితిని చూసి, సానుభూతి కనబరచేవాళ్ళం. సమాజానికి ఆమె చేస్తున్న సేవ కారణంగా స్త్రీని గౌరవించేవాళ్ళం పూజార్హమైందిగా భావించేవాళ్లం. స్త్రీ పట్ల మా సంఘ సభ్యుల ప్రవర్తన రోమన్‌కేథలిక్ శాఖకు చెందిన క్రిష్టియన్ బ్రహ్మచారుల ప్రవర్తనలాంటిది. వాళ్ళు స్త్రీని క్రీస్తు తల్లి మరియమ్మగా భావిస్తారు. అంటే కన్యాత్వం చెడకుండా పుత్రుణ్ణికన్న పవిత్రమూర్తిగా భావించి, స్త్రీ సంగమాన్ని క్షమించరాని పాపంగా (ఒరిజనల్ సిన్) భావిస్తారు. ప్రేమ మానవుల్లోని స్వార్థాన్ని చంపుతుందని వాళ్ళూ ఒప్పుకుంటారు. ఐతే, ప్రేమవల్ల నియమనిబంధనలు సళ్ళువదులు తాయన్న భయంవల్ల ప్రేమను అతీంద్రియ విషయంగా బోధిస్తారు. అలాగే జీవితంలో స్త్రీని ప్రేమించడంగానీ, ఆమెపట్ల ఆకర్షణకలిగి వుండడంగానీ మహాపరాధంగా భావించడం ఆనాటి విప్లవకారులకు సహజం. కానీ, నేనూ, నాలాంటి మరికొందరి దృష్టికోణమూ, ఇందుకు భిన్నంగా వుండేది. మేము విప్లవకార్యక్రమాల్ని జీవితపర్యంతం అనుసరించవల్సి వుంది. అలాంటప్పుడు మా కార్యక్రమాలకు అభ్యంతరం కానంతవరకూ జీవితంలోని సహజ అవసరాలను తీర్చుకోవడంలో తప్పేముంది ? అందుకు భయపడేవాల్ళమూ కాదు. మా సంఘ సభ్యుల్లోనే స్త్రీ పట్ల మాలాంటి సహజ దృష్టికోణం లేని కొందరికి నా ప్రవర్తన విప్లవ సంఘానికి కళంకాన్ని ఆపాదించేదిగా కనుపించింది.

ఇది జరిగిన కొన్నాల్టివరకూ నేను చాలా విచారంగా, విషాదంగా జీవితాన్ని గడిపాను. మాటిమాటికీ ఆత్మ విమర్శ చేసుకునేవాణ్ణి. ప్రేమ కారణంగా విప్లవకర్తవ్యాన్ని నేను ఏమాత్రమూ నిర్లక్ష్యం చేయలేదు. ఐతే, నిర్లక్ష్యం చేశానా ? చేయలేదా ? అనేది ముఖ్యంకాదు వాళ్ళకు, నేనొక అనుచితమైన పనిచేశాననేదే ముఖ్యం. ఆనాటి విప్లవకారుల్లో ఎక్కువమంది నా దృష్టికోణాన్ని అంగీకరించలేదు. కొందరు ఆధునికులైన విప్లవకారులు మాత్రం నాదృష్టికోణాన్ని అర్థం చేసుకున్నట్టు కనుపించే వారు గత పది పదిహేను సంవత్సరాలుగా వ్యక్తిగత స్వార్థాన్ని, తమ కుటుంబాల చింతా - చీకుల్ని పక్కకు నెట్టి, సోషలిష్టు పార్టీలోనూ, కమ్యూనిష్టు పార్టీలోనూ పనిచేస్తూన్న మిత్రులు వున్నారు. సాయుధ విప్లవమే తమ లక్ష్యం కావడంవల్ల వీళ్ళనీ విప్లవకారులనే అనాలి. ఈ విప్లవ కారులు ఒక విషయాన్ని నిర్ద్వంద్వంగా అంగీకరించారు. విప్లవ ధ్యేయాన్ని నిరంతరం కలిగి వుండడానికి జీవితాన్ని స్వాభావికంగా గడపాలని అంగీకరించారు. ప్రేమకు ఉచితమైన అవకాశాన్నీయడం కూడా అవసరం అని తెల్సుకున్నారు. విప్లవకార్యకర్తలయిన స్త్రీ పురుషులు నైతికపతనం చెందకుండా వుండడానికి పరస్పర ప్రేమైక వివాహ సంబంధాల్ని కలిగి వుండడం అవసరమని గమనించారు.

ధన్వంతరీ విప్లవ కర్తవ్యాన్ని, ఈనాటివరకూ ఎంతో నిజాయితీతో నిర్వహిస్తూ వచ్చాడు. 1930 నవంబరు 1వ తారీకున అతడు ఢిల్లీలో అరెస్టయ్యాడు. ఆ తరువాత జైల్లోనూ పోరాడుతూనే వున్నాడు. ద్వీపాంతర వాసం అనుభవించాడు. అక్కడ ప్రగతిశీల విప్లవకారుల్తోకల్సి మార్క్సిజాన్ని అధ్యయనం చేశాడు. జైలు నించీ విడుదల అయ్యాక ఆరోగ్యం బాగాలేనిస్థితిలోనూ అతడెంతో శ్రద్ధగా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. విప్లవ కార్యక్రమాల్ని నిర్వహిస్తూనే అతడు 1950లో లక్నో వచ్చాడు. అప్పుడు జాలంధర్‌లో జరుగబోయే తన వివాహానికి నన్ను రమ్మని ఆహ్వానించాడు. పెండ్లి కూతురు తన అభిప్రాయాన్ని మార్చుకోవడంవల్ల ఆ వివాహం జరగలేదనుకోండి. ఐతే, ప్రేమను భౌతికంగా అనుభవించే విషయంలో ధన్వంతరీ దృష్టికోణంలో మార్పు వచ్చినట్టు స్పష్టం అవుతుంది.

ఈ విషయంలో కైలాసపతి ప్రవర్తనను సందర్భం వచ్చినప్పుడు వివరిస్తాను.

విప్లవ సంఘం విచ్ఛిన్నమయింది. మేమందరం చాలా విచారపడ్డాము. ఎంత విచారపడ్డా ఘోరమైన ఆ యదార్థాన్ని అంగీకరించక తప్పలేదు. ప్రస్తుత స్థితి నుండి బయటపడడానికి మరో వుపాయం లేదు. నా పరిస్థితి నాకే దయనీయమైందిగా కనుపించింది. నాతో సహకరించే లాహోరులోని నిమ్న మధ్యతరగతి మిత్రులందరూ ఒకేమాటు అరెస్టవడంతో నేను నిస్సహాయుణ్ణయ్యాను.

ఎంతో నిరాశతో గడిపానా రోజుల్ని. ఆ నిరాశాంధకారంలో, ఆజాద్ చెప్పిన చివరి మాట ఒక్కటి మాత్రం ఆశాజ్యోతిగా కనబడుతూన్నది. "సోహన్, ఇప్పుడింకేమీ చేయలేము. మనం ఏ కీళ్ళకొట్లో పెట్టుకుని, పొట్టపోసుకుంటూ జీవితాన్ని గడపడానికి ప్రాధాన్యత నివ్వము. నువ్వు ఎప్పుడు ఏం చేయాలనుకున్నా నా సహకారం వుంటుందన్న విషయాన్ని మర్చేపోకు."

ఆజాద్ ఢిల్లీలో, కాన్పూర్‌లో తనువుండే ప్రదేశాల్ని చెప్పాడు. అక్కడికివెళ్ళి కనుక్కుంటే ఆజాద్‌ను కల్సుకోవడానికి వీలవుతుంది.

# పార్టీని కాపాడడానికి ఆజాద్ ప్రయత్నం

1930 డిసెంబర్ 4వ తారీకు మధ్నాహ్నం, ఢిల్లీ బాంబు ఫ్యాక్టరీలో, ఆజాద్ కేంద్రకమిటీని రద్దు చేశాడు. కేంద్ర కమిటీని రద్దు చేయడానికి కారణం నన్ను కాల్చివేసేయాలన్న నిర్ణయాన్ని మార్చివేయ వల్సిరావడమే. ఈ నిర్ణయాన్ని మార్చుకోవడంవల్ల రెండు సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఒకటి, ధన్వంతరీ, సుఖదేవరాజు - పంజాబు వెళ్ళి నన్ను దండించకుండా వదిలిపెట్టడానికి గల కారణాల్ని ఏమని వివరించగలరు ? యశ్‌పాల్ మీద ఆరోపించిన నేరాలు అబద్ధాలని చెప్తారనుకుందాం, అలాచెప్తే ఆ నేరాల్ని ఆరోపించింది వాళ్ళే గనుక, పార్టీ సభ్యుల్లో వాళ్ళమీది విశ్వాసం సన్నగిల్లుతుంది. పోనీ, యశ్‌పాల్ తన అపరాధాలకు క్షమాపణ కోరుకున్నాడని చెప్తారనుకుంటే, శిక్ష విధించక ముందే క్షమించాలి గదా ? పైగా, నేను ఆ అవమానాన్ని ఎందుకు సహిస్తాను ? క్షమించమని కోరుకోవడమంటే అపరాధాల్ని ఒప్పుకోవడమేగదా ? నా మీద అపరాధాల్ని మోపినవాళ్ళూ, నేనూ ఒకేపార్టీలో కల్సి ఇంక పని చేయడం సంభవం కాదు.

కొరకరాని కొయ్యలా తయారైన రెండవ సమస్య 'నన్ను కాల్చేయాలన్న నిర్ణయం బయటికి ఎలా వెళ్ళింది ?' అన్నది. కేంద్ర కమిటీ లోని వ్యక్తే ఈ రహస్యాన్ని బైటపెట్టగలడు. ఈ రహస్యాన్ని

బయటపెట్టింది ఎవరో తెలియనంతవరకూ సభ్యులందర్నీ అనుమానించడం జరుగుతుంది. అనుమానాస్పదుడైన వ్యక్తి తమలో ఉన్నాడని తెలిశాక, ఇంక కేంద్రకమిటీ సభ్యులు ఎలా పనిచేయగలరు?

నేను ఏ విధంగానూ, నాకు రహస్యం చెప్పిన వ్యక్తిపేరు చెప్పడానికి సిద్ధంగాలేను. అంతేకాదు, పరిస్థితిని గజిబిజిచేసి, ఎవరిని అనుమానించాల్నో తోచకుండా చేస్తున్నాను. నా ప్రవర్తనవల్ల కమిటీ సభ్యులు, నిర్దిష్టంగా 'ఫలానావారు రహస్యాన్ని బైటపెట్టారని' ఊహించనుకూడా ఊహించలేకుండా వున్నారు. పార్టీమీదా, నామీద విశ్వాసంగల మిత్రుల పట్ల, అప్పట్లో నేను నిర్వహించవలసిన కర్తవ్యం అదేననుకున్నాను. అయినప్పటికీ కొన్ని విషయాలు కొంత ఊహకు అస్కారాన్ని ఇస్తున్నాయి. నేను కాన్పూరు నుండి రాగానే ప్రకాశవతిని బాంబు ఫ్యాక్టరీలో నుంచి తీసుకువెళ్ళడం, నాకు రహస్యం కాన్పూరులో తెల్సిందనడానికి నిదర్శనం. ఆజాద్‌ను మభ్యపెట్టడానికి అతడితో 'నాకు ఢిల్లీలోనే రహస్యం తెల్సింది' అని చెప్పాను. ఢిల్లీలో నాకు రహస్యాన్ని ఎవరు చెప్తారు ? చెప్తే, కైలాసపతి చెప్పి వుండాలి. కానీ, ఆజాద్‌కు వీరభద్ర తివారీ మీదనే అనుమానం కలిగింది. బహుశ అతడు కమిటీలో మొదట ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించి వుండవచ్చు. ఇతర సభ్యులు పట్టుపట్టడం వల్ల అతడు వూరుకుని వుండవచ్చు. ఆజాద్‌కు, వీరభద్రతివారీమీద అనుమానంవున్నా, తగిన ఆధారాలు లేకుండా అతడిమీద చర్యతీసుకోవడం ఎలా ? పార్టీ సభ్యులు, నమ్మకస్తుడూ, పార్టీకి ఎంతో ఉపయోగపడగల కార్యకర్త నొకణ్ణి చంపుకోవడంలాంటి ఘోర తప్పిదాన్నుండి తప్పించుకున్నందుకు సంతోషపడ్డారు. ఐతే, కేంద్రకమిటీని పూర్తిగా విశ్వసించడానికి వీల్లేని పరిస్థితులు ఏర్పడ్డందుకు విచారిస్తూన్నారుకూడాను.

నన్ను కాల్చేయాలన్న కేంద్రకమిటీ నిర్ణయం మారిపోవడంవల్ల ధన్వంతరీ, సుఖదేవరాజూ-చాలా అసంతృప్తిని చెందారు. నాకూ ఏమంత సంతృప్తి నివ్వలేకపోయింది, నిర్ణయాన్ని మార్చిన పద్ధతి! నన్ను చాలా అవమానపరిచారు. ఆ అవమానానికి తగిన ప్రతీకారం జరగాలని నా ఉద్దేశం. అంతేకాదు. నన్ను ఏ మాత్రం అడక్కుండా, అంటే నా తప్పేమిటో నాకు చెప్పకుండా ఈ నిర్ణయానికి అంగీకరించినందుకు ఆజాద్‌మీదా నాకు కోపం వచ్చింది. ధన్వంతరీ పంజాబులో, నేను క్షమాపణ కోరుకోవడంవల్ల ఆజాద్ క్షమించాడని ప్రచారం చేయడం మొదలు పెట్టాడు. నేను అతడి ప్రచారాన్ని ఖండించడమే కాకుండా 'కేంద్రకమిటీ నిర్ణయాన్ని తోసిరాజని నన్ను క్షమించడానికి ఆజాద్ ఎవడు ? అని వాదించసాగాను. 'ఒక వ్యక్తి కమిటీ సభ్యుల నిర్ణయాన్ని ఎలా మార్చగలడు ?' అని అడగసాగాను. 'నన్ను కాల్చాలన్న నిర్ణయమే జరగలేదు. అంతా అబద్ధం, అనేశాను. నా యీ వాదనలను ఆజాద్‌కు చెప్పారు. అతడు మండిపడ్డాడు. తర్కదృష్టితో నావాదన బాగానేవున్నా, ఆనాటి పరిస్థితుల్లో ఆజాద్‌మీది విశ్వాసమే మమ్మల్నందర్నీ ఒక పార్టీగా నిలబెట్టింది. మేమందరం సాయుధులం. ఒకరిమీద ఒకరికి వల్లమాలిన కోపం రగుల్తోంది. అయినప్పటికీ మేము ఒకళ్ళనొకళ్ళం చంపుకోలేదు. వ్యక్తిగత అవమానాలకంటే ఆదర్శానికి ప్రాధాన్యతనిచ్చేవాళ్ళం. పార్టీ నిర్ణయించిన నియమాల్ని పాటించడమే ముఖ్యం అనుకునేవాళ్ళం. మరి ఆనాడు పార్టీయే ఆజాద్, ఆజాదే పార్టీగా ఉండేది. ఐతే, ఒంటరిగా ఏ ఒక్క నిర్ణయాన్నిగానీ చేయగల శక్తి ఆజాద్‌కు లేదు.

ఆజాద్‌కూడా చాలా కఠినపరిస్థితుల్లో చిక్కుకున్నాడు. మరో రకంగా చెప్పాలంటే, అతి దయనీయమైన స్థితిలో పడ్డాడు. పార్టీ సభ్యుల్లో ఎవర్నీ వదులుకోవడమూ అతడికి ఇష్టంలేదు. మిగిలినవారి కోసం పోనీ, నన్ను వదులుకుంటాడా అంటే అదీ చేయలేకుండా వున్నాడు. కనుక ఈ పరిస్థితులన్నీ సవ్యమవడానికి పార్టీని రద్దుచేయడం ఒకటే మార్గం. అప్పటికి పార్టీని రద్దుచేస్తే, తరువాత కొత్త సభ్యుల్తో, కొత్త ఆధారాల్తో, కొత్తగా మళ్ళీ పార్టీని స్థాపించవచ్చును. అప్పుడు నేను ఏ ప్రాంతానికీ ప్రతినిధిని కాకపోయినప్పటికీ, అన్ని ప్రాంతాల ప్రతినిధులకు ఇచ్చినట్టుగానే నాకూ

ఆయుధాల్నిచ్చాడు ఆజాద్. అతడు అందర్నీ తమ తమ ప్రాంతాల్లో స్వతంత్రంగా కార్యక్రమాల్ని నిర్వహించమన్నాడు. ఎవరికి తన అవుసరం వచ్చినా తప్పక సహకరిస్తానన్నాడు.

ఆజాద్ నాతో ఇలా అన్నాడు. "ఎవరికి వారిని స్వతంత్రంగా పని చేయనిద్దాం. మనిద్దరం విడిగా చేతనయింది చేద్దాం. అప్పుడుగానీ ఈ పోట్లాటలు సమసిపోవు" ఈ నిర్ణయం నన్ను సంతృప్తి పరచక పోయినా, అంతకంటే చేయగలిగింది కూడా ఏమీలేదు. అప్పుడే మరో విషయం తెల్సింది. ధన్వంతరీ, సుఖదేవ్‌రాజు- అబ్దుల్ అజీజ్‌మీద కాల్పులు జరిపారు. అజీజ్ కాలువ వైపు నుంచి కార్లో వస్తూండగా అతడిపై కాల్పులు జరిపారు. ఐతే, అజీజ్‌కు ఏమాత్రం దెబ్బలు తగల లేదు. ఇటు కాల్చిన వాళ్ళూ పట్టుపడలేదు. ఈ దాడిని గురించి లాహోరులో ధన్వంతరీలోగడే నాతో మాట్లాడాడు. నేను అప్పుడే ఇలా అన్నాను "ఈ ప్లానులో దాడిచేసేవారి ప్రాణరక్షణకే ప్రాధాన్యత ఎక్కువ కనుపిస్తోంది. కనుక విజయం లభించడం అనుమానాస్పదం" ఆజాద్‌తోటి పై దాడిని గురించి అలాగే చెప్పాను. అప్పట్లో బాగా కోపంగా వున్నాను. నేనే ఏదో ఒకటిచేసి చెదరిన గౌరవాన్ని కూడ కట్టుకోవాలన్న ఆదుర్దాలోనూ వున్నాను. కనుక, నా స్వరం బాగా కటువుగా మారిపోయింది. నేను చెప్పింది నిజమే అయినప్పటికీ స్వరంలో గర్వం, ఇతర్లపట్ల తిరస్కారం ధ్వనిస్తూన్నాయి. అలాంటప్పుడు ఇతర్లు నా మాటల్నీ చెవిని పెట్టకపోవడంలో ఆశ్చర్యం ఏముంది ?

ఢిల్లీ బాంబు ఫ్యాక్టరీలో తయారు చేసిన పేలుడు పదార్థం చాలా వుంది. ఫ్యాక్టరీలో అవకాశం వున్నప్పుడు బాంబులు తయారు చేయడాన్ని గురించి మరొకొన్ని గ్రంథాల్ని చదవడం జరిగింది. ఆ పరిజ్ఞానంతో పిక్రిక్ యాసిడ్‌ను ఇసుకలో పూడ్చి, పుటంవేసి ద్రవీకరించవచ్చునని తెల్సుకున్నాను. అలా కొద్ది పరిమాణమూ,అధిక శక్తివంతమూ అయిన బాంబుల్ని తయారు చేయవచ్చును. తయారు చేసుకున్నానుకూడాను. ఆజాద్ కాన్పూర్ నుంచి డైనమైట్‌ను తెచ్చాడు. ఇలా ఆయుధబలం సమకూడడంతో ఆజాద్ తన అభిప్రాయాన్నిలా వ్యక్తపరిచాడు. "ఒక మాటు వైస్రాయి స్పెషల్ ట్రైను మీద దాడి చేశాము. అది విఫలమైందనుకో మరో మాటు అదే ప్రయత్నాన్ని చేయవచ్చునుగదా ?"

నేనిలా అన్నాను. "వైస్రాయి స్పెషల్ ట్రైనుమీద మరోమాటు దాడి చేయవచ్చును. ఐతే, ఈమాటు వెనుకటి పద్ధతినే అనుసరించరాదు. ఆ వెనకటి పద్ధతినే అనుసరిస్తే ముందే పట్టుబడిపోతాము. పరిహాస పాత్రులమౌతాము. దాడి చెయ్యాలనుకుంటే కొత్త పద్ధతిలో చెయ్యాలి."

ఆజాద్‌కు హంస్‌రాజ్ యొక్క వైర్‌లెస్ జ్ఞాపకం వచ్చింది. క్రితంసారి వైస్రాయి మీద దాడి సందర్భంగా హంస్‌రాజ్‌ను ఢిల్లీ పిలిపించడం జరిగింది. శ్రద్ధానంద బజారుకు పక్కగొందిలో వున్నామప్పుడు. అప్పుడే హంస్‌రాజ్ తన 'ఒకటిన్నర గజం' 'ఐదుగజాల' ప్రయోగాన్ని చేసి చూపించాడు. ఆ ప్రయోగాన్ని ఆజాద్‌కూడా చూశాడు. ప్రయోగం ఏమిటంటే, హంస్‌రాజ్ చిన్న బ్యాటరీసెల్‌కు రెండు తల వెంట్రుకల్లాటి సన్నని కరెంటువైర్లను చుడతారు. వాటిల్లో ఒకవైరును బ్యాటరీతాలూకు బల్బుకు చుడతాడు. రెండవ వైరును కూడా బల్బుకుతాకిస్తే బల్బు వెలుగుతుంది. అది అందరూ చేయగలరు. అయితే, హంసరాజ్ చేసే గమ్మత్తు ఏమిటంటే, రెండవవైరును బల్బుకు తాకించడు. ఒక చిన్న సీసా బల్బువైపు తీసుకువెడతాడు. ఆ సీసా బల్బు దగ్గరకుపోగానే బల్బు వెలుగుతుంది. అంటే రెండవ వైరును ఆనించకుండానే బల్బు వెలిగించుతాడు. మరోకరకంగా చెప్పాలంటే రెండవ వైరునుబల్బు తనంతతానే సంలగ్నం చేసుకుంటుంది. ఆ చిన్నిసీసాలో కాసిని నీళ్ళుపోసి ఏవేవో మందులు కలుపుతాడు అతడు.

ఈ ప్రయోగాన్ని గురించి వివరిస్తూ "సీసాలో కల్పిన మందుల ప్రభావంవల్ల, సీసాకు గజన్నర దూరం వరకూ విద్యుత్ తరంగాలు ప్రవహిస్తూవుంటాయి. అవి సహజంగానే బల్బుకూ

కరెంటువైరుకు సంబంధాన్ని కలుపుతాయి." అని చెప్పాడు హంసరాజ్. ఐతే, ఈ ప్రయోగాన్ని అందరూ చేయడానికి వీల్లేదు. అతడి చేతి మీదుగా జరగాల్సిందే ! ఇతరులు చేస్తే మందు ప్రభావం పనిచేయదు. మేము సీసాను దగ్గరకు జరిపితే బల్బు వెలగక పోవడానికి కారణాన్ని తెల్పుతూ "సీసాలోంచి కొన్ని ప్రత్యేకమైన దిశలకు విద్యుత్తు తరంగాలు ప్రవహిస్తూ వుంటాయి. విద్యుత్తు ప్రవహించే దిశను నేను గమనించగలను. మీరు గమనించలేరు !" అంటాడు. ఏ శక్తివల్ల తను విద్యుత్తు ప్రసార దిశను కనుక్కోగలుగుతున్నాడో చెప్పడు. "నాకు తెలుస్తుంది !" అని మాత్రం అంటాడు. వాతావరణంలో విద్యుత్తు ప్రవాహదిశను కనుక్కోవడానికి రాడారు యంత్రాలుంటాయి. ప్రపంచంలోని వైజ్ఞానికులందరూ ఈ రాడారు యంత్రాల ద్వారానే విద్యుత్తు దిశను కనుక్కుంటారు. వైజ్ఞానికులే అవసరం లేదు. రాడారు యంత్రాన్ని ఉపయోగించడం తెల్సిన ప్రతివారూ ఆ దిశను తెల్సుకోవచ్చును. శరీర స్పర్శతోనో, ఊహతోనో ఎవరూ విద్యుత్తు దిశను తెల్సుకోలేరు. కానీ, హంసరాజ్ తాను తెల్సుకోగలనంటాడు.

ఈ విద్యుత్ ప్రవాహ చమత్కారమే కాకుండా మెస్మరిజాన్ని చేసి చూపిస్తుండేవాడు. అతడు ప్రదర్శించే ప్రతి ప్రయోగంలోనూ హస్తలాఘవం ఎక్కువగా పనిచేసేది. ఐతే, మేమది గమనించలేక అతడి ప్రయోగాన్ని నిజమని నమ్మేసేవాళ్ళం. అప్పటికి రెండు మార్లు అతడు మమ్మల్ని మోసం చేశాడు. అంటే, 1929లో వైస్రాయి స్పెషల్ ట్రైను కింద బాంబు పేల్చే సందర్భంలోనూ, ఆ తరువాత భగత్‌సింగ్ మొదలైన మిత్రుల్ని లాహోర్ జైల్నుండి విడిపించడానికి ప్రయత్నించే సందర్భంలోనూ - రెండు మాట్లు ముఖం తప్పించాడు. ఐనా, ఆజద్‌కు అతడి పట్ల ఆశ చావలేదు. ఏదైనా అద్భుతమైన పద్ధతలో వైస్రాయి మీద దాడి చేయడం జరిగితే, అది గొప్ప ప్రభావాన్ని వేస్తుందని ఆజాద్ - అన్నాడు. దీన్ని బట్టి ఆజాద్ తన ప్రాణానికి ప్రమాదం లేని విధంగా, వైస్రాయిమీద దాడిచేయడానికి యోచిస్తున్నాడనడం సబబు కాదు. అలా అనుకోవడం వల్ల ఆజాద్‌ను పొరపాటుగా అర్థం చేసుకోవడమే అవుతోంది. అలా అద్భుత ప్రయోగం ద్వారా వైస్రాయి మీద దాడి చేయడం వల్ల, ఎలా దాడిచేశారో తెల్సుకోలేక ప్రభుత్వం కంగు తింటుంది. ప్రభుత్వాన్ని అలా కంగు తినిపించడమే ఆజాద్ ఉద్దేశం.

ఆజాద్ మరొకటీ అన్నాడు. "ఇంతవరకూ హంస్‌రాజ్ ముఖం తప్పిస్తున్నాడు. అందుక్కారణం తనమీద అనుమానం కలుగుతుందన్న భయం కావచ్చు ! ఇంద్రపాల్ కారణంగా హంసరాజ్ మీద ప్రభుత్వానికి ఎటూ అనుమానం కలిగింది. ఇక ఇప్పుడు కొత్తగా అతడి మీద అనుమానం కలిగేదేమీ లేదు. కనుక, మనకు ఈ మాటు సహకరించవచ్చును. నువ్వెళ్ళి అతణ్ణి కనుక్కో. మనకు వైర్‌లెస్ సాధనాన్ని గనక ఇచ్చినట్టయితే, అతడి ప్రాణరక్షణకు అవసరం అయిన ఏర్పాట్లను మనం చేస్తామని చెప్పు. అవసరం అనుకుంటే అతడిని విదేశాలకు పంపించే ఏర్పాట్లూ చేద్దాం. ఏమైనా కానీ, మరోమాటు అతడి విషయంలో ప్రయత్నించు !"

హంస్‌రాజ్ ఎక్కడున్నాడో తెల్సుకోడానికి లాయల్‌పూర్‌లోని అతడి ఇంటికి వెళ్ళవల్సిందే.

ధన్వంతరీ, సుఖదేవరాజు, కైలాసపతి - వీళ్ళు నామీద దుబారా ఖర్చుచేస్తానన్న నేరాన్నీ మోపారు. అందువల్ల మానసికంగా చాలా బాధపడిన నేను, ఇక మీదట పార్టీ సహాయాన్ని గానీ, పార్టీ ఏర్పాట్లను గానీ అర్థించరాదని నిశ్చయించు కున్నాను. నా ఖర్చుకూ, ప్రకాశవతి ఖర్చుకూ పార్టీమీద, లేక పార్టీ సభ్యుల మీదా ఆధారపడరాదనీ అనుకున్నాను.

ఇప్పుడు ఉత్తరప్రదేశ్ కాంగ్రేసు మంత్రి మండలిలో సభ్యులయిన ఆచార్య జుగల్‌కిశోర్‌గారు అప్పట్లో 'ప్రేమ మహా విద్యాలయాని'కి ప్రిన్స్‌పాల్‌గా వుండేవారు. ఆచార్యులవారు వెనుక లాహోర్‌లోని నేషనల్ కాలేజీకి ప్రిన్స్‌పాల్‌గా వున్నారు కొన్నాళ్ళు. నేను ఒకటి రెండు మార్లు ప్రేమ మహా విద్యాలయానికి వెళ్ళి ఆచార్యుల వారిని కల్సుకుని వచ్చాను. వారు కొంత సహాయం కూడా చేశారు.

వారికి ఆచార్య కృపలానీ గారితో బాగా పరిచయం వుంది. కృపలానీ అప్పుడూ, ఆ తరువాత కూడా చాలా రోజులవరకూ ఇండియన్ నేషనల్ కాంగ్రేసుకు కార్యదర్శిగా వున్నారు. జుగల్‌కిశోర్ ద్వారా కృపలానీని కల్సుకోవచ్చు. కృపలానీ అంటే గాంధీగారికి ఎంతో అభిమానం. ఈ విధంగా కాంగ్రేసులోని జాతీయ భావంగల సంపన్నులైన వ్యక్తుల్తో పరిచయం ఏర్పడుతుంది. ఈ పరిచయాల వల్ల ఆర్థిక ప్రయోజనం ఎటూ వుంటుంది. అవకాశం దొరికితే గాంధీగారితో మా నిజాయితీని గురించి, దేశభక్తిని గురించి చెప్పి 'కనీసం విప్లవకారుల్ని నిందించడం మానుకోండి !' అని చెప్పుదామని ఉద్దేశం.

జుగల్‌కిశోర్ ద్వారా ఆచార్య కృపలానీని పరిచయం చేసుకున్నాను. వారికి నామీద సి.ఐ.డి.నేమోనన్న అనుమానం కలగలేదు. బెనారస్ విశ్వవిద్యాలయంలో, పాట్నాలో కొన్నాళ్ళు ఉపాధ్యాయులుగా పనిచేశారు కృపలానీ. అప్పుడు వారికి విప్లవకారుల్తో పరిచయాలూ వుండేవి. విప్లవ కారుల పట్ల వారికి సహానుభూతి వుండేది. మొదటగా కల్సినప్పుడు వారిని ఊరకా పరిచయం మాత్రం చేసుకున్నాను. ఎక్కువగా మాట్లాడలేదు. ఆ రోజుల్లో అంటే, 1929 అక్టోబర్‌లో ఆలిండియా కాంగ్రేస్ వర్కింగ్ కమిటీ ఢిల్లీలో జరుగుతుంది. అప్పటి అసెంబ్లీలో కాంగ్రేసు పార్టీ నాయకుడైన విఠల్‌భాయి పటేల్‌గారి బంగళాలో మీటింగ్ జరుగుతోంది. అప్పుడూ నేనూ - భగవతీచరణ్ శ్రద్ధానందబజార్ పక్కగొందిలో వుంటున్నాము. ఆల్ ఇండియా కాంగ్రేసు వర్కింగ్ కమిటీ మీటింగ్‌కు వెళ్ళి కృపలానీద్వారా ఇతర నాయకుల్ని పరిచయం చేసుకోవడం ఉపయోగకరం అనుకున్నాం. మీటింగ్ సమయంలో లోపలకు వెళ్ళడానికి ఖయాలీరామ్‌గుప్త నడిగి ఖద్దరు లాల్చీ, ధోవతి, టోపి తీసుకున్నాను. పైన ఖద్దరుదే దుశ్శాలువను కప్పుకున్నాను. చొక్కాలోపల, బొడ్లో పిస్తోల్ని పెట్టుకున్నాను. కాంగ్రెసు నాయకుల్లాగానే తోలుసంచీ భుజానికి వ్రేలాడ వేసుకుని, టాంగాలో విఠల్‌భాయి బంగళాకు వెళ్ళాను. భగవతీచరణ్ "ఈ ఆడంబరం అనవసరం. నువ్వు మామూలుగానే సూటు వేసుకుని వెళ్ళు !" అని సలహా ఇచ్చాడు. అతడి సలహా నాకు అంతగా నచ్చలేదు.

మూడు రంగుల బ్యాడ్జీలను ధరించిన కాంగ్రేసు స్వయం సేవకులు నన్ను బంగళా గేటు దగ్గరే ఆపేశారు. 'నన్ను కృపలానీగారు బీహారు నుండి పిలిపించారనీ, అత్యవసరంగా వారితో మాట్లాడాలనీ' చెప్పాను. ఏం చెప్పినా స్వయం సేవకులు వినిపించుకోలేదు. తిరిగి వచ్చాను. ప్రయత్నం విఫలం అయినప్పటికీ, కాంగ్రేసు స్వయంసేవకుల్లో కనిపించిన అనుశాసనానికి సంతోషించాను. తిరిగి వచ్చాక భగవతీచరణ్ ఇలా అన్నాడు. "సూటు వేసుకుని మోటార్ సైకిల్‌మీద వెళ్ళమని మొదటే చెప్పాను కదా ?" రెండవ మాటు మోటార్ సైకిల్ మీద వెళ్ళాను. సూటూ - బూటూతో, హేట్ పెట్టుకుని వెళ్ళాను. ఈమాటు స్వయం సేవకులు నన్ను ప్రశ్నించలేదు సరికదా, దారిలో అజాగ్రత్తగా నిలబడ్డ తమ సహచరుల్ని కోప్పడి నాకు దారి ఇచ్చారు.

మధ్యాహ్న భోజనం కోసం మీటింగును ఆపారు. అప్పుడే నేను వెళ్ళాను. ఇతర నాయకుల్తో పరిచయం చేస్తారనే ఉద్దేశంతో కృపలానీని కల్సుకున్నాను. ఎదురుగా వరండాలో నిలబడి వున్నారు డాక్టర్ గోపీచంద్ భార్గవ్‌గారు. కృపలానీ వార్ని పరిచయం చేయబోయారు. 'డాక్టరుగారు నన్ను ఎరుగుదురు !' అని చెప్పాను. డాక్టరుగారు చిరునవ్వు నవ్వి, నాతో ఎక్కడ మాట్లాడవల్సి వస్తుందోనని లోపలికి వెళ్ళిపోయారు. అక్కడే సుభాష్‌బాబు నిలబడివున్నారు. వార్ని పరిచయం చేశారు కృపలానీ. సంభాష్ చంద్రబోసు నన్ను చూసి పరమానంద పడ్డారు. రెండు చేతుల్నీ పట్టుకుని ఎంతో ఆత్మీయతతో పలకరించారు. 'మరోప్పుడు విశ్రాంతిగా మాట్లాడుకుందాం !' అన్నారు. నేను రెండుమార్లు తిరగడంతో విశ్రాంతి సమయం కాస్తా అయిపోయింది. మధ్యాహ్న సమావేశానికి గంట మోగుతున్నది. సమావేశంలో బోసే మాట్లాడవల్సి వుంది. ఆ సాయంకాలమే మేము అత్యవసరం అయిన పనిమీద కలకత్తా

వెళ్ళిపోవడం జరిగింది. రహస్య జీవితాన్ని గడుపుతున్న రోజుల్లో మరి ఇక సుభాష్‌బాబును కల్సుకోలేక పోయాను. తరువాత వార్ని నేను మళ్ళీ 1940లో కల్సుకున్నాను. అప్పటికి వారు కాంగ్రెసు అధ్యక్ష పదవికి రాజీనామా ఇచ్చారు. ఫార్వర్డ్ బ్లాక్‌ను స్థాపించడానికి తిరుగుతున్నారు. అప్పుడు నేనూ ప్రెస్ వర్కర్స్ కాన్ఫరెన్సులో పాల్గొనడానికి లాహోరు వెళ్తున్నాను. సుభాష్ బాబు నన్ను గుర్తించారు. ఐతే, వారి ఫార్వర్డ్ బ్లాక్ కార్యక్రమం నాకు నచ్చింది కాదు.

బృందావనం వెళ్ళి 1930 సెప్టెంబరులో మరోమాటు కృపలానీని కల్సుకున్నాను. వైస్రాయి స్పెషల్ ట్రైను కింద బాంబు పేల్చిన విషయాన్ని జ్ఞాపకం చేసి "చూడండి, మేమూ ఊరకా కూచోలేము. మా ఆదర్శం ఏమిటో భగత్‌సింగ్ కోర్టులో ఇచ్చిన వాఙ్మూలంలో స్పష్టం చేయడం జరిగింది. మా ఆదర్శంలో మీకు అభ్యంతరకరమైంది ఏమీలేదే ? గాంధీగారు అనవసరంగా మా కార్యక్రమాల్ని నిరసించే తీర్మానాన్ని లాహోరు కాంగ్రెసులో ప్రవేశపెట్టారు. ఆ తీర్మానం నెగ్గడం ఎంత కష్టమైందో మీకూ తెల్సుగదా ? ప్రజల ఉద్దేశం ఏమిటో, ఎటువైపు వుందో మీకు తెల్సు. మీరు మాకు సాయం చెయ్యాలే గానీ ... !' అన్నాను. వారి అలవాటు ప్రకారం "నీ లెక్చర్ ఆపేసి ఏం సాయం కావాలో చెప్పు ?" అన్నారు. "మీనుండి మేము కేవలం ఆర్థిక సహాయాన్ని మాత్రం కోరుతున్నాం !" అన్నాను.

కృపలానీ ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ఒక చిన్న షరతు పెట్టారు. మా మిత్రులు ఎవరూ ఇక మీదట హింసాత్మక కార్యక్రమాల్లో పాల్గొనకుండా వుంటే, సాధారణమైన జీవనానికి లోటులేని ఆర్థిక సహాయాన్ని అందరికీ కలుగ చేస్తామన్నారు.

కృపలానీగారి షరతు అర్థం లేనిదనిపించింది. నేను ఏ పనులు చేయడానికి ఆర్థిక సహాయాన్ని అడిగానో, అవే పనులు మానుకోవల్సిందని వారు షరతు పెడుతున్నారు. "రహస్యంగా వుండి కేవలం పొట్ట పోసుకోవడం పెద్ద సమస్యేమీ కాదు. ఏ కిళ్ళీ కొట్టు పెట్టుకునో, కార్ఖానాలో పనిచేసో బతగ్గలం. అందుకు మేము మిమ్మల్ని ఆర్థిక సహాయం అడగం. మా ఉద్యమాన్ని నడుపుకోడానికే మేము మీ సహాయాన్ని అడుగుతున్నాము !" అన్నాను.

నేనిలా అనడంతో ఆయనకు కోపం వచ్చింది. "మీకు పిచ్చి పట్టినట్టుగా వుంది. ప్రాణాలిస్తామంటారు. మీకు నా సహకారం ఏమీ వుండదు !" అన్నాడు.

ఇక అతడితో తర్కించి ప్రయోజనం లేదు. ఇలా అన్నాను "మాది పిచ్చే అయినా, మీరనుకున్నంత చెడ్డ పిచ్చి కాదులెండి !"

తరువాత జుగల్‌కిశోర్ ఇలా అన్నారు. "కృపలానీగారు, నీవెప్పుడైనా మీరట్ వెడితే గాంధీ ఆశ్రమంలో తనను కల్సు కోమన్నారు !"

చాలా రోజుల తరువాత మీరట్ వెళ్ళడం జరిగింది. గాంధీ ఆశ్రమానికి కూడా వెళ్ళాను. కృపలానీ అప్పుడు అక్కడ లేరు. ఇప్పుడు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వపు రోడ్డు రవాణాశాఖ మంత్రి విచిత్ర నారాయణ శర్మగారు ఉన్నారక్కడ. నేనెవరో చెప్పాను. కృపలానీ నాకో కవరు ఇవ్వమన్నారని చెప్పి, కవరు తెచ్చి ఇచ్చారు. అవతలకు వెళ్ళి చింపి చూశాను. నూరు రూపాయల నోట్లు రెండో మూడో వున్నాయి. ఒక చీటీ వుంది. ఇలా రాశారు 'For Personal needs' (వ్యక్తిగత ఆవశ్యకతలకు) అంటే, వారిడబ్బు మా 'హింసాత్మక' కార్యక్రమాలకు వాడకూడదని ఉద్దేశం. అది ఎలా సంభవం. మేము బతికివున్నదే ఆ ఉద్యమం కోసం కదా.

అప్పట్లో ఒకమాటు బృందావనం వెళ్ళాను. ప్రకాశవతిని కొన్నాళ్ళపాటయినా సురక్షిత ప్రదేశంలో వుంచాలనుకున్నాను. హంస్‌రాజ్ కోసం లాయల్‌పూర్ వెళ్ళాలి. అక్కడికి వెళ్ళడానికి ముందే ప్రకాశవతిని సురక్షిత ప్రదేశానికి చేర్చాలని ఉద్దేశం ! అప్పటికి ప్రకాశవతి ఇల్లు వదిలివచ్చి ఐదారు నెలలే

అయింది. అంతవరకూ పార్టీ స్థావరాల్లోనే వుంది. కాకపోతే, ఒకరిద్దరు సానుభూతిపరుల ఇండ్లల్లో గడిపింది. అప్పటికింకా ఆమెకు రహస్య జీవిత అనుభవం తక్కువ. ఆ తరువాత రహస్య జీవితాన్ని గడుపుతూనే పేరు మార్చుకుని టీచరుగా కూడా పనిచేసింది. బృందావనంలోని 'ప్రేమ మహా విద్యాలయం' సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనే కాంగ్రెసు కార్యకర్తలకు ప్రధాన స్థావరం. అసలా ప్రదేశం ఇంగ్లీషు ప్రభుత్వానికి పాత శత్రువైన రాజా మహేంద్ర ప్రతాప్ జాగీర్‌లోది. విద్యాలయం ట్రస్టీ ఆధీనంలో వుంది గనకగానీ, లేకపోతే ఏనాడో జప్తు అయ్యేది. ఇప్పటికీ ఆ విద్యాలయం మీద సి.ఐ.డి.లు ఒక కన్ను వేసి వుంచుతారు. అలాంటి స్థితిలో ప్రకాశవతిని ఎక్కువ రోజులు అక్కడ వుంచడం ఉచితం కాదు. ఐతే, అక్కడ అనుకోకుండానే కాలేజీ సహపాఠి మనోహర్‌లాల్ ఖన్నా కలిశాడు. మనోహర్ కూడా మా పార్టీకోసం జయచంద్రజీ ద్వారా ప్రోత్సహించబడిన విద్యార్థులలో ఒకడు. మనోహర్‌ని, జయచంద్రగారు కొన్నాళ్ళు బొంబాయిలోనూ కొన్నాళ్ళు శ్రీలంకలోనూ వుంచారు. విదేశాల నుండి ఆయుధాల్ని తెప్పించుకునే విషయంలో అనుభవం సంపాయించాలని వారి ఉద్దేశం ! ఐతే, నిరాదర్శంగా శ్రీలంకలో వుండవల్సి రావడం వల్ల త్వరలోనే మనోహర్ విసిగి తిరిగి వచ్చేశాడు. పార్టీ కార్యక్రమాలకు దూరం అయ్యాడు. ఇలా జయచంద్రజీ ద్వారా ప్రోత్సహింపబడి, తరువాత పార్టీకి దూరం అయిన మిత్రులు చాలామంది వున్నారు. వాళ్ళు మాకు అప్పుడప్పుడూ అనేకరకాలుగా సహాయాలు చేశారు.

మనోహర్‌కు ఫార్మింగ్ అంటే చాలా ఇష్టం. అప్పట్లో అతడు బులంద్‌షహర్ జిల్లాలోని ప్రేమ మహా విద్యాలయ పరిసర గ్రామాలకూ, ఫార్మ్‌కూ మేనేజరుగా ఉన్నాడు. ఆఫీసు బరాల్ అనే గ్రామంలో వుంది. మనోహర్ ప్రకాశవతికి తన దగ్గర ఉండడానికి అవకాశాన్ని ఇచ్చాడు. ప్రేమ మహా విద్యాలయంలో ఉండగానే ప్రకాశవతికి రాణి అన్న పేరు పెట్టడం జరిగింది. ఆ చుట్టుపట్ల ప్రకాశవతిని అందరూ రాణి అనే పిలిచేవరు. మనోహర్ మొదట్నుండీ మంచి అభిరుచులూ, సంస్కారమూ కలవాడు. ఇప్పుడు ఫార్మ్‌కు మేనేజరయ్యాక దొరల హోదాలో ఉంటున్నాడు. హేటు బిర్జిస్, మోకాళ్ళ వరకు వచ్చే బూటు వేసుకుంటున్నాడు.

చాలా రోజులపాటు ఉద్రిక్తమైన జీవితాన్ని గడిపాము. ఇప్పుడు, మనోహర్ దగ్గర కొంత ప్రశాంతంగా వుంటున్నాము. అతడి దగ్గర పిస్తోలు వుంది. వేటాడటానికి తుపాకి వుంది. వాటికి లైసెన్సులూ వున్నాయి. అతడి దగ్గరున్న ఆ కొద్ది రోజులూ చాలా నిశ్చింతగా గడిపాము. హాయిగా తినడం, నిద్రపోవడం ! నేను కూడా హేటు, బూటూ, బిర్జెస్ వేసుకుని తుపాకి తీసుకుని అతడితోపాటు వేటకు వెళ్ళేవాడిని. వేట అంటే పులుల్ని, సింహాల్ని వేటాడటం కాదు. నోరులేని పక్షుల్ని చంపడం మాత్రమే ! చుట్టపట్ల గ్రామాల్లో చెరువుల ఒడ్డున గద్దల్లాంటి తెల్లని పక్షులుండేవి. వాటినే వేటాడేవాళ్ళం.

మనోహర్ ద్వారా రామ్‌ధన్‌సింహ్ అనే నా కాలేజీ మిత్రుడు ఒకతని అడ్రసు తెలిసింది. రామ్‌ధన్ సింహ్ మాలాగానే విప్లవం కోసం ప్రోత్సహించబడిన విద్యార్థుల్లో ఒకడు. ఐతే, తరువాత జయచంద్రగారి నిరుత్సాహం కారణంగా అతడు ఏ కార్యక్రమాల్లోనూ పాల్గొనకుండా పార్టీకి దూరం అయ్యాడు. అతడి అడ్రసు తెలియడం ఎంతో ఉపయోగకరం అయింది.

రామ్‌ధన్‌సింహ్‌ను కలుసుకున్నాను. వాళ్ళది రైతువారీ కుటుంబం. ఐతే, బి.ఎ. అయ్యాక సేద్యం చెయ్యటం అతనికి ఏమీ నచ్చలేదు. గుమస్తా ఉద్యోగం చేయడమూ అతడికిష్టం లేదు. కాన్పూరులోని తోళ్ళ పరిశ్రమ తాలూకు ట్రైనింగు స్కూల్లో చెప్పులు తయారు చేయడం నేర్చుకోవడానికి చేరాడు. ఈ ఒక్క విషయాన్ని బట్టి అతడిలోని విప్లవాత్మక ప్రవృత్తిని అర్థం చేసుకోవచ్చు. హర్యానా, గుడ్‌గావ్, బులంద్‌షహర్ మొదలైన ప్రాంతాలలోని జాట్ కులస్థులు తమను తాము క్షత్రియులుగానే

భావించుకుంటారు. వాళ్ళ పనిపాటలు, ఆచార వ్యవహారాలు కూడా క్షత్రియోచితంగానే ఉంటాయి. అలాంటి స్థితిలో రామ్‌ధన్‌సింహ్ చెప్పులు కుట్టడం నేర్చుకోవడానికి చేరడం విప్లవాత్మకమైన పరిణామమే.

ఒకరోజున మంచి పరిహాసమే జరిగింది. రామ్‌ధన్‌సింహ్ తండ్రి సైన్యంలో సుబేదారుగా పనిచేసి రిటైర్ అయ్యాడు. పెన్షన్ పుచ్చుకుంటూన్నాడు. నేను రామ్‌ధన్‌సింహ్‌ను చూడ్డానికి వెళ్ళినప్పుడు సాధారణమైన వస్త్రాల్లో ఉన్నాను. రామ్‌ధన్ తండ్రి పెన్షన్ తెచ్చుకోవడానికి ఉదయమే బులంద్‌షహర్ వెళ్ళాడు. అక్కడ ఒక ప్రకటనను చూశాడట. ప్రకటన ఇలా వుంది. "వైస్రాయి స్పెషల్ ట్రైను కింద బాంబు పేల్చిన వ్యక్తిని పట్టి యిచ్చినవారికి 20 వేల రూపాయలు బహుమతి ఇవ్వబడును."

ఆ ప్రకటనను గురించి చెబుతూ రామ్‌ధన్ తండ్రి ఇలా అన్నాడు. "బహుమతి ప్రకటించిన మాత్రం చేత అలాంటి వ్యక్తులు దొరుకుతారా ? అరె, పోలీసులు కాపలా ఉండగానే బాంబు పేల్చేడుగదా ? అప్పుడు కనపడలేదు ఈ నాయళ్ళకు. ఇంక ఇప్పుడు కనబడతాడా ? అసలలాంటి వాళ్ళు మాంచి మంత్రగాళ్ళయి ఉంటారు. వాళ్ళ దగ్గర నక్క కొమ్ము వుంటుంది. నక్క కొమ్ము దగ్గర పెట్టుకున్న మనిషి ఎదురుగా ఉన్నా కనపడడు !"

నేను ఆయనకు ఎదురుగానే కూర్చుని ఉన్నాను. రామ్‌ధన్ సింహ్ చాలా గంభీరంగా తండ్రిని ప్రశ్నించాడు. "ఐతే, నక్క కొమ్ము ఎలా దొరుకుతుంది ?"

తండ్రి "దొరకడం చాలా కష్టం. నూటికి కోటికి ఎక్కడో ఒక నక్కకు కొమ్ముంటుంది. ఐతే, దాన్ని మాయ మంత్రాలు తెలిసిన వాళ్ళు పట్టుకోవలసిందే. మామూలు మనుషులకు తరంకాదు. అదంతా యోగమాయ అనుకో !" అన్నారు.

రామ్‌ధన్‌సింహ్ తండ్రి ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో ఫ్రాన్స్, మెసపటోమియా మొదలైన దేశాలకు వెళ్ళి ఇంగ్లీషు వారి తరపున యుద్ధంలో పాల్గొన్నాడు కూడాను. ఆంగ్ల ప్రభుత్వానికి తన సైనికుల మానసిక సంస్కారాన్ని ఇంతకంటే ఉన్నత స్థితికి తీసుకువెళ్ళడం ఇష్టముండదు !

# మరోమాటు వైర్‌లెస్ కోసం ప్రయత్నం

ప్రకాశవతిని మనోహర్ దగ్గర వుంచి నేను హంస్‌రాజ్ కోసం వెళ్ళిపోయాను. హంస్‌రాజ్‌ను ఎరిగిన మిత్రులందరూ, (ఒక్క సుఖదేవరాజు మినహా) రెండవ లాహోరు కుట్రకేసులోని నిందుతులు. అందరూ అరెస్టయ్యారుకూడాను. కనుక, హంస్‌రాజ్ ఎక్కడున్నాడో తెల్సుకోవడం కష్టం. వాళ్ళ ఇంటికి వెడితేగాని తెలియదు. ఇంటికి వెళ్ళినా, తెలుస్తుందన్న నమ్మకంలేదు. అతడిమీద అరెస్టువారంటున్నట్టు ఇంట్లోనూతెల్సు. వాళ్ళూ అతడి అడ్రసు చెప్పరు. చివరకు నేనే లాయల్‌పూర్ వెళ్ళి, అతడి తల్లిని కల్సుకున్నాను. అతడిని పోలీసుల బారినుండి తప్పించడానికే వచ్చానని చెప్పాను. ఆమెకు నామీద విశ్వాసం కలిగింది. అడ్రసు చెప్పింది. హంసరాజ్, తన అన్న బ్రహ్మదేవ్ దగ్గర వుంటున్నాడు. బ్రహ్మదేవ్ కరాచీలో వోల్కాట్ బ్రదర్స్ కంపెనీలో క్లర్కు.

నేను అక్టోబరు మొదటివారంలో కరాచీ వెళ్ళాను. బ్రహ్మదేవ్ 'గాంధీఖాతా' పేటలోని మూడంతస్తుల మేడలో ఒకగదిలో వుంటూన్నాడు. హంస్‌రాజ్ అక్కడే వున్నాడు. అతడిని కల్సుకుని

మాట్లాడాను. "ఇంక చెయ్యక తప్పేదేముంది ? చేస్తాను" అన్నాడతడు. ఇంద్రపాల్ పొరపాటు పడ్డట్టుచెప్పి, విచారాన్ని వ్యక్తపరిచాను. ఎలా అయితేయేం ? చివరకతడు 'వైర్‌లెస్'ను మా కోసం వినియోగించడానికి సిద్ధపడ్డాడు. ఐతే, తనకు అవుసరం అయిన వస్తువులు కరాచీలో దొరకవన్నాడు. వస్తువులు దొరకడానికి ఒక నెల పడుతుందన్నాడు. నవంబరునెలలో ఒక తారీకును చెప్పి ఆ తరువాత ఎప్పుడైనాసరే వచ్చి బల్బును తీసుకువెళ్లమన్నాడు. ఆబల్బు ఐదువందల గజాలవరకూ విద్యుత్తరంగాలను ప్రసారం చేస్తుంది. ఆ బల్బుతోపాటు ఒక చిన్న సీసా వుంటుంది. ఆ సీసాను బల్బుకు దూరంగా తీసుకువెళ్ళినకొలది బల్బులోనుండి విద్యుత్తరంగాలు ప్రసారం అవుతూంటాయి. సీసా దగ్గరవుంటే బల్బు పనిచేయదు. అతడు మాట్లాడిన పద్ధతినిబట్టి అనుమానించవల్సిన అవుసరం కనుపించలేదు.

కరాచీ నుండి సాయంత్రం ఆరు గంటలకు రైలు బయలుదేరుతుంది. ఆ బండికే తిరుగు ప్రయాణం సాగించాను. రాత్రి ఎనిమిది గంటలాచాయల హైద్రాబాద్ (సింధు) స్టేషన్ చేరింది బండి. ఆ స్టేషన్‌లో తలగుడ్డా, చారలకోటు ధరించిన ఒక వ్యక్తి నన్ను చూపుతూ మరోవ్యక్తితో యేమో చెప్తున్నాడు. గడచిన స్టేషన్‌లో మా పెట్టెలోకి ఒక టికెట్ కలెక్టర్ వచ్చి అందరి టికెట్లనూ 'చెక్' చేశాడు. నా టికెట్టునూ చూశాడు. చూసివెళ్ళి చారలకోటు వ్యక్తితో ఏమిటో మాట్లాడాడు. అప్పుడు నాకు అనుమానం కలగలేదు. ఐతే, ఇప్పుడు ఆచారలకోటు వ్యక్తి మరొకడికి నన్ను చూపుతూ మాట్లాడుతూండేసరికి అనుమానం కలిగింది. 'బ్రహ్మదేవ్ దగ్గర హంస్‌రాజ్ వున్న విషయం పోలీసులకు తెల్సివుంటుంది. అతడి ఇంటి దగ్గర C.I.D. పోలీసులు కాపలావుండి వుంటారు. నేను గమనించకపోవడంతో, వెంబడిస్తూన్నారు.' అనుకున్నాను. నాదగ్గర ఎక్కువ సామాన్లు ఏమీలేవు. ఒకచిన్న బెడ్డింగూ, సూట్‌కేసూ వున్నాయి. సూట్‌కేసులో రెండు మూడు పుస్తకాలూ, అవుసరం అయితే మార్చుకోడానికి ఒకజతబట్టలూ వున్నాయి. రెండో వ్యక్తికి నన్ను చూపించిన చారలకోటువాడు ప్లాట్ ఫారానికి కుడివైపుకు వెళ్ళాడు. ఈ రెండో వ్యక్తి కుచ్చుటోపి పెట్టుకున్నాడు. సిగరెట్టుకాలుస్తూ కనుచివర్ల నుండి నన్ను చూస్తూ గార్డు పెట్టెవరకూ ఒక చక్కరు కొట్టి వచ్చాడు. నేనూ అతడిని గమనిస్తూనేవున్నాను. బండి బయల్దేరబోతోంది. నేను తలుపు దగ్గర నిలబడి తొంగి చూస్తూన్నాను. ఏదైతే అదవుతుంది, బండి బయల్దేరాక దిగిపోవాలనుకున్నాను. బండి బయల్దేరింది. వేగం పుజుకోకముందే రెండో వైపుకు దూకేశాను. వెనక్కితిరిగి వెళ్ళిపోసాగాను.

బండి వెళ్ళిపోయింది ప్లాట్ ఫారం చివర నుంచుని వున్నాడు ఆ చారలకోటు మనిషి కరెంటులైట్ల వెలుగులో అతడూ నన్ను చూశాడు. అతడు 'పట్టుకోండి పట్టుకోండి' అని అరుస్తాడేమోననిపించింది. కోటు జేబులోవున్న పిస్తోల్‌మీదకు చెయ్యిపోనిచ్చాను. అతడు అరవలేదు. నన్ను చూడనట్టు నటించాడు. ప్లాట్‌ఫారందాటి అవతలకు వెళ్ళాను. వెలుగు సన్నగిల్లింది. పరిసరం బొత్తిగా తెలియదు. ఐనా, ఎలాగైనా తప్పించు కోవాలిగనుక పడిపోతూన్నాను. ఒక యాభైగజాలువెళ్ళి వెనక్కుతిరిగి చూశాను. అతడు నన్ను వెంబడిస్తూ గబగబా వచ్చేస్తున్నాడు. నేను త్వరత్వరగా వెళ్తూన్నాను. అతడూ అంతే తొందరగా నన్ను వెంబడిస్తూన్నాడు. అపరిచిత ప్రదేశంలో అలా ఎంతదూరమని వెళ్ళగలను ? నాకు రెండు వైపులా రెండు గూడ్సు బండ్లున్నాయి. మధ్యనున్న ఖాళీలైనుమీద నేను నడిచిపోతూన్నాను. రెండు గూడ్సుపెట్టెల మధ్యకువెళ్ళి రక్కిన ఆగిపోయాను. నన్ను అనుసరిస్తూన్న అతడు నడకవేగంవల్ల నన్ను దాటి ఒక అడుగు ముందుకుపోయాడు. మొదటే పిస్తోల్ని చేతిలోకి తీసుకుని వున్నానేమో, ముందుకుపోయిన అతడి మీదకు లంఘించి, పిస్తోలుతో అతడి చెవులమీదా, చెంపలమీదా విస్సురుగా కొట్టాను. అతడి తలపాగా కిందపడిపోయింది. రెండు చేతులతో తలను పట్టుకుని కిందకూలబడ్డాడు.

ఒక్కోప్పుడు తర్కానికీ, విశ్లేషణకు అవకాశంలేనిస్థితి ఏర్పడుతుంది. అలాంటిస్థితిలో మనిషి తన ఊహాపోహల సాయంతో సందర్భోచితంగా వ్యవహరిస్తాడు. అప్పుడు గనుక నేను అతణ్ణి అలాగే ముందుకు పోనిచ్చి, నేను వెనక్కుతిరిగి స్టేషన్‌కు వచ్చినట్లయితే ఏమయ్యేది ? అతడూ స్టేషన్‌కు వచ్చేవాడు. స్టేషన్‌లో నన్ను చూశాక ఇంక అతడు ఏమైనా చేస్తానంటాడు. పోనీ, స్టేషన్‌లోకి వెళ్ళకుండా ఊళ్ళోకి వెళ్దామా అంటే, అప్పటివరకూ నేనాపట్నాన్ని చూడలేదు. అసలతడు మొదటే సాయంకోసం నలుగుర్ని ఎందుకు కేకవేయలేదు ? ఏమో, ఎందుకు వేయలేదో ? సరే, అతడు తలపట్టుకు కూలపడగానే నేను పిస్తోలును అతడి ముక్కుకు గురిపెట్టి, కటుస్వరంలో తిడుతూ "కాల్చిపారేస్తాను. ఎందుకు వెంటపడ్డావ్ ?" అనడిగాను. అతడు సమాధానం చెప్పలేదు. చేతులు జోడించి దణ్ణం పెట్టాడు. పిస్తోలు పేల్చలేదు. పేలిస్తే ఆ శబ్దానికి నలుగురూ పోగవుతారు. నేనే ఇబ్బందికి లోనవుతాను. మరోమాటు అతణ్ణి డబాయించాను. "వెంట పడ్డావా పేల్చిపారేస్తాను. జాగ్రత్త" అన్నాను.

ఇంతలో బండికి అటువైపున ఎవరో రాళ్ళమీద నుంచి నడిచివస్తూన్న శబ్దం అయింది. ఆవ్యక్తి స్టేషన్‌వైపు నుంచీ వస్తూన్నాడు. ఫెన్సింగ్‌నుదాటి బయటకు వెళ్ళడానికి అక్కడో చిన్నమార్గం వుంది. అతడు అటువైపు నుండి బయటకు వెళ్ళిపోయాడు. ఆ మార్గాన్ననుసరించి నేనూ బయటకు వెళ్ళాను. ఇక ఇప్పుడు బయటి అంధకారంలో, రోడ్డుపైన నిలబడి వున్నాను.

కానీ, ఎక్కడికి వెళ్ళగలను ? ఆ పట్నంలో నాకు ఎవరూ పరిచయులులేరు. కప్పుకోనూ, కట్టుకోనూ - ఏ ఒక్కటీ దగ్గరలేదు. నాటిక్కెట్టు ఎక్కడికో నోటుచేసుకుని వుంటారు. నంబరు కూడా నోటుచేసుకుని వుంటారు. లాహోరుకు టిక్కెట్టు తీసుకున్నాను. దాన్ని అక్కడే పారేశాను. నేను తొడుక్కున్న కోటును విడిచి అక్కడే చీకట్లో పారేశాను. ధోవతిని మడిచి అడ్డకట్టు కట్టుకున్నాను. ఐతే, అలాంటి వేషంలో నన్నోగుండాగా భావించి పట్టుకుంటారేమోననీ భయపడ్డాను. అన్నింటి కంటే ప్రధానమైన విషయం నన్ను వెంటాడినవ్యక్తి, తిరిగి నన్ను వెతుక్కుంటూ స్టేషన్‌కు వచ్చాడా, నే నేవిధంగానూ తప్పించుకోలేను. ఐతే, అతడలారాడన్న విశ్వాసం నాకు ఉంది.

సమ్మాసట్టాకుబండి ఎన్ని గంటలకో ఒక కూలీని అడిగి తెల్సుకున్నాను. ఇంకో గంటకు బండి వుంది. నేను మూడవతరగతి ప్రయాణీకుల్లోకివెళ్ళి కూచున్నాను. బండి రావడానికి సూచనగా గంట కొట్టారు. టిక్కెట్టు కొనుక్కుని, బండివచ్చాక మూడవతరగతి పెట్టెలోపైన ధోవతి కప్పుకు పడుకున్నాను. వెంటనే నిద్ర ఏంపడుతూంది ? తప్పించుకున్నందుకు సంతోషడ్డాను.

సమయం గడచినకొద్దీ ప్రశాంతత ఏర్పడసాగింది. శాంతిగా ఆలోచించసాగాను. 'ఇతడు నన్ను బ్రహ్మదేవ్ ఇంటిదగ్గర నుంచే కాదు వెంటాడడం, అంతకు చాలా రోజుల క్రితం 1928లో, నేను నౌజవాన్ భారతసభలో ఉత్సాహంగా పాల్గొనే రోజుల నుండి వెంటాడుతూ వుండవచ్చు' అనిపించింది, ఒకవేళ హంస్‌రాజ్‌ను అరెస్టు చేస్తే ? ఇక నేను మళ్ళీ కరాచీ రావడం అనవసరమే అవుతుంది గదా?

భటిండా మీదుగా ఢిల్లీ చేరుకున్నాను. పరిస్థితి అధ్వాన్నంగా తయారయింది. బట్టలు బాగా మాసిపోయాయి. గడ్డం పెరిగింది. రోహతక్‌లో కిష్టిగాడి వేషంలో వుండేప్పుడూ ఇలాంటి మాసిన గుడ్డలే వేసుకునేవాడిని, ఇలాగే గడ్డం పెరిగేది. ఐతే, అప్పుడు కావాలని అలావున్నాను. ఇప్పుడో, తప్పనిసరి! ఝుండావాలా పేటలోని బాంబు ఫ్యాక్టరీకి తీసుకున్న ఇంటిని ఖాళీచేశాము. ఢిల్లీ ఇన్‌చార్జికైలాసపతినిగానీ, ఆజాద్‌నుగానీ కల్సుకోడానికి వీల్లేకుండా వచ్చింది. ప్రొఫెసర్ నందకిశోర్ నిగం దగ్గరకు వెడితేగాని వాళ్ళు ఎక్కడవున్నదీ తెలియదు. రెండు మార్లు టిక్కెట్టుకొనుక్కుని ఢిల్లీ వచ్చేసరికి నా జేబులో డబ్బులన్నీ ఖర్చు అయ్యాయి. ఆరు పైసలు మాత్రం మిగిలాయి. ప్రొఫెసర్ నిగం యమునానది వొడ్డున హిందూ హాస్టలు దగ్గర ఉంటున్నాడు. అక్కడికి టాంగాలో వెళదామన్నా బాడుగకు డబ్బులు లేవు. కార్తీక

మాసపు ఎండ ఫెళ్ళునకాస్తున్నది. కాలినడకనే, ఆ ఎండలో, హాస్టలువరకూ వెళ్ళాను. కైలాసపతి హాస్టలు నుండి బయటికివస్తూ అనుకోకుండా కనుపించాడు. బాంబు ఫాక్టరీ ప్రసంగంలో చెప్పినట్టు అతడిప్పుడు వెనుకటి కైలాసపతికాడు. వెనక పుష్య మాసపు చలిలో స్వెట్టరులేకుండానే వుండేవాడు. మనం ఇచ్చినా దానిని మరో మిత్రుడికి ఇచ్చి తాను మాత్రం చలికి బాధపడుతూండేవాడు. ఇప్పుడు మనిషిలో చాలా మార్పువచ్చింది. బాగా గంజిపెట్టిన ఫెళ ఫెళలాడే ఇస్త్రీ బట్టలు వేసుకున్నాడు.స్నో పౌడర్ల సువాసనలు గుబాళిస్తున్నాయి. చలవ కండ్లజోడు పెట్టుకున్నాడు. అతడి యీ వేషాన్ని చూసి 'ఠండీకి నీరు వంట పడుతున్నది' అని ఆజాద్‌తో అనేవాడిని.

అప్పటి నా స్థితినిబట్టి అతడి అలంకరణ నాకుమరీ బాధకలిగించింది. నేను అతడితో కటువుగా, యీసడింపుగా మాట్లాడాను. అతడు మాత్రం గంభీరంగా వున్నాడు. "ఇప్పుడిక్కడ ఆజాద్‌గానీ, నిగమ్‌గానీ - ఎవరూ లేరు" అని అన్నాడు. ఆజాద్ కాన్పూరు వెళ్ళేడని తెలిసింది. నా పరిస్థితినిచెప్పి అధికారయుత స్వరంలో డబ్బు ఇమ్మని అడిగాను.

"ఇప్పుడు లేవు" అన్నాడు. బహుశా యీసడింపుగా నేను మాట్లాడిన మాటలకు ఇది ప్రతీకార చర్య కావచ్చును.

మళ్ళీ కాలినడకన ఢిల్లీ వచ్చాను. ఎక్కడికి వెళ్ళేట్టు ? ఖయాలీ రామ్ గుప్త దగ్గరకు వెడితే, అతడి తల్లి గోలపెట్టేస్తూంది. అజ్‌మేరీ దర్వాజా దగ్గరున్న శ్రీ కృష్ణగారింటికి వెళ్ళడం సబబుకాదు. వారింటిని పోలీసులు ఒకమాటు సోదా చేశారని వెనకే చెప్పాను.

ఆకలితో అటూ ఇటూ తిరుగుతున్నాను. కైలాసపతి ప్రవర్తన, ఆకలికంటె గూడా అధికంగా బాధపెట్టూన్నది. జేబులో ఆరు పైసలు ఉన్నాయి. ఏ సెనగపప్పో కొనుక్కుతిని ఆ రోజు వెళ్ళబుచ్చవచ్చు. కానీ, కాన్పూరు ఎలా వెళ్ళడమా ? అన్న సమస్య మనస్సును పీడిస్తూన్నది. ఆకలి తెలియడం లేదు. అప్పటికింకా పొగ తాగడం అలవాటు కాలేదు నాకు. కానీ, ఏం బుద్ధిపుట్టిందో తెలియదు, జేబులోవున్న ఆరు పైసలు పెట్టి ఒక సిగార్‌కొన్నాను. సాయంత్రపు మసక చీకట్లో పరేడ్ మైదానంలో కూచుని సిగార్ తాగసాగాను. కైలాసపతిమీది కోపాన్ని అలా తీర్చుకుంటున్నాను. మాలో ఒకరిమీద ఒకరికి ఎంత అయిష్టత వున్నా, ఒకరు ప్రమాదంలో చిక్కుకొన్నప్పుడు నిర్లక్ష్యం చేసేవారం కాదు. సిగార్ తాగడంవల్ల తల తిరుగుతోంది. కక్కు వచ్చేట్టుగా వుంది. మసీదుకు సమీపంలో వున్న పంపు దగ్గరకు వెళ్ళి ఒట్టి కడుపునిండా నీళ్ళు పట్టించాను. దాంతో మనిషిని మరీ డీలాపడిపోయాను. పరేడ్ గ్రౌండ్సులోకి వెళ్ళి పడుకున్నాను. నేను చాలా మూర్ఖంగా ప్రవర్తిస్తున్నాననిపించింది. జేబులో పిస్తోలువుంది. అలా పడుకుని వుండగా చూసి ఎవడైనా పోలీసు స్టేషనుకు లాక్కెడితే ఏం కాను ?

యాభై సంవత్సరాల సుదీర్ఘ జీవితంలో నేను చాలా చూశాను. అనుభవించాను. కానీ, డబ్బులు లేకపోవడంవల్ల పస్తు పడుకున్న రోజు అదొక్కటే. శ్రీకృష్ణగారింటికి వెళ్ళక తప్పదనిపించింది. అక్కడ నుంచి లేచి అజ్మేరీ గేటువైపు వెళ్ళాను. చావడీ బజారు, ఫతేహపురి - వీటికి మధ్యనున్న మార్గంగుండా వెడుతూన్నాను. రోషన్ సినిమా దగ్గరకు వచ్చే సరికి రాత్రి తొమ్మిదయింది. ఆ రోజుల్లో ఆ ప్రదేశాల్లో చౌకబారు జీవితాన్ని గడిపే వేశ్యలు వుండేవారు. పరిసరం నిర్మానుష్యంగా వుంది. నేను మెల్లగా నడిచి వెడుతున్నాను. నన్ను విటుడిగా భావించారు గావును, రోడ్డుకు రెండు వైపుల నుండి "ఇటురా, ఇటురా" అని వేశ్యలు పిలువసాగారు. వీళ్ళకు నాలాగానే ఆకలివేస్తూ వుండవచ్చు' అని అనుకున్నాను. ఈ అనుభూతి మనస్సులో పీఠం వేసుకు కూచుంది. తరువాత 1938లో ఈ అనుబవం ఆధారంగా 'జోగీ - జోగీ' అన్న కథనురాశాను.

శ్రీకృష్ణగారింటికి వెళ్ళక తప్పిందిగాదు. ఆయన ఇంట్లోనే వున్నాడు. నేను అలాంటి స్థితిలో, అనుకోకుండా వెళ్లడంవల్ల నిర్విణ్ణుడయ్యాడు. 'నేను ఇక్కడకు రాకూడదు. ఐతే, రాక తప్పిందికాదు.' అంటూ క్షమాపణ చెప్పుకున్నాను. మంచి గుడ్డలు, కొద్దిగాడబ్బు కావాలని చెప్పాను. ఏ విషయాన్నైనా గుచ్చి గుచ్చి అడగటం ఆయన అలవాటు. ఆ రోజున ఎందుకనో నన్నేమీ అడగలేదు. గుడ్డలూ, డబ్బూ ఇచ్చాడు. అక్కడే గడ్డంచేసుకుని స్నానంచేసి బట్టలు మార్చుకున్నాను. వారింటికి వెళ్ళినప్పుడు, వదినెగారు భోంచేయకుండా రానివ్వరు.

నేను ఆజాద్ కోసం కాన్పూరు వెళ్ళాను. అక్కడ తనను కల్సుకోవడానికి గుల్జారీలాల్ అడ్రసు చెప్పాడు ఆజాద్. సంధ్యా సమయానికి ఆ అడ్రసుకు వెళ్ళాను. గుల్జారీలాల్ సన్నగా పొడుగ్గా వుంటాడు. గోధుమరంగు శరీరం, కోర మీసాలు, నేనతన్ని ఆజాద్‌ను గురించి అడిగాను. అతడు నా వైపు మౌనంగా చూస్తూ వుండిపోయ్యాడు ఒక క్షణం. తరువాత "సరే, సరే కూర్చోండి" అన్నాడు.

అదొక చిన్నగది. ముందు వరండా వుంది. గుల్జారీ లాల్ ఒంటరిగానే వుంటూన్నాడా గదిలో. గదిలో మంచంవేసి దుప్పటిపరచి నన్ను కూచోపెట్టాడు. వరండాలో ఉన్న పొయ్యిని ముట్టించి పనసకాయ తరుగుతూ కూచున్నాడు. నే వచ్చినట్టు ఆజాద్‌కు కబురు పంపమని మరో మాటు జ్ఞాపకం చేశాను. "ముందు మీ భోజనం కానియ్యండి"' అన్నాడు. గుల్జారీలాల్ కూరకోసం పనసకాయ తరుగుతూ ! ఆకలిలేదనీ, బలవంతం చేయవద్దనీ చెప్పాను. అతడు వినలేదు. పనసకాయ, తరిగి పొయిమీద పెట్టాడు పూరీలు చెయ్యడానికి గోధుమపిండి కలపసాగాడు. అనవసరంగా శ్రమపడవద్దని చెప్పాను. ఆయన వినలేదు. నాకు బాగా జ్ఞాపకం, భగోణీ లేకపోవడంవల్ల లోతుగా వున్న పెనంమీదనే ఎక్కువ నెయ్యి పోసి పూరీలు చేశాడు. ఎంతో భక్తితో నాకు భోజనం పెట్టాడు. యు.పి.లో వుండడమూ, పనసకాయ కూర తినడమూ - రెండింటికీ అదే ప్రథమం. పనసకాయ కూర ఎప్పుడు తిన్నా గుల్జారీలాల్ వంట జ్ఞాపకం వస్తుంది. భోజనమయ్యాక కంచం నన్ను కడుక్కోనివ్వలేదు.

భోజనంపెట్టి ఆజాద్‌కు నేను వచ్చానని చెప్పడానికి వెళ్ళాడు గుల్జారీలాల్. ఆజాద్ పది గంటలాచాయల వచ్చాడు. మేమిద్దరం మాట్లాడుకుంటూంటే గుల్జారీలాల్ దూరంగా వెళ్ళి కూచున్నాడు. కాన్పూరు మున్సిపాలిటీలో, రోడ్లమీద నీళ్ళు చల్లే బస్సు డ్రయివరుగా పనిచేస్తున్నడు గుల్జారీలాల్. ఆ తరువాత ఇంకొక్క మాటు మాత్రమే అతన్ని కల్సుకున్నాను. అతడి ఆకారాన్నీ, శ్రద్ధాభక్తుల్నీ నేను ఇప్పటికీ మర్చేపోలేదు. భయ్యాకు ఇలాంటి విశ్వాసపాత్రులైన వ్యక్తిగత మిత్రులు చాలామంది ఉన్నారు. కరాచీలో హంసరాజు పెట్టిన గడువునూ, దారిలో సంభవించిన ప్రమాదాన్నీ ఆజాద్‌కు చెప్పాను. హంసరాజ్ అరెస్టయితే పత్రికల్లో వార్తవచ్చేదే ఈపాటికి. అప్పటికీ నాలుగయిదు రోజులపాటు ఉదయాన్నే పత్రిక చూశాము. హంసరాజ్ అరెస్టు అయ్యాడేమోనని.

అక్టోబరు నెల చివరి రోజులు 30వ తారీకనుకుంటాను. కైలాసపతి అరెస్టయ్యాడన్న వార్త పత్రికల్లో వచ్చింది. అప్పట్లో కైలాసపతి ఢిల్లీలో, పెద్దగా కార్యక్రమాల్నేమీ నడపడంలేదు. కాకపోతే, అజ్మీరులో మనియాక్షన్ (దోపిడి)కు అవకాశం వుదని ఆజాద్‌కు చెప్పాడు. ఒకటి రెండుమార్లు అజ్మీరుకు వెళ్ళివచ్చాడు. తరువాత పరిస్థితుల్ని అవగాహన చేసుకోవడం కోసం మదనగోపాల్‌ను అక్కడ వుంచడం జరిగింది. ఢిల్లీలో అతడు ఏమంత ఆర్థిక బాధలోనూలేడు. అతడు తన ఇంట్లోనే అరెస్టయ్యాడు. అప్పుడతని దగ్గర పిస్తోలుగూడా వుంది. ఐనా అతడు ఆత్మరక్షణకూ ప్రయత్నం చేయలేదు. పోలీసులమీద దెబ్బతీయడానికీ ప్రయత్నం చేయలేదు. ఇలా మౌనంగా అరెస్టవడాన్ని గురించి విని ఆజాద్ నిరాశగా "ఈ నాయలా జారిపోయాడు" అన్నాడు.

కైలాసపతి అలా ఏ మాత్రం వ్యతిరేకించకుండా అరెస్టవడంవల్ల ఎంతో నిరాశపడ్డాము. అప్పుడే నేను ఆజాద్‌తో ఇలా అన్నాను. 'ఇతడు ప్రభుత్వసాక్షి ఔతాడని నాకు అనుమానంగా వుంది.' నేను కైలాసపతిని వ్యక్తిగతంగా ద్వేషిస్తూండడంవల్ల అలా అనుమానిస్తున్నానని ఆజాద్ అనుకున్నాడు. కానీ, నేను నా అనుమానానికి కారణాల్ని స్పష్టం చేశాను. సంవత్సరం క్రితం అరెస్టయివుంటే నేనతనిని ఇలా అనుమానించేవాడిని కానని, ఈ మధ్య అతడిలో అనుమానించతగినంతగా విలాస ప్రవృత్తి పెరిగిందనీ చెప్పాను. ఐతే, నా మాటల్ని ఆజాద్ అంతగా పట్టించుకోలేదు. కైలాసపతీ, ఇతర మిత్రలూ నామీదా ఇలాంటి అపరాధాన్నే మోపారు. నేను విలాసాల్లో కొట్టుకుపోతున్నాననీ, దుబారా ఖర్చులు పెడుతున్నాననీ అన్నారు. దీన్ని గురించి లోగడే చెప్పాను. ఏకగ్రీవంగా పది పన్నెండు గంటలపాటు పిక్రిక్ యాసిడ్‌ని తయారు చేస్తుండేవాళ్ళం. ఆ విషవాయువులవల్ల తలనొప్పి పట్టుకునేది. మంచి గాలికోసం ఒకగంట టాంగాలో తిరిగొచ్చేవాళ్ళం. ఏదయినా రెస్టారెంట్‌లో ఐస్‌క్రీం తినేవాళ్ళం. ఇదీ అప్పటి మా విలాస ప్రవృత్తి. నిజం చెప్పాలంటే విలాసం అనేది వస్తువుల్లో లేదు, దృష్టి కోణంలో వుంది.

ఆ రోజుల్లో ఢిల్లీలో ధన్వంతరీ అరెస్టయ్యాడని తెలిసింది. పత్రికల వార్తల ప్రకారం, ధన్వంతరీ మరో మిత్రుడితో కలసి టాంగాలో చాందినీ చౌక్‌గుండా వెళుతున్నాడు. పోలీసులు అతడిని గుర్తించి వెంబడిస్తున్నారు. అనువైన ప్రదేశాన్ని చూసుకుని పోలీసులు చుట్టుముట్టారు. ధన్వంతరీ వెంటనే రివాల్వర్ బయటకుతీసి పోలీసులపై కాల్పులు జరిపాడు. కొందరు పోలీసులు గాయపడ్డారు కూడాను. అదే అదనని ధన్వంతరీ టాంగాదిగి పారిపోవడానికి ప్రయత్నించాడు. ఇంతలో పోలీసులు 'పట్టుకోండి పట్టుకోండి' అని కేకలు పెట్టారు. అప్పుడు చాందినీ చౌకులో గస్తీ తిరుగుతున్న పోలీసు పారిపోతున్న ధన్వంతరీని తన చేతిలోని లాఠీతో విసురుగా కొట్టాడు. ధన్వంతరి కిందపడిపోయాడు. పోలీసులు అతడిని పట్టేశారు. అతడి పక్కనున్న మిత్రుడు సుఖదేవ్‌రాజ్ పారిపోయాడు, అలా పారిపోకుండా తనూ పోలీసులపై కాల్పులు జరిపితే ? ఇద్దరూ కలసి పోరాడితే ఎలావుండేది ? ఆపదలో వున్న మిత్రుడ్నివదలి సుఖదేవరాజ్ అలా పారిపోవడం ఇది రెండవమాటు.

కైలాసపతి అరెస్టయిన వారంలోపలే బాబూరాం, ఖయాలీరామ్ గుప్తా, గిరివరసింహ్, విమల్ - మొదలయిన వాళ్ళందరూ అరెస్టయ్యారు. ఢిల్లీలో మా పరిస్థితి విషమంగా తయారయింది. ఇతర చోట్ల ఈ అరెస్టులు బాగా ప్రభావాన్ని వేశాయి. ఆజాద్ నన్ను కాన్పూర్ వచ్చి వుండమని సలహా ఇచ్చాడు. అప్పటికి కాన్పూరులో నాకెవరూ మిత్రులు లేరు. ఆజాద్ ముంషిరాంశర్మ 'సోమ్' గారిదగ్గర నేనూ ప్రకాశవతి - కొన్నాళ్ళుండడానికి ఏర్పాటు చేశాడు. ముంషీరాంగారు అప్పట్లో గంగానది ఒడ్డున పర్మట్ ఘాట్‌లో వుంటున్నారు. డి.ఏ.వి. కాలేజి అధ్యాపకులు ! నాలుగువైపులా అరెస్టులు ముమ్మరంగా జరుగుతున్న రోజుల్లో- మేము ఎవరమో, మాకు ఆశ్రయంయిస్తే ఎలాంటి ఇబ్బందుల్ని ఎదుర్కోవలసి వస్తుందో బాగా తెలిసే వారు మాకు ఆశ్రయాన్నిచ్చారు.

మున్షీరాంగారిల్లు పర్మట్ ఘాట్‌లో రోడ్డుకవతల ఉన్నది. కనుక మరోచోట ఎక్కడయినా ఆశ్రయాన్ని చూసుకోవాలను కున్నాము. కాన్పూరు గవర్నమెంటు లెదరువర్కింగ్ స్కూల్లో చౌధరీరామ్‌ధనసింహ్ పనిచేస్తున్నాడు. అడ్రసు తెలుసుకుని అతడిదగ్గరకు వెళ్ళాను. అతడు అప్పుడు బోర్డింగ్‌లో వుంటున్నాడు. మాకు సహాయం చేయడంకోసం, చున్నీగంజ్‌లో, మేడమీద రెండవ అంతస్థులో, పోర్షను నొకదాన్ని అద్దెకు తీసుకున్నాడు. మేము అక్కడికి వెళ్ళిపోయాము.

కైలాసపతి అరెస్టవడంతో అజ్మీరులో చేయాలనుకున్న దోపిడీ జరగలేదు. ఆజాద్ ఆర్థిక సమస్యల్ని పరిష్కరించడం కోసం ఒక దోపిడీకి ఏర్పాటు చేయవలసిందని వీరభద్రకు చెప్పాడు. మాకు ఆర్థిక బాధ ఎప్పుడూ వుంటుంది. నేరుగా ప్రజలందగ్గరకు వెళ్ళి అడిగే అవకాశం లేకపోవడంవల్ల

కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీల్లా ధనోపార్జన చేయగలిగే వాళ్ళుంకాదు. జాతీయ భావనగల వ్యక్తులు వందా, రెండువందలు సహాయం చేయగలవారూ కొందరున్నారు. అలాంటి వారిమీద గాంధీగారి మాటల ప్రభావం బాగా పడేది. గాంధీగారు మమ్మల్ని దారి తప్పిన దేశభక్తులనేవారు. స్థితిపరులైన, జాతీయభావంగల వ్యక్తులు మమ్మల్ని దుస్సాహసులైన దేశభక్తులుగా భావించేవారు. మా దర్శనాన్నయితే చేసుకునేవారు. కానీ, ఆర్థిక సహాయం దగ్గరకువచ్చేసరికి వెనకాడేవారు. మాకు ఆర్థికసహాయం చేయడం ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమే ఔతుంది. పైగా, గాంధీగారు విప్లవకారులకు సహాయం చేయవద్దని ఒకటేగోల పెడుతున్నారాయె ! మా దర్శనాన్నికోరే జాతీయభావంగల వ్యక్తుల దృష్టిలో మా వ్యక్తిగత ఔసరాలే మెదుల్తూ వుంటాయి. వారు మా ఉద్యమానికి ప్రాధాన్యత నివ్వరు. ఇలాంటి దృష్టికోణానికి ఉదాహరణగా బాబూ పురుషోత్తమదాసు టండన్‌గారి ప్రవర్తనను చెప్పవచ్చును. ఇప్పుడు చెప్పబేయే విషయం సాండర్సు వధ తరువాత 1928 సెప్టెంబరులో జరిగింది.

సాండర్సు వధ తరువాత మాపార్టీ మిత్రుల్ని లాహోరు నుంచి ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్ళవల్సి వచ్చింది. అప్పట్లో పురుషోత్తమదాసు టండన్ పంజాబు నేషనల్ బ్యాంకీ, లాహోరు శాఖకు మేనేజరు. జీతం 800 వరకూ వుంటుంది. అప్పటి ధరలకూ, ఇప్పటి ధరలకూ వున్న వ్యత్యాసాన్నిబట్టి, ఆ జీతాన్ని ఇప్పుడు 3500కు సమం అనవచ్చును. టాండన్‌గారు, లాలా లజపతిరాయ్‌గారు వుంటున్న ఆవరణలోనే ఒక డాబాలో వుంటున్నారు. ఆ ఆవరణలోనే ద్వారకాదాసు పుస్తకాలయం వుంది. కాన్పూర్‌కు చెందిన ప్రసిద్ధ కార్మిక నాయకులు రాజారాంశాస్త్రిగారు, అప్పట్లో ఆ పుస్తకాలయానికి లైబ్రరియన్‌గా వుంటుండేవారు. ఆజాద్, శాస్త్రిగారు పాతస్నేహితులు. వారు బనారస్‌లో వుండగా స్నేహితులయ్యారు. శాస్త్రీగారు భగత్‌సింగ్‌నూ, సుఖదేవ్‌నూ, నన్నూ - ఇంకాకూడా మా మిత్రుల్ని కొందర్ని ఎరుగుదురు ! ఆజాద్, శాస్త్రిగారి ద్వారా టండన్‌గార్ని కల్సుకోవడానికి సమయాన్ని నిర్ణయించుకున్నాడు. ఆజాద్‌ను కల్సుకోవడానికి టండన్ భయపడనూలేదు. సంకోచించనూ లేదు. చాలా స్నేహంగా ఆజాద్ వీపునిమురుతూ "మీ పద్ధతుల్ని సిద్ధాంతాన్ని మేము ఒప్పుకోము. ఐనా, మీ దేశభక్తినీ, వీరత్వాన్ని కాదనలేము !" అన్నాడు.

ఆజద్ ఎవరినీ ఏమీ అడగలేడు. అలా అడగడానికి చాలా బాధపడతాడు. ఐనా, ప్రాణాల్ని ఉగ్గపట్టుకుని ఆర్థికసహాయాన్ని అడిగాడు. టండన్‌గారు ఏ మాత్రం సంకోచించకుండా, కూతుర్నిపిల్చి పది రూపాయలు తెచ్చియివ్వమని చెప్పారు. అలాంటి స్థితిలో ఆజాద్ కళ్ళు చింతనిప్పుల్లా ఎర్రబడడం తథ్యం ! అప్పుడేకాదు, ఈ విషయాన్ని చెప్పినప్పుడల్లా ఆజాద్ కోపంతో మండిపడేవాడు. ఐతే, టండన్‌గారిమీద ఉన్న గౌరవాన్ని, సభ్యతను దృష్టిలో వుంచుకుని కోపాన్ని దిగమింగడం కాక ఆజాద్ చేయగలిగింది ఏముంది ? ఈవిషయాన్ని ఎందుకు చెప్తున్నానంటే టండన్‌గారి జీవితం త్యాగమయమైంది. వారిలో లోభితనం అన్నదిలేదు. అప్పుడు వారు మంచిస్థితిలోనూ వున్నారు. వారి దృష్టిలో ఆజాద్‌కు పదిరూపాయిలకు మించిన ఆర్థిక అవుసరాలు ఏముంటాయి గనుక ? ఇలాంటి అనుభవాల కారణంగా, మేము రాజకీయ దోపిడీలకు పాల్పడక తప్పలేదు !

1930 సం॥ చివరిరోజులు. లండన్‌లో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ ద్వారా ఇంగ్లీషు ప్రభుత్వంతో రాజీబేరాలు సాగుతున్నాయి. కాన్ఫరెన్సులో పాల్గొనడానికి ఇంగ్లీషు ప్రభుత్వం కాంగ్రెసును కూడా ఆహ్వానించింది. ఈ కాన్ఫరెన్సులో స్వరాజ్యానికి రూపురేఖలు ఏర్పడతాయనీ, సంతృప్తికరమైన పరిష్కారం జరుగుతుందని అనుకుంటున్నారు. అలాంటి స్థితిలో కాంగ్రెస్‌కు అనుగుణమైన జాతీయ భావనగల వ్యక్తులు విప్లవకారులకు సహాయం చేసి, తద్వారా ఇంగ్లీషు ప్రభుత్వానికి నొప్పి కలిగిస్తారా?

# కాన్పూర్‌లో మనీయాక్షన్

పార్టీ అతి ఘోరమైన ఆర్థిక బాధల్లో చిక్కుకుంది. ఆజాద్ మాటిమాటికీ వీరభద్ర తివారీతో 'మనీయాక్షన్' (దోపిడీ)కు ఏర్పాటు చేయవల్సిందని చెప్తున్నాడు. మేము 'దోపిడీ' అన్న శబ్దాన్ని వాడే వాళ్ళం కాదు. తప్పని సరై డబ్బుకోసం బల ప్రయోగం చేయవల్సివస్తే, దాన్ని 'మనీయాక్షన్' అనిగానీ 'ధనకార్య' అనిగానీ అనేవాళ్ళం ! ఈ బాధ్యతను వీరభద్రకే వప్పగించడానికి ఒక కారణం వుంది. అతడు ప్రతి విషయంలోనూ తప్పించుకోవడంకోసమే ప్రయత్నిస్తున్నాడేమోనన్న అనుమానం మాకుంది. నా విషయంలో అతడే రహస్యాన్ని చెప్పివుంటాడన్న అనుమానం ఆజాద్‌కు ఎటూవుంది. పైగా, ఏదైనా బాధ్యతను వప్పగించినప్పుడు అతడు చేస్తానని వప్పుకుంటాడు. కానీ, సమయానికి ఏదో అనివార్యమైన కారణాన్ని చెప్పి తప్పించుకుంటాడు. లేదా, కాంగ్రెసు కార్యక్రమాల కారణంగా అరెస్టయి, కొద్దిరోజుల తరువాత విడుదల అయ్యేవాడు అతడు నిజంగా పార్టీని మోసగిస్తున్నాడని తెలిస్తే దండించాలని ఆజాద్ వుద్దేశం ! ఇలాంటి సందేహమే మరో మిత్రుడిమీదా వుండేది ఆజాద్‌కు ! ఆ మిత్రుడి పేరు సత్ గురుదయాల్ ! నా వ్యవహారం తాలూకు అనుభవాన్ని పురస్కరించుకుని వీరిద్దరికీ తమ చర్యల్ని గురించి వివరించి చెప్పుకునే అవకాశాన్నీయాలనుకున్నాడు భయ్యా ! అప్పటికి లాహోరు కుట్రకేసు తీర్పు చెప్పడం అయిపోయింది. భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు - వీరికి ఉరిశిక్ష విధించడం జరిగింది. ఒకరిద్దర్ని వదిలి పెట్టారుకూడాను ! అలా వదిలిపెట్టినవారిలో సురేంద్రపాండే ఒకడు. విడుదలై వచ్చాక ఇతడు ఆజాద్‌ను కల్సుకున్నాడు. పార్టీలో పనిచెయ్యాలన్న తన అభిమతాన్ని తెల్పాడు. సురేంద్రపాండే కాన్పూరులో పార్టీ శాఖ ప్రారంభం అయినప్పటినుంచి పనిచేస్తున్న మిత్రుడు. పైగా, ఈ మధ్య సంవత్సరంన్నరకు పైగా జైల్లో వుండి ఇతర మిత్రుల్తో సామూహిక అధ్యయంనగావించాడు! ఇతడి సహకారం పార్టీకి ఎంతైనా అవుసరం !

ఆజాద్, వీరభద్రతివారీకీ, సత్ గురుదయాల్ అవస్తీకి - వీరిద్దరికీ తమ ప్రవర్తన గురించి వివరించవల్సిందని సందేశం పంపించాడు. అప్పుడు సెంట్రల్ కమిటీ ఎటూలేదు. కాగా, ఆజాద్, సురేంద్రపాండే- వీరే పై సందేశాన్ని పంపారు. సత్ గురుదయాల్ అవస్థీ ఒక జాబురాసి తనమీద మోసిన నేరాలు నిరాధారమైనవని తెలియపరిచాడు. వీరభద్ర తివారీ వచ్చాడు. నాకు రహస్యం చెప్పడం గురించీ ప్రశ్నించాడు ఆజాద్ ! తివారీ నిజాయితీగా తన తప్పును వప్పేసుకున్నాడు. కొన్ని సందర్భాల్లో ప్రాణరక్షన కోసం కర్తవ్యాన్ని నిర్లక్ష్యం చేయడాన్ని గురించి అడిగిన ప్రశ్నకు సమాధానంగా భవిష్యత్తులో అలా చేయనని మాట ఇచ్చాడు.

వీరభద్ర, కాన్పూరులోని నయాగంజి (దాల్‌మండి) వద్ద గల ఖోజే అనే చర్మపు వ్యాపారకొట్టును దోయడానికి ప్లాను వేశాడు. ఆ వ్యాపారి ఇనప్పెట్టెలో లక్షరూపాయల వరకు రొఖ్ఖం వుంటుదని చెప్పాడు. దోపిడీ చేయవల్సిన రోజూ, సమయమూ నిశ్చయమయింది. ఆజాద్ ఒకమాటు వీరభద్రను హెచ్చరించాడు. 'సమయానికి మొండికాలు అడ్డం పెట్టడమో, జైల్లోకివెళ్ళి కూచోవడమో చేయకు !' అన్నాడు అనుకున్నంతా ఐంది. ఆ రోజుకు వీరభద్రతివారీ అరెస్టయ్యాడు.

ఈమాటు యాక్షన్ తప్పక జరుగుతుందని ఆజాద్ అనుకున్నాడు. పరిసరాన్ని ఒకమాటు చూసివచ్చాడు. వీరభద్ర లేకపోయినా యాక్షన్ ఆగనవసరము లేకుండా ఏర్పాట్లు చేసుకున్నాము ఈసారి ! ఆజాద్ ఇతర మిత్రులతో కలిసి అనుకున్న సమయానికి సైకిళ్ళపై ఖోజే దుకాణం దగ్గరకు

వెళ్ళాడు. సైకిళ్ళను మెట్లదగ్గరగా గడపలో పెట్టారు. ఇద్దరు పిస్తోళ్ళు తీసుకుని మేడమీదకు వెళ్ళే మెట్లదగ్గర కాపలా నిలబడ్డారు, ఇతరులెవ్వరూ పైకి పోకుండా ! ఆజాద్, సురేంద్రపాండేను, శాలిగ్రామ్‌ను వెంటపెట్టుకుని పైకి వెళ్ళాడు !

పైన ఖజానా గదిలో లావుపాటి ఖోజా, మరియిద్దరు గుమాస్తాలూ ఉన్నారు. ఆజద్ పిస్తోలు చూపించి ఇనప్పెట్టె తాళం చెవులు ఇమ్మని అడిగాడు. ఖోజా అరవటానికి నోరుతెరిచాడు. ఆజాద్ ఒక చెంపపెట్టుపెట్టి 'నోర్ముయ్ !' అన్నాడు. అతని గొంతులోని అరుపు గొంతులోనే గుర్రు పెట్టింది, తెరచిన నోరు తెరిచినట్టే వుండిపోయింది !

యమదూతల్లాంటి ముగ్గురు వ్యక్తులు ఎదురుగా పిస్తోళ్ళు పట్టుకు నిలబడి వుండడం చూసి గుమస్తాలు కిమ్మనకుండా ఇనప్పెట్టె తాళంచెవులు ఇచ్చేశారు. ఇనప్పెట్టెను తెరచి ఉన్న డబ్బంతా ఒక సంచిలోకి పోసుకున్నారు మిత్రులు ! గుమస్తాలు శాంతంగా కూచున్నారు. వస్తూ వస్తూ టెలిఫోన్ వైర్లను తెంపేశారు. ఇంతసేపూ ఖోజా తెరచిన నోరు తెరచినట్టే వుంది. అతడిక శాశ్వతంగా నోరు తెరిచాడు. స్పృహతప్పి వుంటాడనుకున్నారు మిత్రులు. కానీ, మర్నాటి వార్తలను అనుసరించి అతడు ఈ లోకాన్నే వదిలేశాడని తెలిసింది ! ఆజాద్ ఇతర మిత్రులు తిరిగి వచ్చి సంచిలోని డబ్బును లెక్కపెట్టారు. పన్నెండు వందలు మాత్రమే ఉన్నాయి ! ఇలాంటి నిరుపయోగమైన ప్రదేశాన్ని ఎన్నిక చేసినందుకు వీరభద్రమీద ఆజాద్‌కు వల్లమాలిన కోపమొచ్చింది, కానీ పత్రికల వార్తల ప్రకారం, ఖోజా ఆనాటి మధ్యాహ్నమే ఒక లక్షరూపాయలు బ్యాంకీకి పంపించాడని తెలిసింది. పత్రికల్లో, 'ఈపని చాలా సాహసంతో కూడిందని, నైపుణ్యంగల వ్యక్తులు ఈ పని చేసివుంటారని' రాశారు. ఖోజా దుకాణానికి వెనకవైపున, పెద్ద పోలీస్‌స్టేషన్ వుంది. నయాగంజ్‌లో మూడు ఇళ్ళ తరువాత ఓచిన్న పోలీస్‌స్టేషన్ వుంది. వేనకాముందూ రెండు పోలీస్‌స్టేషనులుండగా, ఇలా చేయగలగటం నిజంగా సాహసంతో కూడినపని ! ఏమైనాకీనీ, ఇది జరిగాక వీరభద్ర పార్టీని మోసగిస్తున్నాడన్న దృఢనిశ్చయానికి వచ్చాడు ఆజాద్ !

# అమరుడు శాలిగ్రాంశుక్ల

కైలాసపతి అరెస్టయ్యాకకూడా ఆజాద్ ఢిల్లీని పూర్తిగా వదిలిపెట్టలేదు. అతడు ఢిల్లీనుండి నందకిశోర్‌నిగమ్‌ను సలహాకోసం కాన్పూరు పిలిపించుకున్నాడు. ఇలాంటి సందర్భాల్లో తెలివితేటలుగల మరోవ్యక్తిని పక్కన వుంచుకోవడం ఆజాద్‌కు అలవాటు ! అప్పట్లో ఆజాద్ ఎక్కువగా సురేంద్రపాండేతో సలహాపడుతూండేవాడు. సురేంద్రపాండే, పోలీసులకు అనుమానం కలగకుండా వుండడానికి సొంత ఇంట్లో వుండకుండా గంగా నది ఒడ్డున, అద్దె ఇంట్లో వుంటున్నాడు. శాలిగ్రాంశుక్ల కూడా అక్కడే వుంటున్నాడు.

శాలిగ్రాం శుక్ల ఇంతకుముందు 'యూత్ గార్డు' సంఘంలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. లాహోరులో 'నౌజవాన్ భారత్ సభ' ఎలాంటిదో, ఉత్తరప్రదేశ్‌లో 'యూత్‌గార్డు సంఘం' అలాంటిది. 'యూత్‌గార్డు సంఘం' యువకులు కాకీడ్రస్ వేసుకుని కవాత్ చేసేవారు. జాతీయ ఉద్యమం లోనూ ఉత్సాహంగా పాల్గొనేవారు. ఒక సందర్భంలో శాలిగ్రాం శుక్ల అతడి మిత్రులూ పోలీసుల్ని కొట్టడం జరిగింది. పోలీసులు శుక్లను అరెస్టు చెయ్యాలని చూస్తున్నారు. శుక్ల మొదట్నుండి పార్టీకార్యక్రమాల

పట్ల ఆసక్తిని కనబరుస్తూండేవాడు. ఇప్పుడు పూర్తిగా పార్టీ మనిషి అయ్యాడు. సురేంద్రపాండేతో ఉంటూ రహస్యజీవితాన్ని గడుపుతున్నాడు.

నిగమ్‌నూ, పాండేనూ ఉదయం ఆరుగంటలకు కల్సుకోవాలని నిర్ణయించాడు ఆజాద్ ! స్థలం గ్రీన్‌పార్కులోని డి.ఎ.వి. కాలేజీ ఎదుట ! పాండేను అక్కడికి తీసుకువెళ్ళే బాధ్యత శాలిగ్రాం శుక్లకు అప్పగించారు. ఇద్దరిదగ్గరా గడియారాలు లేవు సమయానికి చేరుకోలేమేమోనన్న భయంతో బాగా తెల్లవారుఝామున బయల్దేరారు ఇద్దరూ ! ఆ రోజుల్లో 'గ్వాలియర్' స్థితి అధ్వాన్నంగా వుండేది. రోడ్లమీద గోతులూ, గుంటలూ వుండేవి ! పాండే సైకిల్ ముందుచక్రం ఒకపెద్ద గుంటలో పడ్డది. కింద పడ్డంత పనయింది. హేండిల్‌మీద పెట్టివున్న సైకిల్ వంపు చక్రంలో పడి రెండు మూడు చువ్వలు విరిగిపోయాయి. చక్రం వంకరపోయింది. అక్కడ నుండి గ్రీన్‌పార్కు వరకూ నడిచేవచ్చారు.

వీళ్ళు గ్రీన్‌పార్కుకు వెళ్ళేసరికి ఇంకా తెల్లరలేదు. ఆరుగంటలు కావడానికి చాలా సమయం వుందనిపించింది. శాలిగ్రామ్, పాండేతో ఇలా అన్నాడు "ఇంకా ఎక్కడికైనా వెళ్ళవల్సి రావచ్చును డి.ఎ.వి. కాలేజీ బోర్డింగ్‌లో ఎరిగిన విద్యార్థులువున్నారు. ఈ సైకిలు అక్కడపెట్టి మంచి సైకిలు పట్టుకొస్తాను !" శుక్ల, పాండేను గ్రీన్‌పార్కు పర్మట్ వైపున వదలి విరిగిన సైకిలు తీసుకుని బోర్డింగ్‌వైపు వెళ్ళిపోయాడు. శుక్ల కాలేజీ బిల్డింగ్సునుదాటి బోర్డింగ్‌వైపు వెళ్ళిపోయాడు. శుక్ల కాలేజీ బిల్డింగ్సునుదాటి బోర్డింగ్ గేటు దగ్గరకు చేరగానే అటువైపు నుండి టార్చిలైటు ఫోకస్ కనుపించింది. "Beware ! Beware !" అన్న శుక్ల అరుపులు వినిపించాయి ! అప్పుడే పిస్తోలు పేల్చిన శబ్దము వెంటనే రైఫిల్ ధ్వని వినిపించాయి !

ఏం జరిగిందంటే, గ్రీన్‌పార్కు చివర్న, బోర్డింగ్ గేటుకు ఎదరుగా అగ్జిలియరీ ఫోర్స్ ఆఫీసువుంది. అక్కడ సాయుధ ఇంగ్లీషు సిపాయీ కాపలావుంటాడెప్పుడు ! శుక్ల అక్కడికి వెళ్ళేసరికి సి.ఐ.డి. ఇనస్పెక్టర్ శంభూనాద్ మరి ఇద్దరు పోలీసులూ అక్కడవున్నారు. వాళ్ళు ఏపనిమీద అప్పుడు అక్కడకు వచ్చారో తెలియదు. ఇనస్పెక్టరు, శుక్ల మీద టార్చిలైటు ఫోకస్ చేశాడు. శుక్లను గుర్తుపట్టారు. ఇనస్పెక్టరు ఇతణ్ణి పట్టుకోడానికి ప్రయత్నించాడు. శుక్ల పారిపోవడానికి యత్నించాడుగానీ, సైకిల్ విరిగిపోవడంవల్ల పారిపోలేక పోయాడు. ఒకళ్ళొకళ్ళు కలియబడ్డారు. ఇంతలో ఒక కానిస్టేబుల్ చేతి కర్రతో శాలిగ్రామ్ శుక్ల తలమీద కొట్టాడు. అప్పుడే శుక్ల 'Beware ! Beware !' అని అరిచాడు. ఎందుకంటే దగ్గర్లోనే పాండే వున్నాడు. ఆజాద్ రాబోతున్నాడు. ఇనస్పెక్టరూ, పోలీసులూ, అతణ్ణి చుట్టుముట్టారు. ఇంక అప్పుడు పిస్తోలు బైటకు తీసి కాల్చాడు శుక్ల ! ఒకపోలీసుకు తొడలోకి గుండు దూరిపోయింది. పోలీసులూ, ఇనస్పెక్టరూ - అగ్జిలియరీ ఫోర్సు ఆఫీసులోకి పరుగెత్తితల దాచుకున్నారు. శుక్ల సైకిల్‌ని వదిలేసి పారిపోసాగాడు. ఇదిచూసిన ఇంగ్లీషు సిపాయీ శుక్లవీపున రైఫిల్‌తోకాల్చాడు. శాలిగ్రాం శుక్ల రోడ్డుమీద పడిపోయాడు.

అగ్జిలియరీ ఫోర్స్ ఆఫీసులోకి వెళ్ళిన ఇనస్పెక్టరు శంభూనాద్, ఫోన్‌చేసి మరికొందరు పోలీసుల్ని పిలిపించుకున్న తరువాతగానీ అక్కణ్ణుంచి బయటకు రాలేదు. అదనపు పోలీసులు వచ్చేసరికి పదిపదిహేను నిమిషాలు ఎటూ పట్టివుంటాయి. శుక్ల వీపున రైఫిల్ దెబ్బ తగలడం వల్ల అగ్జిలియరీ ఫోర్స్ ఆఫీసుముందు పడివున్నాడు. ఒకవైపున సైకిలూ పడివుంది. అదేసమయంలో ఆజాద్ సైకిల్‌మీద పర్మట్‌వైపున వున్న కొసకు వెళ్ళతూన్నాడు. ఒకయువకుడు దెబ్బతిని పడివుండడాన్ని పక్కన విరిగిన సైకిల్ని - ఆజాద్ చూశాడు. ఐతే, ఆజాద్, ఆపడివున్నది తమ పార్టీ యువకుడే అనుకోలేదు. గ్రీన్‌పార్కు కొసన ఎవరూ లేకపోవడాన్నిచూసి, పర్మట్‌ఘాట్‌లోని పండిత ముంషీరాం ఇంటికి వెళ్ళాడు. సరేంద్ర పాండే, శుక్ల అరుపుల్ని విన్నాడు. ఆ తరువాత రైఫిల్ ధ్వనిని విన్నాడు.

ఇంక అక్కడ నిలుచోవడం అనవసరమూ, ప్రమాదకరమూ అని అనుకుని తనూ ముంషీరాం ఇంటికి వెళ్ళాడు. పాండేచెప్పగా విషయాన్నంతా విన్న ఆజాద్, ఆగ్లోఇండియన్‌ఫోర్స్ ఆఫీసుకు ఎదురుగా పడివున్న యువకుడు శాలిగ్రామ్ శుక్లేనని తెల్సుకున్నాడు. రైఫిల్ గుండుతగిలి శుక్ల చనిపోయాడని, పాండే - ఆజాద్ ఇద్దరూ అనుకున్నారు ! సరే, ఇక చేయగలిగింది ఏముంది !....

ఆజాద్, పాండే మాట్లాడుకుంటూ వుండగానే మళ్ళీ కాల్పులు ధ్వని వినిపించింది గావుకేకలు వినిపించాయి. క్షణంలో అంతా నిశ్శబ్దమయింది. ఆజాద్ బోర్డింగ్ గేటుముందునుంచి వస్తున్నప్పుడు శాలిగ్రామ్ శుక్ల గాయపడ్డాడేగాని చనిపోలేదు. అతడు ఆజాద్‌ను చూసి వుండవచ్చును. ఐతే సహాయం కోసరం అరవలేదు. ఆజాద్‌మీద ఎవరికీ సందేహం కలగకుండా వుండడానికి వూపిరి బిగపట్టుకు వూరుకున్నాడు.

నాలుగయిదు నిమిషాల తరువాత అదనపు సాయుధ పోలీసులు వచ్చారు. శుక్ల చనిపోయాడని భావించి అతడిని వ్యాన్‌లో పడవేయడానికి పోలీసులు దగ్గరకువచ్చారు. వెంటనే శుక్ల మరో నాలుగుమార్లు కాల్పులు జరిపాడు. ముగ్గురుపోలీసుల్ని గాయపరిచాడు. పోలీసులు అదిరిపడి గావుకేకలు పెట్టి తప్పుకున్నారు. దూరాన నిలబడి శుక్లపై కాల్పులు జరిపారు. అతడు చనిపోయాకనే పోలీసులు దగ్గరకు రాగలిగారు. తరువాత శవాన్ని వ్యాన్‌లో వేసుకున్నారు. శాలిగ్రాం శుక్ల పేరు ఏ కుట్రకేసులోనూ లేదు. అతడికి ఎవరూ ఎన్నడూ జయకారాలూ పలకలేదు. ఐనా, శాలిగ్రామ్ శుక్ల త్యాగం దీటులేనిది ! సాహసంలో, శౌర్యంలో శుక్ల మాపార్టీ వీరుల్లో ఎవరికీ తీసిపోడు !

బరాల్‌లో ప్రకాశవతి విశ్రాంతిగా సుఖంగా వుంటూంది. కానీ ఆమెకు తృప్తిలేదు. ఆమె మాతోపాటే వుండి పార్టీపనుల్లో పాల్గొనాలని తహతహలాడుతూన్నది. సురక్షితమైన నివాసానొకదాన్ని ఏర్పరచుకోవాలని ఆలోచిస్తూవున్నాను. కొందరు మిత్రులు అలహాబాదులో వున్నారు. వారితో సంప్రదించడానికి ఆజాద్, నేనూ అలహాబాద్ వెళ్ళాము. అక్కడ అనుకోకుండా బలదేవ్ చౌబే కలిశారు.

చౌబేగారితో లాహోరులోనే పరిచయమైంది. వారు లాలాలజపతిరాయ్ స్థాపించిన 'సర్వెంట్సు ఆఫ్ పీపుల్స్ సొసైటీ'లో సభ్యులు. జీవితమంతా దేశసేవకోసం అర్పించిన త్యాగమూర్తి. పరమ గాంధీవాదులైన పురుషోత్తమదాస్ టండన్ అనుయాయి వీరు !

టండన్‌గారి ఆదేశానుసారం, అలహాబాదులో గంగానదికి అవతల హిందీ విద్యాపీఠాన్ని నడుపుతున్నారు చౌబేగారు. ఈ విద్యాపీఠంలో బీద విద్యార్థులకు జీతం లేకుండా చదువు చెబుతారు. భోజనమూ పెడతారు. విద్యాపీఠం ప్రాచీన దేవాలయం ఒకదాంట్లో జరుగుతూవుండేది. చుట్టుపట్ల మైలు రెండు మైళ్ళవరకూ ఊరుపల్లె ఏమీలేవు. ఘోరమైన నిర్మానుష్యం ! చౌబేగారు చాలా ఆత్మీయతను కనబరిచారు. వారినిలా అడిగాను. "ఎప్పుడైనా అవసరమయితే మాకు మీ దగ్గర ఆశ్రయం దొరుకుతుందా ?" చౌబేగారు అన్నారు. "ఈ ఇంటిని మీదిగానే భావించండి ! నేను చేయగలిగిన సహాయం తప్పకుండా చేస్తాను. మీరు దేశంకోసం ప్రాణాలర్పిస్తున్నారు ....."

పై విషయాన్ని ఎందుకు చెబుతున్నానంటే, విప్లవకారులమైన మమ్ముల్ని గాంధీగారు ఘోరంగా నిందిస్తూంటారు. ఐనా, గాంధీవాదుల హృదయాల్లో మా పట్ల ఎప్పుడూ ఆదరభావం ఉంటూనే వుంది. అలహాబాదు, మీరట్, ఢిల్లీ, లాహోరులోని గాంధీ ఆశ్రమాలు, ఖద్దరు భండారాలు మాకు ఆశ్రయస్థానాలుగా పనికి వచ్చేవి. వార్తలను పంపుకోడానికీ, తెప్పించుకోడానికీ, ఉపయోగపడుతూండేవి. ఉత్తరప్రదేశ్‌లో బెనర్జీ సోదరులు మాకు సహకరిస్తూ వుండేవారు. ఇక లాహోరులోని ఖద్దరు భండారంలో మా సహాధ్యాయి జస్వంతసింగ్ ఉండేవాడు. అతడికి మేము ఎప్పుడు ఏం చేస్తున్నదీ - వివరాలన్నీ తెలుస్తూండేవి ! అతడు మాలో పూర్తిగా కలిసిపోలేదు. అందుకు

కారణం అతడి దృష్టిలో మేము ఏమంత తెలివిగలవాళ్ళమూ, నేర్పుగల వాళ్ళమూకాదు ! ఐతే, అతడి సహాయ సంపత్తులు మాకు ఎప్పుడూ అందుతూ ఉండేవి !

సరే, నేనూ ప్రకాశవతీ, కొన్నాళ్ళపాటు చౌబేగారి విద్యాపీఠంలో ఉన్నాం ! చలికాలంకావడంవల్ల గాలీ వెలుగూ చొరవీలులేని పురాతనమైన ఆ ఇంట్లో ఉండడమూ ఏమంత బాధ అనిపించలేదు. విద్యాపీఠం ఇతరుల దానంతో, చందాలతో నడుస్తూండడం వల్ల విద్యార్థులకు జొన్న రొట్టె, ఒక కూర మాత్రం పెడుతూండేవారు. చౌబేగారు, వారి పన్నెండేళ్ళ కూతురు మాధవి కూడా జొన్న రొట్టెలే తినేవారు. కానీ మాకోసం మాత్రం పండ్లూ ఫలాలూ పట్టుకొస్తూండేవారు. ఇలా వారు జొన్న రొట్టెలు తిని, మాకు పండ్లు తీసుకురావడం కొంత బాధను కలిగించేది !

అలహాబాదులోని మిత్రుల్ని కల్సుకోవడానికి వెళుతూండేవాడిని. రాత్రిపూట్ల ఎనిమిది తొమ్మిది గంటలకు గాని తిరిగొచ్చేవాడిని కాదు. ఆ సమయంలో యమునా నది దాటడానికి నావలు దొరికేవి కావు. వంతెన మీదుగా తిరిగిరావాలి. మూడు నాలుగు మైళ్ళ దూరం చుట్టు తిరిగితే గాని వంతెన తగలదు. ఐనా, సైకిలు చేతిలో వుంది గనుక కష్టం అనిపించేది కాదు. ఒక రోజు రాత్రి నేను తిరిగి వస్తూన్నాను. పక్కన వున్న పల్లెలో నుంచి అరుపులూ, కేకలూ విన్పిస్తున్నాయి; దొమ్మీ జరుగుతూన్నట్లు. విద్యాపీఠానికి వచ్చాక చౌబేగారు ఎంతో అశాంతిగా వుండడాన్ని చూశాను. పక్క గ్రామంలో ఒక గేదెకు పిచ్చెక్కింది. అది దారే వచ్చే పోయేవాళ్ళను పొడిచేస్తూన్నది. నేనెక్కడ దాని దాడికి గురి ఔతానోనని చౌబేగారు బాధ పడుతూన్నారు. సహజంగానే విద్యాపీఠంలోని వారందరూ భయపడు తున్నారు. "అలాంటి గేదెను కాల్చిపారెయ్యాలి" అన్నాను నేను.

క్షణం ఆలోచించి చౌబేగారు అన్నారు "పిచ్చెక్కిన గేదెను కాల్చడానికి వెళ్ళడమూ ప్రమాదమే కదా ?"

"ప్రమాదమే ! ఆ పళంగా వదిలిపెడితే చాలా మందిని చంపేస్తుంది కదా ?" అన్నాను. అప్పటికే గేదె రెండు మూడు గుడిసెల్ని పడేసింది. గేదెని కాల్చడానికి వెళ్ళడం వల్ల ఇతరుల దృష్టికి ఎక్కుతామన్న భయం ఎటూ వుంది. ఐనా, అప్పటికది కర్తవ్యమనుకున్నాను. చౌబేగారితో అన్నాను. "నా దగ్గర పిస్తోలుంది. కానీ పిస్తోలుతో కాల్చాలంటే, గేదెకు దగ్గరగా వెళ్ళాలి. పైగా పిస్తోలు దెబ్బకు గేదె చావదు. గాయపడుతుంది. మరికూడా ప్రమాదకరంగా తయారవుతుంది !"

"తుపాకి వుంది. ఐతే, చాలా రోజులుగా వాడుకలో లేదు !" అన్నారు, చాలాసేపు ఆలోచించి చౌబేగారు.

"ఎక్కడ వుంది ? తెప్పించండి చూద్దాం ! తూటాలు ఉన్నాయా ?" అని అడిగాను. చౌబేగారు అన్నారు. "బాబూ అదంతా నాకు తెలియదు. తెచ్చి యిస్తాను, నువ్వే చూసుకో !"

చౌబేగారు దీపం తీసుకుని చీకటి కొట్టులోకి వెళ్ళారు. ఎర్రని గుడ్డలో చుట్టివున్న తుపాకిని పట్టుకు వచ్చారు. గుడ్డలు విప్పి చూశాను. మందు కూరుకుని కాల్చే నాటు తుపాకి. బహుశా, మహారాష్ట్రుల కాలం నాటిది కావచ్చు. అక్కడ మందూలేదు. తుపాకి గుండ్లు లేవు. మనస్సు మహా ఖేదపడ్డది. ఇంగ్లీషు ప్రభుత్వం ఈ దేశ ప్రజల్ని ఎంత నిరుపాయులను చేసి వదిలింది ? తనపైకి ఎదురు తిరుగుతారన్న అనుమానం లేకపోయినప్పటికీ, ఇంగ్లీషు ప్రభుత్వం ఈ దేశ ప్రజల్ని అతి దారుణంగా నిరాయుధుల్ని, నిస్సహాయుల్ని చేసేసింది. ఈ నిస్సహాయ స్థితికే గాంధీగారు 'ఆత్మశక్తి' అన్న ముద్దు పేరు పెడుతూన్నారు. "ఐతే, చౌబేగారూ, అహింసతోటీ, ఆత్మబలంతోటీ ఆ గేదెకు హృదయ పరివర్తన కావిద్దాం !" అన్నాను. ఆత్మశక్తి పట్ల నాకు విశ్వాసం లేకపోవడాన్ని చూసి చౌబేగారు నిట్టూరుస్తూ "బాబూ, ఎవరి నమ్మిక వాళ్ళది !" అన్నారు.

# లెమింగ్‌టన్ రోడ్డులో కాల్పులు

మొదటి లాహోరు కుట్రకేసును పంజాబ్ గవర్నరు ఆదేశానుసారం ప్రత్యేక న్యాయస్థానానికి వప్పచెప్పారు. ఈ న్యాయస్థానానికి సెషన్సు అధికారాలన్నీ వున్నాయి. ఈ న్యాయస్థానం 1930 అక్టోబరులో భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు- వీరికి ఉరిశిక్షను విధించింది. మిగిలిన మిత్రులు బటుకేశ్వర దత్తు, శివవర్మ, జయదేవ్‌కపూర్, మహావీర్ సింహ్ వీరికి జన్మఖైదును విధించింది. ఈ సందర్భంగా మేము కొంత అసమ్మతిని ప్రకటించాలనుకున్నాం. ఐతే, రెండవ కుట్రకేసు మిత్రులు కూడా అరెస్టు కావడం వల్ల పంజాబులో పరిస్థితులు పూర్తిగా దిగజారిపోయాయి. ఉత్తరప్రదేశ్‌లోనూ అలాగే వుంది. పంజాబ్, ఉత్తర ప్రదేశ్‌ల్లో పోలీసుల దమనకాండ ఎక్కువగా వుంది గనుక దక్షిణాన ఏమయినా చేయవచ్చును అంటాడు ఆజాద్. అలా చేయడం వల్ల ఉద్యమము యొక్క వ్యాప్తి కూడా పెరుగుతుందంటాడు.

గదర్ పార్టీ వీరుల్లో ఒకరైన పృధ్వీసింగ్ మద్రాసు జైల్లో జన్మఖైదు అనుభవిస్తున్నాడు. అతణ్ణి అమరావతి జైలుకు తీసుకు వెడుతూన్నారు. మధ్యలో రైల్లోనుంచి (చినగంజాం దగ్గర) దూకి తప్పించుకు పోయాడు. అతడు కొన్ని సంవత్సరాలుగా వేషం మార్చుకుని స్వామీరావు అన్న పేరుతో గుజరాతులో వుంటున్నాడు. అక్కడ యువకులకు వ్యాయామాన్నీ కసరత్తునీ నేర్పుతున్నాడు. జాతీయ భావాల్ని ప్రచారం చేస్తున్నాడు. పోలీసులకు ఏ మాత్రం అనుమానం కలగకుండా వ్యవహరిస్తున్నాడు. పృధ్వీసింగ్ పేరు మార్చుకుని (స్వామీరావు పేరుతో) గుజరాతులో వుంటున్నాడని పార్టీకి తెలుసు. ధన్వంతరీ ఒక మాటు అతడిని కల్సుకున్నాడు కూడాను. పార్టీ కార్యక్రమాలకు సహకరించ వలసిందని అభ్యర్థించాడు. అందుకు స్వామీరావ్ అంగీకరించాడు. ధన్వంతరీ అతడిని అలహాబాదు తీసుకు వచ్చాడు. ఆజాద్ కూడా స్వామీరావును కల్సుకోవడం జరిగింది. స్వామీరావ్ గుజరాతులోను, మహారాష్ట్రలోను విప్లవ కార్యక్రమాలను నిర్వహించడానికి అంగీకరించాడు. ఐతే నెలలు గడిచినా, ఏ కార్యక్రమమూ జరగడం లేదు.

దుర్గాబాభీ కాన్పూరులో వున్నది. పార్టీ కార్యక్రమాలు ఏమాత్రము జరగక పోవడం వల్ల ఆమె చాలా బాధపడుతున్నది. తనూ కార్యక్రమాల్లో పాల్గొనడానికి తహతహలాడుతున్నది. ఆ రోజుల్లో ఉత్తర భారత దేశంలో ఘోషా ఆచారం ఇప్పటికంటే దారుణంగా వుండేది. ఏ స్త్రీయేగానీ, బయటికి వచ్చి పనిచేయడం, నలుగురి నోళ్ళల్లో నాడానికి కారణమయ్యేది. అలాంటి స్త్రీ గురించిన అత్తంటి వివరాల్నీ, పుట్టింటి వివరాల్నీ సేకరిస్తూ వుండేవారు. కానీ, గుజరాతుకు, మహారాష్ట్రకూ ఉమ్మడి రాజధాని ఐన బొంబాయిలో ఘోషా పద్ధతి అంత విపరీతంగా వుండేది కాదు. కనుక, బాభీ బొంబాయి వెళ్ళి, స్వామీరావును, ఇతర మిత్రులనూ ప్రోత్సహిస్తూ వుండడం మంచిదని ఆజాద్ అనుకున్నాడు.

దుర్గాబాభీ బాంబే చేరిన వెంటనే ఓ పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్లాను వేశారు. లాహోరు కట్ర కేసులోని నిందితులకు విధించిన శిక్షలకు అసమ్మతిగా బొంబాయి గవర్నర్ని కాల్చిచంపేయాలని అనుకున్నారు. ఇందుకవసరమైన ప్లానును తయారు చేసే బాధ్యత స్వామీరావు, అతని మిత్రులూ స్వీకరించారు.

దుర్గాబాభీ కాన్పూరు తిరిగి వచ్చి ఆ ప్లాను మాకు వివరించి చెప్పింది. అది విని మేమెంతో ఆశ్చర్య పడ్డాము. ఆ ప్లాను ప్రకారం విజయాన్ని ఎలా ఆశించారో మాకు అర్థంకాలేదు. గవర్నమెంటు

హౌసులోకి వెళ్ళి, గవర్నర్ని కాల్చాలన్నది వాళ్ళ ఉద్దేశం. గవర్నరుగారు ఉదయం ఎనిమిది గంటలా ఛాయల కాఫీ ఫలహారాలు ముగించుకుని, పత్రిక చదువుకుంటూ వరండాలో, కూర్చుని వుంటారు. ఆ సమయంలో దుర్గాబాభీ ఎరువు తెచ్చుకున్న కారులో అక్కడికి వెళుతుంది. తన కార్డును గవర్నరు సాహబ్‌కు పంపుతుంది. గవర్నరు పిలిచినప్పుడు వెళ్ళి కాల్చివేస్తుంది. ఇదీ ప్లాను.

దుర్గాబాభీతోపాటు వెళ్ళే రెండో వ్యక్తి ఎవరన్న ప్రశ్న వచ్చింది. తనతోపాటు స్వామీరావే వుండాలని బాభీ అన్నది. ఐతే, తాను బంగళాలోకి పోకుండా బైటే వుంటే బాగుంటుందని స్వామీరావు అభిప్రాయం. బాభీ, మరొక మిత్రుడు బంగళాలోకి వెళ్ళి గవర్నర్ని కాల్చి పారిపోతారు. పోలీసులు వారిని వెంబడించినప్పుడు తాను పోలీసులతో పోరాడుతూ బాభీనీ, ఇతర మిత్రుల్నీ రక్షిస్తానంటాడు స్వామీరావ్. కానీ, బాభీ అందుకు ఒప్పుకోలేదు. స్వామీరావ్ వెంటే వుండాలని అన్నది.

ఎవరు వెంట వున్నా, కార్యక్రమం విజయవంతం అవడం సందేహాస్పదం ! ప్లాను వేసిన మిత్రులకు గవర్నమెంటు హౌసులోకి నేరుగా కారును పోనివ్వరన్న విషయం కూడా తెలియదు. గవర్నరుగారిని కల్సుకోవడానికి ముందుగానే అనుమతి తీసుకోవల్సి వుంటుంది. ఎన్నో ఎంక్వయిరీలయ్యాక గానీ అనుమతి లభించదు. దుర్గాబాభీ, నిర్ణయించిన తారీకు వరకు నిశ్చింతగా ఎదురు చూస్తున్నది. తారీకులు మారుతూ ఉండడంతో అభ్యంతరాన్ని చెప్పింది. చివరకు ఒక రోజును నిర్ణయించుకున్నారు. స్వామీరావుకు మిత్రుడైన వైశంపాయన్ ఒక సేటు నడిగి కారు పట్టుకువచ్చాడు. అనుభవంగల, సైన్యంలో పనిచేసిన డ్రైవర్ ఆప్టే బండి నడపడానికి కూచున్నాడు. డ్రైవర్ పక్కనే స్వామీరావ్ కూచున్నాడు. వెనక సీటులో దుర్గాబాభీ, సుఖదేవరాజ్ కూచున్నారు. వాళ్ళ దగ్గర గుళ్ళు నింపిన పిస్తోళ్ళు చెరొకటీ వున్నాయి. కారు గవర్నమెంటు హౌస్ వైపు వెళ్ళింది. ఐతే, లోపలకు ఎలా వెళుతుందీ? లోపలికి వెళ్ళడానికి వీలుకాదు గనుక, గేటు ముందునుండి వెళ్ళిపోయింది కారు. స్వామీరావ్ ఆజ్ఞను అనుసరించి గేటు ముందే రెండు మూడు సార్లు చక్కర్లు కొట్టింది. ఆ రోజున తీన్‌బత్తీ చౌక్‌లో కార్లను చకింగ్ చేస్తున్నారు. బహుశా, లైసెన్సు కోసం నెంబర్లను నోటు చేసుకుంటున్నారు గావును. కారు రెండు మూడు సార్లు ఆ చౌకు గుండానే వెళ్ళింది. స్వామీరావ్ ఆజ్ఞననుసరించి మెరీన్ డ్రయివ్, ఫోర్టు, కాలబా, బైకులా, దాదర్, మహీం - ఈ ప్రదేశాలన్నీ పగలంతా తిరిగింది కారు. ఆ రోజునే పని జరిగిపోవాలని దుర్గాబాభీ పట్టుపట్టింది. మరుసటి రోజుకు వాయిదా వేయడానికి ఆమె ఒప్పుకోలేదు.

బాంబే రోడ్లమీద అలా సాయంత్రం వరకూ తిరిగారు. చీకటి పడ్డది. కారు లెమిగ్‌టన్ రోడ్డు గుండా వెళుతోంది. గ్రాంట్ రోడ్డును దాటాలి. ట్రాఫిక్ కానిస్టేబులు మొదట గ్రాంట్ రోడ్డున వెళ్ళేబండ్లను పోనీయడానికి లెమింగ్‌టన్ రోడ్డున వచ్చిపోయే బండ్లను ఆపు చేశాడు. స్వామీరావ్ కోపంగా ట్రాఫిక్ కానిస్టేబుల్ వైపు చూసి "ఫైర్ !" (కాల్చండి) అని ఆజ్ఞాపించాడు. దుర్గాబాభీ, సుఖదేవ్‌రాజు చకితులయ్యారు. స్వామీరావు వంక చూసి మౌనంగా వుండిపోయారు.

కొంత సేపటికి ఇటు బండ్లకూ వెళ్ళిపోవడానికి అనుమతి లభించింది. లెమింగ్‌టన్ పోలీసుస్టేషన్‌కు నాలుగడుగులు ముందు, ఇప్పుడు 'నాజ్' సినిమాహాలు వున్న చోట, కారును ఆపమన్నాడు స్వామీరావు. ఆ రోజుల్లో బొంబాయి పోలీసుల్లో చాలామంది తెల్లవాళ్ళూ వుండేవారు. ముఖ్యం సార్జెంట్లు అందరూ తెల్లవాళ్ళే. పోలీస్ స్టేషన్ నుండి ఇద్దరు తెల్ల సార్జంట్లు బయటకు వచ్చారు. వాళ్ళ వెంట భార్యలో లేక ప్రేమికలో వున్నారు. రెండు జంటలూ చేతులు పెనవేసుకుని పేవ్‌మెంట్ మీదగా వస్తున్నారు. ఒక జోడీకారుకు బాగా దగ్గరకు వచ్చేసింది. స్వామీరావు 'షూట్' అని ఆజ్ఞాపించారు. వెంటనే దుర్గాబాభీ, సుఖదేవ్‌రాజు ఇద్దరు పిస్తోళ్ళు పేల్చారు. ఒక గుండు ఇంగ్లీషు

సార్జంటు తొడకు తగిలింది. మరోగుండు అతడి ప్రేయసి భుజానికి తగిలింది. 'గవర్నర్ దొరకలేదు సరే, ఎవడో ఒకడు ఇంగ్లీషువాడు దొరికాడు !'' అని అనుకున్నారు దుర్గా బాభీ, సుఖదేవ్‌రాజు ! స్వామీరావు ఆజ్ఞను అనుసరించి కారు శరవేగంతో దూసుకు వెళ్ళిపోయింది.

దెబ్బతిన్న వాళ్ళకు వెనుకగా వస్తున్న రెండవ సార్జెంట్, ప్రక్కనున్న కారు నొకదాన్ని వేసుకుని వీళ్ళవెంట పడ్డాడు. ఐతే, సైనిక డ్రైవర్ అప్టే చిక్కకుండా కారును నడుపుకుపోయాడు. కారు అక్కడా ఇక్కడా తిరుగుతూ అర్ధరాత్రికి గమ్యాన్ని చేరింది. దుర్గాబాభీ కొడుకు నాలుగేళ్ళవాడు శచి అప్పుడు బాభీ దగ్గరే వుంటున్నాడు. కొడుకును తీసుకుని సావర్కార్ 'బాబా' దగ్గరకు వెళ్ళింది బాభీ! "రెండు రోజుల్లో తిరిగి వస్తాను. ఈ రెండు రోజులూ వీణ్ణి మీ దగ్గర వుంచండి !'' అని అడిగింది. శచిని అక్కడ వదిలి, వీళ్ళు కళ్యాణ్‌కు వెళ్ళి ఝాంసీ బండి ఎక్కారు.

మర్నాడు పత్రికల్లో క్రితం సాయంత్రం జరిగిన విషయాన్ని వివరంగా వేశారు. సార్జంట్‌ను కాల్చింది 'స్త్రీ' అని కూడా ప్రకటించారు. సావర్కార్ స్థితిని అర్థం చేసుకున్నాడు. శచిని తన దగ్గర వుంచుకోవడం మంచిది కాదనుకున్నాడు. వైశంపాయన్ దగ్గరకు పంపించాడు. దుర్గాబాభీ కాన్పూర్ వచ్చాక అనవసరంగా వాళ్ళను కాల్చినందుకు చాలా బాధ పడ్డది. అంతటితో స్వామీరావు పేచీ వదిలిపోయింది.

ఆ తరువాత కొన్ని సంవత్సరాలకు పృథ్వీసింగ్ గాంధీగార్ని కలుసుకుని తన పేరును తెలియపరచాడు. తనను గురించి చెప్పుకున్నాడు. గాంధీగారు పోలీసులకు లొంగిపొమ్మని సలహా ఇచ్చారు పృథ్వీసింగ్‌కు ! సాయుధ విప్లవాన్ని వదిలి, గాంధీ మార్గానికి సహకరించేట్టయితే, ప్రభుత్వం క్షమించేట్టు చూడగలనని మాట కూడా ఇచ్చారు పృథ్వీసింగ్‌కు. పృథ్వీసింగ్ అలాగే చేశాడు. గాంధీ మార్గాన్ని అనుసరిస్తూ, గాంధీ ఆశ్రమంలోనే వుంటాడన్న నమ్మకంతో ప్రభుత్వం అతణ్ణి క్షమించింది కూడాను !

పృథ్వీసింగ్ చాలా సంవత్సరాల పాటు గాంధీగారి ఆదేశానుసారం నడిచాడు. ఆ తరువాత గాంధీ ఆశ్రమాన్ని వదిలి, విడిగా వుండి స్వతంత్రంగా వ్యవహరించసాగాడు.

1954 మార్చిలో బొంబాయిలో పృథ్వీసింగ్‌ను కలుసుకోవడం జరిగింది. అప్పుడో చిత్రమైన విషయం చెప్పాడాయన. గాంధీగారు, తన జీవిత చరిత్ర రాసుకోమని పృథ్వీసింగ్‌ను ప్రోత్సహించారు. ఇతడు గనక ఆత్మ కథ రాసుకుంటే దానికి పీఠికను తాను రాసి ఎవరి చేతనైనా ఆ గ్రంథాన్ని ప్రచురింప జేస్తానన్నారు గాంధీగారు. గాంధీగారి పీఠికతో వెలువడ్డ పృథ్వీసింగ్ ఆత్మకథ ఒక లక్ష కాపీలవరకూ అమ్ముడు పోవచ్చునని ఊహ ! పృథ్వీ సింగ్ తన ఆత్మ కథను రాశాడు. అయితే, దానికి పీఠికను రాయడానికి గాంధీగారు తిరస్కరించాడు. గాంధీగారి ఉద్దేశం, పృథ్వీసింగ్ తన గ్రంథంలో సాయుధ పోరాట మార్గాన్ననుసరించినందుకు పశ్చాత్తాపాన్ని ప్రకటించుతాడని ! కాని, అతడలా పశ్చాత్తాపాన్ని ప్రకటించలేదు. ఇన్ని సంవత్సరాల సహవాసానంతరం కూడా పృథ్వీసింగ్ కాంగ్రెసు కార్యక్రమాలకంటే, కమ్యూనిస్టు కార్యక్రమాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నాడు. (పృథ్వీసింగ్ 1955లో ఆంధ్రా అసెంబ్లీకి బై ఎలక్షను జరుగుతున్నప్పుడు కమ్యూనిస్టు పార్టీ ప్రచారకుడుగా ఆంధ్రదేశం వచ్చారు. అప్పుడు అనేక సభల్లో, వారి హిందీ ఉపన్యాసాల్ని, ఈ గ్రంథ అనువాదకుడు తెలుగులోకి అనువదించడం జరిగింది. అప్పుడు పృథ్వీసింగ్ తాను చినగంజాం దగ్గర రైల్లోనుంచి దూకిన అనుభవాన్ని ఈ గ్రంథ అనువాదకునికి స్వయంగా చెప్పారు. ॥అను॥)

నవంబరు నెల. హంస్‌రాజ్ పెట్టిన గడువు దగ్గరకొస్తున్నది. ఆజాద్ "గడువు దాటనివ్వకు, కరాచీ వెళ్ళిరా !'' అన్నాడు. నేను కాన్పూరు నుండి కరాచీకి ప్రయాణమయ్యాను. ఈమాటు భటిండా

వెళ్ళి, అక్కడ నుండి సమ్మాసట్టా మీదుగా కరాచీ చేరాను. హంసరాజ్ తన అన్న బ్రహ్మదేవ్ దగ్గరే వున్నాడు. అతడు ఇలా అన్నాడు. "తయారు చేశాను. రేపు ఇస్తాను." మర్నాడు అతడు నాకు వెడల్పాయిన చిన్న సీసా నొకదాన్ని ఇచ్చాడు. దాన్లో మామిడి చిగురు రంగులో తరళ పదార్థం ఉంది. సీసా బిరడాకు పైనంతా సీలు వేసి వుంది. పైన గుడ్డ చుట్టాడు. దాంతోపాటు మరోచిన్న సీసాను కూడా ఇచ్చాడు. 'చిన్న సీసా పెద్ద సీసాకు దగ్గరగా వున్నవరకూ, పెద్ద సీసాలోని విద్యుత్ శక్తి అణిగి వుంటుంది. చిన్న సీసాను రెండు గజాల దూరం తీసుకువెళితే పెద్ద సీసాలోని విద్యుత్ శక్తి ఐదు వందల గజాల వరకూ ప్రవహిస్తుంది' అని చెప్పాడు హంస్‌రాజ్. నేను అక్కడే పరీక్షించి చూద్దామన్నాను. కానీ, హంస్‌రాజ్ వద్దన్నాడు. "ఢిల్లీలో మనం పరీక్షించి చూసేవాళ్ళం కదా ! అలాగే, ఎప్పుడు కావాలన్నా చూసుకోవచ్చును. ఇక్కడ, మా అన్నా వదినెల ఎదుట ఇలాంటివి చేయడం బాగుండదు !" అన్నాడు. నేను అతని మాటలను విశ్వసించడం తప్ప ఇంక చేయగలిగిందేముంది ?

హంస్‌రాజ్ ఇచ్చిన సీసాల్ని తీసుకుని చాలా ఉత్సాహంగా తిరిగి వచ్చాను. ఈమాటు, కరాచీనుండి సముద్ర మార్గాన, బొంబాయి వచ్చి అక్కడినుండి కాన్పూరు రావాలనుకున్నాను. ఎలాంటి ప్రమాదాల్లోనూ చిక్కుకోకుండా ఉండగలందులకు ఇంత దీర్ఘ ప్రయాణాన్ని చేశాను. ఐతే, ఇది నా అజ్ఞానమేనని తేలిపోయింది. సముద్రంలో రెండు రోజులు ప్రయాణించవలసి వచ్చింది. మూడవ తరగతి, డెక్కుమీద ప్రయాణం చేశాను. తోటి ప్రయాణీకుల మాటల వల్ల బొంబాయిలో కస్టమ్సు అధికారులు జేబులు కూడా తనిఖీ చేస్తారని తెలిసింది. ఓడ, మధ్యలో ఒకటి రెండు చోట్ల ఆగుతుంది. ప్రయాణీకులు నిషిద్ధ వస్తువుల్ని రహస్యంగా పట్టుకు వెళుతుంటారు. ఈ సీసాల్ని గురించి ఏం చెప్పను ? సీసాలకు మూతలు తీస్తే, అవి పనిచేయవని హంస్‌రాజ్ చెప్పాడు కదా ? అదికాక, జేబులో పిస్తోలు వుంది. దాన్నేం చేసేట్టు ? ఇప్పుడిక ఓడదిగి వెళ్ళడానికి వీల్లేదు కదా ? ఘోరంగా పొరపడ్డాను. ఐతే, ఇంక ఇప్పుడీ పొరపాటు నుండి తప్పుకోవడానికి అవకాశం లేదు. తప్పించుకోవడానికీ వీల్లేదు. కస్టమ్సు అధికారులు సోదా చేసే క్షణం కోసం ఎదురుచూస్తూ కూచున్నాను. అనవసరంగా స్మగ్లర్ అనిపించుకుని చనిపోవాల్సి వచ్చినందుకు బాధ పడ్డాను. బోనులో చిక్కుపడ్డ ఎలిక వతు అయింది నా పని ! నా అజ్ఞానానికి పశ్చాత్తాపపడ్డాను.

బొంబాయి హార్బర్‌లో తప్పించుకోవడానికి మార్గంలేదు. వున్నా, నాకు తెలియదు. సాహసించి, కస్టమ్స్ అధికారుల దగ్గర అమాయకుడిగా అభినయించి తప్పించుకోవడం ఒక్కటే మార్గం అదే చేశాను. ఇతర ప్రయాణీకుల్ని తోసుకుంటూ అధికారుల దగ్గరకు వెళ్ళి, సూట్‌కేసు ముందుపెట్టి "బాబూ దీన్ని ముందు చూసేయండి ! ఈ బండికే వెళ్ళిపోవాలి !" అన్నాను. నేనే సూట్‌కేసు తెరిచాను. కస్టమ్స్ అధికారి సూట్‌కేసులోని మాసిన గుడ్డల్ని అటూ-ఇటూ వత్తిగిలించి చూశాడు. అడుగున సీసాలున్నాయి. జేబులోని పిస్తోల్ను పట్టుకు నుంచున్నాను. అతడు సీసాల్ని తీయడం, నేను కాల్చడం - రెండూ ఒకేసారి జరుగుతాయి. క్షణాలు లెక్క పెడుతున్నాను. కానీ, నా ఆదుర్దానీ, నాకు నేనై సూట్‌కేస్ తెరిచిన పద్ధతినీ చూసి అధికారి తృప్తిపడ్డాడు. అతడు సూట్‌కేస్ మూసేసి, చాకోపీసుతో దానిమీద గుర్తువేశాడు. ప్రాణాలు కుదుటపడ్డాయి.

కాన్పూర్ వెళ్ళాను. ఆజాద్, నేనూ చాలా ఉత్సాహంగా బ్యాటరీని పట్టుకువచ్చి పరీక్షించాము. ఫలితం శూన్యం. మరో బల్బ్యూ, బ్యాటరీని తెచ్చి పరీక్షించాము. ఫలితం లేదు. ఆ సీసాల్ని రెండింటినీ ఆజాద్ గోడకు విసిరి కొట్టాడు. ఆ తరువాత వైర్‌లెస్‌కోసం హంస్‌రాజ్‌నూ బాధించలేదు. మేమూ బాధపడలేదు.

అప్పటికి మరికొన్ని అరెస్టులు జరిగాయి. వాటి కారణంగా కైలాసపతి ప్రభుత్వసాక్షి అయ్యాడన్న విషయాన్ని మేము నమ్మాము. ఢిల్లీ వెళ్ళాక మరో విషయమూ తెలిసింది. పోలీసులు అతడికి ప్రత్యేకమైన సౌకర్యాల్ని కల్పించారని విన్నాము. ఢిల్లీలోని రామజస్ స్కూలు డ్రిల్లు మాస్టరు రాజబలీసింగ్ భార్య కమల జైల్లోకి వెళ్ళి కైలాసపతిని కలుసుకుంటూన్నాదనీ తెల్సింది. అరెస్టయ్యేప్పుడు అతడు కమలతోటే వుంటున్నాడు. కమల ఇంటి ముందే అరెస్టయ్యాడు. మామీద సానుభూతిగల, జాతీయ భావం గల జైలు అధికారుల ద్వారా కమల, జైల్లో వున్న కైలాసపతికి రాసే వుత్తరాల నకళ్ళనూ తెప్పించాము. కమల మీది మోహం కారణంగానే కైలాసపతి ఇలా పిరికితనాన్ని ప్రదర్శించాడని అనుకున్నాము. కమల ఏడ్చి మొత్తుకుని అతడిని ప్రభుత్వ సాక్షి అయ్యేట్టు చేసింది. దీన్ని బట్టి విప్లవకారులు ఏ స్త్రీనీ ప్రేమించడం గానీ, ఏ స్త్రీతోటీ సంబంధాన్ని పెట్టుకోవడం గానీ కూడదని స్పష్టం అవుతోంది !

కైలాసపతి సాక్ష్యాన్ని బట్టి, అతడు అరెస్టయిన నాలుగవ రోజున క్షమాభిక్ష లభిస్తుందన్న హామీమీద, ప్రభుత్వ సాక్షి అయ్యాడని తేలిపోయింది. కమల మీది అతడి ప్రేమ అతడి ఈ దుస్థితికి కారణం. కానీ, మరోరకంగా కూడా మనం ఆలోచించవచ్చును. కమల మరో రకమైన స్త్రీ ఐతే ఎలా వుండేది ? అతడి శౌర్యాన్ని, త్యాగాన్ని అభిమానించే స్త్రీ ఐతే ? స్త్రీలూ, పురుషులూ - ఇద్దర్లోనూ పిరికివాళ్ళూ వుంటారు. సాహసులూ వుంటారు. కైలాసపతి తన ప్రవృత్తి, ప్రకృతి కారణంగా విప్లవ చైతన్యంలేని, ప్రతీఘాతక ప్రవృతిత్త గల స్త్రీని ప్రేమించాడు !

# వీరభద్రతివారీ కల్పించిన తిరుగుడు

కైలాసపతిలాంటి ముఖ్యుడు ప్రభుత్వసాక్షి కావడంతో మేమందరమూ చాలా ఖేదపడ్డాము. "పార్టీ, ఇలా ప్రభుత్వ సాక్షిగా మారిన వాళ్ళకు ఎలాంటి దండనా విధించలేదు. గనుకనే వీళ్ళిలా బుడిగి బుడిగిన ప్రభుత్వ సాక్షులయిపోతున్నారు" అన్నాడు ఆజాద్. దీంతో అప్రూవర్ల పట్ల ఆజాద్ కోపం తారాస్థాయినందుకుంది.

ఇంకో కొత్త సమస్య ఒకటి తారసిల్లింది. కైలాసపతికి పరిచయులైన అనేకుల్ని అరెస్టు చేయడం జరిగింది. మరి వీరభద్రతివారీపై ప్రభుత్వం ఎలాంటి చర్యా ఎందుకని తీసుకోలేదు ? అతడు ఇప్పటికీ శ్రద్ధానంద పార్క్ వద్దగల తన ఇంట్లోనే వుంటూ వున్నాడు. బజార్లల్లో ఎక్కడ బడితే అక్కడ తిరుగుతూ కనుపిస్తున్నాడు. సి.ఐ.డి. ఇనస్పెక్టర్ పండిత శంభూనాథ్, వీరభద్ర ఇంటి ప్రక్క ఇంట్లోనే వుంటూన్నాడు. రెండు కుటుంబాలకూ చాలా ఆత్మీయమైన సంబంధం వుంది. వీరభద్ర తివారీ విశ్వాసఘాతకుడు అన్న సంశయం ఆజాద్‌కు కలిగింది.

చున్నీ గంజిలో వుండగా ఆజాద్ ఈ విషయాన్ని గురించి చాలాసార్లు నాతో అన్నాడు. "సి.ఐ.డి. ఇనస్పెక్టరుతో సంబంధాలుండడం సందేహానికి కారణమే ! ఐతే, కైలాసపతి అరెస్టు తరువాత కూడా వీరభద్ర పరారు కావాలనుకోక పోవడం ముఖ్యంగా అనుమానించదగిన విషయం !" అనే వాణ్ణి నేను.

వీరభద్ర తివారి తనకే ప్రమాదమూ లేని విధంగా వ్యవహరిస్తున్నాడన్న అనుమానం నాకు మొదట్నుండి వుంది. అతడు తెలివితేటలు కల వ్యక్తి. శరీరమూ ఒడ్డూ పొడుగూ కలిగి వుంటుంది.

ఐనా, పిరికివాడని నా ఉద్దేశము. 1930 సం॥ సెంట్రల్ కమిటీలో- వీరభద్ర తివారీ, కైలాసపతి ఒక ప్రస్తావన చేశారు. దాని ప్రకారం ప్రాంతీయ కార్యకర్తలు సాయుధ పోరాటాల్లో పాల్గొననవుసరం వుండదు. ఆ ప్రస్తావనను అప్పుడే తోసి పారేశాము. ఆ ప్రస్తావనను గురించి ఆజాద్‌కు జ్ఞాపకం చేశాను. పిరికివాడు ప్రాణరక్షణ కోసం ఎలాంటి 'తిరుగుడైనా' తెచ్చిపెడతాడని నా విశ్వాసం ! అప్పుడు కేంద్రకమిటీ అంటూ లేదు గనుక, ఎవరు దగ్గర వుంటే వారితో సలహా పడుతూండేవాడు ఆజాద్. డిసెంబరు, జనవరి నెలల్లో సురేంద్రపాండే, భవానీసింగ్ - వీరూ అలహాబాద్ వచ్చేశారు. తరచు మాలో మేము సిద్ధాంత చర్చలు జరుపుతూండేవారం.

ఆజాద్, వీరభద్రతివారీని కాల్చేయాలని నిశ్చయించాడు. ఇలా అన్నాడు "వీరభద్రతివారీ, ధూర్తుడూ, చురుకైనవాడు. కాల్చే సందర్భంలో నువ్వూ నావెంట వుండాలి !" నేను సిద్ధపడ్డాను. అతడు నాకు చాలా ప్రమాదకరమైన పరిస్థితిలో సాయం చేశాడు ! అతడికి నేను ఋణపడి వున్నాను. ఐతే, అతడు పార్టీని మోసగిస్తున్నాడనడానికీ కావలసినన్ని నిదర్శనాలున్నాయి. ఆజాద్ అతడికి తన తప్పులను చెప్పి సరిదిద్దుకోమన్నాడు కూడాను. సరిదిద్దుకోవడానికి అవుసరం అయిన అవకాశాన్ని కూడా ఇచ్చాడు. అయినా వీరభద్ర తన ప్రవర్తనను సరిదిద్దుకోలేదు. ఆజాద్, అతణ్ణి రాత్రిపూట 'మెమోరియల్ వెల్' వెనుకనున్న నిర్మానుష్యంగా వుండే ప్రదేశానికి పిలిపించే ఏర్పాటు చేశాడు. అక్కడే అతడిని కాల్చేయడం జరుగుతుంది. వీరభద్ర రాత్రిపూట నిర్మానుష్య ప్రదేశానికి ఎందుకు వస్తాడు ? ఎలా వస్తాడు ? అని నేను అడగనూ లేదు. ఆజాద్ చెప్పనూలేదు. రాత్రి పూట్ల రెండు మాట్లు ఆజాద్ నన్ను వెంటపెట్టుకుని ఆ ప్రదేశానికి వెళ్ళాడు. గంట గంటన్నర సేపు నిరీక్షించాము. అయినా, పని జరగలేదు. వీరభద్ర అక్కడికి రాలేదు. మూడవమాటు రాత్రి 11 గంటలాచాయల ఆజాద్ నన్ను నిద్ర లేపాడు "సోహన్ ! త్వరగా పద ! ఈమాటు పని జరిగిపోవాలి ! అతడు వస్తున్నాడు !" అన్నాడు.

నేను వెంటనే లేచాను. దిండు కిందవున్న పిస్తోల్‌ను జేబులో పెట్టుకున్నాను. సైకిల్ మీద ఆజాద్ వెంట వెళ్ళిపోయాను. ఈమాటూ, చలిలో చీకటిలో దాదాపు నలభై ఐదు నిముషాల సేపు, ఆ నిర్మానుష్య ప్రదేశంలో చక్కర్లు కొట్టాము. వీరభద్రతివారీ రాలేదు. మేము వెనక్కి తిరిగి రాబోతూన్నాము. ఇంతలో అక్కడికో స్త్రీ వచ్చింది. తెల్లని చీరె, తెల్లని బ్లౌజు, నల్లని గరం కోటు వేసుకుని, సన్నగా పొడుగ్గా వుంది. 19-20 ఏళ్ళుంటాయామెకు ! ఆజాద్ ఆమె దగ్గరకు వెళ్ళాడు. నాకు ఆమె ఎవరో తెలియదు. ఆజాద్ నన్ను రమ్మనీ అనలేదు. కనుక దూరంగానే వుండిపోయాను. వాళ్ళు మాట్లాడుకునే మాటలు స్పష్టంగా వినపడడం లేదు. కానీ స్వరం మాత్రం వినబడుతోంది. ఆమె, వీరభద్ర తివారీ అక్కడికి రాకపోవడానికి గల కారణాన్ని వివరిస్తూన్నదనుకున్నాను.

ఆజాద్ నా దగ్గరకు వచ్చి నిరాశగా "నాయాల ప్రతిసారీ ఏదో ఒక 'తిరుగుడు' చేస్తూనే వుంటాడు !" అన్నాడు.

ఇక నేను అడక్క తప్పింది కాదు. "మీ ప్లాను ఏమిటి ? అతడు వస్తాడని ఎలా విశ్వసించావు? ఎందుకిలా అడుగుతున్నానంటే, ఈ పిల్ల అబద్ధం చెబుతోందని అనుమానంగా వుంది !" అన్నాను.

"ఎలా అనుమానిస్తున్నావు ?"

"ఆ గాభరా పడడమూ, ఆ పద్ధతీ చూస్తుంటే ఏదో వంక చెప్పడానికి ప్రయత్నిస్తూన్నదనీ, వంక కుదరడం లేదనీ అనిపిస్తూన్నది నాకు !"

అప్పుడిలా చెప్పాడు ఆజాద్. "ఈ అమ్మాయి ఈ రాత్రి సరసయ్యా ఘట్టంలో తాను పూజ చేసుకోవడానికి వెళ్తూన్నట్టు చెప్పి, వీరభద్రను తోడుకోసం వెంట తీసుకు వస్తానంది. ఇప్పుడేమో తనకేదో పని పడ్డదని వీరభద్ర కబురు పంపించాడంటున్నది !" అన్నాడు.

నేను ఆజాద్‌తో ఇలా అన్నాను. "ఈమె ప్రవర్తన అనుమానంగా వుంది. వీరభద్రకూ, ఈమెకూ అంతటి ఆత్మీయత వుందా ? ఈ రాత్రిపూట అతడిని ఇక్కడికి తీసుకురాగలుగుతుందా ? అతడికి ఇంతటి విశ్వాస పాత్రురాలెలా అయింది ఈమె ? అతడిని కేవలం మోసగించడానికే ఇంత పరిచయాన్ని ఏర్పరచుకుందా ? ఈమె వెంట అతడు అర్ధరాత్రిపూట ఇక్కడకు రావడానికి అవసరం అయిన ఆత్మీయత, నిజంగా అతడికీ ఈమెకూ వుంటే, అతడిని రక్షించడానికి నన్నే మోసగిస్తుందని ఎందుకు అనుకోరాదు ? ఇలా వెంట తీసుకువచ్చి కాల్పించినందు వల్ల ఈమె ప్రమాదంలో చిక్కుకుంటుంది గదా ? పోనీ, దీన్ని తన కర్తవ్యంగా భావిస్తున్నదా అంటే, అంతటి చైతన్యమూ ఈమెలో కనబడడంలేదు !" చాలా రోజుల తరువాత ఆమెను గురించి వివరాలు తెలిశాయి. ఆమె బెంగాలీ జాతికి చెందింది. సాధారణంగా ద్వంద్వ ప్రవృత్తిగల వ్యక్తిలా కనుపిస్తుంది. 'భోకీ' అనే మారు పేరు పెట్టుకుంది. చిట్టి పొట్టి సాహసిక కార్యాలు చేయడం ఆమెకు ఇష్టం ! సాయుధ కార్యక్రమాల పట్ల శ్రద్ధ ఎక్కువ ! తరువాత ఆమె బెంగాల్ వెళ్ళిపోయింది. అక్కడే జైల్లో చనిపోయింది.

ఆ రోజుల్లోనే ఒకమాటు నేను మధ్యాహ్న సమయాన మేస్టన్ రోడ్డున నడచి వెళుతున్నాను. జనసమ్మర్ధం ఎక్కువగా వుంది. వీరభద్ర తివారీ అనుకోకుండా ఎదురయ్యాడు. అతడు నన్ను చూశాడు. కానీ, చూడనట్టు వెళ్ళిపోయాడు. నేనూ చూడనట్టే వుండిపోయాను. నా నడుముకు పిస్తోలు వుంది. అతడి దగ్గర వుందో, లేదో తెలియదు. బహుశ వుండకపోవచ్చును. పిస్తోలును దగ్గర వుంచుకోవడమే ప్రమాదానికి కారణం కాదా ? స్పష్టమైన ప్రయోజనం ఏమీ లేకుండా ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడం అతడి స్వభావం కాదు. అప్పుడా జనంలో, ఆ ప్రదేశంలో అతడిని కాల్చాలన్న ఆలోచనే నాకు కలగలేదు. తరువాత ఆలోచిస్తే, అక్కడ అతడిని ఏం చేసినా, అది అతడికే అనుకూలం అవుతుందనిపించింది. అతడిని కాల్చడానికి ఆజాద్ వేసిన కృత్రిమమైన ప్లానూ, మాటిమాటికీ అతడు తప్పించుకోవడమూ ఇదంతా చూస్తే అతడికి అనుమానం కలిగిందనిపించింది నాకు ! ఎవడైనా ప్రభుత్వ సాక్షి అయ్యాడంటే, అతడికి పార్టీలోని కొందరు వ్యక్తుల్తో కాక, మొత్తం పార్టీతోనే శతృత్వం ఏర్పడుతుంది. 'ఆజాద్‌ను పట్టించి, నన్ను పట్టించడు' అనుకోవడానికి కారణం కనుపించదు. కృతఘ్నుడుగా ప్రవర్తించానన్న కోపం అతడికి నామీద అదనంగా వుండడమూ సంభవం. ఆ తరువాత ఇంక అతడిని కాల్చాలన్న ప్రయత్నాలేమీ మేము చేయలేదు. నేనూ, ఆజాద్ కాన్పూరు నుండి అలహాబాద్ వెళ్ళిపోయాము.

ఆజాద్ ఆజ్ఞానుసారం వీరభద్రతివారీని కాల్చడంలో అప్పట్లో నాకు ఎలాంటి నైతికమైన అభ్యంతరం కూడా కనిపించలేదు. ఇన్నాళ్ళు గడిచాక ఇప్పుడా విషయాన్ని గురించి ఆలోచిస్తూ వుంటే మరో రకమైన అభిప్రాయానికి వస్తున్నాను. నేను జైల్లో ఉన్నప్పుడూ వీరభద్రతివారీని కాల్చడానికి చేసిన ప్రయత్నాల గురించి ఆలోచిస్తూ వుండేవాడిని. 1947లో భారతదేశ పరిపాలనాధికారాన్ని కాంగ్రెసు పార్టీ స్వీకరించిన తరువాత జరిగిన ఒక విషయాన్ని ఉదహరిస్తాను. ఒకనాటి సాయంత్రం భువాలీలో డాక్టర్ ప్రేమ్‌లాల్ సాహుకు మిత్రుడైన ఒక ఆంగ్లేయుడి ఇంట్లో టీ తాగుతున్నాము. పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాము. డాక్టర్ సాహు, ప్రసిద్ధ హిందీ రచయితగా నన్ను వాళ్ళకు పరిచయం చేశాడు. ఇంగ్లీషు దంపతులకూ, వాళ్ళ అతిథి ఐన మరో ఇంగ్లీషు వనితకూ నా మాటలు వినోదాన్ని కలిగిస్తున్నాయి. గాంధీ వాదాన్ని గురించి మాట్లాడుకుంటున్నాం. వాళ్ళ అతిథిఐన ఆంగ్ల వనిత 'గాంధీ వాదం ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన గొప్ప కానుక' అన్నది. ఆమె మాటల్ని నేను పరిహాసంగా కొట్టిపారేస్తున్నాను. ఆమె ఆశ్చర్యపడుతూన్నది. డాక్టర్ సాహు ఇలా అన్నాడు. "గాంధీవాదాన్ని అర్థం చేసుకోవాలంటే వీరితోనే మాట్లాడండి ! వీరు 'గాంధీవాదం - శవపరీక్ష' అన్న పుస్తకం రాశారు !"

ఇంగ్లీషు వనిత కళ్ళు పెద్దవి చేసి నావంక చూస్తోంది. గాంధీని విమర్శించే వ్యక్తులు భారతదేశంలో వుంటారని ఆమె ఎన్నడూ అనుకుని వుండదు. డాక్టర్ సాహా, ఆమెను మరికొంచం కంగారు పెట్టాలనుకున్నాడు. ఇలా అన్నాడు "వీరు 1929లో వైస్రాయి స్పెషల్ ట్రైను కింద బాంబు పేల్చారు !"

ఇంగ్లీషువాళ్ళు ముగ్గురూ నన్ను రెండు మాట్లు ఆపాదమస్తకం చూశారు; తమ ఎదురుగా కూచున్నది భూతం కాదు మనిషేనని నిర్ధారించుకోడానికా అన్నట్టు ! మా సంభాషణ గంభీరమైన విషయం మీదకి మళ్ళింది. అతిధి ఆర్ద్ర స్వరంతో "సరే, గడిచిపోయిందేదో గడిచిపోయింది. ఆ శతృత్వమూ తెగటారింది. నేను ఒకటి అడుగుతాను చెప్పండి ! ఆ తరువాత మీరెప్పుడైనా అలాంటిపని చేసినందుకు బాధపడ్డారా ?" అని అడిగింది.

పై ప్రశ్న వేసిన ఇంగ్లీషు వనిత భర్త రెండవ ప్రపంచ యుద్ధంలో సైన్యంలో మేజరుగా పనిచేశారు. నేను ఎదురు ప్రశ్న వేశాను. "మీ భర్తగారు శత్రు పక్షంలోని చాలామంది సైనికుల్ని చంపి వుంటారు. ఒకవేళ స్వయంగా చంపకపోయినా వారి ఆజ్ఞల వల్ల, వారి ఆధీనంలోని సైనికులైనా ఆ పని చేసి వుంటారు. కనీసం అలాంటి పని చేయడానికి మీ భర్తగారు తప్పకుండా ప్రయత్నించి వుంటారు. మరి అలా శత్రుపక్షంలోని సైనికుల్ని చంపినందుకు మీ భర్తగారి మనస్సు ఎప్పుడైనా బాధపడ్డదేమో అడిగారా ?"

ఆమెకు తన భర్తను అలాంటి ప్రశ్న వేయవలసిన అవసరమే కనిపించలేదు. కారణం, అతడు ప్రాణాలకు తెగించి తన కర్తవ్యాన్ని నిర్వహించాడు.

నేనిలా అన్నాను. "మీ భర్త జీతం తీసుకుని కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాడు. నేను జీతాన్ని ఆశించకుండా, ఘోర ప్రమాదాలకు ఓర్చి నా కర్తవ్యాన్ని నిర్వహించాను. కాకపోతే, వైస్రాయి మీద నాకు శత్రుత్వం వుండవల్సిన పనేముంది ? ఇవ్వాళ ఆ వైస్రాయి చలికి వణుకుతూ కనుపిస్తే నా కోటును ఇచ్చేసినా ఇచ్చేస్తాను !" వైస్రాయిని గురించి గానీ, ఇతర సందర్భాల్లో నాచే కాల్చబడి నేలకు ఒరిగిన ఆంగ్ల ప్రభుత్వ ప్రతినిధుల గురించి గానీ నేనెప్పుడూ పశ్చాత్తాపాన్ని పొందలేదు. పరితాపాన్ని పొందలేదు. కానీ, వీరభద్రతివారీని కాల్చేయడానికి చేసిన ప్రయత్నాల్ని తలుచుకుంటే మాత్రం అనివార్యంగా పశ్చాత్తాపం కలుగుతున్నది. అతడిని కాల్చడానికి ప్రయత్నించడం చాలా అన్యాయం అనిపిస్తూన్నది. నన్నడిగితే అతడు చేసిన మోసం, కార్యక్రమాల్ని జరగకుండా చేయడమే. ప్రమాదానికి దూరంగా వుండాలనే తలంపుతో అతడు కార్యక్రమాన్ని జరగనిచ్చేవాడు కాదు. అదే అతడు చేసిన మోసం. పార్టీ మిత్రుల్ని ఎవర్నీ అతడు అరెస్టు చేయించలేదు. అతడు స్పష్టంగా తన ఇబ్బందిని చెప్పేస్తే సరిపోయేది. "నేను సాయుధ కార్యక్రమాల్లో పాల్గొనలేను. కేవలం సహాయ సహానుభూతుల ద్వారా మాత్రమే పార్టీకి సహకరించగలను !" అని స్పష్టంగా చెబితే, ఇంత బెడద వచ్చేది కాదు. చివరి రోజుల్లో సురేంద్ర పాండే అలా స్పష్టంగా చెప్పేశాడు. అతడిని మేమెవ్వరమూ అనుమానించనూ లేదు. బలవంతానా సాయుధ కార్యక్రమాల్లోకి లాగాలనీ చూడనూలేదు.

ఆజాద్ చున్నీగంజిలో మేము తీసుకున్న ఇంటికి వస్తూండేవాడు. ఒక్కోమాటు రాత్రిపూట కూడా అక్కడ వుండేవాడు. ఎప్పుడైనా 'పప్పు' తినాలనిపిస్తే ప్రకాశవతిని 'పప్పు' వండమనేవాడు. 'పప్పు' ఉడికిందాకా ఎదురు చూస్తూ కూచునేవాడు. అలాంటప్పుడు మౌనంగా కూచోవడం అతడి వల్లకాదు. పక్కన ఎవరైనా వినేవాళ్ళు వుంటే, మాట్లాడుతూనే వుంటాడు. ఆజాద్ లావుగా, బలంగా వుండేవాడు. కండలు తిరిగిన శరీరం కలవాడు. అతడికి వ్యాయామం చేయడమూ ఇష్టమే ! ఐతే, నియమరహితమైన రహస్య జీవితంలో నియమంగా వ్యాయామం చేయడానికి ఎలా వీలుంటుంది ?

ఒక వారం రోజులు ఎక్కడైనా నిలకడగా వుండడం జరిగితే మాత్రం తెల్లవారు జామునే లేచి గుంజీలు, బస్కీలు తప్పకుండా తీస్తానంటాడు. ఆజాద్‌ను లావుగా వున్నాడని ఎవరైనా అంటే చెడ్డ కోపం వచ్చేస్తుంది అతడికి! అతణ్ణి చాటుగా అందరు 'మోటా' (లావాటివాడు) అంటూండేవాళ్ళం. ప్రకాశవతి అతడిని ఎప్పుడూ 'మోటే భైయ్యా!' అని పిల్చేది.

చున్నీగంజిలో వుండగా ఆజాద్, ప్రకాశవతికి పిస్తోలు కాల్చడం నేర్పుతూండేవాడు. దిండుకు గురిపెట్టి బొమ్మ పిస్తోలుతో కాల్పిస్తుండేవాడు. అతడు ప్రకాశవతిని ఇంగ్లీషు చదవమనీ బలవంతం చేసేవాడు. రహస్య జీవితాన్ని గడుపుతూ చదివిన ఇంగ్లీషు తరువాతి జీవితంలో ఆమెకు ఎంతో ఉపయోగపడ్డది. 1934లో ప్రకాశవతి అరెస్టయి విడుదలయింది. తరువాత బెనారస్‌లోని ఒక కాలేజీలో మెట్రిక్ చదవడానికి చేరింది. అప్పటి ఇంగ్లీషు అభ్యాసం వల్లనే ఆమె మెట్రిక్ చదువగల్గింది. చున్నీగంజిలో వుండగా ఒకమాటు ఆజాద్ ఎదుటే ప్రకాశవతి ఇలా అంది "మోటేభైయ్యా కాసేపు అది చెయ్యమంటాడు. కాసేపు ఇది చెయ్యమంటాడు!" అనేసింది.

ఆజాద్‌కు వల్లమాలిన కోపం వచ్చింది. "నన్ను 'మోటా' అంటావుటే పీరమ్మా! అందరూ నీలా పీరుకు మల్లే వుండాలనుకుంటున్నావా?" అని అంటూ ప్రకాశవతి వీపు మీద రెండు గుద్దులు వేశాడు. అప్పట్లో ప్రకాశవతి చాలా సన్నగా వుండేది. మణుగు బరువు కూడా వుండేదికాదు. ఆమెని కసరత్తు చేయమని ఆజ్ఞాపించాడు ఆజాద్! తరువాత ఎప్పుడు అక్కడికి వచ్చినా "ఏయ్ పీరూ! కసరత్తు చేస్తున్నావా?" అని అడిగేవాడు.

చౌధరీ రామధనసింహ్‌ను ఆజాద్‌కు పరిచయం చేశాను. రామధన్ వెనుక పార్టీ ఆదేశాన్ననుసరించి మర్దాన్‌లో కొన్నాళ్ళున్నాడు. పలుకుబడి గల కొందరు ఖానులతోనూ పరిచయాల్ని ఏర్పరచుకున్నాడు. కొంత వరకూ పస్తోభాషనూ మాట్లాడగలడు. ఇవన్నీ తెలుసుకున్న తరువాత ఆజాద్ చాలా ఉత్సాహపడ్డాడు. రామధన్‌సింహ్ చేత స్కూలుకు కొన్నాళ్ళు సెలవు పెట్టించి మర్దాన్ పంపించాము. అక్కడ నుండి దొంగచాటుగా ఆయుధాల్ని కొనుక్కోవడానికి, అక్కడ నుండి ఆఫ్ఘనిస్తాన్ మీదుగా రష్యా పోవడానికి అవకాశం వుంటుందేమో తెల్సుకు రమ్మన్నాము. సెప్టెంబరులో సెంట్రల్ కమిటీ రద్దు అయినప్పటినుండి నేను ఒకటి ఆలోచిస్తున్నాను. "రష్యాగానీ, ఇతర విదేశాలకు గానీ వెళ్ళి ఇంకా అనుభవాన్ని పొంది, సాధ్యమైతే, విదేశాల సాయంతో విస్తృత రూపంలో బ్రిటీష్ ప్రభుత్వాన్ని దెబ్బతీయడం బాగుంటుంది." అని అనుకుంటున్నాను. అలాచేస్తే బాగుంటుందని ఆజాద్ కూడా అనుకుంటున్నాడు.

చౌధరి మర్దాన్‌లో ఒక వారం రోజులు వుండి తిరిగివచ్చాడు. సరిహద్దు ప్రాంతాల నుంచి ఆయుధాలు కొనుక్కునే ఆలోచన ఏమంత ప్రయోజనకరమైంది కాదని చెప్పాడు. అలా ఆయుధాల్ని కొనడంలో రెండు ఇబ్బందులున్నాయన్నాడు. ఒకటి భారతదేశంలో ఆయుధ నిషేధ చట్టం అమల్లో వుంది గనుక భారతీయులకు ఆయుధాల్ని అమ్మడానికి అంతులేని ధర వసూలు చేస్తారు. రెండో ఇబ్బంది, సరిహద్దు ప్రాంతాల్లో చిన్నచిన్న ఆయుధ కర్మాగారాలు ప్రతిచోటా వుంటాయి. వాటిల్లో తయారైన నాటు సరుక్కే 'మేడిన్ జర్మనీ', 'మేడిన్ ఇంగ్లాండ్' అన్న ముద్రలు వేసి విపరీతమైన ధరకు అమ్ముతారు. ఇంగ్లాండు, జర్మనీ ఆయుదాల్లా ఇవి పనిచేయవు. సమయానికి పుట్టిముంచుతాయి. పోతే, కాబుల్ గుండా, విదేశాలకు వెళ్ళడానికి అవకాశం వుంది అని చెప్పాడు రామధన్! రెండు మూడు నెలల్లో నన్ను రష్యా పంపించడం నిశ్చయం అయిపోయింది.

1930 ఆగస్టులో ధన్వంతరీ, రామకృష్ణ అనే మరో మిత్రుణ్ణి సరిహద్దు ప్రాంతాలకు పంపించాడు. రామకృష్ణ కూడా నేషనల్ కాలేజీలో మాతోపాటు చదువుకున్నాడు. చాలా తెలివిగల

విద్యార్థి అనిపించుకున్నాడు. కాలేజీ చదువు పూర్తయ్యాక అతడు లాహోర్‌లోని మోహన్‌లాల్ రోడ్డులో నేతి దుకాణం పెట్టాడు. అతడు నిండైన వ్యక్తిత్వం కలవాడు. అనవసరంగా మాట్లాడేవాడుకాదు. పార్టీ పిలుపునందుకుని దుకాణాన్ని మూసేసి సరిహద్దు ప్రాంతాలకు వెళ్ళాడు. కొద్ది రోజుల్లోనే పస్తో నేర్చుకున్నాడు. కానీ అక్కడ జబ్బు పడిపోయాడు. వైద్య సౌకర్యం లేకపోవడం వల్ల చనిపోయాడు. రామకృష్ణ చేసిన ప్రయత్నం ప్రత్యేకమైన ఫలితాన్నేమీ ఇవ్వలేదు. కానీ, మా విప్లవ సంఘం యొక్క దృష్టి కోణాన్ని తెలియపరుస్తుందా ప్రయత్నం ! మా ఉద్దేశ్యం విస్తృతమైన సాయుధ పోరాటమేగానీ, వ్యక్తిగత దౌర్జన్యవాదం మాత్రం కాదు.

1930 డిసెంబర్ నెల. లాహోర్ యూనివర్శిటీ ఆవరణలో, కాన్వకేషన్ జరుగుతూండగా పంజాబ్ గవర్నర్‌పై కాల్పులు జరిపారన్న వార్తవిని మేము చాలా ఉత్సాహితులమయ్యాము. ఈ సంఘటన కూడా 'హి.స.ప్ర.స'కు సంబంధించిందేనని చెప్పవచ్చును. అంతర్గతమైన అభిప్రాయ భేదాలవల్ల కోట్లాట వల్లా అసంతృప్తిని పొందిన ఇంద్రపాల్ 'అతిశీచక్కర్' (అగ్నివలయం) అన్న ఉపసంఘాన్ని స్థాపించాడు. లాహోరులోని మరికొందరు మిత్రులు ధన్వంతరీ, సుఖదేవ్‌రాజుల్ని అనుసరిస్తున్నారు. వీళ్ళల్లో దేవరాజు, దుర్గాదాసుఖన్నా, రణవీర్, కేవల్ కృష్ణ ముఖ్యులు ! ధన్వంతరీ ఢిల్లీలో అరెస్టు అయ్యాడు. సుఖదేవరాజు యు.పి. వెళ్ళిపోయాడు. ఇంక పంజాబులో సాయుధ పోరాట భావానికి ప్రాణం పోస్తున్నది పైన చెప్పిన మిత్రులే. లాహోరు కుట్ర కేసులో నిందితులకు శిక్షలు చెప్పారు. ఆ శిక్షలకు ప్రతీకార చర్యగా పంజాబు గవర్నర్ని కాల్చాలని నిర్ణయించుకున్నారు దుర్గాదాసుఖన్నా, రణవీర్‌లు.

గవర్నర్ని కాల్చడానికి తమలోనుంచి ఎవర్నీ ఎన్నుకోలేదు వీళ్ళు. మర్దాన్‌నుంచి హరికృష్ణ అనే సాహసికుడైన యువకుణ్ణి ఒకణ్ణి పిలిపించారు ఇందుకోసం. విప్లవ భావాలు గల వ్యక్తి కాకపోయినా, దేశంపట్ల భక్తి శ్రద్ధలున్నాయి ఇతడికి. జాతీయ అవమానానికి ప్రతీకారాన్ని చేయడానికి, దేశ శత్రువైన గవర్నర్ని కాల్చడానికి ప్రాణాలకు తెగించి సిద్ధపడ్డాడు. కాన్వకేషన్ సందర్భంగా యూనివర్శిటీ హాల్లోకి ప్రవేశించడానికి ప్రవేశ పత్రం తెచ్చి ఇవ్వడం జరిగిందితనికి. దుర్గాదాసుగానీ, రణవీగానీ తాము హాల్లోకి వెళ్ళలేదు.

కాన్వకేషన్ యొక్క సాధారణ కార్యక్రమాన్ని పూర్తి చేసుకుని ఊరేగింపుగా హాలులోనుండి వెళ్తూవుండగా, ముందువున్న గవర్నర్ మీద హరికృష్ణ కాల్పులు జరిపాడు. గవర్నరూ, అతడి అంగరక్షకులైన సైనికాధికారులూ పారిపోయారు. వరండాలోకి పారిపోయిన గవర్నర్ని వెంబడించాడు హరికృష్ణ ! రెండవమాటు వరండాలో కాలుస్తుండగా చరణ్‌సింగ్ అనే రాజభక్తి పరాయణుడైన సబ్ ఇనస్పెక్టర్ ఒకడు హరికృష్ణను పట్టుకోవడానికి ముందుకు వచ్చాడు. చచ్చిపోయాడు. హరికృష్ణ పట్టుబడ్డాడు.

ఈ సందర్భంగా డిసెంబర్ 24న మొదటి అరెస్టు జరిగింది. మర్దాన్‌లోని చమన్‌లాల్‌ను మొదటగా అరెస్టు చేశారు. ఈ చమన్‌లాల్, దుర్గాదాసుఖన్నాకు హరికృష్ణను పరిచయం చేశాడు. 24న చమన్‌లాల్ అరెస్టు కావడాన్ని బట్టి, పోలీసులు 23నే లాహోరునుండి మర్దాన్ బయల్దేరారనుకోవాలి అంటే హరికృష్ణ ఎంత తొందరగా సాహసించాడో, అంతే తొందరగా రహస్యాల్ని చెప్పేశాడు. ఒకవారం లోపలే దసౌందా సింగ్, రణవీర్, దుర్గాదాస్ ఖన్నా - వీరందరూ అరెస్టయ్యారు. దసౌందా సింగ్ ప్రభుత్వ సాక్షి అయ్యాడు. దుర్గాదాస్ ఖన్నా ఆనాటి తన జ్ఞాపకాల గురించి రాశాడు. అతడు ఈ 'యాక్షన్ జరపడాన్ని గురించి జైల్లో వున్న భగత్‌సింగ్‌కు రహస్యంగా జాబు రాశాడుట ! ఆ జాబులో సలప

కోరాడుట ! భగత్‌సింగ్ సమాధానం "ఈ పనికి నైతికంగా నేను అనుమతించను. మీకు 'ధైర్యం' వుంటే చేయండి !"

భగత్‌సింగ్ ఇచ్చిన సమాధానం పరిస్థితికి తగినట్టుగా వుంది. అతడు 'ఉచితం' అనుకుంటేనే చేయండి అని సమాధానం ఇచ్చి వుంటే మరోరకంగా వుండేది. 'ధైర్యం' అన్న శబ్దం వాడాడు. ఆ పదం వాడడంలోని అభిప్రాయం 'యాక్షన్' జరిపాక సమర్థించుకోగలరా ? అని. ఎందుకంటే కొత్తగా వచ్చిన వ్యక్తి విప్లవ భావాలకు అనుగుణంగా ప్రవర్తించగలగడం కష్టం !

ఇంగ్లీషు ప్రభుత్వం హరికృష్ణను ఉరికంబానికి ఎక్కించడానికి చాలా ఆదుర్దాపడ్డది. ఆ విధంగా సాయుధ రాజద్రోహానికి ఫలితం ఏమిటో ప్రజలకు చూపించాలనుకుంది. అతడిమీద కుట్రకేసు నడపకుండా హత్యానేరం కేసు నడిపారు. వెంటనే ఉరి తీసేశారు. రణవీర్, దుర్గా దాసు ఖన్నా వీరి మీద కుట్రకేసు బనాయించారు. సెషన్సు జడ్జి వీరికీ ఉరిశిక్ష వేశాడు. ఐతే, లాహోర్‌లో వీరి కుటుంబాలు చాలా పలుకుబడి గలవి. వకీళ్ళందరూ వీరి తరుపున పని చేశారు. హైకోర్టు వీరిని విడుదల చేసింది. దీన్ని ఐక్టి తెల్సుకోవల్సింది హి.స.ప్ర.స. ప్రయత్నాల వల్ల సాయుధ విప్లవానికి ఔసరం అయిన వాతావరణం వ్యాపించింది. కానీ, గాంధీగారు నిరంతరం నిందిస్తూండడం వల్ల సాయుధపోరాటం ఒక ఉద్యమంగా అభివృద్ధికి రాలేకపోయింది. ప్రజల సహకారం లభించలేదు.

# ఇంద్రపాల్

ఆ రోజుల్లో అరెస్టు అయి ప్రభుత్వ సాక్షులుగా మారిపోతున్న మిత్రుల కారణంగా మా మనస్సులు చాలా బాధపడుతూండేవి. కైలాసపతి గురించి చెప్పాను. ఇంద్రపాల్ కూడా ప్రభుత్వసాక్షి అవడంతో వ్యక్తిగతంగా నేను మనస్సులో చాలా బాధపడ్డాను. ఇది విని ఆజాద్ కూడా చాలా బాధపడ్డాడు. ఇంద్రపాల్ సాధువుగా వుండడం బహావల్‌పూర్ రోడ్డులో జరిగిన సంఘటనలో అతడు చూపిన సాహసం ఇవన్నీ ఆజాద్‌కు తెల్సు. అతడు ప్రభుత్వసాక్షి అయ్యాడన్న వార్తను మేము ఏ విధంగానూ నమ్మలేకపోయాము. ఐతే, అతడు కోర్టులో ప్రభుత్వం తరపున ఇచ్చిన సాక్ష్యాలు పత్రికల్లో వస్తున్నాయి. ఇంకా నమ్మకపోవడం ఎలా ? కొన్ని విషయాలు ఇంద్రపాల్‌కు మాత్రమే తెల్సు. మరొకరికి తెలియవు. అలాంటివీ చెప్పేశాడు అతడు. ఇంక నమ్మకపోవడం ఎలా ? అప్పట్లో ఆజాద్ విపరీతమైన మానసికబాధతో ఇలా అంటూడేవాడు. "సోహన్, ఇంక మనం ఎవర్నీ నమ్మడానికి వీల్లేదు. అరెస్టు అవడం తప్పదనుకున్నప్పుడు, పోలీసుల చేతుల్లో చిక్కకుండా తలకు పిస్తోలును పేల్చుకున్న వాడిని మాత్రమే మనం నమ్మవచ్చు. అలాంటివాడే మన మిత్రుడు !"

1931వ సంవత్సరం, జనవరి నెల మొదటి వారంలో వార్తాపత్రికలు లావాటి అక్షరాల్లో ఇలా ప్రకటించాయి. 'రెండవ లాహోరు కుట్రకేసులోని ప్రభుత్వసాక్షి ఇంద్రపాల్ అడ్డం తిరిగాడు !" పోలీసులు తనను బాధించి, తనచేత తప్పుడు సాక్ష్యం ఇప్పిస్తున్నారని కోర్టులో స్పష్టంగా చెప్పాడు ఇంద్రపాల్ ! పోలీసులు రాసి ఇచ్చిన కాగితాలనూ జడ్జీకి ఇచ్చాడు. మేము సంతోషంతో పొంగిపోయాము. "ఈ సాధూ నాయాల ఎవడూ చేయని గమ్మత్తు ఏదో చేస్తాడని అనుకుంటూనే వున్నాను !" అన్నాడు ఆజాద్.

ఇంద్రపాల్ ప్రభుత్వసాక్షి అయ్యాడు. అడ్డం తిరిగాడు అని టూకీగా చెబితే సరిపోదు. నేనూ, ధన్వంతరీ, సుఖదేవ్‌రాజు - మేము ముగ్గురం పోట్లాడుకుంటూండడం వల్ల, ఇంద్రపాల్, అతడి

మిత్రులు కొందరూ ఛిన్నాలయ్యారు. వాళ్ళు విడిగా కొన్ని సాయుధ కార్యక్రమాల్ని నడిపారు. పార్టీ అతడికి విడిగా కార్యక్రమాల్ని నడపడానికి అనుమతినీయలేదు. కనుక తాము ప్రత్యేకం జరిపిన సాయుధ కార్యక్రమాల్ని పార్టీకి అంటగట్టలేరు. అందువల్ల 'అతిశీచక్కర్' అన్న ప్రత్యేకమైన విప్లవ సంఘం తరపున కార్యక్రమాల్ని నడిపారు. ఈ సంఘం పంజాబులో అనేక చోట్ల బాంబుల్ని పేల్చింది. తత్ఫలితంగా అరెస్టులు ప్రారంభం అయ్యాయి. లాయల్‌పూర్‌లో ఈ సంఘానికి సంబంధించినవారనే అనుమానంతో ఇద్దరు పోలీసుల్ని కూడా అరెస్టు చేశారు. ఒకతని పేరు కుందన్ లాల్, రెండవ అతని పేరు బన్సీలాల్ ! వీళ్ళందర్నీ ఒకటి రెండు వారాల్లోనే అరెస్టు చేశారు. నా తమ్ముడు ధర్మపాల్ కూడా వీళ్ళల్లో ఉన్నాడు. అతడు తప్పించుకోవడానికి జాలంధర్ పారిపోయాడు. బోర్డింగ్ స్కూల్లో పదవ తరగతిలో చేరాడు. అతడినీ అరెస్టు చేశారు.

మా సమయంలోనూ మా కంటే ముందూ కొత్తగా విప్లవ సంఘంలోకి వచ్చిన వ్యక్తుల్ని అనేక రకాలుగా పరీక్షించేవారు. కష్టాలను అనుభవించేలా చేసేవారు. అలాంటి శిక్షణ వీళ్ళకు లేదు. ఫలితంగా అందరికంటే ముందు కుందన్‌లాల్, బన్సీలాల్- వీళ్ళు రహస్యాల్ని బైట పెట్టారు. వీళ్ళు చెప్పిన రహస్యాల ఆదారంగా మిగిలిన వాళ్ళనూ పట్టుకు కొట్టారు. హింసలకు తట్టుకోలేక చాలామంది రహస్యాలు చెప్పేశారు. చాలామంది వాళ్ళు చేసిన వన్నీ ఒప్పేసుకున్నారు. అలా రహస్యాలు చెప్పిన మిత్రుల పేర్లు ఇక్కడ ఉదహరించడం అనవసరం ! కారణం. వాళ్ళల్లో ఎక్కువ మంది ఇప్పుడు కాంగ్రేసు ప్రభుత్వంలో ఉన్నతమైన పదవులలో వున్నారు. రహస్యాల్ని కక్కేసినా వీళ్ళను పోలీసులు బాగా కొట్టారు.

లాయల్‌పూర్‌కు చెందిన ధర్మవీర్ అనే అతడి చేతుల్ని మంచం కోళ్ళకింద పెట్టి, మంచంపైన చాలామంది పోలీసులు కూచునేవారట ! అతడిని దుప్పటిలో చుట్టి ఇష్టమొచ్చినట్టు కొట్టేవారుట ! అయినా అతడు రహస్యాలు చెప్పలేదు. అలాగే ధర్మపాల్‌నూ చాలా హింసపెట్టారు. గోడలకు వున్న బేడీలకు చేతులు వేసి ఐదురోజులు రాత్రింబగళ్ళు నుంచోబెట్టారు. రోజు మొత్తంలో తిండికి, కాలకృత్యాల్ని తీర్చుకోడానికి ఒక్క గంట మాత్రం వదిలేవారు. ఎంత బాధించినా ధర్మపాల్ పొక్కలేదు. 'నాకు ఏమి తెలియదు' అని అనేవాడు. అతడి పిక్కలు స్థంభాల్లా వాచిపోయాయి. అప్పుడిక నిరశన వ్రతం ప్రారంభించాడు. స్పృహ తప్పిపోయాక పోలీసులు అతడిని పడుకోబెట్టి కాళ్ళతోనూ, వేడినూనెతోనూ మర్దించారు. గోడ బేడీలను చేతులకు వేసిన మొదటి రోజునే నిరశన వ్రతం ప్రారంభించినట్లయితే, ఆరురోజులు గోడకు నిలబడవల్సి వచ్చేది కాదు. ఇలాంటి బాధలు వీళ్ళందర్ని పెట్టారు. ఇవేకాక, మీసాల వెంట్రుకల్ని పీకడం చీమల్తో నిండిన బెల్లపు గడ్డల్ని పైజమాల్లో వేసి చేతుల్ని కట్టేసేవారు. చీమలు క్రిందికి పోకుండా గిలగల దగ్గర పైజామాల్ని కట్టేసేవారు. ఇలాంటి బాధలు మమ్మల్ని పెట్టలేదు. మొదటి లాహోరు కుట్రకేసు నిందితులను గానీ, ఢిల్లీ కుట్రకేసు నిందితుల్నిగానీ, నన్నుగానీ- ఇలాంటి బాధలు పెట్టలేదు. వీళ్ళనే ఎందుకు పెట్టారంటే, వీళ్ళు కొత్తవాళ్ళని, విప్లవానుభవం లేనివాళ్లనీ పోలీసులు తెల్సుకున్నారు.

ఒకరోజున ఆఫీసులో ప్రశ్నించిన తరువాత ధర్మపాల్‌ను అతడి కొట్టులోకి తీసుకువెళ్ళారు. వీళ్ళకు భోజనం పెట్టే డ్యూటీ, హవల్దార్ పండిత ఫకీర్ చంద్‌ది ! ఫకీర్ చంద్ ధర్మపాల్‌కు భోజనం పెట్టడానికి రాగానే అప్పటి వరకూ డ్యూటీలో వున్న అబ్దల్ సత్తార్ బేడీలతో వున్న ధర్మపాల్‌ను ఫకీర్‌చంద్‌కు వప్పగించి అవతలకు వెళ్ళాడు. ఫకీర్ చంద్ కాంగడా నివాసి. పల్లెటి భాషలో "పాందా (పండితుడు) నీతో మాట్లాడాలిట ! పిలుస్తున్నాడు !" అన్నాడు. ధర్మపాల్‌కు ఫకీర్‌చంద్ మీద అనుమానం కలిగింది. 'కాంగడా నివాసి ఐతే మాత్రం ఏం ? తనను ఇరికించడానికి ఇలా మోసం

చేస్తున్నాడేమో !' అనుకున్నాడు. కానీ, ఫకీర్‌చంద్ నిజంగానే ధర్మపాల్‌ను తీసుకువెళ్ళి ఇంద్రపాల్ వున్న కొట్టు ముందు నించోబెట్టాడు.

అప్పుడు ఇంద్రపాల్ ఇలా అన్నాడు. "ఇంతవరకూ మన మిత్రులు ఐదుగురు తమకు తెలిసిందంతా చెప్పేశారు. క్షమాభిక్ష దొరుకుతుందన్న నమ్మకంతో ప్రభుత్వ సాక్షులు కావడానికి సిద్ధంగా వున్నారు. వీళ్ళు కనీసం పదిహేడు మంది మిత్రుల్ని ఉరికంబానికి ఎక్కిస్తారు ! అబ్దుల్ అజీజ్ (ఈ కేసు ఇన్‌చార్జ్ పోలీసు సూపరింటెండెంట్) నన్ను ప్రభుత్వ సాక్షిగా మారమని అడుగుతున్నాడు. నేనైతేనే విడివిడి సంఘటనలన్నింటినీ ఒక వరుసలో కూర్చగలను. ఈ కేసుకూ, పరారీలో వున్న ఆజాద్, యశ్‌పాల్‌కూ గల సంబంధాన్ని నేను మాత్రమే బైటపెట్టగలను. ఢిల్లీ కుట్రకేసుకూ, మొదటి లాహోరు కుట్రకేసుకూ, ఈ కేసుకూ సంబంధం వుందని నేనే నిరూపించగలను. ఇంకెవ్వరూ ఈ పని చేయలేరు. నా ఉద్దేశం ఏమిటంటే, నేను ప్రభుత్వసాక్షినయి, అన్ని నేరాల్నీ నామీద వేసుకుంటాను. మిగిలిన వాళ్ళను రక్షిస్తాను ! నీ అభిప్రాయం ఏమిటి ?"

"ఎలాంటి స్థితిలోనూ ప్రభుత్వ సాక్షికమ్మని నేను చెప్పను. నీ మీద నీకు అంత విశ్వాసం వుంటే నీయిష్టం !" అన్నాడు ధర్మపాల్.

"నామీద నీకు విశ్వాసం లేదా ?" ఇంద్రపాల్ అడిగాడు.

"ఇప్పటివరకూ విశ్వాసం ఉంది. ఇక మీదటకూడా నీమీద విశ్వాసం వుంచగలను. కానీ, చాలా ఇబ్బంది కలిగించే విషయం ఇది !"

"సరే, నేను ఆలోచిస్తాను !' అన్నాడు ఇంద్రపాల్.

నాలుగు రోజుల తరువాత ఫకీర్ చంద్, ధర్మపాల్‌కు రొట్టెలు పెడుతూ "జాగ్రత్త ! రొట్టెల్లో పండితుడు (ఉత్తర భారతదేశంలో బ్రాహ్మణుల్ని పండితులంటారు; ఆంధ్ర దేశంలో పుట్టుకతోనే బ్రాహ్మణుడు శాస్త్రీ, శర్మ అయినట్టు అక్కడ పండితుడు అవుతాడు ॥అను॥) ఇచ్చిన చీటీ వుంది !" అని చెప్పాడు. రొట్టె కింద బీడీకట్ట కాగితం మీద రాసిన చీటీవుంది. అందులో "నేను ప్రభుత్వ సాక్షినయ్యాను !' అని రాశాడు ఇంద్రపాల్.

రెండు నెల్లవరకూ ఇంద్రపాల్ పోలీసులతో బాగా నేస్తం కట్టాడు. కేసును కోర్టులో దాఖలు చేశారు. అరవై డభై మంది సాక్షుల్ని విచారించారు. ఇంద్రపాల్ వంతు వచ్చింది. ఇంద్రపాల్ ఏడురోజులు సాక్ష్యం ఇచ్చాడు. అతడు కోర్టులో చెప్పినవన్నీ పత్రికల్లో అచ్చు అవుతూండేవి. అక్షరాక్షరం నిజం చెప్పేవాడు. అవి చదివి మేము నెత్తి బాదుకునేవాళ్ళం ! 'వీడికి ఏమొచ్చిందిరా ! ఇలా చెప్పేస్తున్నాడు !' అనుకునేవాళ్ళం ! అతడు తన సాక్ష్యంలో భగవతీభాయి, ఆజాద్, యశ్‌పాల్ చేసిన పనులన్నింటినీ వివరంగా వర్ణించి చెప్పాడు. అలాంటి పనులు చేసిన మాకు ఎంతటి శిక్షవిధించినా చాలదు ! భగవతీభాయి చనిపోయినా, ఆజాద్, యశ్‌పాల్ ఇంకా బతికేవున్నారు గదా ? ఇంద్రపాల్ ఇన్ని వివరాలు ఇస్తూన్నా కొత్త అరెస్టులు ఏమీ జరగకపోవడం విశేషం. ఇంక ఇంద్రపాల్ సాక్ష్యం మలుపు తిరిగింది. జైళ్ళల్లో వున్న మిత్రులకు సంబంధించిన విషయాల్ని చెప్పవల్సిన సమయం వచ్చింది. అంటే అరెస్టయిన మిత్రుల గొంతు మీదికి తెచ్చే విషయాల్లోకి వస్తున్నాడన్నమాట !

కోర్టులో రోజూ ఇంద్రపాల్ చేత 'నిజమే చెబుతాను అబద్ధం చెప్పను, అని ప్రమాణం చేయించేవారు. ఎనిమిదవ రోజున ఇంద్రపాల్ ప్రమాణం చేయ నిరాకరించాడు. జడ్జి కారణం అడిగాడు. ఇంద్రపాల్ "సాబ్ ! ధర్మం పేరు మీద ప్రమాణం చేసి ఇంక అబద్ధం చెప్పలేను ! పోలీసులు ఇహజీవితాన్ని నాశనం చేశారు. ఇప్పుడింక పరజీవితాన్ని కూడా పాడు చేసుకోవడం నా వల్లకాదు. పోలీసులు నాతోపాటు పరలోకానికి రారుగదా ? అక్కడ వీరి అండ వుంటుందని తృప్తిపడడానికి ?

ప్రమాణం చేశాక పోలీసులు నాచేత అబద్ధం సాక్ష్యం ఇప్పించారన్న నిజాన్ని మాత్రమే చెబుతాను. ప్రమాణం చేయకుండా చెప్పమంటే, పోలీసులు బట్టీ పట్టించినవన్నీ చెప్పేస్తాను !" అన్నాడు.

ప్రభుత్వవకీలు జ్వాలా ప్రసాద్ అభ్యంతరాన్ని చెప్పాడు. "ప్రభుత్వసాక్షి అడ్డం తిరిగాడు. అబద్ధం ఆడుతున్నాడు. పోలీసుల మీద అపవాదుల్ని వేస్తున్నాడు." అన్నాడు. పోలీసులు ఇలా బట్టీపట్టించి చెప్పిస్తున్నారనడానికి ప్రమాణం ఏమిటని అడిగింది కోర్టు ఇంద్రపాల్‌ని ! ఇంద్రపాల్ తన జేబుల్లోండి పోలీసులు రాసి ఇచ్చిన కాగితాల్ని చూపించాడు. తనతోపాటు ఖైదుకొట్టులోకి వచ్చేట్టయితే పోలీసులు రాసి ఇచ్చిన కాగితాల్ని ఇంకా కూడా ఇవ్వగలను అన్నాడు. ప్లీడర్ని తన వెంట తీసుకువెళ్ళి వున్న కాగితాల్ని కోర్టుకు వప్పగించాడు. పోలీసులు తనకు పాఠం నేర్పారనడానికి ఉదాహరణగా ఎన్నో ఆధారాల్ని చూపించాడు. తరువాత ఇంద్రపాల్ కోర్టును అడిగాడు. "పోలీసుల ఆధీనంలో వుంచకుండా, పోలీసులు నామీద ఎలాంటి అత్యాచారము చేయకుండా చూస్తామని కోర్టువారు హామీ ఇచ్చేట్టయితే నిజం చెప్పగలను !" అన్నాడు.

ప్రభుత్వ వకీళ్ళు ఇంద్రపాల్‌ని అనేక ప్రశ్నలు వేశారు. ఎక్కడా అతడు దొరకలేదు. చివరకు జ్వాలా ప్రసాద్ వేసిన ఒక ప్రశ్నకు 'నాకు జ్ఞాపకం లేదు !' అని సమాధానం ఇచ్చాడు ఇంద్రపాల్. అప్పుడు జ్వాలా ప్రసాద్ ఇలా అన్నాడు. "చాలా కృతజ్ఞుణ్ణి పండిట్‌జీ ! మీనోటి మీదుగా 'జ్ఞాపకంలేదు' అనిపించగలిగాను" ఇంద్రపాల్‌ను చూసి ప్రభుత్వసాక్షి మదనగోపాల్ కూడా అడ్డం తిరిగాడు.

చివరకు కేసును కొట్టివేయవల్సి వచ్చింది. ప్రభుత్వం ఇంద్రపాల్‌మీద పగతీర్చుకోవడానికి 'ప్రభుత్వాన్ని మోసం చేయడం, కోర్టులో అబద్ధం ఆడడం, ఆతిశీచక్కర్ విప్లవసంఘం ద్వారా హత్యలు జరపడం' మొదలైన నేరాల్ని పురస్కరించుకుని అతడొక్కడి మీదా కేసు పెట్టింది. సెషన్సు జడ్జి అతడికి ఉరిశిక్ష వేశాడు. పోలీసుల అత్యాచారాలకు జడిసి కోర్టులో తమ నేరాల్ని వప్పుకున్నవాళ్ళకు మాత్రమే కొద్ది శిక్షలు పడ్డాయి. కుట్రకేసు ఎగిరి పోయింది. సాయుధ రాజద్రోహానికి తలపడ్డారన్నదీ ఎగిరిపోయింది.

ఇంద్రపాల్‌ని రక్షించడానికి హైకోర్టుకు వెళ్ళాం ! అతడి తరుపున ముఖ్యవకీలు రోహతక్ నివాసి స్వర్గీయ లాలాశ్యామ్‌లాల్ ! వీరు సహాయ నిరాకరణోద్యమంలో కోర్టుల్ని బహిష్కరించారు. తిరిగి రెండవ లాహోర్ కుట్రకేసు నిందితులకు సహాయం చేయడానికి మాత్రమే వకాలత్తు ప్రారంభించారు. వీరికి కోర్టు ఫీజు రూపంలో రోజుకు 64 రూ. ఇస్తుంది ప్రభుత్వం. ఆ డబ్బునూ నిందితులకే ఖర్చు పెట్టేవారు. శ్యామ్‌లాల్‌గారూ, ప్రభుత్వ వకీలైన జ్వాలా ప్రసాద్ - వీరిద్దరూ ఇంద్రపాల్ సాహసాన్ని ఎంతో పొగిడేవారు. హైకోర్టు, ఉరిశిక్షను జన్మఖైదుగా మార్చింది. నాలుగు వైపులనుండి ప్రశంసల వర్షం కురుస్తూన్నప్పుడు ఉరికంబాన్ని ఎక్కడం వేరు. ప్రభుత్వసాక్షి అయ్యాడన్న కళంకాన్ని భరిస్తూ ఉరికంబం ఎక్కడానికి సిద్ధపడడం సాధారణ సాహసంతో కూడిన పనికాదు.

పై వ్యవహారంలో ఇంద్రపాల్ మానసికంగా చాలా బాధపడ్డాడు. పోలీసులూ చాలా హింసించారు. ఇవన్నీ కల్సి అతడికి పెరాలసిస్ వచ్చింది. కొన్నాల్టివరకూ ఈ పక్షపాతమూ వేషమే అనుకున్నారు జైలు అధికారులు. అతడి బాధను లెక్కపెట్టలేదు. తరువాత 'నిజంగా పక్షపాతమే అనుకున్నారు. ఐతే, వైద్యం ఎలా చేయించాలి ?' అన్న ఆలోచనలో పడ్డారు.

శ్యామ్‌లాల్‌గారిని, ఇంద్రపాల్ యొక్క నియమబద్ధమైన జీవితమూ, అతడి సాహసమూ గొప్పగా ప్రభావితం చేశాయి. ఇంద్రపాల్ ప్రాణాల్ని రక్షించడానికి వారు గాంధీగార్ని కలుసుకున్నారు. గాంధీగారు ఈ విషయమై, అప్పుడు పంజాబు ముఖ్యమంత్రిగా వున్న సికందర్ హయాత్‌ఖాన్‌కు జాబు రాశారు. గొప్ప గొప్ప ప్రభుత్వ డాక్టర్లు ఇంద్రపాల్‌ను పరీక్షించారు. రోగం అసాధ్యమైన స్థితికి చేరిందనీ,

ఇప్పుడు వైద్యం పనిచేయదనీ నిర్ణయించారు ! ఏ క్షణంలోనైనా ప్రాణాలు పోవచ్చునన్నారు. ఇక బ్రతకడన్న ఉద్దేశంతో ప్రభుత్వం అతడిని వదిలి పెట్టింది.

విడుదలైనప్పటి ఇంద్రపాల్ స్థితి అతి దారుణంగా వుంది. లేచి కూచోలేడు. మాట్లాడలేడు. కాళ్ళూ చేతులూ వంకర్లు తిరిగిపోయాయి. జైలుకు వెళ్ళడానికి నాలుగయిదు నెల్ల క్రితమే అతడికి వివాహం అయింది. అతడి భార్య జగదీశ్వరి- భర్తకు వైద్యం ప్రారంభించింది. వైద్యులు చెప్పిన తైలాల్ని పట్టుకువచ్చి వంటికి రాస్తూ వుండేది. మందులు వేస్తూ వుండేది. రాత్రింబవళ్ళు సేవ చేసేది. నేను 1938లో విడుదల అయ్యాను. 39లో ప్రెస్‌పనివారి కాన్ఫరెన్సులో పాల్గొనడానికి లాహోరు వెళ్ళాను. అప్పుడు ఇంద్రపాల్ మంచంలో పడుకునే కొంచెంగా మాట్లాడే స్థితికి వచ్చాడు. ఆ వెనుకటి సాహసంతో కూడిన నిర్లక్ష్యం పోనేలేదు అతడిలో ! నన్ను చూడగానే అరిచాడు "అరె ... అరె ... ఉప్పూ, పప్పూ, చింతపండు - అమ్మోవాడి కొడుకువచ్చాడు ! ఏయ్, జగదీశ్వరీ ! బియ్యం, పప్పూ దాచిపెట్టేసెయ్యి ! లేకపోతే తిండిపెట్టాల్సి వస్తుంది !" అన్నాడు.

నా బలవంతం వల్ల భార్యా - భర్తలిద్దరూ లక్నో వచ్చారు. చాలా రోజుల పాటు కరెంటు వైద్యం చేయించాము. కాసేపు కూర్చునే స్థితికి వచ్చాడు. కర్రసాయంతో కుంటుతూ నడుస్తున్నాడు కూడాను. నేను విడుదల అయ్యాక 1938 నవంబర్‌లో 'విప్లవ్' అనే హిందీ మాసపత్రికను ప్రారంభించాను. 1939 అక్టోబరులో వుర్దూలోనూ 'విప్లవ్'ను తీసుకురాసాగాము. ఇంద్రపాల్ హిందీని వర్దూలోకి అనువాదం చేస్తూండేవాడు. కానీ, ప్రభుత్వం రు. 12 వేల ధరావత్తు అడగడం వల్ల కొద్ది రోజుల్లోనే 'విప్లవ్' పత్రిక ఆగిపోయింది. ఇంద్రపాల్ లాహోర్ వెళ్ళిపోయాడు. అక్కడ మరికొందరు వ్రాయసగాళ్ళతో కల్సి వుర్దూ రాతపనిని చేస్తుండేవాడు. అతడి ఆరోగ్యం చాలావరకు కుదుటపడ్డది. కర్రసాయంతో మైలూ, రెండు మైళ్ళు తిరిగి రాగలుగుతున్నాడు. ఒక కొడుకూ, ఒక కూతురూ కలిగారు. మాటల సందర్భంలోనే తన ఆదర్శాన్ని ప్రచారం చేస్తుండేవాడు. రెండు కరపత్రాల్నీ కూడా వేశాడు. 1947లో, పంజాబు విభజనతో అతడికి తిరిగి భయంకరమైన మానసిక వేదన కలిగింది. రోగం తిరగబెట్టింది. లాహోరునుండి ఢిల్లీ వచ్చాడు. హాస్పిటల్లో చనిపోయాడు. జగదీశ్వరి ఢిల్లీలోని ఒక స్కూల్లో కుట్టు టీచరుగా పనిచేస్తూ పిల్లల్ని చదివించుకుంటోంది. ఇప్పుడామె చందోసీలో వుంటోంది.

# చంద్రశేఖర్ ఆజాద్

నేను రష్యా వెళ్ళడాన్ని గురించి ఇతర మిత్రుల్తో మాట్లాడడమూ అవసరమే ! ముఖ్యం సురేంద్రపాండేతో మాట్లాడాలి ! నా రష్యా ప్రయాణానికి పాండే అంగీకరించడమే కాదు, తనూ వస్తానన్నాడు. ఆ రోజుల్లో అలహాబాద్ 'కటరా'లో తీసుకున్న ఇంటిలో సిద్ధాంత చర్చల్లో మునిగితేలుతుండేవాళ్లం ! రష్యా వెళ్ళడాన్ని గురించి, రౌండ్ టేబిల్ కాన్ఫరెన్సును గురించి కూడా చెర్చిస్తూండేవాళ్ళం. ఇంగ్లీషు ప్రభుత్వం కాంగ్రెసును ప్రజల పార్టీగా గుర్తించి చర్చలకు ఆహ్వానించడం ఇదే ప్రధమం. దీంతో కాంగ్రెసువారు ఇంక తమకు బ్రిటీష్ ప్రభుత్వం స్వరాజ్యాన్ని ఇచ్చేయ బోతూన్నదన్న ఉబలాట పడ్డారు. ఇంగ్లీషు ప్రభుత్వానికి - కాగ్రెసుకూ ఏదో ఒక విధమైన ఒప్పందం కుదురుతుందని మేమూ అనుకుంటూనే వున్నాము. మరి అప్పుడు మా స్థితి ఏమిటి ? అప్పుడూ మేము పోరాడుతూ వుండాల్సే వుంటుందా ?

'ఇంగ్లీషు ప్రభుత్వంతో వప్పందం' అన్న భావననే ఆజాద్ భరించలేడు. "ఇంగ్లీషు వాళ్ళు శాసకులుగా ఈ దేశంలో వున్నన్నాళ్ళూ వాళ్ళకూ - మనకూ మధ్య ఎప్పుడూ తుపాకులు పేల్తూనే వుంటాయి. వప్పందం, రాజీ ఇవన్నీ అర్థంలేని మాటలు. వాళ్ళకూ మనకే ఒకటే ఒప్పందం జరగాలి. దాని ప్రకారం వాళ్ళు మూటా - ముల్లె సర్దుకుని తక్షణం ఇక్కడినుండి వెళ్ళిపోవాలి." అనేవాడు ఆజాద్. ఇదే భావన 1942 నాటి 'క్విట్ ఇండియా' నినాదంలో ధ్వనించింది. సిద్ధాంతరూపంగా ఆజాద్ భావాన్ని నేనూ, సురేంద్రపాండే కూడా ఒప్పుకునేవారం. ఐతే, కాంగ్రెసు నాయకుల్ని శత్రువుల్ని చేసుకోవడం మాకు ఇష్టం లేదు. 'బ్రిటీష్ ప్రభుత్వానికీ కాంగ్రెసుకూ జరిగే వప్పందం ఎలాంటిదో, వేచిచూద్దాం !' అనేవాళ్ళం మేము. ఈ విధంగా సిద్ధాంతాన్ని గురించి, ఆదర్శాన్ని గురించి చర్చించుకు నేప్పుడూ వ్యక్తిగత జీవితమూ మా ముందు ప్రశ్నార్థకంగా నిలిచేది ! ఇంతా అయ్యాక వ్యక్తిగతంగా మా స్థితి ఏమిటి ? మేమేం చెయ్యాలి ?

ఒక్కోమాటు పరిహాసంగా అనేవాణ్ణి ఆజాద్‌తో. "భయ్యా ! భయపడతావెందుకు ? కాంగ్రెసూ, ఇంగ్లీషు ప్రభుత్వమూ రాజీ అంటూ పడితే, ఇంక మనం ఇలా రహస్య జీవతాన్ని గడపవలసిన పనిలేదు ! నీ పేరు బాగా ప్రసిద్ధికి వచ్చింది. నువ్వు పోలీసు ఇన్‌స్పెక్టరు వేషానికి సరిపోతావని కాంగ్రెసువాళ్ళకు తెల్సు ! నీకు ఇనస్పెక్టర్ ఉద్యోగం ఇస్తార్లే !"

ఆజాద్‌కు ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం అంటే తగని కోపం. తన్ను ఆ ఉద్యోగానికే సరిపోయేవాడుగా ఎంచుతూన్నందుకు మండిపడేవాడు. 'దొంగ నాయాల ! నువ్వు మహా మేధావివి ? అరిస్టోటల్‌వి గదూ ? దిగి వచ్చావు ! ఐతే, మరి నువ్వేమవుతావప్పుడు ?" అని అడిగేవాడు.

నేను పరిహాసాన్ని ఇంకొంచెం పొడిగించేవాణ్ణి. "నువ్వు ఇనస్పెక్టర్‌వయ్యాక నా గురించి రికమెండ్ చెయ్యవా ? కనీసం నేను హెడ్ కానిస్టేబుల్‌నయినా అవుతాను కదా ?" అని పాండేవైపు చూపుతూ "ఇతడెప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూంటాడు. ఇతణ్ణి మిడిల్ స్కూల్ హెడ్మాస్టర్ని చేయించు !" అనేవాడిని. నేనూ, పాండే ఇంకా బ్రతికి వున్నాం. కాంగ్రెసు ప్రభుత్వ దయవల్ల నేను హెడ్‌కానిస్టేబుల్ నయినా కాలేకపోయాను. పాండే మిడిల్ స్కూల్ హెడ్మాస్టరూ కాలేకపోయాడు !

× × ×

1931 సం॥ అలహాబాదులోని 'కటరా' లో వున్నప్పుడు జరిగిన ఒక సంఘటను మరువలేము. రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సు పరిణామం కోసం ఎదురుచూస్తూ, నిరాశలో, నిష్క్రియతలో రోజుల్ని దొర్లిస్తున్నాము.

ఒకరోజున పాండే చ్యవనప్రాస డబ్బానొకదాన్ని తీసుకువచ్చాడు. రాత్రి పడుకోబోయే ముందు ఆ డబ్బాను ఆజాద్ చూశాడు. "ఏమిట్రా ఇది ? దీన్లో నల్లనల్లగా వుంది !" అనడిగాడు.

"దగ్గుమందు !" అన్నాడు పాండే.

నేను "చాలా బలవర్ధకమైన మందుకూడాను !" అన్నాను.

ఆజాద్ అనుమానించాడు. "నాయాల, ఇది మలాంలాగా వుంది గదరా ?" అన్నాడు.

"బాగా రుచిగా వుంటుంది !" అన్నాను నేను.

కొంచెం నాలుకకు రాచుకుని రుచి చూసి "నిజమే ! రుచిగా వుందే !" అంటూ డబ్బాడూ తినేశాడు.

పాండే గోలపెట్టేశాడు. "భయ్యా ! ఇది మందు. అలా తినకు ! తరువాత బాధపెడు తుంది !" అన్నాడు.

ఆజాద్ వినలేదు. "ఫో ! ఫో !" అన్నాడు.

మర్నాడు ఉదయమే శరీరంలో బాధలు ప్రారంభం అయ్యాయి. మా యిద్దరిమీదా మండి పడ్డాడు. "ఏమిటిది ? అర్థం పర్థం లేకుండా, బలవర్ధకం అని తినిపించారు ...." అన్నాడు. మేము ఒకటే నవ్వడం, అతడు చ్యవనప్రాసను ఒకటే తిట్టడం !

× × ×

రౌండు టేబుల్ కాన్ఫరెన్సు రాజకీయ వాతావరణం మీద బాగా ప్రభావాన్ని వేసింది. ఇంగ్లీషు ప్రభుత్వంతో పోరాటాన్ని ఇక విరమించవల్సి వుంటుందేమోనని మేమూ అనుకోసాగాము. పోరాటాన్ని విరమిస్తే మా భావి జీవితాలు ఎలా వుంటాయి ? మేము ఏం చెయ్యాలి ? అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి మాలో. అదే రోజుల్లో ఆజాద్ కాన్పూర్ చున్నీగంజిలో తీసుకున్న ఇంట్లో, రాత్రిపూట్ల తన గత జీవితాన్ని గురించి మాకు చెప్తూండేవాడు.

ఆజాద్ చెప్పిందాన్ని బట్టి, అతనికి బాగా దగ్గర సంబంధం గల వ్యక్తి, మిత్రుడు - భగవాన్‌దాస్ మాహోర్ చెప్పిందాన్ని బట్టి, అలాగే పరారీలో వుండగా ఆజాద్‌కు ఆశ్రయాన్ని ఇచ్చి ఆదరించిన మాస్టర్ రుద్రనారాయణ్ గారు చెప్పినదాన్ని బట్టి - ఆజాద్ మధ్య భారతంలోని ఝాబులీ తాలూకాకు చెందిన 'భావరా' గ్రామంలో జన్మించాడన వచ్చును ! అప్పట్లో ఆ గ్రామం ఆలీపూర్ జమిందారీలో వుండేది. ఆజాద్ తండ్రి పేరు సీతారం తివారీ, తల్లి పేరు జగరానీదేవి. తివారీ స్థితిపరుడు కాకపోయడం వల్ల ఉన్నావ్ జిల్లాలోని తన బావగార్లయిన శివనందన్‌మిశ్ర, రామప్రసాద్ మిశ్రల దగ్గర వుంటూండేవాడు. తివారీ నిస్వార్థపరుడైన శ్రోత్రియ బ్రాహ్మణుడు. కోపిష్టి, ఎవరి మాటా వినేవాడు కాడు. ఏదో చిన్న విషయానికి బావగార్ల మీద కోపగించుకుని ఉన్నావ్ నుంచి ఆలీరాజపూర్ వెళ్ళిపోయాడు. అక్కడ ఎనిమిది రూపాయిల నెల జీతానికి తోట కాపరిగా వుండిపోయాడు. ఆ జీతానికి తగినట్టుగానే ఆ రోజుల్లో జీవితావసర వస్తువుల ధరలూ చాలా చౌకగా వుండేవి.

చిన్నతనంలో ఆజాద్‌లోనూ బాల్య చాపల్యం వుండేది. తినడంపట్లా, ఆటలపట్లా ఎటూ ఆసక్తి వుండేది. అతడికి బెల్లమంటె చాలా ఇష్టం ! ఆటల్లో మందుకూరి కాల్చే బొమ్మ తుపాకులాట అతడికి మహా ఇష్టమైన ఆట. ఐతే, ఆ ఆట ఆడుకోవడానిక పటాసు కావాలి ! పటాసు కొనుక్కోవడానికి డబ్బులు వుండేవి కావు. ఒకరోజు తోట తమ సొంతమే అనుకుని కొన్ని పళ్ళను అమ్మి బెల్లమూ, పటాసు కొనుక్కున్నాడు. తండ్రి దృష్టిలో ఇది క్షమించరాని అపరాధం అయింది. తండ్రి విపరీతంగా కొట్టాడు. తల్లి హృదయం కంపించిపోయింది. స్వాభిమాని అయిన ఆజాద్ ఇంక ఆ యింట్లో వుండలేకపోయాడు. చదువుకోవాలన్న ఆసక్తి వుంది హృదయంలో. తల్లి అతి కష్టం మీద కూడబెట్టిన పదకొండు రూపాయిలూ కొడుక్కు ఇచ్చింది. ఆజాద్ తండ్రికి చెప్పకుండా, విద్యలకు కేంద్రమైన కాశీకి వెళ్ళిపోయాడు. అక్కడ అతడొక సత్రంలో వుండి లఘుకౌముది, అమరకోశం చదువుకుంటున్నాడు. శాసనోల్లఘున ఉద్యమం తీవ్రస్థాయిలో వున్న రోజులవి. ఆ వుద్యమం ఆజాద్‌ని బాగా ఆకర్షించింది. అప్పుడు ఆజాద్‌కు పదమూడు, పద్నాలుగు ఏళ్ళుంటాయి.

శాసనోల్లంఘనం ఉద్యమంలో పాల్గొన్నాడు. అరెస్టు చేసి మెజిస్ట్రేటు ముందు నిలబెట్టారు. అప్పుడు అతడి చేతులు చాలా చిన్నవి. బేడీల్లోంచి బైటకు వస్తూండేవి. ఆజాద్ తన చేతుల్ని బయటకు తీసి పోలీసువాళ్ళకు చూపించి, వాళ్ళను ఏడిపిస్తుండేవాడు. పోలీసులు ఇది చూసి, రెండు చేతులకూ కలిపి ఒకే బేడీని వేసేశారు. మేజిస్ట్రేటు ఆజాద్‌ను అవమానపరిచాడు "వేలెడు లేవు. పెద్ద వుద్యమాన్ని నడపడానికి వచ్చావా ? ఫో ఆవతలకి !" అన్నాడు. ఆజాద్ మేజిస్ట్రేటును తిరస్కారంగా మాట్లాడాడు. బ్రిటీషు చట్టం పధ్నాలుగేళ్ళ కుర్రవాడికి జైలు శిక్ష మేయడానికి వప్పుకోదు. అందుకని

మేజిస్ట్రేటు, ఆజాద్‌కు 12 పేము బెత్తపు దెబ్బల శిక్షను విధించాడు. దెబ్బలు కొట్టి వదిలిపెట్ట వల్సిందని పోలీసులకు చెప్పాడు. ఈ మాత్రపు దండనతో కుర్ర వెధవకు బుద్ధి వస్తుందనుకున్నాడు మేజిస్ట్రేటు!

కోర్టు ద్వారా విధింపబడిన 12 పేము బెత్తపు దెబ్బల శిక్షను కొందరు సరిగా అర్థం చేసుకోలేకపోవచ్చును. స్కూల్లో అల్లరిపిల్లలను మాస్టరుగారు కొట్టినట్టే కోర్టు శిక్షను కూడా అమలు పరుస్తారని చాలామంది అనుకోవచ్చును. కానీ, అలా వుండదా శిక్ష. శిక్షపడిన వ్యక్తిని జైల్లోకి తీసుకువెడతారు. నిలువుగావున్న నలుచదరపు చక్కకు రెండు చేతులనూ కట్టేస్తారు. వీపు మీదా పిర్రల మీదా గుడ్డల్ని తీసేస్తారు. పిర్రలమీద మలాంటాంటి మందును పూస్తారు. పేము బెత్తాలను నీళ్ళల్లో నానబెడతారు. పేము బెత్తపు శిక్షను అమలు పరచడంలో అనుభవజ్ఞుడైన పాకీవాడు, తన పూర్తి బలాన్ని ఉపయోగించి, చేతులు చాచి చాచి పిరుదుల మీద కొడుతూ వుంటాడు. జైలర్ ఒకటి రెండూ లెక్కపెడుతూ వుంటాడు. మొదటి దెబ్బకే పిర్రల్నుండి, వీపు నుండి రక్తం చిందుతుంది. పదమూడు పధ్నాలుగు ఏళ్ళ ఆజాద్‌కు అలాగ 12 పేము బెత్తపు దెబ్బలు కొట్టారు. ఆజాద్ ప్రతి ఒక్క దెబ్బకు 'వందేమాతరం', 'మహాత్మా గాంధీకీ జై' అంటూ దీర్ఘ నినాదాల్నిచ్చాడు.

పేము బెత్తపు దెబ్బల శిక్షను అనుభవించి విడుదలయ్యాక, ఆజాద్ మరికొంచెం ఉత్సాహంతో ఉద్యమంలోకి దూకాడు. కాకోరీ రైలు దోపిడీలో ఆజాద్ కూడా పాల్గొన్నాడు. అరెస్టులు ప్రారంభం అవడంతో పరారయ్యాడు. చిన్నతనంలోనూ అతడు బాగా అల్లరి చేసేవాడు. చురుగ్గా వుండేవాడు. తొందరనూ, చురుకు దనాన్నీ చూసి మిత్రులు 'క్విక్ సిల్వర్' (పాదరసం) అన్న పేరు పెట్టారు ఆజాద్‌కు. రామ్ ప్రసాద్ బిస్మిల్‌తో పాటు చాలా రాజకీయ దోపిడీల్లో పాల్గొన్నాడు. అలా దోపిడీకి వెళ్ళినప్పుడు, ఆడవాళ్ళ మీద చెయ్యి వేసేవాడు కాదు. వాళ్ళ వంటిమీది నగలనూ లాక్కునేవాడు కాదు. ఒక రాకూరు ఇంటికి దోపిడీకి వెళ్ళారు. ఇంటి యజమానురాలు నగల పెట్టె మీద కూచుంది. ఆజాద్ ఆమెతో "అమ్మా ! కొంచెం తప్పుకోండి !" అన్నాడు. ఆమె తప్పుకోలేదు. అయినప్పటికీ ఆజాద్ ఆమెను కొట్టనూలేదు. పక్కకు నెట్టనూలేదు. వీళ్ళు తిరిగి వెళ్ళేప్పుడు ఆమె ఆజాద్ ముంజేతిని పట్టుకుంది. ఆజాద్ మర్యాద కోసం ఆమెతో పెనుగులాడకుండా అలాగే నిలబడి వున్నాడు. మిత్రులందరూ బయటకు వచ్చారు. ఇతడు మాత్రమే బయటకు రాలేకపోవడంతో బిస్మిల్ లోపలకు వెళ్ళి చూశాడు. ఆజాద్ యజమానురాలి చేతిలో బందీయై నిలబడి వున్నాడు. బిస్మిల్ ఆమె ముంజేతి మీద ఒక దెబ్బ వేసి ఆజాద్‌ను బంధ విముక్తుణ్ణి చేశాడు. బయటకు వచ్చాక ఆజాద్‌ను కోప్పడ్డాడు. "అలా మొద్దులా నిలబడ్డావేం ? అందరి ప్రాణాల మీదకూ తెచ్చేవాడివి !" అన్నాడు.

చిన్నతనంలో చదువుకోవాలన్న కోర్కె వుండేది అతడికి. ఆ ఒక్కకోర్కె మినహాయిస్తే, ఇంక ఆజాద్‌కు వ్యక్తిగతమైన జీవితాదర్శాలు ఏమీ లేవనే చెప్పాలి. చిన్ననాటి చదువు అంటే సంస్కృతం చదవడమే. 'సంస్కృతానికి ఆధునిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ జీవితంతో ఎలాంటి సంబంధమూ లేదు' అని అచిరకాలంలోనే తెల్సుకున్నాడు. రాజకీయ చైతన్యాన్ని పొందాక, స్వాతంత్ర్యం కోసం పరప్రభుత్వంతో పోరాడడం తప్ప అతడికి మరో కోర్కెగానీ, ఆదర్శంగానీ లేకపోయింది. పరప్రభుత్వపు పోలీసులతో పోరాడుతూ చనిపోవడమే తన జీవితానికి పరమావధి అనేవాడు. తన జీవిత పరిణతి కూడా అదేనని అతడి దృఢ విశ్వాసం ! అరెస్టు కావడం, కోర్టుల్లో నిలబడడం అతనికసలు గిట్టదు. ఎప్పుడూ అంటూండేవాడు "అరెస్టయి, కోర్టులో చేతులు కట్టుకు నిలబడి, కోతిలా ఆడడం నావల్ల కాదు. నా పిస్తోలులో ఎనిమిది గుళ్ళుంటాయి. ఇంకో ఎనిమిది గుళ్ళ మేగజీన్ దగ్గరుంటుంది. పదిహేను గుళ్ళతో శత్రువుల్ని కాలుస్తాను. పదహారోగుండును ఇక్కడ కాల్చుకుండాను !" అంటూ తన కణతకు పిస్తోలు ముఖాన్ని తాకించేవాడు.

ఎక్కడ విన్నా ఇంగ్లీషు ప్రభుత్వంతో కాంగ్రెసు రాజీపడుతుందన్న వార్తలే వినిపిస్తున్నాయి. ఈ వార్తల ప్రభావం ఆజాద్‌మీదా పనిచేసింది. ఆ రోజు రాత్రి అన్నాడు. "కాంగ్రెసు ఒకవేళ ప్రభుత్వంతో రాజీ పడితే, నేను పెషావరు గుండా సరిహద్దు దాటి వెళ్ళిపోతాను. వజీరీ, అఫరీదీ ప్రజలు ఆంగ్ల ప్రభుత్వంతో ఎప్పుడూ రాజీపడరు. వాళ్ళతో కల్సి బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడుతాను... సోహన్ ! అలాంటప్పుడు వంటరితనం మహాబాధాకరంగా వుంటుంది. నువ్వూ, పీయూ (ప్రకాశవతి) మంచి పని చేశారు. జీవితంలోని సర్వావస్థల్లోనూ స్త్రీపురుషులు మాత్రమే సహచరులుగా వుండగలరు. నేను సహచరిని ఎన్నుకోవాలనుకున్నా. నాకు తగిన స్త్రీ ఎక్కడుంది ? దీదీనే తీసుకుందాం, (సుశీల) శరీరంలో సేరు మాంసం లేదు. ఒట్టి బుర్రను ఏం చేసుకుంటాం ? బాభీ పరవాలేదు .... అయినా ఆమె పనికిరాదు ! నాకు సహచరి కాబోయే స్త్రీ ఎలా వుండాలో తెల్సా ? కాంగ్రెసు రాజీపడినప్పటికీ మేమిద్దరం సరిహద్దు దాటి వెళ్ళిపోతాం ! ఇద్దరి భుజాల్నా రైఫిళ్ళు ఉంటాయి. ఇద్దరి దగ్గరా తూటాలుంటాయి. శత్రువులు ముట్టడించినప్పుడు, ఆమె రైఫిల్ నింపి ఇస్తూంటుంది. నేను ధనాధన్ కాల్చేస్తుంటాను. ఇద్దరం అలాగే పోరాడుతూ ప్రాణాలర్పించేస్తాం !"

స్త్రీ గురించిన- ఆజాద్ భావాల్లో చాలా మార్పు వచ్చింది. ఒకప్పుడు స్త్రీని 'సూదంటురాయి' అనేవాడు. కానీ, క్రమేణా అతడి భావాలు మారాయి. ఒక్కోప్పుడు వీరభద్రతివారీ మీది కోపంతో ఇలా అనేవాడు. "నాయాల, భార్యను ఘోషాలో వుంచుతాడు. దొంగవస్తువును దాచినట్టు దాస్తాడు భార్యను !"

ఆజాద్ తన రహస్య జీవితంలోని ఎక్కువ భాగాన్ని ఝూన్సీ నివాసి ఐన శిల్పి మాస్టర్ రుద్రనారాయణ గారి ఇంట్లో గడిపాడు. ఆ ఇల్లంటే ఆజాద్‌కు ఎంతో విశ్వాసం. అందుకనే, మాస్టర్‌గారి బలవంతం వల్ల అక్కడే ఒకసారి ఫోటో తీయించుకున్నాడు. రుద్రనారాయణగారు ఆజాద్ శిల్పాన్ని చెక్కాలనుకున్నారు. అందుకే ఫోటో అవసరం అయింది. మాస్టర్‌గారు ఆజాద్ శిల్పాన్ని చెక్కారు. ఆ శిల్పాన్ని వారు అమూల్యమైన నిధిగా భావిస్తున్నారు.

ఆజాద్ తరచు మాస్టర్‌గారితో పోట్లాడుతుండేవాడు. వదినెగారిని ప్రజా ఉద్యమాల్లో పనిచేయనీయరేమని అడిగేవాడు. ఝూన్సీలో పోలీసుల హడావిడి ఎక్కువైంది. ఆజాద్ నుండి వార్తల్ని తీసుకువెళ్ళడం, తీసుకరావడం - 'గునియా' అనే ఒక పనిమనిషి చేస్తుండేది. గునియా యవ్వనంలో వుంది. అందంగానూ వుండేది. ఆమెను గురించి నలుగురూ నాలుగు రకాలుగా చెప్పుకునేవారు. ఐతే, ఆమెను గురించిన అలాంటి వార్తల్ని ఆజాద్ చెవిని పెట్టేవాడు కాదు. ".... ఎవరు ఏం చెప్పుకున్నా ఆమె మోసకారికాదనీ, విశ్వసించదగిన వ్యక్తి అనీ నాకు తెల్సు. కనుక, ఆమె సచ్చరిత్రురాలే !" అనేవాడు ఆజాద్. 'సచ్చరిత్రత' అన్న శబ్దాన్ని కేవలం లైంగిక విషయాల వరకే పరిమితం చేసేవాడు కాదు. నియమబద్ధత, సాహసం, నిర్లోభం - అతడి దృష్టిలో విలువైనవి.

1931వ సంవత్సరం ప్రారంభంలోని విషయం. రౌండు టేబుల్ కాన్ఫరెన్సు సందర్భంగా కాంగ్రెసు రాజీపడితే, రాగల మార్పుల గురించి పండిట్ జవహర్‌లాల్‌తో మాట్లాడడానికి ఆనందభవనానికి వెళ్ళాడు ఆజాద్. కొద్ది రోజుల క్రితమే మోతీలాల్ చనిపోయాడు. వెనక ఒకమారు ఆజాద్ మోతీలాల్‌నూ కల్సుకున్నాడు. అప్పుడు మోతీలాల్‌ని కల్సుకోవడానికి కారణం సిద్ధాంతాన్ని గురించిగానీ, రాజకీయ సమస్యల్ని గురించిగానీ మాట్లాడవల్సి రావడంకాదు. మోతీలాల్ చాలా ఉత్సాహవంతుడు. సాహసవంతుడూనూ ! తాను కాంగ్రెసు పార్టీ వాడయినప్పటికీ, విప్లవకారులకుసహాయం చేస్తూండేవాడు. కాకోరీ కుట్ర కేసులోని నిందితులకు కోర్టువ్యవహారాల సంబంధంగా చాలా సహాయం చేశాడు. బహుశ, ఆజాద్‌ను గురించి విని, అతడిని చూడడానికి పిలిపించుకుని వుండవచ్చును. అపుడు మోతీలాల్

ఆజాద్‌కు తమ ఇంట్లో భోజనం కూడా పెట్టించాడు. చక్కగా మాట్లాడాడు. జవహర్‌లాల్ చెల్లెలు కృష్ణ అప్పుడు అక్కడే వుంది. ఆజాద్ ఆమె ఉర్దూ ఉచ్ఛారణను అనుకరిస్తూ మమ్మల్ని నవ్విస్తుండేవాడు కూడాను.

పండిట్ నెహ్రూ తన ఆత్మకథలో, ఆజాద్ తన్ను కల్సుకున్న సందర్భాన్ని గురించి ఇలా రాశాడు .... అతడు నన్ను కల్సుకోవడానికి కారణం, మేము జైళ్ళనుండి విడుదల అవడం వల్ల ప్రభుత్వానికీ మాకూ కొంత రాజీ కుదురుతున్న ఆశ అందరిలోనూ కలగసాగింది. ఒకవేళ కుదిరితే, వాళ్ళ పార్టీ సభ్యులకూ కొంత శాంతి లభిస్తుందా ? లేదా ? అప్పుడూ వాళ్ళ పార్టీ వాళ్ళను రాజద్రోహులుగానే చూస్తారా ? ఇలాగే వెంటాడుతుంటారా ? వాళ్ళ తలలకోసం ఇలాగే బహుమతులు ప్రకటిస్తూ వుంటారా ? ఉరికంబం ఇప్పటిలాగే వాళ్ళకోసం ఎదురుచూస్తూ వుంటుందా ? లేక శాంతంగా పనిపాట్లు చేసుకునే అవకాశం లభిస్తుందా ? అతడు ఇంకా ఇలా అన్నాడు. 'నేనూ, నా సహచరులూ దౌర్జన్యవాదం నిరుపయోగం అన్న నమ్మకానికి వచ్చాము. దీనివల్ల ప్రయోజనం లేదు. ఐతే, శాంతి మార్గం ద్వారా భారతదేశానికి స్వాతంత్ర్యం లభిస్తుందనీ మేము అనుకోవడం లేదు. భవిష్యత్తులో ఎప్పుడైనా సాయుధ పోరాటానికి అవకాశం కలగవచ్చు. ఆనాడు జరిగే పోరాటం దౌర్జన్యవాదం కాదు !"

ఇదే సందర్భంలో మరికూడా ఇలా రాశాడు. నెహ్రూ "దౌర్జన్యవాదం పట్ల వారికి వున్న నమ్మకాలు తొలిగి పోయినందుకు, నాకు చాలా సంతోషం కలిగింది. ఐతే, వారి వెనుకటి మిత్రులూ, ఇప్పటి సహచరులూ అహింసా పరులయ్యారని గానీ, లేక బ్రిటీష్ ప్రభుత్వానికి భక్తులయ్యారనిగానీ అనుకోరాదు. నాకేమనిపించిందంటే, వారిలో చాలామంది ఫాసిస్టు వృత్తికి దిగజారారనిపించింది."

నెహ్రూగారి ఆత్మకథలోని ఈ సందర్భాన్ని గురించి చర్చించేప్పుడు మనం ఒక విషయాన్ని మర్చేపోరాదు. నెహ్రూగారు దీన్ని బ్రిటీష్ శాసనకాలంలో రాశారు. అన్ని విషయాలూ స్పష్టంగా రాయడానికి అవకాశం లేదు. దీన్ని వారు 1934 లోనో, లేక 36 లోనో రాశారనుకుంటాను. అప్పటికి ఆజాద్ చనిపోయాడు. ఆజాద్ చనిపోవడానికి కొద్దిరోజులు మందు నేను నెహ్రూను కల్సుకున్నాను. ఆ విషయాన్ని ఆయన రాయలేదు జ్ఞాపకం లేక రాయలేదనుకోవడానికి వీల్లేదు. ఎందుకంటే, 1938లో నేను వార్ని భువాలీలో కల్సుకున్నాను. అప్పటికి, వెనుక నేను తనను కల్సుకున్న విషయం జ్ఞప్తిలోనే వుంది ఆయనకు ! నేనీ ఆత్మకథను 1937లో నైనీ జైల్లో వుండగా మొదటిసారి చదివాను. మమ్మల్ని పాసిష్టులనడాన్ని గురించి అప్పుడే బాధ పడ్డాను.

నెహ్రూను కలుసుకున్న తరువాత ఆజాద్ 'కటరా'లోని ఇంట్లో మాకావిషయాన్ని చెప్పాడు. బాధతో అతడి పెదాలువణికాయి. "నాయాల, మనల్ని పాసిష్టులంటున్నాడు !" అన్నాడు. ఆజాద్ ఉద్దేశం నెహ్రూను తిట్టాలనికాదు కొన్ని మాటల్ని అతడు వూతపదాలుగా వాడుతూంటాడు. గంభీరంగా మాట్లాడుకునేప్పుడుగానీ, కోపంలోగానీ ఎవర్నీ తిట్టడు. మామూలుగా మాట్లాడుకునేప్పుడు సాధారణంగా తిట్టుపదాల్ని వాడుతూంటాడు. ఆజాద్ 'నాకూ, నాసహచరులకూ దౌర్జన్యవాదం మీద విశ్వాసం పోయింది. అది నిరుపయోగం అని తెల్సుకున్నాము !' అని వుండడు. 'మేము దౌర్జన్యవాదులం కాదు. సాయుధ పోరాటానికి ప్రయత్నిస్తున్నాము !' అని చెప్పి వుంటాడు. నెహ్రూగారు రాసిన తరువాత పంక్తులవల్ల ఈ విషయంల స్పష్టమవుతుంది 'శాంతి మార్గములోనే భారత దేశానికి స్వాతంత్ర్యం వస్తుందని అతడు ఒప్పుకోడానికి సిద్ధంగాలేడు. భవిష్యత్తులో సాయుధపోరాటానికి అవకావం లభించవచ్చును అని అన్నాడతడు !' నెహ్రూగారికి ఆజాద్ మాటలో ఫాసిజం ఎలా కనుపించిందో అర్థంకాదు. ప్రభుత్వపు దమననీతిమీద ఆధారపడి వుంటుంది ఫాసిజం ! మేము దేశాన్ని పరిపాలించాల్న

పగటికలలు ఎన్నడూకనలేదు. మేము బ్రిటీష్ ప్రభుత్వపు దమననీతిని లేక ఫాసిజాన్ని ఎదిరిస్తున్నాం! మూల అర్థంలో 'ఫాసిస్టు' శబ్దం గాంధీ, నెహ్రూలకే ఎక్కువపాళ్ళు చెల్లుబాటు అవుతుంది.

నెహ్రూ తనను ఫాసిస్టు అన్నందుకు చాలా బాధపడుతూండేవాడు ఆజాద్ ! అతడు 'సోహన్, ఒకమాటునువ్వెళ్ళి, పండిట్ నెహ్రూను కల్సుకో', అనేవాడు. ఫిబ్రవరి చివరి వారంలో శివమూర్తి సింహ్‌ద్వారా నెహ్రూను కల్సుకోడానికి వీలు కల్పించుకున్నాను. సంధ్యాసమయంలో ఆనంద భవనానికి వెళ్ళాను. నేనూ, నెహ్రూగారు గోడనానుకునివున్న నిమ్మచెట్ల వరుసచాటుగా తిరుగుతూ మాట్లాడుకున్నాము. నెహ్రూ దౌర్జన్యవాదం నిరుపయోగం అయినదని చెప్పారు. నేను "మేము దౌర్జన్యవాదులంకాము. విస్తృతమైన సాయుధవిప్లవానికి ప్రయత్నిస్తున్న విప్లవకారులం ! మేమూ దేశ స్వాతంత్ర్యం కోసమే పోరాడుతూన్నాము. ప్రభుత్వ దమన నీతిని వ్యతిరేకిస్తూ, 'నీ ఆయుధ శక్తిని చూసి మేము భయపడము' అని బ్రిటీస్ ప్రభుత్వానికి చెప్తున్నాము. మా ఆదర్శం సామ్యవాదం !" అన్నాను. అప్పుడే నేను రష్యావెళ్ళబోతున్నాననీ, ఆర్థిక సహాయం చేయవల్సిందనీ అడిగాను.

తండ్రి చనిపోయాక తమ ఆర్థికస్థితి ఏమంత బాగాలేదనీ, ఖర్చుల్ని తగ్గించడం, తిరిగి వకాలత్తును ప్రారంభించడంలాంటివి చేయల్సివస్తోన్నదనీ నెహ్రూ చెప్పారు !

"ఇలాంటి విషయాల్లో ఏ ఒక వ్యక్తి మీదనో ఆధారపడలేముకదా ఇలాంటి జాతీయ కార్యక్రమాలు సామూహిక సహాయంవల్లనే జరగగలవు. మీరు మీ పలుకుబడిని మాకోసం ఉపయోగించవచ్చు !" అన్నాను.

"దౌర్జన్యపూరిత కార్యక్రమాలకు నేనేమీ సాయం చెయ్యను. ఐతే, రష్యా వెళ్ళడాన్ని గురించి ఆలోచిస్తాను !" అన్నారు నెహ్రూ. నన్ను రష్యాగానీ, లేక మరే విదేశమైనాగానీ వెళ్ళవల్సిందని సలహా ఇచ్చారు. రష్యా వెళ్ళడానికి ఎంత అవసరం అవుతుందని అడిగారు. నేను "ఇంచుమించు ఐదారువేలు అవసరం అవుతాయి !" అన్నాను.

"అబ్బో .... చాలా అవుతుంది. ఇంత సర్దడం కష్టం ! సరే, ఎంత వీలైతే అంత ! శివమూర్తి సింహ్‌ద్వారా కబురు పెడతా"నన్నారు నెహ్రూ.

తిరిగివచ్చి జరిగినదంతా ఆజాద్‌కు చెప్పాను. ఆజాద్ సంతృప్తి పడ్డాడు. నేనూ, సురేంద్రపాండే రష్యా వెళ్ళడం నిశ్చయమయింది. రామధన్‌సింహ్ సహాయంతో సరిహద్దునుదాటి రష్యా వెళ్ళాలనుకున్నాము. కాంగ్రెసుకూ, ఇంగ్లీషు ప్రభుత్వానికీ రాజీకుదిరి కొన్నాళ్ళపాటు సాయుధ పోరాటాన్ని ఆపవల్సివస్తే, ఆజద్‌కూడా, ప్రకాశవతిని వెంటపెట్టుకుని అదే మార్గాన రష్యా వచ్చేస్తాడు. రష్యా వెళ్ళడాన్ని గురించి ప్రకాశవతితో ఆజాద్ ముందే మాట్లాడాడు.

మూడవరోజుననుకుంటాను శివమూర్తిసింహ్ పదిహేనువందలు తెచ్చియిచ్చాడు. మిగిలిన వాటికోసం నెహ్రూగారు ప్రయత్నిస్తున్నారు అన్నాడు. 'కటరా'లోని ఇంట్లోకి వచ్చి ఆ డబ్బును ఆజాద్‌కు ఇవ్వబోయాను. "నీ దగ్గరే వుంచు !" అన్నాడతడు. ఒక్కరి దగ్గరవుంటే, ఏ ప్రమాదమైనా సంభవించినప్పుడు మొత్తం డబ్బు కూడాపోయే ఇబ్బంది వుంది. అందుకని ఐదువందల రూపాయలు ఆజాద్ జేబులో బలవంతానా పడేశాను. ఆ రాత్రంతా రష్యా వెళ్ళడం గురించే మాట్లాడుకున్నాం !

కొత్త ప్రదేశాలగుండా ప్రయాణం, అనేకమైన అనారోగ్యాలు రావచ్చును. కొన్ని మందులు తీసుకోవడం మంచిదనుకొన్నాను ! పంజాబులో చలి విపరీతం, రెండు స్వెట్టర్లు కూడా తీసుకోవాలను కున్నాం, చౌక్‌కు బయల్దేరాం.

ఆజాద్ "నేను అల్‌ఫ్రేడ్‌పార్కులో ఒక మిత్రుణ్ణి కల్సుకోవాలి. నేనూ అంతవరకూ వస్తాను. మీరు పైకి వెళ్ళిపోదురుగాని !"అన్నాడు.

నేనూ, పాండే, ఆజాద్ - మేము ముగ్గురం సైకిళ్ళమీద అల్‌ఫ్రేడ్ పార్కు ముందునుంచి వెళ్తున్నాం. సుఖదేవరాజు సైకిల్ వేసుకుని పార్కులోకి వెడుతూ కనుపించాడు. ఆజాద్, రాజును కల్సుకోడానికి వచ్చాడుగావును అనుకున్నాను. మమ్మల్ని విడివిడిగా కల్సుకునేవాడు ఆజాద్ ! అతడు పార్కులోకి వెళ్ళాడు. నేనూ, పాండే నేరుగా చౌక్‌కు వెళ్ళాం !

చౌక్‌కు వెళ్ళి అవసరం అయిన మందులు తీసుకున్నాం. ఒక దుకాణంలో రెండు స్వెట్టర్లుకొంటున్నాం. ఇంతలో ప్రజల అరుపులు వినిపించాయి. "కంపెనీబాగ్ (ఆల్‌ఫ్రేడ్‌పార్కు)లో కాల్పులు జరుగుతూన్నాయి !"

పాండే గాభరాపడ్డాడు. వాళ్ళను అడిగాడు. "ఏమైంది ? ఎవరు కాల్చుకుంటున్నారు?"

ఆల్‌ఫ్రేడ్ పార్కులో కాల్పులన్న మాట విని నేనూ కంపించి పోయాను. కానీ, పాండే చేయిపుచ్చుకుని "ఉద్రేకపడకు !" అని చెప్పాను. పార్కులో కాల్పులనేప్పటికే మాకు అర్ధమైంది. పాండేను ఉద్రేకపడవద్దని చెప్పాను, కానీ, నేనే ఆగలేకపోయాను. సైకిల్‌ని వెనక్కి తిప్పి "నేను అక్కడికే వెడుతూన్నాను !" అన్నాను.

"నామాట విను !" పాండే సైకిల్ హేండిల్ పట్టుకుని చెప్పాడు. "వార్త ఇక్కడికి వచ్చేసరికి అంతా అయిపోయి వుంటుంది. కొంచెం తెలివిగా ప్రవర్తించు. నువ్వెళ్ళి ఏం చేయగలవు ? ... నీకు నీవై పోలీసులకు పట్టుపడడం జరుగుతుంది !"

పాండే అన్నమాట నిజమే ! నేనువెళితే పోలీసులకు చేచేతులావప్పగించుకోవడం అవుతుంది!

కళ్ళముందు చీకట్లు వ్యాపించినట్టయింది. ఐనా, మేము ఆగలేక పోయాము. కాసేపు అటూ - ఇటూ తిరిగి పార్కు దగ్గరకు వెళ్ళనే వెళ్ళాము. రోడ్లమీద ప్రజలు గుంపులు గుంపులుగా నిలబడి వున్నారు. పోలీసులు ప్రజల్ని పార్కులోకి పోనీయడం లేదు. విప్లవకారులూ పోలీసులూ కాల్చుకున్నారని ప్రజలు చెప్పుకుంటున్నారు. ఇద్దరు విప్లవకారులను ఓ అరవైమందిదాకా పోలీసులు చుట్టుముట్టారని చెప్పారు. ఇంక సందేహానికి తావెక్కడిది ? విప్లవకారులు చెట్టుకిందకూచుని మాట్లాడుకుంటున్నారు. పోలీసులు వాళ్ళను చుట్టుముట్టి లొంగిపోవాల్సిందని హెచ్చరించారు ఉభయులూ కాల్చుకున్నారు !

అప్పట్లో యు.పి. పోలీసు ఇనస్పెక్టరు జనరలు హాలిన్సు ! అతడు 'Men Only' ఇంగ్లీషు పత్రిక 1954 అక్టోబరు సంచికలో, భారతదేశంలోని తన ఉద్యోగానుభవాల్ని రాశాడు. అందులో 'ఆజాద్ - పోలీసులు' అన్న శీర్షికతో ఈ పోరాటాన్ని వర్ణించాడు. ఆజాద్ కాల్చిన మొదటి గుండు ఇంగ్లీషు పోలీసు సూపరింటెండ్ నాట్‌బావర్ జబ్బకు తగిలింది. పోలీసులు చెట్లగుబుర్లచాటున దాక్కొని ఆజాద్‌మీద, అతని సహచరుని మీదా కాల్పులు జరుపుతూన్నారు. పోలీసు ఇనస్పెక్టరు విశ్వేశ్వరసింహ్ గురి చూసుకోడానికి ఒక పొదచాటునుండి తొంగిచూశాడు. అప్పటికి ఆజాద్ శరీరానికి రెండు మూడు గుండ్లు తగిలాయి. రక్తం బాగా కారిపోయింది. ఆ స్థితిలోనూ అతడు తొంగిచూస్తున్న విశ్వేశ్వరసింహ్ దవడకు గురిచూసి కాల్చాడు. విశ్వేశ్వరసింహ్ దవడ ఎగిరి పోయింది. హాలిన్సు తన లేఖలో ఆజాద్ కాల్చిన ఈ కాల్పులను ప్రశంసిస్తూ 'ఇది ఆజాద్ కాల్చిన చిట్టచివరి కాల్పు ! ఐతే, బహు ప్రశంసాయోగ్యమైన కాల్పు !' అని రాశాడు.

హాలిన్సు, ఆజాద్ పోలీసుల తుపాకీ కాల్పులవల్ల చనిపోయాడని రాశాడు. కానీ, ఆ పోరాటాన్ని కళ్ళారాచూసిన ప్రజలు మరో రకంగా చెప్తున్నారు. ప్రజా కథనాన్ని- అనుసరించి, ఇద్దర్లో ఒకడు గాయపడ్డా పోరాడుతూనే వున్నాడు. రెండవ అతడు పారిపోయాడు. పోరాడుతున్న విప్లవకారుడు చివరి గుండును తనకణతకి కాల్చుకున్నాడు. అతడు పడిపోయాక కూడా పోలీసులు

అతడిని సమీపించడానికి సాహసించలేకపోయారు. ఆ తరువాత కూడా అతడి శరీరంమీద చాలా కాల్పులు జరిపారు. చనిపోయాడని పూర్తిగా నిశ్చయం అయ్యాకనే శవాన్ని సమీపించారు. పోలీసులు శవాన్ని వ్యానులో వేసుకువెళ్ళారు. అప్పుడు ఆజాద్ జేబులో ఐదు వంద రూపాయల నోట్లు వున్నాయని ప్రభుత్వం ప్రకటించింది ! ఆ డబ్బు నెహ్రూగారు పంపించిన పదిహేనువందల్లోది !

అలహాబాదులోని కాంగ్రెసువారు, జాతీయభావంగల ఇతర ప్రజలు ఆజాద్ అంతిమ సంస్కారాన్ని సగౌరవంగా జరపాలనుకున్నారు. నెహ్రూగారి భార్య కమలానెహ్రూ, పురుషోత్తమదాసుటండన్‌గారూ - పోలీసుల నుండి శవాన్ని తీసుకోడానికి చాలా ప్రయత్నించారు. శవాన్ని ఇవ్వడానికి పోలీసులు పేచీపెడుతూన్నారు. చివరకు ఒక వ్యక్తిని ఆజాద్‌కు సోదరుడని చెప్పి, అతడిచేత శవాన్ని అడిగించాము. శవాన్ని చూశాము. కుడికణతన పిస్తోలు దెబ్బవుంది. ఆ దెబ్బకు చుట్టూ వున్న వెంట్రుకలు కాలిపోయాయి. గుండు దూరాన్నుండివచ్చి తగిల్తే అలా కాలాల్సిన పని వుండదు. పిస్తోల్ని కణతకు ఆనించుకు కాల్చుకున్నప్పుడే అలా వెంట్రుకలు తగలబడతాయి. దహన సంస్కారం గంగాతటాన జరిగింది. ఊరేగింపును ప్రభుత్వం నిషేధించినప్పటికీ పెద్ద సంఖ్యలో ప్రజలు పోగయ్యారు. చితాభస్మాన్ని చిటికెడుకూడా మిగులకుండా శ్రద్ధాళువులైన ప్రజలు తీసుకువెళ్ళారు !

మరుసటి రోజునుంచే జాతీయ వీరుడి స్మృతి చిహ్నమైన అల్‌ఫ్రేడ్ పార్కులోని ఆచెట్టును ప్రజలు పూజించసాగారు. మానుకు చాలా గుండ్లు తగిలాయి. లోపలికీ గుచ్చుకుపోయాయి. ప్రజలు ఆ చెట్టును పసుపు, కుంకం - పూలతో, ధూపదీపాలతో పూజించసాగారు. బ్రిటీష్ ప్రభుత్వం దీన్ని సహించలేకపోయింది. కొన్నాళ్ళకి పూజించే ప్రజల సంఖ్య పెరిగింది. ప్రభుత్వం ఆ చెట్టును కొట్టేయించింది. ఐతే, ప్రజలు ఊరుకోలేదు. ఆల్‌ఫ్రేడ్ పార్కును, ఆజాద్‌పార్కు అని పిలవసాగారు. ఆ పేరే ఆపార్కుకు స్థిరం అయిపోయింది. దేశంలోని ఇతర నగరాల్లోను పార్కులకూ, చౌకులకూ ఆజాద్ పేరుపెట్టుకున్నారు. ఎన్నో 'ఆజాద్ పార్కులు' 'ఆజాద్ చౌకులు' వెలిశాయి.

పార్కులోనుండి పారిపోయిన మిత్రుడు సుఖదేవ్‌రాజు ! నాకూ, ఇతర మిత్రులకుకూడా అతడి ఈపనిచాలా గర్హనీయమైందనిపించింది. ఆజాద్ పోరాడుతూండడంవల్ల పోలీసుల దృష్టి అతడిమీద కేంద్రీకరించబడింది. ఇతడు పారిపోవడానికి అవకాశం దొరికింది. పోలీసు ల దృష్టి ఎంత ఆజాద్‌మీద కేంద్రీకరింపబడి వున్నప్పటికీ పారిపోతూన్న సుఖదేవరాజును ఎవరూ కాల్చకపోవడం విస్మయాన్నే కలిగిస్తుంది.

1938లో దీన్ని గురించి సుఖదేవరాజుతో మాట్లాడడం జరిగింది. ఆజాదే తనతోటి 'నేను పోరాడుతాను. నువ్వు తప్పించుకోడానికి ప్రయత్నించు !' అన్నాడని చెప్పాడు అతను. కనుకనే పారిపోయానన్నాడు. ఆజాద్ అలా అనడం చాలా సహజం ! కానీ, 'మిత్రుడు' జగదీశ్, సుఖదేవ్‌రాజు శాలీమార్ బాగ్‌లో వుండగా పోలీసులు చుట్టుముట్టారు. జగదీశ్ పోరాడుతూ ప్రాణాలర్పించాడు. ఇతడు పారిపోవడానికి ప్రయత్నించి, అవకాశంలేకపోవడం వల్ల ఆయుధాల్ని కింద పడేసి లొంగిపోయాడు. జైల్లో ఇతడిని రెండవ లాహోరు కుట్రకేసు నిందితుల్తోపాటు వుంచారు. కానీ, ఇతడు తోటిమిత్రుల్తో వుండలేక దరఖాస్తు పెట్టుకుని విడిగావుంచే ఏర్పాటు చేయించుకున్నాడు.

ఆ సమయంలో ఆజాద్ అల్‌ఫ్రేడ్ పార్కులోవున్నాడని పోలీసులకు ఎవరు ఉప్పు అందించారు ? అనేది పెద్దసమస్య అయింది. సుఖదేవరాజు మరోవిషయం చెప్పాడు. తనూ, ఆజాద్ మట్లాడుకుంటూ ఉండగా పార్కుకు అవతల మేయోకాలేజీ రోడ్డుగుండా వెళుతున్న ఒకవ్యక్తిని చూపించి ఆజాద్ అన్నాడుట "ఆ వెళుతున్న వ్యక్తి వీరభద్రతివారీలాగా ఉన్నాడు. మనల్ని చూశాడేమో !"

అప్పటివరకూ సుఖదేవరాజు వీరభద్రతివారీని చూడలేదు. కనుక ఆ వెళుతున్నది వీరభద్రతివారీ ఔనో కాదో సుఖదేవరాజు నిర్ణయించలేకపోయాడు. ఇదే విషయాన్ని సుఖదేవరాజు ఇతర మిత్రులకూ చెప్పాడు. ఇతడి మాటల ఆధారంగా వీరభద్రతివారీయే ఉప్పు అందించాడు అనుకొన్నారు. ఈ అనుమానంతోనే వీరభద్రతివారీని కాల్చటమూ జరిగింది. ఐతే తప్పించుకొని బతికిపోయాడు.

కొందరు వైశంపాయన్ అందించాడనీ, మరికొందరు నిగమ్ అందించాడనీ, రామరఖ్‌సింహ్ అందించాడనీ ఇంకొందరూ అనుకున్నారు. ఐతే బ్రిటీష్‌వారు దేశాన్ని వదిలి వెళ్ళాక కాంగ్రెసు ప్రభుత్వాలు ఏర్పడ్డాక ఈ విషయాన్ని గురించి నిజాన్ని తెలుసుకోడానికి అనేకరకాలుగా ప్రయత్నించటం జరిగింది. ఆ వెనుకటి ఉద్యోగులు ఇప్పుడు రిటైరైపోయారు. వాళ్ళల్లో కొందరికి ఆనాటిదాడితో దగ్గర సంబంధం ఉంది. లభించిన రికార్డుల్ని బట్టి, ఆనాటి ఉద్యోగులిచ్చిన వివరాల్ని బట్టి మనం యిలా చెప్పుకోవచ్చు.

సి.ఐ.డి. విశ్వేశ్వరసింహ్, కోర్టు ఇనస్పెక్టర్ డాల్‌చంద్ - వీరిద్దరూ ఆరోజు ఉదయం వాహ్యాళికి వెళ్ళి తిరిగివస్తున్నారు. పార్కులో నుంచి వస్తున్న వీరికి ఆజాద్, సుఖదేవరాజ్ చెట్టుకింద కూర్చొని మాట్లాడుకుంటూ కన్పించారు. వీళ్ళను చూసి విశ్వేశ్వరసింహ్ ఇలా అన్నాడు “ఆ మనిషి ఆజాద్‌లా ఉన్నాడు ?” ‘

1920 నాటికి ఆజాద్ 13,14 ఏళ్ళ కుర్రవాడు. సహాయ నిరాకరణోద్యమంలో మహోత్సాహంగా పాల్గొన్నాడు. 12 పేముబెత్తపు దెబ్బలశిక్షను అనుభవించాడు. నలుగురి దృష్టికీ ఎక్కాడు. అప్పుడు విశ్వేశ్వరసింహ్ కాశీలోనే పోలీసు ఇనస్పెక్టరుగా పనిచేస్తున్నాడు. అప్పుడతడు ఆజాద్‌ని చూశాడు. ఐతే గడచిన 11,12 ఏళ్ళలోనూ మళ్ళీ అతడు ఆజాద్‌ను చూడలేదు. ఐనప్పటికీ బలిష్ఠమైన ఆజాద్ రూపం అతడి స్మృతిపథంలో ఉంది. పైగా ప్రతిచోటా ప్రభుత్వ ప్రకటనలలో ఆజాద్ చిత్రం ఉండేది. బలిష్ఠమైన శరీరం, చామనచాయరంగు, స్ఫోటకం మచ్చల ముఖము ఇవన్నీకలిసి విశ్వేశ్వరసింహ్ స్మృతిపథంలో ఆజాద్ ఆకారం మెదులుతూనేవుంది. కనుకనే చెట్టుకింద కూర్చున్న ఆజాద్‌ను కొంతలో కొంత పోల్చుకుని డాల్‌చంద్‌తో ఇలా అన్నాడు. “వాళ్ళిద్దర్నీ కనిపెట్టిఉండు. నేను ఇప్పుడే వస్తాను.”

విశ్వేశ్వరసింహ్ దగ్గరలోనేవున్న సి.ఐ.డి. పోలీస్ సూపరింటెండెంట్ నాట్ బావర్ బంగళాకువెళ్ళాడు. “పార్కులో ఒకవ్యక్తి కూర్చొని ఉన్నాడు అతడు ఆజాద్‌లా ఉన్నాడు” అని చెప్పాడు నాట్‌వబార్‌తో.

కాల్పులు జరిగిన మరుసటిరోజు ఉదయమే అలహాబాదు నుంచి వెలువడే ‘లీడర్’ అనే పత్రికకు నాట్‌బావర్ కొంత సమాచారాన్ని ప్రకటన నిమిత్తం ఇచ్చాడు. ఆ ప్రకటన తాలూకు కటింగ్ ఇప్పటికీ నా దగ్గరవుంది. విశ్వేశ్వరసింహ్ చెప్పినదాన్ని బట్టి, నాట్‌బావర్‌కు పార్కులో ఆజాద్ లాంటి వ్యక్తి ఉన్నాడని మాత్రమే తెలిసింది. అప్పటికే ఆజాద్ లాంటి వ్యక్తుల్ని ఇద్దర్ని అరెస్టుచేయడమూ తరువాత వదలిపెట్టడమూ జరిగింది.

విశ్వేశ్వరసింహ్ సమాచారాన్ని అందించగానే నాట్‌బావర్ పిస్తోలు జేబులో పెట్టుకొని బయలుదేరాడు. అతడి వెంట ఇద్దరు బంట్రోతులూ ఉన్నారు. అతడే స్వయంగా కారు నడుపుతూన్నాడు.

నాట్‌బావర్ రోడ్డుమీద కారు ఆపాడు. కారుదిగి పిస్తోలుచేత బుచ్చుకొని విప్లవకారులవైపు బయలుదేరాడు. అతడికీ, విప్లవకారులకూ 25, 30 అడుగుల దూరంమాత్రమే ఉంటుంది. ఆజాద్,

నాట్‌బావర్‌ని చూడగానే తనూ పిస్తోలుని తీశాడు. దాదాపుగా ఇద్దరూ ఒకేమారు కాల్పులు ప్రారంభించారు. నాట్‌బావర్ కాల్చిన మొదటిగుండు ఆజాద్ తొడకు తగిలింది. సరిగా ఆదేసమయంలో ఆజాద్ కాల్చిన గుండు నాట్‌బావర్ జబ్బకు తగిలింది. అప్పుడే సుఖదేవ్‌రాజ్ పారిపోయివుంటాడు. ఇంక ఆజాద్ చెట్టును చాటుచేసుకున్నాడు. నాట్‌బావర్ పొదల్నీ, మొక్కల్నీ చాటుచేసుకున్నాడు. విశ్వేశ్వరసింహ్ నిరాయుధుడుగా ఉన్నాడు అనుకోకుండా ఆదేసమయంలో బ్రిటీష్ ప్రభుత్వపు నమ్మినబంటు ఒకడు జోడుగుళ్ళ తుపాకీని పట్టుకుని వెళుతున్నాడు. విశ్వేశ్వరసింహ్ అతడివద్దనుంచి తుపాకీ తీసుకుని ఒకపొదను చాటుచేసుకుని ఆజాద్‌మీద కాల్పులు ప్రారంభించాడు. ఆజాద్ ఇద్దరిమీదా కాల్పులు సాగిస్తున్నాడు. అతడి శరీరానికి మూడు నాలుగు గుళ్ళు తగిలాయి. అప్పటికీ మంచి తెలివిగా పోరాడుతున్నాడు. అదే సమయంలో విశ్వేశ్వరసింహ్ గురిచూసుకోవడంకోసం పొదలమీదుగా తలపైకి పెట్టాడు. వెంటనే ఆజాద్ గురిచూసి కాల్చాడు. విశ్వేశ్వరసింహ్ దవడ ఎగిరిపోయింది తరువాత హాలిన్స్ ఆజాద్ కాల్చిన ఈ కాల్పును గొప్పగా ప్రశంసించాడు.

ఆజాద్ తన పిస్తోలులోని చివరి గుండును తాను ఎప్పుడూ చెప్తున్నట్లే కణతకు గురిపెట్టి కాల్చుకున్నాడు.

కాల్పులు ప్రారంభం కాగానే డాల్‌చంద్ పరుగెత్తుకెళ్ళి పోలీసు స్టేషనుకు ఫోన్ చేశాడు. పోలీసులు పెద్దసంఖ్యలో లారీలో వచ్చారు. పార్కులో జనం గుంపులు గూడడం చూసి ఆజాద్ శవాన్ని లారీలో వేసుకొని వెళ్ళారు. అప్పటికీ చనిపోయింది ఎవరో పోలీసుకు స్పష్టంగా తెలియదు. వెంటనే బెనారస్‌కూ ఝాన్సీకీ ఫోన్ చేశారు. ఆజాద్‌ను గుర్తుపట్టగల వ్యక్తుల్ని పిలిపించారు. వాళ్ళు చనిపోయింది ఆజాదేనని స్పష్టంగా చెప్పారు. ఆ తరువాతనే లీడర్ మొదలైన స్థానిక పత్రికల్లో ప్రకటన వెలువడ్డది. దీన్ని బట్టి పోలీసులకు ముందుగా అతడే ఆజాద్ అని తెలియదు. తెలిసివుంటే మొదటే తగినంత మంది సాయుధులైన పోలీసుల్ని తీసుకు వెళ్ళేవాడుకదా నాట్‌బావర్?

ఆజాద్ విషయంలో విశ్వాసఘాతుకం జరిగిందనటానికి అవకాశం లేదు.

ఆజాద్ చనిపోయాక కొద్దిరోజుల వరకూ కొత్తనాయకుడెవరో నిర్ణయించుకోలేని స్థితిలోపడ్డాం! మిత్రులు సురేంద్రపాండేను, నన్నూ సలహాలు సంప్రదింపులూ అడిగేవారు. కాశీరాం కూడా చాలా రోజులుగా పార్టీలో పనిచేస్తున్నాడు. కైలాసపతి ప్రభుత్వసాక్షి అయ్యాక కాశీరాం మీదా వారెంట్ పుట్టింది. ఈ స్థితిలో ఏమిచేయడం ? అన్నది మాలో పెద్ద ప్రశ్నగా తయారయింది. ఏం చెయ్యాలన్నా డబ్బుది సమస్య. నేను ప్రమాదాల్ని వరించడంలో వెనుక పడలేదుగానీ దోపిడీ చేయడానికి మాత్రం అంగీకరించటంలేదు. అప్పుడే లెనిన్ జీవితమూ, మరికొన్ని గ్రంథాల్ని చదవడం జరిగింది. సిద్ధాంతరీత్యా మిత్రుల్ని చైతన్యవంతుల్ని చేయటం అవసరమని నేనూ, సురేంద్ర పాండే అనుకున్నాం. కాన్పూరులోగానీ, అలహాబాదులోగానీ ఉన్నప్పుడు ఆజాద్, మేము ఈ విషయమై మాట్లాడుతూ ఉండేవారం. ఆజాద్‌కుకూడా సిద్ధాంతరీత్యా పటిష్టమవడం ప్రజలతో సంబంధాలను పెంచుకోవడం ఇష్టమే ! మేము ఒకచిన్న ప్రెస్‌ను పెట్టాలనుకున్నాం. సిద్ధాంత సంబంధమైన కరపత్రాలను, చిన్నచిన్న పుస్తకాలను వేయడానికి ! ఆ ప్రెస్‌లో పనివాళ్ళందరూ మిత్రులే అయి వుంటారు. ఐతే, కొందరికి ప్రెస్ పెట్టాలన్న భావన నచ్చలేదు.

పార్టీని పునర్నిర్మించాలని అందరం అనుకుంటున్నాం. ఐతే, నాయకుడెవరు ? ఎవరి ఆజ్ఞానుసారం సంఘటితమవ్వాలి ? నిర్ణయించుకోలేక పోతాన్నాం. అప్పట్లో కాశీరాం,. భవానీసహాయ్ మొదలైన మిత్రులతో నాకు సంబంధాలు ఎక్కువగా ఉండేవి. నేను మీరట్ వెళ్ళిపోయాను.

సురేంద్రపాండే కాన్పూరులోనే ఉంటున్నాడు. భవానిసింహ్ మొదలుగా గల మిత్రులతో అతడి పరిచయం ధృడతరమైంది.

అప్పుడు అలహాబాదు 'కటరా'లోని ఇంటిలో ఆజాద్‌తోపాటు నేనూ, సురేంద్రపాండే, భవానీసింహ్ వుంటూన్నాము. అలహాబాదులో వున్న మేమే కాకుండా కాన్పూరూ, మీరట్, ఢిల్లీ - మొదలైన పట్నాల్లో ఇంకా కూడా మిత్రులు వున్నారు. వాళ్ళందర్నీ కాదని నేనూ, సురేంద్రపాండే మాత్రమే రష్యా వెళ్ళలేము ! కనుక, ఒకరకంగా మా రష్యా ప్రయాణం ఆగిపోయంది. నెహ్రూగారు మాకు డబ్బులిస్తానన్నది మా విప్లవ కార్యక్రమాల కోసం కాదు ! మేము రష్యా వెళ్ళడంకోసం వారు ఇస్తామన్నారు. మా ప్రయాణమే ఆగిపోయాక వారిని డబ్బు అడిగే పనేముంటుంది ? ఆ తరువాత శివమూర్తిసింహ్‌ను కల్సుకోనేలేదు. నా దగ్గర వున్న వెయ్యిరూపాయలు తాత్కాలిక ఔసరాలకు ఖర్చయిపోతూన్నాయి. దుర్గాబాభీ కోసంగానీ, సుశీలాదీదీకోసంగానీ మేమేమీ చేయలేదు. అప్పుడు మాకూవాళ్ళకూ బొత్తిగా సంబంధం లేకుండావుంది. ఆజాద్ మృత్యువు మాలో ప్రతి ఒక్కర్నీ అత్యంత ఆత్మీయుణ్ణి పోగొట్టుకున్నవాళ్ళలా బాధించింది. కాన్పూరువెళ్ళి ఈ విషయం ప్రకాశవతికి చెప్పాలనుకున్నాను. తీరా అక్కడికి వెళ్ళాక దుఃఖావేశంలవల్ల నోటమాటే రాలేదు. ఆజాద్ పోయాడన్న వార్తవిని ప్రకాశవతి పసిపిల్లలా భోరున ఏడిచింది. పార్టీ సభ్యులందరికీ ఆజాద్‌తో వ్యక్తిగత సంబంధాలుండేవి. అతడు పోయాక మిత్రులందర్నీ కూడ కట్టుకురావడం పెద్ద సమస్య అయింది ! చదువుసంధ్యల్లేని ఆజాద్ వ్యక్తిత్వంలోని గొప్పతనం అతడు పోయాకగానీ మాకు అర్థంకాలేదు !

# భగత్సింగ్, సుఖదేవ్, రాజగురు - ఉరి !

1931 మార్చి 23వ తారీకున భగత్సింగ్, సుఖదేవ్, రాజగురు - వీర్ని లాహోరు జైల్లో ఉరితీశారు. ఈ సందర్భంగా దేశమంతటా హర్తాళ్ళు జరిగాయి. అప్పటికి బ్రిటీష్ సామ్రాజ్యవాదులు, కాంగ్రేసు , ముస్లిములీగుల మధ్య ద్వేషాగ్నిని బాగా రగల్చగలిగారు ముస్లిములకు, కాంగ్రేసువారు హిందూ ప్రభుత్వాన్ని స్థాపించనున్నారన్న భావన ఏర్పడింది ! ముస్లింలీగ్, సాంప్రదాయక ముస్లిములు - పోటీలో వెనుక పడకుండా వుండగలందులకు ఇంగ్లీషు ప్రభుత్వానికి విశ్వాస పాత్రులవుతూన్నారు. కాన్పూరులో హరతాళ్ చేయించడంలో కాంగ్రేసు ప్రముఖ పాత్ర వహించింది. పోలీసులు రెచ్చగొట్టడంతో, కొందరు ముస్లిములు కాంగ్రేసును ఉడికించడానికి హర్తాల్ చేయము అన్నారు. బ్రిటీష్ ప్రభుత్వానికి కృపాపాత్రులవడానికీ ఇది మంచి అదును. హర్తాళ్‌లో పాల్గొనకపోవడం జాతీయ వీరుల్ని అవమానించడంగా సాధారణ ప్రజలు భావించారు. ప్రజలు అమర వీరుల్ని అవమానపరచడం ఎప్పుడూ సహించరు. ఈ కారణంగా హిందూ ముస్లిము కొట్లాటలు చెలరేగాయి. ఈ కొట్లాటల్లోనే గణేష్‌శంకర విద్యార్థి మతపిచ్చిలో అంధులైన ముస్లిములచేత హత్య చేయబడ్డాడు !

× × ×

1929, 30, 31 సంవత్సరాల్లో 'ఇంకిలాబ్ జిందాబాద్' 'భగత్సింగ్‌కి జై !' అన్న నినాదాలు భారత ప్రజల్లో అత్యధిక ప్రచారంలో వున్నాయి. అరోజుల్లో పై నినాదాలకున్న ప్రచారం 'గాంధీకి జై' అన్న నినాదానికి కూడా లేదంటే అతిశయోక్తి కాదు ! కాంగ్రేసు పార్టీలోని సాధారణ సభ్యులు 'బ్రిటీష్

ప్రభుత్వంతో సంప్రతించేప్పుడు 'భగత్సింగ్‌కూ, అతడి మిత్రులకూ విధించబోయే ఉరిశిక్షను రద్దుచేయా' లన్న షరతును కూడా చేర్చవల్సిందని గాంధీగారిని అడిగారు. కానీ గాంధీగారు ఈ సమస్యను ఒక షరతుగా వైస్రాయి ముందుంచడానికి నిరాకరించారు. ఏమైనప్పటికీ ప్రజల వాంఛను ఇంతగా నిర్లక్ష్యం చేస్తారని ఎవరూ అనుకోలేదు. ఉరిశిక్ష రద్దవుతుందనే అందరూ ఆశించారు. ఆంగ్ల ప్రభుత్వం దీన్ని తన గౌరవానికీ, సామర్థ్యానికీ సంబంధించిన ప్రశ్నగా భావించింది. భగత్సింగునూ, అతడి మిత్రులనూ ఉరితీశాక ప్రజల హృదయాలు ఘోర ఆఘాతానికి గురి అయ్యాయి. ఆ వీరుల సమస్యకు గాంధీగారు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వలనా ప్రజల హృదయాలు క్షోభపడ్డాయి. గాంధీగారు ఆంగ్ల ప్రభుత్వంతో రాజీ పడడానికి పన్నెండు షరతుల్ని వైస్రాయి ముందుంచారు. వాటిల్లో ఒకటి ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని పెట్టాలనేది. కానీ, భగత్‌సింగ్, అతని అనుచరులను వదిలిపెట్టాలన్న షరతు మాత్రం ఆ పన్నెండింటిలో లేదు. ప్రజల మీద పర ప్రభుత్వ శక్తిని ఉపయోగించి మద్యపాన నిషేధాన్ని అమలుపరచడం నైతికంగా సమర్థనీయ చర్యగా భావించారు గాంధీగారు. కానీ, భగత్‌సింగ్ - మిత్రుల ఉరిశిక్షలను రద్దుచేయడానికి, ప్రజాశక్తి ఆధారంగా పర ప్రభుత్వం మీద వత్తిడి తేవడం అనైతికమైన విషయంగా భావించారు ! కనుకే, 1931 మార్చి చివరి వారంలో కరాచీలో జరిగిన కాంగ్రెసు సభలో గాంధీగారికి నల్లని పూలు కానుకగా ఇచ్చారు. నల్ల జండాలు చూపించారు. ప్రజల హృదయాలు వివశంగా ఘూర్ణిల్లాయి. పర ప్రభుత్వం మీద ద్వేషం పెల్లుబికింది. తమ ప్రియతమ వీరుల మీద అతిశయోక్తితో కూడిన కథలల్లి ప్రచారం చేసుకుని తృప్తిపడ్డారు ప్రజలు !

× × ×

భగత్సింగ్, సుఖదేవ్, రాజగురు - వీర్ని ఉరితీసేప్పుడు, రెండవ లాహోరు కుట్రకేసుకు సంబంధించిన నిందితులు సర్దార్ సింగ్, జహంగీరీలాల్, జై ప్రకాశ్, ధర్మపాల్ - వీరూ లాహోరు సెంట్రల్ జైలులోనే వున్నారు. వీళ్ళ గదులు ఉరిశిక్ష పడ్డ భగత్సింగ్ మొదలైనవారి గదులకు దగ్గర్లోనే వున్నాయి. ఎప్పుడైనా ఒకరికి ఒకరు ఎదురు పడడమూ కద్దు. మాట్లాడుకోవడమూ జరుగుతూ వుండేది. తమ గదుల్లోంచీ కూడా కేక వేసి పలకరించు కోవచ్చును. కాపలావాళ్ళూ, వార్డర్లూ వార్తల్నీ, తినుబండారాల్నీ ఒకరినుంచీ మరొకరికి చేరవేస్తూ వుండేవారు. ఈ మిత్రుల కథనం ప్రకారం భగత్సింగ్, సుఖదేవ్, రాజగురు - చివరి క్షణం వరకు ఆరోగ్యకరమైన మానసిక స్థితిలోనే ఉన్నారని తెలుస్తుంది. తమ ఆదర్శం కోసం బలౌతున్నందుకు వాళ్ళు ఎంతో తృప్తిగా వున్నారు. అప్పట్లో ఒకే ఒక విషయం భగత్‌సింగ్ మనస్సును బాధించింది. అది ఏమిటంటే, అతడి తండ్రి సర్దార్ కిషన్‌సింగ్ పుత్రప్రాణ భిక్ష కోసం గవర్నర్‌కు ప్రార్థనాపత్రం పంపుకున్నాడు. గవర్నర్ ఆ ప్రార్థనను ఎటూ అంగీకరించలేదు. కాగా, తండ్రి అలా చేసినందుకు భగత్సింగ్ ఎంతో అవమానాన్ని పొందాడు. తండ్రి పెట్టుకున్న ప్రార్థనాపత్రాన్ని గురించి విని ఖిన్న స్వరంలో భగత్సింగ్ ఇలా అన్నాడు. "My father has stabed me in the back." (తండ్రే నన్ను వెన్నుపోటు పొడిచాడు.)

1931 సంవత్సరం మార్చి 24వ తారీకు మిత్రుల్ని ఉరితీయడానికి నిశ్చయింపబడ్డది. ఆ సమయంలో ప్రజలు ప్రదర్శనలు జరపవచ్చు. ప్రజలు శవాన్ని తీసుకుని ఊరేగింపు జరపవచ్చు. ఇవన్నీ ప్రభుత్వానికి వ్యతిరేకతను తెచ్చిపెట్టే చర్యలవుతాయి. కనుక గవర్నర్ యొక్క ప్రత్యేకానుమతితో, ఉరిశిక్షల్ని అనుకున్న సమయానికి ముందే అమలు జరపడం ఉచితం అనుకున్నారు జైలు అధికారులు.

మార్చి 23వ తారీకున రెండవ లాహోరు కుట్రకేసులోని నిందితుల్ని మధ్యాహ్నానంతరం కోర్టునుండి జైలుకు తీసుకువచ్చారు. మూడు నాలుగు గంటలాచాయల జైల్లోని ఖైదీలందర్నీ వారి వారి

గదుల్లోకి పంపించి తలుపులు వేసేశారు. జైలంతా శుభ్రం చేస్తున్నారు. భగత్సింగ్ గది ధర్మపాల్ గదికి చాలా దగ్గర్లో వుంది. భగత్సింగ్ ధర్మపాల్‌ని కేక వేసి పిలిచి అడిగాడు. "ధర్మా ! ఇవ్వాళ కోర్టునుంచి మీరింత తొందరగా వచ్చారేం ?"

"జైళ్ళ ఇనస్పెక్టరు, కమీషనరు - జైల్ను చూడడానికి వస్తున్నారని అంటున్నారు !" అన్నాడు ధర్మపాల్.

"పిచ్చోడా ! చూట్టానికి వాళ్ళు రావడంకాదు. మేం వెళుతున్నాం !" అన్నాడు భగత్సింగ్.

భగత్సింగ్, సుఖదేవ్, రాజగురు - వీరి ముగ్గురికీ అప్పుడే స్నానానికి నీళ్ళు ఇచ్చారు. మరణశిక్షను పొందే వ్యక్తిని, ఉరితీయడానికి తీసుకు వెళ్ళేముందు స్నానం చేయించడం ఆచారం. భగత్‌సింగ్‌కు జైలు అధికార్లలోనే ఎవరో ముందుగా ఈ విషయాన్ని చెప్పారు. జైప్రకాష్ మొదలైన రెండవ లాహోరు కుట్రకేసు నిందితులు భగత్సింగ్ వస్తువుల్ని జ్ఞాపకార్థం అడిగారు. ఉరి తీయడానికి ఒక గంటముందు అతడు తన వస్తువులన్నింటినీ - రేజరు, బ్లేడ్లు, గుండీలు, ఖాళీ అగ్గిపెట్టె - అన్నింటినీ మిత్రులకు పంచేశాడు. పై అధికారులకు అనుమానం కలగకుండా వుండడానికి తనకేమీ తెలియనట్టు మౌనంగా వున్నాడు.

సుఖదేవ్ గదిలోంచీ 'ఇంకిలాబ్ జిందాబాద్' అన్న దీర్ఘ నినాదం వినిపించింది. తరువాత అతడి గదిలోంచి ఘర్షణ పడుతున్న సవ్వడి వినిపించింది. సుఖదేవ్ చేతులకు బేడీలు వేయబోతున్నారనీ, అతడు వ్యతిరేకిస్తున్నాడనీ తెలిసింది. ఉరికంబం దగ్గరకు తీసుకువెళ్ళేప్పుడు ఖైదీల చేతుల్ని వెనక్కు విరిచికట్టడం ఆచారం. సుఖదేవ్ అందుకు అంగీకరించడం లేదు. ముసలి జైలు వార్డరు చతర్‌సింగ్, భగత్‌సింగ్‌ను ప్రార్థించాడు. "మా మీద దయ చూపండి. బేడీలు వేయమని ఆర్డర్ అయింది. అలా వేయడం ఆచారం ! వేయించుకోండి !" అన్నాడు. భగత్సింగ్ చెప్పిన మీదట సుఖదేవ్, రాజగురు బేడీలు వేయించుకున్నారు ! తరువాత జైలులోని ఇతర మిత్రుల్ని ఉద్దేశించి "సరే, మిత్రులారా వెళ్తున్నాం !" అన్నాడు భగత్సింగ్.

ఇతర మిత్రులు తమ గదుల్లోంచి 'ఇంకిలాబ్ జిందాబాద్ !' అని నినాదాలు చేశారు. వీరిని అనుకరించి జైలులోని ఖైదీలందరూ 'ఇంకిలాబ్ జిందాబాద్ !' అని నినాదాలు చేశారు. ఈ నినాదాలు జైలుకు ప్రక్కనే వున్న పండిత కె. సంతానం గారి బంగళాలోకి వినిపిస్తున్నాయి. ఆయనగారు ఈ నినాదాలకు కారణాన్ని ఊహించి, సర్దార్ కిషన్‌సింగ్‌కు ఫోన్ చేశాడు. జైల్లోని ఖైదీలందరూ ఉరికొయ్య పడే శబ్దాన్ని వినడానికి శ్వాస బిగబట్టుకు వింటున్నారు. ధర్మపాల్ గడియారం ప్రకారం 7 గంటల 23 నిమిషాలకు ఉరికొయ్య పడ్డ శబ్దం వినిపించింది. జైలంతా ఒక్కమాటుగా 'ఇంకిలాబ్ జిందాబాద్ !', 'భగత్సింగ్ జిందాబాద్ !', 'సుఖదేవ్ జిందాబాద్ !', 'రాజగురు జిందాబాద్ !' అన్న నినాదాల్తో ప్రతిధ్వనించిపోయింది. ఈ నినాదాల ప్రతిధ్వని కారణంగా అరగంటవరకు మా మిత్రులు ఎవరూ ఒకరితో ఇంకొకరు మాట్లాడుకోలేకపోయారు. జైలు అధికారులు మా మిత్రులకు చెప్పిన వార్తల్ని బట్టి, భగత్సింగ్, సుఖదేవ్, రాజగురు - ఉరికొయ్య దగ్గరకు వెళ్ళాక, సూపరింటెండెంట్‌ను 'మేము తృప్తిగా నినాదాలు ఇచ్చుకోడానికి రెండు క్షణాలు అవకాశం ఇవ్వండి ! మా ఈ చిన్న కోర్కెను మీరు అంగీకరిస్తారని ఆశిస్తున్నాము !' అని అడిగారుట. సూపరింటెండెంట్ రెండు క్షణాలు మౌనంగా నిలబడ్డాడు.

ముగ్గురు మిత్రులూ ఒకేసారి నినాదాల్నిచ్చారు.

Long live Revolution - విప్లవం వర్ధిల్లాలి !

Down with Imperialism - సామ్రాజ్యవాదం నశించాలి !

ఆనాడు జైల్లో ఖైదీలెవరూ అన్నాలు తినలేదు. కొందరు భారతీయులైన జైలు అధికారులు కూడా ఆ రోజున అన్నం తినలేదు. జైలు ఇనస్పెక్టర్ మహమ్మద్ అక్బర్ ఖాన్‌సాహెబ్, రెండు రోజుల తరువాత సర్దార్ కిషన్‌సింగ్‌ను కలుసుకున్నప్పుడు ఇలా అన్నాడు: 'ఉద్యోగం అనే దాస్యం చేస్తున్నాం గనక ప్రభుత్వ ఆజ్ఞల్ని పాటించక తప్పదు. కానీ, మనస్సు చాలా బాధపడ్తది. అన్నం ముందు కూచుంటే పురుగుల్ని చూసినట్టయింది. వెధవపొట్ట, ఈ పొట్టకోసం కదా, ఇలాంటి దాస్యానికి పాల్పడవల్సివచ్చింది !'

ప్రభుత్వం విప్లవకారుల శవాలకు ఉచితరీతిన దహన సంస్కారాలు జరుపుతుందన్న నమ్మకం ప్రజలకు లేదు. శవాలను అగౌరవ పరచవచ్చనీ ప్రజలు భయపడ్డారు. లాహోరునుంచి బయటకు వెళ్ళే ప్రతిరోడ్డుమీదా కొందరు మిత్రులు కాపలా కాస్తూ కూర్చున్నారు. ఫిరోజ్‌పూర్ వెళ్ళే రోడ్డున భగత్‌సింగ్ సోదరి అమర్‌కౌర్ కొందరు మిత్రుల్తో కూర్చుంది. అర్ధరాత్రి తరువాత పోలీసువ్యాను ఒకటి ఫిరోజ్‌పూర్ వైపు వెళ్ళింది. శవాలను సట్లజ్ తీరానికి తీసుకువెళ్తున్నారని అనుకున్నారు. సూర్యోదయంతో పాటు లాహోరుకు అరవై మైళ్ళ దూరంలోగల సట్లజ్ నదీ తీరానికి ప్రజలు గుంపులు గుంపులుగా పోసాగారు. అక్కడే నది మీద రైలు వంతెన ఒకటుంది. తెల్లవారాక ఆ పరిసరంలో మూడు చితులు మండుతూ కనిపించాయి. పోలీసులు వెళ్ళిపోయారు. శ్రద్ధాళువులైన ప్రజలు అస్తికలనూ, భస్మాన్నీ తీసుకువెళ్ళారు. 1947 మార్చి వరకూ ప్రతి సంవత్సరం మార్చి 23వ తారీకున అక్కడ పెద్ద తిరునాళ్ళ జరిగేది. ఇప్పుడా ప్రదేశం పాకిస్తాన్‌లోకి పోయింది !

× × ×

భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు - వీళ్ళతోపాటు మరో వ్యక్తికి కూడా ఉరిశిక్ష విధించారు. అతడు కేహరిసింగ్ ! అతడు తన బావనూ, ఊరి మునసబునూ హత్య చేశాడు. ఆ కేసు నడుస్తూన్నది. పోలీసులకు శవాలు దొరకలేదు. కనుక, హైకోర్టులో విడుదల కావచ్చుననుకుంటున్నారు. అతడు అందరితోటీ ఇలా అనేవాడు. "నేను ఇంకొకణ్ణి చంపాలి ! వాణ్ణి చంపి వచ్చి ఉరికంబం ఎక్కుతాను !" కేహరిసింగ్ విడుదల అయ్యాడు. అసిస్టెంట్ సబ్ ఇనస్పెక్టర్ని చంపి, మళ్ళీ జైలుకు వచ్చాడు. ఈ మాటు అతడు హైకోర్టుకు అపీల్ చేసుకోలేదు. ఐతే, అతడి పినతల్లి అపీల్ చేసుకుంది. ఈమాటూ శవం దొరకలేదు. ఈమాటూ విడుదల అవటానికి అవకాశం వుంది. అతడు జైలు సూపరింటెండెంటుకు "తను కొన్ని హత్యలకు సంబంధించిన వివరాల్ని పోలీసులకీయాలనుకుంటున్నానని" దరఖాస్తు పెట్టుకున్నాడు. అతడి చేతులకు బేడీలు వేసి, గట్టి బందోబస్తుతో జైలు నుండి బయటకు తీసుకువెళ్ళారు. తను హత్యచేసిన ముగ్గురి శవాలను చూపించాడు. కోర్టులో నేరాన్ని ఒప్పుకున్నాడు. అతడు మళ్ళీ ఉరిశిక్ష పడ్డ ఖైదీలను వుంచే ఖైదు కొట్లల్లోకి వచ్చాడు. అతడు సిఫిలిస్, గనేరియాలాంటి భయంకరమైన సుఖవ్యాధుల్తో బాధపడుతుండేవాడు. ఎప్పుడూ బూతుపాటల్ని పెద్దగా పాడుతుండేవాడు. ఎప్పుడు ఉరికంబాన్నెక్కి శాంతిని పొందుదామా అని తహతహలాడుతున్నట్టు అశాంతిగా వుండేవాడు. ఒకరోజున భగత్‌సింగ్, ఇతర మిత్రులూ అతడితో అన్నారు. "నువ్వు ఇంతటి వీరుడివి కదా, ఇలాంటి బూతుపాటలు పాడడం నీకేం శోభస్కరంగా వుంటుంది ?"

కేహరిసింగ్ "ఐతే, ఇంకేం పాడమంటారు ? సమయం గడవడానికి ఏదో ఒకటి పాడుకోవాలి గదా ?" అన్నాడు.

మిత్రులిలా అన్నారు "మిత్రమా ! నీకు ఇంకేమీ రాకపోతే, భగవంతుణ్ణయినా తలచుకో, ఇలాంటి బూతు పాటలు మాత్రం పాడకు !".

కేహరిసింగ్‌కు వీళ్ళమాటంటే గురి "సరే బాబూ ! ఇక మీదట నేనీ పాటను పాడు కుంటాను - 'మౌలా మై కుక్కడ్ ఖాదే తేరే తూ బక్షదే ఔగున్ మేరే !' ఓ యజమానీ, నేను నీ కోళ్ళను తిన్నాను. నీవు నా అపరాధాల్ని క్షమించు !" అని అన్నాడు.

ఉరికంబం వైపు వెళ్ళేప్పుడు కూడా అతడు ఇదేపాట పాడుకుంటూ వెళ్ళాడు.

భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు - ఈ ముగ్గురు అమర వీరుల్లో ఎవరు గొప్ప ? ఎవరు కొద్ది? అన్న విచక్షణ తగదనే అనుకుంటున్నాను. కానీ, నిజం చెప్పుకోవాలంటే సుఖదేవ్‌కు చాలా అన్యాయం జరిగింది. అతడి భావనను ఎవరూ అర్థం చేసుకోలేదు. అతడి దృష్టికోణానికీ, ఇతర మిత్రుల దృష్టికోణానికి వ్యత్యాసం వుండడం వల్ల అతడి ప్రవర్తన ఇతరులకు విచిత్రం అనిపించింది ! మొట్టమొదట అరెస్టు కాగానే తను చేసిన కొన్ని పనులను ఒప్పేసుకున్నాడు. అప్పుడే ఇతర మిత్రుల ప్రవర్తనకూ, అతడి ప్రవర్తనకూ వ్యత్యాసం కనిపించింది. ఆ తరువాత కూడా అతడి ప్రవర్తననే చూశారు కానీ, అతడి ఉద్దేశాన్ని ఎవరూ అర్థ చేసుకోలేదు. చిట్టచివరి వరకూ అతడి ప్రవర్తనను పరిశీలిస్తేగానీ, అతడిని అర్థం చేసుకోలేము. అతడి చివరి రోజు ప్రవర్తన వల్ల సాహసంలో అతడు ఎవరికీ తీసిపోడనీ, ఇతర మిత్రులకంటే సాహసికుడనీ స్పష్టం అవుతున్నది. శత్రువు నుండి ఎలాంటి సౌజన్యాన్ని ఆశించడంగానీ, శత్రువు పట్ల సౌజన్యాన్ని ప్రదర్శించడంగానీ అతడికి ఇష్టం వుండదు. కోర్టులో నడచిన కేసు పట్ల కూడా అతడి దృష్టికోణం ఇదే. ఇతర మిత్రులు 'కోర్టులో తప్పించుకోగలిగితే తప్పించు కుందాం !' అంటారు. కానీ సుఖదేవ్‌కు అసలు కోర్టుకు వెళ్ళడమే ఇష్టం లేదు. అతడిలా అంటాడు "నువ్వు నా శత్రువ్వు ! నీతో నేను పోరాడుతున్నాను ! నువ్వు చేసేదేమిటో చేసుకో !" ఈ భావనతోనే అతడు ముందుగా తన తప్పుల్ని ఒప్పుకున్నాడు. అతడి దృష్టికోణంలో లోపం వుండవచ్చు. కానీ, పిరికితనం, ప్రాణరక్షణార్థం పాకులాడే తత్వం అతడిలో లేదు.

# తిరిగి ఉద్యమ నిర్మాణానికి ప్రయత్నం

నేను ఢిల్లీకి రాకపోకలు సాగించాను. కృష్ణగారిని మళ్ళీ డబ్బుల కోసం బాధించసాగాను. పార్టీకోసం తీసుకున్న డబ్బును వ్యక్తిగత అవసరాలకు వాడరాదని ఉద్దేశ్యం. కానీ, ఈ నిశ్చయం నిలిచేది కాదు. అసలు వ్యక్తిగత అవసరాల కోసం తెచ్చుకున్న డబ్బుల్నే పార్టీకోసం ఖర్చుపెట్టవల్సి వచ్చేది. ఒకరోజున కృష్ణగారు చేతులు ఎత్తివేశారు. "బాబూ ! ఇంక నా ప్రాణాలు కొరక్కండి ! ఇద్దరు కొత్త భక్తుల్ని పరిచయం చేస్తాను. నన్ను వదిలిపెట్టండి !" అన్నారు.

కృష్ణ బావమరిది ధృవదేవ్. మా కారణంగా ఆయన ఒకమాటు పోలీసుల చేతుల్లో పడ్డాడు కూడాను. ఐనా, సహాయం చేయడానికి వేనకాడడు. ప్రభుదత్తు అనే కొత్త మిత్రుణ్ణి పరిచయం చేశాడు ధృవదేవ్ ! అజ్మీరీగేట్ దగ్గర రోషన్ థియేటర్ ప్రక్కనున్న సందులో వీరి బంగళా. బాగా ధనికుడు. అప్పట్లో ప్రభుదత్తు సరదాకు విమానం నడపడం నేర్చుకుంటున్నాడు. తరువాత ఈయన పైలెట్ అయ్యాడు. మొట్టమొదటి భారతీయ సివిల్ పైలెట్ ఈయనే ! ప్రభుదత్తు చేసే సహాయానికి ఒక హద్దూ - పద్దూ అంటూ వుండేది కాదు. ఈయనకు చిన్నకారొకటి వుంది. నేను ఎక్కడికి పోవాలన్నా కార్లో దింపి వచ్చేవాడు. తను వెంటరావడం ప్రమాదం అనుకున్నప్పుడు "కారు వేసుకు వెళ్ళు ! పోలీసులు అంతగా పట్టుకుంటే నాకార్ను దొంగిలించాడంటాను. నీమీద ఇన్ని కేసులు ఎటూ వున్నాయిగదా ? కార్ని

దొంగిలించిన కేసు ఇంకొకటనుకో ! అంతేగా ?" అనేవాడు. లాహోరు, ఢిల్లీ కుట్రకేసుల్లోని నిందితులు కొందరు అప్రూవరులై తమకు సహాయం చేసిన సహృదయుల పేర్లు చెప్పి, వార్ని ఇరకాటంలో పడేశారు. ఆ విషయం ప్రభుదత్తుకు తెల్సు. అందుకని మా పార్టీలోని ఇతర సభ్యులకు తనను పరిచయం చేయవద్దని చెప్పేవాడు. నేనూ ఈ నిశ్చయాన్ని అక్షరాలా పాటించాను.

ప్రభుదత్తు పైలెట్ అయ్యాడు. అతడి తమ్ముడు బ్రహ్మదత్తు కూడా పైలెట్ అయ్యాడు. అప్పట్లో ఉన్నతమైన యోగ్యతలు గల ప్రథమ భారతీయ పైలెట్ ప్రభుదత్తే ! ఇంగ్లీషు పైలెట్లు వీళ్ళను చూసి ఈర్ష్య పడుతూండేవారు. ఒకరోజున ఇద్దరు అన్నదమ్ములూ, చెరో విమానంలో, కరాచీ నుండి ప్రయాణం అయ్యారు. ఒకరు ఢిల్లీకి, మరొకరు లాహోరుకు వెళ్తున్నారు. దారిలో రెండు విమానాలకూ నిప్పంటుకుంది. ఆ విమానాల్తో పాటు ఇద్దరు అన్నదమ్ములూ భస్మమయ్యారు ! ఇదేదో కుతంత్రం వల్ల జరిగిందని అందరూ అనుకున్నారు. ప్రభుదత్తు ఏ విమానంలో వెళతాడో, మొదట తెలియలేదు. అందువల్ల కుతంత్రం చేసినవాళ్ళు, బయలుదేరిన కొంతసేపటికి నిప్పు అంటుకునేట్లు చేశారు రెండు విమానాలకు ! ప్రభుదత్తులాంటి సహృదయులు, సాహసం గల వ్యక్తులు అరుదుగానే వుంటారు.

కృష్ణగారు పరిచయం చేసిన రెండవ వ్యక్తి సుమిత్రాదీదీ ! ఆమె ఢిల్లీలోని ప్రసిద్ధ కాంట్రాక్టరు నారాయణదత్తు కూతురు. నారాయణ దత్తు కాంగ్రేసు వాది. పెద్ద పెద్ద కాంగ్రేసు నాయకులు వారిట్లోనే ఆతిథ్యాన్ని పొందుతూండేవారు. సుమిత్రాదీదీ ఖద్దరు ధరించేది. ఎం.ఏ. చదువుతూంది. ఆమెతో అప్పుడప్పుడూ సిద్ధాంత చర్చలూ జరుగుతుండేవి. ఆమె అనేది "మనిషికి దేశభక్తి వుండడం మంచిదే! స్వాతంత్ర్యము, సామ్యవాదమూ - అన్నీ అవసరమే ! ఐతే, ఇలా తుపాకులూ, పిస్తోళ్ళు వేసుకుని హింసకు పాల్పడడం సరికాదు !" ఎంతో ఉదారంగా ఆర్థిక సహాయం చేసేది. ఆమె డబ్బు ఇచ్చినప్పుడల్లా "సోదరా ! ఈ డబ్బుల్ని ఎవరి ప్రాణాలు తీయడానికి వాడకండి !" అనేది.

ఒకరోజున ఆమె కార్లో వెళ్తూ, నేను ఎక్కడో నడిచి వెళ్తూండగా చూసిందట ! ఆ తరువాత కల్సుకున్నప్పుడు

"సోదరా ఫలానారోజున నువ్వు జనసమ్మర్దంగా వున్న రోడ్డున కాలినడక వెళ్తున్నావు కదా ? ఎవడైనా గుర్తుపట్టి వెంటపడితే ?" అనడిగింది.

"సైకిల్ ఎటూ లేదు. టాంగా చేసుకువెడదామంటే అన్నప్పుడల్లా జేబులో డబ్బులుండవు. పైగా, టాంగాకంటే నడిచి వెళ్ళడమే నయం, ఎప్పుడైనా ఏ సందులోకయినా తప్పుకోవచ్చును !" అన్నాడు.

"నాతో ఇంటికి రండి ! డబ్బులు ఇస్తాను. ఇప్పుడే సైకిలు కొని తెచ్చుకుందురుగాని !" అన్నది.

ఆమె అనుమానం సరైనదే ! ఢిల్లీ కుట్రకేసు కోర్టులో వుంది. కైలాసపతి సాక్ష్యాలు పత్రికల్లో అచ్చవుతున్నాయి. ఆజాద్, భగవతీచరణ్, యశ్‌పాల్ గురించి ప్రజలు ఒకే తీరున చెప్పుకుంటున్నారు. ఆజాద్, భగవతీచరణ్ - ఇద్దరూ బలైపోయారు. యశ్‌పాల్ గురించి పోలీసుల ఉద్దేశం ఏమిటో తెల్సుకోడానికి హాలిన్స్ రాసిన ఈ క్రింది వాక్యాల్ని చదివితే చాలు. 'ఆజాద్ చనిపోయాక అతడి అనుచరుడు ఆజాద్ స్థానాన్ని స్వీకరించాడు. ఇతడు అతడికంటె దుస్సాహసి, నిర్దయుడు ....'

పంజాబు, ఢిల్లీ పోలీసులు విప్లవకారుల్ని పట్టి ఇచ్చిన వాళ్ళకు పెద్ద పెద్ద బహుమతులు ప్రకటించారు. విప్లవకారుల బొమ్మలతో గల పోస్టర్లను పోస్టాఫీసుల్లోనూ, రైల్వేస్టేషనుల్లోనూ, పట్నాల చౌరాస్తాల్లోనూ అతికించారు. ఆ పోస్టర్ల మధ్యలో నా ఫోటో వుండేది. చౌరాస్తాల్లో అతికించిన పోస్టర్లను

ప్రజలు చింపేసేవారు. లేకపోతే, వూడతీసుకుపోయేవారు. అలాంటి పోస్టర్ని ఒకదాన్ని ఢిల్లీలోని శ్రీకృష్ణసూరి ఎక్కణ్ణుంచో తీసుకుని వచ్చి నాకిచ్చాడు. అది ఇప్పటికీ నా దగ్గర వుంది. ఈ పోస్టర్లను చూసి నన్నెవరూ గుర్తుపట్టలేరని నా విశ్వాసం. నేనే రైల్వేస్టేషన్‌లోనైనా కొంత సమయాన్ని గడపవల్సివస్తే సరీగా పోస్టర్ కింద వున్న బెంచీ మీద కూచుని సిగరెట్టు ముట్టించేవాణ్ణి. సరీగా ఆ పోస్టర్ కిందనే యశ్‌పాల్ కూచుంటాడని ఎవరనుకుంటారు ? నకిలీ మీసాలూ, గడ్డాలూ నేను ఎన్నడూ పెట్టుకోలేదు. దుస్తుల్ని కొద్దిగా మార్చేవాణ్ణి అంతే.

మిత్రులందరం పునరాలోచించుకుని తిరిగి ఉద్యమాన్ని నిర్మించే బాధ్యత ఒకరికి ఒప్పగించాలని అనుకున్నాము. రహస్యోద్యమాలు ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికల ద్వారానే నడుపుదామంటే కుదరదు. సురేంద్రపాండే కాన్పూర్‌లో ఉద్యమాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తున్నాడు. అతడు నన్ను కాన్పూర్ రమ్మన్నాడు. నేను అతడినే ఢిల్లీ రమ్మన్నాను. "నేను పరారీలో వున్నాను. ప్రయాణం చెయ్యాలంటే డబ్బు కావాలి. ఎవరైనా గుర్తిస్తారేమోనన్న భయమూ ఉంటుంది !" అన్నాను.

అతడి సమాధానం "బాబూ ! నీవైపు ఎవరూ చూడరు. నా విషయం అలా కాదు. నా ముఖమే ఫిలాసఫర్ ముఖంలా వుంటుంది. నలుగురి దృష్టులూ నామీద వుంటాయి. నేను ఒకసారి అరెస్టు అయివుండడం వల్ల కాన్పూర్ పోలీసులు నన్ను బాగా ఎరుగుదురు !"

పాండే చెప్పిన మొదటి కారణం ఎలా వున్నా, రెండవ కారణం సరైనదే. నేనే కాన్పూర్ వెళ్ళి రావడానికి అంగీకరించాను. అతడిమీద మళ్ళీ వారంటు లేకపోయినప్పటికీ, ఒక రకంగా పరారీలోనే వున్నాడు.

ఒక తేదీని తెలియజేస్తూ పగలు పదకొండు గంటలాచాయల సరసైయా ఘాట్ దగ్గర కల్సుకోవలసిందని కబురు పెట్టాడు పాండే. ఇతర మిత్రులూ వస్తున్నారు. ఉద్యమ నిర్మాణాన్ని గురించి చర్చించడం జరుగుతుంది.

కాన్పూర్ వెళ్ళి నేను గుల్జారీలాల్ గదిలోనే బస చేసినట్టు జ్ఞాపకం. అతనిదే సైకిల్ వేసుకుని సరసైయ్యా ఘాట్‌కు వెళ్ళాను. మే నెల, ఎండ దహించేస్తోంది. ఆ సమయంలో సరసైయ్యా ఘాట్ నిర్మానుష్యంగా వుంటుంది అనుకున్నాను. నేను ఘాట్‌కు వెళ్ళాను. ఒడ్డున చిన్న శివాలయం వుంది. రావిచెట్టు కింద అరుగు మీద కాశీరామ్, భవానీసహాయ్, రాజేంద్రనిగమ్ - ముగ్గురూ కూచుని పేక ఆడుకుంటున్నారు. సురేంద్ర పాండే మరి ఒకరిద్దరు ఇతర మిత్రులూ రావాలి. ఐదారు నిమిషాల సేపు ఆ మాటలూ, ఈ మాటలూ మాట్లాడుకున్నాము. ఇంతలో నా దృష్టి మాకు కొద్ది దూరంలో నిలబడి వున్న నలుగురు మనుషుల మీద పడ్డది. వాళ్ళ ప్రక్కన ఒక గుర్రబండి వుంది. రెండు సైకిళ్ళు వున్నాయి. "వీళ్ళు ఎవరు ? ఎందుకు నిలబడి వున్నారు ?" అని మిత్రుల్ని అడిగాను.

"ఎవరో తెలియదు. నే వస్తూవుంటే నావెనకే వచ్చారు ! అప్పటినుంచి అలాగే నిలబడ్డారు !" అన్నాడు కాశీరామ్.

నేను ఆశ్చర్యపడ్డాను. "వాళ్ళు నిన్ను వెంబడిస్తూ వుంటే, వెంటబెట్టుకుని ఇక్కడికి వచ్చావా? విచిత్రమైనవాడివే ? మనల్ని వెంబడించే వారు సి.ఐ.డి.లే గదా ?" అన్నాను.

"నేను గొందులు సందులు తిరిగి వీళ్ళను వదిలించుకోడానికి చాలా ప్రయత్నించాను. కానీ, వీళ్ళు వదిలితే కదా ? అన్నాడు కాశీరామ్.

అతడి ఈ అమాయకత్వానికి కోపం వచ్చింది. ఇంకా మిత్రులు రావలసిన వాళ్ళు వున్నారు. "నువ్వు చాలా చెడ్డ పని చేశావు. అందర్నీ ప్రమాదంలో ఇరికించడం అవుతుంది ఇప్పుడు !" అన్నాను. కానీ, ఇంకప్పుడు ఏం చేసేట్టు ? ఇతర మిత్రులు రాకముందే వీళ్ళ విషయం తేల్చేసుకోవలి ! లేదా,

ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టేసెయ్యాలి ! 'ఏం చేస్తారో చూద్దాం' అనుకుంటూ ఒక ఆట ఆడాము. తరువాత వాళ్ళను కేకవేసి దగ్గరకు పిల్చాను. "నిలబడి ఏం చూస్తారు ? రండి రెండాటలు ఆడుకుందాం !" అన్నాను.

"మేం ఊరకా నిలబడ్డాం ! మిమ్మల్ని ఏమీ అనడం లేదుకదా ? మీరు ఆడుకోండి !" అన్నారు వాళ్ళు.

"మరి అలా చూస్తూ ఎందుకు నిలబడ్డారు ? మాతోటి ఏమైనా పనుందా ?"

"ఏం పనిలేదు. మీరు ఆడుకోండి !" అన్నారు వాళ్ళు.

"మేము ఇక్కడ ఏకాంతంలో సరదాగా ఆడుకోడానికి వచ్చాము. మీరలా నిలబడి చూడ్డం మాకేం బాగాలేదు."

"మేము మిమ్మల్ని ఏమీ అనడం లేదుకదా ? మీ ఆట మీరు ఆడుకోండి !" అన్నారు మళ్ళీ.

ఇంక అనుమానం ఏముంది ? వాళ్ళకు వినపడేట్టు మిత్రుల్తో ఇలా అన్నాను. "వాళ్ళు ఇక్కడ కూచుంటారులా వుంది. మనమే ఇంకోచోటికి వెళదాం పదండి !"

మేము నలుగురం లేచి నిలబడ్డాం ! సైకిళ్ళు తీసుకుని లాల్ ఇమలీ మిల్లు వైపు బయల్దేరాము. వాళ్ళూ మా వెనుకనే బయల్దేరారు. ఇద్దరు సైకిళ్ళమీదా, ఇద్దరు గుర్రబండిలోనూ. అప్పటికి నిగమ్ మీద వారంటు లేదు. కొంచెం ముందుకు వెడితే రోడ్డు చీలుతుంది. నేను నిగమ్‌తో ఇలా అన్నాను. "నువ్వు హాలసీ రోడ్డున వెళ్ళిపో ! వీళ్ళల్లో ఎవరైనా నీ వెంటపడితే వీళ్ళను చీల్చినట్టవుతుంది. నిన్నేం చేయలేరు గదా ? మిగిలిన వాళ్ళపని నేను చూసుకుంటాను !" (అప్పట్లో నిగమ్ కాంగ్రెసు ఆఫీసులో వుండేవాడు.)

లాల్ ఇమలీ చౌక్‌కు వచ్చాక నిగమ్ హాలసీ రోడ్డువైపు తిరిగాడు. కానీ వాళ్ళు నిగమ్‌ను వెంబడించలేదు. నేను, కాశీరామ్, భవానీ సహాయ్‌తో అన్నాను. "సైకిళ్ళను బాగా వేగంగా తొక్కండి, నేను ఆపమన్నప్పుడు ఒక్కసారిగా ఆపేసెయ్యండి !" మేము బాగా వేగంగా తొక్కుతున్నాం. మమ్మల్ని వెంటాడేవాళ్ళూ వేగాన్ని పెంచారు. బండికి కట్టిన గుర్రం గొప్పది. మంచి వేగంగా పరుగిడుతూన్నది. ఇంకొంచెం ముందుకు వెడితే కచేరీ వస్తుంది. ఆ జనంలో వీళ్ళను వదిలించుకోడం కష్టం అవుతుంది. ఒక్కమాటుగా 'స్టాప్' అనేశాను.

మేము ముగ్గురం షడన్ బ్రేక్ వేసి సైకిళ్ళను ఆపాం ! మేము అక్కడ అలా ఆపుతామనుకోకపోవడం వల్ల వాళ్ళు నాలుగడుగులు ముందుకు వెళ్ళి ఆగి, మా వైపు తిరిగారు. ఆ తిరగడంలో వాళ్ళల్లో ఒకడి దగ్గర రివాల్వరు కనిపించింది. నేను వాళ్ళనుద్దేశించి "ఇంతకూ మీరెందుకిలా మావెంట వస్తున్నారు ?" అనడిగాను.

వాళ్ళల్లో ఒకడు కాశీరామ్ వైపు చూపుతూ "మేము ఈయనను స్టేషనుకు తీసుకు వెళతాం !" అన్నాడు.

"ఎందుకు ?" నేనడిగాను.

"ఈయన మీద వారంటు వుంది !"

"ఈయన మీద వారంటు ఎలా వుంటుంది ? సరే, ఈయన పేరేమిటి ?" అనడిగాను.

"కాశీరామ్ !" అన్నాడు.

"నా పేరు జగదీష్ !" అన్నాడు కాశీరామ్. నేనూ దాన్ని సమర్థించాను.

"అలా ఐతే, ఈయన మాతోపాటు స్టేషనుకు వస్తే అక్కడ తెలుస్తుంది గదా, కాశీరామ్ ఔనో, కాదో ?"

"సరే, మీరు పదండి ! ఈయన స్టేషనుకు వచ్చి స్వయంగా మాట్లాడతాడు. మేము ఈయనను స్టేషనుకు తీసుకువస్తాం పదండి !" అన్నాను. వాళ్ళెందుకు ఒప్పుకుంటారు ? నేను అవకాశం కోసం సమయాన్ని దొర్లిస్తున్నాను. "సరే, సోదరా ! వీళ్ళు చెప్పినట్టు చెయ్యి ! నువ్వు వీళ్ళతోపాటు వెళ్ళు, మేము మీ అన్నయ్యను తీసుకుని స్టేషనుకు వస్తాం !" అని కాశీరామ్‌తో అన్నాను.

కాశీరామ్ కంగారు పడ్డాడు. "నే వెళ్ళను ! నేనెందుకు వెళ్ళాలి ? నాపేరు జగదీష్ !" అన్నాడు.

నేనతడిని కోప్పడ్డాను. "ఎందుకు వెళ్ళవు ? వాళ్ళు రమ్మంటున్నారు గదా ? పోలీసుల మాట మనం వినాలి. వెళ్ళినందు వల్ల నీకు వచ్చిన నష్టం ఏమిటి ?" అన్నాను.

కాశీరామ్ భయపడడం సహజం ! నేనతడిని ఒంటరిగా ప్రమాదానికి గురి చేస్తాననుకున్నాడో, ఏమో ! "నన్ను వెళ్ళమంటావా ?" అనడిగాడు దిగులుగా.

"చెప్తున్నాను గదా వెళ్ళమని. వెళ్ళు. పోలీసుల్తో మనకు పేచీ ఎందుకు ? మీ అన్నయ్యను తీసుకుని మేము ఇప్పుడే వస్తాము గదా ! భయపడవల్సిన పనేముంది ?" అని కోప్పడ్డాను.

గట్టిగా నిట్టూర్చి "సరే !" అంటూ సైకిల్‌ని తిప్పాడు. సైకిల్ మీద ఎలాగయినా తప్పించుకోవచ్చునను కుంటాన్నాడు లాగుంది.

పోలీసులు అతడి సైకిల్‌ను పట్టుకున్నారు. "మీరు బండిలో కూచోండి ! సైకిల్‌ని మేము బండి వెనుక కడతాము !" అన్నారు.

కాశీరామ్ సైకిల్ వదలనని మొండికి వేశాడు. నేను మళ్ళీ కోప్పడ్డాను. "వాళ్ళు చెప్పినట్టు చెయ్యవెందుకనీ ?"

కాశీరామ్ నిరాశగా సైకిల్‌ని వదలి బండిలో కూచున్నాడు. బండివాడి దగ్గర తాడు తీసుకుని ఇద్దరు పోలీసులు సైకిల్‌ని బండి వెనక కడుతున్నారు. మిగిలిన ఇద్దరూ కూడా అటే చూస్తున్నారు. నేను నా సైకిల్‌ను కొంచెం వెనక్కు జరిపాను. రొంటినుండి పిస్తోల్‌తీసి ఇద్దరు పోలీసుల్ని కాల్చాను. మిలటరీ పిస్తోలు. గుండ్లు పెద్దవి. ఒక్కొక్క గుండు తగిలేసరికే కిందపడిపోయారు ఇద్దరూ. అరవసాగారు. మిగిలిన ఇద్దర్లో ఒకడు సైకిల్ మీద పారిపోయాడు. రెండవ వాడు ప్రహరీని దాటి పక్కనే వున్న బంగళా ఆవరణలోకి వెళ్ళాడు.

కాశీరామ్ బండిలోనుంచి కిందికి దూకాడు. కిందపడివున్న పోలీసులో ఒకడికి గురిచూసి అతడూ ఒక గుండు కాల్చాడు. అతణ్ణి, భవానీ సభాయ్‌నూ వెంటనే వెళ్ళిపొమ్మన్నాను. నేనూ, పారిపోయిన పోలీసు వైపు పిస్తోలుతో కాలుస్తూ సైకిల్ మీద వెళ్ళాను. నేను తిరిగి గుల్జారీలాల్ గదికి వచ్చేశాను. ఇంత అయ్యాక ఇంక కాన్పూర్‌లో సమావేశం ఏం జరుగుతుంది ? మర్నాడే ఢిల్లీ వెళ్ళిపోయాను.

మర్నాడు వార్తాపత్రికల్లో ఈ వార్త వచ్చింది. ఇద్దరు పోలీసుల పరిస్థితి ప్రమాదకరంగా వుందని రాశారు. ఒకడికి ఊపిరితిత్తుల దగ్గర దెబ్బ తగిలిందట. మరొకడికి కడుపులో.

ఢిల్లీనుంచి కాన్పూర్ వెళ్ళడానికి డబ్బు సుమిత్రాదీదీ ఇచ్చింది. నేనేదో కార్యక్రమం మీదనే వుళ్తున్నానని ఆమెకు తెల్సు. నేను తిరిగి ఢిల్లీ వెళ్లకముందే సుమిత్రా దీదీ పత్రికల్లో వచ్చిన వార్తల్ని చదివింది. నే వెళ్ళగానే "భయ్యా ! ఏమిటి ఇలా చేశావ్ ?" అని అడిగింది.

"వాళ్ళు అనవసరంగా మా ప్రాణాల మీదికి తెస్తున్నారు. మమ్మల్ని మేము రక్షించుకోవాలి గదా ?" అని చెప్పాను.

కాన్పూర్ పోలీసులు కాశీరామ్‌ను వెతుకుతున్నారు. కానీ, ప్రభుత్వం ఆ కాల్పులకు నేను బాధ్యుణ్ణని ఎలా అనుకుందో తెలియదు. అరెస్టయ్యాక ప్రభుత్వం నామీద కాన్పూర్, కాల్పుల్ని గురించి కూడా కేసు పెట్టింది. ఐతే, ఆ తరువాత కొన్నాళ్లకి కాన్పూర్‌లో 'సిగమ్' అరెస్టయ్యాడు. అతడికి ఇదే కేసు సంబంధంగా ఏడేళ్ళు శిక్ష విధించారు. ఆంగ్ల ప్రభుత్వ న్యాయానికి ఇది ఒక మచ్చు తునక ! ఆ కేసు గురించి ఒకణ్ణి అరెస్టు చెయ్యాలి. చేతికి అందినవాడే పెళ్ళికొడుకు. లేకపోతే పోలీసుల అసమర్థత బయటపడుతుంది కదా ?

తరువాత మరికొన్నాళ్ళకు ఉద్యమ నిర్మాణాన్ని గురించి చర్చించుకోడానికి రమ్మని కబురువచ్చింది. ఈమాటు హాపుడ్‌లో కల్సుకోవాలని నిశ్చయించుకున్నాను. భావి కార్యక్రమాన్ని గురించి నేనొక అభిప్రాయాన్ని ఇచ్చాను. 'పార్టీకి మన భావాలప్రచారం ముఖ్య కార్యక్రమంగా వుండాలి! మన భావాల్ని ప్రచారం చేసుకుంటూ సాధారణ ప్రజల్లో పార్టీ సానుభూతిపరుల్ని ఏర్పరచుకోవాలి ! అలా ప్రచారం చేసుకోడానికి రహస్యంగా ప్రెస్సును నడుపుకోడం అవుసరం ! మనం ప్రెస్సుపనిలో అనుభవం గడించడానికి కాంపోజిటర్ల గానో, మరోటిగానో ప్రెస్సులో చేరడమూ అవసరమేను ! అలాచేయడంవల్ల తాత్కాలికంగా మనజరుగుబాటు సమస్యాపరిష్కారమవుతుంది. ఈ దోపిడీలు చేయవల్సిన అవుసరమూ వుండదు !" అన్నాను.

నా యీ అభిప్రాయం పాండేకు నచ్చలేదు. ఇతర మిత్రులకూ నచ్చలేదు. సాయుధపోరాట బాధ్యతల్ని నేను తీసుకోవాలనీ, తను పార్టీ సిద్ధాంతాల్ని నిర్ణయించే భాధ్యతల్ని తీసుకోవచ్చుననీ అతడి ఉద్దేశం ! ఇది నాకు నచ్చలేదు. ఆ రాత్రి పొద్దుపోయేవరకూ ఏవిషయము తేలక పోవడంతో చర్చల్ని మర్నాటికి వాయిదా వేసుకున్నాము. అపళంగా, ఆ చాపలమీదనే పడి నిద్రపోయాం ! ఉదయాన్నే మెళుకువ వచ్చేసరికి మిత్రుల మాటలు వినబడుతూన్నాయి. ఇద్దరు మిత్రులు నా వీపువైపు కూచుని ఖిన్నస్వరంలో చెప్పుకుంటున్నారు. ఆ మాటలు నాగురించేకావడంవల్ల మౌనంగా వింటూ పడుకున్నాను. '..... భలే ! మన్ని కాంపోజీటర్లను కమ్మంటున్నాడు .... వైస్రాయి ట్రయిన్‌కింద బాంబు పేల్చడానికి బటన్ నొక్కడంతో తను మహా ఇదయిపోయినట్టు భావిస్తున్నాడు ....' అంటూన్నారు. కాసేపు ఆగి లేచి కూచున్నాను. నేను ఆ మాటల్ని విన్నట్టు తెలియనీయలేదు. వీళ్ళకు నామీద విశ్వాసంలేదని నిశ్చయించుకున్నాను. అక్కణ్ణుండి బయల్దేరేప్పుడు చెప్పాను. "మీరొక నిర్ణయానికి రండి ! మీ నిర్ణయం నాకు అంగీకారం అయితే, సహకరిస్తాను !"

ఆ రోజుల్లోనే జరిగిన మరో సంఘటనను కూడా చెప్పడం అవుసరం అనుకుంటున్నాను. ఒకనాటి సూర్యాస్తమయ సమయంలో చావడీ బజారుగుండా జామా మసీదువైపు వెడుతూన్నాను. జనసమ్మర్దం ఎక్కువగా వుంది. కాన్పూర్ సంఘటనకు సంబంధించిన నలుగురు పోలీసుల్లో ఒకడు నా ఎదురుగుండా వచ్చేస్తున్నాడు. నేను విభ్రాంతుణ్ణయ్యాను. బాగా దగ్గరకు వచ్చాక ఒకరి కళ్ళల్లోకి ఒకంర చూసుకున్నాము. ఇతడు అప్పుడు గుర్రం బండిలో కూచున్నాడు. నల్లని నలుపు, స్థూలకాయం, షైల్మాన్లు వేసుకునే దుస్తులూ - ఇట్టే పోల్చుకోవచ్చు ! ఇతడు అప్పుడూ ఇలాంటి దుస్తుల్నే వేసుకున్నాడు. నేనూ ఆనాడు కాన్పూర్‌లో కట్టుకున్నట్టు ధోవతి కట్టుకుని చొక్కా వేసుకున్నాను. ఇద్దరు పోలీసులు గుండు దెబ్బతగిలి పడిపోయాక, ఇతడు ఎదరన వున్న బంగళా ఆవరణలోకి పరుగెత్తి అక్కణ్ణుండి నామీద కాల్పులు జరిపాడు.

నేనతడి కళ్ళల్లోకి చూడగానే అతడు ఆ పాదమస్తకం కంపించిపోయాడు. నేను నారొంటిన చెయ్యి పెట్టుకుని ప్రక్కకు తప్పుకుని, కళ్ళతోనే సంజ్ఞ చేశాను - 'మెదలకుండా వెళ్ళిపో !'

ఆ పోలీసు చప్పున - పరుగెత్తుతున్నంత వేగంతో - నడిచి వెళ్ళిపోయాడు. ఒక్కక్షణం అతడివంక చూస్తూ అలాగే నిలబడి వున్నాను. పదిగజాలు వెళ్ళి అతడు వెనక్కు తిరిగి చూశాడు. నేనలాగే చూస్తూండడంతో, ఇంక పరుగు లంకించుకున్నాడు. నేను గొందులు సందులు తిరుగుతూ ఎవరూ నన్ను వెంటాడడం లేదని నిశ్చయించుకున్న తరువాత నివాసాన్ని చేరుకున్నాను. 'బహుశ, అతడు నిరాయుధుడై వుండవచ్చును !' అనుకున్నాను.

ఇది జరిగాక రష్యా వెళ్ళిపోవాలన్న ఆలోచన తలెత్తింది నా బుర్రలో ! వీళ్ళకు నామీద విశ్వాసం లేనప్పుడు, వీళ్ళ బాధ్యత నాకేమిటి ? ప్రకాశవతి కూడా రష్యా వెళ్ళమనే సలహా ఇచ్చింది !

లాహోరు నేషనల్ హైస్కూలు హెడ్మాస్టరుగా పనిచేసిన గురుదత్తుగారు ఢిల్లీలో కనుపించారు. నేను రష్యా వెడితే ప్రకాశవతికి, తమ ఇంట్లో వుండడానికి అవకాశం ఇస్తామని మాట ఇచ్చారు. అప్పుడు వారు ఉ.ప్రదేశ్‌లోని అమెరీ తాలూకాలో, రాజా సాహబ్‌కు ప్రైవేటు సెక్రటరీగా పనిచేస్తున్నారు. నేను రష్యా వెళ్ళడం కొంతవరకూ నిశ్చయం అయినట్లే ! ప్రభుదత్తు తను కొంత ఆర్థిక సాయం చేస్తానన్నాడు. మిగిలింది సుమిత్రా దీదీని అడగమన్నాడు ! నన్ను విదేశం వెళ్ళమని సుమిత్రాదీదీ ఎప్పటినించో చెబుతోంది !

ప్రకాశవతి గురుదత్తుగారితో అమెరీ వెళ్ళిపోయింది. ఢిల్లీలో మేము వున్న ఇంటిని ఖాళీ చేశాము. సరిహద్దు ప్రాంతాల గుండా రష్యా వెళ్ళడం ప్రమాదకరమని నా ఉద్దేశ్యం ! సరిహద్దు ప్రాంతాల్లో వుండే పఠాన్ దోపిడీదార్ల చేతుల్లోపడి చచ్చిపోవడం జరిగితే ? లేక రష్యాలో ప్రవేశించాక గూఢచారిగా అనుమానించి వాళ్ళు జైల్లోవేసేస్తే ? ప్రయోజనం ఏంటి ? కనుక రష్యాతో సంబంధం కల వ్యక్తుల ద్వారా వెళ్ళడం మంచిది కదా ? అలా వెళ్ళినప్పుడే రష్యా ప్రభుత్వం నన్ను విశ్వసించగలదు ! ఎమ్.ఎన్. రాయ్ రష్యానుండి తిరిగి వచ్చిన కొత్త రోజులు. ఇంకా అరెస్టు కాలేదు. అప్పుడతడు డాక్టర్ అహమ్మద్ అన్న పేరుతో బొంబాయిలో వుంటుండేవాడు. ఒక మిత్రుడి దగ్గర నన్ను కల్సుకోవాలనీ అన్నాడుట! భారత కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమానికీ, ఎమ్.ఎన్. రాయ్ కార్యక్రమానికి ఉన్న వ్యత్యాసం నాకు అప్పటికి తెలియదు. మీరట్ కుట్ర కేసు జరుగుతోంది అప్పుడు. ఆ కేసులోని నిందితుడు హచిన్‌సన్ బెయిల్‌మీద విడుదల అయ్యాడు. నేనతణ్ణి కల్సుకుని నాకో ప్రమాణపత్రాన్ని ఇప్పించమని కోరాను. 'బ్రిటీషు ప్రభుత్వంతో పోరాడుతూన్న విప్లవకారుడు. విశ్వాసయోగ్యుడు !' అన్న ప్రమాణ పత్రాన్ని ఇప్పించమన్నాను.

హచిన్‌సన్ ప్రమాణ పత్రాన్ని ఇప్పిస్తానన్నాడు. ఐతే, దానికోసం నేను బొంబాయి వెళ్ళాలన్నాడు! అప్పట్లో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం మరో రకంగా వుండేది. పార్టీ ప్రసిడెంట్ సుహాసిని ! ఆమె జబ్బులో వుంది. బొంబాయి వెళ్ళి రణదివేను కల్సుకుని మాట్లాడాను. ప్రమాణ పత్రాన్ని ఇవ్వడానికి సందేహాన్ని వెలిబుచ్చాడు. నేను మధ్యలో ఎక్కడైనా అరెస్టయితే, నా దగ్గర తమ ప్రమాణ పత్రం వుండడం వల్ల, 'టెర్రరిస్టులకూ, కమ్యూనిస్టు పార్టీకీ సంబంధం వున్నట్లు నిర్ణయం అవుతుంది !' అని భయపడ్డాడు. ఐతే, సముద్రమార్గాన విదేశాలకు తీసుకువెళ్ళే వ్యక్తుల్ని పరిచయం చేస్తానన్నాడు. బొంబాయిలో వాళ్ళదగ్గర వున్నప్పుడు, నేను సాయుధుడుగా వుండడం వాళ్ళను బాధించింది !

ఎమ్.ఎన్.రాయ్‌ని కల్సుకోవాలన్న అభిప్రాయాన్ని రణదివేకు చెప్పాను. అతడిలా అన్నాడు."మీ యిష్టం కల్సుకోవచ్చును. కానీ, మీరు ఎమ్.ఎన్. రాయ్‌తో పరిచయం పెట్టుకుంటే మా పార్టీ నుండి ఎలాంటి సహాయాన్నీ ఆశించకండి !" ఎమ్.ఎన్.రాయ్ భారతదేశానికి వచ్చేముందు కమ్యూనిస్టు ఇంటర్ నేషనల్‌తో పోట్లాడి వచ్చాడనీ, చైనాలో విశ్వాసఘాతకం చేసినట్టు అతడిమీద ఆరోపణలు వున్నాయనీ నాకు అప్పటికి తెలియదు.

బొంబాయి నించి తిరిగివచ్చాను. ఈ మాటు అన్ని విషయాల్ని పరిష్కరించుకుని బొంబాయి వచ్చి, అక్కడ నుండి విదేశాలకు వెళ్ళిపోవాలనుకున్నాను. ఆమెరీ వెళ్ళి ప్రకాశవతిని కల్సుకున్నాను. ఆమె వెనుకటి సలహానే ఇచ్చింది. అక్కడ నుండి తిరిగి వచ్చేటప్పుడు ప్రతాపగఢ్ స్టేషన్ వైటింగ్ రూమ్‌లో కొంతసేపు నిరీక్షించవల్సి వచ్చింది. గుజరాతీ సేఠుల్లా పొడుగాటి కోటు సన్నని ధోవతి, టోపీ-ధరించాను. నేను అక్కడ కూచుని వుండగానే స్టేషనంతా పోలీసులతో ముట్టడింపబడటాన్ని చూసి అదరిపడ్డాను. గుమ్మడికాయల దొంగ ఎవడంటే బుజాలు తడుముకున్నట్లు అయింది. 'నేనీ వైటింగ్ రూమ్‌లో వున్నట్టు పోలీసులకు తెల్సి వుంటుంది. ముట్టడించారు. పోలీసులతో పోరాడుతూ చనిపోవడమే గత్యంతరం !' అనుకున్నాను. పరిసరం బొత్తిగా అపరిచితం అయింది. ఆ గదిమధ్యలో ఒక టేబుల్ వుంది. దానిమీద సూట్‌కేసును తెరచిపెట్టాను. 'దానిచాటున వుండి ఎక్కువసేపు పోరాడవచ్చును' అనుకున్నాను. తలుపులకు సన్నని ఇనుపతెరలుండడం వల్ల బైటి దృశ్యం నాకు స్పష్టంగా కనపడుతూన్నా, లోపలి దృశ్యం బైటివాళ్ళకు కనపడదు. 'పోలీసులు వైటింగ్ రూమ్‌వైపు వస్తూనే వుంటారు !' అనుకుంటూ మాటి మాటికీ సూట్‌కేసుపై నుండి తొంగి చూస్తున్నాను. కొంతసేపటి తరువాత ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు తలపాగలను సరిచేసుకుంటూ వస్తూ కనుపించారు. ఇద్దరి భుజాలనా రివాల్వర్లు వ్రేలాడుతున్నాయి. వాళ్ళ వెనుక సాయుధులైన పోలీసులు కొందరున్నారు. వెంటనే సూట్‌కేసు చాటుకువెళ్ళి రివాల్వర్ చేతిలోకి తీసుకు సిద్ధంగా వున్నాను. వాళ్ళు లోపలకు అడుగుపెట్టగానే, మొదటి దెబ్బ నేనే కొట్టాలనుకున్నాను !

ఒక కానిస్టేబులు తలుపు తెరచాడు. ఇన్‌స్పెక్టరు లోపలకు తొంగి చూశాడు. ఐతే, చిరునవ్వు నవ్వుతూన్నాడు. చాలా సభ్యతగా "నమస్తే, మీకు కొంచెం ఇబ్బంది కలిగిస్తున్నాము !" అన్నాడు నేను రివాల్వర్ని లోపలపెట్టి, సూట్‌కేసు మూసేశాను. నేనూ చాలా వినయంగా "చెప్పండి !" అన్నాను.

ఇన్‌స్పెక్టరు అన్నాడు. "గవర్నర్‌గారి స్పెషల్ ట్రైన్ ఇంజను ఇక్కడ నీళ్ళు పోసుకుంటుంది! నియమం ప్రకారం అలాంటప్పుడు స్టేషన్‌లో ఎవరూ వుండడానికి వీల్లేదు. బాధలేదనుకుంటే, మీ సామాన్లకు తాళంవేసి పది నిమిషాలు బైట తిరిగి రండి !"

మనస్సు కుదుటపడ్డది. బొంబాయి యాసతో హిందిలో "మీ నియమం ఎట్లాగో అట్లాగే కానిద్దాం ! కానీ, నేను బండిమారడానికి కూచున్నాను. ఈ పరిసరం నాకు తెలియదు !" అన్నాను.

"ఐతే మీరు స్పెషల్ ట్రైన్ ఇక్కడున్నవరకూ బైటకు రాకండి ! ఒక్క పది నిమిషాలు. మీకు ఇబ్బంది అనుకోండి ! ఐనా, నియమాన్ని పాటించక తప్పదుగదా ?" అన్నాడు. పీడ విరగడయింది. చెప్పవచ్చేది ఏమిటంటే, అహర్నిశలూ మనస్సు ఇంత తీవ్రంగానూ ఆలోచిస్తూ వుండేది !

సుమిత్రాదీదీ మసూరీలో వుందని తెల్సి నేనక్కడికి వెళ్ళాను. ఆర్థిక సహాయాన్ని గురించి మాట్లాడాలి గదా ? సంపన్నుల వేషంలోనే వెళ్ళాను. హోటల్లో గది తీసుకుందామంటే అద్దె అధికంగా వుంటుంది. కాగా, ఎవరూ ? ఏమిటి ? అన్న సమస్య కూడా వస్తుంది. ఒక పెద్ద బంగళాలో గదులు అద్దెకు ఇస్తారని తెల్సి వెళ్లి అడిగాను కుటుంబంతో వుంటారా ? ఒంటరిగా వుంటారా ? అనడిగారు. ఒంటరివాళ్ళకు గదులు ఇవ్వరేమో అనుకున్నాను. "గది దొరికితే ఉత్తరం రాసి భార్యను పిలిపించుకుంటాను !" అన్నాను. ఒక గదిని అద్దెకు తీసుకున్నాను.

సుమిత్రాదీదీ ఉన్న చోటుకు వెళ్ళాను. ఆమె అక్కగారు కనుపించారు మొదట ! ఢిల్లీలో వారింటికి వెళ్ళేప్పుడు ఖద్దరు దుస్తులు వేసుకుని, టోపీ పెట్టుకుని వెళ్ళేవాడిని. ఈమెగారు నా గురించి చెల్లెల్ని అడిగింది అప్పుడు. "డాక్టరు కాంగ్రెసులో పనిచేస్తుంటారు !" అని చెప్పింది సుమిత్రాదీదీ.

"డాక్టరా ? పాపం, ఏం ప్రాక్టీసు వుంటుదీనకు ?" అని సహానుభూతిని ప్రకటించింది అక్కగారు. "అదే ప్రాక్టీసు ! హోమియోపతి డాక్టరు !" అన్నది సుమిత్ర.

ఇప్పుడు, మసూరీలో కోటూ, ప్యాంటూ, టై కట్టుకుని వారింటికి వెళ్ళాను. దీదీ అక్కగారు మొదట గుర్తుపట్టలా, గుర్తుపట్టాక ఎత్తిపొడుపుగా "ఏమండీ డాక్టరుగారూ ! ఖద్దర్ని ఏం చేశారు ?" అనడిగింది.

"ఇప్పుడు ఇంక ఖద్దరు పనేముంది ? స్వరాజ్యంకోసమే కదా, ఖద్దరు తొడగడం ? గాంధీగారు స్వరాజ్యం తీసుకు రావడానికి ఎటూ వెళ్ళారు గదా ? (గాంధీగారు రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సుకు వెళ్ళారు) ఇంక ఖద్దరుతో పనిలేదు !" అని చెప్పాను.

సుమిత్రాదీదీని కల్సుకున్నాను. ఢిల్లీ వెళ్ళాకగానీ, తనేమీ చేయలేనంది. కుటుంబం మొత్తం బయల్దేరినప్పుడే తను ఢిల్లీకి బయలుదేరుతుంది.

× × ×

రష్యా ప్రయాణం వాయిదా పడుతూనే వుంది. ఇన్నాళ్టిలో మిత్రుల అవిశ్వాసం తాలూకు మానసిక బాధ కొంత శమించింది. 'నన్ను విశ్వసించని వాళ్ళ విషయం వదిలిపెడదాం, విశ్వసించేవాళ్ళూ చాలామంది వున్నారు. నామీద విశ్వాసంగల మిత్రుల్తో తిరిగి ఉద్యమాన్ని నిర్మించవచ్చును గదా ?' అనిపిస్తోన్నది. 'సూరి' వారి కుటుంబం ఇటు కాంగ్రెసువాదులకూ, అటు విప్లవకారులకు కూడా పరిచయమైన కుటుంబం ! కొద్ది ప్రయత్నంతో రామసింగ్, హరిబంధు, రాజేంద్రసింగ్, రణధీర్‌సింగ్‌లాంటి మిత్రుల్ని కల్సుకోగలిగాను. వీళ్ళు నాకోసం వెతుకుతూన్నారు. రాజేంద్ర, రణధీర్‌సింగ్‌లు రెండు మూడు పిస్తోళ్ళను కూడా సంపాయించారు. కాన్పూర్ నుంచి 'మహీమా' ఢిల్లీ వచ్చింది. ఆమె నన్ను వెతుకుతోంది. పార్టీ ఇలా స్తబ్దు అయిపోయినందుకు వీళ్ళందరూ బాధపడుతూన్నారు. నేను ఏదో కొంత చేయగలనన్న విశ్వాసం వీళ్ళందరికీ వుంది. ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతానికి చెందిన కృష్ణశంకర్ శ్రీవాస్తవ్ తనమిత్రుల పూర్తి సహాయ సహకారాల్ని అందివ్వగలనని మాట ఇచ్చాడు. అతడు ఢిల్లీలో వున్న ఒక ఐరిష్ స్త్రీని పరిచయం చేశాడు. ఆమె పేరు సావిత్రీదేవి ! (మిసెస్ జాఫర్ అలీ) ఆమె జాఫర్ అలీకి విడాకులిచ్చి, మాంటుస్సోరీ పద్ధతిలో పిల్లల విద్యాలయాన్ని నడుపుకుంటోంది. ఐరిష్ వనిత కావడం వల్ల ఇంగ్లీషువాళ్ళను ద్వేషిస్తుంది. భారతదేశాన్ని తన మాతృదేశంగా భావిస్తోన్నది. ఇంగ్లీషువాళ్ళను ఈ దేశం నుండి వెళ్ళగొట్టే ప్రయత్నాలకు సహకరించడం ఆమెకు చాలా ఇష్టం ! వీరందరి రాజకీయ భావన హి.స.ప్ర.స. భావనలకు దగ్గరగా వుంది. వీరందరినీ కూడగట్టుకుని ఏదో ఒకటి చేయవచ్చునన్న ఆశ మొలకెత్తింది నాలో ! ఇదే సందర్భంలో సుశీలాదీదీని దుర్గాబాభీని కూడా కల్సుకున్నాను. సుశీలాదీదీ సహాయం చేయడానికి స్పష్టంగా నిరాకరించింది. దుర్గాబాభీ చాలా సౌమ్యంగా మాట్లాడింది. మేము ఏమైనా చేస్తే తన శక్తినిబట్టి సహకరిస్తానన్నది.

కృష్ణశంకర్, రాజేంద్రసింగ్ - ఇద్దరూ కాన్పూర్ నుండి కబురు పంపించారు. మరోమాటు మిత్రులందరం కూచుని ఉద్యమ నిర్మాణాన్ని గురించి చర్చించుకుందామన్నారు. ఈ మాటు సమావేశం గఢముక్తేశ్వరంలో, తిరుణాల సమయంలో జరపడానికి నిశ్చయం అయింది. జనవరి మొదటివారం........ చలి ఎముకల్ని కొరికేస్తోంది. నేనూ, ప్రకాశవతి ఇద్దరం వెళ్ళాం ! సమావేశానికి ఇందరు రావడం చూసి ఆశ్చర్యపడ్డాం ! అంతకుముందు ఇలాంటి సమావేశాలకు ఏడెనిమిది మందికంటె ఎక్కువమంది హాజరు అయ్యేవాళ్ళం కాదు. సురేంద్రపాండే, మాషీమా, పంజాబు నుండి పాండే చెల్లెలూ, ఇంకా నేనెరుగనివాళ్ళు చాలామంది వచ్చారు. పాండే మందీ - మార్బలంతో వచ్చాడు అనిపించింది. మనస్సు బాధపడ్డది. తన వాదనను మెజారిటీ నిర్ణయం పేరుతో ఒప్పించుకోవడానికి ఇదొక ఎత్తు అనుకున్నాను.

పాండే పరిస్థితిని వివరించడం ప్రారంభించాడు. సిద్ధాంతరూపంగా అతడికీ నాకూ అభిప్రాయభేదాలు ఏమీలేవు. అతడు సిద్ధాంతపరమైన కార్యక్రమాన్ని స్వీకరించి, ప్రమాదభరితమైన సాయుధ కార్యక్రమాన్ని నాకు వప్పగించడమే నచ్చలేదు నాకు ! పాండే సాయుధ కార్యక్రమాలు తనవల్లకావనీ, ఐతే, సిద్ధాంతరీత్యా ఉద్యమాన్ని నిర్మించడంలో సహకరించగలననీ అన్నాడు. అంతకుముందు కార్యాచరణనూ - సిద్ధాంతాన్నీ వేరుచేసి ఆలోచించడం అలవాటు లేకపోవడం వల్ల, నాకది విచిత్రమనిపించింది !

పాండే తన వాదాన్ని వ్యతిరేకించడానికి వీల్లేనంత సౌమ్యంగా చెప్పాడు. ఐనప్పటికీ నేను వ్యతిరేకించాను. "రెండు నాయకత్వాల అవసరం ఏమీలేదు. మన లక్ష్యం ఏమిటో, సిద్ధాంతం ఏమిటో తెల్సు మనకు ! ఇకపోతే, మెజారిటీ నిర్ణయాన్ని తీసుకునే విషయం అంటారా ? ఇక్కడున్న వాళ్ళల్లో చాలామందిని నేను ఎరగనే ఎరగను ! ఓటుచేసే హక్కు కేవలం పార్టీ సభ్యులకే ఉండాలని నా ఉద్దేశ్యం !" అన్నాను. నేను, పాండే చెల్లెల్ని పంజాబునించి వచ్చిన అపరిచితులైన ఇతర మిత్రుల్ని ఉద్దేశించి అన్నాను.

రాజేంద్రసింగ్ నా అభిప్రాయాన్ని వ్యతిరేకించాడు. "సభ్యులంటే అర్థం ఏమిటి? ప్రాణాలకు తెగించి పోరాడే వాళ్ళందరూ సభ్యులే ! అలాంటి వాళ్ళందరికీ ఓటింగ్ హక్కు వుండాలి !" అన్నాడు. అతడి మాటను అందరూ సమర్థించారు. ఇంక నేనేం అనను...... ? అప్పుడే పాండే చెల్లెలు అంది. "నాయకుడు ఒక్కడే వుండాలని నా అభిప్రాయం. కమాండర్-ఇన్-చీఫ్ అన్ని కార్యక్రమాలనూ నిర్ణయిస్తాడు. అతడే నాయకుడు......." అని క్షణం ఆగి "కమాండర్-ఇన్-చీఫ్‌గా యశ్‌పాల్ వుండాలని నా అభిప్రాయం !" అన్నది ఆమె. ఆమె ప్రస్తావనను అందరూ సమర్థించారు. పాండే కూడా సమర్థించాడు. నేనలా మాట్లాడినందుకు చాలా సిగ్గుపడ్డాను. అప్పటికీ పాండే సిద్ధాంత పక్షాన్ని నిర్లక్ష్యం చేయకూడదని నొక్కి చెప్పాడు. అతడికి సిద్ధాంత అధ్యయనానికీ, ప్రజా సహకారాన్ని కూడగట్టుకోవడానికి ప్రత్యేకం పనిచేయల్సిన బాధ్యతను వప్పగించాము. ఇదే సమావేశంలో మా పోరాటం దౌర్జన్యవాదంగా వుండరాదనీ, గెరిల్లా పోరాట పద్ధతుల ద్వారా విస్తృత సాయుధ పోరాటానికి ప్రయత్నించవలసి వుంటుందనీ నిర్ణయించుకున్నాము. ఇదే సందర్భంలో కమాండర్-ఇన్-చీఫ్ యశ్‌పాల్ పేరున ఒక కరపత్రాన్ని కూడా ప్రకటించాము. ఉత్తరప్రదేశ్‌లోని తూర్పు భాగంలో ఉద్యమ నిర్మాణానికి సమావేశం వేసుకోవడం అవసరం అన్నాడు కృష్ణశంకర్ ! అందుకోసం జనవరి 22 వ తారీకు సాయంత్రం అలహాబాదు వస్తానని అతడికి మాట ఇచ్చాను.

బండి రాత్రి తొమ్మిదిన్నర గంటలకు అలహాబాదు చేరింది. కృష్ణశంకర్ తనను కల్సుకోవడానికి హివెట్ రోడ్డు అడ్రసు ఇచ్చాడు. హివెట్ రోడ్డులో 'హోటల్ కృష్ణా' పై అంతస్తులో, ఐరిష్ మహిళ సావిత్రీదేవి గదిని అద్దెకు తీసుకుని ఉంటోంది. ఈ రాత్రి సమయంలో అక్కడికి వెళ్ళి ఆమెను బాధపెట్టడం ఇష్టంలేదు. పరిచయస్తులు చాలామంది ఉన్నారు. ఎక్కడికో ఒకచోటికి వెళదామనుకున్నాను. తెల్లవారి కృష్ణశంకర్‌ని కల్సుకోవచ్చుననుకున్నాను. కానీ నన్ను రిసీవ్ చేసుకోడానికి కృష్ణశంకర్ స్టేషన్‌కే వచ్చాడు. ఇంక అతనితో వెళ్ళక తప్పలేదు. అతడు నన్ను ఐరిష్ మహిళ నివాసానికి తీసుకువెళ్ళి దింపాడు. నాకు అప్పుడే కొంత బాధ కలిగింది. కారణం ఏమిటంటే, భారతీయ కట్టుబొట్టుతో, ఈ దేశపు సాధారణ ప్రజల మధ్య నివసించే యూరోపియ వనితపట్ల ప్రజలు ఉత్సుకతను ప్రదర్శించడం సాధారణ విషయం ! అలాంటి ఆమె అతిథినైన నాపట్ల కూడా ఆసక్తిని కనబరుస్తారు గదా ప్రజలు ? ప్రజలదృష్టికి ఎక్కకుండా వుండటానికే సదా ప్రయత్నిస్తూ వుంటాము.

సావిత్రీదేవి ఎంతో ఆత్మీయతగా ఆతిథ్యాన్నిచ్చారు.

భోజనం అయింది. పడుకోబోతూన్నాను. నా గరమ్‌కోటును చిలకకొయ్యకు తగిలించాను. ఆజాద్ నాకు ప్రత్యేకం ఇచ్చిన ఎనిమిది గుళ్ళతుపాకీ, విడి మేగజీనూ కోటు జేబులో వున్నాయి. నిద్రపోయేప్పుడు వాటిని తలకింద పెట్టుకుపడుకోవడం అలవాటు !

కృష్ణశంకర్ శ్రీవాస్తవ్ వెళుతూ "సమావేశానికి వచ్చే మిత్రులకు సమయాన్ని, ప్రదేశాన్ని చెప్పి వస్తాను. నేను ఇంక తెల్లవారుఝామున ఐదు, ఐదున్నర గంటలకు వస్తాను !" అన్నాడు.

బయటకు వెడుతూ "భైయ్యా ! చలి ఎముకల్ని కొరికేస్తోంది. నీకోటు వేసుకువెళ్ళనా ?" అని అడిగాడు.

కోటు జేబులో వున్న పిస్తోల్‌ను నాకు ఇచ్చి, కోటు వేసుకువెళ్ళమన్నాను. కృష్ణశంకర్ గోడదగ్గర పడివున్న రివాల్వర్ని చూపుతూ "ఇదిగో రివాల్వర్ ! మదర్ దగ్గర ఇంకా వున్నాయి కూడాను !" అన్నాడు. శ్రీవాస్తవ్ సావిత్రిగారిని మదర్ అనిగానీ, 'మా' అనిగానీ పిలుస్తాడు. ఆమెను తల్లిలాగానే భావిస్తాడు.

అతడు వెళ్ళగానే దగ్గర్లో పడివున్న రివాల్వర్ని తీసుకుని, గుండ్లు విడిగా తీసి ఒకమాటు నొక్కి చూశాను. సరీగా నడవలేదు. మీటను ఎడం చేత్తో సరిచేసుకుంటూ, కుడిచేత్తో కాల్చవల్సి వుంటుంది దాన్ని ! తలకింద పెట్టుకుపడుకున్నాను. ఇంకోటి ఉందో, లేదో కూడా కనుక్కోలేదు.

చిన్నతనం నుంచి తెల్లవార్ఝురఝామునే నిద్రలేవడం నా అలవాటు ! నిద్రలేచి టైం చూసుకున్నాను. ఐదు గంటలు అయింది. సావిత్రీదేవి కూడా లేచింది. "టీ పెట్టి ఇవ్వనా ?" అని అడిగింది. నిద్రలేవగానే ఒక కప్పు వేడివేడి టీ తాగితే హాయిగా వుంటుంది. ఇవ్వమన్నాను. ఆమె స్టౌ వెలిగించి, టీ తయారుచేసే ప్రయత్నంలో వుంది. 'కృష్ణశంకర్ శ్రీవాస్తవ్ వస్తూ వుండవచ్చును !" అనుకున్నాను మనస్సులో !

సావిత్రీదేవి రెండో అంతస్థులో వుంటోంది. మెట్లమీద అడుగుల శబ్దం వినిపించింది. శ్రీవాస్తవ్ వస్తూన్నాడనుకున్నాను. ఐతే, చాలామంది వస్తూన్న శబ్దం అది !

"ఎవరో వస్తూన్నా"రన్నది సావిత్రీదేవి.

"చాలామంది వస్తూన్న శబ్దం ఇది !" అన్నాను నేను.

తలుపు కొట్టారు. తలుపు కొట్టడంలో దార్ష్టికం కనుపిస్తోంది.

"ఎవరు ?" సావిత్రిగారు ఇంగ్లీషులో అడిగింది.

"తలుపు తెరు !" బయట నుండి ఇంగ్లీషులో ఆర్డర్ వచ్చింది !

"ఎవరు నువ్వు ?" మళ్ళీ అడిగింది ఈమె.

"పోలీసులం త్వరగా తలుపు తెరు !"

రోమాలు నిక్కబొడుచుకున్నాయి. అంతిమ సమయం వచ్చేసింది అన్న భావన కరెంటు షాక్‌లా తగిలింది. సావిత్రీదేవి నావైపు అనుమానంగా చూసింది. బయట ఉన్న పోలీసుల్ని ఉద్దేశించి "పోలీసులకు ఇక్కడేం పనుంది ?" అనడిగింది.

"నీ యింటిని సోదా చెయ్యాలి. త్వరగా తెరు. లేకపోతే తలుపుల్ని బద్దలు కొట్టవల్సి వుంటుంది !" సంభాషణ ఇంగ్లీష/లో జరుగుతోంది.

సావిత్రీదేవి మళ్ళీ ఒకమాటు నావంక చూసింది.

"మీరు తలుపు తెరచి ఒక పక్కకు తప్పుకోండి ! నేను పోరాడుతాను. మీరు మధ్యలోకి రాకండి ! తలుపు తెరవండి !" అన్నాను. దిండు కిందనుంచి రివాల్వర్ తీసుకున్నాను.

సావిత్రీదేవి తలుపు తీయడానికి ముందుకు అడుగు వేసింది. నేను వాకిలివైపు గురిపెట్టాను. తలుపు తీయగానే మొదట నేనే కాల్చాలనుకున్నాను. కానీ, అలా కాలిస్తే మొదటి గుండు సావిత్రీదేవికే తగుల్తుంది. మరోచోటు ఏదైనా వెతుక్కోవాలి ! 'పారిపోవడానికి వీలుంటే సరే సరి ! లేకపోతే దేన్నయినా చాటు చేసుకుని బాగా పోరాడదా'మనుకున్నాను.

ఆ ఇల్లూ, పరిసరం నాకు కొత్త ! వెనుక గదిని ఆనుకుని వాకిలి వుంది. చిన్న మెట్లవుంది. ఎదురుగా నిలువెత్తున సీనారేకుల్తో అడ్డం కట్టిన దడి వుంది. ఆ రేకులు నాకంటే ఎత్తుగా వున్నాయి. చేతులు మోపి అవతలికి దూకబోయాను. నా వెనుకనుంచి కాల్పుల శబ్దం వినిపించింది. నా తలమీదుగా గుండు దూసుకుపోయింది. అవతల వైపు దూకాను. మరో గుండువచ్చి నా పక్కనే పడ్డది. వెనుక్కు తిరిగి గొంతుక్కూచుని ముందుకు చూశాను. రేకుల దడి కొసనుండి ఒక యూరోపియన్ పిస్తోలుతో నా మీదకు కాలుస్తున్నాడు. నేనూ అతడికి గురిచూసి కాల్చాను. యూరోపియన్ తలచాటు చేసుకున్నాడు. క్రింద బజార్లో నుండి కూడా తుపాకులు కాలుస్తున్న శబ్దం వినిపించింది.

నన్ను కాల్చడానికి అతడు తలపైకి పెట్టినప్పుడు, నేనూ కాలుస్తున్నాను. రివాల్వర్ మొండికి వేస్తూన్నది. ప్రతిమాటూ దాన్ని ఎడంచేత్తో సరిచేసుకుని కాల్చవల్సి వస్తోంది. శత్రువు రెండుమార్లు కాలిస్తే, నేను ఒక్కమారు కాలుస్తున్నాను. రివాల్వర్‌లో ఆరే గుండ్లు వున్నాయి. తొందరలో ఇంకా గుండ్లను తీసుకోవడం మర్చేపోయాను. నా రివాల్వర్‌లో గుండ్లు అయిపోయాయి. అతడు కాల్చిన ఒక్క గుండూ నాకు తగల్లేదు. అందుకు, ఆతడిలోని ఆత్మరక్షణ తాలూకు ఆదుర్దా కొంత కారణం, చీకటి కూడా కొంత కారణం ! నేను కాల్చినవీ అతడికి తగల్లేదు. గుండ్లు అయిపోయాయి. యూరోపియన్ తలపైకి పెట్టాడు. ఖాళీ రివాల్వర్‌ని అతడిమీదకు విసిరికొట్టాను.

ఈ మాటు యూరోపియన్ తలపైకి పెట్టి పిస్తోలును నావైపు గురిపెట్టాడు. ఐతే, కాల్చలేదు "Now You are unarmed" (ఇప్పుడు నీవు నిరాయుధుడివి) అన్నాడు.

అతడు ఒక్కక్షణం ఆగాడు. అతడి స్వరం మారింది. "సరే, ఇటురండి !...... నేను సాయం చేయనా ?" యూరోపియన్ ఎత్తైన వస్తువును దేన్నో ఎక్కి సాయం చేయడానికి తన చేతిని రేకుల ఇవతలకు పెట్టాడు.

"ధన్యవాదం"

నేనతడి సహాయాన్ని అపేక్షించకుండానే చేతుల వూతంతో ఎగిరి అవతలవైపుకు దూకాను. అవతలవైపున రేకులకు వూతంగా వుండడానికి కొయ్యదుంగ నొకదాన్ని పాతారు. అతడు ఆ దుంగమీదకు ఎక్కి నన్ను కాల్చగలిగాడు. చేయి అందించడానికి ఆ దుంగమీదకే ఎక్కాడు. "దెబ్బలేమీ తగల్లేదు గదా ?" అతడు నన్ను అడిగాడు.

"లేదు ! మీకూ తగల్లేదనే అనుకుంటున్నాను !" అని అన్నాను.

అతడు మోకాలి దగ్గర నాపైజామాకు ఉన్న రక్తపు మరకను చూపుతూ "ఈ మరక ఏమిటి ?" అనడిగాడు.

నేనూ చూసుకున్నాను. "ఏమీలేదు, రేకు గీచుకుంది !" అన్నాను.

ఆ యూరోపియన్ తన పరిచయాన్ని ఇచ్చాడు. "నా పేరు డి. పిడ్లిచ్ ! స్పెషల్ పోలీసు సూపరింటెండెంట్‌ను ! మీరు మిస్టర్ యశ్‌పాలని నాకు తెల్సు !" అన్నాడు.

"ధన్యవాదం !"

అప్పుడే ఒక హెడ్‌కానిస్టేబుల్ తుండు నొకదాన్ని మెలిపి నా చేతులకు కట్టడానికి ముందుకు వచ్చాడు. పిడ్లిచ్ అతడిని అవతలకు పొమ్మన్నాడు. "నా ఉద్దేశంలో చేతులు కట్టవల్సిన అవసరం లేదనుకుంటున్నాను. మీ అభిప్రాయం ఏమిటి ?" అని అడిగాడు నన్ను.

"అవుసరం వుండదని నేనూ అనుకుంటున్నాను. ఆ తరువాత మీ ఇష్టం !" అన్నాను.

"మీరు ఇప్పుడే లేచినట్టున్నారు బట్టలు మార్చుకోండి. అంతవరకూ వేచి వుంటాం !" అన్నాడు పిడ్లిచ్.

"నేనొక్క కంబళి మాత్రం తీసుకుంటాను చాలు !"

"మీ ఇష్టం !"

అక్కడ నుండి వెళ్ళబోయేముందు సావిత్రీదేవిగారికి నమస్కరించి "నానుంచి మీకూ బాధ కలిగినందుకు విచారిస్తున్నాను !" అన్నాను.

సావిత్రీదేవి గర్వంగా తలపైకి ఎత్తి "నేను విచారించడం లేదు. గర్వపడుతూన్నాను !" పిడ్లిచ్ వైపు తిరిగి "నేనీ ఇంగ్లీషు దుర్మార్గుల్ని ద్వేషిస్తున్నాను !" అన్నది.

దీన్నిబట్టి ఆమె తనకు తెలియనట్టు నటించి శిక్షనుండి తప్పించుకునే ప్రయత్నం చేయదని స్పష్టమయింది.

పిడ్లిచ్ ఇనస్పెక్టరుకు ఆజ్ఞ ఇచ్చాడు. "ఈ ఇంటిని సోదాచేసి ఔసరం అయిన చర్య తీసుకోండి!" అన్నాడు. తరువాత నన్ను వెంటపెట్టుకుని, మరో ఆఫీసరుతోనూ, నలుగురు కానిస్టేబుళ్ళతోనూ - కిందికి దిగాడు. కింద, వీధిలో ఒక చిన్నకారు, మూడు పోలీసు లారీలు వున్నాయి. కొందరు కాంగ్రెసు జండా పుచ్చుకుని, ఆశ్చర్యంగా చూస్తూ ఒక పక్కగా నిలబడి వున్నారు. జాతీయవారం జరుగుతోంది. ప్రభాత ఫేరీని జరుపుతున్న దళమది ! వాళ్ళూ దేశ స్వాతంత్ర్యం కోసం నినాదాలిస్తున్నారు. నేనూ నా పద్ధతిలో దేశ స్వాతంత్ర్యం కోసమే ప్రయత్నించాను. కానీ, ఆ క్షణాన వాళ్ళూ నేనూ ఒకరికొకరం అపరిచితులం ! తుపాకి కాల్పుల శబ్దాల్ని విని రోడ్డుమీద చాలామంది జనం ప్రోగుపడ్డారు.

చిన్న కార్లో పడ్లిచ్ కూచ్చున్నాడు. ప్రక్కన నన్ను కూచోమన్నాడు. నా పక్కన రెండవ ఆఫీసరు కూచున్నాడు. ముందు సీటులో, డ్రైవరు, పక్కన సాయుధుడైన పోలీసు కూచుని వున్నాడు. కారు బయల్దేరింది. మా కారుకు ముందూ, వెనుకా సాయుధులైన పోలీసుల్తో నిండిన లారీలు ఉన్నాయి. కొంచెం దూరం వెళ్ళాక పిడ్లిచ్ నా పక్కన కూర్చున్న ఆఫీసర్ని పరిచయం చేశాడు నాకు. "వీరు డిప్యూటీ సూపరింటెండెంట్ మిస్టర్ మిశ్రా !" అన్నాడు.

మిశ్రా ఇలా అన్నాడు. "మీరు పంజాబీలు కదా ? నేను పంజాబులో చాలా రోజులు వున్నాను. పంజాబీలు సహజంగానే సాహసవంతులు !" అయన పంజాబీలోనే మాట్లాడుతూన్నాడు. "చాలా చలిగా వుంది. వెళ్ళి టీ తాగుదామంటారా ? లేకపోతే, లస్సీ తాగుదామా ? పంజాబీలు చలికాలంలోనూ లస్సీ తాగటానికే ఇష్టపడతారు !" అన్నాడు.

నేనొకమాటు తీక్షణంగా మిశ్రావంక చూశాను. "ఇలాంటి పరిహాసాలు నాకు నచ్చవ్ !" అన్నాను ఇంగ్లీషులో.

మిశ్రా ఒక్కక్షణం మౌనంగా వుండిపోయాడు. తరువాత 'I am sorry' అన్నాడు.

నేను కోపగించుకోవల్సిన పనిలేదు. మిశ్రా నాతో పరిహాసమూ ఆడలేదు. ఓటమిని కప్పిపుచ్చుకోవాలన్న వ్యర్థ ప్రయత్నంలో అలా కోపగించుకున్నాను.

మా కారు కైనింగ్ రోడ్డు పోలీసు స్టేషన్ లోపలకు వెళ్ళిపోయింది. డ్యూటీలో వున్న పోలీసులు పరుగెత్తుకు వచ్చారు. పిడ్లిచ్ లాకప్ గదిలో ఒక కుర్చీనీ, ఒక మేజాబల్లనూ వేయమని ఆజ్ఞ ఇచ్చాడు. తరువాత నన్నిలా అడిగాడు. "టీ తెప్పించమంటారా ?"

"అలాగే, ధన్యవాదం !"

"మీకేమైనా అవసరమైతే, కబురు పెట్టండి. సూపు పిళ్ళాలకు నేనే వచ్చి కల్సు కుంటాను !" అన్నాడు.

పిడ్లిచ్, మిశ్రా - ఇద్దరూ వెళ్ళిపోయారు. లాకప్ కొట్టు ఇనుప చువ్వల తలుపులు మూసుకున్నాయి. ఒక పోలీసు బాయనెట్ పుచ్చుకుని పహరా ఇస్తున్నాడు.

నేను నమ్మక ద్రోహంవల్ల పట్టుబడ్డానని అందరూ విశ్వసిస్తున్నారు. నేను జైల్లో వుండగా, నా కేసును చూస్తున్న ప్లీడరు ద్వారా, మిత్రులు నన్నీ విషయమై ఎన్నో ప్రశ్నలు వేశారు కూడాను. ఎలా జరిగిందో, ఏం జరిగిందో ఉన్నదున్నట్టుగా ఇక్కడ వర్ణించాను. దీన్నిబట్టి నేను కృష్ణశంకర్ శ్రీవాస్తవ్‌ను అనుమానించడం సహజం ! అతడినే అనుమానించాను. అతడు నన్ను తీసుకువెళ్ళి సావిత్రీదేవి దగ్గర వుంచడం. నా పిస్తోలును తీసుకువెళ్ళడం, పిడ్లిచ్ స్వయంగా "మీరు మిస్టర్ యశ్‌పాల్ !' అనడం ఇవన్నీ అతడిని అనుమానించడానికే దోహదం చేస్తున్నాయి. నేను అలహాబాదు వచ్చిన విషయం ఒక్క కృష్ణశంకర్‌కే తెల్సు !

సావిత్రీదేవిని నేను కల్లో కూడా అనుమానించలేదు. నాకు ఆశ్రయం ఈయడంవల్ల ఆమె నాలుగు సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించింది. నేను జైల్లో వుండగా కృష్ణశంకర్‌ని ఎవరో కాల్చారని కూడా విన్నాను. అయితే అతడు బ్రతికిపోయాడు. తరువాత సత్యాగ్రహం చేసి జైలుకు వెళ్ళాడు.

నేను జైలు నుంచి విడుదల అయ్యాక కూడా చాలామంది నన్నీ విషయమైన అడిగారు. వాళ్ళకు నేను ఒకటే సమాధానం ఇచ్చాను. "ఇప్పుడంతా అయిపోయింది. ఇంక ఈ ప్రశ్నను తేవలసిన పనిలేదు !"

నేనూ ఈ ప్రశ్న గురించి చాలా రోజులు ఆలోచించాను. కేవలం కృష్ణశంకర్‌నే అనుమానించవల్సిన పనిలేదు. అతడు సమావేశానికి పిల్చిన మిత్రుల్లో ఎవరైనా నా గురించి పోలీసులకు కబురు పెట్టవచ్చును గదా ? సావిత్రీదేవిగారి ఇంట్లో నేను అరెస్టు అయితే, ఆమెకూ ప్రమాదమన్న విషయం కృష్ణశంకర్‌కు తెలియదా ? సావిత్రీదేవి అంటే అతడికి ఎంతో అభిమానం, గౌరవం కూడాను ! ఆమెకు కూడా అతడంటే ఎంతో మమకారం ! ఒక రకంగా పుత్రవాత్సల్యం ! అతణ్ణి గుడ్డిగానూ నమ్ముతుంది. 1938 లో నేను జైలునుంచి విడుదల అయ్యాక భువాలీలో వుంటూన్నాను. అప్పుడు సావిత్రీదేవి కృష్ణశంకర్‌ని తీసుకుని నా దగ్గరకు వచ్చింది. నాకు కృష్ణశంకర్‌మీద సందేహం లేదని రాసి ఇవ్వమంది !

నేను అప్పుడూ ఆమెపట్ల ఎంతో కృతజ్ఞతను ప్రదర్శించాను. నా వల్ల ఆమెకు కలిగిన బాధకు విచారాన్ని ప్రకటించాను. ఇలా అన్నాను. "కృష్ణశంకర్ నాపట్ల విశ్వాసఘాతుకాన్ని చేశాడని నేను అనను! ఐతే, ఎవరు చేశారో నాకు తెలియదు. కనుక, కృష్ణశంకర్ చేయలేదనీ నేను రాసి ఇవ్వలేను !"

నేను అరెస్టు అయినప్పుడు నానుంచి తనకు కలుగబోయే బాధకు విచారాన్ని వ్యక్తపరిచాను. అప్పుడు సావిత్రీదేవి ఇలా అన్నది. "ఇందుకు నేను విచారించడం లేదు. గర్విస్తున్నాను !"

నేను జైల్లో వుండగా నా ప్లీడరు శ్యామ్‌కుమారి నెహ్రూ పరిహాసంగా అనేది. "ఆ ముసలిదానిమీద ఏం మత్తుమందు చల్లావోగాని, జైల్లోనూ నీమీద కవిత్వం రాస్తోందిట !"

కానీ, 38 లో ఆమె అడిగినట్టు నేను రాసి ఇవ్వలేదు. అప్పటి నుండి ఆమె నన్ను నీచుణ్ణి, కృతఘ్నుణ్ణి అంటోందిట ! నాలాంటి వాడికోసం ఇన్ని బాధలు పడ్డందుకు విచారపడుతూన్నదిట !

భారతదేశంలో 'హిందూస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సేన' స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటంలోని నా అనుభవాలు నా అరెస్టుతో ముగిశాయి. ఇక పాఠకుల తృప్తికోసం జైలు అనుభవాల్ని రాయవల్సి వుంది.

# జైలు అనుభవాలు

అలహాబాదు హివేట్ రోడ్డులోని సావిత్రిగారి ఇంట్లో అరెస్టు చేశాక నన్ను క్రైనింగ్ రోడ్డులోని పోలీస్ స్టేషన్‌లో కస్టడీలో పెట్టారు. భయమూ, ఉద్రేకమూ అప్పటి నా ప్రవర్తనమీద తప్పకుండా ప్రభావాన్ని వేసి వుంటాయి. అప్పటి నా స్థితి, నా మనస్సులోని భావాలు, శంకలూ కూడా నా ప్రవర్తనపై ప్రభావాన్ని వేశాయి. ముఖ్యంగా లాహోరు కుట్ర కేసులో సుఖదేవుకు వురిశిక్ష వేశారు. మరి నేను లాహోరు, ఢిల్లీ, కాన్పూరు ఈ మూడు ప్రాంతాలకు చెందిన అభియోగాల్లో నిందితుడ్ని. నాకు ఉరిశిక్ష విధించకుండా ఉంటారనుకోవడానికి వీలులేదు. ఇతర మిత్రులూ, నాకు ఉరిశిక్ష విధిస్తారన్న ఉద్దేశ్యంలోనే ఉన్నారు. పైగా, పోలీసులు నన్ను బాగా హింసించి ఇతర మిత్రులను గురించీ, ఇతర సంఘటనలను గురించీ నా దగ్గర నుండి విషయాన్ని రాబట్టుకుంటారనీ అనుకుంటున్నాను. మనస్సులోని యిలాంటి భావాల కారణముగా మృత్యువుకూ, అన్నిరకాల హింసలకూ సిద్ధంగా వుండాలని అనుకున్నాను. నేను చేయగల్గిందంతా చేశాను. అలాగే శత్రువు కూడా నన్ను హింసించగలిగినంత హింసిస్తాడు. శత్రువు నుండి ఎంత కష్టం ఎదురైనా దృఢంగా చెక్కుచెదరకుండా ఉండి నా వ్యక్తిగత గౌరవాన్ని, విప్లవ సంఘ గౌరవాన్ని కాపాడుకోవలెనన్న తీవ్రమైన ఆలోచనల్లో అనవసరమైన కోపాన్ని ప్రదర్శించిన సందర్భాలూ ఉన్నాయి.

నన్ను ఖైదు కొట్టులో పెట్టి ఇంకా పది నిమిషాలు అయినా గడవలేదు. ఒక పోలీసు కేక వేశాడు. "ఇదుగో టీ తీసుకో".

నేను జైలు దర్వాజా వైపు వీపుపెట్టి కూర్చున్నాను. వెనక్కు తిరిగి చూశాను. పోలీసు నల్లని మురికి ఓడుతూన్న అల్యూమినియం గ్లాసును ఇనప చువ్వల్లోంచి లోపలకు పెట్టి వెళ్ళిపోయాడు. అలా టీ యివ్వడం చాలా అవమానకరం అనిపించింది. పోలీసు నాలుగడుగులే వెళ్ళాడు. గ్లాసును తీసుకొని టీతో సహా ఇనుపచువ్వల అవతలకు విసిరికొట్టాను.

ఐదు నిమిషాలు గడిచాక పోలీస్ ఇనస్పెక్టర్ వచ్చాడు. సానుభూతితో "టీని అవతల పారబోశారా ?" అని అడిగాడు.

"నేను అలాంటి టీ తాగను" అన్నాను.

"ఐతే, ట్రేలో పంపించమంటారా ?"

"అవును".

కొద్దిసేపు గడిచింది. దగ్గరలో వున్న హోటల్నుంచి గావును టీ తెప్పించారు. ట్రేలో డికాక్షన్, పాలు, పంచదార - విడివిడిగా వచ్చాయి. ఇనస్పెక్టర్‌గారు క్షమాపణ వేడుకున్నారు. "వీళ్లు ఒట్టి అడవి మనుషులు, టీ ఎట్లా తాగుతారో వీళ్ళకేం తెలుసు" అని అన్నారు, నాకు మొదట టీ తెచ్చి ఇచ్చిన పోలీసు గురించి ! ఇన్‌స్పెక్టర్‌గారు నాపట్ల ఇలా ఎందుకు సౌజన్యతను ప్రదర్శిస్తున్నారో నాకు అర్థం కాలేదు. ఏమైనా కానీ నేను అడవి జంతువులా కటకటాల వెనుక బంధింపబడ్డాను.

మరో అర్ధగంట గడిచింది. బయట చాలా సంరంభంగా వుంది. ఇద్దరు పోలీసులు భుజాలన తుపాకులు పెట్టుకొని ఖైదుకొట్టు ముందుకొచ్చి నిలబడ్డారు. తలుపు తెరిచారు. ఇద్దరు ఇంగ్లీషువాళ్ళు ఖైదుకొట్టులోకి వచ్చారు. ఒక అతడు బొద్దుగా కొంచెం పొట్టిగా వున్నాడు. మరో అతడు పొడుగ్గా, పొడుక్కు తగ్గ లావుగా వున్నాడు. ఇద్దరూ ప్రౌఢులే.

"గుడ్‌మార్నింగ్. చివరకు నిన్ను పట్టేశాం !" వాళ్ళల్లో ఒకతడు లోపలకు వస్తూనే చురక అంటించాడు.

'గుడ్‌మార్నింగ్ !" అంటూ లేచి నిలబడి "కుర్చీ ఒకటే వుంది మిమ్ములను ఎలా కూర్చోమనను ? తమరు ఎవరో తెలుసుకోవచ్చునా ?"అన్నాను.

ఇద్దర్లో పొట్టిగా వున్న అతడే మాట్లాడుతున్నాడు. "మీరు యశ్‌పాల్ ! మాకు తెలుసును. మరి మేము ఎవరమో మీకు తెలియదా ? మీ తుపాకీతో మా బుర్రల్ని ఎగరగొట్టడానికి ఎన్నోమార్లు మా బంగళాల చుట్టూ తిరిగారు కదా ?" అన్నాడు.

దొరగారి అజ్ఞానానికి నవ్వుకున్నాను. "ఆ భయంతో మీరు చాలా రాత్రుళ్ళు నిద్రపోకుండా గడిపారనుకుంటాను ! నా దురదృష్టమో ఏమో, మీరు ఎవరో నిజంగా నాకు తెలియదు" అన్నాను.

దొరగారు మామూలు స్థితికి వచ్చారు. "నా పేరు హాలిన్స్. యు.పి. పోలీస్ యినస్పెక్టరు జనరల్‌ని. వీరు మిస్టర్ షా. సి.ఐ.డి. పోలీసు డిప్యూటీ యినస్పెక్టర్ జనరల్" అంటూ తన సహచరుడివైపు సంజ్ఞ చేశారు.

హాలిన్సుకు, నాకు ఈ సందర్భంలో జరిగిన వివరాన్ని సింహావలోకనం మొదటి భాగంలోనే యిచ్చాను. ఈ మధ్య 1954 అక్టోబరులో ఇంగ్లాండు నుంచి ప్రకటింపబడే 'మెన్‌ఓన్‌లీ' అనే ఇంగ్లీషు పత్రికలో యస్.టి. హాలిన్స్ భారతదేశంలోని తన అనుభవాలను రాశాడు. ఇతడా అనుభవాల్లో నా అరెస్టును గురించి, ఆజాద్ మృత్యువును గురించి కూడా రాశాడు. ఇప్పటికి 22 సంవత్సరాలు కావడం వల్ల బహుశా అతడు నా పేరును మరిచిపోయి ఉంటాడు. మరి కూడా కొన్ని విషయాలను యిష్టం వచ్చినట్లు రాసుకొచ్చాడు. వైస్రాయి ట్రైన్‌కింద బాంబు పేల్చడం డిశంబరు 31 న అనీ సావిత్రిగారు, తాను అరెస్టు అయిన సంవత్సరానికి జైలులోనే చనిపోయిందనీ రాశాడు. అది సరికాదు. ఆమె పూర్తిగా జైలుశిక్షను అనుభవించి విడుదలయింది. 1938 జులైలో భువాలీలో నన్ను కలుసుకున్నది కూడాను.

హాలిన్స్‌తో ఇలా అన్నాను. "మీరు ఇలా వచ్చినందుకు కృతజ్ఞుడ్ని. ఏమిటి సెలవు ?"

హాలిన్స్ వెంటనే ఇలా అడిగాడు. "మీరు బాగా చదువుకున్నవారు. సంస్కారం కలవారు. ఈ మార్గాన్ని ఎందుకు అనుసరించారు ?"

"మరే మార్గములేదు గనక ! మరే విధంగా చెప్పినా మీరు వినరు గనక" అని సమాధానం ఇచ్చాను. హాలిన్స్ అడిగింది విప్లవం సంబంధంగానేనని స్పష్టమవుతున్నది.

హాలిన్స్ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ "మీ అభిప్రాయం ?" అన్నాడు.

"నా అభిప్రాయం స్పష్టమే ! ఈ దేశంలోని నూటికి 99 మంది మానవులు కూడూ, గుడ్డ, ఇల్లూ లేకుండా, పశువుల్లాంటి జీవితాన్ని గడుపుతున్నారు. విదేశీ దాస్యమనే ఇనుప పిడికిట్లో నలిగిపోతున్నారు. దాస్య విముక్తికి ప్రయత్నించడం స్వాభావికం కాదా ?" అని అడిగాను.

ఈ దేశంలోని సాధారణ ప్రజలు దయనీయమైన జీవితాన్ని గడుపుతున్నారని హాలిన్స్ అంగీకరించాడు. స్వాతంత్ర్యం కోసం ప్రయత్నించే హక్కు ఈ దేశ ప్రజలకు ఉన్నదనీ అంగీకరించాడు. ఐతే, ఓ ఘనమైన ఉపదేశాన్నీ చేశాడు. స్వాతంత్ర్యం పొందటానికి గాంధీగారి మార్గమే సరి అయిందన్నాడు.

నేను అన్నాను. "బ్రిటీష్ ప్రభుత్వం గాంధీగారి మార్గమే సరియైందని అనుకుంటే, మరి కాంగ్రెస్ కార్యకర్తల పైన లాఠీఛార్జి చేయడానికి కారణం ? తుపాకీ కాల్పులు ఎందుకు సాగుతున్నాయి. అదీకాక గాంధీగారి మార్గమే సరి అయిందనుకుంటే కాంగ్రెసునెందుకు నిషేధించారు ?"

హాలిన్స్‌కు పై విధంగా సమాధానం ఇచ్చాను. ఒక బ్రిటీష్ అధికారికి అంతకంటే సమాధానం ఏమివ్వగలను ? కానీ, ఒక విప్లవకారుడి దృష్టికోణం నుండి ఆలోచిస్తే సమాధానం ఎలా వుంటుంది ?

సరి అయిందని గాంధీ మార్గాన్నీ, గాంధీ ఉద్యమాల్నీ శత్రువు అంటున్నాడు ! దీనికి అర్థం ఏమిటి ? స్వాతంత్ర్య ప్రాప్తికి గాంధీ నడిపే ఉద్యమాలు, లేక ఆయన సిద్ధాంతాలు భారత స్వాతంత్ర్యానికి ఉపయోగపడటం కంటే బ్రిటీష్ సామ్రాజ్యవాదులకే ఎక్కువగా ఉపయోగపడతాయి. గఢ్‌వాల్ పోలీసులు పూర్తి అహింసాత్మకంగా సత్యాగ్రహం చేశారు. దాన్ని గాంధీగారు విమర్శిస్తూ బ్రిటీష్ ప్రభుత్వం తరఫున వకాల్తా పుచ్చుకున్నారు. మరి గాంధీగారి ఉద్యమాలు బ్రిటీష్ ప్రభుత్వానికే ప్రయోజనాన్ని చేకూరుస్తాయనడానికి ఇంతకంటె ప్రమాణం ఇంకేం కావాలి ?

ఇక్కడ మరొక విషయమూ స్పష్టపరచవలసి వుంది. నేను గాంధీగారిని, వారి ఉద్యమాల్ని బ్రిటీష్ ప్రభుత్వానికి సహాయకారులు అంటున్నాను. అందుకు కారణం ఉంది. 1954 అక్టోబర్ మొదటివారం 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికలో జి.డి. తేందుల్‌కర్ ఒక లేఖ రాశాడు. అందులో సోవియట్ ప్రచురించిన విశ్వకోశంలో గాంధీని గురించిన వివరణను అధిక్షేపించాడు. ఇంతకూ గాంధీగారిని గురించి సోవియట్ విశ్వకోశంలో ఉన్న వివరణ ఏమిటో ? అందులో గాంధీగారిని గురించి బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి సహాయకుడని, భారత స్వాతంత్ర్య పోరాటానికి శత్రువు అని వివరణ ఇవ్వడం జరిగింది.

ఒక్కక్షణం తరువాత అడిగాడు. "మీకు ఇక్కడ ఏమీ బాధగా లేదుగదా ?"

"నన్ను బాధించడానికే ఇక్కడికి తీసుకొచ్చారు కదా ? అందుకు నేను సిద్ధంగానే ఉన్నాను" అన్నాను.

"మీరు అన్నదానికి అర్థం ?"

"ఇంతవరకూ నేను మీతో పోరాడాను. ఇప్పుడు మీ ఆధీనములో ఉన్నాను. మీ ఇష్టం ఏం చేసినసరే ! ఎక్కడ వుంచినా సరే ! కాకపోతే ఇది మనుషులుండే ప్రదేశమా ?" అంటూ ఆ జైలుకొట్టును చూపించాను.

"అంతా సవ్యం ఔతుంది. మిమ్ముల్ని ఇలాంటి కొట్లో వుంచము. బ్రిటీష్ వాళ్ళమైన మేము ఎవరిమీదా పగబూని వ్యవహరించం. ఇదే ఏ జర్మన్‌లో, రష్యన్‌లో ఐతే మీ పట్ల ఎలా వ్యవహరించేవారో తెలిసేది. మేము మానవత్వానికి ఎక్కువ విలువ ఇస్తాము. మీరే చూస్తారుగా, నియమానుసారం మీకు కల్పించదగిన ప్రతి సౌకర్యాన్నీ కల్పిస్తాము."

హాలిన్స్ వెళ్ళాడు. మరి కొద్దిసేపటికి మళ్ళీ జైలు తలుపు తెరుచుకుంది. వరండాలో ఓ అరడజనుమంది దాకా సాయుధులైన పోలీసులు నిలబడి వున్నారు. ఇనస్పెక్టరు అన్నాడు. "మిమ్ముల్ని మరోచోటికి మారుస్తున్నాము".

పోలీసులు వెంటరాగా వ్యాన్‌లో కూర్చున్నాను. అలహాబాదు రోడ్లన్నీ పరిచయమైనవే ! ఆ రోడ్లన ఎన్నోమార్లు స్వతంత్రంగా తిరిగాను. ఇప్పుడు బందీనై ఆ రోడ్లగుండానే వెళుతున్నాను. నన్ను 'కటరా' దగ్గిర కచేరీ వెనకనున్న ఆంగ్ల అపరాధుల్ని ఉంచే జైలుకు తీసుకువెళ్ళారు. ఈ జైలు క్లైనింగ్ రోడ్డు జైలుకంటే చాలా విశాలంగా వుంది. బాగా వెలుగు, గాలి వస్తున్నది. ఇక్కడి జైలుకొట్టుకు ప్రత్యేక స్నానాలగది కూడా వుంది. దర్వాజాలు, కిటికీలు దట్టమైన ఇనుప చువ్వలతో బిగించబడి ఉన్నాయి. చుట్టూ ఎత్తైన ఇటుకరాయితో కట్టిన ప్రహరీ గోడ వుంది. జైలుచుట్టూ సాయుధులైన పోలీసులు కాపలా వున్నారు. దీనికి ఇన్‌ఛార్జి ఒక ఇంగ్లీషువాడు, అతడు ఇంగ్లీషువాడో, ఆంగ్లో ఇండియనో ఖచ్చితంగా చెప్పటం కష్టం. కొట్లో పెట్టేముందు అతడు నన్ను పూర్తిగా సోదాచేశాడు. సావిత్రిగారి ఇంటినుండి వచ్చేప్పుడు రెండు వస్తువులను మాత్రమే వెంట తెచ్చుకున్నాను. ఒకటి కప్పుకునే కంబళి, రెండవది కలము. ఆ కలాన్ని సుమిత్రాదీదీ కానుకగా ఇచ్చింది నాకు ! ఆ రోజుల్లో దొరికే కలాలన్నిటి కంటే

విలువైనది. ఆ కలమంటే నాకు చాలా ఇష్టము. అదీకాక సుమిత్రాదీదీ కానుకగా ఇచ్చింది అన్న భావనా వుంది. ఈ రెండు కారణాల వల్లా దాన్ని వదలలేక వెంటతెచ్చుకున్నాను. జైలు ఆఫీసరు ఆ కలాన్ని తీసేసుకున్నాడు. ఇలా అన్నాడు. "ఇక్కడ నించి వెళ్ళేప్పుడు నీ కలం నీకు ఇవ్వబడుతుంది. ఇక్కడ ఖైదీలు కలమూ, కాగితాలు దగ్గర ఉంచుకోవటం నియమ విరుద్ధం."

ఈ యూరోపియన్ జైల్లోకి వచ్చాక నాకో సబ్బు, తుండుగుడ్డా, పళ్ళు తోముకోవటానికి బ్రెష్, టూత్‌పేస్టు ఇచ్చారు ! జైలుకొట్టులో ఒక ఇనుప మంచమూ, పరుపూ, దుప్పటీ, కంబళీ కూడా వున్నాయి. తొమ్మిదిన్నరకు ఉదయపు అల్పాహారం వచ్చింది. రొట్టె, వెన్న, గ్రుడ్లు, టీ, ఈ జైలు కూడా నేరస్తులను బంధించడానికే ఏర్పాటైంది. ఐతే, పాలకజాతికి చెందిన నేరస్తులు ఇందులో వుంటారు. గనుక వారికోసం ప్రత్యేకమైన సౌకర్యాలు కల్పింపబడ్డాయి.

నన్నిలా పాలకజాతి నేరస్తులతో పాటు అధికమైన సౌకర్యాలు లభించేచోట ఉంచడానికి కారణం, ప్రత్యేకం సురక్షితమైన ప్రదేశములో ఉంచుదామన్న ఉద్దేశ్యమైనా అయి వుంటుంది. కాకపోతే, ప్రభుత్వ సాక్షులుగా మారిన వాళ్ళద్వారా ఆధునికమైన నా అభిరుచుల్నీ, అలవాట్లనూ తెలుసుకొని ఉండటమైనా అయి వుంటుంది. జైలు ఆఫీసరు రెండు మూడు చౌకబారు ఇంగ్లీషు నవలల్ని కూడా ఇచ్చాడు, కాలక్షేపానికి ఐతే అప్పుడే పుస్తకాల్లో ఏంతల దూర్చగలను?

ఆ జైల్లో కొంతకాలంపాటు ఉంచుతారనుకున్నాను. అంటే, కొంతకాలం ప్రశాంతంగా ఒకేచోట వుండే అవకాశము లభించిందనుకున్నాను. అరెస్టు కావడానికి ముందు కాల్పులు జరిగాయి. కాల్పులు జరిగి అప్పటికి దాదాపు నాలుగు గంటల సమయం గడిచింది. ఆహారం తీసుకున్నాను. జైలుకొట్టు కూడా ఏమంత అధ్వాన్నంగా లేదు. ఆ స్థితిలో అంతకంటె మంచి ప్రదేశాన్ని కోరుకోవటమూ అత్యాశే అవుతుంది. భవిష్యత్తు గురించి ఆలోచించే అవకాశం దొరికింది. ఐతే, ఆలోచించడానికి ఏమీ విషయం దొరకలేదు. ఎదురుగా సమస్య అనేది లేనప్పుడు ఆలోచనలు మాత్రం ఏముంటాయి ? 'లాహోరు, ఢిల్లీ కేసుల్లో యిరికిస్తారు. ఏదో ఒక కేసులో ఉరిశిక్ష పడుతుంది. కొద్దిరోజుల్లోనో లేక ఒకటి రెండు నెలల్లోనో ఉరికంబానికి వ్రేలాడడం ఖాయం' అనుకున్నాను.

ఆ కొట్టులో వెనకవుండి వెళ్ళిన ఖైదీలు గోడలమీద తమ పేర్లు రాసుకున్నారు. తమ పేరు శాశ్వతంగా ఉండాలన్న కోర్కె చాలా విచిత్రమైంది. చిన్నపిల్లలు ఎక్కడికి వెళ్లినా, దేనిమీదనైనా తమ పేరు రాసుకుంటూ ఉంటారు. కొందరిలో బాగా వయసువచ్చినా ఈ బాల్య చేష్టపోదు. స్థితి గలవారు బాల్యచేష్ట తాలూకు ఈ కోర్కెని తీర్చుకోవడానికి కిల్లాలు, కోటలూ కట్టిస్తూ ఉంటారు. అలా కీర్తి కండూతిని తీర్చుకుంటారు. జైలుకొట్టు గోడలమీద కొన్ని ఇంగ్లీషు కవిత్వ చరణాల్ని కూడా రాశారు. అవి చాలా విషాదకరమైన గీతాలు. వాటి ప్రభావం నా మనస్సుమీద పడి వుంటుంది. అప్పటి నా మానసిక స్థితి చాలా విషాదకరంగా వుంది. నేనూ ఓ కవిత్వ చరణాన్ని కూనిరాగం తీయటం ప్రారంభించాను. "మిత్రులారా కొద్దిక్షణాల అతిథిని ! ఆరిపోయే దీపాన్ని ! నేను లేకపోయిన మాత్రాన ఏ పనులాగుతాయి? నాకోసం ఎవరు విలపిస్తారు ?" మనసులో ఉద్వేగం కలిగినప్పుడూ, భావావేశం కలిగినప్పుడూ ఇలాంటివే చరణాల్ని కూనిరాగంలో ఆలపించటం ప్రారంభించాను.

నాలో నేనే అనుకున్నాను. "నాకోసరం ఎవరు ఏడుస్తారు ? ఎవరు విచారిస్తారు ? నామీద నేనే జాలిపడి, ప్రయోజనం ఏమిటి ? మా అమ్మ, తమ్ముడు ప్రకాశవతి జ్ఞాపకం వచ్చారు. వాళ్ళని మర్చిపోవటానికి ప్రయత్నించాను. నా అరెస్టును గురించి విని వాళ్ళు చాలా దుఃఖపడేమాట నిజం. వాళ్ళ దుఃఖాన్ని నేను ఏ విధంగానూ నివారించలేను కదా ! అలాంటప్పుడు వాళ్ళ గురించి ఆలోచించి మాత్రం ప్రయోజనం ఏమిటి ? వాళ్ళు నా గురించి దుఃఖపడకుండా ఉండేట్టు చేయడానికి ఒకే ఒక

మార్గం వుంది. అది, నేను నా ప్రవర్తనలో ఎలాంటి బలహీనతా రాకుండా చూసుకోవాలి ! నా గురించి వాళ్ళు గర్వపడేట్లు ప్రవర్తించాలి !

మధ్యాహ్నమైంది. ఒక లావాటి వ్యక్తి లోపలకు వచ్చాడు. వున్నికోటు, ప్యాంటు వేసుకొని ఉన్నాడు. అతడి వెనుక ఒక పోలీసు ఉన్నాడు. పోలీసు రెండు చేతుల్లోనూ రెండు పళ్ళేలు ఉన్నాయి. ఒక చేతిలోని పళ్ళెం మీద శుభ్రమైన తువ్వాలు కప్పి వుంది. లావాటి వ్యక్తి, కుర్చీలో కూర్చొని తన గురించి చెప్పాడు. "నేను జె. బెనర్జీని ! డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ !" అన్నాడు.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది. సి.ఐ.డి. పోలీస్ డిప్యూటీ సూపరింటెండెంట్ బెనర్జీ గొప్ప రాజభక్తుడు. అతడి రాజభక్తికి తగిన ప్రతిఫలాన్ని ఇవ్వడానికి ఒకమాటు బెనారస్‌లో విప్లవకారులు ప్రయత్నించారు. కాల్చడమూ జరిగింది. ఐతే బతికిపోయాడు. ఈ మహానుభావుడు అతడేనని తెలుసుకున్నాను. బెనర్జీ చెప్పుకుపోవడం ప్రారంభించాడు. "నువ్వు అరెస్టు అయ్యావని విని చాలా బాధపడ్డాను ! ఒకమాటు నిన్ను చూడాలనిపించి వచ్చాను ! నీవు మంచి కుటుంబంలో పుట్టినవాడివనీ, జైలు తిండి తినలేవనీ తెలుసుకొని నాతోపాటే భోజనాన్ని కూడా పట్టుకొచ్చాను ! ముందు భోంచెయ్యి. ఆ తరువాత మాట్లాడుకుందాం !" అంటూ చాలా బలవంతం చేశాడు.

నేను అన్నాను. "ఈ జైల్లో ఏర్పాట్లన్నీ బాగున్నాయి. భోజనం కూడా బాగానే వుంటుంది. మీరు శ్రమపడటం అనవసరం."

ఐనా ఆయన వినలేదు. పళ్ళేన్ని నా ముందుపెట్టి చాలా ఆత్మీయతగా తినమని బలవంతం చేయసాగాడు. పరదేశం నుండి వచ్చిన కుర్రవాడ్ని లాలన చేసి తినిపిస్తున్నట్టుగా వుంది. బెంగాలీ సాంప్రదాయం ప్రకారం వండిన కమ్మని భోజనం పట్టుకువచ్చాడు. సంపన్నులైన బెంగాలీలు తీపిలేకుండా భోజనం చేయరు. ఖర్జూర బెల్లాన్ని మొదటిసారిగా అప్పుడే తిన్నాను.

భోజనం చేయటం అయింది. మా సంభాషణ ప్రారంభమైంది. "ఆపదలో వున్న నిన్ను నా చేతనైనవరకూ రక్షించటానికి ఇలా నీ దగ్గరకు వచ్చాను ! నీ అరెస్టు గురించి విని మీ అమ్మా, తమ్ముడూ దుఃఖపడుతూ ఉండవచ్చును ! ముఖ్యంగా 'యంగ్ లేడీ' (ప్రకాశవతి) ఎంత దుఃఖపడుతూ వుంటుందో ఆలోచించు ! కనుక చట్టమనే జంజాటం నుంచి తప్పించుకొని మిగిలిన జీవితాన్ని సుఖంగా గడపటానికి మార్గం చూసుకో ! నీలాంటి చదువుకున్న, సంస్కారం గల యువకుడి జీవితం వ్యర్థం కావడం నేను సహించలేను ! నీవు విప్లవకారుడవనీ, దొంగవూ, తోడుమోతువూ కావనీ నాకు తెలుసును. అన్నిటికంటె ముఖ్యమైంది, నీలాగానే దేశభక్తి అనే పిచ్చిలో పడి జీవితాలను నాశనం చేసుకొనేవాళ్ళు ఇంకా చాలామంది ఉండవచ్చును. వాళ్ళ జీవితాలను రక్షించటమూ నా కర్తవ్యంగా భావిస్తున్నాను. నేనూ పంజాబీవాడినే ! నీ పౌరుషాన్నీ, స్పష్టంగా మాట్లాడే ప్రవృత్తినీ మెచ్చుకుంటున్నాను ! ప్రభుత్వంతో పోరాడేటప్పుడు వీరుడిలా పోట్లాడేవు. ఇప్పుడు పోట్లాట తేలిపోయింది. ఇంక మనం స్పష్టంగా మాట్లాడేసుకుంటే ఏ పేచీ వుండదు. పిడ్లిచ్ కూడా నీ సాహసాన్నీ, సంస్కారాన్నీ చాలా మెచ్చుకున్నాడు. పిడ్లిచ్‌కి నీమీద వ్యక్తిగతమైన వైరమేమీ లేదు" అన్నాడు.

తరువాత బెనర్జీ చెప్పిన మొత్తం విషయంలోని సారాంశం ఇది - బెనర్జీ రోజూ గీతాపారాయణ చేస్తూ ఉంటాడు. ప్రతి చిన్న విషయంలోనూ గీతోపదేశానికి అనుగుణంగానే ప్రవర్తిస్తూ ఉంటాడు. అంటే కర్మచేయటం తన కర్తవ్యం. ఫలితాన్ని భగవంతుడికి వదిలేస్తాడు. నన్నూ అలాగే చేయమన్నాడు. గీతాశ్లోకాలను కొన్నింటిని వల్లించాడు. దేశంలోని యువకుల జీవితాలు సర్వనాశనం కావటం తను సహించలేకపోతున్నాడు. అలాంటి యువకుల్ని రక్షించడం తన వ్యక్తిగతమైన, జాతీయమైన కర్తవ్యంగా భావిస్తున్నాడు. బెనారస్‌లో తన సొంత మేనల్లుడే (మణీంద్ర) కాల్చాడు అతణ్ణి ! అప్పుడు అక్కడున్న

ప్రజలు మణీంద్రుడ్ని పట్టుకొని కొడుతూంటే, ఇతడే అప్పుడతడ్ని విడిపించాడు. "పసివాడు ఏమీ తెలియదు. వదలిపెట్టండి" అన్నాడు.

మణీంద్రుడు కాల్చినగుండు బెనర్జీ డొక్కను రాచుకుంటూ వెళ్ళింది. బతికిపోయాడు. ఆ తరువాత కూడా చాలా సందర్భాల్లో గీతోపదేశాన్ని ఆచరణలో పెట్టాడు. ఇతడి ఈ సత్కార్యానికి మెచ్చి ఇంగ్లీషు ప్రభుత్వం ఇతడికి రాయబహదూర్ అన్న బిరుదునిచ్చి సత్కరించింది.

నేను బెనర్జీ మహాశయుడికి కృతజ్ఞతలు తెలియపరిచాను. "నేను కూడా నాకు తెలిసినంతవరకూ గీతోపదేశాన్ని ఆచరణలో పెట్టడానికే ప్రయత్నించాను. ఏదైతే కర్తవ్యం అనుకున్నానో, దానికోసం ప్రాణాలొడ్డి పోరాడాను. ఇప్పుడు ఫలితం ఏమైనా సరే ! కృష్ణ భగవానుడు చుట్టపక్కాల మోహాన్ని విడిచి కర్తవ్యాన్ని పాటించమన్నాడు. తల్లీ, తమ్ముడు, పెళ్ళాం, ఈ సంబంధాలన్నీ నశ్వరమైన ఈ శరీరానికి సంబంధించినవి కదా ? ఈ శరీరంతోపాటు ఈ బంధుత్వాలూ పోతాయి. ఒకర్ని ఒకరు దుఃఖపెట్టటం అంటూ వుండదు ! ఎవరి కర్మ ఫలితాన్ని వారు అనుభవిస్తారు" అన్నాను.

బెనర్జీ మహాశయుడు అలా మూడురోజులు మధ్యాహ్నాపూట్ల నా దగ్గరకు వచ్చాడు. మాంచి రుచికరమైన భోజనాన్ని పట్టుకొచ్చేవాడు. రోజూ మధ్యాహ్నాపూట్ల గీతోపదేశాన్ని గురించి చర్చ ప్రారంభించేవాడు. నా జీవితాన్ని, నాలాంటి మరికొందరు యువకుల జీవితాల్ని కాపాడడానికి బద్ధ కంకణునయ్యానని చెప్పేవాడు. మా జీవితాలు నాశనం అవుతూన్నందుకు విచారాన్ని ప్రకటించేవాడు. కొంత కాలక్షేపంగా వుండేది.,

నాలుగో రోజున అనుకుంటాను; మధ్యాహ్న సమయం జైలుకొట్టు తలుపు తెరుచుకుంది. మరో జైలుకు మారుస్తున్నారని తెలిసింది. 'ఈ నాలుగురోజులు మంచిగా చెప్పి చూశారు. ఇప్పుడింక మరో మార్గాన్ని అనుసరిస్తారుగావును !' అనుకున్నాను. పోలీసులు పెట్టగల హింసల్ని గురించి వెనకే విన్నాను. తల్లక్రిందులుగా వేలాడదీయడం, విపరీతంగా కొట్టడం. గోళ్ళల్లో గుండుసూదులు గుచ్చడం - ఇత్యాది ప్రక్రియల్ని గురించి విన్నాను. మనస్సులోనే అనుకున్నాను 'ఇంక తయారుగా వుండు !'

పోలీసు వ్యానులో పది పన్నెండుమంది సాయుధులైన పోలీసులు వున్నారు. నన్ను క్షేమంగా మలాకా (అలహాబాద్ జిల్లా జైలు) జైలుకు తీసుకువెళ్ళారు. జైలు లోపలకు వెళ్ళాను. గడచిన నాలుగు రోజుల్లోనూ నాకు ఎక్కడా బేడీలు వేయలేదు. నేను లోపలకు వెళ్ళగానే ఒక కమ్మరి, నా కాళ్ళకూ, చేతులకూ వేయడానికి బేడీలు పట్టుకువచ్చాడు. నేను జైలర్‌కు నా అభ్యంతరాన్ని తెలిపాను. "నేను రాజకీయ ఖైదీని, బేడీలు వేయించుకోను !" అన్నాను. "అదంతా నాకు తెలియదు ! నీ సెక్షన్‌బట్టి నీకు బేడీలు వేయక తప్పదు !" అన్నాడు జైలర్.

"మీరు బేడీలు వేస్తే, అసమ్మతి సూచకంగా నేను ఆహారం తీసుకోవడం మానేస్తాను !"

"ఆ తరువాత నీ యిష్టం !"

బేడీలు వేశారు ఐదు ద్వారాల్ని దాటి లోపలికి వెళ్ళాక విశాలమైన ప్రాంగణంలో ఓ పొడవైన బారక్కు ! అందులోని ఒక కొట్టులో నన్ను పెట్టారు. తలుపుకు తాళాలు వేశారు. బారక్కు యొక్క ముఖ్య ద్వారానికీ తాళాం పడింది. గది తలుపులు ఇనుపరేకుల్తో కప్పబడి వున్నాయి. గోడన ఒక రంధ్రము. రంధ్రానికి బయటినుండి ఓ మూత ! బయటివారు లోపలికి తొంగి చూడవచ్చును. లోపలినుండి బయటకు చూడలేము. ఈ బారక్కు మధ్యలో చిన్న గొందిలాంటి ఖాళీ ప్రదేశం వుంది. ఆ గొందికి రెండువైపులా ఖైదుకొట్లు, ఒక కొట్టులో పిచ్చివాణ్ణి పెట్టారు. వాడు కాసేపు నవ్వడం, కాసేపు పాడడం చేస్తూంటాడు. మిగిలిన కొట్లల్లో ఏకాంతవాస శిక్షను అనుభవిస్తూన్న ఖైదీలు వున్నారు. నన్ను పెట్టిన కొట్టులో పడుకోడానికి ఓ గోనెపట్టా నీళ్లు తాగడానికి ఇనుపముంతా, మలమూత్రాల్ని విసర్జించుకోడానికి

తారుపూసిన మట్టిమూకుడూ వున్నాయి. కొట్టు పగటిపూట కూడా చీకటిగానే వుంటూంది. రాత్రిపూట్ల దీపం వుండదు. మనస్సులో అనుకున్నాను. "అప్పుడే ఏమైంది ! ముందు ముందు ఇంకేం జరుగుతుందో చూద్దాం !"

ఉదయాన్నే వేగీవేగని పురుగులు పట్టిన శనగపప్పు కాసిని పెట్టేవారు. ఉదయమూ, సాయంకాలము పెద్ద పెద్ద రొట్టెలూ, నీళ్ళలాంటి పప్పూ పోసేవారు. నేను ఏమీ తినకుండా ముందేం జరుగుతుందో ఊహిస్తూపడుకొని ఉండేవాడిని. విపరీతంగా నిద్రపోయేవాడిని ! అలా నాలుగు రోజులు గడిచాయి. ఓ రోజు ఉదయం జైలు సూపరింటెండెంట్ వచ్చాడు. ఇంగ్లీషువాడు. అతడు వచ్చినా నేను లేవలేదు.

సూపరింటెండెంట్ అన్నాడు. "నువ్వు అగౌరవంగా ఎందుకు ప్రవర్తిస్తున్నావు ?"

సమాధానం ఇచ్చాను. "నాపట్ల కూడా అగౌరవంగానే ప్రవర్తిస్తున్నారు కదా !"

"నిన్ను ఎవరు అగౌరపరిచారు ?"

'వేరే అవమానించాల్నా ? ఇది గౌరవనీయులు వుండే ప్రదేశమా ?" అంటూ ఖైదుకొట్టును చూపించాను. నామాట వినుపించుకోకుండానే డబాయింపు సెక్షన్ ప్రారంభించాడు. "నువ్వు నిరాహారదీక్ష పట్టావు. ఇది జైలు నిబంధనల దృష్ట్యానేరం !" అన్నాడు.

"నేనేమీ నిరాహారదీక్ష చేయడం లేదు. నాపట్ల గౌరవంగా వ్యవహరించమని అడుగుతూన్నాను. తినడానికి యోగ్యమైన ఆహారం పెట్టమంటున్నాను. మీరు పెట్టే ఆహారం నేను తినలేకుండా వున్నాను. కనుక, తినడం లేదు !"

"అంటే, పాలూ - పెరుగూ, సన్నబియ్యపు అన్నం కావాల్నా ?"

"సమస్య, పాలూ - పెరుగును గురించి కాదు. నాపట్ల గౌరవనీయంగా ప్రవర్తించాలి !" అన్నాను.

"గౌరవనీయం అంటే ? అదెలా వుంటుందో ?"

"నన్ను రాజకీయఖైదీలా చూడాలి ! ఒక సభ్యదేశం యుద్ధఖైదీల నెలా చూస్తుందో, అలా చూడాలి !"

"నువ్వు హింసాత్మక మార్గాన్ని అనుసరించే విప్లవకారుడివి కదా !" ఆంగ్లదొర గాంధీభాషను వల్లించాడు.

"అయినప్పటికీ మా ఉద్దేశం రాజకీయమైందేకదా ?"

"అదంతా మాకు తెలియదు. నీకు అదనపు సౌకర్యాలు కావాలంటే దరఖాస్తు పెట్టుకో ! నీ ఆర్థికస్థితిని పరిశీలించి, మెజిస్ట్రేట్ ఆదేశాన్ననుసరించి, వీలునుబట్టి సౌకర్యాలు కల్పించబడతాయి. తాత్కాలికంగా వరన్నం - పాలూ కావాలంటే నేను సొంత బాధ్యతతో, వ్యక్తిగత సానుభూతితో - ఇప్పించగలను "

"ధన్యవాదం. సానుభూతి నాకు అవుసరం లేదు. నాపట్ల రాజకీయ ఖైదీలా వ్యవహరించాలని కోరుతూన్నాను !"

ఆంగ్లదొర వెళ్ళిపోయాడు. జైలుకొట్టు తలుపులు మూసుకున్నాయి.

మరుసటి రోజు మధ్యాహ్నం నన్ను ఆఫీసుకు పిలిపించాడు. అక్కడ మెజిస్ట్రేట్ వున్నాడు. పరిస్థితి అర్థమైంది. నన్ను మరికొన్నాళ్ళపాటు కస్టడీలోనే వుంచడం కోసం, జైలు ఆఫీసులోనే మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచే తతంగాన్ని నడుపుతున్నారని తెల్సుకున్నాను. బహుశ ప్రజలు నన్ను న్యాయస్థానంలో హాజరుపరచవల్సిందని ఆందోళన జరుపుతూ వుండవచ్చును. ప్రజల వత్తిడికారణంగా ఈ తతంగం జరుపవల్సి వచ్చి వుంటుంది. మెజిస్ట్రేట్ అడిగాడు."నీ సమస్య ఏంటి ? నువ్వేం కోరుతూన్నావు?"

"నన్నొక మానవుడిలా చూడడం లేదు. కాళ్ళకు సంకెళ్ళు వేశారు. సంకెళ్ళు తీసేవరకూ నేను భోంచేయను. మరేమీ చేయను. నన్ను రాజకీయ ఖైదీలా చూడాలని కోరుతున్నాను !" అన్నాను.

"నీకు అధిక సౌకర్యాలు కావాలంటేనూ, నీపట్ల ఉన్నతవర్గానికి చెందినట్లు ప్రవర్తించాలంటేనూ - దరఖాస్తు పెట్టుకో !"

"మీతో చెప్తున్నాను గదా, ఇదే దరఖాస్తు అనుకోండి !"

అరెస్టయి వారం గడిచింది. ఇన్నాళ్ళలోనూ బయటివాళ్ళతో ఎవరితోనూ మాట్లాడే అవకాశం లభించలేదు. అసలు నేను అరస్టు అయినట్లు బయటి ప్రజలకు తెల్సునో, తెలియదో కూడా నాకు తెలియదు. బయటి ప్రజలు నా గురించి ఏమైనా ఆలోచిస్తున్నారా, లేదా ? అదీ తెలియదు. "ఎవరో నాకోసం ఏదో చేస్తారని ఎదురు చూడడంకంటే, నాకు చాతనయింది నేను చేయడం మంచిది. కేసు నడుస్తుంది. భగత్సింగ్ చెప్పినట్టు నేనూ మా ఆదర్శాన్ని, నేను చేసిందాన్ని స్పష్టంగా చెప్పేస్తాను" అనుకున్నాను.

ఆ తరువాత మిత్రుల ద్వారా తెల్సుకున్న కొన్ని అభిప్రాయాల్ని ఇక్కడ ఉదహరించడం అవసరం అనుకుంటున్నాను. 'తన గురించి బయటి ప్రపంచానికి ఏమీ తెలియదు. తాను జైలుకొట్టులో చనిపోయినా బయటి ప్రపంచానికి వార్త అందదు !' అన్న భావన ఖైదీని యమయాతన పెడుతుంది. ఖైదీ తన గురించి బయటి ప్రపంచానికి తెలియాలని ఎప్పుడైతే ఆదుర్దా పడతాడో, అదే అతడిలోని బలహీనతగా పోలీసులు గుర్తిస్తారు. ఇంక పోలీసులు ఖైదీతో "నువ్వేదో పెద్ద దేశభక్తుడివనుకుంటున్నావు. నీ గురించి ప్రజలు ఉద్యమాలు లేవదీస్తారనుకుంటున్నావు ! నీ గురించి ఎవడికీ పట్టదు. ఎవడికీ తెలియదు. నువ్వు ఇక్కడ చచ్చినా బయటకు పొక్కదు !" అన్నట్టు వ్యవహరిస్తారు. బాధపడే ఖైదీని మరికొంచెం బాధపెట్టడానికి తన్నడం కొట్టడం లాంటివి చేస్తారు.

ఆ మర్నాడే కాళ్ళకు వేసిన సంకెళ్ళను తీసివేశారు. చీకటి కొట్టులోకి ఒక ఇనుపమంచమూ, పడక కూడా వచ్చాయి. బి. క్లాసు కాంగ్రెసు ఖైదీలకు పెట్టే మంచి భోజనాన్ని పంపించసాగారు.

ఆ మర్నాడు బెనర్జీ మళ్ళీ వచ్చాడు. నన్నిలా చీకటి కొట్టులోవేసినందుకు నొచ్చుకున్నాడు. "నిన్ను ఈ చీకటి కొట్టులో పెట్టడం ఏంటి ? వీళ్ళు చాలా మూర్ఖులు. ఏమాత్రం బుద్ధిలేదు వీళ్ళకు. నిన్ను ఇలాంటి కొట్టులో పెట్టారని నాకు తెలియదు. ఇది నువ్వు ఉండదగ్గ ప్రదేశం కాదు !" అన్నాడు. తనతోపాటు పళ్ళూ, ఫలాలు, భోజనం పట్టుకువచ్చాడు. ఇంక గీతోపదేశం తాలూకు ఊకదంపుడు ప్రారంభించాడు. 'ఫలితాన్ని గురించి ఆలోచించకు, కర్తవ్యాన్ని నిర్ణయించుకో ! 'యంగ్‌లేడీ' గురించి ఆలోచించు. నువ్వు 'సరే' అంటే, కోర్టు వ్యవహారాలన్నీ నామమాత్రంగా జరుగుతాయి. నీకేమీ హాని జరుగదు. ఆ తరువాత, కావాలంటే నువ్వు ఇంగ్లాండు వెళ్ళిపోయి అక్కడే స్థిరపడే ఏర్పాట్లు జరుగుతాయి !' అన్నాడు. చివరకు తేల్చింది, నేను ప్రభుత్వ సాక్షిగా మారడం ! అలా ప్రభుత్వ సాక్షినై, నా లాగానే జీవితాలను పాడు చేసుకుంటున్న ఇతర యువకుల్ని కాపాడడం !

బెనర్జీ మహాశయుడు అలా రావటం నా మనస్సును బాధించసాగింది. ఇంక అతడితో నిర్మొగమాటంగా మాట్లాడవలసిన పరిస్థితి ఏర్పడుతున్నది. ఐతే, అతడి ప్రవర్తనా, మాటా ఎంతో నమ్రతగా ఉండేవి. అలాంటప్పుడు నిర్మొగమాటంగా ఎలా మాట్లాడగలను ? అయినా ఒకరోజున ఇలా అన్నాను. "బెనర్జీగారూ ! భగవద్గీత విషయం వదిలిపెట్టండి. అది ఎవరికీ అర్థంకాదు. గీతోపదేశం విన్నాక అర్జునుడు రాజ్యకాంక్షతో తన బంధుమిత్రుల్నే చంపుకోవడానికి సిద్ధపడ్డాడు. చాలామంది భగవద్గీతను చదివి బైరాగులై పోతున్నారు. మరి గాంధీగారికి భగవద్గీతలో అహింస కనిపించింది. మీరేమో ఆ భగవద్గీత ఆధారంగానే నా స్వలాభం కోసరం మిత్రులకు ద్రోహం చేయటం ఉచితం అని

చెప్తున్నారు ! నా సాధారణ బుద్ధికి తోచిన వరకు గీతోపదేశం ప్రకారమే చేస్తున్నాను. నేను చేసిందేదో చేశాను. అందుకు ఫలితాన్ని అనుభవించవలసి ఉంటుందని నాకు తెలుసును. నేను అందుకు సిద్ధంగా వున్నాను., నాకు మీరు రోజా భోజనం పట్టుకురావటం బాగుండదు. నాకు జైల్లో భోజనం పెడతారు గదా ? ఇంక మీకెందుకు శ్రమ ?" అన్నాను.

బెనర్జీ చెయ్యి అడ్డంగా తిప్పుతూ, "ఈ చిన్న విషయాన్ని గురించి పట్టించుకోకు నా సంతృప్తి కోసం పట్టుకొస్తున్నాను" అన్నాడు.

ఇంక బెనర్జీ మహాశయుడితో స్పష్టంగా మాట్లాడక తప్పలేదు. "చూడండి నేను ఖైదీని, అన్నమేయో మీరు తెచ్చిపెడుతున్నారు. నాకేమైనా అయితే విషం పెట్టారన్న అపవాదు మీకు వస్తుంది. మీకు అలాంటి అపవాదు రావటం నాకిష్టంలేదు."

బెనర్జీ మహాశయుడు రెండు చెవులూ మూసుకున్నాడు. "ఒద్దు బాబూ, నువ్వు అలా అనుకునట్లయితే ఇక నేను అన్నం పంపించను." అన్నాడు.

ఇది జరిగిన నాల్గవరోజున బెనర్జీ మళ్ళీ వచ్చాడు. కొంత విసుగు, కొంత అసహనమూ నలిపిన స్వరంలో "నీ వ్యవహారం కోర్టుకు పంపకుండా ఎన్నాళ్ళని ఆపమంటావు ? ఒకమాటు కోర్టుకెళ్ళాక, ఇంక వ్యవహారం మా చేతుల్లోంచి దాటిపోతుంది. అప్పుడిక మేం చేయగలిగిందేమీ ఉండదు" అన్నాడు.

నేను అన్నాను. "నా వ్యవహారం త్వరగా కోర్టులో దాఖలు చెయ్యాలని నేనూ కోరుతున్నాను. నన్ను ఈ మురికి కూపంలో పడేసి అట్టే పెట్టారు. మీరు నామీద చూపుతున్న వాత్సల్యానికి కృతజ్ఞుడిని. మీరు నన్ను కలుసుకోవటానికి రాకుండా వుంటేనే మంచిది."

బెనర్జీ మహాశయుడు నిట్టూర్చుతూ వెళ్ళిపోయాడు. అంత మాత్రానికి అతడు నిరాశపడ్డాడనీ, తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడనీ అనుకోవటానికి వీల్లేదు. గీతోపదేశం ద్వారా నాకు హృదయ పరివర్త గావించడానికి మరొకమాటు ప్రయత్నించాడు. ఐతే, కొన్నాళ్ళు ఆగి ప్రయత్నించాడు.

రెండు రోజులు గడిచాయి. నన్ను జైలు ఆఫీసుకు పిలిచారు. శ్యాంకుమారీ నెహ్రూ వచ్చింది. ఆమెను గుర్తుపట్టాను. పరారీలో వుండగా ఈమె తల్లిగారు ఉమా నెహ్రూనూ, తండ్రిగారు మోహన్‌లాల్ నెహ్రూనూ కలుసుకున్నాను. ఈమెనూ ఒకటి రెండుసార్లు కలుసుకున్నాను. శ్యాంకుమారీ నెహ్రూతోపాటు మరో ఇద్దరు వ్యక్తులు కూడా వచ్చారు. ఒకరు శ్యాంకుమారీ నెహ్రూ పినతండ్రి బిహారీలాల్ నెహ్రూ. రెండవ అతడు బిహారీలాల్ నెహ్రూ మిత్రుడైన బారిస్టర్ ! వీళ్ళు నా తరఫున వాదించటానికి అంగీకరించారు. నా కేసు విషయంలో మాట్లాడడానికి వచ్చారు. మేము జైలు అధికారుల ఎదుటే మాట్లాడుకున్నాము. అధికారులు మా మాటలు వినబడనంత దూరంలో నిలబడి మమ్మల్ని గమనిస్తున్నారు మేమేదైనా ఇచ్చి పుచ్చుకోవడం చేస్తామేమోనని జాగ్రత్తగా చూస్తున్నారు. ఐతే, మా మాటలు వాళ్ళకు వినబడడం లేదు. బ్రిటీష్ ప్రభుత్వపు జైళ్ళల్లో నేను ప్లీడర్లతో నా కేసు విషయమై రహస్యంగా మాట్లాడే అధికారాన్ని ఉపయోగించుకున్నాను. ప్రతి ఖైదీ, వాడెంతటి ప్రమాదకరమైన ఖైదీ అయినాసరే ఈ అధికారాన్ని ఆనాడు ఉపయోగించుగలిగేవాడు. కానీ 1949 లో రైల్వే సమ్మె సందర్భంగా, అకారణంగా నన్ను జైల్లో పెట్టడం జరిగింది. అప్పుడు కాంగ్రేసు ప్రభుత్వం కమ్యూనిస్టు ఖైదీలకు తమ ప్లీడర్లతో మాట్లాడుకునే అధికారాన్ని ఇవ్వడానికి నిరాకరించింది. చాలా విచారపడ్డాను. నన్ను అరెస్టు చేయడాన్ని ప్రజలు గట్టిగా వ్యతిరేకించడంతో వెంటనే నన్ను విడుదల చేసింది, కాంగ్రేసు ప్రభుత్వం., అప్పుడు ఉత్తరప్రదేశ్ పోలీసు శాఖమంత్రి లాల్‌బహదూర్‌శాస్త్రీ ! వారికి ఈ అన్యాయాన్ని గురించి చెప్పటానికి వెళ్ళాను. అప్పుడాయన రాట్నం వడుకుతున్నాడు. నేను చెప్పిందాన్ని ఖండిస్తూ "కమ్యూనిస్టులు

ఇలాంటి అధికారాలను దుర్వినియోగపరుస్తారు" అన్నాడు. అంటే కమ్యూనిస్టులు ఇలాంటి అధికారాల ద్వారా అనుచితమైన లాభాలను పొందుతారని వారి ఉద్దేశ్యం. మిత్రులకూ, ఇతర పార్టీ సభ్యులకూ వార్తలు పంపుకుంటారనీ అభిప్రాయం.

శాస్త్రిగారు చెప్పింది నిజం కావచ్చును. ఐతే, వ్యక్తిగత పరిచయం ద్వారా నేను ఒకటి చెప్పగలను. బ్రిటీష్ ప్రభుత్వ కాలంలో పై అధికారాన్ని కాంగ్రెసు నాయకులూ అనుచితంగానే వాడుకున్నారు. పండిట్ నెహ్రూ దగ్గర్నుండి, ఈ శాస్త్రిగారి వరకూ - అందరూ పై అధికారాన్ని అనుచితంగా వాడకున్నవారే ! కాగా, ఆ రోజుల్లో ఈ అధికారాన్ని బ్రిటీష్ ప్రభుత్వం లాగేసుకో చూసినప్పుడు, అది అన్యాయం అని ఈ కాంగ్రెసు నాయకులందరూ గోలపెట్టినవారే ! రాజకీయ ఖైదీలు పై అధికారాన్ని అనుచితంగా వాడుకుంటారని బ్రిటీష్ ప్రభుత్వానికీ తెల్సు. ఐతే, బ్రిటీష్‌వారు, ఒక నియమాన్ని చేశాక దాన్ని పాటించడం తమ కర్తవ్యంగా భావిస్తారు ! దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, కాంగ్రెసు వారిలో అలాంటి నీతి - నిజాయితీలు దివిటీ వేసి వెతికినా కనుపించవు ! రోజూ చరఖా తిప్పితే చాలు, అదే నీతీ, నిజయితీ, సత్యం, అహింస అనుకుంటారు.

శ్యాంకుమారి నెహ్రూ ద్వారా బయటి ప్రపంచపు విషయాలు కొన్ని తెలిశాయి. ప్రజలు ఓ కమిటీని వేసి, ఆ కమిటీ ద్వారా నా సహాయం కొరకు చందాలు ప్రోగుచేస్తున్నారని తెల్సింది. ఆమెతో నేనిలా అన్నాను. "ఢిల్లీ, లాహోరు కుట్రకేసుల విషయం వేరు. ఆ కేసుల్లో చాలామంది నిందితులు వున్నారు. వాళ్ళల్లో నేనొకణ్ణి అవుతాను. మరి ఇక్కడి కేసులో మీరు ఎటూ వాదిస్తూన్నారు గదా ? ఇంక నాకు డబ్బుతో పనేమిటి ? ఇకపోతే, మా అమ్మగారికి సహాయం చేయాలనే ఉద్దేశంతో చందా వసూలు చేయడమూ నాకు ఇష్టం లేదు !"

నేనూ, ధర్మపాల్ - మేమిద్దరం అరెస్టు అయ్యాక మా అమ్మ మళ్ళీ ఉద్యోగం వెతుక్కుంది. లాహోరు మహిళా మహావిద్యాలయం బోర్డింగ్‌లో ఉద్యోగం చూసుకుంది.

నాకు ఆశ్రయం యిచ్చిన కారణంగా సావిత్రిదేవిగారి మీద కూడా బ్రిటీష్ ప్రభుత్వం కేసు పెట్టింది. శ్యాంకుమారిగారు నా అరెస్టును గురించి అన్ని వివరాలూ అడిగారు. 'నాకు ఎవరు విశ్వాసఘాతుకం చేశారు' అనే విషయాన్ని తెల్సుకోవడం కోసం ఆమె ప్రయత్నించింది. ప్రకాశవతి ఇతర మిత్రులూ సురక్షితంగానే ఉన్నారని తెల్సింది. రెండవ లాహోరు కుట్రకేసు వీగిపోయింది. ఇంద్రపాల్ విడుదల అయ్యాడు. ప్రభుత్వం నామీద, లైసెన్సు లేకుండా ఆయుధాల్ని కలిగివున్నందుకు ఒకటి, హత్యా ప్రయత్నం చేసినందుకు రెండు - మొత్తం మూడు కేసులు పెట్టబోతోంది.

నేనొక్కణ్ణే నిందితుణ్ణి కావడం వల్ల కుట్రకేసు పెట్టడానికి వీలులేదు. నామీద పెట్టబోయే కేసుల్లో ఏడేళ్ళకు మించి శిక్ష వేయడానికి వీల్లేదు. లాహోరు, ఢిల్లీ కుట్రకేసుల్లో, వైస్రాయి ట్రయిన్ క్రింద బాంబు పేల్చిన కేసులో నన్ను చేర్చేట్టయితే - నన్నూ లాహోరుగానీ లేక ఢిల్లీగానీ తీసుకువెళతారు !

బిహారీలాల్ నెహ్రూ ఇలా అన్నాడు. "307 వ సెక్షన్ క్రింద కాన్పూర్‌కు సంబంధించిన కేసు ఒకటి పెడతారు. ఈ కేసుకు సంబంధించిన కాన్పూర్ పోలీసుల్ని నిన్ను గుర్తించే నిమిత్తం తీసుకువస్తారు. ఈ గుర్తింపు తతంగం ఓ మెజిస్ట్రేట్ సమ్ముఖంలో జరుగుతుంది. వాళ్ళు నిన్ను గుర్తించకపోతే, ఆ కేసూ పోయినట్టే !"

నేను నవ్వేశాను. "వాళ్ళు నన్ను గుర్తించకపోవడం ఎలా ? వాళ్ళతో చాలాసేపు మాట్లాడాను, ఘర్షణ పడ్డాను. ఎదురు బొదురుగా కాల్చుకున్నాం. ఇంక వాళ్ళు నన్ను ఎలా గుర్తించకుండా వుంటారు? ప్రత్యేకం గుర్తించడానికే పిలిపిస్తూనన్నప్పుడు ? వాళ్ళల్లో ఒకడు ఈ మధ్య ఢిల్లీ చావడి బజార్లో తారసపడ్డాడు. వెంటనే గుర్తించాడు. వాళ్ళు నన్ను గుర్తించకపోవడం మాత్రం అసంభవం !" అన్నాను.

"అసంభవం అనకు ! తొంబైతొమ్మిదిపాళ్ళు గుర్తించడానికే అవకాశం వుంది. ఒకపాలు గుర్తించకపోవచ్చు కూడాను ! మరొక్క విషయం, ఈ కేసును రాజకీయ కుట్రకేసుగా పెట్టడం లేదు. కనుక, నీ అంతట నువ్వు 'నేనది చేశాను. నేనిది చేశానని' అనకు ! అవన్నీ చేయలేదని అబద్ధం ఆడడం నీకు ఇష్టం లేకపోతే, నువ్వు మౌనంగా వుండు ! ఏమీ చెప్పకు ! ఆ తరువాత మాకు చాతనయింది ఏదో ఒకటి మేము చేస్తాము. మా ప్రయత్నాలకు అడ్డంకుల్ని మాత్రం కలిగించకు !" అన్నాడు బిహారీలాల్ నెహ్రూ ! ఇంతగా చెప్తూంటే, ఆయనమాట వినక తప్పలేదు. మౌనంగా వుండడం వల్ల నా అభిమానం దెబ్బతింటుందన్న ప్రశ్న కూడా ఉదయించదు.

అప్పట్లో కట్టుకోవడానికి బట్టల్ని శ్యాంకుమారి నెహ్రూ పట్టుకువచ్చి ఇచ్చింది. అప్పటికి వారం రోజులుగా గడ్డం చేయించుకోలేదు. ఖైదీలకు చేసే జైలు మంగలిచేత గడ్డం గీయించుకోవడం ఇష్టం లేదు. రేజరు వాడడానికి అనుమతి నివ్వలేదు. గడ్డం బాగా పెరిగింది. మర్నాడు మధ్యాహ్నం నన్ను ఆఫీసు గదికి పిలిపించారు. అక్కడ మెజిస్ట్రేట్ వున్నాడు. మెజిస్ట్రేట్ యువకుడు, సౌజన్యత కలవాడులా కనుపించాడు. పేరు మిస్టర్ భగవాన్ సహాయ్ ! ఈయన స్వాతంత్ర్యం వచ్చాక ఉత్తరప్రదేశ్ చీఫ్ సెక్రటరీగా నియమింపబడ్డాడు. భోపాల్ సంస్థానంలోనూ చీఫ్ సెక్రటరీగా కొన్నాళ్ళు పనిచేశాడు. ప్రస్తుతం జమ్మూ - కాశ్మీరు గవర్నరుగా వున్నాడు.

మిస్టర్ భగవాన్‌సహాయ్ అన్నాడు. "మిమ్మల్ని గుర్తించడానికి మరికొందరు ఖైదీల్తోపాటు నిలబెడతాము. కాన్పూరుకు చెందిన పోలీసులు గుర్తించడానికి వస్తారు !"

నేను గుర్తింపుకు హాజరు కావడానికి నిరాకరించాను.

మిస్టర్ సహాయ్ చాలా స్పష్టంగా, తటస్థుడిలా అన్నాడు "ఇటు చూడండి ! మీరుగనక గుర్తింపుకు హాజరు కాకపోతే, ఖైదీ గుర్తింపుకు హాజరు కావడానికి నిరాకరించడాని రాసేస్తాను ! కానీ, ఒక్కటి మీరు తెలుసుకోవడం అవుసరం అనుకుంటున్నాను. మీరు గనక నిరాకరిస్తే, మీరు 'దోషి' అని నిర్ధారణ అవుతుంది ! అలాకాక, గుర్తింపు న్యాయంగా జరగడం లేదని మీకు అనిపించినా లేక గుర్తింపు జరిపే పద్ధతిలో మీకేమైనా అభ్యంతరం వున్నా చెప్పండి ! తప్పకుండా మీ అభ్యంతరాన్ని పరిగణనకు తీసుకుంటాను. అభ్యంతరాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తాను".

నేనూ స్పష్టంగానే సమాధానం ఇచ్చాను. "అలాగైతే, తప్పకుండా నా అభ్యంతరాల్ని చెప్తాను. నన్ను సి. క్లాసు ఖైదీల్లో నిలబెడతారు. నాతోపాటు నిలబెట్టే ఖైదీలందరూ జైలు దుస్తుల్లో వుంటారు. నేను ఒకడిని మాత్రమే మామూలు దుస్తుల్లో వుంటాను. ఇది ఒక అభ్యంతరం. పైగా నేను పది పదిహేను రోజులుగా గడ్డం చేయించుకోలేదు నా గడ్డం. నా మామూలు దుస్తులూ నన్ను ఇట్టే పట్టిస్తాయి. నాలాంటి రాజకీయ ఖైదీల్లో నన్ను నిలబెట్టండి. గడ్డం చేసుకునే అవకాశం ఇవ్వండి. అలా న్యాయంగా గుర్తింపు వ్యవహారం జరుపుతానంటే నాకేమీ అభ్యంతరం వుండదు'"అన్నాను.

"మీ అభ్యంతరం న్యాయమైందే !" మిస్టర్ సహాయ్ ఒప్పుకున్నాడు.

గుర్తింపు సమయంలో నన్ను బి. క్లాస్ రాజకీయ ఖైదీల్లో నిలబెట్టడానికి అంగీకరించారు. బట్టలు మార్చుకోవడానికి, గడ్డం చేసుకోవడానికి వీలు కల్పించారు.

అప్పుడు అలహాబాద్ జైల్లో మోహన్‌లాల్ గౌతమ్, గోపీనాథ్ సింగ్ - అనే ఇద్దరు పూర్వ పరిచయులు, రాజకీయ ఖైదీలుగా వున్నారు. నాకు సహాయం చేయడానికి పూర్తి సంసిద్ధతను వ్యక్తపరిచారు. వీళ్ళిద్దరూ తెల్లని ఖద్దరు దుస్తుల్ని వేసుకునేవారు. ఖద్దరు టోపీ పెట్టుకునేవారు. ఖద్దరు దుస్తులూ - టోపీ నాకోసం తెప్పించారు. గడ్డం చేయడానికి మంగలి వచ్చాడు. కాన్పూర్ సంఘటన జరిగిన రోజుల్లో సన్నని కొనదేలిన మీసాలుండేవి నాకు. గౌతమ్‌గారు బాగా మీసాల్ని పెంచుకున్నారు

వత్తుగా బుర్రమీసాల్లాగున్నాయి వారి మీసాలు ! మీసాల్ని సన్నగా, కొనవేలినట్టు గొరిగించుకోమని వారికి చెప్పాను. నేనేమో అసలు మీసాల్లేకుండా మూతిని నున్నగా గొరిగించేశాను ! గుర్తింపు పెరేడ్‌లో నిలబడడానికి మరో పంజాబీ ఖైదీని కూడా తీసుకువచ్చారు. అతడూ బి. క్లాసు ఖైదీయే ! మంచివాడు. దొంగనాణాలు ముద్రిస్తూండగా పట్టుబడి జైలుకు వచ్చాడు. నేను పంజాబీని, భగత్సింగ్ సహచరుణ్ణి, విప్లవకారుణ్ణి కావడం వల్ల అతడు ఎంతో ప్రభావితుడయ్యాడు. వస్తూనే ఆలింగనం చేసుకుని "మిమ్మల్ని రక్షించడానికి అవసరం అనుకుంటే ప్రాణాన్నయినా ఇచ్చేస్తాను !" అన్నాడు.

పై చెప్పిన పంజాబీఖైదీ చాలా శ్రద్ధగా మీసాల్ని పెంచుకున్నాడు. అతడికి తన మీసాలపట్ల ఎంతో గర్వం ! వాటిని పైకి మెలిత్రిప్పి, కొనతేల్చి, తేలుకొండీల్లా వుంచేవాడు. నేనిలా అన్నాను. "మీరీమీసాల్ని తీసేయాలి ! సన్నగా వుండేట్టు కత్తిరించుకోండి !" అని చెప్పాను. పంజాబీ మిత్రుడు అంగీకరించాడు. నాకోసం తన మీసాల్ని త్యాగం చేశాడు.

మెజిస్ట్రేట్ మిస్టర్ సహాయ్ చాలా నిర్లిప్తంగా, న్యాయంగా వ్యవహరించాడు. సౌంజ్ఞలు చేసీ, ఇతరత్రా అనుచితంగా ప్రవర్తిస్తారనుకున్న జైలు అధికారుల్ని, సిబ్బందినీ - దూరంగా పంపించివేశాడు., "ఇప్పుడు మీకేమీ అభ్యంతరం లేదు కదా ?" అని అడిగాడు. నిజంగానే ఇంక అభ్యంతరానికి తావులేదు. ఐతే, అంతమాత్రం చేత నా మనస్సులో భయం తీరలేదు. గుండె దిటవు చేసుకున్నాను. అందరం నుంచున్నాం. గుర్తించడానికి వచ్చిన ఒక పోలీసును పిల్చారు. అతడు రాగానే నేను గుర్తుపట్టాను. నే నేమాత్రం తత్తరపడకుండా హుందాగా, శాంతంగా నిలబడ్డాను. మొదట అనుకున్నట్టు గౌతమ్‌గారు పంజాబీ మిత్రుడూ కొంచెంగా తత్తరపాటును నటించారు. కాన్పూరు పోలీసు మమ్మల్ని ముగ్గుర్ని నాలుగయిదుసార్లు పరిశీలనగా చూశాడు. ఒక నిర్ణయానికి రాలేకపోవడం వల్ల ఏర్పడ్డ కోపమూ, విసుకుదలా అతడి ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి చూసి, చూసి అతడు గౌతమ్‌గారి చేతిని పట్టుకున్నాడు.

రెండవ పోలీసును పిల్చారు. అతడు మమ్మల్ని కొంతసేపు పరిశీలనగా చూశాడు. అనంతరం పంజాబీ మిత్రుడి చేయిపుచ్చుకుని 'ఇతడే !' అన్నాడు.

మూడవ పోలీసు వచ్చారు. ఇతడు ఢిల్లీ చావడీ బార్లో కనుపించినవాడే ! అతడిలో వెనుకటి భయం తాలూకు వణుకు స్పష్టంగా కనుపించసాగింది. మూడవ పోలీసు మా ముగ్గుర్ని చాలాసేపు చూశాడు. చివరకు ఇలా అన్నాడు" ఆ మనిషి వీళ్ళల్లో లేడు !"

అంతటితో కాన్పూర్ సంఘటనకు సంబంధించిన కేసు విరగడయింది.

మూడవ రోజున మళ్ళీ ఆఫీసు గదికి పిలిచారు. ఈ మాటు నన్ను పోలీస్ ఎస్కార్టుకు వప్పగించారు. జైలు నిబంధనల ప్రకారం, ఖైదీని ఒక జైలునించీ మరో జైలుకు మార్చడాన్ని ముందుగా తెలియనీయరు. అలా తెలిస్తే ఖైదీ పారిపోవడానికి రహస్యంగా ఏర్పాట్లు చేసుకుంటాడేమోనని భయం. ఐతే, పాత ఖైదీలకు ఎలాగో ముందుగానే తెల్సిపోతుంది, తమను మారుస్తూన్నారని ! అప్పటికి నేనింకా కొత్తకాపుని. ఎక్కడికి తీసుకువెళ్ళబోతూన్నారో తెలియదు. లాహోరుగానీ, ఢిల్లీగానీ తీసుకువెళ్తూన్నారనుకున్నాను.

శ్యాంకుమారి నెహ్రూ నాలుగు రోజులకు ఒకమాటు వచ్చి చూసి పోతూన్నది. క్రితంసారి వచ్చినప్పుడు 'లాహోరు, ఢిల్లీ కేసుల సందర్భంగా నిన్ను లాహోరు ఢిల్లీ కోర్టులో హాజరు పరచవల్సిందని ప్లీడర్లు డిమాండ్ చేస్తున్నారు !' అని చెప్పింది. నన్ను లాహోరుగానీ, ఢిల్లీగానీ తీసుకువెళ్ళడం అంటే ఢిల్లీ కుట్రకేసునూ, లాహోరు కుట్రకేసునూ మళ్ళీ మొదలెత్తుకుని విచారిస్తారన్నమాట ! అప్పటికే ప్రభుత్వం పై రెండు కేసులకు గాను పదిహేను పదహారు లక్షల రూపాయిలు ఖర్చుపెట్టింది. ఢిల్లీగానీ,

లాహోరు గానీ తీసుకువెడితే మిత్రుల్ని కల్సుకోవచ్చునన్న సంతోషం కలిగింది. ఐతే, ఆ కేసుల్లో నన్ను ఇరికిస్తే ద్వీపాంతరవాస శిక్షగానీ, మరణశిక్ష గానీ - పడే అవకాశమూ వుంది !

పోలీసులు నన్ను రైల్వేస్టేషనుకు తీసుకువెళ్ళలేదు. అలహాబాద్‌లోనే వున్న మరో జైలుకు (నైనీ సెంట్రల్ జైలుకు) తీసుకువెళ్ళారు. అక్కడ నన్ను ఇంగ్లీషు వాళ్ళుండే బారక్కులోని ఓ గదిలో వుంచారు. గదిని దాటి నేను బయటకు వెళ్ళడానికి వీల్లేదు. నా గదివెనుక ఒక పోలీసు వుండేవాడు. నేను గదిలో నుండి ఎటైనా వెళ్తానేమో కనిపెడుతూండేవాడు. నన్ను కల్సుకోడానికి ఎవరూ రావడానికి వీలులేదు. నిజం చెప్పాలంటే, ఆ బారక్కు గదుల్లోని ఇంగ్లీషు ఖైదీలందరూ నా కాపలాదార్లే ! అందరూ నన్ను గమనిస్తూండేవారు. ఆ ఖైదీల్లో ఎక్కువమంది ఆంగ్ల సైనికులు. ఒకరిద్దరు ఇంగ్లీషు వాళ్ళమని చెప్పుకునే ఆంగ్లో - ఇండియన్లూ వున్నారు ! ఒకడు తాను ఆంగ్లో ఇండియన్‌ని చెప్పుకునేవాడు. ఐతే, అతడు దేశీయ క్రిష్టియను. వాళ్ళందరు నన్ను పరమశత్రువుగా చేసేవారు. ఈ ఇంగ్లీషు బారక్కులోని ఖైదీలకు వున్న సౌకర్యాలు బి. క్లాసు రాజకీయ ఖైదీల సౌకర్యాలకంటే కూడా మిన్నగా వున్నాయి. మంచి భోజనం, వస్త్రం లభించేవి. వెన్న, రొట్టె, పాలు, టీ, సన్నబియ్యపు అన్నం, పప్పు, మాంసం - ఇవన్నీ ఇచ్చేవారు. ఆ జైలు సూపరింటెండెంట్ ఒబేరాయ్ మంచివాడు. నన్ను ఉన్నత కుటుంబానికి చెందినవాడిగా భావించాడు. నేను అనారోగ్యముగానూ ఉన్నాను. గుడ్లూ - పాలూ నాకు ఎక్కువ ఇచ్చే ఏర్పాటు చేశాడు.

శ్యాంకుమారీ, ఇతర వకీళ్ళూ - నన్ను కల్సుకోడానికి నైనీ జైలుకూ వచ్చేవారు. శ్యాంకుమారి చాలా సహాయం చేసేది. ఆమెకు ఏ మాత్రం సంకోచించకుండా నా వ్యక్తిగత అవుసరాల్ని గురించి కూడా చెప్తూండేవాణ్ణి ! బయటి మిత్రులకు, రాజకీయమైన నా అభిప్రాయాల్ని చేరవేయడంలోనూ సహకరించేది. నేను అడిగిన పుస్తకాల్ని, ఇతర వస్తువుల్ని తెచ్చిపెట్టేది. ఔసరమైతే, కబురుపెట్టమనీ చెప్పింది. కబురు పెట్టడంలో వున్న ఇబ్బందిని తెల్పుతూ ఇలా అన్నాను. "మలాకా జైల్లో కొందరు పరిచయులు ఏర్పడ్డారు. ఇక్కడ ఎవరూ తెలియరు. పైగా చాలా పెద్ద జైలు. నిర్బంధమూ పెద్దగానే వుండే ట్టుంది !"

ఇదే జైల్లో జవహర్‌లాల్ నెహ్రూను, వారి ఇతర కుటుంబీకుల్ని పెట్టడం జరిగింది. నెహ్రూ కుటుంబంలోని సభ్యులు చాలారోజులు నైనీ జైల్లో వున్నారు. అందువల్ల శ్యాంకుమారి ఈ జైలుకు తరచు వస్తూండేది. ధైర్యాన్నిచ్చింది. "భయపడకు, జైలు పెద్దదైనకొద్దీ మనకు అవకాశాలూ పెద్దగానే లభిస్తూంటాయి !" అంటూ ఒక విశ్వాసపాత్రుడైన వార్డర్ పేరు చెప్పి "జవహర్లాల్ నెహ్రూ, రణజీత్‌భాయి ఈ వార్డర్ ద్వారా మాకు జాబులు పంపించేవారు. నువ్వూ ఇతడి ద్వారా కబురుపెట్టు. సంకోచించకు. మేమతడికి బహుమానం ఇస్తుంటాము. ఔసరం అనుకుంటే ఐదో పదో దగ్గరుంచుకో, ఫరవాలేదు !" అన్నది శ్యాంకుమారి.

జైలు నిబంధనల ననుసరించి ఖైదీలు దగ్గర డబ్బు అట్టే పెట్టుకోవడం చాలా పెద్దనేరం. ఐతే, ఖైదీలందరూ కొద్దో గొప్పో డబ్బు దగ్గర వుంచుకుంటారు. అలా వుంచుకుంటారని జైలు ఆఫీసర్లకూ తెల్సు. ఐనా, పట్టించుకునేవారు కాదు. మరి ఖైదీల దగ్గర డబ్బుల్లేకపోతే, జైలు అధికార్లకు లంచాలు ఎలా వస్తాయి ?

నా కేసు మార్చి చివరివారంలో విచారణకు వస్తుంది; అనుకుంటున్నాం. అప్పుడే మా అమ్మ లాహోరు నుండి నన్ను చూడటానికి వచ్చింది. నేనూ, ధర్మపాల్ అరెస్టు కావడం వల్ల మా అమ్మ ఏకాంతంలో దుఃఖపడేదేమో తెలియదు. నన్ను కల్సుకున్నప్పుడు మాత్రం చిరునవ్వుతో మాట్లాడింది. ".......నువ్వు చేసిందేదో చేశావు. తెలిసి నీ ఆదర్శం కోసం చేశావు. కనుక తల్లిపాలకు అవమానం తెచ్చిపెట్టే పని ఏదీ చేయకు !"

శ్యాంకుమారి గారి ద్వారా ప్రకాశవతి జాబులు నాకూ, నా జాబులు ప్రకాశవతికి అందసాగాయి. ఈ జాబులు ఇవ్వడాలూ - పుచ్చుకోవడాలూ జైలు అధికార్ల సమ్ముఖంలోనే జరిగినా, వారు చూడకుండా జాగ్రత్తపడేవాళ్ళం ! జైల్లోంచి నేను ప్రకాశవతికి రాసిన మొదటి జాబును సబ్బు పెట్టెలో వుండే తెల్లకాగితం మీద రాశాను. ఆ జాబును ఈనాటికీ భద్రంగా దాచుకుంది ప్రకాశవతి ! ఇరవైమూడేళ్ళ క్రితం రాసిన విషయాల్ని ఇప్పుడు చదువుకుంటే విచిత్రమైన అనుభూతులు వస్తూంటాయి.

కేసు విచారణకు నన్ను జైలునుండి కోర్టుకు తీసుకువెళ్ళాలి. కానీ, అలా తీసుకువెళ్ళడం జైలు అధికారులకు ఇష్టం లేదు ! నన్ను బైటకు రానిస్తే ఏదో ప్రమాదం ముంచుకువస్తుందని ప్రభుత్వమూ అనుకుంది. అందువల్ల నైనీ జైల్లోని ఒక గదిని కోర్టుగా ఉపయోగించుకున్నారు. నా కేసును విచారించే జడ్జీపేరు తేజ్‌నారాయణముల్లా ! ముల్లా కుటుంబీకులు బ్రిటీష్ ప్రభుత్వానికి పరమ విధేయులు ! తేజ్‌నారాయణ తండ్రి జగత్ నారాయణ్ ముల్లా కాకోరి కుట్ర కేసులో ప్రభుత్వ ప్లీడరు ! ఇంతకు క్రితం ఒకటి రెండు సందర్భాల్లో బ్రిటీష్ న్యాయాన్ని అభినందించాను. ఐతే, నా కేసు బ్రిటీష్ న్యాయానికి మరో ఉదాహరణ ! నామీద రెండు అభియోగాల్ని మోపారు. ఒకటి లైసెన్సు లేకుండా ఆయుధాన్ని కలిగి వున్నందుకు, రెండవది 307 సెక్షన్ కింద హత్యా ప్రయత్నానికి పాల్పడ్డందుకు. నిజానికి రెండు అభియోగాలూ ఒకే కేసుకు అంతర్భాగాలు. ఐతే, శిక్ష అధికం చేయడానికి విడదీసి రెండు అభియోగాల్ని చేశారు. ఇది బ్రిటీష్ న్యాయం యొక్క రెండవ రూపం.

నా కేసును అధ్యయనం చేయడం కోసం జైలు లైబ్రరీ నుండి 'ఇండియన్ పీనల్‌కోడ్' తీసుకుని చదువుతుండేవాణ్ణి. జైల్లోని ఏకాంతం, తీరిక - కొంత కుతూహలం - కారణంగా మొత్తం పీనల్‌కోడ్‌ను చదివేశాను. బ్రిటీష్ న్యాయం చైతన్య రహితమైన యంత్రం లాంటిది. ఒకానొక సెక్షన్ ప్రకారం వైస్రాయిపై హత్యా ప్రయత్నం చేసినందుకు ఉరిశిక్ష వేయవచ్చును. 'నామీద ఆ సెక్షన్‌కిందే కేసు పెట్టవచ్చును గదా ? మొత్తం పీడ విరగడైపోతుంది !' అనుకున్నాను. సరే, లైసెన్సు లేకుండా ఆయుధాన్ని కలిగివున్న కేసును విచారించడానికి జడ్జీనీ, జ్యూరీని నియమించారు. హత్యాప్రయత్నం కేసుకు అసేసర్లను నియమించారు.

ముందుగా లైసెన్సు లేకుండా ఆయుధాన్ని కలిగివున్న కేసుపై విచారణ జరిగింది. ఈ కేసులో నామీద అపరాధం రుజువుకాలేదని జ్యూరీ నిర్ణయించింది. జడ్జి ముల్లా, అతడు జ్యూరీ అభిప్రాయాన్ని వ్యతిరేకించాడు. జ్యూరీని కాదని శిక్ష విధించలేడు. గనుక ఈ కేసును హైకోర్టుకు అవాల్తా చేశాడు. ఇక, పిస్తోలుతో కాల్చి మానవ హత్యకు పాల్పడ్డానన్న కేసు ఒకటుంది. ఇది అసెసర్ల ద్వారా విచారించబడింది. ఈ అభియోగం కేవలం పోలీసు అధికారుల సాక్ష్యాధారాలమీద ఆధారపడింది. అదీ ముఖ్యంగా పిడ్లిచ్ సాక్ష్యంమీద ఆధారపడ్డదీ కేసు ! ఇతర సాక్షులు ఎవరూ లేరు. సాక్ష్యానికి ఉపయోగపడే పరికరమూ ఏమీలేదు. నేను ఏ విధమైన వాఙ్మూలాన్ని ఇవ్వడానికి తిరస్కరించాను. ఇక్కడ ఒక విషయం చెప్పకుండా వుండలేను. మిస్టర్ పిడ్లిచ్ తన వాఙ్మూలంలో అక్షరాక్షరం సత్యాన్నే చెప్పాడు. బిహారీలాల్ చాలా నిదానంగా మాట్లాడేవాడు. ఐతే, వాదనలో దిట్ట. నేర్పుగా వాదనని మలుపు తిప్పాడు. సాక్షిని ప్రశ్నవేయడంలో గొప్ప నేర్పరితనాన్ని ప్రదర్శించాడు. బిహారీలాల ప్రశ్నకు సమాధానం ఇస్తూ పిడ్లిచ్ ఇలా అన్నాడు. "నా విశ్వాసాన్ని అనుసరించి, ఈ కోర్టులో నిలబడి వున్న మిస్టర్ యశ్‌పాల్ నాపై కాల్పులు జరిపాడని అనుకుంటున్నాను. ఐతే, రేకుల దడి వెనుక మరో వ్యక్తి ఎవరైనా వుండడమూ, అతడు నామీద కాల్పులు జరిపి పారిపోవడమూ పూర్తిగా సంభవం. అభియుక్తుని తరఫున వాదిస్తున్న ప్లీడరుగారి అభిప్రాయానికి, వారి అనుమానానికి అవకాశం వుంది. కాల్చింది మరొకరు కావచ్చును.

నేర్పరి ఐన ప్లీడరు అనుమానానికి అవకాశం కల్పించాడు.

అసేసర్లు కూడా అంగీకరించారు. 'సందేహానికి అవకాశం వుంది' అన్నారు.

నా అపరాధం రుజువు కాలేదు. ఐతే, జడ్జీముల్లా అసేసర్ల అభిప్రాయానికి ప్రాధాన్యత నివ్వకుండా ఏడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్షను విధించాడు. ఎంతటి సాధారణ బుద్ధికయినా స్పష్టంగా తోచే విషయం పిస్తోలు ఉన్నదన్న విషయమే రుజువు కానప్పుడు ఇంక పిస్తోలు కాల్పుతో హత్యకు ప్రయత్నించాడన్న వాదాన్ని ఎలా అంగీకరించడం ? ఐతే, కోర్టు వ్యవహారాలూ, వాళ్ళ నియమాలూ - న్యాయాలూ సాధారణ బుద్ధికి అర్థం కావు.

జైలు కొట్టులోనే ఏర్పాటైన ఈ న్యాయస్థానంలో ఓ చిత్రమైన సంఘటన జరిగింది. డెహరాడూన్‌లో వున్నప్పుడు నేను డాక్టర్నని చెప్పుకుని కాలం గడిపిన విషయం వెనకే రాశాను. ఆ రోజుల్లో ఓ బెంగాలీ యువ ఉపాధ్యాయినితో పరిచయం అయింది. ఆమె తండ్రిగారితోనూ బాగా పరిచయం ఏర్పడ్డది. ఈ న్యాయస్థానానికి ఆయనగారు రావడమూ జరిగింది. చూడగానే ఆయన్ను గుర్తించాను. ఐతే, గుర్తించినట్టు పైకి కనబడనీయలేదు. అసలీ న్యాయస్థానానికి సాధారణ ప్రజలు వచ్చే అవకాశంలేదు. కానీ, పత్రికా సంపాదకులూ, విలేఖరులూ రావచ్చును. అలా వచ్చిన విలేఖరుల్లో పై చెప్పిన బెంగాలీ యువ ఉపాధ్యాయురాలి తండ్రిగారు కూడా వున్నారు. ఆయన నన్ను చూసి చాలా ఆశ్చర్యపోయారు., పోల్చుకోవడానికి సతమతమయ్యారు. మూడవరోజున ఏకాంతంలో, అవకాశాన్ని చూసుకుని పలకరించారు. తాను చేయగల్గినంత సహాయం చేస్తానని గద్గదమైన స్వరంలో చెప్పారు. నాకేమైనా అవసరం అయితే చెప్పమన్నారు.

"ధన్యవాదం ! అంతా సవ్యంగా వుంది !" అన్నాను క్లుప్తంగా.

నాతో ఆయన ఆత్మీయతగా మాట్లాడడం పోలీసులు చూస్తే, ఆయన వెంటపడతారు. ఆయనని ఇబ్బంది పెడతారు. అది నాకు ఇష్టం లేదు. అందుకే క్లుప్తంగా సమాధానం చెప్పాను.

ఒక నెలరోజుల తరువాత గానీ హైకోర్టు తీర్పు చెప్పదు. ఈలోపు ప్లీడర్లువచ్చి పోతూన్నారు. తీర్పు చెప్పాక శ్యాంకుమారి నేరుగా జైలుకు వచ్చింది. నన్ను అభినందించింది. లైసెన్సు లేకుండా ఆయుధాన్ని కలిగివున్నందుకు హైకోర్టు నన్ను అపరాధిగా భావించింది. ఐతే, నష్టమేమీ లేదు. ఈ కేసులోనూ ఏడేళ్ళు శిక్ష పడవచ్చును. హత్యాప్రయత్నానికి ఏడేళ్ళు ఎటూ విధించారు. రెండు శిక్షలూ ఏకకాలంలోనే అనుభవించవల్సి వుంటుంది. ఏడేళ్ళు జైలు చేయవల్సి వుంటుంది. ఇంతచేశాక ఏడేళ్ళ శిక్ష నాకో శిక్ష అనిపించలేదు. శిక్ష పడకుండా వదిలిపెట్టినంత సంతోషపడ్డాను. సాహిత్యాధ్యయనానికి ప్రభుత్వం ఏడేళ్ళ సదవకాశాన్ని ఇచ్చిందనిపించింది.

మర్నాడు మళ్ళీ శ్యాంకుమారి వచ్చింది. ఆమె ముఖం వెల వెల పోతోంది. "నిన్న ఇంగ్లీషు జడ్జి తీర్పు చెప్పేప్పుడు 'రెండు శిక్షలు కలసి అనుభవించవల్సి వుంటుంది' అని చెప్పాడు. తీర్పు అప్పటికి టైపుకాకపోవడం వల్ల జడ్జి సంతకం పడలేదు. రాత్రి క్లబ్బులో ఇతర ఇంగ్లీషు అసేసర్లతో మాట్లాడక జడ్జి తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు. 'కలసి' అన్న శబ్దాన్ని కొట్టివేసి 'క్రమంగా" అని రాశాడు. ఒక్క శబ్దాన్ని మార్చడం వల్ల ఏడేళ్ళ, శిక్ష పధ్నాలుగేళ్ళయింది ! పధ్నాలుగేళ్ళతోనే ఆగిపోదు. పధ్నాలుగేళ్ళ శిక్ష పడడమంటే జన్మఖైదు కిందికి వస్తుంది. శిక్ష పూర్తి అయ్యాక కూడా ఖైదీని వదిలిపెట్టడానికి ప్రభుత్వం ప్రత్యేకం అనుమతించవల్సి వుంటుంది" అన్నది.

శ్యాంకుమారి నాకీ విషయాన్ని చెప్పేప్పుడు అనుకోకుండా మీరట్ కేసులోని నిందితుల్ని కల్సుకోవడం జరిగింది. వాళ్ళ విచారణ అలహాబాద్‌లో జరగాలి. నైనీ జైలు ఆఫీసు గదిలో నేనూ వాళ్ళూ కల్సుకోవడం జరిగింది. వాళ్ళల్లో లాహోరు నివాసి లాలా కేదారనాథ్ సహగల్ కూడా వున్నాడు. ఆయన అన్నాడు. "పధ్నాలుగేళ్ళు జైలుశిక్షే గదా ? ఫరవాలేదు ! ఉరిశిక్ష పడనందుకు సంతోషించు !" నాకూ

అలాగే అనిపించింది. 'ఏడేళ్ళూ, పధ్నాలుగేళ్ళూ - రెండు ఒకటే - పెద్ద వ్యత్యాసం ఏమీలేదు !' అని మనస్సులోనే ఊరట చెందడానికి ప్రయత్నించాను.

అసలైన కేసుల ఇంకా అట్లాగే వున్నాయి. అలహాబాద్ కేసు అయిపోయింది గదా ! ఇక లాహోరు, ఢిల్లీ కేసుల్ని మొదలుపెడతారు !

లాహోరుకు గానీ, ఢిల్లీకి గానీ త్వరలో ప్రయాణం వుంటుందనుకుంటున్నాను. ఏదో ఒక పుస్తకాన్ని చదువుతూ కాలం వెళ్ళబుచ్చుతూన్నాను. ఒకరోజున జైలు ఆఫీసు నుండి పిలుపు వచ్చింది. ఆఫీసు నుండి పిలుపు రావడం ఓ ప్రత్యేకతను సూచిస్తుంటుంది. జైల్లో ఏదో అపరాధం చేయడం వల్ల శిక్ష అనుభవించడానికి సూపరింటెండెంట్ పిలిపించవచ్చును. ఒక జైలునుండి మరో జైలుకు మార్చడం కారణంగా పిలుపు రావచ్చును. కాక ఎవరైనా ఖైదీని కల్సుకోడానికి రావడం వల్లా ఆఫీసు నుండి పిలుపు రావచ్చును. మొత్తానికి ఆఫీసు నుండి పిలుపు వచ్చిందంటే తప్పకుండా ఏదో ఒక కొత్త విషయం జరగబోతోందన్నమాట !

ఆఫీసు గదికి వెళ్ళాను.

కల్సుకోడానికి ఎవరూ రాలేదు. జైలర్, వార్డర్ నొకణ్ణి తోడు ఇచ్చి పై అంతస్తులోని ఓ గదికి పంపించాడు. ఆ గదిలో బెనర్జీ మహాశయుడు కూర్చొని వున్నాడు. 'ఇతడు మళ్ళీ వచ్చిపడ్డాడే !' అనుకున్నాను.

బెనర్జీ మహాశయుడు ఒట్టిచేతుల్తో రాలేదు. మామిడి పండ్లను పట్టుకువచ్చాడు. మనస్సులో ఇలా అనుకున్నాను. 'శిక్ష కూడా పడ్డది కదా ? ఇంక ఇతడు ఎందుకు వచ్చాడు ? ఇంకా ఢిల్లీ కుట్రకేసు, లాహోరు కుట్రకేసు అలాగే వున్నాయి గదా ? అందుకే వచ్చివుంటాడు !'

అతడు వస్తూనే 'నిన్ను గురించి చాలా విచారిస్తున్నాను. ఎంతో బాధపడుతూన్నాను. అలహాబాద్ కేసు అయిపోయిందనుకో ! లాహోరు, ఢిల్లీ కుట్రకేసులు వున్నాయి కదా ? కాకపోయినా పధ్నాలుగు ఏళ్ళు జైలుశిక్ష అనుభవించడం సామాన్యమైన విషయమా ? ముఖ్యంగా ఎంగ్‌లేడీ ప్రకాశవతి జీవితాన్ని గురించి కూడా ఆలోచించు ! ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. నువ్వొక నిర్ణయానికి వస్తే, ఈ జైలు శిక్షలూ - అన్నీ పోతాయి. మిగిలిన జీవితాన్ని సుఖంగా గడపవచ్చును !' అంటూ ఒక చిన్న ఎర్రని కరపత్రాన్నొకదాన్ని నా చేతికి ఇచ్చాడు బెనర్జీ మహాశయుడు.

ఆ కరపత్రంలో విదేశీ పాలకులపై తిరుగుబాటు చేయవల్సిందని బాహాటంగా పిలుపు ఇవ్వడం జరిగింది. క్రింద 'కమేండర్ ఇన్‌చీఫ్ ప్రకాశవతి' అని వుంది.

ప్రకాశవతి పేరున వున్న కరపత్రాన్ని నాకు చూపడంలోని ఆంతర్యం స్పష్టమే ! ఆమె ప్రమాదంలో వున్నట్టు చిత్రించి నన్ను ప్రభుత్వ సాక్షి కావల్సిందని చెప్తూన్నాడన్నమాట ! అది చూసి నేను బాధపడిపోతానని అనుకున్నాడు బెనర్జీ ! కానీ, నేను ఏ మాత్రమూ ఉద్రేకపడలేదు. స్థిమితంగా "దాదాపుగా మూడు నెల్లనుంచి జైల్లో వున్నాను. ఈ కరపత్రాన్ని గురించి నాకేమీ తెలియదు గదా ? ఇంక నాకు చూపి ప్రయోజనం ? ఈ కరపత్రాన్ని గురించి నేనేమీ అభిప్రాయాన్ని ఇవ్వలేను. అసలు ఆలోచించను కూడా ఆలోచించలేను !" అన్నాను.

మా ప్రయత్నాలు ఆగిపోనందుకు, విప్లవ చర్యలు ఇంకా కొనసాగుతూన్నందుకు మనస్సులోనే సంతోషపడ్డాను. ఒక అనుమానమూ వచ్చింది. నన్ను భయపెట్టడం కోసం బెనర్జీ దొంగ కరపత్రాన్ని అచ్చువేయించుకు రాలేదు కదా ?

జైలునుండి విడుదల అయ్యాక, ఈ కరపత్రం గురించి ప్రకాశవతిని అడిగాను. రాజేంద్రసింగ్ మొదలైన మిత్రులు కమాండర్ ఇన్‌ఛీఫ్‌గా ఆమె పేరును వాడుకుంటామని అడిగారుట ! అందుకు ప్రకాశవతి అంగీకరించింది.

బెనర్జీతో అన్నాను "చూడండి ! నేను జైల్లో వున్నాను. బైట ఏం జరుగుతోందో నాకు తెలియదు. నా ప్రమేయమూ లేదు. 14 సంవత్సరాల శిక్షపడ్డది. అనుభవించడానికి సిద్ధంగా వున్నాను. లాహోరు, ఢిల్లీ కేసుల్లో పడే శిక్షనూ అనుభవించడానికి నేను సిద్ధం ! కనుక, నేను మీరు చెప్పే మాటల్ని వినను, మీ సలహాను అంగీకరించను. మీ సహాయాన్ని స్వీకరించను. నాపట్ల మీరు ప్రదర్శించిన అనురాగానికి ధన్యవాదం !" అన్నాను.

బెనర్జీ అప్పటికీ వదల్లేదు. "చూడు బాబు ! నేను ఉద్యోగ విరమణ చేసే వయస్సులో వున్నాను. నేను రిటైర్ అయ్యేలోపు నీకేమైనా మేలు చేద్దామని నా ఉద్దేశం ! నా మాటలలో నీకు నమ్మకం లేదా ! నేను మాట నిలబెట్టుకోలేనేమోనని గానీ, చివరకు మాట తప్పుతానని గానీ, కాక నా పట్ల ఏ రకమైన అనుమానమైనా వుంటే, నీకు నమ్మకం గల పెద్ద ఆఫీసరు సమక్షంలో మాట్లాడుకుందాము. పిడ్డిచ్‌ని చూశావు గదా ? చాలా నిజాయితీపరుడు ! ఆయన్ని కల్సుకుని మాట్లాడుతానంటే, ఆయన్ని పిలిపించే ఏర్పాటు చేస్తాను ! చెప్పు, మాట్లాడతావా ?" అనడిగాడు.

గమ్మత్తు చేద్దామనిపించింది. "వారు మాట్లాడాలనుకుంటే నేను సిద్ధం !" అన్నాను.

బెనర్జీ తలనిమురుకుంటూ తన నెరిసిన తలవెంట్రుకల్ని చూపుతూ "నా వయస్సును బట్టి అయినా నా మాట నిలబెట్టు ! తీరా ఆయనగారు వచ్చాక తలాతోకాలేని మాటలు మాట్లాడకు ! పిడ్డిచ్‌గారు ఇప్పుడు నైనీటాల్లో వున్నారు. అక్కణ్ణుండి పిలిపించాలి !" అన్నాడు.

"అదంతా మీరు ఆలోచించుకోండి ! 'వారిని పిలిపించండి ! నేను మాట్లాడతాను !' అని నేనేమీ మీకు మాట ఇవ్వలేను. వారు వస్తే నాతో మాట్లాడాలనుకుంటే నేను తప్పకుండా మాట్లాడతాను! ఐతే, ఒక విషయం మీరు తప్పక గమనించాలి ! ఇకమీదట ఎన్నడూ నాకోసం మీరు ఇలా శ్రమ తీసుకోకండి ! నాకు శిక్ష కూడా పడ్డది. జైలు నియమాల ననుసరించి ఖైదీ బయటనుండి వచ్చిన వస్తువుల్ని తినకూడదు. మీరు తెచ్చిన మామిడి పళ్ళను కూడా నేను తీసుకోలేను !" అన్నాను. ఒక రకంగా నామీద బాధ్యత లేకుండా చేసుకున్నాను.

మూడవరోజు మళ్ళీ ఆఫీసు నుంచి పిలుపు వచ్చింది, వెళ్ళాను. సూపరింటెండెంట్ తన గదిలోకి పిలిపించాడు. మిస్టర్ పిడ్డిచ్, మిస్టర్ మార్ష, మరి ఇద్దరు సూపరింటెండెంట్‌లూ ఉన్నారక్కడ! మిస్టర్ పిడ్డిచ్ నవ్వుతూ కరచాలనం చేసి "కూర్చోండి ! నేను నైనెటాల్‌లో వున్నాను. మొన్న బెనర్జీగారి ఫోన్ వచ్చింది. మీరు నాతో మాట్లాడాలనుకుంటున్నట్టు తెల్సింది, నేరుగా వచ్చేశాను !" అన్నాడు.

"నా కారణంగా మీకు శ్రమ కలిగింది. చాలా విచారిస్తూన్నాను !" అన్నాను.

"నాకేమీ శ్రమ కలగలేదు. పైగా, మీరు నాతో మాట్లాడాలనుకుంటున్నందుకు సంతోషపడుతూన్నాను. మనం మొదటగా విచిత్రమైన స్థితిలో కల్సుకున్నాము. మిమ్మల్ని కల్సుకున్నందుకు - ఆనాడూ సంతోషపడ్డాను, ఇప్పుడూ సంతోషపడుతూన్నాను ! ఇంతకూ నాతో ఏం మాట్లాడాలనుకుంటున్నారు ? ఒంటరిగా మాట్లాడాలనుకుంటే మిస్టర్ మార్ష అవతలికి వెడతారు !" అన్నాడు పిడ్డిచ్.

"అలా వద్దు. ఖైదీ ఒంటరిగా ఇతరుల్తో మాట్లాడడం జైలు నియమాలకు విరుద్ధం కదా ? పైగా మనం మాట్లాడుకున్నప్పుడు జైలు అధికారులు ఎవరో ఒకరు మధ్యవర్తిగా వుండడం అవసరం అనుకుంటున్నాను" అన్నాను.

పోలీస్ సూపరింటెండెంట్ వచ్చాడని తెల్సి ఒబేరాయ్ తన బంగ్లా నుండి ఆదరాబదరా వచ్చేశాడు. మేము మాట్లాడుతూండడం చూసి ఆగిపోయాడు. "మీరు మాట్లాడుకోండి !" అంటూ వెళ్ళిపోవడానికి వెనక్కు తిరిగాడు.

నేనిలా అన్నాను "జైలు నియమాల ననుసరించి ఖైదీ ఎవరితో మాట్లాడినా, జైలు అధికారుల సమ్ముఖంలోనే మాట్లాడాలి !" అన్నాను.

"ఏం ఫరవాలేదు. అంతా సవ్యంగానే వుంది !" అంటూ వెళ్ళబోయాడు.

"ఐనా, జైలు నిబంధనల్ని త్రోసి రాజనడం నాకిష్టం లేదు !" అన్నాను మొండిగా.

ఒబేరాయ్, పిడ్లిచ్ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. పిడ్లిచ్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. "మనం మాట్లాడుకునేప్పుడూ, మనం ఒక ఒప్పందానికి వచ్చేప్పుడూ మనమధ్య నమ్మకస్తుడైన మధ్యవర్తి ఒకరుండడం అవసరమని బహుశ మిస్టర్ యశ్పాల్ అనుకుని వుంటారు. మధ్యవర్తి ఉండడం పట్ల నాకేమీ అభ్యంతరం లేదు. మేజర్ ఒబేరాయ్, మీరు ఉండండి ! మనం ఇక్కడ ఏం మాట్లాడుకున్నా, మన ముగ్గుర్లోనే వుంటుంది. బయటికి పోదు !"

ఒబేరాయ్ అయిష్టంగానే కూర్చున్నాడు.

పిడ్లిచ్ నన్ను అడిగాడు. 'మీరు ఏం మాట్లాడాలనుకున్నారు ?

"మీరు చాలాదూరం నుండి, శ్రమపడి వచ్చారు. అందుకు విచారిస్తున్నాను. నేను ప్రత్యేకం చెప్పవల్సింది ఏమీలేదు. మిస్టర్ బెనర్జీ నన్ను కల్సుకోడానికి రాకుండా వుంటే బాగుంటుంది. ఒక సి.ఐ.డి. ఆఫీసరు నన్ను కల్సుకోడానికి వస్తూండడం వల్ల ప్రజలు నా గురించి చెడుగా అనుకుంటారు !" అన్నాను.

"ఇంతేనా, ఇంకేమీ లేదా మాట్లాడవల్సింది ?" పిడ్లిచ్ ఆశ్చర్యాన్ని ప్రకటించాడు.

"నేను చెప్పదలచింది ఇదే ! ఇంక మీరు ఏమైనా అడిగితే సమాధానం ఇస్తాను ! మీరేమైనా చెప్తే చేస్తాను !" అన్నాను.

పిడ్లిచ్ రెండు క్షణాలు ఆలోచించాడు.

"మీరు మీ గతజీవితాన్ని గురించి ఓ గ్రంథం రాయండి. నిజమైన, ప్రామాణికమైన జీవితాన్ని రాయండి. అందుకు అవసరం అయిన పరికరాల్ని ఇచ్చే ఏర్పాటు చేయిస్తాను !" అన్నాడు పిడ్లిచ్.

"ఆత్మకథలు మహాపురుషులు రాసుకుంటారు ! నేనంత గొప్పవాణ్ణి కాను. అదీకాక, నా జీవితకథ వల్ల ఎవరికీ ప్రయోజనం వుండదు !" అన్నాను.

"అలా అనుకోవద్దు. మీరీ ఉద్యమంలో ప్రముఖమైన పాత్ర నిర్వహించారు. మీ జీవితచరిత్ర, మీ విప్లవసంఘ చరిత్ర - మీరు రాస్తే భవిష్యత్తులో అనేకమంది జీవితాల్ని నాశనం కాకుండా కాపాడిన వారవుతారు !" అన్నాడు పిడ్లిచ్.

నేను పిడ్లిచ్‌తో

"అంటే, నేను ఇన్నాళ్ళూ ఏ మిత్రుల్తో కల్సి పనిచేశానో, వాళ్ళ ప్రాణాల్ని మీ చేతుల్లో పెట్టమంటారు ?" అన్నాను.

పిడ్లిచ్ మాట ఇచ్చాడు. "నేను మీకు మాట ఇస్తున్నాను. హత్యలూ - దోపిడీల్లో పాల్గొనివారిపట్ల ఎలాంటి చర్యా తీసుకోవడం జరుగదు భవిష్యత్తులో వారలా చేయకుండా నిరోధించడం మాత్రం జరుగుతుంది. ఇక దోపిడీలూ హత్యలూ మొదలైనవాటిలో పాల్గొన్నవారిపట్ల కూడా సాధ్యమైనంత ఔదర్యాన్ని ప్రదర్శించడం జరుగుతుంది. ఇలాంటి హింసాత్మక ప్రవృత్తిని నిరోధించడమే వుద్దేశ్యంగా పెట్టుకుంటాము. ప్రతిహింస, శత్రుభావన వుండవు !" అన్నాడు.

పిడ్లిచ్ స్పష్టంగా, అరమరికెలు లేకుండా మాట్లాడుతున్నాడు. కనుక, నేనూ స్పష్టంగా అడిగాను. "నా జీవితకథనూ, నా మిత్రుల యదార్థ స్థితినీ- వ్రాసి మీకు ఇవ్వమంటున్నారు. మరి నా స్థానంలో ఏ బ్రిటీష్ నాగరికుడో ఉన్నాడనుకోండి, ఉదాహరణకు మీరే వున్నారనుకుందాం. అలా రాసి ఇవ్వగలుగుతారా ?" అని ప్రశ్నించాను.

పిడ్లిచ్ ముఖం ఎర్రబడింది. "ఎన్నటికీ అలా రాసి ఇవ్వను" అన్నాడు.

"మరి నేను మాత్రం ఎలా రాసి ఇవ్వగలను ?"

పిడ్లిచ్ ఒక్కక్షణం మౌనంగా వున్నాడు. తరువాత

"ఇప్పుడు నేను మిమ్మల్ని మరి కూడా గౌరవిస్తున్నాను. సరే, ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదలిపెడదాం. ఇచ్చిపుచ్చుకునే వుద్దేశంతో కాదు, ఓ మిత్రుడిగా అడుగుతున్నాను. నావల్ల మీకేమైనా సహాయం కావల్సి వుంటే చెప్పండి, చేసి పెడతాను !" అన్నాడు.

"ధన్యవాదం నాకేంకావల్సి వుంటుంది ? అంతా బాగానే వుంది !"

"అలాకాదు. పధ్నాలుగేళ్ల జైలుజీవితం గడపడం సాధారణమైన విషయం కాదు. ఉన్నతశ్రేణి సౌకర్యాల్ని పొందే అవకాశం వుంటుంది ! ఔనుకదా, ఒబేరాయ్ ?" అన్నాడు పిడ్లిచ్.

'ధన్యవాదం నేను బి క్లాసు ఖైదీని. హింసాత్మక కార్యక్రమాల కారణంగా శిక్షపడినవారికి జైలు నియామల ననుసరించి ఎ క్లాసు లభించదు' అన్నాను.

"అదేమీ లేదు. ప్రభుత్వం అనుమతి ఇస్తే అన్నీ జరుగుతాయి !" అన్నాడు పిడ్లిచ్.

"మీరు అడిగారని కోరడం బాగుండదు బి. క్లాసు సుఖంగానే వుంది. సంతృప్తిగా వుంది. నాకు ఇంకేమీ అవుసరం లేదు !" అన్నాను.

"చాలా సంతోషం, మిత్రుడిగా ఒక సలహా ఇస్తున్నాను. జైల్లో, ఒంటరి జీవితంలో, సమయం గడవడం కష్టం ! క్రితం యుద్ధంలో నేను యుద్ధబందీగా వున్నాను. నాకు జైలు అనుభవం వుంది. జైలు జీవితంలో విదేశీభాషను నేర్చుకోవడం వల్ల మనకు తెలియకుండానే కాలం దొర్లిపోతుంది. జైలుజీవితం గడపడానికి విదేశీ భాషాధ్యయనం మంచి సాధనం. "హ్యూగో" పబ్లికేషన్సు వారు అనేక భాషలకు స్వబోధినీలను ప్రచురించారు. వాటిని తెప్పించుకుని కొత్త భాషలు నేర్చుకోడానికి ప్రయత్నించండి !"

"అలాగయితే, నాకు ఒక సౌకర్యాన్ని కలిగించండి !"

"ఏమిటి ?"

"కలమూ - కాగితాలూ దగ్గర వుంచుకోడానికి నాకు అనుమతి ఇప్పించండి. కాగితాలు లెక్కపెట్టి ఇవ్వండి. నేను కొన్ని కథలూ - వ్యాసాలు రాయాలనుకుంటున్నాను. వాటిని, పోలీసులు చదివి అభ్యంతరం లేకపోతేనే నా మిత్రులకో, లేక నా బంధువులకో ఇచ్చే ఏర్పాటు చేయమనండి !" అన్నాను.

"మిస్టర్ ఒబేరాయ్ ! ఇది అభ్యంతరకరమైన కోర్కెకాదు గదా ?" అని అడిగాడు పిడ్లిచ్. ఒబేరాయ్ కాదని చెప్పాడు. సౌజన్యపూరిత వాతావరణంలో కరచాలనం చేసి, వీడ్కోలు చెప్పుకున్నాం.

పిడ్లిచ్ ఇచ్చిన సలహాకు చాలా కృతజ్ఞుణ్ణి. సుదీర్ఘమైన జైలు జీవితంలో ఫ్రెంచి ఇటాలియన్ భాషల్ని అభ్యసించాను.

మే నెల, ఒకరోజున ఆఫీసు నుండి పిలుపు వచ్చింది. సామాను కూడా వెంట తెచ్చుకోమన్నారు. అంటే నన్ను మరో జైలుకు మారుస్తున్నారన్నమాట ! ఢిల్లీగానీ, లాహోరుగానీ - పంపుతారని ఎటూ అనుకుంటూనే వున్నాను ! ఖైదీకి జైలుమారడం చాలా ఇబ్బందికరంగా వుంటుంది. నియమానుసారం, మూడు సంవత్సరాలపైబడి శిక్షపడ్డ ఖైదీని బయటకు తీసుకువెళ్ళేటప్పుడు బేడీలు వేస్తారు. ఒకచోట వున్న ఖైదీ అక్కడి పరిస్థితులకు అలవాటుపడతాడు. కొత్త జైలుకు వెడితే మళ్ళీ పరిస్థితి మొదటికి వస్తుంది. కొత్త ఖైదీలపట్ల జైలు అధికారులు కఠినంగానూ ప్రవర్తిస్తూ వుంటారు. అలా తమ ప్రభావాన్ని ఖైదీలమీద వేయచూస్తారు ! ఇలాంటి ఇబ్బందులు వున్నప్పటికీ కొత్త జైలుకు మారడం కొంత ఆనందాన్ని ఇస్తుంది. మరో జైలుకు మారేప్పుడు బయటి ప్రపంచాన్ని చూసే అవకాశం లభిస్తుంది.

సాధారణ దుస్తుల్లో వున్న స్త్రీ పురుష - బాలవృద్ధుల్ని చూడడం జరుగుతుంది ! పశువుల్ని, వివిధ రకాలైన చెట్లు చేమల్ని, బజార్లనూ చూడడం వల్ల ఖైదీకి చాలా ఆనందం కలుగుతుంది. జైలుభాషలో దీన్ని 'లోకం చూడ్డం' అంటారు. ఇలా జైళ్ళు మారేప్పుడు అనుకోకుండా, పరిచయం అయిన ప్రదేశమో, వ్యక్తులో తారసపడవచ్చును. కాళ్ళకూ చేతులకూ సంకెళ్ళు వేయబడి, పోలీసుల కాపలాలో వున్న ఖైదీని సాధారణ ప్రజలు, ద్వేషపూరిత నయనాల్తో చూస్తారు. భయంకరమైన వ్యక్తిగా పరిగణిస్తారు. కొందరు అకారణంగానే గుద్దుతామని, తన్నుతమాని - అలాంటి ఖైదీకి సంజ్ఞల ద్వారా తెలియపరుస్తారు. ఇవన్నీ ఓ నూతనమైన అనుభూతిని కలిగిస్తూ వుంటాయి ఖైదీకి ! అలహాబాద్ రైల్వేస్టేషన్‌లో నాపట్ల అలాగే జరిగింది. పోలీసుల మధ్య, కాళ్ళకూ, చేతులకూ, బేడీలతో వున్న నన్ను చూసి ఓ నల్లదొరసాని పిడికిలి బిగించి, "గుద్దుతాన"ని సంజ్ఞ చేసింది. నేను నవ్వి వూరుకున్నాను.

నన్ను ఢిల్లీ తీసుకువెళ్తున్నారని తెలిసింది !

ఢిల్లీ జైల్లో అడుగుపెట్టగానే మొదటగా నేను చూసిన అధికారి చావలా, నన్ను చూస్తూనే జైలు అధికారి మిస్టర్ చావలా కొంచంగా తొట్రుపడ్డాడు. అతడలా తొట్రు పడడానికి కారణం వుంది. నేను ఢిల్లీలో ప్రభు దత్తు దగ్గర ఉన్న రోజుల్లో విమానం నడపడం నేర్చుకోవడం కోసం ఒక యువకుడు ప్రభుదత్తు దగ్గరకు వచ్చేవాడు. ఆ యువకుడు ఈ అధికారికి బంధువు ఆ యువడితోపాటు నేనూ తరచు ఈ అధికారి దగ్గరకు వస్తూండేవాణ్ణి పరిచయం ఏర్పడితే అప్పుడు ఢిల్లీ జైల్లోవున్న మిత్రుల గురించి తెల్సుకోవచ్చునని ఉద్దేశం.

ఇప్పుడు నన్ను ఖైదీ రూపంలో చూసేసరికి జైలు అధికారి మిస్టర్ చావలా ఆశ్చర్యపడడం లేక తొట్రుపడడం సహజం. నేనూ చావలాను గుర్తించాను. గుర్తించినట్టు కనబడనీయలేదు. నన్నొక చీకటి కొట్టులోకి పంపించారు. పడుకోవడానికి ఒక చాప, కంబళీ వున్నాయి. భోజనం రొట్టె నీళ్ళ పప్పు!

నేను నా అసమ్మతిని తెలియపరచాను. "నేను బి. క్లాసు ఖైదీని" అన్నాను.

"అలాగని మాకేమీ ఉత్తర్వులు రాలేదు" అన్నాడు జైలు అధికారి.

నాలుగు రోజులు భోజనం ముట్టలేదు అప్పటికి గానీ వాళ్ళకు ఉత్తర్వులు రాలేదు. బి క్లాసు ఖైదీకి ఉచితమైన సౌకర్యాలు లభించసాగాయి. మరో రెండు రోజుల తరువాత సాయం సమయాన నన్ను న్యాయస్థానానికి పంపించారు. ఢిల్లీ కుట్రకేసును విచారించడానికి సెక్రటేరియట్‌లో ఒక ప్రత్యేకమైన న్యాయస్థానాన్ని ఏర్పాటు చేశారు. అక్కడికి వెళ్ళాక నన్నొక గదిలో కూర్చోబెట్టారు. ప్రక్క గదిలో నుండి విచారణ తాలూకు శబ్దాలూ, మాటలూ అస్పష్టంగా వినిపిస్తున్నాయి. మిత్రుల్ని చూసే అవకాశం లభిస్తుందని ఉత్సాహంగా పిలుపుకోసం ఎదురు చూస్తున్నాను. కిటికిలో నుండి చూస్తూంటే పొద్దుకుంక వచ్చినట్టు నీడలు దీర్ఘమైనట్టు తెలుస్తూన్నది. 'ఐతే, రాత్రి ఏడెనిమది గంటలవరకూ విచారణ సాగుతుందేమో !" అనుకున్నాను.

నన్ను విచారణకు పిల్చారు. న్యాయస్థానంలో నా సహచరులు ఎవరూ లేరు. జడ్జి, ప్రభుత్వ వకీలు, నా తరపున వాదించడానికి ఢిల్లీ వాస్తవ్యుడు మిస్టర్ బెనర్జీ - మాత్రం ఉన్నారు. ప్రభుత్వ వకీలు "ముద్దాయి యశ్‌పాల్ న్యాయస్థానంలో వున్నాడు. ఐతే, ఈ కేసు తాలూకు విచారణ చాలావరకు జరిగిపోయింది. ఇప్పుడు మొదలెత్తుకుని మొదటినుండి విచారణను ప్రారంభించడం సంభవం కాదు. అనవసరమైన ఖర్చు కూడాను. కాలయాపన. ముద్దాయి యశ్‌పాల్‌కు మరో కేసులో 14 ఏళ్ళు కఠిన కారాగారవాస శిక్షపడడం వల్ల ప్రభుత్వం ఢిల్లీ కేసును ఎత్తేసుకుంటోంది !" అని ప్రకటించాడు.

నా వకీలు మిస్టర్ బెనర్జీ ఏ అభ్యంతరమూ చెప్పలేదు. కేసు ఎత్తి వేసుకోవడం జరిగింది. నన్ను మళ్ళీ అలాహాబాద్ పంపించారు. ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో అలహాబాద్ బండికోసం ఆగవల్సి

వచ్చింది. నన్ను రైల్వే పోలీస్ స్టేషన్‌లో రైలు వచ్చేవరకు వుంచారు. అదే స్టేషన్‌లోని ఒక కొట్లో ఢిల్లీ నివాసి కాకా 'శ్రీకృష్ణ' వున్నారు. కొట్లో బంధింపబడిన అతడు ఒక దానిమ్మ చెక్కనుండి గింజల్ని వలుచుకుతింటున్నాడు. అతడిని చూశాను. పలకరించలేదు విస్మయాన్ని ప్రకటించలేదు. అతడూ నన్ను చూశాడు స్టేషన్ ఇన్‌ఛార్జీని, ఒక్కక్షణం బయటకు రావడానికి అనుమతిని అడిగాడు. ఇన్‌ఛార్జి అనుమతించాడు. కాకా శ్రీకృష్ణ బయటకు వచ్చి కొన్ని క్షణాలు నన్ను చూస్తూ నిల్చుండిపోయాడు. తరువాత తన కొట్టులోకి వెళ్ళిపోయాడు. పరారీలో వుండగా కాక శ్రీకృష్ణ గారింటిలో నేను ఎన్నోసార్లు ఆశ్రయాన్ని పొందాను. ఆయన చాలా బాగా పాడగలడు. బహదూర్ షాహ్ గజల్ ఒకటి నాకు చాలా ఇష్టమైంది. ఆ గజల్‌ని కాకా చేత ఎప్పుడూ పాడించుకు వింటుండేవాడిని. ఆయనకు ఆ విషయం జ్ఞాపకం వచ్చి వుంటుంది. అత్యంత ఆర్ద్ర స్వరంలో బహదూర్‌షాహ్ గజల్‌ని ఆలపించసాగాడు. "లగతా నహీహై దిల్ మేరా ఉజడే దయార్ మే......" (ఈ ధ్వంస ప్రకృతిలో నా మనస్సుకు రమ్యత లేదు)

ఢిల్లీ కేసు కొట్టివేసుకుంది ప్రభుత్వం. పోతే, లాహోరు కేసు లాహోరులోనే నడుస్తుంది. ఐతే ప్రభుత్వం ఆ కేసును అసలు కోర్టులో దాఖలు చేయకుండానే ఎత్తివేసుకుంది.

నైనీ జైలుకు తిరిగివచ్చాను. తెల్లవాళ్ళుండే బ్యారక్కులోని వెనుకటి గదిలోనే వుంచారు. జైలు నియమాలు చాలా విచిత్రంగా వుంటాయి. విచారణలో వున్నంతవరకూ ఖైదీపట్ల కఠినంగా ప్రవర్తించడం జరుగుతుంది. నేరం రుజువయి, శిక్షపడ్డాక ఖైదీకి కొంతలో కొంత స్వాతంత్ర్యం సౌకర్యం లభిస్తాయి ! నా విషయంలోనూ అలాగే జరిగింది. నా గుర్తింపు కార్డుమీద "Specially dangerous but not amounting to personal assault" అని రాసి వుంది. అంటే 'కొట్లాడే ప్రమాదం లేకపోయినా, ఇతడిని జాగ్రత్తగా కనిపెట్టి వుండాలి' అని రాయడం జరిగింది. కనుక నన్ను ప్రత్యేకం జాగ్రత్తగా కనిపెట్టుతూండేవారు. సాధారణంగా విప్లవకారులైన ఖైదీల కార్డులమీద 'ప్రమాదకరమైన ఖైదీ' అని రాసి వుంటుంది. నేను 14 సంవత్సరాలు జైలు చేయలేదు 1937 లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. 38 మార్చి 2 వ తారీకున విడుదల అయ్యాను.

జైలు జీవితంలో పెద్దగా చెప్పవల్సింది ఏమీ కనుపించదు. కాంగ్రెసు వుద్యమంలోనూ లక్షలాది ప్రజలు జైలు జీవితాన్ని అనుభవించారు. ఐతే, వారి జైలు జీవితానుభవాలకూ, నా అనుభవాలకూ కొంత వ్యత్యాసం. భిన్నత్వం వుండవచ్చును. అందుకనే నా జైలు జీవితానుభవాల్ని గురించి రాస్తున్నాను.

యూరోపియన్లు వుండే బారక్కులో నేను చాలాకాలం వున్నాను. యూరోపియన్ ఖైదీలకు బి క్లాసు ఖైదీల సౌకర్యాలన్నీ లభిస్తూంటాయి. వీళ్ళు పొందే కొన్ని సౌకర్యాలు బి. క్లాసు ఖైదీలకు కూడా లభించవు. ఈ బారక్కులో వుండే యూరోపియన్ ఖైదీలు చాలా విచిత్రమైనవాళ్ళు.

జైలు నియమాల్లో 'ఖైదీలు దగ్గర డబ్బు వుంచుకోకూడ'దన్న నియమం ఒకటుంది. అయినా, ఈ నియమాన్ని ఎవరూ ఖాతరు చేయరు. ఏ సెంట్రల్ జైల్లోనేగానీ, వెయ్యి, రెండువేల రూపాయలు సునాయాసంగా దొరుకుతాయి ఖైదీల దగ్గర ! సెంట్రల్ జైళ్ళల్లో ఖైదీలూ పెద్ద సంఖ్యలో వుంటారనుకోండి. జైళ్ళల్లో ప్రత్యేకమైన పద్ధతిలో బేరసారాలూ జరుగుతూంటాయి.

ఆ రోజుల్లో జైల్లోకి పుగాకు, బీడి సిగిరెట్లు రాకూడదన్న నియమం వుండేది. ఈ నియమాన్ని గట్టిగా పాటించాలన్న తాకీదులూ వస్తుండేవి. ఐతే, ఖైదీలు, జైలు అధికార్ల కంటపడకుండా చుట్టా - బీడీ సిగిరెట్లను విరివిగా వాడుతూండేవారు.

చిట్టిపొట్టి అధికారుల్ని ఖైదీలు లెక్కపెట్టేవారు కాదు. సి. క్లాసు ఖైదీలు, భారతీయ ఖైదీలు వార్డర్ల ద్వారానే ఇళ్ళ దగ్గర నుండి డబ్బులు తెప్పించుకునేవారు. ఇలా డబ్బులు తెప్పించుకోడానికి

ప్రత్యేకమైన కమీషన్‌రేటు కూడా వుంది. రూపాయికి నాలుగణాల చొప్పున తెచ్చిపెట్టిన వార్డర్‌కి ఇవ్వాలి. సాధారణంగా ఇలాంటి డబ్బు తెచ్చి ఇచ్చే వ్యవహారాల్లో మోసమంటూ జరగదు. ఐతే, ఆంగ్ల ఖైదీలు డబ్బులు ఎక్కణ్నుండి తెప్పించుకోగలరు ? వాళ్ళకు ఈ దేశంలో ఇళ్ళు లేవు కదా ? కనుక తమకు ఇచ్చే రేషన్‌ని - అంటే డబుల్ రొట్టె, వెన్న, పంచదార - అమ్ముకుంటూ వుండేవారు. అలా అమ్ముకోగా వచ్చిన డబ్బుతో బీడీలు కొనుక్కునేవారు. సాధారణంగా జైళ్ళలో వస్తుమార్పిడి పద్ధతి అమల్లో వుంటుంది. ఒక డబల్ రొట్టె, లేక చటాకు వెన్న, పంచదార, ఇదీకాకపోతే మూడు చటాకుల మాంసం, ఇస్తే ఒక బీడాకట్ట ఇస్తారు. జైలు పరిస్థితులు తెలియనివారు ఈ రేటును చూసి ఆశ్చర్యపోవచ్చును. కానీ, నిజానికి ఆశ్చర్యపడవల్సింది ఏమీలేదు. రొట్టె, చక్కెర, వెన్న ప్రభుత్వం ఇస్తుంది. అవి సహజంగా లభిస్తాయి. కానీ, బీడీకట్టను జైల్లోకి తీసుకురావడానికి చాలా ఇబ్బందిపడవల్సి వుంటుంది. సాహసాన్ని ప్రదర్శించవల్సి వుంటుంది. బీడీకట్టలు తక్కువగా వస్తాయి. తాగేవాళ్ళు ఎక్కువమంది వుంటారు. బంగారం, వెండి, వజ్రవైఢూర్యాలు - మానవుడి నిత్యావసరాలైన ఆహారపదార్థాల కంటే చాలా ఎక్కువ ధరపెడితేగాని లభించవు ! ఎందువల్ల ? ఒకటి నిత్యావసర వస్తువుల కంటే వెండి బంగారం సమాజంలో చాలా తక్కువ పరిమాణంలో దొరుకుతాయి. రెండు బంగారాన్ని, వెండిని సంపాయించడానికి చాలా శ్రమ, ప్రమాదాల్ని ఎదుర్కోవల్సిన అవసరమూ వుంటుంది. జైళ్ళల్లో జరిగే ఈ వస్తుమార్పిడి వ్యాపారంలో బీడీకట్టే ప్రామాణిక నాణెం ! ఆ రోజుల్లోనే ఒక బీడికట్ట ఖరీదు అర్థణా వుండేది. ఆంగ్ల ఖైదీలు తమ ఆహార పదార్థాల్ని అమ్ముకుని బీడీకట్టల్ని కొనుక్కునేవారు. సాధారణంగా ఒక్కొక్క ఖైదీ రోజుకు కట్టబీడీలను కాల్చేవారు. కొందరు ఖైదీలు కట్టకు పైబడి కాల్చేవారు.

ప్రతి మంగళవారం ఖైదీలకు ధర్మోపదేశం చేయడానికి ఒక ఫాదరీ వచ్చేవాడు. ఇతడు మేజరు హోదా కలవాడు. బ్రిటీష్ సైనికులకు ధర్మోపదేశం చేయడం ఇతడి పని, ఆంగ్ల ఖైదీలకూ ధర్మోపదేశం చేస్తూండేవాడు. తమ సైనికుల మత విశ్వాసాన్ని అక్షుణ్ణంగా వుంచడం బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు ఎంతైనా అవుసరం మరి ! ఈ ఫాదరిగారు తాను వస్తూ, కొన్ని పాత సచిత్ర పత్రికల్ని తెస్తూండేవాడు. అవి ఇంగ్లాండు నుండి వచ్చిన పాతపత్రికలు. వాటిద్వారా ఆంగ్ల ఖైదీలకు కొంత మనోరంజనం కలిగించాలని ఇతడి ఉద్దేశం. ఆంగ్ల ఖైదీలు తమ తమ స్టూళ్ళను తెచ్చుకుని బయటకు వచ్చి కూచునేవారు. ఫాదరీగారు బైబిల్లోని కొన్ని పాటల్ని పాడించేవాడు. కన్యాత్వం చెడకుండానే, పవిత్రాత్మ ద్వారా మేరీ కనిన, భగవంతుని కొడుకుమీద విశ్వాసం వుంచండని చెప్పి వెళ్ళిపోయేవాడు. ఉపదేశాల ప్రభావం - రెండు మూడు గంటలసేపు ఖైదీలమీద పనిచేసేది.

ఫాదరిగారికి నా ఆత్మమీద కూడా దయ కలిగింది. నన్నూ బైబిల్ చదవమన్నాడు. ధర్మోపదేశం వినమన్నాడు. నేనూ అందరితోపాటు ధర్మోపదేశానికి హాజరవసాగాను.

ఒక మంగళవారం నాటి విషయం. అందరూ ఫాదరీ తెచ్చిన కొత్త సచిత్ర పత్రికల్ని చూడడంలో మునిగివున్నారు. డన్ అనే సిపాయి భగవంతుడి దయను గురించి, అతడి అంతులేని శక్తిని గురించి మాట్లాడుతూన్నాడు. ఎక్కడో చదివిన ఒక హాస్య సందర్భం జ్ఞాపకం వచ్చింది. డన్‌ని ఇలా అడిగాను.

"భగవంతుడు అంతులేని శక్తి కలవాడా ?"

"ఔను" డన్ అన్నాడు.

"ఐతే, ఒకటి చెప్పు ! భగవంతుడు తాను మోయలేనంత పెద్ద రాతిని తయారుచేయ గలడా ?" అనడిగాను.

డన్ కళ్ళు పెద్దవిచేసి నావైపు చూశాడు. "ఎందుకు చేయలేడు ? చేయగలడు !"

నా ప్రశ్నను మరోమాటు చెప్పి వివరించాను. "భగవంతుడు అలాంటి రాయిని గనుక తయారుచేస్తే, ఆ రాయిని మోసే శక్తి అతడికి వుండదు. అలాంటి రాయిని తయారుచేయడమనుకో ! అప్పుడు తను మోయలేని రాతిని తయారుచేసే శక్తి అతడికి లేదన్నమాట ! మరి నువ్వు భగవంతుడు 'సర్వశక్తిమంతుడు' అంటున్నావు కదా ?"

పై తర్కం విని డన్ కొంచెంగా చలించాడు. నేను ఇంకో ప్రశ్న వేశాను.

"ప్రకృతి నియమాల్ని ఎవరు నిర్ణయించారు ?"

"భగవంతుడు !"

ఐతే, భగవంతుడు తాను నిర్ణయించిన నియమాల్ని తాను అతిక్రమించాడెందుకనీ ? అతిక్రమించలేదంటావా ? కుమారి గర్భాన్న క్రీస్తు జన్మించడం ప్రకృతి నియమాన్ని అతిక్రమించడం కాదా ?" అన్నాను.

డన్ చాలాసేపు ఆలోచించాడు. అన్నాడు. "స్త్రీపురుష సంబంధం అపవిత్రమైంది. కనుకనే భగవంతుని కుమారుడు స్త్రీ పురుష సంబంధం ద్వారా పుట్టలేదు !"

నేను మళ్ళీ ప్రశ్నించాను. "ప్రకృతిలో స్త్రీపురుష సంబంధాల్ని ఏర్పరచింది ఎవరు ?"

"భగవంతుడు !"

"మరి అపవిత్రమైన సంబంధాల్ని ఏర్పాటు చేసిన భగవంతుడు అపవిత్రుడూ, పాపికాడా ?" అనడిగాను.

డన్ ఆ వారం అంతా ఈ సమస్య గురించే ఆలోచిస్తూ గడిపాడు. మంగళవారం నాడు ఫాదరీరాగానే ఈ సమస్యను అతని ముందు పెట్టాడు. ఫాదరీ, డన్‌ను అడిగాడు. "భగవంతుడు ఉన్నాడని నీవు నమ్ముతున్నావు కదా ? అతడీ ప్రపంచాన్ని సృష్టించాడనీ, సర్వశక్తి సంపన్నుడనీ ఒప్పుకుంటున్నావు కదా ?"

డన్ ఔనని తలవూపాడు.

తరువాత ఫాదరి అన్నాడు. "సర్వశక్తి సంపన్నుడైన భగవంతుడు మహిమాన్వితుడు. అతడు తన మహిమ ద్వారా ఎన్నో చమత్కారాల్ని చేయగలడు. నిష్కళంక ఐన కుమారి గర్భం నుండీ క్రీస్తును పుట్టించాడు. అనవసరమైన తర్కాలకు పోకూడదు పాపం తగుల్తుంది !"

డన్‌కు తృప్తి కలిగింది. అతడి సమస్య తీరింది. అనంతరం ఫాదరీ అడిగాడు. "అసలీ సమస్య నీ బుర్రలోకి ఎలా వచ్చింది ?"

డన్ నా పేరు చెప్పాడు.

ఫాదరీ ఏకాంతంలో నాతో అన్నాడు "వీళ్ళు చదువుసంధ్యలు లేనివాళ్ళు. ఇలాంటివి వీళ్ళకు చెప్పకూడదు. విశ్వాసం అనేది వీళ్ళకు ఎంతో అవసరం. ఆ విశ్వాసం కారణంగానే శాంతిగా వుంటారు. వీళ్ళ శాంతిని మనం భంగపరచకూడదు !"

ఆంగ్ల ఖైదీల బారక్కుకు ప్రక్కనే ఓ చిన్న గదిని ఏర్పాటు చేసి, ప్రస్తుతం పాకిస్తాన్ రవాణా మంత్రిగా వున్న (1953) ఖాన్ సాహబ్‌ను వుంచారు. అతడు అనుమానితుడుగా బంధింపబడ్డాడు. ఆ రోజుల్లో అతడి దినబత్తెం పదిపన్నెండు రూపాయిలు వుండేది. ఇప్పుడైతే (1953) యాభై అరవై రూపాయిలు అవుతుంది. ఖాన్‌సాహబ్‌తో అప్పుడప్పుడూ రహస్యంగా మాట్లాడుతూండేవాణ్ణి. ఆయనకు పండ్లూ - ఇతర తినుబండారాలూ అశేషంగా వస్తూండేవి. వాటిని ఆంగ్ల ఖైదీలకు కూడా పెట్టేవాడు. అందువల్ల ఆంగ్ల ఖైదీలు మేము మాట్లాడుకోవడాన్ని ఎవరికీ చెప్పేవారుకాదు. ఖాన్‌సాహబ్ తనకోసం తెచ్చిన తినుబండారాలను నాకూ పెట్టబోయేవాడు. ఐతే చాలా వినయంగా తిరస్కరించేవాడిని. కాగా,

పుస్తకాలనూ ఇస్తూండేవాడు. వాటిని తిరస్కరించేవాణ్ణి కాదనుకోండి ! బుఖారిన్ రాసిన "హిస్టారికల్ మెటీరియలిజం" అనే పుస్తకాన్ని వీరిదగ్గర తీసుకున్నాను. ఆ పుస్తకాన్ని ఖాన్‌సాహబ్‌కు జవహర్‌లాల్ నెహ్రూ తెచ్చి ఇచ్చారుట !

ఇక్కడి హెడ్‌జైలర్ పేరు టైని. చాలా అనుభవము, తెలివీకల వ్యక్తి. ఎవరైనా చాడీలు చెప్పినా అంతగా పట్టించుకునేవాడు కాదు. ఖాన్‌సాహబ్, నేనూ మాట్లాడుకుంటూన్న విషయం ఎవరో టైనీ చెవిన పడేశారు. "మాట్లాడుకుంటే మాట్లాడుకోనివ్వు ! వచ్చిన నష్టం ఏముంది ? అంత మాత్రాన జైలుగోడలు పడదోసుకుపోలేరు కదా ?" అనేశాడు టైనీ.

టైనీ ప్రౌఢ వయస్సులో వున్నాడు. మంచి గృహస్థు. కుటుంబం పెద్దది. ప్రథమ యవ్వనపు పొంగులో భార్యనే కాకుండా మరో వుంపుడుగత్తెనూ చేరదీశాడు. ఇప్పుడు రెండు కుటుంబాల్ని పోషించలేక సతమతం అవుతూన్నాడు. గేదెల్ని పెట్టాడు. ఆ గేదెల్ని, ఖైదీల రేషన్‌తో, జైలు తాలూకు పశువుల మేతతో - పోషిస్తూ, వాటి పాలను అమ్ముకుంటూ వుంటాడు. కనుకనే ఖైదీలను అనవసరంగా బాధించడు. అప్పుడప్పుడూ జమాదార్‌గానీ, చిన్న అధికార్లు గానీ, ఖైదీలను సోదాచేసి వారిదగ్గర డబ్బు వుంటే, జైలర్‌కు చూపి, 'శిక్షించండి' అని చెప్తూంటారు.

అలాంటి సందర్భం వచ్చినప్పుడు టైనీ అంటూంటాడు "ఖైదీల్తో మనకు తగాదా ఎందుకు? డబ్బు వుంచుకోనీ నాయాళ్ళని ! కాదు కూడదంటే ఆ డబ్బులన్నీ ప్రభుత్వానికి పోతాయి. అలాకాక ఖైదీల దగ్గర వుంటే - మనకూ ఇస్తూంటారు !"

టైనీ అంటే ఖైదీలకు చాలా ఇష్టం. ఖైదీలు చాలా ఆదరంగా 'టైనీబాబా' అని పిలుస్తూంటరు అతడిని. కొద్దీగొప్పా లంచం పుచ్చుకున్నా ఖైదీల అవుసరాల్ని తీరుస్తూ వుంటాడు. టైనీ లంచం తెమ్మని ఖైదీల్ని వేధించడమూ చేయడు. ఎవడు ఎంత ఇస్తే అంతే పుచ్చుకుంటాడు. కొందరు అతడి చెప్పుల్లో పావలా కాసుపడేసి నమస్కారం పెట్టేసేవారు.

ఆంగ్లేయుల బారక్కులో ఆరునెల్లు గడిపాను. పరస్పర ద్వేషంతో ఆ ఆంగ్లసిపాయీల మధ్య ఎక్కువ రోజులు వుండలేకపోయాను. అధికారుల్ని ఏమీ కోరకూడదనీ, ఎలాంటి అభ్యర్థననూ చేయకూడదనీ - అనుకున్నాను. కానీ, అధికారుల్ని అభ్యర్థించక తప్పలేదు. ఎక్కువ రోజులు అక్కడి వాతావరణాన్ని భరించలేకపోయాను. ఒకరోజున పై అధికారుల్తో అన్నాను. "అసభ్యులైన ఈ ఆంగ్ల సిపాయీల్తో కలసి వుండడం నాకు ఇష్టం లేదు !"

నన్ను ఇతర బి క్లాసు రాజకీయ ఖైదీల్తోపాటు వుంచుతారనుకున్నాను. కానీ అలా చేయలేదు. నైనీ జైల్లో ప్రత్యేక ఏకాంతంలో వుంచారు.

నైనీ జైల్లో రెండు గదులు, వరండా, స్నానాల గదిగల ప్రత్యేకమైన బ్లాకులో నన్ను వుంచారు. చుట్టూ బాగా ఎత్తయిన గోడవుంది. ఆ బ్లాకుకు 'కుక్కలదొడ్డి' అన్న పేరుంది. పేరు అలా వున్నా, ప్రదేశం బాగానే వుంది. ఒకప్పుడు జవహర్‌లాల్ నెహ్రూనూ - మౌలానా ఆజాద్‌నూ ఈ బ్లాకులో వుంచారు. ఐతే వాళ్ళు ఇప్పుడు నైనీ జైల్లో లేరు బహుశ డేహ్రాడూన్ జైలుకు పంపించబడి వుంటారు. జవహర్‌లాల్ నెహ్రూ ఉదయం సాయంత్రం వ్యాయామం చేసేవారు. వ్యాయామంలో భాగంగా చుట్టూ వున్న ఎత్తయిన ప్రహరీ గోడ ననుసరించి పచారు చేయడమో, పరుగెత్తడమో చేసేవారు. నేనలా చేయడానికి అనుమతి నివ్వలేదు. ఒంటరిగా వుండడం వల్ల పగలంతా చదువుతూండేవాణ్ణి. ఇక్కడే "స్వయం శిక్షక్" సాయంతో ఫ్రెంచ్ భాషను అభ్యసించాను. కథలూ రాస్తూండేవాణ్ణి. అలా ఒక సంవత్సరం గడిచింది.

నా కార్డుమీద మేజోళ్ళు అల్లేపనిని రాశారు ఐతే, టైనీబాబా ఎన్నడు నాకాపనిని ఇవ్వలేదు. నూలు, దారం, సూదులూ - ఇవసలు నాకు పంపనే లేదు. ఇంకా నావంతు పనిని పూర్తి చేయలేదన్న

ప్రశ్నే రాలేదు. సమయం గడవడం కోసం పొద్దుకులూ చదువుతూనో, రాస్తూనో వుండేవాణ్ణి. మొదట ఇంగ్లీషులో రాయడం ప్రారంభించాను. కానీ, తరువాత హిందీలోనే రాయాలని నిర్ణయం చేసుకున్నాను. మాతృభాషలో రాసి, మాతృభాషను సంపన్నం చేయడం కర్తవ్యం అనిపించింది. అందువల్లనే హిందీలో తప్ప మరే భాషలోనూ రాయకూడదన్న ప్రతిన బూనాను. పగలంతా తీరిక, నేను రాసిన రచనలను మళ్ళీ మళ్ళీ చదివేవాడిని ! కఠినంగా విమర్శించుకునేవాడిని. తిరిగి రాస్తూండేవాడిని !

నైనీ జైలు సూపరింటెండెంట్ మారిపోయాడు. మేజర్ ఒబేరాయ్ స్థానంలో మేజర్ సలామత్ వుల్లా వచ్చాడు. ఒబేరాయ్ చూసీ చూడనట్టు పోయే మనస్తత్వం గలవాడు. ఆఫీసరుగా తన కర్తవ్యాన్ని అంతగా పాటించేవాడు కాదు. ఖైదీల్ని బాధించేవాడు కాదు. ఐతే, సలామత్‌ఉల్లా ఖైదీలపట్ల చాలా కఠినంగా ప్రవర్తిస్తాడని చెప్పుకునేవారు. కానీ, నాకు తెల్సినవరకూ ఇతడూ ఖైదీలపట్ల ఏమంత కఠినంగా ప్రవర్తించేవాడు కాదనే చెప్పవచ్చు. కాకపోతే, ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తూ వుండాలంటాడు. ఒకరోజున అతడే అడిగాడు "ఇక్కడ ఒంటరిగా మీరేమీ ఇబ్బంది పడడం లేదుకదా ?"

"ఏం చేయమంటారు ? తప్పదు కదా ? ఒంటరిగా వుంచారు కనుక వుంటున్నాను. ప్రభుత్వమే ఇలా ఒంటరిగా వుంచమని ఆజ్ఞ ఇచ్చిందేమో తెలియదు ! ఇలా నన్ను ఏకాంతవాసంలో వుంచడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటో కూడా నాకు తెలియదు !" అన్నాను.

ముల్లాగారు నన్ను ప్రక్కనే వున్న మరో బ్లాకుకు మార్చారు. అక్కడి బి. క్లాసు ఖైదీల్తో కల్సి వుండసాగాను.

బి. క్లాస్ బ్లాకులో వున్న నలుగురు ఖైదీల్లోనూ ఇద్దరు రాజకీయ ఖైదీలు. ఒకరు కాకోరీ కుట్రకేసు తాలూకు గోవిందచరణసింహ్‌కార్, మరొకరు బరేలీ కాల్పులకు సంబంధించిన ఠాకూర్ టీకమ్‌సింహ్ మేము ముగ్గురం చాల కలసి-మెలసి వుండసాగాము. కార్‌దాదా బెంగాలీ భాషపట్ల నాకు గల అనురాగాన్ని చూసి ముగ్ధుడయ్యాడు. బెంగాలీ చదివించసాగాడు. రెండు మూడు నెలల్లో నా అంతట నేనే పుస్తకాలు చదవగల స్థితికి వచ్చాను. కార్‌దాదా చాలా ఇష్టంగా బెంగాలీ భాష చదివించేవాడు. నన్ను ఫతేహ్‌గఢ్ సెంట్రల్ జైలుకు మార్చారు. నేనక్కడికి వెళ్ళేప్పుడు కార్‌దాదా తనదగ్గర వున్న ఎన్నో బెంగాలీ గ్రంథాల్ని నాకు ఇచ్చి పంపించాడు.

ఠాకూర్ టీకమ్‌సింహ్ మంచి బలవంతుడు. ఒడ్డూ పొడుగూ కలిగి మంచి దారుఢ్యం కల వ్యక్తి ! శరీరం ఎంత గొప్పదో, దానికి తగినట్టుగానే అతడి ప్రవర్తనా స్వభావం కూడా గొప్పగా వుండేవి. 1932 నాటికి ఠాకూర్ సాహబ్ దాదాపు 12 సంవత్సరాల జైలు జీవితాన్ని గడిపాడు. అతడి కథ బ్రిటీష్ న్యాయానికి ఓ మచ్చుతునక ! జిల్లా మెజిస్ట్రేట్ మీద రాజకీయ కారణంగా తుపాకి కాల్పులు జరిపాడన్న ఆరోపణపై బరేలీ న్యాయస్థానం టీకమ్‌సింహకు 12 సం॥లు కఠిన కారాగారశిక్ష విధించింది. రాజకీయ ఖైదీలకూ, ఇతర ఖైదీలకూ ప్రత్యేకమైన వ్యత్యాసం ఒకటుంది. ఇతర ఖైదీల్ని వాళ్ళ అపరాధాల్ని గురించి అడిగితే ఇలా చెప్తారు "మా శతృవులూ, పోలీసులూ - కల్సి లేనిపోని అపరాధాల్ని మా నెత్తికి చుట్టి జైల్లో పెట్టించారు !' అంటారు. ఇతర ఖైదీలు ఇలా చెప్పడానికి ఒక కారణం వుండవచ్చును. ఇలా చెప్తూంటే తమ కేసుమీద ఏ మాత్రమైనా ప్రభావం పడవచ్చును. లేదా శిక్ష కొంత తగ్గవచ్చును అని వాళ్ళ ఉద్దేశ్యమేమో ! ఇలాంటి మిథ్యాప్రలోభం వాళ్ళల్లో వుండి వుంటుంది. బాగా పరిచయం అయితే అపరాధాన్ని అంగీకరిస్తూ నిజాన్ని చెప్పేవాళ్ళూ కొందరుంటారు. రాజకీయ ఖైదీలు ఇందుకు పూర్తి విరుద్ధంగా చెప్తారు. తమ కార్యక్రమాల గురించి, తాము చేసిన పనుల గురించి - నిర్భయంగా చెప్పేస్తారు. అత్యుక్తులు కూడా చెబుతారు. అత్యుక్తులూ, అతిశయోక్తులూ చెప్పడం వల్ల ఇతర్లలో సాహసబీజాల్ని నాటవచ్చునన్న భావన వుండవచ్చును వారిలో. ఇలా అత్యుక్తులు చెప్పడం వల్ల కొంత సంతృప్తి కూడా లభించవచ్చును వారికి !

టీకమ్‌సింహ్ మెజిస్ట్రేట్‌మీద తుపాకి కాల్పులు జరపలేదనీ, ఆ కేసుతో తనకు ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టంగా చెప్పాడు. టీకమ్‌సింహ్ స్వతంత్రమైన రాజకీయ భావాలు కలవాడు. మెజిస్ట్రేట్ మీద కాల్పులు జరిపిన అపరాధిని పోలీసులు పట్టుకోలేకపోయారు. కానీ, తమ అసమర్థతను కప్పిపుచ్చుకోడానికి ఆ అపరాధాన్ని టీకమ్‌సింహ్ నెత్తికి చుట్టారు. ఇతడు బరేలీ హైస్కూల్లో చదువుతూన్నాడు. మంచి బలవంతుడు. ధైర్యశాలి. ఇంకేం వుంది, పోలీసులు ఈ కేసులో ఇరికించారు. టీకమ్‌సింహ్ స్పష్టవాది. అబద్ధం ఆడడు. "శిక్ష ఎటూ అనుభవించాను. అబద్ధం చెప్పవలసిన పనిలేదు. నేనసలు ఈ పని చేయలేదు !" అతడన్నాడు.

బ్రిటీష్ ప్రభుత్వం రాజకీయ ఖైదీలకు బి. క్లాసు సౌకర్యాల్ని ఏర్పాటు చేసింది. ఐతే, టీకమ్‌సిర్‌కు బి. క్లాసు సౌకర్యాల్ని కల్పించడానికి ప్రభుత్వం అంగీకరించలేదు. బి. క్లాసు రాజకీయ ఖైదీ హోదా కోసరం అరవై రోజులు నిరశన వ్రతం చేశాడు. బలమైన మనిషే అయినా, ఆరోగ్యం దెబ్బతిన్నది.

ఇతరులచేత గౌరవింపబడాలన్నది మానవుడి స్వభావంలోని ఒక భాగం. తమ చదువు, సంస్కారాన్ని బట్టి, తమ భావాల్ని బట్టి - వాటికి అనుగుణంగా వ్యవహరిస్తూ మనుష్యులు ఇతర్ల నుండి గౌరవాన్ని పొందడానికి ప్రయత్నిస్తూ వుంటారు. ఈ ప్రవృత్తి జైళ్ళల్లోనూ కనుపిస్తూంటుంది. జైళ్ళల్లో తాను బీదకుటుంబంలోంచి వచ్చానని చెప్పుకునే ఖైదీ చాలా అరుదుగా గానీ కనుపించడు ! అందుకనే జైళ్ళల్లో ఓ సామెతను చాలా ప్రసిద్ధిగా చెప్పుకుంటారు.

'తమ వూర్లో ప్రతి ఒక్కడి ఇంటిమీదా యాభై రెండు కుంటల పాదీనాకు కూర కాస్తూంటుంది.'

(పై సామెతకు తుల్యమైంది తెలుగులోనూ ఒక సామెత వుంది - మా తాత గుమ్మడికాయంత బంగారం కుక్క ముట్టుకుంటే అవతల పారేశాడు.)

దొంగతనం అపరాధం కారణంగా జైలుకు వచ్చినవాళ్ళను "ఇంటిదగ్గర అంత స్థితి వున్నప్పుడు మరి దొంగతనాలు ఎందుకు చేశారు ?" అని అడిగితే, అంటారు "డబ్బుకోసం కాదండి మేం దొంగతనం చేసింది ! అలాంటి స్నేహాలు పట్టాము. అలవాటయింది ! అదో సరదా! అంతే !"

మరి జైళ్ళల్లో ఏదైనా గొప్ప పనిచేసి గౌరవాన్ని పొందడం సంభవం కాదుగదా ? కనుకనే, ధనిక కుటుంబానికి చెందినవాణ్ణని చెప్పుకుని తేలిగ్గా గౌరవాన్ని పొందాలని చూస్తూంటారు. ఇలాంటి గౌరవం పొందడానికి తాను ధనికుడు కావల్సిన అవసరం లేదు. కేవలం చెప్పుకోవడమే గదా ? ఇలాంటి మిథ్యాగౌరవాన్ని పొందాలనే దురద ఒక్కో రాజకీయ ఖైదీకి పుట్టడమూ కద్దు ! నాతోపాటు వుండే ఒక రాజకీయ ఖైదీకి తీపి అధికంగా తినడం అలవాటు. అతడు రహస్యంగా బెల్లం తెప్పించుకోడానికి ప్రయత్నించాడు. బయటకు వెడుతూన్న తోటి ఖైదీకి డబ్బులు ఇచ్చి బెల్లం తెప్పించుకున్నాడు. రహస్యం వెల్లడయింది. జైలు అధికారులకు తెలిసింది. బెల్లం తెప్పించుకున్న రాజకీయ ఖైదీ ఓ తిరుగుడు చేశాడు. బెల్లం అంటే గౌరవానికి భంగకరం అనుకుని, మరింత డబ్బులు ఖర్చుచేసి బెల్లం స్థానంలో పంచదార తెప్పించి పెట్టుకున్నాడు. బెల్లం తెప్పించుకున్నాడంటే పల్చన. పంచదార తెప్పించుకున్నాడంటే 'గొప్ప !' అదీ భావన !

గౌరవాన్ని పొందడం లేక పేరు తెచ్చుకోవడం ముఖ్యం అనుకున్నప్పుడు కొంటె పనులూ, చెడ్డపనులూ చేసి కూడా పేరు తెచ్చుకోవడం కద్దు ! జైల్లో కొందరు ఖైదీలు రౌడీలుగా పేరు తెచ్చుకోవడానికి తాపత్రయ పడుతూంటారు. అందుకు తేలికైన వుపాయం, సూపరింటెండెంట్‌నుగానీ, జైలర్‌నిగానీ పట్టుకుతన్నడం ! సూపరింటెండెంట్ మీదగానీ, జైలర్‌మీద గానీ, చెయ్యి చేసుకుంటే చాలా కఠినమైన శిక్ష అనుభవించవల్సి వుంటుంది. శిక్ష అనుభవించడం కష్టమే అయినా, పేరు మాత్రం బ్రహ్మాండంగా పాకిపోతుంది. ఐదూ పది ఖర్చుపెట్టగల ఖైదీలు కొందరుంటారు. అలాంటి ఖైదీలు పై

చెప్పినలాంటి బద్మాష్‌లకు పెట్టుబడి పెట్టి తద్వారా జైల్లో తమ దర్పాన్ని నిలుపుకోచూస్తారు. ఒకమాటు ఇలాంటి బద్మాష్‌తో టీకమ్‌సింహ్ తలబడవల్సి వచ్చింది.

ఒకమాటు టీకమ్‌సింహ్‌కు మరో ఠాకూర్ ఖైదీకీ మాటామాటా వచ్చింది. టీకమ్‌సింహ్ అతడిని చీవాట్లు పెట్టాడు. మరుసటిరోజున ఒక యువఖైదీ దూరంగా నిలబడి ఇతడిని చూసి తొడ కొట్టడం ప్రారంభించాడు. ఒకటి రెండుసార్లు టీకమ్‌సింహ్ చూసేట్టు దండేలూ - బస్కీలూ - గుంజీళ్ళూ తీశాడు. టీకమ్‌సింహ్ చాలా గంభీరమైన స్వభావం కలవాడు. అంతమాత్రానికి కోపం తెచ్చుకునే వ్యక్తికాదు. ఒకమాటు ఆ యువఖైదీని దగ్గరకు పిల్చి "ఏమిటి విషయం ? మనిషివి నిలవలేకండా వున్నావు ?" అని అడిగాడు.

టీకమ్‌సింహ్ భారీ విగ్రహాన్ని దగ్గరగా చూసి యువఖైదీ భయపడిపోయాడు. దణ్ణంపెట్టి "అయ్యా, నా తప్పేమీలేదు! ఠాకూర్ ఖైదీ ఎలాగ్గైనా మిమ్మల్ని అవమానపర్చమన్నాడు. అవమానపరిస్తే, రెండు రూపాయిలూ, రోజూ అర్ధసేరు పాలచొప్పున ఒక నెలరోజులు తన వంతుపాలూ నాకు ఇస్తానన్నాడు. బాగా కసరత్తు చేయమన్నాడు. మీదాసుణ్ణి ! క్షమించండి ! మీమీదకు నేను రాగలనా ? ఊరకా ఠాకూర్‌కి చూపించడం కోసం దూరం నుండి తొడకొడుతూన్నాను ! అంతే !" అన్నాడు.

టీకమ్‌సింహ్ పెద్దగా నవ్వాడు. "అరే, పొట్టేగా ! నెలరోజులు హాయిగా పాలుతాగు ! బాగా తొడకొట్టు ! నాకేమీ నష్టంలేదు !" అన్నాడు.

ఒక్కోమాటు ఇలాంటి చిలిపి తగాదాల్లో రాజకీయ ఖైదీలు చిక్కుకునే ప్రమాదమూ ఎంతైనా వుంది. సాధారణంగా రాజకీయ ఖైదీని ఇతర ఖైదీలు గౌరవంగానే చూస్తారు. ఐతే కొందరు ఖైదీలకు రాజకీయ ఖైదీలు ఇలా గౌరవాన్ని పొందటం కంటకప్రాయంగా వుంటుంది. అలాంటివాళ్ళు రాజకీయ ఖైదీల్తో అకారణంగానే పోట్లాటకు దిగుతారు. పోతే, రాజకీయ ఖైదీల్ని అవమానపరచడం కోసం జైలు అధికారులే ఒక్కోమాటు ఇతర ఖైదీల్ని వాళ్ళమీదకు ఎక్కేస్తూ వుంటారు.

అవధ నివాసి ఓ ఠాకూర్ సాబ్ జైల్లో పరిచయం అయ్యాడు. అతడో జమీందారుకు బంధువు కావడం వల్ల బి. క్లాసు రాజకీయ ఖైదీల్తో పాటు వుంచారు. అతడికి చదువు బొత్తిగా రాదు. కూడబలుక్కుని నాలుగు పంక్తులు చదవగలడేమో ! ఐతే, 'రాజాసాహబ్' అని పిలిపించుకోవడం అతడికి చాలా ఇష్టం ! అతడి ఇష్టప్రకారమే అందరూ అతణ్ణి రాజాసాహబ్ అని పిలిచేవారు. మేమూ అలాగే పిల్చేవారం అతడి అసలు పేరు జీత్‌సింగ్ ! ఐతే, మేము అతడి పేరుకు 'బహద్దూర్' అనే కొసనొకదాన్ని తగిలించాము. 'జీత్ బహద్దూర్ సింగ్' అని మొదట కొన్నాళ్లు పిల్చాము. ఆ తరువాత అతడి పేరు 'విజయజీత్ బహద్దూర్ సింగ్'గా మారింది. మరి కొన్నాళ్ళకు 'విజయప్రతాప్ జీత్ బహద్దూర్‌సింగ్' అయింది. రాజా అన్న పదం కూడా వుండవం అవుసరం గనుక 'రాజా విజయప్రతాప్ జీత్ బహద్దూర్ సింగ్'గా అతడి పేరు స్థిరమైంది. ఇలా పేరు దిన దిన ప్రవర్ధమానంగా పెరుగుతూన్నకొద్దీ ఠాకూర్ సాబ్ గర్వమూ సమపాళ్ళల్లో పెరిగింది. ఈ రెండింటినీ అనుసరించి కోరమీసాలూ పెరిగాయి. ఈ ఠాకుర్ సాహబ్‌గారు ఉర్దూలోనే సంతకం పెడుతూండేవారు.

విప్లవకారులైన ఖైదీలు హిందీ, ఇంగ్లీషు పుస్తకాల్ని, వివిధ పత్రికల్ని తెప్పించుకుంటూ వుండేవారు. ఇలా పుస్తకాల్ని తెప్పించుకుంటూండడం వల్ల విప్లవకారులు బాగా చదువుకున్నవారనీ, పండితులనీ జైలు అధికారులు భావించేవారు. గౌరవించేవారు. ఒకరోజున ఠాకుర్ సాహబ్ నన్ను పిల్చి "నేను కొన్ని పుస్తకాలను తెప్పించుకుంటాను. జైలు సూపరింటెండెంట్‌కు అప్లికేషన్ ఒకటి రాసి ఇవ్వండి !" అని అడిగాడు.

"పుస్తకాల పేర్లు చెప్పండి !" అడిగాను.

"పుస్తకాల పేర్లు నాకేం తెల్సు ? మీకు తెల్సిన పుస్తకాల పేర్లు నాలుగు రాయండి. ఇంగ్లీషు పుస్తకాల పేర్లే రాయండి. బాగా లావుపాటివి. బైడ్లు, మిలమిల్లాడుతూండాలి. అరమరలో పెట్టుకోడానికి వీలుగా వుండాలి !" అన్నాడు.

నాకు తెల్సిన మంచి మంచి పుస్తకాల పేర్లు రాసి, సూపరింటెండెంట్‌కు అప్లికేషన్ ఒకటి పెట్టాను, ఠాకుర్ సాహబ్ పేరుమీద ! ఠాకుర్ సాహబ్ కూడా పెద్ద పెద్ద పుస్తకాలు తెప్పిస్తున్నారన్న విషయం నలుగురికీ తెల్సిపోయింది. ఐతే, ఎన్నాల్టికీ రాకపోవడంతో సూపరింటెండెంట్‌ను కారణం అడిగాను. అతడు 'రాజాసాహెబ్ ఖాతాలో డబ్బులు ఏమీ లేవని' చెప్పాడు !

రాజాసాహెబ్ గప్పాలు కొట్టడంలో మొనగాడు. తాను రాజకీయ ఖైదీననే చెప్పుకునేవాడు. నిజానికి అతడు రాజకీయ ఖైదీకాదు. తాను మనసుపడ్డ ఒకానొక రజకవనిత భర్తను కడతేర్చడానికి ప్రయత్నించిన సందర్భంగా జైలుపాలు అయ్యాడు. వికృతమైన లైంగిక అలవాట్లు కలవాడు కావడం వల్ల, అతడి అసభ్యకరమైన లైంగిక చేష్టల వల్ల బి. క్లాసు ప్రతిష్ఠ దెబ్బతింటున్నదని బాధపడేవాళ్ళం. అతడు కూడా రాజకీయ ఖైదీలమైన మా ఎదుట వెర్రి వెర్రి వేషాలు వేయడానికి జంకేవాడు.

బయటి సమాజంలోని అన్నిరకాల హీనప్రవృత్తులూ, కుత్సిత ప్రవర్తనలూ - జైళ్ళల్లోనూ కనబడుతూనే వుంటాయి ! ఈర్ష్యా, ద్వేషం, అహంకారం జైళ్ళల్లోనూ ప్రత్యక్షం అవుతూ వుంటాయి ! కొందరు తమ దుర్వ్యసనాల్ని బాహాటంగా ప్రదర్శిస్తూ, తద్వారా గౌరవాన్ని సంపాయించాలని తాపత్రయపడుతూ వుంటారు. కొజ్జాల్ని మచ్చిక చేసుకోవడం, వంటికి అతుక్కున్నట్టున్న గుడ్డల్ని వేసుకు ఒయ్యారాన్ని ఒలకబోస్తూ తిరగడం - అలా లైంగిక వాంఛల్ని ప్రదర్శించడం చేస్తూ వుంటారు కొందరు ! తాను తప్పు చేశానని బాధపడే ఖైదీనిగానీ, అలాంటి తప్పుల్నుండి తనను తాను రక్షించుకోడానికి ప్రయత్నించే ఖైదీని గాని నేను చూడలేదు. ఈ సమాజంలో న్యాయాన్ని పరిరక్షించాలన్న లక్ష్యంతో పాలకజాతి కొందర్ని ఖైదుల్లో పెట్టి వారిపట్ల పగసాధిస్తూ వుంటుంది. ఖైదుల్లో పెట్టబడ్డ పాలితుల్లోని అట్టడుగు ప్రజలకు తమకు చాతనయిన పద్ధతిలో పాలకజాతి నియమాల్ని బద్దలు కొడుతూంటారు.

అనేక జైళ్ళల్లో, అనేకమంది ఖైదీలను కల్సుకున్నాను. వారితో మాట్లాడాను. అందరి ఖైదీలకు ఏదో రకంగా దేవుడిపట్ల విశ్వాసం వుంది. నమ్మకం వుంది. ఒక్క విప్లవకారులైన ఖైదీలు మాత్రం దేవుణ్ణి, మతాన్ని అంగీకరించరు. విప్లవకారులు మినహా మిగిలిన ఖైదీలందరూ భగవంతుణ్ణి కొలిచేవారే అయినా, అసమాజికమైన, సమాజానికి అహితకరమైన పనులు చేయడంలో వారు ఎవరికీ తీసిపోరు. భగవద్భక్తికీ, సామాజిక సంబంధాలకూ లేక ప్రగతికీ - ఎలాంటి సంబంధమూ లేదని వారి ఉద్దేశం ! కనుకనే, ఒకవైపు దేవుణ్ణి కొలుస్తూనే వుంటారు, మరోవైపు సామాజిక అపరాధాల్ని చేస్తూనే వుంటారు. జైళ్ళల్లో శిక్ష అనుభవించేప్పుడు కూడా ఈ భగవంతుని మీద విశ్వాసం గల ఖైదీలు భవిష్యత్తులో నేరాలు చేయకూడదనుకోరు. నేరాల్ని చేయాలిసిందే ! ఐతే, జాగ్రత్తగా పట్టుపడకుండా చేయాలనుకుంటారు. తోటి ఖైదీలు ఒక్కో నేరం నుండి ఎలా తప్పించుకున్నారో తెల్సుకుని తద్వారా తమ నేర్పుకు పదును పెట్టుకుంటారు.

విప్లవకారులైన ఖైదీలను రెండున్నర సంవత్సరాలకంటే ఎక్కువ కాలం ఏ జైల్లోనూ వుంచరు. పలుకుబడిని పెంచుకునీ, శిష్యబృందాన్ని ఏర్పరచుకునీ - జైళ్ళల్లోంచి పారిపోతారేమోనన్న భయం ప్రభుత్వానికి ఎప్పుడూ వుంటుంది. అలాంటి భయం ప్రభుత్వానికి వుండడం అనవసరమనీ అనలేము. ప్రభుత్వం ముందు తలవంచని విప్లవకారులు, తమకు విధించిన జన్మ ఖైదును తిరస్కరించి పారిపోవడానికి ప్రయత్నించడమూ సహజమే కదా ? మా మిత్రుడు కీ.శే: శచీంద్రనాథ్

సన్యాల్ జైల్లోంచి తప్పించుకుపోవడానికి ఎప్పుడూ ఏదో ఒక ఉపాయాన్ని ఆలోచిస్తూండేవాడు. ఒకమాటు ఇనుపచువ్వల్ని కోసి పారిపోవడానికి రంపం లాంటి సాధనాల్ని తెప్పించాడు. తరువాత అతడి ప్లాను బయటపడ్డది. ఆ సామాన్లను పట్టేశారు. ఆయనమీద మరి కూడా గట్టి నిఘా వుంచారు. శచీంద్రనాథ్ సన్యాల్ ఒకవైపున పారిపోవడానికి ప్రయత్నిస్తూండేవాడు. మరోవైపున తనను దయతో విడిచిపెట్టవల్సిందని 'మెర్సీ పిటీషన్'లూ పెడుతూండేవాడు. నా స్థితి వేరు. జైల్లో నుండి పారిపోవడం తప్పు అని నేను ఎన్నడూ అనను. నాకు పారిపోవడానికి అభ్యంతరమూ లేదు. ఐనా, నేను ఎన్నడూ పారిపోవడానికి ప్రయత్నించలేదు. అందుకు కారణం, పూర్తి సఫలతను పొందగలమన్న విశ్వాసం కలిగినప్పుడే నేనలాంటి పనిచేస్తాను !

కొద్దిరోజుల తరువాత నన్ను నైనీ జైలునుండి ఫతేహ్‌గఢ్ సెంట్రల్ జైలుకు మార్చారు !

ఫతేహ్‌గఢ్ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ మిస్టర్ ఒబేరాయ్ ! వెనకే పరిచయం వుంది! సరళమైన వ్యక్తి కూడాను ! ఐతే, బ్రిటీష్ సామ్రాజ్యానికి నమ్మినబంటుగా చాలా చెడ్డపేరు తెచ్చుకున్న సర్దార్ గండాసింగ్ హెడ్ సూపరింటెండెంట్ ! ఇతడు విప్లవకారుల పట్ల అత్యంత క్రూరంగా ప్రవర్తించేవాడు. అందుకుగాను బ్రిటిష్ ప్రభుత్వం ఇతడికి 'సర్దార్ బహద్దూర్' అనీ, 'ఆఫీసర్ ఆఫ్ బ్రిటీష్ ఎంపైర్' అనీ బిరుదుల్ని ఇచ్చింది.

కొన్నాళ్ళ తరువాత ఒబేరాయ్ బదిలీ అయ్యాడు. ఇతడి స్థానంలో మేజర్ రామ్‌నారాయణ్‌భండారి సూపరింటెండెంట్‌గా వచ్చాడు. ఇతడు సర్దార్ గండాసింగ్‌కంటె రెండాకులు ఎక్కువ చదివాడు. ప్రభు భక్తి పరాయణతలో గండాసింగ్‌ను మించాడు. సాధారణంగా జైలు సూపరింటెండెంట్‌ల క్రూరత్వాన్ని గురించి, నిరంకుశత్వాన్ని గురించి ఖైదీలు అనేక రకాలుగా చెప్పుకుంటూ వుంటారు. ఈ రామ్‌నారాయణ భండారీని గురించీ ఎన్నో కథలు ప్రచారంలో వున్నాయి. 'ఇతడిని చూస్తే పశువులూ భయపడుతూంటాయి. ఇతడు చూస్తుండగా పశువులు కొమ్ము విసరడం గానీ రంకెవేయడంగానీ - చేయడానికి వీలులేదు. అలా చేసిన పశువులకు కొరడా దెబ్బల శిక్షగానీ ! ఒంటరి ఖైదు శిక్షగానీ - విధిస్తూంటాడు. ఒకమాటు ఇతడు చూస్తూండగా రావిచెట్టు గాలికి కదలడమూ, రావి ఆకులు గలగల్లాడడమూ జరిగిందట ! ఇంకేవుంది? రావిచెట్టుకు పన్నెండు కొరడాదెబ్బల శిక్ష విధించాడుట !' అని చెప్పుకునేవారు.

బ్రిటీష్ సామ్రాజ్యంలో వైస్రాయికి గల అధికారాలకంటే దర్పం కంటే, జైళ్ళల్లో సూపరింటెండెంటుకు ఏ కొద్దిగానో ఎక్కువే అధికార దర్పాలుంటాయి. జైలుకు మహారాజు సూపరింటెండెంటే. ఆంగ్ల ప్రభుత్వం జైలు సూపరింటెండెంట్లకు విస్తృతమైన అధికారాల్ని ఇచ్చింది. వీళ్ళల్లో, ఖైదీలమీద ఇతర జైలు సిబ్బందిమీదా అధకారాన్ని చలాయించాలన్న కాంక్ష పెరిగిపోతూ వుంటుంది. మహారాజుల్లా దర్పం వెలగబెడుతూ వుంటారు. కాంగ్రెసు పాలనలో కూడా సూపరింటెండెంట్ హోదాలూ - అధికారాలూ - అహంకారాలు యథాతథంగానే వున్నాయని చెప్పకతప్పదు. అప్పుడప్పుడూ సూపరింటెండెంట్‌గారు జైలును సందర్శించడానికి వస్తూంటారు. అలాంటప్పుడు, అయ్యగారికి నాలుగడుగులు ముందు ఇద్దరు పోలీసులు శరీర రక్షకులుగా నడుస్తూంటారు. అతగాడు ప్రాంగణంలోకి రాగానే 'దొరగారు వస్తున్నారు !' అన్న కేక వేస్తారు. దాన్ని, 'రిపోర్టు చదవడం' అంటారు. అదయ్యాక ఖైదీలందర్ని ప్రత్యేకమైన పద్ధతిలో మోకాళ్ళను ఒకచోటికి చేర్చి కూర్చోబెడతారు. ఖైదీల చేతులు తెరచి ముందుకు చాచి వుండాలి. వాళ్ళ చేతుల్లో ఆయుధాలు లేవని తెలియడానికి అలా కూర్చోబెడతారు. ఏ ఖైదీనయినా సూపరింటెండెంట్ దగ్గరకు తీసుకువెళ్ళడం జరిగితే, అతడిని ఇద్దరు పోలీసుల మధ్య నిశ్చలంగా నిలబెడతారు. ఐతే రాజకీయ ఖైదీల విషయం వేరు. వీళ్ళు సూపరింటెండెంట్ వస్తున్నాడంటే రెండు మోకాళ్ళనూ దగ్గరకు పెట్టుకుని చేతులు చాచి గొంతుకు కూచోవడానికి అంగీకరించేవారు కాదు.

రాజకీయ ఖైదీలకూ జైలు అధికారులకూ ఎప్పుడూ ఘర్షణలు జరుగుతూనే వుండేవి. 'విప్లవకారులు అలా కూర్చోనవసరం లేదు. ఐతే, తన కార్డును పట్టుకుని కదలకుండా బొమ్మలా నిలబడాల'న్నారు. రాజకీయ ఖైదీలు అలా నిల్చోవడానికి అంగీకరించలేదు. అదీ తమకు అవమానం అన్నారు. చివరకు జైలు అధికారులు నోరు నొక్కుకోక తప్పలేదు.

సూపరింటెండెంట్ తనిఖీ చేయడానికి వచ్చినప్పుడు ప్రక్కన హెడ్‌జైలర్ వుండేవాడు. ఇటూ అటూ ఇద్దరూ ఇనస్పెక్టర్లూ, పోలీసులూ వగైరా మందీ మార్బలం వుండేవారు. ఒక ఖైదీ జమాదార్ సూపరింటెండెంట్‌కు గొడుగు పట్టి అతణ్ణి అనుసరించి నడిచేవాడు. జైలు అధికారులు ఇలా తమ దర్పాన్ని అధికారాన్ని - ఖైదీల దగ్గర ప్రదర్శిస్తూండేవారు.

ఫతేహ్‌గఢ్ సెంట్రల్ జైలుకు నేను వెళ్ళేటప్పటికే అక్కడ ఇద్దరు విప్లవకారులైన ఖైదీలున్నారు. ఒకరు మన్మతనాథ్‌గుప్త, మరొకరు మణీంద్రనాథ్ బెనర్జీ ! మన్మధనాథ్ కాకోరీ కుట్రకేసులో అభియుక్తుడు. మణీంద్రుడు, సి.ఐ.డి. డిప్యూటీ సూపరింటెండెంట్ బెనర్జీని కాల్చిన కేసులో నిందితుడు. ఈ సి.ఐ.డి. ఆఫీసర్ని గురించి లోగడ వివరంగానే రాశాను. మణీంద్ర, ఈ సి.ఐ.డి. సూపరింటెండెంట్ బెనర్జీకి మేనల్లుడవుతాడు. ఈ జైల్లో బి. క్లాసు విప్లవకారులకు ఇచ్చిన బ్లాకు చాలా పెద్దది. అందులో మన్మధ, మణీంద్ర ఇద్దరే వుంటున్నారు. సర్దార్ గండాసింగ్ ఆవరణ మొత్తానికీ ఇనుపపెన్సింగ్ వేయించాడు. వార్తలు బయటనుండి లోపలకు వచ్చే వీలుగానీ, లోపలినుండి బయటకు వెళ్ళే వీలుగానీ - బొత్తిగా లేదు !

నేను ఫతేహ్‌గఢ్ జైలుకు వెళ్ళడానికి ముందే మన్మధనాథ్‌గుప్త, మణీంద్ర బెనర్జీ - జైలు అధికారుల్తో దీర్ఘకాలం పోరాడారు. చాలారోజుల పాటు నిరశన వ్రతం చేశారు. అప్పటికి జైలు అధికారులు రాజీకి వచ్చారు. జైల్లో వీరికి తాడుపేనే పనిని ఇచ్చారు. వీళ్ళు చేయం అన్నారు. బి. క్లాసు ఖైదీల సౌకర్యాలు వీళ్ళకు కల్పించడం లేదు. ఆ సౌకర్యాల్ని తమకు ఇవ్వాలని పట్టుపట్టారు. నైనీ జైలునుండి మే నెలలో వచ్చాను. బ్లాకులో పంఖాలు లేవు. నైనీ జైల్లో పంఖాలుండేవి. పోతే, పడుకోవడానికి మంచాలూ లేవు. నైనీ జైల్లోని సౌకర్యాల్ని ఉదహరిస్తూ, ఇక్కడా అసౌకర్యాల్ని ఏర్పాటు చేయవల్సిందని అధికార్లను అడిగాను. "జైలు నియమాల్లో (మాన్యుయల్) అలాంటి సౌకర్యాల్ని కల్పించమని లేదు !" అన్నారు. ఐతే, జైలు మాన్యుయల్‌ను ఖైదీలకు చూపించరు. చూడనివ్వరు. వేదాల్ని శూద్రులు చదవకూడదన్నట్టు జైలు మాన్యుయల్‌ను ఖైదీలు చదువరాదు ! మేము మాన్యుయల్ చూస్తామని పట్టుపట్టాము. తప్పనిసరై మాన్యుయల్‌ను చూడనిచ్చారు.

ఫతేహ్‌గఢ్ సెంట్రల్ జైలు అధికారులూ పట్టుపట్టారు. 'జైలు మాన్యుయల్‌లో లేనిదాన్ని ఇవ్వం, ఉన్నదాన్ని తీయం' అన్నారు. జైలు మాన్యుయల్‌ను అక్షరాక్షరం పాటిస్తామంటున్నారు. ఐతే, చిక్కు ఎక్కడ వస్తుందంటే, జైలు మాన్యుయల్ రచన ఓ ప్రత్యేకమైన పద్ధతిలో జరిగింది. దాన్ని ఉన్నది ఉన్నట్టు పాటించడం ఎవడి వశమూ కాదు. అలా అమలు జరిపితే అధికార్లే అగచాట్లు పాలవుతారు. ఆనాటి జైలు మాన్యుయల్ ప్రకారం ఖైదీలు దగ్గర డబ్బు వుంచుకోరాదు. పదిమంది ఖైదీలు ఒకచోట చేరి సరదాగా గడపరాదు. గానా బజానాలాంటివి చేయకూడదు.

పై చెప్పినవన్నీ జైలు నియమాలు. ఐతే, వాటిని అక్షరాక్షరం పాటింపచేసే శక్తి ఏ అధికారికీ వుండదనే చెప్పాలి. పై చెప్పినలాంటి విషయాల్లో, ముఖ్యం, పండగ రోజుల్లో ఖైదీలను అదుపు చేయాలన్న పిచ్చి సాహసాన్ని ఏ జైలరు గానీ, సూపరింటెండెంట్ గానీ - ప్రదర్శించడు ! దీపావళి పండుగ రాత్రి ప్రతి సెంట్రల్ జైల్లోనూ జూదం ముమ్మరంగా సాగుతుంది. కొన్ని వేల రూపాయిలు వినిమయం జరుగుతుంది. ఇంక హోలీ పండుగరోజున సాగే గానాబజానా సాధారణ స్థాయినిదాటి వికృత

రూపాన్ని ధరిస్తుంది. భైనీబాబా లాంటి జైలరు వుంటే, హార్మోనియం - తబలా లాంటి వాయిద్యాలు కూడా జైల్లోకి వచ్చేస్తాయి. రెండు మూడొందల గజాల దూరానికి కూడా కాలిగజ్జెల సవ్వడి వినిపిస్తూంటుంది. సంగీతం హోరెత్తి పోతుంది, పూరీలు, పిండివంటలు వండుతారు. జైల్లో అందరికీ పెడతారు. చిన్న అధికార్లు తాము ఈ ఆనందోత్సవంలో పాల్గొంటారు. సూపరింటెండెంట్, జైలర్ లాంటి పెద్ద అధికార్లు చూసీ చూడనట్టు వెళ్ళిపోతారు !

విశాలమైన నైనీ జైలుబ్లాకులో నేను ఒక్కణ్ణే వుండేవాణ్ణని చెప్పాను. అక్కడ ఫతేహగఢ్ సెంట్రల్ జైలుకంటే సౌకర్యాలు అధికంగానే వున్నాయి. అయినా, అక్కడ కాలాన్ని వృథా పుచ్చాననే చెప్పాలి. ఫతేహగఢ్ జైల్లో కాలం సద్వినియోగమయింది. కారణం, మన్మధ్‌నాథ్, మణీంద్ర - ఇద్దరూ మంచి అను శాసనంతో జీవితాన్ని గడుపుతున్నారు. చాలా చిన్న వయస్సులోనే వారు జైలుపాలు అయ్యారు. అప్పటికి ఇంకా విద్యార్థి దశలోనే వున్నారు. మణీంద్ర బెనర్జీకి ఏడేళ్ళ శిక్షపడ్డది. మన్మధ్‌నాథ్‌కు అజన్మ కారాగారవాసం పడ్డది. ఇద్దరూ ఎక్కువ సమయాన్ని అధ్యయనంలో గడిపేవారు. మన్మధ్‌నాథ్ అప్పటికే ఫ్రెంచ్ భాషను అభ్యసించాడు. రష్యన్ భాషను చదువుతున్నాడు. హిందీ - ఉర్దూ భాషల్లో దొరికిన పుస్తకాలన్నింటినీ చదివేస్తున్నాడు. ప్రతీ ఒక్క పనినీ సమయానికి చేస్తుండేవాడు. తాను విడుదల ఔతానన్న ఆలోచన మన్మధ్‌నాథ్‌కు లేదు. ఒకవేళ అయినా, ఇరవై ఏళ్ళ తరువాత ! అలాంటి స్థితిలో నియమబద్ధతను అలవరచుకోవడం చాలా అవుసరం !

నేను ఫతేహగఢ్ సెంట్రల్ జైల్లో అడుగుపెట్టగానే, మన్మధ్‌నాథ్, మణీంద్ర - ఇద్దరూ విప్లవకారుడి హోదాలో నన్ను సాదరంగా ఆహ్వానించారు. ఇంగ్లీషులో మాట్లాడారు. కానీ, యూరోపియన్ బారక్కులోంచి వచ్చిన నేను యూరోపియన్ దుస్తుల్లోనే వున్నాను. నెత్తిన దొరటోపీ పెట్టుకున్నాను. అది చూసి ఇద్దరూ బెంగాలీ భాషలో నన్ను హేళన చేస్తూ ఇలా అనుకున్నారు. 'ఈనాయాల అచ్చం దొరలా తయారైవచ్చాడు !"

నాకు బెంగాలీ భాష వచ్చునని వాళ్ళు అనుకోలేదు. నేనూ రానట్టుగానే వున్నాను. అవమానాన్ని దిగమింగాను. ఐతే, ఈ ప్రథమ పరిచయ ప్రభావం నాలో పనిచేస్తూనే వుంది. వాళ్ళతో నా ప్రవర్తన, లేక నాతో వాళ్ళ ప్రవర్తన - మర్యాదతో కూడిందిగా వున్నదే గానీ, ఆత్మీయతతో కూడిందిగా ఎన్నడూ లేదు ! వాళ్ళిద్దరూ తమలో తాము బెంగాలీలో కబుర్లు చెప్పుకునేవారు. నాతో మాట్లాడాల్సి వస్తే ఇంగ్లీషులో మాట్లాడేవారు. మన్మధ్‌నాథ్‌కు హిందీ బాగావచ్చు. మరి నేను పంజాబీని కావడం వల్ల హిందీ రాదనుకున్నాడో లేక దొరల దుస్తుల్లో వుండడం వల్ల హిందీలో మాట్లాడకూడదనుకున్నాడో - ఏమైనా కానీ, నాతో హిందీలో మాట్లాడేవారు కాదు. ఇంగ్లీషులోనే మాట్లాడేవారు. ఈ కారణంగా, నా సమయాన్ని ఎక్కువగా చదువుకోవడానికి ఖర్చుపెట్టేవాణ్ణి ! మన్మధ్‌నాథ్ ఫ్రెంచి పుస్తకాల్ని ఇచ్చాడు. ఫ్రెంచి భాషను బాగా అభ్యసించాను. అతడూ నేనూ - ఇద్దరం ఇటాలియన్ భాషను చదవాలనుకున్నాం!

ఫతేహగఢ్ సెంట్రల్ జైల్లో సాధారణ ఖైదీగా వుంటున్న రమేశ్ చంద్రగుప్త అనే ఓ రాజకీయ ఖైదీ నిరశన వ్రతం పట్టాడు. రమేశ్‌చంద్ర ఇంకా విద్యార్థి దశలోనే వున్నాడు. కాన్పూర్‌లో చదువుకుంటూ విప్లవ రాజకీయాలవైపు ఆకర్షింపబడ్డాడు. వీరభద్ర తివారీ, ఆజాద్ పట్ల విశ్వాసఘాతుకం చేశాడన్న వార్త కాన్పూర్‌లో దావానలంగా వ్యాపించింది. వీరభద్ర తివారీ పోలీసులకు ఉప్పందించాడని అందరూ అనుకుంటున్నారు. అతడిక కాన్పూర్‌లో వుండలేకపోయాడు. 'ఉరయీ' అనే పల్లెటూర్లో వుంటున్నాడు. రమేశ్‌చంద్ర రామలీల ఉత్సవ సందర్భంగా 'ఉరయీ' వెళ్ళాడు. ఉత్సవ సందట్లో వీరభద్రను కాల్చేశాడు. దెబ్బ తప్పించుకుని వీరభద్ర బతికిపోయాడు. రమేశ్‌చంద్రను అరెస్టు చేశారు.

రమేశ్‌చంద్రకు ఏడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించారు. ఎన్నిమార్లు అర్జీలు పెట్టుకున్నా అతణ్ణి బి. క్లాసుకు మార్చలేదు. విసిగిపోయిన రమేశ్‌చంద్ర నిరశన వ్రతం ప్రారంభించాడు. ఇది తెలిశాక, అతడికి మద్దతుగా మేమూ నిరశన వ్రతం పట్టడం తప్పనిసరయింది ! రమేశ్‌చంద్రకు మేము సందేశం పంపించాము. "నువ్వు ధైర్యంగా వుండు ! నీకు సానుభూతిగా మేమూ నిరశన వ్రతం ప్రారంభిస్తున్నాం !"

మేము జైలు అధికారులకు నోటీసు ఇచ్చాము. మా పట్ల ప్రవర్తిస్తున్న అనుచిత ప్రవర్తనను గురించి, రమేశ్‌చంద్ర న్యాయమైన కోర్కెల గురించి - మేమూ నిరశన వ్రతం చేస్తున్నట్టు తెలియపరచాం. నిరశన వ్రతం ప్రారంభించాం.

విప్లవకారులు, నిరశన వ్రతం ద్వారా ఆత్మోద్ధరణ పొందాలని గానీ, లేక భగవదానుగ్రహం పొందాలని గానీ, ఎన్నడూ అనుకోరు. ప్రజల్లో తమ కోర్కెల ప్రచారానికి, ప్రభుత్వం పట్ల తమ గాఢ అసమ్మతిని ప్రకటిస్తూ ప్రజాభిమతాన్ని కూడగట్టుకోడానికి - ఇదో సాధనంగా భావిస్తారు. ఐతే, ఫతేహ్‌గఢ్ సెంట్రల్ జైల్లోంచి వార్త బయటికి పోవడమే అసంభవం ! ఇంక మేము నిరశన వ్రతం చేస్తూన్నట్టు ప్రజలకేలా తెలియడం ? ఎన్ని కట్టుదిట్టాలు చేసినా, ఎంతటి కఠిన నిర్బంధాన్ని అమలుపరచినా - మేము నిరశన వ్రతం చేస్తూన్నామన్న విషయం ప్రజలకు తెలియనే తెలిసింది ! జైలు అధికారులు విస్మయం చెందిన విషయం. "అసలు రమేష్‌చంద్ర నిరశన వ్రతం చేస్తూన్నట్టు మాకెలా తెల్సింది ?" అనేది ! ఆ క్షణం నుండి నిర్బంధాన్ని మరిన్నీ అధికం చేశారు.

నిరశన వ్రతం పద్దెనిమిది లేక పందొమ్మిది రోజులపాటు చేసినట్టు జ్ఞాపకం ! గాంధేయవాదులు నిరశన వ్రతం ఆచరించేప్పుడు నిమ్మరసాన్ని నీళ్ళు కలిపి తీసుకుంటూంటారు. శరీరానికి బాదంనూనె పట్టిస్తూంటారు. విప్లవకారులు అలాంటివేమీ చేసేవారుకాదు. పది పద్దెనిమిది రోజులు ఉపవాసం చేయడం విప్లవకారులకు ఒక లెక్కలోది కాదు. అంతకు క్రితం మన్మథనాథ్, మణీంద్ర చెరో నెలా ఉపవాసం చేశారు. అంతకంటె ముందు మన్మథనాథ్ దాదాపు అరవై రోజులు ఉపవాసం చేశాడు. కనుక పద్దెనిమిది రోజులు ఒక లెక్కకాదు. జోగేష్ ఛటర్జీ ఆగ్రా జైల్లో దాదాపు నూటయాభై రోజులు నిరశన వ్రతం చేశాడు. నిరశన వ్రతం ఇరవై రోజులు దాటాక బలవంతానా పాలు తాగించే ఏర్పాటు చేస్తారు. ఉపవాసం చేసే ఖైదీ చనిపోతే ప్రజల్లో అశాంతి, అలజడి వ్యాపిస్తాయి. అందుకని ఉపవాసం చేసే ఖైదీలకు, బలవంతానా పాలు తాగిస్తారు. రబ్బరు గొట్టాలగుండా ముక్కుద్వారా పాలుపట్టే ఈ పద్ధతి ఉపవాస దీక్షలో వున్న ఖైదీల్ని చాలా బాధపెడుతుంది.

పద్దెనిమిది రోజుల ఈ ఉపవాస దీక్షా సమయంలో, మా ఆత్మలు శుద్ధీకరింపబడ్డాయని మాలో ఎవరికీ అనుపించలేదు. నిరశన వ్రతం చేసేప్పుడు మొదటి మూడురోజులూ ఆకలితో చాలా బాధపడవల్సి వుంటుంది. ఆ తరువాత శరీరం ఆకలికి అలవాటు పడుతుంది. మరికొన్నాళ్ళు గడిచాక లేవడం, కూర్చోవడం, నడవడం, చివరకు కదలడం కూడా బాధగానే ఉంటుంది. మనస్సు ఎప్పుడూ భోజనాన్ని గురించే ఆలోచిస్తూంటుంది. రకరకాలైన భోజన పదార్థాల రుచులూ, సువాసనలూ స్ఫురణకు వస్తూంటాయి. ఉపవాస దీక్షా సమయంలోని మా అనుభవాల గురించి ఒకరికొకరం చెప్పుకుంటూ వుంటాము. మేము ముగ్గురం - నేనూ, మన్మథ్‌నాథ్, మణీంద్ర - నాస్తికులం ! ఐతే, టీకమ్‌సింహ్ పరమ ఆస్తికుడు. అతడికీ ఉపవాస సమయంలో భగవద్దర్శనం గానీ, ఆత్మోద్ధరణ గానీ - కలగలేదు ! మనస్సు ఎప్పుడూ ఉడకబెట్టిన కోడిగుడ్డు కోసం కొట్టుకులాడేదిట ! విచిత్రం ఏమిటంటే, టీకమ్‌సింహ్ శాకాహారి !

పద్దెనిమిదవ రోజున రమేష్ బంధువులు కాన్పూర్ నుండి బాలకృష్ణ శర్మ 'నవీన్' ను తీసుకుని వచ్చారు. అధికార్లు రమేష్‌కు బి. క్లాసు ఇవ్వడానికి అంగీకరించారు. అతడు ఉపవాసాన్ని విరమించాడు. రమేష్ సమస్య ముఖ్యం కావడం వల్ల, అతడు విరమించగానే మేమూ విరమించాము. ఐతే, మేము కోరిన సౌకర్యాలను కల్పించకపోతే తిరిగి ఉపవాస దీక్ష కొనసాగించగలమని ప్రకటించాము.

మణీంద్ర ఆరోగ్యం అసలే అంతంత మాత్రం, ఈ ఉపవాసంతో అతడి ఆరోగ్యం మరీ చెడిపోయింది. గుండెజబ్బు పట్టుకుంది. వైద్యం చేయించే నెపంతో మేజర్ భండారీ మణీంద్రను మరో బ్లాకుకు పంపించాడు. అది హాస్పటల్‌కు దగ్గరగా వుంది. నాలుగు రోజులు గడిచాయో లేదో, మణీంద్ర స్థితి ప్రమాదకరంగా పరిణమించింది అన్న వార్త వచ్చింది. మేము వెళ్ళి మణీంద్రను చూడడానికి అనుమతిని ఇచ్చాడు. మేజర్ భండారి ! ఇలాంటి అనుమతిని ఇవ్వడం అతడి స్వభావానికే విరుద్ధం!

మేము హాస్పిటల్‌కు వెళ్ళాము. మణీంద్రనాథ్ బెనర్జీ మృత్యు ముఖంలో వున్నాడు. శ్వాస అందక తన్నుకుంటున్నాడు. అతడి స్థితిని చూసి మేము కంపించిపోయాము. అతడి కాళ్ళుచేతులూ వాచాయి. చూపు మారిపోయింది. కూచోలేకపోతూన్నాడు. పడుకోలేకపోతూన్నాడు. శ్వాస ఆడటం లేదు. ఆక్సిజన్ గ్యాస్ ఇస్తూన్నారు ఆ హాస్పిటల్ డాక్టరుకు రోగికి గ్యాసు ఇవ్వడం కూడా తెలియదు. ఎలాగో గ్యాసు రోగికి అందింది. స్థితి కొంచెం మెరుగయింది.

మణీంద్రనాథ్ మృత్యు సన్నివేశాన్ని గురించి రెండవ భాగంలోనూ రాశాను. ఇక్కడ మళ్ళీ రాయడం పునరుక్తి అవుతుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే మణీంద్రనాథ్ బెనర్జీ హాస్పటల్లో అలా యమయాతన అనుభవించి చనిపోయాడు. ఐతే, అతడు తన ఆదర్శం కోసం వీరమరణాన్ని పొందాడనే అనాలి, చివరి క్షణంలోనూ చలించని అచంచల వీరుడు మణీంద్ర. ఆనాటి హి.స.ప్ర.స. మిత్రుల భావాలు ఎలా వుండేవో తెల్సుకోవడానికి మణీంద్ర అన్న చివరి మాటలు చక్కని ఉదాహరణ.

మణీంద్ర చనిపోవడంతో నేనూ మన్మధనాథ్ - ఇద్దరం భారంగా రోజుల్ని దొర్లించసాగాము. ఒక వారం గడిచింది. రమేశ్‌చంద్రకు బి. క్లాసు సౌకర్యాలను ఇచ్చారు. అతడిని మేము ఉన్న బ్లాకుకు పంపించారు. రమేశ్ చాలా చిన్న వయసులో జైలుకు వచ్చాడు. మెట్రిక్కు కూడా కాలేదు ! అంత చిన్న వయసులో వీరభద్రను కాల్చడానికి సంసిద్ధుడయ్యాడంటే, అతడిలోని దేశభక్తే అలా చేయించింది. మా బ్లాకుకు వచ్చాక అతడి దృష్టిని చదువుమీదకు మరల్చాము.

మరి కొద్దిరోజులకు మరో బి. క్లాసు రాజకీయ ఖైదీని కూడా మా బ్లాకుకు పంపించారు. వీరి పేరు శివరాంపాండే, వీరిది కాన్పూరు, కాంగ్రెసు స్వయం సేవకులు. సత్యాగ్రహం చేసి జైలుకు వచ్చారు. శివరాంపాండే విద్యాధికులు ప్రస్తుతం (1952) ఉత్తరప్రదేశ్ విధానసభ సభ్యులు.

శివరాంపాండేగారు ఇతర సత్యాగ్రహులైన ఖైదీల్లాగానే ఎప్పుడూ నువ్వుల నూనెను వంటికి మాలీసు చేసుకోవడం, వ్యాయామం చేయడం, గీతాపఠనం కావించడం - చేస్తూండేవారు. కలుపుగోలుతనం గల మనిషి కావడం వల్ల - సరదాగా రోజులు గడువసాగాయి.

శివరాం పాండేగారు కాంగ్రేసువాది అయినప్పటికీ విప్లవకారుల పట్ల గొప్ప సానుభూతిని కలిగివుండేవారు. నేను భగత్సింగ్ సహచరుణ్ణని తెలిశాక పాండేగారికి మరికూడ కుతూహలమూ, ఉత్సాహమూ కలిగాయి. ఎన్నో ప్రశ్నలు వేస్తూండేవారు. సందేహాల్ని తీర్చుకుంటూండేవారు. ఒకమాటు అడిగారు. "ఒకమాటు భగత్సింగ్‌గారూ, ఆజాద్‌గారూ, (పాండేగారు గౌరవసూచకం అయిన-జీ-గారు శబ్దాన్ని అధికంగా వాడుతుంటారు) ఇంగ్లాండు నుండి ఓడలో వస్తున్నారట ! తెల్లవాడొకడు భారతమాత పట్ల నిందా పూర్వకంగా మాట్లాడటంతో కోపగించుకున్న భగత్సింగ్‌గారు, ఆ తెల్లవాణ్ణి చెవులుపుచ్చుకుని కుక్కపిల్లలా ఎత్తి సముద్రంలో పారేశాడుట ! ఇది నిజమేనా ?"

నాకు నవ్వు వచ్చింది. భగత్సింగ్, ఆజాద్ - వీరు ఎన్నడూ ఇంగ్లాండు వెళ్ళలేదని, పాండేగారు విన్న కథ కట్టుకథ అనీ చెప్పాను ! పాండేగారు నిరుత్సాహపడ్డారు నావైపు అనుమానంగా చూశారు. 'తాను విన్న కథ నిజమైందే ! కానీ, భగత్సింగ్‌కు లభిస్తున్న కీర్తి కారణంగా ఈర్ష్యాళువునైన నేను ఈ కథను 'అబద్ధం' అంటున్నాను !' ఆ చూపులు పై విధంగా నామీద నెపం వేస్తున్నాయి. నేను ఆ కథను నిజమైనదని అంగీకరిస్తే, దాన్ని యువకుల్లో ప్రచారం చేసి, దేశభక్తిని పెంపొందించాలని పాండేగారి అభిప్రాయం !

నేను జైలు నుండి విడుదల అయ్యాక కూడా పాండేగారి లాంటి ఉత్సాహవంతులైన దేశభక్తుల్ని చాలామందిని నిరాశ పరిచాను. భగత్సింగ్ చంద్రశేఖర్ ఆజాద్-వీరు సాధారణ మానవులు కారనీ అతి మానవులనీ - అత్యుక్తులు చెప్పడం ఒక రకం దేశభక్తి ! ఐతే, అత్యుక్తులకూ, కల్పనలకూ కథల్లో నవలల్లో స్థానం వుంటుంది గానీ, నిజజీవితంలోనూ, వ్యక్తిగత అనుభవాల్లోనూ స్థానం వుండదు కదా ?

నేను అరెస్టు అయ్యాక ముందు దుర్గాబాభీ, తరువాత సుశీలాదీదీ అరెస్టు అయినట్టు తెల్సింది. మేము నిరశన వ్రతం చేయడానికి కొద్దిరోజుల ముందు 1934 లో ప్రకాశవతి అరస్టు అయినట్టు వార్త వచ్చింది. ప్రకాశవతి జీవితం ఏమవుతుందో ? నన్న ఆలోచన నన్ను బాధపెట్టసాగింది. మా తమ్ముడూ, ఇతర మిత్రులూ రాసే ఉత్తరాల్తో పాటు ప్రకాశవతి తనను గురించీ సంకేతాత్మకంగా జాబులు రాస్తుండేది ! నేను కూడా ఆమెకు ఉపమానాల్తో ధ్వన్యాత్మకంగా, సంకేతాల్తో - జాబులు రాస్తుండేవాణ్ణి ! ఆమెకు రాసిన జాబుల్ని ఇతర మిత్రుల అడ్రసుకు పంపేవాణ్ణి ! నెలకు ఒక్క జాబురాసుకోడానికి అనుమతి ఇచ్చారు. కనుక, ఒక్కో జాబు రెండు మూడు రావులు అయ్యేది. నాకు వచ్చే జాబులూ, నేను రాసే జాబులూ - సి.ఐ.డి. డిపార్టుమెంటు పరిశీలించేది తమకు తెలియని ఏదో సాంకేతిక పద్ధతిలో మేము నిషిద్ధమైన వార్తల్ని అందించుకుంటామని వారికి అనుమానమే ! మేము బయట ప్రపంచానికి తెలిపే వార్తలవల్ల అలజడులూ, ఆందోళనలూ - జరగకుండా, అసలు అలాంటి వార్తలు మేము రాయకుండా, సి.ఐ.డి. డిపార్టుమెంటు జాగ్రత్తపడేది అలాగే, బయట నుండి మాకు వచ్చే వార్తల ఆధారంగా, మేము జైళ్ళలో నుండి పారిపోడానికి ప్రయత్నాల్ని చేస్తామేమోనని భయపడుతుండేవారు - అందువల్ల, మా జాబుల్లో తమకు అర్థంకాని, అనుమానించదగిన శబ్దాల్ని, వాక్యాల్ని నల్లని సిరాతో కొట్టివేసి, చదవడానికి వీలు లేకుండా చేసేవారు.

అప్పటికి రెండు సంవత్సరాలయింది, నేను జైలుకువచ్చి ! పరిస్థితులకు అలవాటుపడ్డాను. కొంత స్థిమితం ఏర్పడ్డది. మాకు 'స్టేట్సుమెన్' ఇంగ్లీషు పత్రికను, 'భారత్' అనే హిందీ పత్రికను చదువుకోడానికి ఇచ్చేవారు ఈ రెండూ ప్రభుత్వాన్ని సమర్థించే పత్రికలే ! ఈ పత్రికల్లోనూ విప్లవోద్యమానికి సంబంధించిన వార్తలు వుంటే, వాటిని కట్ చేయడమో, లేక వాటిపై నల్లని సిరాపూసి చదవడానికి వీలు లేకుండా చేయడమో చేసేవారు. అయినప్పటికీ మీరట్, కాన్పూర్, డేరాడూనుల్లో విప్లవ కార్యక్రమాలు కొనసాగుతూనే వున్నాయన్న వార్తలు అందుతూనే వున్నాయి. పోలీసులు డేరాడూన్ - కాన్పూర్ కుట్ర కేసింకొకదాన్ని పెట్టాలని ఆలోచిస్తున్నారు. మాకు అందుతున్న వార్తలకంటే తీవ్రరూపంలోనే విప్లవోద్యమం కొనసాగుతుందని అనుకున్నాను. ఏకాంతంలో, మౌనంగా గడచిన క్షణాల్లో అనేకమైన ఆలోచనలు వచ్చేవి. నా భవిష్యత్ జీవితాన్ని గురించి, ప్రస్తుత జైలుజీవితం గురించి ఆలోచిస్తుండేవాణ్ణి ఇంకా పన్నెండు సంవత్సరాలు జైలుజీవితాన్ని గడపాలి ! ఆ తరువాత విడుదల ఐతే, నేనేస్థితిలో వుంటాను? వయస్సు నలభై ఏళ్ళు దాటుతుంది. ఆ వయస్సులో మళ్ళీ కొత్తగా జీవితాన్ని ప్రారంభించాలి. పైగా, ఇన్ని సంవత్సరాలు ఏ పనీ చేయకుండా కూర్చుని వుండడం వల్ల ఆరోగ్యము సరిగా వుండదు. కనుక,

ఒక రకంగా జైలునుండి బయటపడేనాటికి దాదాపు వృద్ధ్యాప్యపు ఛాయలు నాలో గోచరిస్తుంటాయి. ఆ వయసులో, ఆ నిస్సహాయ స్థితిలో, నేనేం చేయగలను ? ఒకటే ఆశ మినుకు మినుకుమంటుండేది. విడుదల అయ్యాక నా ఆదర్శాన్ని ప్రచారం చేస్తూ ఇతర్లను, ముఖ్యంగా, యువకుల్ని విప్లవానికి సన్నద్ధుల్ని చేయగలుగుతాను ! సాహిత్యం ద్వారా ప్రచార కార్యాన్ని నిర్వహించి జాతీయ విముక్తికి దోహదం చేయగలనేమో ! ఇలాగే ఏవేవో ఆలోచనలు బుర్రలో మెదిలేవి !

పెళ్ళీ కుటుంబమూ అనేవి లేకుండా ఒంటరిగా జీవితాన్ని గడుపుతానన్న వూహల్లో వుండేవాణ్ణి !

నిరశన వ్రతం విరమించి కొద్దిరోజులే అయింది. ఇంకా శరీరం బలహీనంగానే వుంది. ఒకరోజున ఆఫీసు నుండి పిలుపు వచ్చింది. మేజర్ భండారి తన ఆఫీసు గదిలోకి పిల్చి, నన్ను కల్సుకోడానికి లాహోరు నుండి ఎవరో వచ్చారని చెప్పాడు. ఇంకా ఇలా అన్నాడు. 'నిరశన వ్రతాన్ని గురించి ఏమీ మాట్లాడనని మాట ఇస్తే - కల్సుకోడానికి అనుమతిస్తాను. లేకపోతే ఇవ్వను"

పై నిబంధన చాలా అవమానకరమైనదనిపించింది. వచ్చిన వ్యక్తిని కల్సుకోకుండానే వుందామనుకున్నాను. కానీ, మరో రకమైన ఆలోచనలు వచ్చాయి. మా అమ్మ నా నిరశన వ్రతాన్ని గురించి విని చూడడానికి వచ్చి వుంటుంది. కటిక బీదరికంలో ఆరువందల మైళ్ళు ప్రయాణం చేసి వచ్చింది. నన్ను చూడడానికి ! నన్ను కల్సుకునే అవకాశమే లభించకపోతే ఎంత నిరాశపడుతుందో కదా? ఉపవాస వ్రతం పూర్తయింది. ఫలితాన్నీ పొందాము. ఇంకాదాన్ని గురించి మాట్లాడినా, మాట్లాడకపోయినా ఒకటే !

నిరశన వ్రతాన్ని గురించి మాట్లాడనని మాట ఇచ్చాను !

నన్ను కలవడానికి వచ్చిన వ్యక్తిని లోపలకు తీసుకువచ్చారు. మా అమ్మగారు కాదు, వచ్చింది ప్రకాశవతి ! మేము దాదాపు ఏమీ మాట్లాడుకోలేకపోయామనే చెప్పాలి ! అందుకు కారణం ! మేజర్ భండారి అతి తెలివిగా మా ఇద్దరి మధ్యా ఒక పోలీసు అధికారిని కూర్చోబెట్టాడు. అతడి చెవిన పడకుండా మేము ఏమీ మాట్లాడుకోలేని స్థితిని కల్పించాడు. దీర్ఘమైన అనశన వ్రతం కారణంగా బాగా బలహీనంగా వున్నాను. అనశనవ్రతం చేశానని చెప్పకపోవడం వల్లా, నేను నీరసించి వుండడం వల్లా జైల్లో నాపట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారనీ, బాధలు పెడుతున్నారనీ - ప్రకాశవతి అనుకున్నది ! ఆమె ఇంటికి వెళ్ళిన వెంటనే యు.పి. ప్రభుత్వపు హోమ్ మెంబర్ మహరాజసింహ్‌ను కల్సుకుని నా పరిస్థితిని చెప్పింది. కేంద్ర అసెంబ్లీ మెంబర్లకూ నా పరిస్థితిని తెలియపరిచింది. పత్రికల్లోనూ నా ఆరోగ్యాన్ని గురించి వార్తలు వచ్చాయి. నిజంగానే నా ఆరోగ్యము శిథిలమవసాగింది. జ్వరం కాస్తోంది !

ఆ మధ్యకాలంలో ప్రకాశవతిని గురించి, ఆమె భవిష్యత్ జీవితాన్ని గురించి చాలా రోజులు ఆలోచించాను. నామీది మమకారం, లేక ప్రేమ - ఆమె జీవితాన్ని మోడు బార్చేవిగా వుండకూడదు అనుకున్నాను. నా స్నేహాన్ని, మిత్రుత్వాన్ని మర్చిపోయి మరొకర్ని వివాహమాడి జీవితాన్ని సార్థకం చేసుకోమని చెప్పాలనుకున్నాను. పోలీసు అధికారి ఎదుట చెప్పలేకపోయాను. ఇదే అభిప్రాయాన్ని ఒక జాబు ద్వారా తెలియపరచాను. నేను ఇంకా పన్నెండు సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించాలి. నాకోసం ప్రకాశవతి తన జీవితాన్ని అడవికాచిన వెన్నెల చేసుకోవడం అన్యాయం అనిపించింది ! సామాజిక దృష్టికల, ఉత్తముడైన వ్యక్తిని వివాహమాడి సామాన్య గృహిణిగా జీవితాన్ని ప్రారంభించమనీ, శక్తికొలది ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని ప్రచారం చేయడానికి ప్రయత్నించమనీ - జాబు ద్వారా సలహా ఇచ్చాను.

శివరాంపాండే శిక్ష పూర్తి అయింది. విడుదల అయి వెళ్ళిపోయాడు. మన్మథనాథ్ గుప్తనీ, రమేశ్‌చంద్రనీ ఆగ్రా సెంట్రల్ జైలుకు మార్చారు. బి. క్లాసుకు చెందిన అక్బర్ మహమ్మద్‌ఖాన్ అనే అతణ్ణి నేను వుండే బ్లాకుకు మార్చారు. ఇతడు యు.పి. కి చెందినవాడు. ఒక మోస్తరు భూస్వామి. హత్యలూ, దోపిడీల్లాంటి నైతిక అపరాధాల కారణంగా జీవితఖైదు అనుభవిస్తున్నాడు. ఇతడిమీద పెద్దగా అజమాయిషీ వుండేది కాదు. జైలు ఆవరణ అంతా తిరుగుతుండేవాడు. బి. క్లాసు రాజకీయ ఖైదీల గౌరవాన్ని, అభిమానాన్నీ - మంటకలపగల నీచమైన పనులను చేస్తుండేవాడు. అలాంటివి చేయవద్దని చెబితే మీసాలు మెలితిప్పుతూ "మీ బాంబులూ, పిస్తోళ్ళూ చూసి భయపడతానను కున్నావా ?" అంటూ పోట్లాటకు దిగేవాడు. ఇలా నైతిక అపరాధులతో పాటు కల్సి వుండవల్సి రావడం రాజకీయ ఖైదీలకు ఎప్పుడూ సమస్యగానే వుంటుంది. నైతిక అపరాధాల కారణంగా శిక్షను అనుభవిస్తున్న బి. క్లాసు ఖైదీలు రాజకీయ ఖైదీలకు తలనొప్పిగా తయారవుతారు.

మానసికంగా ఖిన్నుడనయ్యాను. రోజూ జ్వరం వస్తోంది. ఫతేహ్‌గఢ్ సెంట్రల్ జైలునుండి సుల్తాన్‌పూర్ శానిటోరియం జైలుకు నన్ను మార్చారు. 'బహుశా జ్వరం టి.బి. లోకి దించి వుంటుంది. జైలు అధికారులు నాకు చెప్పడం మంచిది కాదనుకున్నారేమో ! చెప్పలేదు. మౌనంగా సుల్తాన్‌పూర్ శానిటోరియం జైలుకు పంపిస్తున్నారని, అనుకున్నాను. చాలా నీరసపడిపోయాను. 'జైలుశిక్ష పూర్తికావడం అన్న సమస్యే వుండదు. అసలు అంతవరకూ బ్రతికితే కదా ?' అనుకున్నాను.

ప్రకాశవతికి మరో జాబు రాశాను. "నేను విడుదల అయి వస్తానన్న ఆశను వదలి, నీకు అనుకూలమైన నూతన జీవితాన్ని ప్రారంభించడం మంచిది !" అని స్పష్టంగా రాశాను.

సుల్తాన్‌పుర్ శానిటోరియం జైలు డాక్టరు శంకర్‌లాల్ గుప్త, చాలా మంచివాడు. టి.బి. స్పెషలిస్టు, వెళ్ళగానే నన్ను పరీక్షించాడు. 'నీకు టి.బి. లేదు' అని చెప్పాడు. నిశ్చింతగా వుండమన్నాడు. హాయిగా తిని, సంతోషంగా వుండమన్నాడు. గుప్త మంచి డాక్టరే కాదు; సాహిత్యాభిరుచి కలవాడు. శానిటోరియంని ఓ మంచి పూలతోటగా తీర్చిదిద్దాడు. ఎటు చూసినా పూవులే కనుపిస్తాయి. అక్కడ వున్న రోగులయిన ఖైదీలు ఆ జైలును నిజంగా శానిటోరియంగా భావించాలని డాక్టర్ ఆశయం ! అక్కడ త్వరలోనే నా ఆరోగ్యం కోలుకుంది !

నేను సుల్తాన్‌పుర్ శానిటోరియం జైలుకు మార్చబడ్డానని తెల్సుకుని ప్రకాశవతి చాలా బాధపడ్డది. తరచుగా నన్ను చూడడానికి రాసాగింది. తరచుగా రావడానికి అవకాశమూ లభించింది. ప్రభుత్వం ఆమె ఢిల్లీ, లాహోరు పట్నాల్లో వుండడాన్ని ఒక సంవత్సరం పాటు నిషేధించింది. ఈ సంవత్సర కాలాన్ని సద్వినియోగ పరచడంకోసం, కాశీ విశ్వవిద్యాలయంలో చేరి చదువుకోసాగింది. సుల్తాన్‌పుర్, బెనారస్‌కు చాలా దగ్గర ! అలా ఐదు ఆరునెల్లు గడిచాయి. నా ఆరోగ్యం కుదుట పడ్డది. నన్ను బరేలీ సెంట్రల్ జైలుకు మార్చారు !

బరేలీ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ మేజర్ రోజేయర్. ఇతడు ఆంగ్లో ఇండియన్. ఐతే, నలుగురూ తనను యూరోపియన్ అనుకోవాలని తాపత్రయపడతాడు. అహంకారానికీ, గర్వానికీ కొదువలేదు. ఇతర సూపరింటెండెంట్‌లు, సాధ్యమైనవరకూ విప్లవకారుల్తో తగాదాపడరు. చీటికీమాటికీ విప్లవకారుల బారక్కుల్లోకి వెళ్ళడం అలాంటివి చేయరు. కానీ ఈ రోజేయరు అలాకాదు. విప్లవకారులమీద కూడా దాష్టీకాన్ని చెలాయించాలంటాడు. తను బారక్కులోకి వచ్చినప్పుడు విప్లవకారులూ లేచి నిలబడాలంటాడు. మాకు ఇచ్చిన పనిని గురించి "అది ఎందుకు చేయలేదు ? ఇది ఎందుకు చేయలేదు ?" అని గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తుంటాడు. అలాగని రోజేయర్ని చెడ్డవాడంటానికి వీలులేదు.

విప్లవకారులు కూడా తనను గౌరవించాలనీ, తనపట్ల వినయాన్ని ప్రదర్శించాలనీ అంటాడు అంతే ! అదే మాకు గిట్టదు. జైల్లో మాకు ఇచ్చే పనులు ఎంత తేలికవయినా మేము వాటిని చేసేవాళ్ళం కాదు.

ఒకరోజున రోజేయర్‌తో పోట్లాడాలనుకున్నాను. పరేడ్ రోజు అది. రోజేయర్ వార్డర్లతో కల్సి బ్లాకులోకి వచ్చాడు. అందరికీ వినపడేట్టుగా ఉపదేశించసాగాడు. "పని చేయడం అవమానకరం అనుకోకూడదు. మేమూ రోజంతా పనిచేస్తూనే వుంటాము. ఎం.ఎన్. రాయ్ కూడా ఈ జైల్లోనే వున్నాడు. అతడు ఎన్నడూ తనకు ఇచ్చిన పనిని ఎగగొట్టేవాడు కాదు........"

మాట్లాడుతూ రోజేయర్ తన బూటుకాలిని నా మంచం తలవేపున మడిచిపెట్టుకున్న కంబళిమీద పెట్టాడు. యూరోపియన్ ఆచారాల ననుసరించి బూటుకాల్ని అలా పెట్టడం పెద్ద తప్పయిన విషయం కాదని నాకూ తెల్సు. ఐతే, నేను అవకాశం కోసం చూస్తున్నాను. అవకాశం దొరికింది.

నేను వెంటనే లేచి నిలబడి, ఆ కంబళిని తీసి అవతల విసిరిపారేశాను. "నేనీ కంబళిని కప్పుకుంటాను. నువ్వేమో కంబళిమీద బూటుకాలు పెడుతున్నావు. ఇది నన్ను అవమానపరచడమే అవుతుంది !" అని గట్టిగా కోపగించుకున్నాను.

జైలువార్డర్లూ, ఇతర అధికారులూ నిర్విణ్ణులయ్యారు. రోజేయర్ ముఖం పాలిపోయింది. ఘోరమైన ఈ అవమానానికి మనిషి ఉగ్రుడయ్యాడు. 'సరే, సరే, ఇందుకు తగినశిక్ష అనుభవిస్తావు !' అంటూ విసురుగా బ్లాకులోంచి వెళ్ళిపోయాడు.

ఒక గంట తరువాత వార్డర్ వచ్చాడు. రిపోర్టు చదివాడు. "సూపరింటెండెంట్ మేజర్ రోజేయర్ వస్తున్నారు !"

కక్ష తీర్చుకునే ఉద్దేశంతో వస్తూన్నాడనేది స్పష్టం ! 'ఐతే, ఎలాంటి శిక్ష విధించబోతూ న్నాడు ?" అన్న ఆలోచన వేధిస్తోంది. కొద్దిసేపటి తరువాత రోజేయర్ వచ్చాడు. అతడి ముఖంలో చిరునవ్వు కనుపిస్తోంది ! "మీ ఆరోగ్యాన్ని పరీక్షించాలి !" అన్నాడు.

వెంట ఒక డాక్టరూ, ఒక వార్డరూ ఉన్నారు. రక్తపోటును పరీక్షించే యంత్రాన్ని పట్టుకువచ్చారు. చాలాసేపు పరీక్షించారు. చివరకు రోజేయర్ ఇలా ప్రకటించాడు. "మిస్టర్ యశ్‌పాల్‌కు రక్తపోటు చాలా తక్కువగా వుంది. ఈ స్థితిలో యశ్‌పాల్ కోపగించుకోవడం సహజం !" ఆ తరువాత కూడా చాలాసేపు పరీక్షించడం జరిగింది. నా ఆహారాన్ని గురించి, ఇతర విషయాల గురించి ప్రశ్నలు అడిగాడు. తరువాత అనుభవం గల ఓ డాక్టర్‌లా అన్నాడు రోజేయర్. "రక్తపోటు తక్కువగా వుండడం భయపడవల్సిన జబ్బేమీకాదు. ఐతే, పంచమజార్జి ఈ రోగంతోనే చనిపోయాడనుకోండి ! ఐనా, ఫరవాలేదు !"

ఇది జరిగాక, నన్ను వేధించడం, గుచ్చిగుచ్చి ప్రశ్నలు వేయడం అన్నీ బంద్ అయ్యాయి.

బరేలీ జైల్లో చంద్రసింహ్ గఢ్‌వాలీ పరిచయం అయ్యాడు. 1930 లో, పెషావర్‌లో ఆంగ్ల ప్రభుత్వం ప్రజలను కాల్చడానికి ఆర్డర్ ఇచ్చింది. అప్పుడు గఢ్‌వాలీ సైన్యం ప్రభుత్వ ఆర్డర్‌ని తిరస్కరించింది. ప్రజల్ని కాల్చడానికి నిరాకరించింది. ఆ సైనిక విభాగానికి హవల్దార్ చంద్రసింహ్ గఢ్‌వాలీ. ప్రజల్ని కాల్చడానికి హుకుంజారీ అయినప్పుడు, మొట్టమొదటగా ఎదురు తిరిగి, ప్రభుత్వ ఆజ్ఞను తిరస్కరించింది ఇతడే ! చంద్రసింహ్‌తో పాటు ఇతడి సహ ఉద్యోగి మరొక సైనికుడు కూడా శిక్ష అనుభవిస్తూన్నాడు. అప్పటికే ఇద్దరూ ఆరు ఏడు సంవత్సరాల శిక్ష అనుభవించారు. ఖైదీ జమాదార్లయ్యారు ఇతర ఖైదీల్లో ఆర్యసమాజ ఆదర్శాల్ని ప్రచారం చేస్తూండేవారు ! జైల్లో స్వతంత్రంగా అటూ ఇటూ తిరుగుతూండేవారు. నాకు పరిచయం అయ్యాక మార్క్సిజాన్ని గురించి చెప్పసాగాను. మార్క్సిజం వైపు కొంత మొగ్గు చూపారు కూడాను ! చంద్రసింహ్ గఢవాలి నన్ను 'గురు' అని పిల్చేవాడు. నేనతడిని 'సోదరా' అని పిల్చేవాణ్ణి.

ఆ జైల్లో చౌరాచౌరీ సంఘటనలో అరెస్టయిన కాంగ్రెసు ఖైదీలు కూడా వున్నారు. వాళ్ళూ నా పరిచయాన్ని, స్నేహాన్ని కోరుతూండేవారు. చౌరాచౌరీ ఖైదీలు, రాజకీయ ఖైదీలని నిరభ్యంతరంగా చెప్పవచ్చును. ఐతే, వాళ్ళను బి. క్లాసులో చేర్పించడానికి కాంగ్రెసువారు ఎన్నడూ ప్రయత్నించలేదు.

మేజర్ రోజేయర్ మారిపోయాడు., అతడి స్థానంలోకి మేజర్ మలహోత్రా వచ్చాడు. మలహోత్రా చాలా మంచివాడు. దయ గలవాడు. ఐతే, తన దయను, మంచితనాన్ని కనబడనీయకుండా, కావాలని కొంత కాఠిన్యాన్ని ప్రదర్శిస్తూ వుంటాడు. ఎవరైనా లేని మంచితనాన్ని ప్రదర్శించి మన్ననలు పొందచూస్తారు. ఇతడు ఉన్న మంచితనాన్ని దాచి, లేని కఠినత్వాన్ని ప్రదర్శిస్తూ వుంటాడు. అప్పట్లో విలియమ్స్ అనే అతడు హెడ్ జైలర్‌గా వుండేవాడు. అతడు ఆంగ్లో ఇండియన్. చాలా నీచుడు. చాడీకోరు. ఆంగ్ల గవర్నర్లూ, వైస్రియీలూ తనకు సొంతమామలు అయినట్టు విర్రవీగుతూ వుంటాడు. మా దగ్గరకు వచ్చి "నీకెన్నేళ్ళు ? నువ్వు పుట్టిన తారీకేమిటి ?" అని అడుగుతూండేవాడు. ఆ తరువాత హి హి హి అని ఇకిలిస్తూ "సామ్రాట్ ఎనిమిదవ ఎడ్వర్డ పుట్టిన తేదీ, నేను పుట్టిన తేదీ ఒకటే !" అనేవాడు తానూ ఎడ్వర్డ వంశస్థుడైనట్టు ఫోజు పెట్టేవాడు. ఈ విలియమ్స్ తనను గురించిన రహస్య రిపోర్టులు పైకి పంపించవచ్చునన్న భయం మేజర్ మల్హోత్రాకు వుండి వుంటుంది. విప్లవకారుల పట్ల సానుభూతి కనబరుస్తూన్నాడన్న రిపోర్టు పంపినా ఆశ్చర్యపడవల్సిన పనిలేదు. అందువల్లనే గావును మల్హోత్రా విలియమ్స్ వెంట ఉన్నప్పుడు ఒక రకంగా ప్రవర్తించేవాడు మాతో ! విలియమ్స్ ప్రక్కన లేనప్పుడు మరో రకంగా ప్రవర్తించేవాడు.

# జైల్లో పెళ్ళి

ఒకనాటి సాయంత్రం, బారక్కు గేట్లు వేసేశారు. కొద్దిసేపటి తరువాత మేజర్ మల్హోత్రా పర్యవేక్షణకు మా బారక్కుకు వచ్చాడు. విలియమ్స్ వెంటలేడు. ఇద్దరు వార్డర్లు మాత్రం శరీర రక్షకులుగా వెంట వచ్చారు. ఇంగ్లీషులో కుశల ప్రశ్నల్ని అడిగాడు. తరువాత పంజాబీ భాషలో అడిగాడు. "ఇంతకూ మిస్ ప్రకాశవతి కపూర్ ఎవరు ? నువ్వు ఎరుగుదువా ? ఆమెను ?"

"విషయం ఏమిటో చెప్పండి " అడిగాను.

"అప్పుడే ఎవరితోటీ అనకు ! మిస్ ప్రకాశవతి కపూర్, డిప్యూటీ కమీషనర్ ద్వారా దరఖాస్తు పెట్టుకుంది. నిన్ను జైల్లోనే పెళ్ళి చేసుకుంటుందిట !" అని చెబుతూ మల్హోత్రా భావోద్రిక్తుడయ్యాడు. ఇలా అన్నాడు. "భగవంతుడి దయవల్ల నువ్వు విడుదల అయితే మంచిదే ! కానీ, ఈమె త్యాగాన్ని చూడు! ఇలాంటి త్యాగపూరితమైన, ధార్మిక భావన ఒక్క హిందువుల్లోనే చూడగలం. ప్రపంచంలో మరెక్కడా చూడలేము ! నువ్వు కూడా గొప్ప దేశభక్తుడవనీ, వీరుడవనీ నాకు తెల్సు ! నువ్వు నీ జీవితాన్ని దేశంకోసం త్యాగం చేశావు. నువ్వు అరెస్టు అయినప్పుడు రోజూ వార్తాపత్రికల్ని చూస్తూ నీ గురించి చాలా ఆసక్తిగా తెల్సుకుంటూ వుండేవాడిని. నీ త్యాగంకంటే కూడా ఈమె త్యాగం చాలా గొప్పది. నాకు నెహ్రూ కుటుంబానికి చెందినవారూ చాలామంది తెల్సు. విజయలక్ష్మీ పండిట్; శ్యామ్‌కుమారి నెహ్రూ - వీరందరూ నాకు పరిచయులే ! కానీ, ప్రకాశవతి త్యాగం అపూర్వమయింది. నిన్ను పెళ్ళి చేసుకుని ఈమె ఏమి సుఖాన్ని పొందగలదు ? హిందూ దేశం ఈనాటికీ బ్రతికివున్నదంటే, ఇలాంటి త్యాగమూర్తులయిన స్త్రీ రత్నాలవల్లనే బ్రతికి వుంది. ఇలాంటి త్యాగమూర్తిని దర్శనం చేసుకోబోతూన్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది !" అన్నాడు మల్హోత్రా. ఇంక నేనేం మాట్లాడను ?

మరుసటి రోజు ప్రభుత్వం నుండి డిప్యూటీ కమీషనర్ ద్వారా జాబు ఒకటి వచ్చింది. దాన్ని నాకు చూపించారు. "లాహోరు నివాసి మిస్ ప్రకాశవతి కపూర్, బరేలీ సెంట్రల్ జైల్లో ఖైదీగా వున్న, టెరరిస్టు యశ్‌పాల్‌ను వివాహమాడాలనుకుంటున్నది. ఖైదీ యశ్‌పాల్ ఈ వివాహానికి అంగీకరిస్తాడా ? అంగీకరించడా ?"

నేను నా అంగీకారాన్ని తెలియపరచాను. ఆగస్టు ఏడవ తారీఖున వివాహం జరగాలని నిశ్చయం అయింది.

కొద్దిరోజుల క్రితమే రమేష్ గుప్తను బరేలీ సెంట్రల్ జైలుకు మార్చారు. అతడు నన్ను 'అన్నయ్య' అని పిల్చేవాడు. అన్నయ్య పెళ్ళికి ఉత్సాహంగానే వున్నాడు. నా పెళ్ళి గురించి విన్న ప్రతి ఒక్కరూ మహాశ్చర్యపడిపోతున్నారు. జైల్లో ఖైదీకి పెళ్ళికావడం అనేది ఇంతవరకూ ఎవరూ వినలేదు! పెళ్ళయ్యాక కొన్నాళ్ళపాటు నన్ను ఇంటికి పంపుతారనీ కొందరు అనుకున్నారు.

పెళ్ళిరోజున ఉదయం ఎనిమిది గంటలకు ఆఫీసు నుండి పిలుపు వచ్చింది. విషయం తెల్సిందే కదా ! జైలు దుస్తులు, నూలుకోటు ప్యాంటూ ఉతికి ఇస్త్రీ పెట్టించుకున్నాను, వాటిని వేసుకున్నాను. పెళ్ళి డిప్యూటీ కమీషనర్‌గారి ఆఫీసులో, అక్కడికి వెళ్ళాలి ! జైలు ఆఫీసు గదిలోకి వెళ్ళగానే బేడీలు వేసుకోడానికి ఆర్డర్ అయింది.

"బేడీలు ఎందుకు ?" నేను విస్మయాన్ని ప్రకటించాను.

"జైలు నుండి బయటకు (డిప్యూటీ కమీషనర్‌గారి ఆఫీసుకు) వెళ్తున్నావు కదా ? బేడీలు వేయక తప్పదు !" సమాధానం వచ్చింది.

"కానీ, నేను పెళ్ళి చేసుకోవడానికి కదా వెళ్తున్నాను ? బేడీలతో ఎక్కడైనా పెళ్ళి చేసుకుంటారా ? మీరు బేడీలు వేసేట్టయితే, నేను పెళ్ళికి వెళ్ళను ! పెళ్ళి అయితే అవుతుంది ! కాకపోతే కాకపోతుంది !"

నన్ను కమీషనర్ ఆఫీసుకు తీసుకువెళ్ళడానికి వచ్చిన సబ్ ఇనస్పెక్టర్, బేడీలు లేకుండా నన్ను తీసుకువెళ్ళడం అన్న బాధ్యతను నెత్తిన వేసుకోడానికి సుముఖంగా లేడు.

జైలు సూపరింటెండెంట్ మేజర్ మల్హోత్రా ఇరకాటంలో పడ్డాడు. అతడు పోలీసు సూపరింటెండెంట్‌కు ఫోన్ చేశాడు. "ఖైదీ యశ్‌పాల్ బేడీలు వేసుకుని పెళ్ళికి వెళ్ళడానికి అంగీకరించడం లేదు !" అని చెప్పాడు. ఐతే, నన్ను బేడీలు లేకుండా బయటకు పంపించడం అన్న బాధ్యతను నెత్తిన పెట్టుకోడానికి పోలీసు సూపరింటెండెంట్ కూడా సిద్ధంగా లేడు.

నేను ఎలాంటి పరిస్థితిలోనూ బేడీలతో పెళ్ళి చేసుకోడానికి సిద్ధంగా లేను. మేజర్ మల్హోత్రా ఈ పరిస్థితిని గురించి డిప్యూటీ కమీషన్‌కు ఫోన్‌లో చెప్పాడు.

డిప్యూటీ కమీషనర్ మిస్టర్ పైడలే ఇరుకున పడ్డాడు. ఆయన జాబు ఆధారంగా ప్రకాశవతి, మా అమ్మగారు, మరి ఇద్దరు సాక్షులూ చాలా దూరాన్నుండి వచ్చారు. తన ఆఫీసులో కూర్చుని వున్నారు. కమీషనర్, మల్హోత్రాతో ఇలా అన్నాడు. "సూపరింటెండెంట్ వాదన, ఖైదీ వాదన - రెండు సబబైనవే! నేనే పెళ్ళికూతుర్ని తీసుకుని జైలుకు వస్తున్నాను. అక్కడే పెళ్ళి అవుతుంది !"

అనుకోకుండా సంభవించిన మరో ఇబ్బంది ఎదురైంది ఆ రోజు బరేలీలో, రిక్షావాళ్ళూ, బళ్ళవాళ్ళూ, టాక్సీవాళ్ళూ సమ్మె చేశారు ! పట్టణ కాంగ్రెస్ సెక్రటరీ సంతసింగ్, మా అమ్మగార్నీ, ప్రకాశవతినీ, హిందూస్తాన్ టైమ్స్ మేనేజర్ దేవీప్రసాద్‌శర్మగారినీ, శ్రీకృష్ణసూరిగారినీ - ఎలాగో కమీషనర్‌గారి ఆఫీసువరకూ తీసుకువచ్చారు. ఇక అక్కడి నుండి జైలువరకూ వారిని తీసుకురావడం సంతసింగ్ శక్తికి మించిన విషయం ! పైడలే ఒక రకంగా ఈ సమస్యనూ పరిష్కరించారు. తన కారులో

మా అమ్మగారినీ, ప్రకాశవతినీ తీసుకువచ్చారు. మిగిలిన ఇద్దరికి కూడా ఎవరిదో కారు దొరికింది ! మా అమ్మగారు, ప్రకాశవతి - డిప్యూటీ కమీషనర్ కార్లో వారితోపాటే రావడం వల్ల నలుగురూ పొరపాటుగా అభిప్రాయపడ్డారు. దాన్ని గురించి తరువాత చెబుతాను.

మిస్టర్ పైడలే జైలు ఆఫీసు గదినే వివాహపు కోర్టు చేయమన్నాడు. ఆధునిక వివాహం తాలూకు తంతు ప్రారంభమయింది. ఇద్దరమూ కొన్ని ప్రతిజ్ఞలు చేశాము. డిప్యూటీ కమీషనర్ పురోహితుడయ్యాడు. మతాన్ని గురించిన ప్రశ్న వచ్చినప్పుడు ప్రకాశవతి తాను సనాతన హిందూ మతానికి చెందిన వ్యక్తినని చెప్పుకుంది. నేను మాత్రం నా మతం "రేషనలిజ్మ్" అన్నాను. హిందీలో దీన్ని "బుద్ధివాద్" అనవచ్చును. (తెలుగులోనూ 'బుద్ధివాదం, అంటే సరిపోతుందేమో ! ॥అను॥)

మిస్టర్ పైడిలే ఇలా అన్నాడు. "ఈ కొత్త 'ఇజాన్ని' ఎన్నడూ వినలేదు. నాస్తికుడని రాయమంటావా ? లేక బౌద్ధుడని రాయమంటావా !"

"అలా రాయవద్దు ! నేను చెప్పినట్టే రాయండి !" అన్నాను.

మిస్టర్ పైడలే విసుక్కుంటూ 'రేషనలిజ్మ్' అనే రాశాడు. కోర్టు ఫీజు రూపాయి పావులా అడిగి పుచ్చుకున్నాడు. ప్రకాశవతి తరపున దేవీప్రసాద్ శర్మ, శ్రీకృష్ణసూరి సాక్షి సంతకాలు చేశారు. నా తరపున రమేష్ చంద్రగుప్త, మేజర్ మల్హోత్రా సంతకాలు చేశారు. సూరి వస్తూ ఐదారుసేర్ల మిఠాయి పట్టుకువచ్చాడు. దాన్ని అందరికీ పంచారు. జైల్లో ఎన్నడూ జరగని వింత జరిగింది ! వివాహ సందర్భంగా మా అమ్మగారితోటీ, ప్రకాశవతితోటీ - ఇతరుల్తోటీ సరదాగా మాట్లాడుకోడానికి ఒక గంట అవకాశాన్ని ఇచ్చాడు మల్హోత్రా ! గంట తరువాత వాళ్ళు జైలుగోడలకు అటు, నేను ఇటు !

వివాహం అయ్యాక, రెండవ రోజునో, మూడవరోజునో - సి. క్లాసు రాజకీయ ఖైదీలు నాకో పెద్ద వుత్తరాన్ని రహస్యంగా పంపించారు. ఒక రావునిండా పెన్సిల్‌తో రాసివుందా జాబు ! ఆ జాబులోని విషయం ఇలా వుంది. "విప్లవకారులైన మీరు ఇలా ప్రవర్తించినందుకు మేము చాలా బాధపడుతున్నాము. విప్లవకారుల పేరును కళంకితం చేయకండి ! జైలునుండి విడుదల కావడం కోసం మీరు ఆంగ్లేయుడైన డిప్యూటీ కమీషనర్ కూతుర్ని వివాహమాడారు. చాలామంది రాజకీయ ఖైదీలు సి. క్లాసులో, జన్మఖైదును అనుభవిస్తున్నారు. మీరు సుఖమైన బి. క్లాసులో వుంటూ కూడా ఇలాంటి పనిచేసినందుకు చాలా బాధపడుతూన్నాము. ఈ మాత్రం కష్టాన్ని కూడా భరించలేరా మీరు ?........

జైలువార్డర్లు కొంత సమాచారాన్ని ఇచ్చారు. జైలు వివిధ బ్లాకుల్లో వుండే ఖైదీలు మా వివాహాన్ని గురించి రకరకాలుగా చెప్పుకుంటున్నారట ఆంగ్లేయుడైన కమీషనర్ తన కూతుర్ని చీరకట్టించి తీసుకువచ్చి, నాకు ఇచ్చి పెళ్ళి చేశాడని చెప్పుకోసాగారు. ప్రభుత్వమూ, నేను ఒక ఒప్పందానికి వచ్చామనీ, ఇంక నన్ను వదలిపెడతారని చెప్పుకుంటున్నారు. ఇలాంటి అపోహలకూ, అపవాదులకూ కారణం స్పష్టమే ! టాంగాలూ, ఇతర వాహనాలూ సమ్మెలో వుండడంవల్ల ప్రకాశవతి కమీషన్ కార్లో జైలువరకూ వచ్చింది. అదే ఈ అపవాదులకు కారణం ! పంజాబీ స్త్రీలు మామూలుగానే పసిమిగా వుంటారు. పెళ్ళికోసం ప్రత్యేకం పౌడరు కొట్టి వుంటుంది. దాంతో ఖైదీలు ప్రకాశవతిని ఆంగ్ల వనిత అనుకున్నారు.

జైల్లో పెళ్లి జరగడం గురించి ప్రభుత్వ దృష్టికి ఎక్కింది. ఏ సరదాలూ, సంస్కారాలు లేని ఆ పెళ్ళి, నీరసమైన కాగితాలమీద పెళ్ళిగానే జరిగింది. అయినా, ప్రభుత్వపు కన్నెర్రకు కారణం అయింది. ఈ పెళ్ళి వల్ల జైలు యొక్క భయంకరత్వం కొంత తగ్గుతుందని ప్రభుత్వానికి భయం !

సచివాలయం నుంచి ఎంక్వయిరీ ప్రారంభమైంది. జైల్లో పెళ్ళి ఎలా జరిగింది ? ఎందుకు జరిగింది ? మల్హోత్రాని ప్రశ్నించారు. అతడు నిర్భయంగా "వివాహం డిప్యూటీ కమీషనర్ ఆజ్ఞతో, అనుమతితో జరిగింది ! వివాహం జరిగిన గది డిప్యూటీ కమీషనర్‌గారి కచేరీగా మార్చబడింది. మరి అప్పుడు ఆ ప్రదేశం జైలు సూపరింటెండెంట్‌నైన, నా ఆధీనంలో లేదు. నేను అప్పుడు అక్కడ కేవలం

ప్రేక్షకమాత్రుడిగానే వున్నాను. జైలు మాన్యుయల్‌లో, జైలులో పెళ్ళి జరగరాదన్న నిషేధంగానీ, జరగవచ్చునన్న అనుమతిగానీ - రెండూ లేవు. కనుక ఈ విషయంలో నిర్ణయం తీసుకునే బాధ్యత కమీషనర్‌గారికే వదిలి వేశాను ! నా బాధ్యత ఏమీలేదు" అని చెప్పేశాడు.

జైల్లో వివాహం జరగడం అన్న సమస్య అంతటితో ఆగిపోలేదు. డిప్యూటీ కమీషనర్ మిస్టర్ పైడలేని సంజాయిషీ అడిగారు. 'జైల్లో ఖైదీ వివాహానికిఎలా అనుమతించారని ?, ప్రశ్నించారు. బ్రిటీష్ ఆఫీసర్లు భారతీయ ఆఫీసర్లలా పిరికివాళ్ళు కాదు. పైడలే ఇలా సమాధానం ఇచ్చాడు. "జైలు నియమాల్లో గానీ, అనూచానంగా వస్తున్న అనుభవాల్ని బట్టి గానీ - ఖైదీకి పెళ్ళి జరగరాదని గానీ, లేక జైల్లో ఖైదీకి పెళ్లి జరగరాదని గాని - స్పష్టమైన ఆదేశాలు ఎక్కడా లేవు. మిస్ ప్రకాశవతి, ఖైదీ యశ్‌పాల్‌ని వివాహం చేసుకుంటానని దరఖాస్తు పంపుకుంది. ఆమె దరఖాస్తు కాదనడానికి నాకేమీ కారణం కనుపించలేదు. కనుక, అనుమతిని ఇచ్చాను."

ఇది జరిగిన కొద్ది నెల్లకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ హోంమెంబరు సర్ మహారాజసింహ్ బరేలీజైల్ను చూడడానికి వచ్చాడు. ఆయనగారి దర్శన భాగ్యం నాకూ కలిగింది. వార్డర్లు నా పరిచయాన్ని ఇచ్చారు.

సర్ మహారాజసింహ్ అన్నాడు. "నిన్ను జైల్లో వుంచడం వల్ల మాకు ఏదో ఒక తలనొప్పి వ్యవహారాన్ని తెచ్చిపెడుతూనే వున్నావు ! జైల్లో పెళ్ళి చేసుకోవడం వల్ల నీకు ఏమి ప్రయోజనం జరిగింది ! మాకు కొత్త సమస్యను తెచ్చిపెట్టావు !"

"మీరు చూస్తూనే వున్నారు గదా ? నాకేమీ ప్రత్యేకమైన ప్రయోజనం జరగలేదు. నేను మీ ప్రభుత్వ బోనులో బంధింపబడి వున్నాను. ప్రభుత్వ అనుమతీ, ప్రభుత్వ ఆఫీసర్ల అనుమతితోనే కదా, జరిగిందీ పెళ్ళి !" అన్నాను.

మహారాజసింహ్ "నీకు ప్రయోజనం జరిగినా జరక్కపోయినా, మాకు మాత్రం తలనొప్పి అయికూచుంది. జైలు మాన్యుయల్‌లో 'ఖైదీకి జైల్లో వివాహం జరగరాదన్న, కొత్త నియమాన్ని ఒకదాన్ని చేర్చవలసి వచ్చింది !" అన్నాడు.

నేను నవ్వేశాను "పోనీయండి ! ఒక అద్భుతం జరిగింది. ఇలాంటిది గతంలో జరగనూ లేదు. భవిష్యత్తులో జరగనూబోదు !" అన్నాను.

ఈ వివాహం వల్ల నాకు తక్షణ ప్రయోజనం ఏమీలేకపోయినా, బ్రిటీష్ ప్రభుత్వపు నియమనిబంధనల గురించి ఉదాహరణ లభిస్తుంది !

# జైల్లో అధ్యయనం

1937 మార్చినెల అనుకుంటాను. ఒకరోజు ఉదయం సమాచారం అందింది. రమేశ్ చంద్రగుప్తనీ, నన్నూ నైనీ సెంట్రల్ జైలుకు మారుస్తున్నారని తెల్పింది. అక్కడే విప్లవకారులైన ఖైదీలందర్నీ వుంచుతారనీ తెల్సింది.

నేనూ రమేశ్‌చంద్రగుప్త - పులకిత హృదయంతో స్టేషన్ నుండి నైనీ జైలుకు వెళ్ళాము. జైల్లో విప్లవపార్టీ యొక్క అతిరథులూ, మహారథులూ ఐన నాయకుల్ని కల్సుకోబోతున్నామన్న భావన మమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది ! శచీంద్రనాథ్ సన్యాల్, యోగేశ్ చంద్రచటర్జీ - వీరిని గురించి

విన్నాం! కలుసుకునే అవకాశం దొరకలేదు. వీరిని ఎన్నడూ చూడకపోయినా వీరిపట్ల మా హృదయాల్లో గొప్ప శ్రద్ధ వుంది. వీరిని గురించి కథలూ, గాథలూ మామీద ఎంతగానో ప్రభావాన్ని వేశాయి. సన్యాల్ దాదా రాసిన 'బందీ - జీవన్' అనే పుస్తకం సాయుధ పోరాటంలో మాకు పాఠ్యగ్రంథంగా పనిచేసింది.

ఓ పెద్ద యార్డులో రెండు బారక్కులున్నాయి. నేనూ, రమేశ్‌చంద్ర గుప్త ఆ యార్డులోకి వెళ్ళినప్పుడు యార్డ్ అంతా నిర్మానుష్యంగా వుంది. మేమేముందుగా వచ్చాం. ఆ తరువాత రోజుకు ఇద్దరూ, ముగ్గురూ చొప్పున విప్లవకారులైన ఖైదీలు రాసాగారు. బారక్కు నిండిపోయింది. శచీంద్రసన్యాల్, యేగేష్‌చటర్జీ, శచీంద్ర బక్షీ, మన్మథనాథ్ గుప్త, ముకుందీలాల్ వీళ్ళందరూ కాకోరీ కుట్రకేసు ఖైదీలు వీరుకాక సువిమల్‌కుమార్‌రాయ్, శంభూనాథ్, బల్‌రాజ్, రాజేంద్రనిగమ్ మొదలైన వివిధ కేసులకూ సంబంధించిన ఖైదీలూ వచ్చారు. కాశీరామ్, నేనూ హిస.ప్ర.స. సభ్యులం. కమ్యూనిస్టు పార్టీ సభ్యులు శివసింహ్ కూడా వచ్చాడు. కాన్పూరుకు చెందిన మజ్‌దూర్ సభ కార్యకర్త కూడా ఒకతను వచ్చాడు. బారక్కు అంతా ఒకటే సందడి.

వీరంతా బాగా అనుభవం గలవారు ! ఇలా అనుభవజ్ఞులైనటువంటి విప్లవకారులందర్నీ ఒకచోట చేర్చడం వల్ల విప్లవకారుల సంఘటిత శక్తి పెరుగుతుంది. కలిసికట్టుగా అధికారుల దౌర్జన్యాన్ని ఎదిరించడమూ జరుగుతుంది. ఈ సుగుణంతో పాటు ఒక దుర్గుణమూ అంటిపెట్టుకొని వుంటుంది. పరస్పరం కీచులాడుకోవడం చిన్న చిన్న విషయాల క్కూడా పంతాలకూ, పట్టింపులకూ పోవడం జరుగుతుంది. కనుకనే, మేమందరం ఏమాత్రమూ, కాలాన్ని వృధాపోనివ్వకుండా చూసుకున్నాం. సామూహిక అధ్యయనాన్ని ప్రారంభించాము. కొన్ని నియమాలను ఏర్పరచుకున్నాము. మాలో ఎవరేగాని జైలు అధికారుల్తో వ్యక్తిగత సంబంధాలను పెట్టుకోగూడదు. వ్యక్తిగతంగా జైలు అధికారుల్ని ఏమీ అడగరాదు. ప్రతి ఒక్క విషయమూ బారక్కులోని అందరి తరపునా సమిష్టిగా జరగవలసిందే ! మా అందరి తరపునా నన్ను నాయకుడిగా ఎన్నుకోవటం జరిగింది. నాయకుడన్నవాడు కొంతవరకు న్యాయమూర్తిగా కూడా వ్యవహరించవలసి వుంటుంది. అక్కడికొచ్చిన విప్లవకారులందరూ అతిరథ మహారథులు వాళ్ళకు సలహాదారుగాగాని నాయకుడిగా గాని ఉండగలగటం తేలికైన పనికాదు. అలాంటి బాధ్యతను మిత్రులందరి సలహా, సంప్రదింపుల్తోనే నిర్వహించగలుగుతాను.

నాకంటే ఎంతో అనుభవం గల మిత్రుల మధ్య ఉంటూ 'నేను గొప్పవాణ్ణి మేధావిని. కనుకే నన్ను నాయకుడిగా ఎన్నుకున్నారు' అనుకోవడం గొప్ప మూర్ఖత్వం ఔతుంది. సన్యాల్ దాదా బెంగాల్‌కు చెందిన 'అనుశీలన్' అనే విప్లవ సంఘానికి నాయకుడు. యోగేష్‌దాదా 'యుగాంతర్' పార్టీ నాయకుడు ఈ రెండు సంఘాలకూ ఎప్పుడూ పోటాపోటీగా ఉండేది. ఆ పోటీ భావన వీరి వ్యక్తిగత ప్రవర్తనలోనూ, వీరి రాజకీయ సిద్ధాంతాల్లోనూ తాత్విక భావనల్లో కూడా కొంత వ్యక్తం అవుతూండేది !

సన్యాల్ దాదా ఆధ్యాత్మవాది. భక్తితత్వం కంటే గాంధీగారి ఆధ్యాత్మ వాదానికి వీరి భావాలు దగ్గరగా వుంటావు. ఇంకా వివరంగా చెప్పాలంటే ఆధ్యాత్మికంగా అరవిందుడి అనుయాయి, సన్యాల్ దాదా ! వీరు 'భారతదేశానికి ఆధ్యాత్మ నిర్దేశితమైన ప్రజాతంత్ర సరిపడుతుందం'టారు. యోగేశ్ దాదా అలాకాదు. మార్క్సిజం వైపు మొగ్గు చూపుతారు. వెనకా యోగేశ్‌దాదా మార్క్సిజాన్ని చదివాడు. జైల్లోనూ బాగా అధ్యయనం చేశాడు. మిగిలిన వాళ్ళల్లో ఎవరూ కూడా ఆధ్యాత్మవాదాన్నీ, ఆదర్శవాదాన్నీ అంగీకరించరు. మేమందరం కల్సివుండడం వల్ల ఒకరి భావాల్ను మరొకరు తెల్సుకోవడానికి, మంచి మంచి గ్రంథాలను అధ్యయనం చేయడానికి అవకాశం దొరికింది. సాహిత్య గోష్ఠుల్నూ జరుపుతూండేవారం భావాల పరిణతకూ, ప్రగతికీ - ఇవి ఎంతగానో తోడ్పడేవి. నేను. ఫతేహ్‌గఢ్ సెంట్రల్ జైల్లో రాసిన కొన్ని కథల్ని మిత్రులు అడగగా చదివి వినిపించాను. సన్యాల్ దాదా, యోగేశ్‌దాదా, బక్షి మన్మథనాథ్ గుప్త

వాటిని విన్నారు. చాలా బాగున్నాయని మెచ్చుకున్నారు. నాకు ధైర్యం వచ్చింది. ఫతేహ్‌గఢ్ జైల్లో ఉన్నప్పుడూ సాహిత్యకమైన వాదోపవాదాలు జరుగుతూండేవి. అప్పటికే మన్మధనాథ్ ఇంగ్లీషులోనూ కవిత్వాల్ని కథల్నీ రాస్తూండేవాడు. నేను హిందీలో మాత్రమే రాసేవాణ్ణి ! ఒకమాటు అనటోల్ ఫ్రాన్సు రాసిన ఒక గ్రంథంలోని ఒక పేరాను మన్మధ్‌కు చూపించాను. ఆ పుస్తకం ఫ్రంచి పుస్తకం. నేను చూపించిన పేరా చాలా గొప్పగా వుంది. మన్మధనాథ్ ఆ పేరాను చదివాడు. విషయం దృష్ట్యానూ భాష దృష్ట్యానూ చాలా గొప్పగా వుందని పొగడాడు. నేను ఇలా అన్నాను. "బెంగాలీ భాషలో గానీ, హిందీలోగానీ - ఇదే పేరాను ఇంతకంటే గొప్పగా అనువాదం చేయాలి !"

మన్మథ్ ఇలా అన్నాడు. "అసంభవం ! అనువాదం ఇంతకంటే బాగా ఎన్నటికీ రాదు. ఎంత గొప్పగా చేసినా, అనువాదం అనువాదమే !"

నేను మౌనంగా ఆ పేరాను హిందీలోకి అనువాదం చేశాను. మన్మధనాథ్‌తో ఇలా అన్నాను. "ఫ్రంచి మూలాన్ని మరొకమాటు చదువు, నేను చేసిన ఈ అనువాదాన్ని కూడా చదువు. తప్పు ఏమిటో చెప్పు. బాగుండకపోతే మరోమాటు ప్రయత్నిస్తాను !"

విమర్శనాత్మక దృష్టితో మన్మథ్‌నాథ్ మూలాన్ని, నా అనువాదాన్ని కూడా ఒకటి రెండుమార్లు చదివాడు. తరువాత ఇలా అన్నాడు. "మూలం కంటే కూడా అనువాదం సరసంగా వుంది".

ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి మెజారిటీని సంపాదించింది. కాంగ్రెస్ మంత్రులు పదవుల్ని స్వీకరించాక త్వరలో మేము విడుదల కావచ్చునన్న ఆలోచన బలమైంది. అప్పుడు అక్కడున్న మేమందరమూ విడుదల అయ్యాక తిరిగి మా ఆదర్శం కోసం పోరాటాన్ని చేపట్టాలన్న నిర్ణయాన్ని చేసుకున్నాం. మా లక్ష్యాన్ని గురించి కూడా స్పష్టమైన అవగాహనకు వచ్చాము. కాకోరీ మిత్రులు అరెస్టయ్యాక, తిరిగి విప్లవ సంఘాన్ని పునరుజ్జీవింపచేసిన భగత్‌సింగ్ మొదలైనవారు విప్లవసంఘం పేరులో సామ్యవాదం అన్న శబ్దాన్ని జోడించారు. ఈ శబ్దాన్ని జోడించడం యాదృచ్ఛికం కాదు. కావాలనే సామ్యవాదం అన్న శబ్దాన్ని చేర్చేరు. అప్పుడు నైనీ సెంట్రల్ జైలులోని మిత్రుల్లో కేవలమూ సన్యాల్‌దాదా ఒక్కరికి సామ్యవాదమన్న శబ్దాన్ని చేర్చటం అంతగా ఉపయోగకరం కాదనిపించింది. సన్యాల్‌దాదాకు సామ్యవాద సమాజంపట్లగాని, వ్యవస్థపట్ల గాని, నిరసన లేదు. సామ్యవాద సిద్ధాంతం కేవలం భౌతికవాదం మీద ఆధారపడడమే వారికి నచ్చదు. సన్యాల్ దాదాకు ఆధ్యాత్మిక సమాజంమీద మక్కువ ఎక్కువ ! ఐతే, ఆధ్యాత్మిక సమాజవాదం అనేది ఎక్కడా ఇంతవరకూ ప్రామాణికతను పొందలేదు. అది ఒట్టి కల్పన మాత్రమే. మిగిలిన మిత్రులందరూ మార్క్స్ ప్రతిపాదించిన గతితార్కిక భౌతికవాద సిద్ధాంతాన్ని నిర్ద్వంద్వంగా అంగీకరించారు. మేము క్రమంగా మార్క్స్ చెప్పిన గతితార్కిక భౌతికవాదం ఆదర్శంగా పరిఢవిల్లనున్న సామాజిక ఆర్థిక తత్వాలను అవగతం చేసుకోసాగాము. హిందుస్థాన్ సామ్యవాద ప్రజాతంత్ర సంఘ సభ్యులందరూ దాదాపుగా మార్క్స్ ప్రవచించిన గతితార్కిక భౌతికవాదాన్ని అంగీకరించారు. అండమాన్ దీవిలోని జైల్లో మా సంఘ సభ్యులందరూ మొత్తంగా మార్క్సిజాన్ని స్వీకరించారు.

నైనీ జైల్లో మేమందరమూ స్పష్టమైన కార్యక్రమాన్ని నిర్ణయించుకున్నాము. ఉదయం ఫలాహారమయ్యాక క్లాసులు జరుపుకునే వారము. ఏదో ఒక విషయాన్ని గురించిన అధ్యయనాన్ని సాగించేవారం. ఈ అధ్యయన తరగతుల్లో యోగేష్‌దాదా చాలా ఉత్సాహంగా పాల్గొనేవారు. మధ్యాహ్నం 12 గంటలకు భోజనం, విశ్రాంతి ! తిరిగి మూడు గంటలకు టీ తాగి అధ్యయనానికి కూర్చొనేవారం. సాయంకాలం వాలీబాల్‌గానీ, బాట్‌మెంటన్‌గాని ఆడేవారం. అది కొంత వ్యాయామంగా వుండేది.

రాత్రిపూట ఎవరికివారు చదువుకునేవారు. పగలు అర్థశాస్త్రం, వేదాంతం, రాజకీయం మొదలైన విషయాల గురించి సామూహిక అధ్యయనం సాగేది. రాత్రిపూట సాహిత్య గ్రంథాల్ని చదువుకునేవారం.

మిత్రుడు శివసింహ్ అధ్యయన తరగతులు క్రమంగా సాగటానికి సహకరించేవాడు. అతడు ఏ విప్లవ సంఘానికీ చెందినవాడు కాదు. ఐనప్పటికీ అతని జీవితం అద్భుతమైన, విచిత్రమైన ఘటనలతో నిండి వుంది. యువకత్వంలో సిక్కు మతాన్ని ప్రచారం చేయడానికి బర్మా వెళ్ళిపోయాడు. బర్మా నుండి సింగపూరు, మలయామీదుగా ఆస్ట్రేలియా వెళ్ళాడు. అక్కడ నుంచి అమెరికా వెళ్ళాడు. అమెరికాలోనే అతడు కమ్యూనిజాన్ని అధ్యయనం చేశాడు. అమెరికా నుండి స్పెయిన్, ఫ్రాన్స్ జర్మనీ మొదలైన దేశాలు వెళ్ళాడు. తరువాత రష్యా వెళ్ళాడు. రష్యాలో రెండు సంవత్సరాలు ఉండి కమ్యూనిజాన్ని గురించి బాగా చదివాడు. కొన్నాళ్ళు కార్మికుడిగా జీవితాన్ని గడిపాడు అక్కడ. అక్కడ నుండి టర్కీ, ఇరాన్ మీదుగా భారతదేశం వచ్చాడు. కనుకనే మా అధ్యయన తరగతులకు శివసింహ్ అధ్యాపకుడయ్యాడు.

ఈ అధ్యయన క్లాసులకు విధిగా అందరూ హాజరు అవాలన్న నియమమూ లేదు. అందరూ హాజరు అయ్యేవారూ కాదు. సన్యాల్ దాదా ఈ అధ్యయనమే అనవసరం అనుకునేవారు. కొందరు మిత్రులు పెద్దగా చదువుకోక పోవడం వల్ల ఈ తరగతుల్లో పాల్గొనలేకపోయేవారు. మరి కొందరికి ఈ తరగతుల పట్ల ఆసక్తి లేదు. అలాంటివారిలో సువిశాల్‌కుమార్ రాయ్ ఒకడు ! ఇతడు బారక్కుకు సంబంధించిన వంటా - వార్పూ బాధ్యతల్ని స్వీకరించాడు. కొద్ది మాంసాన్ని సన్నని ముక్కలుగా తొరిగి వాటిని నాలుగయితు పిల్లులకు వేస్తూ, వాటిలో వాటికి పోరాటం పెడుతూ కాలం వెళ్ళబుచ్చుతూండేవాడు. అలా చేయడం అతడికోసరదా ! 'స్టేట్సుమెన్, పత్రిక నొక్కదాన్ని మాత్రం చదివేవాడు. 'స్టేట్సుమెన్' రాగానే మొదట అతడికి ఇవ్వకపోతే, బిక్కముఖం వేసేవాడు. అందులోనూ, ఒకే ఒక్క విషయాన్ని చూసేవాడు. రైల్వే టైంటేబుల్‌లో ఏమైనా, మార్పు జరిగిందేమో చూసుకునేవాడు. సువిమలకుమార్‌రాయ్ కొన్ని సంవత్సరాలుగా అలా చూస్తున్నాడు. అతడు ఇలా అంటాడు. "మనకు తెలియని ఏ కారణం వల్లనైనా, ఏ క్షణాన్నయినా విడుదల కావచ్చుకదా ? రైల్వే టైంటేబుల్ తెలియకపోతే, తక్షణం బనారస్ వెళ్ళే బండిని అందుకోలేం కదా ?"

సువిమల్‌కుమార్‌రాయ్, తనకు విప్లవ కార్యక్రమాలతో గానీ, రాజకీయాల్తో గానీ ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టంగా చెప్పేవాడు. ఇతడి చెల్లెలు విప్లవకారుల పట్ల సానుభూతి కలిగి వుండేది. విప్లవకారులకు సహాయ, సహకారాల్ని అందిస్తూ వుండేది. ఆ విషయం ఇతడికి బొత్తిగా తెలియదు. ఒకరోజున ఇతడికి తెలియకుండానే చెల్లెలు ఒక బాంబును తెచ్చి ఇంట్లో పెట్టింది. అనుకోకుండా ఆ బాంబు ప్రేలింది. చెల్లెల్ని అరెస్టు చేసే పరిస్థితి ఏర్పడింది. చెల్లెలు అరెస్టయితే, కుటుంబ గౌరవం ఏమయ్యేట్టు ? 'తానే పరారైపోతే పోలీసులు తననే వెదుకుతారు కదా ? అపరాధం తనమీదకే వస్తుంది. పోలీసులు తననే అరెస్టు చేస్తారు' ఇలా ఆలోచించి సువిమల్‌కుమార్‌రాయ్ పరారయ్యాడు. మర్నాడే పోలీసులకు లొంగిపోయాడు. రహస్య జీవితంలో సువిమల్‌రాయ్‌ని అన్నింటికంటే కధికంగా బాధించిన విషయం 'రెంటికి ఎక్కడకు వెళ్ళడం ?" అన్నది ! తమ ఇల్లూ, పట్నంలోని బంధువుల ఇళ్ళూ కాక, మరో చోటికి ఎన్నడూ వెళ్ళి ఎరగడు ! పల్లెల్లో ఎన్నడూ వుండలేదు. ఆరుబయట ప్రదేశానికి చెంబుబట్టుకు వెళ్ళడం అసలు తెలియదు. ఆరుబయట ప్రదేశంలోనో, చేలల్లోనో కూచుంటే గడ్డీ, గాదం, మోళ్ళూ పిర్రలకు గుచ్చుకుంటూ వుంటాయి. మొదటిరోజు ఓ చెట్టు కొమ్మమీద కూర్చుని బాధను నివృత్తి చేసుకున్నాడు. రోజూ అలా కూచోడానికి ధైర్యం చాల్లేదు. క్రిందపడతానన్న భయం వేధించసాగింది!

ఇక లాభంలేదనుకుని పోలీసులకు తనను తాను వప్పచెప్పుకున్నాడు. ఎన్ని బాధలు పడ్డా మధ్యతరగతి గౌరవనీయ కుటుంబ స్త్రీ గౌరవాన్ని బజారుపాలు కానీయలేదు. ఏడు సంవత్సరాల జైలు జీవితాన్ని అనుభవించాడు. దీన్ని పిరికితనం అందామా ? కాక, సాహసం అందామా ? దేశం కోసం, స్వాతంత్ర్యం కోసం మేము పడ్డంత శ్రమా, సువిమల్‌కుమార్‌రాయ్ మధ్యతరగతి గౌరవనీయ కుటుంబ స్త్రీ గౌరవాన్ని అక్షుణ్ణంగా వుంచడానికి తను పడుతున్నాడు. మరోవైపున పండిట్ జవహర్‌లాల్ భార్యా, సోదరిలాంటి స్త్రీలు ఢంకా బజాయించి జైళ్ళకు వెళుతున్నారు !

# విడుదలకు ఆటంకాలు

1937 జులై నెల, వైస్రాయి, గవర్నర్లు, కాంగ్రెసువారికి హామీ ఇచ్చారు. పరిపాలనా సంబంధమైన వ్యవహారాల్లో దాదాపుగా కలుగచేసుకోమనే అన్నారు. పదకొండు ప్రాంతాల్లో కాంగ్రెసు మంత్రివర్గాలు ఏర్పడ్డాయి. ఎన్నికల్లో కాంగ్రెసువారు ప్రజల ముందుంచిన ప్రణాళికలో రాజకీయ ఖైదీలందర్నీ - విప్లవకారుల్తో సహా, విడుదల చేస్తామన్నారు. సత్యాగ్రహోద్యమంలో అరెస్టయిన ఖైదీలందరూ విడుదలై వెళ్ళిపోయారు. మమ్మల్నీ విడుదల చేస్తారనుకుంటున్నాము. ఇంతలో ఇద్దరు మిత్రులు అమాంతంగా అమరవీరులయిపోవాలనుకున్నారు ! అందర్నీ విడుదల చేయకపోతే, ఆ మరణ నిరాహారదీక్ష పూనుతున్నాం. అని ప్రకటించారా ఇద్దరు మిత్రులు, దాదాపు అప్పుడు జైల్లో వున్న మిత్రులందరికీ వీరి ఈ 'నిరాహారదీక్ష' అనవసరమైనదనిపించింది.

బారక్కు నాయకుడిగా నేను బాగా ఇరకాటంలో పడ్డాను. "నిరాహారదీక్ష సాగిస్తున్న మిత్రులకూ, మాకూ ఎలాంటి సంబంధమూ లేదు'. అని చెప్పడమూ కష్టమే ! కాక, నిరశన వ్రతాన్ని సమర్థిస్తున్నామనడమూ బాధాకరమే ! మరో ఇబ్బంది కూడా ఎదురయింది. అప్పుడు నైనీ జైలు సూపరింటెండెంట్ మేజర్ భండారి, విప్లవకారులు ఏదైనా పొరపాటుగానీ చేస్తే, దాన్ని ఆసరగా తీసుకుని కొత్త ప్రభుత్వం నుండి మెప్పుకోలు పొందాలని చూస్తున్నాడతడు ! ఐతే, అతడి పప్పులుడికేట్టు లేవు. విధానసభ సభ్యుల్లో అత్యధికులకు విప్లవకారుల్తో వ్యక్తిగత పరిచయాలు వున్నాయి. భండారి ఆటలు సాగటం లేదు.

కాకోరీ కేసు ఖైదీ రామకృష్ణ ఖత్రి తన శిక్షను పూర్తి చేసుకుని విడుదలయ్యాడు. అతడు ఇతర విప్లవకారుల్ని విడిపించడం కోసం మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. జైల్లోకి వచ్చి మాకు ధైర్యం ఇస్తుండేవాడు. కాంగ్రెసు ప్రభుత్వం తెచ్చిన కొత్త మార్పుల్ని గురించి చెప్తుండేవాడు. విధానసభ, సచివాలయంలో ఖద్దరు గుడ్డలకూ, టోపీలకూ మంచి పలుకుబడి ఏర్పడ్డదని చెప్పేవాడు! డ్యూటీలో వుండే ఇంగ్లీషు సార్జంట్లు మంత్రుల ముఖాల్నీ, నాయకుల ముఖాల్నీ, పోల్చుకోలేకపోయేవారు. ఖత్రీ ఖద్దరు డ్రస్సు వేసుకుని, ఖద్దరుటోపీ పెట్టుకుని వెళ్ళేవాడు. డ్యూటీలో వున్న ఆంగ్లసార్జెంట్ నిగ్రనీలిగి, మడమకు మడమ ఫట్‌న టాకించుకుని శ్యాల్యూట్ చేసేవాడుట !

రామకృష్ణ ఖత్రి చెప్పే పై మాటల్ని వింటుంటే యువఖైదీలు పొంగిపోయేవారు. ఇంకేం కావాలి ?

ఆగస్టు నెల సూపరింటెండెంట్ దగ్గర్నుండి వార్డర్ వరకూ అందరూ హుషారుగా ఉన్నారు. కొత్త డ్రస్సు వేసుకున్నారు. హడావిడిగా ఉన్నారు. కారణం ముఖ్యమంత్రి రాబోతున్నారు. మేమందరం

ఎంతో శాంతంగా నిబ్బరంగా వున్నాము. మాబాబో, బాబాయో వస్తున్నట్టుగా వుంది మా అందరికి ! జైలువార్డర్లూ, సచివాలయ బంట్రోతులూ వెంటరాగా ముఖ్యమంత్రి పండిత గోవిందవల్లభపంత్, శ్రీ వెంకటేశనారాయణ్‌తివారి వచ్చారు.

వెనక ఎవడైనా అధికారి వస్తున్నాడంటే ఎంతో ఆడంబరం చేసేవారు. వార్డర్లు అధికారులకు పది అడుగుల దూరంలో నిలబడేవారు. ఖైదీలందర్నీ బొమ్మల్లా కదలకుండా నిలబడి వుండమనేవారు. కానీ, ఇప్పుడు అలాంటి నిబంధన ఏదీలేదు. గోవిందవల్లభపంత్ కలివిడిగా వచ్చి మా మధ్యలో నిలబడ్డాడు. జైలుసిబ్బందినీ, అధికారుల్ని అవతలకి పొమ్మన్నాడు. శరీర రక్షకుల్ని పక్కకు పంపి, మా వీపుల్ని నిమురుతూ అందర్నీ పలకరించాడు. జైలుచరిత్రలోనే ఇది అపూర్వమైన విషయం.

పంత్‌జీ మమ్ముల్ని అందర్నీ చుట్టూ కూర్చోబెట్టుకున్నాడు. తాను మధ్యలో కూచున్నాడు. ఇలా చెప్పాడు. "కాంగ్రెసు పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో రాజకీయ ఖైదీలందర్నీ విడిచిపెడతానని ప్రకటించింది. మిమ్ముల్ని విడిచిపెడతాము. సందేహం లేదు. ఐతే, వెనుకటి నుండి, సత్యాగ్రహులైన అహింసాత్మక ఖైదీలకూ, ఆయుధ ధారణ చేసి హింసాత్మక కార్యక్రమాల్లో పాల్గొన్న విప్లవకారులకూ మధ్య కొంత అంతరాన్ని పాటించడం రివాజుగా వస్తూన్నది. పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఈ పరిస్థితుల్లో మీరు ఇంక హింసను వదిలివేస్తారనీ, హింసాత్మక కార్యక్రమాల్లో పాల్గొనరనీ - నేను అనుకుంటున్నాను. మిమ్ముల్ని వదిలిపెట్టడానికి నిబంధన అంటూ ఏదీ పెట్టడం జరగదు. అలాగే మీనుండి రాతకోతలూ కోరము. మీరు మా సొంత మనుషులకింద లెక్క. మాతోటి ఏదైనా ఒకమాట చెప్పుకున్నా, మీ ఆత్మాభిమానానికి దెబ్బ వుండదు. మీ అభిప్రాయాలు మారాయని, మీరు ఇప్పుడు హింసను విశ్వసించడం లేదని, హింసపట్ల మీకు విశ్వాసం లేదని - మాట మాత్రంగా నాతో చెప్పండి, చాలు ! నేను గౌర్నర్‌తో మీ విడుదల గురించి మాట్లాడేప్పుడు 'మీరు హింసాపద్ధతుల్ని విసర్జించారని' అధికారికంగా చెప్పడానికి వీలుంటుంది. మిమ్ముల్నందర్ని ఒదిలి పెట్టడం మాత్రం ఖాయం !"

పంత్‌గారి మాటలు పూర్తయ్యాయి. మేమందరమూ మౌనంగా వున్నాము. ఇంతలో సన్యాల్‌దాదా తన సహజ ధోరణిలో, కూచునే ఇలా అన్నారు. "మాకు ఎప్పుడూ హింసలో విశ్వాసం లేదు. మీముందు ఆ మాట ఒప్పుకుంటే మీకు కొంత ఆధారంగా వుంటుంది అనుకుంటే, అలాగే కానిద్దాము ! మాకు మాత్రం అభ్యంతరం ఏముంటుంది ?"

సన్యాల్ దాదా మాటలు విని పంత్‌గారు సంతృప్తి చెందారు. ఇతర మిత్రుల ముఖాలూ సంతృప్తిగానే వున్నాయి. నాకు మాత్రం ఇది నచ్చలేదు. నేను లేచి నిలబడి "రెండు మాటలు మాట్లాడతాను. అనుమతి నివ్వండి !" అని అనుమతిని అడిగి, తరువాత ఇలా చెప్పాను "మీరు కాంగ్రెసు ప్రభుత్వం మమ్ముల్ని విడుదల చెయ్యాలన్న తలంపుతోనే వుందని చెప్తూన్నారు. మేమూ అలాగే అనుకుంటున్నాము. మీ ముందు మా మనస్సులోని విషయాల్ని స్పష్టంగా చెప్పడానికీ మాకేమీ సంకోచం లేదు. కానీ, ప్రతి పనీ లేకమాట యొక్క అభిప్రాయం స్థితినీ, కాలాన్నిబట్టి మారిపోతూంటుంది. మా విడుదల గురించి మీరే మీ నిబంధన అంటూ పెట్టడం లేదు. నిజమే ! ఐతే, మా విడుదల సందర్భంగా మేము ఏం చెప్పినా, దానికీ మా విడుదలకూ కార్యకారణ సంబంధం తప్పనిసరిగా ఏర్పడుతుంది. ఈనాడు మేము 'పరిస్థితులు మారినయ్యి. కనుక మాకు హింసాత్మక కార్యక్రమాల్లో విశ్వాసం పోయింది' అన్నామనుకోండి, దానికి అర్థం ఏమిటి ? ఇంతకుముందు మాకు హింసలో నమ్మకం వుందన్న అర్థం రావడం లేదా ? నిజానికి హింసలో మాకు ఎన్నడూ నమ్మకంలేదు. మేమసలు

మమ్ముల్ని విడుదల చెయ్యండని కూడా అడగడం లేదు. అలా అడిగి మిమ్ముల్ని ఇబ్బందుల పాలు చెయ్యడం, ఇరకాటంలో పడవేయడం మాకు ఇష్టం లేదు. మమ్ముల్ని విడుదల చేయాలని మీరు మనస్ఫూర్తిగా అనుకుంటేనూ, ప్రజలు కూడా మమ్ముల్ని విడుదల చేయాలని కోరితేనూ విడుదల చేయండి ! లేకపోతే వద్దు ! మీరు దేశానికి ఏమైనా మేలుచేస్తే, అంతటితోనే తృప్తిపడతాము. అదే మా విడుదల అనుకుంటాము. ఇవ్వాళ మేము విడుదల గురించి ఏం చెప్పినా అది ఒక షర్తో, లేక నిబంధనో - తప్పకుండా అవుతుంది. ఇంతవరకూ మేము మా ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ వచ్చాము. మేము ఇలాగే ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని మీరూ కాంక్షిస్తారు. ఈ స్థితిలో 'ఇప్పుడు మాకు హింసలో నమ్మకం పోయింది' అని మాచేత అనిపించాలని మీరు కోరడమూ ఏమంత శోభస్కరంగా వుండదు ! ప్రజల నిర్ణయమే మా నిర్ణయం అని మేము అనేకమార్లు చెప్పాము. కనుక ప్రజలు మా విడుదలను కోరితే చేయండి. చివరకు మరొక్క విషయం కూడా చెప్తున్నాను. నన్నీ బారక్కుకు నాయకుడుగా ఎన్నుకున్నారు. ఆ హోదాలో ఇంతవరకూ మాట్లాడాను. ఐతే ఈ విషయమై మేమందరం కూర్చుని చర్చించుకునే అవకాశం లభించలేదు. కనుక, నా అభిప్రాయం మిత్రుల్లో ఎవరికైనా నచ్చకపోతే, వారు తమ అభిప్రాయాన్ని ప్రకటించవచ్చును !" అని కూచున్నాను.

కొంతసేపటివరకూ ఎవరూ మాట్లాడలేదు. తరువాత యోగేశ్ దాదా లేచి నిలబడి "మిత్రుడు యశ్‌పాల్ చెప్పిందాన్ని నేను సమర్థిస్తున్నాను !" అన్నాడు.

సన్యాల్‌దాదా కూడా "ఔను ! అంతే !" అన్నాడు. మిగిలిన మిత్రులందరూ మౌనంగానే తమ సమర్థనను తెలియపరచారు.

ఇది జరిగాక ఒక నెలరోజులకు అనుకుంటాను రామకృష్ణ ఖత్రి మమ్ముల్ని కల్సుకోడానికి వచ్చాడు. మమ్ముల్నందర్నీ వదిలిపెట్టడానికి ఆర్డర్ అయిందనీ, ఆర్డర్ కాపీ రావడానికి రెండుమూడు రోజులు పట్టవచ్చుననీ అన్నాడు. మరో విషయం కూడా చెప్పాడు. "విడుదల అయ్యాక ఎటువాళ్ళు అటు పోకండి ! అలహాబాద్ కాంగ్రెసు ఆఫీసు దగ్గరకు అందరూ వస్తే, విప్లవకారుల గౌరవార్థం వూరేగింపు తీద్దాం !" అన్నాడు. అతడి ఈ ప్రస్తావన అందరికీ నచ్చింది. నేను "నన్ను మాత్రం బలవంతం చేయవద్దు. నాకు ఈ ఊరేగింపులూ - అవీ గిట్టవు. నా స్వభావానికి సరిపడవు !" అన్నాను.

రామకృష్ణ ఖత్రీ కోపగించుకున్నాడు. "అలా వీల్లేదు అందరూ రావల్సిందే. ఇది వ్యక్తిగతమైన విషయం కాదు. విప్లవకారులందరికీ సంబంధించింది. ప్రజలకు మనం ఎవరమో, ఎందుకోసరం ప్రాణాలర్పిస్తున్నామో తెలియదు. ఊరేగింపు తీసి, సన్యాల్ దాదా, యోగేశ్ దాదాలాంటి వారు ఉపన్యసిస్తే - మనం ఎవరమో ప్రజలుకు తెలుస్తుంది !" అన్నాడు.

నేను ఖత్రీ వాదాన్ని అంగీకరించలేకపోయాను. "చూడు సోదరా ! మనం పరిస్థితుల కారణంగా విడుదల అవుతున్నాం. మనమేమీ పోరాటంలో విజయాన్ని పొందలేదు; పూలమాలలు వేసుకు ఊరేగడానికి ! ఇది కాంగ్రెసుకు విజయం. వాళ్ళ ఆశయం సిద్ధించింది. మన ఆశయాలు అసలు పూర్తికాలేదు కదా ? మనం మన లక్ష్యసాధనకు మళ్ళీ పోరాడవల్సి వచ్చినా రావచ్చును !" అన్నాను.

యోగేష్‌దాదా నా వాదాన్ని అంగీకరించాడు. ఊరేగింపులో పాల్గొననన్నాడు. చివరకు ఖత్రీ ఇలా అన్నాడు. "విడుదల అయ్యాక అందరూ కాంగ్రెసు ఆఫీసుకు రండి ! మంచిచెడ్డల్ని అక్కడ ఆలోచిద్దాం !"

ఇక్కడ ఒక విషయం చెప్పడమూ అసందర్భం కాదనుకుంటున్నాను. 'హిందూస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సంఘం' ఏమైంది ? ఆ సంఘం యొక్క ఆశయం నెరవేరిందా ? నెరవేరితే ఏ రూపంలో నెరవేరింది ? నెరవేరలేదా ? నెరవేరకపోతే ఆ సంఘం ప్రజల్లో పనిచేయాలి గదా ? ఏ రూపంలో పనిచేస్తోంది ! అన్న ప్రశ్నలు పాఠకుల మనస్సుల్లో మెదలవచ్చును. దీనికి సమాధానంగా ఒక్క ఉదాహరణను ఇస్తాను.

భావాల వికాసం లేక ప్రగతి క్రాంతికి మార్గదర్శకం అవుతుంది. 'హిందూస్తాన్ ప్రజాతంత్ర సంఘం' "హిందూస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సంఘంగా'గా పరిణతి చెందడం భావాల ప్రగతి కారణంగానే జరిగింది. అలాగే హిందూస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సంఘం యొక్క కార్యరంగం గానీ, భావాల ప్రగతి గానీ అంతటితో ఆగిపోలేదు. ఆ సంఘం తనకంటే విస్తృతమైన, గతితార్కికమైన పద్ధతిలో విప్లవాన్ని ఆవాహనం చేస్తూన్న కమ్యూనిస్టు పార్టీలో అంతర్లీనం అయింది. అండమాన్‌లో శిక్ష అనుభవిస్తూన్న 'హిందూస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సంఘం' కార్యకర్తలు సామూహికంగా కమ్యూనిస్టు పార్టీలో చేరిపోయారు. ఆ మిత్రులు ఎవరూ తమ వ్యక్తిగత అహంకారానికి గానీ, ఆధిపత్యానికి గానీ ప్రాధాన్యత నివ్వలేదు. లక్ష్యసాధనకు, ఆదర్శ నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ వ్యక్తిగతమైన మిథ్యా అభిమానికి ప్రాధాన్యత నివ్వకుండా మిత్రులందరూ కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

ఈ విషయమై నేను విడుదలయ్యాక జరిగిన ఒక సంఘటనను ఉదహరిస్తాను. నేను చాలా రోజులు జబ్బుపడ్డాను. కొంత కోలుకున్న తరువాత 1938 లో విడుదల చేశారు. విడుదల చేస్తూ, 48 గంటల్లో భువాలీ శానిటోరియంకు చేరవల్సి వుంటుందనీ అన్నారు. శానిటోరియం నుండి ఆగస్టులో తిరిగివచ్చాను. విడుదల అయిన మా మిత్రుల్లో చాలామంది, పరిస్థితుల కారణంగా, ఏదో ఒక వృత్తిలో చేరి జీవనయాపనం కానివ్వసాగారు. ఐతే యోగేశ్‌దాదా మాత్రం తన ఆదర్శాన్ని ప్రచారం చేసుకుంటూ, తనకు తోచిన విధంగా దేశం కోసం పాటుపడుతూన్నాడు. జైల్లో మాకు ఏర్పడిన పరిచయం కారణంగా నేను కూడా తనలాగానే ప్రజావిముక్తి కోసం పాటుడపతానన్న నమ్మకం యోగేశ్‌దాదాకు వుంది. జైల్లో నన్ను 'ఫ్రండ్' 'ఫిలాసలర్' 'గైడ్' అన్న పేర్లతో పిలుస్తుండేవాడు. సెప్టెంబరులో లక్నో గణేశ్‌గంజికి నన్ను కల్సుకోడానికి వచ్చాడు. ఇలా అన్నాడు. "మళ్ళీ ఉద్యమం ప్రారంభిద్దామని వుంది. ముందు నిన్ను కల్సుకుని మాట్లాడితే బాగుంటుందని ఉద్దేశం ! ఇప్పుడు మనం ఏం చేయాలి ? అంటే హిందుస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సంఘం కార్యక్రమం ఏంటి ?" అని అడిగాడు.

మేము 'హి.స.ప్ర.స.' లక్ష్యాల గురించి మాట్లాడుకున్నాం. తరువాత ఇలా అడిగాను. "హి.స.ప్ర.స." లక్ష్యాలకూ భారత కమ్యూనిస్టు పార్టీలక్ష్యాలకూ తేడా ఏమిటి ?"

యోగేశ్‌దాదాకు ఏమీ తేడా కనుపించలేదు. ప్రశ్నించాడు. "ఐతే, మనం మన వ్యక్తిత్వాన్ని, ప్రత్యేకతల్ని చంపుకుని కమ్యూనిస్టు పార్టీలో కల్సిపోదామా ?"

నేనిలా అన్నాను. "కేవలమూ మన వ్యక్తిత్వం కోసమని పోటీ సంస్థను ఏర్పరచడం నాకు నచ్చదు !"

ఆనాటి నుండి జోగేశ్‌దాదాకు నామీద నమ్మకం పోయింది. వారు రివల్యూషనరీ సోషలిస్టు పార్టీని స్థాపించారు. కమ్యూనిస్టు పార్టీ లక్ష్యాలకూ, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ లక్ష్యాలకూ తేడా ఏమీలేదు. జండాకూడా అదే - సుత్తీకొడవలీ !

నా అభిమానులూ, పాఠకులూ, ఇతరులు చాలామంది నేను భారతీయ కమ్యూనిస్టు పార్టీ మెంబర్నని అనుకుంటారు. నేనా పార్టీమెంబర్ని కానని చెబితే, కొందరికి ఆశ్చర్యమూ కలగవచ్చును. 1949 లో కమ్యూనిస్టుల్ని ముమ్మరంగా అరెస్టు చేస్తున్నారు. నన్నూ అరెస్టు చేశారు. జైల్లో పెట్టారు. ప్రకాశవతి, అప్పటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పంత్‌ను కల్సుకుని నన్ను విడుదల చేయవల్సిందని అడిగింది. ఇలా అన్నది. "యశ్‌పాల్ కమ్యూనిస్టు పార్టీ మెంబరు కాడు. ఏ ట్రేడ్ యూనియన్‌లోనూ లేడు. ఆయనను ఎందుకు అరెస్టు చేశారు ?" అని అడిగింది. పంత్‌గారు నా అరెస్టు గురించి తనకు తెలియదన్నారు. తరువాత కోపంగా "యశ్‌పాల్ మెంబరు కాకపోతే ఏం ? అడ్డమైన రాతలు రాసి రాసి ఇతర్లను కమ్యూనిస్టుల్ని చేస్తున్నాడు కదా ?" అన్నారు. తమ పోలీసుల చర్య సమర్థించుకోడానికి ఆ మాత్రం గట్టిగా మాట్లాడడం అవుసరమే !

పంత్‌గారు నామీద వేసిన ఈ వాదుకు నేను ప్రత్యేకం సమాధానం చెప్పను. ఎందుకంటే ఆయనగారే స్వయంగా చెప్పుకున్న గొప్పల్లో 'కాంగ్రేసు ప్రభుత్వంలో భావప్రకటనా, భావప్రచార స్వాతంత్ర్యం పుష్కలంగా వుంది !' అనేది ఒకటి.

సరే, రామకృష్ణ ఖత్రీ వచ్చి అలా చెప్పి వెళ్ళి నాలుగైదు రోజులు గడిచాయి. నాకు కొంచంగా జ్వరం కాయడం ప్రారంభించింది. మూడవ రోజున దగ్గు ప్రారంభం అయింది. కళ్ళెవెంట రక్తం పడసాగింది. నేనలా జ్వరంలో వుండగానే మిగిలిన మిత్రుల విడుదలకు అనుమతి వచ్చేసింది. కాకోరీ కుట్ర కేసులోని మిత్రులందరూ విడుదలై వెళ్ళిపోయారు. నేను మరో నలుగురైదుగురు మిత్రులం మాత్రం మిగిలిపోయాం ! ఆ మిగిలిన మిత్రుల్లో - శివసింహ్, బెనర్జీ, బలరాజ్, శివరాజ్ - వీరి శిక్ష దాదాపుగా పూర్తికావచ్చింది. మమ్మల్నీ త్వరలోనే విడుదల చేస్తారనీ అనుకుంటున్నాము. నా ఆరోగ్యం రోజు రోజుకూ క్షీణిస్తోంది. మేజర్ భండారీ నా ఆరోగ్యాన్ని కాపాడడానికి అనేక విధాల ప్రయత్నిస్తున్నాడు. అయినా, నోటివెంట రక్తం పడడం కట్టలేదు ! రక్తం ఊపిరితిత్తుల్నుండి వస్తోందా ? లేక గొంతులోని నరాల నుండి వస్తోందా ? అనేది తెలియలేదు. ఒకరోజున చాలా ఎక్కువ రక్తం పడింది. డాక్టర్ ఆపరేషన్ చేయాలన్న అభిప్రాయానికి వచ్చాడు. జైలు అధికారులకూ, ప్రభుత్వానికీ మధ్య నా గురించి ఉత్తర ప్రత్యుత్తరాలు జోరుగాసాగాయి. అప్పటి ఉత్తరప్రదేశ్ గవర్నర్ హాలెట్ అందర్నీ వదిలిపెట్టడానికి అంగీకరించాడు. కానీ, నన్ను విడుదల చేయడానికి మాత్రం అంగీకరించలేదు. హాలెట్ మరో విషయంగానూ మండిపడుతూన్నాడు. అప్పుడు నైనీ జైలు నుండి విడుదలైన విప్లవకారులందరూ పెద్ద ఊరేగింపు తీశారు. బహిరంగ సభ జరిపారు. 'బ్రిటీష్ ఛత్రఛాయలో అధికారాలన్నీ బ్రిటీష్ ప్రభువుల చేతుల్లో వుండగా ఏర్పడిన ఈ కాంగ్రేసు పాలన నిజమైన స్వాతంత్ర్యంకాదనీ, నిజమైన స్వాతంత్ర్యం కోసం తిరిగి పోరాడవల్సి వుంటుందనీ' చెప్పారు. ఇది అతడికి మరీ మంటగా వుంది.

ముఖ్యమంత్రి పంత్, జైళ్ళ మంత్రి రఫీకిద్వాయి - గవర్నర్ని కల్సుకుని నా ఆరోగ్య పరిస్థితిని గురించి చెప్పి, విడుదల చేయవల్సిందని సలహా ఇచ్చారు. ఐతే గవర్నరు నా అనారోగ్యం ఒట్టి నాటకమనీ, విడుదల కావడం కోసం వేషం వేస్తూన్నాననీ తలంచాడు. నన్ను పరీక్షించడానికి, అలహాబాద్ సివిల్ సర్జన్ లాయీనీ, టి.బి. స్పెషలిస్టు డాక్టర్ టండన్‌నీ, మిలటరీ డాక్టరు కర్నల్ బాసూనీ- పంపించాడు ! ఐతే, ఈ ముగ్గురి అభిప్రాయాలూ కలవలేదు.

కొద్దిరోజుల తరువాత నోటివెంట రక్తం పడడం ఆగింది. ఆరోగ్యం కుదుటపడసాగింది. నేను హాస్పటల్లో వుండగానే మిగిలిన మిత్రులు విడుదల అయ్యారు. కాకోరీ కేసు మిత్రులు విడుదలై ఐదారునెల్లు గడిచింది. నన్ను లక్నో జిల్లా జైలుకు మార్చారు. జైలు జీవితంలో మొదటిసారి బేడీలు లేకుండా ప్రయాణం చేశాను. 'బహుశ విడిచిపెట్టడానికే లక్నో జైలుకు తీసుకువెడుతూన్నారు' అనుకున్నాను.

లక్నో జైలుకు వెళ్ళిన నాలుగవ రోజున రఫీకిద్వాయీ నన్ను కల్సుకోవడానికి వచ్చాడు. కాంగ్రేసు ప్రభుత్వానికీ, గవర్నర్‌కూ - నా విడుదల గురించి హోరాహోరీ సంగ్రామం జరుగుతోందని చెప్పాడు. గవర్నర్ చివరి అభ్యంతరంగా ఇలా అన్నాడుట. "యశ్‌పాల్ పంజాబీ, అతడు విడుదల కాగానే పంజాబు వెడతాడు. అతడు పంజాబు రావడం అక్కడి ప్రభుత్వానికి ఇష్టం వుండక పోవచ్చును !" అప్పుడు పంజాబులో కాంగ్రేసు ప్రభుత్వం లేదు. బ్రిటీష్ భక్తుడైన సర్ సికిందర్ హయాత్ ప్రభుత్వం వుంది. నాలాంటి వ్యక్తిని విడుదల చేయవల్సిందని ఆ ప్రభుత్వం ఎందుకు కోరుతుంది ? కనుకనే గవర్నర్ ఈ మొండికాలు అడ్డం పెట్టాడు. నేను విడుదల అవుతానన్న ఆశ అడుగంట సాగింది.

కిద్వాయీ "విడుదల అయ్యాక పంజాబు వెళ్ళనని నువ్వు మాట ఇస్తే, గవర్నర్ అభ్యంతరాన్ని కాదనవచ్చును !" అన్నాడు.

"విడుదల కావడం కోసం ఓ షరతు రూపంలో ఆ మాత్రం మాట ఇవ్వడమూ నాకు ఇష్టంలేదు !" అన్నాను.

రఫీకిద్వాయీ చాలా గంభీరమైన వ్యక్తి, చాలా సానుభూతిగా వుండేవాడు. నేను పై విధంగా అనేసరికి కిద్వాయీ విసుకుదలగా ఇలా అన్నాడు. "నిన్ను రాసి ఇవ్వమనడం లేదు. నోటిమాట మాత్రంగానైనా అలా చెప్పడం నీకు అభ్యంతరం అయితే, ఇంక మేము చేయగలిగింది ఏముంటుంది? రాజకీయ ఖైదీలందర్నీ విడుదల చేస్తామన్న తనమాటను నిలబెట్టుకోలేకపోయినందుకు - కాంగ్రేసు మంత్రిమండలి రాజీనామానయినా ఇవ్వాలి ! లేదా, నిన్ను పంజాబు ప్రభుత్వానికయినా వప్ప గించాలి !"

చాలా కఠిన సమస్య ఎదురైంది. కాసేపు ఆలోచించి ఇలా అన్నాను. "ప్రభుత్వపు షరతు నుంచి తప్పించుకోడానికి ఓ మార్గం వుంది. నేను మీ పేర ఒక జాబు రాస్తాను. ఆ జాబుద్వారా గవర్నర్ అభ్యంతరాన్నీ కాదన్నట్టు అవుతుంది. కొన్ని షరతులకు లోబడి విడుదల అయ్యానన్న బాధా నాకు వుండదు !"

రఫీసాహబ్ జైలు సూపరింటెండెంట్‌తో "యశ్‌పాల్ జాబు రాసి ఇస్తాడు. దాన్ని వెంటనే నాకు పంపించండి !" అని చెప్పాడు.

మర్నాడు నేను జైళ్ళమంత్రి రఫీకిద్వాయీ పేర ఓ జాబు రాశాను. దాని భావం దాదాపుగా ఇలా వుంటుంది.

"నాతోటి ఖైదీలందరూ విడుదల అయ్యారు. కొద్దిరోజుల్లో నేనూ విడుదల అవుతానని అనుకుంటున్నాను. ప్రస్తుతం నా ఆరోగ్యం ఆందోళనకరంగా వుంది. విడుదల అయ్యాక వెంటనే నన్ను స్విట్జర్లండ్ తీసుకువెళ్ళాలని నా భార్య అనుకుంటోంది. స్విట్జర్లండ్ వెళ్ళడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. కొంతకాలం పడుతుంది. నా స్వగ్రామం పంజాబులో, కాంగడా జిల్లాలో వుంది. ప్రస్తుతపు నా ఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకుంటే, కాంగడా జిల్లాలోని స్వగ్రామానికి ప్రయాణం చేయడం వుచితం అనిపించదు. ఆ కుగ్రామంలో నాకు సరియైన వైద్య సౌకర్యాలు లభించవు. కనుక, నేను విడుదల

అయ్యాక, స్విట్జర్లండ్ వెళ్ళేలోపు, నేను ఉండడానికీ వైద్యానికీ, - భువాలీ శానిటోరియంలో తగు ఏర్పాట్లు చేయించగలందులకు ప్రార్థిస్తున్నాను !"

జాబు రాసి ఇచ్చాను. సమాధానంకోసం ఎదురు చూస్తున్నాను.

1938 మార్చి నెల 2 వ తారీకు, సూర్యాస్తమయం అయింది. జైలుగేట్లు వేసేశారు. ఇంతలో, యార్డులోంచీ ఇద్దరు వార్డర్లు పరుగెత్తుకుంటూ వస్తూ కనుపించారు. మొత్తం యార్డులో, బ్లాకులో నేను ఒక్కణ్ణే ఖైదీని వున్నాను. వార్డర్ల వెనుక కిద్వాయీ సాహబ్, సూపరింటెండెంట్ వస్తున్నారు. బ్లాక్ తాళం తెరిచారు. రఫీకిద్వాయీ సాహబ్ మెల్లగా వచ్చి నాకు అభిముఖంగా నిలబడ్డాడు. ఆయన మౌనాన్ని చూసి 'గవర్నర్ అంగీకరించలేదుగావును' అనుకున్నాను.

నేను నమస్కరించి "కూర్చోండి !" అన్నాను.

"పదండి !"అన్నాడు కిద్వాయీ.

"ఎక్కడికి ?" అడిగాను.

"ఇంటికి ? మీ పుస్తకాలూ, అవీ - వుంటే, తీసుకోండి ! వెళ్దాము"

వార్డర్లు నా పుస్తకాల్ని సర్దారు. జైలుపడకను అక్కడే వదిలి పెట్టేశాను.

జైలు గేటుదాటి ఇవతలకు వచ్చాము. మసక చీకటిగా వుంది. కిద్వాయీ సాహబ్ నన్నూ తన కార్లో కూర్చోపెట్టుకున్నారు. కారు బయల్దేరింది. "జైలు నుంచి విడుదల అయ్యావు. ఎలా వుంది విడుదల అయిన అనుభూతి ?" అని అడిగాడు.

"చాలా విచిత్రంగా వుంటుంది, అనుకున్నాను. కానీ, చాలారోజులుగా ఎదురుచూస్తూ, విడుదల అవుతానన్న నమ్మకంలో వున్నానేమో, ఇప్పుడు సహజమే అనిపిస్తోంది !" అన్నాను.

రఫీసాహబ్ నవ్వాడు. "నేను రేపో ఎల్లుండో వచ్చేవాణ్ణి, నిన్ను తీసుకువెళ్ళడానికి ! కానీ, ప్రకాశవతి ఊపిరి ఆడనివ్వడం లేదు. ఆమె మళ్ళీ వచ్చి నన్ను తొందర పెట్టకముందే, నిన్నూ వెంటబెట్టుకు వెళ్దామనుకున్నాను !" అన్నాడు.

◆